# Āndhra mahābhāratanlō rāyabāraghaṭṭālu - rājanītijñata

A Thesis submitted to the University of Hyderabad in partial fulfilment of the requirement for the award of

**Doctor of Philosophy**
**In**
**Telugu**


**Researcher**
**K Sujana**
**(Reg No: 18HTPH02)**

**Department of Telugu**
**School of Humanities**
**UNIVERSITY OF HYDERABAD**
**Hyderabad – 500046**
**Telangana, India**


**January – 2024**

# ఆంధ్రమహాభారతంలో

# రాయబారఘట్టాలు – రాజనీతిజ్ఞత

పిహెచ్.డి. పట్టా కోసం హైదరాబాద్ విశ్వవిద్యాలయం వారికి సమర్పించిన పరిశోధన గ్రంథం


పరిశోధకురాలు

**కె. సుజన**

(Reg. No: 18HTPH02)

పర్యవేక్షకుడు

**ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు**

తెలుగు శాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్

హైదరాబాద్ – 500046


జనవరి – 2024

# DECLARATION

I, K Sujana here by declare that this thesis entitled *Āndhra mahābhāratanlō rāyabāraghaṭṭālu – rājanītijñata* submitted by me under the guidance and **Supervision of Prof. Darla Venkateswara Rao** is my bonafide research work. I also declare that it has not been submitted previously in part or in full to this University or other University or institution for the award of any degree or diploma. I hereby agree that this thesis can be deposited in shodhganga/ INFLIBNET.

K.Sujana

Date: 22/01/2024

Signature of the student

Name: K.Sujana,

Roll No: 18 HTPH02

**CERTIFICATE**

This is to certify the Thesis entitled ***Āndhra mahābhāratanlō rāyabāraghaṭṭālu – rājanītijñata*** by **Mrs. K Sujana** bearing Regd.No.18HTPH02 in partial fulfilment of the requirements for the award of **Doctor of Philosophy** in the School of Humanities, Department of Telugu is a bonafide work carried out by him under my supervision and guidance.

The thesis is free from plagiarism and has not been submitted previously in part or in fulls to this University or any
other University or Institution for award of any degree or diploma.

A. **Published in the following Publications:**

Parts of this thesis have been: (NOT EXACT PARTS Issues discussed in the following papers have been presented elaborately In the chapter 1, 3, 4,and 5th).

1. ***Āndhramahābhāratanlō rājanīti- samakālīnata,* Bhavaveena** Journal of arts Literary, Culture& Language Study Monthly, UGC Care Journal , ISSN No. 2456-4702 , August 2020, Vol.17, Issue -8, Spl Edition , august -2020, pages: 49-53. Editor: Kolla Sri krishnarao, Chief Editor: Pitta Santhi, Published by kolla Srikrishna Rao, Rohini Towers, 2/11, Brodipet, Guntur, A.P. India. **(Thesis Chapter 5).**
2. ***Mahābhāratāniki nāyakuḍu evaru?, Musi,* Literary Cultural** Historical Telugu Monthly Magazine, UGC Car list Approved Journal ,ISSN 2457-0796 ,july 2023,Vol 26, Issue -9, Pages:44 -46 Founde: Sri B.N. Sasthri. Editor: Sagi Kamalakara Sharma, Associate Editor: Dr. Dattaiah Attem, printed and published : B. Anantha Lakshmi. *Musi* magazine,2/2/1109/ bk, lig10, bathukammakunta, bagh amberpet, Hyderabad, Telangana.( Thesis Chapter 1).

3. ***Mahābhāratanlōō rājanīti*, *Bhavaveena* Journal of arts Literary,** Culture& Language Study Monthly, UGC Care Journal , ISSN No. 2456-4702 , August 2022, Vol.19, Issue -8, Spl Edition , august - 2022, pages: 284-286. Editor: Kolla Sri krishnarao, Chief Editor: pitta Santhi, Published by kolla Srikrishna Rao, Rohini Towers, 2/11, Brodipet, Guntur, A.P. India. (Thesis Chapter 4).
4. ***Rāyabārālu samakālīnata, Auchityam*, International Research Journal for Telugu language & Literary Studies, UGC care listed journal, ISSN: 2583-4797, Vol:4, Issue:4, April, 2023, Editor in chief:** Dr. Rambhatla parvatheswara sarma,bvisakha patnam, Andhra Pradesh, India.(***Thesis Chapter 3).***

**B. Presented in the following National Seminar:**

1. **Mahābhāratanlō śrīkr̥ṣṇa sandēśaṁ - vyaktitva vikāsaṁ, Telugu tejam, (social cultural Literary Political Monthly magazine),** Ramayana, bharatha bhagavathalau – vyakthitva vikasam (two days national seminar special Edition), September 2022. Vol:15, Issue 10, ISSN No: 2319-2550 RNI no:KARTEL/2008/27162, Pages: 162-165.
   **Editor: Dr. Batthala ashok kumar , co Editor: Dr. yogeswar naidu, Management:** Sahitya bharathi, pathiki rajyalakshmi foundation, ananthapuram. (Thesis Chapter 3).

Further the student has passed the following courses towards fulfilment of course work requirement for Ph.D.

Sl No. [illegible]
Notification No. 1

हैदराबाद विश्वविद्यालय

# UNIVERSITY OF HYDERABAD

(A Central University Established by an Act of Parliament)
P.O. CENTRAL UNIVERSITY, GACHIBOWLI, HYDERABAD - 500 046 (INDIA)

REGULAR EXAMINATION

**SEMESTER GRADE TRANSCRIPT**

REG. NO. [illegible]
NAME OF THE STUDENT K SUJANA
MONTH AND YEAR OF NOV 2018
COURSE Ph.D. TELUGU
PARENT'S NAME SUDHAKAR / SARALA

SEMESTER 1

| COURSE NO | TITLE OF THE COURSE | CREDITS | RESULTS |
|---|---|---|---|
| HT700 | RESEARCH METHODOLOGY | 4 | PASS |
| HT701 | HISTORY OF TELUGU RESEARCH | 4 | PASS |
| HT702 | STUDIES IN LITERATURE AND LANGUAGE | 4 | PASS |
| HT703 | SPECIALIZED AREA AND BROAD FIELD | 4 | PASS |

SEMESTER GRADE POINT AVERAGE (SGPA) : 10.0

(In words) : TEN POINT ZERO

DEPUTY REGISTRAR
(ACAD & EXAMS)

Date Of Result Notification : Jan 8, 2019
Date Of Download : Dec 15, 2023

This is system generated certificate issued by O/o The Controller of Examinations, University of Hyderabad

27/11/2024

Prof. Darla Venkateswara Rao
Research Supervisor
School of Humanities
UNIVERSITY OF HYDERABAD
HYDERABAD-500 046., T.S.

**(Prof. Darla Venkateswara Rao)**
**Research Supervisor**

27/11/2024

**(Prof. Darla Venkateswara Rao)**
**Head Department of Telugu**

Head
Department of Telugu
University of Hyderabad
Hyderabad-500 046

**(Prof. V.Krishna)**
**Dean, School of Humanities**

# విషయసూచిక


కృతజ్ఞతలు xxii

ప్రస్తావన xxx

1. పరిశోధనాంశం పరిచయం (Introduction):
2. పరిశోధన ఆవశ్యకత(Necessity of the Research)
3. పూర్వ పరిశోధనల పరామర్శ(Review of literature)
4. క్షేత్ర పర్యటన/గ్రంథ సేకరణ(Field – work/ Books collection)
5. పరిశోధన ఆకరాలు(Research Source)
6. పరిశోధన గ్రంథ రచనా పద్ధతి(Method of Research)
7. పరిశోధన పరిధి(Scope of the Research)
8. పరిశోధన లక్ష్యాలు– ప్రయోజనాలు(Research objects)
9. ఫలితాంశాలు(Research Results)


### మొదటి అధ్యాయం

## మహాభారత ప్రాశస్త్యం


1.1. ఉపోద్ఘాతం: 1

1.2. మహాభారతం –నామ ప్రాముఖ్యం 2

1.3. మహాభారతం కాల నిర్ణయం 3

1.4. మహాభారతానికి నాయకుడు ఎవరు? – చర్చ 4

1.4.1. నాయక చర్చ –ప్రముఖుల అభిప్రాయాలు: 7

1.5. మహాభారతం 'జయ' కావ్యం –పరిణామ క్రమం 10

1.6. మహాభారత వైశిష్ట్యం 12

1.7. మహాభారతం వేద సారం 16

1.8. మహాభారతం ఆధ్యాత్మిక సాధనం 20

1.9. వ్యాస హృదయం 21

1.10.భారతం ఎందుకు చదవాలి 25

1.11. వ్యాసుడు దర్శించిన భారతం 32

1.12. మహాభారత పరమార్థం 34
1.13.మహాభారతం ఆదర్శ గ్రంథం 36
1.14. మహాభారతం ప్రపంచ విస్తరణ 37
1.15. వ్యాసుని మహాభారత రచనా విధానం 38
1.16. మహాభారతం వైశిష్ట్యం– ప్రముఖుల అభిప్రాయాలు 41
1.17. మహాభారతం – గురు ప్రాముఖ్యం 44
1.17.1 గురువు – పరిచయం 45
1.18. సద్గురు స్థానం లో వ్యాసుడు 48
1.19..మహాభారతం – గురు శిష్యుల కథలు 49
1.19.1.అయోద ధౌమ్యుడు – శిష్యులు 49
(ఉపమన్యువు, ఆరుణి, వేదుడు )
1.19.1. 1. ఆరుణి 49
1.19.1.2. ఉపమన్యువు 50
1.19.1.3. వేదుడు 51
1.19.1.4. వేదుడు – ఉత్తంకుడు (ఉదంకుడు) 52
1.19.1.5. శుక్రాచార్యుడు –కచుడు 55
1.20..గురువు శిష్యులపై సమభావాన్ని ప్రదర్శించడం 55
1.21. మహాభారతం ఫలశ్రుతి 57

## రెండవ అధ్యాయం

# మహాభారతంలో ధర్మనీతి దృక్పథాలు పరిశీలన

2.1. ధర్మం నిర్వచనం 61
2.2. ధర్మ పరిణామం 62
2.3. ధర్మ నిర్ణయం ఎలా చేయాలి 64
2.4. ధర్మమే యశస్సు 66
2.5. ధర్మం యొక్క ఔన్నత్యం 67
2.6. ఏది ధర్మం ఏది అధర్మం 68
2.7. ధర్మం యొక్క ఫలితం 69
2.8. ధర్మం భేదాలు 70
2,9. ధర్మ పరిశీలన 72

2.10.  ధర్మ శాసనం 74
2.11. మహాభారతంలో ధర్మసూక్ష్మం 75
2.12. ధర్మ సాధనకు అర్థం 76
2.13. వర్ణాశ్రమ ధర్మాలు 79
2.14.  ఆంధ్ర మహాభారతం – ధర్మ బోధనలు 79
2.14.1. శౌనకుడు బోధించిన ధర్మాలు 80
2.14.2.రోమశుని ధర్మాలు 82
2.14.3.ధర్మవ్యాధుని ధర్మాలు 82
2.14.4. ధౌమ్యుడు – రాజధర్మం 85
2.14.5. విదురుడు – నీతి ధర్మాలు 88
2.14.6. దుర్జనుని లక్షణం 88
2.14.7. సత్ఫలితాలు ఆశించేవాడికి ఉండవలసిన అర్హత 90
2.14.8. గుణాలను బట్టి వ్యక్తిత్వం 90
2.14,9. ఓర్వలేనితనం  వ్యాధిగా పరిగణించిన విదురుడు 91
2.15. ధర్మం – ధర్మసూక్ష్మం – ప్రముఖుల అభిప్రాయాలు 92
2.16. మహాభారతం - పాత్రలు– ధర్మసూక్ష్మాలు 94
2.16.1 వ్యాస జననం 94
2.16.2. పరాశర మహర్షి సత్యవతి  – ధర్మవిచారణ 95
2.16.3. పరాశర మహర్షి సత్యవతి – సత్యాన్వేషణ 96
2.16.4.ధృతరాష్ట్రుడు, పాండురాజు- విదురుడు- జననం ధర్మసూక్ష్మం 98
2.16.5. మనుధర్మ శాస్త్రం చెప్పిన ధర్మాలు 99
2.16.6. ఏకలవ్యుడు – ధర్మవిచారణ 102
2.16.7. ద్రౌపది – ధర్మ విచారణ 104
2.16.8. ద్రౌపది  పూర్వ జన్మ వృత్తాంతం 105
2.16.9. ద్రౌపది వివాహ చర్చ 107

మూడవ అధ్యాయం

## సంస్కృతాంధ్ర మహాభారతాలు – రాయబార ఘట్టాలు పరిశీలన


3.1.రాయబారం– పరిచయం 110

3.2. దూత శబ్దము – వ్యుత్పత్తి 111

3.3. కౌటుల్యుడు – రాయబార లక్షణాలు 113

3.4. రాయబార నియమాలు 114

3.5. రాయబారం – ప్రముఖుల అభిప్రాయాలు 119

3.6.శ్రీకృష్ణుడు చెప్పిన రాయబార లక్షణాలు 123

3.6.1. ధర్మశీలుడు 123

3.6.2. పవిత్రాత్ముడు 123

3.6.3. కులీనత 124

3.6.4. సావధానం 124

3.7. బలరాముడు తెలిపిన రాయబార లక్షణాలు 124

3.8. సాత్యకి తెలిపిన రాయబార లక్షణాలు 125

3.9. ద్రుపదుడు తెలిపిన రాయబార లక్షణాలు 126

3.10. ఆదిపర్వం– రాయబారాలు 126

3.10.1. దేవదూత 127

3.10.2. గౌరవ ముఖుని రాయబారం 128

3.10.2.1. శమీకుడు చెప్పిన రాజనీతి విశేషాలు 129

3.10.2.2. శమీకడు రాజమర్యాదను తెలుపుట 131

3.10.2.3. గౌరవ ముఖుడు పరిక్షిత్తు మరణాన్ని తెలుపుట 131

3.10.3. కచుని రాయబారం 133

3.10.3.1. శుక్రాచార్యుని సేవకునిగా కచుడు 133

3.10.3.2. కచుడు మృతసంజీవనిని గ్రహించుట 134

3.10.3.3. దేవయాని ప్రేమను కచుడు తిరస్కరించుట 134

3.10.4. మేనక రాయబారం 135

3.10.5.దేవదూత(అశరీర వాణి) 136

3.10.5.1.దేవదూత సంభాషణ 138

3.10.6. దాసి (ఘూర్ణిక) రాయబారం 139
3.10.7. భీష్ముని రాయబారం: (స్వీయ రాయబారి) 140
3.10.7.1. భీష్ముడు ప్రతిజ్ఞ 140
3.10.8. స్వీయ రాయబారం( దృష్టద్యుమ్నుడు రాయబారం) 141
3.10.9. ద్రుపద పురోహిత రాయబారం 143
3.10.10. అనామిక దూత 144
3.10.11. దుర్యోధనుని వేగులు 145
3.11. సభాపర్వం – రాయబారాలు – పరిశీలన 147
3.11.1. నారద రాయబారం 147
3.11.2. దూత:(ఇంద్ర సేనుడు) 148
3.11.3. విదురుని రాయబారం 149
3.11.3.1.విదురుడుధర్మరాజునుమిత్రద్యూతానికిఆహ్వానించడం 150
3.11.3.2. దుర్యోధనుడు ఆజ్ఞ మేరకు ధృతరాష్ట్రుడు సభను నిర్మించుట 151
3.11.3.3. ధృతరాష్ట్రుడు విదురుని రాయబారిగా పంపుట 151
3.11.4. ప్రాతికామి రాయబారం 154
3.11.4.1. ధర్మారాజు పంపిన రహస్య దూత 156
3.12. అరణ్య పర్వం– రాయబారాలు 156
3.12.1. సంజయ రాయబారం 156
3.12.1.1. ధృతరాష్ట్రుని ఓర్వలేనితనం 157
3.12.1.2. సంజయుడు ధృతరాష్ట్రుని పరిస్థితిని తెలుపుట 158
3.12.3. హంస రాయబారం 159
3.12.3.1. హంస రాయబార ఆంతర్యం 160
3.12.3.2 హంస పూర్వజన్మ వృత్తాంతం 161
3.12.4. నల రాయబారం 162
3.12.5. పర్ణాదుని రాయబారం 164
3.12.6. సుదేవుని రాయబారం 165
3.12.7. కేశిని దూతిక 166
3.12.7.1. కేశిని నలునిని పరీక్షించుట 167
3.12.7.2. కేశిని నలుని రహస్యాలను దమయంతికి తెలుపుట 168

3.13. కోటికాస్య రాయబారం 169
3.14. విరాట పర్వం – రాయబారాలు 171
3.14.1. సుధేష్ణ రాయబారం 171
3.14.2. సుధేష్ణ రాయబార విశేషాలు 174
3.14.3. వేగులు – రాయబారం 174
3.14.4. దుర్యోధనుని దూత 176
3.15. ఉద్యోగ పర్వం–రాయబారాలు 177
3.15.1. ఉద్యోగ శబ్దం వివరణ 178
3.15.2. భవిష్యకార్యాచరణకై సమావేశం 181
3.15.3. శ్రీకృష్ణునిఅభిప్రాయం 181
3.15.4. బలరాముని అభిప్రాయం 182
3.15.5. ద్రుపదుడు సైన్య సమీకరణకు దూతలను పంపుట 185
3.15.6. ద్రుపద పురోహితుని రాయబారం 185
3.15.7. ద్రుపదుడు పురోహితునికి రాయబార సంభాషణను తెలుపుట 186
3.15.8. సంస్కృత భారతంలో ద్రుపదుని రాజనీతి 187
3.15.9. ద్రుపద పురోహితుడు హస్తినకు చేరుట 189
3.15.10. కౌరవుల దుశ్చర్యలను పురోహితుడు తెలుపుట 190
3.15.11. పాండవ కౌరవుల సైన్యాన్ని వివరించుట 191
3.15.12. పురోహితుని మాటలకు భీష్ముడి స్పందన 192
3.15.13. కర్ణుడు దుర్యోధనుని ఆంతర్యాన్ని తెలుపుట 193
3.15.14. భీష్ముడు కర్ణున్ని మందలించుట 194
3.15.15. ధృతరాష్ట్రుడు భీష్మకర్ణుల వాగ్వివాదాన్ని నివారించుట 195
3.15.16. ద్రుపద పురోహితుని రాయబారం పరిశీలన 195
3.15.16.1. రాయబార లక్షణం అన్వయం 196
3.15.17. సంజయ రాయబారం 196
3.15.18. దుర్యోధనుని అహంకారాన్ని వివరించుట 200
3.15.19. పాండవులనుశాంతింపచేయమని ధృతరాష్ట్రుడు చెప్పుట 200
3.15.20. శ్రీకృష్ణుని పరాక్రమాన్ని ధృతరాష్ట్రుడు గుర్తుచేయుట 201

3.15.21. ధృతరాష్ట్రుడు యుద్ధప్రసక్తి లేకుండా మాట్లాడమని చెప్పుట 201
3.15.22. సంజయుడు ఉపప్లావ్యము చేరుట 203
3.15.23. ధర్మరాజు రాజ్యక్షేమాన్ని గురించి విచారించుట 205
3.15.24. ధర్మరాజు ప్రశ్నలకు సంజయుని సమాధానం 207
3.15.25. సంజయుడు ధృత రాష్ట్రుని సందేశమును యుధిష్ఠిరునికి వినిపించుట 208
3.15.26. సంజయుని మాటలకు ధర్మరాజు సమాధానం 212
3.15.27. ధృతరాష్ట్రుని బుద్ధిని ధర్మరాజు వివరించుట 213
3.15.28. సంజయుడు ధర్మరాజుని ఉపశమింపచేయుట 213
3.15.29. పాండవులను భిక్షావృత్తిని చేపట్టమని చెప్పుట 214
3.15.30. ధర్మరాజు ధర్మవిచారణ 214
3.15.31. శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రునితో చెప్పమన్న మాటలు 215
3.15.32. శ్రీకృష్ణుడు పాండవులకు కౌరవులకు మధ్య పోలికను తెలుపుట 217
3.15.33. సంజయుడు తిరిగి హస్తినా పురం తిరుగు ప్రయాణం – ధర్మరాజుని సందేశం 217
3.15.34. సంజయుడు ధృతరాష్ట్రుని తో సంభాషించుట 219
3.15.35. సంజయుడు రాయబార విశేషాలు తెలుపుట 220
3.15.36. అర్జునుని అభిప్రాయాన్ని సంజయుడు తెలుపుట 221
3.15.37. భీష్ముడు దుర్యోధనునికి హితవు పలుకుట 222
3.15.38. ధృతరాష్ట్రునికి సంజయుడు పాండవుల పరాక్రమాన్ని వివరించుట 222
3.15.39. సంజయ రాయబారం చర్చ 223
3.15.39.1. రాయబార లక్షణం – అన్వయం 224
3.16. శ్రీకృష్ణ రాయబారం 227
3.16.1. ధర్మరాజు శ్రీకృష్ణునికి తన అభిప్రాయాలను తెలుపుట 229
3.16.2. ధృతరాష్ట్రుని లోభత్వాన్ని తెలుపుట 229

| | | |
|---|---|---|
| 3.16.3. | ధర్మరాజు దైన్యం | 230 |
| 3.16.4. | ధర్మరాజు సంపద గొప్పతనాన్ని వివరించుట | 231 |
| 3.16.5. | ధర్మరాజు యుద్ధం వలన కలిగే అనర్థాలను తెలుపుట | 234 |
| 3.16.6. | ధర్మరాజు క్షత్రియ ధర్మాన్ని తెలుపుట | 235 |
| 3.16.7. | ధర్మరాజు చెప్పిన దూత లక్షణాలు | 237 |
| 3.16.8. | ధర్మరాజు యుద్ధాన్ని కుక్కుల కోట్లాటగా పోల్చడం | 238 |
| 3.16.9. | ధర్మరాజు శ్రీకృష్ణునికే కార్యభారాన్ని అప్పగించుట | 239 |
| 3.16.10. | శ్రీకృష్ణుడు తన శక్తిసామర్థ్యాలను ధర్మరాజుకు తెలుపుట | 240 |
| 3.16.11. | శ్రీకృష్ణ రాయబార కార్య రహస్యం | 240 |
| 3.16.12. | శ్రీకృష్ణునికి రాయబార స్వేచ్ఛను ధర్మరాజు తెలుపుట | 241 |
| 3.16.13. | శ్రీకృష్ణుడు ధర్మరాజుకు యుద్ధసన్నాహాలు చేయమని తెలుపుట | 241 |
| 3.16.14. | శ్రీకృష్ణుడిది రాయబారమా? యుద్ధప్రేరణా? – ప్రముఖుల అభిప్రాయాలు | 243 |
| 3.16.15. | భీమసేనుడు సంధి వాక్యాలు పలుకుట | 253 |
| 3.16.16. | శ్రీకృష్ణడు భీమున్ని ఉత్తేజపరుచుట | 254 |
| 3.16.17. | భీముడు తన సామర్థ్యాన్ని తెలుపుట | 255 |
| 3.16.18. | శ్రీకృష్ణుడు భీముడికి దైవపురుష ప్రయత్నాన్ని గురించి తెలుపుట | 256 |
| 3.16.19. | అర్జునుడు తన అభిప్రాయాలను విన్నవించుట | 257 |
| 3.16.20. | అర్జునుడికి శ్రీకృష్ణుని సమాధానం | 258 |
| 3.16.21. | నకులుని అభిప్రాయం | 259 |
| 3.16.22. | సహదేవుడు అభిప్రాయం | 260 |
| 3.16.23. | ద్రౌపది కృష్ణునితో తన కష్టమును తెలుపుట | 262 |
| 3.16.24. | శ్రీకృష్ణుడు ద్రౌపదిని ఓదార్చుట | 264 |
| 3.16.25. | శ్రీకృష్ణున్ని సంధికి అంగీకరించవద్దని చెప్పుట | 265 |
| 3.16.26. | శ్రీకృష్ణుని హస్తిన ప్రయాణం | 265 |
| 3.16.27. | ధర్మరాజు కుంతిదేవికి సందేశాన్నందించుట | 266 |
| 3.16.28. | అర్జునుడు శ్రీకృష్ణునికి చెప్పిన తీర్మానం | 267 |

3.16.29. రాయబారానికి వెళ్తున్న శ్రీకృష్ణున్ని దర్శించిన మహర్షులు 268
3.16.30. ధృతరాష్ట్రుని అత్యవసర సమావేశం 269
3.16.31. విదురుని మాటలకు దుర్యోధనుని అభిప్రాయం 273
3.16.32. దుర్యోధనుని దురహంకారం 273
3.16.33. భీష్ముని హెచ్చరిక 274
3.16.34. శ్రీకృష్ణుడు నగర ప్రవేశం 275
3.16.35. శ్రీకృష్ణుడు కుంతిదేవిని పరామర్శించుట కుంతిదేవి సందేశం 275
3.16.36. శ్రీకృష్ణుడు దుర్యోధనుని ఆతిథ్యాన్ని తిరస్కరించడం 277
3.16.37. దుర్యోధనాదుల దుర్బుద్ధిని విదురుడు కృష్ణుడికి విన్నవించుట 278
3.16.38. శ్రీకృష్ణుడు కౌరవ సభ ప్రవేశం 281
3.16.39. శ్రీకృష్ణుని సందేశం 282
3.16.40. శ్రీకృష్ణుడు తెలిపిన పాండవుల అభిప్రాయాలు 285
3.16.41. దుర్యధనునుకి మహర్షుల హిత బోధ 288
3.16.42. శ్రీకృష్ణ విశ్వరూపం 291
3.16.43. ధృతరాష్ట్రుడు తనపై నింద పడకుండా సమర్థించుకోవడం 292
3.16.44. కుంతీ సందేశం 293
3.16.45. శ్రీకృష్ణుడు – కర్ణుని సంభాషణ 294
3.16.46. కృష్ణుడు రాయబార విశేషాలు పాండవులకు తెలుపుట 298
3.16.47. శ్రీకృష్ణ రాయబారం చర్చ 299
3.17. ఉలూకుని రాయబారం 302
3.17.1. ఉలూకుని మాటలకు భీముని సమాధానం 303
3.17.2. ఉలూకుని మాటలకు సహదేవుని సమాధానం 304
3.17.3. ఉలూకునికి అర్జునుని సమాధానం 305
3.17.4. ఉలూకునితో శ్రీకృష్ణ సంభాషణ 305
3.17.5. ఉలూకున్ని ధర్మరాజు గౌరవించి పంపుట 306

3.18. ఉద్యోగ పర్వం (ఇతర రాయబారాలు) 306
3.18.1. దుర్యోధన,అర్జున రాయబారులు (స్వీయ రాయబారులు) 306
3.18.2. మునుల రాయబారం 309
3.18.3. అగ్ని రాయబారం: 312
3.19. కర్ణ పర్వం రాయబారాలు 313
3.19.1. దుర్యోధనుని రాయబారం 313
3.20. అశ్వమేథ పర్వం రాయబారాలు: 314
3.20.1. ఇంద్రుడు కోసం అగ్ని చేసిన రాయబారం 314
3.20.2. గంధర్వరాజు ధృతరాష్ట్రుని రాయబారం 316
3.21. స్వర్గారోహణ పర్వం –రాయబారం 317
3.21.1. ఇంద్రుడు నియమించిన దేవదూత 317
3.22. ఆధునిక రాయబార తత్త్వం 318
3.23. రాయబారం – సమకాలీనత 320
3.24. అంతర్జాతీయ న్యాయ వ్యవస్థ రూపొందించిన రాయబారలక్షణాలు 321
3.25. రాయబారిని దేశ అతిథిగా పరిగణించాలి 322
3.26. రాయబారిని నిర్బంధించకూడదు (అరెస్ట్ చేయకూడదు) 323

## నాల్గవ అధ్యాయం

# ఆంధ్ర మహాభారతం లో రాజనీతి

4.1. రాజ్యము – వివరణ 329
4.2. రాజ్యం – విధులు 331
4.3. రాజనీతి శాస్త్రం 333
4.4. రాజనీతి – రాజు పరిపాలన 337
4.5. రాజనీతి పుట్టుక 339
4.6. రాజు –రాజ ధర్మాలు 341
4.7. రాజు లక్షణములు 343

4.7.1. అభి గామిక గుణాలు 343
4.7.2. ప్రజ్ఞా గుణములు 344
4.7.3. ఉత్సాహ గుణములు 344
4.8. రాజుకు ఉండకూడని లక్షణాలు 344
4.9. ద్రౌపది రాజుయొక్క కర్తవ్య అకర్తవ్యాలను తెలుపుట 346
4.10. రాజు శబ్దం పుట్టుక – వివరణ 347
4.11. రాజు దైవాంశ సంభూతుడు 348
4.12. రాజు ఆవిర్భావ విశేషాలు 351
4.13. సార్వభౌమాధికారం 353
4.14. రాజనీతి పాశ్చాత్యుల నిర్వచనం 354
4.15. రాజ్యం పాశ్చాత్యుల నిర్వచనం 357
4.16. అమాత్యుడు 360
4.17. భృత్యుల నియామకం 362
4.18. ఆంధ్రమహాభారతంలో మంత్రులు 362
4.19. మంత్రి లక్షణాలు 364
4.20. మంత్రిమండలి నియామకం 366
4.21. మంత్రం 367
4.22. జనపదం 368
4.23. రాష్ట్రం 370
4.24. రాష్ట్ర ప్రజలు కర్తవ్యం 372
4.25. పురజనులు 373
4.26. కోశం 377
4.27. సైన్యం 381
4.28. సైన్యం రకాలు 382
4.29. సేనానీతి– యుద్ధ ప్రదేశం 383
4.30. మహాభారతం లో యుద్ధ శిబిరాలు 384
4.31. సైన్యం వ్యూహం ఎలా ఉండాలి 385

4.32. యుద్ధనివారణోపాయాలు 385
4.33. మిత్రుడు 387
4.34. దుర్గం 389
4.35. రాజ పదవి 391
4.36. రాజనీతి భాగాలు 393
4.36.1. దండనీతి 393
4.36.2. దండం పుట్టుక 396
4.36.3. దండం – పూజా విధానం 399
4.37. అర్థశాస్త్రం 401
4.38. నీతి శాస్త్రం 404
4.39. రాజనీతి–రాజ్యపరిపాలన–ప్రముఖుల అభిప్రాయాలు 406
4.40. గణజనులు – పాలించే విధానం 414
4.41. సభలు –సమావేశాలు 417
4.42. కణికుని రాజనీతి 420
4.42.1. రాజు స్వీయరక్షణ 422
4.42.2. సంస్కృత భారతంలో కణికుడు చెప్పిన కూట నీతి 424
4.42.2.1. రాజు దండ ప్రయోగం 424
4.42.2.2. రాజుతీసుకోవలసిన జాగ్రత్తలు 425
4.42.2.3. శత్రువుకు నమ్మకం కలిగించి మట్టుపెట్టడం 426
4.42.2.4. ధనాశ చూపుట 427
4.42.2.5. కపట ప్రేమ 429
4.42.2.6. శత్రువును లోభ పెట్టుట 429
4.43. నారదుడు బోధించిన రాజనీతి 433
4.43.1. రాజు న్యాయ విచారణ చేయవలసిన సమయం 433
4.43.2. మంత్రుల ఎన్నిక 433
4.43.3. రహస్యాలోచనం రాజు ప్రధాన కర్తవ్యం 434

4.43.4. రహస్య గూఢచార కార్యం 435

4.43.5. ఉద్యోగుల నియామకం 436

4.44. రాజు పట్టాభిషేక మహోత్సవం 438

4.45. రాజు పుర ప్రవేశం 440

4.46. రాజు ఉద్యోగులను నియమించుట 441

4.47. క్షత్రియసంహారానంతరం రాజ్యపరిపాలన కొనసాగిన విధానం 443

4.48. రాజ్యావిర్భావ సిద్ధాంతాలు 445

4.48.1. దైవదత్తాధికార సిద్ధాంతం 445

4.48.2. వైన్యుడుని రాజును చేయడం 447

4.48.3. ఒడంబడిక సిద్ధాంతం 449

4.49. రాజ పురోహితుడు 450

4.49.1. నారదుడు తెలిపిన పురోహిత లక్షణాలు 452

4.49.2. భీష్ముడు తెలిపిన పురోహిత లక్షణాలు 455

4.50. యుద్ధ తంత్రం – అస్త్ర శస్త్రాలు 456

4.51. మనుస్మృతి – రాజనీతి– మహాభారతాంశాలు 461

4.52. కౌటిల్యుడు– మాకియోవెల్లి – ఆలోచనా విధానం 462

4.52.1. కౌటిల్యుడు – మాకియోవెల్లి మధ్య పోలిక: 462

4.53. మాకియోవెల్లి రాజనీతి 463

4.54. ద ప్రిన్స్ – మహాభారత అన్వయం 467

4.54.1. వంశపారమైన పాలనా విధానం 469

4.54.2. మిశ్రమ సంస్థానాల గురించి 469

4.54.3. సైన్యాన్ని సమకూర్చుకోవడం 471

4.54.4. రాజు వనరులను సమకూర్చుకోవడం 471

4.54.5. రాజు యొక్క ద్వంద్వ భావం 473

4.55. యుద్ధనీతి 476

4.56. శ్రీకృష్ణరాజనీతి 477

4.57. ద్రౌపది దండనీతి 483

4.58. ధర్మరాజు రాజనీతి 485

4.59. శివుడు పార్వతి దేవికి చెప్పిన రాజనీతి 492


### ఐదవ అధ్యాయం

## రాజనీతి కథలు – రాజకీయ వ్యవస్థ


5.1.మహాభారతం చారిత్రక దృష్టి 495

5.2. రాజనీతి కథలు – పరిచయం 497

5.3. సుద్యుమ్న చరిత్ర 497

5.3.1. సుద్యుమ్న చరిత్ర – చర్చ 499

5.4. కాలక వృక్షీయ క్షేమ దర్శి సంవాదం 500

5.4.1.సంస్కృత భారతం లో ఉన్న కాలక వృక్షీయ క్షేమ దర్శి కథ 501

5.5.జనక సులభ సంవాదం 503

5.5.1. సంస్కృత భారతం జనక సులభ సంవాదం 505

5.6. కణికుడు చెప్పిన కూట నీతి కథ 505

5.7. వ్యాఘ్ర గోమాయు సంవాదం 507

5.8. సముద్ర సరిత్సంవాదము 509

5.9. కుర్కురోపాఖ్యానం 510

5.10. ఉష్ట్రగ్రీవోపాఖ్యానం 513

5.11. మహాభారతం –రాజనీతి –నేటి పరిణామం 515

5.12.సనాతన రాజనీతికి నవీనాంశాలు 520

5.13. నాయకుడు ఎలా ఉండాలి? 523

5.14. కాయవ్యోపాఖ్యానం 525

5.15. భారతీయ రాజనీతి 526

5.16. మహాభారతం కాలం నాటి రాజనీతి 529

5.17. ప్రజాస్వామ్యం అవగాహన 531

5.18. నన్నయ కాలం నాటి రాజకీయ వ్యవస్థ 533

5.18.1.నన్నయ కాలం నాటి రాజకీయ విశేషాలు 535

5.18.2. పౌరుల హక్కులు 536
5.19. తిక్కన కాలం నాటి రాజకీయ వ్యవస్థ: 537
5.20. ఎఱ్ఱన కాలం నాటి స్థితి 540
5.21. ముగింపు 541
పరిశోధన ఫలితాంశాలు 543
సింహావలోకనం 544
ఉపయుక్త గ్రంథ సూచిక 547
అనుబంధాలు xxxviii

అనుబంధం – 1 xxxviii
ఆంధ్రమహాభారతంలో రాయబారఘట్టాలు
–రాజనీతిజ్ఞత అంశంపై సమర్పించిన పరిశోధన పత్రాలు
అనుబంధం –2 xciii

ప్రముఖ ఆధ్యాత్మిక వేత్తలు , సాహితీ వేత్తలతో ముఖాముఖి
అనుబంధం 3 clv

ప్రముఖ ఆధ్యాత్మిక వేత్తలు, సాహిత్యవేత్తల స్వదస్తూరి
అనుబంధం 4 clx
పంచపాండవులు ద్రౌపది తో కూడిన చిత్రం(అంతర్జాలంలో సేకరణ)
అర్జునుడు మత్స్య యంత్రాన్ని ఛేదిస్తున్న చిత్రం
అనుబంధం – 5 clxii
ఆధ్యాత్మిక వేత్త బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారితో పరిశోధకురాలు
అనుబంధం –6 clxiii
భారత కాల భరతఖండ చిత్రపటం

# కృతజ్ఞతలు

క్రొత్తక్రొత్త విషయాలను పరిచయం చేసి అందులో దాగి ఉన్న రహస్యాలను పాఠకలోకానికి అందించే విధానం ఒక్క పరిశోధనారంగంలోనే ఉంది.అటువంటి పరిశోధన చేయడానికి అవకాశం కల్పించిన హైదరాబాద్ కేంద్రియ విశ్వవిద్యాలయం వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

నేను ఉన్నత స్థానాన్ని అధిరోహించి ఉన్నత గౌరవాన్ని సంపాదించి సముజంలో నాకంటూ ఒక ప్రత్యేకత ఉండాలని నిరంతరం తపించే అమ్మ సరళ దివంగతులు నాన్న సుధాకర్ గార్లకు పాదాభివందనాలు. నా చెల్లెలు భార్గవి కి శుభాశీస్సులు.

తల్లిదండ్రుల పాత్ర పిల్లల్ని కని పోషించడం, చదివించడం. అయితే ఆ చదివే క్రమంలో బంగారమయమైన జీవితం కావాలన్నా చదువులో ఉన్నత విలువల లోతుల్ని తెలుసుకుని సమాజంలో మెలగాలంటే అది ఒక్క గురువులకే సాధ్యం. ప్రధానంగా ప్రస్తుత వర్తమానాన్ని కాకుండా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వారిని ఆ మార్గం వైపు నడిపించే గురువులు చాలా తక్కువమంది ఉంటారు. అటువంటి వారిలో విద్యార్థుల్ని అన్ని రంగాలలో రానించాలనే ఉద్ధేశంతో వారి కోసం నిరంతరం ఆలోచించే ఆచార్య దార్ల వేంకటేశ్వర రావు గారికి ఎన్నిసార్లు కృతజ్ఞతలు తెలిపినా తక్కువే నా భర్తకు చూపు లేనప్పటికి ఆయనకు ఆత్మస్థైర్యాన్నికలిగిస్తూ నీవు పరిశోధన రంగంలో రానించగలవని ఉత్సాహపరచి వారికి పర్యవేక్షకులుగా ఉంటూ ఎం.ఫిల్, పి.హెచ్.డిని పూర్తి చేయించారు. ఆ సమయంలో నా ప్రతిభను గుర్తించి నేను కూడా పరిశోధన చేయడానికి అర్హురాలిని ప్రోత్సహించి, నాకు పరిశోధనా అంశాన్ని సూచించడంతో పాటు పర్యవేక్షక బాధ్యతను నిర్వహించి నాపరిశోధన భావితరాల విద్యార్థులందరికి ఉపయోగపడేలా తగిన సలహాలు ఇస్తూ పొరపాట్లను సరిచేస్తూ ఉన్నత పరిశోధనాంశంగా రావాలని తీర్చిదిద్దించిన గురువుగారు ఆచార్య దార్ల వేంకటేశ్వర రావు గారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

అంతే కాకుండా కేవలం పరిశోధనాంశానికే నన్ను పరిమితం చేయకుండా సాంకేతికత విజ్ఞానం వైపు బాటలు నిర్మింపచేసి ఆ వైపు జ్ఞాన బీజం నాలోమొలకెత్తించిన ఆచార్య దార్లవేంకటేశ్వర రావు గారికి కృతజ్ఞతలు.

పరిశోధనలో భాగంగా పర్యవేక్షకుడు ఆచార్య దార్ల వేంకటేశ్వర రావు గారి ఇంటికి వెళ్లిన ప్రతిసారి నేను విద్యార్థిని అనే భావన వారిలో లేకుండా నన్ను ఒక కూతురులా భావించి. అమ్మలాగే ఆదరించి భోజనాదులను సమకూరుస్తూ, పరిశోధనకు ప్రోత్సహించిన ఆచార్య దార్ల మంజుశ్రీ గారికి కృతజ్ఞతలు. అలాగే చిరంజీవి దార్ల శ్రీనివాసరావుకి నా శుభాశీస్సులు.

తెలుగు శాఖ అధ్యాపక బృందం ఆచార్య దార్ల వేంకటేశ్వర రావు గారికి( తెలుగు శాఖ అధ్యక్షులు), ఆచార్య ఎం. గోనానాయక్ గారికి , ఆచార్య తుమ్మల రామకృష్ణ గారికి, (ద్రవిడ విశ్వవిద్యాలయం, పూర్వ ఉపకులపతి, కుప్పం), ఆచార్య. ఎస్. శరత్ జ్యోత్స్నా రాణి గారికి, ఆచార్య జి. అరుణ కుమారి గారికి, ఆచార్య రేమిళ్ళ వేంకట రామకృష్ణ గారికి, ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారికి, ఆచార్య నడుంపల్లి శ్రీరామరాజు గారికి, నా పరిశోధన గ్రంథానికి సలహాలు ఇచ్చిన ఆచార్య పిల్లలమర్రి రాములు గారికి,

ఎప్పుడు కనబడినా అత్యంత ఆప్యాయతతో పలకరిస్తూ మా వారి మీద ఉన్న అభిమానాన్ని నా మీద చూపుతూ మమ్మల్ని మా వ్యక్తిత్వాలను,మా కుటుంబాన్ని అర్థం చేసుకుని నేనున్నాను ఉంటానని ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నాలో కలిగిస్తూ పరిశోధన పూర్తి చేయగలవని నిరంతరం ప్రోత్సహిస్తున్న ఆచార్య పమ్మిపవన్ కుమార్ గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

నా పరిశోధనకు విలువైన సూచనలు చేసిన ఆచార్య డి. విజయ లక్ష్మి గారికి, కృతజ్ఞతలు , డా. బాణాల భుజంగ రెడ్డి గారికి, డా.దాసర విజయకుమారి గారికి, డా. సోమయాజుల గారికి, డా. భూక్య తిరుపతి గారికి మొదలైన సాహిత్యాగ్రేసరులు, గౌరవనీయులైన ఆచార్య బృందానికంతటికి నా కృతజ్ఞతలు. మరియు ఆఫిస్ సిబ్బందికి నా కృతజ్ఞతలు.

నన్ను కేవలం ఇంటికే పరిమితం చేయకుండా నన్ను ఉన్నత చదువు చదువుకోవడానికి ప్రోత్సహిస్తూ నాకంటూ సమాజంలో గౌరవం ఉండాలని కోరుకున్న నా శ్రీపతి డా-రాజేందర్ గారికి నా కృతజ్ఞతలు. నాకు పనిలోనూ , చదువుకొనేటప్పుడు నాకు సహకరించిన మా పెద్ద కుమారుడు ధనుష్ దత్తకు, దాక్షిణ్య శ్రీజకు, శ్రీశ్రీకర్ దత్తకు శుభాశీస్సులు. అలాగే విసుగుచెందకుండా నేను చదువుకుంటే ఇంటి పనులలో సహకరించిన మా అత్తమ్మ భాగ్యమ్మకు కృతజ్ఞతలు.

మహాభారతం మీద పరిశోధన కేవలం మహాభారతాన్ని చదివినంత మాత్రాన సరిపోదు దాని యొక్కలోతుల్ని తెలుసుకోవాలి. ప్రముఖుల అభిప్రాయాలు సేకరించి వాటిని విశ్లేషిస్తే అసలైన సారం బయటకు వస్తుంది. పైగా రాయబారాలు, రాజనీతి మీద అపారమైన జ్ఞాన సంపదను కలిగి ఉండాలి. అందుకోసం గాను పరిశోధనలో భాగంగా ఆధ్యాత్మిక గురువు శ్రీప్రణవ పీఠాధిపతి, బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి ప్రవచనాలు ఎంతగానో స్ఫూర్తి నిచ్చాయి. వారు ప్రవచనం విన్న తర్వాత నా పరిశోధనకు కావలసిన కొత్త అంశాలు బోధపడ్డాయి. నేను మహాభారతం మీద పరిశోధన చేస్తున్నాను అనగానే ఎంతో సంతోషంతో వారి దివ్యఆశీస్సులు అందించి, వారికున్న ఎంతో విలువైన సమయాన్ని ముఖాముఖికి కేటాయించారు. ఆధ్యాత్మిక గురువైన బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారితో మొదటి ముఖాముఖిని నిర్వహించాను. ఆ గురుదేవుల పాదపద్మాలకు శిరస్సు వంచి నమస్కరిస్తూ కృతజ్ఞతలు తెలుపుతున్నాను. అలాగే గురుపత్ని రంగవేణి అమ్మగారికి, గురువు గారు వద్దిపర్తి పద్మాకర్ కూతురు శ్రీవిద్య గారికి, శ్రీకరి గారికి నా కృతజ్ఞతలు.

అవధూతలు, ఆధ్యాత్మిక గురువులు నిత్యం కార్యక్రమాలలో నిమగ్నమై ఉంటారు. అయినప్పటికి పరిశోధనకు సంబంధించిన ముఖాముఖిని అడిగిన వెంటనే శిష్యుల ద్వారా టైపింగ్ చేయించి మరి ముఖాముఖి ని అందించిన అవధూత శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామి వారికి శిరస్సు వంచి ప్రణమిల్లుతున్నాను. అలాగే నా కృతజ్ఞతలు. వీరి శిష్యుడు

ములుకుట్ల రామ్ జి గారు గురువు గారి అభిప్రాయాలను టైపింగ్ ద్వారా అందించారు. వీరికి నా కృతజ్ఞతలు.

నిత్య ప్రవచనాలతో అలుపెరుగని వ్యక్తి ధర్మ ప్రచారమే ధ్యేయంగా చేసుకున్న ఆధ్యాత్మిక గురువు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు గారికి ప్రత్యేక కృతజ్ఞతలు. వీరు ఎంతో ఓపికగా సహనంతో ఎంతో మర్యాదతో పలుకరించి పరిశోధనకు కావలసిన సమాచారాన్ని అందించిన వీరికి హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తూ ధర్మ ప్రచారం చేస్తున్న మరొక ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ, వీరు దూర ప్రాంతాలలో ఉన్నప్పటికి పరిశోధనకు సంబంధించిన వివరాలను చేతివ్రాత ద్వారా ఎంతో సహనంతో ముఖాముఖిని అందించారు. వారికి నా పాదాభివందనములు. మరియు కృతజ్ఞతలు.

ప్రముఖ సాహిత్య ధురంధరుడు మహాప్రజ్ఞాశాలి అయిన ప్రాచార్య శలాక రఘునాథ శర్మ గారు. వీరు వయసు దృష్ట్యా పెద్దవారైనప్పటికి వారింటికి వెళ్లగానే ఎంతో ఓపికగా ముఖాముఖిని అందించారు. వారికి నా కృతజ్ఞతలు. అలాగే వారి కూతురు లలిత గారు ఎంతో మర్యాదగా నాకు ఆతిథ్యం ఇచ్చి నా పరిశోధనకు కావలసిన కొన్ని పుస్తకాలను కూడా అందించారు వారికి నా కృతజ్ఞతలు.

కంచి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి గురువుల అనుగ్రహంతో వారి శిష్యులు బ్రహ్మశ్రీ చిర్రావూరి శివరామకృష్ణ శర్మ గారితో ముఖాముఖి నిర్వహించడం జరిగింది. నా పరిశోధనకు సహకరించిన ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి గురువులకు నా కృతజ్ఞతలు.

అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మంచంపై ఉన్నప్పటికి ముఖాముఖిని అందించిన బ్రహ్మశ్రీ చిర్రావూరి శివరామ కృష్ణ శర్మ గారికి కృతజ్ఞతలు.

ప్రముఖ మహాభారత పరిశోధకులు శ్రీదేవిసెట్టి చలపతిరావు గారు ప్రతిరోజు ఒక ప్రశ్న చొప్పున జూమ్ మాధ్యమం ద్వారా ముఖాముఖిని అందించారు వారికి నా కృతజ్ఞతలు.

ప్రముఖ సాహితీ వేత్త శ్రీ వాగ్దేవి కళాపీఠ వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ వెంపరాల వెంకట లక్ష్మీ శ్రీనివాస మూర్తిగారు వారు ఎంతో విలువైన సమయాన్ని వెచ్చించి ముఖాముఖి వివరాలను టైపింగ్ చేసి అందించారు. వారి ఓర్పుకు స్ఫూర్తికి నమస్కరిస్తూ వారికి నా కృతజ్ఞతలు.

హైదరాబాద్ విశ్వ విద్యాలయం అధ్యాపకులు ప్రముఖ రాజనీతి నిపుణుడు ఆచార్య ఇ. వెంకటేశు గారు. నా పరిశోధనకు సంబంధించిన రాజనీతి అంశాలను, రాయబార విశేషాలను నేటి కాలానికి అనుగుణంగా చాలా విషయాలు ముఖాముఖిలో చర్చించారు. వారికి నా ధన్యవాదాలు.

కరోనా సమయంలో గ్రంథాలయానికి వెళ్ళే పరిస్థితి లేనందున ఆ సమయంలో అంతర్జాల గ్రంథాలయాలు నాకు బాగా సహకరించాయి. వాటిలో Free Gurukula, Archive, Sodhganaga, Telugu Thisis, ఈ వెబ్సైట్లు నిర్వహించిన వారందరికి నా కృతజ్ఞతలు.

నా పరిశోధనాంశానికి సంబంధించిన వ్యాసాలను ప్రచురించిన పత్రికల వారైనా మూసి పత్రిక వారికి, భావవీణ వారికి, ఔచిత్యం అంతర్జాల పత్రిక వారికి, ఇంకా నా వ్యాసాలను ముద్రించిన వారికి నా కృతజ్ఞతలు. మనస్వి చంద్ర ప్రచురణ వారికి, సాహిత్య భారతి, పతికి రాజ్యలక్ష్మి ఫౌండేషన్ వారికి, నా కృతజ్ఞతలు.

ఇక నా కోర్స్ వర్క్ లో నా పిల్లల్ని హైదరాబాద్ కు వచ్చి చూసుకున్న మా అమ్మ కామిసెట్టి సరళ గారికి అలాగే మా పిన్ని సువర్ణ గారికి , మా కుటుంబంలో ఒక సభ్యురాలుగా కలిసిపోయి నా పిల్లల్ని పట్టుకుని నా పరిశోధనకు సహకరించిన ప్రస్తుతం పంచాయితి సెక్రటరి గా ఉన్న సోదరి నల్లా సుభాషిణి కి, అలాగే నా పరిశోధన గ్రంథాన్ని

ప్రూఫ్ రీడింగ్ చేసి తగిన సలహాలు, ఇచ్చిన అసిస్టెంట్ మేనేజర్ సోదరుడు డా. రామిరెడ్డి బాలిరెడ్డి కి, వీరికి నా ప్రత్యేక కృతజ్ఞతలు.

ముఖాముఖిలో కొంతమందిని కలవడానికి సహకరించిన టి.వి. 9 న్యూస్ రీడర్ సోదరి దీప్తి వాజ్ పేయ్ వారికి కృతజ్ఞతలు. అలాగే ఆధ్యాత్మిక వేత్తలతో ముఖాముఖిని నిర్వహించడానికి , ప్రోత్సహించిన రాంభట్ల వేంకట రామారావు గారికి నా కృతజ్ఞతలు.

యూనివర్సిటికి వెళ్ళేటప్పుడు పిల్లల్ని కనిపెట్టుకుని ఉన్న నా ఆడపడుచు కొడుకు, అల్లుడు చరణ్ కు శుభాశీస్సులు. పిల్లల్ని చూసుకోవడంలో సహకరించిన కీర్తి శేషులు అవ్వ నారాయణమ్మ కు కృతజ్ఞతలు.

ప్రధానంగా నా పరిశోధన క్రమంలో నా పరిశోధనకు సహకరించిన వారిలో వద్దిపర్తి సత్సంగ సభ్యులు చెప్పుకోదగినవారు. వారిలో మొట్ట మొదటిగా చెప్పుకోవలసినది అమెరికా లో ఉంటూ సొంత అన్నయ లా ఎన్నో సూచనలు ఇస్తూ నా పరిశోధనకు సంబంధించిన అంశాలకు తగిన సలహాలు ఇస్తూ ఆధ్యాత్మిక గురువులతో మాట్లాడడానికి వారి ఫోన్ నెంబర్లను ఇచ్చి వారిని కలవడానికి సులభ మార్గాలను తెలియజేసిన అన్నయ్య కోడె జగదీష్ గారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు.

అలాగే దుబాయ్ లో ఉంటూ ఎప్పటికప్పుడు టెక్నికల్ గా నాకు సహాయం చేస్తూ నా డాక్యుమెంట్స్ ని నాకు కావలసిన ఫార్మెట్ లోకి ఎప్పటికప్పుడు మార్చి ఇవ్వడానికి తన విలువైన సమయాన్ని కేటాయించిన తమ్ముడు శిష్ట్లా పవన్ కుమార్ కి నా కృతజ్ఞతలు. ఇంకా సాంకేతికంగా అవసరమైనప్పుడు వద్దిపర్తి సత్సంగంలో నాకు సహకరించిన సోదరులు ఆర్. ఆర్. శ్రీకాంత్ కి, కిషోర్ కి, మల్లికార్జున కి, అక్క వరసైనా రంగ కుమారి గారికి, లత గారికి, పచ్చా హరినాథ్ గారికి, కందాళ సూరి బాబు గారికి, పొత్తూరి అశోక్ తమ్ముడికి, గంగవంశం జితేంద్ర గారికి కృతజ్ఞతలు. సత్సంగ సభ్యులు సి. ఉమారెడ్డి గారికి, బెంగుళూర్ లోని ఆరవేటి కిషోర్ కుమార్ గారికి కృతజ్ఞతలు.

నా పరిశోధనకు సంబంధించిన పుస్తకాల పేర్లు తెలిపి , నా పర్యవేక్షకుల దగ్గరే పరిశోధనను పూర్తి చేసిన సోదరుడు డా. రామ్ ప్రసాద్ కి నా కృతజ్ఞతలు,

ముఖాముఖి లో భాగంగా దూర ప్రాంతానికి వెళ్ళినప్పుడు ఆశ్రయమిచ్చిన శివదేవికి కృతజ్ఞతలు.

కెనరా బ్యాంక్ సిబ్బంది అవసరమైనప్పుడు ప్రింట్ తీయడానికి సహకరించిన వల్లాల రాజు గారికి, సాయిలక్ష్మి గారికి, సునీల్ కుమార్ గారికి, నాగేశ్వర రావు గారికి, సత్యేంద్ర సింగ్ గారికి కృతజ్ఞతలు, నా పరిశోధనలో భాగంగా మా వారితో కలిసి సంస్కృత భారతం పుస్తకాలను ఇంటి వరకు తీసుకు వచ్చిన శరత్ కి , అలాగే జగదీష్ కి కె.వి. రావు గారికి , మల్లేష్ గారికి జాస్మి గారికి కృతజ్ఞతలు.

నా పరిశోధనలో సలహాలు అందించిన వారిలో నాకు డిగ్రీలో పాఠాలు బోధించిన గిరిజాలక్ష్మి గురువు గారికి నా కృతజ్ఞతలు.

హైదరాబాద్ విశ్వవిద్యాలయం సీనియర్ విద్యార్థులు డా// మంత్రి మల్లేష్ గారికి, డా// రవిచంద్రకు కృతజ్ఞతలు.

హైదరాబాద్ విశ్వ విద్యాలయం గ్రంథాలయం సిబ్బంది వారికి , వారిలో ప్రత్యేకంగా ప్రొఫిషినల్ అసిస్టెంట్ అనుమగంటి పద్మిని గారికి నా కృతజ్ఞతలు. అలాగే హైదరాబాద్ విశ్వ విద్యాలయ గ్రంథాలయంలో పుస్తకాలు వెతకడానికి సహకరించిన విశ్వనాథ్ తమ్ముడుకి, కృతజ్ఞతలు మా తెలుగు శాఖ నాన్ టిచింగ్ స్టాఫ్ కృష్ణ గారికి, మధు గార్లకి మరియు ఆఫీస్ సిబ్బందికి కృతజ్ఞతలు.

నేను గ్రంథాలయానికి రాని సమయాలలో పుస్తక సమాచారం అందించిన కాశి కి, వాసుదేవ్ కి, శివకి, యశోదకి, స్వేత కి, పురుషోత్తం కి నా కృతజ్ఞతలు.

నా పరిశోధన పూర్తి చేయడానికి ప్రత్యక్షంగా,పరోక్షంగా సహకరించిన వారందరికి కృతజ్ఞతలు.

# ప్రస్తావన

**పరిశోధనాంశం పరిచయం (Introduction):**

మహాభారత మహాగ్రంథం అనేక భాషలలో గ్రంథస్థం చేయబడి ప్రపంచ నలుమూలలా వ్యాపిస్తూ మహాభారత గ్రంథానికి మహాభారతమే సాటి దానికి సాటియైన గ్రంథం మరొకటి లేదనిపిస్తూ అందరికి ఆదర్శ గ్రంథంగా విరాజిల్లుతూ ఉంది. మహాభారతం మీద ఎన్ని పరిశోధనలు జరిగినా ఇంకా పరిశోధన చేయాలనే కుతూహలం కలిగించే మహత్తర గ్రంథం మహాభారతం ఈ నేపథ్యంలో నేను ఎంచుకున్న పరిశోధనాంశం **''ఆంధ్రమహాభారతంలో రాయబార ఘట్టాలు–రాజనీతిజ్ఞత''** ఈ అంశం పేరు వినగానే అందరికి ద్రుపద పురోహితుని రాయబారం, సంజయ రాయబారం, శ్రీకృష్ణ రాయబారం, ఉలూకుని రాయబారాలే జ్ఞప్తికి వస్తాయి. ఒక సందేశాన్ని నలుమూలలా వ్యాపించేయడానికి రాయబారాలు అవసరం ఎంతైనా ఉంది. ఈ రాయబారాలే కాకుండా సందేశాన్ని ఇచ్చే రాయబారాలు ఇంకా ఏమైనా ఉన్నాయా అని పరిశీలించి మహాభారతంలోని రాజనీతి అంశాలను చర్చించడం ఈ అంశం యొక్క ప్రధాన ఉద్దేశ్యం.

**పరిశోధన ఆవశ్యకత(Necessity of the Research):**

మహాభారతం పై అనేక పరిశోధనలు జరిగినప్పటికి మహాభారతంలో ఉన్నటువంటి విషయజ్ఞానం, ఆధ్యాత్మిక సంపద, నీతియుతమైన కథలు, రాజనీతి తత్త్వము, వ్యక్తిత్వ పరిశీలన ఇటువంటి అనేకాంశాలు చోటుచేసుకున్నందువలన వాటియొక్క లోతుల్ని నేటి సమాజానికి అనుగుణంగా అందించడానికి ఇంకా పరిశోధనలు జరగవలసిన అవసరం ఉందనిపించింది. రాయబారాలను అందులోని రాజనీతి అంశాలను పరిశీలించడానికి **''ఆంధ్ర మహాభారతంలో రాయబార ఘట్టాలు రాజనీతిజ్ఞత''** అనే అంశాన్ని ఎంచుకున్నాను. నన్నయ్య, తిక్కన, ఎఱ్ఱన అనువదించిన మహాభారతాన్ని మొత్తం పరిశీలించడానికి సమయ పరిధి సరిపోదు

కావున ప్రధానంగా రాయబారాలు, రాజనీతి అంశాలను ఎన్నుకున్నాను. సంస్కృత భారతాన్ని స్పృశిస్తూ ప్రధానంగా రాయబారాలు, రాజనీతి అంశాలలో ఆంధ్రమహాభారతంలో ని మార్పులను కొన్నింటిని పరిశీలించాను.

ప్రాచీన కాలంలో ఒక వర్తమానాన్ని అవతలి వ్యక్తులకు కాని, రాజులకు కాని చేరవేసేటప్పుడు పావురాలు, చిలక, హంస రాయబారాలు జరిపారు. ఇవి మన కావ్యాల్లోనూ దర్శనమిస్తాయి. వ్యక్తుల మధ్య రాయబారాలు జరిపేటప్పుడు కొన్ని మెలకువలు పాటించాలి. ఆ రాయబారాలలో దాగి ఉన్న ఆంతర్యాన్ని , రాయబారాల వల్ల కలిగే ప్రయోజనాలను. ఆంధ్ర మహాభారతంలో రాయబారాల నిర్వహణలో దాగి ఉన్న రాజనీతిని తెలుసుకుని వాటిని నేటి ఆధునిక రాజకీయాలకు అన్వయించవలసిన అవసరం ఉందని భావించి ఈ అంశాన్ని ఎన్నుకున్నాను.

**పూర్వ పరిశోధనల పరామర్శ((Rview of literature)**

మహాభారతం పైన అనేక పరిశోధనలు జరిగాయి రాయబారాలు, రాజనీతి మీద పరిశోధనలు పరిమితంగానే ఉన్నాయనిపించింది. రాయబారాలు, రాజనీతి మీద జరిగిన పరిశోధనలు కొన్నింటిని ఇక్కడ పేర్కుంటున్నాను.

| క్రమ సంఖ్య | పరిశోధన పేరు | పరిశోధకుని పేరు | విశ్వవిద్యాలయం | పర్యవేక్షకుడు | సంవత్సరం |
|---|---|---|---|---|---|
| 1. | ప్రాచీన తెలుగు కావ్యాల్లో సందేశాలు రాయబారాలు | కె. కృపాకర రెడ్డి | శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం | ఎస్. జి.పి. చంద్రశేఖర్ | 1992 |
| 2. | తెలుగు ప్రబంధాలలో రాజనీతి, (సి.గ్రం), | రామనాథం , మనస, | ఉస్మానియా విశ్వవిద్యాలయం, | ఆచార్య వెలిదండ నిత్యానంద రావు | హైదరాబాద్ , 2017. |
| 3. | ప్రాచీనాంధ్ర కావ్యాలు | దామోదర్ | శ్రీ సత్యతీర్థ | | అనంతపు |

| | | | | | |
|---|---|---|---|---|---|
| | రాజనీతి( సి.గ్రం), (ప్ర.ము), | రెడ్డి, పామిరెడ్డి | ప్రింటింగ్ ప్రెస్, | | రం 1994. |
| 4. | దూత్య సౌవరచ్చసము ప్రబంధ సాహిత్యము(15,16,17 శతాబ్దములు) | విద్యాలత, వల్లివేడు | మద్రాస్ విశ్వవిద్యాలయం | అక్కిరెడ్డి, ఎస్. | మద్రాస్, 1983 |
| 5. | తిక్కన ఉద్యోగ పర్వం, రాజనీతి, (ఎం.ఫిల్),. | లలిత కుమారి,సి | ఉస్మానియా విశ్వ విద్యాలయం | సీతా కల్యాణి, వి. | 1979 |
| 6. | | | | | |

ఈ పరిశోధనలు పరిశీలించిన తర్వాత ఇంకా సమగ్ర పరిశీలన అవసరమనిపించింది. రాయబార, రాజనీతి లక్షణాలను మహాభారతానికి సమయ సందర్భాన్ని బట్టి అన్వయించే ప్రయత్నం చేసాను.

**క్షేత్ర పర్యటన/గ్రంథ సేకరణ(Field work/ Books collection):**

మహాభారతం ఒక అక్షయ గ్రంథం పరిశీలించే కొద్ది కొత్త విషయాలు ప్రకటితమవుతూనే ఉంటాయి. మహాభారతం మీద ప్రధానంగా కవిత్రయ భారతం మీద పరిశోధనలు చాలా జరిగాయి. రాయబారాల మీద రాజనీతి మీద వివిధ కోణాలలో పరిమితంగా పరిశోధనలు జరిగాయని నా పరిశీలనలో తేలింది. అయితే ఆ పరిశోధనలు ఆలంకారిక దృష్ట్యా, కొన్ని, శిల్ప దృష్ట్యా కొన్ని సిద్ధాంత గ్రంథాలు వెలువడ్డాయి అంతే కాక రాజనీతి అంశాలు ఉన్న శాంతి పర్వం మీద ప్రత్యేకంగాను లేద ఉద్యోగ పర్వంలో ఉన్న రాయబారాల మీద ఏదో ఒక అంశానికి లోబడి పరిశోధనలు జరగడం గమనించాను. రాయబారం అంటే దాని లక్షణుల ఏమిటో వివరిస్తూ ఆ లక్షణాలు మహాభారతానికి అన్వయించడం అలాగే రాజనీతి భావాలు ఏ

సంఘటనల్లో ప్రధానంగా చోటుచేసుకున్నాయో వివరించే ప్రయత్నం పూర్వ పరిశోధనల్లో ఎక్కువగా కనిపించదు. నేను ఆ దిశగా ముందుకు వెళ్ళడానికి ''ఆంధ్రమహాభారతంలో రాయబార ఘట్టాలు–రాజనీతిజ్ఞత'' సిద్ధాంత గ్రంథంలో పొందుపరిచే ప్రయత్నం చేసాను.

మహాభారతంలోని రాయబారాలపైన కాని, రాజనీతి పైన కాని ఒక సరైన అవగాహన కలగాలంటే ప్రముఖ ఆధ్యాత్మిక వేత్తలను ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సంప్రదించి వాటి లోతుల్ని తెలుసుకోవడం అవసరమనిపించింది. ప్రముఖులను సంప్రదించే ముందు సంస్కృత భారతాన్ని కొనుగోలు చేసాను. అలాగే టి.టి.డి వారు ముద్రించిన ఆంధ్రమహాభారతాన్ని కొనుగోలు చేసాను. ఆంధ్రమహాభారతం ను చదివేటప్పుడు నా పరిశోధనకు సంబంధించిన అంశాలను వ్రాసుకుంటూ వచ్చాను. క్షేత్రపర్యటనలో భాగంగా నా పరిశోధనలోని కొన్ని ప్రశ్నలను నివృత్తి చేసుకోవడానికి ఆధ్యాత్మిక వేత్తలను సంప్రదించాను. వారి వివరాలు ఇక్కడ పొందుపరుస్తున్నాను.

1. బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్
2. బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు
3. బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ
4. అవధూత గణపతి సచ్చిదానంద స్వామి
5. ప్రాచార్య శలాక రఘునాథ శర్మ
6. బ్రహ్మశ్రీ చిర్రావూరి శివరామకృష్ణ శర్మ
7. బ్రహ్మశ్రీ వెంపరాల వెంకట లక్ష్మీ శ్రీనివాస మూర్తి
8. సద్గురు శ్రీ దేవిసెట్టి చలపతి రావు
9. రాజనీతి నిపుణుడు ఆచార్య ఇ. వెంకటేశు.

వీరందరితో మాట్లాడిన తర్వాత నా పరిశోధన పరిధి సరిపోదని భావి తరాల పరిశోధకులు వీటి మీద సమగ్ర పరిశీలన చేయవలసిన అవసరం ఉందనిపించింది.

వీరు చెప్పిన అభిప్రాయాలను నా సిద్ధాంత గ్రంథంలో పొందుపరుస్తూ వాటిని విశ్లేషించాను.

కరోనా నేపథ్యంలో క్షేత్ర పర్యటనకు ఆటంకం కలిగిన కారణంగా చాలా గ్రంథాలు అంతర్జాలం నుండి సేకరించాను.

**పరిశోధన ఆకరాలు(Research Source):**

నా పరిశోధన పూర్తి చేయడానికి మహాభారతం పై వచ్చిన పరిశోధన గ్రంథాలు, ముద్రించబడిన గ్రంథాలు, పత్రికలు, ముఖాముఖిలు , మహాభారతం పై వచ్చిన విమర్శా గ్రంథాలు చక్కని విషయ జ్ఞానాన్ని అందించాయి. నేను సేకరించిన గ్రంథాల వివరాలు ఆధార గ్రంథాల్లో వివరంగా తెలియజేసాను. కొన్నింటి ఆకరాలను ఇక్కడ పేర్కుంటున్నాను.

1. గోదావరిభాయి, సంధ్యావందనం, “ ***భారతము రాజనీతి విశేషాలు*** ” , తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి, 1988.
2. శ్రీరామచంద్ర మూర్తి, ఎమ్.జి.పి.“ ***ఆంధ్రమహాభారతంలో ధర్మ సూక్ష్మాలు,*** ” కాకతీయ విశ్వవిద్యాలయం(సి.గ్రం), 2000.
3. ఉషశ్రీ, “***ఎవరు ఎలా మాట్లాడుతారు?***”(మహాభారతంలో రాయబారాలు), ఉషశ్రీ ప్రచురణ, విజయవాడ, 2015.
4. వెంకట రంగయ్య, మామిడి పూడి(అనువాదకులు), ***కౌటిల్యుని అర్థశాస్త్రం(అనువాదం),*** ఆంధ్ర యూనివర్శిటి, ప్రెస్సు, విశాఖపట్టణం, 1981.
5. శ్రీ రాజవీర శాస్త్రి (సంపాదకులు), విశుద్ధ మనుస్మృతి, ఆంధ్రానువాదకులు (పి.వి రమణా రెడ్డి), హింది మూలం(మూ కుమార్), వేద ధర్మ ప్రచార సంస్థ నరసారావు పేట, 1997.
6. షణ్ముఖ శర్మ, సామవేదం, “***ఇదీ యదార్థ మహాభారతం***”, ఋషి పీఠం ప్రచురణలు, (నాల్గవ ముద్రణ), హైదరాబాద్, నవంబర్ 2022.

**పరిశోధన గ్రంథ రచనా పద్ధతి(Method of Research):**

మహాభారతం కు సంబంధించిన కొన్ని ప్రాచీన గ్రంథాలలో గ్రాంథిక భాషను ఉపయోగించారు. నేను వాటిని వ్యావహారిక మాటల్లో వ్రాసే ప్రయత్నం చేసాను. సంస్కృత భారతంలోని ప్రధాన అంశాలను, పరిశోధనకు సంబంధించిన అంశాలను ఆంధ్రమహాభారతంలో ఏ విధంగా చోటుచేసుకున్నాయో పరిశీలిస్తూ మార్పులు ఉంటే వాటిని సాధ్యమైనంత వరకు నా సిద్ధాంత గ్రంథంలో పొందుపరిచాను.

**పరిశోధనా పరిధి(Scope of the Research):**

మహాభారతంలోని రాయబారాలన్నింటిని పరిశీలించి ఆ రాయబారాలలో ఉన్న రాజనీతిని విశ్లేషణాత్మకంగా వివరించడం, రాయబార లక్షణాలను, రాజనీతి సూత్రాలను తెలియజేస్తూ వాటిని మహాభారతానికి అన్వయించడం నా పరిశోధనా పరిధి. అలాగే సంస్కృత భారతంలోని రాయబారాలు, రాజనీతి అంశాలు ఆంధ్రమహాభారతంలో ఏమైనా మార్పులు చేసారా లేదా అని పరిశీలించడం.

**పరిశోధన లక్ష్యాలు(Research objects):**

ఆంధ్ర మహాభారతంలో ఆది పర్వం నుండి స్వర్గారోహణ పర్వం వరకు పద్దెనిమిది పర్వాలలో రాయబార విషయాలను విశ్లేషణాత్మకంగా తెలియజేయడం నా పరిశోధనా లక్ష్యం.

1. ఆంధ్ర మహా భారతంలో ఏ పర్వాలలో రాజనీతి చోటు చేసుకుందో తెలియజేయడం.

2. రాయబార లక్షణాల్ని మహాభారతానికి అన్వయించడం.

3. కౌటిల్యుని అర్థశాస్త్రంలోని రాజనీతి సూత్రాలు మహాభారతానికి ఏ విధంగా అన్వయించబడ్డాయి.

4. వ్యాసభారతంలోని రాయబారాలకు, ఆంధ్ర మహాభారతంలోని రాయబారాలకు ఏమైనా వ్యత్యాసాన్ని పాటించారా లేదా తులనాత్మకంగా పరిశోధించడం.

5. ఆంధ్ర మహాభారతంలోని రాజనీతి, రాజకీయ పరిస్థితులు నేటి ఆధునిక సమాజానికి ప్రేరణను కలిగించాయా లేదా మార్పులు ఏమైనా చేసారా పరిశీలించడం నా పరిశోధనా లక్ష్యం.

**మొదటి అధ్యాయం :(మహాభారత ప్రాశస్త్యం):**

మహాభారతం యొక్క గొప్పతనాన్ని వివరించడమే కాకుండా ఈ అధ్యాయంలో ప్రధానంగా మహాభారతం పేరులోని అంతరార్థాన్ని వివరించాను. ప్రామాణికమైన అంశాలను ఉదాహరణలుగా తీసుకుని మహాభారతం **'జయ'** కావ్యంగా ఎలా పరిణమించిందో వివరించాను. మహాభారతాన్ని ప్రపంచ దేశాలు ఏ విధంగా గౌరవించాయి ఏ విధంగా ప్రపంచానికి విస్తరించిందో ఈ అధ్యాయంలో పేర్కొన్నాను. మహాభారత ప్రాశస్త్యంతో పాటు గురు ప్రాముఖ్యతను వివరించే ప్రయత్నం చేసాను. అలాగే గురుశిష్యుల కథలను కొన్నింటిని వివరించాను. అన్నింటి కంటే ప్రదానంగా మహాఆభారత ప్రాశస్త్యాన్ని ఆధ్యాత్మిక ప్రముఖుల అభిప్రాయాలను పొందుపరిచి వాటిని విశ్లేషించాను.

**రెండవ అధ్యాయం(మహాభారతంలో ధర్మనీతి దృక్పథాలు పరిశీలన:**

ఈ అధ్యాయంలో ధర్మం అంటే ఏమిటి ధర్మంలో గల భేదాలు ధర్మం ధర్మ సూక్ష్మాల మధ్యగల భేదం ఏమిటి? ఆంధ్రమహాభారతంలో ధర్మానికి సంబంధించిన బోధనలు మహర్షులు చెప్పిన ధర్మాలు ధర్మం ధర్మ సూక్ష్మం గురించి ప్రముఖులు చెప్పిన అభిప్రాయాలను వివరిస్తూ విశ్లేషించాను.

వ్యాసుని పుట్టుకలో ద్రౌపది వివాహ విషయంలోనూ అనేకమంది సందేహాలు వ్యక్తం చేస్తుంటారు ఆ సంఘటనల్లోని ధర్మ విచారణను ఈ అధ్యాయంలో వివరించే ప్రయత్నం చేసాను.

**మూడవ అధ్యాయం(సంస్కృతాంధ్ర మహాభారతాలు రాయబార ఘట్టాలు పరిశీలన):**

రాయబారం గురించి పరిచయం చేసి దూత శబ్దం ఎలా పుట్టిందో ఈ అధ్యాయంలో పేర్కొన్నాను. రాయబార లక్షణాలను రాయబార నియమాలను సంస్కృత భారతంలో శ్రీకృష్ణుడు చెప్పిన రాయబార లక్షణాలను విశ్లేషించడం దూత ఎలా ఉండాలో బలరాముడు, సాత్యకి, ద్రుపదుడు తెలిపిన రాయబార లక్షణాలను వివరించి. సాధ్యమైనంత వరకు పర్వాలలోని రాయబారాలను పేర్కొంటూనే సంస్కృత భారతంలో రాయబారాలను ఆంధ్రమహాభారతంలోని రాయబారాలకు మధ్య వ్యత్యాసం ఏమైనా ఉందా అని పరిశీలించాను. సంభాషణల్లో మార్పులు గమనించినంత వరకు సూచించాను. అంతే కాకుండా రాయబార లక్షణాలను మహాభారతంలో ఏ సందర్భంలో ఏ సన్నివేశంలో ఉందో అన్వయించాను.

**నాల్గవ అధ్యాయం: ఆంధ్రమహాభారతం రాజనీతి:**

ఈ అధ్యాయంలో రాజ్యము వివరణ రాజ్యం యొక్క విధులు , రాజనీతి , రాజు పరిపాలన రాలు లక్షణాలు వీటిని వివరిస్తూనే రాజనీతి లక్షణాలు మహాభారతంలో ఏ మేరకు ప్రస్తావించబడ్డాయో వివరించాను. మనుస్మృతిలో చెప్పిన రాజనీతి అంశాలు. మహాభారతానికి అన్వయించడం, కౌటిల్యుడు మాకియోవెల్లి, ఆలోచన విధానం ఏ విధంగా సాగింది. మాకియోవెల్లి భావాలను కొంతమంది సమర్థించారు మరికొంతమంది విమర్శించారు. ఈ వివరాలను పొందుపరిచి విశ్లేషించాను. మాకియో వెల్లి ఆలోచన రీతిని, రాజనీతి విషయాలను ద ప్రిన్స్ గ్రంథంలో పొందుపరిచాడు. ఆ గ్రంథంలోని విషయాలు మహాభారతంలోని కణికుడు చెప్పిన కూటనీతికి దగ్గరగా ఉన్నాయనిపించింది. ఆ వివరాలను సంస్కృత భారతంలోని శ్లోకాలను ఉదాహరిస్తూ వివరించాను. కూటనీతి అనేది కపటమైన వ్యక్తుల దగ్గర రాక్షస స్వభావం కలిగిన వారి దగ్గర ఉపయోగించడంలో తప్పులేదని శ్రీకృష్ణ రాజనీతి తెలియజేస్తుంది. ఏ సందర్భంలో శ్రీకృష్ణుడు ఈ రాజనీతిని ఉపయోగించాడో వివరించాను.

**ఐదవ అధ్యాయం( రాజనీతి కథలు రాజకీయ వ్యవస్థ):**

ఈ అధ్యాయంలో రాజనీతికి సంబంధించిన కొన్ని కథలను పరిచయం చేస్తూ రాజనీతి అంశాలను వివరించాను. ఆధునిక రాజకీయ పరిణామాలను కొన్నింటిని వివరించాను. కాలం మారుతున్న కొద్ది పరిసరాలలోనూ పరిపాలనా విధానంలోనూ అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. పరిపాలన ఎంత పారదర్శకంగా ఉంటే ప్రజారక్షణ అంత పటిష్ఠంగా ఉంటుంది. వాటిని ఈ రాజనీతి కథల ద్వారా రాజు లేదా అధికారి తన వ్యవస్థను ఏ విధంగా రూపుదిద్దుకోగలడో ఈ కథలు వివరిస్తాయి.

**పరిశోధన ఫలితాంశాలు(Research Results):**

ఆధునిక ప్రపంచంలో ముఖ్యంగా నేటి తరం వారికి ప్రాచీన సాహిత్యం పట్ల అవగాహన, ఇతిహాసాల పట్ల సదభిప్రాయాన్ని కలిగించడానికి ఈ పరిశోధన ఉపయోగపడుతుందని భావిస్తున్నాను.

రాయబారం అంటే అందరికి శ్రీకృష్ణ రాయబారం, ద్రుపద పురోహితుని రాయబారం, సంజయ రాయబారం, ఉలూకుని రాయబారం వీటినే చెప్తారు. కాని ఒక సందేశాన్ని అందించడమే రాయబారమని అభిప్రాయపడితే చాలా రాయబారాలు మహాభారతంలో స్ఫురిస్తాయి. వాటిని పొందుపరిచే ప్రయత్నం ఈ పరిశోధనలో చేసాను. రాయబార లక్షణాలను, రాజనీతి అంశాలను పేర్కొంటు అవి మహాభారతంలో ఎంత వరకు నిక్షిప్తమయ్యాయో పరిశీలించాను. అంతే కాకుండా నేటి ఆధునిక రాజకీయాలను పరిచయం చేస్తూ ఏ సూత్రాలను పాటించడం ద్వారా పరిపాలన ప్రజారంజకంగా ఉంటుందో వివరించాను. దీని వలన నేటి తరం వారికి పరిపాలన పట్ల సమాజం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించడం నేర్చుకుంటారు.

## మొదటి అధ్యాయం

# మహాభారత ప్రాశస్త్యం

### 1.1. ఉపోద్ఘాతం:

ప్రాచీన గ్రంథాలలో అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్న గ్రంథం మహాభారతం. మహాభారతాన్ని సూక్ష్మంగా పరిశీలిస్తే అందులో చెప్పబడిన ప్రతి మాట ఆచరణీయమే. విద్యా విధానం మొదలుకుని సూక్ష్మ ధర్మాలు తెలుసుకునేంత వరకు, జ్ఞానాన్ని సముపార్జించడం మొదలుకుని ఆధ్యాత్మికతను సాధించడం వరకు భూమండలం యొక్క స్థితిగతుల దగ్గర నుండి తీర్థయాత్రల విశేషాల వరకు, దౌత్య సంబంధాలు మొదలకుని రాజనీతి చాతుర్యతను ప్రదర్శించేంత వరకు ప్రతి అంశం ప్రతి కథ ఒక విశిష్టతను సంతరించుకుంది. వేద సారాంశాన్నంతా పునికి పుచ్చుకున్న పవిత్ర గ్రంథం మహాభారతం లౌకిక జ్ఞానానికి ,ఆధ్యాత్మిక సాధనకు పునాదివంటిది మహాభారతం.

*'' పురాణ పూర్ణ చంద్రేణ శ్రుతి జ్యోత్స్నా ప్రకాశితా'' పురాణమను పూర్ణ చంద్రుని చేతవేదములనేవెన్నెలవెలుగొందబడింది.*

*(శ్రీరామచంద్రమూర్తి,యమ్.జి.పి.ఆంధ్రమహాభారతంలో ధర్మసూక్ష్మాలు,పుట:19.)*

ఈ వాక్యాలను పరిశీలిస్తే మహాభారతం పంచమవేదం.ఇతిహాసం చతుర్వేదాలను తనలో ఇముడ్చుకున్న గొప్ప గ్రంథం. ఇక్కడ పురాణాలను పూర్ణ చంద్రునిలాగా వేదాలను వెన్నెల వెలుగును ఇస్తుంది అన్నాడు. అంటే ఎప్పుడూ పురాణాలలోని అంశాలు , ఎప్పుడూ క్రొత్తగా కనిపిస్తూఉంటాయి. వెన్నెల ఎంత చల్లదనంగా ఉంటుందో వేదాలలోని సారాంశం తెలుసుకుంటే అంతే ఆహ్లాదంగా ఉంటుంది. ప్రధానంగా మహాభారత కథలు పిల్లల దగ్గర నుండి ప్రతి ఒక్కరి ఆలోచనకు పదును పెట్టేవిగానూ, జీవితాన్ని సరైన క్రమంలో ఎలా సరిదిద్దుకోవాలో నేర్పుతాయి.

మహాభారతం యొక్క మాహాత్మ్యమును గూర్చి శ్రీ విద్య ప్రకాశనందగిరి స్వాములవారు ఈవిధంగా తెలియజేసారు. *''మహాభారతము ఆర్య సంస్కృతి యొక్క భారతీయ సనాతన ధర్మము యొక్క అత్యంత ఆదరణీయమగు ఒక మహాగ్రంథము. ఇది అమూల్య ధర్మ రత్నముల యొక్క మహాభాండారము, కావున భారతము మహాకావ్యము, గూఢార్థమయమగు జ్ఞాన విజ్ఞాన శాస్త్రము ధర్మ గ్రంథము, అధ్యాత్మశాస్త్రము సర్వ శాస్త్ర సంగ్రహము అయి యున్నది. ( శ్రీ విద్య ప్రకాశనందగిరి స్వాముల వారు. భారత రత్నాకరము, పుట:238.).*

ఆంధ్ర మహాభారతం ధర్మ తత్త్వం గ్రంథానికి జి.వి సుబ్రహ్మణ్యం **'ధర్మ దీపిక'** వ్రాస్తూ మహాభారతం గురించి ఈ విధంగా తెలియజేసారు. *''మహాభారతం ఇతిహాసం చతుర్విధ పురుషార్థ ఫలాలను సమగ్రంగా సాధించిన సంపూర్ణ చరిత్రను కర్మఫలానుభవ నిదర్శకంగా ప్రదర్శించగలిగే మహారచన ఇతిహాసం. పాండవుల చరిత్ర ఇతిహాస వస్తువు దానిని గ్రహించి వ్యాసమహర్షి శాస్త్రేతిహాసంగా నిర్వహించాడు. దానిని కవిత్రయం వారు తెలుగులో కావ్యేతిహాసంగా సంతరించారు. ( విద్యేశ్వరి ,డి. 'ఆంధ్ర మహాభారతం – ధర్మతత్త్వం' , పుట: ధర్మదీపిక.).*

**1.2. మహాభారతం –నామ ప్రాముఖ్యం:**

మహాభారతం గురించి ఎవరు చెప్పమన్నా వారి అభిప్రాయాలను తెలియజేస్తారు. మరి భారతం పేరులోని అంతరార్థాన్ని వేదాలను లోతుగా అధ్యయనం చేసిన వారు మాత్రమే తెలియజేయగలరు. భారతం పేరులోని అంతరార్థాన్ని ఈ క్రింది వివరిస్తున్నాను.

*భారతమనగా 'భా' సూర్యః, ర=అగ్నిః, తం= చంద్రః చంద్ర సూర్యాగ్ని చంద్ర సంయోగాదేవ చరాచరాత్మ సృష్టిరిత్యర్థః అని బీజాక్షర నిఘంటువు.*

*సూర్య చంద్రాగ్నుల సంయోగం వలనే సమస్త చరాచర ప్రపంచం యొక్క సృష్టి జరుగుచున్నదని తాత్పర్యం. (శ్రీ రామచంద్రమూర్తి, యమ్.జి.పి. ఆంధ్రమహాభారతంలో ధర్మసూక్ష్మాలు,పుట:10.)*

శ్రీరామచంద్రమూర్తి గారు'' **ఆంధ్రమహాభారతంలో ధర్మ సూక్ష్మాలు**'' తన సిద్ధాంత గ్రంథంలో పై విధంగా భారతంకి నిర్వచనం ఇచ్చారు. సూక్ష్మపరిశీలన చేస్తే

ప్రపంచమంతా సూర్యచంద్రుల పరిభ్రమణం చేత నడుస్తుంది. సృష్టి సరైన క్రమంలో నడవడానికి ప్రతి ప్రాణి తన జీవన శైలిని సక్రమంగా నిర్వర్తించుకోవడానికి ప్రధాన ఆధారం సూర్యచంద్రులే అనే విషయం స్పష్టమవుతుంది.

భారతం పేరు లోని విశేషాంశాలను సామవేదం షణ్ముఖ శర్మ గారు ఈ విధంగా తెలియజేస్తారు. *"భరత' అంటే యజ్ఞాగ్ని వేదంలో భరత అని అగ్నిని సంబోధించిన మంత్రాలున్నాయి. యజ్ఞాగ్నితో పవిత్రమైన నేల కనుక ఇది 'భారతం' అని చెప్పుకోవచ్చు. దుష్యంతుడి కొడుకైన భరతుడు ఏలిన భూమండలం కనుక 'భరత వర్షం' అని చెప్పుకోవచ్చు." (షణ్ముఖ శర్మ, సామవేదం, 'ఇది యదార్థ మహాభారతం' పుట:78.)*

## 1.3. మహాభారతం కాల నిర్ణయం:

మహాభారత కాల నిర్ణయం గురించి ప్రాచ్య పాశ్చాత్యులకు భిన్నాభిప్రాయాలు ఉన్నాయి ఆంధ్ర మహాభారతం అవతరణ గురించి కొన్ని నిశ్చితమైన అభిప్రాయాలు ఉన్నాయి ఆంధ్ర మహాభారతానికి మూలమైన సంస్కృత భారతం ఏ కాలంలో ఆవిర్భవించిందో అనే విషయం పై అనేక చర్చలు జరిగాయి వాటికి సంబంధించి కొన్ని వివరాలను పొందుపరిచే ప్రయత్నం చేస్తాను.మహాభారత యుద్ధ కాలము ను పరిశీలిస్తే మహాభారత కాలం ను నిర్ణయించవచ్చని కొంత మంది అభిప్రాయపడుతున్నారు. పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, మహాభారత యుద్ధకాలమును ఈ విధంగా ఊహించారు. *"మహాభారత గాథ క్షాత్రకాలమున జరిగెనని చారిత్రకులు ఊహించి చెప్పారని చెప్తూ క్షాత్రకాలము యొక్క తుదిని రచింపబడెనని తెలిపే అథర్వ, సంహితలోను. , ఐతరేయ బ్రాహ్మణములోను పాండవ వంశవర్ధనుడును అర్జునుని పౌత్రుడు అయిన పరిక్షిత్తుని ప్రశంస కలదు. పరిక్షిత్తు తనయుడగు జనమేజయుడు అశ్వమేధయాగకర్తలలో ముఖ్యుడని ఐతరేయ బ్రాహ్మణమును, శతపథ బ్రాహ్మణమును కలదు. జనమేజయుని యందు ఆనాటి వారికి విశేషగౌరవముండెడిది. అందువలన అతడు చనిపోయినప్పటికి తరువాతి వారు ఏ లోకమున ఉండెనని ప్రశ్నలు అడుగుచుండినట్లు బృహదారణ్యకోపనిషత్ లో కలదు. కాని పాండవ ధార్త రాష్ట్రుల పేరులు కాని వారి చరిత్ర కాని వైదిక వాఙ్మయయమున కనబడవు.*

*సూత్రకారులైన 'శాకటాయన పాణిన్యాచార్యులు మాత్రం భారత యుద్ధ వీరుల పేరులు ఉచ్చరించుటయే కాక వాసు దేవార్జునుల యందు నాటి వారు భక్తితత్పరులై ఉన్నారని కూడా తమ వ్యాకరణములయందు సూచించి యున్నారు. క్షాత్ర కాలము చివరి వాఙ్మయంలో పరిక్షిత్తు జనమేజయులు పేర్కొనబడుటచేత అంతకు ముందు అనగా క్షాత్ర కాల మధ్యభాగమున కురు పాండవులుంటారని చెప్పవలసి యున్నది. కాని క్షాత్ర కాలము ఎప్పటిది అన్నప్పుడు ఆంగ్లేయులు భాషా పండితులు క్షాత్ర కాలము క్రీ.పూ 1400 సంవత్సరములు మొదలు క్రీ.పూ 1000 సంవత్సరముల వరకు అని నిశ్చయించారు. కాని బాలగంగాధర్ తిలక్ క్రీ.పూ 2000 సంవత్సరములు మొదలుకునే క్షాత్ర కాలము ఉన్నదని వ్రాసారు. వీరి అభిప్రాయాన్నే పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, గారు సమర్థించారు. వేద వాఙ్మయము చేత కాని, సూత్ర వాఙ్మయముచేత కాని కురు పాండవుల కాలమును నిర్ణయింపలేము కాని మహాభారతము లోని వర్ణనా విశేషములచేతను, విష్ణు భాగవత పురాణములలోని కురు పాండవుల కాలమును గురించి వ్రాసిన వ్రాతలచేతను కురుపాండవుల కాలము అనగా మహాభారత యుద్ధకాలాన్ని నిర్ణయించవలసి ఉన్నదని వీరు అభిప్రాయపడ్డారు.'' (వేంకట, సుబ్రహ్మణ్య శాస్త్రి, పెండ్యాల, మహాభారత చరిత్రము, పుట:04).*

వీరు సూచించిన వివరాలు ప్రకారం మహాభారత కాలాన్ని నిర్ణయించడం లో స్పష్టత లేదు కాని కొన్ని ఆధారాలు ప్రకారం మహాభారత యుద్ధకాలాన్ని నిర్ణయించే ప్రయత్నం ఇందులో కనబడుతుంది. మరింత లోతుగా యుద్ధకాలాన్ని నిర్ణయించాలంటే మహాభారతంలోని వర్ణనా విశేషాలచేత, పురాణాలలో కురు పాండవుల కాలాన్ని గురించిన చర్చల చేత సాధ్యమయ్యే అవకాశం ఉందని వీరు భావించారు.

### 1.4. మహాభారతానికి నాయకుడు ఎవరు? – చర్చ:

మహాభారతానికి నాయకుని విషయంలో అనేక మంది తమ అభిప్రాయలను వెల్లడించారు. కొంతమంది కృష్ణుడే నాయకుడని, కొంతమంది ధర్మరాజే నాయకుడని, కొంతమంది అర్జునుడని భీముడని భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. మరి కొంతమంది

మహాభారతం బహువిధనాయకులతో ఉందని వక్కాణించారు. నాయకుని గురించిన చర్చ ఈ విధంగా ఉన్నది.

*“ధర్మ ప్రవృత్తి–యంతయు ధర్మజునాశ్రయించి వర్తిల్లుచున్నది. ప్రజ్ఞచే ప్రేరితమైన పరాక్రమము ధర్మజానుజుల పరాక్రమ తాత్పర్యము. ధర్మజుఁడు రామునివలె కోదండము పట్టి నడుచువాఁడు కాఁడు కావున గదాగాండీవములను పట్టి నడచు భీమార్జునులకు యుద్ధరంగమున నాయకత్వము శోభించుచున్నది. ఉదాహరణమునకు విరాట పర్వమున కీచక వధ చేసినవాఁడు భీముఁడు. ఉత్తరగోగ్రహణమున విజయ సాధకుఁడు అర్జునుఁడు. "నయతి వృత్తం ఫలం ప్రాప్నోతిచ" అని నాయక లక్షణము కదా! వృత్తమును నడుపువాఁడు. ఫలముననుభవించు వాఁడు నాయకుఁడు. పై రెండు ఘట్టములలో ధర్మరాజు ఆనతే లేకయే భీమార్జునులు స్వతంత్రముగా వర్తించిరి కదా! అయినను వారి స్వతంత్ర వర్తనము ఒక ధర్మరక్షణము కొఱకే. ధర్మరాజు రక్షణము. ధర్మజుఁడు అగ్రజుఁడుగా తమ్ములను భౌతికముగా శాసించును. ఒక వర్తనముగా తమ్ముల శీలమును శాసించును.తమ్ముల చేతలలోని ధర్మశీలము కూడ ధర్మరాజే. ధర్మరాజు ఎంత వ్యక్తియో అంతశక్తి. అతని నీతి శక్తి ఉద్యోగ పర్వమున ఉన్మీలించినది. అతని నీతిసారమునకు నిండు రూపమును కల్పించినవాఁడు శ్రీకృష్ణుఁడు. శ్రీకృష్ణుని యందు శక్తి యుక్తులు రెండునూ కలవు. అందునే ఉద్యోగపర్వమంతయు శ్రీకృష్ణుఁడు ప్రకటించిన నీతి పర్వము వలె కానఁబడును. కాని కృష్ణనీతి ధర్మజ మూలమైనది. ఇట్లు ఉద్యోగ పర్వము నందు కూడా ధర్మజుఁడొక ప్రజ్ఞామూర్తి లాగా, శ్రీకృష్ణుఁడు దానికి ప్రయోక్త లాగా, భాసింపవచ్చును. రామాయణమున రాముఁడు తాను ముందు నడుచుచు కథను తన వెంట నడిపించును. కథతో పాటు ఆతని తమ్ములును నడుచుచుందురు. భారతమున ధర్మజుఁడు తాను కూర్చుండి కథనడిపించును. కథ నడపు వారాతని తమ్ములు, గోవిందుఁడు. కూర్చున్న వాఁడు సూత్రధారి, కార్యకర్త పాత్రధారి. ఇట్లగుటచే ధర్మజునితో పాటు ఆయా కార్యరంగములందు భీమార్జున శ్రీకృష్ణాదులు నాయకులుగా కథను ముందుకు నడుపుచు తత్తత్కార్యములను సాధించుచున్నట్లు భాసించుచుండుటచే*

*భారతేతిహాస కథాగతి బహునాయకులచే ప్రవర్తిల్లుచున్నదని రాజశేఖరుఁడు భావించుయుండును.*

*(సుమతినరేంద్ర,పి. తిక్కనచేసిన మార్పులు ఔచిత్యపు తీర్పులు, పుట:438,439).*

ఈ వివరాలను గమనిస్తే ప్రతి పాత్ర లోనూ ధీరత్వం, నాయక లక్షణాలు ప్రస్ఫుటించడం చేత బహువిధనాయకత్వాన్ని మహాభారతానికి ఆపాదించారు. అయితే నాయకుడుగా ధర్మరాజు ఉండాలి అనే అభిప్రాయం కృష్ణునితో సహా అర్జునుడుకు, భీమునికి, నకుల , సహదేవులకి ఉంది. ఆ విధంగానే వారు సాధించిన విజయాలు ధర్మరాజుకే అంకితం చేసారు. ధర్మమే ధర్మరాజు రూపంలో ఉందని భావించినప్పుడు ధర్మానికి ఎవరైనా తలవంచవలసిందే కదా అనే అభిప్రాయం పై విషయంలో అర్థమవుతుంది. ధర్మానికి కట్టుబడి ప్రవర్తించే ధర్మరాజు తమ్ములు నాయక లక్షణాలు కలవారు అవుతారు కాని నాయకులు కాలేరని నా అభిప్రాయం. నాయకునికి ఓర్పు సహనం కూడా ఉండాలి. అవసరమైనప్పుడు వాటిని పక్కన పెట్టి శత్రువులను జయించే నైపుణ్యం ఉండాలి. ధర్మరాజు ఏ గుణాన్ని ఎక్కడ ప్రదర్శించాలో తెలిసినవాడు కాబట్టి అతనిని నాయకునిగా నియమించడంలో సందేహంలేదు అయితే నాయకుడినే నడిపించే శక్తి పాండవుల దగ్గర ఉంది వారే శ్రీకృష్ణ పరమాత్మ. నాయకుడుని నడిపించే సమర్థత శ్రీకృష్ణునికి ఉండడం చేత కొందరు శ్రీకృష్ణుని నాయకుడు గా భావించారు.

ముదిగొండ వీరేశలింగం"***జైమిని భారతము సంశోధనాత్మక పరిశీలనము***" *గ్రంథంలో ధర్మరాజు ను నాయకుడు గా పేర్కొన్నారు. "ధర్మరాజు నాయకుడు శ్రీకృష్ణార్జున భీమాదులు అనునాయకులు. ధర్మరాజు శాంతిమూర్తి. యుద్ధ ప్రధానవస్తువైన గ్రంథమగు జైమిని భారతమునందును మహాభారతము నందును నాయకుడగుచు అశ్వమేధ యాగమును నిర్వహించి వీరుడై యాగ ఫలము అనునాయకులైన తమ్ముల ద్వారా పొందినాడని వివరించారు."(వీరేశలింగము, ముదిగొండ, 'జైమిని భారతము సంశోధనాత్మక పరిశీలనము'*, **పుట**:194.)

అయితే కొంత మంది ప్రముఖులు మహాభారతానికి నాయకుడు ఎవరూ అనే దానిపై లోతైన చర్చ చేసారు వారు చెప్పిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

**1.4.1. నాయక చర్చ– ప్రముఖుల అభిప్రాయాలు:**

మహాభారతానికి నాయకుడు అంటూ ఎవరూ లేరు కృష్ణుడే ప్రధాన సూత్రధారి అని చెపుతూ మహాభారతమే విష్ణువు అని చెప్తారు వద్దిపర్తి పద్మాకర్ ముఖాముఖి లో అలాగే భారతానికి ప్రధాన కారకులు అనలుడు అంటే అగ్ని హోత్రుడు , సూర్యుడు, చంద్రుడని తెలియజేసారు.మహాభారతం యజ్ఞంతో మొదలై యజ్ఞంతో ముగిసే అపూర్వమైన ప్రక్రియగా భావించి అగ్నిహోత్రుడు ప్రధాన పాత్రధారిగా తెలియజేసారు. (చూడు: అనుబంధం 2, వద్దిపర్తి పద్మాకర్ ముఖాముఖి).

ఈ విషయాలను స్పష్టం చేస్తూ శ్రీమత్తిరుమల వేంకట శ్రీనివాసాచార్యులు **"శ్రీ మహాభారత వైజ్ఞానిక సమీక్ష"** అనే గ్రంథములో అగ్ని విద్యయే భారతము అని చెప్తూ ఈ క్రింది మాటలను వివరించారు.

*" స్థూల శరీరము పృథివినుండి యుత్పన్నమైనది ఇందు వైశ్వానరాగ్ని కలదు "అగ్ని గర్భా పృథివి' అని శ్రుతి. పృథివి వ్యుత్పన్నమైన స్థూల శరీరమునకు సంబంధించిన అగ్ని విద్యయే భారతము. అని తెలియజేస్తారు. ఇది మానవ చరితము మనస్సులో దేవ, అసుర ప్రవృత్తులకు జరుగు సంఘర్షణయే మహాభారత సంగ్రామం. ఇందులో చెడు ప్రవృత్తులను అణచి ధర్మ విజయమును సాధించుటయే దీని ప్రధానాశయము. మానవుని పురుషార్థ సాధనకు ధర్మము మొదటి మెట్టు వస్తు రక్షకమగు స్వరూప ధర్మమును త్వం అందురు త్వ లేనిచో పదార్థమే ఉండదు. మానవత్వము మానవ స్వరూప ధర్మము. అది లేనివాడు పశుత్వము. భారతము మానవ ధర్మ స్వరూప నిరూపణము చేస్తుంది. కనుక ధర్మ శాస్త్రజ్ఞులు దీనిని ధర్మ శాస్త్రమనిరి. (వేంకట శ్రీనివాసాచార్యులు, శ్రీమత్తిరుమల. శ్రీ మహాభారత వైజ్ఞానిక సమీక్ష'* **పుట:04.)**

ఈ విషయాలు మహాభారతం అంటేనే విష్ణువు అనడంతో మహాభారతాన్ని చదివితే విష్ణుహృదయం ఏమిటో తెలుస్తుంది. ధర్మంగా జీవించేవారికి విష్ణువే సహాయకారి, అధర్మంగా నడిచేవారికి ఆ విష్ణువే దండన విధించేవాడవుతాడు. సమాజ పురోభివృద్ధికి

విభిన్న మనస్తత్వాలు కలిగిన ప్రపంచాన్ని ఒక మార్గం వైపు నడిపించే ప్రయత్నమే మహాభారతానికి నాంది అనే అభిప్రాయం పై మాటల్లో అర్థమవుతుంది. అగ్నితో అంటే యజ్ఞంతో ప్రారంభం అవుతుంది మహాభారతం అంటారు అంటే అగ్నికూడాప్రధాన పాత్రధారి అని చెప్పడంలో ఆంతర్యాన్ని గమనిస్తే వ్యర్థపదార్థాలను కూడా దగ్ధం చేసి వాటి వలన హాని కలగకుండా చేయగల శక్తి అగ్నికి ఉంది అలాగే మన ఆలోచనల్లోని మాలిన్యాన్ని భారతమనే అగ్ని దహింపచేసి క్రొత్త మార్గనిర్దేశాన్ని అందిస్తుంది. అగ్ని లేనిదే సృష్టి జరగదు అంటారు అగ్నికి మన జీవన విధానానికి అంతటి అనుబంధం ఉంది.

***"భారతసూర్యే నృణాం వినిహితం తమః"*** (శ్రీ రామచంద్రమూర్తి, యమ్.జి.పి. ఆంధ్రమహాభారతంలో ధర్మసూక్ష్మాలు,పుట:19.)భారతమను సూర్యుని చేత మానవులంతః కరణమందలి చీకట్లు తొలగిపోవును.

ఇక్కడ భారతమును సూర్యుని చేత పోల్చారు. సూర్యుడు అగ్ని స్వరూపుడు. తన కిరణాలతో ప్రపంచ చీకట్లు తొలగించినట్లు భారతం ప్రజల అంతరంగంలోని అజ్ఞాన చీకట్లు తొలగిస్తుందని చెప్తాడు. అంతేకాదు. మానవులై పుట్టాక అనేక సందేహాలతో మానసిక ఆందోళనతో సతమతమవుతారు. ఆ ఆందోళన తొలగడానికే మహాభారతం ఉందని పై వాక్యాల ద్వారా తెలుస్తుంది.

మహాభారతంలో శ్రీకృష్ణుడిని ప్రధాన సూత్ర ధారిగా పేర్కొంటూనే బాగుంటుందని తెలియజేసారు. నిస్వార్థంతో ప్రపంచాన్ని నడిపించేవాడనే భావంతో శ్రీకృష్ణుడుని నాయకుడుగా పేర్కొన్నారు.

(చూడు: అనుబంధం 2, గణపతి సచ్చిదానంద స్వామి).

వీరి అభిప్రాయం ప్రకారం ఎటువంటి స్వార్థపూరితమైన ఆలోచనలు లేకుండా ఎటువంటి ప్రయోజనాన్ని ఆశించకుండా ఒక వ్యవస్థను సరైన మార్గంలో పెట్టడానికి ఒక బాధ్యతను స్వీకరించి దానిని అమలు చేయడంలోనే పూర్తిగా నిమగ్నుడై లోకంలో శాంతిస్థాపనకు, కృషిచేసేవాడే నిజమైన నాయకుడని అటువంటి నాయకుడు శ్రీకృష్ణుడే అని తెలుస్తుంది.

బ్రహ్మశ్రీచాగంటి కోటేశ్వర రావు ముఖాముఖిలో మహాభారతానికి నాయకుడు శ్రీకృష్ణున్ని నిస్సందేహంగా పేర్కొనవచ్చని నాయకుడు శ్రీకృష్ణుని కాదని ఇంకొకరిని నాయకుడుగా స్వీకరించడం సాహసం అవుతుందని వీరు తెలియజేసారు.

(చూడు:అనుబంధం 2, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు ముఖాముఖి).

బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గారు మహాభారతానికి నాయకుడు శ్రీకృష్ణుడే అని తెలియజేస్తూ మహాభారతానికికథానాయకుడు శ్రీకృష్ణుడేనని స్పష్టంగా వ్యాసుడు పలుచోట్ల పేర్కున్నాడని వీరు పేర్కున్నారు.

(చూడు: అనుబంధం,2, సామవేదం షణ్ముఖ శర్మ, ముఖాముఖి).

ప్రాచార్య శలాక రఘునాథ శర్మ మహాభారతానికి నాయకుడు ధర్మరాజే కాని నాయకుడినే నడిపించే వాడు సూత్రధారి శ్రీకృష్ణుడని తెలియజేసారు.

(చూడు: అనుబంధం2,ప్రాచార్య శలాక రఘునాథ శర్మ, ముఖాముఖి).

వీరి అభిప్రాయంలోనూ మహాభారతానికి ప్రధాన సూత్రధారి శ్రీకృష్ణ పరమాత్మయే అని తెలుస్తుంది.వీరి మాటల్లోని అంతరార్థం ని పరిశీలిస్తే మహాభారతానికి కర్త , కర్మ, క్రియ అన్ని శ్రీకృష్ణుడే అని అర్థమవుతుంది.

బ్రహ్మశ్రీ చిర్రావూరి శివ రామ కృష్ణ శర్మ గారు ముఖాముఖిలో మహాభారత దృష్ట్యా చూసినప్పుడు నాయకుడు ధర్మరాజు. తర్వాత ప్రధాన సూత్రధారి అంటే
భేదం వస్తుంది. నడిపించినటువంటి వాడు, ప్రత్యక్షంగా చూస్తే శ్రీకృష్ణుడే సూత్రధారిగా కనబడతాడని పరోక్షంగా ఈశ్వరుడు మహాభారతానికి సూత్రధారిగా కనబడతాడని తెలియజేసారు.

(అనుబంధం 2, బ్రహ్మశ్రీ చిర్రావూరి శివరామకృష్ణ శర్మ, ముఖాముఖి)

శ్రీ దేవిసెట్టి చలపతిరావు గారు ముఖాముఖిలో శ్రీకృష్ణుణ్ణి మహాభారతానికి నాయకుడుగా పేర్కొనాలని చెప్తాడు .అయితే మహాభారతానికి నాయకుడు, నాయకురాలు, ప్రతి నాయకుడు అనే పద్ధతిలో చూసుకుంటే ధర్మరాజు, ద్రౌపది, దుర్యోధనుడు ఇలా వస్తాడు. కాని మహాభారతాన్ని మొత్తంగా జాగ్రత్తగా పరిశోధన చేస్తే కేవలం శ్రీకృష్ణుడు

మాత్రమే నాయకుడని తెలియజేసారు. (చూడు: అనుబంధం 2, బ్రహ్మశ్రీ చిర్రావూరి శివరామకృష్ణ శర్మ,).

మహాభారతానికి నాయకుడుగా చెప్పదగిన వ్యక్తికి కొన్ని అర్హతలు ఉండాలి. కాని సూత్రధారుడు అంటే సమస్తాన్ని తన అధీనంలో ఉంచి ధర్మ సంస్థాపనకు కృషి చేసే వారు ఎవరో వారు శ్రీకృష్ణుడని ప్రధానంగా చెప్పడం వీరి మాటల్లో అంతర్లీనంగా కనబడుతుంది.

వెంపరాల వెంకట లక్ష్మీ, శ్రీనివాస మూర్తి (శ్రీ వి.వి.ఎల్. శ్రీనివాస మూర్తి )మహా భారతానికి నాయకుడు –ప్రధాన సూత్రధారి. ఎవరు అనే విషయాన్ని వివరిస్తూ ఈ విధంగా తెలియజేసారు. *మహా భారత సూత్రధారి అన్నప్పుడు ఖచ్చితంగా ఈ జగన్నాటకానికి మూల పురుషుడు –కర్త, కర్మ, క్రియ అయిన పురుషోత్తముడు శ్రీకృష్ణ పరమాత్ముడే అనే విషయాన్ని స్పష్టం చేస్తూ మహా భారత కథా చిత్రణా పరంగా చూస్తే –ఆదిపర్వంలోని కుమారాస్త్ర విద్యా ప్రదర్శన ఘట్టం నుంచి, కురుక్షేత్ర సంగ్రామం వరకు కథలో నాయకుడిగా కనిపించేది 'అర్జునుడు 'మాత్రమే, నని వీరు తెలియజేసారు. (చూడు: అనుబంధం 2, వెంపరాల వెంకట లక్ష్మీ శ్రీనివాస మూర్తి).*

వీరి అభిప్రాయాలను పరిశీలిస్తే అస్త్ర విద్యానైపుణ్యంతో అర్జునుడు ఒక్కొక్క విజయ శిఖరాన్ని అందుకున్నప్పుడు అర్జునుడే నాయకుడు అనిపించినట్లు ఉంటుంది. కాని పరోక్షంగా అర్జునుని అంతరంగం లో ఉండి ప్రత్యక్షంగా అర్జునునికి రథ సారథి గా ఉన్న శ్రీకృష్ణుడే ప్రధాన సూత్రధారని అర్థమవుతుంది.

### 1.5. మహాభారతం 'జయ' కావ్యం –పరిణామ క్రమం:

మహాభారతానికి జయ కావ్యం అనే పేరు ఉందని అందరికి తెలిసిన విషయం. అయితే ఈ జయ అనే పేరులోని అంతరార్థాన్ని గమనిస్తే కొన్ని ఆసక్తికరమైన విషయాలు బోధపడుతాయి. *'' మహాభారతానికి మరో పేరు 'జయం' కటపయాది సంఖ్యాశాస్త్రం ప్రకారం 'జయ' అన్నప్పుడు '81' సంఖ్య వస్తుంది. 'అంకానాం వామతోగతిః' అని గణిస్తే అది 18 అవుతుంది. అంటే 18 సంఖ్యాకం చెప్పబడిన గ్రంథానికి 'జయం' అని పేరు. మహాభారతం 18 పర్వాలతో ఉంది కనుక ఇది 'జయం' అదే విధంగా అష్టాదశ*

*పురాణాలకు ఇది ప్రార్థనా శ్లోకంగా చెప్పబడుతుంది.అలా చూసినా ఇది జయం. 'జయం' అంటే ధర్మ, అర్థ, కామ, మోక్షాలు అనే నాలుగు పురుషార్థాలను ప్రసాదించునది అని అర్థం.''(షణ్ముఖ శర్మ ,సామవేదం,ఇది యదార్థ మహాభారతం, పుట:47.).*

ఈ విషయాలను పరిశీలిస్తే జయం అనే పేరు మహాభారతానికి ఏ విధంగా సార్థకమైనదో అర్థమవుతుంది. అంతేకాకుండా ఈ మహాభారతంలోని విషయాలను మన జీవితంలోకి అన్వయించుకుంటే అంతర్గత శత్రువులను జయించి బాహ్య ప్రపంచంలో కూడా శత్రువులు లేకుండా జీవించగలం అనే భావన పై మాటల్లో తెలుస్తుంది.

*'' వేద వ్యాసుని మేధలో నుండి పుట్టిన భారతం మూడంచెలుగా విస్తరిల్లి లోకంలో వ్యాపించింది. మునీంద్రుడు భారత వంశ కథను మూడేళ్లు దీక్ష పూని* ***'జయ'*** *మనే కావ్యంగా మొదట రచించాడు. మహాభారతానికి అది మొదటి రూపం. దానిని వివిధ లోకాలలో ప్రచారం చేయడానికి తన శిష్యులను నియోగించాడు. నారదుడు దేవ లోకంలోనూ, అసితుడైన దేవలుడు పితృలోకంలోనూ, వైశంపాయనుడు జనమేజయునికి చెప్పడం ద్వారా మానవ లోకంలోనూ జయ కావ్యాన్ని విజయవంతంగా వ్యాప్తి కలిగించారు. వైశంపాయనుడు జనమేజయుడికి చెప్పేటప్పుడు. అతనికి కలిగిన అనుమానాలను, అడిగిన విశేషాలను వ్యాస తాత్పర్యానికి అనుగుణంగా వివరించాడు. ఆ విశేషాలతో కలసి వ్యాసుని  జయ కావ్యం భారతంగా ప్రసిద్ధి పొందింది. దానిని వైశంపాయనుడు చెప్పగా రోమ మహర్షుని కుమారుడైన ఉగ్రశ్రవసుడు అనే సూతుడు వేద వ్యాసుడి అభిప్రాయానికి అనుగుణంగా అనువుగా వివరిస్తూ అందించాడు. దానితో గ్రంథం పెరిగింది. అదంతా కలసి మహాభారతంగా ప్రసిద్ధి పొందింది. మహాభారతమంటే జయ కావ్యం మూడు దశలలో విస్తరించిన మహేతిహాసం అది వ్యాస మునీంద్రుని కవితోద్యానంలో పుట్టి పెరిగిన పారిజాతం. ( కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహా భారతం,ఆది పర్వం, మొదటి భాగం, పీఠిక.)*

ఈ విషయాలను పరిశీలిస్తే మహాభారతం పేరు యొక్క పూర్వపరాలు ,భారతం అనే పేరు ఏ విధంగా సార్థకమయ్యిందో తెలుస్తుంది.

### 1.6. మహాభారత వైశిష్ట్యం:

మహాభారతం యొక్క గొప్పతనాన్ని ఆదిపర్వం లో ఈ విధంగా చెప్పబడింది.

*సీ. ధర్మ తత్త్వజ్ఞులు ధర్మ శాస్త్రంబని*
*ఆధ్యాత్మ విదులు వేదాంతమనియు*
*నీతి విచక్షణుల్ నీతి శాస్త్రంబని*
*కవి వృషభులు మహా కావ్యమనియు*
*లాక్షణికులు సర్వ లక్ష్య సంగ్రమని*
*యైతిహాసకులు ఇతిహాసమనియు*
*పరమ పౌరాణికుల్ బహు పురాణ సముచ్చ*
*యంబని మహిన్ గొనియాడుచుండ*

*ఆ. వివిధ వేద తత్త్వ వేది వేద వ్యాసు*
*డాది ముని పరాశరాత్మజుండు*
*విష్ణు సన్నిభుండి విశ్వ జనీనమై*
*పరగు చుండ జేసె భారతంబు (ఆంధ్రమహాభారతం, ఆదిపర్వం, ప్రథమాశ్వాసం, 32 వ పద్యం).*

మహాభారతం యొక్క ఆత్మ స్వభావాన్ని ఈ పద్యం వివరిస్తుంది. ధర్మాన్ని ఆచరించే వారికి, ధర్మ శాస్త్రాలను తెలుసుకునే వారికి, ధర్మానుష్ఠానం చేసే వారికి ఈ గ్రంథం ధర్మశాస్త్రం, భగవత్ చింతన చేయాలనే దృఢ నిశ్చయం గలవారికి ఇది ఆధ్యాత్మిక గ్రంథం. సత్ప్రవర్తనతో జీవనాన్ని సాగించడానికి నీతి సారాన్ని తెలుసుకోవడానికి ఇది నీతి గ్రంథం. కవులు ఈ గ్రంథాన్ని మహా కావ్యంగా పేర్కున్నారు. లక్షణ గ్రంథాల గురించి తెలుసుకునే వారికి ఈ గ్రంథం సర్వ లక్ష్య సంగ్రహమని, పౌరాణికులు గొప్పదైన పురాణాలకు ఇది నిలయమని భావించారు. ఇటువంటి అద్భుతమైన గ్రంథాన్ని విశ్వ శ్రేయస్సు కోసం విశ్వమే ప్రశంసించదగినదిగా వ్యాసమహర్షి ఈ భారతాన్ని వ్రాసాడు.

మహాభారత మహిమను ఆదిపర్వం తృతీయాశ్వాసంలో నన్నయ చెప్తూ

సీ. *కమనీయధర్మార్థకామమోక్షములకు 1 నత్యంతసాధనం బయినదాని*

*వేడ్కతోఁదవిలి తన్ వినుచున్నవారల1 కభిమతశుభకరం బయినదాని*

*రాజుల కఖిలభూరాజ్యాభివృద్ధిని 1 త్యాభ్యుదయప్రదం బయిన దాని*

*వాఙ్మనఃకాయప్రవర్తితానేకజ 1 న్మాఘనిబర్హణంబయిన దాని.*

*ఆ. సత్య వాక్ప్రబంధ శత సహస్రశ్లోక1 సంఖ్య మయినదాని, సర్వలోక*

*పూజ్య మయిన దాని, బుధనుతవ్యాసమ1 హాముని ప్రణీత మయినదాని.*

*(ఆంధ్రమహాభారతం, ఆదిపర్వం, తృతియాశ్వాసం, 9 వ పద్యం).*

ధర్మార్థకామమోక్షాలైన పురుషార్థాలకు సాధనమైన ఈ మహాభారతంను ఆసక్తితో , కుతూహలంతో వింటున్న వారికి సకల శుభాలను అందిస్తుందని రాజులకు సమస్తభూమి యొక్క అభివృద్ధిని సంతతశుభాభి వృద్ధిని ఇచ్చేదని, వాక్కు , మనసు , దేహం అనే మూడింటితో చేయబడిన అనేక జన్మల పాపాలను పోగోట్టేదని ఈ పద్యం తెలియజేస్తుంది.

ఈ వివరణ అంతా మహాభారత మహిమ ఎటువంటిదో తెలుపుతుంది. మనిషి మాట్లాడకుండా ఉండలేడు ఎక్కువగా మాట్లాడటం వలన అబద్ధాలు చెప్పే సందర్భాలు రావచ్చు, అనవసర ప్రసంగాలు చేయవచ్చు అటువంటి వాక్కు వలన కలిగిన దోషాలను ఈ మహాభారతం నశింపచేస్తుంది. అలాగే మనసు అతి వేగంగా చలించిపోయే మనసు చేత అనేక పాపాలను తెలియకుండానే మనలో చేరిపోతుంటాయి. ఇవి ఎక్కువగా ఈర్ష్య , అసూయ చేత ఏర్పడుతూ ఉంటుంది. ఇటువంటి పాపాలను కూడా ప్రక్షాళన చేసే శక్తి మహాభారతానికి ఉంది. అలాగే శరీరంతో చేసే పాపాలు ఇవి చెప్పడానికి కూడా వీలులేనంతగా తెలిసి కొన్ని తెలియకుండా కొన్ని పాపాలు చేస్తూ ఉంటాము, చిన్న చిన్న ప్రాణులను చంపడం, ఎదుటి వారిని కోపంతో కొట్టడం, ఇటువంటి చెడు కార్యాల వలన కలిగే పాపాలను కూడా పోగొట్టే శక్తి మహాభారతానికి ఉంది అని పై మాటల్లో వ్యక్తమవుతుంది.

*“ధర్మేచార్థేచ కామేచ మోక్షేచ భరతర్షభ*

*యదిహాస్తి తదన్యత్రయన్నే హాస్తినతత్క్వచిత్” (సుబ్రహ్మణ్య శాస్త్రి,వారణాసి, మహాభారత తత్త్వ కథనం, పుట: 01.)*

ధర్మార్థ కామ మోక్షాలకు సంబంధించి భారతంలో ఉన్న అంశం మరొక చోట ఉండవచ్చు కాని భారతంలో లేని అంశం మరెక్కడా ఉండదు. అంటే జన జీవనంలోని ప్రతి అంశం, భారతంలో చోటుచేసుకున్నాయి. అరిషడ్వర్గాలైన కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యాలను నిర్మూలించడానికి, చతుర్విధ పురుషార్థాలైన ధర్మార్థ కామ మోక్షాలను పొందడానికి మహాభారతం విజ్ఞాన కేంద్రంగా ఉంది అని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

మహాభారత వైశిష్ట్యం గురించి సామవేదం షణ్ముఖ శర్మ గారు ఈ విధంగా వర్ణించారు *'అత్రోపనిషదం పుణ్యం కృష్ణద్వైపాయనోబ్రవీత్' ఈ విధంగా మహాభారతం అనే 'ఉపనిషత్తు' ని కృష్ణద్వైపాయనుడు చెప్పాడు. అంటే మహాభారతం ఒక ఉపనిషత్తు. వ్యాస మహర్షి వ్రాసిన భారతంలో కవితాదృష్టితో చూసినా, సాహిత్య దృష్టితో చూసినా శిల్పశాస్త్రం చాలా ఉంది. రచనా శిల్పంలో కొన్ని సంకేత పదాలు, కొన్ని ప్రతీక పదాలు, కొన్ని వేద గాథలు జంతువుల మీద పక్షుల మీద అన్యాపదేశంగా చెప్పిన గాథలు ఈ గాథలు అన్నీ నవరసాలతో ఉన్నాయి ఎన్నెన్నో చమత్కారాలున్నాయి. అస్త్ర విద్యలు, శస్త్ర విద్యలు యుద్ధ వ్యూహాలు, యజ్ఞ రహస్యాలు ఎన్నెన్నో ఉన్నాయి " యుద్ధాల్లో వినిపించే అక్షౌహిణుల సంఖ్య, శస్త్రాల సంఖ్య ఇలా అనేక సందర్భాలలో వినిపించే సంఖ్యలు మనకి వేదాల్లో చెప్పబడిన యజ్ఞాల సంఖ్యలుగా కనిపిస్తాయి అంటే యజ్ఞ సంకేతాలు మనకి మహాభారతంలో మొదటి నుంచి కనిపిస్తుంటాయి. అందుకే భారతం వింటే పఠిస్తే యజ్ఞాలు చేసిన ఫలితం లభిస్తుంది." (షణ్ముఖ శర్మ , సామవేదం, ఇది యదార్థ మహాభారతం, పుట:39,40.)*

శిల్పికి ఒక రాయిని చూస్తే దానికి ఏదో ఒక రూపాన్ని ఆపాదించి రాయికి జీవం పోసినట్లు శిల్పం అపూర్వంగా చెక్కబడుతుంది. అలాగే మనిషిని మానిషిగా మహా రుషిగా తీర్చిదిద్దే శక్తి మహాభారతానికి ఉందని తెలుస్తుంది.

*మహాభారతం మహోత్తమమైన గ్రంథం దాని మహిమను ఇందులో వివరిస్తున్నారు. "ఇది చదివిన వారి , విన్నవారి భావించిన వారి అందులోని ధర్మాలను ఆచరణలో పెట్టుకున్నవారి ఆయువును పెంపొందిస్తుంది. మన ప్రాచీన మహర్షులందరూ మానవులు నిండైన ఆయువు కలవారు కావాలని కాంక్షించారు. ఆయువు ఎంత అధికం అయితే*

అంతగా ధర్మము మొదలైన పురుషార్థాలను సాధించుకునే అవకాశం ఏర్పడుతుంది. ఈ యుగంలో మానవుని పూర్ణమైన ఆయువు నూరేండ్లు అదికూడా శక్తి సంపదను, బుద్ధి సంపదను కోల్పోని విధంగా నిలుపుకోవలసినది. ఈ గ్రంథ పఠనం వలన ధర్మస్వరూపం చక్కగా తెలుస్తుంది. ఆచరించి ఫలం పొందాలనే బుద్ధి వృద్ధి పొందుతుంది. '' (రఘునాథ శర్మ, శలాక,కవిత్రయ భారత జ్యోత్స్న, పుట:06.).

ధర్మాచరణకు ఈ జీవితం సరిపోదని ఇంకా ఆధ్యాత్మిక ప్రపంచంలో క్రొత్త క్రొత్త విషయాలు తెలుసుకొని జన్మ చరితార్థం చేసుకోవడానికి ఆయువును కోరుకునే వారు అటువంటి వారు మహాభారతాన్నే ఆశ్రయిస్తారని ధర్మ స్వరూపాన్ని తెలుసుకుని ఆచరిస్తే వచ్చే ఫలితం బుద్ధి ని వృద్ధి పరిచి ఆచరణల ద్వారా ఆయువును పెంపొందిస్తుందని తెలుస్తుంది.

'భారతీయుల్నే కాక, ప్రపంచ సాహితీ పిపాసుల్ని భారతం విశేషంగా ఆకర్షించింది. అది మనిషి భావనలకు చక్కటి భాష్యం. (రంగనాథ్, పురాణపండ, బాలానందబొమ్మల భారతం,పుట:6)

ప్రతి మానవుడు అనేక కోరికలతో వివిధ మనస్తత్వాలతో ఈ ప్రపంచంలో నివసిస్తుంటాడు. ఈ పాత్రలన్ని కూడా మహాభారతంలో ఉన్నాయని అర్థమవుతుంది.

''మహాభారతం పారిజాత వృక్షంలాంటిదని భారతీయులు భావిస్తారు. పారిజాత వృక్షం కల్పవృక్షం లాగా కోర్కెలను తీర్చే దేవ తరువు. అది వ్యాసుడనే ఉద్యానంలో పుట్టింది. ఉపాఖ్యానాలనే కొమ్మలతో విస్తరిల్లింది. వేదార్థాలనే చల్లని నీడలను ప్రసరించింది. ధర్మార్థ కామమోక్షాలనే పూలగుత్తులతో సువాసనలు వెదజల్లింది. నరనారాయణుల గుణ కీర్తనమనే ఫలాలతో విరాజిల్లింది. భారత పారిజాతం కోర్కెల వర్షపాతం. మహాభారతం భారతీయ భారతిగా ప్రవహించే గంగా ప్రవాహం. దీనిని వింటే అందులో స్నానం చేసినట్లే . పాపాలను ప్రక్షాళితం చేసుకున్నట్లే. సర్వపాపనివారిణి, సకల పుణ్య సంపాదిని శ్రీ మహాభారత శ్రవణం, శ్రీమహాభారత కీర్తనం.అని జి.వి. సుబ్రహ్మణ్యం గారు మహాభారత గొప్పదనాన్ని గురించి చక్కటి భాష్యాన్ని చెప్పారు. (సుబ్రహ్మణ్యం, జి.వి. ఆంధ్రమహాభారతం అమృతత్వ సాధనం, పుట:3.).

మానవుల కోరికలకు అంతం ఉండదు. వారు కోరుకునే కోరికలు ధర్మబద్ధమైనప్పుడు. అది తప్పకుండా నెరవేర్చే శక్తి మహాభారత కావ్యానికి ఉంది అనడంలో అతిశయోక్తి లేదు. కోరికలు నెరవేరకపోతే ఆ వ్యక్తికి మోక్షమనేది కలుగదు కాబట్టి. మానవుడు తన సంసార చక్రంలో కోరికలను నెరవేర్చుకుంటూ క్రమంగా వాటిని తగ్గించుకుంటూ చివరకు వైరాగ్యాన్ని పొందు ముక్తిని ఆశిస్తాడు. ఆ కోరికలు తీరాలన్నా మహాభారతమే సాక్ష్యంగా నిలుస్తుంది. జీవితంలో తెలిసో తెలియక చేసిన పాపాలకు మహాభారతం ప్రక్షాళన చేసి వారి జీవితాలను ధన్యులను చేస్తుంది.

## 1.7. మహాభారతం వేద సారం:

**'మహాభారతం ధర్మశాస్త్రము'** అనే పుస్తకానికి శ్రీభాష్యం అప్పలాచార్యులు నివేదనము వ్రాస్తూ మహాభారతాన్ని గురించి ఈ విధంగా అంటారు.

*"మనము తెలుసుకోవలసినది ఏది తెలియజేయు సాధనమేది తెలుసుకోవడానికి ఏది ఆటంకంగా ఉన్నది తెలుసుకోవడం వలన ఫలమేమి, ఈ జ్ఞానమును పొందు తాను ఎవరు;? అను విషయములను తెలియజేయునది వేదము, దాని రూపాంతరము భారతము, భారతం పంచమ వేదమని ప్రసిద్ధి పొందినది, ప్రత్యక్షము చేత గాని అనుమానము చేత గాని తెలియని దానిని తెలియచేయునది వేదము, వేదయతి ఇతి వేదః ఎఱిగించునదని అర్థము మనము మానవులమై జన్మించినను జ్ఞానము కలవారము అయిననూ దేనిని పొందాలో ఎట్లు పొందాలో అట్టి జ్ఞానమును ప్రసాదించిన వేదములో ప్రధానమైన పర్వములనుండి మనం తెలుసుకోగలము, భారము కలది కనుక భారతము అని పేరు ఆ భారమే విజ్ఞాన భారము," (సుబ్బారావు, కొండేపూడి, మహాభారత ధర్మశాస్త్రము, పుట: v,vi.).*

మహాభారత ప్రశస్తి చాలా చక్కగా వివరించారు. అందరూ తమకు అన్నీ తెలుసు అనుకుంటూనే తప్పటడుగులు వేస్తుంటారు. ఏ అడుగు వేస్తే ఎటువంటి ప్రమాదం జరుగుతుంది. ఎక్కడ ఎలా ప్రవర్తించాలి, ఏ కర్మను ఏ విధంగా చేయాలి. ఇటువంటి జ్ఞానం కలగాలంటే మహాభారతం చదవాలని ఈ విషయాలను బట్టి తెలుస్తుంది.

*“పరమ పౌరాణికుడును పరాశర పుత్రుడును అగు శ్రీ మద్వేద వ్యాస మహర్షి లోకానుగ్రహ తత్పరుడై చతుర్దశ విద్యాస్థాన రహస్యములను ఒక చోట ప్రదర్శిస్తూ మంద మధ్యమాధికారులను కూడా అనుగ్రహించుటకై వైశంపాయన జనమేజయ సంవాద రూపమును అందులో సౌతి శౌనక సంవాద రూపమున హరి వంశము లక్ష గ్రంథాత్మకమై హరి వంశముగా అష్టాదశ మహా పర్వములను, హరి వంశంలో కూడా నవాంతర పర్వ శతమును కల మహా భారతమును ఇతిహాసమును సాక్షాద్గణపతి లేఖకుడుగా రచించి ఈ మనుష్య లోకమున ప్రతిష్ఠింపచేసారు.”(సుబ్రహ్మణ్య శాస్త్రి,వారణాసి, మహాభారత తత్త్వ కథనం, పుట: 01.).*

వేదవ్యాస మహర్షి చతుర్విధ వేదాల సారాన్నంతా మహాభారతంలో నిక్షిప్తం చేశాడని, కేవలం పండితులకు కాకుండా సాధారణ ప్రజానికానికి కూడా వారి జీవన శైలిని మార్చుకోవడానికి, ధర్మ విధులను ఆచరించడానికి నీతి బోధకమైన విషయాలు మహాభారతంలో ప్రతిష్ఠించి మానవ లోకానికి అందించాడని తెలుస్తుంది. భారతాన్ని అందించే ప్రయత్నంలో వైశంపాయన జనమేజయ సంవాద రూపమున, సౌతి శౌనకాది సంవాద రూపమున పేర్కొన్నాడు. గణపతి వ్రాస్తూ ఉంటే వేదవ్యాస మహర్షి లోకమునకు మహాభారతేతిహాసాన్ని ప్రజాలోకానికి అందించాడని పై విషయాలను బట్టి తెలుస్తుంది.

*“ఆది కాలంలో వేదాలన్ని ఒక దగ్గర కలగాపులగంగా ఉండేవి. ఏదిత చెప్పడానికి వీలుపడేది కాదు. అవన్నీ విడమర్చిన వాడు వ్యాసముని ,రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం. అథర్వణ వేదం ఇలా నాలుగు వేదాలుగా విభాగించాడు. పైలుడు, వైశంపాయనుడూ , సుమంతుడూ , జైమినీ ఈ నలుగురు శిష్యులకి చెప్పి వరసగా ఆ నాలుగింటికి సూత్రాలు రాయించాడు. వేదవ్యాసుడయ్యాడు. ఆ వేద వ్యాసుడు రాసిన పుణ్యకథ మహాభారతం. వేద వ్యాసుడు తన తపశ్శక్తి వలన పద్దెనిమిది పురాణాలూ, ధర్మశాస్త్రాలు అర్థాలు, వేదాల వేదాంతాల తాత్పర్యాలూ, ధర్మార్థ కామ మోక్షాలికి సంబంధించిన కథలూ, ఇతిహాసాలు, ప్రసిద్ధులైన మహామునులు మహారాజుల వంశ చరిత్రలు, వర్ణాశ్రమాల ధర్మక్రమాలు, శ్రీకృష్ణ మహాత్మ్యము, భారత వీరుల మహాగుణాలు ఇవన్నీ నిర్మలమూ, విజ్ఞాన మయము అయిన తన వాగ్దర్పణంలో ప్రతి ఫలించేటట్టు*

*మహాభారతం రాసాడు. అదే పనిగా కూచుంటే ఇది ముగించే సరికి మూడేళ్లు పట్టింది ఆయనకు.'' (అప్పలస్వామి, పురిపండా, వ్యావహారికాంధ్ర మహాభారతం, (సం.1),పుట:2.).*

ఈ విషయాలను పరిశీలిస్తే వేదాలను వ్యాసమహర్షి నాలుగు వేదాలుగా విభజించి శిష్యులను నియమించి అన్ని లోకాలకు వ్యాపింపచేసాడు. కాలానుగుణంగా వేదాలసారాంశాన్నంతా మహాభారతంలో నిక్షిప్తం చేసి ప్రజలందరికి సులభరీతిలో అర్థమయ్యేవిధంగా రచించాడని తెలుస్తుంది.

మోపిదేవి కృష్ణస్వామి మహాభారతానికి వేదవ్యాసుడు అనుసరించిన విధానాన్ని వివరించారు. మహాభారతం ఆవిర్భావానికి గల కారణాలను నేపథ్యాన్ని తన గ్రంథమైన'' **భారతం ధర్మాద్వైతం వ్యాసుని దర్శనం —తిక్కన సందర్శనం** ''లో ఈ విధంగా వివరించారు.

*''వేదం అఖండం వినియోగం నాల్గువిధాలు ఇట్టి విద్య తరువాతికాలం వారికి దుష్కరమని భావించి వ్యాసుడు వేదమంత్రాలలోని పరమార్థాన్ని అనుసరించి ఆ మంత్రాలనే నాలుగు సంహితలుగా విభజించాడు. ఒక్కొక్క సంహితను ఒక్కొక్క సంప్రదాయం వారికి అప్పగించాడు. ఆ సంహితను చెక్కుచెదరకుండా తమ తర్వాతి తరాల వారికి అందించే బాధ్యతను వారు స్వీకరించారు. ఒక్కొక్క దానిలో అంతర్భాగాలేర్పడ్డాయి. వాటిని బట్టి అన్ని సంప్రదాయాల వారిని వ్యాసుడు గణాలుగా ఏర్పరచాడు అప్పటికే ఈ విజ్ఞానకోశం మొత్తం ఒక మహారణ్యంలా పెరిగిపోయింది. దానితో బ్రహ్మ విద్యలోని పరమార్థాన్ని ఎత్తి చూపేటటువంటి వేదమంత్రాలు వాటిని గురించి సదస్సులలో జరిగిన అర్థబోధలు వేరువేరు గ్రంథాలుగా వడపోత పెట్టబడ్డాయి. వేదసారాన్ని పట్టి ఇచ్చే ఈ గ్రంథాలే ఉపనిషత్తులుగా రూపొందాయి. వేదం ఉపదేశిస్తున్నదేమిటి. అది దేనికి ప్రాధాన్యిన్నిస్తుంది. అనే అంశాన్ని గురించి చర్చలనేకం జరుగుతూ ఉండేవి. కొందరు తమ చర్చలనుండి సిద్ధాంతాలు చేసి ప్రతిపాదించారు కూడా జైమిని పూర్వమీమాంస మొదలైనవి అట్టి ప్రతిపాదనలే. వీటినన్నింటిని దృష్టిలో పెట్టుకుని వ్యాసుడు వేదసారాన్ని, సందేశాన్ని సమ్యక్ దర్శనాన్ని సూత్రీకరించాడు అవే బ్రహ్మసూత్రాలు ఈ సూత్రాలలో వేదహృదయం*

*ధృవీకరించబడింది. కొంతకాలం జరిగేటప్పటికి వేదాలను వేదాంతాలను వేరుగా చూడటం మొదలుపెట్టి జనం దారితప్పుసాగారు. దీన్ని గ్రహించిన వ్యాసుడు తండ్రి పరాశర మహర్షి ఉపదేశించిన విష్ణుపురాణాన్ని ఆదర్శంగా స్వీకరించి బ్రాహ్మణ గ్రంథాలలోని పురాణ ఇతిహాసాలుఅనబడే అర్థవాదాలను కొన్నింటిని ఎంచుకుని విస్తృతపరిచారు. బ్రాహ్మణాలలో పురాణేతిహాసాలు అనదగిన అర్థవాదాలను కొన్నింటిని ఎంచుకుని విస్తృతపరిచాడు. బ్రాహ్మణాలలో పురాణేతిహాసాలు అనదగిన అర్థవాదాలు కొన్ని వందలున్నాయి అలాంటి పురాణాల్లో ప్రధానమైనవాటిని పద్దెనిమిదింటిని స్వీకరించి వ్యాసుడు శిష్యుల సహాయంతో ప్రత్యేక గ్రంథాలుగా రూపొందించాడు. అలాగే ఇతిహాసాలను ఉద్ధరించి కూర్పుచేసి తన సమకాలిక చరిత్ర అయిన కురువంశ గాధతో మేళవించి భారత గ్రంథ సంహితను ఏర్పరిచాడు. అందులో నాలుగు వేదాలలోని ధర్మమార్గాన్ని సమన్వయపరచి కథల్లో, గాథల్లో పాత్రలపోకడల్లో సన్నివేశాల్లో సంభాషణాదుల్లో విచిత్రంగా ఇమిడ్చాడు. ఇలాంటి ప్రయత్నం అంతకుముందు జరగలేదు కాబట్టే అతని శిష్యులు 'వ్యాసస్యాద్భుతకర్మః' అని ప్రశంసించారు. ఈ ప్రయత్నాలకు ఫలితమైన మహాభారత సంహితలో మానవునకు కావలసిన అర్థాలు, పరమార్థాలు, ఆచరణీయ ధర్మాలు మొత్తం కరతలామలకమయ్యాయి. ఎప్పుడెవ్వరికి ఏ పరిష్కారం కావలసినా దీనిలో లభిస్తుందనడానికి హేతువు ఈ సమగ్రప్రయత్నమే ఈ గ్రంథం యొక్క పెరుగుదల పేర్పుగా గాక కూర్పుగా యనబడింది. అంటే ఒక మహాభవన నిర్మాణం మాదిరిగాకాక విత్తనం నుండి వృక్షంలా పెరిగింది. అమితాఖ్యానక శాఖలతో వివిధార్థ నిర్మలచ్ఛాయలు కలిగి ఈ వృక్షం సర్వసద్విజశ్రేణికి కులాయాలకు నిలయమై నిలిచింది." ( కృష్ణస్వామి, మోపిదేవి.భారతం ధర్మాద్వైతం వ్యాసుని దర్శనం – తిక్కన సందర్శనం , పుట: 09)*

ఈ విషయాలన్నీ చెపుతున్నవి ఒక్కటే వేదసారాన్ని ప్రజలు గ్రహించలేరు రాబోయేది కలియుగం ఆ యుగంలోని ప్రజలు అలసులై జీవిస్తుంటారు అటువంటి వారిని కూడా దృష్టిలో ఉంచుకుని కథలకు ఎవరైనా ఆసక్తిని చూపుతారు కాబట్టి సమస్త వేద గ్రంథాలలోని విషయాన్నంతటిని మహాభారతంగా రూపొందించి అందులోనే మానవులు

ఆచరించవలసిన ధర్మాలను సులభమార్గంలో రచించాడు.అనే విషయం స్పష్టంగా అర్థమవుతుంది.తన తపశ్శక్తినంతా తన స్వార్థంకోసం కాకుండా ప్రజలకు ఉపయోగపడే ఒక మహత్తర గ్రంథాన్ని సమాజానికి అందించాడని అర్థమవుతుంది.

## 1.8. మహాభారతం ఆధ్యాత్మిక సాధనం:

కొండేపూడి సుబ్బారావు మహాభారతంలో దాగి ఉన్న విషయాలను తెలియజేస్తూ *శ్రీమద్భారత "భూభాగము సత్కర్మలకు నిలయమైన పుణ్యభూమి, వర్ణాశ్రమ నియమాచరణకు స్థానమయిన ధర్మక్షేత్రము. కుల పర్వతములలో ఒకటియు అతి ముఖ్యమైనదియు అగు మేరువునకు దక్షిణ మందున్న జంబూద్వీపమున గల ఈ భరత వర్షము. శైల కానన నదీ కాంచన మణి మయాది ధాతు సంపన్నము. సర్వ ప్రకృతి సంపత్ సమృద్ధము. మనువు మొదలు మహా పతులెందరో ప్రజలను కన్నబిడ్డలుగా ఏలి కీర్తిగాంచిన ప్రసిద్ధ దేశము. వేద శాస్త్రజ్ఞులు, నిస్స్వార్థులు, త్యాగ పురుషులు అయిన ఋషీంద్రులు కవీంద్రులు, ఉద్భవించిన పవిత్ర భూమి. వేదోపనిద్ధర్మములు ఆధారముగా వారు వ్రాసి భారత ప్రజలకందిచ్చిన పురాణములు. కావ్యములే ఈ నాటికిని భారతీయ సంస్కృతికి మూలాధారమై మానవ ధర్మమెట్టిదో సర్వ ప్రపంచమునకు చాటి చెప్పిన జ్ఞానభాండారములు. ( సుబ్బారావు, కొండేపూడి.మహాభారత ధర్మశాస్త్రము, శాంతి అనుశాసనిక పర్వములు.పుట:1.)*

మహాభారతం జరిగిన ఈ భూమి సత్కర్మలకు నిలయమని చెప్తున్నారు, ఆధ్యాత్మిక సంపదకు ఆలవాలమై మహాభారతం ఒప్పుచున్నది. స్ఫూర్తికి, కీర్తికి మహాభారతమే నిదర్శనం. ప్రతి భారతీయునికి మన సంస్కృతి పట్ల అభిమానం, కలిగితే మన ఆర్షధర్మాలను రక్షించుకోగలుగుతాము. ఇతిహాసాలు, కల్పితము కాదు అవి మన జీవితాలను తీర్చి దిద్దే ఒక ఆధ్మాత్మిక మార్గము.

## 1.9. వ్యాస హృదయం:

మహాభారత రచనకు మూలమైన ప్రాథమిక అంశాలను చర్చించవలసిన అవసరం ఉంది మహాభారతాన్ని రచించింది వ్యాసుడే అయినా మహాభారతాన్ని రచించాలనే సంకల్పానికి గల కారణాలను కూడా కొంత వరకు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

భారతం ఏమి చెపుతుందో మోపిదేవి కృష్ణ స్వామి ఈ విధంగా వివరిస్తారు *భారతం వ్యక్తి జీవితాన్ని రెండు భాగాలుగా దర్శింపజేస్తుంది. మొదటిది వ్యక్తిగత జీవితం, రెండవది సామాజిక జీవితం. మానవుడు తన జీవితంలోని ఈ రెండు పాత్రల్ని ధర్మబద్ధంగా నిర్వహించుకోవాలి. వ్యక్తిగత జీవితం సామాజిక జీవితానికి దీప్తిని కలిగించేదిగా ఉండాలి. సామాజిక శ్రేయస్సుకు అవశ్యకమైనప్పుడు మానవుడు తన వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేయగలిగి ఉండాలి. అలా త్యాగం చేయడమే ధర్మం అవుతుంది. సామాజిక శ్రేయస్సు కన్నా తన వ్యక్తిత్వానికే ఎక్కువగా ప్రాముఖ్యమిచ్చే వ్యక్తి అధర్మ మార్గాన్ని అవలంబిస్తున్న వాడు అవుతున్నాడు అన్నది మహాభారతం యొక్క ఉపదేశం. ఉదాహరణకు తన వ్యక్తిగత జీవితంలోని పవిత్రతను కురు వంశాన్ని నిలిపేటందుకు త్యాగం చేసాడు వ్యాసభగవానుడు. అదే సందర్భంలో లోక శ్రేయస్సుకన్నా తన ప్రతిజ్ఞకు ఎక్కువ విలువను ఇచ్చాడు భీష్ముడు. సమర్థుడు అయి ఉండికూడా తనకు తానుగా లోకహిత కార్యంలో పాలుపంచుకోలేకపోయాడు. వ్యక్తిగత జీవితంలో చూపిన పవిత్రత సామాజిక జీవితంలో చూపలేకపోయాడు కర్ణుడు మిత్రునిగా, ధాతగా వ్యక్తిగత జీవితంలో ప్రసిద్ధిపొందిన కర్ణుడు తన సామాజిక పాత్రలో దుర్యోధనుడికి ప్రేరణను ఇచ్చి అధర్మమార్గాన నడుస్తున్న అతనికి వంతపాడి జరగకూడని సంఘటనలు జరగడానికి కారణభూతుడయ్యాడు.*

*ఈ విధంగా మానవుడు నిర్వహించవలసిన వ్యక్తిగత సామాజిక పాత్రలను దర్శింపజేసి ఈ రెండు పాత్రలను ధర్మబద్ధంగా నడుపుకొన్నవాడు ధర్మాత్ముడు అవుతాడనీ ఆవశ్యకత ఏర్పడినప్పుడు వ్యక్తిత్వాన్ని లోక శ్రేయస్సుకోసం త్యాగం చేయగలిగినవాడు ధన్యుడు అవుతాడనీ బోధపరుస్తుంది భారతం.*

*మహాభారతంలో ధర్మసంఘర్షణలూ, పరిష్కారాలు, మాత్రమే కాకుండా ఆపద్ధర్మాలు కూడా ప్రాముఖ్యం వహించాయి. ఇందులో వాదైనచోటులన్నీ రాజకుటుంబాల*

*కక్ష్యల్లోనే ఉత్పన్నమైనప్పటికి ఆ సన్నివేశాలన్నీ రాష్ట్ర ధర్మం, సకల ప్రజాపాలన రక్షణ ధర్మాలు, అనే కక్ష్యలతో ముడిపెట్టుకుని ఉన్నాయి. శంతనుడి రెండో పెళ్ళి, భీష్ముడు ప్రతిజ్ఞ గాంధారి వివాహం, ద్రౌపది వివాహం, కుంతీ గాంధారుల సంతానప్రాప్తి, రాజసూయం, జూదం కీచకుని ఘట్టం మొదలైనవన్నీ ప్రజలకు రాష్ట్రానికి సంబంధించిన సన్నివేశాలుగా ప్రాముఖ్యం వహించాయి. అన్నిటి కన్నా మిన్నగా యుద్ధరంగంలో అర్జునుడి విషాదం తత్ఫలితమైన గీతోపదేశం యావత్ప్రపంచానికి సార్వకాలికమైనదిగా ప్రతిష్ఠ చెందింది. అలాగే ధర్మజుడికి భీష్ముడు చేసి న ఉపదేశం కూడా ఈ విధంగా ధర్మాలకూ, వేదాలకూ వాదాలకూ రంగస్థలం అవడంలో రామాయణం కన్నా మహాభారతం కనీసం పద్దెనిమిది రెట్లు పెద్ద కనుకనే భారతంలోని అరణ్యపర్వంలో అంతర్భాగంగా రామాయణ గాథ ఇమిడిపోగలిగింది. ( కృష్ణస్వామి, మోపిదేవి.భారతం ధర్మాద్వైతం వ్యాసుని దర్శనం – తిక్కన సందర్శనం , పుట: 20,21.)*

ఈ విషయాలన్నీ మహాభారతం యొక్క గొప్పతనాన్ని వివరిస్తుంది. అంతేకాదు మహాభారతం వ్యక్తిగత జీవితంలో మనిషి కామ క్రోధాలనే అరిషడ్వర్గాలను ఎలా ఎదుర్కోవాలో నేర్పుతుంది అంతేకాకుండా వ్యసనాలకు మనిషి బానిసకాకుండా వ్యక్తిత్వవికాసాన్ని అందిస్తుంది. మానవున్ని సమాజజీవితంలో గౌరవంగా బ్రతికేలా తగిన జాగ్రత్తలు మెలకువలు అందిస్తుంది. అంతటి మహోన్నతమైనది మహాభారతం. సాహిత్యం లో ఉన్న అనేక గ్రంథాలకు, పరిపాలనా విధానానికి , మహాభారతమే ఆధారమని వివరించారు. అంతే కాదు ఒక వ్యక్తి ఉన్నతమైన భావాలతో జీవించడానికి మహాభారతమే ఆధారం , ప్రతి ఒక్కరి మనసులో అనేక సంఘర్షణలు, ప్రశ్నలు ఉంటాయి వాటన్నింటికి సమాధానం మహాభారతం, మన ప్రతి కదలిక మహాభారతంలో నిక్షిప్తమై ఉంటుందని పై విషయాలు తెలియజేస్తాయి.

మహాభారతాన్ని చదివినా విన్నా ఇహపర సౌఖ్యాలు లభిస్తాయన్న విషయం అందరికి తెలిసిందే అయితే మహాభారతాన్ని వినడం ద్వారా చదవడం ద్వారా కలిగే ఫలితాలను తెలుసుకుని చదివితే మహాభారతం యొక్క ప్రయోజనం అందరికి అర్థమవుతుంది.

మహాభారతం యొక్క హృదయాన్ని వింజమూరి విశ్వనాథమయ్య అన అభిప్రాయాన్ని ' **'ఆంధ్రమహాభారతం కథా పరమార్థం'** లో ఈ విధంగా తెలియజేసారు *'ఒక వంశంలో ఒక మహాపురుషుడు పుట్టడానికి ముందు ఎంతటి ధర్మ సాధన సంఘర్షణ ఉంటుందో కళ్ళకు కట్టినట్లు చూపించేది ఆదిపర్వం. పాండవులు పుట్టి ధార్మికులై, బలసంపన్నులై, దైవ సహాయాన్ని పొందే మార్గాన్ని జీవితంలో ఎలా సాధించాలో తెలుసుకున్న మెలకువలను సభాపర్వం ప్రకటిస్తుంది. ఆదర్శానికి, ఆచరణకూ మధ్య ఉండే అశాంతిని, ఆందోళనను తొలగించుకుని, చిత్తశుద్ధితో కూడిన వ్రత దీక్షతో ఏకాగ్రతను పరిపూర్ణతను సాధించే ప్రయత్నం అరణ్య పర్వంలో గోచరిస్తుంది. యక్ష ప్రశ్నలు యుధిష్ఠిరుని జీవితంలో ధర్మ ప్రతినిష్ఠకు పెట్టిన గట్టి పరీక్ష. అతడు అరణ్య పర్వంలో నెగ్గాడు ధర్మ సామ్రాజ్యధిపత్యానికి అర్హత సంపాదించుకున్నాడు. పాండవులు అజ్ఞాత వాస వ్రతం అసువులు కోల్పోయేటప్పుడు దానికి ధార్మికంగా అమరత్వాన్ని స్వయంగా అందించగలిగారు. అందువల్లనే విరాటపర్వం హృదయాహ్లాది. ఉద్యోగ పర్వంలో పాండవ నైపుణ్యమంతా మానవ యత్నానికి మాధవ యత్నాన్ని సంవిధానం చేయడంలోనే ఉంది. పురుష యత్నం దైవానుకూలంతో గాని, సిద్ధింపదన్న ధర్మ రహస్యాన్ని పరమ రమణీయంగా ప్రదర్శించేది ఉద్యోగ పర్వం.*

*యుద్ధపంచకంలో ధర్మాధర్మ సంఘర్షణలో ధర్మం దైవ సహాయంతో విజయాన్ని సాధించటం వర్ణించబడుతుంది. ఇచ్ఛా మరణం వరంగా పొందిన భీష్ముడు అంపశయ్యపై ఒదిగిపోతాడు. పుట్టుకవచంతో పుట్టిన కర్ణుడు శాపగ్రస్తుడై రణరంగంలో వీర స్వర్గం అలంకరిస్తాడు. అమరులమౌదామని మృత్యువును జయిద్దామని యత్నించిన వీరులలో భీష్మున్ని, కర్ణుణ్ణి, ప్రత్యేకించి చెప్పుకోవాలి. కోరుకున్నప్పుడు చనిపోవటం, అమరత్వం కాదు, పుట్టు కవచంతో అనిత్యమైన దేహాన్ని రక్షించుకోవటం, అమరత్వం కాదు, దాన త్యాగంతో జీవితం సాగాలి. ఉత్తమ గుణ సత్సంగత్వంతో కలసి సాధన చేయాలి. మొదటిది ఉన్నా రెండవ దశ భీష్మునికీ, కర్ణునికీ కరువయ్యాయి. అందువలన పరిపూర్ణత వారికి సిద్ధించలేదు. శాంతి పర్వం ధర్మరాజు యొక్క అంతఃకరణ ప్రవృత్తి యొక్క పరిపక్వతను సాధింపచేసే జ్ఞాన యోగం, శాంతి పంచకం ధర్మజుని జీవితంలో జాలువారిన ధర్మశాల*

*ప్రవర్తనం. మహాప్రస్థాన, స్వర్గారోహణ పర్వాలు ధర్మజుని అమరత్వ సాధనలో ఫలించిన పరిపూర్ణానుభవం. అందువల్లనే భారతం మానవుని అమృత్వ ప్రస్థానంగా పరిగణింపబడుతుంది. ( శ్రీ వింజమూరి విశ్వ నాథమయ్య, ఆంధ్ర మహాభారతం కథా-పరమార్థం, (సంపాదకీయం), పుట:v)*

అని వింజమూరి విశ్వనాథమయ్య గారు మహాభారతంలోని అంతర్లీనంగా దాగిఉన్న విశేషాలు అందించారు. వీరు మనం నిర్వర్తించవలసిన బాధ్యతను మహాభారతం తెలియజేస్తుందని అర్థమవుతుంది. నేటి సమాజానికి ప్రధానంగా కావలసింది మానసిక పరిపక్వత శారీరకంగా ఎన్నో పదార్థాలను తయారుచేసుకుని మానవుడు జీవనాన్ని సాగిస్తున్నాడు కాని మానసిక పరిపక్వత జరగకపోతే మనిషి మానవతా విలువలకు దూరం అవుతాడు తినడానికి తిండి, ఉండడానికి ఇల్లు, కట్టుకోవడానికి వస్త్రం ఉంటే చాలు అనుకుంటే పొరబాటే అది జీవనమార్గానికి అడ్డురాకపోవచ్చు కాని అంతర్గతంగా మనలో దాగి ఉన్న వ్యక్తిత్వాన్ని కప్పివుంచుతుంది. మానవునిలోని శక్తి బహిర్గతం కావడానికి మహాభారతం ఎంతగానో ఉపయోగపడుతుంది. దీని వలన ప్రయోజనం ఏమిటంటే మనిషి మనిషికి సహాయం చేస్తాడు ఎవరో చెప్పిన దానిని పాటించకుండా తన మనసు ఏది ధర్మం అని చెపుతుందో దానిని పాటిస్తాడు. కులమత భేదాలను పట్టించుకోకుండా మానవత్వంతో తోటి వారిని ఆదరిస్తాడు .ఇంతటి శక్తి బహిర్గతం కావాలంటే మహాభారతం ప్రతి మానవుని కి ఏదో ఒక రూపంలో ప్రచారం జరగాలి. అందులోని విషయాలను ఆదరించాలి, ఆచరించాలి. క్రొత్త ప్రపంచాన్ని తనలోనే అంతర్లీనంగా దర్శించగలగాలి. అప్పుడే మన జన్మకు సార్థకత లభిస్తుంది.

*నండూరి రామకృష్ణమాచార్యుల వారు'' శ్రీమన్మహాభారతం ఉద్యోగపర్వం'' గ్రంథంలో తీర్థము శీర్షికలో మహాభారతాన్ని అమ్మవారి స్వరూపంగా భావిస్తారు. శ్రీ మహాభారతమును పరాభట్టారిక స్వరూపంగా భావించినచో అందులో ఆది పంచకము వాగ్భవకూటము, అమ్మవారి ముఖము వంటిది. యుద్ధషట్కము, మధ్యమ కూటము, పరమేశ్వరి మెడ క్రింది భాగము నుండి నడుమునకు ఉన్న ప్రదేశము వంటిది. శాంతి*

*సప్తకము శక్తి కూటమి , కట్యోధోభాగము వంటిది అని వారు భారతాన్ని అమ్మవారి తో పోల్చారు. (రామకృష్ణమాచార్య నండూరి, శ్రీమన్మహాభారతం ఉద్యోగ పర్వం(ముందుమాట), పుట:xx.)*

ఆదిపంచకం అంటే ఆది, సభా, అరణ్య, విరాట, ఉద్యోగ,పర్వాలు వీటిని ఆది పంచకం అంటారు. ఈపర్వాలు అమ్మవారికి వాగ్భవ కూటమి అంటే ముఖస్వరూపం, యుద్ధషట్కము అంటే భీష్మ, ద్రోణ, కర్ణ, శల్య, సౌప్తిక,స్త్రీ పర్వాలు ఇవి అమ్మవారి మధ్యకూటమి, అంటే కంఠం నుండి కటి భాగం వరకు, శాంతి సప్తకము అంటే శాంతి, అనుశాసనిక, అశ్వమేధ, ఆశ్రమవాస, మౌసల పర్వం మహాప్రస్థానం, స్వర్గారోహణం, ఈ పర్వాలు అమ్మవారి కటి భాగం నుండి పాదముల వరకు గల భాగం అని నండూరి రామకృష్ణమాచార్యుల వారి భావన ఇలా వారు ఎందుకు భావించారో ఆలోచిస్తే జగన్మాతకు ఆది అంతము లేదు ఆమె సర్వాంతర్యామి తన సంకల్పంతోనే చరాచర జగత్తు నడుస్తుంది. అందులో భాగంగానే తాను సృష్టించిన శ్రీహరిని సమస్తమానవాళి ప్రయోజనకారిగా ఉపయోగించుకుంటుంది. అందులో భాగంగానే శ్రీకృష్ణుడు మహాభారతంలో తాను ఒక భగవంతుడిగా, ఒక సూత్రధారునిగా ధర్మరథం చేపట్టిన సారథిగా మెలిగి దుష్టశిక్షణ, శిష్ట రక్షణ గావించాడు.

### 1.10. భారతం ఎందుకు చదవాలి:

భారతం ఎందుకు చదవాలి అనే ప్రశ్న వేసుకుంటే సాధారణంగా మనకు తెలిసిన మిడి మిడి జ్ఞానం తో గడిపే జీవితం కంటే ఉన్నతోన్నతమైన జీవన విధానంతో మన జీవన శైలిని రూపుదిద్దుకోవచ్చు అనే విషయం స్పష్టంగా అర్థమవుతుంది. దాని కోసం భారతం చదవాలి. నిన్నటి వరకు మనం గడిపిన జీవితం ఒక విధమైతే భారతం చదివిన తర్వాత ఖచ్చితంగా తన జీవన విధానంలో మార్పును ఆలోచన విధానంలో మార్పును మానవుడు కోరుకుంటాడు. అది భారతం యొక్క గొప్పతనం.

*" భారతం ఒక విజ్ఞాన సర్వస్వం ఒక వేదం, ఒక శాస్త్రం. కాదు సర్వశాస్త్ర సమాహారం సర్వవేదాంత సమన్వయం భాండాగారం ఇందులో లేనిదంటూ లేదు, ఇహ*

*పరాలు రెండు కలబోసి రంగరించి అందించాడు వ్యాసమహర్షి ఇందులో దాని రుచి ఒకసారి ఆస్వాదిస్తే ఇక దాన్ని విడిచిపెట్టరు మనీషులు . ( సంస్కృత భారతం(విరాట పర్వం), సంపాదకులు తప్పాభట్ల రామకృష్ణ మూర్తి , డా సూరం శ్రీనివాసులు,ఉపోద్ఘాతం. పుట:11)*

ఇక్కడ మనం గుర్తించిన విషయం మన హైందవ సంస్కృతి మీద అపార నమ్మకం ఉన్న వ్యక్తి ఎవరైనా భారతం యొక్క రుచి తెలుసుకుంటే ఆ మహాభారతం అందించిన సమస్త విషయాలను సారాంశాన్ని గ్రహించడమే కాకుండా ఆలోచనా శక్తిని పెంపొందించుకుంటారు.

మానవ సంబంధాలు భారతంలో ఏ పాత్రల ద్వారా మనం గ్రహించవచ్చో ఈ విషయాలను పరిశీలిస్తే తెలుస్తుంది.

1. గురు శిష్యుల సంబంధం ఎలా ఉండాలో తెలియాలంటే ద్రోణార్జునులను , కృష్ణార్జునులను చూస్తే తెలుస్తుంది.
2. తండ్రీ, కొడుకుల సంబంధం తెలియాలంటే ధర్మవ్యాధుని పాత్ర ను గమనించాలి.
3. రాజు రాజ్యాన్ని ఎలా పరిపాలించాలో తెలియాలంటే భీష్ముని ధర్మరాజును పరిశీలిస్తే తెలుస్తుంది.
4. పితృవాక్య పరిపాలనం అంటే ఏమిటో తెలుసుకోవడానికి భీష్ముడే నిదర్శనం
5. భార్యా భర్తల సంబంధం తెలియాలంటే ద్రౌపది, పాండవులే ఆదర్శం
6. అత్తా కోడళ్ళు ఎలా ఉండాలో కుంతి, ద్రౌపదిని చూస్తే అర్థమవుతుంది.

భారతం మానవ సంబంధాలు ఎలా ఉండాలి అనేదే కాకుండా ఎలా ఉండకూడదో కూడ చెపుతుంది భారతం.కర్తవ్యం, అకర్తవ్యం తెలియాలంటే భారతమే శరణ్యం. (సంస్కృత భారతం(విరాట పర్వం), సంపాదకులు తప్పాభట్ల రామకృష్ణ మూర్తి , డా సూరం శ్రీనివాసులు.పుట:ఉపోద్ఘాతం.).

భారతంలో ధన కాంక్ష, రాజ్య కాంక్ష వలన కౌరవులు ఏ విధంగా నష్ట పోయారో మనకు తెలిసిన విషయమే ఆ ధనం ఎటువంటిదో ఆ ధనం వలన బంధుత్వంలో ఎటువంటి మార్పులు వస్తాయో వద్దిపర్తి పద్మాకర్ గారు **'మా'నవ కథ** పుస్తకంలో ఈ విధంగా వివరించారు.

*సీ. అన్నదమ్ముల మధ్య నతి భయంకర యుద్ధ*

*మును రగిలించు సాధనము ధనము*

*గురు మిత్ర బాంధవ కోటినైననూ ద్రిప్పు*

*కొన జాలు గొప్ప సాధనము ధనము*

*పరమ నీచాత్ముని వ్యసనుని బిరుదిచ్చి*

*ఘనుని జేయగల సాధనము ధనము*

*బమ్మ తిమ్మిని దిమ్మె బమ్మను జేయంగ*

*దగినట్టి మంచి సాధనము ధనము*

*తే.గీ. దారుణాజ్ఞానపావ కేంధనము ధనము*

*దారపతి సుతనామబంధనము ధనము*

*దర్పమును బెంచునట్టి దండనమయయ్యు*

*మనుజ దేహమ్మునకు మూల ధనము ధనము. ( పద్మాకర్ , వద్దిపర్తి. 'మా'నవ కథ ,(ద్వి.ము), పుట: 16).*

ఈ పద్య భావాన్ని గమనించినట్లైతే అన్నదమ్ముల మధ్య తగాదా పెట్టేది ధనమే, నా అనుకునే గురువులు, బంధువులు , మిత్రులు వంటి వారిని కూడా తన వైపునకు తిప్పుకోగలిగే పదార్థం ధనమే. నీచుడిని, వ్యసన పరుడిని కూడా డబ్బు ఉంటే చాలు వారిని గొప్పవాడంటూ పొగుడుతాం. బిరుదులిచ్చి, సన్మానిస్తాం. బ్రహ్మను కోతిగాను, కోతిని బ్రహ్మ గాను కూడా డబ్బున్న వాడు మార్చగలడు, దారుణమైన అజ్ఞానమనే అగ్నికి ఇంధనం ధనం. భార్య భర్త కొడుకు అనే ఒక బంధం ఉండాలంటే దానికి ధనం

ఉండాల్సిందే అహంకారాన్ని పెంచే వ్యర్థ పదార్థమైనప్పటికి మానవ జీవితం నడవాలంటే ధనం ఉండాల్సిందేనని తెలియజేసారు. ధనమనే మాయ చేత మానవుడు తన వ్యక్తిత్వాన్నే కాక మంచి సంబంధ బాంధవ్యాలను పోగొట్టుకుంటున్నాడని, అశాశ్వతమైన ధనం కోసం వ్యర్థమైన జీవితాన్ని గడుపుతున్నాడని ఈ పద్యం లోని అంతరార్థం.

భారతంలోనే మనం దుర్యోధనుని అత్యంత అసూయ, రాజ్యకాంక్షవలన సంబంధ బాంధవ్యాలను దూరం చేసుకోవడమే కాకుండా తనతో పాటు తన వారందరి వినాశనానికి కారకుడయ్యాడు.

మానవునికి అంతఃశత్రువులు కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యాలు అత్యంత ప్రమాదకరమైనవి ఇవి అదుపులో పెట్టుకోవడానికే జీవితమంతా సరిపోతుంది. మానవుడు ధన వ్యామోహంలో పడి వీటి గురించిన ఆలోచనే చేయకుండా అనేక తప్పులు చేస్తూ జీవిస్తుంటాడు. ఆ మాయ నుండి బయట పడడానికే మహాభారతం వంటి ఇతిహాసాలు , పురాణాలు చదవాలి, లేదా వినాలి.

*" భారతీయ చరిత్రలో ఎన్నో యుద్ధాలు రక్తపాతాలు జరిగాయి అన్ని యుద్ధాలలోనూ అస్త్రాలు, శస్త్రాలు ఉంటాయి కాని ఈ మహాభారతంలో శస్త్రాలతో పాటుగా శాస్త్రం కూడా ఉంది అంటారు."*

*( వేంకటేశ్వర శర్మ, గుత్తి కొండ , పంచమ వేదం సంపూర్ణ మహాభారతం, పుట:03.)*

అస్త్రాలు, శస్త్రాలు అనేవి యుద్ధరంగం ముగిసేవరకు ఉపయోగపడతాయి కాని శాస్త్రం అలాకాదు తరతరాలు అంతరించినా తర్వాతి తరం వారికి సందేశాలను అందిస్తూనే ఉంటుంది. మానవునిలో చైతన్యాన్ని కలిగిస్తూనే ఉంటుంది. అందులో ప్రధానంగా మహాభారతంలో చెప్పబడిన విషయాలను ధర్మసూక్ష్మాలను శాస్త్రప్రమాణంగా తీసుకుని ఆచరించగలిగితే మన బుద్ధిలో ఎప్పటికి తరిగిపోని జ్ఞాన నిధిని మనం సంపాదించుకోవచ్చు.

*"ప్రాచీన గ్రీకు వేదాంతి ఒకరు ఒకే నదిలో ఎవరైననూ రెండు మారులు స్నానము చేయలేరు అన్నాడు అనగా ప్రతిక్షణం పరిణామశీలము నది అందులో నీరు సదా*

*ప్రవహిస్తూనే ఉంటుంది. అంతేకాదు స్నానం చేసే మనిషి కూడా ప్రతిక్షణం పరిణామశీలియే.*

*ప్రతి క్షణం పరిణామబద్ధమైన ఈ ప్రపంచంలో కర్తవ్యము ఎట్లు నిర్ణయించుకోవాలి? ఏ ధర్మాన్ని ఆచరించాలి? సదా పరిణామశీలమైనది ఎల్లప్పుడూ గమనించునది కదా ఈ జగత్తు అందుచేతనే మహాభారతం ధర్మమునందలి అద్వైతమును సమన్వయ సంధానమును ప్రసాదించుచున్నది. వైవిధ్యములోని ఏకత్వ ప్రతిపాదికను మహాభారతం అని నందూరి రామకృష్ణమాచార్యులు అభిప్రాయపడ్డారు.'' ( రామకృష్ణమాచార్య నందూరి, శ్రీమన్మహాభారతం ఉద్యోగ పర్వం(ముందుమాట), పుట:xvii.*

పరిణామం అంటే మార్పు ఈ జీవన ప్రపంచంలో సాంకేతికత రూపుదిద్దుకున్న ఈ సమాజం అణువణువు మార్పుకు లోనవుతూ ఉంటుంది. వాటి ద్వారా వ్యక్తుల అభిప్రాయంలోనూ వైవిధ్యం ఏర్పడుతూ ఉంటుంది. వాటన్నింటిని సమన్వయ పరచి ఒకే పద్ధతి ని అలవాటు చేయించి సన్మార్గం వైపున నడిపించేదే భారతమని పై మాటలో అర్థమవుతుంది.

బానోజి సంపత్ కుమార్ **''మహాభారత ఔచిత్యమ్''** వ్యాసం లో మహాభారత గొప్పతనాన్ని ఈ విధంగా వివరించారు. *''మహోన్నతమైన లక్ష్యంతో మహాభారత రచనను చేపట్టారు. స్థూలంగా మహాభారతాన్ని పరిశీలిస్తే ఇదొక అద్వితీయ ఇతిహాసమని తెలుస్తుంది. ఇతిహాసమునకు ఇతిహ ఆస్తినే అస్తేతి ఇతిహాసః అనే వ్యుత్పత్తి కలదు దీనిని అనుసరించి ఇతిహాసము అనగా పూర్వమిట్లు జరిగినదని పరంపరాగతంగా చెప్పబడింది అని అర్థము. ఇందులో సోమవంశజుల చరిత్ర కలదు విశేషించి కురుపాండవుల చరిత్రలో భాసించునది. ఈ ఇతిహాసము ఉపదేశ ప్రధానమైనది. పైగా యధార్థముగా జరిగిన కథ. మానవుని సదాచారునిగా ,ధార్మికునిగా తీర్చిదిద్ది మనిషిని మనీషిగా చేయగలిగిన ఉత్తమ గ్రంథము వివిధ శాస్త్రములకు ఆలవాలము. ఇందులో గల ఒక్కో పాత్ర ఒక్కో పాఠాన్ని నేర్పిస్తుంది. ఒక్కో సంఘటన మానవ జీవితాన్ని ప్రతిబింబిస్తుంది. విలువైన*

*సందేశాలిస్తుంది. అంటారు.అంతేకాదు భారత సావిత్రి అంటే భారత సారాన్ని తెలియజేసే శ్లోక రాజమే భారత సావిత్రి అని చెప్తూ*

*"న జాతు కామాన్న భయాన్నలోభాద్*

*ధర్మం త్యజేజ్జీవితస్యాపి హేతోః*

*నిత్యో ధర్మః సుఖ దుఃఖే త్వనిత్యే*

*జీవో నిత్యో హేతు రస్య త్వనిత్యః "*

*ధర్మం నిత్యం సుఖదుఖాలు అనిత్యాలు జీవుడు నిత్యుడు జీవత్వ కారణమైన అవిద్య అనిత్యము కనుక భోగాభిలాషచే గాని, భయంచే గాని,లోభం వల్ల కాని చివరకు ప్రాణాపాయ స్థితిలో కూడా ధర్యం తప్పరాదు అని మానవ జాతిని హెచ్చరిస్తూ వ్యాసుడు స్వర్గారోహణ పర్వంతో భారతాన్ని ముగిస్తాడు. ఇలా ధర్మ అధర్మ పరుల రెండు జీవితాలు చిత్రించి మహర్షి అధర్మ పరిణామం ఇంత దారుణంగా ఉంటుంది. కావున దానిని త్యజించాలి. ( సంపత్ కుమార్ , బానోజి మహాభారత ఔచిత్యమ్.(పరిశోధనపత్రం),* https://www.auchithyam.com/advanced/october22_Special_Issue_01.html

ఈ విషయాలను పరిశీలిస్తే నేటి సమాజంలో చిన్న చిన్న విషయాలకు అబద్ధాలు చెప్పడం , నీతి చెప్పే వారే నీతిని తప్పడం గమనిస్తుంటాము కాని ధర్మన్నే వ్రతంగా చేసుకుని జీవించేవారు ప్రాణాపాయ స్థితిలోనూ తన ధర్మాన్ని విడువకుండా జీవితాన్ని పరమార్థం చేసుకుంటారు.

**"మహాభారత అవతారిక"** లో శలాక రఘునాథ శర్మ గారు మహాభారతం గురించి తెలియజేస్తూ ఈ విధంగా అన్నారు. " శ్రీమద్ వ్యాస రూప నారాయణులు మానవజాతిని మాధవ స్థాయికి ఉద్ధరించవలయును అనే పూనికతో రూపొందించిన జ్ఞాన గంగయే శ్రీమహాభారతము మానవుడు ముందుగా దీని మహత్త్వ గౌరవములను గూర్చి తప్పక సంభావించవలయును దేశకాల విషయసంబంధమగు వ్యాప్తి ఇందులో అనితర సాధారణముగా గోచరించును శ్రీ వేద వ్యాసుల వారే ఇందు ఒక విషయమును స్పష్టముగా

ప్రకటించారు. ‘‘ భగవాన్ వాసుదేవో2పి కీర్త్యతే2త్ర సనాతనః సనాతనుడు భగవంతుడునైన వాసుదేవుడును ఇందు కీర్తింపబడుచున్నాడు. భరతవంశం వారి చరిత్రము అని భారతం పేరు వింటేనే తెలుస్తుంది. ఆ భరతవంశము వారు వాసుదేవునిలో అంతర్భాగమే. శ్రీకృష్ణవాసుదేవుడు అర్జునుని నిమిత్తముగా చేసుకుని గీతోపదేశమును మానవాళికి చేసెను సత్యోక్తి ఇచటను అన్వయించుకుంటే భరతవంశము వారి చరిత్రమును నిమిత్తముగా చేసుకుని వాసుదేవ పరబ్రహ్మతత్త్వమును మహాభారతగ్రంథమును ప్రపంచించి చూపుచున్నదని తత్త్వజ్ఞుల సముచిత భావన’’ ( రఘునాథ శర్మ, శలాక, మహాభారతావతారిక ఆది పర్వము, పుట:07).

దీనిని బట్టి మహాభారతము లో జరిగే ప్రతి సంఘటన వాసుదేవుడైన శ్రీకృష్ణ పరమాత్మ సంకల్పమే అని తెలుస్తుంది. రాబోయే తరాల వారికి మంచి, చెడు గ్రహించేవిధంగా శ్రీకృష్ణుడే మహాభారతంగా మహాభారతమే శ్రీకృష్ణునిగా రూపొంది మానవాళిని సంరక్షిస్తుందనే భావన పై మాటల్లో వ్యక్తమవుతుంది.

మహాభారతావతారిక గ్రంథంలో శలాకరఘునాథ శర్మ మహాభారతాన్ని గురించి ఇంకా కొన్ని విషయాలు తెలిపారు.*‘‘ అజ్ఞానంతో లోకం వెంటపడి తిరుగుతున్న వానికి కళ్ళు తెరిపించే కాటుక పుల్ల .ఇందులో ధర్మము, అర్థము, కామము, మోక్షము, అనే నాలుగు పురుషార్థాలు విషయాలు సంగ్రహంగా , విస్తారంగా రూపుదిద్దుకున్నాయి. ఆ విధంగా మానవులను ఆవరించి ఉన్న చీకటి భారత సూర్యునితో పటాపంచలవుతుంది. ఈ పురాణం పూర్ణ చంద్రుడు. వేదార్థాలనే వెన్నెలలను విరజిమ్ముతూ ఉంటుంది. మోహమనే ఆవరణం ఈ ఇతిహాస ప్రదీపంతో విచ్చిపోతుంది. లోకమనే గర్భగృహం కాంతులతో వెలిగిపోతుంది.*

*దీనికి‘‘ సంగ్రహాధ్యాయం విత్తనం . పౌలోమ , ఆస్తీక పర్వాలు వేళ్ళు సంభవ పర్వం బోధె, సభ అరణ్య పర్వాలు చక్కగా ఉండడానికి కట్టుకునే గూళ్ళు, అరణీ పర్వం అందచందాలు, విరాట, ఉద్యోగ పర్వాలు, ఈ చెట్టు చేవ. భీష్మ పర్వం పెద్ద కొమ్మ , ద్రోణ పర్వం పచ్చగా నిగ నిగ లాడుతూ ఉండే ఆకు, జొంపం, కర్ణ పర్వం తెల్లని పూలు, శల్య పర్వం ఆ పూల పరిమళం. స్త్రీ పర్వం, సౌప్తిక పర్వం కొమ్మల నడిమి విశ్రాంతి స్థలాలు.*

*శాంతి  పర్వం ఈ చెట్టు ప్రసాదించే మహాఫలం. అనుశాసనికం శాంతి పర్వం లో భాగమే. అశ్వ మేధం అమృత రసం. ఆశ్రమ వాస పర్వం జ్ఞానం పొందాలనే తీవ్ర కాంక్షగల పక్షులు సుఖంగా కూర్చుండే తావు. మౌసల పర్వం చిటారు కొమ్మ (వేదాంత విజ్ఞాన విలాస భూమి) మహాప్రస్థాన స్వర్గారోహణ పర్వాలు అనంతమైన గగనాన్ని తాకుతూ ఉండే అంచులు. వీనిని శిష్టులైన ద్విజులు సంస్కారవంతులైన బ్రాహ్మణులు పక్షులు సేవిస్తూ ఉంటారు. ఈ భారతమనే మహావృక్షం సర్వభూతాలకు వానదేవుడు ఎలా జీవాన్ని ఇస్తాడో అలా కవి ముఖ్యులందరికి జీవనాధారం అయి అక్షయంగా అలరారుతూ ఉంటుంది.'' ( రఘునాథ శర్మ, శలాక, మహాభారతావతారిక ఆది పర్వము, పుట:07)*

మహాభారతం లోని పర్వాలన్నీ ఒక మహావృక్షంతో పోల్చారు చెట్టుకు ఏ భాగం లేకపోయినా తన రూపాన్ని కొల్పోతుంది. మహాభారత యుద్ధం ముగిసిన తర్వాత  ఆ యుద్ధం కారణంగా జరిగిన నష్టాలను, లాభాలను గురించి ఆలోచిస్తే దాని నుండి గ్రహించిన విషయాలు,  తెలుసుకున్న విషయాలన్నీ
శాంతి పర్వం లో కథ ల రూపంలో సాక్షాత్కరిస్తాయి అనే భావన వ్యక్తమవుతుంది.

### 1.11 వ్యాసుడు దర్శించిన భారతం:

*''వ్యాసుడు తన అంతరంగంలో విశ్వాన్వేషణ గావిస్తూ అనేక విషయాల మీద దృష్టి సారించాడు. ఈ జగత్తు ఎలా పుట్టింది ? ఈ మానవుణ్ణి సృష్టించిందెవరు? ఈ శరీర నిర్మాణం, మెదడు, మనస్సూ, గర్భంలో ఉన్న శిశువుకి కూడా తెలియకుండా ఈ అంతటిని ఏ శక్తి నిర్మిస్తుంది? పుట్టబోయే పిల్ల కోసం ముందుగానే తల్లికి పాలు ఎవరు ఏర్పాటు చేస్తున్నారు తల్లి నిమిత్తమాత్రురాలు, తండ్రీ అంతే వాళ్ళిద్దరిని పనిముట్లుగా ఉపయోగించి ఏ శక్తి, ఈ మానవ శరీరాలను కోటానుకోట్లగా ఇలా తయారుచేస్తుంది? ఈ సృష్టి చేసే శక్తి ఏమిటి? ఈ కనబడే ప్రపంచాన్నీ అలాగే భూగోళం , సూర్యుడు, చంద్రుడూ, నదులు, సముద్రాలు, కడుపులో పెరిగే పిండాండం ఇవన్నీ పుట్టించిన శక్తి విశాల విశ్వంలో ఏర్పడే బ్రహ్మాండం. ఈ రెండూ ఒకటేనా? ఈ రెండింటి వెనక ఉండి నిర్వహించేది ఒకే అజ్ఞాన హస్తమేనా? అయితే ఈ సృష్టి వెనకాల దాగి ఉన్న అంతరార్థం ఏమిటి? పైకి కనిపించే*

*ప్రకృతి వెనుకఉన్న చైతన్యం అంతటా విశ్వం వెనుక దాగి ఉన్న విశ్వ మేధస్సు ఎవరు? ఈ విశాల విశ్వాంతరాళంలో వెనుక దాగి ఏదైనా ఒక సంకల్పం ఉన్నదా? లేక పదార్థమే అన్నీ నిర్వహిస్తున్నదా?ఇది కేవలం ఒక పెద్ద శక్తి మాత్రమేనా 'తెలివి ' కూడా కలిగి ఉందా? దీన్ని తెలుసుకునేదెలాగా?*

*అంతే గాక తను నిర్మించిన దుష్ట ఆలోచనల స్వార్థాన్ని అనుమానాల భయాల చెడు పనుల విషవలయంలో ఆశల వలలో చిక్కిన ఎలుకల మందలాగా చిక్కి గిలగిలా కొట్టుకుంటున్నా ఈ మానవ జాతిని అందులోంచి బైటపడేసే తారకమంత్రం ఏది? సుఖ సంతోషాలూ ఆనందంతోపాటు మానవజాతి ఇరుక్కుపోయిన ఈ దానవత్వపు ఊబిలోంచి మళ్ళీ మానవత్వంలోకి కాదు దైవత్వంలోకి తిరిగి తనను తాను మనిషి ఉద్ధరించుకోవాలంటే మార్గమేమిటి? అనే నిగూఢ రహస్యాన్ని భేదించాలని తాను గాఢంగా ప్రేమించే ఈ తోటి మనుష్యుల కోసం ఆ చంద్రార్కం నిలిచిపోయే ఒక వెలుగు దివ్వెను మానవుల హృదయంలో వెలిగించాలని సంకల్పించాడు వ్యాసుడు. ( వేదవ్యాస, శ్రీ వేదవ్యాస మహర్షి దివ్య చరిత్ర, పుట: 04.)*

దీనిని బట్టి ఒక మహత్తర కార్యాన్ని సాధించాలంటే దానికి ఎంతో గట్టి సంకల్పం కావాలి సంకల్పం తోపాటు కఠోర దీక్ష, తపస్సు, సాధన, శ్రద్ధ ఇవన్నీ చాలా అవసరం వేదవ్యాసుడు భవిష్యత్తరాలకు మార్గనిర్దేశనం కోసం పరితపించాడు. అంతే కాదు మానవుని లో పరివర్తన నిరంతరం కొనసాగడానికి ఏదో ఒక ఆధ్యాత్మిక ప్రయత్నం చేయాలని భావించాడు, అనే విషయం పై మాటల వల్ల తెలుస్తుంది.

''వేదాలకు అర్థం  తపస్సు ద్వారా దివ్య దృష్టితో గ్రహించిన వ్యాసమహర్షికి త్వరలో రానున్న కలియుగం గురించి, మానవజాతికి స్వార్థము అహంకారము అంతర్యుద్ధాలతో మహాపాపాలతో నిండివున్న నేటి కలియుగం గోచరించింది.

ఈ కలియుగ మానవాళి అల్పాయుష్కులు భక్తి రహితులు పుణ్య హీనులై స్వార్థంతో చేసిన అనేక చెడు కర్మల ఫలితాలను జన్మజన్మలకే అనుభవిస్తున్న ఈ కలియుగం మానవులైన మన గురించి ఆయనకు ఎంతో దయకలిగింది. వేదార్థాన్ని అవగతం చేసుకోలేని కలియుగమానవాళికి వేదం యొక్క సందేశాన్ని అందించడం ఎలా? పిల్లలకు

తల్లి బోధించినట్టు ధర్మాన్ని , నీతిని త్యాగాన్ని, పుణ్యపాప ఫలితాలను కథల ద్వారా అందిస్తే బాగుంటుందని సంకల్పించి ఇతిహాసమైన మహాభారతాన్ని రచించాడు. నాలుగు వేదాల సారమైన మహాభారతాన్ని పంచమవేదంగా ఋషులందరూ కీర్తించి శిరోధార్యంగా ఒక పారాయణ గ్రంథంగా నేటికి పూజించి పఠిస్తున్నారు.

ఈ మహాభారతంలోనే భగవద్గీతను , విష్ణుసహస్రనామాలను, ఇంకా అనేక స్తోత్రాలను, మంత్రాలను, జపాలను, అనేక ధర్మాలను మనిషిగా జన్మ నెత్తినవాడు తెలుసుకోవలసిన సర్వవిషయాలను వ్యాసమహర్షి కథల రూపంలో అందించాడు. నేటి కలియుగ మానవాళికి చివరకు ఈ కలియుగం ఎప్పుడు అంతమవుతుందో కూడా తెలియజేసి రానున్న కల్కిఅవతారం చరిత్ర కూడా ఎంతో విశదంగా వర్ణించాడు. వ్యాసమహర్షి అరణ్యపర్వంలో ఈ మహాభారతాన్ని కేవలం కథలు గా కాకుండా ఒక శాస్త్ర గ్రంథంగా పరిశోధన దృష్టితో అధ్యయనం చేస్తే అందులో మనకు కనిపించే అనేక శాస్త్ర రహస్యాలేమిటో తెలుస్తాయి.'' (వేదవ్యాస, శ్రీ వేదవ్యాస మహర్షి దివ్య చరిత్ర, పుట: 350.)

ఏ యుగంలో నైనా మానవుడికి సూక్ష్మ దృష్టి చాలా అవసరం వర్తమానంలో జీవిస్తున్నాం కదా జరిగేది ఏదైనా జరగక మానదు అని వదిలివేయకూడదు ప్రస్తుత పరిస్థితులను గమనిస్తూనే భవిష్యత్తు కార్యాచరణ గురించి అంచనా వేయగలవాడే సమర్థుడు . వేదవ్యాస మహర్షి తన మేథస్సును చిలికి ప్రాపంచక విషయాలు మానవులను ఏ విధంగా భ్రష్ఠులను చేస్తాయో ముందుగానే తెలియజేసాడు. అంతే కాదు కలియుగ మానవులు తరించడానికి ఎన్నో సూక్ష్మ ధర్మాలను వివరించాడు. రాబోయే తరాలవారు ధర్మాన్ని ఆచరించడంలో అలసత్వం వహిస్తారని, సోమరులై ఉంటారని గ్రహించి కథల ద్వారా మానవాళిని బాగుపరచాలి అనుకున్న జ్ఞాని.

## 1.12. మహాభారత పరమార్థం:

జి.వి. సుబ్రహ్మణ్యం అమృతత్వసాధనమంటే ఏమిటో చెప్తూ'' *మహాభారతంలో మొదలూ, ముగింపూ మానవుడు అమృతత్వ సిద్ధి కోసం చేసే సాధన యొక్క ప్రారంభ*

*పరిణతావస్థలను తెలుపుతూ ఉన్నాయి. దానికి ఉదాహరణగా మహాభారత కథకు మృతసంజీవని కోసం ప్రయత్నించడం అమృతత్వసాధనకు శుభారంభం గా వివరించారు.*

*''లోకంలో మరణం లేదా మృతి మాట ఉంది. దేహి ప్రాణ త్యాగం చేసినప్పుడు. దేహం పొందే జడత్వం మృత్యువు. పుట్టిన జీవి గిట్టడం సహజం. జన్మ ఎత్తిన ప్రాణి మృత్యువు పొందక తప్పదు. మానవుడు ఈ రెండింటిని జయించాలని తీవ్రంగా ప్రయత్నం చేస్తూ వచ్చాడు. ఈ ప్రయత్నాన్ని ఆధ్యాత్మిక ప్రస్థానం అంటారు. మరణం లేకుండా ఉండే స్థితిని పొందితే అమరత్వం అనాలి. జన్మ ఎత్తకుండా ఉండే నిత్య స్థితిని మోక్షమన్నారు. పుట్టిన జీవి మరణం లేకుండా బ్రతకటం ఒక ఎత్తు అసలు పుట్టుక లేకుండా బ్రహ్మ స్థితిలో నిలపడం మరొక ఎత్తు. మొదటి మార్గానికి ఫలం స్వర్గం, రెండవ ప్రస్థానానికి ఫలం బ్రహ్మత్వం. ఈ రెండు రకాల సాధనల్లో మొదటిది సామాన్యంగా కర్మ మార్గాన్ని అనుసరించే వారికి లభ్యమవుతూ ఉంటుంది. జ్ఞానమార్గం అనుసరించే వారికి బ్రహ్మానంద స్థితి గమ్యమవుతూ ఉంటుంది. భక్తి మార్గ ప్రస్థానంలో ఉభయ సిద్ధులకు అవకాశం ఉంది. మహాభారతం ఈ మూడు మార్గాలను ముచ్చటగా మేళవించింది.'' ( సుబ్రహ్మణ్యం, జి.వి. ఆంధ్రమహాభారతం అమృత్వ సాధనం. పుట:132,133,)*

లోకంలో పుట్టడం, మరణించడం ఇవి ప్రతి మానవుడు అనుభవించే ఒక క్రియ. పుట్టిన దగ్గర నుండి మరణించేంత వరకు జరిగే జీవన సమయంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కుంటాడు మానవుడు. అయితే జ్ఞాన మార్గాన్ని అన్వేషించే వారికి మహాభారతం ఒక అమృత్వ సాధనం అని జి.వి.సుబ్రహ్మణ్యం గారు చక్కగా వివరించారు.

'' మానవ సమాజంలో స్థూలంగా రెండురకాల వారుంటారు. లోకం కోసం తను వున్నానని విశ్వసించి నడచుకునేవారు, తనకోసమే లోకం వుందని ప్రవర్తించేవారు. అలాగే తాను అనుసరించిందే ''ధర్మం'' అని భావించేవారు, అసలుసిసలు ధర్మాన్ని గుర్తించి అనుసరించే వారు మనలోనే వున్నారు. మహాభారతంలో ''ధర్మం'' అనే ఏకసూత్రం అంతర్లీనంగా వుంది. దానిని పాటించే వారిని, పాటించని వారిని గమనించే ''విధాత'' పాత్ర శక్తివంతంగా సందర్భాన్ని బట్టి పని చేస్తుంది. ''కాలం'' మరొక ఆయతనంగా తన

పని తాను చేసుకుంటూ పోతుంది. కాలానికి నిర్దిష్టమైన ఒక ప్రణాళిక వుంటుంది. సన్నివేశాలన్నీ ఆ ప్రణాళిక క్రమంగా జరగడానికి వీలుగా నడుస్తూ వుంటాయి. ఎటువంటి ప్రణాళికనైనా తేలికగా వేయడానికి గల తెలివిని మహాభారతం అందిస్తుంది. (https://rushivarya.com/post/mahabharatam)

"**ఆంధ్రమహాభారతోపన్యాసములు**" గ్రంథంలో సి. నారాయణ రెడ్డి, అవతారికను వ్రాస్తూ మహాభారతంలో దాగి ఉన్న విషయాలను ఈ విధంగా చెప్పారు. *" ఆధునిక సామాజిక జీవనంలో మననం చేసుకోవలసిన అనేకాంశాలు మహాభారతంలో నిక్షిప్తమై ఉన్నాయి. ప్రాచ్య పాశ్చాత్య వేదాంతుల దృష్టిని ఆకర్షించిన భగవద్గీత కూడా మహాభారతాంతర్గతమే మహాభారతాన్ని అధ్యయనం చేయగలిగితే మానవ మనస్తత్వాలు సమగ్రంగా అవగతమవుతాయి. మహాభారతాన్ని ఐతిహాసిక దృష్టితోనే కాకుండా కావ్య దృష్టితో వివేచిస్తే అనేక కావ్య లక్షణాలు స్ఫురిస్తాయని నిరూపిస్తున్నాయి."*

*(నారాయణ రెడ్డి, సి. (ప్ర.సం), శివారెడ్డి, ఎల్లూరి( సంపాదకులు), ఆంధ్రమహాభారతోపన్యాసములు,(ఉపన్యాస సంకలనం) పుట: అవతారిక.)*

### 1.13. మహాభారతం ఆదర్శ గ్రంథం

మహాభారతం ఒక వ్యక్తి పుట్టిన దగ్గర నుండి మరణించేంత వరకు వ్యక్తిత్వానికి కావలసిన విషయాలన్నింటిని సమకూర్చే గ్రంథం.

*"భారతదేశము నందలి ప్రాచీన భాషలన్నియు భారతాన్ని ఆశ్రయించుకుని తమ కావ్యములు రచించుచున్నారని అలాగే ఈ మహాగ్రంథమును, పరివర్తనములు కూడా జరిగాయి. అవి లోక ప్రియములు కూడా అయినవి. మహారాష్ట్ర భాషయందు యోగీశ్వరుడైన జ్ఞాన దేవుడు మొదలుకుని, ముక్తీశ్వరుడు, మోరోపంతు వామన పండితుడు, రఘునాథ పండితుడు మొదలగు ప్రాచీన మహా కవులందరును తమ ప్రతిభా సముపార్జన కొరకు మహా భారతాన్నే ఆశ్రయించారు. తక్కిన భాషలలో కూడా ఇంతే ఆంధ్ర జాతికి భారతము మహా ప్రియమైనది. సర్వాంగ సుందరంగా దానిని వారు తెనుగించుకున్నారు. సంస్కృతమున భారతమును ఆశ్రయించుకుని పుట్టిన రచనలకు లెక్కలేదు. రాజకీయ భావ ప్రచారముకు దేశ నాయకులెందరో భారతమును ఆశ్రయించిరి.*

*కన్నడమున 'పంప భారతము' కుమార 'వ్యాస భారతము' రన్నని 'గదా యుద్ధము'. మొదలగు వానికి విజ్ఞాన భిక్ష పెట్టినది సంస్కృత భారత కల్పవృక్షం కల్పనాత్మకమైన కావ్య మార్గమునకు గాక నిత్య జీవితమున కూడా మహాభారతము మన ఆరాధ్యము,ఆశ్రయము, ప్రతి ధర్మమును భారతమును చూచి మనం నిర్ణయించుకున్నదే దాని యందు వర్ణించబడిన కథల నుండి నీతులు నేర్చుకున్నాము. (నారాయణాచార్యులు, పుట్టపర్తి, మహాభారత విమర్శనం (ప్ర.భా).పుట:07.)*

ఈ విషయాలన్ని కవి పండితులకు, యోగేశ్వరులకు అందరూ తమ జ్ఞాన సంపదను పెంచుకోవడానికి మహాభారతాన్ని ఆశ్రయించారని తెలుస్తుంది. నేడు సమాజంలో ఉన్న రాచరిక వ్యవస్థ రాజనీతి తంత్రాలు, అన్నింటిని మహాభారతం వివరిస్తుంది. మనం నేడు ఆచరిస్తున్న ధర్మం ఆచారాలు, ఇవన్ని భారతం నుండి గ్రహించినవే. అందులోని ప్రతి కథలోని సారాంశం మానవుని జీవన శైలి పైన మానవుని వ్యక్తిత్వం పైనా పడుతుంది. మానవున్ని సర్వోత్తమ లక్షణాలు కలవారుగా తీర్చిదిద్దడానికి మహాభారతం తోడ్పడుతుంది.

## 1.14. మహాభారతం ప్రపంచ విస్తరణ:

మహాభారతం భారతదేశానికే పరిమితమైనది కాదు సమస్త ప్రపంచానికి దాని యొక్క ఉనికి అవసరం. అందుకే అనేక భాషల్లో వారికి అర్థమైనరీతిలో అనువదించుకుని మరి భారతాన్ని అర్థంచేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

*''మహాభారతం యొక్క వైశిష్ట్యం కేవలం భారతదేశం వరకే కాదు అన్యదేశీయుమును దాని గొప్పతనమును , అతి ప్రాచీన కాలమునే గ్రహించారు. క్రీ.శ 2 వ శతాబ్దం నాటికే గ్రీకు సాహిత్యమున భారతం ప్రవేశించి దానిని గురించిన పొగడ్తలు, ఉల్లేఖనములు ఆ వాఙ్మయమునందు ఉన్నవి. క్రి.శ 6 వ శతాబ్దం నాటికి కాంబోడియా యందలి దేవళము లందు భారతము సంపూర్ణంగా చదువే ఆచారముండేది. క్రీ.శ 7 వశతాబ్దమున 'మంగోలియా' 'టర్కి' భాషలలో హిడింబమని వంటి సన్ని వేశాలు కావ్యాలుగా రాయబడి పాడబడుచుండెను. 10 వ శతాబ్దం నాటికే మహా భారతమును*

*జావా ద్వీపము వారు స్వభాషలోనికి పరివర్తించుకునేవారు. క్రి.శ 1819 లో ఫ్రాన్ జ్ బాప్' అను ఒక విద్వాంసుడు మహాభారతమునందలి నలోపాఖ్యానమును పాశ్చాత్య భాషలోనికి పరివర్తించెను. ఆ కథ యొక్క సౌందర్యమునకు ముగ్ధులైన పాశ్చాత్యులు ఉత్తమోత్తమ సాహిత్యమని దానిని పొగిడారు.''*

*( నారాయణాచార్యులు, పుట్టపర్తి, మహాభారత విమర్శనం (ప్ర.భా).పుట:18,19.)*

భారతదేశమున మహాభారతమును గురించి తెలియని వారు లేరు. ఏనాడో వ్యాసునిచే రచింపబడిన మహాభారతం. నేటికినీ దేశ భాషలందే గాక విదేశ *భాషలందును స్థానం ఆక్రమించిన ఆ గ్రంథ ప్రాశస్త్యాన్ని గమనించాలి.*

*"మహాభారత ప్రతులు క్రీ.శ 60 వ ప్రాంతమున కంపూచియా చేరినట్లు తెలియుచున్నది. క్రీ.శ. 10 వ శతాబ్దం నాటికే మహా భారతము జావా భాషలోనికి అనువదించబడింది. క్రీ.శ 17 వ శతాబ్దంలో పర్షియా భాషలోనికి అనువదించబడింది. క్రీ.శ 19 వ శతాబ్దంలో ఇంగ్లీష్, జర్మని భాషలోకి అనువదించబడింది. మహాభారతంలోని కథలు బౌద్ధ గ్రంథములలో చోటు చేసుకుని మధ్య ఆసియా, చైనా, జపాన్ , మంగోలియా దేశమునకు వ్యాపించింది.'' (వాచస్పతి స్వర్ణ, శ్రీ మహా భారత స్వస్వరూపం, పుట:100,101.)*

పై విషయాలను పరిశీలిస్తే కేవలం మహా భారత కథ భారతదేశం వరకే పరిమితం కాలేదు. పరదేశాలను కూడా ఆకర్షించింది. సర్వ విషయాల సమాచారం అంతా మహా భారతంలో ఉండడం చేత ఆ గ్రంథానికి అంతటి ప్రాముఖ్యం ఏర్పడింది. అనేక పాశ్చాత్య భాషల్లోకి అనువదించబడి శిఖర స్థానాన్ని పొందింది.

### 1.15. **వ్యాసుని మహాభారత రచనా విధానం:**

కథ ఎలా ఉండాలో తెలియజేస్తూ జి.వి సుబ్రహ్మణ్యం గారు' ఆంధ్ర మహాభారతం అమృత్వ సాధనం ' అనే తన రచనలో ఈ విధంగా తెలియజేసారు.

*'' కథ హృద్యంగా ఉండాలి. అంటే మనసును ఆకట్టుకొనేటట్లు ఉండాలి. అపూర్వంగా ఉండాలి. అంటే అంతకుముందు చెప్పబడనిదై వింటే ఇంత గొప్పకథ*

*ఎప్పుడూ వినలేదని అనిపించేటట్లు ఉండాలని భావం. కథ వింటే జ్ఞానం సమగ్రంగా కలగాలి. జ్ఞానం అంటే ధర్మ అర్థ కామ మోక్షాలనే చతుర్విధ పురుషార్థాలను సాధించి జీవితంలో అమృత్వ సాధనం చేయడానికి అనువైన తెలివిని కలిగించడం. జీవిత లక్ష్యాన్ని సాధింపగలిగే సమగ్ర జీవన ధర్మ పరిజ్ఞానమే ఎఱుక సమగ్రమై ఉండే కథా పరిజ్ఞానం. కథ పాపాన్ని తొలగించాలి. అంటే కథ విన్న తరువాత శ్రోత మనసులో ఒక ఉన్నత పరిణామం రావాలి. జీవితంలో అధర్మ ప్రవృత్తిని తొలగించుకొగలిగే ఒక సంస్కారం ఏర్పడాలి. తనను తాను ఉద్ధరించుకునే ఆత్మధర్మం పుణ్యం. దానికి విరుద్ధమైనది పాపం. పాపాన్ని ప్రక్షాళనం చేసుకునే ప్రజ్ఞను కథ మనకు ప్రసాదించాలి. ఇది కథాతత్త్వం. ఈ లక్షణాలన్నీ ఉన్న కథ మహాభారత మని సూతుడు పేర్కొన్నాడు. ( సుబ్రహ్మణ్యం, జి.వి. ఆంధ్రమహాభారతం అమృత్వ సాధనం. పుట: నా మాట )*

ఈ విషయాలను పరిశీలిస్తే కథ స్వరూప స్వభావాలు ఎలా ఉంటే ప్రజారక్షణ కలిగి విస్తరిల్లుతుందో ఆ లక్షణాలు. మహాభారతంలో ఉన్నాయని తెలుస్తుంది. అందులో మహాభారతం జీవనశైలిని మార్చగల శక్తి కలిగినది. మన జీవితంలో ఏ సంఘటన జరిగినా దానికి ప్రతిబింబంగా మహాభారతంలోని అనేక కథల ద్వారా ప్రస్ఫుటమవుతూనే ఉంటాయి.

వ్యాసమహర్షి ఒక రచన చేసి పేరు పొందాలనుకునే వ్యక్తి కాదు లోకహితం కోసం రచనా యజ్ఞాన్ని ప్రారంభించిన ఒక యోగి , యోగి యొక్క ఆలోచనా విధానం సామ్యంగా ఉండదు నిస్వార్థ పరమైన పరమార్థం వారిలో ఎప్పుడూ స్థిరనివాసం ఏర్పరుచుకునే ఉంటుంది. వేదవ్యాస వారు తన రచన **'వేదవ్యాస మహర్షి దివ్య చరిత్ర'** గ్రంథంలో వారి వ్యాసుని రచనా పద్ధతిని వివరించారు.

*"పరమగురువులలో అగ్రగణ్యుడైన వేదవ్యాస మహర్షి ఏధంగా తన దివ్య దృష్టితో చూసి కురు క్షేత్రంలో అక్కడ జరుగుతున్న మహాభారత సంగ్రామాన్ని తానిక్కడ ఆశ్రమంలోనే కూర్చుని యోగ సమాధిలో దర్శిస్తూ ఆ పనికి అంతరాయం లేకుండానే ఎదురుగా కూర్చుని శరవేగంతో వ్రాస్తున్న  గణపతికి ధారాపాతంగా కవిత్వ పటిమ*

*చెడకుండా శ్లోకాలు పుంఖానుపుంఖాలుగా వర్షిస్తూ అదే సమయంలో ఇంకో ప్రక్క ధృతరాష్ట్రునికి తోడుగా సంజయుడిని కూర్చోబెట్టి దివ్య దృష్టిని ప్రసాదించిన ఆ సంజయునికే జరిగే యావత్తూ యుద్ధమూ ఒక వంక చూపెడుతూనే అతని నోటినుండి వెలువడే మాటలు, శ్లోకాలు, వర్ణనల్లోనే, సంజయుని పాత్రగా జేసి తాను వ్రాసే భగవద్గీత లోనే అతని శరీరాన్ని ఉపయోగించి ఆశువుగా రచన చెయ్యటం జరిగిందన్న రహస్యం ఎంతమందికి అర్థమవుతుంది? ఇది పరమగురువులతో సన్నిహిత సంబంధం ఉండి వారికి సర్వస్వశరణాగతి చేసి తన మనస్సులోని ఆలోచనలు వదిలివేసి తన మనస్సుతో పాటు శరీరాన్ని కూడా ఒక పనిముట్టుగా సమర్పించిన భక్తులకు ఇలాంటి ఆశ్చర్యకరమైన గ్రంథ రచన అర్థం అవుతుంది అని తెలియజేసారు .( వేదవ్యాస, శ్రీ వేదవ్యాస మహర్షి దివ్య చరిత్ర, పుట: 103.)*

ఈ మాటలను పరిశీలిస్తే ఏక కాలంలో అనేక కార్యాలు పూర్తిచేయగల సామర్థ్యం అదికూడా కథకు భంగం కాకుండా చక్కటి వ్యాఖ్యానంతో రచన చేయడం వ్యాసుని వంటి మహాత్ములకే సాధ్యమని తెలుస్తుంది.

*వ్యాసుడు రచయిత కాదు ఋషి ''ఋష్'' అనే ధాతువుకు చూచు అని అర్థం ఋషి అంటే ఉన్నది ఉన్నట్లుగా చూడగలిగిన వాడన్న మాట అలాంటి ఋషి నుండి దిగి వచ్చేదే సరైన కావ్యం సత్కావ్యం అవుతుంది., ఈ సత్యాన్ని చెప్పడానికి లోకహితాన్ని కోరి ఋషి వంటి స్థితిలో నిలిచి కృషి జరపిన వారే వాల్మీకి, వ్యాసుడు. (కృష్ణస్వామి, మోపిదేవి.భారతం ధర్మాద్వైతం వ్యాసుని దర్శనం – తిక్కన సందర్శనం , పుట: 17).*

పై వివరాలు కేవలం కల్పించి వ్రాసినది కాకుండా సమాజంలో జరుగుతున్న జరగబోయే పరిణామాలను ఉన్నది ఉన్నట్లు చిత్రీకరించడం ద్వారా ఆ గ్రంథం సర్వజనావళిని ఉత్తేజపరుస్తూ కార్యాచరణ జరిగేలా చేసి సమాజాభివృద్ధికి పూనుకుంటుంది.

## 1.16. మహాభారతం వైశిష్ట్యం– ప్రముఖుల అభిప్రాయాలు:

మహాభారతం మన నిత్యజీవనాన్ని తెలియజేస్తుందని చెప్తూ బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ ముఖాముఖిలో ఈ విధంగా తెలియజేసారు. భారతంలోని ప్రతి అంశం నిత్య జీవితంలోనివేనని ద్రౌపది, కృష్ణుడు,శకుని లాంటి పాత్రలు ఉంటాయని భారతం ఇతిహాసం కాదు పురాణమని వీరు అభిప్రాయపడ్డారు.(చూడు: అనుబంధం 2, వద్దిపర్తి పద్మాకర్ ,ముఖాముఖి)

ఈ మాటలను పరిశీలిస్తే మహాభారతం ఇతిహాసమైనప్పటికి మరలా మరలా చదివించి ఎప్పటికప్పుడు క్రొత్త విషయాలను అందిస్తుంది కాబట్టి మహాభారతం పురాణం అని భావించారని తెలుస్తుంది.

మహాభారత వైశిష్ట్యాన్ని గురించి బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు గారుతెలియజేస్తూ మహాభారతాన్ని సమాజానికి ఏ విధంగా విస్తరింపజేస్తే సమాజపురోగతి బాగుపడుతుందో తెలియజేసారు.ఒక్కొక్క వ్యక్తి యొక్క త్యాగమయమైన జీవితం తీసుకున్నా మూర్ఖత్వాన్ని పరాకాష్ఠగా స్వీకరించి జీవితాన్ని పాడు చేసుకున్న వారిని చూసినా ఎంత గొప్ప విలాస విద్య చేతిలో ఉండికూడా పొగడ్తలకు లొంగిపోయే శల్యుని లాంటి వారిని చూచినా ఏ కోణంలో ఏ విషయాన్ని చూడండి మహాభారతం జవాబు చెపుతుందని వీరు తెలిపారు.(చూడు:అనుబంధం 2, చాగంటి కోటేశ్వరరావు, ముఖాముఖి).

మనిషి సంస్కరించబడాలంటే మహాభారతంలో చెప్పిన ప్రతి విషయాన్ని అన్ని కోణాలనుండి పరిశీలిస్తే వాటిని ప్రజలు అనుసరిస్తే మానవుడే మాధవుడు అనే మాటకు సార్థకత చేకూరుతుంది అనే విషయం అర్థమవుతుంది. ముఖ్యంగా మహాభారతంలోని పాత్రలు సజ్జనులుగా ఉంటే ఎటువంటి సుఖాన్ని అనుభవిస్తారు దుర్జనులుగా ఉంటే ఎటువంటి వేదనను అనుభవిస్తారు అనే విషయాన్ని సుస్పష్టం గా తెలుస్తుంది. అటువంటి మహాభారతాన్ని ప్రవచనాల ద్వారా ప్రజలు మహాభారత వైశిష్ట్యాన్ని అందుకోవడం ఒక పద్ధతి అయితే మహాభారతం పై చర్చా వేదికలు నిర్మించి చర్చలు జరపడం వలన సత్యప్రమాణాలైన విషయాలు ప్రజానికానికి అందించ వచ్చనే విషయాన్ని తెలియజేసారు. అంతే కాకుండా మహాభారతం పై విస్తృతమైన పరిశోధనలు జరపడం వలన కూడా

మహాభారత వైశిష్ట్యాన్ని సమాజానికి విస్తరింపచేయవచ్చు. అనే అమూల్యమైన విషయాన్ని తెలియజేసారు.

అవధూత గణపతి సచ్చిదానంద స్వామి మహాభారతం ధర్మంతో ముడిపడిఉందని ధర్మాన్ని ఆచరించి సత్ఫలితాలు పొందినప్పుడు మాత్రమే మహాభారతం యొక్క విలువ తెలుస్తుందని వీరు అభిప్రాయ పడ్డారు. (చూడు: అనుబంధం 2, గణపతి సచ్చిదానంద స్వామి , ముఖాముఖి).

బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గారు మహాభారత వైశిష్ట్యాన్ని గురించి ఆ గ్రంథాన్ని ప్రజలకు ఏ విధంగా చేరవేయాలి అనే విషయాన్ని గురించి ఈ విధంగా తెలియజేసారు. *మానవ సంబంధాలు, రాజకీయ అంశాలు , ఆధ్యాత్మిక విశేషాలు, నీతి ధర్మాలు ఇవన్నీ కలిగిన భారతం కంటే సమాజంలో విస్తరించకలిగే గ్రంథం మరొకటి లేదని వీరు తెలిపారు. (చూడు: అనుబంధం 2, సామవేదం షణ్ముఖ వర్మ, ముఖాముఖి).*

సమాజం ఎన్నో పరిణామాలతో ముందుకు వెళ్ళినా ఆ సమాజ స్థితిగతులను మహాభారతం ఏనాడో వివరించి చెప్పింది. అయితే సమాజంలోని ప్రజల అవగాహనకు మహాభారత గ్రంథం లోని విషయాలను క్షుణ్ణంగా పరిశీలించడం ద్వారా అందులోని విషయాలను అధ్యయనాంశాలుగా చేసి భారతాన్ని అర్థం చేసుకోవడం ద్వారా, వివిధ మాధ్యమాలు మహాభారత వైశిష్ట్యాన్ని ప్రసారం చేయడం ద్వారా ప్రజలకు సులభంగా మహాభారతాన్ని తెలుసుకోగలుగుతారనే విషయం వారి మాటల్లో అర్థమవుతుంది.

ప్రాచార్యాశలాక రఘునాథ శర్మ గారు మహాభారత వైశిష్ట్యాన్ని వివరిస్తూ ఈ విధంగా తెలియజేసారు.

*'భారతం అనేది వేదంలాంటిది అన్నారు గనుక వేదములో ప్రధానంగా భగవంతుడు, దైవము, మొదలైన అంశాలు ప్రధానంగా ఉండితీరుతాయని వీరు అభిప్రాయపడ్డారు. (చూడు: అనుబంధం 2., శలాక రఘునాథ శర్మ, ముఖాముఖి).*

మహాభారతం వేదం అని అన్నారు కావున అందులో భగవంతుడే ప్రధానంగా ఉండి శాస్త్రాల గురించి రాజనీతి ధర్మాల గురించి , నీతి బోధకమైన విషయాల గురించి

చెప్పి ప్రజానికాన్ని ఎప్పటికప్పుడు మేల్కొల్పుతున్నాడు అనే భావన వీరి మాటల్లో వ్యక్తమవుతుంది.

శ్రీదేవిసెట్టి చలపతిరావు గారు మహాభారతం గురించి చెప్తూ సమాజానికి మహాభారత వైశిష్ట్యాన్ని విస్తరింపచేయడం కష్టమని అందులో ఉన్న సారాంశాన్ని అందుకునే వారు అందుకునే పద్ధతిలో అందుకుని తమ జీవనాన్ని మార్చుకుంటారని తెలియజేసారు. (చూడు: అనుబంధం –2, దేవిసెట్టి చలపతిరావు ముఖాముఖి).

ఈ విషయాలను పరిశీలిస్తే మహాభారతంలో లేని విషయాలు సమాజంలో ఎక్కడా కనబడవు మహాభారతంలో దాగి ఉన్న విషయాలు సమాజంలో అణువణువు ఏదో ఒక కోణంలో స్పృశిస్తూనే ఉంటాయి అని చెప్తూ ఆ మహాభారతాన్ని అందుకునే వారు తక్కువ మంది ఉన్నారని సినిమాల ప్రభావం చేత సినిమాలో చిత్రీకరించబడిన కథే నిజమనే భ్రమలో ప్రజలు ఉన్నారని వాటి నిజనిజాలు కూడా తెలుసుకోవాలనే జ్ఞానం కూడా వారికి కలగడం లేదని ఇలాంటి స్థితిలో మహాభారత వైశిష్ట్యాన్ని సమాజానికి విస్తరింపచేస్తే ఎంతమంది దానిని అందుకోగలరో ఆలోచించాలని వీరి మాటల్లో వ్యక్తమవుతుంది.

బ్రహ్మశ్రీ చిర్రావూరిశివ రామకృష్ణ శర్మ గారు మహాభారతం ఎందుకు చదవాలో ఎందుకు వినాలో తెలియజేసారు. *చిన్నప్పటినుండే పిల్లల్లో మహాభారతంలోని మంచి పాత్రల్ని చెడు పాత్రల్ని పరిచయం చేసి ఏ పాత్ర ఏమి చెపుతుందో ఆ పాత్రల స్వభావాలు నుండి మనం ఏమి నేర్చుకోవాలో వీరు తెలియజేసారు.కీచకుని వంటి పాత్రలను పరిచయం చేయడం వలన చిన్నప్పటినుండే ఆడవారితో ఎలా ప్రవర్తించాలో నేర్చుకుంటారని వీరి అభిప్రాయం. (చూడు: అనుబంధం 2, బ్రహ్మశ్రీ చిర్రావూరి శివరామకృష్ణ శర్మ, ముఖాముఖి).*

పూర్వం మహాభారతం , రామాయణం, భాగవతాలు ఏ సమయాలలో చదవాలో నిర్ణయించుకుని నిత్య జీవితంలో ఒక భాగంగా వాటిని చేర్చుకుని పారాయణ చేసేవారు అందులోని ధర్మాలు నేడు పాఠ్యాంశాలుగా లేకపోవడం వలన పిల్లల్లో వారు నేర్చుకోవలసిన ధర్మాలు నేర్చుకోలేకపోవడం వలన చెడుసావాసాలతో తన జీవన

మార్గాన్ని సరైనదిగా చిత్రీకరించుకోలేకపోతున్నారు. అని చెప్తూ కీచకుడు, సైంధవుడు వారి చరిత్రలు పిల్లల వయసునుండే తెలుసుకోవడం వలన వారిలో ఎటువంటి తప్పు చేస్తే ఎటువంటి వినాశనానికి గురవుతామో అనే అవగాహన వారిలో ఏర్పడుతుందని తెలియజేసారు. కాబట్టి మహాభారతం వంటివి విస్తృతంగా ప్రచారం జరగాలని వారి అభిప్రాయమని తెలుస్తుంది.

## 1.17. **మహాభారతం – గురు ప్రాముఖ్యం:**

తల్లి ప్రథమ గురువు అని తర్వాత తండ్రి అని అందరూ చెప్తుంటారు. కాని ఇంట్లో వరకే పొందే జ్ఞానం వేరు బయట ప్రపంచంలో జీవించడానికి సరిపడ జ్ఞానాన్ని పొందడం వేరు. ఇల్లు ఇంటి పరిసరాలు , వ్యక్తిత్వ ధోరణులు ఇవన్నీ ఆ వ్యక్తి సమాజంలో ముందడుగు వేయడానికి ఒక బీజం లాంటిది. బీజం ఏర్పడితే సరిపోదు కదా వృక్షంగా మారలంటే పాదు చేయాలి, నీరు పోయాలి. పురుగు పట్టకుండా చూడాలి. వాటి రక్షణ ప్రత్యేకంగా ఎవరో ఒకరు బాధ్యతవహించి చూసుకోగలిగితే వృక్షంగా మారి కావలసిన పూలో, పండ్లో ఇస్తుంది. అలాగే వ్యక్తి తన గృహశాల నుండి పాఠశాలలోకి అడుగు పెట్టినప్పటి నుండి ఎక్కువ సమయం. గురువుతోనే సన్నిహితం ఏర్పడుతుంది. అక్కడ నుండి సమాజ పాఠాలు, పరిసరాల జ్ఞానం ఉద్యోగం చేసేంత వరకు కావలసిన పుస్తక జ్ఞానాన్ని మానవుడు పొందగలుగుతాడు. అంతటితో తాను ఒక బాధ్యతను పూర్తి చేసుకున్నట్లు భావిస్తాడు. తర్వాత ఒక కోరిక తర్వాత మరొక కోరిక నెరవేర్చుకుంటూ కోరికలు నెరవేరకపోతే బాధపడుతూ సంసార జీవితాన్ని అనుభవిస్తూ కాలాన్ని గడుపుతాడు. దీని వలన తాను సాధించింది. కేవలం కోరికలతో కూడిన జీవితం. ఇది బ్రతుకుతున్నంత వరకే ఆ సమాజంలో తాను ఏర్పరుచుకున్న ఉద్యోగం. నెరవేర్చుకున్న కోరికలు ఉంటాయి. తర్వాత ఆలోచిస్తే అంతా శూన్యం. ఆ శూన్యత్వం నుండి జీవిత సాఫల్యం చెందడానికి ఒక ఆధ్యాత్మిక గురువు ప్రతి ఒక్కరికి అవసరం. సంసారంలోని ఒడిదుడుకులను దాటుకుంటూ శాశ్వత ఆనందాన్నికలిగించే వారు ఒక గురువు మాత్రమే.

ఆధ్యాత్మిక ప్రపంచంలో గురు స్థానం కీలకమైనది. నిత్యం నిష్ఠ నియమాలతో నిత్య ఉపాసనలతో తాను సిద్ధిపొందుతూ శిష్యులను తరింపచేస్తూ సమస్త మానవాళికి ఉపదేశామృతాన్ని అందించే నిరహంకార రూపుడు గురువు అటువంటి గురువు త్రిమూర్త స్వరూపుడు. నేటి ప్రపంచంలో మోక్ష సోపానాలను ఎక్కించి పునర్జన్మ లేకుండా చేయగల శక్తి ఒక గురువుకే ఉంది. ఈ చరాచర సృష్టిలో తల్లిది ప్రథమ స్థానం అంటారు కాని తల్లి ఇచ్చిన జన్మను చరితార్థం చేయగల  వారు గురువు మాత్రమే. మానవులంతా ఎందుకు పుదుతున్నారో పుట్టిన తర్వాత ఏమి సాధిస్తున్నారో తాను సాధించిన తాత్కాలిక విజయాలు వారిని ఏ మార్గం వైపు నడిపిస్తున్నాయో ఎవరు గ్రహించలేరు. ఏమి సాధించాము అని తన జీవితాన్ని నెమరు వేసుకునే సమయానికి మరణం ఒడిలోకి చేరుతున్నారు మానవులు. ఎప్పుడో ముసలితనంలో భగవంతుని పై గురి కుదుర్చుకునే ప్రయత్నం చేస్తారు చాలామంది  అప్పటికప్పుడు ఏర్పరుచుకున్న భక్తి స్థిరత్వాన్ని పొందలేదు, మనసు నిలకడగా ఉంచడం కూడా కష్టమే ఆధ్యాత్మిక సాధన చిన్నతనం నుండే ప్రారంభం కావాలి అలా కావాలంటే సద్గురువుల ఆశ్రయం పొందాలి. తల్లిదండ్రులు పిల్లలను ఆ విధంగా ప్రోత్సహించాలి. ఈ సృష్టిలో మానవుడు భయ భ్రాంతుల మధ్య తమ జీవితాన్ని గడుపుతుంటారు ఆ స్థితి నుండి బయటపడేసే మార్గం గురువు కే తెలుసు .అజ్ఞానాంధకారం నుండి జ్ఞాన ప్రకాశాన్ని కలిగించి దివ్యానుభూతిని గురువు అందిస్తాడు.

### 1.17.1. గురువు – పరిచయం:

స్వామి పరమానందనాథ(డా. క్రోవి పార్థసారథి) **"శ్రీ గురుతత్వము** "వీరు గురువు అంటే ఉదాహరణను తెలియజేస్తూ ఈ విధంగా అంటారు. *" ఒక వస్తువును చూసి అది సరి అయినది అని మనం తెలుసుకోలేనప్పుడు ఆ వస్తువు యొక్క నిజస్వరూపాన్ని మనం గుర్తించలేనప్పుడు ఎవరో ఒక వ్యక్తి వచ్చి  ఆ వస్తువు యొక్క యదార్థ స్థితిని గురించి మనకు తెలియజేస్తారు. అప్పుడు వస్తువు యొక్క అసలు రూపం మనకి తెలుస్తుంది. అది పాము కాదు త్రాదు అని చెప్పారు. ఇంకా మనకి భయం పోలేదు దీపపు వెలుగులో  అది త్రాడు అని చూపించారు. కర్రతో కదిపి చూపించారు అది కదల్లేదు. పాము కాదు త్రాడే*

*ఇలా విషయాన్ని మనకి వివరించి చెప్పేవాడే గురువు. (స్వామి పరమానంద నాథ(డా.క్రోవి పార్థసారథి), శ్రీ గురుతత్త్వము, పుట:08.)*

ఈ విషయాలను గమనిస్తే మన జీవితంలో మనం ఎదుర్కొనే పరిస్థితులు కూడా ఇలానే ఉంటాయి మన ఉనికి శాశ్వతం కాదని తెలిసినా ఏదో తెలియని ఆరాటంతో జీవిస్తుంటాం. ధనం కోసం ప్రాకులాడుతాము, సంసారమనే వలలో చిక్కుకుని విలవిలలాడిపోతాము. విషమపరిస్థితి నుండి బయట పడేసే వారే గురువు.

తోటపల్లి బాలకృష్ణ శర్మ జగద్గురువు శ్రీ శ్రీ శ్రీ శంకరాచార్యుల దివ్య భవ్య చరిత్ర '' గ్రంథంలో గురువు గురించి వివరాలను తెలియజేసారు.

**''గురుః పితా గురుర్మాతా గురుర్దేవో న నంశయః**
**కర్మణా మనసా వాచా తస్మాత్ సర్వైప్రసేవ్యతే**
**గురు ప్రసాదతః సర్వం లభ్యతే శుభమాత్మనః**
**తస్మాత్ సేవ్యో గురుర్నిత్య మన్మథా న శుభం భవేత్ (శివ సంహిత)**

గురువు తల్లిదండ్రి దైవం వంటి వాడును, సందేహం లేదు. కావున కర్మనే మనస్సుచే వాక్కుచే పలు విధాల గురుసేవ చేయవలెను. గురు ప్రసాదంతో ఆత్మకు అనుగ్రహం చేకూరును నిత్యం గురుసేవ కర్తవ్యంగా ఒనర్చాలి.. గురువనుగ్రహంతో పలు శుభాలు కలుగును. మోక్షమూలం గురోర్కృప చివరిలో కైవల్య ప్రాప్తియు కలుగును. (బాలకృష్ణ శర్మ, తోటపల్లి. జగద్గురు శ్రీ శ్రీ శ్రీ శంకరాచార్యుల దివ్య భవ్య చరిత్ర.పుట:xvi.)

ఈ విషయాలను పరిశీలిస్తే గురువుకు ప్రత్యక్షంగాను , పరోక్షంగాను గురువును అనుసరించడం వలన మానసిక శాంతి, కలగడంతో పాటు ప్రతి క్షణం మనం ఆలోచించే మార్గం సరైనదా లేదా అనే విషయాలను మనం గ్రహించకలుగుతాం. గురు ధ్యానం సామాన్యమైనది కాదు మనిషిలోని మూల మూలాల్లో దాగి ఉన్న అజ్ఞానపు చీకట్లను కూకటి వేళ్ళతో సహాపెకలింపచేయగల శక్తి ఒక గురువుకే ఉంది. అందుకే ఈ శ్లోకంలో కూడా తల్లి ,తండ్రి, దైవం వంటి వాడని అందులో సందేహం లేదని చెప్పారు.

వేద వ్యాస మహర్షి భవిష్యత్తును దృష్టి లో పెట్టుకుని కలియుగ మానవులంత వైఖరిని వారి అలసత్వాన్ని గ్రహించి చాలా సులభరీతిలో భగవంతుని దర్శింపజేసే అనేక ధర్మసూక్ష్మాలను అందించి అష్టాదశ పురాణాలనే మహత్తర కార్యాన్ని నిర్వహించారు.

శ్రీ మద్ది నాగేశ్వర రావు గురువాణి గ్రంథానికి మున్నుడి వ్రాస్తూ గురువు గురించి ఈ మాటలను పేర్కుంటాడు. *''భారతీయ సంప్రదాయమున గురువు సాక్షాత్తు ఈశ్వరుడే సద్గురు దేవుడని పరబ్రహ్మమే. ఈశ్వర సాక్షాత్కారానికై శ్రమించే ముముక్షువునకు అతనిలో అంతర్యామియై హృదయస్థుడై సాక్షియై ఆత్మ రూపమున ఉన్న ఈశ్వరుడే కాలము పక్వమైనప్పుడు అతని ఎడల కరుణతో సచ్చిదానంద స్వరూపుడై గురు రూపమున అవతరిస్తాడు. మొదట మానవుడు తానుచాలా అల్పుడునని ఈ జగత్తునంతా నియమించి పోషించి, పాలించే సర్వాధికుడు , సర్వజ్ఞుడు , సర్వశక్తుడు అయిన భగవంతుడొకడు ఉన్నాడని గుర్తించి ఆయనను భక్తితో పూజించి సేవిస్తాడు. ఒక స్థితికి చేరుకుని జ్ఞానార్తత పొందిన పిమ్మట అతడు సేవించే భగవంతుడే గురువై వచ్చి అతనిని ముందుకు నడిపించుకుపోతాడు. భగవంతుడు నీలోనే ఉన్నాడు అంతరదృష్టితో ఆయనను సందర్శించమని చెప్పడానికే ఆ గురువు వచ్చేది. భగవంతుడు.గురువు,ఆత్మ ముగ్గురు ఒక్కటే* **( విజయేశ్వరానంద స్వామి, గురువాణి. పుట:మున్నుడి.)**

మనకు ఈ లౌకిక ప్రపంచంలో ప్రతి వస్తువును చూసినా ప్రతి వ్యక్తి ని చూసినా అనుమానంగానే భావిస్తాము అది కలి ప్రభావము . నిత్యం పురాణాలను చెపుతూ, ఆధ్యాత్మిక సాధనలో ఉన్నవారిని శిష్యులకు ఒక మంచి మార్గంవైపు నడిపించే గురువును సామాన్య వ్యక్తులుగా కాకుండా సాక్షాత్తు భగవత్స్వరూపులుగా భావించాలి. ఆ భావన కలగడానికి సాధన అవసరం. అనే విషయం పై మాట ద్వారా వ్యక్తమవుతుంది.

*''గురువంటే దార్శనికుడు. పథ నిర్దేశకుడు. లౌకిక జ్ఞానాన్ని భగవశ్శక్తితో అనుసంధానించ కలిగిన భాగవతోత్తముడు. అలాంటి గురువు లభిస్తే, ఆయనను సేవించగలిగితే అనంత జ్ఞానంతో అమిత శక్తిమంతులు అవుతారన్నది అనుభవజ్ఞుల మాట. గురువంటే కేవలం విద్యాబుద్ధులు నేర్పిన వారే కాదు. ఎన్నో శ్రమలకోర్చి వివిధ రీతులలో జ్ఞానాన్ని ప్రసాదించిన మహాపురుషులు, రుషులు, ధర్మోద్ధరణకు పాటుపడిన, పడుతున్న*

*మహనీయులు, ఉపనయనంలో భాగంగా బ్రహ్మోపదేశం చేసిన తండ్రి, ఉగ్గుపాలతో విజ్ఞాన ఊపిరిలూదిన తల్లి, కులపెద్ద, పితామహుడు, మాతామహుడు, పినతండ్రి, అన్న, మేనమామ, మామ, రాజు... వీరంతా గురువులేనని శాస్త్రం చెపుతోంది.* *https://vsktelangana.org/divine-gifts-to-the-givers-of-knowledge*

మనం నిద్ర లేచినదగ్గర నుండి మనకు ఎవరి దగ్గర దేని నుండి ఏమి నేర్చుకుంటున్నాము నేర్చుకున్న జ్ఞానం మనకు ఎంతవరకు ఉపయోగపబడుతుంది. మనం వేసే ప్రతి అడుగు ప్రతి చర్య మనల్ని ఏ స్థితికి తీసుకుని వెళుతుంది. ఇలా మానవునిలో అనేక అనుమానాలు, సందేహాలు వీటిని నివృత్తి పరచేవారు ఎవరైనా వారికి గురువే సూక్ష్మంగా పరిశీలిస్తే ప్రకృతే గురువుగా చేసుకుని ఎన్నో విషయాలను గ్రహించవచ్చు. వాటిని మన నిత్య జీవితంలో అన్వయించుకుని తరించవచ్చు. ఇది పరోక్షంగా ప్రకృతిని గురువుగా చేసుకుని తనకు తాను వృద్ధి చెందడం. కాని నేటి మానవుడు తాను అర్థం చేసుకునే విధానంలో అనేక మార్పులు రావచ్చు. కాబట్టి ప్రత్యక్షంగా ఒక జ్ఞాన బోధను చేసే గురువును ఆశ్రయించి జీవన తీరు తెన్నులను మార్చుకోవడం శ్రేయస్కరం.

### 1.18. సద్గురు స్థానం లో వ్యాసుడు:

అసలు గురువు అనే పదాన్ని ఉపయోగించే ముందు మనం తెలుసుకోదగిన వారు వ్యాసులు వారే సమస్త జ్ఞాన భాండాగారానికి గురువులు అటువంటి వ్యాస మహర్షి గురించి తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. వేదవ్యాస వారు *"శ్రీ వేద వ్యాస మహర్షి దివ్య చరిత్ర" లో పరమగురువుల యొక్క లక్షణాలను తెలుపుతూ వ్యాస మహర్షిహృదయాన్ని ఆవిష్కరించారు. " పురాణాలను వ్రాసి మునులను వక్తలుగా పెట్టి వారిద్వారా ఒక్కసారి తానేరచయితగా ఉండి వ్యాసమహర్షి ఎలాగ వ్రాశారో, శుకయోగి ద్వారా భాగవతం అలానే సూతుని ద్వారా భారతం శతానీకుని ద్వారా భవిష్యపురాణం, వైశంపాయనుని ద్వారా సకల పురాణ కావ్య సంపదా ఇటు తన ఆశ్రమం లోంచి తాను కదలకుండానే వ్యాస మహర్షి మానవజాతికి ఎలాగ పురాణాలలోని పాత్రలయిన కుంతికి ధర్మజునికి తదితరులకూ మళ్లీ తాను తలచినప్పుడు ఆ తల్లికి దర్శనమిస్తూ తాను వ్రాసే పురాణంలో తానే పాత్రగా గ్రంథకర్తగా వక్తగా ఎలా నిర్వహించాడో ఇదే పరమ గురువు యొక్క లక్షణం వ్యాసులు వారు ప్రదర్శించిన దివ్య లీల ఇది జరిగిన విధానం ఇప్పుడీ జ్ఞానంతో మళ్ళీ ఆ*

*పురాణాలు చదివితే మనకు ప్రతి అంశం మెరుపులా తెలుస్తుంది. ఈ రహస్యం తెలిస్తే కాని తెలియదు. భారతంలో ఒకే శ్లోకంతో అన్ని పర్వాలు ఎందుకారంభం అవుతాయని అందుకే వ్యాసుడు ప్రతి అధ్యాయంలోనూ మొదటి ప్రార్థన 'పరమగురుమండలికి గురువైన నారాయణ రుషికి ఆ శ్లోకంతోనే చెయ్యటంలోని రహస్య ప్రయోజనం.*

*(వేదవ్యాస, శ్రీ వేద వ్యాస మహర్షి దివ్య చరిత్ర పుట:106.)*

ఈ విషయాలన్నీ వ్యాస మహర్షి జ్ఞానాన్ని ప్రపంచమంతటికి ఒకేసారి ఎలా ప్రసరింపచేస్తాడో తెలియజేస్తుంది. వ్యాసుని జ్ఞానం మునులందరిలో ప్రవేశించి వారి ద్వారా సమస్త శాస్త్రాలను, ధర్మాలను ప్రబోధింపచేసాడు. అంతటి శక్తి మంతుడు వ్యాసమహర్షి సూర్యుడు ఒక్కసారిగా తన కిరణాలతో ప్రపంచమంతటిని ప్రకాశింపచేసినట్లుగా వ్యాసమహర్షి తన జ్ఞాన కిరణాలతో మునలందరి మనసులను ఏకం చేసి సమస్త ప్రపంచానికి కావలసిన జ్ఞానవిద్యను అందింపచేసాడనే విషయం పై మాటల ద్వారా వ్యక్తమవుతుంది.

## 1.19. మహాభారతం – గురు శిష్యుల కథలు:

గురుశిష్యుల సంబంధాలు కు సంబంధించిన కథలు మహాభారతంలో చాలా ఉన్నాయి వాటిలో కొన్ని కథలు మాత్రమే ఈ అధ్యాయంలో పేర్కుంటున్నాను.

మహాభారతంలో ప్రారంభంలోనే గురువు మాటను ఎలా పాటించాలో తెలియజెప్పే కథను తెలియజేస్తాడు వ్యాస భగవానుడు . గురువు ఆజ్ఞను మనసా వాచా కర్మణా పాటిస్తే కలిగే ప్రయోజనం ఎటువంటిదో ఈ కథ చెపుతుంది.

### 1.19.1.అయోద ధౌమ్యుడు – శిష్యులు(ఉపమన్యువు, ఆరుణి, వేదుడు ) :

గురువు అయోద ధౌమ్యుడు అతని శిష్యులను పరిక్షిస్తాడు.

#### 1.19.1.1. ఆరుణి:

అయోద ధౌమ్యుడు తన శిష్యుడు ఆరుణిని పిలిచి పొలానికి కంత కట్టమని పంపుతాడు. తన గురువు ఆజ్ఞతో పాంచాలుడైన ఆరుణి అక్కడకి వెళ్లి పొలానికి కంత కట్టడం రాక గురువు ఆజ్ఞను ఎలాగైనా నెరవేర్చాలని పొలంలో కంతకు అడ్డంగా పడుకుంటాడు. నీరు నిలచిపోతుంది.గురువైన అయోదధౌమ్యుడు ఆరుణి ఇంకా తిరగి

రాలేదని అతని కోసం శిష్యులతో కలసి ఆరుణి శిష్యుడు ఉన్న చోటకు వెళ్తాడు. గురువు గారు పిలవగానే ఆరుణి వచ్చి పొలం నుండి ప్రవహించిపోతూ అడ్డుకట్ట వేయడానికి వీలులేని ఆ నీటి ప్రవాహాన్ని ఆపడానికి అడ్డంగా పడుకున్నానని మీరు పిలవగానే ఆ మట్టినంతా తొలగించుకుని ఇటు మీ వద్దకు వచ్చానని చెప్తాడు. దానికి గురువు సంతోషించి నీవు మట్టిని పెకలించుకుని పైకి లేచావు కాబట్టి ఉద్దాలకుడనే పేరుతో ప్రసిద్ధికెక్కుతావని చెప్తాడు.అంతే కాకుండా గురువు  మాటను గౌరవించి శ్రద్ధతో చెప్పిన పని చేసాడు కావున సమస్త వేదాలు సర్వధర్మ శాస్త్రాలు స్వయంగా నీకు స్ఫురిస్తాయని ఆశీర్వదిస్తాడు. గురువు ఆశీర్వాదం తీసుకుని ఉద్దాలకుడు తన నచ్చిన చోటుకు వెళ్తాడు.

### 1.19.1.2. ఉపమన్యువు:

అయోదధౌమ్యుడు ఉపమన్యువును పరిక్షించే సమయంలో గోవులను కాస్తూఉండమని చెప్తాడు. అయితే ఉపమన్యువును నీవు బలంగా ఉన్నావు దేనితో జీవిస్తున్నావనగా భిక్షాటనతో జీవిస్తున్నానని చెప్తాడు గురువుకు ఇవ్వకుండా భిక్షాటనం చేయకూడదని చెప్పగానే ఉపమన్యువు సరే అని చెప్పి రెండు సార్లు భిక్షాటనకు వెళతాడు ఇది ధర్మం కాదు భిక్షావృత్తి మీద జీవించే వారికి ఆటంకం కలిగించిన వాడవవుతావు అనగానే , దానిని మానుకుంటాడు. అయినప్పటికి ఉపమన్యువు బలంగా ఉండడం చూసి ఇప్పుడు ఎలా జీవనం సాగిస్తున్నావు అనగా పాలు త్రాగి జీవనం సాగిస్తున్నానని చెప్తాడు. దానికి గురువు అనుమతి లేదు పాలు త్రాగడానికి వీలు లేదని చెప్తాడు. దానికి ఉపమన్యువు అంగీకరిస్తాడు. కొద్ది రోజుల తర్వాత కూడా ఉపమన్యువు దృఢంగా ఉండడం గమనించి ఇప్పుడు ఏ విధంగా జీవితం గడుపుతున్నావనగా దూడ తన తల్లుల దగ్గర పాలు త్రాగేటప్పుడు పైకి ఎగజిమ్మే పాల నురుగును స్వీకరిస్తున్నానని చెప్తాడు. అలా చేయడం వలన దూడల ఆహారానికి అడ్డుపడిన వాడవవుతావు అనగానే ఆ ఆహారాన్ని స్వీకరించడం మానేస్తాడు. ఒకసారి ఆకలి బాధ తట్టుకోలేక జిల్లేడు ఆకులను తినడంతో అతని కళ్ళు కనిపించవకుండా పోతాయి. గురువు గారు సాయంత్రమైనా శిష్యుడు రాలేదని వెతుకుతాడు అతను ఒక బావిలో పడిపోయానని చెప్తాడు. అయోద ధౌమ్యుడు దేవ వైద్యులు అశ్విని దేవతలను ప్రార్థించమని చెప్తాడు. ఉపమన్యువు ప్రార్థిస్తాడు అశ్విని దేవతలు

ఉపమన్యువుకు తిరిగి చూపును ప్రసాదిస్తారు అంతే కాకుండా ఒక అప్పాన్ని ఇస్తాడు. ఉపమన్యువు తన గురువు కు నివేదించకుండా తిననని చెప్తాడు. దానికి వారు సంతోషిస్తారు. తర్వాత ఉపమన్యువుకి కళ్ళు వచ్చిన తర్వాత గురువు గారి దగ్గరకు వెళ్ళి నమస్కరిస్తాడు. గురువు ఆశీర్వదించి నీకు సర్వవేదాలు సమస్త ధర్మ శాస్త్రాలు స్వయంగా స్ఫురిస్తాయని చెప్తాడు. ఇది ఉపమన్యుని పరీక్ష.

దీని వలన గురు శిష్యుల సంబంధాలు ఆనాటి కాలంలో ఎలా ఉండేవో గురు శిష్యుల ప్రాధాన్యం ఎటువంటిదో తెలుస్తుంది.

### 1.19.1.3.వేదుడు:

ఇంకొక శిష్యుడు అయోదధౌమ్యునికి వేదుడనేవాడున్నాడు. అతనిని గురువు వత్సా వేదుడా నీవు కొంతకాలం నా ఇంట్లో ఉండు సేవ చేస్తూ ఉండు నీకు మేలు కలుగుతుందని ఆదేశిస్తాడు. వేదుడు గురు శుశ్రూష చేసుకుంటూ ఎద్దువలె అనేక బరువులు మోస్తూ ఆకలి దప్పికలకు ఓర్చుకుంటూ గురువుకు అనుకూలుడై గడుపుతున్నాడు. ఇలా చాలా కాలం గడిచాకా గురువు సంతోషపడి వేదునకు శ్రేయస్సు, సర్వజ్ఞత్వం కలుగుతాయని ఆశీర్వదిస్తాడు. ఇది వేదునికి పరీక్ష.

ఇతడు గురువు అనుమతితో సమావర్తన సంస్కారం పొంది స్నాతకుడై గురుకులం నుండి గృహస్థాశ్రమం ప్రవేశిస్తాడు. అతనికి తన ఇంటిలో ముగ్గురు శిష్యులు ఉన్నప్పటికి వారికి గురు శుశ్రూష చేయమని కాని, ఏ పనిగాని చెప్పేవాడు కాదు. ఇలా ఉండగా కొంత కాలానికి జనమేజయుడు పౌష్యుడు అనే రాజులిద్దరు వచ్చి బ్రహ్మ వేత్త అయిన వేదుని తన పురోహితునిగా వరించారు. ( సంస్కృత భారతం, ఆదిపర్వం, మూడవ అధ్యాయం).

ఈ కథను గమనిస్తే ఒక శిష్యుడు పరిపూర్ణ జ్ఞానాన్ని పొందాలంటే గురువు అనేక పరిక్షల ద్వారా శిష్యులను పరిశీలించి వారి యొక్క స్వభావాన్ని మెరుగుపరచి సంపూర్ణ జ్ఞానాన్ని అందిస్తాడని అర్థమవుతుంది. జీవితంలో ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఎదుర్కోగల సామర్థ్యం శిష్యులకు అలవడుతుంది.

### 1.19.1.4. వేదుడు – ఉత్తంకుడు (ఉదంకుడు):

వేదుడు గృహస్థాశ్రమం స్వీకరించిన తర్వాత అతనికి ముగ్గురు శిష్యులు ఉన్నప్పటికి వారికి ఏ పనులు చెప్పేవాడు కాదు. తాను అంతకు ముందు గురు కులంలో ఎదుర్కొనిన కష్టాలు శిష్యులకు కలిగించాలని అనుకోలేదు.

జనమేజయుడు పౌష్యుడు అనే రాజులు వేదున్ని పురోహితునిగా స్వీకరించారు. ఒకసారి వేదుడు యజమాని కార్యం కోసం వెళుతూ ఉత్తంకుడనే శిష్యునికి అగ్ని కార్యం బాధ్యతను ఇంటిలో లోటు లేకుండా చూపమని ఆజ్ఞాపించి వేదుడు వేరే ప్రాంతానికి వెళతాడు.

ఉత్తంకుడు గురు శుశ్రూష చేస్తూ గురుకులంలో ఉంటాడు.
అక్కడ ఆ ఇంటిలోని స్త్రీలందరూ గురుపత్ని రుతుమతి అయ్యింది రుతుకాలం వ్యర్థం కాకుండా ఉండేలా చేయమని అనగానే ఉత్తంకుడు ఆడవారి మాటలను విని నేను చెడుకార్యాన్ని చేయలేను. అకార్యం చేయమని గురువు నాకు చెప్పలేదని సమాధానం ఇస్తాడు. ఇక్కడ ఉత్తంకుని యొక్క నిజాయితీ గురువు మాటను సత్యంగా , ధర్మంగా ఆచరించి చూడడం కనబడుతుంది. కామానికి లోనై గురుపత్నిని కోరుకోలేదు అధర్మాన్ని నిర్మొహమాటంగా తెలియజెప్పి గురుభక్తి చాటుకున్నాడు. అందుకే ఉదంకుడు ఉన్నత స్థానాన్ని గౌరవాన్ని కీర్తిని అందుకోగలిగాడు.

గురువు పరదేశం నుండి రాగానే శిష్యుని వృత్తాంతాన్ని విని సంతోషించాడు. ఉత్తంకునితో నీవు నన్ను ధర్మబద్ధంగా సేవించావు. నీపై ప్రేమ పెరిగింది. నీకు ఇంటికి వెళ్ళడానికి అనుమతిని ఇస్తున్నాను. నీ కోరికలన్నీ తీరుతాయి. వెళ్ళు అనగానే శిష్యుడు గురుదక్షిణ ఇవ్వకుండా గురువుకు ఇష్టమైన కార్యం చేయకుండా వెళితే అది అధర్మమవుతుంది. గురుద్రోహం అవుతుంది కాబట్టి మీకు ఏది గురుదక్షిణ కావాలో చెప్పమని పదేపదే అడుగుతాడు. అలా అడగడంతో ఇంట్లో ఉన్న మీ గురుపత్నికి ఏమి కావాలో అడిగి అది నెరవేర్చమంటాడు,

ఇక్కడ ఉత్తంకుడు పదేపదే గురుదక్షిణ అడగడంతో గురువు గురుపత్నికి ఏమి కావాలో అది తెచ్చి ఇవ్వమని చెప్తాడు. అతడు ఇలా అనగానే ఉత్తంకుడు గురుపత్ని వద్దకు

వచ్చి పూజ్యురాలా గురువు గారు నన్ను ఇంటికి వెళ్ళమని అనుమతించారు. మీకు ఇష్టమైన దానిని గురుదక్షిణ గా సమర్పించి ఋణవిముక్తుడనై ఇంటికి వెళ్లాలనుకుంటున్నాను కాబట్టి గురుదక్షిణ గా మీకు ఏ కానుకను తేవాలో తెలియజేయమని  అడుగుతాడు. ఉత్తంకుడు ఇలా అడిగిన వెంటనే గురుపత్ని పౌష్యమహారాజు వద్దకు వెళ్ళి అతని భార్య ధరించే కుండలాలను అడుగు ఈ రోజుకి నాలుగోరోజున పుణ్యక వ్రతం జరుగుతుంది. వాటిని ధరించి అలంకరించుకొని బ్రాహ్మణులకు భోజనం వడ్డించాలనుకుంటున్నాను. కాబట్టి వాటిని సంపాదించు అలాచేస్తే నీకు మేలు జరుగుతుంది. అనగానే ఉత్తంకుడు బయలుదేరుతాడు.

ఇక్కడ నుండి ఉత్తంకుడు గురుపత్ని కార్యాన్ని నెరవేర్చడానికి ఎన్నో కష్టాలు పడుతాడు. కుండలాలు దొరికినప్పటికి తక్షకుడు నుండి వాటిని రక్షించుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటాడు. పౌష్య మహారాజు అన్నం వడ్డించగా అందులో వెంట్రుక ఉండడంతో ఉత్తంకుడు పౌష్యమహారాజుని అంధుడువు కమ్మని శపిస్తాడు. పౌష్య మహారాజు కూడా తిరిగి సంతాన విహీనుడవుతావని శపిస్తాడు.

ఇలా ప్రతి శాపమిచ్చుకున్న తర్వాత పౌష్యుడు తన తప్పిదాన్ని తెలుసుకుని శాపాన్ని ఉపసంహరించుకుంటాడు. ఉత్తంకుడు కూడా శాపాన్ని ఉపసంహరించుకోమని చెప్తే పౌష్యుడు శాపాన్ని ఉపసంహరించుకోవడానికి నేను అశక్తుడను. దానికి కారణం చెపుతూ బ్రాహ్మణుని మనసు వెన్న వాక్కు మాత్రం కఠినంగా ఉంటుంది, ఈ రెండు క్షత్రియుని యందు వ్యతిరేకం అని చెప్తాడు.

. పౌష్యుని శాపాన్ని ఉత్తంకుడు ఉపసంహరిస్తాడు. కాని ఉత్తంకుడికి పౌష్యుడు ఇచ్చిన శాపం తనకు తగలదని చెప్తాడు దానికి కారణం అన్నం అశుచిగా ఉందని చూచిన నీవు నన్ను బ్రతిమాలావు కాని అంతకు ముందే నీవు అన్నావు.

*ప్రత్యను నీతః ప్రాక్ చ తే2భిహితమ్*

*యస్మాదదుష్టమన్నం దూషయసి తస్మాదనపత్యో*

*భవిష్యనీతి దుష్టే చాన్నే నైష మమశాపో భవిష్యతీతి." ( సంస్కృత భారతం ఆదిపర్వం, మూడవ అధ్యాయం)*

దుష్టం కాని అన్నాన్ని దూషించావు కాబట్టి అనపత్యుడవు అవుతావు. అని అన్నం దుష్టమే కాబట్టి ఈ శాపం నాకు తగలదు అని ఉత్తంకుడు ఆ రెండు కుండలాలను తీసుకుని బయలుదేరుతాడు. ఇక్కడ పౌష్య మహారాజుకు తిరిగి శాపాన్ని వెనుకకు తీసుకునే శక్తి లేదు కాబట్టి పైగా ఉత్తంకుని వంటి గురు భక్తుడు శాపాన్ని పొందే అర్హత లేనివాడు. కావున ఉత్తంకుడు తన శాపాన్ని తానే ఉపసంహరించుకునే తత్త్వాన్ని ఆలోచించాడు. అనే విషయం అర్థమవుతుంది.

తర్వాత తక్షకుడు ఆ కుండలాలను దొంగిలిచడం తక్షకుడు ఒక చిన్ని రంధ్రంలో దూరడం ఉదంకుడు ఆ రంధ్రంలోకి దూరి తక్షకుడిని వెంబడించడానికి ఇంద్రుడు సహాయం చేయడం . నాగలోకానికి ప్రవేశించిన ఉదంకుడు  కొన్నిసంఘటనలను చూస్తాడు. చివరకు కుండలాలను సంపాదించుకుని గురుకులానికి చేరి సమయానికి గురుపత్నికి కుండలాలను సమర్పించి శుభాశీస్సులు పొందాడు. తాను చూసిన విచిత్రసంఘటనల గురించి గురువు గారిని అడిగాడు. ఉత్తంకుడు చూసిన ఆ ఇద్దరు స్త్రీలు ధాత, విధాత అని ఆ స్త్రీలు మగ్గం మీద పడుగుతో బట్ట నేస్తున్నారు. అందులో నలుపు, తెలుపు, పోగులు, రాత్రిబవళ్లు అని ఆరుగురు కుమారులు త్రిప్పుతున్న ద్వాదశ చక్రంలో ఆరుగురు కుమారులు ఆరురుతువులు అని పన్నెండు ఆకులు పన్నెండు మాసాలు, అని చక్రం సంవత్సరమని ,అక్కడున్న పురుషుడు పర్జన్యుడు, ఆ అశ్వం అగ్ని నీవు దారిలో వెళుతూ చూచినది గజరాజు ఐరావతం ఇక దానిని ఎక్కిన పురుషుడు ఇంద్రుడు . నీవు తిన్న ఆ ఎద్దు పేడ అమృతం దాని వలననే ఆ నాగ లోకంలో నీవు మరణించలేదని ఇంద్రుడు తన స్నేహితుడు నీమీద దయతో ఇలా అనుగ్రహించాడు. ఆ కారణంగానే నీవు కుండలాలను తీసుకుని తిరిగి వచ్చావని గురువు  చెప్పి శిష్యుడిని ఆశీర్వదించాడు.( సంస్కృత భారతం ఆదిపర్వం, మూడవ అధ్యాయం)

ఇక్కడ కథ ఏదైనా ఉదంకుడికి గురుసేవ చేయాలనే పట్టుదల అతని కార్య దీక్షతల నిమగ్నమయ్యేట్లు చేసింది. తక్షకుడు దొంగిలించిన కుండలాలను తీసుకురావడం అంత తేలిక కాదు గురు భక్తి ఉంది కావున గురువుకు సన్నిహితులైన ఇంద్రుడు మారు రూపంలో అమృతాన్ని సేవింప చేసి అతనికి విజయాన్ని అందేట్లు సహకరించాడు. అంతే కాదు.

మనకు సంవత్సరమనేది ఎలా గడుస్తుంది. అనే దానికి నాగలోకంలోని దృశ్యాలే సాక్ష్యం. ధాత విధాత, లు ఎంతో వేగంతో కాలాన్ని నడిపిస్తున్నారో అర్థమవుతుంది. ఇటువంటి కొత్త విషయాలను గురువు గారి ద్వారా తెలుసుకుని జ్ఞానాన్ని పొంది గురువు వద్ద సెలవు తీసుకుని తక్షకుడు చేసిన అపరాధానికి ప్రతీకారం తీర్చుకోవడానికి జనమేజయ మహారాజును ఆశ్రయిస్తాడు.

కథ ఎలా సాగినా గురు భక్తి ఉన్నవాడు ఎన్నో శక్తులను పొంది అభివృద్ధిలోకి వస్తారు. అనే విషయం వేదుడు, ఉత్తంకుని గురుశిష్యుల ద్వారా తెలుస్తుంది.

### 1.19.1.5.శుక్రాచార్యుడు –కచుడు:

శుక్రాచార్యుడు కచుడు గురు శిష్యుల సంబంధాలను మహాభారతంలో పరిశీలిస్తే ఒక విద్యను పొందడానికి శిష్యుడు తన ప్రాణాన్నైనా లెక్కచేయలేదు. అనే విషయం తెలుస్తుంది. కచుడు దేవతల ప్రీతి కొరకు మృతసంజీవని విద్యను నేర్చుకోవడానికి వచ్చాడు. ఇలాంటి శక్తివంతమైన విద్యలు నేర్చుకునే క్రమంలో ఎన్నో ఆటంకాలు ఎదురవుతాయి. కచుని విషయంలోనూ అదే జరిగింది. కచుడు విద్య కోసం శుక్రాచార్యుని వద్ద చేరినప్పటికి గురువును మాత్రం నిర్లక్ష్యం చేయకుండా ఎంతో భక్తితో మెలగాడు. గురుసేవ చేసుకున్నాడు. అందుకే మృత సంజీవని విద్యను పొందాడు. దేవయానిని తిరస్కరించేందుకు కచుడు దేవయాని శాపానికి గురైనప్పటికి ఈ విద్య నాకు ఉపయోగపడకపోయినా ఈ విద్య నేర్చుకున్నవారందరికి ఫలిస్తుందని చెప్పడంతోనే కచుడు యొక్క స్వభావం వ్యక్తమవుతుంది. ఇక్కడ మనం గమనిస్తే శుక్రాచార్యునికి బృహస్పతి మధ్య ఎన్ని విభేదాలు ఉన్నప్పటికి వారి పుత్రుల మీద ఎటువంటి వైర భావం లేకుండా వారి ఉదార స్వభావాన్ని చాటుకున్నట్లు తెలుస్తుంది. శుక్రాచార్యుడు యొక్క ఔన్నత్యం ఇక్కడ తేట తెల్లమవుతుంది.

## 1.20. గురువు శిష్యులపై సమభావాన్ని ప్రదర్శించడం:

*సమర్థుడైన గురువు సర్వ విద్యార్థుల పట్ల సమభావన కలిగియుంటాడు. అనగా ప్రత్యేకాభిమానం చూపించడు. అందరికి ఒకే రకంగా బోధిస్తాడు. కాని ఆ బోధన ఆయా*

*విద్యార్థుల మనో భావనను బట్టి గురు బోధనను  ఉపయోగించుకుంటారు. ( బాలకృష్ణ శర్మ, తోటపల్లి, (సంకలన కర్త), గురువిజ్ఞాన సర్వస్వం, పుట:340.)*

ఈ విషయాలను గమనిస్తే గురువు బోధన ఏ ఒక్క వ్యక్తికి మాత్రమే పరిమితం కాకుండా అందరి శిష్యులకు విద్యను అందించి అందలి విలువలను నేర్పిస్తాడు. విద్యార్థుల మనసులో గురువు చెప్పే విషయాన్ని స్థిరంగా నాటుకున్నప్పుడు మాత్రమే ఆ విద్యయొక్క ఫలితాన్ని శిష్యులు పొందగలుగుతారు. మహా భారతంలో తోటపల్లి బాలకృష్ణ శర్మ ఇచ్చిన ఉదాహరణను గమనిస్తే

యుద్ధసన్నాహాలు జరుగుతున్న సమయంలో దుర్యోధనుడు,అర్జునుడు శ్రీకృష్ణుని సహాయం కొఱకు  బయలుదేరుతారు. అక్కడ పరమాత్మ వారి వారి వినయ విధేయతలు గమనించినప్పటికి వారిని పరిక్షించుటకు యుద్ధ రంగమున ఇద్దరికి సహకరించడానికి తాను తన పదివేల సైన్యము అస్త్రములతో యుద్ధం చేయుట  తాను మాత్రం ఆయుధం పట్టకుండా  ఒక వైపు ఉంటానని మీరు ఎటువంటి సహాయం కావాలో కోరుకోమనగా దుర్యోధనుడు పదివేల సైన్యాన్ని కోరుకుంటాడు. అర్జునడు శ్రీకృష్ణ పరమాత్మను కోరుకుంటాడు. ఇక్కడ అర్జునునికి తెలుసు శ్రీకృష్ణుడు అసామాన్యుడు కాదని పరమాత్ముడని. దుర్యోధనుడు అర్జునుడు శ్రీకృష్ణుని ఎన్నుకోవడం అంటే తన మనసులో కోరిక నెరవేరినట్లే అని యుద్ధమున విజయం తనదే అని భావించి వెళ్ళిపోతాడు. దుర్యోధనుని మనసు భగవంతున్ని గుర్తించలేకపోయింది. కాబట్టే తగిన ఫలితం యుద్ధరూపంలో కనబడింది.

కాబట్టి గురువు అందరిని సమభావనతోనే చూస్తాడు కాని వారు అర్థం చేసుకునేదానిని బట్టి వ్యక్తిత్వ వికాసం జరుగుతుంది.

ఇంకా గురుప్రాముఖ్యాన్ని తెలిపే ఘట్టాలు మహాభారతంలో చాలా ఉన్నాయి.

*“గురు ముఖంగా విద్యలు నేర్చుకుంటేనే ఆ విద్య పరిపూర్ణంగా సఫలీకృతమవుతుంది. అంతే కాకుండా నేర్చుకున్న వ్యక్తికి కూడా ఆ విద్యలోని మెలకువలు తెలుస్తాయి అలాకాకుండా స్వీయ విద్యను అనుసరిస్తే ఎటువంటి పరిణామాలను ఎదుర్కోవాలో యువక్రతుడు అనే కథను సంక్షిప్తంగా పరిశీలించాలి. ఎలాంటి గురువు లేకుండానే*

*జపతపాలు చేస్తూ అనేక విద్యలు నేర్చుకున్నాడు గురుకులంలో ఉన్న రైభ్యుడు వేదాది విద్యల్ని బాగా నేర్చుకున్నాడు యువక్రతుడు అప్పుడప్పుడు కలుస్తున్నాడు, మాట్లాడుతున్నాడు , రైభ్యుడు గురుకులంలో సాధన చేసుకుంటున్నాడు, కొంత కాలానికి యువక్రతుణ్ణి రైభ్యుడు మించిపోయాడు. చాలా ఎదిగిపోయాడు నన్ను సందేహాలడిగి తెలుసుకుంటున్న వాడు నాకన్నా చిన్నవాడు నన్నెలా మించిపోయాడు? నేను నేర్చిన విద్యలు అతని విద్యలాగా ఎందుకు రాణించడం లేదు? అని యువక్రతుడు దేవతల్ని ప్రశ్నించాడు. గురువుల ద్వారా కాక సొంతంగా మంత్రతంత్ర శక్తుల ఆర్జనతో నేర్చిన విద్యలు ప్రయోగ దశలో మద మాత్సర్యాలను కలిగిస్తాయి అవి రాణించవు. ( సామవేదం షణ్ముఖ శర్మ, ఇది యదార్థ మహాభారతం, పుట:97.)*

ఈ విషయాలను పరిశీలిస్తే గురువు సమక్షంలోనే విద్య రాణిస్తుంది, గురువు సమక్షంలో నేర్చిన విద్య అతనికి ఒక గొప్ప అర్హతను కలిగించి ఉన్నత స్థానంలో ఉండేలా చేస్తుంది. అలా కాకుండా సొంత తెలివితో విద్యను అభ్యసించాలని ప్రయత్నిస్తే అది ఎప్పటికైనా ప్రమాదమే అని తెలుస్తుంది.

ఇవే కాకుండా గురు శిష్యులకు సంబంధించిన కథలు మహాభారతంలో కోకొల్లలుగా ఉన్నాయి. ఉదాహరణకు ద్రోణుడు కురు వంశీయులందరికి గురువు అయినప్పటికి అర్జునుని ఉత్తమ శిష్యునిగా కీర్తించాడు. శ్రీకృష్ణుడు జగద్గురువుగా మహాభారతాన్నంతటికి ఆధారమై, అవసరమైన చోట సత్య ధర్మాలను తెలియజేస్తూ సమస్త మానవాళికి ఆచరణయోగ్యమైన భగవద్గీతను అందించాడు. అతని కంటే మరో గురువు ఎవరు లేరు.

### 1.21. మహాభారతం ఫలశ్రుతి:

మహాభారతం వినడం ద్వారా లేదా పఠించడం ద్వారా కలిగే ఫలితాన్ని నన్నయ ఆది పర్వం ప్రథమాశ్వాసం లో ఈ విధంగా తెలియజేసారు.

*'' సీ. ఇమ్మహాభారతం బిమ్ములఁ బాయక / విహితావధాను లై వినుచునుండు*
*వారికి విపుల ధర్మారంభసంసిద్ధి /యగుఁ బరమార్థంబ యక్రమమున*
*వేదముల్ నాలుగు నాది పురాణముల్ /పదునెనిమిదియుఁ దత్ప్రమిత ధర్మ*

*శాస్త్రంబులును మోక్షశాస్త్ర తత్త్వంబులు / నెఱిఁగిన ఫలమగు, నెల్ల ప్రొద్దు*

*ఆ. దానములను బహువిధక్రతుహుతజప /బ్రహ్మచర్యములను బడయఁబడిన*

*పుణ్య ఫలముఁ బడయఁబోలు, నశేషపా/పక్షయంబు నగు, శుభంబు బెరుఁగు.*

*(ఆంధ్రమహాభారతం, ఆదిపర్వం, ప్రథమాశ్వాసం, 51 వ పద్యం)*

*ఈ మహాభారతాన్ని స్పష్టంగా ఏకాగ్రతతో వింటూ ఉన్న ప్రజలందరికి అధిక మైన ధర్మ లాభం కలుగుతుంది. దాని ఫలితంగా శ్రమలేకుండా నాలుగు వేదాలు పదునెనిమిది పురాణములు వాటి చేత నిరూపింపబడిన ధర్మాన్ని బోధించే శాస్త్రాలనూ, మోక్షమార్గాన్ని తెలిపే శాస్త్రాల యథార్థ స్వరూపాన్ని తెలుసుకున్న ఫలితం లభిస్తుంది. నిరంతరం దానాలు చేత, యాగాలు చేత హోమాల చేత జపాల చేత బ్రహ్మ చర్య వ్రతంచేత పొందబడిన పుణ్యం యొక్క లాభం పొందశక్యమవుతుంది. సకల పాపాల నాశనం జరిగి వారికి అన్ని వేళలా శుభం కలుగుతుంది.*

అంటే పైమాటలన్నీ ధర్మకార్యాలు చేయాలనే ఆసక్తి కలగాలంటే మహాభారతాన్ని జాగ్రత్తగా ఏకాగ్రతతో వినాలని దానివలన అనేక శుభాలు మానవాళికి అందుతుందని ఎన్నో పుణ్యకార్యాలు చేసిన ఫలితం మహాభారతాన్ని వినడం, లేదా చదవడం వలన కలుగుతుందని అర్థమవుతుంది.

*వైశంపాయన మహర్షి జనమేజయునకు చెప్తూ ఇది వేదాలతో సమానమైనది, పవిత్రమైనది, ఉత్తమమైనది వినదగిన వారిలో ఉత్తమమైన పురాణం, ఋషుల ప్రశంసలు పొందినది.చాలా పవిత్రమైన ఈ మహాభారతం అనే ఇతిహాసంలో ధర్మార్థాలు పూర్తిగా ఉపదేశించబడ్డాయి.*

*మోక్షబుద్ధిఉపదేశించబడింది. కృష్ణద్వైపాయనుడు చెప్పిన ఈ భారత సంహితను మంచి స్వభావం కలవారికి, దానశీలురకు సత్యశీలులకు, ఆస్తికులకు, వినిపించిన విద్వాంసుడు అభీష్టాన్ని పొందుతాడు.*

*ఈ మాటలను పరిశీలిస్తే మహాభారతం మీద మన వేద పురాణేతిహాసాల మీద నమ్మకం ఉన్నవారికి ఈ మహాభారతం కల్పవృక్షం అని అర్థమవుతుంది.*

ఈ ఇతిహాసం వినడం వల్ల భ్రూణహత్యవల్ల కలిగిన పాపం కూడా పోతుంది. ఇందులో సందేహం లేదు. రాహువుచే విడువబడిన చంద్రునిలా అన్ని పాపాల నుండి విముక్తుడవుతాడు. విజయాన్ని కోరుకునే వాడు తప్పనిసరిగా జయమనే పేరుగల ఈ ఇతిహాసాన్ని వినాలి. దీనిని విన్న రాజు భూమిని జయిస్తాడు. శత్రువులను ఓడిస్తాడు. పుత్రుని పొందడానికి ఇది శ్రేష్ఠమైన మంచి గొప్ప సాధనం యువరాజు రాణి అనేక పర్యాయాలు దీనిని వినాలి. అలా వింటే వీరుడైన పుత్రుడు జన్మిస్తాడు. లేదా రాజ్యాన్ని పొందగల కన్య జన్మిస్తుంది.

అపారమైన మేధా సంపత్తి గల వ్యాసుడు పవిత్రమైన ధర్మశాస్త్రాన్ని గొప్ప అర్థశాస్త్రాన్ని, ఉత్తమమైన మోక్ష శాస్త్రాన్ని ఈ భారత రూపంలో చెప్పాడు. ఇప్పుడు ఈ జయేతిహాసాన్ని చెప్పే వారి, వినేవారి పుత్రులు సేవా పరాయణులవుతారు, సేవకులు ప్రియంగా పనిచేసేవారవుతారు.ఈ ఇతిహాసాన్ని విన్న మానవుడు మనోవాక్కాయలనే చేసిన పాపం నుండి వెంటనే విముక్తుడవుతాడు.భరత వంశీయుల జన్మవృత్తాంతం విన్నవారికి అసూయ ఉండదు, వారికి రోగభయమే ఉండదు. వర్షాకాలం నాలుగు నెలలు చదివితే అన్ని పాపాల నుండి ముక్తుడవుతాడు, భారతాన్ని పఠించినవాడు వేదపారగుడని గుర్తించాలి. దేవతలు, రాజర్షులు, పవిత్రమైన బ్రహ్మర్షులు, పాప నిర్మూక్తులూ, ఇందులో కీర్తింపబడుతూ ఉన్నారు, శ్రీకృష్ణ భగవానుడు కూడా కీర్తింపబడుతున్నాడు. దేవేశుడైన ఈశ్వరుడు, పార్వతీ దేవి, పలువురు తల్లులు గల కార్తికేయుని జననం ఇందులో వర్ణించబడ్డాయి. బ్రాహ్మణుల యొక్క గోవుల యొక్క మహత్త్వం ఇందులో చెప్పబడింది. సర్వవేద సమూహం అయిన ఈ భారతాన్ని ధర్మబుద్ధితో వినాలి.

ఈ మహాభారతాన్ని వినడం వలన గర్భవతి పుత్రుని కంటుంది. కన్యకు శీఘ్రంగా వివాహం అవుతుంది. వర్తకులు తమ వాణిజ్యయాత్రలో సఫలులు అవుతారు.భారతంలో మహాత్ములైన రాజర్షుల జన్మ వృత్తాంతాలు ఎన్నో వర్ణించబడ్డాయి. ఉత్తమమైన మంత్రాంగ విధానం చెప్పబడింది, అనేక దర్శనాలకు లోబడి ధర్మం చెప్పబడింది. విచిత్రాలైన యుద్ధాలు వర్ణింపబడ్డాయి. ఋషులు, గంధర్వులు, రాక్షసులు వీరి యొక్క కథలు ఆయా

*విషయ ప్రాధాన్యాన్ని బట్టి విస్తారంగా చెప్పబడ్డాయి. పవిత్ర తీర్థాలు, దేశాలు, వనాలు, పర్వతాలు, నదులు, సముద్రం వీటన్నింటి గురించి దీంట్లో చెప్పబడింది.*

*పవిత్రమైన దేశాలు, పురాలు వర్ణింపబడ్డాయి. శ్రేష్ఠమైన ఉపచారాలు, అలౌకిక పరాక్రమాలు, సత్కారాలు, రథ ,అశ్వ, గజ, బలాలను ఏర్పాటు చేయడం. యుద్ధ కౌశలం, ఇందులో వర్ణింపబడ్డాయి. అనేక విన్యాసాల వాక్య సమూహాలు ఇందులో చూపబడ్డాయి.శ్రాద్ధ సమయంలో బ్రాహ్మణులకు చివరకు ఈ భారతంలోని ఒక్క శ్లోక పాదం వినిపించినా, ఆ శ్రాద్ధం అక్షయ ఫలాన్నిస్తుంది. పితృదేవతలను తప్పక చేరుతుంది.ఇంద్రియాలతో కాని, మనస్సుతో కాని తెలిసికాని, తెలియక కాని ఏ రోజు చేసిన పాపం ఆ రోజే భారతాఖ్యానం వినడం వల్ల నశిస్తుంది. భరత వంశీయుల ఉత్తమ జన్మ వృత్తాంతం చెప్పడం వల్ల ఇది మహాభారతమని చెప్పబడుతుంది. కృష్ణ ద్వైపాయనుడు మూడు సంవత్సరాలు నిత్యోత్సాహంతో అద్భుతమైన ఈ మహాభారత ఆఖ్యానాన్ని రచించాడు. (సంస్కృత భారతం(ఆది పర్వం), 62 వ అధ్యాయం).*

ఈ అధ్యాయంలో ప్రధానంగా మహాభారత వైశిష్ట్యాన్ని తెలియజేసాను. అంతే కాకుండా భారతం పేరులోని అంతరార్థాన్ని వివరిస్తూ మహాభారతం యొక్క ప్రయోజనాన్ని వివరించాను. అలాగే మహాభారతం ఒక ప్రాంతానికి , ఒక దేశానికి పరిమితం కాకుండా అనేక దేశాలలో ఎంతటి ప్రాముఖ్యం సంపాదించిందో వివరించాను. భారతంలో ని గురుశిష్యుల సంబంధాలను కొంత వరకు వివరించే ప్రయత్నం చేసాను. ఆ క్రమంలో గురుశిష్యుల కథలను ప్రస్తావించాను. అంతే కాకుండా మహాభారతానికి నాయకుడు ఎవరు, మహాభారత వైశిష్ట్యం గురించి ప్రముఖ ఆధ్యాత్మిక వేత్తలు తెలిపిన వివరాలను తెలిపాను. చివరగా మహాభారతం ఫలశ్రుతితో ఈ అధ్యాయాన్ని పూర్తిచేసాను. తర్వాతి అధ్యాయంలోమహాభారతంలోని ధర్మాలను గురించి, ధర్మసూక్ష్మాల గురించి వివరిస్తాను.

రెండవ అధ్యాయం

# మహాభారతంలో ధర్మనీతి దృక్పథాలు పరిశీలన

మహాభారతంలోని ధర్మసూక్ష్మాలను తెలుసుకునే ముందు ధర్మం అంటే ఏమిటి ధర్మ సూక్ష్మం అంటే ఏమిటో తెలుసుకోవాలి. మరలా ఈ ధర్మాన్ని ఎలా అంటే అలా తనకు తోచినదే ధర్మం అని భావించి ఆచరించకూడదు. ఈ ధర్మాలు తెలుసుకోవాలంటే ప్రతివ్యక్తి సత్యమును జ్ఞానమును గురించి తెలుసుకోవాలి. వీటి గురించి తెలుసుకున్న వ్యక్తికి ధర్మాలను తెలుసుకోవడం అంత కష్టంగా ఉండదు. ఏది ధర్మం, ఏది అధర్మం అనే విచక్షణా జ్ఞానాన్ని కలిగి ఉంటారు. ధర్మాలను తెలుసుకుని ఆచరించే వారికి ధర్మ సూక్ష్మాలు కూడా తెలిసి ఉండాలి అప్పుడే జీవన విధానం మెరుగుపడుతుంది.

## 2.1. ధర్మం నిర్వచనం:

శ్రీ కేశవ పంతుల నరసింహశాస్త్రి సంస్కృత భారతం **'సంస్కృత భారతం–ధర్మనీతి దృక్పథాలు'** అనే వ్యాసంలో ధర్మం గురించి ఈ విధంగా తెలియజేసారు.

*''మహనీయము, విశాలమయమైన మానవజాతికి అభ్యుదయ శ్రేష్ఠములను చేకూర్చునదియైన ధర్మము సత్క్రియా రూపం. పాణిని మహర్షి అష్టాధ్యాయిలో ఉణాది సూత్రాలలో 'ధర్మః' అను సూత్రం ద్వారా ధర్మ శబ్దరూపమును ప్రతిపాదించినవాడు. ధృఞ్ = ధారణే అను ధాతువు నుండి ఏర్పడిన ఈ శబ్దానికి సమస్త విశ్వమును నిలకడగా ఉంచునది అను అర్థము వాచ్యమై, జగత్తుకు అబాధితంగా (అడ్డులేనిదై), నిలువదగిన ఆధారమనే అభిప్రాయం వ్యక్తపరుస్తున్నది. ఈ అభిప్రాయం వేదసమ్మితమని ఈ క్రింది యజుర్వేద మంత్రం స్పష్టపరుస్తుంది.*

*''ధర్మో విశ్వస్య జగతః ప్రతిష్ఠా లోకే ధర్మిష్ఠం ప్రజా ఉప సర్పంతి, ధర్మేణ పాపమపనుదతి, ధర్మే సర్వం ప్రతిష్ఠితమ్, తస్మాద్ధర్మం పరమం వదంతి.''(వ్యాస సాహితీ సంహిత , ఉపన్యాస వ్యాస మంజరి, పుట:85.).*

ఇది ధర్మం ఇది అధర్మం అని చెప్పగలిగిన అధికారం స్వయంగా ఉద్భవించి 'విధానం' అని మనుస్మృతిలో పేర్కొనబడ్డ వేదానికే ఉన్నదని ధర్మజ్ఞుల అభిప్రాయం.

## 2.2. ధర్మ పరిణామం:

వేదం ధర్మం గురించి ఏమి చెబుతుంది. ధర్మ స్వరూపం ఎటువంటిది, వంటి విషయాలు తెలుసుకోవడం ఎంతైనా అవసరం.

*''భారతీయ వాఙ్మయమున ధర్మమను శబ్దము చాలా ప్రముఖమయిన స్థానములంకరించి విస్తృతమయిన అర్థము కలదిగా ఉన్నది. ఇయ్యది మంగళ వాచకము కూడను భగవద్గీత యందు సయితము ''ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః అని ధర్మ శబ్దము చేతనే ఆరంభింపబడినది. బహు భాషావేత్తయగు ''వింటర్ విడ్జ్'' అను పండితుడు There is no word In any European Language Which is quite synonymous with the Sanskrit word Dharma ధర్మ శబ్దానికి సర్వార్థచ్ఛాయలుగల పదాలు ఇతర భాషలలో లేవు. ధర్మ పదానికి సమానార్థకమయిన శబ్దము యూరోపియన్ భాషలలోను లేదని వక్కాణించెను.*

*పాణిని మహర్షి అష్టాధ్యాయిలోని ఉణాది సూత్రములో ధర్మః అను సూత్రము ద్వారా ధర్మ శబ్ద స్వరూపమును ప్రతిపాదించినారు. ఈ శబ్దమునకు సమస్త విశ్వమును నిలకడగా నుంచునదియని అర్థము. అయితే యీ ధర్మస్వరూపము ప్రత్యక్ష ప్రమాణము ద్వారా గాని అనుమాన ప్రమాణము ద్వారా గాని హేతువాద నాస్తిక వాదముల ద్వారా గాని తెలియబడదు. శబ్ద ప్రమాణ మూర్ధన్యమయిన వేదము ద్వారా, తదర్థబోధకములైన పురాణేతిహాసముల మూలమునే తెలియవలెను. అయితే ఈ ధర్మము యుగములననుసరించి మారుచుండును. కృత త్రేతా ద్వాపరయుగములందు అనుసరింపబడిన ఆపద్ధర్మమయిన నియోగపద్ధతిని సంతానమును పొందుట కలియుగమున మనువు చేతనే నిషేధింపబడింది. అలాగే కొంతకాలము క్రిందట*

*రజస్వలానంతర వివాహములుదూష్యములు. నేడు బాల్య వివాహము శిక్షార్హమయిన నేరము. మహా భారతమునందలి ధర్మ సూక్ష్మములు స్థూల దృష్టి కలవారికి దురవగాహములు. (శ్రీ రామచంద్రమూర్తి, యమ్.జి.పి. ఆంధ్రమహాభారతంలో ధర్మసూక్ష్మాలు,పుట:18.)*

పై విషయాలను పరిశీలిస్తే ధర్మం అనే పదాన్ని నిర్వచించడం కష్టమని, సమస్త మానవాళి ఒక పద్ధతిని అనుసరించడానికి, ధర్మం ఏర్పడిందని తెలుస్తుంది. మానవుడు క్రమశిక్షణ ద్వారానే క్రమక్రమంగా తన జీవితాన్ని మార్చుకుంటూ జీవిత సాఫల్యాన్ని పొందుతాడు. అందుకే ధర్మం ఆచరణీయమైనది. ఆదర్శవంతులను చేస్తుంది.అలాగే యుగాన్నిబట్టి ధర్మం మారుతూఉంటుంది.

*'కర్మజన్యాభ్యుదయనిశ్రేయసహేతురపూర్వాఖ్య ఆత్మ గుణో ధర్మః తానుచేసిన కర్మల వలన కలిగిన పుణ్యము చేత అభ్యుదయములు అనగా స్వర్గాది లోకములను పొందుటకు మోక్షము పొందుటకు కారణమైన అపూర్వమను పేరుగల ఆత్మ గుణమే ధర్మము అని దానికి అర్థం. ఇట్టి ధర్మమును తెలియవలయునన్న పూర్వజన్మ సంస్కారముండవలయును. ఈ సంస్కారము తాను జేసిన కర్మ సిద్ధాంతముపై ఆధారపడి యుండును.కనుక శాస్త్రోక్త కర్మలను చేస్తూ చిత్తశుద్ధి ద్వారా ఆత్మావలోకనం చేసుకునేవారికి ధర్మం తెలుస్తుంది. మిగిలిన వారి విషయంలో అది కనబడదు. అని ''ఆంధ్రమహాభారతంలో ధర్మసూక్ష్మాలు'' సిద్ధాంత గ్రంథానికి కంభంపాటి సీతారామాంజనేయులు ధర్మశంసనం వ్రాస్తూ ఈ విషయాలను తెలియజేస్తారు.(శ్రీరామచంద్రమూర్తి,యమ్.జి.పి. ఆంధ్రమహాభారతంలో ధర్మసూక్ష్మాలు, పుట:vii.).*

ఈ విషయాలను పరిశీలిస్తే ఎవరికి వారు తను చేసిన కర్మల ఫలితంగానే సుఖదుఃఖాలు ఏర్పడతాయని అయితే మనం ఎప్పుడైతే  ధర్మం ఏమిటో తెలుసుకోవడానికి అన్వేషిస్తామో అప్పటి నుండి ఆచరణలో జీవన విధానంలో అనేక మార్పులు రావడాన్ని మనంగమనించవచ్చు. అయితే ఇది ఎప్పుడు సాధ్యమవుతుంది. అంటే మన ప్రవర్తనను ఎప్పటికప్పుడు మనమే ప్రశ్నించుకోవడం వలన మన మనసు అదుపులోకి వస్తుంది.

అప్పుడు ధర్మాన్ని రక్షించగలం. మనల్ని ధర్మం రక్షిస్తుంది అనే విషయాలు స్పష్టమవుతాయి.

## 2.3. ధర్మ నిర్ణయం ఎలా చేయాలి:

కంభం పాటి సీతారామాంజనేయులు ధర్మం గురించి తన అభిప్రాయాలను తెలియజేస్తూ ఈవిధంగా అన్నారు. *'' లోకో భిన్నరుచైః'' అన్నట్లు అనేకమంది అనేకవిధముల వారికి తోచినట్లు ధర్మ నిర్వచనము చేస్తూఉంటారు. కాని అది సరికాదు. కౌరవ పాండవుల విషయముననుు ధర్మ నిర్ణయము చేయలేని పలువురు పలు విధముల అవకాశ వాదమును కల్పించుకని వ్రాయుటయే సంభవించినది. మంత్రద్రష్టలు, దివ్య దృష్టిగలవారు. లోక కల్యాణము నాశించు మహానుభావులు  హృదయముల ను తెలుసుకుని ధర్మ నిర్ణయం చేయాలి. అట్టి ధర్మనిర్ణయము చేయగల మహానుభావులే భారత ప్రాశస్త్యము ను తెలుపుతూ, ఈ మహాభారతం ధర్మశాస్త్రము, వేదాంతము, నీతి శాస్త్రము, మహాకావ్యము, సర్వలక్ష్యసంగ్రహము. ఇతిహాసము బహుపురాణ సముచ్చయము ధర్మార్థకామ మోక్ష చతుర్విధ పురుషార్థ సాధకమని అన్నారు. ధర్మము స్థూల సూక్ష్మములని రెండు రకములు. అందు సూక్ష్మధర్మమును తెలుసుకొనుట మిక్కిలి కష్టసాధ్యము. ధర్మ నిర్ణయమును ఎవరి బుద్ధికి తోచినట్లు వారు చేయకూడదు. దానిని నిర్ణయించుటకు వేదశాస్త్ర స్మృతి పురాణములున్నాయి. వానిని బట్టియే ధర్మ నిర్ణయము చేయుట మంచిది. కనుకనే '' తాస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్యవ్యవస్థితౌ, జ్ఞాత్వా శాస్త్రవిధానోక్తం కర్మ కర్తుమిహార్హసి' అని గీతాచార్యుని వచనము. అనగా కార్యాకార్య నిర్ణయము చేయునప్పుడు శాస్త్ర ప్రమాణమే శరణ్యము నెరిగియే కర్మనాచరింపవలయునని అర్థము. శాస్త్ర విధానమునెరుంగక దానిని ఉల్లంఘించి తన యిష్టానుసారము ప్రవర్తించువాడు సుఖ సంతోషములను పొందక యధః పతితుడగునని గీతాచార్యుడే చెప్పియున్నాడు. ఇంకను పాపా చరణమును చేయువాడు పాపత్ములయందును పుణ్యాచరణమును చేయువారు పుణ్యాత్ములయందును జన్మిస్తారని వేద శాస్త్రములు చెపుతున్నాయి. అలాగే ప్రతి మత గ్రంథములను తెలియజేస్తున్నాయి. అటువంటి మత గ్రంథములను ప్రతి ఒక్కరును తెలుసుకోవాలి. అట్లు వీలులేనప్పుడు స్వార్థరహితులునగు మతాచార్యులు బోధనలను*

*వినియైనా సరే ధర్మము ఆచరించాలి . స్వార్థముతో నుండు వారిని ఒక కంట అప్రమత్తులై కనిపెడుతూ ఉండాలి. స్వార్థపరులు దేనినైనను తమకి అనుకూలముగా చేసుకుని బోధిస్తారు. వారు సర్వం తమకే తెలుసు అని ఇతరులను దుఃఖపెడుతూ ఉంటారు. ధర్మమును తెలియకుండుట అధర్మము కానేరదు. కాని ధర్మము ఆచరింపక తమ తమ యిష్టానుసారము ఆచరించుటయే అధర్మమగును. అట్టివాడు ధర్మాధర్మముల ఏ విధంగా తెలుసుకోవాలంటే గొప్పవారు ధర్మాలను ఆచరించేవిధానాన్ని గమనించి ధర్మాచరణం చేయాలి.వారి వారి ప్రవృత్తినిబట్టియే మనము ఉత్తమ పురుషులు ఎవరో తెలుసుకోవాలి.'' శ్రీ రామచంద్రమూర్తి, యమ్.జి.పి. ఆంధ్రమహాభారతంలో ధర్మసూక్ష్మాలు,పుట:ix.)*

మహాభారతం ధర్మగ్రంథమని అందరికి తెలుసు అయితే ఏది ధర్మం , ఏది అధర్మం అని తెలియాలంటే వేదాలు, స్మృతులు బాగా పరిశీలన చేయాలి. ఆయా యుగధర్మాలను వ్యాసుల వారు ముందుగానే నిర్ణయించారు. భవిష్యత్తులో కలియుగం ఎలా ఉంటుందో ఊహించారు కాబట్టే దేశకాల పరిస్థితులను బట్టి ధర్మాలను సవరించి అందించారు. ధర్మసూక్ష్మాలను తెలుసుకోవడం ద్వారా ధర్మం పై ఆసక్తి కలుగుతుంది. ధర్మం ఆచరించడం కష్టమే అయినప్పటికి ధర్మ సాధన చేయడం ద్వారా సుఖసంతోషాలను కలిగిస్తుంది. ఇది ఎవరికి వారే ప్రయత్న పూర్వకంగా గ్రహించగలగాలి. గురువులను, తల్లిదండ్రులను, ప్రవచనాలను అనుసరించి ధర్మాలు తెలుసుకుని ఆచరించాలి.అనే విషయాన్ని కంభంపాటి సీతారామాంజనేయులు గారు చెప్పిన విషయాలలోని అంతరార్థం.

ధర్మాన్ని నిర్ణయించడం కష్టతరమైనది అయితే ధర్మాన్ని అనుసరించడమనేది ఏ పూజలతోనూ హోమాలతోనూ సమానం కాదు. దానికి ఉదాహరణగా వద్దిపర్తి పద్మాకర్ గరుడపురాణంలో ఒక ఉదాహరణ చెప్పారు. ''కర్ణుడిలో కూడా మంచిలక్షణాలు ఉన్నాయి కొన్ని దానాలుచేసాడు. ఆ దానాలు కర్ణుడుని యుద్ధరంగంలో రక్షించలేదు. అర్జునుడి చేతిలో చావు తప్పలేదు. దుర్యోధనుడు కూడా పౌండ్రకమనే యాగం చేసాడు. ఆ యాగం చేస్తే మాత్రం వాడి తొడలు విరగకుండా ఉన్నాయా? ఎందుకని? దుర్యోధనుడు యాగం చేసినా కర్ణుడు అంతో ఇంతో దానం చేసినా వాళ్ళు పాపాత్ములు, మహాఅపచారాలు చేసారు. సంపూర్ణంగా ధర్మ విరుద్ధంగా నడుచుకున్నారు. అందువల్లే వాళ్ళని

యుద్ధరంగంలో విజయం సాధించలేదు. సూర్యుడు కన్నతండ్రి అయి కూడా కర్ణుని కాపాడలేకపోయాడు. మనం ధర్మాన్ని ఆచరించాలి. ధర్మాన్ని ఆచరించినప్పుడే యాగములు , పూజలు మనల్ని రక్షిస్తాయి. కాబట్టి సాధ్యమైనంత వరకు ధర్మబద్ధంగా ప్రవర్తించాలి.(పద్మాకర్, వద్దిపర్తి,శ్రీ గరుడ పురాణం, ఆచార కాండం, పుట:57).

ఈ వివరాలన్నీ ధర్మోరక్షితో రక్షితః అనే మాటను గుర్తుచేస్తుంది. ధర్మం వలన కలిగే లాభాలు అనుభవానికి వచ్చినప్పుడు మాత్రమే వాటి యొక్క గొప్పతనం తెలుస్తుంది.

## 2.4. ధర్మమే యశస్సు:

'బోధాయన ధర్మసూత్రాలు ' గ్రంథంలో బి. నరసింహాచార్యులు ధర్మం గురించి ఈ విధంగా తెలియజేసారు.

ధర్మేణ ధ్రియతే లోకో ధర్మ స్సర్వ హితం కరః
సర్వో ధర్మే హి వర్తేత జహ్యాద్ధర్మం న జాతు చిత్
ధర్మే లోక ప్రతిష్ఠా చ సత్యే ధర్మః ప్రతిష్ఠితః
సత్యమాచార మూలం హి తేనాచారం ప్రవర్తయేత్

*ధర్మము అనుపదమూ దాని చుట్టూ ఉన్న భావన సంస్కృతానికి చెందిన ఓ ప్రత్యేకత. ఈ పదానికి సరిపోయిన పదము ఇతర భాషలలో ఉన్నట్టు కనిపించదు. మానవుని మహోన్నతునిగా నిలిపేది జంతు జాలాన్నుండి వేరు చేసేది ఈ ధర్మమే ఈ ధర్మానికి మూలము , ప్రమాణము వేదమే. అదే శ్రుతి దానినాధారంగా వెలువడినవే స్మృతులు వీటికే ధర్మ శాస్త్రము అని మరియొక పేరు వీటి మొదటి రూపం ధర్మ సూత్రములలో ఉన్నది.*

*ధర్మమనగా వేద విహిత కర్మాచరణ చేస్తూ మూడు విధాలయిన ఋణాల నుండి విముక్తుడవుతాడు. ముక్తుడుకావడానికి ప్రయత్నం చేయడమే ధర్మసూత్ర గ్రంథాలు ఆచార వ్యవహారాలను నిరూపిస్తాయి. నిర్ణయిస్తాయి. విధిస్తాయి. " (లక్ష్మి నరసింహాచార్యులు,, నల్లంతిగళ్, 'బోధాయన ధర్మసూత్రములు' , పుట:IV.).*

సృష్టిలో మానవ మేధస్సుతో సాటి వచ్చే జీవి ఏది లేదు మానవునకు ఉన్నటువంటి తెలివితేటలు వృథా కాకుండా తన ఆలోచనలను సరైన పద్ధతిలో పెట్టడానికి ధర్మాన్ని

ఆచరించడమే ప్రధానమైనది. ప్రధానంగా ధర్మాలలో ఆచార వ్యవహారాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి వీటిని ఆచరించడం వలన మన వ్యక్తిత్వ వికాసం పై ప్రభావాన్ని చూపిస్తాయి. మన ఆలోచనా విధానం ఎలా ఉందో మన పద్ధతులను మనం పాటిస్తున్న ధర్మాన్ని అనుసరించే ఎదుటి వారు నిర్ణయిస్తారు. ఇలా ధర్మాలను తెలుసుకోవడం, ఆచరించడం, దాని వలన కలిగిన ఫలితాన్ని అనుభవించడం నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలి.

**2.5. ధర్మం యొక్క ఔన్నత్యం:**

సద్గురు" **ధర్మం, వ్యక్తిగత – సార్వత్రిక ధర్మాలు**" వ్యాసంలో ధర్మం యొక్క ఔన్నత్యాన్ని వివరిస్తారు.

*ధర్మం అంటే ప్రతి వ్యక్తీ తమ సర్వోత్తమ ఉన్నతస్థితికి చేరే విధంగా జీవితాన్ని క్రమబద్ధం చేయడం ధర్మం అంటే, మీరు మీ పరమోన్నత స్థితికి చేరడానికి వీలుగా జీవితాన్ని క్రమబద్ధీకరించడం. మహాభారతంలో 'ఇది నాధర్మం' అంటే, ఎవరైనా 'ఇది నా ధర్మం' అంటే, తమ ధర్మం వారికి ఇష్టం కాకపోవచ్చు, అది వారికి సౌఖ్యంగా లేకపోవచ్చు, కానీ వారు తమ సర్వోత్తమ స్థితికి చేరడానికి ఇదే వారికి మార్గం. భీష్ముడు 'తన ధర్మం' అన్నప్పుడు, 'కురువంశానికి ఏమి జరిగినా, రాజ్యం సంక్షోభంలో పడినా, నేను ఈ రాజ్యానికి నా జీవితాన్ని ఇస్తాను, కానీ నా ప్రతిన వీడను' అంటే అర్థం ఏమిటంటే. నేను నా పరమోన్నత స్థితికి చేరడానికి ఎంచుకున్న మార్గం ఇదే, దానిని తాను విడనాడడని అర్థం. విదురుడు ఏమన్నాడో మీకు తెలుసు కదా. "కుటుంబం కోసం ఒక వ్యక్తిని త్యజించ వచ్చు, ఒక గ్రామం కోసం ఒక కుటుంబాన్ని త్యజించ వచ్చు, ఒక దేశం కోసం ఒక గ్రామాన్ని త్యజించ వచ్చు, ప్రపంచం కోసం ఒక దేశాన్ని త్యజించ వచ్చు, కానీ పరమోన్నత స్థితి చేరడం కోసం మీరు ప్రపంచాన్ని కూడా త్యజించవచ్చు" అన్నాడు. ధర్మాన్ని ఈ విధంగా చూడడం జరిగింది.పరమోన్నతస్థితినిచేరడమేఉన్నతలక్ష్యంఅనివారన్నారు.*(https://isha.sadhguru.org/in/te/blog/article/dharamam-vayakataigata-saaaravataraika-dharamaaalau)

ఈ విషయాలను పరిశీలిస్తే ధర్మం అనేది ఒక నిర్ణయానికి కట్టుబడి ఉండడం అంటే మనం ఒక ఉన్నతమైన స్థానంలో ఉండడానికి మనం తీసుకున్న ఒక ధార్మికమైన నిర్ణయం దానిని క్రమపద్ధతి ప్రకారంగా ఆచరణలో పెడితే వారు మహోన్నత స్థానానికి చేరుకుంటారు అని వీరు తెలియజేసిన మాటల్లోని అంతరార్థం. దానికి ఉదాహరణగా భీష్మని చెప్తారు. రాజ్యం ఎటువంటి పరిస్థితులను ఎదుర్కొన్నప్పటికి తన ప్రతిజ్ఞ మాత్రం విడిచి పెట్టడు అందుకే భీష్మునికి తను ఎప్పుడు మరణం కావాలో అప్పుడే మృత్యువును ఆహ్వానించే స్థితికి చేరుకున్నాడు. ఇది సాధారణమైన విషయం కాదు ఎవరికి ఎప్పుడు మృత్యువు వస్తుందో తెలియదు అటువంటిది భీష్ముడు మృత్యువును తన గుప్పెట్లో బంధించాడు అంటే తన ఆధీనంలో ఉంచుకోగలిగాడు.

## 2.6. ఏది ధర్మం ఏది అధర్మం:

సత్యనారాయణ శర్మ ''అశ్వత్థామ మహాభారతంలోని కొన్ని ధర్మసూక్ష్మాలు '' అనే అంశంలో ధర్మం గురించి ఈ విధంగా తెలియజేసారు.

*''మహాభారతంలోని పాత్రలు ఎంత గొప్పవంటే ప్రతి పాత్రా తానూ ధర్మాన్ని ఆచరిస్తున్నాననే అనుకుంటుంది. వారిలో ఎవరి లాజిక్ వారి కుంటుంది శకుని దుర్యోధనుడూ వంటి వారు కూడా ధర్మాన్ని అనుసరిస్తున్నామనే అనుకున్నారు. ద్రౌపది వస్త్రాపహరణాన్ని చేస్తున్న దుశ్శాసనుడు కూడా తన అన్న ఆజ్ఞను పాటిస్తున్నానని అదే ధర్మమని అనుకున్నాడు. ఈ ధర్మం అనేది చాలా విచిత్రమైనది విశ్వం మొత్తానికి వర్తించే ధర్మం ఒకటి ఉన్నది అది కాకుండా మానవ జీవితంలోని స్థితిని బట్టి స్థాయిని బట్టి కులాన్ని బట్టి వృత్తినిబట్టి సాంఘిక మర్యాదను బట్టి కుటుంబ మర్యాదను బట్టి ఇలా రకరకాలైన ధర్మాలు ఉన్నాయి. ఆయా ధర్మాలను విశ్వ ధర్మంతో అనుసంధానం చేసుకుంటూ జీవించడమే దైవధర్మం అప్పుడు కర్మ తగ్గుతుంది. ఈ నియమాన్ని తప్పి ఎవరి ధర్మం వారిదే అనుకుంటూ వారి వారి ఆలోచనలన్నీ సరియైనవే అనుకుంటూ ఎవరిష్టం వచ్చినట్లు వారు ప్రవర్తిస్తే విశ్వ ధర్మం దూరమవుతుంది. అది కర్మ పెరగడానికి దారి తీస్తుంది. ఆ కర్మ కొంత ఫలితాన్నిస్తుంది. మళ్ళీ అది ఇంకొక కర్మకు దారితీస్తుంది. ఈ వలయం ఇలా*

*నిరంతరం తిరుగుతూ మనిషిని జన్మ వలయాలలో బంధించి పారేస్తుంది. ఈ విషయాన్ని మహాభారతం కంటే చక్కగా చెప్పిన గ్రంథం ఇంకొకటి లేదు అంటే అతిశయోక్తి కాదు.'' (http://www.teluguyogi.net/2014/08/blog-post_17.html), ఆగష్టు 17,2014.*

ఈ విషయాలను గమనిస్తే ప్రతి ఒక్కరు తాను ధర్మాన్ని పాటిస్తున్నానే భ్రమలో ఉండి తాను చేస్తున్న పని ఏ స్థితికి చేరుస్తుంది అనే విచక్షణ ను కూడా కోల్పోతుంటారని దానికి ఉదాహరణగా దుశ్శాసనుని తీసుకుంటే ఒక పతివ్రత అయిన స్త్రీని అవమానించడం సమాజ పరంగా నైతిక పరంగా నేరం, అధర్మం అయినప్పటికి తన అన్న మాటను పాటించాలనే నెపంలో తాను చేస్తున్న పని తప్పని తెలిసినా మూర్ఖంగా ఆలోచనా రహితంగా ప్రవర్తించాడు. అన్న చెప్పిన మాట నెరవేరుస్తున్నాను కదా ఇది ధర్మం కదా అని అనుకోవడానికి లేదు ఒక స్త్రీ ని అవమానపరిచే సంఘటన జరగుతుంది అని తెలిసినప్పుడే ఆ కార్యానికి దూరంగా ఉండాలి. కాని అలా జరగలేదు కాబట్టి ఇది అధర్మ కార్యం అని తెలుస్తుంది.

## 2.7. ధర్మం యొక్క ఫలితం:

జటావల్లభుల పురుషోత్తముడు **'ధర్మ మంజరి'** లో ఈ విధంగా తెలియజేసారు.

*'' సుఖమార్గమునకే ధర్మమార్గమని పేరు ధర్మము ఆచరించుచున్నవారు. దుఃఖము అనుభవించుటయు అధర్మము ఆచరించువారు సుఖమును అనుభవించుట లోకంలో కనబడుట లేదా అనగా ఆచరించు ధర్మాధర్మములకు ఫలము వెంటనే సంభవింపక పోవచ్చు. ఎప్పుడో చేసిన ధర్మాధర్మములకు ఇప్పుడు ఫలము అనుభవములోకి రావచ్చును. ఇప్పుడు చేయుచున్న ధర్మాధర్మములకు ఫలమిక ముందు ఎప్పుడో అనుభవములోకి రావచ్చును. భౌతిక ప్రపంచములో కూడా ఇట్టి అనుభవము మనకు కనబడుచున్నది. నిన్న తిన్న అజీర్ణ వస్తువునకు ఫలము నిన్ననే కలుగడం లేదు . నేడు కలుగుచున్నది. పుణ్య పాపములకు సంబంధించిన ఫలము చిరకాలమునకు పిమ్మట కాని జన్మాంతరములో కాని లోకాంతరములో కాని కలుగునని చెప్పడంలో ఆశ్చర్యం లేదు. వ్యవసాయము జరుగుచున్న భూమి అప్పటికప్పుడే ఫలించదు. కావున పాపులు సుఖంగా ఉండుటను, పుణ్యాత్ములు*

*ఆపదలతో ఉండుటను చూచి ఎవడునూ ధర్మము వలన లాభము లేదనియు, అధర్మము వలన హాని లేదని తలంచకూడదు.'' ( పురుషోత్తము జటావల్లభుల, ధర్మమంజరి, పుట:01).*

ఈ వివరాలు అన్నీ పరిశీలిస్తే ధర్మం ఆచరించడం కష్టమైనప్పటికి దానిని అలవాటు చేసుకున్నప్పుడు కలిగే సత్ఫలితాలు శాశ్వతమైన ఆనందాన్ని అందించగలదు, అలాగే అధర్మం తాత్కాలికమైన ఆనందాన్ని కలిగించినా మనలో ఏదో ఒక రోజు పశ్చాత్తాప పడవలసిన పరిస్థితి ఎదురవుతుంది. దాని వలన ఎటువంటి ప్రయోజనం ఉండదు. కావున ఫలితం ఆలస్యమైన ధర్మాన్ని ఆచరించడమే శ్రేయస్కరం అని తెలుస్తుంది.

**2.8. ధర్మం భేదాలు:**

*ధర్మము స్థూలధర్మమని, సూక్ష్మ ధర్మమని రెండు విధాలుగా ఉంటుంది. మందబుద్ధులకు కూడా తెలిసేది స్థూల ధర్మం. శాస్త్ర పారంగతులకు మాత్రమే తెలిసేది సూక్ష్మ ధర్మం (శ్రీ రామచంద్ర మూర్తి, ఎం.జి.పి., ఆంధ్ర మహాభారతంలో ధర్మసూక్ష్మములు, పుట:11.)*

ధర్మాన్ని గ్రహించడం మందబుద్ధులకు కూడా తెలుస్తుంది. అన్నారు అంటే బుర్ర కథలు, హరి కథలు ద్వారానో లేక గ్రంథ పతనం ద్వారానో సామాన్య మానవులు సహితం తాము ఎలా నడుచుకోవాలో తెలుసుకుని పాటిస్తారు. ఉదాహరణకు ప్రతి వ్యక్తి సూర్యోదయానికి ముందే నిద్రలేవాలి. సంధ్యావందనాలు ఆచరించాలి, సమయానికి ఆహారాన్ని స్వీకరించాలి, వీటిని క్రమం తప్పకుండా ఆచరిస్తే కలిగే ప్రయోజనాలు ఏమిటో తెలుసుకుని ఆ ధర్మాలను అనుసరిస్తాడు. ఇటువంటివి స్థూల ధర్మాలు, అయితే వీటిని ఆచరించేటప్పుడు తను ఏర్పరచుకున్న ధర్మాలకు, సిద్ధాంతాలకు, కొన్ని పరిస్థితుల్లో ఆటంకం కలగవచ్చు. అటువంటప్పుడు ఆపద్ధర్మంగా ఏమి చేయాలో తెలుసుకుని పాటించడమే ధర్మసూక్ష్మమని అర్థమవుతుంది. అయితే ఈ ధర్మసూక్ష్మాలు అందరికి బోధపడవు శాస్త్రాలు బాగా ఆకళింపు చేసుకున్న వారికి తెలుస్తాయి. శాస్త్ర ప్రమాణం లేకుండా ధర్మాలను మిడి మిడి జ్ఞానంతో చెప్పిన వారు ఉంటే ప్రజలలో భక్తి ఏర్పడకుండా భయాందోళనలు కలుగుతాయి. దానితో నిజనిజాలు గ్రహించలేక భగవదారాధనలో

ఇదిగో ఇలా చేస్తే భగవంతుడు కోపపడతాడేమో, ఇలా చేస్తే భగవంతుడుకు ఇష్టం లేదేమో, అనే భావన ఎక్కువైపోయి దిక్కు తోచని స్థితికి చేరుకునే సందర్భాలు ఉంటాయి. కాబట్టి శాస్త్రాల సారాంశాన్ని బాగా గ్రహించిన పౌరాణికుల ప్రసంగాలు, వినే అలవాటు చేసుకోవడం వలన వారిలో ఉన్న సందేహాలన్నీ నివృత్తి అయ్యి భగవంతుని స్వేచ్ఛగా, స్వచ్ఛందంగా మనస్ఫూర్తిగా ఆరాధించి తన దగ్గరే భగవంతుడున్నాడనే భావం నుండి చివరకు తనలోనే ఉన్నాడని గ్రహించి ధన్యుడవుతాడు.

ధర్మ సూక్ష్మాలు తెలియకపోతే ప్రతిది అనుమానంగానే భావిస్తాడు. ఆ సందేహాలతో ఈ పని చేయవచ్చా చేయకూడదా అనే ఆందోళన ఎక్కవైపోతుంది ఇవన్నీ తొలగాలంటే శాస్త్రాలను తెలుసుకోవాలి. కాబట్టి తనకు తెలిసినదే తను అనుకున్నదే ధర్మం అని భావించుకోకుండా విచారణ చేసి సత్సాంగత్యం చేసి ధర్మాలను ధర్మసూక్ష్మాలను తెలుసుకోవాలి.

**" ధర్మాదర్థో ర్థతో భోగో,భోగాద్వైరాగ్య సంభవః**
**ధర్మార్జితార్థ భోగేన వైరాగ్య ముపజాయతై"**

*ధర్మం వల్ల ధనం, ధనం వల్ల భోగం, భోగం వలన వైరాగ్యం,వరుసగా లభిస్తాయి. ధర్మంగా సంపాదించే ధనం వల్ల మాత్రమే వైరాగ్యం లభిస్తుంది. అధర్మం వల్ల సంపాదించే ధనంతో భోగాలు అనుభవిస్తే వైరాగ్యం రాదు. ఇంకా సంసారమోహం పెరుగుతుంది. ధర్మము రెండు రకాలు ఒకటి ద్రవ్య ధర్మం, రెండు దేహ ధర్మం. యజ్ఞాలు దానాలు మొదలైనవి ద్రవ్య ధర్మాలు. శరీరంతో చేసే స్నానం, విభూతి ధారణ, ప్రదక్షిణలు ఇటువంటివి దేహ ధర్మాలు. ఈ ధర్మాలు సరిగా ఆచరిస్తే ధనం పెరుగుతుంది. ఈ ధనం వలన తపస్సు చేయాలనే కోరిక పెరుగుతుంది. తపస్సు వల్ల దివ్య రూపాలు దివ్య లోకాలు లభిస్తాయి. ఏ కోరికా లేకుండా ధర్మం ఆచరిస్తే మనశ్శుద్ధి కలుగుతుంది. మనశ్శుద్ధి వల్ల క్రమక్రమంగా జ్ఞానాభివృద్ధి అవుతుంది. (పద్మాకర్ , వద్దిపర్తి, సంపూర్ణ శివపురాణం, పుట: 54).*

ఈ వివరాలు పరిశీలిస్తే ధర్మం ఎంతటి ఉత్కృష్టమైనదో తెలుస్తుంది. మనం నిర్వర్తించవలసిన ధర్మాలు సక్రమంగా నెరవేరిస్తే ఆ ధర్మమే మనలను కాపాడుతుంది. వీరు

చెప్పిన ద్రవ్య ధర్మాలు ఆచరించడం కష్టమని అనిపించినప్పుడు యాగాలు, చేసేవారికి సహకరించినా అది ద్రవ్య ధర్మమే అవుతుంది. నిత్యం నిద్ర లేచినప్పటి నుండి మనం ఆచరించే విధానంలో విభూతి ధారణ తిలక ధారణ ప్రధానమైనవి వీటివలన మనలో తెలియని శక్తి ఆ వృతమై మనలను నిత్యం పవిత్రులుగా చేస్తుంది. దేవాలయ ప్రదక్షిణాలు మనలో ఆధ్యాత్మిక ఉత్తేజాన్ని కలిగిస్తుంది వీటిని ఆచరించడం వలన ధనం , సంతోషం కలిగి నిత్యానందంతో ఉండేట్లు చేస్తుంది. ధర్మం యొక్క శక్తి అటువంటిది ఇవన్నీ కూడా చెప్పడం కంటే ఆచరించి అనుభవించినప్పుడే వాటి యొక్క ప్రాముఖ్యత అర్థమవుతుంది.

ఈ ధర్మం అనేది అనేక విధాలుగా గోచరిస్తూ ఉంటుంది. ఒకరికి ధర్మంగా కనిపించింది మరియొకరికి అధర్మంగా కనిపించవచ్చు, ఒకరికి అధర్మంగా కనిపించింది. మరియొకరికి ధర్మంగా కనబడవచ్చు ఇటువంటి క్లిష్టమైన సంఘటనలు భారతంలో చాలా కనబడుతాయి.

**2,9. ధర్మ పరిశీలన:**

ఉదాహరణకు శ్రీకృష్ణుడు మహాభారత యుద్ధంలో పాండవులకు విజయము కలిగించుట కొరకు చేసిన స్వల్పమైన అధర్మములు గూర్చి ధర్మ నిర్ణయము చేయుటకు చాలా పరిశీలనము కావలెను. *శ్రీకృష్ణుడే మాయావులను దుర్మార్గులను మాయతోనే సంహరించుట ధర్మమని నొక్కి చెప్పియున్నారు. ఈ సందర్భమును పురస్కరించుకుని మహామనిషి రాజగోపాలాచార్యులు వారు తమ భారతంలో శ్రీకృష్ణుని ధర్మనిర్ణయము చర్చించుటకు మనకు అర్హత లేదని చెప్పియున్నారు.*

*“ The poet had not the heart to impute this act to arjuna who was the embodiment of nobility. It was the lord Krishna that incited arjuna to kill karna when he was vainly trying to raise his chariot out of the mud in which it had stuck. According to the code of honour and laws of war prevailing then it was wholly wrong. Who could bear the responsibility for breaches of dharma except the lord himself”*

*ధర్మరాజు కర్ణునిచే చావు దెబ్బలు తిని వచ్చియుండగా శ్రీకృష్ణార్జునులు ధర్మజుని శిబిరమునకు కుశల ప్రశ్నలు చేయుటకు వచ్చిరి. ఇంకను కర్ణుడు బ్రతికి యున్నాడని విని ధర్మజుడు కోపించి అర్జునుని గాండీవము శ్రీకృష్ణునికిమ్మని పలికెను. అర్జునుడు తన గాండీవమును పరులకిమ్మని చెప్పిన వ్యక్తియొక్క తల నరికివేసెదనని భీకర ప్రతిజ్ఞ చేసెను. ఆ క్లిష్టపరిస్థితిని పరమకరుణామూర్తియైన శ్రీకృష్ణుడు నైపుణ్యముతో ధర్మబద్ధముగా పరిష్కరించెను. శ్రీకృష్ణుడు అర్జునుని క్రోధము అనుచితమనియు ఒక్కొక్క సారి క్రోధము యుక్తాయుక్త వివేక జ్ఞానమును నశింపచేయునని ప్రియ శిష్యుని మందలించి ధర్మార్థ మధురముగా ఈ విధంగా హితోపదేశము చేసెను. ( గోపాలకృష్ణ మూర్తి, నందుల, ఆంధ్ర మహాభారతము ఉపదేశము, పుట:419).*

అంటే అర్జునుని ప్రతిజ్ఞ చేసినప్పుడు దానిని పాటించడం ధర్మం అయితే ఆ ప్రతిజ్ఞ ధర్మరాజునే చంపేంతటి సందర్భం వచ్చినప్పుడు చాకచక్యంగా శ్రీకృష్ణుడు అర్జునునితో తిట్టినా చంపడంతో సమానమే అని చెప్పి కాబట్టి నువ్వు ధర్మరాజును చంపకుండా తిట్టినా సరిపోతుందని అలా ధర్మరాజును చంపకుండా, ఆపద్ధర్మాన్ని ప్రయోగించి ఇద్దరిని కాపాడాడు.

*'' మహాభారతాన్ని జాగ్రత్తతో పరిశీలిస్తే శ్రీకృష్ణ పరమాత్మ అందులో అందరిలో అన్నిటా ఉండి నిర్లిప్తుడై వ్యవహారమంతా నడిపినట్లు మనకు తేటతెల్లమవుతుంది. మరొక విధంగా సర్వమూ తాను అయినవాడు ఈ జ్ఞానం అత్యధికంగా ఉన్నవారు పాండవులు, అణుమాత్రం కూడా లేనివారు ధార్తరాష్ట్రులు జ్ఞాన స్వరూపాన్ని రేఖా మాత్రంగా తెలుసుకోవడానికి శలాక రఘునాథ శర్మ గారు ఈ విషయాలను వ్యక్తపరిచారు. ( రఘునాథ శర్మ, శలాక, తైత్తిరీయ విద్యాసౌరభము, పుట:140,141.).*

ఈ విషయాలను శ్రీకృష్ణున్ని భగవంతునిగా భావించిన పాండవులు జ్ఞానం కలిగినవారు అంతా శ్రీకృష్ణుని సంకల్పంతో జరుగుతుందని విశ్వసించిన వారు కాబట్టే శ్రీకృష్ణుని అనుమతితోనే సర్వకార్యాలు చేసి యుద్ధంలో విజయం సాధించగలిగారు. ఇక్కడ పాండవుల విజయానికి జ్ఞానం, ధర్మమే మూల కారణాలుగా చెప్పబడుతాయి. 1, శ్రీకృష్ణున్ని మహాత్మునిగా ధర్మమూర్తిగా అన్నింటికంటే భగవంతునిగా గ్రహించిన వారి

జ్ఞానం.శ్రీకృష్ణుడు చెప్పిందే వేదమని సత్యమని భావించి వాటిని ఆచరించి ధర్మ బద్ధంగా జీవించడం. అనే విషయాలు ప్రస్ఫుటమవుతున్నాయి.

ధృతరాష్ట్రాదులకు శ్రీకృష్ణుడు నిజంగానే భగవంతుడా కాదా అనే అనుమానంతో ఉన్నవారు సంపూర్ణమైన జ్ఞానం వారికి లేదు. శ్రీకృష్ణుని మీద వారికున్న జ్ఞానం మిడి మిడి జ్ఞానం .

## 2.10.ధర్మ శాసనం:

*ధర్మాపర పర్యాయమైన వేదమునకు 'విధానం' (శాస్వతమైన చట్టము), అని కూడా పేరున్నది. ఆ చట్టమునకు అర్థము చెప్పగలవాడు ఒక్క మనువు మాత్రమే అని ఋషులు ప్రార్థించినట్టు మనుస్మృతి మొదటి అధ్యాయం మూడవ శ్లోకం వివరిస్తుంది.*

*'' త్వమేకో హ్యస్య సర్వస్య విధానస్య స్వయంభువః*
*అచింత్య స్యా ప్రమేయస్య కార్య తత్త్వార్థవిత్ప్రభో''*

*వైదిక లౌకిక కర్మలను విధించునది కనుక వేదమునకు విధానమను పేరు సార్థకత ధర్మం యొక్క యదార్థ స్వరూపమనును చెప్పగలది వేదమే అన్న విషయం సర్వపండిత సమ్మతమై యున్నది. (నరసింహ శాస్త్రి, శ్రీ కేశవ పంతులు, సంస్కృత భారతం – ధర్మనీతి దృక్పథాలు' , పుట:88.).*

ఇక్కడ ప్రస్తుతం న్యాయ వ్యవస్థలో చట్టం అనే పదం వేదకాలంలోనే చెప్పబడింది. దానికి విధానం అని పేరు. నేటి కాలంలో ఒక చట్టం అనేది చేసినప్పుడు దానిని ఎవరూ కూడా అతిక్రమించడానికి వీలులేదు. ఆ చట్టాన్ని ఉల్లంఘిస్తే వారు శిక్షార్హులు అవుతారు. ఇది ఈ కాలంలో అమలుపరుస్తున్న ధర్మస్వరూపం కలిగి ఉన్నచట్టం.

మనం నైతిక జీవితాన్ని గడుపుతున్నప్పుడు మనకు కొన్ని ధర్మాలు అవసరమవుతాయి. ఆ ధర్మాలను మనం తెలుసుకున్నప్పుడు ఖచ్చితంగా ఆచరించాలి. వీటిని ఉల్లంఘిస్తే ఆ వ్యక్తి అవమానాలు పాలు కావడమూ ఏదో ఒక ఉపద్రవానికి గురువుతాడు.  వేదం ఇలా ఉండాలని శాసిస్తుంది. శాసించడమనేది ఖచ్చితంగా ఆ శాసనాన్ని పాటించితీరవలసిందే, అని పై విషయాలను బట్టి అర్థమవుతుంది.

*''ధర్మం యొక్క స్వరూపం ఏది అది మనకు ఏవిధంగా అనుసరణీయం అనేది మన జిజ్ఞాసకు సదుపదేశం ఇది ధర్మం యొక్క అసలు రూపం. 'ఫలప్రదమైన సత్ క్రియాచరణం' ఆ చరణం అంటే action సత్ఫలంను ఉద్దేశించి వేదస్మృతి ఇతిహాసాదులు మానవునికి బోధించిన విషయమును ఆచరించడమే ధర్మం. లోకంలో ప్రతి action కు ఒక reaction ఉంటుందన్న విషయం మనకు అనుభవసిద్ధమే కదా అట్లే ధర్మాచరణ రూపమైన క్రియకు స్వర్గ మోక్షాదులుగా మనం గుర్తించాలి.'' ( నరసింహ శాస్త్రి, శ్రీ కేశవ పంతులు, సంస్కృత భారతం – ధర్మనీతి దృక్పథాలు' , పుట:88.)*

ఇక్కడ ధర్మాన్ని ఆచరించిన వాడికి ప్రతిఫలం ఉంటుంది. ఆ ప్రతిఫలమే ఉత్తమ గతులను చేరడం లేదా మోక్షసిద్ధి కలగడం అని పై మాటల్లో వ్యక్తమవుతుంది.

## 2.11. మహాభారతంలో ధర్మసూక్ష్మం:

మహాభారతంలోని విషయాలను శ్రీ కేశవ పంతుల నరసింహ శాస్త్రి ఈ విధంగా చెప్పారు. 'కుటిల మార్గంలో అధర్మమును ఆశ్రయించి పాండవులకు హానిచేసిన దుర్యోధనుని నిర్జించడంలో ధర్మరాజు ఆశ్రయించిన పద్ధతి ద్రోణ భీష్మాదుల విధానంలో అనుసరించిన మార్గము, అధర్మము, అశ్రేయస్కరము కాదని తాత్పర్యం, సామోపాయంచేత సాధ్యపడు దుర్యోధనుని వంటి మూర్ఖుని విషయంలో కాని, వానికి తోడ్పడుతున్న ఇతరుల విషయంలో కాని వాడు అనుసరించిన కుటిల మార్గమునే అనుసరించి 'అశ్వత్థామ హతఃకుంజరః' అని పలికిన ధర్మరాజు అధర్మాత్ముడు కాడని మనం కూడా అట్లు చేయడం తప్పుకాదని వ్యాసుని భావం. (వ్యాససాహితీ సంహిత (ఉపన్యాస వ్యాస మంజరి,పుట:102.).

పై వివరాలు చిన్నప్పటి నుండి అసూయ ద్వేషాలతో రాజ్య కాంక్షతో పెరిగిన దుర్యోధనుడు ఎటువంటి హాని చేయని పాండవుల మీద కక్షకట్టి చిన్నతనంలోనే భీముడిని చంపి తరువాత తక్కిన వారందరిని చంపడానికి సిద్ధపడ్డాడు. అలా అధర్మ బుద్ధితో పెరిగిన దుర్యోధనుని విషయంలో పాండవులు అనుసరించిన పద్ధతి సరియైనదే అలాగే భీష్ముని, సంహార విషయంలోనూ , భీష్ముదుని ఎలా సంహరించాలో ధర్మరాజు భీష్మడిని అడిగితే

భీష్ముడు తన చావు రహస్యాన్ని తెలిపి ధర్మరాజును ఆశీర్వదిస్తాడు. ద్రోణుని విషయంలో కూడా ధర్మరాజు అనుసరించిన పద్ధతి సరియైనదే అనే విషయం అవగతమవుతున్నది.

ఇంకా లోతుగా పరిశీలిస్తే హరిశివకుమార్ ఈ విధంగా అన్నారు. *''మనం వేదోక్తమైన ధర్మాలనే ఆచరిస్తున్నాము. అది మన భారతీయ సంస్కృతి అయితే ఈ ధర్మాలు కొన్ని యుగాలను బట్టి మారుతూ ఉంటాయి. ద్వాపర యుగంలో ధర్మాలు కలియుగంలో అనుసరణీయములు కాకపోవచ్చు. నిన్న మొన్నటి ఆచారాలే ఈనాడు మారిపోయాయి. పూర్వం భోజన పదార్థాలు విక్రయం మహాదోషంగా భావింపబడేది. ఇవాళ అది తప్పు కాదు. ఒకప్పుడు మేనరికం ఆచారంగా ఉండేది. ఈనాడది తప్పుగా భావించబడుతుంది. అలాంటి వాటిని మనం దేశ కాల పరిస్థితులను బట్టి అర్థం చేసుకోవలసి ఉంటుంది. అలాగే మహాభారతంలో చెప్పిన కొన్ని విషయాలు నేటి కాలం వారికి అధర్మ భ్రాంతిని కల్గించవచ్చు. అలాంటి విషయాలలోని ధర్మసూక్ష్మాలను మహాభారత వ్యాఖ్యాతలు, విమర్శకులు, స్మృతి కర్తలు చెప్పిన ప్రమాణాలను ఆధారంగా చేసుకుని పరిశీలించాలి. అంతేగాని ఈనాటి ప్రమాణాలతో లెక్కించి అవి అధర్మాలని తృణీకరించడం సమజసం కాదు.''* (*శ్రీ రామచంద్ర మూర్తి, ఎం.జి.పి., ఆంధ్ర మహాభారతంలో ధర్మసూక్ష్మములు, పుట:11*)

కాలం మారుతున్న కొద్ది ధర్మాన్ని ఆచరించడంలో అలసత్వం ఏర్పడి ఆ ధర్మం యొక్క స్వరూపం సవరించబడుతుంది. వేద కాలంలోని ధర్మాలను ప్రక్కన పెడితే పరమపదించిన మన పూర్వీకుల ఆచారవ్యవహారాలు వంశపారం పర్యంగా ఆచరించే వారు తగ్గిపోయారు. తరాలు మారే కొద్ది ఒక వంశంలోని పూర్వీకులు అందించిన ధర్మాలే తర్వాతి తరం వారు అందుకోలేక నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇక సమాజంలోని ప్రజలు అసుసరించవలసిన విధులు ధర్మాలు వేదకాలం కంటే అనేక రూపురేఖలు మార్చుకుని ప్రవర్తిల్లుతుంది. అనడంలో సందేహం లేదని తెలుస్తుంది.

## 2.12. ధర్మ సాధనకు అర్థం :

*''సంస్కృతం ధర్మనీతి దృక్పథాలు'' వ్యాసంలో శ్రీ కేశవ పంతులు నరసింహ శాస్త్రి ఈ విషయాలను తెలియజేసాడు.*

*''చాణుక్యుడు అర్థ శాస్త్ర ఆరంభంలో ఈ సూత్రాలను రచించాడు. 'సుఖస్య మూలం ధర్మః ధర్మస్య మూలం అర్థం. అర్థస్య మూలం రాజ్యం, రాజ్యమూలం ఇంద్రియః, ఇంద్రియ జయ జయస్య మూలం వినయః, వినయస్య మూలం, వృద్ధోవసేవా వృద్ధ సేవయా విజ్ఞానం, విజ్ఞానేన ఆత్మానం సంపాదయేత్, సంపాదిత్వా జీతాత్మా భవతి, జితాత్మ సర్వార్థైః సంయుజ్యేత''*

*మానవుల సుఖానికి ముఖ్య హేతువు ధర్మమని ధర్మసాధనకు అర్థం మూలమని అర్థ సంపదకు రాజ్యం మూలమని రాజ్య సంపాదన రక్షణములకు ఇంద్రియ జయం కావాలని ఇంద్రియములను జయించుటకు వినయము, అవసరమని, వినయవంతుడు కావాలనుకునేవాడు పెద్దలను సేవించడం. అవసరమని వృద్ధ సేవ వల్ల విజ్ఞానం లభిస్తుందని విజ్ఞానం చేత ఆత్మను పవిత్రంగా ఉంచుకోవలెనని, అలాంటి ఆత్మ విజ్ఞానం కలవాడు కామ క్రోధాదులైన అరిషడ్వర్గమును జయింపగలడని జితాత్ముడైన పురుషుడు, సర్వార్థములను సకల సంపదలను పొందగలుగునని పై సూత్రాలకు అర్థం. ఈ విధమైన నీతి శాస్త్రంలో అసాధారణమైన విజ్ఞానం కలవానిగా తీర్చిదిద్దిన వ్యక్తి ధర్మరాజు ఆదర్శంగా నిలుస్తాడని చూపించిన వాడు వ్యాసుడు.( ఉపన్యాస వ్యాస మంజరి, (వ్యాస సాహితీ సంహిత), పుట:95.).*

ఈ వివరాలను గమనిస్తే ఒక ధర్మమూర్తిగా సమాజంలో గుర్తింపబడటానికి మనలో కలగవలసిన మార్పుల్ని ఇక్కడ గమనించాలి. ప్రధానంగా ఆత్మ పవిత్రంగా ఉండాలి అన్నాడు అంటే మన మనసు నిష్కల్మషంగా ఉండాలి. అలా ఉన్నప్పుడు మనిషి తను చేస్తున్న ప్రతి పనిని గమనిస్తూ ఎప్పటికప్పుడు తన పొరపాట్లను సరిదిద్దుకుంటుంటే తనకు తెలియకుండానే పవిత్రుడు అవుతాడు అలా పవిత్రుడు అయిన వ్యక్తి ఇంద్రియాలను అదుపులో పెట్టగలడు ఎందులోనైనా విజయం సాధించగలడు , పెద్దలను సేవించడం వలన ధర్మాలు తెలుస్తాయని చెప్తున్నారు. అంటే వారు వయసులో పెద్దవారిని సేవిస్తే వారి జీవితంలోని ఒడిదుడుకులు మాత్రమే తెలుసుకోగలరు. జ్ఞాన వయో వృద్ధులను సేవిస్తే సమస్త ధర్మాలను ఆచరించడం వలన కలిగే సుఖాలను తెలియజేస్తారు. దానితో ఏది

శాశ్వతమైన సుఖాన్ని ఇస్తుందో ఏది తాత్కాలికమైన సుఖాన్ని ఇస్తుందో తెలుసుకోగలుగుతాము.

మహాభారతంలో ధర్మరాజు వ్యక్తిత్వాన్ని గమనిస్తే ధర్మమూర్తి లక్షణాలు ఎలా ఉంటాయో తెలుస్తుంది.

ఇంద్రియ నిగ్రహం కలిగిన రాజు దేనినైనా జయిస్తాడు అని చెప్తున్నప్పుడు పాండురాజు తనకు వచ్చిన శాపాన్ని మరచి పోయి మాద్రితో కలవడం అతని మరణానికి కారణమైంది. ఈ సంఘటన చాలా మందికి మాద్రి పాండురాజును ప్రేరేపించిందనో లేకపోతే పాండురాజు తన శాపాన్ని కూడా మరచిపోయేంత ఇంద్రియ నిగ్రహాన్ని కోల్పోయాడనో అనేక అభిప్రాయాలు కలగవచ్చు. అయితే ఈ సన్నివేశానికి మహాభారత కథకు సంబంధం ఉందనే విధంగా ఆ సంబధం దేనితో సంబంధం అనే విషయంపై లంక వేంకటసుబ్రహ్మణ్యేశ్వర శర్మ‘‘**నన్నయ భారతము –స్ఫోటతత్త్వ సమీక్ష**’’ వ్యాసం లో ఈ విధమైన చర్చ చేస్తారు.

*‘‘కాల క్రమంలో ఒక ఋతువు వచ్చింది అదే వసంత ఋతువు ఈ వసంతానికి కథలో అమోఘమైన ప్రయోజనం ఉంది. పాండురాజు వసంత ప్రోద్బలంతో మాద్రిని ముట్టుకోకపోతే అతడు నిరంతరం తపశ్చర్యలో అక్కడే ఉండిపోయేవాడు. పాండు పుత్రులేమౌతారు? పత్నులేమౌతారు? వారు ముని కుమారులు, వీరు ముని పత్నులు మిగిలిపోతారు? అలా అయితే ఇక భారతమేముంది?*

*కాబట్టి ఈ వసంతం ఏమి చేసిందంటే పాండురాజును అమరసీమలకు పంపి, పాండవులను తల్లితో హస్తినకు సాగనంపింది. ’’(వాఙ్మయి (సాహిత్య , చారిత్రక పరిశోధన పత్రిక, భూమయ్య అనుమాండ్ల, (ప్ర.సంపాదకులు) పుట: 104).*

ఈ మాటలను పరిశీలిస్తే ప్రగతి కూడా కథలో లీనమయ్యే విధానాన్ని తెలియజేస్తుంది.

## 2.13.వర్ణాశ్రమ ధర్మాలు:

ప్రాచీన సాహిత్యానికి వర్ణాశ్రమధర్మాలు ప్రధానమని చెప్తూ ఎండ్లూరి *సుధాకర్ 'ప్రాచీన సాహిత్యంలో సందేశం'' వ్యాసం లో ఈ విధంగా తెలియజేసారు.'' ప్రాచీన సాహిత్యానికి ధర్మం ప్రధానం ఈ ధర్మం కూడా వర్ణాశ్రమ ధర్మాలకు కట్టుబడి ఉంటుంది. ప్రాచీన సాహిత్య నిర్మాణానికి వర్ణాశ్రయమెంత ప్రధానమో రాజాశ్రయం కూడా అంతే ప్రాధాన్యం సంతరించుకుంటుంది. రాజు ఏ .మతాన్ని అవలంబిస్తాడో ఆచరిస్తాడో ఆదరిస్తాడో అదే ప్రభావం ఆ కాలం ప్రజల మీద కావ్యాల మీద ఉంటుంది.'' ((వాఙ్మయి (సాహిత్య , చారిత్రక పరిశోధన పత్రిక, భూమయ్య అనుమాండ్ల, (ప్ర.సంపాదకులు) పుట: 118).*

ప్రాచీన గ్రంథాలలో ధర్మం ఏవిధంగా ఉంటుందో వర్ణాశ్రమధర్మానికి కట్టుబడి ఉండడాన్ని ఈ వివరాలు తెలియజేసాయి.

**హరి రామనాథ్ తన ధర్మఘంట గ్రంథంలో భగవద్గీత నుండి జీవన సత్యాలను విశ్లేషణాత్మకంగా వివరిస్తారు.** ''శ్రీకృష్ణుడు అంటున్నాడు అర్జునా నీవే చెప్పావు కదా వర్ణాశ్రమ ధర్మాలన్నీ పోషించి తీరాలి. అవి విరాట్పురుషుని కి అవయవాలు. '' బ్రాహ్మణ ధర్మం తపస్సు విరాట్పురుషునికి ముఖం, క్షత్రియ ధర్మం ప్రజాసంరక్షణం విరాట్పురుషునకు బాహువులు, వైశ్య ధర్మం వ్యాపారం విరాట్పురుషునకు ఊరువులయింది, శూద్రధర్మం సేవ విరాట్పురుషుని పాదాలనుండి పుట్టింది.'' (హరి రామనాథ్ , ధర్మఘంట, పుట:13,14).

ఈ వివరాలను బట్టి అన్ని వర్ణాల వారు సమానమేనని ఏ వర్ణం వారు తమ వృత్తిని కర్తవ్యాన్ని నిర్వర్తించలేకపోతే అది అన్ని వర్ణాల వారికి, సమాజానికి కూడా నష్టాన్ని కలుగజేస్తుంది. అంతేకాకుండా అన్ని వర్ణాల వారు అందరి కోసం ఒకరికొకరు బాధ్యతతో మెలగడమే అసలైన ధర్మం అని వీరు వివరించారు.

## 2.14. ఆంధ్ర మహాభారతం – ధర్మ బోధనలు :

ఆంధ్రమహాభారతంలో అనేక ధర్మాలు ఆయా సందర్భాలను అనుసరించి తెలియజేయబడుతాయి వాటిలో కొన్నింటిని పరిశీలిస్తున్నాను.

## 2.14.1. శౌనకుడు బోధించిన ధర్మాలు:

పాండవులు అరణ్య వాసం చేస్తున్న సమయంలో ధర్మరాజు ఒకానొక సందర్భంలో కలత చెంది స్పృహ కోల్పోతే శౌనకుడు అనే బ్రాహ్మణ ఋషి ధర్మరాజుకు జనక గీతాలలోని వేదాంత పరమార్థాన్ని తెలియజేసాడు.

కం. **'శోక భయస్థానంబు ల; నేకంబులు కలిగినను విహీన వివేకుం**
**డాకులతఁ బొందునట్లు వి; వేగము గలవాఁడు బుద్ధి వికలుండగునే?**
**(ఆంధ్రమహాభారతం, అరణ్య.పర్వం, ప్రథమాశ్వాసం, 20 వ పద్యం).**

వివేకి తెలివి గల మానవుడు దుఖం కలిగిన సందర్భాలు ఎన్ని వచ్చినా వాటిని ఎదుర్కొనే ప్రయత్నం చేస్తాడు కాని క్రుంగిపోయి తన జ్ఞానాన్ని నశింపచేసుకోరు అని అర్థం మానవునికి దుఃఖం రావడం సహజమే కాని ఆ దుఃఖం శాశ్వతంగా ఉండదు అని గ్రహించిన వాడు దుఃఖానికి కారణం తెలుసుకుని పరిష్కరించే ప్రయత్నం చేస్తాడు. అది వివేకవంతుల లక్షణమని తెలుస్తుంది.

*కం. శారీర మానస మహా ; దారుణ దుఃఖములఁజేసి తఱిఁగి శరీరుల్*
*క్రూర తర బాధఁ బొందుదు ; రా రెంటిని జెఱుతు రార్యులమలిన బుద్ధిన్.*
*((ఆంధ్రమహాభారతం, అరణ్య పర్వం,ప్రథమాశ్వాసం., 21 వ పద్యం).*

కేవలం శరీరం ధరించిన సామాన్య మానవులు శరీరక మానసిక బాధల చేత నశిస్తారు గొప్పవారు ఆ రెండింటిని నిర్మల బుద్ధితో నిగ్రహించుకోగలుగుతారు.

ఈ విషయాన్ని గ్రహిస్తే మానవులంతా తన మనసు బాధపడకుండా మంచి విషయాల పట్ల ఆసక్తి చూపడం ఆహ్లాదాన్ని కలిగించే అంశాల మీద జ్ఞానులతో చర్చచేయడం చేసి ఉపశమనం పొందుతారు. అనే విషయం అంతర్లీనంగా తెలుస్తుంది.

*''మఱి స్నేహజంబు లైన మానస దుఃఖంబులు జలంబుల నగ్ని యుపవమిల్లునట్లు విమల జ్ఞానంబునం జేసి యుపశమంబునం బొందు.'' ((ఆంధ్రమహాభారతం, అరణ్య.పర్వం, ప్రథమాశ్వాసం,, 22 వ వచనం)*

స్నేహం వలన ఏర్పడిన మానసిక తాపాలు , నీటి వలన నిప్పు అణగినట్లుగా జ్ఞానం చేత మానసిక ఉపశమనం తొలగుతుంది.

*మనసో దుఃఖమూలం తు స్నేహ ఇత్యుపలభ్యతే*

*స్నేహాత్ తు సజ్జతే జంతుః దుఃఖ యోగముపైతి చ''( సంస్కృత భారతం, 2* వఅధ్యాయం, 27 వ శ్లోకం)

మానసిక దుఃఖానికి మూలం స్నేహమని ఆ స్నేహం వలన జీవుడు ఆసక్తుడై దుఃఖాన్ని పొందుతున్నాడని దీని అర్థం ఇదే విషయం నన్నయ అరణ్యపర్వం లో ఈ విధంగా అంటాడు.

*కం. ''స్నేహార్ణవ మగ్నుం ; దేహి మహాదుఃఖముల నధృతిఁబొందును దుః*

*ఖాహతుఁడు శోకతాపవి ; మోహి యగున్ స్నేహ మూలములు రాగాదుల్.*

*(ఆంధ్రమహాభారతం, అరణ్య పర్వం, ప్రథమాశ్వాసం, 23 వ పద్యం)*

అనురాగం , ప్రేమ అనేవి స్నేహాన్ని ఆశ్రయించుకుని మానవునకు దుఃఖాన్ని కలిగిస్తున్నాయి అంటాడు నన్నయ.

*వ. కావున బంధుమిత్రధన సంచయంబుల వలన స్నేహంబు విడుచునది, పద్మ పత్రంబు నీరం బొందనియ ట్లెరుక గలవారి నెట్టి యెడలను స్నేహంబు వొందదు, స్నేహంబున రాగంబును, రాగంబునం గామంబును, గామంబునం గ్రోధంబును, గ్రోధంబునం దృష్ణయు వర్తిల్లు. ( ఆంధ్రమహాభారతం అరణ్య.పర్వం, ప్రథమాశ్వాసం, పుట:24 వపద్యం. )*

బంధువుల వలన మిత్రుల వలన ధనం సమకూర్చడం వలన ఏర్పడే స్నేహాన్ని విడిచిపెట్టాలి, అది ఎలా గంటే తామరాకు నీటిని పొందనట్లు జ్ఞాని ఎప్పుడును స్నేహం పొందదు, కూరిమి వలన అభిమానం , అభిమానం వలన కోరిక కోరిక వలన కోపం, కోపం వలన దాహం ఉద్భవిస్తాయి. దాహం అంటే అత్యాశ.

ఇందులోని విషయాన్ని గ్రహిస్తే బాంధవ్యం ఉండాలి కాని అది ధనంతో ముడిపడకూడనిదై ఉండాలి అని ధనం మనకు అత్యాశ ను కలిగించి దుఃఖానికి కారణమవుతుందని తెలుస్తుంది.

ఇలా అనేక ధర్మాలను శౌనకుడు ధర్మరాజుకు తెలియజేస్తాడు.

2.14.2. **రోమశుని ధర్మాలు :**

ధర్మరాజు రోమశ మహర్షిని భూలోకంలో అధర్మపరులకు అభివృద్ధి కలుగుతుంది ధర్మాత్ములకు  భరించరాని కష్టాలు ఏర్పడుతున్నాయి ఇది ఎక్కడ న్యాయం అని అడుగగా రోమశ మహర్షి కొన్ని ధర్మాలను తెలియజేసాడు.

*"చ. వసుధ నధర్మవర్తులగు వారల వర్ధన మెన్నడున్ సమం*
*జసమయి నిల్వనేరదు భృశంబుగ నాశము వుందు దుర్మద*
*వ్యసనులధర్మవర్తనఁ బ్రవర్ధితులయ్యును నేము చూడ రా*
*క్షసులును దైత్య మానవులు  గ్రాఁగరె తొల్లి సహస్రసంఖ్యలన్. (ఆంధ్రమహా భారతం, అరణ్య పర్వం, ద్వితియాశ్వాసం,310 వ పద్యం)*

భూమిపై అధర్మ ప్రవర్తన కలవారి అభివృద్ధి స్థిరంగా ఎంతోకాలం నిలువదు, తప్పకుండా నాశనమైపోతుంది ఇక మా కన్నులముందే ఎందరో రాక్షసులు చెడుగర్వంతో చెలరేగి దుర్మార్గులై ప్రవర్తించి అభివృద్ధి చెందినవారు వేలకువేలు నశించిపోలేదా

ఈ విషయాలను పరిశీలిస్తే అధర్మం సంతోషాన్ని కలిగించినప్పటికి అది ఎక్కువ కాలం నిలవదని, ధర్మం మార్గంలో నడిచిన వారు ముందు కష్టాలు అనుభవించినప్పటికి శాశ్వతమైన ఆనందాన్ని కలిగిస్తుందని తెలుస్తుంది.

అధర్మం గా ఉండడం వలన వారిలో గర్వం ఉద్భవిస్తుంది. గర్వం వలన స్వాభిమానం ఏర్పడుతుంది స్వాభిమానం వలన కోపం ఉదయిస్తుంది. కోపం వలన సిగ్గుపోతుంది, నడవడిక చెడుతుంది. సిగ్గున్నూ సత్ప్రవర్తన లేనివారిని నిగ్రహం, శోభ విడిచిపెడతాయి.

**2.14.3.ధర్మవ్యాధుని ధర్మాలు:**

*"ప్రాణాంతికే వివాహే చ వక్త వ్యమనృతం భవేత్*
*అనృతేన భవేత్ సత్యం సత్యేనైవానృతం భవేత్ 11 (సంస్కృతభారతం, వనపర్వం, 209 వ అధ్యాయం, 3 వ శ్లోకం).*

ప్రాణాలను కాపాడుకునే సమయంలో కన్యా వివాహంలో అవసరం అయితే అసత్యం ఆడవచ్చు, నిజం చెప్పడం వల్ల ప్రాణాపాయం కలుగుతుంది అనుకున్నప్పుడు అబద్ధం చెప్పవచ్చు. అసత్యం వల్ల ఒక్కొక్కప్పుడు సత్య ఫలం కలగవచ్చు అలాగే ప్రాణాపాయ సమయంలో సత్యం చెప్పడం వల్ల అసత్యానికి వచ్చే పాపాం కలుగుతుంది. ఇటువంటి ధర్మసూక్ష్మాలను మనం గమనించాలి. ఇదే విషయం ఆంధ్ర మహాభారతంలో ఈ పద్య రూపంలో ఉంటుంది.

**ఉ.** *భూతహితంబుగాఁ బలుకు బొంకును సత్య ఫలంబు నిచ్చుఁద*
*ద్భూతభయాస్పదం బగు ప్రభూతపు సత్యము బొంకు నట్ల, ప్రా*
*ణాతురుఁడైనచోఁ బరిణయంబునయందును బల్కు బొంకు స*
*త్యాతిశయంబు యంద్రు మహితాత్మక! యిట్టివి ధర్మసూక్ష్మముల్(ఆంధ్ర మహా భారతం,అరణ్య పర్వం, రెండవ భాగం, పంచమాశ్వాసం, 62 వ పద్యం.*

*కౌశికుడు ధర్మవ్యాధుడు మాంసాన్ని అమ్మడం చూసి ఈ విధంగా అడుగుతున్నాడు. నీవు ధర్మ మార్గం అనగా ఎట్టిదో బాగా తెలిసినవాడవు కదా జీవహింస ను బ్రతుకుదెరువుగా చేసుకుని ప్రవర్తించడం న్యాయమేనా నీవు చేస్తున్న ఈ పాప కృత్యం వలన నా మనస్సు మిక్కిలి పరితపిస్తున్నది. అనగా నే ధర్మవ్యాధుడు కౌశికునితో ఇట్లా చెప్పాడు ఎవరికి అనువైన ధర్మాలు వారు ఆచరించవలసి ఉన్నది. బ్రాహ్మణులు నిర్వహించవలసిన ధర్మాలు తపస్సు వేదాలను చదవటం పరిశుభ్రత పాటించడం ఇంద్రియ నిగ్రహంతో ఉండి జ్ఞాన సముపార్జనం చేయడం క్షత్రియ ప్రభువులు పాటించవలసిన ధర్మం శిష్ట రక్షణం దుష్ట శిక్షణతో గూడిన పరిపాలన వైశ్యులు ఆచరించవలసిన ధర్మాలు వ్యవసాయం వర్తకం, పాడిపంటలు అభివృద్ధి చేయటం శూద్రులకు విహితమైన ధర్మం పరిచర్య అట్లే వ్యాధులు నెరవేర్చదగిన ధర్మం మాంసవిక్రయం మాంసోపజీవనం మాకు వంశక్రమంగా సంక్రమించిన ఆచారం అంతేకాకుండా ఇది మిథిల రాజ్యం ఈ దేశానికి ప్రభువు జనకమహారాజు ఎవరి వంశ వృత్తులు వారు నిర్వర్తించవలనని శాసించాడు ఆ శాసనం మీరే వాడు తన కొడుకైనా సరే దండన విధిస్తుంటాడు. ఇన్ని కారణాలచేత నేను*

*నా స్వధర్మమైన మాంసవిక్రయాన్ని విడిచిపోలేను. ( ఆంధ్ర మహాభారతం, అరణ్య పర్వం, పంచమాశ్వాసం.,32 వ వచనం నుండి).*

*తే. జీవ హింస యెన్నండును జేయ ననఘ 1*
*యొరులు సంపి తెచ్చిన మాంస మొనర విలిచి*
*తగిన వెల కమ్మి బ్రదుకుదుఁ దద్ధనమున1*
*నమలమానసశాంతి నా యర్థమెందు. ( ఆంధ్ర మహాభారతం, అరణ్య పర్వం, పంచమాశ్వాసం.,33 వ పద్యం).*

అని ధర్మ వ్యాధుడు చెప్తాడు. నా అంతట నేను ఎప్పుడూ ఎటువంటి జీవహింసకు పాల్పడును ఇతరులు మృగాలను చంపి తెచ్చి ఇచ్చిన మాంసాన్ని నేను కొని కొద్ది లాభాన్ని మాత్రమే తీసుకుని సరైన ధరకు అమ్ముతున్నాను ఆ విధంగా లభించిన ధనం వలన జీవిస్తున్నాను దీనివలన నేను మనశ్శాంతిని పొంది జీవించగలుగుతున్నాను ఇదే నా పరమార్థం అని చెప్తాడు.

ధర్మవ్యాధుడు చెప్పిన ఈ మాటలలో ప్రధానమైన విషయం ఎవరి వృత్తిని వారు నిర్వర్తించడమే ధర్మమని తెలుస్తుంది. ఆ ధర్మం పాటించడం లో కొన్ని మెలకువలను పాటించినట్లయితే దాని వలన ధర్మానికి లోపం కలగకుండా జాగ్రత్త పడవచ్చు అనే విషయం అర్థమవుతుంది.

*తే. వేద విహితంబులును శాస్త్రవిహితములును1*
*శిష్టచరితంబులును నన జెప్ప నొప్పి*
*ధర్మములు మూడు విధముల దనరుచుండుఁ 1*
*గడఁగి యున్నియు సద్గతి కారణములు (ఆంధ్ర మహాభారతం,అరణ్య పర్వం,పంచమాశ్వాసం, 49 వ పద్యం,)*

ధర్మాలు మూడు రకాలు ఒకటి వేదాల చేత విధింపబడినది రెండు శాస్త్రాల చేత నిర్దేశించబడినది, మూడు పెద్దల మంచినడవడికలు పై మూడు పద్ధతులు సద్గతికి కారణాలుగా నిలుస్తున్నాయి అని చెప్తాడు.

ఈ వివరాలను గమనిస్తే వేదాలలో చెప్పిన విషయాలు ధర్మాలుగా చెప్పబడుతాయి అయితే సామాన్య మానవులకు ఆ వేద సారం అర్థం కాదు కాబట్టి సాధ్యమైనంత వరకు పెద్దవారు అంటే జ్ఞానం ఉన్న వారిని అనుసరిస్తే ధర్మం బోధపడుతుందని అర్థమవుతుంది.

### 2.14.4. ధౌమ్యుడు – రాజధర్మం:

ధౌమ్యుడు పాండవులు అజ్ఞాతవాసం చేయడానికి సిద్ధపడే సమయంలో వారికి కొన్ని రాజధర్మాలను తెలియజేస్తాడు. రాజు రాజ్యంలో ఎలా మెలగాలో రాజుతో ఎలా ప్రవర్తించాలో తెలియజేస్తాడు.

*కం. తగఁజొచ్చి తనకు నర్హం 1 బగు నెడఁ గూర్చుండి రూప మవికృతవేషం*
*బుగ సమయ మెఱిఁగి కొలిచిన 1 జగతీ వల్లభున కతఁడు సమ్మాన్యుఁడగున్.*
*(ఆంధ్రమహాభారతం, విరాట పర్వం, ప్రథమాశ్వాసం, 121 వ పద్యం).*

ఒక పద్ధతి ప్రకారం సభలోకి ప్రవేశించాలని తనకు కేటాయించిన ఆసనం లో కూర్చోవాలని తన రూపం గానr వేషం కాని వికృతంగా ఉండకుండా చూచుకోవాలి. సమయం తెలుసుకుని మసలు కొంటూ సేవించాలి. అలా చేయగల వ్యక్తి రాజుకు గౌరవార్హుడవుతాడు.

మొదట ధౌమ్యులు వారు కూర్చునే స్థానానికి ప్రాధాన్యం వహించాడు. తర్వాత తన వేషధారణ వికారంగా ఉండకూడదని అంటే చూచేవారికి ఆ వ్యక్తి పై అసహ్య భావం కలగకుండా చూసుకోమని చెప్తాడు. అలా రాజుకు అసహ్య భావన కలిగితే ఆ వ్యక్తిని దూరంగా పెట్టించవచ్చు అలా జరిగితే అతను వచ్చిన కార్యం చెడిపోయే ప్రమాదం ఉన్నది కావునా ఆ విషయంలో జాగ్రత్త వహించమని చెప్తున్నాడు.

*‘‘కం. నరనాథుఁగొలిచి యలవడఁ దిరిగితి నా కేమి’*
*యనుచుఁ దేఁకువ లేమిన్*
*మరియాద దప్ప మెలఁగిన 1*
*పురుషార్థంబునకు హాని పుట్టకయున్నే?( ఆంధ్ర మహాభారతం, విరాట పర్వం, ప్రథమాశ్వాసం, 122 వ పద్యం)*

రాజు కొలువులో ఉన్నామని కొందరికి అహంకారం తెలియకుండానే ఆవహిస్తుంది. దానిని గ్రహించిన ధౌమ్యుడు రాజుకొలువులో ఉన్నానని రాజుతో చనువుగా తిరుగుతున్నాను నాకేమిటి అని అనుకుంటూ నిర్భయంగా మర్యాదను అతి క్రమించి ప్రవర్తిస్తే మొదటికే మోసం వస్తుంది.

*రాజుగారి ఇంటికన్నా అందంగా ఇల్లు కట్టుకొనకూడదు, రాజు గారి వేషధారణ పద్ధతిలో తాను దుస్తులు తొడుగు కొనకూడదు. రాజు చేసే విహారం వలె తానూ విహరించకూడదు. రాజు మాట్లాడే పద్ధతిలో తాను మాట్లాడటం తగదు. (ఆంధ్రమహాభారతం, విరాట పర్వం, ప్రథమాశ్వాసం, 123 వ పద్యం)*

ఈ మాటలను గమనిస్తే రాజు కంటే ఏది సేవకుడు మిన్నగా ఉండకూడదు రాజు పద్ధతులను అనుసరించకూడదు కాని రాజు చెప్పిన శాసనం మాత్రం అందరూ పాటించి తీరాలి. రాజు కంటే గొప్ప గా జీవిస్తే అది రాజు అవమానంగా భావించవచ్చు రాజులు ఎప్పుడూ ధీరత్వాన్ని ప్రదర్శిస్తూ రాజ్యాన్ని అన్ని విధాలా కపాడుకుంటారు కాబట్టి వారికి కృతజ్ఞతా పూర్వకంగా నైనా కాస్త అణగి ఉండడం మంచిదని అర్ధమవుతుంది.

*క. పుత్రులు పౌత్రులు భ్రాతలు1 మిత్రులనరు రాజు లాజ్ఞ మిగిలిన చోటన్*
*శత్రుల కాఁదమయలుకకుఁ1బాత్రము సేయుదురు నిజశుభస్థితి పొంటెన్.*
*(ఆంధ్రమహాభారతం, విరాట పర్వం, ప్రథమాశ్వాసం, 124 వ పద్యం.)*

రాజులు తమ ఆజ్ఞను మీరిన వారిని కొడుకులని గాని మనుమలను గాని , సోదరులని గాని, స్నేహితులని గాని, రాజులు పరిగణించరు, తమ మేలు కొరకు, భద్రత కొరకు వారిని శత్రువులు గానే పరిగణిస్తారు. కొపం పెంచుకుని వారి అంతు చూస్తారు.

ఇక్కడ రాజనేవాడు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తాడని చెప్తున్నాడు రాజు చెప్పిన పనిని చేయకపోతే వారు తన సొంత పుత్రులైనా సరే వారికి శిక్షవిధించి సమన్యాయాన్ని పాటిస్తాడని ఇందులోని అర్థం తన భద్రత కొరకు తోబుట్టిన వారినైనా సరే శత్రువులుగా పరిగణిస్తారు వారిని శిక్షిస్తారు అని రాజ లక్షణాన్ని ధౌమ్యుడు చెప్పినదానిలోని అర్థం. ఇలా రాజు వ్యవహరించడం చూస్తే పైకి రాజు అహంకారిగానో లేక బంధుప్రీతి లేని వాడిగానో

కనబడవచ్చు. కాని రాజరిక వ్యవస్థలో ఇదే న్యాయం రాజు అలా ఉంటేనే శత్రువుల పుట్టుక ఉండదు. ఒక వేళ శత్రువులు ఏర్పడినా భయంతోనైనా తన దుశ్చర్యలను మానుకుంటాడు. తప్పు చేస్తే రాజు ఎవరినైనా వదిలిపెట్టడు అనే భయం ప్రజల్లోనూ శత్రువుల్లోనూ కలిగితే రాజు రాజ్యం అభివృద్ధి చెందుతుందని నా అభిప్రాయం.

*ఆ. ఆవులింత,తుమ్ము హాసంబు, నిష్ఠీవ l నంబు గుప్త వర్తనములు గాఁగఁ*

*జలువ వలయు నృపతి కొలువున్న యెడల బాహిరములైనఁగెలని కెగ్గు లగుట.*

*(ఆంధ్రమహాభారతం, విరాట పర్వం, ప్రథమాశ్వాసం, 137 వ పద్యం.)*

రాజు సభ సమావేశంలో ఉన్నప్పుడు సేవకుడు ఆవులించకూడదని, తుమ్ములు మంచిది కాదని నవ్వడం అసలే పనికిరాదని ఉమ్మివేయడం తప్పు అని వీటిని బహిరంగంగా చేస్తే ప్రక్క వాళ్ళకు సహించరానివి కాబట్టి వాటిని గోప్యంగా చేయాలి.

ఈ విషయాలను గమనిస్తే కనీస మర్యాదలు రాజు ముందు పాటించాలని తెలుస్తుంది. రాజు కొలువు దీరినప్పుడు ఒక వ్యక్తి ఆవలిస్తే ఆ సభ మీద అతనికి అనాసక్తి ఉన్నట్టు అటువంటివారిని రాజు సహించడు సమావేశం అందరి కోసం నిర్వహిస్తారు, అక్కడ రాజ్య పరిపాలన గురించి చర్చ జరుగుతున్నప్పుడు సేవకులు కనీస మర్యాదలను పాటించాలి అనవసరంగా సభలో నవ్వితే అది రాజుకే అవమానం కలుగుతుంది.

*కం. వైరుల దూతలు,నెరవగు l వారు నిరాకృతులుఁబాపవంతులుఁ దమకుం*

*జేరువఁగా వర్తించుట l నేరమి, తుది బోయి చేటు నిందయు వచ్చున్.*

*(ఆంధ్రమహాభారతం, విరాట పర్వం, ప్రథమాశ్వాసం, 138 వ పద్యం)*

శత్రువుల దూతలు గాని రాజు ఆగ్రహానికి పాత్రులై నిరాకరించబడిన వారు గాని, పాపాత్ములు గాని, తమకు దగ్గరగా ఉండడం మంచిది కాదు. దీని వలన చివరకు కీడు నిందా వస్తాయి.

రాజు కు ఉన్న శత్రువుల దూతలు , రాజు నిరాకరించబడిన వారి దగ్గరకు వెళ్ళి వారితో స్నేహం చేయకూడదు ఇది రాజు ఆగ్రహానికి కారణమయ్యే ప్రమాదం ఉంది. ఇలా ఇంకా కొన్ని జాగ్రత్తలును , రాజనీతి ధర్మాలను ధౌమ్యుడు పాండవులకు చెప్తాడు.

### 2.14.5. విదురుడు – నీతి ధర్మాలు:

ధృతరాష్ట్రునికి విదురుడు నీతి సంబంధిత విషయాలను తెలియజేస్తాడు.

- *జనులకు అంగీకారమైన విధంగా ప్రవర్తిస్తూ లోకం నిందించే పనులను చేయటం మాని తన సంపద కంటే ఎక్కువని ఇంకొకడి సంపదకు ఈర్ష్య చెందక, మనుష్యులతో కలిసి మెలసి బ్రతకటం మంచిది.*

ఈ మాటల్లో  విషయాన్ని గమనిస్తే అందరు అంగీకరించిన విధంగా మన ప్రవర్తన ఉండాలని చెప్తున్నాడు. అందరికి నచ్చినది చేయమని కాదు ధర్మాత్ములు, శాస్త్ర ప్రమాణం తెలిసిన వారు పాటించిన నియమాలను పాటించాలి అవి అందరికి అంగీకారయోగ్యమైనవిగా ఉంటాయి. వాటికి వ్యతిరేకంగా నడుచుకునే వారు అవమానాలు పాలవుతారు. లోకం వారిని నిందిస్తుంది. అటువంటి చెడు పనులను మానుకోవాలి. ఇంకొకటి ఈర్ష్య తన సంపద కంటే ఎక్కువని ఇంకొకడి సంపద ను చూసి బాధపడకుండా అందరితో కలిసి మెలసి ఉండాలి అని చెప్తున్నాడు.

### 2.14.6.దుర్జనుని లక్షణం:

చెడ్డవారి లక్షణాలు ఎలా ఉంటాయో ఈ పద్యం వివరిస్తుంది.

*కం. కోపము, నుబ్బును, గర్వము 1 నాపోవక యునికియును దురభిమానము,*

*నిర్వ్యాపారత్వము నను నివి1 కాపురుష గుణంబు లంద్రు కౌరవనాథా!*

*(ఆంధ్రమహాభారతం, ఉద్యోగ పర్వం, ద్వితియాశ్వాసం, 132 వ పద్యం)*

కోపము, పొంగిపోవడం, గర్వము, తృప్తి లేకపోవడం, దురభిమానం ఏ పని చేయకపోవడం అనే ఇవి దుర్జనుడి లక్షణం.

కోపం దీని గురించి తెలియని వారు ఎవరూ ఉండరు కోపం గురించి నీతులు చెప్పేవారే దానిని తన అధీనంలోకి తెచ్చుకోలేరు కోపం వలన నష్టం జరుగుతుంది అన్నా దాని విషయం పట్టించుకోరు ఏదైనా తప్పు పని చేసేసి, ఏదైనా తప్పుగా మాట్లాడి తర్వాత అయ్యో నేను ఏదో కోపంలో అనేసాను అంటాడు. అంటే విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయి

ఎదుటి వారిని బాధపెట్టేసి తరువాత శాంతి వచనాలు పలికితే అది సరియైన పద్ధతి అనిపించుకోదు ఆ కోపాన్ని నియంత్రించ గల శక్తి ఆధ్యాత్మిక ప్రపంచంలో ఎందరో మహానుభావులు తెలియజేసి ఉంటారు. వాటిని అనుసరించి కోపాన్ని నియంత్రించుకోవాలి.

పొంగిపోవడం ఎవరైనా ఏదైనా చిన్న పనికే పొగిడితే సంబర పడిపోకూడదు ఇంత చిన్న పనికి నన్ను ఎందుకు పొగుడుతున్నాడా అని అనుమానించాలి. ఈ పొగడ్తలకు లొంగి పోవడం వలన చాలా ఇబ్బందులకు గురి కావలసి వస్తుంది. పొగడ్త ఆ వ్యక్తికి ఇచ్చేది తాత్కాలికమైన ఆనందమే తప్ప శాశ్వతమైన ఆనందం కాదని గుర్తించాలి. దాని వలన ఎదుటి వారికి తనకు తెలియకుండానే తాను అతని మాటకు బానిసఅయిపోయి అతను ఏ పని చెప్తే అది విచారణ లేకుండా చేస్తాడు. కాబట్టి పొగడ్తలకు పొంగిపోకూడదు అని చెప్తున్నాడు.

గర్వము ఇది ఇంకా ప్రమాదం ఈ గర్వం చదువు వలన కావచ్చు అంటే నాకే అన్ని విషయాలు తెలుసు నాకంటే మించిన పండితుడు లేదు ఇలా అనుకోవడం కూడా గర్వమే మరికొందరికి ధనం వలన గర్వం ఏర్పడుతుంది. జీవితానికి సరిపడ ధనాన్ని దాచిపెట్టి ధన అహంకారంతో ఎదుటి వారిని నిర్లక్ష్యంగా మాట్లాడటం కూడా గర్వమే,

తృప్తిలేకపోవడం అంటే ఎంత సంపాదించినా తృప్తిపొందలేక ఉన్నదానిలో సంతృప్తి పొందేలేక
సతమతమయ్యే గుణం కూడా దుర్జనుడి లక్షణం .

ఏపని చేయక పోవడం అంటే ఇతరుల మీద ఆధారపడుతూ బ్రతికినంత కాలం సోమరిపోతుగా జీవించడం ఇలా సోమరితనంగా ఉంటే వ్యక్తి జీవన విధానానికే కాదు ఆ కుటుంబ వ్యవస్థ కూడా అస్తవ్యస్థమైపోతుందని ఇందులోని అంతరార్థం.

సత్ఫలితాలు పొందాలి అనే వ్యక్తి ఎవరిని ముందు గౌరవించాలి అనే విషయాన్ని విదురుడు చెప్తున్నాడు.

2.14.7. **సత్ఫలితాలు ఆశించేవాడికి ఉండవలసిన అర్హత:**

ప్రతి వ్యక్తి తాను చేసిన కార్యానికి ఫలితాన్ని కోరుకుంటాడు. అలా మంచి ఫలితాలు రావడానికి వారు కొన్ని అర్హతలు సంపాదించుకోవాలి వాటిని ఈ పద్యం లో గమనించవచ్చు.

*కం. ఏలిన వానిని దైవము 1 నాలిని, బంధులను సముచితారాధన సం*
*శీలతఁ బ్రీతులఁ జేయని 1 పాలసుఁడా ఫలము లాసపడు, మనుజేంద్రా! ( ఆంధ్రమహాభారతం, ఉద్యోగ పర్వం, ద్వితియాశ్వాసం, 33 వ పద్యం)*

రాజునూ, భగవంతుడిని, భార్యను, చుట్టాలను, తగిన విధంగా పూజించే సత్స్వభావంతో సంతోషపెట్టని యుక్తాయుక్త వివేక శూన్యుడా సత్ఫలితాలు ఆశించేది?

అంటే ప్రజలు సుభిక్షంగా కరువు కాటకాలతో ఇబ్బందులు పడకుండా దొంగల బెడద లేకుండా చేసేది రాజే కాబట్టి రాజును పూజించాలి, తర్వాత భార్యను నేటి కాలంలో మానవులు స్వార్థపూరితమైన జీవితాన్ని గడుపుతున్నారు పురుషుడు తన అన్ని అవసరాలను భార్య ద్వారా నెరవేర్చుకుంటూ భార్యను ఎప్పటికప్పుడు వంట విషయంలోనూ, ప్రతి చిన్న పొరపాటుకు కోపపడుతూ అందరి ముందర అవమానపరుస్తుంటే ఆ భర్త తన జీవితంలో పురోగమించలేడు అని తెలుస్తుంది. బంధువులను అభిమానించడం వ్రతాలకనో, పండగలకనో వారిని ఆహ్వానించి తగిన మర్యాదలు చేయడం ఇలాగా ఎవరికి ప్రాధాన్యత ఇవ్వాలో వారిని గౌరవించడం వలన ప్రతి వ్యక్తి ఏ కార్యంలోనైనా సఫలీకృతం కాగలడు అనే విషయం మనకు అర్థమవుతుంది.

**2.14.8. గుణాలను బట్టి వ్యక్తిత్వం**

అలాగే ధనము, విద్య ఉత్తమ వంశము అనేవి ఎవరిలో ఉంటే మంచి భవిష్యత్తుకు నాంది పలుకుతుందో ఎవరి దగ్గర ఉంటే అహంకారానికి దారితీస్తుందో చెప్తున్నాడు విదురుడు.

*క. ధనమును , విద్యయు, వంశం 1 బును దుర్మతులకు మదంబుఁ బొనరించును స*
*జ్జను లైనవారి కడఁకువ 1 యును, వినయము నివియతెచ్చు నుర్వీ నాథా! ( ఆంధ్ర మహాభారతం, ఉద్యోగ పర్వం, ద్వితియాశ్వాసం, 35 వ పద్యం).*

ధనము, విద్య ఉత్తమ వంశము దుర్బుద్ధులు మదం కలిగిస్తాయి. ఇవే సద్బుద్ధులకు అడకువను, గౌరవాన్ని తెచ్చిపెడతాయి.

చెడు ఆలోచనలు, చెడు సహవాసాలు, చెడు అలవాట్లు , వ్యసనాలకు బానిసత్వం కలిగిన వారి దగ్గర విద్య , ధనము, ఉత్తమ వంశం ఉంటే వారికి అహంకారం ప్రవేశించి అతనిని నాశనం చేస్తుంది. ఇదే విద్య , ధనము ఉత్తమ వంశం అనేవి మంచివారిలో ఉన్నట్లయితే వారు సత్కార్యాలకు ధనాన్ని వినియోగిస్తారు, పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందింస్తారు. మంచి వంశం నుండి వచ్చావని కీర్తిస్తారు. అటువంటి వారు ఎక్కడ ఉన్నా అభివృద్ధి చెందుతారు. అనే విషయం పై మాటల వలన వ్యక్తమవుతుంది.

### 2.14.9. ఓర్వలేనితనాన్ని వ్యాధిగా పరిగణించిన విదురుడు:

ఓర్వలేనితనం అనేది మనిషికి సంక్రమించిన మానసిక వ్యాధి దానినే ఇక్కడ గమనిస్తే

*కం. ‘‘ పరుల ధనమునకు , విద్య / పరిణతికిం, దేజమునకు, బలమునకు మనం*
*బెరియఁగ నసహ్యపడు న /న్నరుఁడు దెవులు లేని వేదనం బడు నధిపా’’ (ఆంధ్ర మహాభారతం, ఉద్యోగ పర్వం, ద్వితియాశ్వాసం, 58 వ పద్యం)*

విదురుడు చెప్తున్నాడు ఇతరుల డబ్బుకు, విద్యాపరిపక్వతకూ తేజస్సుకూ బలానికి మనస్సు కాలిపోయేటట్లు ఓర్వలేని ఆ మనుష్యుడు రోగం ఏమి లేకుండానే బాధపడుతాడు.

ఈ విషయాలను పరిశీలిస్తే మన శరీరానికి రోగం వచ్చినప్పుడు దానిని పట్టించుకోకపోతే నెమ్మదిగా ఆ రోగం ముదిరి కోలుకోలేని స్థితికి చేరుస్తుంది. అలాగే ఇతరులు అభివృద్ధి చెందితే ఓర్వలేనితనంతో ఉన్న వ్యక్తికి శారీరకంగా ఎటువంటి రోగం లేకపోయినప్పటికి మానసిక రోగాన్ని తనకు తెలియకుండానే అనుభవిస్తాడు . ఈ వ్యాధిని నయంచేసుకునే ప్రయత్నం చేయకపోతే ఆ వ్యక్తి జీవితం ఛిన్నాభిన్నమయిపోతుంది. ఎదుటి వారి సంపదకు ఆశపడక, ఎదుటి వారి చదువుకు ఈర్ష్య పడక, ఎదుటి వారి బలానికి క్రుంగి పోకుండా జీవించేవాడు ఎక్కువ కాలం జీవించగలుగుతారు.

ఇలా ఇంకా ఎన్నో ధార్మికమైన విషయాలు విదురుడు ధృతరాష్ట్రునికి తెలియజేస్తాడు.

## 2.15. ధర్మం – ధర్మసూక్ష్మం – ప్రముఖుల అభిప్రాయాలు:

ధర్మం ధర్మసూక్ష్మం గురించిన అన్వేషణ చేస్తున్న కొలది క్రొత్త విషయాలు తెలుస్తూనే ఉంటాయి వాటి గురించిన సంపూర్ణ పరిజ్ఞానం తెలుసుకోవడం కొంచెం కష్టమైన పనే అయినప్పటికి వేదాలు , ధర్మాలు, తెలిసిన వారి ప్రముఖుల అభిప్రాయాలు తెలుసుకోవడం వలన మనకు సూక్ష్మమైన ధర్మాలు తెలుసుకునే అవకాశం ఉంది. ఈ క్రింది వారి అభిప్రాయాలను పేర్కుంటున్నాను.

ధర్మం ధర్మసూక్ష్మం గురించి చాగంటి కోటేశ్వర రావు ముఖాముఖిలో ఈ విధంగా తెలియజేసారు. *ధర్మము, అధర్మము అన్నవి స్పష్టంగా కనబడిపోతాయి. కొంచెం దానిని పట్టుకోవడం కూడా తేలికగానే ఉంటుంది. అధర్మంగా కనబడి ఒక ప్రత్యేక కారణం చేత ధర్మ సూక్ష్మం అవుతుంది. ధర్మసూక్ష్మం అనేటటువంటిది అందరూ తెలుసుకోలేరని చెప్తారు. కొంత పరిజ్ఞానం ఉన్నవారు మాత్రమే పట్టుకుని ధర్మాధర్మ వివక్ష చేయగలరు.* (చూడు:అనుబంధం2, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు, ముఖాముఖి).

ఈ వివరాలు ధర్మానికి ధర్మసూక్ష్మానికి మధ్య గల వ్యత్యాసాన్ని వివరణాత్మకంగా తెలియజేస్తుంది. ఈ రకంగా మనం గమనిస్తే ఏ వ్యక్తి కూడా స్పష్టంగా ఇది అధర్మం అని చెప్పడానికి ముందు లోతైన బుద్ధితో ఆ చర్యలోని మర్మాన్ని గ్రహించి ధర్మసూక్ష్మాన్ని పట్టుకోకలిగితే అప్పుడు అది ధర్మమా అధర్మమా అన్న విషయం అర్థమవుతుంది.

సద్గురు శ్రీదేవి సెట్టి చలపతిరావు ముఖాముఖిలో ధర్మం తెలిసినవాళ్లు సాధారణంగా చెప్పడానికే వీలవుతుంది. ధర్మసూక్ష్మం అంటే ఎంతో సూక్ష్మమైనటువంటి ధర్మాన్ని గుర్తించగలగాలి. అది చాలా కష్టం అందుకని దానిని ధర్మసూక్ష్మమని వీరు తెలియజేసారు. (చూడు: అనుబంధం -2. సద్గురు శ్రీదేవిసెట్టి చలపతిరావు, ముఖాముఖి).

ప్రాచార్య శలాక రఘునాథ శర్మ ముఖాముఖిలో ధర్మసూక్ష్మం గురించి చెప్తూ రెండు ధర్మాలుంటాయి రెండు ధర్మాలలో అది చేయాలా ఇది చేయాలాఈ ధర్మాన్ని అనుసరిస్తే వేరొక ధర్మానికి ప్రమాణం వస్తుంది. వేరొక ధర్మాన్ని అనుసరిస్తే దీనికి ప్రమాణం వస్తుంది. అటువంటప్పుడు సునిశితమైన దృష్టితో నిర్ణయాన్ని తీసుకోవాలి

అనేటటువంటిది ధర్మ సూక్ష్మమని చెప్పారు. (చూడు: అనుబంధం 2 , ప్రాచార్య శలాకరఘునాథ శర్మ, ముఖాముఖి).

ఈ విషయాలన్నీ కూడా మనం జాగ్రత్తగా గమనిస్తే ధర్మసూక్ష్మం అనేది పేరులోనే ఉంది సూక్ష్మం అని . అది ఎవరికి అంత సామాన్యంగా కనబడదు దానిని మనం మన తెలివితో పరిశోధనాత్మకంగా మాత్రమే ధర్మసూక్ష్మాన్ని తెలుసుకోగలగాలి.

గణపతి సచ్చిదానంద స్వామి ధర్మానికి ధర్మసూక్ష్మానికి మధ్య భేదాలను ఈ విధంగా తెలియజేస్తారు.

''ధర్మము స్థూల సూక్ష్మాలని రెండు రకాలు. ఇందులో సూక్ష్మధర్మం తెలుసుకోవటం చాలా కష్టం. అందుచేత ధర్మనిర్ణయాన్ని ఎవరి బుద్ధికి తోచినట్లుగా వారు చెయ్యకూడదు. మరి ఆధారమేమిటి? అంటే వేదశాస్త్రస్మృతి పురాణాలు. వాటిని ఆధారంగా చేసుకొనే ధర్మనిర్ణయం చెయ్యాలని వీరు వివరించారు.

**( చూడు: అనుబంధం –2, అవధూత గణపతి సచ్చిదానం స్వామి ముఖాముఖి,).**

వీరు చెప్పిన వివరాలను పరిశీలిస్తే ఆపద సమయంలో మనం నిరంతరం ఆచరించే ధర్మాలను ఆపద సమయంలో ఆచరించకపోయినా లేదా ఆధర్మానికి ప్రత్యామ్నాయం ఆలోచించినా దోషం కాదని అటువంటి వాటినే ఆపద్ధర్మాలుగా, ధర్మసూక్ష్మాలుగా చెప్పబడుతుందని అర్థమవుతుంది ఆ ధర్మ సూక్ష్మం అంటే ఏమిటో మహాభారతంలోని కొన్ని కథల ద్వారా ఉదాహరించారు. దీని వలన ధర్మసూక్ష్మాన్ని మరింత గ్రహించవచ్చు.

సామవేదం షణ్ముఖ శర్మ ధర్మం, ధర్మసూక్ష్మం గురించి తెలియజేస్తూ ఈ విధంగా అంటారు.

*''ఇది స్పష్టంగా ధర్మం అని సామాన్యులు కూడా కనిపించేది ధర్మం, సామాన్య దృష్టికి అధర్మం వలె కనబడినప్పటికి, సూక్ష్మంగా ఆలోచిస్తే ధర్మ విరుద్ధం కానిది 'ధర్మ సూక్ష్మమని తెలియజేసారు. (చూడు: అనుబంధం 2,బ్రహ్మశ్రీసామవేదం షణ్ముఖ శర్మ ,ముఖాముఖి,)*

చిర్రావూరి శివ రామ కృష్ణ శర్మ ధర్మం ధర్మసూక్ష్మం గురించి తెలియజేస్తూ ఈ విధంగా అంటారు. ఎక్కువగా ఆచరింపదగిన దానిని పరిస్థితులను అనుసరించి

చేయలేనప్పుడు దానిని కొంచెం తగ్గించి ఎక్కువ శ్రమ లేకుండగా చేసేటటువంటి విధానాన్ని ధర్మసూక్ష్మము అని పిలుస్తారని వీరు తెలియజేసారు.(చూడు: అనుబంధం2 , బ్రహ్మశ్రీ చిర్రావూరి శివరామకృష్ణ శర్మ ముఖాముఖి).

## 2.16. మహాభారతం – పాత్రలు– ధర్మసూక్ష్మాలు:

మహాభారతంలోని కొన్ని సంఘటనలు అధర్మంగా తోచినప్పటికి వాటి అంతరాంతాలలోని విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే ధర్మసూక్ష్మం అవగతమవుతుంది. అటువంటి వాటిలో మొదటిది వ్యాస జననం.

### 2.16.1. **వ్యాస జననం:**

వ్యాసుని జననానికి విష్ణుమూర్తి దగ్గరే బీజం ఏర్పడింది. విష్ణుమూర్తి నుండి ఉద్భవించిన వ్యాసుని అప్పటి పేరు అపాంతరతముడు . తర్వాతి కాలంలో వ్యాసునిగా జన్మించాడు . ఆ వివరాలను క్లుప్తంగా పరిశీలిస్తే

*“ విష్ణుమూర్తి తన మనసులో ఒక ఆలోచన చేస్తాడు. పరమేష్ఠి అయిన బ్రహ్మ ఈ ప్రజా సృష్టి నయితే చేసాడు కాని రాక్షసులు, దైత్యులు , గంధర్వుల సమూహాల భారంతో క్రుంగిపోయిన ఈ భూమి పీడించబడుతుంది. బలవంతులైన దైత్య దానవ రాక్షసులు అనేకులు ఈ భూమి మీద జన్మించి మహత్తర తపస్సు చేసి గొప్ప వరాలు పొందుతారు. అది జరిగితే రాక్షసులు దేవతలను, మహర్షులను, తీవ్రంగా బాధిస్తారు. కాబట్టి ఇప్పుడు నేను భూమిపై క్రమంగా అనేక అవతారాలను ధరించి ఈ భూభారాన్ని తగ్గించాలి అలా చేయడం వలన భూదేవికి భారం తగ్గుతుంది . పాతాళంలో ఆదిశేషుని రూపంలో ఉండి నేనే ఈ భూమిని ధరిస్తున్నాను. నేను ధరించడం వలన ఈ భూమి సంపూర్ణమైన చరాచర జగత్తును ధరిస్తున్నది. అనుకుని విష్ణువు నుండి వెలువడిన ‘భో’ అనే వాక్కును ఉచ్చరించడంతో ‘అపాంతరతముడు’ ఉద్భవించాడు. అతనితో శ్రీహరి వేదాలను వ్యాఖ్యానించడానికి వేదాలను విడిగా చేయాలి. అనగా అపాంతరతముడు స్వాయంభువ మన్వంతరంలో భగవంతుని ఆజ్ఞానుసారం వేద విభాగం చేసాడు. ఆ ముని చేసిన ఈ పనికి చేసిన తపస్సుకు యమ నియమాలకు సంతోషించి శ్రీహరి నీవు పుట్టింటిలో ఉండే*

*ఒక కన్యకు మహర్షి వలన పుత్రునిగా జన్మిస్తావు కానీనుడు అంటే పెళ్లి కాని పిల్లకు కలిగిన కొడుకు) అని నిన్ను లోకం వ్యవహరిస్తుంది. అతడే పరాశర మహర్షికి పుత్రుడుగా వేద వ్యాస మహర్షిగా కీర్తి పొందుతాడు.*

*ద్వాపర కలియుగాల సంధికాలంలో కురువంశ క్షత్రియులు కలుగుతారు. అభిమానధనులైన ఆ రాజులు సమస్త భూమండలంలో విఖ్యాతులు, అవుతారు. నీ వలన పుట్టిన వంశంలో పరస్పర వినాశం కోసం విభేదం ఏర్పడుతుంది. నీ ప్రమేయం లేకుండానే వారి మధ్య యుద్ధం జరుగుతుంది. అని భవిష్యత్తును శ్రీహరి ముందుగానే చెప్పడంతో కురువంశీయులు పుట్టుక వారి మధ్య రాజ్యకాంక్ష, వైరం ఏర్పడి యుద్ధంలో అనేకమంది మరణించడం జరుగుతుంది.*

అంటే భగవంతుని మాటకు ఒక రూపం , కావాలి కాబట్టి విష్ణు సంకల్పం నుండి పుట్టిన ధర్మసంస్థాపనకు, అధర్మనిర్మూలనకు కురు పాండవుల చరిత్ర నిదర్శనంగా నిలిచిందని అర్థమవుతుంది.

### 2.16.2. పరాశర మహర్షి సత్యవతి – ధర్మవిచారణ:

మత్స్యకన్య దాశరాజు కూతురు తరువాత సత్యవతి గా పేరు పొందింది. ఈమెకు పరాశరమహర్షికి మధ్య సంబంధాన్ని ఆంధ్రమహాభారతంలో చెప్పిన విధానంలో కామంతో పరాశరుడు సత్యవతికి దగ్గరయ్యి వ్యాసుని జననానికి కారకుడయ్యాడని చెప్పబడుతుంది. దానికి ఉదాహరణగా

*“ నెంత శాంతులయ్యు నెంత జితేంద్రియు*
*లయ్యు గడు వివక్తమయిన చోట్ల*
*సతుల గోష్ఠి జిత్త చలన మొందురురెందు*
*గాము శక్తి నోర్వగలరె జనులు” (ఆం.భా. ఆది, తృ,ఆ, 44).*

అని వ్రాసారని చెప్తూ దీనికి గల కారణాలను కూడా శ్రీ రామ చంద్ర మూర్తి ఈవిధంగా భావించారు. *“నన్నయ కవీంద్రులు కావ్య రస పోషణ దృష్టితో ఇట్లు కల్పించి వ్రాసారని భావింపవలసి ఉన్నది. కావుననే కేవలమాంధ్ర మహాభారతమును మాత్రమే*

*చదివి మహాభారతంలోని ధర్మాధర్మాలను విమర్శించుట యుక్తము కాదు. ఆంధ్ర మహాభారత కర్తలు మహనీయులు అనుటలో సందియము లేదు. కాని వారికి మహాభారతంలోని ధర్మ సందేహములు వానికి సమాధానమీయదగు ధర్మ సూక్ష్మములపై దృష్టి లేకపోవచ్చును, కథా వస్తువును సంగ్రహంగా తెలుగు పాఠకులకు అంది యుంటే వారి కర్తవ్యముగా భావించిరి. ఆంధ్రభాషాసౌకుమార్యమును, కావ్య రసపోషణమునను, పాత్ర చిత్రణమునను వారు చూపిన శ్రద్ధ ధర్మ సూక్ష్మ విషయములపై చూపలేదనవలసి వచ్చును. మహాభారతమున వివాదాస్పదములైన అనేక సందర్భములలోని ముఖ్యముగా సభాపర్వమునను ఆంధ్రమున చాలా సంగ్రహీతమైనది కొన్ని చోట్ల వ్యాస హృదయమునకు ఆంధ్రీకరణమున భంగము వాటిల్లినది . (శ్రీ రామచంద్ర మూర్తి, ఎం.జి.పి., ఆంధ్ర మహాభారతంలో ధర్మసూక్ష్మములు, పుట:32.) అని తెలియజేస్తారు.*

ఈ వాక్యాలన్నీ విమర్శనాత్మకంగానే ఉన్నాయి మహర్షుల మనోభావాలను పూర్తిగా అర్ధంచేసుకోకపోవడం వలన ఇటువంటి సందేహాలు ఏర్పడుతూ ఉంటాయి. ఒక విషయాన్ని అనేక మంది వ్యక్తులు వారి మనసులో ఏర్పడిన భావాలను బట్టి అనేక రకాలుగా వర్ణిస్తుంటారు. ఇప్పటి కాలంలో కూడా మంచి వారికి లోకమంతా మంచిగాను, చెడ్డవారికి లోకమంతా చెడ్డగాను అనిపిస్తూ ఉంటుంది. ఆయా వ్యక్తుల వ్యక్తిత్వాన్ని బట్టి వారి అభిప్రాయాలను మార్చుకుంటూ ఉంటారు. తెలుగుకు అధిక ప్రాధాన్యమిచ్చి భావితరాల వారికి సాహిత్యం పట్ల ఒక ప్రత్యేకఅనుభూతిని ఆనందాన్ని కలిగించిన వారు కవిత్రయం వారు. వారు సాహిత్య దృష్టితో, కావ్య రసపోషణకు  కొన్ని సంఘటనలకు ఉపయోగించే పదాలు కొంచెం ఇబ్బంది కలగవచ్చు అంతమాత్రం చేత వారి వ్యక్తిత్వాన్ని పూర్తిగా విమర్శించలేము అని నాకు అర్థమవుతుంది.

### 2.16.3. పరాశర మహర్షి సత్యవతి –సత్యాన్వేషణ:

పరాశర మహర్షి, సత్యవతి కలయిక గురించి విమర్శలు వస్తున్న నేపథ్యంలో వారి సంగమం గురించి అంతర్లీనంగా దాగి ఉన్న ఆధ్యాత్మిక రహస్యాన్ని దేవిసెట్టి చలపతిరావు ఈ విధంగా వర్ణిస్తారు.

“ ‘**సత్యవతి**’ అంటే సత్యం కోసం పరమాత్మ కోసం పరితపించే సాధకుడు అని ‘**దాశరాజు**’ అంటే దశేంద్రియాలను స్వాధీనములో పెట్టుకోవడం ఇంద్రియ నిగ్రహం అని‘యమునా నది పై నావ నడపడం’ అంటే యమునా నది నీరు నలుపు, నలుపు తమో గుణానికి చిహ్నం, నావ నడపటం అంటే దాటటం, కనుక తమోగుణాన్ని అధిగమించడం అని‘

‘**పరాశరుడు**’ పర అంటే పరమాత్మ శరం అంటే బాణం కనుక పరాశరుడు అంటే పరమాత్మ నుండి విడువబడిన బాణం అని అతడే భగవత్స్వరూపుడైన సద్గురువు.

‘**నీతో సంగమించాలి అని చెప్పడం**’ అంటే సాధకుణ్ణి శిష్యుడుగా చేసుకుని సద్గురువు జ్ఞాన బోధ చెయ్యాలనుకోవడం అని

‘**చుట్టూ అందరూ చూస్తున్నారు కదా** ’ అనడం అంటే చుట్టూ ఎన్నో విషయవస్తువులు ప్రాపంచిక భోగాలు భ్రమలు కల్పిస్తున్నాయి కదా మోహ పెడుతున్నాయి కదా అని

‘**మాయా తిమిరాన్ని సృష్టించడం**’ అంటే విషయ వస్తువులపై మోహాన్ని పోగొట్టేందుకు వైరాగ్య బోధ చెయ్యడం అని ,

కన్యత్వం దూషితం అయితే తండ్రి వద్దకు ఎలా వెళ్ళగలను అంటే ఈ జ్ఞాన బోధతో నా కర్తవ్యాన్ని విడిచిపెట్టాల్సి వస్తే తండ్రి వద్దకెలా వెళ్ళగలను? తండ్రి ఆనతిని ధిక్కరించినట్లు అవుతుంది కదా అని

‘**నీ కన్యత్వం దూషితం కాదు**’ అంటే నీ కర్తవ్యాన్ని యథావిధిగా నెరవేర్చుకోవచ్చు అని

‘మత్స్య వాసన పోయి సుగంధ వాసన కలిగేటట్లు అనుగ్రహించడం. అంటే గత జన్మలలో సంపాదించుకున్న దుర్వాసనల (అసద్ వాసనల)ను నశింపచేసి సద్ వాసనలు కలిగేటట్లు అనుగ్రహించడం అని.

‘**పరాశరుడు సత్యవతితో కలియటం**’ అంటే సద్గురువు అన్ని అర్హతలు సంపాదించిన శిష్యునకు ఆత్మజ్ఞానాన్ని బోధించడం అని.

*'ఎప్పుడు స్మరిస్తే అప్పుడు తక్షణమే నీ ఎదురుగా ఉంటాను అని తల్లికి వ్యాసుడు చెప్పడం. '* *అంటే గురుబోధ ద్వారా లభించిన జ్ఞానం విని ఊరుకుంటే శిష్యునిలో నిలువదు. మళ్లీ మననం చేసుకుంటూ ఉంటేనే ఆ జ్ఞానం స్థిరంగా నిలుస్తుంది. అని ఇప్పుడు మొత్తం కథను ఆధ్యాత్మికంగా మలచుకుంటే ఇలా అర్థమవుతుంది. ( చలపతిరావు, దేవిసెట్టి, వ్యాస మహాభారతం, విశేషములు, విశ్లేషణలు,పుట:39.)*

ఈ వివరాలను పరిశీలిస్తే పరాశరుడు, సత్యవతి కలయిక సాధారణమైనది కాదు అది అనేక ఆధ్యాత్మిక, తాత్త్విక భావాలకు నిదర్శనం గా ఉంది అనే విషయం ఈ విశ్లేషణలో అర్థమవుతుంది. ఒక భావి కథకు మార్గదర్శకమైన పరాశరుని , సత్యవతి సంగమం దాని వలన కలిగిన ఫలితం దేవిసెట్టి చలపతిరావు గురువు శిష్యున్ని ఏ విధంగా కార్యసాధకుడిని చేస్తాడో ఆ విధంగా వారి కలయిక జరిగింది అని లోతైన విషయాలను ప్రస్తావించాడు. యుగాన్ని బట్టి ధర్మాలు మార్పుచెందుతూ ఉంటాయి. అప్పటికాలంలో అనుసరించిన ధర్మాలు నేటి కాలంలో యథాతథంగా అనుసరించడానికి కావలసిన వాతావరణం , పరిస్థితులు అనుకూలించవు.

### 2.16.4 .ధృతరాష్ట్రుడు, పాండురాజు– విదురుడు– జననం–ధర్మసూక్ష్మం:

వీరి యొక్క పుట్టుక గురించి జరిగిన చర్చను గమనించినట్లైతే *'' విచిత్ర వీర్యుడు మరణించడంతో కుటుంబంలో వంశాభివృద్ధి జరగలేదని సత్యవతి భీష్మున్ని అంబికా అంబాలిక యందు సంతానాన్ని కనమంటుంది. ఇది ధర్మబద్ధమే అని చెప్తుంది. కాని భీష్ముడు తన ప్రతిజ్ఞను వెనుకకు తిప్పను సత్యాన్ని నేను ఎప్పుడూ విడిచి పెట్టలేనని చెప్తాడు. కుటుంబ వృద్ధి జరగడానికి భీష్ముడు ధర్మోపాయాన్ని తెలియజేస్తాడు. గుణవంతులయిన బ్రాహ్మణుని ఎవనికైనా ధనమిచ్చి నియమించు ఆయన విచిత్ర వీర్యుని భార్యల యందు సంతానాన్ని కంటాడు. అని తెలియజేస్తాడు. సత్యవతి తన జన్మ వృత్తాంతాన్ని , పరాశరుని యందు గర్భం ధరించినా కన్యత్వం కోల్పోకుండా వరాన్ని పొందిన విషయాన్ని వ్యాస జననం గురించి చెప్పి అతని ద్వారా కాశిరాజు కూతుళ్లు అంబిక, అంబాలిక లయందు వ్యాసుడు పుత్ర సంతానాన్ని కలిగింపజేస్తే బాగుంటుందని*

*నేను అభిప్రాయపడుతున్నాను అనగానే భీష్ముడు దానికి అంగీకరిస్తాడు. ( సంస్కృత భారతం(ఆది పర్వం), రామకృష్ణ మూర్తి , తిప్పాభట్ల , శ్రీనివాసులు,సూరం, (సంపాదకులు).పుట: 387,)*

ఒక వంశం నశించిపోతున్నప్పుడు ఈ ధర్మం ఆపద్ధర్మంగా చెప్పబడుతుంది. వ్యాసుడు అంబిక, అంబాలికకు పుత్ర సంతానం కలిగించడం అనేది కామంతో జరిగిన కార్యం కాదు. వంశాబివృద్ధి కోసం జరిగిన కార్యం అది కూడా తల్లి కోరిక మేరకు వ్యాసుడు కురువంశాభివృద్ధి గావించాడు. అంబిక వ్యాసుని చూసి భయంతో కళ్ళు మూసుకోవడంతో గ్రుడ్డివాడైన ధృతరాష్ట్రుడు పుడతాడు, అంబాలిక వ్యాసుని చూసి వణికపోవడంతో పాండువర్ణం కలిగిన పాండురాజు జన్మిస్తాడు. మరలా తల్లి ప్రోత్సాహంతో వ్యాసుడు అంబిక దగ్గరకు వెళ్తే ఆమె తన దాసి ని నియోగిస్తుంది . ఆమె వ్యాసునికి సపర్యలు చేసి ఇష్ట పూర్వకంగా కలవడంతో ఆమెకు ధర్మాత్ముడైన విదురుడు పుడతాడు.

ఈ పద్ధతిలో కుమారులను పొందడం అనేది నేటి కాలంలో ని చాలామందికి అధర్మంగా అనిపిస్తుంది. దాని యొక్క లోతులను పరిశీలిస్తే ధర్మసూక్ష్మం బోధపడుతుంది. దేవి సెట్టి చలపతిరావు మనుధర్మ శాస్త్రములోని కొన్ని అంశాలను ఉదాహరణగా చూపుతూ ధృతరాష్ట్ర, పాండురాజు, విదురుల పుట్టిన విధానంలో ఏర్పడిన ధర్మ సంకటాలను తీర్చే ప్రయత్నం చేసాడు ఆ విషయాలను ఈ క్రింది విధంగా ఉన్నాయి.

### 2.16.5. మనుధర్మ శాస్త్రం చెప్పిన ధర్మాలు:

మనుధర్మ శాస్త్రం లోని విషయాలు,

1. *స్త్రీలు తమంతట తాముగా సంతానాన్ని పొందరాదు. పెద్దలు, గురుజనుల యొక్క అనుమతితో వారి యొక్క నియోగంతో మాత్రమే జరగవలసిన కార్యం ఇది.*
2. *పురుషుణ్ని నిర్ణయించడంలో కూడా పెద్దల ఇష్టమే కాని, ఆ స్త్రీ యొక్క ఇష్టాయిష్టాలేమి ఉండవు?*

*3. నియోగ విధిని పాటించవలసిన పురుషుడు శరీరమునందంతటా నెయ్యి పూసుకోవాలి. దాని వల్ల శరీర రూప సౌందర్యం మరుగున పడుతుంది. కామాన్ని ప్రేరేపించే చర్యలుండవు.*

*4. సంయోగ సమయంలో మాట్లాడరాదు. మాటల వల్ల పరిచయాలు  సంబంధం కొనసాగించాలనే నిర్ణయాలు జరగవచ్చు. కనుక మౌనంగా ఉండాలి.*

*5. నియోగం ఒక్క పుత్రుని కొరకే వారంతట వారే మరొక పుత్రుని కొరకు ప్రయత్నించరాదు.*

*6. ఒక్కసారి కలయికతోనే గర్భాదానం చేయగల తపశ్శక్తి సంపన్నుడైన మహాత్ముని నియోగించాలి.*

*7. స్త్రీ పురుషులిరువురూ కామపరవశులు కాకుండా కర్తవ్యమునందే బుద్ధిని నిలిపేయుంచాలి.*

*8. సంయోగ సమయంలో మనస్సు చలించకుండా మనోనిగ్రహం ఉండాలి. ఇంద్రియాలు అనాసక్తంగా ఇంద్రియ నిగ్రహంతో ఉండాలి.*

*9. సంయోగానంతరం ఎప్పుడైనా ఆ స్త్రీ పురుషులు ఎదురుపడితే స్త్రీ ఆ పురుషుని తండ్రిలాగా, పురుషుడు ఈ స్త్రీని కోడలిగా చూడగల మనోనిగ్రహం పవిత్రత వారిలో ఉండాలి. ఇలా కత్తి మీద సాములాంటిది ఈ నియోగ విధి. సామాన్యులకు అసాధ్యమైనది.( చలపతిరావు దేవిసెట్టి, వ్యాస మహాభారతం విశేషములు, విశ్లేషణలు: 107.)*

సంతానాన్ని పొందే విషయంలో ఈ కఠిన నియమాలు పాటించగలిగిన వారు మాత్రమే గర్భాదానం చేయడానికి అర్హులని అర్థమవుతుంది.  అది కూడా పెద్దల, గురువుల అనుమతితోనే జరగాలి అని చెప్పడం వలన ఇతరులతో సంతానం కలగడానికి మాత్రమే ఆ

స్త్రీ సన్నద్ధమైనప్పుడు ఆ స్త్రీ కూడా కామ వాంఛతో సమాగమం పొందకూడదు సంతానాన్ని ప్రసాదించే వ్యక్తి కూడా అటువంటి కామానికి గురికాకూడదు అనే విషయాలు పై చర్చలో తెలుస్తుంది.

సాధారణంగా భార్యా భర్తలు సంతానాన్ని కనే క్రమంలో వారి మధ్య అత్యంత అనురాగం, ప్రేమ, ధర్మ బద్ధమైన శృంగార వాంఛ కలిగి సత్సంతానాన్ని పొందుతారు. ఇక్కడ సంతానం కొరకు ఇతరులను నియమించేటప్పుడు కొన్ని నియమాలను ఏర్పరచారు శృంగార భావన అనేది లేకపోతే సంతానం కలగడానికి ఆస్కారం ఉంటుందా అనే అనుమానం కొందరికి కలగవచ్చు. దానికి నా అభిప్రాయం ఏమిటంటే తపశ్శక్తి కలిగిన మహాత్ములు మాత్రమే ఇంద్రియ నిగ్రహం కలిగిన వారు వారు అన్నింటి యందు అధికమైన ఆసక్తిని చూపరు ఏ పనిని ప్రారంభించినా అదే ప్రపంచంగా గడపరు. అటువంటి నిరాసక్తత, దేహం పట్ల, అభిమానం లేకపోవడం వలన వారు కామ వశులు కారు, ఎవరి మీద అనురక్తిని చూపరు తాము తను జీవిస్తున్న ప్రపంచానికి ఎటువంటి సంబంధం లేదు అన్నట్లు  సర్వ సుఖాలను త్యజించి సంచారం చేస్తూ జ్ఞాన అన్వేషణ కోసం నిరంతరం తపిస్తూ ఉన్నవారికి కామ భోగాలను అనుభవించాలనే దాని పైన కాని సంసారం పైన కాని ఆసక్తి ఉండదు,  విరక్తి భావంతో ఉంటారు. అటువంటి వారిని మాత్రమే పెద్దలు నిర్ణయించి ఆ స్త్రీ దగ్గరకు పంపుతారు.  వారే అర్హులు అనే విషయం పై మాటల్లో వ్యక్తమవుతుంది. ఇక్కడ వ్యాసులు వారు చేసిన చర్యలు కూడా ఎటువంటివి అంటే తామరాకుపై నీటి బొట్టు వంటిది. ఈ నీరు ఏవిధంగా అంటి అంటనట్లు తామరాకుపై తేలియాడుతుందో మహాత్ముల హృదయాలు కూడా అలానే ఉంటాయి.

*‘‘ఈనాటి కాలానికి అనుగుణంగా మనం కొన్ని ఉదాహరణలను గమనించవచ్చు. ఆమ్రపాలి గౌతమ బుద్ధుని ని మనసులో కోరుకుని తమ ఇంటికి రమ్మనమని ఇష్టపడితే సర్వభోగాలను సమకూరుస్తానని చెప్తుంది. అంతటి సౌందర్య వతి అడిగిన వెంటనే గౌతముడు చలించలేదు. చిరునవ్వుతో ప్రతి మానవునికి చావు తప్పడం లేదు ఆ కారణాన్ని ప్రకృతిలోని రహస్యాలను తెలుసుకోవాలనేదే తన ధ్యేయమని ఆ అన్వేషణలో ఉన్నానని*

*చెపుతాడు. రాగం, భోగం కంటే మోక్ష కారణాన్ని అన్వేషిస్తున్నానని వివరిస్తాడు. ఈ మాటలతో ఆమ్రపాలి తన పొరపాటును తెలుసుకుంటుంది సిద్ధార్థుని పాదాల మీద పడి క్షమించమని వేడుకుంటుంది.'' (వేంకటేశ్వర రావు, దార్ల, జ్ఞానానంద కవి ఆమ్రపాలి పరిశీలన , పుట:16).*

ఈ వివరాలు అన్నీ మహాత్ముల యొక్క మనోప్రవృత్తిని తెలియజేస్తాయి. వారి కనుల ముందు ఎంతటి ఆకర్షణీయమైన వస్తువు ఉన్నప్పటికి చలించరు. మనసును తమ అధీనంలోనే ఉంచుకుంటారని అర్థమవుతుంది.

మహాభారతంలో కూడా సత్యవతి, సకల ధర్మాలు తెలిసిన భీష్మునితో తన జన్మ వృత్తాంతాన్ని తెలిపి వ్యాసుని ద్వారా అంబిక,అంబాలిక లద్వారా సంతానాన్ని పొందే ఏర్పాటు చేయించిందని నా అభిప్రాయం.

**2.16.6. ఏకలవ్యుడు – ధర్మవిచారణ:**

మహాభారతంలో ఏకలవ్యుని పాత్ర మీద భిన్నాభిప్రాయాలు ఉన్నాయి ముఖ్యంగా ఏకలవ్యుని ఏకాగ్రతను గురుభక్తిని గ్రహించకుండా ఏకలవ్యునికి ద్రోణుడు అన్యాయం చేసాడనే వాదనలు ఎక్కువవుతున్న సందర్భంలో ప్రముఖులు ఆ ఏకలవ్యుని పాత్ర మీద ప్రత్యేకమైన దృష్టిని కేంద్రీకరించి నిజనిజాలను ప్రామాణికమైన ఆధారాలతో వివరించి చెప్పారు వాటిలో కొందరి అభిప్రాయాలను పరిశిలిద్దాం.

సామవేదం షణ్ముఖ శర్మ **'ఇది యదార్థ మహాభారతం'** పుస్తకంలో ఏకలవ్యుని పాత్ర గురించి ఈ విధంగా తెలియజేసారు. *ఈ '' ఏకలవ్యుడు క్రోధ వసువులు అనే రాక్షస గణాలకు చెందిన వాడు. ఏకలవ్యుడు నిషాదరాజయిన హిరణ్య ధనుష్యుడు అనే వాడి కొడుకు బోయవాడు, పిట్టల్ని, జంతువుల్ని వేటాడే వాళ్ళకి ఉత్తమమైన ధనుర్విద్య నేర్పకూడదన్నది ఆనాటి శాస్త్ర నియమం. మంత్రపూర్వకమైన శాస్త్రాలు నేర్పాలంటే కొన్ని సంస్కారాలు కావాలి. పైగా పాలనా బాధ్యత ఉన్నవాళ్ళకి నేర్పే విద్యల్ని అవి లేనివాళ్ళకి నేర్పకూడదు కనుక అప్పటి కాలాన్ని బట్టి ఏకలవ్యుడి పాత్రని చూడాలి. ''( షణ్ముఖ శర్మ, సామవేదం. ఇది యదార్థ మహాభారతం' పుట:96.).*

ఈ విషయాలను పరిశీలించేముందు నిషాదులు ఎవరు అనే విషయాన్ని కూడా మనం గుర్తించాలి. బోయవాడు, అడవులలో నివసించే వారు అనే విషయాన్ని ప్రధానంగా గుర్తు పెట్టుకోవాలి. ‘‘ఈ నిషాదులనే కిరాతుల అని కూడా అంటారు. వీరు ఉభయ చరులు అంటే వీరు అడవులలోనూ వాటికి ఆనుకుని ఉన్న మైదాన ప్రాంతాలలోనూ జీవించగలరు. విలు విద్య, బాణాలు, ఇనుము ఉక్కుతో ఆయుధాలు, ఇతర సామగ్రి తయారు చేయడంలో నేర్పరులు.( https://tharjani.in/whose-is-this-nishada-tribes/), నవంబర్ 11, 2020.

ఈ విషయాన్ని బట్టి అడవులలో ఈ నిషాదులు జీవనాన్ని గడుపుతున్నారని తెలుస్తుంది. అడవులలో నివసించే వారు తమ ఆత్మ రక్షణ కోసం కొన్ని విద్యలు నేర్చుకోవడం, ఆయుధాలు తయారు చేయడం, వంటివి చేస్తూ అవసరమైన వారికి వాటిని అందజేస్తూ వారి జీవన విధానాన్ని కొనసాగిస్తున్నారు. అనే విషయం స్పష్టమవుతుంది. ఇది వారికున్న పరిధి ఆ పరిధిని దాటి వెళ్ళే ప్రయత్నం చేసాడు. ఏకలవ్యుడు ద్రోణాచార్యుని వద్ద ధనుర్విద్యను నేర్చుకోవాలి అనుకున్నాడు ఆటవిక జీవనాన్ని గడుపుతున్న వారికి విద్య నేర్పితే ప్రమాదమని ముందుగానే భవిష్యత్ లో ఏమి జరుగుతుందో ఊహించి విద్యను నేర్పడం కుదరదు అన్నాడు. అయినా సరే పట్టుదలతో గురువు ప్రతిమను తయారు చేసుకుని ఏకాగ్రతతో విద్యను అభ్యసించాడు. మంచి ధనుర్విద్యను సంపాదించాడు. కాని తర్వాత ఏమైంది ఒక కుక్క తనను చూసి మొరుగుతుందని అది నోరు తెరవడానికి మూయడానికి కూడా వీలుకానంతగా దాని నోటి నిండా బాణాలు ప్రయోగించాడు. అది కుక్క గట్టిగా అరిస్తే పారిపోతుంది. లేదా తన దగ్గర ఆయుధాలు ఉన్నాయి కనుక బెదిరిస్తే పారిపోతుంది. కాని అలా జరగలేదు తనకు వచ్చిన ధనుర్విద్యా నైపుణ్యాన్ని నోరు లేని మూగ జీవిపై ప్రయోగించాడు. పైగా ధర్మ విచారణ చేసే నైపుణ్యం లేని వాడు. అలా ఉండి ఉంటే క్రూరంగా ప్రాణిని హింసించేవాడు కాదు. ఇలాంటి వారి దగ్గర ధనుర్విద్య ఉంటే ప్రమాదం కనుక గురు దక్షిణ గా బొటన వేలిని ఇమ్మన్నాడు ద్రోణుడు ఏకలవ్యుడు ఏమాత్రం ఆలోచించకుండా, క్షణ కాలంలో అడిగిన వెంటనే తన బొటన వేలును

సంతోషంతో ఇచ్చాడు. ఇలా ఇవ్వడానికి ఏకలవ్యుని మనసులో ఒక సంఘర్షణ జరుగుండాలి చేతిలో విద్య ఉంది దీనిని ఎలా ఉపయోగించాలో తనకు తెలిసిఉండక పోవచ్చు దాని ద్వారా ఎటువంటి ప్రమాదాలు జరుగుతాయో ఎవరి మీద అంటే వారి మీద ప్రయోగించకూడదు కదా. ఇటువంటి జ్ఞానాన్ని నేను సంపాదించి కూడా వృథా అయిపోయిందే అనే ఆలోచన ఏకలవ్యుడికి ఉండి ఉంటే దానికి సమాధానంగా ద్రోణుని గురు దక్షిణ సరి అయినదే అవుతుంది. అతను అలా గురుదక్షిణగా బొటన వేలు ను స్వీకరించడం ద్వారా ఏకలవ్యుడు బాణ ప్రయోగాన్ని సరిగ్గా ప్రదర్శించలేడు దాని కారణంగా అతని ఆవేశం తో చేసే పనులు అదుపులోకి వచ్చే అవకాశం కూడా ఉండిఉండవచ్చు. ఇది ఒక రకంగా అతనిలో మార్పు కోసం కావచ్చని భావించవచ్చు కదా అని నా అభిప్రాయం.

ఒక సంఘటనను ఎన్ని కోణాల నుండి ఆలోచించినా చివరకు వారికి లభించే సమాధానం సమాజాన్ని మేల్కొలిపే విధంగా ఉండాలి కాని అనుమానాలకు అపార్థాలకు దారితీయకూడదు. క్షుణ్ణంగా ఆలోచించాలి. సామవేదం షణ్ముఖ శర్మ చెప్పిన విధానంలో కూడా ఆనాటి కాలపు పరిస్థితులకు అనుగుణంగానే ఏకలవ్యుని పాత్ర ను చూడాలి ఆ సమయానికి ఆ కాలపు సిద్ధాంతాలకు , నియమాలకు కట్టుబడి ఉండాలి దానిని అతిక్రమిస్తే ప్రమాదం అనే విషయాన్ని గుర్తించినవారు విమర్శల జోలికి పోరు అని నా అభిప్రాయం.

### 2.16.7. ద్రౌపది – ధర్మ విచారణ:

మహాభారతంలో పతివ్రతా శిరోమణి ద్రౌపది ఆమె యజ్ఞకుండం నుండి పుట్టడం చేత యాజ్ఞసేని, నీలపు వర్ణం కలిగి ఉండడం చేత కృష్ణ అని ఆమె కు మరో పేరు సార్థకమయ్యింది. ద్రౌపది పుట్టుకే ఒక పవిత్రతను గుర్తుచేస్తుంది. యజ్ఞకుండం అంటే అగ్నే కదా అగ్నిని తాకిన వారు ఎటువంటి వారైనా పవిత్రులుగా మారుతారు అటువంటిది అగ్ని నుండే ద్రౌపది ఆవిర్భవించింది అంటే ఆమె ఎప్పుడూ పవిత్రంగానే ఉంటుంది. ద్రౌపది గురించిన విమర్శలు ఎన్ని వచ్చినప్పటికి అవి ఆమె వ్యక్తిత్వపు ఛాయలను కూడా స్పృశించలేవు. ద్రౌపది యొక్క గుణం , పాతివ్రత్యం అటువంటిది.

నేటి కాలంలో ద్రౌపది గురించిన అనేక సందేహాలు, అపోహాలు ఉన్నాయి వాటిలో కొన్నింటిని పరిశీలిస్తున్నాను.

ద్రౌపది పూర్వ జన్మ వృత్తాంతము తెలిసిన వారు ద్రౌపది ఐదుగురు భర్తలును పొందిన దాని గురించి విమర్శించరు. ద్రుపదుడు కూడా మొదట తన కూతురు ఐదు మందితో కలిసి ఉండడం కొంత ఆందోళనకు గురి చేసింది. అందుకే ద్రుపదుడు తన వేదనను వ్యాసునితో ఇలా అంటాడు.

*" అధర్మో2యం మమ మతః విరుద్ధో లోక వేదయోః*

*న హ్యేకా విద్యతే పత్నీ బహూనాం ద్విజ సత్తమ" (సంస్కృభారతం, ఆదిపర్వం, 196 వ అధ్యాయం, 7 వ శ్లోకం).*

ద్రుపదుడు చెప్తున్నాడు నాకు ఇది అధర్మంగా కనిపిస్తున్నది అంతేకాక ఇది లోక వేదాలకు విరుద్ధం చాలామంది పురుషులకు ఒకతే భార్య కావడం లోకంలో ఉండదని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తాడు దానికి దృష్ట ద్యుమ్నుడు కూడా తన సందేహాన్ని వ్యాసులు వారే తీర్చగలరని చెప్తూ ధర్మ స్వరూపాన్ని గురించి వివరిస్తాడు.

*"ధర్మ స్వరూపమే అత్యంత సూక్ష్మం దాని గతిని ఎవరూ తెలుసుకోలేరు. మా వంటి వారికి ధర్మాధర్మ నిశ్చయం అశక్యం, అందువలన మేము ఇటువంటి వ్యవహారాలను అంగీకరించలేకపోతున్నాము ద్రౌపది భార్య కావడం ఏ విధంగానూ కుదరదు అంటాడు. ((సంస్కృభారతం, ఆదిపర్వం, 196 వ అధ్యాయం, ).*

ఇక్కడ ద్రుపదునికి అతని పుత్రుడు దృష్టద్యుమ్నుకి కూడా ధర్మసంకటం ఏర్పడింది వారు ద్రౌపది వివాహాన్ని అధర్మంగానే భావించారు కాని దానియొక్క ధర్మ సూక్ష్మాన్ని గ్రహించే శక్తి లేక వారు అచేతనులయ్యారు. వ్యాసుడు  తర్వాత ద్రౌపది పూర్వ జన్మ వృత్తాంతాన్ని తెలియజేసి ఆ ధర్మ సూక్ష్మాన్ని ద్రుపదునికి మాత్రమే తెలియజేస్తాడు.

### 2.16.8. ద్రౌపది  పూర్వ జన్మ వృత్తాంతం:

వ్యాసుడు పాండవుల పూర్వ జన్మ వృత్తాంతాన్ని ద్రుపదునికి వివరించాడు. శివుని ఆజ్ఞ ప్రకారంగానే ఇంద్రస్వరూపులు పాండవులుగా జన్మిస్తారు. పాండవుల పూర్వపు

దేహాలను వ్యాసుడు ద్రుపదునికి దివ్య నేత్రాలను అనుగ్రహించి దర్శించేపస్తాడు. నలుగురు పాండవుల పూర్వరూపాలను , ఇంద్రాత్మజుడైన అర్జునుని రూపాన్ని చూచి ప్రసన్నుడు అవుతాడు ద్రుపదుడు ఆ మాయతో ఆశ్చర్యాన్ని పొందుతాడు. ద్రౌపది పూర్వం కోరిన వరం గురించి వ్యాసుడు చెప్తూ  ఒకానొకప్పుడు తపోవనంలో ఒక ఋషికి ఒక కుమార్తె ఉంది ఆమె సౌందర్యరాశి అయినా వివాహం కుదరలేదు. ఆమె కఠినమైన తపస్సుచే శంకరుని మెప్పించింది.ఈశ్వరుడు సంతసించి ప్రత్యక్షమై వరం కోరుకొమ్మని ఆమెతో అన్నాడు. శంకరుడు మాట విని ఆమె పదేపదే అన్ని గుణాలు కలిగిన పతిని వరంగా కోరింది. సంతోషంతో శివుడు నీకు ఐదుగురు భర్తలు ఉంటారని ఆమె  కోరిన వరాన్నిచ్చాడు. ఆమె శంకరుని బతిమాలుతూ తిరిగి సర్వగుణ సంపన్నుడైన ఒక భర్త చాలు ఒక్కడు చాలు అనగా శివుడు ఆమెతో నీవు తొందరలో అయిదుసార్లు భర్త కావాలని కోరుకున్నావు అది అలాగే జరుగుతుంది నీవు మరు జన్మలో ఈ వరాన్ని పొందుతావు అని చెప్తాడు. ఆ ఋషి కన్యే ద్రౌపదిగా జన్మించింది. ఐదుగురు వీరులకు పత్నిగా పూర్వమే నిర్ణయించబడింది. ఈ స్వర్గలక్ష్మే నీకు యజ్ఞ శాలలో పాండవ పత్నిగా జన్మించింది. ఆమె ఘోరమైన తపస్సు చేసి నీకు కుమార్తె గా వచ్చింది  స్వయంగా ఈమెను దేవపత్నిగా బ్రహ్మ తలపెట్టాడు ఇది విన్న నీవు నీ ఇష్టం వచ్చినట్లు చేయమని చెప్తాడు.

అది విన్న ద్రుపదుడు అంతా శివ సంకల్పంగా అర్థం చేసుకుంటాడు. కారణ జన్ములు ఏదో ఒక కార్య నిమిత్తం లోక కల్యాణం కోసం జన్మిస్తారు.  విధాత విధానాన్ని ఎదిరించగల శక్తి ఎవరికి లేదు అయిదుగురితో వివాహమే ఉచితమని అదృష్టాన్ని ఎవ్వరూ తప్పించలేరు, స్వయంగా ప్రయాసపడి ఏమి చేయలేరు. శంకరుని వరం లో దాగిన రహస్యం పరమాత్మకే తెలుసు శంకరుని అనుశాసనమే అయితే ధర్మాధర్మ ప్రసక్తి నా అపరాధమూ లేవు ఈమె వీరిదే కావున విధివిధానంగా పాండవులు ఈమెను పరిగ్రహిస్తారు. (**సంస్కృభారతం, ఆదిపర్వం, 196,197 వ అధ్యాయం, పుట:663,664,665**).

ఈ విధంగా  వ్యాసుడు ద్రుపదునికి ధర్మసూక్ష్మాలను తెలియజేస్తాడు. పంచపాండవులతో విశేషంగా వివాహాన్ని జరిపిస్తారు.

### 2.18.9. ద్రౌపది వివాహ చర్చ:

ద్రౌపది వివాహ విషయమై శ్రీరామ చంద్ర మూర్తి, 'ఆంధ్రమహాభారతములో ధర్మసూక్ష్మములు ' గ్రంథంలో ద్రౌపది పూర్వ వృత్తాంతాన్ని ఈ విధంగా తెలియజేస్తాడు. గౌతమ బ్రాహ్మణమునందు, ఐతరేయ బ్రాహ్మణమునందు శ్రుతి యందు ఈ విధముగా ఉన్నది.

'' తస్మాత్ ఏకస్య బహుభ్యో జాయా న భవంతి

వైకస్యా బహవః పతయః

*ఈ విధంగానే ధర్మశాస్త్రములందును కలదు మరలా ఇట్టి ద్రౌపది దేవి కులటగాక సుప్రసిద్ధ స్మరణీయురాలు ఎలా అయ్యిందని గొప్ప సందేహము , దీనికి సమాధానము తెలియవలెనన్న ద్రౌపది పూర్వజన్మ వృత్తాంతము తెలుసుకోవాలి. ద్రౌపది సామాన్య కన్య కాదు. త్రేతాయుగమున రావణ సంహారార్థము కల్పింపబడిన మాయాశక్తి రావణ సంహారానంతర మా మాయా శక్తి రామునిచేత విడువబడి ఒక మహామునికి నాలాయనయై జన్మించి అష్టసిద్ధులు కలిగిన మౌద్గల్యుడను ఒక మహామునిని పెండ్లి ఆడెను. ఆ మహర్షి ఆమె పాతివ్రత్యమునకు పరిక్షించదలచి కుష్ఠ వ్యాధి పీడితునిగా, మహా కోపిష్ఠివలె చరిస్తూ సేవ చేసుకుంటున్నాడు ఒకనాడు అతని వ్రేలు ఊడ భోజనం నందు పడినది నాలాయనయు దానిని అసహ్యించుకోకుండా ఆ ఊడిన వ్రేలును తీసి ప్రక్కన ఉంచి మిగిలిన అన్నమును తిన్నది. ఆమె పాతివ్రత్యమునకు ఆ ముని సంతసించి ఆమెను ఏకరూపములోను అయిదు రూపములతోనూ రమించి సంతోషపెట్టెను. ఇట్లుండ కొంతకాలముకు ఆతడు బ్రహ్మనిష్ఠాసక్తుడై పోవుచుండగా వారించి తన మనోరథమింకను తీరలేదని ఆ మునిని నిలువరించగా అతడు కోపించి ఓ నాలాయనీ నీవు భూలోకమున ద్రుపదుని యజ్ఞకుండమున జన్మిస్తావు అప్పుడు నీకు ఐదుగురు భర్తలుకలుగగలరని యానతిచ్చి వెళ్ళిపోయాడు. ఆ నాలాయని పరమేశ్వరుని గూర్చి తీవ్రమైన తపస్సు చేసెను.*

*ఆమె తపమునకు మెచ్చి పరమేశ్వరుడు నీవు పై జన్మములో ఉత్తమ స్త్రీవై జన్మిస్తావు. నీకు ఇంద్ర సమాన స్వరూపులు , మహేంద్ర విక్రములు లోక విఖ్యాతులును అగు ఐదుగురు భర్తలు కలుగుదురని వరమిచ్చెను. అప్పుడు ఆమె ఈశ్వరునితో నేను ఒక భర్తనే కోరియున్నాను కదా ఐదుగురు భర్తలు ఏమిటి? ఒకస్త్రీ కి ఒక భర్తయే కదా బహు భర్తలు ఉండరాదే అనగా శివుడు నీకోరికను నాకు చెప్పేటప్పుడు పతిం దేహి పతిం దేహి అని ఐదుసార్లు నీవు అనడం చేత నీకు అట్టి వరము ఈయవలసి వచ్చింది. అనెను. అప్పుడు ఆ నాలాయని స్త్రీకి ఒక్కడే భర్త అగుట ధర్మమని బహు పత్నులు కలిగియుండుట పురుషులకు ధర్మమని మునులచే పూర్వము నిర్ణయింపబడినది. స్త్రీ కి ఒక్కడే పతియగుట లోక ప్రసిద్ధము ఆపత్కాల సమయమునందు నియోగ విధిన బట్టి భర్తకంటే అన్యుడైన పురుషుడు చెప్పబడెను. తృతీయ పురుష సంబంధము ప్రాయశ్చిత్తావహము, చతుర్థ పురుష సంబంధమున పతితురాలగును, పంచ పురుష సంబంధముచే బన్దకి యగును. ధర్మమార్గమిట్లుండుటచేత నేను బహు పురుషులను గోరజాలను, లోక విరుద్ధములయిన ఈ దోషము నుండి నాకు విముక్తి ఎట్లా అని ప్రశ్నించెను. ఒక వేళ నాకు పంచపతిత్వము తప్పని యెడల అంతట నాకు పంచపతిత్వము తప్పని యెడల నాయాచన ను ఆలకించి ఒక వరమును అనుగ్రహింపుము, ఏకైక పతి సాంగత్యమునందును నాకు కన్యత్వ సిద్ధి కలుగుచుండునట్లు వరమిమ్ము అంతట పరమేశ్వరుడు నీవు జన్మాంతరమందు రూప సౌభాగ్య గుణాన్వితురాలవై ఏకైక పతి సాంగత్యముతో కన్యత్వముచే వహించుచు పంచపతులతో పూజ్యురాలై యుందువని అనుగ్రహించెను.*

*(శ్రీరామచంద్రమూర్తి, ఎన్.జి.పి, ఆంధ్రమహాభారతములో ధర్మసూక్ష్మములు, పుట:98).*

ఈ వివరాలు అన్నీ ద్రౌపది పతిత కాదు మహా పతివ్రత అని నిరూపించే ద్రౌపది పూర్వ జన్మ వృత్తాంతాలు, వీటిని పై పై చూసి ఒక నిర్ణయం రావడం అందరికి అలవాటే అలాకాకుండా లోతుగా పరిశీలిస్తే ధర్మం ఏమిటో సూక్ష్మధర్మం ఏమిటో స్పష్టంగా తెలుస్తుంది. ధర్మరాజు ద్రౌపది వివాహ చర్చ విషయం ధర్మయుక్తమే అని చెప్తాడు. తన మనస్సు ఎప్పుడూ అధర్మం వైపు వెళ్ళదు నా వివాహాన్ని నా మనస్సు అంగీకరిస్తుంది అని

చెప్తూ పురాణాలలోని కొంత మంది ఋషుల పేర్లను కూడా ప్రస్తావిస్తాడు. జటిల అనే గౌతమగోత్ర కన్య ఏడుగురు ఋషులను వివాహం చేసుకున్నదని, అలాగే కండుమహర్షి పుత్రికయైన వార్షి తపస్సులచే పవిత్రాలైన అంతఃకరణాలు కల ప్రచేతసుని పుత్రులను ఒకే పేరు గల వారిని పదిమందిని వివాహమాడిందని చెప్తాడు. అలాగే ధర్మపరాయణురాలు అయిన తల్లి వాక్కు ఎప్పుడూ సత్యాన్నే పలుకుతుంది. అటువంటి మా అమ్మ మీరందరూ ఈమెను (ద్రౌపది)ని భిక్ష వలె అనుభవించండని పల్కింది. కావున మా అయిదుగురితో ఈ ద్రౌపది వివాహం ధర్మయుక్తమే అని చెప్పాడు.

ఈ విషయంలో కుంతి కూడా కాస్త భయపడింది నేను ఇలా ద్రౌపదిని తన ఐదుమంది పుత్రులను పంచుకోమన్నానే అని ఆమె బాధపడింది. అందుకే వ్యాసునితో నాకు అసత్యం వల్ల భయం ఏర్పడింది. నన్ను ఎట్లైననూ అసత్య దోషం నుండి దూరం చేసే ఉపాయం చెప్పు అని అడుగుతుంది.

అందరి ప్రశ్నలకు వ్యాసుడు సమాధానం చెప్పలేదు ఎవరికైతే ధర్మ సంకటంతో సతమతమవుతున్నాడో అతనే ద్రౌపది తండ్రి ద్రుపదునికి మాత్రమే ఆ ధర్మ సూక్ష్మాన్ని తెలియజేయాలని అనుకున్నాడు. ద్రుపదునితో చాలామంది పురుషులు ఒకే భార్యను కలిగి ఉండడం ఎలా ధర్మమవుతుందో వివరించాడు. (సంస్కృభారతం, ఆదిపర్వం, 196 వ అధ్యాయం,).

పైన పేర్కొన్న భారతంలోని సంఘటనలే కాకుండా ధర్మవిచారణ చేయవలసిన అంశాలు చాలా ఉన్నాయి వాటిలో కొన్నింటిని మాత్రమే ఇక్కడ పేర్కున్నాను.

ఈ అధ్యాయంలో ధర్మం గురించిన అవగాహన కోసం ధర్మం అంటే ఏమిటో ధర్మం యొక్క గొప్పతనం ఏమిటో వివరించాను. వర్ణాశ్రమ ధర్మాలు, ధౌమ్యుడు, రోమశుడు, విదురుడు చెప్పిన ధర్మాలను, వివరించాను అంతే కాకుండా ఏకలవ్యుడు, ద్రౌపది వివాహం, వ్యాస జననం పాత్రలలోని ధర్మసూక్ష్మాలను ఈ అధ్యాయంలో వివరించాను. తర్వాతి అధ్యాయంలో సంస్కృతాంధ్ర మహాభారతంలోని రాయబార ఘట్టాలను పరిశీలిస్తాను.

మూడవ అధ్యాయం

# సంస్కృతాంధ్ర మహాభారతాలు – రాయబారఘట్టాలు పరిశీలన

## 3.1. రాయబారం– పరిచయం:

రాయబారం అంటేనే ఒకరి అభిప్రాయాలు మరొకరికి చేరవేయడానికి అవతలి వారి అభిప్రాయాలను తెలుసుకుని ఎవరైతే రాయబారానికి పంపారో వారికి సమాచారం అందించడానికి ఉపయోగపడేది. అతి పురాతన కాలంలో ఆధునిక సాంకేతికత లేకపోవడం వలన వ్యక్తులునే ప్రధానంగా రాయబారానికి వినియోగించేవారు. రాయబారానికి వెళ్ళే వ్యక్తి ధైర్యంతో ఉండాలని, సమయస్ఫూర్తితో వ్యవహరించాలని ఇలా రాయబారికి కొన్ని లక్షణాలను ఆపాదించారు. ఈ అధ్యాయంలో రాయబార లక్షణాలను తెలియజేస్తూ మహాభారతంలోని రాయబారాలను పరిశీలించడం ప్రధానోద్దేశ్యం.

*" ఇద్దరి వ్యక్తుల మధ్యకానీ, రెండు పక్షాల మధ్య కానీ స్పర్థలు, అపోహలు, జగడాలు ఉన్నప్పుడు వారిద్దరి మధ్య సయోధ్య ఏర్పరచడానికి మధ్యవర్తులు అవసరం ఉంటుంది. మనస్పర్థలు పోగొట్టడానికీ లేదా రాజులకూ, రాజ్యాలకూ మధ్య యుద్ధం నివారించడానికో సహాయ సహకారాలు అందించుకోవడానికీ ఈ మధ్యవర్తిత్వం అవసరం. దీనినే రాయబారం అంటారు.( కృపాకర రెడ్డి, ప్రాచీన కావ్యాల్లో సందేశాలు–రాయబారాలు, (సి.వ్యా), పుట:62)."*

ఈ విషయాలను పరిశీలిస్తే ఇద్దరి వ్యక్తుల మధ్య కాని, రాజుల మధ్య కాని సంఘర్షణ ఏర్పడినప్పుడు ఆ సంఘర్షణను నివారించడానికో లేదా ఏదైనా ఒప్పందం చేసుకోవడానికో లేద యుద్ధ ప్రకటనకో, సంధి ప్రయత్నానికో , ఏదైనా కార్యభారాన్ని నిర్వహించడానికో, మధ్యవర్తిగా ఒకరిని నియమించి పంపించడమే రాయబారమని తెలుస్తుంది. రాయబారం నిర్వహించడానికి వాక్చాతుర్యం కలవాడై ఉండాలని

రాయబారానికి పంపే వ్యక్తి కూడా సమర్థవంతంగా కార్యాన్ని పూర్తి చేసుకురాగల వారినే ఎన్నుకోవాలని తెలుస్తుంది.

*"అనాదికాలంనుండి దౌత్యవ్యవహారలకు రాజకీయంగా ఎంతో ప్రాధాన్యముంది. సామాజికమైన ఈ దూతకార్యనిర్వహణను కవులు తమ కావ్యాలలో లక్షణబద్ధం చేసారు. ఆదికావ్యమైన రామయణంలోనూ, భారతేతిహాసంలోను దూతక్రియాచాతురీమహిమను ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దారు. సంస్కృత కావ్య, నాటకాలలో కూడా ఈ దౌత్యప్రక్రియ విశిష్టస్థానాన్ని ఆక్రమించింది."*

https://www.auchithyam.com/2023/apr_2023/full_papers/april23_09.php

"వల్లివేడు విద్యాలత దూత్య సాహిత్యము గ్రంథము నందు దూత్య నిర్వహణము గురించి ఈ విధంగా వివరించారు. *" కావ్య సాహిత్యమున దూత్య నిర్వహణము విలక్షణమును, వినోద ప్రాయమును అగు ప్రక్రియ యనుట ప్రసిద్ధము దూత్య ప్రస్తావరహితమైన కావ్యముండుట అరుదు. దూత్య నిర్వహణము మానవమాత్ర పరిమితం కాదు తిర్యగ్గివ్య సంబంధియగు దూత్యములను ఉన్నవి దూత్య వైవిధ్యమును బట్టియు లోకజ్ఞులకు కవుల పరిశీలనా ప్రావీణ్యమును బట్టి బహువిధ దూత్య పరిభాషలు ప్రయుక్తములైనవి,"*

ఈ విషయాలను పరిశీలిస్తే కవులు తమ కావ్యాలలో దూత కార్యాలకు ఒక విశిష్టతను ఆపాదించి దూత కార్యం యొక్క ప్రయోజనాలను సాహిత్యకారులకు అవగతమయ్యేలా వారి కావ్యాలలో నిక్షిప్తం చేసారని ప్రాచీన ఇతిహాసాలలో దూత కార్యాలను లక్ష్యంగా చేసుకుని వాటిని తెలుగులోకి అనువదించే సమయంలో తెలుగు వైశిష్ట్యం ఉట్టిపడేలా వారి సాహిత్య ప్రతిభను పొందుపరిచారని తెలుస్తుంది.

### 3.2. **దూత శబ్దము – వ్యుత్పత్తి:**

వల్లివేడు విద్యాలత దూత శబ్దముకు వ్యుత్పత్తి అర్థాలు  ఎలా వ్యవహరించబడిందో తెలియజేసింది. *1. దూత: ( దూయతే అనేన పర ఇతి దూతః) వీని చేత శత్రువు*

పరితపింపచేయబడునని అర్థం. అంటే ఈ పరితాపమునకు రెండు అర్థాలను ఇస్తూ వీరమున ప్రతాప ప్రకటనము శృంగారమున వియోగ ప్రస్తావనము అని తెలియజేసారు.

2. దూత్యము: దూతస్య భావః కర్మ వా దూత్యమ్ " అనగా దూత యొక్క భావము లేక కర్మము లేక స్వభావము దూత్యమగునని అర్థము.

3. దూతి: దూయతే స్త్రీ వా పుమాన్ వా దూతి' దీని చేత పురుషుడు గాని , స్త్రీ గాని అన్యోన్య విషయమై పరితపింపచేయబడును.

4. వాణిని: " వణతి తాచ్ఛీల్యేనేతి వాణినీ" పలుకునట్టి స్వభావము కలది .

5. వార్తా హరుడు (వార్త): " వార్తా వృత్తౌ జనశ్రుతౌ" వార్త అనగా వృత్తాంతమనియు లోకవార్త అనియు గ్రహించాలి. రాజనీతి యందు ఒక అంగమును తెల్పు ప్రక్రియకు వార్త యనియే వ్యవహారము

6. శంభళి: శం శ్రేయః భాలయతి హినస్తి ఇతి శంభళి' అని శ్రేయస్సును చెఱచునదని భావము. శంభళికి తార్పుడుకత్తె (A Bawd Procuress) అని ఆప్టే నిఘంటువు.

7. ( శాసన ధారి) శాసనము: " శాస్యతే అనేన శాసనమ్ శాసు అనుశిష్టౌ' దీని చేత శిక్షింపబడును ఆజ్ఞ అని దీనికి అర్థము. రాజాజ్ఞ గల పత్రమునకు శాసన పత్రమందురు ఈ శాసనమును గొని పోవువాడు శాసనహారి , శాసనహరుడు శాసనమును ధరించిపోవువాడు శాసనధరుడు. శాసన ధారి. ఈ పదము కేవల రాజ శాసనమునకు , రాజదూతలకు పరిమితం యుండినది అనుట స్పష్టము.

8. సంచారిక: "సంచారయతి ప్రాపయతి పుమాంసం, స్త్రియం ఇతి సంచారికా' సంచారము వలన పురుషుని స్త్రీని కూర్చునదని భావము, ఈ కృదంత శబ్దమునకు దూతకి అని సాధారాణార్థము,. సంచారి అని దీనికి మరో రూపము.

9. సందేశము: సందేశము " అన్యేన సందిశ్యతే ఇతి సందేశః అని వ్యుత్పత్తి ఒకని చేత చెప్పబడు విషయము సందేశమని భావము.

*10. సంధానము ' సంధీయతే యత్ ఇతి సంధానమ్' బాగుగా చేర్చబడునది అని దీని భావము. ( విద్యాలత, వల్లివేడు. దూత్య సాహిత్యము ( 15, 16, 17 శతాబ్దములు, పుట: 09, 10, 11.)*

ఈ వ్యుత్పత్తులన్ని విషయ ప్రసారమునకు కలిగినటువంటి పదాలుగా కనబడుతున్నాయి. ఆయా సందర్భాలలో ఈ పదాలు మనకు కావ్యాలలో కనబడుతుంటాయి.

సందేశాన్ని ఇవ్వడమే రాయబారం అన్నప్పుడు సందేశ శబ్దం ఎలా ఏర్పడిందో ఈ క్రింది తెలియజేస్తున్నాను.

*"సంపూర్వక 'దిశ'( అతిసర్జనే), ధాతువునకు భావార్థంలో ఘఙ్ ప్రత్యయం చేరగా సందేశమనే శబ్దమేర్పడింది. దీనికి వార్తను పంపడం, సందేశమందివ్వడం, ఏమైనా మాటలు చెప్పి పంపడమని అర్థం. అంతేకాక పనుపు , ఆజ్ఞ అనే అర్థాలు కూడా ఉన్నాయి. " సందేశస్తు ప్రోషితస్య స్వహర్తా ప్రేషణం భవేత్" అని రసాణవ సుధాకరం(1.204) దేశాంతర గమ్యమై స్వజనానికి వార్తను పంపడమని అర్థం. సందేశాన్ని తీసుకుపోయే వాణ్ణి సందేశహరుడుఅంటారు. అతనికి 'దూత' 'దూతడు' అని కూడా వ్యవహారం. "సందేశహరోదూతయే దూత్యం తద్భావ కర్మణో...." అని అమరం.(రాజగోపాల శర్మ, బాపట్ల, తెలుగు సందేశకావ్య సమాలోచనం.పుట:07).*

### 3.3. కౌటుల్యుడు – రాయబార లక్షణాలు:

కౌటిల్యుని అర్థశాస్త్రం లో రాయబార లక్షణాలను ఈ విధంగా తెలియజేయబడ్డాయి.

*శ్లో//"ప్రేషణం సంధిపాలత్వం ప్రతాపో మిత్ర సంగ్రహః*
*ఉపజాపః సుహృద్భేదో దణ్డ గూఢాతిసారణమ్,*
*బన్ధురత్నాపహరణం చారజ్ఞానం పరాక్రమః*
*సమాధిమోక్షో దూతస్య కర్మయోగస్యచాశ్రయః"*

పై శ్లోకంలోని అర్థాన్ని పరిశీలిస్తే వార్తలు పంపడం, ఇతర రాజులలో తన స్వామి చేసుకున్న సంధులను గట్టిచేయడం, తన స్వామి గొప్పతనాన్ని చాటడం, మిత్రుల్ని

సంపాదించడం, కృత్యాదుల్ని రెచ్చగొట్టడం, శత్రువుల స్నేహితులలో భేదం కలిగించడం (వాళ్ళని విడదీయడం), సైన్యాన్ని, గూఢ పురుషుల్ని, శత్రు రాజ్యంలోకి ప్రవేశ పెట్టడం, శత్రువుల బంధువులను రత్నాలను(ధనాన్ని) అపహరించడం, రహస్య సమాచారాలు తెలుసుకోవడం, పరాక్రమం చూపడం, సమాధిని విడిపించడం, రహస్యమైన ఉపాయాలు పన్నడం, ఇవి దూతలు చేయవలసిన పనులు.**(పుల్లెల శ్రీ రామచంద్రుడు(వ్యాఖ్యాత), కౌటిలీయమ్ అర్థశాస్త్రమ్, పుట:68).**

పై విషయాలను పరిశీలిస్తే రాయబారిగా నియమితుడైన వాడు తాను చేయవలసిన కర్తవ్యాన్ని నిర్వహిస్తూ శత్రురాజుల యందు సమయానుకూలంగా సంభాషిస్తూ వాక్చాతుర్యాన్ని ప్రదర్శిస్తూ రాయబార కార్యాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకురాగల సమర్థుడై ఉండాలని తెలుస్తుంది. అలాగే రాయబారానికి పంపే వ్యక్తి కూడా సమర్థవంతంగా కార్యాన్ని పూర్తి చేసుకురాగల వారినే ఎన్నుకోవాలని అర్థమవుతుంది.

### 3.4. రాయబార నియమాలు:

కౌటిల్యుని అర్థశాస్త్రంలో దూతలు అనుసరించవలసిన విధులను ఈ క్రింది విధంగా తెలియజేసారు. *1. ఆలోచన ఫలితంగా ఒక నిశ్చయం ఏర్పడిన తర్వాత దూతను (కార్యాచరణమునకు) నియోగించాలి.*

*2. అమాత్యులకు ఉండవలసిన అర్హతలు గల దూత సర్వాధికారాలు కలవాడు.*

*3. అర్హతలలో నాల్గవ వంతు లేని వాడు పరిమితాధికారం గల దూత.*

*4. అర్థభాగం లేనివాడు రాజాజ్ఞను అందించువాడు(అందుకు మాత్రమే ఉపయోగించువారు).*

*5. శత్రువునకు అందించవలసిన రాజశాసనమిది, అతడు చెప్పు జవాబు ఇట్టిది. దానికి తగిన సమాధానము ఈ విధముగా ఉండాలి, అతని ఎత్తుకు పై ఎత్తు వేయవలెను. అని ఆలోచించుకుంటూ అతడు ప్రయాణం చేయాలి.*

*6. మార్గంలో అతడు ఆటవికులతోను, అంతపాలురతోను, పుర రాష్ట్రములలోని ప్రధానాధికారులతోను, సంప్రదింపులు సాగిస్తూ వెళ్ళవలెను.*

7. తమ యొక్క శత్రువుల యొక్క సైన్యములను నిలుపుటకు యుద్ధము చేయుటకు అదనపు సేవలు నుంచుటకు పారిపోవుటకు అనువగు ప్రదేశములను పరిశీలించవలెను.

8. శత్రురాజుయొక్క) దుర్గములను, రాష్ట్రములను ప్రమాణము అందులోని బలాబలములు ప్రజల వృత్తులు, రక్షణ సాధనములు తెలుసుకోవలెను.

10. శత్రువు అనుమతి పొంది అతడు ఆ స్థానమును ప్రవేశించవలెను.

11. ప్రాణాపాయము కనిపించినను దానిని గమనించక) యథోక్తముగా రాజ సందేశము అతనికి తెలియపరచవలెను.

12. శత్రురాజు యొక్క మాటలలో, ముఖములో కండ్లలో సౌమ్యత, (దూతయొక్క) మాటల పట్ల గౌరవభావము, అతని అభిమతమును గురించి కుశల ప్రశ్న. (తన రాజును గురించిన) గుణ కథనమునందు ఆసక్తి, (సింహాసనముకు) సమీపముగా ఆసన మిచ్చుట. సత్కారము, ఇష్టాగోష్ఠులలో (దూతను గురించి), స్మరణ, (దూతలో) విశ్వాస ప్రదర్శనము, ఇవి అనుకూలుడగు శత్రు రాజు లక్షణములు.

13. తమపై శస్త్రములెత్తినను దూతలు (తమ రాజుల) మాటలను తూచాతప్పకుండా చెప్పవలసి యున్నది.

14. అంత్యజులు కూడా అవధ్యులు, బ్రాహ్మణుల మాట వేరుగా చెప్పవలెనా ఈ నా మాటలు మరియొకరివి (అంటే మాట్లాడుతున్నది దూత అయినప్పటికి మాటలు వేరే వారివి అని గ్రహించాలని అర్థం), ఇవి దూత ధర్మములు.

15. చూపబడిన గౌరవమునకు పొంగిపోకుండా (శత్రురాజు) వెళ్ళవచ్చునని చెప్పేంతవరకు వెనుకకు మరలిపోకూడదు

16. శత్రువులలో తనరాజే బలవంతుడని అనుకొనరాదు.

17. అప్రియములకు మాటలు పలికినను సహించవలెను.

18. స్త్రీ పానములను విడిచిపెట్టవలెను.

19. తాను ఒంటరిగా నిద్రించవలెను. ఎందుకంటే నిద్రలోనూ, మత్తెక్కినప్పుడును ఒకని భావములు వ్యక్తములగును.

20 తాపస, వైదేహిక వేషధారులగు పౌరుల ద్వారాగాని, వారి శిష్యుల ద్వారా గాని ఉభయ వేతనులైన చికిత్సక పాషండ వేషధారులగు చారుల ద్వారా గాని శత్రురాష్ట్రములోని కృత్య పక్షములవారి కుట్రలను ఆ కృత్యపక్షముల వారిని శోధించుటకై వినియోగింపబడిన చారుల ప్రవృత్తిని (శత్రుప్రజలు) వారి రాజుల పట్ల చూపు రాగానురాగములను అచటి ప్రకృతులలోని లోపములను తెలుసుకొనవలెను.

21. వారితో సంభాషణ సాధ్యము కానప్పుడు యాచకులు మత్తెక్కినవారు, ఉన్మాదులు నిద్రలోనుండువారు వీరు చేయు ప్రభావముల ద్వారాగాని, పుణ్య క్షేత్రములోనియు, దేవాలయములోనియు, చిత్రలేఖనములు,వ్రాతలు, సంజ్ఞలు మున్నగునవి వాని ద్వారా గాని రహస్యసమాచారమును తెలుసుకొనవలెను. అది తెలియగానే అతడు కుట్రలు పన్నవలెను.

22. శత్రురాజు అడిగినను తన రాజు యొక్క ప్రకృతుల పరిమాణమును తెలియపరచకూడదు.

సర్వము మీకు తెలిసినదే అని గాని తన కార్యసిద్ధికి అనుకూలించు సమాధానము గాని చెప్పవలెను.

23. దూత కార్యము సఫలము కాకపోయినను వెనుకకు వెళ్లిపోవుటకు (శత్రురాజు) అనుమతి ఇయ్యనప్పుడు అతడు మనసులో ఇలాగా ఆలోచించాలి. ‘‘ఇట్లు నన్ను నిలిపివేయుటకు కారణము నా ప్రభువునకేదో ప్రమాదము సంభవించనున్నదని అనుకోవడమా లేక తనకు సంభవించబోవు ప్రమాదముకు ప్రతి క్రియ చేసుకొను ఉద్దేశమా లేక నా ప్రభువుపైన పార్ష్ణిగ్రాహునికాని, తన మిత్రుని గాని అంతఃకలహమును గాని ఆటవికుని ప్రేరేపణ చేయ వాంఛయా లేదా నా ప్రభువు యొక్క మిత్రుని గాని ఆటవికునితో గాని చేయుచుండు యుద్ధములోను అంతఃకలహములోను అవసర చర్యలు తీసుకొనగోరియా లేక నా ప్రభువు సన్నాహము పూర్తిచేసుకునిన విజయయాత్రాకాలమునకు భంగము కలిగించు ఉద్దేశమా? లేక తనకు అవసరమగు ధాన్యమును, వస్తు సామగ్రిని వన్య వస్తువులను సంగ్రహించుకొనగోరియా లేక తన దుర్గమును బలపరచుకొను ఇచ్ఛయా,సైనిక బలమును సమకూర్చుకొను ఆశయా లేక తాను తలపెట్టిన యుద్ధయాత్ర కుఅనువగు దేశకాలముల నిరీక్షించుటయాలేకపరిభవ

ప్రమాదము సంభవించుననియా లేక నా ప్రభువుతో సఖ్యమే విడనాడరాదను అభిప్రాయమా అని (శత్రువు ) ఉద్దేశము ను ఊహించి తానక్కడ ఉండుటయో,వెళ్ళిపోవుటయా అనేది నిశ్చయించుకోవాలి.

లేక వాంఛనీయమగు మరియొక ప్రయోజనము గురించి ఆలోచించవలెను.

24. (శత్రురాజునకు) గిట్టని సందేశమును తెలియపరిచిన తర్వాత తనకు నిర్బంధమూ, మరణమూ సంభవించును భయముండును గనుక, అనుమతి లభించినను లభించకపోయినను అక్కడ నుండి వెళ్ళిపోవలెను. అట్లు చేయని యెడల నిర్బంధమునకు గురి కావచ్చును.

25.(తన ప్రభువునకు) వార్తలను పంపుట సంధి షరతులను పాటించుట (తన ప్రభువు యొక్క) ప్రతాపమును ప్రశంసించుట, మిత్రులను సంపాదించుట కుట్రలు పన్నుట (శత్రువు యొక్క) మిత్రులలో భేదము కల్పించుట. గూఢచారులను సైనికులను (శత్రు రాజ్యములో) ప్రవేశ పెట్టుట

26(.శత్రువు యొక్క) బంధువులను రత్నములను అపహరించుట, రహస్య సమాచారమును సేకరించుట, పరాక్రమ ప్రదర్శనము హామీగా ఉంచబడిన వారిని తప్పించుకొనునట్లు చేయుట రహస్య చర్యల ప్రయోగము అని దూత చేయవలసిన పనులు.(దూతలు గూఢచారులుగా ప్రవర్తించువారని దీని నుండి తెలియుచున్నది)

27.(రాజు) దూతల ద్వారా ఈ కార్యములను సాగించుచు ప్రతి దూతల మూలమును , చారుల మూలమును ప్రకటముగను, గూఢమును శత్రు దూతలను కనిపెట్టి యుండవలెను.

ఇటువంటివి దూతకు సంబంధించిన విషయాలన్ని మొదటి అధికరణం, పదహారవ అధ్యాయం, పన్నెండవ ప్రకరణంలో చెప్పబడ్డాయి. ***(వేంకట రంగయ్య మామిడి పూడి,కౌటిల్యుని అర్థశాస్త్రం(తెలుగు అనువాదం), పుట:40.)***

పుల్లెల శ్రీ రామచంద్రుడు‘ ***కౌటిలీయమ్ అర్థశాస్త్రం’*** అనే గ్రంథం లో దూత గురించిన వివరాలు ఈ విధంగా తెలుపుతాడు.

*" ఉద్ధృతమన్త్రో దూత ప్రణిధిః అమాత్యసంపదో పేతో నిసృష్టార్థః పాదగుణ హీనః పరిమితార్థః అర్ధగుణ హీనః శాసనహరః"*

*1. మంత్రం నిశ్చితమైన తరువాత దూతల ప్రయోగం జరగాలి.*

*2. అమాత్యులకు ఉండే గుణ సంపద అంతా ఉన్న దూత "నిసృష్టార్థుడు" అనగా కార్యభారం అంతా అతని మీద విడిచి వేయవచ్చు అని అర్థం.*

*3. నాల్గవ వంతు గుణాలు తక్కువ ఉన్నవాడు "పరిమితార్థుడు" (పరిమితమైన ప్రయోజనం కలవాడు. అనగా కొంత వరకే అతనికి కార్యభారం అప్పగించాలి).*

*4.సగం గుణాలు లేనివాడు "శాసన హరుడు" అనగా రాజు పంపే వార్తలు తీసుకుని వెళ్ళడానికి మాత్రమే తగిన వాడు.( **పుల్లెల శ్రీ రామచంద్రుడు (వ్యాఖ్యాత), కౌటిలీయమ్ అర్థశాస్త్రం., పుట:64.)***

పై విషయాలను పరిశీలిస్తే రాయబారిగా వెళ్ళువారు స్వతంత్రంగా అధికారి గలవాడై ఉండాలని నైపుణ్యంతో అప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకోగల స్వేచ్ఛ రాయబారికి ఇవ్వాలని. శత్రువుల రాజుల దగ్గరకు వెళ్ళినప్పటికి అక్కడి సపరివారంతో మర్యాదతో ఓర్పుతో వారిని పలకరించాలని ఎన్ని ఆటంకాలు ఏర్పడినప్పటికి, శత్రురాజు దూషణ చేసినప్పటికి, సహనంతో తాను చెప్పదలచుకున్న సందేశాన్ని అందించాలని తెలుస్తుంది.

**ఆంధ్రభూమి పత్రికలో** తల్కా ఉషశ్రీ రాయబారం గురించి తెలుపుతూ ఈ విధంగా అంటారు.

*"దౌత్యం అని చెప్పగానే ఎవరికీ అర్థంకాదు. ఈ పదంతో చాలా సమస్యలు తొలగిపోతాయి. అది ఇద్దరు వ్యక్తుల మధ్య ప్రేమనుగానీ, లేదా రెండు ఊర్ల మధ్యగానీ, రెండు జిల్లాల మధ్య గానీ, రెండు రాష్ట్రాల మధ్యగానీ లేదా రెండు దేశాల మధ్య గొడవలను, యుద్ధాలను ఆపడానికి ఒక్క దౌత్యంతో సాధ్యమవుతుంది. అనగా రాయబారంతో అని. అలా దౌత్యంతో రాయబారాలు నిర్వహించేవారు ఉన్నపుడు ఎంతటి పెద్ద సమస్యకు అయినా సమాధానం దొరుకుతుంది. చరిత్రలో చూస్తే భారతంలో శ్రీకృష్ణుడు కౌరవుల వద్దకు రాయబారిగా వెళ్ళాడు. అలాగే రామాయణంలో చూస్తే హనుమంతుడు లంకకు వెళ్లి*

*రాయబారం నడిపాడు. వ్యక్తులు నిర్వహించిన రాయబారాలు చాలావరకు రాజకీయ కారణాలతో సాహిత్యంతోకనిపిస్తాయి.''*
(http://www.andhrabhoomi.net/content/sub-feature-904

రాయబారం వలన ఇద్దరి వ్యక్తుల మధ్య సయోధ్య కుదురుతుందని, ఎంత పెద్ద సమస్య ఏర్పడినా రాయబారం జరగడం వలన ఆ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని తెలుస్తుంది.

**3.5. రాయబారం – ప్రముఖుల అభిప్రాయాలు:**

రాయబారం జరిగేటప్పుడు రాయబారి ఎలా ఉండాలి ఎలా ప్రవర్తించాలో ప్రముఖులు తగిన సూచనలు చేసారు. వాటిని ఈ క్రింది పరిశీలిస్తున్నాను.

*రాయబారం గురించి బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ చెప్తూ రాయబారి ప్రభువు చెప్పిన మాటలను సూటిగా ఎదుటి వారు బాధపడకుండా చెప్పాలని శత్రువు దగ్గరకు ఒంటరిగా వెళ్ళినా మరణించే పరిస్థితులు ఎదురైనా తన ప్రభువు చెప్పిన మాటలను చెప్పి కార్యాన్ని నిర్వహించుకుని తిరిగి రాగలిగే సామర్థ్యం కలిగిన వాడినే రాయబారిగా పంపాలి. మొత్తంగా ప్రభువు చెప్పిన మాటలు కాకుండా సందర్భానుసారంగా మాట్లాడే శ్రీకృష్ణుడి రాయబారం గమనించాలని వీరు అభిప్రాయపడ్డారు.(చూడు: అనుబంధం 2, వద్దిపర్తి పద్మాకర్, ముఖాముఖి).*

ఈ వివరాలు రాయబారి యొక్క నైపుణ్యం ఎటువంటిదో తెలియజేస్తాయి. రాయబారికి ప్రధానంగా ఉండవలసిన సాహసం, వాక్ నైపుణ్యం, ధైర్యం అన్నింటికి మించి సందర్భానుకూలంగా స్పందించడం కృష్ణుని లో కనబడుతాయని వీరి అభిప్రాయాల్లో వ్యక్తమవుతుంది.

బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ ముఖాముఖిలో *"రాయబారికి ప్రధానంగా ఉండవలసినది తాను ఏ రాజ్యం, ఏరాజు పక్షాన ఉన్నాడో ఆ రాజ్యానికి రాజుకి హితం కలిగేలా ప్రవర్తించడం. సందేశాన్ని స్పష్టంగా ప్రయోజనకరంగా అందించడం. ద్రోహ చింతన లేని నిష్కపటత్వం అవసరమని వీరు తెలియజేసారు. (చూడు: అనుబంధం 2, బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ, ముఖాముఖి).*

ఒక్కొక్కసారి రాయబారి ప్రభువు మీద భక్తితో లేకపోతే ఆ రాయబారం సఫలం కాదు పైగా రాజుకు రాజ్యానికి ప్రమాదమే కాబట్టి రాయబారి కపటత్వం లేకుండా తన ప్రభువు చెప్పి పంపిన విషయాలను స్పష్టపరచాలని వీరి అభిప్రాయం.

బ్రహ్మశ్రీచాగంటి కోటేశ్వర రావు ముఖాముఖిలో ప్రధానంగా రాయబారికి ధైర్యం రెండవది భాషయందు పటుత్వం ఉండాలని చెప్పారు.*(చూడు: అనుబంధం 2, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు , ముఖాముఖి).*

రాయబారి అనే వాడు చెప్పే మాటలను స్పష్టంగా తడబాటు లేకుండా సరైన భాషను ఉపయోగించాలని వీరు చెప్పారు. ఈ లక్షణం రాయబారిలో ఉండడం వలన మాట తడబాటు ఉండదు. చెప్పవలసిన విషయాన్ని సాగదీయకుండా ఉన్నది ఉన్నట్లు చెప్పగలుగుతాడు. తాను ఉపయోగించే పదాలు స్వతహాగా చెప్పినప్పటికి సరైన వాక్ప్రయోగం చేయగలగాలి అప్పుడే రాయబారం సఫలమయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఎదుటి వారి మనసును అంచనా వేసి తర్వాతి కార్యాచరణను తెలుసుకోగలగాలని వీరి మాటల్లో తెలుస్తుంది.

**సద్గురు శ్రీదేవి సెట్టి చలపతి రావు రాయబారి లక్షణాలను ముఖాముఖిలో** *రాయబారి అయినటువంటి వాడు కేవలం  రాజు లేదా పరిపాలకుడు చెప్పినటువంటి విషయాలే కాకుండా అవసరమైనటువంటి అన్నీ విషయాలు కూడా నిర్వహించకలిగేటటువంటి సమర్థత ఉండాలి. రెండవది రాయబారి అయినటువంటి వాడు అనవరమైనటువంటి మాటలు మాట్లాడకుండా ఎంత వరకు మాట్లాడాలో అంత వరకే మాట్లాడాలి. మూడవది మాట్లాడేటటువంటి విషయాలు ఏరకంగా మాట్లాడాలి. ఎలా మాట్లాడితే అవతలి వారు సర్దుకుపోవడానికి వీలుందో అలాగా మాట్లాడాలి. దూతగా వ్యవహరిస్తే అతని తప్పేముండదు. దూతగా వ్యవహరించకుండా స్వంతంగా ఏదైనా మాట్లాడితే అతని మీద ఏదైనా చర్య తీసుకోవలసి వస్తుంది ధర్మ శాస్త్రం ప్రకారం.''(చూడు: అనుబంధం –2, సద్గురు శ్రీదేవిసెట్టిచలపతిరావు, ముఖాముఖి).*

రాయబారి మితంగా మాట్లాడాలి చెప్పవలసిన విషయాలను స్పష్టంగా చెప్పాలి ,ఎక్కువ మాట్లాడితే ఆ చనువు కారణంగా తన ప్రభువు యొక్క రహస్యాలను వెల్లడించే అవకాశంఉంది. కాబట్టి ఎంత వరకు మాట్లాడాలో అంత  వరకు మాట్లాడి తగిన సమాచారాన్ని రాబట్టాలని వీరి మాటల్లో తెలుస్తుంది.

బ్రహ్మశ్రీ చిర్రావూరి శివ రామ కృష్ణ శర్మ ముఖాముఖిలో *''రాయబారానికి యథార్థ వక్తృత్వం ఉండాలి. భీతి ఉండకూడదు. రాయబారానికి వెళ్ళిన వారిని చంపేసిన ఘట్టాలు కూడా రాజ్యంలో ఉన్నాయి. అందుకు కూడా సిద్ధపడి ధైర్యంతో చెప్పగలిగిన వారు ఉండాలి.'' (చూడు:అనుబంధం -2, బ్రహ్మశ్రీ చిర్రావూరి శివరామకృష్ణ శర్మ).*

వీరి అభిప్రాయం ప్రకారం మరణం సంభవించే సందర్భాలు ఉన్నప్పటికి దానికి కూడా సిద్ధపడగలగాలి రాయబారి అని వీరి మాటల్లో అర్థమవుతుంది.
వెంపరాల వెంకట లక్ష్మీ శ్రీనివాసమూర్తి గారు ముఖాముఖిలో

*రాయబారి తనను పంపే వాని హితం త్రికరణ శుద్ధిగా కోరాలి. రాయబార కార్యం మిక్కిలి క్లిష్టమైనది.  ఆ కార్యనిర్వహణలో ఎంతో చాకచక్యం, ప్రజ్ఞా పాటవం కావాలి. ఎట్టి విషయాన్నయినా  ఎదుటి వారి మనసు నొచ్చుకోకుండా చెప్పే నేర్పు అవసరం. ఎంత మతిమంతుడైనా, చతుర వచన కోవిదుడైనా, సమయజ్ఞత, పరింగత జ్ఞానం దూతకు కావలసిన ముఖ్య గుణాలని వీరు తెలియజేసారు.(చూడు: అనుబంధం 2, వెంపరాల వెంకట లక్ష్మీ శ్రీనివాస మూర్తి, ముఖాముఖి).*

వీరి మాటలను పరిశీలిస్తే మనసులో ఒక అభిప్రాయం ఏర్పరచుకుని దాని యొక్క ఫలితాలను అంచనా వేసి తగిన రీతిలో ఆ విషయాన్ని విశదపరచగలిగితే  ఆ రాయబార కార్యం సఫలమవుతుంది.

ప్రాచార్య శలాక రఘునాథ శర్మ ముఖాముఖిలో *''రాయబారి అనేటటువంటి వారు రాజు హృదయాన్ని సంపూర్ణంగా ఆకళింపుచేసుకుని అవసరమైస్తే కొన్ని స్వతంత్రమైన*

*నిర్ణయాలు ప్రతిపాదించి ఆ నిర్ణయము తన రాజుకి ఏ విధమైన మర్యాద భంగం రాకుండా చూడవలసినటువంటి పరిస్థితి ఉందని" వీరు తెలియజేసారు.(చూడు: అనుబంధం 2, ప్రాచార్య శలాక రఘునాథ శర్మ, ముఖాముఖి).*

రాయబారి స్వంత నిర్ణయాలు తన ప్రభువు యొక్క అనుమతితో చెప్పాలి అలా చెప్పేటప్పుడు మర్యాద భంగం కాకుండా చెప్పగలగాలి అలా చెప్పగలిగితే రాజు ఆ మాటలకు ఆకర్షితుడై సంధి కుదురుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. రాయబారి రాజు తను చెప్పే మాటను ఆహార్యాన్ని గమనిస్తున్నాడన్న విషయం కూడా రాయబారి గుర్తుపెట్టుకోవాలి. మాటలో కాని ముఖకవళికల్లో కాని భేదం కనబడితే రాయబారిని కూడా బంధించే అవకాశం ఉంటుందని వీరి మాటల్లో తెలుస్తుంది.

ఆచార్య ఇ. వెంకటేశు ముఖాముఖిలో

*"రాయబారం అనేది అత్యంత కీలకమైనటువంటిది అది రాజరిక వ్యవస్థ కావచ్చు. ప్రజాస్వామ్య వ్యవస్థ కావచ్చు రాజ్యాల మధ్య సంధి చేయాలన్నా యుద్ధం చేయాలి. సంధికైనా యుద్ధానికైనా రాయబారమే అత్యంత కీలకమని వీరు తెలియజేసారు." (చూడు అనుబంధం 2, ఆచార్య ఇ. వెంకటేశు, ముఖాముఖి).*

ఒక రాజ్య వ్యవస్థను పునరుద్ధరించడానికి రాయబారం కీలకమైనదని సంధి చేసుకోగలిగితే రాజ్య విస్తరణకు అభివృద్ధికి ఆ రాజ్యం పురోగమిస్తుంది. యుద్ధానికి సిద్ధపడి బలవంతంగా రాజ్యం చేజిక్కుంచుకోవాలి అనుకున్నప్పుడు ఇరు రాజ్యాలకు నష్టం వాటిల్లుతుంది. కాబట్టి రాయబారి సంధి కుదిరేలా తన చాకచక్యాన్ని ప్రదర్శించడం లేదా యుద్ధానికి అవతలి రాజ్యం వాళ్ళుఎటువంటి ప్రణాళికలు వేసుకున్నారో కనిపెట్టగల సామర్థ్యం ఉండాలి కాబట్టి రాయబారం కీలకమైనదని వీరి మాటల్లో వ్యక్తమవుతుంది.

## 3.6. శ్రీకృష్ణుడు చెప్పిన రాయబార లక్షణాలు:

భారతంలో ఉత్తర , అభిమన్యుల వివాహం తర్వాత తర్వాతి కార్యాచరణను గురించి సభ తీర్చిన సమయంలో శ్రీకృష్ణుడు పాండవుల పరాక్రమాన్ని గురించి తెలుపుతూ ప్రస్తుతం రాయబారిని పంపాలి దుర్యోధనుని ఆలోచన ఎలా ఉందో తెలుసుకోవాలి అని చెప్తూ రాయబారి అనేవాడు ఎలా ఉండాలో కూడా చెప్తాడు.

**"తస్మాదితో గచ్ఛతు ధర్మశీలః**

**శుచిః కులీనః పురుషో2ప్రమత్తః"**(సంస్కృత భారతం, , ఉద్యోగ పర్వం, 1 వ అధ్యాయం, 24 వ శ్లోకం,)

ధర్మశీలుడు, పవిత్రాత్ముడు, కులీనుడు, సావధానుడు, అయిన ఒక వ్యక్తి దూతగా అక్కడకు వెళ్ళాలని చెప్తాడు.

### 3.6.1. ధర్మశీలుడు:

కృష్ణుడు చెప్పిన ఈ రాయబార లక్షణాలను గమనిస్తే కౌరవుల దగ్గరకు వెళ్ళే దూత ధర్మశీలుడై ఉండాలి. సాధారణంగా బ్రాహ్మణుడు ధర్మాన్ని నిష్ఠతో అనుసరిస్తాడు అటువంటి వాడై ఉండాలి మరలా బ్రాహ్మణుడు అంటే వేదాలలోని లోతులను తెలిసినటువంటి వాడు. అనే అర్థంలో తీసుకోవాలి అటువంటి వాడు ధర్మాన్ని వ్రతంగా ఆచరించేవారు రాయబారిగా వెళ్లాలని అర్థం అవుతుంది. పాండవుల తరపున రాయబారి వెళ్లాలి కాబట్టి పాండవుల ధర్మాత్ములు అనే భావన దృష్టిలో పెట్టుకుని చెప్పగలగాలనే భావన ఇందులో కనబడుతుంది.

### 3.6.2. పవిత్రాత్ముడు:

పవిత్రాత్ముడు అన్నాడు. అంటే మనసు కల్మషం లేకుండా తనను ఎవరైతే రాయబారానికి పంపించారో వారి పై భక్తితో , నమ్మకంతో వారి మాటలను శ్రద్ధతో చెప్పగలగాలనే విషయం వ్యక్తమవుతుంది.

### 3.6.3. కులీనత:

" మంచి వంశమున లేదా కులమున పుట్టుట." (http://telugunighantuvu.com/

మంచి వంశము అంటే వంశపారం పర్యంతో వచ్చే రాజనీతిని తెలిసినవాడైతే రాయబారాన్ని సమర్థంగా ఎదుర్కోగలడు అనే విషయం తెలుస్తుంది.

### 3.6.4. సావధానం:

అంటే ఏకాగ్రత కలిగి ఉండాలి. చంచలమైన మనసుతో కాకుండా తాను చెప్పవలసిన విషయాలను జాగ్రత్తగా వినిఅ విషయాలలోని అర్థం చెడకుండా ఏకాగ్రత బుద్ధిని కలిగి రాయబారి మాట్లాడాలి. మనసు ఏకాగ్రతతో విషయాన్ని ఆకళింపు చేసుకోగలిగితేనే రాయబారం విజయవంతమవుతుంది.

రాయబారి కౌరవుల ఆవేశాన్ని, అహంకారాన్ని శాంతింపచేసి ధర్మరాజుకు అర్థరాజ్యం ఇచ్చేటట్లు చేయగలవాడై ఉండాలని చెప్తాడు.

కౌరవుల విషయం పక్కన పెడితే సాధారణంగా ఇందులోని అర్థం గ్రహిస్తే తన రాజు యొక్క గొప్పతనాన్ని, పరాక్రమతను దూత వర్ణించేటప్పుడు అవతలి వైపు రాజుకు అహంకారము, రావచ్చు లేదా కోపము రావచ్చు అలా వచ్చినప్పుడు వాటిని తన మాటలతో కార్యాన్ని సాధించుకురాగలిగిన సామర్థ్యం కలిగిన వాడు దూతగా వెళ్లాలనే భావం పై మాటల్లో వ్యక్తమవుతుంది.

శ్రీకృష్ణుడు చెప్పిన ఈ లక్షణాలు ప్రతి దూతకు ఉండవలసిన ప్రధాన లక్షణాలు.

## 3.7. బలరాముడు తెలిపిన రాయబార లక్షణాలు:

ఉద్యోగపర్వంలో సంజయ, శ్రీకృష్ణరాయబారాలలో రాయబార లక్షణాలు స్పష్టంగా కనబడతాయి. అవి రాయబారాలుగా కాకుండా సమరానికి చేసే ప్రయత్నాలుగా వారి సంభాషణల్లో చోటుచేసుకుంటుంది.

మహాభారతంలో పాండవుల అరణ్యవాసాలు పూర్తి అయిన తరువాత ఉపప్లావ్యంలో భవిష్యత్తు కార్యాచరణ చేయడానికి పాండవులు, శ్రీకృష్ణుడు, బలరాముడు

మున్నగు ప్రముఖ రాజులంతా సమావేశమవుతారు. అక్కడ రాజ్యభాగం కోసం రాయబారానికి ఎవరిని పంపాలి , ఎటువంటి సందేశాన్ని కౌరవులకు పంపాలి ఎటువంటి వాక్చాతుర్యం కలిగిన వాడిని పంపాలి అనే దాని మీద చర్చలు కొనసాగే సమయంలో బలరాముడు తన అభిప్రాయాన్ని వెల్లడిస్తూ

*ఆ. మాట పొందెఱింగి, యోటమై నల్లన /చేరి కౌరవేంద్రు చిత్తవృత్తి*

*కనుగుణంబుగాఁగ నానతుం డగుచుఁ బ్రా/ ర్థించి యడుగకున్నఁదెరగుపడదు.*

*(ఆంధ్ర మహాభారతం, ఉద్యోగపర్వం, ప్ర.ఆ, పుట:09).*

ఈ పద్యం యొక్క అర్థాన్ని చూస్తే వినయంతో ఎంతో గౌరవంతో దుర్యోధనుడి మనఃస్థితికి అనుకూలంగా మాట్లాడి వ్యవహారం చక్కబరచుకురావాలని తెలియజేస్తాడు. ఈ మాటల్లో రాయబారి లక్షణం కనబడుతుంది. మొత్తంగా బలరాముని అభిప్రాయం దుర్యోధనుని దగ్గరకు వెళ్ళేటటువంటి దూత వినయపరుడై రాయబార కార్యాన్ని సాధించుకురావాలని చెప్తాడు.

## 3.8. సాత్యకి తెలిపిన రాయబార లక్షణాలు:

బలరాముని మాటను ఖండిస్తూ సాత్యకి ధర్మరాజాదుల ధర్మ గుణాన్ని, దుర్యోధనాదులు చేసిన దుశ్చర్యలను గుర్తుచేస్తూ యుద్ధం చేయడమే కర్తవ్యంగా చెపుతాడు ఒక వేళ దుర్యోధనుడి దగ్గరకు రాయబారిని పంపితే అతను ఎలా ఉండాలో సాత్యకి ఈ విధంగా చెప్తాడు.

*ఉ. దైన్యము దక్కి దూత యుచితంబుగఁ బాండు నృపాలుపాలు రా*
*జన్య వరుండు ధర్మజుఁడు సమ్మతి వేఁడెదు నన్న, లోక సా*
*మాన్య విధిం దగంగ గరిమంబున నిచ్చెనఁ బుచ్చికొండ మ*
*న్యోన్య విరుద్ధభాషణము లాడినఁదత్పల మాతఁడందెడున్ (ఆంధ్ర మహాభారతం, ఉద్యోగ పర్వం, ప్ర.ఆ, 32 వ పద్యం)*

ఈ పద్య భావాన్ని గమనించినట్లైతే ఏ మాత్రము దీనత్వం లేకుండా దూత సముచితంగా పాండు రాజు రాజ్యభాగం రాజోత్తముడైన ధర్మరాజు ఇష్టంతో వేదుకుంటున్నాడు అన్నప్పుడు లోక సాధారణమైన న్యాయం చొప్పున తగినట్లుగా సగౌరవంగా ఆ

దుర్యోధనుడు ఇస్తే తీసుకుందాం. అట్లాకాక పరస్పర విరుద్ధంగా మాటలాడితే దాని ఫలం అతడు అనుభవిస్తాడని ఒక హెచ్చరిక రూపంలో తన అభిప్రాయాన్ని వెల్లడిస్తూ రాయబారి అనే వ్యక్తి మొదట సౌమ్యంగా మాట్లాడి దానికి తగిన సమాధానం అవతలి వారి దగ్గర నుండి రాకపోతే యుద్ధానికైనా సిద్ధపడేటట్లు రాయబార కార్యాన్ని జరుపుకుని రావాలనే భావం వ్యక్తమవుతుంది.

## 3.9. ద్రుపదుడు తెలిపిన రాయబార లక్షణాలు:

ద్రుపదుడు తన పురోహితున్ని రాయబారిగా పంపేటప్పుడు పలికిన ఈ మాటలు రాయబార లక్షణాలను తెలియజేస్తాయి.

*కం. "హితుఁడవు,మతిమంతుండవు,*
*చతురవచనకోవిదుఁడవు,సమయజ్ఞుఁడ,వు*
*న్నతవంశవర్ధనుఁడ,విం*
*గితవేదివి,నెచ్చెలివి,సుకృతివట్లగుటన్."*

*(ఆంధ్రమహాభారతం, ఉద్యోగ పర్వం,ప్రథమాశ్వాసం , 53 వ పద్యం)*

నీవు మాకు దగ్గరి వాడవు బుద్ధిమంతుడవు, నేర్పుగా ఎలా మాట్లాడాలో తెలిసిన పండితుడవు, సమయం తెలిసిన వాడవు ఉన్నత వంశాన్ని అభివృద్ధిపరిచేవాడవు, ఎదుటి వారి మనసులోని అభిప్రాయాన్ని తెలుసుకునేవాడవు ప్రియమిత్రుడవు, పుణ్యాత్ముడవు. ఇలా ద్రుపదుడు తన పురోహితునితో అన్న మాటలలో రాయబారిగా వెళ్ళవలసిన వ్యక్తి వాక్చాతుర్యంతో మాట్లాడాలని సమయానికి తగిన విధంగా మాట్లాడి కార్యం నెరవేర్చాలనే భావం వ్యక్తమవుతుంది.

## 3.10. ఆదిపర్వం– రాయబారాలు:

ఈ ఆది పర్వం గురించి తిరుమల వెంకట శ్రీనివాసాచార్యులు ఈ విధంగా తెలిపారు. మానవుడు తన పుట్టుక తాను ఎరుగడు. అజ్ఞానమునందే సృష్టి జరుగుచున్నది. శిశువు గర్భమున ప్రవేశించుట అనేక సంస్కారములతో భూమిపై జన్మించుట ఆదిపర్వమని

తెలియజేసారు.( **వెంకట శ్రీనివాసాచార్యులు, తిరుమల, శ్రీమహాభారత వైజ్ఞానిక సమీక్ష పుట:41.**).

ఆంధ్రమహాభారతంలోని రాయబారాలును ఈ క్రింది విధంగా పరిశీలిస్తున్నాను. అందులో మొదటగా ఆదిపర్వంలో నేను గమనించిన రాయబారాలు.

### 3.10.1. దేవదూత:

దేవదూత అంటే దేవతలు పంపించిన రాయబారి, దేవతలకు దూత అని అర్థం. ఆంధ్ర మహాభారతంలో రురుడు, తాను ప్రేమించిన ప్రమద్వర పాము కాటుకు బలైనప్పుడు రురుడు బాధతో ఏడుస్తుంటాడు. ఆ సమయంలో ఒక దేవదూత వచ్చి మరణించిన వారిని బ్రతికించడం సాధ్యం కాని పని కాని ఒక మార్గం ఉందని రురుని ఆయుర్దాయంలో సగం ప్రమధ్వరకు ఇచ్చినట్లైతే ఆమె బ్రతుకుతుందని చెప్తాడు. రురుడు దానికి అంగీకరిస్తాడు. ప్రమద్వర బ్రతుకుతుంది. ఇక్కడ దేవదూత యముడి అనుమతితో అతను చెప్పిన ఉపాయం చేత ప్రమద్వరను మృత్యువు నుండి కాపాడుతుంది.( ఆంధ్రమహా భారతం, ఆది పర్వం, ప్రథమాశ్వాసం, 150 వచనం,)

సంస్కృత భారతంలోని కథను ఒకసారి పరిశీలిస్తే రురుడు పాము చేత చనిపోయిన ప్రమద్వర గురించి విలపిస్తాడు. అలా అడవిలో విలపిస్తున్న రురుడు వద్దకు దేవదూత ఇలా అంటాడు. ఇక్కడ దేవదూత అదృశ్య రూపంలో ఇలా అంటాడు. ఇక్కడ దేవదూత అనగా దేవతల రాయబారి అంటే రురుని యొక్క రోధన అదృశ్య రూపంలో ఎవరో గ్రహించారని తెలస్తుంది. చూస్తే ఎవరూ కనబడరు. మనం ఎంత రహస్యమైన పనులు చేసినా ముందుగా తెలిసేది పంచభూతాలైన ఆకాశం, భూమి, అగ్ని, నీరు, వాయువు, వీటిని దాటి మానవుడు ఎక్కడా రహస్యంగా ఏ పని చేయలేడు ఇవి ప్రకృతిలో మమేకమై ఉంటాయి. మనం పరమాత్మను ప్రగాఢంగా నమ్మి ఉన్నప్పుడు కష్టం ఎదురైనప్పుడు మన మనసులో ని మర్మం కూడా తెలుసుకోగల శక్తి పంచభూతాలకుంది. వీటి ద్వారా సమాచారం దేవతలకు అందుతుంది. అలాంటి భావన ఉన్నవారు రురుడు అడవిలో విలపిస్తున్న సంగతి ఎవరు ఎవరి ద్వారా చెప్పి పంపలేదు. అతని రోదన ప్రకృతి గమనించింది. ప్రమద్వర ఎలాగైనా బ్రతకాలని నేను దాన పరుడునైతే, గురువులను సేవించే వాడినైతే, నిత్య కర్మలు ఆచరించే

వాడినైతే శ్రీకృష్ణ భగవానుని యందు నాకు నిశ్చల భక్తి ఉన్నట్లయితే ప్రమద్వర బ్రతకాలని చెప్తాడు అయితే మానవుడు మరణించిన తర్వాత తిరిగి ప్రాణం రావడం అసంభవం కాబట్టి దేవదూత వచ్చాడు. ‘‘ధర్మాత్మా నీవు ఇంతవరకు మాటలాడినవన్నీ అసత్యాలే ఆయువు తీరిన మానవునకు ప్రాణం ఉండదు. గంధర్వ, అప్సరసలకు పుట్టిన ఈ దీనురాలికి ఆయువు తీరాలి. అని మరణం యొక్క సహజ ధర్మాన్ని చెప్పి ఈ విషయంలో దేవతలు ఒక ఉపాయాన్నిపూర్వం చెప్పి ఉంచారు అది నీకు ఇష్టమైతే అది చేసి ప్రమధ్వరను పొందగలవు అనగానే రురుడు ఆకాశచారి అయిన దేవదూతతో తప్పకుండా చేస్తాను అంటాడు. రురువు యొక్క ఆయువులో సగం ప్రమధ్వరకు ఇవ్వగలిగితే ఆమె బ్రతుకుతుందనగానే రురువు అంగీకరిస్తాడు. ఈ రురువు తరపున గంధర్వరాజు అయిన విశ్వ వసువు, దేవదూత ఆ ఇద్దరు సత్పురుషులు కలిసి యమ ధర్మరాజు దగ్గరకు వెళ్ళి జరిగిన వృత్తాంతం చెప్పగా యమధర్మరాజు రురువు యొక్క ఆయుస్సులో సగం పొంది ఆమె బ్రతుకుతుందని చెప్పడంతో ప్రమద్వర బ్రతుకుతుంది.‘‘(సంస్కృత భారతం, ఆది పర్వం, తొమ్మిదవ అధ్యాయం,)

ఇక్కడ దేవదూత ద్వారా గంధర్వుడు విశ్వావసువు ద్వారా సమాచారం యమునికి చేరి ప్రమద్వర కు రురువు యొక్క సగం ఆయువును ఇచ్చి బ్రతికిస్తాడు. ఇక్కడ భూలోకం నుండి యమలోకానికి రాయబార వ్యవహారం కొనసాగిందని తెలుస్తుంది.

### 3.10.2. గౌరవ ముఖుని రాయబారం:

వేట యందు ఆసక్తి గల పరిక్షిత్తు మహారాజు అడవులకు వెళ్ళి జంతువులను వేటాడే సమయంలో బాణం దెబ్బతిన్న జింక తప్పించుకుని పోతుంది. పరిక్షిత్తు దానిని వెదుకుతూ మౌన వ్రతం చేస్తున్న శమీకుడిని అడుగుతాడు. అతను సమాధానం ఇవ్వక పోవడం చేత కోపంతో పరిక్షిత్తు చచ్చిపడి ఉన్న ఒక పామును తన వింటి కొన చేత తీసుకుని శమీకుని మెడలో తగిలించి తిరిగి హస్తినా పురానికి వెళ్తాడు. శృంగి తన తండ్రి శమీకుని మెడలో చచ్చిపడి ఉన్న పామును చూసి జరిగిన విషయాన్ని కృశుడనే ముని వలన తెలుసుకుని పరిక్షిత్తు మహారాజును ఏడు రోజుల లోపల తక్షకుడనే సర్పం యొక్క విషాగ్నికి

మరణిస్తాడని చెప్తాడు. శమీకుడు అప్పుడే మౌన వ్రతాన్ని వీడి కొడుకు ఇచ్చిన శాపానికి చింతిస్తాడు.

ఈ విషయంలో తాను ఏమి చేయలేకపోవడం చేత గౌరవ ముఖుడనే పేరుగల తన శిష్యుడిని పిలిచి ఈ విషయమంతా పరిక్షిత్తుకు తెలిపి తక్షకుడి వలన కలిగే భయాన్ని తొలగే ఉపాయం చేసుకొమ్మని పంపుతాడు. గౌరవ ముఖుడు వెంటనే పరిక్షిత్తు చెంతకు వెళ్ళి జరిగిన విషయాన్ని శృంగి శాపాన్ని తెలియజేసి భయాన్ని తొలగింపచేసే మంత్ర తంత్రాలను మొదలైన విధానాలను ఏర్పరచి ఎప్పుడూ జాగ్రత్తతో ఉండాలని బోధించి రమ్మని శమీకుడు నన్ను పంపాడని చెప్తాడు.( ఆంధ్ర మహాభారతం, ఆది పర్వం, (ద్వి.ఆ), 179 వ పద్యం.)

ఇలా గురువు గారి సందేశం చెప్పి వెళ్తాడు. గౌరవ ముఖుడు ఇక్కడ గౌరవముఖుడు తాను స్వయంగా ఆలోచించి చెప్పే ప్రయత్నం ఏమి చేయలేదు. శమీకుని ముని చెప్పిన మాటలనే యథాతథంగా పరిక్షిత్తుకు వివరించాడు. ఈ రాయబారం వలన పరిక్షిత్తు మహారాజు తక్షకుడి వలన హాని లేకుండా ఉండడానికి తగిన ఏర్పాట్లు చేసుకునే ప్రయత్నం చేస్తాడు. శమీకుడు తన వలన రాజుకు కలిగిన బాధను ఏ విధంగానైనా తొలగించే ప్రయత్నం చేస్తాడు.

### 3.10.2.1. శమీకుడు చెప్పిన రాజనీతి విశేషాలు:

సంస్కృత భారతంలో ఈ విషయాలను పరిశీలిద్దాం. శృంగి శాపాన్ని ఇచ్చిన విషయం తెలుసుకున్న శమీకుడు కొడుకుకు కొన్ని హిత వచనాలను చెపుతాడు. నీవు కోపంతో చేసిన పని తప్పు అతను దాహార్తి తో నా మౌన వ్రతాన్ని తెలియక అలా చేసాడనుకుంటున్నానని చెప్పి రాజు లేకపోతే జరిగే నష్టాన్ని కూడా తెలియజేసాడు.

1. దేశంలో రాజు లేకపోతే అనేక దోషాలు కలుగుతాయి. చోర భయం కలుగుతుంది. అధర్మంగా ప్రవర్తిస్తూ హద్దు మీరి ప్రవర్తించే వాళ్లని రాజు దండిస్తాడు.
2. శిక్షవల్ల భయం కలుగుతుంది. భయం వల్ల తాత్కాలికమైన శాంతి కలుగుతుంది. చోరాది భయంతో ఉన్నవాడు ధర్మాన్ని ఏ మాత్రం ఆచరింపలేడు ఉద్విగ్నంగా ఉన్న మానవుడు యజ్ఞ కర్మలు గాని శ్రాద్ధాది శాస్త్రీయ కర్మలు చేయలేడు.

3. రాజు ధర్మాన్ని స్థాపిస్తే ధర్మం నుండి స్వర్గ లోకం ప్రాప్తిస్తుంది. రాజ రక్షణం వల్లే బ్రాహ్మణులు యజ్ఞాల్ని సురక్షితంగా చేస్తారు. యజ్ఞాల వలన దేవతలు సంతోషిస్తారు.
4. దేవతలు సంతోషిస్తే సకాలంలో పంటలకు అనుకూలంగా వర్షాలు కురుస్తాయి. వర్షాల వల్ల ఓషధులు లభిస్తాయి. ఓషధులు బాగా పెరిగితే మనుష్యులకు చాలా మేలు కలిగి సుఖంగా ఉంటారు. కాబట్టి రాజు ఈ సమస్తానికి మూలాధారం వేదాధ్యయనపరులైన పదిమందితో ధర్మపరుడైన ఒక్క రాజు సమానమని మనువు చెప్పాడని రాజనీతి విషయాలను తెలియపరిచాడు. ఈ విషయాలు ఆంధ్ర మహాభారతంలో కనబడవు.

ఈ విషయాల వలన నిత్యం వేదాన్ని అధ్యయనం చేస్తే సమస్త లోకాలు క్షేమాన్ని పొందుతాయి అలాంటిది పది మంది వేదాధ్యయనం చేయడం ఇంకా శక్తి వంతంతో లోకాలు రక్షించబడుతాయి అటువంటి వారితో ధర్మంతో జీవించే రాజు సమానుడని మనువు చెప్పినట్లు శమీకుడు వివంచాడు.

ఈ విషయాలను పరిశీలిస్తే ఋషులు శాంత స్వరూపులు ఎదుటి వారు కోపోద్రేకాలకు లోనైనా ఋషులు చలించరు స్థిత ప్రజ్ఞను కలిగి ఉంటారు. అందుకే శృంగి రాజు విషయంలో తెలియక చేసిన పొరపాటుకు శాపమివ్వడంతో శమీకుడు బాధపడుతాడు. తన కొడుకు చేసిన పనిని సమర్థించకుండా తప్పని చెప్పాడు. రాజు పరిపాలన ఏ విధంగా ఉంటుందో తెలియజేయడంతో పాటు శృంగి వయసు బాల్యం కాబట్టి ఆ సమయంలో సాహసముంటుంది. హితబోధ చేయాలనుకుని కోపం వలన కలిగే నష్టాలు, శాంతం వలన కలిగే లాభాలు గురించి చెప్పడమే కాకుండా శమీకుడు శృంగితో కుమారా రాజు దగ్గరకు ఎవరినైనా పంపుతాను రాజు నిన్ను నా తెలివి తక్కువ కొడుకు శపించాడు నీవు నన్ను అవమానించావని కోపించి నా పుత్రుడిలా చేసాడని శమీక మహర్షి దయాళువు సచ్ఛీలుడు అయిన తన శిష్యుడు గౌరవముఖుడు అనే వానిని రాజు దగ్గరకు రాయబారిగా పంపుతాడు అతనితో కొన్ని సూచనలు చేస్తాడు.

### 3.10.2.2. శమీకడు రాజమర్యాదను తెలుపుట:

మొదటగా రాజును కుశల ప్రశ్నల్ని అడుగు తరువాత శాపానికి కారణాన్ని చెప్పు ఆ తరువాత కుమారుడిచ్చిన శాపాన్ని తెలియజేయి తరువాత తక్షకుని నుండి తప్పించుకునే ఉపాయాన్ని ఆలోచించుకోమని చెప్పమని ఆదేశించి రాజు దగ్గరకు పంపాడు.గౌరవ ముఖుడు కురు వంశోద్ధారకుడైన పరిక్షిత్తు దగ్గరకు వెళ్ళి ద్వారపాలకుడి ద్వారా తన రాకను తెలిపి రాజానుమతితో భవనంలో ప్రవేశించాడు. ఇది రాయబారి ప్రధాన లక్షణం.

మహారాజు గౌరవముఖుని సగౌరవంగా సత్కరించాడు. మంత్రుల సన్నిధానంలో గౌరవముఖుడు శ్రమలేకుండా పరిక్షిత్తుకు శమీకమహర్షి చెప్పిన సందేశాన్ని అంతటిని పూస గుచ్చినట్లు చెప్పాడు.

### 3.10.2.3. గౌరవ ముఖుడు పరిక్షిత్తు మరణాన్ని తెలుపుట:

గౌరవముఖుడు ముందు శమీకుని యొక్క పరమధర్మాన్ని శాంత స్వభావాన్ని తెలియజేసాడు. పరిక్షిత్తు శమీకుని మెడలో మృత సర్పాన్ని విడిచినప్పటికి శమీకుడు కోపగించలేదు క్షమించాడని శమీకుని గుణాలు తెలిపి తర్వాత అతని పుత్రుడు మాత్రం తండ్రికి జరిగిన అవమానాన్ని సహించలేక తండ్రికి కూడా తెలియకుండా ఏడు రోజుల్లో తక్షకుని చేతిలో మరణం సంభవించాలని శాపం ఇచ్చాడని ఈ పరిస్థితి నుండి నీవు తక్షకుని బారి నుండి రక్షించుకోవలసిందిగా మా శమీక మహర్షి పదేపదే కోరుతున్నాడు. ఈ శాపాన్ని మరలించడానికి ఏ విధంగాను సాధ్యం కాదు తన కుమారున్ని మహర్షి శాంత పరచలేకపోయాడు. మహారాజా ఆ కారణం వల్ల శమీక మహర్షి మీ మేలు కోరి నన్ను ఇక్కడికి పంపించారు. అనగానే పరిక్షిత్తు ఈ మాటలు వినగానే తన అపరాధానికి బాధ పడ్డాడు. తర్వాత గౌరవముఖుని ఆశ్రమానికి పంపిస్తూ భగవంతుడైన శమీక మునీంద్రులు మా యందు దయజేసి అనుగ్ర హించవలెనని ప్రార్థిస్తున్నాను అని ప్రతి సందేశం ఇచ్చి పంపించాడు. (సంస్కృత భారతం, ఆది పర్వం, 42 వ అధ్యాయం)

ఈ గౌరవముఖుని రాయబారం ఆంధ్ర మహాభారతంలో సంక్షిప్తంగా ఉంటుంది. సంస్కృత భారతంలో శమీకుని లో రాజనీతి, రాయబార లక్షణాలు ప్రస్ఫుటంగా

కనబడుతాయి. రాజనీతిలో భాగంగా రాజు లేకపోతే రాజు తన ధర్మాన్ని నిర్వర్తించకపోతే ప్రపంచం అల్లకల్లోలం అవుతుంది. అటువంటి రాజును కాపాడుకోవలసిన బాధ్యత అతని రాజ్యంలో నివసించే మనందరిది. మనం వారి క్షేమం కోరాలి కాని వారి నాశనాన్ని కోరకూడదు. పైగా పరిక్షిత్తు అసహన స్థితిలో ఉండి అపరాధం చేసాడు. నీవు ఆవేశంలో శాపమిచ్చావని అంటాడు అంతే కాకుండా గౌరవముఖుడు పరిక్షిత్తు మహారాజు దగ్గరకు వెళ్లేటప్పుడు రాయబార మర్యాదను పాటించాడు.

రాజుకు క్రమపద్ధతిలో సమాచారాన్ని వివరించుట:

రాయబారానికి వెళ్ళే వ్యక్తికి రాజు దగ్గర ఎలా ప్రవర్తించాలో క్రమపద్ధతిలో వివరించాడు

1. కుశల ప్రశ్న
2. శాపానికి కారణం, తరువాత కుమారుడు శాపాన్ని తెలియజేయడం,
3. తక్షకుని నుండి తప్పించుకునే ఉపాయం ఆలోచించమని చెప్పడం

   పరిక్షిత్తు మహారాజు మరణ విషయం అందరికి బాధాకరమైనది అందుకని ఆ విషయాన్ని ఎలా చెప్పాలో ఏ పద్ధతిలో చెప్పాలో అలా గౌరవముఖుడు చెప్పాడు. గౌరవ ముఖుడు కూడా తన గురువు చెప్పిన విషయాన్ని యధాతథంగా చెప్పాడు. కాని శమీకుని మహర్షి గుణం తెలియడానికి పరిక్షిత్తు ఎంత అవమానించినా సహనంతో భరించారన్న విషయం తెలిపి తర్వాత **శమీకుని పుత్రుడు మాత్రం సహనాన్ని కోల్పోయి' తండ్రికి కూడా తెలియకుండా''** అన్న వాక్యం ఉపయోగిస్తాడు. ఎందుకంటే తండ్రికి తెలిసి శాపం ఇచ్చి ఉంటే శమీకుడు ప్రతీకారం తీర్చుకున్నాడనే భావన పరీక్షిత్తుకు రానీయకుండా తండ్రికి తెలియకుండా శాపమిచ్చాడని చెప్పాడు. ఇది రాయబారి లక్షణం సమయస్ఫూర్తిగా శమీకుని పై నింద కలగకుండా జరిగిన విషయాన్ని సున్నితంగా తెలియజేసిన ఘనత గౌరవముఖునికి దక్కుతుంది.

   గౌరవముఖుని రాయబారం అంతగా ప్రాధాన్యతను ఇవ్వలేకపోయినప్పటికి ఈ రాయబారం చాలా ఆధ్యాత్మిక సంపదను తెచ్చిపెట్టింది ఆ కాలంలో చరవాణిలు

లేవు కదా పరిక్షిత్తుకు శాప విషయం చెప్పాలి. కాబట్టి ఈ రాయబారం జరిగింది. గౌరవముఖుని రాయబారం జరగక పోయి ఉంటే పరిక్షిత్తుకు శాప విషయం తెలిసేదే కాదు మరణం కూడా సహజ మరణమే అయిఉండేది. రాయబారం జరిగింది కాబట్టి తన శాప విషయాన్ని తెలుసుకున్న పరిక్షిత్తు ఆలస్యం చేయకుండా శుకుని ద్వారా ఏడు రోజులు భాగవతం చెప్పించుకుని తరించాడు. ఈ నాడు ఇన్ని కోట్ల మంది భాగవత కథలతో జన్మధన్యం చేసుకోవడానికి ఈ సంఘటన ఉపయోగపడిందని నా అభిప్రాయం.

### 3.10.3. కచుని రాయబారం

శుక్రుడు రాక్షసులకు గురువై దేవదానవుల యుద్ధంలో మరణించిన రాక్షసులను మృతసంజీవని విద్యతో బతికిస్తున్నాడు. ఇది దేవతలను భయ భ్రాంతులను చేసింది. మృత సంజీవని విద్యను శుక్రుని దగ్గర నుండి పొంది తీసుకురాగల సమర్థుడు ఎవరున్నారని విచారిస్తూ బృహస్పతి కుమారుడైన కచుని వద్దకు వెళ్తారు. శుక్రుని దగ్గర నుండి సంజీవని విద్యను తీసుకువచ్చి దేవతలను కాపాడమని చెప్తారు. శుక్రాచార్యుడు నిన్ను శిష్యునిగా స్వీకరించి నీకు ఆ విద్యను ఇవ్వగలడని కూతురు దేవయాని మాటలను శుక్రాచార్యుడు జవదాటడని ఆమె మనసుని లోబరుచుకునే శుక్రునికి శుశ్రూష చేస్తూ నీకు కార్యసిద్ధి కలుగుతుందని దేవతలు పంపుతారు.

#### 3.10.3.1. శుక్రాచార్యుని సేవకునిగా కచుడు:

కచుడు దేవతల మేలు కొరకు వృషపర్వుని పట్టణానికి వెళ్ళి అక్కడ శుక్రాచార్యునికి నమస్కారం చేస్తాడు. తాను బృహస్పతి కుమారుడు కచుడునని తమకు సేవచేయడానికి వచ్చానని చెప్తాడు. శుక్రుడు సంతోషంగా కచుడిని శిష్యునిగా స్వీకరిస్తాడు. కచుడు కూడా శుక్రునికి సేవలు చేస్తూ శుక్రునికి అతని కూతురు దేవయాని ప్రేమను అభిమానాన్ని సంపాదిస్తాడు.

### 3.10.3.2. కచుడు మృతసంజీవనిని గ్రహించుట:

కచుడు శుక్రాచార్యుని ఆశ్రయించడం సహించలేని రాక్షసులు హోమ ధేనువులను కాస్తూ ఒంటరిగా ఉన్న కచుడిని చంపి ఒక పెద్ద చెట్టు బోదెకు కట్టేసి వెళ్ళిపోతారు. దేవయాని కచుడు ఇంకా రాకపోవడానికి చింతిస్తుంది. శుక్రుడు తన దివ్య దృష్టితో జరిగిన విషయాన్ని తెలుసుకుని మృత సంజీవని విద్యను పంపించి కచుడిని బతికిస్తాడు. కొద్ది రోజుల తర్వాత మరలా రాక్షసులు కచుడిని బూడిద చేసి ఆ బూడిదను శుక్రుడు తాగే మద్యంలో కలిపేయగా శుక్రుడు దానిని తాగేస్తాడు. శుక్రుడు తన దివ్య దృష్టితో రాక్షసుల దుశ్చర్యను తెలుసుకుంటాడు. తన కడుపులోనే కచుడున్నాడని గ్రహిస్తాడు. మృత సంజీవని ద్వారా శుక్రుడు కచుడికి ప్రాణం పోస్తాడు. కడుపులో ఉన్న కచుడు తాను బయటకు వచ్చే మార్గాన్ని చెప్పమనగా శుక్రుడు నీకు మృత సంజీవని మంత్రాన్ని ఉపదేశిస్తాడు. దానిని నా కడుపు బద్దలు కొట్టుకుని బయటకు రాగానే మూర్ఛపడి ఉన్న నన్ను మరలా బ్రతికించమని శుక్రుడు కచుడికి సంజీవని విద్యను ఉపదేశిస్తాడు.

దీనితో కచుడు తను వచ్చిన పని పూర్తవుతుంది. కొంత కాలం వారితో ఉండి కచుడు స్వర్గానికి బయలుదేరుతాడు.

### 3.10.3.3. దేవయాని ప్రేమను కచుడు తిరస్కరించుట:

దేవయాని కచుడిపై గల ప్రేమను కోరికను తెలియజేస్తుంది. కచుడు దానిని తిరస్కరించడంతో తనను సోదరితో సమానంగా భావించానని చెప్తాడు. దేవయాని కోపంతో దేనికోసమైతే మృత సంజీవనిని తీసుకుని పోతున్నావో అది నీకు ప్రయోజనం లేకుండా పోతుందని చెప్పగా కచుడు నీ శాప వచనం చేత నాకు సంజీవని విద్య పని చేయకపోయినా నా చేత ఉపదేశం గ్రహించిన వారికి పనిచేస్తుందని చెప్తాడు. దేవయానిని బ్రాహ్మణుడు పెళ్ళి ఆడడని ఎదురు శాపమిచ్చి స్వర్గానికి వెళ్ళి అక్కడ దేవతలకు సంజీవని విద్యను ఉపదేశించి దేవతలకు మేలు చేసాడు.

ఇక్కడ కచుడు దేవతలకు రాయబారిగా శుక్రాచార్యుడి దగ్గరకు వెళ్తాడు. దేవతల కోరిక మేరకు తన కార్య సాధనలో మరణాన్ని కూడా లెక్క చేయకుండా రాక్షసుల చేత

బాధింపబడినవాడు అయినప్పటికి మృత సంజీవని విద్యను పొందుతాడు. దేవయానిని మచ్చిక చేసుకుని శుక్రునికి సేవలు చేసి అతని అభిమానాన్ని పొందాడు. మృత సంజీవనిని సంపాదించి దేవతల కార్యాన్ని నెరవేర్చాడు.

### 3.10.4. మేనక రాయబారం:

తపస్సాధనలో రాజర్షిగా ఉన్న విశ్వామిత్రుడు దానిపై స్థాయి అయిన బ్రహ్మర్షి స్థానాన్ని పొందగోరి అత్యంత భయంకరమైన తపస్సు చేస్తుండగా దేవేంద్రుడు భయపడి మేనకను పిలిపించి విశ్వామిత్రుని తపస్సును భంగపరచి స్వర్గ లోక గౌరవాన్ని కాపాడమని కోరుతాడు. మేనక విశ్వామిత్రుని కోపానికి తాను బలైపోతానేమోనని భయపడుతుంది. వసిష్ఠుడంతటి వాడిని పుత్ర శోకంలో ముంచిన కోప స్వభావుడైన విశ్వామిత్రుని దగ్గరకు వెళ్లమనడం న్యాయం కాదు. అతని కోపం ముల్లోకాలు భయపడిపోతాయి. అబలనైన నేను వెళ్ళడానికి భయపడుతున్నాను అయినా నా శక్తి కొలది ప్రయత్నిస్తానని చెప్పి విశ్వామిత్రుడి ఆశ్రమంలోకి ప్రవేశిస్తుంది. విశ్వామిత్రుని వనంలో మేనక తన అందచందాలు మైమరపించే విధంగా విశ్వామిత్రుని కంటిలో పడుతుంది. విశ్వామిత్రుడు మన్మథ బాణాలకు గురై ఆమెతో చాలా కాలం భోగించి అనుభవించగా వారిద్దరికి శకుంతల పుడుతుంది. మేనక ఆ బిడ్డను మాలినీ నది తీరానా ఒక ఇసుక తిన్నె మీద ఉంచి తాను దేవలోకానికి వెళ్ళి పోతుంది. విశ్వామిత్రుడు కూడా తపోవనానికి వెళ్ళిపోతాడు. (ఆంధ్ర మహాభారతం, చతుర్థాశ్వాసం, వచనం :46).

ఆంధ్ర మహా భారతంలో మేనక ఒక్కటే విశ్వామిత్రుని దగ్గర కు వెళ్ళినట్లు ఉంటుంది. సంస్కృత భారతంలో ఆమెకు సహకరించడానికి వాయువును కూడా ఇంద్రుడు పంపుతాడు మేనక వాయువు సహాయంతో విశ్వామిత్రునికి తపో భంగం కలిగిస్తుంది. అంతేకాకుండా మేనక రాయబారిగా చెప్పినట్లైతే ఆమె భయపడకూడదు కాని భయపడుతూనే తన కార్యాన్ని నెరవేరుస్తుంది.

ఇక్కడ దేవేంద్రుడు తన రాజ్యం యొక్క గౌరవం కాపాడడానికి మేనకను విశ్వామిత్రుని తపస్సును భంగం చేయడం అనే కార్యానికి రాయబారిగా పంపుతాడు. మేనక భయపడుతూనే తన కార్యాన్ని నెరవేరుస్తుంది. విశ్వామిత్రుని తపస్సు భంగం చేసి

దేవేంద్రుడు ఆజ్ఞాపించి పంపించిన కార్యాన్ని నిర్విఘ్నంగా పూర్తి చేస్తుంది. దానితో పాటు ఒక బిడ్డకు జన్మ నిస్తుంది. మేనక పని కేవలం విశ్వామిత్రుని తపస్సు భంగం చేయడం మాత్రమే కావున బిడ్డను వదిలి పెట్టి దేవలోకాలకు వెళ్ళిపోతుంది. విశ్వామిత్రుడు కూడా తపోవనానికి వెళ్ళిపోతాడు.

### 3.10.5. దేవదూత(అశరీర వాణి):

దుష్యంతుడు శకుంతలను నిరాకరించడంతో శకుంతల ఏడ్చి, ఆశలు వదులుకొని ఇకపై దైవమే శరణ్యమని భావించి ఆ ఉత్తమ పతివ్రత కొడుకును వెంటబెట్టుకుని తిరిగిపోతున్న సమయంలో దివ్యవాణి (ఆకాశ వాణి) ఇలా చెప్తుంది.

*చ. గొనకొని వీఁడు నీకును శకుంతలకుం బ్రియనందనుండు, సే*
*కొని భరియింపుమీతని శకుంతల సత్యము వల్కె సాధ్వి స*
*ద్వినుత మహాపతివ్రత వివేకముతో నని దివ్యవాణి దా*
*విని చె ధరాధినాథునకు విస్మయ మందఁగఁ దత్సభాసదుల్.(ఆంధ్రమహాభారతం, ఆది పర్వం, చతుర్థాశ్వాసం, 105 వ పద్యం).*

ఈ భరతుడు నీకు శకుంతలకు పుట్టిన కుమారుడు. ఇతనిని నీ దగ్గర కు తీసుకుని పోషించు, ఈ ఇల్లాలు మహాపతివ్రత, ఈమె చెప్పినదంతా నిజమేనని ఆకాశ వాణి ఆ సభలో వారు విని ఆశ్చర్య పడేటట్లు రాజుకు వినిపించింది. ఈ విధంగా శకుంతల పాతివ్రత్యాన్ని గురించి సత్యాన్ని, గురించి, భరతుడి పుట్టుకను గురించి మిక్కిలి సంతోషంతో కీర్తించే దేవతల మాటలు, విస్పష్టంగా ఆకాశం నుండి వెలువడగా దుష్యంతుడు విని సభా సదులతో ఈ విధంగా అన్నాడు. శకుంతలను ,తన భార్యగా, భరతుని తన పుత్రుని అంగీకరించి లోక నింద జరుగునేమోనని భయపడ్డాను కాని ఆకాశవాణి చెప్పడంతో ఆ సంశయం తొలగిపోయిందని వారిని సగౌరవంగా ఆదరించాడు.

ఈ విషయాలలోని విశేషాంశాలను పరిశీలిస్తే అశరీరవాణి యొక్క లక్షణం కనబడుతుంది. *"పురుషుడి వృత్తాన్ని గమనిస్తూ ఉండే మహాపదార్థాలలో శబ్దగుణం కలిగిన ఆకాశం సాక్ష్యం పలకడం అద్భుతం,ఔచిత్యం. అమూర్తమైన ఆకాశవాణికి*

*మానవీకరణం వస్తుకళా విశేషం. దుష్యంతుడిని ఇంత సుకుమారంగా మందలించి సత్యాన్ని ప్రతిష్ఠాపించిన ఆకాశవాణి మాటలు కూర్చిన ఈ రచనలో సౌకుమార్యమనే శబ్ద గుణం సార్థకంగా పోషించబడింది. పరుష వాక్యంతో తిరస్కరించిన దుష్యంతుడికి దివ్యవాణి సుకుమారంగా ధర్మాన్ని నిర్దేశించింది. దానిని వస్తుధ్వనితో నిర్వహించడం నన్నయ్య రచనాశిల్పం. ఆకాశ వాణితో పాటు దేవతల మాటలు కూడా వినబడ్డాయి ఇవి ఈ కథలోని విశేషం. (ఆంధ్రమహాభారతం, ఆది పర్వం, చతుర్థాశ్వాసం, 105 వ పద్యానికి ఇచ్చిన విశేషాంశాలు)''*

ఇక్కడ దివ్యవాణి, ఆకాశ వాణి అనే మాటలు ప్రధానంగా వినబడ్డాయి సంస్కృత భారతంలో అశరీర వాణి, దేవదూత అనే పదాలు ఉపయోగించడం చేత వచ్చింది దేవదూత  దేవతల రాయబారి అనే విషయం స్పష్టంగా తెలుస్తుంది. ఎందుకు దేవదూత వచ్చింది అనే ప్రశ్న వేసుకుంటే ధర్మాన్ని నిలబెట్టడం కోసమని మనం భావించాలి. ఇక్కడ ఆకాశ వాణి ద్వారా దేవదూత ద్వారా ధర్మం నిలబడిందనే విషయం స్పష్టమవుతుంది.

**''శకుంతలే తవ సుతః చక్రవర్తీ భవిష్యతి1**
**ఏవముక్తో మహేంద్రేణ భవిష్యతి న చాన్యథా11**
**సాక్షిత్వే బహవో2ప్యుక్తాః దేవదూతాదయో మతాః1**
**న బ్రువంతి యథా సత్యమ్ ఉతాహో2 ప్యనృతం కిల11**
**అసాక్షిణే మందభాగ్యా గమిష్యామి యథా22గతమ్**11(సంస్కృత భారతం, ఆదిపర్వం, 74 వ అధ్యాయం, 108వ శ్లోకం).

ఇదే విషయాన్ని సంస్కృత భారతంలో శకుంతలకు ఇంద్రుడు నీ కొడుకు చక్రవర్తి అవుతాడని చెప్పాడు అది అలాగే జరుగుతుంది. మరొకలా జరుగదు ఈ విషయంలో దేవదూతాదులు ఎందరో ఉన్నారు కాని వారిప్పుడు సత్యమో అసత్యమో చెప్పరు అందువల్ల సాక్షి లేని దురుదృష్ట వంతురాలిని వచ్చిన దారినే వెళ్తానని రాజుకు చెప్పి శకుంతల బయలుదేరుతుంది.

ఆ సమయంలో దేవదూత అంతరిక్షం నుండి అశరీర వాణి ఋత్విక్ పురోహితులతో మంత్రులతో కూడి ఉన్న దుష్యంతునికి ఇలా చెప్పింది.

ఇక్కడ దేవదూతను ఎవరో పంపించి రాయబారం నడిపి పరిస్థితిని చక్కచేయమని చెప్పినట్లు ఉండదు శకుంతల మాటలు అదృశ్య రూపంలో ఉన్న దేవదూత శకుంతల సమస్యను పరిష్కరించినట్లు అర్థమవుతుంది.

### 3.10.5.1.దేవదూత సంభాషణ:

దేవదూత దుష్యంతునితో తల్లి గర్భసంచిలో మోసేది మాత్రమే పుత్రుడు తండ్రికి సంబంధించిన వాడే ఎవని చేత అతను జన్మించాడో అతడి స్వరూపమే పుత్రుడు.అందువల్ల పుత్రుని భరించు. ఈ శకుంతలను అసాధారణమైన నీ భార్యగా చూసుకో ఆమెను అవమానించవద్దు దుష్యంతా ధర్మ బద్ధంగా స్త్రీలను గ్రహించడం పవిత్రమైన అసమానమైన కార్యం . నెల నెల రజస్సు వారి దోషాలను తొలగిస్తుంది. నరదేవా రేతస్సును ధరించే తండ్రే పుత్రుని కలిగించగలడు. ఆ కుమారుడు యమలోకం నుండి తన పితృగణాలను రక్షిస్తాడు. ఈమె యందు గర్భాన్ని కలిగించినవాడవు నీవు శకుంతల నిజం చెప్పింది. తన శరీరాన్ని రెండుగా విభజించుకొని భార్య తన కుమారున్ని కంటుందని చెప్పి పుత్రుని విడిచిపెట్టి జీవించే జీవనం దురదృష్టకరమని చెప్తుంది. అంతే కాకుండా నీ కుమారుడు భరతుడు అనే పేరుతో ప్రసిద్ధి చెందుతాడు. దేవదూత ఇలా చెప్పిన తర్వాత దేవతలు, ఋషులు , తపోధనులు, శకుంతల పతివ్రత అని సంతసించి పుష్పవృష్టిని కురిపించారు. దేవతలు చెప్పిన ఆ మాటలకు దుష్యంతుడు సంతోషించి సభాముఖంగా మీరంతా ఈ దేవదూత యొక్క మాటను బట్టి ఇతనిని కొడుకుగా గ్రహిస్తే లోకానికి శంకింపదగిన వాడవుతాడు స్వచ్ఛమైన వాడు కాలేడు అనగానే దేవదూత ద్వారా ఆ బాలుని స్వచ్ఛతను నిశ్చయించి మిక్కిలి ఆనందించి అతడిని కొడుకుగా స్వీకరిస్తాడు. అనంతరం రాజు ప్రేమతో తన కుమారునికి తండ్రి చేయదగిన సంస్కారాలను జరిపిస్తాడు. **(సంస్కృత భారతం, ఆది పర్వం, 74 వ అధ్యాయం, 113 శ్లోకం నుండి 119).**

ఈ విషయాలు శకుంతల చెప్పిన మాటలను నిజం చేస్తూ దుష్యంతుడికి పుత్రుడి పుట్టుక యొక్క రహస్యాలను, భార్య యొక్క గొప్పతనాన్ని వివరించి వైవాహిక బంధం బలపడేటట్లు చేయడం కనబడుతుంది.

### 3.10.6. దాసి(ఘూర్ణిక) రాయబారం:

ఈ రాయబారం ఆంధ్రమహాభారతంలో దేవయాని తనను వెతుకుతూ వచ్చిన ఘూర్ణిక కు తన పరిస్థితిని తన తండ్రికి చెప్పిపంపిస్తుంది.

**సంస్కృత భారతంలో**

దేవయాని, శర్మిష్ఠ ఒకరి చీరలు ఒకరు మార్చుకోవడం చేత మనస్పర్థలు ఏర్పడుతాయి. దీనితో కోపించిన శర్మిష్ఠ దేవయానిని వివస్త్రను చేసి పాడుబడిన నూతిలో పడేసి వెళ్ళిపోతుంది. తర్వాత యయాతి ఆమెను కాపాడుతాడు. దేవయాని యయాతిని వివాహమాడాలని అనుకుంటుంది. అక్కడే అడవిలో దేవయాని కూర్చుని ఏడుస్తుంటుంది. శుక్రుడు దేవయాని ఇంటికి రాకపోయేసరికి దాదితో ఇలా అంటాడు. ధాత్రీ నీవు త్వరగా దేవయానిని తీసుకుని రా అని చెప్పగానే ఆమె వెళ్ళిన ప్రదేశాలన్నీ ఆమె కోసం వెతుకుతుంది ఒక చోట అలసిపోయి దీనంగా ఏడుస్తూ ఉన్న దేవయానిని చూసి దాది ఇలా అంటుంది.

*“వృత్తం తే కిమిదం భద్రే శీఘ్రం వద పితా22హ్వయత్1”(సంస్కృత భారతం, ఆదిపర్వం, 78 వ అధ్యాయం, 24 వ శ్లోకం).*

నీకేం జరిగింది. ఇలా ఉన్నావు తొందరగా చెప్పు నీ తండ్రి నిన్ను పిలిచాడని సమాచారాన్ని అందిస్తుంది. అప్పుడు దేవయానిదుఃఖంతో తపించినదై దేవయాని తనకెదురుగా వచ్చిన ఘూర్ణిక (దాది)తో ఇలా అంటుంది. ఘూర్ణికా తొందరగా వెళ్ళు శీఘ్రంగా నా తండ్రికి చెప్పు నేను వృషపర్వుని నగరాన్ని ప్రవేశించనని చెప్పమంటుంది. ఘూర్ణిక అక్కడున్న రాక్షసమందిరానికి వెళ్ళి శుక్రుని చూసి కంగారుపడుతున్న హృదయంతో వృషపర్వుని కూతురైన శర్మిష్ఠ వనంలో దేవయానిని కొట్టిందని. చెప్పగానే శుక్రుడు బాధపడుతూ కూతురును వెతుక్కుంటూ అడవికి వెళ్ళి దేవయానిని చూస్తాడు. **(సంస్కృత భారతం , ఆది పర్వం, 78 వ అధ్యాయం, 29 వశ్లోకం)**

ఇక్కడ ఘూర్ణిక దేవయాని ఏమి చెప్పి పంపిందో ఆ విషయాన్ని యథాతథంగా చెప్పింది అయితే కంగారు పడుతూ శుక్రునికి ఈ విషయాన్ని తెలుపుతుంది. రాయబారం

జరిపే వ్యక్తి కంగారు కంటే సమయస్ఫూర్తి ఎక్కువగా ఉండాలి. ఈ దాసి లో ఆ గుణం కనబడలేదని తెలుస్తుంది.

### 3.10.7. భీష్ముని రాయబారం: (స్వీయ రాయబారి).

శంతనుడు దాశరాజు కుమార్తె యోజనగంధి పై మనసు పడతాడు. దాశరాజు తన కుమార్తెను ఇవ్వాలంటే ఆమెకు పుట్టిన కోడుకే రాజ్యాన్ని పరిపాలించాలని
చెప్పడంతో తన కొడుకు భీష్ముడు ను గుర్తుచేసుకుని బాధతో ఇంటికి తిరిగి వచ్చేస్తాడు అది గ్రహించిన భీముడు తన తండ్రి దుఃఖానికి కారణాన్ని తెలుసుకుని తన తండ్రికి పెళ్ళిచేయడానికి మంత్రులు, పురోహితులు మిత్రులు మొదలగు వారితో సంప్రదించి దాశరాజు వద్దకు స్వీయరాయబారియై వెళ్తాడు.

#### 3.10.7.1. భీష్ముడు ప్రతిజ్ఞ:

దాశరాజు దగ్గరకు వెళ్ళిన భీముడు సత్యవతిని తన తండ్రికి ఇవ్వమని కోరగా దాశరాజు తన కూతురుకు పుట్టిన పిల్లలే రాజ్యాన్ని పరిపాలించేవారు కావాలని అప్పుడే తన కూతురు వివాహానికి అంగీకరిస్తానని చెప్పగా దానికి భీష్ముడు ప్రభువులందరి ముందు తాను తండ్రి గారి ప్రయోజనం కొరకు యోజన గంధికి పుట్టిన కొడుకే రాజ్యం చేయడానికి హక్కుగలవాడు అవుతాడు. అతడే మాకందరికి ప్రభువు. కౌరవ వంశాన్ని నిలిపేవాడు అవుతాడని చెప్తాడు. అంతటితో తృప్తి చెందక భీష్ముడికి తర్వాతికాలంలో పిల్లలు కలిగితే వారు విధించిన నియమాన్ని పాటిస్తారా అంటే

భీష్ముడు వెంటనే తాను బ్రహ్మచర్యా వ్రతాన్ని స్వీకరించాను మీకు ఎటువంటి సమస్య ఉండదని తెలియజేస్తాడు. దాశరాజు మిక్కిలి సంతోషంతో శంతనునికి సత్యవతిని ఇవ్వడానికి అంగీకరిస్తాడు. భీష్ముడు ఆమెను గౌరవ మర్యాదలతో హస్తినాపురికి ఆమెను తన వెంట తీసుకుని వస్తాడు. శంతనుడు ఆమెను వివాహం చేసుకుని  భీష్మునికి ఎప్పుడు కోరుకుంటే అప్పుడు మరణం సంభవించే విధంగా వరమిస్తాడు. (**ఆంధ్ర మహాభారతం, ఆది పర్వం, చతుర్థాశ్వాసం, 178 వ వచనం**).

ఇక్కడ తన తండ్రి కోసం సత్యవతిని తీసుకురావడం కోసం భీష్ముడిని ఎవరూ ప్రేరేపించి దాశరాజు వద్దకు పంపించి రాయబారం జరపలేదు. భీష్ముడే స్వయంగా తండ్రి బాధను తెలుసుకుని తండ్రి మనసులో ఎవరున్నారో గ్రహించి స్వీయ రాయబారియై వెళ్తాడు. ఆ కార్యాన్ని నెరవేర్చే క్రమంలో ఎవరికి సాధ్యం కానటువంటి వారసత్వం గా వచ్చే రాజ్యాన్ని వదిలి పెట్టడం. వివాహ ప్రసక్తే లేకుండా తన తండ్రి కోసం బ్రహ్మ చర్య వ్రతాన్ని స్వీకరించడం చేస్తాడు. ఇటువంటి కఠినమైన ప్రతిజ్ఞలతో  రాయబారాన్ని దిగ్విజయం చేస్తాడు. నిస్వార్థపరమైన స్వీయ రాయబారి భీష్ముడు  సత్యవతిని శంతనుని చెంతకు చేర్చి శంతనుని నుండి తాను కోరినప్పుడు మాత్రమే మరణం సంభవించేలా వరాన్ని పొందుతాడు కీర్తి, ప్రతిష్ఠలు పొందుతాడు.

భీష్ముడు స్వీయ దూత అని వల్లివేడు విద్యాలత **"దూత్య సాహిత్యము" లో** పేర్కొన్నారు. స్వీయ దూత లక్షణాలు వివరిస్తూ ఈ విధంగా తెలియజేసారు." స్వయం దూతలలో మూడు వర్గాలున్నాయి. దూత నియామకమునకు అవకాశములేని పరిస్థితులలో స్వప్రయోజనము కొఱకు స్వయముగా దూత్యము నడపుకొనెడి వారు మొదటి వర్గమునకు చెందినవారు.ఒరుల చేత దూతలుగా నియమితులై ఆత్మ ప్రయోజనము సాధించుకొనెడి స్వార్థపరులకు స్వయం దూతలు అధములు. కోరకపోయినను పరప్రయోజనార్థము దూత్య భారము వహించెడి త్యాగధనులగు ఉత్తములు మూడవ వర్గమునకు చెందినవారు. ( **విద్యాలత, వల్లివేడు. దూత్య సాహిత్యము , (115,16,17 శతాబ్దములు, పుట:74).**

ఈ వర్గాలను పరిశీలించినప్పుడు భీష్ముడు మొదటి వర్గానికి చెందిన స్వయం దూతగా తెలియజేయబడుతుంది.

### 3.10.8. స్వీయ రాయబారం( దృష్టద్యుమ్నుడు రాయబారం):

*ధృష్టద్యుమ్నస్తు పాంచాల్యః పృష్ఠతః కురునందనౌ*
*అన్వగచ్ఛత్ తదా యాంతౌ భార్గవస్య నివేశనే11*
*సో2జ్ఞాయమానః పురుషాన్ అవధాయ సమంతతః*
*స్వయమారాన్నిలీనో భూద్ భార్గవస్య నివేశనే 11 (*

*సంస్కృత భారతం, ఆది పర్వం, 191 వ అధ్యాయం, 1,2 శ్లోకాలు ).*

ద్రౌపది స్వయంవరం తరువాత దృష్టద్యుమ్నుడు తన సోదరిని పెళ్ళి చేసుకున్నది ఎవరని తెలుసుకోవడానికి భీమార్జునులకు తెలియకుండా చాలామంది సేవకులను అంతటా పెట్టి తాను భార్గవుని ఇంటి దగ్గర అజ్ఞాతంగా ఉంటూ ద్రౌపది ఏ పరిస్థితిలో ఉందో తెలుసుకోవాలనుకుంటాడు.

పాండవులు కుంతి, ద్రౌపది, వారి దినచర్యను గమనించాడు, అన్నం భాగాలుగా చేసుకుని తినే పద్ధతిని, ఇంకా పాండవులు సైనికాధికారాల గురించి, దివ్యాస్త్రాలగురించి, రథాల గురించి, ఏనుగులు , ఖడ్గాలు, గదలు, మున్నగు వాటిని గురించి చర్చించుకోవడం వింటాడు. అవన్నీ రహస్యంగా విన్న దృష్టద్యుమ్నుడు ద్రుపదునికి ఈ వివరాలు చెప్పాలని త్వరగా బయలుదేరి చెప్తాడు. అప్పుడు ద్రుపదుడు నేను మా అమ్మాయిని ఎవరికి ఇచ్చాను. హీనకులజునకు ఇచ్చానా లేదు కదా అర్జునుడే మా అమ్మాయిని వరించాడా వంటి అనేక అనుమానాలతో ఉంటాడు. దానికి ధృష్టద్యుమ్నుడు పాండవుల వేషభాషల్ని ద్రుపదునకు చెప్తున్నాడు.ద్రౌపది వారికి సపర్యలు చేసిన విషయాన్ని, భోజనమయ్యాక ద్రౌపది వారి పాదాల వద్దే పడుకునే విషయాన్ని చెప్తాడు. వారి మాటలను బట్టి వారు బ్రాహ్మణ , వైశ్య, శూద్రులు కారని అర్థమవుతుంది. పాండవులు లాక్షగృహ దహనం నుండి తప్పించుకుని ఉన్నారన్న విషయం తెలుసుకదా వారే వీరైఉంటారని నాకనిపిస్తుంది. ఇదంతా విన్న ద్రుపదునికి అనుమానం తీరలేదు ద్రుపద పురోహితుడిని దూతగా పంపిస్తాడు.

ఇక్కడ ధృష్టద్యుమ్నుడు ఎవరికి కనబడకుండా స్వీయరాయబారియై తన చెల్లెలు ఒక ఆడపడుచు అత్తారింటికి వెళ్ళినప్పుడు ఆమె బాగోగులను చూసుకోవడం పుట్టింటి వారి బాధ్యత ఇక్కడ ధృష్టద్యుమ్నుడు అదే పని చేసాడు. నేరుగా వెళితే అవతలి వారు బాగా అమ్మాయిని చూసుకుంటున్నట్లు నటించవచ్చు. అందుకని రహస్యంగా ద్రౌపది ఎలాంటి పరిస్థితిలో ఉందో సుఖంగా ఉందో లేదో అని పరిశీలించాడు. ఈ రాయబారం సోదరి ప్రేమను తెలియజేస్తుంది.

**ఆంధ్రమహాభారతంలో**

*“ నిట ద్రుపదుండు తన కూఁతునకు వరుండైన వాఁడెవ్వఁడో యేవంశంబునవాఁడో వాని చరితం బెట్టిదో యెఱింగి రమ్మని ధృష్టద్యుమ్నుం బనిచిన నతండు భీమార్జున ద్రౌపదుల పిఱుందన వచ్చి తన్నొరులు లెఱుంగకుండ నక్కుంభకార గృహంబున నుండి యంత వృత్తాంతంబు నెఱింగిపోయి ద్రుపదుని కిట్లనియె.” (ఆంధ్ర మహాభారతం, ఆదిపర్వం, సప్తమాశ్వాసం, 222 వ వచనం).*

ద్రుపదుడు స్వయంగా తన కూతురుకి భర్త అయినవాడు ఎవడో? ఏ వంశం వాడూ? అతని చరిత్ర ఎటువంటిదో? తెలుసుకుని రమ్మని దృష్టద్యుమ్నుని పంపాడు. అతడు భీమార్జున ద్రౌపదుల వెనుకనే వచ్చి, ఇతరులు తనను చూడకుండా ఆ కుమ్మరి వాని ఇంట్లో ఉండి అంతా గ్రహించి ద్రుపదునితో చెప్తాడు.

### 3.10.9. ద్రుపద పురోహిత రాయబారం:

ద్రుపదుడు కుమ్మరి వాని ఇంట్లో ఉన్న ఐదుగురు వ్యక్తులను ఒక స్త్రీని వారితో పాటు ఉన్న ద్రౌపదిని వారి భాషలను విని తన పురోహితుడిని **“మీరు పాండు పుత్రులైన పాండవులేనా”** అని అడిగి రమ్మని పంపుతాడు. రాజు యొక్క ఆజ్ఞను ద్రుపద పురోహితుడు వారి వద్దకు పోయి వారి గుణ గానం చేసి రాజైన ద్రుపదుని మాటలను ఒక్కొక్కరిని క్రమంగా పలుకరిస్తాడు. ద్రుపద మహారాజు వారి యొక్క వివరాలను, వారి జాతి కులాన్ని తెలిపి ద్రుపద మహారాజుని ఆనందింప చేయండని అనడంతో రాయబారి మొదట తన రాజు యొక్క సంతోషాన్ని కోరుకుంటున్నట్లు తెలుస్తుంది. తర్వాత రాజు యొక్క చిరకాలం యొక్క కోరిక పాండవులతోటి సంబంధమని అందులో అర్జునునికిచ్చి ద్రౌపది నిచ్చి వివాహం చేయడం అతని కోరిక తీరితే నాపూర్వ శుభకర్మల ఫలితాన్ని తాను పొందినట్లేనని ద్రుపద పురోహితుడు ద్రుపదుని అభిప్రాయాలను చెప్తాడు.

ఇక్కడ రాయబారి ఎలాగైనా తను రాజు సంతోషపడే విధంగా వివరాలు రాబట్టే ప్రయత్నం చేస్తున్నాడు.

దానికి ధర్మరాజు  ముందు ఎటువంటి సమాధానం ఇవ్వకుండా రాయబారిగా వచ్చిన వ్యక్తిత్వం గుర్తించి అతనికి ఆదర సత్కారాలు అర్ఘ్యపాద్యాలతో గౌరవింప చేయమని భీముని ఆదేశిస్తాడు. అలా భీముడు అతిథి సత్కారం పూర్తయిన తర్వాత  అర్ఘ్య పాద్యాలు

స్వీకరించి సంతోషంగా ఉన్న సమయంలో ధర్మరాజు నేరుగా ద్రుపద మహారాజు కోరిక అర్జునునికి ద్రౌపదినివ్వడం అలా జరగలేదు. ద్రుపదులు తన కోరిక ప్రకారంగా కన్యను ఇవ్వలేదు లక్ష్యాన్ని ఛేదించినవానికే కన్యనిస్తానని శుల్కాన్ని కూడా నిశ్చయించాడు. ఆ రకంగా అర్జునుడు అనకుండా వర పురుషుడు నియమానుసారం. లక్ష్యాన్ని భేదించి పొందాడని చెప్తాడు. పరోక్షంగా అడుగుతున్నట్లు మా వర్ణ , కులాన్ని గురించి అడుగుతున్నావు ఆ రోజు రాజు వర్ణ, కుల, గోత్ర, వివక్షను పాటించలేదు. వింటిని లక్ష్యాన్ని ఎక్కు పెట్టి ఛేదించిన వాడికి కన్యనిస్తానన్నాడు ఇతను గెలిచాడు. తీసుకుని వచ్చాడు. ఇందులో ద్రుపదుడు బాధపవడవలసినదో, కష్టపడవలసిందో లేదు, ఇలా ధర్మరాజు అతనికి తెలివిగా సమాధానం చెప్పి చివరలో ద్రుపదుని కోరిక సిద్ధిస్తుంది. మేము కూడా యోగులం కాగలం, విల్లు ఎక్కుపెట్టడం అంత సామాన్యుడు వేయలేదు. హీన కులంలో పుట్టినవాడు కాని  మరొకరు కాని మత్స్యాన్ని పడగొట్టడం అసంభవం. కావున ద్రుపదుని కుమార్తె విషయంలో బాధపడవలసిన అవసరం లేదని చెప్తాడు. ఇలా మాట్లాడుతూ ఉండగానే ద్రుపదుడు మరో దూతను పంపించి ద్రుపదుడు మీకొరకు విందు సిద్ధం చేసాడని చెప్తాడు. **(సంస్కృత భారతం, ఆది పర్వం, 192 వ అధ్యాయం,).**

ఇక్కడ ద్రుపద పురోహితుని రాయబార కార్యక్రమం ముగించుకుని వెళ్ళే సమయానికి ద్రుపదుడు మరొక దూతను పంపించి వివాహ నిమిత్తంగా భోజనానికి ఆహ్వానింపచేస్తాడు.

### 3.10.10. అనామిక దూత:

**జన్యార్థమన్నం ద్రుపదేన రాజ్ఞా**
**వివాహహేతోరుపసంస్కృతం చ**
**తదాప్నువధ్వం కృతసర్వకార్యాః**
**కృష్ణాం చ తత్రైవ చిరం న కార్యమ్11 (సంస్కృత భారతం, ఆది పర్వం, 193 వ అధ్యాయం, 1 వ శ్లోకం).**

ద్రుపదుడు మరొక దూతను పాండవులున్న చోటుకు పంపిస్తాడు.దూతకు పేరు లేదు కాని వారి దగ్గరకు వచ్చి మీ పనులు పూర్తి చేసుకుని భోజనానికి ఆహ్వానిస్తాడు.

అంతేకాదు దూత చేత అలంకరించబడి రాజశ్రేష్ఠులు అధిరోహించగల రథాలను దూత తీసుకుని వచ్చి వారందరిని అందులో ఎక్కి ద్రుపదుని రాజమందిరంలోకి ప్రవేశించండని దూత చెప్పడంతో పాండవులు ద్రుపద పురోహితుని పంపించిన రథాలపైన రాజభవనానికి బయలుదేరుతారు.

ద్రుపదుడు పురోహితుని ద్వారా ధర్మరాజు చెప్పిన మాటలన్నీ విని ఇంకా అనుమానం తీరక వీరు బ్రాహ్మణులు కాదు క్షత్రియులని నిరూపించడానికి ఒక వైపు వస్తుసామగ్రిని మరోవైపు యుద్ధ సామగ్రిని ఏర్పాటు చేస్తాడు.

ఆంధ్ర మహా భారతంలో ద్రుపదుడు తన పురోహితుడిని పిలిచి వారి విషయం చక్కగా తెలుసుకుని రమ్మని పంపుతాడు. సంస్కృత భారతంలో నేరుగా మీరు పాండవులేనా అని అడిగి రమ్మంటాడు. ఈ మార్పును గమనించాను. అంతేకాదు సంస్కృత భారతంలో ఒక దూత విందుకు ఆహ్వానించినట్లు ఉంటుంది. ఆ దూత పేరు చెప్పలేదు. పైగా ఈ దూత ద్రుపదపురోహితుని రాయబారం జరుగుతుండగానే మధ్యలో వచ్చి విందుకు ఆహ్వానిస్తాడు.

ఆంధ్రమహాభారతంలో **"ద్రుపదుండు ధృష్టద్యుమ్నుం జూచి 'చాతుర్వర్ణ్యోచితంబు లయిన రథంబులు గొని పోయి వారలం దొడ్కొని రమ్మని పంచిన వాఁడును నాక్షణంబు పాండవుల పాలికి వచ్చి యీ రథంబు లెక్కి మారాజు నొద్దకురండనిన" ...." (ఆంధ్రమహాభారతం, ఆదిపర్వం, సప్తమాశ్వాసం, 235 వ వచనం).**

ద్రుపదుడు ధృష్టద్యుమ్నుని పంపగా ధృష్టద్యుమ్నుడు ఈ రథాలెక్కి మా రాజు దగ్గరకు రండి అని పలుకగా బంగారు రథాలు ఎక్కి వారు వెళతారు.
ఇక్కడ దూత కు ఉన్న పేరు మార్పును నేను గమనించాను.

### 3.10.11. దుర్యోధనుని వేగులు:

రాజుకు నమ్మకం కలిగిన కొందరు వేగులు హస్తినాపురానికి వెళ్ళి కర్ణ , దుశ్శాసన, శకుని సోమదత్తులు చుట్టూ చేరి ఉండగా సభలో ఉన్న దుర్యోధనునికి నమస్కరించి ద్రౌపది స్వయం వర విశేషాలు తెలియేస్తారు.

ద్రౌపద స్వయం వరంలో మత్స్యయంత్రాన్ని ఛేదించి ద్రౌపదిని గెలుచుకున్న అర్జునుని గురించి , ద్వంద్వయుద్ధంలో కర్ణుడిని ఓడించిన భయంకరమైన బలం కలవాడు భీముడని, యుద్ధ ప్రారంభంలో మహారథులు, బలవంతులు అయిన ధృతరాష్ట్ర మహారాజు కుమారుల గర్వాన్ని అణచిన వాళ్ళు ధర్మరాజు నకులసహదేవులని వేగులు చెప్పగా దుర్యోధనుడు బాధపడుతాడు.

**(ఆంధ్రమహాభారతం, ఆదిపర్వం,(రెండవ సంపుటి,) అష్టమాశ్వాసం, 10, 11 పద్యాల భావం**).

ఇదే విషయం సంస్కృత భారతంలో కూడా ఉంటుంది. అక్కడ వేగులు అనే పదాన్ని కాకుండా దూత అనే పదాన్ని వినియోగించారు.

*తతో రాజ్ఞాం చరైరాప్తైః ప్రవృత్తిరుపనీయత*

*పాండవైరుపసంపన్నా ద్రౌపదీ పతిభిః శుభా11 (సంస్కృత భారతం, ఆది పర్వం,199 వ అధ్యాయం, 1 వ శ్లోకం).*

ఇది రాయబారం క్రిందే వస్తుందని నేను భావిస్తున్నాను.. అయితే ఇక్కడ రాయబారులు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎవరిని పంపలేదు. కాకపోతే రాజుల మీద అభిమానం ఎక్కువగా ఉండడం దుర్యోధనుని దూతలు దుర్యోధనునికి చెప్పే రహస్యవిషయాల మీదే ఆసక్తి చూపుతారు కనుక ద్రౌపది పాండవుల వివాహ రహస్యాలను తెలియజేసారని నాకు అర్థమవుతుంది.

*మామిడి పూడి వేంకట రంగయ్య కౌటిల్యుని అర్థ శాస్త్రం లో దూత యొక్క లక్షణాన్ని ఈ విధంగా తెలియజేసాడు.(శత్రువు యొక్క) బంధువులను రత్నములను అపహరించుట, రహస్య సమాచారమును సేకరించుట, పరాక్రమ ప్రదర్శనము హామీగా ఉంచబడిన వారిని తప్పించుకొనునట్లు చేయుట రహస్య చర్యల ప్రయోగము అని దూత చేయవలసిన పనులు.(దూతలు గూఢచారులుగా ప్రవర్తించువారని దీని నుండి తెలియుచున్నది)*

*( వేంకట రంగయ్య మామిడి పూడి,కౌటిల్యుని అర్థశాస్త్రం(తెలుగు అనువాదం), పుట:40)*

ఈ దూత లక్షణం దుర్యోధనుని దూతలకు సరిపోలుతున్నదని నేను భావిస్తున్నాను. ద్రౌపది వివాహం వంటి రహస్య సమాచారాన్ని దూతలు దుర్యోధనుని సభలో నివేదించారని తెలుస్తుంది.

## 3.11. సభాపర్వం – రాయబారాలు – పరిశీలన:

*ఈ సభా పర్వం రాయబారాల గురించి సర్వేంద్రియ మనో వికాసమని తిరుమల వెంకట శ్రీనివాసాచార్యులు తెలియజేసారు.( వెంకట శ్రీనివాసాచార్యులు,తిరుమల,శ్రీమహాభారతవైజ్ఞానికసమీక్ష(ఆదిపర్వం).పుట:41.).*

సభాపర్వంలో రాయబారాలను ఈ క్రింది వివరిస్తున్నాను.

### 3.11.1. నారద రాయబారం:

నారదుడు ధర్మరాజుకు హరిశ్చంద్రుని గొప్పతనం గురించి చెపుతాడు. హరిశ్చంద్రుడు దేవేంద్ర లోకాన్ని పొందిన విధానం గురించి చెప్పి యమ సభలో రాజులందరితో ఉన్న పాండురాజు నారదునితో చెప్పిన మాటలను ధర్మరాజుకు నారదుడు తెలియజేస్తాడు. పాండురాజు యమసభలో ఉన్న విషయాన్ని రాజసూయ మహాయాగం చేసిన పుణ్యాత్ములంతా ఇంద్ర సభలో ఉన్న విషయాన్ని ధర్మరాజుకు తెలియజేయమని ఆ యాగం చేయడానికి ఉచిత రీతిని అతన్ని ఆజ్ఞాపించమని ధర్మరాజు రాజసూయ యాగం చేస్తే పాండురాజుకు పితృ పితామహ సమూహంలో ఇంద్రలోక సుఖప్రాప్తి కలుగుతుందని పాండురాజు చెప్పిన మాటలన్నీ నారదుడు ధర్మరాజుకు తెలియజేస్తాడు. (ఆంధ్రమహాభారతం, సభాపర్వం, ప్రథమాశ్వాసం, 88 వ పద్యం ).

ఇక్కడ నారద మహర్షి చెప్పిన విషయాలన్నీ రాయబారం వలన ధర్మరాజు రాజసూయ మహాయాగం చేయడానికి అవకాశం ఏర్పడింది. ధర్మరాజు ధౌమ్యాదుల సలహాల మేరకు తమ్ముళ్ల సమ్మతిని తీసుకుని రాజసూయ యాగం చేయడానికి పూనుకున్నాడు.

సంస్కృత భారతంలో కూడా పై విషయాలను యథాతథంగా ఉన్నాయి ఇవే కాకుండా రాజసూయ యాగం చేస్తే హరిశ్చంద్రుని వలె ఎన్నో సంవత్సరాలు ఇంద్రసన్నిధిలో ఆనందాన్ని అనుభవించగలనని చెప్పి పంపిస్తాడు పాండురాజు నారదునికి.

అంతే కాకుండా రాజసూయ యాగానికి ఆటంకాలు వచ్చే అవకాశం ఉందని బ్రహ్మ రాక్షసులు ఎన్నో విఘ్నాలను కల్పిస్తారు. ఈ యాగాన్ని అనుష్ఠించడం వలన ఈ భూమండలం పై సర్వక్షత్ర వినాశకమైన యుద్ధం సంభవించేందుకు కారణమైన సంఘటన జరిగే అవకాశం కూడా ఉన్నది. నాలుగు వర్ణాలను రక్షించడంలో నిత్యము జాగ్రత్తగా ఉండమని అప్రమత్తుడివై ఉండు లోకంలో అభ్యుదయాన్ని పొందు. ఆనందంగా ఉండు, ధనంతో బ్రాహ్మణులను తృప్తులను చేయి నీవు నన్ను అడిగిన విషయాన్ని వివరంగా చెప్పాను. నీవు అనుమతిస్తే ఇక్కడ నుండి ద్వారకకు వెళ్తానని వారి అనుమతి తీసుకుని తన వెంట వచ్చిన మునులతో కలిసి నిష్క్రమిస్తాడు.. (సంస్కృత మహాభారతం, సభా పర్వం, 12 అధ్యాయం).

### 3.11.2.దూత:(ఇంద్ర సేనుడు):

**శాసన హరుడు** అనే రాయబార లక్షణాన్ని ఈ దూత కు అన్వయించవచ్చు ఎందుకంటే శాసన హరుడు అంటే వార్తలను మాత్రమే చేరవేసేవాడు.

ధౌమ్యులు మొదలైన వాళ్లు చెప్పిన దానికి తగినట్లే ధర్మరాజు తమ్ముల సమ్మతి పొందాడు. రాజసూయం చేయడానికి పూనుకున్నాడు. ఈ యాగాన్ని నిర్విఘ్నంగా నిర్వహించడానికి శ్రీకృష్ణుడే సమర్థుడనుకున్నాడు. ఇతరులెవ్వరూ కాదనుకున్నాడు. సేవకులను పిలిపించి వాయువేగం గల గుర్రాల్ని కట్టిన రథం ఎక్కి వెళ్ళండని సేవకుల్ని పంపుతాడు. ఆయన రాకకై ఎదురు చూస్తూ ఉంటాడు ధర్మరాజు సందేశాన్ని అందుకున్న శ్రీకృష్ణుడు కూడా ఆయనను చూడాలనే కుతూహలంతో ద్వారపతి నుండి బయల్దేరి ఎక్కడా మధ్యలో ఆగకుండా ప్రయాణాలు చేసి ఇంద్రప్రస్థపురానికి వచ్చాడు.

ఇక్కడ సేవకుల ద్వారా శ్రీకృష్ణునికి సందేశం పంపించాడు. ఇదే విషయం సంస్కృత భారతంలో ఉన్నప్పటికి అక్కడ ధర్మరాజు ఒక దూతను పంపాడు ఆ దూత వేగంగా ప్రయాణించే రథంలో త్వరగా యాదవుల దగ్గరకు పోయి ద్వారకావాసి అయిన శ్రీకృష్ణుని కలిసాడు. ఆ దూత వినయంగా నమస్కరించి శ్రీకృష్ణునికి ఇలా నివేదించాడు.

*"ధర్మరాజో హృషీకేశ ధౌమ్యవ్యాసాదిభిః సహ1*

*పాంచాల మాత్స్యసహితైః భ్రాతృభిశ్చైవ సర్వశః11*

*త్వద్దర్శనం మహాబాహూ కాంక్షతే న యుధిష్ఠిరః1* ( సంస్కృత భారతం, సభాపర్వం, 40వశ్లోకం,). శ్రీకృష్ణా ధౌమ్యవ్యాసాదులతోడనూ,పాంచాల మత్స్యరాజులతోనూ,సోదరులతోనూ కలిసి యుధిష్ఠిరుడు తమ దర్శనాన్ని కోరుతున్నాడు.

**ఇంద్రసేనవచః శ్రుత్వా యాదవప్రవరో బలీ** ( సంస్కృత భారతం, సభావపర్వం, 41 వశ్లోకం.). అని దూతగా వచ్చిన ఇంద్రసేనుడు మాట విని యాదవ శ్రేష్ఠుడు బలవంతుడు అయిన శ్రీకృష్ణుడు తనను చూడాలని కోరిన యుధిష్ఠిరుని చూడాలని భావించి ఇంద్రసేనునితో కలసి ఇంద్రప్రస్థానికి బయలుదేరాడు.

ఇక్కడ ఆంధ్ర మహాభారతంలో సేవకుల్ని పంపించినట్లుగా మాత్రమే ఉంటుంది. సంస్కృత భారతంలో ఒక దూతను పంపినట్లు ఆ దూత పేరు ఇంద్రసేనుడు అనే విషయం స్పష్టంగా తెలుపుతారు. ఈ విషయాలను గమనిస్తే ఒక వార్తను తెలియజేయడానికి కూడా దూతను ఉపయోగించేవారు .ఈ ఇంద్రసేనుడు కేవలం శ్రీకృష్ణునికి యుధిష్ఠిరుడు నిన్ను చూడాలి అనే విషయాన్ని యథాతథంగా మాత్రమే చెప్పాడు ధర్మరాజు రాజసూయ యాగ విషయం గురించి దూతకు చెప్పి పంపలేదు శ్రీకృష్ణుడు వచ్చిన తర్వాత మాత్రమే ధర్మరాజు ఆ విషయాన్ని శ్రీకృష్ణునికి రాజసూయ యాగ నిర్ణయాన్ని తెలియజేసాడు.

### 3.11.3. విదురుని రాయబారం:

దుర్యోధనుడు ధర్మరాజు చేసిన రాజసూయ యాగానికి వచ్చి అక్కడ మయసభను చూసి ఆశ్చర్యపోతాడు. ధర్మరాజు సంపదకు అసూయ చెందుతాడు. మయ సభ నిర్మాణాన్ని దర్శించే సమయంలో అవమానం పాలవుతాడు. తర్వాత దుర్యోధనుడు శకునితో చర్చించి ఎలాగైనా ధర్మరాజును మాయా జూదానికి ఆహ్వానించి సంపదను కాజేయాలనే పన్నాగం పన్నుతారు. అందులో భాగంగా ధృతరాష్ట్రుని తో దుర్యోధనుడు జూదానికి అంగీకరించమంటాడు. ధృతరాష్ట్రుడు జూదానికి ఇష్టపడక విదురుడు చెప్పినట్లు నడుచుకుంటాడు. కాని దుర్యోధనుడు ధృతరాష్ట్రుని మనసు మార్చే విధంగా విదురుడు పాండవ పక్షపాతి అని అతను చెప్పింది చేయకూడదని జూదం అనేది పురాణాల్లో కూడా వినిపిస్తుందని అందులో దోషం లేదని స్నేహంగా ఆడుకునే జూదం వల్ల దేవతలు

దేవత్వాన్ని పొందుతున్నారు. అందువల్ల ఈ జూదాన్ని నడిపించడానికి శకునికి అనుమతి ఇచ్చి ధర్మరాజును ఇక్కడకి రప్పించాలి. అనగా ధృతరాష్ట్రుడు చాలా సేపు ఆలోచించి చివరకు అంగీకరించాడు.

### 3.11.3.1. విదురుడు ధర్మరాజును మిత్రద్యూతానికి ఆహ్వానించడం:

విదురున్ని పిలిపించి ధర్మరాజును జూదానికి ఆహ్వానించమని దుర్యోధనుడు మిత్రద్యూతం ఆడతాడని చెప్పగా విదురుడు దుఃఖం పొంది జూదం వలన అనర్థం జరుగుతుందని అనేక సార్లు చెప్పి చెడ్డపనిని తప్పించుకోవడానికి సాధ్యం కాదు తెలుసుకుని ధృతరాష్ట్రుని ఆజ్ఞకు తలవంచి ఇంద్ర ప్రస్థపురానికి వెళ్లి దేవేంద్రునితో సమానమైన ధర్మరాజును దర్శిస్తాడు. విదురుడు తన రాకకు గల కారణం తెలుపగా ధృతరాష్ట్ర మహారాజు ఆదరంతో నన్ను పిలిపించుకు రమ్మని నిన్ను పంపాడని ఆ సభను చూడటానికి వచ్చి జూదం ఆడడం తగదని మాలో మాకు వేరు ఏర్పడక మానదని ధృతరాష్ట్రుని ఆజ్ఞ నీవు మేర లేవు అని చెప్పి ధర్మరాజు విదురుని వెంట వెళ్ళడానికి నిశ్చయించాడు. తమ్ముళ్లు , ద్రౌపది, ముఖ్య సేవకులు ధౌమ్యుడు మొదలగు పండితులు వెంటరాగా ధర్మరాజు హస్తినాపురానికి వెళ్తాడు.

ఇక్కడ విదురుని రాయబారంలో ధృతరాష్ట్రుడు విదురుడికి ధర్మరాజు దగ్గరకు వెళ్ళి మిత్రద్యూతం ఆడటానికి ఆహ్వానించడం జరుగుతుంది. ధర్మరాజు కూడా ద్యూతం వలన నష్టం కలుగుతుందని తెలిసి కూడా విధిని తప్పించలేరని భావించి విదురుని వెంట ధర్మరాజు హస్తినాపురానికి వెళతాడు. ( ఆంధ్రమహాభారతం, సభాపర్వం,(ద్వి.ఆ 154 వ పద్యం నుండి,)

ధృతరాష్ట్రుడు విదురుని ధర్మరాజును జూదానికి ఆహ్వానించడానికి పంపినప్పుడు రాయబారి అయిన విదురుడు వెంటనే ఒప్పుకోలేదు దాని వలన కలిగే నష్టాన్ని తెలియపరిచాడు ఇక చేసేది లేక ధర్మరాజు దగ్గరకు వెళ్ళి విషయాన్నంతా చెప్పి దగ్గరుండి హస్తినాపురానికి తీసుకుని వస్తాడు. విదురుని మాటను కాదనలేని పాండవులు హస్తినా పురానికి వచ్చి జూదమాడుతారు. ధృతరాష్ట్రునికి తెలుసు ఎవరు చెప్తే పాండవులు మాట విని జూదమాడటానికి వస్తారో తెలుసుకుని తెలివిగా విదురుడిని రాయబారానికి పంపించారేమోనని నా అభిప్రాయం.

సంస్కృత భారతంలో విదురుని రాయబార విషయాలు ఎలా ఉన్నాయో గమనిస్తే

శకుని దుర్యోధనునితో ధర్మరాజు యొక్క ఏ సంపదను చూసి నువ్వు బాధపడుతున్నావో ఆ సంపదను నేను జూదంతో హరిస్తాను. దానికి యుధిష్ఠిరుని పిలిపించు కేవలం పాచికలు విసిరితే ఏమాత్రం నష్టం పొందకుండా, ఇందులో విద్వాంసుడను కనుక విద్వాంసుడు కాని అతనిని జయిస్తాను. పాచికలాటలే నా ధనుస్సులు పాచికలే నా బాణాలని తెలుసుకో. పాచికలలోని రహస్యమే నా వింటినారి, జూదపు బల్లయే నా రథమని గుర్తించు అంటాడు.

### 3.11.3.2. దుర్యోధనుడు ఆజ్ఞ మేరకు ధృతరాష్ట్రుడు సభను నిర్మించుట:

ప్రాచీనులు కూడా ద్యూత వ్యవహారం నడిపి ఉన్నారు. దాని వలన దోషము లేదు. యుద్ధమూ రాదు కాబట్టి ఇప్పుడు శకుని మాటను అంగీకరించు. వెంటనే ఇక్కడ సభా నిర్మాణానికి అనుమతి ఇయ్యి అని అనడంతో ధృతరాష్ట్రుడు దుర్యోధనునికి పలు విధాలు చెప్పినా ఫలితం లేకపోయేసరికి గొప్పదైన సభను నిర్మాణం చేయిస్తాడు.

### 3.11.3.3. ధృతరాష్ట్రుడు విదురుని రాయబారిగా పంపుట:

విదురుని పిలిపించి తన మాటగా యుధిష్ఠిరుని వెంటనే తీసుకురమ్మని చెప్తాడు. అలాగే

*'సభేయం మే బహురత్నా విచిత్రా*

*శయ్యాసనైరుపపన్నా మహార్హైః*

*సా దృశ్యతాం భ్రాతృభిః సార్థమేత్య*

*సుహృద్ ద్యూతం వర్తతామత్ర చేతి11( సంస్కృత భారతం, సభాపర్వం 56 వ అధ్యాయం, 22 వ శ్లోకం)*

ఈ సభ అత్యంత అద్భుతంగా తీర్చిదిద్దబడింది తమ్ముళ్లతో వచ్చి చూడమని మిత్రద్యూతం కూడా జరుగుతుందని చెప్పమంటాడు. ఈ మాటలను విన్న విదురుడు వారిని ద్యూతానికి  ఆహ్వానించడానికి ఒప్పుకోలేదు  దీని వలన కుమారుల మధ్య విభేదం ఏర్పడుతుందని చెప్పినా ధృతరాష్ట్రుడు బ్రహ్మ సృష్టించిన ఈ లోకమంతా దైవానికే కట్టుబడి

ఉంటుంది. కాని స్వతంత్రంగా ఉండదు.కాబట్టి యుధిష్ఠురుడిని వెంటనే ఇక్కడకు తీసుకుని రా అనగానే బలవంతం మీద విదురుడు పాండవుల వద్దకు వెళతాడు.

ఇక్కడ విదురునికి ఈ విధంగా తానే వెళ్ళి ద్యూతానికి పిలవడం ఇష్టం లేదు కాని వెళ్ళక తప్పని పరిస్థితిలో వెళతాడు అందుకే విదురుని రాకను చూడగానే ధర్మరాజు కూడా నీ మనసు సంతోషంగా లేదని అర్థమవుతుందని అడుగుతాడు. విదురునికి స్వాగత సత్కార్యాలు చేసి ధృతరాష్ట్రుని కుశలాన్ని అడుగుతాడు తర్వాత దుర్యోధనాదుల మనసు తెలిసిన వాడు కాబట్టి దుర్యోధనాదులు ధృతరాష్ట్రుని మాటలకు కట్టుబడి ఉన్నారా అని ప్రశ్నిస్తాడు. దానికి విదురుడు రాజు పుత్రులతో కలిసి సుఖంగా ఉన్నాడు, మర్యాదస్తులైన పుత్రుల వలన సంతోషాన్ని పొందుతున్నాడు ఎటువంటి దుఃఖం లేకుండా తనయందు తాను అనురాగం కలిగి ఉన్నాడని వారి క్షేమాన్ని గురించి చెప్పి మీ క్షేమాన్ని గురించి అడిగి, కురురాజు మీకు ఒక సందేశాన్ని ఇచ్చాడు ధృతరాష్ట్రుని మాటలుగా విదురుడు చెప్తాడు. పుత్రా ఈ సభ నీ సభతో సమానమైన ఆకారంతో నిర్మించబడింది. తమ్ముళ్ళతో కలిసి వచ్చి నీవు దీనిని చూడాలి. పార్థా సోదరులతో కలిసి ఆ సభలో సుహృద్ద్యూతం ఆడాలి వినోదించాలి. మిమ్మల్ని కలుసుకోవడం వలన అక్కడకు వచ్చిన కౌరవులందరూ సంతోషిస్తాము. అక్కడ ధృతరాష్ట్ర మహారాజు ఏర్పరిచిన జూదశాలలను, అక్కడకు చేరి ఆసీనులయిన జూదరులను చూచాదువు గాని ఇందుకే నేను వచ్చానని విదురుడు తాను చెప్పవలసిన సందేశాన్ని ఇస్తాడు. ధర్మరాజు కూడా జూదం వలన కలహం కలుగుతుంది. బుద్ధిమంతుడు ఎవడూ దీనిని ఇష్టపడడు నీవు దీనిని ఇష్టపడుతున్నావా నీ మాట మీదే మేము నిలబడి ఉన్నాం అనగానే విదురుడు  నేను జూదం వలన అనర్థం కలుగుతుందని చెప్పాను కాని వినిపించుకోకుండానే నీ దగ్గరకు పంపాడు. ఇది శ్రేయస్కరమైనది ఆచరించు అనగానే ధర్మరాజు  విదురునితో అక్కడ ధృతరాష్ట్రుని కొడుకులు కాక జూదమాడే వేరే జూదరులు ఎవరు నిన్ను అడుగుతున్నాను వారెవరూ మాకు చెప్పు వందలకొద్దీ పందేలు వేసి ఎవరితో జూదమాడాలి మేము? అప్పుడు విదురుడు రాజా గాంధార రాజు శకుని ఉన్నాడు. అతడు ఎక్కువగా జూదమాడుతాడు. అభిమతమైన పాచికలు కలవాడు. నేర్పరి. అతడేకాక రాజు వివింశతి, చిత్రసేనుడు, సత్యవ్రతుడు , పురుమిత్రుడు జయుడు కూడా

ఉన్నారు అని చెప్తాడు.వెంటనే ధర్మరాజు మహాభయంకరులు మోసంతో జూదమాడే జూదరులు అక్కడ చేరి ఉన్నారు. ఈ ప్రపంచమంతా విధికి లోబడి ఉంది స్వతంత్రమైనది కాదు కదా కావున తండ్రి ఆజ్ఞను అనుసరించి జూదానికి వెళ్తాను. ధృతరాష్ట్రుడు సభకు రమ్మని ఆహ్వానించకపోయి ఉంటే పాచికలాటలో కోరిక లేని నేను శకునితో జూదమాడను. నన్ను ఆహ్వానించారు కాబట్టి వెనుతిరుగను ఇది నాకు శాశ్వతమైన వ్రతమని హస్తినాపురానికి వెళ్ళే ఏర్పాట్లు చేసుకుంటాడు. ( **సంస్కృత భారతం, సభాపర్వం, 56 వ అధ్యాయం**).

ఈ విదురుని రాయబారం అసహనంతో అశాంతితో జరిగినట్లు తెలుస్తుంది. ధృతరాష్ట్రుడు ఏమి చెప్పి పంపించాడో యథాతథంగా చెప్పినప్పటికి ధర్మరాజు అడిగిన వెంటనే జూదరులు పేర్లను చెప్తాడు. విదురుడు కూడా ధృతరాష్ట్రునికి ఈ జూదం వలన నష్టం కలుగుతుందని వారించడానికి ప్రయత్నం చేసానని ధర్మరాజాదులకు చెప్తాడు. ఇక్కడ రాయబారి రాజు చెప్పిన విషయాలు సరైనవా కావా అని తెలుసుకుని అనర్థం జరుగుతుందని భావించి సూచనలు చేసాడని తెలుస్తుంది. అయినా చివరకు విధిని తప్పించడం . ఎవరి తరం కాదని తెలుసుకుని రాయబార కార్యానికి పూనుకుంటాడు. అది కూడా అనిష్టం తో రాయబారం నడుపుతాడు. ధర్మరాజాదులు కూడా వచ్చిన వారు విదురుడు అతని మీద గౌరవంతో తండ్రి ఆహ్వానాన్ని తిరస్కరించలేక జూదం ఆడడానికి ఇష్టం లేక పోయినా అంగీకరించి హస్తినాపురానికి బయలుదేరుతాడు. దుర్యోధనునికి జూదం వలన నష్టం కలుగుతుందని ధృతరాష్ట్రుడు చెప్పినా వినకపోయేసరికి విధిరాత మీదే భారం వేసారు. అలాగే విదురుడు చెప్పినా ధృతరాష్ట్రుడు వినకపోయే సరికి విధికి తలవంచి రాయబారం జరిపాడు. చివరకు ధర్మరాజు కూడా విధిని అనుసరించే అనిష్టంతోనే జూదానికి సిద్ధపడ్డాడు. అంటే భవిష్యత్తు అందరికి తెలుసు ఎటువంటి ప్రమాదం జరుగుతుందో కాని జరిగేది జరగక మానదు అనే అభిప్రాయంతోనే అందరూ కార్యోన్ముఖులయ్యారు. వారి కష్టాలను వారే స్వయంగా ఆహ్వానించివారయ్యారని నా అభిప్రాయం.

### 3.11.4. ప్రాతికామి రాయబారం:

జూదంలో శకుని ధర్మరాజును ఓడిస్తాడు. ధర్మరాజు అవమానంతో క్రోధంలో ఎలగైనా జూదంలో గెలవాలని మరలా మరలా శకునితో జూదమాడి సంపదనంతా పోగొట్టుకుంటాడు. చివరకు ద్రౌపదిని పణంగా పెడతాడు. జూదంలో ఓడిపోతాడు. దుర్యోధనుడు, విదురుడిని ద్రౌపదిని తీసుకురమ్మని పంపుతాడు. దానికి విదురుడు తిరస్కరించడంతో ప్రాతికామి అనే అతన్ని పిలిచి ద్రౌపదిని తీసుకుని రమ్మంటాడు.

ప్రాతికామి దుర్యోధనుని ఆజ్ఞమేరకు ద్రౌపది దగ్గరకు వెళ్ళి భక్తితో నమస్కరించి ధర్మరాజు జూదమాడి ధన సంపదలు రాజ్యాన్ని కొడుకులను, అన్నలను, నిన్ను ఓడిపోయాడని చెప్తాడు. దుర్యోధనుని ఆజ్ఞ మేరకు నిన్ను తీసుకు పోవడానికి వచ్చాను రమ్మని పిలుస్తాడు.

ద్రౌపది కూడా తన సందేశంగా ధర్మరాజుతో కొన్ని ప్రశ్నలు సమాధానం తెలుసుకు రమ్మని పంపుతుంది.

*తే. " మున్ను దన్నోటువడి మఱి నన్ను నోటు*
*పడియెనో, నన్ను మున్నోటువడి విభుండు*
*గ్రన్నఁ దన్నోటువడియెనో యన్న*
*నాకు నెఱుగఁజెప్పుము దీని నీ వెఱుఁగుదేని"*

తన భర్త  మొదట ధర్మరాజు ఓడిపోయి తరువాత నన్ను ఓడెనా; లేక ముందే నన్ను ఓడి తరువాత తాను ఓడెనా అన్నా నీకు తెలిస్తే ఈ సంగతి నాకు చెప్పు  నీకు తెలియకపోతే ఆ జూదగాణ్ని అడిగి వచ్చి నన్ను పిలుచుకుని వెళ్ళడం తగినట్లయితే పిలుచుకుని వెళ్ళమని ద్రౌపది పలుకగా, ప్రాతికామి తిరిగి వచ్చి ఆమెమాటలు ధర్మరాజుకు చెప్తాడు. కాని అతడు జూదంలో ఓడిపోయిన దుఃఖంలో ఉండడం వలన ధర్మరాజు సమాధానం చెప్పలేదు. దుర్యోధనుడే సమాధానం చెప్తూ సభలోని వారందరూ తెలుసుకునేట్లు ఖచ్చితంగా సమాధానం చెప్పడానికి వీలులేని న్యాయాన్ని ఇంతమంది ఎదుట అడిగావని చెప్పి ద్రౌపదిని ఆలస్యం చేయకుండా తీసుకుని రమ్మని ప్రాతికామికి చెప్తాడు. ప్రాతికామి ద్రౌపది దగ్గరకు వెళ్ళి నీ ప్రశ్నకు న్యాయం నిర్ణయించడానికి సభ్యులు ఆజ్ఞాపించారని రమ్మని

పిలుస్తాడు. ద్రౌపది దీనమైన స్థితిలో ప్రాతికామి వెంట సభకు వెళ్ళింది. కురు వృద్ధుడైన ధృతరాష్ట్రుని వద్ద నిలబడుతుంది. ( ఆంధ్ర మహాభారతం,సభాపర్వం,(ద్వి.ఆ),పుట:196 వ పద్యం నుండి)

ఈ రాయబారంలో ప్రాతికామి రాయబారంవలన ప్రాతికామి దుర్యోధనుని ఆజ్ఞ మేరకు ఆమెను పిలుచుకు రావడానికి వెళ్ళడమే కాక సభలో జరిగిన విషయాన్నంతా ద్రౌపదికి వివరిస్తాడు. ద్రౌపది చెప్పిన సందేశాన్ని ధర్మరాజుకు తెలియజేస్తాడు. చివరకు ద్రౌపది అడిగిన ప్రశ్నకు సమాధానం సభలోనే నిర్ణయిస్తారని సభకు ఆహ్వానిస్తాడు. ప్రాతికామి సమాచారాన్ని అందించడంలో తన రాయబార కార్యాన్ని నిర్వహించడంలో స్వతంత్రతను ప్రయోగించకుండా యథాతథంగా రాయబార కార్యాన్ని నిర్వహించాడని అర్థమవుతుంది.

ఇదే రాయబారం సంస్కృత భారతంలో ఉన్నప్పటికి  కొంత మార్పుకనబడుతుంది. ప్రాతికామి దుర్యోధనుని రాయబారి కనుక బాధపడుతూ రాజభవనానికి వెళ్ళి ద్రౌపదితో సభలోకే నిన్ను పిలుస్తున్నారని చెప్తూ కౌరవులకు వినాశకాలం ఏర్పడిందని నేను భావిస్తున్నాను. అనగా ద్రౌపది ధర్మాన్ని నేను అతిక్రమించను నీవు కౌరవసభలోకే వెళ్ళి ధర్మబద్ధమయిన నా ఈ మాటను అడుగు నేనేం చేయాలో వారే నిర్ణయించి చెపుతారు. ఆ మేరకు నేను పాటిస్తాను. అనగానే ద్రౌపది మాటను సభకు వెళ్ళి చెప్తాడు. అక్కడున్న పెద్దలు దుర్యోధనుని మొండితనాన్ని గ్రహించి ఏమి మాట్లాడకుండా ఊరుకున్నారు . **(సంస్కృత భారతం, సభాపర్వం, 67 వ అధ్యాయం,).**

తరువాత సభలోనే ఉన్న ప్రాతికామితో దుర్యోధనుడు ద్రౌపదిని ఇక్కడికే తీసుకునిరా ఆమె ఎదుట కౌరవులు సమాధానం చెప్తారని ఆదేశించాడు దుర్యోధన రాయబారి అయిన ఆ సూతుడు ద్రౌపది కోపానికి భయపడి తన మాన అవమానాలను లెక్కచేయకుండా ద్రౌపదితో ఏమి చెప్పమంటారు అని మరలా సభ్యులను అడుగుతాడు. **(సంస్కృత భారతం, సభాపర్వం, 67 వ అధ్యాయం).**

ఇక్కడ ప్రాతికామి ద్రౌపది ఏ ప్రశ్నైతే వేసిందో దానికి సమాధానం తెలుసుకుని వెళ్లడానికే ప్రయత్నించాడు. ఇక్కడ ప్రాతికామి దుఃఖానికి, భయానికి లోనైన రాయబారిగా

తెలుస్తుంది. అది గమనించిన దుర్యోధనుడు ప్రాతికామిని పంపకుండా వదిలి పెట్టి దుశ్శాసనునితో ప్రాతికామి మందబుద్ది కలిగిన వాడు భీముని చూచి భయపడుతున్నాడని దుర్యోధనుడు దుశ్శాసనుని పంపిస్తాడు. ఇక్కడ రాయబారాన్ని ప్రాతికామి సంపూర్ణంగా పూర్తి చేయలేకపోయాడని అర్థమవుతుంది.

### 3.11.4.1. ధర్మారాజు పంపిన రహస్య దూత:

ప్రాతికామి రాయబారం జరుగుతున్న సమయంలోనే ధర్మరాజు దుర్యోధనుడు చేయాలనుకున్న పనిని విని ద్రౌపదికి నచ్చిన ఒక దూతను ఆమె దగ్గరకు పంపుతాడు. పాంచాలీ నీవు ఏక వస్త్రవు, రజస్వలవు, అయిననూ ఏడుస్తూ సభలోనికి వచ్చి మామగారి ఎదుట నిలబడు నీవు వస్తే ఆ రీతిగా సభలోనికి రావలసి వచ్చిన రాజకుమారిని నిన్ను చూచి సభ్యులంతా దుర్యోధనుని గట్టిగా నిందిస్తారు. అని చెప్పి పంపుతాడు. బుద్ధిమంతుడైన ఆ సూతుడు వెంటనే ద్రౌపది భవనానికి వెళ్ళి ధర్మరాజు నిశ్చయాన్ని ఆమెకు నివేదించాడు. **(సంస్కృత భారతం, సభాపర్వం, 67 వ అధ్యాయం).**

ఇక్కడ ధర్మరాజు రహస్యంగా ద్రౌపది దగ్గరకు దూతను పంపి ఆమె ఏ దీనావస్థలో ఉందో అదే పరిస్థితి సభయందు ప్రదర్శిస్తే పెద్దలు ఈ అన్యాయాన్ని గ్రహిస్తారని సభలోని పెద్దలు దుర్యోధనుని నిందిస్తారని చెప్తాడు ఆ దూత యథాప్రకారంగా ఆమాటలను ద్రౌపది కి చేరవేస్తాడు.

## 3.12. అరణ్య పర్వం – రాయబారాలు:

*"ఆత్మ జ్ఞాన సముపార్జనము అరణ్య పర్వం ఇది ఉపాసనకు సంబంధించింది." ( వెంకట శ్రీనివాసాచార్యులు, తిరుమల, శ్రీమహాభారత వైజ్ఞానిక సమీక్ష(ఆదిపర్వం).పుట:41.).*
*ఈ విషయాలను పరిశీలిస్తే అరణ్య పర్వంలోఎందరో ఋషులు చెప్పే ఆధ్యాత్మిక చర్చలు జరపడం వలన ఈ పర్వం ఆత్మజ్ఞానానికి సంబంధించినదని తెలుస్తుంది.*

అరణ్య పర్వం లోని రాయబారాలు ను ఈ క్రింది పరిశీలిస్తున్నాను.

### 3.12.1. సంజయ రాయబారం:

విదురుడు పాండవుల విషయంలో జరిగినది ఎలాగో జరిగిపోయింది ఇకనైనా వారిని పిలిపించి ధర్మరాజును పట్టాభిషిక్తుని చేయి దుర్యోధనుడు పుట్టిన వెంటనే అతని

వలన కీడు కలుగుతుందని చెప్పానని విదురుడు అనగానే ధృతరాష్ట్రునికి కోపం వచ్చి నా మొదటి పుత్రున్ని నేను ఎలా కాదనగలను నా కొడుకులు పైకి రావటం నీవు సహించలేవు. నీ సాయం నాకు అవసరం లేదు నీవు పాండవుల దగ్గరకు లేక నీకిష్టమైన చోటుకి వెళ్ళిపో అంటాడు విదురుడు.

కామ్యకవనంలో ఉన్న పాండవుల దగ్గరకు వెళ్ళి విదురుని రాకకు కారణం చెప్తాడు.

విదురుని పంపించిన తర్వాత  ధృతరాష్ట్రుడు చాలా బాధపడి సంజయున్ని రాయబారిగా పంపిస్తాడు.

సంజయుడు పాండవుల దగ్గరకు వెళ్ళి ధర్మరాజుతో మీ అనుజ్ఞ తీసుకుని విదురుడిని తీసుకుని రమ్మని నన్ను ధృతరాష్ట్రుడు మీ దగ్గరకు పంపాడని సంజయుడు చెప్పగా విని ధర్మరాజు ప్రజలందరూ ధృతరాష్ట్రుడి శాసనం పాటిస్తున్నప్పుడు అతడి ఆజ్ఞను విశేషించి పాటించవలసిన ధర్మం మనపై ఉన్నది. కాబట్టి నీవు ఆలస్యం చేయకుండా వెళ్లమని విదురుడితో ధర్మరాజు అంటాడు. వెంటనే విదురుడు హస్తినాపురానికి వెళ్తాడు. (ఆంధ్రమహా భారతం, అరణ్య పర్వం,63 వ పద్యం నుండి 68 వ పద్యం వరకు).

### 3.12.1.1. ధృతరాష్ట్రుని ఓర్వలేనితనం:

సంస్కృత భారతంలో విదురుడు వెళ్ళిపోయిన తర్వాత ధృతరాష్ట్రుడు ఈ విధంగా అనుకుంటాడు.

*''విదురస్య ప్రభావం చ సంధి విగ్రహకారితమ్*

*వివృద్ధిం చ పరాం మత్వా పాండవానాం భవిష్యతి'' (సంస్కృత భారతం, అరణ్య పర్వం, ఆరవ అధ్యాయం*

*2 వ శ్లోకం.)*

విదురుని సంధి విగ్రహాది నీతిజ్ఞతను , ప్రభావాన్ని తలచుకుని అతనివల్ల పాండవులకు మిక్కిలి అభివృద్ధి కలుగుతుందని భావిస్తాడు.

తర్వాత విదురుని స్మరిస్తూ స్పృహతప్పి పడిపోయి తిరిగి తెలివి తెచ్చుకుని సంజయుని పిలిచి  విదురుడు నా సోదరుడే కాదు మిత్రుడు కూడా అపర ధర్మస్వరూపుడు, అతని స్మరణ చేత ఈ రోజు నా హృదయం మిక్కిలి బాధగా ఉందని చెప్పి విదురుని

త్వరగా ఇక్కడకు తీసుకుని రా సంజయా వెళ్లు నా సోదరుడైన విదురుని గురించి తెలుసుకో పాపాత్ముడనైన నేను కోపంతో వెళ్లగొట్టాను. అతడు జీవించి ఉన్నాడో, లేదో? నా వల్ల విదురుని పట్ల పెద్ద అపరాధం జరిగిపోయింది. నీవు వెళ్ళి అతనిని తీసుకొనిరా లేకుంటే నాప్రాణాలు విడుస్తాను. సంజయుడు రాజు యొక్క మాటలు విని అతనిని ఆదరించి సంజయుడు అట్లే అని కామ్యక వనానికి వెళ్తాడు.

### 3.12.1.2. సంజయుడు ధృతరాష్ట్రుని పరిస్థితిని తెలుపుట:

సంజయుడు శీఘ్రంగా కామ్యకవనం చేరి అక్కడ పాండవులతో ఉన్న విదురుని చూస్తాడు ముందుగా ధర్మరాజును పూజిస్తాడు . భీమార్జున నకుల సహదేవులు కూడా సంజయుని సత్కరిస్తారు తర్వాత ధర్మరాజు సంజయుని కుశల ప్రశ్నలను అడుగుతాడు సంజయుడు సుఖాసీనుడైన తర్వాత తన రాకకు కారణాన్ని చెప్పి విదురునితో ధృతరాష్ట్రమహారాజు నిన్ను తలచుకుంటున్నాడు వెంటనే వెళ్లి ఆయనను చూడు రాజును బ్రతికించు అనగా విదురుడు ధర్మరాజు అనుమతి తీసుకుని హస్తినాపురానికి తిరిగి వస్తాడు. **(సంస్కృత భారతం, వన పర్వం, 6వ అధ్యాయం).**

ఈ రాయబారంలో సంస్కృత మహాభారతంలో సంజయుడు నేరుగా విదురునితో ధృతరాష్ట్రుని పరిస్థితి తెలిపి విదురుని రమ్మంటాడు. విదురుడు ధర్మరాజు అనుమతితో హస్తినాపురానికి తిరిగి వెళ్తాడు. అదేగాక విదురుని తిరిగి ధృతరాష్ట్రుడు రప్పించడంలో గల అంతరార్థం ను చూస్తే విదురుడికి రాజనీతిలో భాగమైన సంధి,విగ్రహం,వంటి వన్నీ తెలిసినవాడు దానివలన పాండవులకు మిక్కిలి అభివృద్ధి కలుగుతుందని తలచకుంటూ స్పృహ కోల్పోతాడు. అంటే ఇక్కడ కూడా ధృతరాష్ట్రుని అసూయ వ్యక్తమవుతుంది. విదురుని పిలిపిస్తే ధర్మరాజాదులకు సలహాలు ఇవ్వడు దాని ద్వారా వారు అభివృద్ధి పొందలేరు అనే భావన చేత తిరిగి విదురుడిని పిలిపించాడని అర్థమవుతుంది. ఆంధ్ర మహాభారతంలో ఈ విషయం ఉండదు.

ఆంధ్రమహాభారతంలో సంజయుడు ధర్మరాజుతో చెప్తాడు విదురుని పంపించమని ధృతరాష్ట్రుడు కలవరిస్తున్నాడని అప్పుడు ధర్మరాజు విదురునికి రాజు మాటను

తిరస్కరించకూడదు వెంటనే వెళ్ళమని చెప్తాడు. ఈ రాయబారంలో ఈ చిన్న మార్పు చోటుచేసుకుంది.

### 3.12.3. హంస రాయబారం:

దమయంతి గుణాలను నలుడికి నలుడి గుణాలు దమయంతికి తెలిసేటట్లు ప్రజలు మాట్లాడుకోవడం చేత వారిరువురి మధ్య అనురాగం ఏర్పడుతుంది. సంస్కృత భారతంలో దమయంతి చెలులు నలుని గుణాలను తెలియజేసినట్లు ఉంటుంది.**(సంస్కృత భారతం, అరణ్య పర్వం,53 వ అధ్యాయం.)**. ఇలా నలుడు దమయంతి ని స్మరిస్తూ ఉద్యానంలో తిరుగుతుండగా అక్కడ ఉన్న ఒక హంసను పట్టుకొనబోతాడు ఆ హంస నలమహారాజుతో ‘‘రాజా నన్ను చంపకు నేను నీకు ప్రియమైన ఉపకారం చేస్తాను దమయంతి దగ్గరకు వెళ్ళి ఆమెకు నీ మహనీయ గుణగుణాలను చెప్తాను దమయంతికి నీ మీదే ప్రేమ కలిగేటట్లు చేస్తాను అనగానే ఆ హంసను విడిచి పెడతాడు. ఆ హంస విదర్భరాజధానికి ఎగిరి వెళ్ళి అక్కడ ఉద్యానంలో చెలికత్తెలతో కలిసి విహరిస్తున్న దమయంతి సమీపానికి వచ్చి నడయాడుతూ ఉన్నది. దమయంతి ఆ హంసలను చూచి మిక్కులమైన సంతోషాన్ని పొందింది. వాటిలో దమయంతి ఒక హంసను పట్టుకున్నది ఆ రాజ హంస దమయంతితో నేను నీకు ప్రియమైన నలుడి దగ్గర నుండి వచ్చాను. నీవు నలుడికి భార్యవు అయితే తప్ప నీకు గల గొప్ప లక్షణాలు సౌందర్యం, లావణ్య సంపద, ఐశ్వర్యం, నిత్య సౌభాగ్యం , అదృష్టం వంశ గౌరవం మున్నగున్నవి రాణించవు. నలుడు నరులలోనే మిన్న మీ ఇరువురి సంయోగం ఒకరికి ఇంకొకరు అందాన్నిచేకూర్చినట్లు ఉంటుంది. అని హంస పలుకగా దమయంతి ఆనందం పొంది ఇట్లా అన్నది  ఆ నలమహారాజు గుణాలను గురించి నాకు ఎలా చెప్పావో అలాగే నన్ను గురించి కూడా ఆ రాజుకు తెలియజెప్పుమని దమయంతి అనగానే ఆ హంస నిషధదేశానికి వెళ్ళి నలమహారాజుకు దమయంతి గుణరూపాలను చెప్పింది.**(ఆంధ్రమహాభారతం, అరణ్యపర్వం,ద్వితీయాశ్వాసం,15 వ పద్యం నుండి22 వ పద్యం వరకు)**

సంస్కృత భారతంలో కూడా ఈ రాయబారంలో మార్పు లేకపోయినప్పటికి సంభాషణలో మార్పు కనబడింది.

### 3.12.3.1. హంస రాయబార అంతర్యం:

హంసరాయబారం ఒక పక్షి రాయబారంగా కనబడుతున్నప్పటికి ఈ హంస ఒక సామాన్యమైన పక్షి కాదు ఇందులోని ఆధ్యాత్మిక రహస్యం గురించిన చర్చను గమనిస్తే నండూరి సుబ్రహ్మణ్యశర్మ **'ఆంధ్రమహాభారతోపన్యాసములు'** గ్రంథంలో ఈ విధంగా తెలియజేసారు. '' హంస మామూలు పక్షి కాదని అది రాజ హంస అని రాజహంసల సమూహము ఆ సరోవరమునందున్నను ఏకాంతమునందు ఈ హంస విశ్రాంతిని తీసుకొనుచున్నది. ఈ వర్ణన కేవలం కథమాత్రమునే కాకుండా మోక్షార్థమున సాధనభాగమై వెలసిన కుండలినీ జాగరణమును కూడా స్మృతికి తెస్తున్నది. స్వభాముచేత మన నాసికారంధ్రముల నుండి వెలుపలకును లోపలకును వచ్చుచు పోవుచుండు ప్రాణవాయువును యోగశాస్త్రమున హంసయను పదమును వాడుతుంటారు. యోగశాస్త్ర సిద్ధాంతమునందు అదియే పరబ్రహ్మము స్థూల దృష్టి యందు అది గాలిగా వ్యవహరించబడినను సూక్ష్మదృష్టియందు అది చిద్రూపమగు పరబ్రహ్మమే ఈ హంస సూర్యోదయము మొదలు రెండవ రోజు సూర్యోదయము వరకును ఇరవైఒక్క వేల ఆరు వందల సార్లు చరిస్తూఉండును. దీనినే హంసగమనందురు. దివ్య తేజోమయమైన విరాజితమగు ఈ హంసను పట్టుటకు మరియొక పేరు ప్రాణాయామము. ఆప్రాణ వాయువును ధారణ చేయవలెనన్న శారీరక శ్రమ , మౌనము మున్నగు నియమములు అవసరం. స్థూల దేహ శోధనము కాని సూక్ష్మ దేహము శోధింపబడదు. నేను చక్రవర్తినను భావమును వదిలి నలుడు హంసను పెట్టుకొనుటకు అర్హమైన శరీరమును ధరించాడు. నలుడు హంసను పట్టుటకు వామనుడయ్యెను వామనుడుఅంటే పరమాత్మ అని అర్థము. అంటే ఆ హంసకు తనకు వేరు లేదని తెలుసుకోనుటయే హంసను పట్టుట. దీనినే వేదాంతమున సో2హంభావమని వాడుతారు. అలాగే హంసయొక్క రెక్కలు రెండు అగ్నిఘోరము ఉపనిషత్తులు వర్ణించాయి. కనుక హంస దౌత్యమున కూడా హంసయందు ఈ పరమార్థ రహస్యమును వదలకుండానే శ్రీహర్షుడు తెలియజేసారని వీరి వక్కాణిస్తారు.''**(సుబ్రహ్మణ్య శర్మ, నండూరు. మహాభారతోపన్యాసములు, పుట:59,60).**

వీరి అభిప్రాయాలను పరిశీలించిన మీదట హంస రాయబారము కేవలం వ్యక్తులను కలిపే దౌత్యము కాదు అది ఒక పరమాత్మ కార్యంగా భావించబడిందని తెలుస్తుంది. ప్రతి ఒక్కరిలోనూ ఈ హంసతత్వాన్ని తెలుసుకుని ఏకాగ్రతను సాధించాలనే ఆధ్యాత్మిక సిద్ధాంతం వలన స్పష్టమవుతుంది.

### 3.12.3.2 హంస పూర్వజన్మ వృత్తాంతం:.

నల దమయంతుల కలయిక హంస దౌత్యము చేతనే బలపడిందని అభిప్రాయపడినట్లైతే ఈ హంస యొక్క వృత్తాంతం కూడా తెలుసుకోగలిగితే ఈ రాయబారం యొక్క పరమార్థం బోధపడుతుంది.

నలోపాఖ్యానమునకు ధూళిపాళ శ్రీరామమూర్తి వ్యాఖ్య వ్రాస్తూ నలదమయంతులకు దూత గా ఉన్న హంస గురించి కొన్ని వివరాలను అందించారు.

*కం. దమయంతికి నలునకు సం*
*గమ కారణ దూతయైన కలహంస మనో*
*జ్ఞ మనుష్య వాక్యముల న*
*ద్దమయంతికి హర్షమెసగఁదానిట్లనియెన్. (ఆంధ్రమహాభారతం, ద్వితియాశ్వాసం, 18 వ పద్యం)*

*“ఈ హంస దూత అవ్వడానికి కారణమేమిటి? ఆ హేతువు వారిద్దరి కలయిక సాధింపబడవలసి ఉండుట. వారి సంగమము జరుగవలసి ఉన్నది. కావున ఇది కారణముగా నీ హంస దూతయై వచ్చిందని లోతైన సమాధానము దీనిపైన తోచు మరియొక్క స్వారస్యము ఈ హంస నారి సంగమము నిర్వహించుటకది యొక కారణముగా వచ్చినది కాని తక్కిన సామాన్య హంసల వంటిది కాదు. లోకములో కారణ జన్మములని కర్మ జన్మములని అందురు. ఒక మహాకార్యమును నిర్వహించుటకు పుట్టిన వారు కారణ జన్మములు. జన్మాంతరమున చేసిన పుణ్యపాపములు అనుభవించుటకు పుట్టినవారు కర్మజన్ములు. ఈ హంస అటువంటి కారణజన్మ కలది. ఈ దౌత్యము కొరకు జన్మయెత్తినది. ఇది ఒక స్వారస్యము. ఇంత కంటెను నన్నయ గరు ఉద్దేశించినట్టిది కనుక గంభీరమైనది హంస అనగా శివుడు ఈ కలహంస శివుడు. నల దమయంతుల*

*సంగమము నిర్వహించునట్టిది.కారణముగా దూతయైనవాడు కావున కారణ దూత. శివుడా హంస ఆకారముతో వచ్చాడు. హంసలో ఒక్క హంసగా కాదు ఆ హంసలన్నియు శివుడే . నలుడే హంసను పట్టుకున్నను అది శివుడే. దమయంతి యే హంసను పట్టుకున్నను అది శివుడే. నన్నయ గారు నలచరిత్ర యందు హంస దౌత్యమునకు చెప్పిన భాష్యమిది.(ప్రసన్న కథావిపంచి, (నన్నయభారతంలోని కొన్ని ఉపాఖ్యానాలకు సరళ వ్యాఖ్యానం,), పుట:265,266).*

*ఈ కథలోని హంసకు పూర్వ జన్మ గురించి విశ్వనాథ సత్యనారాయణ ''ప్రసన్న కథా కలితార్థయుక్తి' లో ఈ విధంగా తెలియజేసారు.*

*ఈ హంస శివుడు. ఇది శివపురాణాంతర్గత మయిన కథ ఆహుకులను భిల్లదంపతులు యుగాంతరములందు తపస్సు చేయగా శివుడు అనుగ్రహించి మీరిద్దరు నలదమయంతులయి జన్మిస్తారు. మీకు నేను దౌత్యము చేస్తానని ప్రసాదించెను.''(సత్యనారాయణ, విశ్వనాథ. నన్నయగారి ప్రసన్నకథాకలితార్థయుక్తి, పుట:96).*

ఈ వివరాలను పరిశీలిస్తే హంస శివ రూపమని స్పష్టమైనది దానితోటే హంస రాయబారంలో ఆధ్యాత్మిక రహస్యముందని నలదమయంతుల కలయిక ధర్మకార్యమని తెలుస్తుంది. ధర్మకార్యానికి భగవంతుడు ఏ రూపమైనా ధరిస్తాడు అనడానికి ఈ హంస రాయబారాన్ని చెప్పవచ్చు.

### 3.12.4. **నల రాయబారం:**

నారదుడు దమయంతి స్వయం వరం గురించి దేవతలకు చెప్పడంతో వారు దమయంతి స్వయం వరానికి బయలుదేరుతారు.మార్గ మధ్యంలో నలుడి రూప సౌందర్యాలు చూసి ఆశ్చర్యపోతారు దేవతలు నలుడి దగ్గరకు వచ్చి నీవు మాకు అనువైన దూతగా వెళ్ళి మా కోరిక నెరవేరేట్లు చేయాలి అనగానే వెంటనే నలుడు దేని కోసం, ఎవరి వద్దకు దూతగా వెళ్ళాలి అని అడగకుండా తెలుసుకోకుండా అలాగే చేస్తానని మాట ఇచ్చేస్తాడు. తర్వాత దేవేంద్రుడు మేము దిక్పాలురం నీవు దమయంతి దగ్గరకు వెళ్ళి పేర్లతో బిరుదులతో ప్రశంసింపచేసి దమయంతి మాలో ఎవరినో ఒకరిని వరించేటట్లు చేయమని

చెప్తాడు ఇంద్రుడు దానికి నలుడు నేను, మీరు ఒకే లక్ష్యంతో ఉన్నాము ఆ విషయం దేవతలైన మీకు తెలిసే ఉంటుంది ఈ పనికి నన్ను నియోగించడం సరియైనదేనా అంటే దేవేంద్రుడు నీవు మాకు మాట ఇచ్చావు దానిని తప్పకూడదు నీవు సత్యసంధుడివి ఈ కార్యం నిర్వహించగలిగే శక్తి సామర్థ్యాలు నీకు ఉన్నాయని మాకు తెలుసు అనగానే నలుడు అంగీకరిస్తాడు. దమయంతి అంతఃపురంలో కి ఎవరూ వెళ్ళలేని విధంగా కట్టుదిట్టం చేయబడి ఉంటుంది. కాని దేవతల సహాయంతో ఎవరికి కనబడకుండా నలుడు దమయంతి దగ్గరకు వెళ్ళి తాను దేవతలకు దూతగా వచ్చానని చెప్తాడు. ఇంద్రుడు ,అగ్ని, వరుణుడు, యముడు మున్నగు దిక్పాలుకలలో ఒకరిని వరియించమని చెప్తాడు. దమయంతి నలుడి మాటలకు బాధపడి తాను నలుడిని ఎంతగా ప్రేమిస్తుందో తెలియజేస్తుంది. నలుడు తనను వివాహం చేసుకోవడానికి అంగీకరించకపోతే విషం తీసుకోవడానికైనా సిద్ధమవుతుంది. నలుడు దిక్పాలురును ఎదిరించిన వారు అష్టకష్టాలు పడుతారు. వారి ఇష్టాన్ని పాటించమని చెప్తాడు. దమయంతి కన్నీరు కారుస్తుంది. దిక్పాలకులు స్వయం వరానికి వస్తే నేను వారి సమక్షంలోనే నలుడిని వరిస్తానని చెప్తుంది. దమయంతి తెలిపిన వివరాలన్నీ నలుడు దిక్పాలకులకు వివరించి చెప్తాడు. దేవతలు ఏ విధంగా నలుడిని వరిస్తుందో చూద్దామని దేవతలందరూ నలుని రూపం ధరించి స్వయం వరానికి వెళ్తారు. దమయంతి ఆర్తితో దేవతలను ప్రార్థించడంతో దేవతలు నలుడిని గుర్తించే జ్ఞానం కలిగించడంతో దమయంతి నలుని వరించి వివాహం చేసుకుంటుంది. **(ఆంధ్ర మహాభారతం, అరణ్య పర్వం, ద్వితియాశ్వాసం, 39 వ పద్యం నుండి)**

ఈ రాయబారంలో దిక్పాలురు ఏమి అడిగితే అది చేస్తానని నలుడు చెప్పడంతో నలుడు తాను వరించాలనుకున్న దమయంతి దగ్గరికి తానే దిక్పాలురకు రాయబారిగా వెళ్ళవలసి వస్తుంది. దమయంతి నలుడినే వరిస్తానని మరొకరిని వరియించనని చెప్పినప్పటికి నలుడు తన రాయబార కార్యాన్ని నిర్వర్తించడంలో నిజాయితిని ప్రదర్శిస్తాడు. దిక్పాలకుల వైపే మాట్లాడుతాడు. దమయంతిని దిక్పాలురలలో ఎవరినైనా వరియించమని అడుగుతాడు. ఈ రాయబారం విఫలమయిందని చెప్పవచ్చు దేవతలకు రాయబారిగా వెళ్ళినప్పటికి దమయంతి దేవతల మాటలను తిరస్కరించడంతో పాటు నలుని తప్ప

మరొకరిని వివాహమాడనని చెప్పడం ఈ మాటలను విన్న దేవతలు దమయంతికి పరీక్ష పెట్టడం దమయంతి ఆ దేవతలనే ప్రార్థించి తను కోరుకున్న నలుడినే వివాహ మాడటం జరుగుతుంది. కావున ఈ రాయబారం సఫలం కాలేదు.

ఇక్కడ నలుడు తన ప్రేయసి అయినప్పటికి దేవతల కోరికను మన్నించి వారు చెప్పిన మాటలను యథాతథంగా చెప్పాడు . రాయబార లక్షణాలలో శాసనహరుడు అంటే రాజు చెప్పిన మాటలను యథాతథంగా చెప్పడం అనే లక్షణం ఈ రాయబారం లో కనిపిస్తుంది.

### 3.12.5. పర్ణాదుని రాయబారం:

దమయంతి తన తండ్రి దగ్గరకు చేరుకున్న తర్వాత నలుడిని వెతికించమని తండ్రి భీమరాజుతో అంటుంది. భీమరాజు సత్ప్రవర్తన కలిగిన బ్రాహ్మణులను నియోగించాడు. వారితో దమయంతి తన మాటలు గా అంతటా ప్రచారం చేయండి అని ఈ విధంగా అంటుంది.

*'' నీవు సత్యవ్రతుడివి, నీ భార్యను మోసం చేసి ఆమె చీరను సగం చింపి నీవు కట్టుబట్టగా చేసుకుని పోవటం న్యాయమా, భరించబడేది భార్య అని కదా ధర్మం. ఈ ధర్మం పట్ల నీ పట్ల అసత్యమైనది గదా నీవు ఇటువంటి దయలేని కఠినమైన బుద్ధిని అవలంబించడం సరియైనది కాదు అటువంటి పతివ్రతా శిరోమణి పట్ల అనుగ్రహం చూపుము అని అన్ని చోట్ల పలకండి'' ఆంధ్ర మహాభారతం, అరణ్యపర్వం, ద్వితియాశ్వాసం,159 వ వచనం).*

ఎవరైతే ఈ మాటలకు సమాధానం ఇస్తాడో వారికి నా గురించి చెప్పి నా దగ్గరకు తీసుకుని రండి అతడు రాకపోతే అతడిని గుర్తుపెట్టుకుని ఇక్కడికి రండని చెప్తుంది. ఎవరి దగ్గర నుండి సమాచారం రాలేదు చాలా కాలం తర్వాత పర్ణాదుడు దమయంతికి అయోధ్య కు వెళ్ళి అక్కడ ఋతుపర్ణుడి సభలో దమయంతి మాటలను చెప్పినప్పటికి ఎవరూ సమాధానం చెప్పలేదు కాని ఒక సేవకుడు బాహుకుడు అనే అతను కురూపి రూపంలో ఉన్నాడు పొట్టి చేతులు కలవాడు గుర్రాల శిక్షకుడు, నా మాటలు విని నన్ను రహస్యంగా కలుసుకుని దుఃఖంతో మాట్లాడుతాడు. భర్త యందు తప్పులుంటే సహించగలిగేదే కదా భార్య అంటే అటువంటి భార్య భర్త నుండి తాను కోరిన సౌఖ్యం పొందుతుంది. అలాగే ఆ

పుణ్యం వలన మరు జన్మలో ధర్మం పట్ల ప్రీతిని పొందగలదు.అన్న మాటలు మాత్రమే చెప్పి తాను నివసించే చోటుకి వెళ్ళిపోతాడు.

**సంస్కృతంలో మార్పు:**

సంస్కృత భారతంలో బ్రాహ్మణోత్తముని మాటలకు ఎవరైనా బదులు ఇస్తే ఆ మాటలను గుర్తుపెట్టుకుని తెలియజేయమని చెప్తుంది. అంతే కాకుండా సమాధానం ఇచ్చే వ్యక్తికి మీరు ఎవరో తెలియకుండా జాగ్రత్త పడి ఎలాంటి తొట్రుపాటు ప్రదర్శించకుండా తిరిగి రండని చెప్తుంది. నలుడు ఏ వేషంలోనైనా ఉండవచ్చునని భావించి అతడు ధనవంతుడు కావచ్చు, పేదవాడు కావచ్చు, అసమర్థుడు కావచ్చు అతడేమి చేయదలచినాడో తెలుసుకోవాలి. ఈ విధంగా దమయంతి చెప్పినవన్నీ విని బ్రాహ్మణోత్తములు వెదకటానికి వెళ్తారు.(సంస్కృత భారతం, అరణ్య పర్వం, 69 వ అధ్యాయం).

ఆంధ్రమహాభారతంలో సమాచారం అందించిన పర్ణాదుడికి దమయంతి ఎటువంటి కానుకలు సమర్పించదు సంస్కృత భారతంలో పర్ణాదుడికి అధిక ధనమిచ్చి సత్కరించింది. నలుడు ఇక్కడకు వస్తే మరలా మరింత ధనం ఇస్తానని చెప్తుంది.

ఈ రాయబారం అంతా ఒక వైపు ప్రత్యక్షంగా సమాచారాన్ని అందించే సమయంలో పరోక్షంగా జరిగినట్లు అర్థమవుతుంది. జన సమూహంలో దమయంతి చెప్పిన మాటలను బహిర్గతంగా చెప్పడం చేత ఆ మాటలను విన్నవారు తమకు సంబంధం లేని మాటలుగా భావించి మౌనంగా ఉంటారు. ఆ మాటలకు సంబంధం ఉన్న నలుడు బాహుకుడి రూపంలో పర్ణాదుడికి సమాధానం ఇవ్వడం ఆ మాటలను దమయంతి కి తెలియజేయడంతో నలుడిని గుర్తించగలిగే ఉపాయం సఫలమైందని తెలుస్తుంది. ఈ విషయంలో పర్ణాదుడు సొంత మాటలను ప్రయోగించకుండా కార్యాన్ని నెరవేర్చాడని తెలుస్తుంది.

### 3.12.6. సుదేవుని రాయబారం:

దమయంతి తండ్రి కి తెలియకుండా బాహుకుడే నలుడు అయిఉండవచ్చు నని దానిని నిర్ధారణ చేసుకోవడానికి తండ్రికి తెలియకుండా తల్లి అనుమతితో సుదేవుని

పిలిపించి ఈ విధంగా మాట్లాడుతుంది.కేవలం రుతు పర్ణుడికి మాత్రమే తెలిసే విధంగా ద్వితీయ స్వయం వరం దమయంతికి జరుగుతుందని చెప్పమనగా సుదేవుడు అలాగే చేస్తాడు. బాహుకుడు మనసులో బాధపడి అడవిలో తనను విడిచి వెళ్ళిపోయానని కోపంతో ఈ విధంగా చేసి ఉంటుందని భావించి తాము ఏమి చేసినా తమనే వనితలు ప్రేమిస్తూ ఉంటారని నమ్మే పురుషులు అవివేకులు అనుకుని ఏమి జరుగుతుందో చూద్దామని రాజును తీసుకు పోవడానికి సిద్ధమవుతాడు.**(సంస్కృత భారతం, వన పర్వం,70 వ అధ్యాయం).**

ఇక్కడ సుదేవుడు సమాచారాన్ని మాత్రమే చేరవేసాడు అది విదర్భకు బాహుకుడు వచ్చేటట్లు కార్యరూపం దాల్చింది. రుతుపర్ణుడు నిజంగానే స్వయంవరం అనుకుని దానిని చూడాలని బాహుకుడితో బయలుదేరుతాడు.

### 3.12.7. కేశిని దూతిక:

*ఏవం సా తర్కయిత్వా తు దమయంతీ విశాంపతే1*

*దూతీం ప్రస్థాపయామాస నైషధాన్వేషణే శుభా 11 (సంస్కృత భారతం ,వన పర్వం,73 వ అధ్యాయం, 36 వ శ్లోకం).*

దమయంతి అనేక విధాల ఆలోచించి తర్వాత నలుని వెదకడానికి ఒక దూతికను పంపింది.ఈ మాటలను బట్టి కేశిని దూతకి ఆమె ద్వారా రాయబారం జరిగిందని తెలుస్తుంది.

నలుడు ఋతుపర్ణునితో కలిసి రథమెక్కి విదర్భకు వెళ్తాడు. నలుడు నడిపిన రథం యొక్క శబ్దం వినగానే దమయంతి ఇది నలుడి రథమని గుర్తుపట్టింది. అది శుభసూచకంగా భావించి నలుడిని చూస్తానని సంతోషించి కేశిని అనే దూతిని పిలిచి బాహుకుడి మీద అనుమానం ఉంది అయోధ్యలో పర్ణాదుడికి ప్రత్యుత్తరం ఇచ్చింది కూడా ఇతడే అయిఉండవచ్చు అతని వివరాలన్నీ తెలుసుకురమ్మని పంపిస్తుంది. ఇక్కడ దమయంతి బాహుకుడికి ఏమి చెప్పాలో చెప్పలేదు. బాహుకుడి యొక్క సంగతి ఏమిటో తెలుసుకురమ్మని మాత్రం చెప్తుంది.

సంస్కృతభారతంలో దమయంతి కేశినితో కొన్ని మాటలను చెప్పి పంపిస్తుంది. కేశినీ నీవు అక్కడకు వెళ్ళు ఆ రథం ప్రక్కన పొట్టి చేతులు వికృతిరూపంతో ఒకడు కూర్చుని ఉన్నాడు. ఆ రథ సారథి ఎవరో తెలుసుకో ఆ పురుషుని దగ్గరకు వెళ్ళి ఏమాత్రం తొందర పడకుండా మృదువుగా క్షేమసమాచారాలు అడిగి తెలుసుకో అతనితో సంభాషణ ముగిసే సమయంలో పర్ణాదుడు చెప్పిన మాటలన్నీ పలుకు నీ పలుకులకు అతడేమి సమాధానం చెపుతాడో తెలుసుకో అనగానే దూతి నెమ్మదిగా వెళ్ళి బాహుకునితో దమయంతి ప్రాసాదం పై నుండి చూస్తోందని సంబాషణ ప్రారంభిస్తుంది. (**సంస్కృత భారతం, వన పర్వం,73 వ అధ్యాయం, ).**

### 3.12.7.1. కేశిని నలునిని పరీక్షించుట:

కేశిని బాహుకుడి దగ్గరకు వచ్చి దమయంతి నీ యోగ క్షేమాలను తెలుసుకురమ్మని నన్నుపంపించిందని చెప్పి ఇక్కడకు మీరు  ఎందుకు వచ్చారని దానికి బాహుకుడు కాస్త ఎత్తి పొడుపుగా దమయంతికి తిరిగి స్వయం వరం కల్పించారు కదా అందుకు ఆ కారణం చేత రుతుపర్ణుడు మహారాజు వేడుకతో ఒక్క రోజులోనే అయోధ్య నుండి నేరుగా ఇక్కడికి నూరు ఆమడల దూరం ఒక దినంలో వచ్చిన సంగతి నీవు వినలేదా అతడి రథసారథిని నేను. నేను కూడా అతడితో పాటు మనోవేగంగా వచ్చాను. వేరే చెప్పలేదా అనిచెప్పగా విని 'కేశిని' మూడవ వ్యక్తి ఎవరు? అని అడుగుతుంది. అతడు ఒకానొకనాడు నలుడి రథసారథి. అతడి పేరు వార్ష్ణేయుడు గౌరవించదగిన వాడని చెప్పగానే అతనికి నలుడు కూడా తెలిసిఉంటుంది కదా అని ఎదురు ప్రశ్న వేస్తుంది. అప్పుడు బాహుకుడు ఇలా పలుకుతాడు. వార్ష్ణేయుడు నిషధ నుండి నలుడి బిడ్డలను విదర్భకు తీసుకుని పోయి అక్కడ విదర్భరాజు దగ్గర వదిలి పెట్టి తాను వెనుతిరిగి పోతూ మార్గమధ్యంలో నలుడు రాజ్యాన్ని జూదంలో కోల్పోయిన వార్త తెలుసుకుని రుతు పర్ణుడు కొలువులో చేరాడు అందువలన వార్ష్ణేయుడికి నలుడి గురించి తెలియదని చెప్పింది. నలుని గురించి నలునితో పాటు ఉన్న దమయంతికి తెలియాలి. లేదా ఆ నలుడికే తెలియాలి కాని ఇతరులకు తెలియడానికి ఎటువంటి అవకాశాలు లేవు. అనగానే కేశిని  పర్ణాదుని మాటలను ఇక్కడే చెపుతుంది నలుడు దమయంతిని విడిచి వెళ్ళిపోయాడు అప్పటినుండి దమయంతి సగం చీరనే నేటికీ

కట్టుకుని ఉంది. ఆమె శరీరం దుమ్ముతో మలినమై ఉన్నది. నిరలంకారంగా ఉంది. అటువంటి దమయంతిని నలుడు ఎలా మరచిపోయాడో కదా అని కేశిని నిందిస్తుంటే నలుడు ఆమెకు తెలియకుండా కన్నీరు కారుస్తాడు. కేశిని బాహుకుడి మాటలు, రూపం దమయంతికి తెలుపుతుంది. దమయంతి బాహుకుడే నలుడు కావచ్చునని సందేహించి ఇంకా పరిక్షించమని అతని వంటను గమనించమని చెప్తుంది.

### 3.12.7.2.కేశిని నలుని రహస్యాలను దమయంతికి తెలుపుట:

కేశిని చాకచక్యంగా నలుడి నుండి సమాచారాన్ని అతని హావభావాలను గమనించి ఆ విషయాలన్నింటిని దమయంతికి తెలుపుతుంది. కేశిని నలుడి వంటకాలను వండిన విధానాన్ని గమనించి ఈ విధంగా చెపుతుంది కొన్ని ఆశ్చర్యకరమైన పనులను అతని దగ్గర చూసాననిచెప్తుంది.గడ్డితో కూడిన పిడికిలిని వీచితే అక్కడ నిప్పు ఉద్భవించి అతడి వంట పూర్తి అయ్యేవరకు కట్టెలతో నిమిత్తం లేకుండా అట్లే మండుతూనే ఉంటుంది. అంతేకాక మాంసాలు కడగడానికి నీరు వాటంతట అవే రావడం ఇలా కొన్ని సంఘటనలను చెప్తుంది. అతను వండిన మాంసంను కూడా దమయంతికి అందిస్తుంది. కేశిని చెప్పిన మాటలను సత్యంగా భావించి దమయంతి ఇతడు నలుడే అని నిర్ధారించుకుని ఆఖరి ప్రయత్నంగా తన పుత్రుని పుత్రికను పంపిస్తుంది. వారిని చూచిన వెంటనే నలుడు వారిని కౌగిలించుకుని తొడ మీద కూర్చో బెట్టుకుంటాడు. కేశినితో వీరిని చూడగానే నా పిల్లలు గుర్తుకు వచ్చారని అందుకు అలా చేసానని చెప్తాడు నీవు మాటిమాటికి ఇక్కడకు రావద్దని మేము అతిథులుగా వచ్చామని ఎవరైనా చూస్తే ఏమైనా అనుకుంటారని వెంటనే ఇక్కడ నుండి వెళ్ళమని చెప్తాడు.

కేశిని దమయంతికి ఈ వివరాలన్నీ తెలుపగా తల్లి అనుమతితో నలుడిని తన దగ్గరకు రప్పించి నలుడి నిజస్వరూపం వచ్చేటట్లు చేస్తుంది.(ఆంధ్రమహాభారతం, అరణ్య పర్వం, ద్వితియాశ్వాసం,186 నుండి 203 వరకు).

సంస్కృతం భారతంలో పిడికెడు గడ్డి తీసుకుని సూర్యుని వైపు చూపగానే అది మండిందని ,దానితో అగ్నిని సిద్ధం చేసాడని ఉంటుంది, అతడు అగ్నిని తాకినప్పటికి అది

వానిని దహించడం లేదు , ఈ మార్పు ఆంధ్రమహాభారతం లో కనబడలేదు. **(సంస్కృత భారతం, అరణ్య పర్వం,73 ,74 వ అధ్యాయాలు, ).**

కేశిని రాయబారం నిర్వర్తించడంలో సఫలమైందని చెప్పవచ్చు.

## 3.13. కోటికాస్య రాయబారం:

జయద్రథుడు అనేక మంది రాజులతో సాల్వరాజు కుమార్తెను వివాహమాడడానికి వెళ్తూ కామ్యకవనం లో ఉన్న ద్రౌపదిని చూసి మోహిస్తాడు. ఆమెను ఎలాగైనా పొందాలని తన తోటి రాజు కోటికాస్యుడినితో తన మాటలుగా కొన్ని విషయాలు చెప్తాడు. ఈమె సౌందర్యం నన్ను ఆకట్టుకున్నది ఈమె దేవకన్యాలాగా, యక్ష కన్యలాగా కనబడుతుంది ఈమె గురించిన వివరాలను తెలసుకురమ్మని తోటి రాజు, స్నేహితుడైన కోటికాస్యున్ని పంపుతాడు. పంపేటప్పుడు ఈమెతో నాకు సమాగమం కలిగేవిధంగా ప్రయత్నించి నా జన్మ ధన్యం చేయమని చెప్తాడు.

ఇక్కడ రాయబారిగా పంపేవ్యక్తి తను ఎవరిగురించి వివరాలు తెలుసుకోవాలనుకున్నాడో ఆ ద్రౌపది ఎదుటనే కొంత దూరంలో ఉన్నప్పటికి తాను స్వయంగా వెళ్ళకుండా రాయబారిగా కోటికాస్యుని పంపడంలో గల ఆంతర్యాన్ని గమనిస్తే రాయబారం నిర్వహించడంలోనూ ఒక రాచమర్యాదను పాటిస్తున్నట్లు తెలుస్తుంది.

కోటికాస్యుడు ద్రౌపది దగ్గరకు వెళ్ళి తనను పంపించిన జయద్రథుని కి గౌరవం కలిగించాలని రాయబారిగా వచ్చిన కోటికాస్యుడు తన ప్రభువుయొక్క కోరికను నెరవేర్చే పనిలో మొదటి ప్రయోగంగా ద్రౌపదిని అనేకమంది దేవతాస్త్రీలతో పొగుడుతాడు. వనదేవతగా, శచీదేవిగా, లక్ష్మీ దేవిగా, ఆమె సౌందర్యాన్ని ప్రశంసించి, ఆమె నివసించిన ఆ గొప్ప వంశం ఏదని, గొప్ప అదృష్టవంతుడైన తండ్రి ఎవరని , గొప్పవారైన ఆ భర్తలు ఎవరని అడుగుతాడు.

తర్వాత ద్రౌపది సమాధానం చెప్పకముందే తన గురించి చెప్తాడు.

*క. కరిరాజ గమన! మా తెఱఁ /గరయఁదలఁచితేని వినవె యధికబలుఁడ నే*

*సురథుఁడను రాజ పుత్త్రుడ / నరిమథనుఁడఁ గోటికాస్యుఁడనఁజనువాఁడన్(ఆంధ్ర మహాభారతం అరణ్య పర్వం, రెండవ సంపుటి, 152 వ పద్యం).*

నేను బలం కలిగిన వాడినని సురథుడనే మహారాజు కొడుకుని శత్రుసంహారం చేసే సామర్థ్యం కలవాడినని నన్ను కోటికాస్యుడని పిలుస్తాడని  చెప్తాడు. తర్వాత త్రిగర్త దేశ రాజు క్షేమంకరుడిని , సుబలుడనే రాజ కుమారుడుని,చెప్పి తర్వాత పన్నెండుమంది సౌవీరరాజులందరి చేత సేవించబడే మహారాజు జయద్రథుడు అతను నీ యొక్క విశేషాలు తెలుసుకురమ్మని పంపాడని చెప్తాడు. అతని మీద మక్కువ ఏర్పడడానికి అతని సైన్య సంపదను చెప్పి సింధు సౌవీర దేశాలకు అధినేత అయిన జయద్రథుడని వివరించాడు. తన రాయబారం సఫలం కావడం కోసం ప్రయత్నిస్తున్నట్లు ఇతని మాటల వలన తెలుస్తుంది.

ద్రౌపది వెంటనే స్త్రీ సహజమైన భయం చేత  ఈ ఆశ్రమంలో ఒంటరిగా ఉన్నాను నీవు నా డగ్గరకు రావడం మంచిది కాదు మర్యాద అనిపించుకోదు. అతని ఆంతర్యం కొంత వరకు గ్రహించినట్లు ద్రౌపది నన్ను సామాన్య స్త్రీగా భావించవద్దు, నేను ధర్మాన్ని ఎప్పుడూ విడువను పైగానీవు శిబి చక్రవర్తి వంశంలోని సురథుని కొడుకువు కాబట్టి నీవు ధర్మాన్ని తెలుసుకుని మసలుకో అని పరోక్షంగా చెప్పినట్లు ఉంటుంది. ఈ విషయాలు చెప్పిన తరువాత తన గురించి ద్రౌపది చెప్తుంది తాను పాంచాల దేశ ప్రభువు ద్రుపదుని కుమార్తెనని , పాండురాజు పుత్రులు, ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకుల సహదేవులు తన భర్తలని వారు వేటకు వెళ్లారని వారు వచ్చే సమయమయ్యిందని మీరు వారి అతిథి మర్యాదలు స్వీకరించడానికి తగిన వారు కాబట్టి ఈ ఆశ్రమ సమీపంలో వేచి ఉండమని చెప్పి కుటీరంలోకి వెళ్లిపోతుంది.

కోటికాస్యుడు జయద్రథుని దగ్గరకు వెళ్ళి ద్రౌపది వివరాలను తెలియజేస్తాడు. జయద్రథుడు దుష్టబుద్ధితో ఆమెను బలాత్కారంగానైనా పొందాలనే తలంపుతో తాను వెళ్ళేది సింహపు గుహలోనికి అని తెలుసుకోకుండా ద్రౌపది కుటిరాన్ని చేరుతాడు.

ఈ కోటికాస్యుని రాయబారం లో ద్రౌపది వివరాలు మాత్రం తెలపడం ఒక్కటే అతను సాధించింది. జయద్రథుడు  చెప్పిన విధంగా ద్రౌపది మనసును జయద్రథుడి వైపు మళ్ళించే ప్రయత్నం చేసాడు కాని పూర్తిగా మనసును మార్చలేకపోయాడు కాబట్టి ఈ విషయంలో రాయబారం విఫలమైందని చెప్పవచ్చు.

## 3.14. విరాట పర్వం – రాయబారాలు:

విరాడుపాసన విరాట పర్వము ఇది రహస్య భావమునకు చెందినది కనుక అజ్ఞాతముగనే జరుగవలెను. ( **వెంకట శ్రీనివాసాచార్యులు, తిరుమల, శ్రీమహాభారత వైజ్ఞానిక సమీక్ష(ఆదిపర్వం).పుట:42.).**

విరాట పర్వం పాండవుల అజ్ఞాత వాసమును, కీచక వధ వంటి అంశాలతో విరాజిల్లుతుంది. పాండవులు ఎవరికి తెలియకుండా మారు వేషాలతో విరాట నగరమందు ఉండడం అందరికి తెలిసిన విషయమే . ఈ సమయంలో ఎన్నో ఇబ్బందులు కూడా ఎదుర్కున్నారు. వారి అజ్ఞాతాన్ని నండూరి సుబ్రహ్మణ్య శర్మ దాగుడు మూతయాట అని కూడా వర్ణించవచ్చని చెప్తారు. (సుబ్రహ్మణ్య శర్మ, నండూరు, మహాభారతోపన్యాసములు, పుట: 175).

వీరి అభిప్రాయాన్ని పరిశీలిస్తే అజ్ఞాత వాసం చేస్తున్నప్పటికి వారికి ఎదురయ్యే తీవ్రమైన సంఘటనలు వారిని ఎక్కడ బయటపడేటట్లు చేస్తాయో అన్నట్లు ఉన్నప్పటికి వాటిని సమర్ధవంతంగా ఎదుర్కొని సఫలీకృతులవుతారు వారు ముఖ్యంగా ద్రౌపది విషయంలో కీచకుడు చేసిన నిర్వాకం ఎక్కడ అజ్ఞాత భంగమయ్యే పరిస్థితి వస్తుందా అని అనుకోవడానికి ఆస్కారం ఉన్నప్పటికి వారి జ్ఞానంతో నిశ్శబ్దం గానే కీచకవధ కార్యాన్ని నిర్వర్తించి వారి పనులలో వారు నిమగ్నులు అవుతారు. ఇటువంటి సన్నివేశాలు ఉండడం చేత ఇది దాగుడు మూత ఆట గా వారు అభివర్ణించారని తెలుస్తుంది . ఇక ఈ పర్వంలోని రాయబారాలను పరిశీలిస్తాము.

### 3.14.1. సుధేష్ణ రాయబారం:

*ఈమె మత్స్యమహీపాలుని రాణి తన అభిమతానికి వ్యతిరేకంగా నిస్సహాయస్థితిలో జార దూతి అవుతుంది. సమస్త భారాన్ని భగవంతునిపై మోపి నిమిత్తమాత్రురాలిగా ఉండి పోతుంది. అందుచేత ఇది త్రికరణ శుద్ధి లేని రాయబారమైనది.(విద్యాలత , వల్లివేడు, దూత్య సాహిత్యము, 15,16,17, శతాబ్దములు, పుట:75).*

సుధేష్ణ తమ్ముడు కీచకుడు సింహబలుడు విరాట రాజునకు దండనాథుడు. బలగర్వితుడు. ఇతని కన్ను సైరంధ్రి అయిన ద్రౌపది పై పడుతుంది. ఆమె సౌందర్యానికి ముగ్ధడయ్యి అక్క అయిన సుధేష్ణ దగ్గరకు వెళ్ళి పాంచాలి వివరాలు అడుగుతాడు సుధేష్ణ కీచకుని ఆంతర్యం తెలుసుకుని అతని మనసు మరల్చుటకు ప్రయత్నించి విఫలమవుతుంది.

కీచకుడు ద్రౌపది దగ్గరకు వెళ్ళి ఆమె సౌందర్యమును మెచ్చుకుని తన కోరిక తెలియజేస్తుంది.. దురభిమాని అయిన కీచకుని నుండి తప్పించు కోవడానికి మృదువుగా అతని కోరిక సమంజసం కాదని మందలిస్తుంది. కాని కీచకుడు పరసతి సంగమం వలన వచ్చే పాపాన్నైనా భరిస్తాను కాని నిన్ను మాత్రం వదలనని మితిమీరిన కామదాహంతో పలుకుతాడు. నీచుడు కాబట్టి మెత్తగా చెపితే వినేటట్టు లేడని పరుషంగా మాట్లాడుతుంది. కీచకుడు సుధేష్ణను వేడుకుంటాడు. సుధేష్ణ కలవరపడుతుంది. కీచకుడికి అన్ని రకాలుగా అతని బుద్ధిని మరల్చడానికి ప్రయత్నించింది. సైరంధ్రి భర్తలు గంధర్వులని బెదిరించింది. మందలించింది. మూర్ఖపు పట్టుదలతో ధైర్యముతో కీచకుడు సుధేష్ణ పాదాలపై పడుతాడు. సుధేష్ణ మనసులో మన్మథుని బాణాలచేతనైనా మరణిస్తాడు,లేదంటే సైరంధ్రి భర్తల చేతిలోనైనా చావు తప్పదని భావిస్తుంది చివరికి కీచకుడికి ఆనందం చేకూర్చే విధంగా కీచకుని దగ్గరకు పని నిమిత్తం ఈ రోజు ముగిసేలోగా పంపిస్తానని వాగ్దానం చేస్తుంది. సుధేష్ణ కీచకుని కోరిక మేరకు అంతఃపురానికి సైరంధ్రిని పిలిపించి మితి మీరిన దాహాన్ని నటిస్తూ కీచకుని అంతఃపురంలో మదిర తీసుకు రమ్మని పంపుతుంది. అది ధర్మ బద్ధం కాదని తెలిసి కూడా తమ్ముని ప్రాణాలు గుర్తుకు వచ్చి అధర్మ మార్గాన నడుస్తుంది. సైరంధ్రికి ఇష్టం లేకపోయినప్పటికి సుధేష్ణ బలవంతం మీద వెళ్ళవలసి వచ్చింది. ఇక్కడ సుధేష్ణ అపూర్వమగు శృంగార దూతికగా కనబడుతుంది. **(ఆంధ్రమహాభారతం, విరాట పర్వం, ద్వితియాశ్వాసం,82 వ పద్యం నుండి )**

సంస్కృత భారతంలో కూడా సుధేష్ణ కీచకుడికి ద్రౌపది భర్తలు గంధర్వులని వారు చాలా బలవంతులని చెప్పి కీచకుని మనసు మార్చడానికి చూస్తుంది. అయినా సరే కీచకుడు వినకపోయేసరికి చాలా బాధతో సుధేష్ణ కీచకునితో నీకారణంగా నా సోదరులు,

మిత్రులూ అందరూ నశించిపోతారు నీవు ఇటువంటి అనుచితమైన కోరికను మనసులో ఉంచుకున్నావు నీ మేలేదో నీవు తెలుసుకోలేకపోతున్నావు, కామానికి దాసుడివవుతున్నావు.

*"ధ్రువం గతాయుస్త్వం పాప యదేవం కామమోహితః*
*అకర్తవ్యే హి మాం పాపే నియునంక్షి నరాధమ" (సంస్కృత భారతం, విరాట పర్వం, 15 వ అధ్యాయం, 17 వ శ్లోకం).*

నీవు పాపాత్ముడివి నీ ఆయుస్సు తీరిపోయే సమయం వచ్చింది అందుకే కామంతో ఉన్నావు ఎప్పటికి నేను చేయకూడని పాపపు పనికి నన్ను పురమాయిస్తున్నావు. నీవు యముని దగ్గరకు వెళ్ళడం నిశ్చయం ఇందులో సందేహం లేదు సోదరుని పై ప్రేమతో నీ మాటను కాదనలేక ఈ పనిని చేస్తున్నాను. తర్వాత నీవు వంశాన్ని నాశనం చేసి సంతోషంతో ఉందువులే అని చెప్పి కీచకుని కోరికను గుర్తించి అతనికి ద్రౌపది యొక్క పొందు లభించడానికి తగిన ఉపాయాన్ని నిశ్చయించుకుని అతనితో ఇలా అంది. నీవు పర్వదినాన్ని పురస్కరించుకుని నీ ఇంటిలో మద్యాన్ని భోజన సామగ్రిని సిద్ధంచేయించు. ఆపైన నేను సైరంధ్రిని సుర తెచ్చే మిష మీద నీ దగ్గరకు పంపుతానని చెప్తుంది.

ఇక్కడ కీచకుడు సుధేష్ణను రాయబారిగా చేసుకుని ద్రౌపదిని తన దగ్గరకు వచ్చే ప్రయత్నం చేసాడు. సుధేష్ణ మదిర తెమ్మని ద్రౌపది తో అంటుంది. దానికి ద్రౌపది మొదట అంగీకరించక పోయినా దుఃఖంతోనే భయపడుతూ సూర్య భగవానుని తలచుకుని కీచకుని ఇంటికి వెళ్ళి అవమానం పాలవుతుంది.

ఆంధ్ర మహాభారతంలో సుధేష్ణ కీచకుడు మూర్ఖుడు కావున మాట వినడని తెలుసుకుని బాధతో ద్రౌపదిని పంపే ఏర్పాట్లు చేస్తానని చెప్పింది సంస్కృతభారతంలో కూడా ఆ విధంగా చెప్పినప్పటికి కీచకుడు చావడం తథ్యం అని తేల్చి చెప్పేసింది అయినప్పటికి రెండు గ్రంథాలలోనూ సోదరుని పై అభిమానంతో చేయకూడని పనిని చేస్తుంది.

*సుధేష్ణను నీచ శ్రేణి దూతగా వల్లివేదు విద్యాలత వర్ణించారు. (విద్యాలత వల్లివేదు,* ***దూత్య సౌవర్చసము – ప్రబంధ సాహిత్యము****, 15,16,17 ) (సిద్ధాంత గ్రంథము, పుట:15.).* వల్లివేదు విద్యాలత తన దూత్య సాహిత్యము అనే గ్రంథంలో సుధేష్ణ

పరిస్థితులను ఎదిరించలేక స్వభావవిరుద్ధంగా ప్రవర్తించిందని దానికి ఆమె మానసిక సంఘర్షణ కూడా కారణం అవుతుంది. జార ద్యూతము సుధేష్ణ రాయబారం లో కనబడుతుందని సుధేష్ణ ఒక అపూర్వమగు శృంగార దూతకి అని తెలియజేసారు.( **విద్యాలత , వల్లివేడు, దూత్య సాహిత్యము, 15,16,17, శతాబ్దములు, పుట:79).**

### 3.14.2. సుధేష్ణ రాయబార విశేషాలు:

*సుధేష్ణ ద్రౌపదిని కీచకుని దగ్గరకు పంపుటకు చేసిన కార్యం అందరూ సుధేష్ణ ను నీచపాత్రగానే గుర్తించే అవకాశం ఉంది కాని ఆ కార్యంలో గల ఆంతర్యాన్న నండూరు సుబ్రహ్మణ్య శర్మ* ***'మహాభారతోపన్యాసములు '*** *గ్రంథంలో ఈ విధంగా వివరిస్తారు. కీచకుడు చావకుండా ఉండడానికి తన ప్రయత్నము తాను చేసినది. కామం చేత చావకుండుటకు సైరంధ్రిని పంపింది. గంధర్వులచే చావకుండుటకు బలవంత పెట్టవద్దని జాగురుకతను బోధించింది. ఆంధ్ర భారతమును మాత్రమే సుధేష్ణ పాత్ర అనౌచిత్యముగా చిత్రీకరించబడింది. నిజానికి గమనిస్తే సుధేష్ణ కార్యగౌరవము కనబడుతుందని వీరు అభిప్రాయపడుతారు అంతేకాకుండా ద్రౌపది మదిర తీసుకుని వెళ్లుటకు తిరస్కరించినప్పుడు సుధేష్ణ నేను ఆతనిని భద్రపరచియే నిన్ను పంపుచున్నాను అని చెప్పి పాన పాత్రను చేతికిచ్చినది. అప్పుడు సుధేష్ణ హృదయం ఎటువంటిదంటే అంతకు ముందే కీచకునికి చెప్పింది బలవంతపెట్టవద్దని ఆ ధైర్యము చేతనే ఇలా చెప్పిందని వీరు చెప్పారు. చూసే వారికి సుధేష్ణ తారుపుకత్తెవలె కనబడుతుందని వీరు తెలియజేసారు.(సుబ్రహ్మణ్య శర్మ, నందూరు. మహాభారతోపన్యాసములు, పుట:248)*

### 3.14.3. వేగులు – రాయబారం:

దుర్యోధనుడు పాండవుల అజ్ఞాత వాసాన్ని భంగపరచడానికి వారి జాడను తెలుసుకోవడానికి వేగులను పంపుతాడు. వారు పాండవులను గుర్తించలేక హస్తినాపురికి ప్రవేశించి. సభలో ఉన్న దుర్యోధనునితో కనబడిన పొదరిళ్ళను, పల్లపు ప్రాంతాలన్నింటిని దిగిచూచాము, చెట్టు చెట్టుకూ తిరిగి ఎక్కి చూచాము, నీటి పడవలలో, కొండ గుహలలో దూరి గాలించాము, అనేక దేశాలలో తిరిగి

వేదికామని ఒకచోట రథాలు పడిపోయిన జాడ గమనించి దాని వెంట మేము కూడా చాలా దూరం వెళ్ళి సారథులతో మాత్రమే పోతున్న ఆ రథాలను చూచాం. వాటి దగ్గరకు పోకుండా అవి ఎటువైపు పోతాయో గమనిస్తూ వాటి వెంట రహస్యంగా అనుసరించాము, ఆ రథాలు ద్వారకా నగరానికి చేరగా ఆ ద్వారకలో ఉంటారనే ఆశతో అనేక విధాలుగా తిరిగి పాండవుల జాడ గుర్తించలేకపోయాము. మేము చేసిన ప్రయత్నాలన్నింటిని తెలిపి తర్వాత మీ ఆనతి ప్రకారం ఏమి చేయాలో అది చేద్దామని తిరిగి వచ్చామని చెప్తారు. పాండవులు రూపు మాసి పోయి ఉంటారు. బ్రతికి ఉంటే కనబడకుండా పోరు ఇది ఇందులో ఉన్న యథార్థం అయితే మీకు ప్రియమైన ఒక విశేషం విని సంతోషంతో వచ్చాం. మత్స్యదేశపురాజైన విరటుడి బావమరిది కీచకుడిని పవిత్ర మూర్తి అయిన ఒక సుందరాంగి కారణంగా అర్థరాత్రి వేళ గంధర్వులు అతి రహస్య పద్ధతిలో చంపారు ఆ చంపటం కూడా ఆశ్చర్యంగా చంపారు. ఆయుధాలతో పని లేకుండా చేసిన ఆ యుద్ధంలో తల, కాళ్ళు, చేతులు డొక్కలోనికి చొప్పించి పీనుగును ముద్దగా చేసి వేసారు. దుర్మార్గులయిన కీచకుడి తమ్ముళ్ళను కూడా వదలకుండా క్రమ్ముకుని వారిని చంపారు. వారు ఎలా చంపారో తెలుసుకోవడానికి సాధ్యపడలేని విధంగా ఆ గంధర్వులు వెళ్ళిపోయారు. విరటుడు శత్రువు గనుక అతడికి ఏర్పడిన బాధను మీకు విన్నవించాము తర్వాత పాండవులను గూర్చి వెదికే విషయంలో తగిన ఉత్తర్వులు ఇవ్వమనగా అలాగే చేస్తాములే అని వేగులను దుర్యోధనుడు పంపివేస్తాడు. **(ఆంధ్రమహాభారతం, విరాటపర్వం, తృతీయాశ్వాసం,73 వ పద్యం నుండి).**

ఇక్కడ వేగులను దుర్యోధనుడు పాండవులను వెదకడానికి పంపిస్తాడు. ఆ దుర్యోధనుని ఆజ్ఞను అనుసరించి వేగులు పాండవులను వెదకి అజ్ఞాతవాస భంగం చేయడానికి వెళ్ళినప్పటికి వారి జాడను గుర్తించలేక విఫలం చెందుతారు. రాయబారులుగా వారు విఫలం చెందినప్పటికి దుర్యోధనుడు ఆలోచించే విధంగా విరాటుని కొలువులో జరిగిన కీచక ఉపకీచకుల మరణ ప్రస్తావనను తీసుకు

వస్తారు. ఈ విధంగా వేగులు రాయబారులుగా విఫలం పొందారు. ఇక్కడ వేగులను రహస్య రాయబారులుగా చెప్పవచ్చని నా అభిప్రాయం.

### 3.14.4. **దుర్యోధనుని దూత:**

పాండవుల అజ్ఞాత వాసం పూర్తయిందని భీష్మాదులు చెప్పినప్పటికి దుర్యోధనుడు వారి మాటలను ప్రమాణాలుగా గుర్తించకుండా రహస్యంగా ధర్మరాజు వద్దకు దూతను పంపుతాడు. ఆ దూత ధర్మరాజు వద్దకు వెళ్ళి అజ్ఞాత వాసం పూర్తికాక ముందే అర్జునుడు బయటపడ్డాడని నీవు లెక్కచూచి తెలుసుకుని ఏది ఉచితమూ తెలియజేయాలని తిరిగి వనవాసం చేయాలని అనేటట్లు దూత పలుకగా ధర్మరాజు నవ్వి

*క.నిండె సమయాబ్దములు నిం /కొండనలే దిపుడ చని సుయోధనుతో భీ*
*ష్మండును గురుండును వినఁగా/ నిండె నను ము నిండె నిండె నిక్కంబునకున్*
*(ఆంధ్రమహాభారతం, విరాటపర్వం, పంచమాశ్వాసం, 370 వ పద్యం).*

శపథ రూపంలో 13 ఏళ్ళునిండాయి . ఇప్పుడే వెళ్ళి దుర్యోధనుడితో భీష్ముడు, ద్రోణుడు, వింటుండగా చెప్పమని తెలియజేస్తాడు. దూత అదే విధంగా దుర్యోధనునికి అంతా వివరించి చెప్తాడు. అది విని దుర్యోధనుడు ఆ రాత్రి కొలువులో భీష్ముడు, ద్రోణుడు ,కర్ణుడు, తన తమ్ములు ఉండగా ధర్మరాజు వద్దకు దూతను పంపిన విషయం చెప్పకుండా మనం మోసపోయి అనవసరంగా నిర్దోషంగా ఆ అర్జునుడితో యుద్ధం చేసాం అసలు అతడు పదమూడేళ్లు అయ్యాక వచ్చాడా? అనే అనుమానాన్ని వ్యక్తం చేస్తాడు. భీష్ముడు అనుమానం అక్కర్లేదు. అర్జునుడు వచ్చినప్పుడే చెప్పానని అనుమానం పడవలసిన అవసరం లేదని అప్పటికి ముందే నియమిత కాలం గడచిపోయిందని భీష్ముడు చెప్పిన మాటలను అందరూ సమ్మతించారు.(ఆంధ్రమహాభారతం, విరాట పర్వం, పంచమాశ్వాసం,367 వచనం నుండి373 వరకు )

ఇక్కడ దుర్యోధనుని ఓర్వలేని తనం అర్థమవుతుంది. ఏదో ఒక కారణం చేత పాండవులను అడవులకు పంపాలనే ఆలోచనతో వారి అజ్ఞాతవాసం పూర్తి కాక ముందే

అర్జునుడు కనబడ్డాడనే ఆలోచనతో దూతను పాండవుల దగ్గరకు పంపిస్తాడు. ధర్మరాజు సమాధానాన్ని విని మరలా దూతను పంపిన విషయం భీష్మాదులకు తెలియకుండా వారితో మరలా పదమూడేళ్లు నిండాయా? లేదా? అనే అనుమానాన్ని వ్యక్తం చేస్తాడు.

ఇక్కడ దూత రాజుల యొక్క విషయాన్ని యథాతథంగా చెప్పి కార్యభారాన్ని నిర్వహిస్తాడు.

## 3.15. ఉద్యోగ పర్వం–రాయబారాలు:

ఉద్యోగం అంటే ప్రయత్నమని అర్థం ఏ ప్రయత్నం ధర్మం కోసం ప్రయత్నమా అధర్మాన్ని నిర్మూలించడం కోసం ప్రయత్నమా, అని ఆలోచించినప్పుడు ధర్మహాని కలిగినప్పుడల్లా దానిని నివారించడానికి జరిగే ఒక ప్రక్రియ ఈ రాయబారాలలో కనబడుతుంది. ఒక్క విషయం గూర్చి అనేక విధాలుగా చర్చించబడుతుంది. ధర్మబద్ధంగా రావలసిన రాజ్యాన్ని కౌరవులు వారంతట వారే పిలిచి నియమాను సారంగా ఇవ్వాలి అది జరగలేదు కాబట్టి ఈ రాయబారాలు పుట్టుకొచ్చాయి. ఇది స్పష్టమైన అంశం. రాజ్య భాగమే ఇచ్చిఉంటే రాయబారాలే అవసరముండేది కాదు యుద్ధము సంభవించేది కాదు. కాని పాండవులు అరణ్య అజ్ఞాత వాసాలకు ముందు ఎన్నో అవమానాలను ఎదుర్కున్నారు. చిన్నప్పటి నుండి కష్టాలను ఎదుర్కున్నారు. కౌరవులు పాండవులను జీవితాంతం కష్టాలు పాలు చేయాలని చూసే తత్త్వం గలవారు. వారికి బుద్ధి చెప్పడం ఎలా అని ఆలోచించినప్పుడు
దుర్యోధనాదుల మీద ప్రయోగించే అస్త్రాల వంటివే ఈ రాయబారాలని నా అభిప్రాయం.

దురహంకారంతో ఉన్న దుర్యోధనుడికి అతనిని సమర్థించే ధృతరాష్ట్రునికి సామ దాన భేదో పాయాలను ముందుగా ప్రయోగించే ప్రక్రియగా కూడా ఈ రాయబారాలు కనబడుతున్నాయి. అయితే రాయబారాలు సఫలం కావని అందరికి ఒక నిశ్చితఅభిప్రాయం ఉన్నప్పటికి అనవసరంగా వంశ నాశనం జరగకూడదనే ఒక శాంతిపూర్వకమైన ఆలోచన ద్వారా ఈ రాయబారాలు జరిగాయని నా అభిప్రాయం. ముందు జాగ్రత్తగా రాయాబారాలకు ముందే ఇరు వర్గాలు సైన్యాన్ని సమకూర్చుకుంటారు.

గెలుపైనా ఓటమి అయినా ప్రయత్నం చేస్తేనే తెలుస్తుంది అంటుంటారు కదా అలా ఈ రాయబారాల ప్రయత్నాలు జరిగాయి దుర్యోధనాదుల దుర్నీతి వలన అహంకారం, ఈర్ష్య,అసూయ వలన ఏ రాయబారం సంపూర్ణమైన ఫలితాన్ని ఇవ్వలేకపోయింది. రాయబారిగా పరమాత్మ అయిన శ్రీకృష్ణుని బంధించే ప్రయత్నం జరిగిందంటే దుర్యోధనాదుల అహంకారం ఏ స్థాయిలో ఉందో మనం గుర్తించవచ్చు అటువంటి వారి వలన పదిమంది చెడిపోతారు అలాంటి వారి వలన లోకానికి ఉపయోగం ఉండదు. మొత్తంగా అధర్మనిర్మూలనే రాయబారాలు జరిగినట్లు అవి విఫలం కావడం చేత దండోపాయంతో యుద్ధం ద్వారా తగిన బుద్ధి చెప్పినట్లు ఈ ఉద్యోగ పర్వంలోని రాయబారాల వలన తెలుస్తుంది.

### 3.15.1. ఉద్యోగ శబ్దం వివరణ:

ఈ ఉద్యోగ పర్వంలోని రాయబారాల గురించి పొట్లూరి నారాయణ దాసు **“ఉద్యోగ పర్వం-రాయబారాలు”** అనే వ్యాసంలో ఈ విధంగా తెలియజేసారు.

*ఉద్యోగ' శబ్దానికి ప్రయత్నమని అర్థం. ప్రయత్నము సంధికా? సమరానికా? అన్నది ప్రశ్న. ఈ రెంటికీ అనియే చెప్పవలసి ఉంటుంది. సంధి సమర ప్రయత్నాలు ఎప్పుడూ ఏకకాలం లోనే జరగటం సహజం. సమర ప్రయత్నాలు సంపూర్ణంగా చేసుకొని, తమ స్థితిని బలపర్చుకున్న తరువాతనే సంధి ప్రయత్నాలు ప్రారంభించటం నేడు కూడా మనం చూస్తూనే ఉన్నాం. Speak from strength అన్నది నేటికీ రాజనీతి శాస్త్రంలో ప్రధాన విషయం గానే ఉంది. అదే విధంగా ఉద్యోగ పర్వంలో కూడా సమర ప్రయత్నాలు పూర్తి అయిన తరువాతనే సంధి ప్రయత్నాలు ప్రారంభ మైనాయి. అయితే సమర ప్రయత్నాలు బయటికి కనపడకుండా నిగూఢంగా, సమర్థంగా సాగుతూ ఉండగా, సంధి ప్రయత్నాలు మాత్రం లోకంలో బహుళ ప్రచారం పొందుతాయి. అదే విధంగా, భారతంలో కూడా సమర ప్రయత్నాల ప్రాధాన్యం బయటికి కనపడకుండా, సంధి ప్రయత్నాలే విస్తృతంగా వర్ణింప బడటం గమనింప దగిన విశేషం. సంధి ప్రయత్నాలు విరివిగా జరిగినా, ఆ ప్రయత్నాలు చేసిన వారెవ్వరూ సంధి కాగలదన్న విశ్వాసంతో చేసిన వారు కారు. అందరూ*

*అధర్మాన్ని ఎదుటివారిపై నెట్టి తాము ధర్మమార్గ వర్తులమని నిరూపించుకోవటానికి మాత్రమే ప్రయత్నం చేశారు. ఉద్యోగ పర్వం లోని రాయబారాలని పరిశీలించి చూస్తే ఈ విషయం విశదమవుతుంది. అందుచేత సంధి ప్రయత్నాలు సమర ప్రయత్నాలకి బలాన్ని చేకూర్చేవి మాత్రమే కావడం చేత ఉద్యోగ శబ్దానికి సమరోద్యోగం గానే విమర్శకులు అర్థం చెప్పారు.*

https://eemaata.com/em/issues/201603/8395.html

వీరి అభిప్రాయాలను పరిశీలిస్తే సమరానికి జరిగే ప్రయత్నంగానే ఉద్యోగ పర్వంలోని రాయబారాలుగా చెప్పారు. ఎవరికి వారు ధర్మపరులుగా మార్చుకోవడానికే ఈ రాయబారాలు అనే అభిప్రాయం వారి మాటల్లో వ్యక్తమవుతుంది. అది కొంత వరకు నిజమైనప్పటికి దుర్యోధనుడికి అసూయ, ధనాశ అతని శరీరమంతా వ్యాపించింది, ధృతరాష్ట్రునికి పుత్ర వాత్సల్యం చేత అతను దుర్యోధనాదుల తప్పులను ఖండించకుండా తండ్రిగా అవసరమైనప్పుడల్లా దండించకుండా సమర్థిస్తూ వస్తున్నాడు  ఈ స్వార్థ పూరితమైన వారి ఆలోచనలకు  మాటలనే చికిత్స ద్వారా సరైన ఔషధాన్ని అందించాలి. వారి బుద్ధిని మార్చడానికి అనేక విధాలుగా ప్రయత్నించి చూడాలి ఆ ప్రయత్నమే రాయబారాలుగా అవతరించాయని నా అభిప్రాయం. కాని దుర్యోధనాదుల మొండితనంతో అహంకారంతో యద్ధమే సమాధానంగా నిలిచింది.ఉద్యోగ పర్వం గురించి పురాణ పండ ఉషశ్రీ ఈ విషయాలను తెలియజేస్తారు.

**రాయబార రూపంలో రాజనీతి**

**విదురుని రూపంలో లోకనీతి**

**సనత్సుజాతుని నోట ఆత్మజ్యోతి** ఈ పర్వంలో గ్రహించాలి. ఈ పర్వంలో నలుగురు రాయబారులు వస్తారు. వారు వ్యవహార జ్ఞానం లేకుండా నిజాన్ని నిష్ఠురంగా చెప్పడమే తెలిసిన రాయబారి ద్రుపద పురోహితుడు,

కర్ర విరగకుండా పాము చావకుండా మంత్రాంగం నడిపే రాయబారి సంజయుడు.

త్రాచుపామును బలమయిన కర్రతో నడ్డి విరగపొడిచే రాయబారి వాసుదేవుడు

విరిగిన మనసులను మరింత విరిచే అవివేక రాయబారి శకుని కొడుకు ఉలూకుడు. (పురాణపండ ఉషశ్రీ, భారతం(ద్వి.సం), పుట:179.)

వీరి మాటల్లోని ఆంతర్యాన్ని పరిశీలిస్తే ధృతరాష్ట్రుని బుద్ధి ఎలాంటిదో అతని మనసులో మర్మం ఏమిటో బయటవారు గ్రహించకుండా పాండవులు యుద్ధోన్ముఖులు కాకుండా శాంతికాముకులుగా ఉండిపోవడానికి సంజయున్ని రాయబారిగా పంపించాడని, శ్రీకృష్ణ రాయబారం అధర్మ పరులందరికి ఒక అవకాశం ఇచ్చాడు వారు మారకపోగా హద్దులు మీరారు ఫలితంగా శ్రీకృష్ణ రాయబారం జరిగింది. వారందరికి బుద్ధి చెప్పే సమయం ఆసన్నమయ్యింది కాబట్టి యుద్ధం జరిగిందనే భావం వారి మాటల్లో తెలుస్తుంది. యుద్ధం నిర్ణయమైన తర్వాత పాండవులను కోపోద్రేకులను చేసి మరింత వారి వీరత్వానికి బలం చేకూర్చే విధంగా మాట్లాడిన దుర్యోధన రాయబారి ఉలూకుడని వీరి మాటల్లోని భావం.

ఆంధ్ర కమలా దేవి **'తిక్కన భారతము– రసపోషణము'' లో** శ్రీ భూపతి ఉద్యోగ పర్వం గురించి వివరాలను తెలియజేసారు. *'' ఉద్యోగ పర్వము రాజకీయ విషయ ప్రధానమైనది, లోకశాంతి, లోకానర్థములకు హేతువులగు సంధి ,విగ్రహముల వినిశ్చయము ప్రయోజనముగ పాండవుల చేసిన ప్రయత్నమందలి విషయము పాండవుల భావికర్తవ్యమును నిశ్చయించుటయే కాక, ఈ పర్వము సత్య ధర్మన్యాయములకు లోకమున గల స్థితి ఎట్టిదో కూడా వ్యక్తము చేయుచున్నది. లోకహితమును, బంధు హితమును కోరిన ధర్మజుని ఆశయమును నెరవేర్చువాడైన కృష్ణుడు సామదానద్వైదీభావములను అతి చాతుర్యంతోప్రయోగించుట ఇందలి ప్రధాన ఇతివృత్తమని చెప్పుటయే గాక రాజకీయ సంబంధములకు రాయబారములు ఈ ఘట్టమున కలవు''* ***(కమలా దేవి , ఆంధ్ర, 'తిక్కన భారతము– రసపోషణము, పుట:132.).***

పాండవుల భవిష్యత్తును నిర్ణయించే ఘట్టాలు, రాయబార ప్రయత్నాలు ఈ పర్వంలో చోటుచేసుకున్నాయి కావున ఈ పర్వం రాజకీయసంబంధాలతో కూడి ఉన్నదని వీరి మాటల్లో కనబడుతుంది.

### 3.15.2. భవిష్యకార్యాచరణకై సమావేశం:

ఉపప్లావ్యంలో శ్రీకృష్ణుడు , పాండవులు, బలరాముడు మున్నగు వారంతా భవిష్యత్ కార్యాచరణ గురించి ఆలోచించడం మొదలుపెడతారు. శ్రీకృష్ణుడు పాండవులు ధర్మబద్ధంగా అరణ్య అజ్ఞాత వాసాలు పూర్తిచేసుకున్నారని , ద్యూత నియమాన్ని శాంతంగా పాటించి కోపం హృదయంలో అతిశయించగా తమ భుజ బలాన్ని,నిగ్రహించాలని పూనికతో కూడిన పరాక్రమాన్ని కౌరవులకు చూపాలనుకుంటున్నారు. ఈ పాండవుల అభిప్రాయం తెలిసిన దుర్యోధనుడు అల్పసంఖ్యాకులై ఉన్నప్పుడే శత్రువులను యుద్ధంలో చంపుతానని అనివార్యమైన మిత్రబృందాన్ని సమకూర్చుకుంటున్నాడు. కౌరవుల మనఃస్థితి ఎలా ఉందో తెలుసుకోవడానికి కౌరవసభకు తగిన వాడిని పంపాలని దుర్యోధనుడు రాజ్యభాగం ఇస్తే మంచిది ఇవ్వకపోతే తర్వాత ఏమి చేయాలో ఆ సమయానికి ఆలోచిస్తామని చెప్తాడు. **(ఆంధ్రమహాభారతం, ఉద్యోగపర్వం, ప్రథమాశ్వాసం,17 వ పద్యం).**

### 3.15.3. శ్రీకృష్ణుని అభిప్రాయం:

సంస్కృత భారతంలో శ్రీకృష్ణుడు సభాసదులందరితో పాండవుల ధర్మనిష్ఠను తెలుపుతూ ధృతరాష్ట్ర పుత్రులు పాండవులకు రావలసిన రాజ్యం తిరిగి ఇవ్వకపోతే పాండవులు వారిని చంపేస్తారు. కౌరవులు పాండవుల కార్యానికి విఘ్నాలు కల్పిస్తారు. అపకీర్తిని తేవడానికి సిద్ధపడుతారు. ఈ విషయాన్ని గ్రహించిన మిత్రులు బంధువులు కౌరవులచే బాధించబడిన పాండవులు యుద్ధంలో వారిని సంహరిస్తారు. అయినా తక్కువ సంఖ్యలో ఉన్నవీరు వారిని జయించడానికి సమర్థులు కారని మీ అభిప్రాయం అయి ఉండవచ్చు అయినప్పటికి పాండవులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, కౌరవుల వినాశనానికి ప్రయత్నం చేసి తీరుతారు. దుర్యోధనుని అభిప్రాయం ఏమిటో స్పష్టంగా తెలియక పోవడం వలన వారు ఏమి చేయబోతున్నారో తెలియడం లేదు. శత్రుపక్షం ఆలోచన తెలియకుండా మీరు ఇది ఇలా చేయాలని నిశ్చయించలేము. కాబట్టి కార్యం ఎలా పరిణమిస్తుందో

తెలుసుకోవలసిన అవసరం ఉంది. కనుక ధర్మశీలుడు, పవిత్రాత్ముడు, కులీనుడు, సావధానుడు, అయిన వ్యక్తిని దూతగా అక్కడకు వెళ్ళాలి.

**''దూత సమర్థః ప్రశమాయ తేషాం రాజ్యార్ధదానాయ యుధిష్ఠిరస్య''దూత కౌరవుల అహంకారాన్ని, ఆవేశాన్ని శాంతింపచేసి, యుధిష్ఠురునికి అర్థ రాజ్యాన్ని ఇచ్చేట్లుగా చేయగలవాడై ఉండాలి. (సంస్కృత భారతం,ఉద్యోగ పర్వం, 1 వ అధ్యాయం, 24 వ శ్లోకం.).**

శ్రీకృష్ణుడు పాండవులు యుద్ధాన్ని కోరుకుని తమ పరాక్రమాన్ని కౌరవులకు చూపాలి అనుకుంటున్నారు అన్నట్లు ఆంధ్ర మహాభారతంలో ఉంటుంది. సంస్కృత భారతంలో కౌరవులు వీరికి రాజ్యం ఇవ్వకపోతే పాండవులు వారిని చంపేస్తారని నిశ్చియించి చెప్పాడు. అయితే శత్రుపక్షం ఆలోచన ఎలా ఉందో నిర్ణయానికి రాకూడదు కాబట్టి రాయబారం జరపాలని చెప్పి రాయబారిగా వెళ్లే వ్యక్తి ఎలా ఉండాలో కూడా చెప్తాడు.

### 3.15.4. బలరాముని అభిప్రాయం:

బలరాముడు కూడా శ్రీకృష్ణున్ని అనుసరిస్తూ రాయబారానికి ఒకరిని పంపాలని అయితే పంపిన వ్యక్తి మాటతీరు తెలిసి ఉండాలని వినయంతో మెల్లగా చేరి దుర్యోధనుడి మనఃస్థితికి అనుకూలంగా వినమ్రుడై అడగాలని లేకపోతే రాయబార కార్యం చక్కబడదని చెప్తాడు.

సంస్కృత భారతంలో బలరాముడు సామ్య పద్ధతిలోనే రాయబారం జరగాలని చెప్తాడు. ఆ దూత కురువృద్ధుడైన భీష్మున్ణి, మహానుభావుడైన ధృతరాష్ట్రున్నీ, ద్రోణుని, అశ్వత్థామను, విదురుణ్ణి, కృపాచార్యుని, శకునిని, కర్ణుని,కౌరవులందరిని బలవంతులు, వేద విదులు, స్వధర్మనిష్ఠులు, మహావీరులు, వయో వృద్ధులు అయిన ఆ సభలోని పౌరులను ఉద్దేశించి వినయపూర్వకంగా పాండవులకు ప్రయోజనకరమైన విధంగా మాట్లాడాలి. సామ్యంగా మాట్లాడితేనే లాభదాయకంగా ఉంటుందని యుద్ధం వలన ఉభయపక్షాలకు నష్టం, అన్యాయం, జరుగుతుంది. అది ప్రయోజనకారి కాదని బలరాముని అభిప్రాయం.

ఈ విషయాలను పరిశీలిస్తే బలరాముడు. రాయబారి లక్షణాలతో ప్రధానమైన విషయాన్ని రాయబారి ప్రవర్తించవలసిన తీరు ఎలా ఉండాలో తెలియజేసాడని అర్థమవుతుంది.

కాని బలరాముడు దుర్యోధనుని పక్షం మాట్లాడడంతో సాత్యకి కోపం తెచ్చుకుని ధర్మబద్ధంగా ధర్మరాజుకు రావలసిన రాజ్యం వారు ఇవ్వాలి అలాకాకుండా మనమే వెళ్ళి దైన్యంతో అడుక్కోవలసిన పని లేదు , నా అభిప్రాయం ప్రకారం యుద్ధం చేయడమే కర్తవ్యం, అలాకాక, ఈ లోపల ఆ దుర్యోధనుడితో శాంత వచనాలు పలకడానికి ఎవరినైనా పంపితే

*ఉ. దైన్యము దక్కి దూత యుచితంబుగఁబాండునృపాలుపాలు రా*

*జన్యవరుండు ధర్మజుడు సమ్మతి వేఁడెడు నన్న లోక*

*సామాన్య విధిం దగంగ గరిమంబున నిచ్చినఁ బుచ్చికొంద మ*

*న్యోన్య విరుద్ధభాషణము లాడినఁదత్ఫల మాతఁడందెడున్" (ఆంధ్రమహాభారతం, ఉద్యోగపర్వం, ప్రథమాశ్వాసం, 32 వ పద్యం).* ఎటువంటి బాధను ప్రదర్శించకుండా శాంతియుతంగా ధర్మరాజు పోరాడుతున్నప్పుడు అవతల దుర్యోధనుడు కూడా న్యాయానికి కట్టుబడి ఇస్తే మర్యాదగా స్వీకరిస్తాము లేకపోతే పరుషంగా మాట్లాడితే దానికి తగిన ఫలితం అనుభవించక తప్పదని చెప్తాడు.

ఇక్కడ రాయబారిగా వెళ్లే వ్యక్తి సౌమ్యంగా కోపం ఏ మాత్రం ప్రదర్శించకుండా కార్యాన్ని నెరవేర్చాలని బలరాముడి అభిప్రాయం అలా జరిగితే అది పాండవులకు ఏ మాత్రం గౌరవంగా ఉండదు న్యాయంగా రావలసినది వారు అడగకపోయినా ఇవ్వాలి కాని దుర్యోధనుడు మూర్ఖపు ఆలోచనలతో ఉన్నాడు. అతనికి సౌమ్యం పనికి రాదు చెప్పవలసినది చెప్పి దానికి అంగీకరించకోతే నేరుగా యుద్ధానికే సిద్ధపడాలి తప్ప సౌమ్యంగా అర్థించడం తగని పని అని సాత్యకి అభిప్రాయం. రాయబారంలో ప్రధానమైనది సామ, దాన ,భేద , దండోపాయాలను బలరాముడు సామోపాయాన్ని ప్రయోగించాలి అంటాడు. సాత్యకి దండోపాయమే వారికి ఉచితమైనది ఆ రీతిలో ప్రయత్నాలు జరగాలి అనే భావన అతనిది. చివరకు సాత్యకి అభిప్రాయాన్నే ద్రుపదుడు అంగీకరించాడు.

దూతను పంపడానికి ఆలోచన చేస్తూనే యుద్ధానికి సైన్యాలను సమకూర్చుకుంటున్నారు. *ద్రుపదుడు శల్యుడు, దృష్టకేతువు,జయత్సేనుడు, కేకయులు మొదలైనవారందరి వద్దకు త్వరగా వెళ్లగలిగిన దూతలను పంపండి. దుర్యోధనుడు కూడా తప్పకుండా అన్ని వైపులకు దూతలనుపంపుతాడు. సజ్జనులు ముందుగా వచ్చిన వారికే సహాయం చేస్తారు. అందువలన ముందుగానే రాజులందరికి ఆహ్వానాలు పంపడానికి త్వరపడాలి. శల్యుని వద్దకు అతనిని అనుసరించేరాజుల వద్దకు పూర్వసముద్ర తీర నివాసి యైన మహారాజు భగదత్తుని వద్దకు వెంటనే దూతలను పంపండి అంటూ అందరి దగ్గరకు దూతలను పంపిస్తూఉంటారు.(సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం,4 వ అధ్యాయం, 10,11, శ్లోకాలు).*

**ఆలోచన ఫలితంగా ఒక నిశ్చయం ఏర్పడిన తర్వాత దూతను (కార్యాచరణమునకు) నియోగించాలి.** ఈ రాయబార లక్షణం ఇక్కడ జరిగిన సభా సమావేశంలో జరుగుతుంది. అయితే సంధి లేకపోతే యుద్ధం అనే నిశ్చితఅభిప్రాయానికి ఇక్కడున్న పెద్దలు నిశ్చయించారు.

అయితే భగవంతుడైన శ్రీకృష్ణున్ని మాటల్లోనూ, సాత్యకి, మాటల్లోనూ ద్రుపదుని మాటల్లోనూ పైకి సంధి చేయాలనే మాటలు కనబడినా వారి మాటల్లోని లోతులు గమనిస్తే మాత్రం యుద్ధానికే పెద్ద పీట వేసారని తెలుస్తుంది. బలరాముని మాటల తర్వాత సాత్యకి వీరోచితంగా మాట్లాడిన మాటలు అందుకు సాక్ష్యాలుగా నిలుస్తాయి.ద్రుపదుడు యుద్ధ సన్నాహాలకు దూతలను పంపి సేనలను సమకూర్చుకునే విధానాన్ని అతని మాటలను విని శ్రీకృష్ణుడు కూడా వారి అభిప్రాయానికి సమ్మతిని తెలియజేస్తాడు ఇదే సరైన మార్గమని చెప్పి సైన్యాన్ని సమకూర్చడానికి అందరికి ఆహ్వానాలు పంపి తరువాత నన్ను పిలవండని చెప్తాడు.

ఇక్కడ రాయబారాలు జరగక ముందే యుద్ధసన్నాహాలు చేస్తున్నారు మహాభారతంలో కూడా రాయబారాలు జరగక ముందే యుద్ధానికి సైన్యాన్ని సమకూర్చుకుంటారు. ఇంది పాండవుల , కౌరవుల ముందు చూపు పాండవులు రాయబారాల ద్వారా కౌరవులలో మార్పు ఏమైనా వస్తుందో చూద్దాం కౌరవులలో మంచి

మార్పు కనబడితే యుద్ధం చేయవలసిన పని ఉండదు కదా అని యుద్ధానికి సైన్యాన్ని సిద్ధం చేయకపోతే అది ప్రమాదంగా మారిపోయేది. దుర్యోధనుని మనసు ఎలా ఉంటుందో ముందు చూపుతో తార్కిక బుద్ధితో ఆలోచించగలవారు కాబట్టే యుద్ధానికి సైన్యాన్ని సమకూర్చుతూనే రాయబారాలు నడిపారు. పైగా పాండవులకు కూడా యుద్ధం చేయవలననే ఉత్సాహం మనసులో ఉంటుంది. కాని ఒక మర్యాద కోసం కృష్ణుని మాటలను గౌరవిస్తూ రాయబారాలు జరుపుతారు.

### 3.15.5. ద్రుపదుడు సైన్య సమీకరణకు దూతలను పంపుట:

**సగం గుణాలు లేనివాడు ''శాసన హరుదు'' అనగా రాజు పంపే వార్తలు తీసుకుని వెళ్లడానికి మాత్రమే తగిన వాడు.** (పుల్లెల శ్రీ రామచంద్రుడు, (వ్యాఖ్యాత), కౌటిలీయమ్ అర్థశాస్త్రము, పుట:64').

ఈ క్రింది చెప్పిన విషయాలను గమనిస్తే ద్రుపదుడు పంపిన దూతలు రాజులకు యుద్ధ సన్నాహాల గురించి తెలియజేసి రాజులను ఆహ్వానింపచేయడానికి మాత్రమే ఉపయోగపడ్డారని తెలుస్తుంది.

ద్రుపదుడు సైన్యాన్ని సమకూర్చుకోవడానికి రాజుల దగ్గరకు దూతలను పంపండని చెప్తాడు. ఎవరెవరి దగ్గరకు త్వరగా దూతలను పంపాలో చెప్తాడు. ఇక్కడ దూతలు కేవలం రాజులను ఆహ్వానించడానికి మాత్రమే ఉపయోగపడతారు. ఇక్కడ రాజు యొక్క అభిప్రాయం రాజులను యుద్ధానికి ఆహ్వానించడం దాని కోసం దూతలను పంపుతారు ఇక్కడ ఏ రాజు కి సంధి ప్రయత్నం కాని , యుద్ధప్రయత్నం కాని చేయడం లేదు అంటే రాయబారి సమాచారాన్ని అందించే వ్యక్తి నేటి కాలంలో లాగాపిలవడానికి చరవాణులు ఆకాలంలో లేవు కనుక ప్రతి చిన్న విషయాన్ని అయినా సరే అవతలి వైపున్న రాజుకు లేదా వ్యక్తులకు సమాచారాన్ని అందించడానికి దూతే ప్రధానమైనటువంటి వాడని తెలుస్తుంది.

### 3.15.6. ద్రుపద పురోహితుని రాయబారం:

పాండవులు ,విరాట రాజు, ద్రుపద మహారాజు అందరూ యుద్ధోత్సాహంలో ఉంటారు అటువంటి సమయంలో

*"వ. అట్టి సమయమున అజాత శత్రునసుమతి వడసి పాంచాలపతి వయోజ్ఞానవృద్ధుండైన తన పురోహితుం గురుపతి పాలికి బుచ్చువాఁడై యతని రావించి (ఆంధ్రమహాభారతం, ఉద్యోగపర్వం, ప్రథమాశ్వాసం, 52 వ వచనం).*

ద్రుపదుడు ధర్మరాజు ఆజ్ఞను పొంది వయస్సు చేత జ్ఞానం చేత పెద్దవాడైన పురోహితున్ని ధృతరాష్ట్రుడి దగ్గరకు పంపడానికి నిశ్చయించాడు.

ఇక్కడ మనం గమనించాలి నష్టం జరిగింది పాండవులకు, దూతను నిశ్చయించింది శ్రీకృష్ణుడు, దూతను పంపేది ద్రుపదుడు ద్రుపద పురోహితుని రాయబారిగా పంపేటప్పుడు పాండవులు దూతకు ఎటువంటి మాటలు అందించలేదు. పెద్దవారికే అగ్రస్థానం కల్పంచి ద్రుపదుని కోరికను గౌరవించి పాండవులు దూతకు ఏమి చెప్పలేదు ముందుగా దూత ఏమి చెప్పాలో ఎలా చెప్పాలో ఎవరిని దూతగా పంపిస్తే కార్యం సఫలమవుతుందో అతనిని పురోహితున్ని ఎంచుకుంటాడు.

### 3.15.7. ద్రుపదుడు పురోహితునికి రాయబార సంభాషణను తెలుపుట:

పురోహితునితో చెప్పవలసిన మాటలను చెప్తాడు. ద్రుపదుడు తన పురోహితునితో ధృతరాష్ట్రుడు పరమలోభి అని ఆ రాజు విధము, ధర్మరాజు స్వభావము తెలిసినవాడివి, పాండవుల భాగాన్ని ఇమ్మని అడగటానికి వెళ్ళి ధృతరాష్ట్రుడితో ధర్మయుక్తము, సముచితమైన మాట పలికితే కౌరవుల పక్షంలో ఉన్న రాజుల, సేవకుల మనస్సులు మనకు అనుకూలంగా మారిపోతాయని చెప్తాడు. ద్రోణ భీష్ముడు యుద్ధానికి ఇష్టపడరని దుర్యోధనుడు బాధపడి వారిని అంగీకరించేటట్లు చేసినట్లయితే సైన్యమంతా ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తుందని తెలుపుతాడు. పాండవుల బంధువులందరికి తెలియజేయమని వంశానికి ఇది తగినది కాదని తెలియజేయమంటారు. ఇంకా అందరి మనస్సులు ఇక్కడికి చేరుకునే ఉపాయాలు ఎన్ని ఉన్నాయో అన్నిటినీ సందర్భానుగుణంగా ఉపయోగించమని ఇక్కడ విరాటుడి కొలువలో పుట్టిన కృష్ణాదుల మాటల తీరు మనకు తెలిసిందే,. దానికి తగినట్లు మాట్లాడి పాండవులకు బలం చేకూరే విధంగా మాట్లాడాలని తెలుపుతాడు. ధృతరాష్ట్ర, దుర్యోధనాదులు భీష్మ, విదురుడు, ద్రోణ,కృపాచార్య మొదలగు వారి దగ్గరకు వెళ్ళి క్రమక్రమంగా వారి మనోభిప్రాయాలు తెలుసుకుని ప్రవర్తించమంటాడు. అదృష్టవశాన

దుర్యోధనుడు అంగీకరిస్తే మంచిదని ధర్మరాజుకూడా దాని వలన సంతోషిస్తాడని వెళ్ళి రమ్మని నిర్ణయించగా ఆ ద్రుపద పురోహితుడు ద్రుపదుని దగ్గర సెలవు తీసుకుని పాండవుల అనుజ్ఞను పొంది, సన్మానాలు పొంది సంతోషంతో వెళ్తాడు. **(ఆంధ్రమహాభారతం, ఉద్యోగ పర్వం, ప్రథమాశ్వాసం, 55 నుండి60 వరకు).**

పై విషయాలను పరిశీలిస్తే ద్రుపదుడు తన పురోహితున్ని కౌరవుల దగ్గరకు రాయబారిగా నియమించి రాయబారికి కావలసిన లక్షణాలు పురోహితునిలో ఉన్నాయని మాట తీరులోనూ,ప్రవర్తించే విధానంలోనూ శ్రేష్ఠుడని ద్రుపదుడు మొదట పురోహితున్ని ప్రశంసిస్తాడు. దాని వలన రాయబారి తాను నిర్వర్తించవలసిన విధిని మనస్ఫూర్తిగా విజయవంతంగా చేసుకుని రాగలనన్న నమ్మకం అతనిలో ఏర్పడుతుందని తెలుస్తుంది. తర్వాత ధృతరాష్ట్రాదులను, భీష్మ ద్రోణులకు, మున్నగు వారికందరికి ఏ విషయాలను తెలియజేయాలి. వారి మనోభిప్రాయాలు ఎలా రాబట్టాలి అన్ని విషయాలను తెలియజేస్తాడు. పాండవుల కష్టాలను తెలియజేయమని అక్కడున్న పెద్దవారికి వంశానికి ఇది తగినది కాదని మున్నగు విషయాలు తెలియజేయమని చెప్తాడు. ఇలా చెప్పడం ద్వారా పురోహితుడు రాయబారిగా తాను సౌమ్యంగా అందరిని మెప్పించే విధంగా తన రాయబార కార్యాన్ని విజయవంతం చేసుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఇలా పాండవులకు ప్రీతిని కలుగజేయడానికి ద్రుపదుడు అందించిన సమాచారాన్ని గ్రహించి పురోహితుడు రాయబారిగా అందరి ఆశీర్వచనాలు తీసుకుని బయలుదేరుతాడు.

### 3.15.8. సంస్కృత భారతంలో ద్రుపదుని రాజనీతి:

*“ తతః ప్రజ్ఞావయోవృద్ధం పాంచాల్యః స్వపురోహితమ్*
*కురుభ్యః ప్రేషయామాస యుధిష్ఠిరమతే స్థితః” (సంస్కృత భారతం, ఉద్యోగపర్వం, 5 వ అధ్యాయం, 18 వ శ్లోకం).*

ద్రుపదుడు ధర్మరాజు అనుమతి పొందలేదు ధర్మరాజు అభిప్రాయం తెలిసిన పురోహితుణ్ణి కౌరవుల దగ్గరకు పంపుతాడు.

ద్రుపదుడు పురోహితునిని దూత గా పంపించే సమయంలో ఒక రాజనీతి ని ప్రతిపాదిస్తాడు.

*"అమాత్యేషు చ భిన్నేషు, యోధేసు విముఖేషు చ*

*పురరేకత్రకరణం తేషాం కర్మ భవిష్యతి" (సంస్కృత భారతం, ఉద్యోగపర్వం, ఆరవ అధ్యాయం, 10 వ శ్లోకం, పుట:274),*

మంత్రులలో భిన్నాభిప్రాయాలు ఏర్పడినప్పుడు యోధులు యుద్ధ విముఖులు అయినప్పుడు వారందరినీ ఒక త్రాటి మీదకు తేవటమే పెద్దపని అవుతుంది.

ఈ మాటలను పరిశీలిస్తే కౌరవుల సభలో యుద్ధానికి కాలు దువ్వే వారు ఉన్నారు, యుద్ధానికి విముఖతను ప్రదర్శించే వారూ ఉన్నారు వీరందరి అభిప్రాయాలను తెలుసుకుని అందరిని ఒకే త్రాటి పైకి అంటే యుద్ధమా లేక సంధా అనేటట్టు పురోహితుడు చేయగలగాలి. అది చాలా కష్టమైన పని అని చెప్తున్నాడు.

*"ఏత స్మిన్నంతరే పార్థాః సుఖామేకాగ్రబుద్ధయః*
*సేనాకర్మ కరిష్యంతి ద్రవ్యాణాం చైవ సంచయమ్ (సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, (ఆరవ అధ్యాయం 11 వశ్లోకం).*

ఇంతలో ఏకాగ్రచిత్తులైన పాండవులు సైన్యాన్ని ద్రవ్యాలను సమకూర్చుకునే పనులను సులువుగా చేయగలుగుతారు.

ఇలా దూత కౌరవుల సభలో అందరి అభిప్రాయాలను సేకరించి కార్యాన్ని సక్రమంగా నిర్వర్తించే పనిలో ఉన్నప్పుడు ఇక్కడ పాండవులు తమ ప్రయత్నాలను తేలికగా చేసుకోగలుగుతారు అంటే అక్కడున్న వారంతా సభలో నే ఉండి చర్చ కొనసాగించే సమయంలో పాండవులు తమ కార్యాన్ని నెరవేర్చుకోవడానికి సులభమైన ఉపాయాన్ని ద్రుపదుడు ఆలోచించాడు.

*విద్యమానేషు చ స్వేషు లంబమానే తథా త్వయి*

*న తథా తే కరిష్యంతి సేనా కర్మ న సంశయః (సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, (ఆరవ అధ్యాయం), 12 వ శ్లోకం.)*

వారి జనమూ నీవూ అక్కడ ఉండి ఆలస్యం చేస్తుంటే వారు పాండవులు చేసినంత చక్కగా యుద్ధప్రయత్నాలు చేయలేరని చెపుతూ ఇంకా నీవు దూతగా వెళ్ళడంలో ఇది

ప్రధాన ప్రయోజనం అవుతుంది. ధర్మబద్ధమైన నీ మాట విని ధృతరాష్ట్రుని మనసు మారే అవకాశమూ ఉంది.

ఈ మాటలను గమనిస్తే పురోహితుడు కౌరవుల సభలో చర్చ జరుగుతున్న సమయంలో పాండవులు యుద్ధప్రయత్నాలు త్వరగా పూర్తి చేసుకోగలరని, కౌరవులు పాండవులు చేసినంత యుద్ధప్రయత్నాలు వారు చేయకుండా ఉండే అవకాశం ఉంటుందని ఈ పనే పురోహితుడికి పెద్ద కార్యమని దానిని నిర్వర్తించమని చెప్తాడు.

ఈ మాటలు ఆంధ్ర మహాభారతంలో ఉండవు. ద్రుపదుని ఆలోచన విధానం శత్రువులను మభ్యపెట్టి తన బలాన్ని పెంపొందించుకోవడం అనే రాజనీతి ఉపాయం ప్రయోగించాడని అర్థమవుతుంది.

### 3.15.9. **ద్రుపదపురోహితుడు హస్తినకుచేరుట**:

ద్రుపద పురోహితుడు మొదటిగా కౌరవులు సమకూర్చుకున్న పదకొండు అక్షౌహిణుల సైన్యాన్ని చూస్తాడు. తర్వాత ద్రుపదుని పురోహితుడు కురురాజును సమీపిస్తాడు అప్పుడు వచ్చిన రాయబారికి ధృతరాష్ట్ర మహారాజు, భీష్ముడు, విదురుడు అతనిని సన్మానిస్తారు.

ముందుగా తమ పక్షం వారి క్షేమ సమాచారాన్ని చెప్పి తరువాత ధృతరాష్ట్రాదుల క్షేమ సమాచారాన్ని అడిగి సేనానాయకులందరి సమక్షంలో ద్రుపద పురోహితుడు ఇలా చెప్తాడు.

ఇక్కడ రాయబార లక్షణమును అనుసరించి దూతగా వచ్చిన ద్రుపద పురోహితుడు సన్మానించబడ్డాడు, అతను తన ప్రభువు యొక్క క్షేమ సమాచారాన్ని తెలిపి తరువాత ధృతరాష్ట్రాదుల క్షేమాన్ని అడిగినట్లు తెలుస్తుంది. దీనిని బట్టి తన ప్రభువు మీద భక్తి కూడా వ్యక్తమవుతుంది.

ఆంధ్ర మహాభారతంలో ద్రుపద పురోహితుడు తగిన విధంగా హస్తినాపురానికి వచ్చి ధృతరాష్ట్రుడిని ప్రీతితో చూసి కృప ద్రోణ విదుర భీష్ములను వారి వారి ఇళ్లకు వెళ్లి చూచి తగిన మాటలతో మనస్సులకు సంతోషం కలిగించి దుర్యోధనుని దర్శనం కూడా చేసుకుని నిరంతరం నేర్పుతో ఆరాధించి ధృతరాష్ట్రుడిని తనకు అనుకూలుడిగా చేసుకుని

ఒకనాడు ఆ ధృతరాష్ట్రుడి నిండు కొలువులో సేనా నాయకులనందరిని బాగుగా చూచి ద్రుపద పురోహితుడు మాట్లాడినట్లు ఉంటుంది. (ఆంధ్ర మహాభారతం, ఉద్యోగ పర్వం ,ప్రథమాశ్వాసం,పుట:79),

### 3.15.10. కౌరవుల దుశ్చర్యలను పురోహితుడు తెలుపుట:

సంస్కృత భారతంలో ధృతరాష్ట్రుడు, పాండురాజు ఈ ఇద్దరూ ఒకే తండ్రి కుమారులు తండ్రులు సంపాదించిన సంపదపై ఇద్దరికి సమానమైన అధికారం ఉంది. ఇందులో సందేహం లేదు, ధృతరాష్ట్రుని పుత్రులు తమ తండ్రి సంపదను పొందారు. కాని పాండు కుమారులు మాత్రం ఎందువల్ల పిత్రార్జితాన్ని పొందలేకపోయారు? అనే ప్రశ్న వేసి పైగా ధృతరాష్ట్రుని కుమారులు దుర్యోధనాదులు మున్నగువారు ప్రాణాంతకాలైన ఉపాయాల చేత పాండవులను చంపడానికి చాలా మార్లు ప్రయత్నించారు. కాని వాళ్లకు ఆయువు మిగిలి ఉండటం చేత మరణం పొందలేదు. మరలా పాండవులు తమ పరాక్రమంతో నూతన రాజ్యాన్ని స్థాపించి వృద్ధి చేసారు. కాని శకునితో కలిసి ధృతరాష్ట్ర కుమారులు జూదం వంకతో దాన్ని కూడా అపహరించారు. ధృతరాష్ట్రుడు కూడా ఆ జూదాన్ని అనుమతించాడు. వారు నిర్ణయించినట్లుగా పాండవులు అరణ్య అజ్ఞాత వాసాలు పూర్తి చేసారు. కౌరవ సభలో భార్యతో పాటు పాండవులు చాలా కష్టాలు పొందడమే కాదు అరణ్యంలో కూడ దారుణమైన కష్టాలు ఎన్నో అనుభవించారు. అంతకుముందు మీరు చేసిన తప్పులను అన్నింటిని వెనుకకు నెట్టి కురుశ్రేష్ఠులైన పాండవులు కౌరవులతో సంధినే కోరుకుంటున్నారు.

*“తేషాం చ వృత్తమాజ్ఞాయ వృత్తం దుర్యోధనస్యచ*

*అనునేతు మిహార్హంతి ధార్తరాష్ట్రం సుహృజ్జనాః ” ( సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, ఇరువదియవ అధ్యాయం, 13 వ శ్లోకం)*

పాండవుల ప్రవర్తనను దుర్యోధనుని తీరును బాగా తెలుసుకుని ఇరు పక్షాల క్షేమాన్ని కోరే స్నేహితులు దుర్యోధనుడు సక్రమంగా సత్ప్రవర్తనతో ఉండేలా నిలపడం మంచిది.

*క. వీరల వృత్తముఁ బాండుకుమారుల వర్తనము తెఱగు మాత్సర్యములే*

*కారసి, ధృతరాష్ట్రునకున్ గారవమున బుద్ధి సెప్పఁగా దగు మీకున్. (ఆంధ్ర మహాభారతం, ఉద్యోగ పర్వం, ప్రథమాశ్వాసం, 233 వ పద్యం,)*

సంస్కృత భారతంలోని విషయాలే ఆంధ్ర మహాభారతంలో ఉన్నప్పటికి ఒక విషయాన్ని చర్చించేటప్పుడు పేర్లలో మార్పును గమనించవచ్చు సంస్కృతభారతంలో దుర్యోధనునికి నీతులు చెప్పి బాగుపరచడం మంచిదని ఉంటుంది ఆంధ్ర మహాభారతంలో ధృతరాష్ట్రునికి బుద్ధి చెప్పడం మంచిదని ఉంటుంది. ఈ మార్పును గమనించాను.

*వీరులైనప్పటికి పాండవులు కౌరవులతో యుద్ధం చేయరు, జన నష్టం లేకుండా తమ రాజ్యాన్ని తాము పొందాలనుకుంటున్నారు. ఏ కారణంతో దుర్యోధనుడు యుద్ధం చేయాలనుకుంటున్నారో దాన్ని నిజమైన కారణంగా భావించవద్దు ఎందుకంటే పాండువలు కౌరవుల కంటే బలవంతులు, (సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, ఇరవదియవ అధ్యాయం, 14 వశ్లోక భావం..)*

ఇలా చెప్పడం లో గల ఆంతర్యాన్ని గమనిస్తే దుర్యోధనుడు సైనిక బలాన్ని భీష్మ ద్రోణులను దృష్టిలో పెట్టుకుని యుద్ధానికి సిద్ధపడుతున్నాడేమో అటువంటి ఆలోచనలు పెట్టుకోవద్దని చెప్పండి పాండవులు దగ్గర సైన్యం తక్కువ సంఖ్యలో ఉన్నప్పటికి వారి బలపరాక్రమాల ముందు ఎన్ని అక్షౌహిణులు ఉన్నా బలహీనపడవలసిందే అనే భావం వచ్చేటట్లు పై మాటలు వ్యక్తమవుతున్నాయి.

### 3.15.11. పాండవ కౌరవుల సైన్యాన్ని వివరించుట:

కౌరవులతో యుద్ధం చేయడం కోసం ధర్మరాజు దగ్గరకు చేరిన ఏడు అక్షౌహిణులు సేనలు అతని ఆజ్ఞ కోసం ఎదురు చూస్తున్నాయి. వారితో పాటు ఇంక వేయి అక్షౌహిణులతో సమానులు, పురుష శ్రేష్ఠులు ఐన సాత్యకి, భీమ సేనుడు, మహాబలవంతులైన నకుల సహదేవులు కూడా ఉన్నారు. కౌరవ పక్షంలోని పదకొండు అక్షౌహిణుల సేనలు ఒకవైపు మహాబాహువు, అయిన అర్జునుడు ఒకవైపు ఉన్నా ఆ సేనలకు అర్జునుడొక్కడు చాలు, అర్జునుడొక్కడూ అన్ని సేనలను మించి ఉన్నట్లే మహాబాహువు ఐన వాసుదేవుడు కూడా అందరిని మించిన వాడు. సేనా బలాన్ని అర్జునుని పరాక్రమాన్ని శ్రీకృష్ణుని తెలివి తేటల్ని తెలిసి కూడా ఎవడు యుద్ధం చేస్తాడు అందువలన

మీరు మీ ధర్మాన్ని అనుసరించి మునుపు చేసిన ప్రతిజ్ఞలను అనుసరించి పాండవులకు ఇవ్వదగిన రాజ్య భాగాన్ని ఇవ్వండి ఇంకా మీకు సమయం మించిపోలేదు.

ఇవే విషయాలు ఆంధ్ర మహాభారతంలో ఉన్నాయి చివర శ్రీకృష్ణుని అండ పాండవులకు ఉందని ఒక మాటతో చెప్పారు సంస్కృత భారతంలో అదే మాటను శ్రీకృష్ణుని గుణాలను ఆంధ్ర మహాభారతంలో శ్రీకృష్ణుని రాజనీతి చాతుర్యాన్ని వివరిస్తూ చక్కని పద్యంలో తిక్కన కూర్చారు.

*మ. వివిధోపాయ పరాయణుండు, రిపుదోర్వీర్యాపహారక్రియా*
*ప్రవణోద్యోగుఁడు మంత్ర రక్షణ కళా ప్రావీణ్యగణ్యుండు, ధై*
*ర్య వివేకాది గుణోత్తరుం, డఖిల విద్యాజాల సంవేది మా*
*ధవుఁడా దిక్కటె పాండవేయుల కసాధ్యం బెద్దియుం గల్గునే? (ఆంధ్ర మహాభారతం, ఉద్యోగపర్వం, ప్రథమాశ్వాసం, 240 వ పద్యం)*

ఈ పద్యంలో శ్రీకృష్ణుని గుణాలు ప్రస్తావించబడ్డాయి, అన్ని ఉపాయాలను సమర్థవంతంగా నిర్వహించేవాడు శత్రువులను మట్టుపెట్టడంలో సమర్థుడు, ధైర్యము విద్యల చేతా ప్రకాశించే శ్రీకృష్ణుడు పాండవలు వైపుఉంటే విజయం లభించితీరుతుందని చెప్తాడు.

శ్రీకృష్ణుడు బల పరాక్రమంలోనే కాకుండా బుద్ధిచేత ఏ పని ఎలా ఎప్పుడు చేయాలో వివేకంతో విజయాన్ని ఎలా పొందాలో లేక విజయాన్ని అందించాలో తెలిసిన వాడు అటువంటి వారు ఒక్కరున్నా చాలు అనే భావం పై మాటల్లో తెలుస్తుంది.

### 3.15.12. పురోహితుని మాటలకు భీష్మడి స్పందన:

ద్రుపద పురోహితుని మాటలు విని భీష్ముడు సమయోచితంగా అతనిని గౌరవించి అదృష్టవశాత్తు అంతా కుశలంగా ఉన్నారు. అలాగే కృష్ణునితో వారికి సహాయం ఏర్పడింది. పాండవులు సంధి కోరుకోవడం చాలా అదృష్టం నీవు చెప్పినదంతా కూడా నిజమే అయితే నీ మాట చాలా కఠినంగా ఉంది ఇది బ్రాహ్మణస్వభావం వల్ల అని నేను అనుకుంటున్నాను. రాజ్యాలలో , అరణ్యాలలో పాండవులు బాధలను అనుభవించారు

ధర్మంగా వారి తండ్రి రాజ్యాన్ని అనుభవించే హక్కు వారికి ఉంది. అర్జునుడు ఒక్కడు చాలు యుద్ధంలో అతనిని జయించేవారు ఎవరూ లేరు వజ్రాయుధం ధరించిన ఇంద్రుడు కూడా అర్జునుని ముందు నిలువలేడు. **(సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, ఇరవదిఒకటవ అధ్యాయం,.)**

ఆంధ్ర మహాభారతంలో కూడా ఈ మాటలే ప్రస్తావించబడ్డాయి. రాయబారిగా వచ్చిన ద్రుపద పురోహితుడు గౌరవించబడ్డాడు. అతను బ్రాహ్మణుడు కావున అతని మాటలు సూటిగా ద్రుపదుడు ఏమి చెప్పమన్నాడో వాటినే ప్రస్తావించాడు అయితే రాయబారిగా వెళ్ళిన వ్యక్తి పరిసరాలను గమనించడం తన రాజుకు చేకూర్చే లాభాల్లో ఒకటి ఈ గుణం చేత ద్రుపద పురోహితుడు కౌరవులు సమకూర్చుకున్న సైన్యాన్ని పరిశీలిస్తాడు.

### 3.15.13. కర్ణుడు దుర్యోధనుని అంతర్యాన్ని తెలుపుట:

సంస్కృత భారతంలో భీష్ముడు అర్జునుని పరాక్రమాన్ని పొగుడుతూ ఉండగా కర్ణుడు దుర్యోధనుని వైపు చూసి తర్వాత కోపంతో పొగరుగా ఆక్షేపిస్తూ ఇలా అన్నాడు. బ్రాహ్మణోత్తమా! గతంలో జరిగినదంతా తెలియనిది కాదు మళ్లీ దానిని చెప్పడం వల్ల ఏమి ఉపయోగం లేదు. దుర్యోధనుని కోసం శకుని ధర్మరాజును జూదంలో ఎప్పుడో ఓడించాడు. జూదపు నియమం ప్రకారం ధర్మరాజు అరణ్యానికి వెళ్ళాడు. ఇప్పుడు ద్యూత నియమాన్ని నిర్వహించి రాజ్యం అడగడం లేదు సమాయాన్ని అతిక్రమించి అడుగుతున్నాడు.

విద్వాంసుడా! దుర్యోధనుడు భయం వల్ల అర్ధ రాజ్యాన్ని కాదు చివరకు నాల్గవ వంతుకూడా ఇవ్వడు కాని ధర్మం ప్రకారం అయితే శత్రువుకైనా రాజ్యాన్నంతటిని ఇవ్వగలడు. వారి ఆస్తి వారికి కావాలంటే మరలా ప్రతిజ్ఞ ప్రకారం సమయం ముగిసే వరకు వనవాసం చేయాలి ఆ తరువాత దుర్యోధనుడి దగ్గర భయంలేకుండా ఉంటారు అంతేగాని కేవలం మూర్ఖంగా తమ బుద్ధిని అధర్మం పాలు చేసుకోవద్దు ఇకవారు ధర్మాన్ని విడిచి పెట్టి యుద్ధాన్ని కోరితే పాండవులు ఈ కురు శ్రేష్ఠులను కలిసినప్పుడు నామాటను గుర్తుచేసుకోండి అంటాడు. **(సంస్కృత భారతం, ఉద్యోగపర్వం, ఇరవది ఒకటవ అధ్యాయం,).**

ఈ మాటలను పరిశీలిస్తే కర్ణుడు దుర్యోధనుని వంక చూసి తర్వాత కోపంతో మాట్లాడటం గమనించవచ్చు. బ్రాహ్మణోత్తమా, విద్వాంసుడా అని సంబోధనల వలన ద్రుపద పురోహితునితోనే ఈ మాటను చెప్పినట్లు తెలుస్తుంది. కాని అంతకు ముందు భీష్ముడు మాట్లాడిన మాటలకు భీష్మునితోనే మాట్లాడాలి కాని భీష్మునికి పరోక్షంగా సమాధానాన్ని ఇచ్చినట్లు తెలుస్తుంది. అది కూడా ద్రుపద పురోహితుడికి చెప్తున్నట్లు కోపంతో మాట్లాడాడు కాని ఆ మాటలు భీష్మునికి చెప్పినట్లు ఉన్నాయని అర్థమవుతుంది. రాజ్యాన్ని  ఇవ్వడని దుర్యోధనుని కంటే ముందే కర్ణుడు నిశ్చయించి చెప్తున్నాడు. నాల్గవ వంతు కూడా ఇవ్వడని పాండవులు నియమం తప్పి అధర్మపరులయ్యారని ధర్మంగా ఉంటే శత్రువుకైనా రాజ్యాన్ని ఇవ్వగలడని చెప్తాడు.

ఆంధ్ర మహాభారతంలో భీష్ముని మాటలకు కర్ణుడు సమాధానం ఇచ్చినట్లు ఉంటుంది. ఎవరితో అంటున్నాడు అనేది స్పష్టంగా తెలియదు కాని చదివిన వారికి సూటిగా భీష్ముడితోనే మాట్లాడినట్లు అర్థమవుతుంది. ఈ మార్పును గమనించాను.

### 3.15.14. భీష్ముడు కర్ణున్ని మందలించుట:

భీష్ముడు కర్ణునితో కోపంతో అర్జునుడు ఒక్కడే యుద్ధంలో ఆరుగురు రథికులను జయించాడు.నీవు ఆ విషయాన్ని గుర్తుపెట్టుకో అప్పుడు నీ పరాక్రమం ఎలాంటిదో అప్పుడే చూసాం. ఈ బ్రాహ్మణుడు చెప్పినట్లు చేయకపోతే మనం యుద్ధంలో ఆ అర్జునుని చేతిలో దెబ్బలు తిని చచ్చిపోయేవారమని తెలుపుతాడు.**(సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, ఇరవది ఒకటవ అధ్యాయం,17 వశ్లోకం ).**

ఆంధ్ర మహాభారతంలో జయించిన ఆ ఆరుగురు పేర్లను భీష్ముడు చెప్పినట్లు ఉంటుంది. ఉత్తర గోగ్రహణంలో మన ఆరుగురిని భీష్ముడు , ద్రోణుడు, కృపుడు, అశ్వత్థామ, దుర్యోధనుడు , కర్ణుడు, జయించాడు నువ్వు మాత్రం అక్కడున్న సభలో కూర్చుని మాటలతో గెలుస్తున్నావు అంటాడు అంతే కాకుండా అజ్ఞాత వాస కాలాన్ని దుర్యోధనుడు ఉత్తర గోగ్రహణ సమయంలో అడిగినప్పుడు నీవు ద్రోణుడు, కృపుడు అశ్వత్థామ వింటూ ఉండగా లెక్కకట్టి ముగిసిపోయిందని చెప్పాను కదా అని చెప్తాడు. ఇంత వివరణ సంస్కృత భారతంలో ఉండదు.

### 3.15.15. ధృతరాష్ట్రుడు భీష్మకర్ణుల వాగ్వివాదాన్ని నివారించుట:

వీరి వాగ్వివాదం మితి మీరితే ప్రమాదమని భావించి ధృతరాష్ట్రుడు భీష్ముని భక్తితో గౌరవించి కర్ణుని నిందించి ఇలా అంటాడు భీష్ముడు మాకు మంచి మాటలే చెప్పాడు. అది పాండవులకు అందరికి మంచిదే నేను ఆలోచించి పాండవుల వద్దకు సంజయుని పంపిస్తాను. నీవు ఆలస్యంచేయక పాండవుల వద్దకు తిరిగి వెళ్ళమని ద్రుపద పురోహితుని సత్కరించి పాండవుల దగ్గరకు పంపి సభలోకి సంజయుని పిలిపిస్తాడు. **(సంస్కృ భారతం, ఉద్యోగ పర్వం, ఇరవది ఒకటవ అధ్యాయం, 20,21 వ శ్లోకాలు)**

ఆంధ్ర మహాభారతంలో సంజయుని పేరు నేరుగా చెప్పలేదు. మంచివాడిని ఒకడిని పంపిస్తానని నేను మనసులో ఆ పాండవులతో కలిసి ఉండే మార్గాన్ని అవలంబిస్తానని తెలియజేస్తాడు. ( **ఆంధ్ర మహాభారతం , ఉద్యోగ పర్వం, ప్రథమాశ్వాసం25 వ పద్యభావం).**

ఈ మాటలను పరిశీలిస్తే ధృతరాష్ట్రుడు పెద్దలు చెప్పిన మాటలు అంగీకరించేవిధంగానే ఉన్నాయి అన్నాడే కాని వారికి రాజ్య భాగ ప్రస్తావన గురించి చర్చించలేదు పైగా మా వైపు ఒక రాయబారిని పంపిస్తానని చెప్పడంతో ధృతరాష్ట్రునికి మనసులో రాజ్య భాగం ఇవ్వాలి అనే ఆలోచన ఏ మూలానా లేదని తెలుస్తుంది.

మహాభారతంలో ద్రుపద పురోహితుడు రాయబారిగా వెళ్లాడు కాని **పరిమిత అధికారాలు కలిగిన రాయబారిగా** కనబడుతాడు. దానివలన పాండవుల అభిప్రాయాలను మాత్రమే వెల్లడించాడు అదీగాక మాటల్లో ఆవేశం కనబడుతుంది. రాయబార కార్యాన్ని చక్కగా నెరవేర్చినప్పటికి సంపూర్ణంగా రాయబార లక్షణాలను అనుసరించినట్లు కనబడదు,

### 3.15.16. ద్రుపద పురోహితుని రాయబారం పరిశీలన:

నేతి అనంతరామశాస్త్రి ఈ ద్రుపదపురోహిత రాయబారాన్ని తులనాత్మక దృష్టితో చూస్తూ ద్రుపద పురోహిత రాయబారం గురించి చెప్తూ ద్రుపద పురోహితుడు “ *దూతలు వ్యవహరించవలసిన తీరున వ్యవహరించకుండా ఎదుటి వారి మనసును*

*గాయపరిచేటట్లుగాను, సమస్య మరింత కష్టమయ్యేటట్లుగాను వ్యవహరించడం గమనించాలని చెప్తాడు. గడిచిపోయిన సంఘటనలను గుర్తుచేస్తూ మీరు తప్పుచేసారని దానిని సరిదిద్దుకోండని చెప్పడం దూత లక్షణం కాదని వీరు అభిప్రాయపడుతున్నారు. అలాగే ద్రుపద పురోహితుడు మాట్లాడిన ధోరణిని బట్టి దౌత్య పర్యవసానాన్ని బట్టి చూస్తే సంధి జరగకూడదనే ధోరణిలో ద్రుపదపురోహితుడు ప్రసంగించినట్లు భావించబడుతాడు. '' (అనంతరామ శాస్త్రి, నేతి, కవిత్రయ భారతం– రాజనీతి, పుట:262, 263,264).*

### 3.15.16.1. రాయబార లక్షణం అన్వయం:

**''శత్రువులలో తనరాజే బలవంతుడని అనుకొనరాదు.'' వేంకట రంగయ్య మామిడి పూడి,కౌటిల్యుని అర్థశాస్త్రం(తెలుగు అనువాదం), పుట:40.)**

ఈ రాయబార లక్షణాన్ని నేతి అనంతరామశాస్త్రి చెప్పినట్లు ద్రుపద పురోహితుడు ఉల్లంఘించాడని తెలుస్తుంది. ద్రుపద పురోహితుడు తన రాజు యొక్క శక్తి సామర్థ్యాలను వీరత్వం ఉట్టిపడేటట్లు వర్ణించాడు. ఇది దూత లక్షణంగా చెప్పబడదు ఈ రాయబార లక్షణం లేని కారణంగా కూడా ద్రుపద పురోహితుని రాయబారం విఫలమయ్యిన్నట్లు తెలుస్తుంది.

### 3.15.17. సంజయ రాయబారం:

సంస్కృత భారతంలో ధృతరాష్ట్రుడు సంజయునితో అనిన మొదటి మాట

*'' అజాత శత్రుం చ సభాజయేథాః*

*దిష్ట్యా సహ్యాస్థానముపస్థితస్త్వమ్(సంస్కృత భారతం, ఇరవది రెండవ అధ్యాయం, 1 వ శ్లోకం.)*

అజాత శత్రువైన ధర్మరాజును గౌరవించు 'భాగ్యవశం వల్ల మీరు మాకు తగిన స్థానానికి చేరుకున్నారని చెప్పమంటాడు.

అదృష్టం వల్ల మీరు అరణ్య అజ్ఞాత వాసాల్ని పూర్తి చేసుకున్నారు లేకపోతే మీరు ఎప్పుడో మేము వేసిన ఉపాయాల చేత పరమపదించేవారు మీరు ఉండవలసిన స్థానం కూడా ఇదే అంతకుమించి మరో స్థానాన్ని కోరుకోవద్దు అనే భావన పై మాటల్లో

వ్యక్తమవుతుంది. అంతే కాకుండా పైకి కుశలమైన మాటలు చెప్తున్నా లోపల అసూయతో చెప్తున్నట్లు ఉంటుంది.

ఆంధ్ర మహాభారతంలో ధృతరాష్ట్రుడు సంజయుడిని సభలోకి పిలిపించి పాండవుల దగ్గరకు పంపుతూ మొట్టమొదటగా వారితో మీరు అరణ్య వాస దుఃఖాన్ని దాటి అభివృద్ధితో వచ్చారన్న సంగతి విని మీ తండ్రి సంతోషంతో నన్ను ఇక్కడికి పంపించాడని చెప్పమంటాడు తరువాత తన చుట్టూ ఉన్నవాళ్లతో మాట్లాడుతాడు.

సంస్కృత భారతంలో ధృతరాష్ట్రుడు సభలో సంజయుని సంబోధిస్తూ సంజయునికి చెప్పవలసిన మాటలు చెప్పినట్లు ఉంటుంది.

ఆంధ్ర మహాభారతంలో ధృతరాష్ట్రుడు సభలో ని వారి వైపు తిరిగి పాండవుల ఔనత్యాన్ని దుర్యోధనుని తెలివితక్కువ తనం వలన సంక్షోభం పుట్టింది కాని పాండవులు దోషులు కారని చెప్తాడు.

సంస్కృత భారతంలో సంజయా! మనమంతా కుశలమని వారందరికి చెప్పు పరోపకారం చేసేవారు సత్పురుషులు అయిన పాండవులు కష్టమైన అరణ్యవాసం చేయదగ్గవారు కాదు అయినా వాళ్ళ నియమం ప్రకారం వనవాసం పూర్తిచేసారనిచెప్పమంటాడు.

*“తేషాం శాంతిర్విద్యతే2స్మాసు శీఘ్రం*

*మిథ్యాపేతానాముప కారిణాం సతామ్” (సంస్కృత భారతం , ఉద్యోగ పర్వం, ఇరువది రెండవ అధ్యాయం, 1 వ శ్లోకం).*

నీవు ఇలా చెప్తే వారికి మనపట్ల ఉన్న కోపం త్వరగా శాంతిస్తుందని చెప్తాడు అంటే వారు శాంతించడానికి వారిని ప్రశంసా రూపంలో పలుకరించమన్నాడు తప్ప వారి మీద ఆప్యాయతతో కాదన్న విషయం పై మాట వలన తెలుస్తుంది.

ఆంధ్ర మహాభారతంలో సభలోని వారికి చెప్తున్నట్లు పాండవులు మేము కలిసి హాయిగా బ్రతకాలి కదా వాళ్ళు కష్టాలు పడదగినటువంటి వారు కాదు తమ తండ్రి వాట అనుభవించదగిన వాళ్ళు కారా? **( ఆంధ్ర మహాభారతం , ఉద్యోగ పర్వం, ప్రథమాశ్వాసం, 263 వ పద్యం).**

అంటే వారు కష్టాలు పడవలసిన వారు కారు వారి తండ్రి సంపదను అనుభవించడానికి అర్హులు అయిన వారు వారు ఇన్ని కష్టాలు వచ్చిన తరువాత వారికి మనపై విశ్వాసం ఉండదు. మనతో కలిసి బ్రతకడానికి అంగీకరించరు అయినా ధర్మం నడపడానికి ధర్మరాజున్నాడు. ఇక్కడ ధృతరాష్ట్రుని ఉద్దేశంలో ధర్మరాజు శాంతి పరుడని మిగతావారు కోపగించినా ధర్మరాజు శాంతి వచనాలే మాట్లాడుతాడని భావిస్తున్నాడు.

*"మ. మనకీ కుండఁగ వచ్చునే? మనము దుర్మానంబు వాటించి యొ*

*పప్పని కార్యంబులు వట్టి వారికిఁదగం బాలీక గర్వంబు లా*

*డిన నిక్కంబగు నల్క నర్జునుడు గాండీవంబు మో పెట్టఁ గృ*

*ష్ణుని సారథ్యము నై జగత్త్రితయ సంక్షోభంబు గా కుండునే? ( ఆంధ్ర మహాభారతం, ఉద్యోగ పర్వం, ప్ర.ఆ. పుట:94.).*

ఈ పద్యం ద్వారా ధృతరాష్ట్రుడు వారు చేసిన పనులు దురహంకారంతో చేసినవని ఒప్పుకున్నట్లు ఉంటుంది. మనము అనే పదం ఉపయోగించడం చేత ధృతరాష్ట్రునితో సహా దుర్యోధనాదులు వారికి ఆపదలు తలపెట్టడం అనే విషయం అర్ధమవుతుంది.

ఈ పద్యం లోని భావం చూస్తే ' వారి భాగం వారికివ్వకుండా ఉందామన్నా మనకు శక్యం కాదు. మనం దురహంకారం పూని చేయకూడని పనులు చేసి వారికి సముచితంగా భాగం పంచిపెట్టక గర్వంగా మాటాడితే నిజమైన కోపంతో అర్జునుడు గాండీవం ఎక్కుపెట్టగా దానికి శ్రీకృష్ణుడి సారథ్యం కూడా తోడైతే ముల్లోకాలు దద్దరిల్లుతాయి అంతేకాకుండా అర్జునుని పరాక్రమం, శ్రీకృష్ణుని సారథ్యం లోకాలన్ని వణికిపోతాయని చెప్తున్నాడు.

సంస్కృత భారతంలో పాండవుల ఉన్నతిని ఎక్కువగా వర్ణిస్తాడు. ధృతరాష్ట్రుడు ఇలా చెప్తున్నాడు నేను నిత్యం వెతుకుతూ ఉన్నా నిందింపదగిన తప్పులు వారిలో ఒక్కటి కూడా కనబడదు వారు నిత్యం ధర్మార్థాలతో కూడిన పనినే చేస్తారు. కామంతో సుఖాన్ని ప్రియాన్ని అనుసరించేవారు కాదు. **(సంస్కృత భారతం , ఉద్యోగ పర్వం, ఇరవది రెండవ అధ్యాయం,4 వశ్లోకం).**

ఇక్కడ ధృతరాష్ట్రుడు సభలో ఉండి సంజయునితో పాండవులను పొగుడుతూ మాట్లాడటం వలన సభలోని వారు ధృతరాష్ట్రుని కి పాండవులపై మంచి అభిప్రాయమే ఉంది అనే భావన వారికి కలిగేటట్లు ప్రవర్తిస్తున్నాడనిపిస్తుందని ధృతరాష్ట్రుని సంభాషణలో తెలుస్తుంది.

సంస్కృత భారతంలో ధృతరాష్ట్రుడు మనం పాండవులకు అపకారం చేసాము అనే మాట ఉపయోగించలేదు దుర్యోధనుడు కర్ణుడు వీరి వలన నష్టం కలుగుతున్నట్లు చెప్తాడు. ఈ విషయాలు ఆంధ్ర మహాభారతంలో ఉండవు.

*“ త్యజంతి మిత్రేషు ధనాని కాలే*
*న సంవాసాజ్జీర్యతి తేషు మైత్రీ*
*యథార్థమానార్థకరా హి పార్థాః*
*తేషాం ద్వేష్టా నాస్త్యా జమీఢస్య పక్షే*
*అన్యత్ర పాపాద్ విషమాన్మంద బుద్ధేః*
*దుర్యోధనాత్ క్షుద్ర తరాచ్చ కర్ణాత్......( సంస్కృత భారతం , ఉద్యోగ పర్వం, ఇరువది రెండవ అధ్యాయం, )*

పాండవులు తగిన సమయంలో మిత్రులకు ధనాన్ని ఇస్తారు. వాళ్లు ఎక్కడ ఉన్నా వారి మైత్రి నశించదు. పాండవులు అందరిని వారికి తగినట్లుగానే సత్కరిస్తారు. పాపాత్ముడు, వక్రంగా ఉండేవాడు. మందబుద్ధి అయిన దుర్యోధనుడు మిక్కిలి నీచుడైన కర్ణుడు తప్ప కౌరవ పక్షంలోని ఇంకెవరూ పాండవులను ద్వేషించేవారు కాదు. (సంజయా నా కొడుకు దుర్యోధనుడు కామానికి లొంగిపోయి మృత్యువుకు వశమయ్యాడు. మూర్ఖుడైన దుర్యోధనుడు మహాత్ములూ పుణ్యాతలములైన పాండవుల రాజ్యభాగాన్ని దక్కించుకోవాలనుకుంటున్నాడు. ఈ కర్ణ దుర్యోధనులు ఇద్దరూ సుఖానికి , ఇష్టమైన వారికి దూరమైన పాండవులకు కోపం కలిగిస్తున్నారని చెప్తాడు. *( సంస్కృత భారతం , ఉద్యోగ పర్వం, ఇరువది రెండవ అధ్యాయం, ).*

ఇక్కడ ధృతరాష్ట్రుడు పాండవుల ఉదారతను పొగుడుతూ దుర్యోధన, కర్ణాదులను నిందిస్తున్నట్లు తెలుస్తుంది. ఈ విషయాలు ఆంధ్ర మహాభారతంలో ‘మన కీ కుండఁగ

వచ్చునే?....అనే పద్యంలో మనము అని ఉపయోగించాడు దుర్యోధనునితో తాను కూడా అపచారం చేసాడని చెప్పకనే చెప్పాడు.

### 3.15.18. దుర్యోధనుని అహంకారాన్ని వివరించుట:

*తాను మాత్రమే పరాక్రమం కలవాడుననే దురహంకారంతో ఉన్న దుర్యోధనుడు సుఖంలో పెరిగినవాడై పాండవులు జీవించి ఉండగానే వారి భాగాన్ని బాలునిలా హరించగల ననుకుంటున్నాడు దానినే మంచిపనిగా భావిస్తున్నాడు.( సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, ఇరవది రెండవ అధ్యాయం, 8 వ శ్లోకం)*

ఈ మాటలను పరిశీలిస్తే దుర్యోధనుడు పరాక్రమవంతుడు సుఖాలు మాత్రమే దుర్యోధనునికి తెలుసు ఆ సుఖం కోసం ఎంతటికైనా ముందుకు వెళ్తాడు. పాండవులు జీవించి ఉండగా వారి భాగాన్ని బాలునిలా అంటే మూర్ఖునిగా హరించాలనుకుంటున్నాడు అంటే వారిని తన పరాక్రమంతో హతమార్చి రాజ్యాన్ని చేజిక్కించుకోవాలి కాని వారు బ్రతికి ఉండగానే మూర్ఖత్వంతో హరించాలనుకుంటున్నాడు అదే మంచి పని అనుకుంటున్నాడు అది మంచిపని కాదని దుర్యోధనునికి అర్థం కావడం లేదనే భావం పై మాటల్లో వ్యక్తమవుతున్నట్లు తెలుస్తుంది.

### 3.15.19. పాండవులను శాంతింపచేయమని ధృతరాష్ట్రుడు చెప్పుట:

సంస్కృత భారతంలో అర్జునుడు శ్రీకృష్ణుడు, భీమసేనుడు , సాత్యకి , నకుల సహదేవులు, సృంజయ వంశ వీరులును అజాత శత్రువైన యుధిష్ఠిరుని మార్గాన్ని అనుసరిస్తున్నారు. కావున యుద్ధ ప్రసక్తి మాని ముందు రాజ్యభాగమివ్వడం మంచిది. ( **సంస్కృత భారతం , ఉద్యోగ పర్వం, ఇరువది రెండవ అధ్యాయం, 9 వ శ్లోకం)**
పాండవులు సైన్యాన్ని సమకూర్చుకుంటున్నారన్న విషయాన్ని తెలిసినవాడు కాబట్టి అందరి మన్ననలు పొందడానికి యుద్ధ ప్రసక్తి లేకుండా రాజ్య భాగం ఇస్తే మంచిదని పైకి అలా చెప్తున్నాడు.

సంస్కృత భారతంలో శ్రీకృష్ణుడు పాండవులు వారికి సహాయకులుగా వచ్చిన రాజుల పరాక్రమాన్ని సంక్షిప్తంగా వర్ణిస్తాడు అంతేకాదు మన బలం పరిపూర్ణమైనప్పటికి

పాండవులకు ఎదురైనప్పుడు వారితో సమానం కాదనిపిస్తుంది. ( **సంస్కృత భారతం, ఉద్యోగపర్వం, ఇరువది రెండవ అధ్యాయం, 9 వ శ్లోకం**)

ఆంధ్ర మహాభారతంలో శ్రీకృష్ణుడు పాండవులకు సహకరించడానికి వచ్చిన వారి పేర్లు నామ మాత్రంగా చెప్పి వారిని జయించడం కష్టం, వారి కంటే ఎక్కువ ధర్మరాజు కోపానికి భయపడవలసిందే కదా అని చెప్పి సంజయుడి వైపు తిరిగి వారిని శాంతి వచనాలతో శాంతపరిచే విధంగా స్నేహం కలిగే విధంగా మాట్లాడమని చెప్పి పంపిస్తాడు.

ఈ మాట ధృతరాష్ట్రుడు చెప్పడంతో కొంత పాండవుల పరాక్రమానికి భయపడుతున్నట్లు తెలుస్తుంది.

### 3.15.20. శ్రీకృష్ణుని పరాక్రమాన్ని ధృతరాష్ట్రుడు గుర్తుచేయుట:

ధృతరాష్ట్రుడు సంజయునితో ఇలా అంటున్నాడు. ఈ సందర్భంలోనే శ్రీకృష్ణుడు శిశుపాలుని సంహరించడాన్ని గుర్తుచేస్తాడు. పాండవుల కోసం శ్రీకృష్ణుడు చూపిన పరాక్రమం చూస్తుంటే నాకు శాంతి కలగడంలేదు. శ్రీకృష్ణుడిని ఆధారంగా చేసుకున్న ఆ పాండవులను ఎదిరింపగల శత్రువు వేరొకడు ఉండడు. ఒకే రథం మీద ఉన్న కృష్ణార్జునులను గురించి వింటేనే నా హృదయం భయంతో వణికిపోతుంది. తెలివి తక్కువ వాడైన నా కుమారుడు వారిరువురితో యుద్ధానికి వెళ్లకపోతే శుభాన్ని పొందుతాడు వెడితే ఇంద్రుడు, విష్ణువు, రాక్షస సేనను సంహరించినట్లుగా వారిరువురు కౌరవులనందరిని దహించివేస్తారు.

### 3.15.21. ధృతరాష్ట్రుడు యుద్ధప్రసక్తి లేకుండా మాట్లాడమని చెప్పుట:

వినయము, బలము కల అజాత శత్రువు ధర్మరాజు ధర్మాన్ని ఆచరించడంలోనే సంతోష పడతాడు. అలా కాకపోతే ధర్మరాజు తనను దుర్యోధనుడు ఎంతగానో అవమానించినందులకు, కౌరవులను ఎప్పుడో అంతమొందించేవాడు. క్రోధంతో ఉన్న ధర్మరాజు కు భయపడినంతగా అర్జునుడు కృష్ణుడు , భీముడు, నకుల సహదేవుల పట్ల గాని నేను భయపడను ధర్మరాజు కోపంచూసి నేను భయపడటం యుక్తమే నీవు త్వరగా రథంపూని పాంచాల రాజు యొక్క సైన్యం సేదతీరిన చోటుకు వెళ్ళు ధర్మరాజుతో

*అజాత శత్రుం కుశలం స్మ పృచ్ఛేః*

*పునః పునః ప్రీతి యుక్తం వదేస్త్వమ్*

*జనార్ధనం చాపి సమేత్య తాత*

*మహామాత్రం వీర్యవతాముదారమ్*

*అనామయం మద్వచనేక పృచ్ఛేః*

*ధృతరాష్ట్రః పాండవై శాంతిమీప్సుః*

*న తస్య కించిద్ వచనం న కుర్యాత్*

*కుంతిపుత్రో వాసుదేవస్య సూత'' (సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, ఇరువది రెండవ అధ్యాయం, 38 వ శ్లోకం)*

ధర్మరాజుతో మళ్ళీ మళ్ళీ ఎన్నిసార్లైనా ప్రీతిగా మాట్లాడు ధృతరాష్ట్రుడు పాండవులతో శాంతిని కోరుకుంటున్నాడని చెప్పు, సంజయా ధర్మరాజు వాసుదేవుడు చెప్పిన మాటనే తప్పక ఆచరిస్తాడు. అక్కడున్న పాండవులను. సృంజయ వంశీయులను శ్రీకృష్ణుని, సాత్యకిని, విరాట రాజును, ఉపపాండవులను నా మాటగా క్షేమ సమాచారం అడుగు, అంతే కాకుండా భరత వంశీయులకు హితమని తోచిన మాటలను పాండవులకు చెప్పు క్రోధానికి కాని యుద్ధానికి కాని కారణమయ్యే మాటలు మాట్లాడవద్దని ధృతరాష్ట్రుడు సంజయునికి చెప్పి పంపిస్తాడు. *సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, ఇరువది రెండవ అధ్యాయం, 38 వ శ్లోకం).*

ధృతరాష్ట్రుడు పంపిన ఈ సందేశంలో శాంతియుతంగా సమస్యను పరిష్కరించడానికి ఎట్టి పరిస్థితిల్లోనూ క్రోధానికి కాని యుద్ధానికి కాని కారణమయ్యే మాటలను అసలు మాట్లాడవద్దని చెప్పడంతో పాండవుల దగ్గర కాస్త మెత్తగా మాట్లాడితే వారు కరిగిపోతారు. ధర్మరాజు దయాస్వరూపడు మళ్లీ అడవులకు వెళ్లి అక్కడే నివాసముండమని చెప్పినా నా మాటను కాదనక వెళ్ళే మనిషి కాబట్టి శాంతియుతంగా సమస్యను పరిష్కరింపచేసుకు రమ్మని ధృతరాష్ట్రుని భావమని తెలుస్తుంది.

### 3.15.22. **సంజయుడు ఉపప్లావ్యము చేరుట:**

''ధృతరాష్ట్రుని మాటను విని సంజయుడు పాండవులను చూడడానికి ఉపప్లావ్యానికి వెళ్లాడు. అతడు ముందుగా కుంతి పుత్రుడైన యుధిష్ఠురుని సమీపించి నమస్కరించి ఇలా అంటాడు. మొదట అదృష్టవశాన నిన్ను చూడటం చాలా సంతోషంగా ఉందని చెప్పి, తర్వాత ధృతరాష్ట్రుడు నీ క్షేమాన్ని గురించి అడుగుతున్నాడు తర్వాత భీమ, అర్జున, నకుల సహదేవులు వారి కుశలాన్ని అడిగాడు. తర్వాత ద్రౌపది తన కుమారులతో క్షేమంగా ఉందా

**'' మనస్వినీ యత్ర చ వాంఛ సి త్వమ్**

**ఇష్టాన్ కామాన్ భారత స్వస్తి కామః'' ( సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, ఇరువది మూడవ అధ్యాయం, పుట:320).**

నీకు ఇష్టులైన వారంతా తమ తమ అభీష్ట భోగాలతో కుశలమే కదా ఈ మాట చెప్పడంలో కొంత వ్యంగ్యం కనబడుతుంది. అరణ్య అజ్ఞాత వాసాలు పూర్తి చేసుకుని తనను నమ్ముకున్న వారిని పోషించడానికి రాజ్య భాగం కోసం ఎదురు చూస్తున్న వారిని ఇష్టమైన భోగాలు అనుభవిస్తూ సుఖంగా ఉన్నారని చెప్పడంలో వ్యంగ్య పలకరింపు గోచరిస్తుంది.

ఆంధ్రమహాభారతంలో ఒక్క మాటలో తమ్ములూ,నీవు ద్రౌపది నీ కొడుకులు కులాసాగా ఉన్న విషయం తెలుసుకోవడానికి అధిక మైత్రితో నిండిన మనస్సుతో నన్ను పంపాడని చెప్తాడు. ( ఆంధ్ర మహాభారతం, ఉద్యోగ పర్వం, ప్రథమాశ్వాసం, 274 వ పద్యం).

ధర్మరాజు సంజయునితో నీకు స్వాగతం నీ దర్శనం చేత మేము ఆనందిస్తున్నాము నేను నా సోదరులతో కుశలంగా ఆరోగ్యంగా ఉన్నామని అంటాడు. **(సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, ప్రథమాశ్వాసం, 274 వ పద్యం).**

ధర్మరాజు సమాధానంలో మేము భోగాలైతే అనుభవించడం లేదుగాని క్షేమంగా ఆరోగ్యంగా ఉన్నాము అనే భావం ధర్మరాజు మాటల్లో వ్యక్తమవుతుంది.

ఆంధ్ర మహాభారతంలో ధర్మరాజు సమాధానంలోనూ పరోక్షభావం ఉట్టిపడేటట్లు ఉంటుంది. ఆ ధృతరాష్ట్ర మహారాజుకు మామీద ఉన్న దయచేత మేము ఇట్లా సుఖంగా ఉన్నాము. నిన్ను ఇక్కడకు పంపి చూపిన వాత్సల్యం చేత నా మనస్సు సంతోషించింది.

ఇందులోని ఎత్తి పొడుపు మాటలు వ్యక్తీకరించబడ్డాయి. ఆ రాజుకు మా పట్ల ఉన్న దయ వలన ఇలా సుఖంగా ఉన్నాం. అన్నప్పుడు దయ కాదు కాపట్యం వలన అని అర్థం. ఇట్లు అంటే ఈ విధంగా రాజ్యహీనులమైనామని భావం. సుఖంగా అంటే దుఃఖంగా అని ఉన్నామంటే ఏదో ఇలా బ్రతుకు ఈడుస్తున్నాం అనే వ్యంగ్య భావన కనబడుతుంది.

సంస్కృత భారతంలో ధర్మరాజు చాలా కాలం తర్వాత ధృతరాష్ట్ర మహారాజు కుశల సమాచారాన్ని నీ ప్రేమను, నిన్ను చూస్తూ ఉంటే సాక్షాత్తుగా ఆ ధృతరాష్ట్రున్నే చూసినట్లనిపిస్తుంది. **( సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, ఇరువది మూడవ అధ్యాయం,7 వ శ్లోకం).**

ఇక్కడ కూడా ధర్మరాజు వ్యంగ్య సంభాషణ చేసినట్లు తెలుస్తుంది. ఇంత కాలం లేనిది ఇప్పుడు కొత్తగా వచ్చి ధృతరాష్ట్రుడు చాలా కాలం తర్వాత మా క్షేమ సమాచారం అడగడం ఆశ్చర్యంగా ఉందనే భావం బోధపడుతుంది.

భీష్ముని కుశలాన్ని మొదట ధర్మరాజు అడుగుతాడు మా పట్ల భీష్మునికి అభిమానంలో ఎటువంటి మార్పురాలేదు కదా అంటే మాపై ప్రేమతో నే ఉన్నారుకదా అని అడుగుతాడు. ధర్మరాజు కురువంశానికి పెద్దవాడైన భీష్ముని సమాచారమే ప్రధానమని భావించాడు

తర్వాత ధృతరాష్ట్రుడు తన కుమారులతో పాటు కుశలమేనా అని అడుగుతాడు. **( సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, ఇరువది అయిదవ అధ్యాయం,9 వ శ్లోకం)**

ఇక్కడ కుమారులే ప్రపంచంగా భావించే ధృతరాష్ట్ర మహారాజు వారితో కలిసి క్షేమంగా ఉన్నాడా అనే భావన అర్థమవుతుంది.

భీష్ముని తరువాత ధృతరాష్ట్రుని తరువాత ప్రతీపుని కుమారుడు బాహ్లీకుడు, సోమదత్తుడు, శల్యుడు, ద్రోణాచార్యుడు, కృపాచార్యుడు, వంటి ధనుర్ధారులను అడిగాడు అశ్వత్థామ యొక్క క్షేమసమాచారాన్ని ఇలా వరుసగా అడుగుతాడు ధర్మరాజు.

ఆంధ్ర మహాభారతంలో మొదట ధృతరాష్ట్రుడు తరువాత అతని కొడుకులను, మనుమలను , పట్టణాలలో జనపదాల ప్రస్తావన తీసుకువస్తాడు తరువాత ద్రోణుడు, కృపుడు, అశ్వత్థామ, భీష్ముడు యొక్క క్షేమ సమాచారాన్ని వరుసగా అడిగినట్లు తెలుస్తుంది.

సంస్కృత భారతంలో ధృతరాష్ట్రునికి వైశ్య పత్నికి పుట్టిన యుయుత్సుడిని క్షేమాన్ని అడిగాడు ఇది ఆంధ్ర మహాభారతంలో ఉండదు.

*‘ కర్ణో2మాత్యః కుశలీ తాత కచ్చిత్*

*సుయోధనో యస్య మందోవిధేయః ’’* అనడంలో మూర్ఖుడైన దుర్యోధనుడు ఎవనికి విధేయుడో ఆ కర్ణుడు కుశలమేనా అడుగుతాడు ఈ మాటల్లోనే కర్ణుని మాటలు తప్ప ఎవరి మాటలు లెక్కచేయని మూర్ఖుడు దుర్యోధనుడని తెలుస్తుంది.

### 3.15.23. ధర్మరాజు రాజ్యక్షేమాన్ని గురించి విచారించుట:

దుర్యోధనుడు బ్రాహ్మణుల పట్ల మునుపటిలా తగిన విధంగా ప్రవర్తిస్తున్నాడా బ్రాహ్మణుల జీవనం కోసం నేనిచ్చిన గ్రామాదులను దుర్యోధనుడు లాగుకొనలేదు కదా అని అడుగుతాడు ఆంధ్ర మహాభారతంలో ఇదే విషయాన్ని దుర్యోధనుని పేరు ప్రస్తావించకుండా అడిగినట్లు తెలుస్తుంది.

ఇలా అడగడంలో దుర్యోధనునికి ఎంత రాజ్యం మీద, సుఖభోగాలపైన ఆసక్తి ఉన్నప్పటికి బ్రాహ్మణుల పట్ల ఆదరంగా వ్యవహరించాలి ముఖ్యంగా వారికి మేమిచ్చిన గ్రామాల జోలికి వెళ్ళడం లేదు కదా అని అడుగుతాడు. అంటే ధర్మరాజు రాజ్యాన్ని మోసపూరితంగా లాక్కున్నారు కదా బ్రాహ్మణులకు పాండవులు ఇచ్చిన గ్రామాలు కూడా మా సంపదేనని అపహరించే ప్రయత్నం చేయడం లేదు కదా అనే భావం వ్యక్తమవుతుంది.

తర్వాత శ్లోకంలో వెంటనే ‘పుత్రులతో పాటు ధృతరాష్ట్రుడు కూడా బ్రాహ్మణుల పట్ల జరిగిన అపరాధాలను ఉపేక్షించడం లేదు కదా అని చెప్పడంతో దుర్యోధనాదుల మీద అమిత ప్రేమ కలిగిన ధృతరాష్ట్రుడు పుత్రులు బ్రాహ్మణులకు అపరాధం చేస్తుంటే ఊరకనే ఉండక తగిన మందలింపు ఇస్తున్నాడా లేదా అని చెప్పినట్లు ఉంటుంది. వెంటనే బ్రాహ్మణుల పట్ల అపరాధం జరిగితే ఏమవుతుందో చెప్తాడు. బ్రాహ్మణులకు జీవికను

కల్పించడమనేది స్వర్గానికి దారిచూపే వెలుగు, బ్రహ్మ ప్రజల కోసం ఈ తెల్లని జ్యోతిని ఏర్పరచాడు. మూర్ఖులైన కౌరవులు బ్రాహ్మణుల పట్ల జరిగే తప్పుల్ని సరిదిద్దుకోకపోతే కౌరవులకు సర్వనాశనమే అవుతుంది. ఇక్కడ ధర్మరాజుకి బ్రాహ్మణుల పై భక్తిని కౌరవులు వారి పట్ల నిరాదరత కలిగితే వారికి జరగబోయే అనర్థాన్ని తెలియజేస్తాడు.

ఆంధ్రమహాభారతంలో ఈ మాటలను ధర్మరాజు కాకుండా సంజయుడు ధర్మరాజుకు ఇచ్చిన సమాధానంలో చెప్పినట్లు ఉంటుంది.

సంస్కృతభారతంలో

*"కచ్చిద్ రాజ్యే ధృతరాష్ట్రం సపుత్రం*

*సమేత్యాహుః కురవః సర్వ ఏవ "( సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, ఇరవది అయిదవ అధ్యాయం,20 వ శ్లోకం).*

కురు వంశీయులంతా వెళ్లి ఎప్పుడైనా దుర్యోధనునితో ఉన్న ధృతరాష్ట్రునితో మీకు కావలసిన రాజ్యాన్ని గురించి మాట్లాడుతున్నారా?**(సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, ఇరవది అయిదవ అధ్యాయం).**

ఈ విధంగా చెప్పడంతో మా రాజ్య భాగం గురించి పెద్దలంతా న్యాయాన్యాయాలు గురించి చర్చలు ఏమైనా జరుగుతున్నాయా అని ధర్మరాజు అడుగుతున్నాడు ధర్మరాజు తెలివిగా సంజయుని నుండి వారి అభిప్రాయాలను సేకరించే ప్రయత్నం చేస్తున్నాడని తెలుస్తుంది.

ఆంధ్ర మహాభారతంలో ఈ మాట చెప్పినట్లు ఉండదు. తర్వాత ధర్మరాజు దోపిడిలు చేసే వారు అర్జునుని పరాక్రమాన్ని తలచుకుంటున్నారా, అర్జునుని గాండీవం నుండి వెలువడే శబ్దం ను అర్జునుని బాణాలను వారు స్మరిస్తున్నారా అలాగే గదా యుద్ధంలో శత్రువులకు భయంకరుడైన భీముని కళింగ రాజులను జయించిన సహదేవుని , శిబిని, త్రిగర్త దేశ రాజులను జయించిన నకులను గుర్తుపెట్టుకున్నారా అనడంలో వారిని గుర్తుపెట్టుకుంటే భవిష్యత్తులో తమకు అన్యాయం చేయాలనే ఆలోచన వచ్చినా ఆ విధంగా ప్రవర్తించినా వారికి ఓటమి తప్పదని హెచ్చరిస్తున్నట్లు అర్థమవుతుంది.

ధర్మరాజు ఇంకా ఇలా అడుగుతున్నాడు ద్వైత వనంలోకి ఘోష యాత్రకు వచ్చిన దుర్యోధనాదులు అపజయం పాలయ్యారు.శత్రువుల ఆధీనం అయిపోతున్న మందబుద్ధులను భీమార్జునులు బంధవిముక్తుల్ని చేసారు.

ఆ సంగతిని గుర్తుచేసుకుంటున్నారా అని అడగడంలో ఒకసారి గంధర్వుల చేత పరాభవించబడితే భీమార్జునులు రక్షించారు కదా దానిని మరచిపోయి మా రాజ్య భాగం ఇవ్వకుండా రాయబారాలు నడిపిస్తున్నారా అనే భావం ధర్మరాజు మాటల్లో తెలుస్తుందని నా అభిప్రాయం.ఇదే మాట ఆంధ్ర మహాభారతంలోనూ ఉంటుంది.

చివరకు ధర్మరాజు రాజనీతిలో భాగమైన దానంచేత కాని, భేదోపాయం చేత కాని, దండోపాయం చేత కాని దుర్యోధనుని మనసు మార్చడం కష్టమనిపిస్తే సామోపాయం చేత కూడా అతనిని మార్చలేము ఇది నిశ్చయమని ధర్మరాజు చెప్తాడు.

ఆంధ్ర మహాభారతంలో ఇలా నిశ్చయమైన అభిప్రాయాన్ని తెలుపడు.

ఈ సంజయ రాయబారాన్ని గమనిస్తే వచ్చిన వ్యక్తి సంజయుడు అందరికి మిత్రుడు, కావున ఒకరికొకరు వారి వారి రాజ్యాలలోని క్షేమ సమాచారాన్ని అడిగారు. ధర్మరాజు అడిగిన ప్రశ్నలన్నింటికి సమాధానం చెప్తాడు.

### 3.15.24. ధర్మరాజు ప్రశ్నలకు సంజయుని సమాధానం:

దుర్యోధనుడు ఎన్ని దోషాలు చేసినా అతనికి మీరు ఎటువంటి కష్టం కలిగించలేదు అటువంటి మీకు ధృతరాష్ట్రుడు ద్రోహ చింతన చేస్తే అది వానికి మంచిది కాదు, మీ వంటి మంచివారిని ద్వేషిస్తే ధృతరాష్ట్రుడు మిత్రద్రోహి, చెడ్డవాడు కాగలడు. కౌరవులు యుద్ధ ప్రసక్తి వచ్చినపుడు మీ గురించి అర్జునుని గురించి స్మరిస్తూ ఉంటారని చెప్తాడు అంతే కాకుండా

*“ త్వమేవైతత్ కృచ్ఛ్రగతశ్చ భూయః*

*సమీకుర్యాః ప్రజ్ఞయాజాతశత్రో” ( సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 24 వ అధ్యాయం, 8 వ శ్లోకం)*

**‘అజాత శత్రూ’**‘అనే సంబోధనలోనే నీకు శత్రువులు అనేవారు ఎవరూ లేరు అటువంటి నీవు శాంతంతో నే కార్యాన్ని చక్కదిద్దగలవు అనే భావన వ్యక్తమవుతుంది. ఆ అర్థం

వచ్చేటట్లుగానే సంజయుడు '' ఇంతటి కష్టంలో ఉన్నప్పటికి నీవే ప్రతిభతో శాంతికి ఉపాయాన్ని ఆలోచించాలి. ఇంద్రునితో సమానమైన పాండవులు తమ కోరికల కోసం ధర్మాన్ని ఎన్నడూ విడిచి పెట్టరు. కౌరవులు, పాండవులు, సృంజయులు ఉండే విధంగా నీ ప్రతిభతో నీవే ఈ సమస్యను పరిష్కరించాలని చెప్తాడు. ( **సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 24 వ అధ్యాయం, 8 వ శ్లోకం**)

ఈ మాటలను బట్టి వ్యంగ్యంగానే సంజయుడు కోరికలు లేని వారు అటువంటి మీరు కోరికలను తీర్చుకోవడానికి అధర్మమార్గం అనుసరించరు కౌరవులు పాండవులు శాంతియుతంగా జీవించే పద్ధతినే మీరు ఎప్పుడూ ఆలోచిస్తూఉంటారు. అనే భావం పై మాటల్లో తెలుస్తుంది.

తరువాత సంజయుడు తనకు చెప్పిపంపిన ధృతరాష్ట్రుని సమాచారం తెలియజేస్తాడు.

### 3.15.25. సంజయుడు ధృత రాష్ట్రుని సందేశమును యుధిష్ఠిరునికి వినిపించుట:

ధర్మరాజు సంజయునితో పాండవులు, సృంజయులు, శ్రీకృష్ణుడు, సాత్యకి విరాటరాజు, అందరూ ఇక్కడ ఉన్నారు. ధృతరాష్ట్ర మహారాజు నీచే పంపిన సందేశాన్ని వినిపించు అనగానే సంజయుడు అందరికి నమస్కరించి కురువంశీయుల క్షేమాన్ని కోరి నేను చెప్పే మాటలను మీరంతా వినండని ప్రారంభిస్తాడు.

**ఆంధ్రమహాభారతంలో ....''ధర్మనందను గరువంపుఁబల్కుల విధంబునకున్ మదిలోన నుల్కుచున్''** అంటే ధర్మనందునుడు ధృతరాష్ట్రుడు చెప్పిన మాటలను వినిపించమని చెప్పగానే సంజయుడు అతని గడుసరి తనంతో అడిగిన విధానానికి సంజయుడు భయపడుతూ అందరిని తిలకించి సమాధానం చెప్తున్నట్లు ఉంటుంది. రాయబారికి భయం ఉండకూడదు ఇక్కడ సంజయుడికి కొంచెం భయం కలిగడం మనం గమనించాలి. ఈ భయం సంస్కృత భారతంలో ఉండదు.

*సర్వైర్ధర్మైః సముపేతాస్తు పార్థాః*

*సంస్థానేన మార్దవేనార్జవేన*

*జాతాః కులే హ్యనృశంసా వదాన్యాః*

*హ్రీనిషేవాః కర్మణాం నిశ్చయజ్ఞాః (సంస్కృత భారతం, ఉద్యోగపర్వం, 25వ అధ్యాయం, 5 వ శ్లోకం).*

మీరు దివ్యమైన శరీరం చేత మృదువైన మాటల చేత మంచి ప్రవర్తన చేత అన్ని ధర్మాలతో కూడి ఉన్నారు. ఉన్నత వంశంలో పుట్టిన మీరు దయ కలిగిన వారు ఉదార స్వభావం కలిగిన వారు

ఈ విషయంలో గల అంతరార్థాన్ని సంపాదకులు ఈ విధంగా విశ్లేషణ చేసారు. '' ' **కులేజాతాః** అనడం చేత వంశకలహం మానండని, **'అనృశంసాః'** అనడం యుద్ధంలో భీష్మాదులను ఎట్లు చంపగలరని**, వదాన్యాః'** అనడంచే రాజ్యాన్ని ఇచ్చి మళ్ళీ ఎలా అడుగుతారు? అని, **'హ్రీనిషేవాః'** అనడం జ్ఞాతుల ముఖం చూచి ఎలా కొట్టగలరని, **'కర్మణాం నిశ్చయజ్ఞాః**అనడం చేత తక్కువ బలం కల మీరు ఎక్కువ బలం కల కౌరవులను ఎలా కొట్టగలరని సంజయుని మాటల్లోని ఆంతర్యం. ధృతరాష్ట్రుడు చెప్పిన విదంగా మాట్లాడి దౌత్యం నెరపడంలో సంజయుని నేర్పు ఇక్కడ వ్యక్తమైంది. **(సంస్కృత భారతం, ఉద్యోగపర్వం,25 వ అధ్యాయం,5 వ శ్లోకం).**

ఇక్కడ ధృతరాష్ట్రుని మాటలు ఎదుటి వారికి తియ్యని మాటలు గా కనబడుతాయి కాని అందులోని ఆంతర్యాన్ని గమనిస్తే అసలు తేనె పూసిన కత్తి వంటి మాటలు వ్యక్తమవుతున్నాయని తెలుస్తుంది.

అంతే కాకుండా '' భయంకరమైన సేనలు గల పాండవులారా నీచమైన పని మీకు యుక్తం కాదు మీ యొక్క సత్వగుణం (బలం) అటువంటిది కదా మీ యొక్క చిన్న పొరపాటు ఉన్నా అది తెల్లని వస్త్రం మీద నల్లని మరకలా ఉంటుందని చెప్తాడు. (సంస్కృత భారతం,ఉద్యోగ పర్వం,పుట:325). ఇక్కడ యుద్ధమనే ప్రసక్తిని తీసుకువస్తారేమో అదే జరిగితే ఇది మీ స్వచ్ఛమైన మీ గుణాలకు కళంకం తెచ్చిపెడుతుంది అది మీరు సహించలేరు అనే భావం ఈ మాటల్లో వ్యక్తమవుతుంది.

“ **సత్వం హి వస్తాదృశం భీమసేనాః”** అన్న దానిలో భీమసేనాః అనే సంబోధనలోని అర్థాన్ని సంపాదకులు ఈ విధంగా వివరిస్తారు. మీ సేనలో భీముడొక్కడే బలవంతుడు మాకు చాలామంది ఉన్నారు అనడం అంతరార్థం గా తెలియజేయబడుతుంది.(**సంస్కృత భారతం, ఉద్యోగపర్వం, 25 వ అధ్యాయం,6 వ శ్లోకం).**

యుద్ధం అందరికి నాశనం కలిగిస్తుంది పాపాన్ని కలిగిస్తుంది కురువంశానికి తప్పని సరిగా అభ్యుదయం కలగాలంటే కురువంశీయులు నిందితమైన జీవనాన్ని తమలో తాము కలహించుకోవడం విడిచిపెట్టాలి. యుద్ధమే కావాలని నిశ్చయించి వారిని బంధించినా, వధించినా ఆ తరువాత మీ జీవితం మరణంతో సమానమే అది మీకు మంచిది కాదు

దృష్టద్యుమ్నుడు మిమ్మల్ని రక్షిస్తూ ఉండగా భగవంతుడైన శ్రీకృష్ణుడు, చేకితానుడు, సాత్యకి, సహాయకులుగా ఉండగా ఇంద్రునితో పాటు దేవతలంతా దండెత్తినా మిమ్మల్ని ఎవడూ నిలపలేడు అదే విధంగా యుద్ధంలో ద్రోణుడు, భీష్ముడు, అశ్వత్థామ, శల్యుడు, కృపుడు, కర్ణుడు, మున్నగు వారిచే రక్షింపబడుతూ ఉన్న కౌరవులను ఎవడు జయింపగలడు.

*‘మహద్ బలం ధార్తరాష్ట్రస్య రాజ్ఞః*
*కో వై శక్తో హంతుమక్షీయమాణః*
*సోఽహం జయే చైవ పరాజయే చ*
*నిః శ్రేయసం నాధిగచ్ఛామి కించిత్ ( సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 25 అధ్యాయం 6 వ శ్లోకం)’* దుర్యోధనుని వద్ద చాలా పెద్ద సైన్యం ఉంది. ఆ సైన్యాన్ని ఎవరూ నశింపచేయలేరని చెప్తాడు.

ఈ మాటలు పాండవులలో భయాన్ని పుట్టించి యుద్ధ ప్రసక్తి ఆ విధంగానైనా మానుకుంటారేమోనని సంజయుడు ప్రయత్నిస్తున్నట్లు అర్థమవుతుంది.

చివరకు సంజయుడు శరణు వేడుతూ ఈ విధంగా అంటాడు.

*ఉ. మ్రొక్కెద వాసుదేవునకు, మోడ్చెదఁ జేతులు సవ్యసాచికిం*
*దక్కటి మిత్త్ర బాంధవ హిత ప్రియమంత్రి వయస్య కోటికిన్*

*గ్రుక్కుచు విన్నవించెద నసూయలు దక్కి మనుజ్ఞ సేయుఁడీ*

*యిక్కరుణాకరున్ శరణ మే నిదె వేఁడెదఁ గ్రోధశాంతికిన్. (ఆంధ్రమహాభారతం, ఉద్యోగ పర్వం, ప్రథమాశ్వాసం, 302 వ పద్యం, పుట: 110).*

శ్రీకృష్ణునకు , అర్జునునికి చేతులు జోడించి తక్కిన వారందరికి మనవి చేస్తూ కోపాలు మానమని చెప్పి ధర్మరాజు కోపం పొందకుండా ఉండడానికి శరణు వేడుతున్నాడు. సంస్కృత భారతంలో నూ శరణు వేడినప్పటికి అక్కడ ఈ విధంగా ఉంటుంది.

ఇంకా చెడువంశంలో పుట్టిన నీచుల వలె పాండవులు ధర్మరహితమైన పనిని ఎలా చేస్తారు. వాసుదేవునకు ద్రుపదునకు నమస్కరించి కురు సృంజయులకు వంశీయులకు క్షేమం ఎలా కలుగుతుందో చూడమని చేతులు జోడించి మిమ్మల్ని శరణు వేడుతున్నాను. వాసుదేవుడు, అర్జునుడు నా మాటను లక్ష్య పెట్టరని నేననుకోవడం లేదు. **"నేనడిగితే అర్జునుడు ప్రాణాలైనా ఇవ్వగలడు" (ఈ వాక్యం ఆంధ్ర మహాభారతంలో ఉండదు.)** ఇక ఇతర విషయాల సంగతి చెప్పడమెందుకు? విద్వాంసుడవైన ధర్మరాజా కార్యం సాధించడం కోసం ఇదంతా చెపుతున్నాను. భీష్మ ధృతరాష్ట్రులు అభిమతం కూడా ఇదే దీని వలన అందరికి శాంతి లభిస్తుందని చెప్తాడు సంజయుడు, (సంస్కృత భారతం ఉద్యోగ పర్వం, 25 వ అధ్యాయం).

ఈ మాటలను పరిశీలిస్తే సంజయుడు మీరు యుద్ధ ప్రసక్తిని మనసులో నైనా తలచకండి శాంతినే అందరూ కోరుకుంటున్నారు. అయినా మీరు ధర్మాత్ములు కదా మీరు ఎప్పుడూ ఏ సమస్య అయినా శాంతియుతంగానే పరిష్కరిస్తారు అంతటి నేర్పు మీలో ఉందిని సంజయుని మాటల్లో కాదు ధృతరాష్ట్రుని ఆంతర్యాన్ని తెలియజేస్తాడు.

అంతే కాకుండా కోపాలు మాని శాంతించమని ధర్మరాజు కోపం పొందకుండా ఉండడానికి శరణు వేడుతున్నానని రాయబారిగా వచ్చిన సంజయుడు పాండవులు శాంతించడమే తాను పొందే ప్రథమ ప్రయోజనంగా భావించినట్లు తెలుస్తుంది. ధృతరాష్ట్రుడు కోరుకున్నది కూడా అదే కాబట్టి బతిమాలి అయినా వారిని శాంతింపచేసే

ప్రయత్నం చేస్తున్నారు. శాంతిస్తే భీష్ముడు కూడా సంతోషిస్తాడని చెప్పడంలో భీష్ముని మీద గౌరవంతోనైనా కోపం పొందకుండా ఉంటారని భావించాడు.

### 3.15.26. సంజయుని మాటలకు ధర్మరాజు సమాధానం:

సంజయుడు యుద్ధప్రసక్తి వద్దని శాంతించమని చెప్పిన మాటలన్నీ ధర్మరాజు చెప్పిన ఒక్క సమాధానంతో వృథాఅయిపోయినట్లనిపిస్తుంది. సంజయుడిని ఒక్క సారిగా ఉలిక్కి పడేలా చేస్తుంది.

*కాం ను వాచం సంజయ మే శృణోషి*

*యుద్ధైషిణీం యేన యుద్ధాద్ బిభేషి/*

*అయుద్ధం వై తాత యుద్ధాద్ గరీయః*

*కస్తల్లబ్ధ్వా జాతు యుధ్యేత సూత// (సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 26 వ అధ్యాయం, 1వ శ్లోకం)*

ఇదే విషయాన్ని ఆంధ్ర మహాభారతంలో ఈ విధంగా ఉంటుంది.

*ఉ. నెయ్యము దప్ప నొండొకటి నీ చెవి సోఁకెనె నాదు పల్కులం*

*దియ్యెడ? సంజయా! యనికి నెమ్మెయి నల్కెదు నీవు మాకు దాఁ*

*గయ్యము దక్కి మన్కితగు కార్యము గా దాకొ? పోరితంబు లే*

*కయ్యెదు నర్థసిద్ధి వెడఁగైనను నొల్లక యొందు సేయునే? (ఆంధ్రమహాభారతం, ఉద్యోగ పర్వం, ప్రథమాశ్వాసం,304 వ పద్యం).*

సంజయా ఇప్పటి వరకు నీవు మాట్లాడిన మాటలు యుద్ధ ప్రసక్తి వద్దని శాంతించమని వేడుకున్నావు నా మాటల్లో స్నేహం తప్ప మరోమాట నీకు వినబడిందా యుద్ధ విషయమే నేను తీసుకురాలేదు నీవు ఎందుకు భయపడుతున్నావు యుద్ధం లేకపోతే అది అందరికి లాభదాయకమైనదే కదా అని అంటాడు.యుద్ధం లేకుండానే రావలసిన అర్ధ భాగం వస్తే యుద్ధం చేయవలసిన అవసరముండదని చెప్తాడు.

### 3.15.27. ధృతరాష్ట్రుని బుద్ధిని ధర్మరాజు వివరించుట:

ధృతరాష్ట్రుడు ద్యూత సభలో నీతి మార్గాన్ని పక్కనపెట్టి మంచి మార్గంలో మమ్మల్ని నడవమని చెప్పడం ఎంత వరకు సరైనదిగా ఉంటుందని సంపద కోల్పోయాని , శక్తిలేనివారమని లెక్కకట్టి మమ్మల్ని గౌరవంతో మా రాజ్యం ఇవ్వడానికి ధృతరాష్ట్రుడు ఒప్పుకోడు. కొడుకు మాటే వింటాడు. ధర్మాన్ని నిర్లక్ష్యం చేస్తాడు.

తర్వాత కూడా దుర్యోధన, శకుని, కర్ణాదులు తనను ఏవైపు నడిపిస్తారో ఆ మార్గాన్నే అనుసరిస్తాడు. ఆయన పద్ధతి మార్చుకుంటాడా? ఇంకా సంజయుడితో దుర్యోధనుడి దురహంకారము తెలియదా. అతనికి కృష్ణుడు అంటే లెక్క లేదు. ఇంకా అర్జునుడికి ఎదురుగా కర్ణుడున్నాడని అహంకారంతో ఉంటాడు. బంధువుల పరాక్రమం తెలిసి కూడా చావును వరించి యుద్ధాన్ని కోరుతున్నారు. నీవు మమ్మల్ని ముందుగా ప్రశంసించి తరువాత కౌరవులను గెలవడం అసాధ్యం అన్నావు. ఈ మాటలను అంగీకరింపదగినది కాదు. పక్షపాతంతో మాట్లాడావు. మేము ఎన్నో అవమానాలను సహించి ఉన్నాము.

నీకు తెలియనివి కావు. మా తండ్రి తలచుకుని మాకు ఏ కష్టం రాకండా లోకం మెచ్చేటట్లు మమ్మల్ని తన వద్దకి పిలిచి మాకు ఇయ్యవలసిన రాజ్య భాగాన్ని కొడుకులను ఆజ్ఞాపించు ఇంద్రప్రస్థాన్ని మరొక నగరాన్నో రాజధానిగా చేసుకుని పరిపాలించండని చెప్పడం ఎంత సముచితంగా ఉంటుందని ఆవేశంలో ధర్మరాజు పలుకుతాడు.

### 3.15.28. సంజయుడు ధర్మరాజుని ఉపశమింపచేయుట:

ధర్మరాజు మాటలకు సంజయుడు – ఎదుటివారు ఎన్ని తప్పులు చేసినా వాటన్నింటిని పక్కకు పెట్టి ఓర్పును ప్రదర్శించగల గొప్ప ఉదాత్త స్వభావం కలవాడవు, మచ్చలేని చరిత్ర నీకు ఉన్నది. కౌరవులు రాజ్యభాగం ఇవ్వకుండా అన్యాయం చేస్తే రక్తపు కూడు తినడం కంటే భిక్షాన్నమే మేలు కదా, రాజసూయ యాగంతో దేవతలనే మెప్పించి

కీర్తి పొందిన పుణ్యమూర్తివి నీవు, నీ పుణ్య చరిత్ర కళంకంగా మారడం మంచిది కాదంటూ యుద్ధం చేయాలన్న ఆలోచనను మానుకోమంటాడు.

### 3.15.29. పాండవులను భిక్షావృత్తిని చేపట్టమని చెప్పుట:

సంస్కృత భారతంలో పైవిషయాలు ప్రస్తావించినప్పటికి భిక్షాటన అనేది అంధక వృష్ణి రాజ్యాలలో భిక్షావృత్తిని అవలంబించటం మేలని చెప్తాడు.

*“భైక్షచర్యామంధకవృష్ణి రాజ్యే శ్రేయో మన్యే న తు యుద్ధేన రాజ్యమ్ ”( సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 27 వ అధ్యాయం, 2 వ శ్లోకం ).*

ఈ మాటల వలన ఏ ప్రాంతంలో భిక్షాటన చేసుకోవాలో కూడా నిర్ణయించి చెప్పడంతో వారికి శాంత స్వరూపుడు ధర్మరాజు కావున యుద్ధ ప్రసక్తి చేయదు కాబట్టి ఈ భిక్షాటన విధానమే వారికి సరైనా మార్గం అనే ఆలోచన ధృతరాష్ట్రుడు చేసినట్లు తెలుస్తుంది.

### 3.15.30. ధర్మరాజు ధర్మవిచారణ:

ధర్మరాజు సంజయునితో – లోకంలో కొన్ని పనులు పైకి ధర్మంగా కనబడుతూ చివరకు అధర్మంగా చెడిపోతాయి. కొన్ని అధర్మాలుగా గోచరిస్తూనే చివరకు ధర్మాలై రూపొందుతాయి. కోపాన్ని పోగొట్టుకోవటం, అహింసతో ఉండడం ధర్మాలే, పాపాత్ములను నిర్మూలించడం కూడ ధర్మమే. రాజులకు యుద్ధం చేయడం ధర్మమా? అధర్మమా ? అని నీవే చెప్పుము అంటూ ధర్మాధర్మాలను వివేచించడానికి వాసుదేవుడున్నాడు అంటూ కొన్ని ధర్మమార్గాలను తెలియజేస్తాడు.

సంస్కృత భారతంలో ఈ ధర్మాధర్మాల గురించి ప్రస్తావన వచ్చినప్పుడు సంపాదకులు ఈ విషయంలో దాగి ఉన్న ఆంతర్యాన్ని ఈ విధంగా తెలియజేస్తారు. *“ధృతరాష్ట్రుని కపట ద్యూతం అధర్మమే అయినా ఆపత్కాలంలో ఆ ద్యూతమే ధర్మంగా అంగీకరించబడింది. ధృతరాష్ట్రుడు మాకు వేరే రాజ్యం ఇవ్వడం ధర్మమే అయినా లక్క ఇంటిని నివాసానికివ్వడం వల్ల అధర్మమే అవుతుంది. మేము ప్రతిజ్ఞ ప్రకారం వనవాసం*

*చేయడం ధర్మం ధర్మరూపంతోనే కనపడడమవుతుంది.జ్ఞాతి వధ అధర్మంగా తోచినా అధర్మాకులైన ధార్తరాష్ట్రులను వధించడం మాకు క్షాత్ర ధర్మమే అవుతుంది కాబట్టి దోషం లేదని ధర్మరాజు మాటల ఆంతర్యం." ( సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 28 వ అధ్యాయం, 2 వశ్లోకం).*

ఈ విషయాలను పరిశీలిస్తే ధర్మరాజు ఆలోచనా ధోరణి అందరికి ప్రశాంతంగా ఉన్నట్లు కనబడుతున్నా మనసులో యుద్ధం వలనే రాజ్యభాగం సాధ్యమవుతుందనే బలమైన ఆలోచన ఉన్నట్లు తెలుస్తుంది. అది ఎవరికి అర్థం కాని రీతిలో పరోక్ష సంభాషణ కావించినట్లు ధర్మరాజు మాటల్లోనూ సంపాదకుల అభిప్రాయం లోనూ వెల్లడవుతుంది.

### 3.15.31. శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రునితో చెప్పమన్న మాటలు:

శ్రీకృష్ణుడు సంజయుని ద్వారా ధృతరాష్ట్రునికి సందేశం పంపించే సమయంలో తాను పాండువల యోగక్షేమాలను కోరేవాడని చెప్తాడు, ధృతరాష్ట్రుడు తెలివితో సంజయుడిని పంపించి యోగక్షేమాలు తెలుసుకోవడం సంతోషంగా ఉందని సంజయుడు వారి మాటల్ని మరింత ఇష్టంగా వినయం కనబడేటట్లు మాట్లాడడం తనకు సమ్మతాన్ని కలిగించిందని ధర్మరాజు చెప్తాడు. ఇప్పటి వరకు జరిగినదంతా చూస్తే ధర్మరాజు సంధి జరిగే పద్ధతి కనబడడం లేదు. దుర్యోధనుడు కుటిల బుద్ధి కలవాడు, చివరకు అందరూ కలిసి ఉండటం అనే మాట ఎట్లు కలుగుతుందని పాండవులు శాంతి కోరుకుంటే మంచిదే కాని తండ్రి వారికి స్వయంగా రావలసిన రాజ్యభాగం తండ్రి పంచి ఇవ్వలేదని తెంపు చేసి యుద్ధాన్ని వారు ప్రకటిస్తే ద్రోహమవుతుందా? నా దృష్టికి పాండవులకు యుద్ధమే శరణ్యమని కనబడతున్నదని తెలియజేస్తూ క్షత్రియ ధర్మాలను చెప్తూ వారి యుద్ధం చేయడం న్యాయమైనదేనని చెప్తాడు. ద్రౌపదిని అవమానించిన తీరును వివరిస్తాడు. ఆ సమయంలో కర్ణుడు మాట్లాడి దుర్భాషలను తెలియజేస్తాడు. ఇన్ని జరిగినా రాజు ఏనాడైనా ఓదార్పు పలికాడా ఈ సంధి కార్యం జరగదని కృష్ణుడు భావిస్తాడు. ఈ

వ్యవహారం మీద తానే స్వయంగా వస్తానని నా ప్రయత్నానికి రాజు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా దానిని వారి ప్రవర్తనను బట్టి తాను వ్యవహరిస్తానని చెప్తాడు.

సంస్కృత భారతంలో శ్రీకృష్ణుడు ధృతరాష్ట్ర, దుర్యోధనాదులను దోపిడిదారులుగా భావిస్తాడు. *“ యుద్ధరంగంలో దొంగలను చంపడం వల్ల రాజులకు పుణ్యం వస్తుంది. ఇతరుల సొమ్మును అపహరించడమనే తప్పు కౌరవుల్లో తీవ్రరూపం దాల్చింది. అధర్మమే అని తెలిసి ధర్మాన్ని తెలియని కౌరవులు చేసిన పని మంచిది కాదు ఆ ధృతరాష్ట్ర మహారాజు పుత్రులతో కలిసి పాండవులకు రావలసిన రాజ్యాభాగాన్ని కారణం లేకుండానే అపహరించాడు. కౌరవులంతా రాజధర్మాన్ని పాటించడంలేదని అంటాడు.*

*స్తేనో హరేద్ యత్ర ధనం హ్యదృష్టః*

*ప్రసహ్య వా యత్ర హరేత దృష్టః*

*ఉభౌ గర్హ్యౌ భవతః సంజయైతౌ*

*కిం వై పృథక్త్వం ధృతరాష్ట్రస్య పుత్రే” ( సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 29 వ అధ్యాయం,33 వ శ్లోకం)*

*దొంగ ఎవరూ చూడకుండా ఇతరుల ధనాన్ని అపహరిస్తాడు ఒకవేళ ఎవరైనా కనబడితే వారిని బంధించి మరీ ధనాన్ని దోచుకుంటాడు. ఈ రెండు మార్గాలు దొంగ ఎంచుకున్నప్పటికి అతనిని దోపిడీ దారుగానే పిలుస్తారు వారు నిందార్హులుగానే ఉంటారు. ఈ విషయంలో ధృతరాష్ట్ర పుత్రునికి వారికి భేదమేమైనా ఉందా? అని సంజయునితో అంటాడు.”*

ఈ మాటల వలన అందరి ముందు రాజులా తిరుగుతూ దొంగల బుద్ధితో పరోక్షంగా దుర్యోధనాదులున్నారని  అటువంటి దొంగలను నిర్మూలించడమే సరైన మార్గమని శ్రీకృష్ణుని అభిప్రాయంగా తెలుస్తుంది.

### 3.15.32. శ్రీకృష్ణుడు పాండవులకు కౌరవులకు మధ్య పోలికను తెలుపుట:

శ్రీకృష్ణుడు పాండవులను , కౌరవులకు మధ్య పోలికను వర్ణిస్తూ ఈ మాట అంటాడు.

*" లతా ధర్మా ధార్తరాష్ట్రాః శాలాః సంజయ పాండవాః*

*న లతా వర్ధతే జాతు మహాద్రుమ మనాశ్రితా"(సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 29 వ అధ్యాయం,56 వ శ్లోకం)*

ధృతరాష్ట్ర కుమారులు తీగల వంటి వారని పాండవులు సాల వృక్షాల వంటి వారని పెద్ద వృక్షాలు లేకపోతే లతలు వృద్ధి చెందలేవని చెప్తాడు.

ఈ మాటలు పరిశీలిస్తే కౌరవులు ఎదగడానికి ఆధారం పాండవులే వారినే నశింపచేయాలని చూస్తే అది కౌరవుల అభివృద్ధితో పాటు వంశ వినాశం కలగడానికి కూడా దారితీస్తుందని హెచ్చరించినట్లు ఈ పోలిక కనబడుతుంది.

శ్రీకృష్ణుడి ఆలోచనా ధోరణి అంతా ప్రత్యక్షంగానే చెప్తాడు ఉన్నది ఉన్నట్లు నిర్మొహమాటంగా చెప్పడం గమనించదగిన విషయం.

చివరగా శ్రీకృష్ణుడు *"స్థితాః శమే మహాత్మానః పాండవా ధర్మచారిణః*

*యోధాః సమర్థాస్తద్ విద్వన్నాచక్షీథా యథాతథమ్"(సంస్కృత భారతం , ఉద్యోగ పర్వం, 29 వ అధ్యాయం, 58 వ శ్లోకం).*

ధర్మంగా నడిచే పాండవులు సంధికి సిద్ధంగా ఉన్నారు యుద్ధం చేయడానికైనా సిద్ధంగా ఉన్నారు. ఈ రెండు పరిస్థితులను గ్రహించి ధృతరాష్ట్రునికి ఉన్నది ఉన్నట్లు చెప్పమని చెప్తాడు.

### 3.15.33. సంజయుడు తిరిగి హస్తినా పురం తిరుగు ప్రయాణం – ధర్మరాజుని సందేశం:

సంజయుడు ధర్మరాజు వద్ద అనుమతి తీసుకుని తాను తగని మాటలు ఏమైనా మాట్లాడానా అని ప్రశ్నిస్తాడు. ధర్మరాజు నీవు ఇక పోయి రావచ్చును. ఇంతమంది,

వింటుండగా నీవు చెప్పవలసిన మాటలు వివరంగా తెలిపావు. ఎదుటివారి పరిస్థితులను చెప్పడంలో నీవు ఎటువంటి ఇబ్బందులు పడవని కొన్ని మాటలను చెప్పి ధృతరాష్ట్రుడు నిండు కొలువుండగా కొన్ని మాటలు చెప్పి పంపించాడు. భీష్మాచార్యునికిని, దుర్యోధనుడికి చెప్పవలసిన మాటలను ధర్మరాజు చెప్పేటప్పుడు దుర్యోధనునికి సభా ముఖంగా కొన్ని మాటలు చెప్పమంటాడు.

*సీ. ఆ సమయంబున నచ్చటి వారెల్ల 1 వినునట్లుగా సుయోధనుని తోడ*
*బాహుబలాఢ్యుల బలవిహీనుల క్రియ 1 వెడలంగ నడిచిన వెఱ్ఱితనము*
*నత్యంత చిరకాల మడవులఁ గొండల1 బాధలఁ బెట్టిన పరుసఁదనము*
*సభలోన నట్లు పాంచాల రాజాత్మజఁ దలపట్టి యీడ్చిన తులువతనము*
*తే.ధర్మ పుత్త్రుండు సైరించెఁదఢ్య మీవు1 కురు కుమారుల నని మ్రింగికొనకు మొరుల*
*సొమ్మునకు నాసపడఁదగ దిమ్ము వారి1 పాలు వారలతోఁ గూడి బ్రదుకు మనుము.*
*( ఆంధ్ర మహాభారతం, ఉద్యోగ పర్వం, ప్రథమాశ్వాసం, 376 వ పద్యం, ).*

పరాక్రమవంతులైన పాండవులను ఊరిలో నుండి వెళ్ళగొట్టడం పిచ్చివాళ్ళపని దానిని సహించాము అంతేకాకుండా చాలా కాలం అడవులలోనూ, కొండలలోనూ బాధలు పెట్టిన మీ క్రూరత్వము, సభలో ద్రౌపదిని ఆ విధంగా జుట్టుపట్టుకుని ఈడ్చిన ఘట్టాలు ఎంతో బాధించినప్పటికి సహించాము. నీ మూర్ఖత్వంతో ఇక మీద కౌరవులను యుద్ధంలో నాశనం చేసుకోకు. ఇతరుల ధనాన్ని ఆశించకూడదు. వారి భాగం వారికి ఇచ్చేస్తే అందరూ కలిసి బ్రతుకుతామని చెప్పమంటాడు.

ఈ విషయాలు ధర్మరాజుకు ఉన్న సహనశీలత్వాన్ని నిరూపించేవిధంగా ఉన్నాయి.

సంస్కృత భారతంలో ధర్మరాజు సంజయునితో చెప్పిన మాటలను పరిశీలిస్తే

*‘‘ఇదం పునర్వచనం ధార్తరాష్ట్రం*
*సుయోధనం సంజయ శ్రావయేథాః1*
*యస్తే శరీరే హృదయం దునోతి*
*కామః కురూనసపత్నో2నుశిష్యామ్11*

*న విద్యతే యుక్తిరేతస్య కాచిత్*

*నైవం విధాః స్యామ యథాప్రియం తే1*

*దదస్వ వా శక్రపురీం మమైవ*

*యుధ్యస్వ వా భారతముఖ్య వీర11( సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 30 వ అధ్యాయం, 48,49 శ్లోకాలు).*

దుర్యోధనునికి ప్రత్యేకంగా ఒక మాట చెప్పు పాండవులను నశింప చేసి కౌరవులకు శత్రువులు లేకుండా చెయ్యాలనే నీ మనస్సులోని కోరిక నీ శరీరాన్ని బాధిస్తుంది. అది సిద్ధించడానికి తగిన ఉపాయం ఏమి లేదు అంటే పాండవులు వారు అనుసరించే ధర్మాలను బట్టి ఎప్పుడూ అభివృద్ధి చెందుతూనే ఉంటారు కాని నీవు అనుకున్నట్లు మాత్రం అది నెరవేరే పని కాదు. నీకు ఇష్టమైనట్లు మేము ఉండలేము ఇంద్రప్రస్థాన్ని నాకు తిరిగి ఇవ్వు లేదా భారత వీరా యుద్ధానికి సిద్ధంగా ఉండమని చెప్తాడు. ఈ మాటల్లోనే ధర్మరాజు వాక్చాతుర్యం దుర్యోధనుని మనసు గ్రహించినవాడు కావునే కొంచెం గట్టిగా మందలించే ప్రయత్నం చేసినట్లు కనబడుతుంది.

సంజయుడు అందరికీ నమస్కరించి బయలుదేరే సమయంలో అర్జునుడు సంజయునితో నీవు బాల్యస్నేహితుడవు, కౌరవ పాండవుల తీరు నీకు తెలియనిది కాదు. భీమసేనుడి బలాన్ని గుర్తు చేసి ధర్మరాజు దయ వలనే మౌనం వహిస్తున్నాము. లేకుంటే వారి ఆట ఎప్పుడో సమాప్తమయ్యేదని అధిక్షేపంగా మాట్లాడి సంజయుడిని హస్తినకు సాగనంపుతాడు.

### 3.15.34. సంజయుడు ధృతరాష్ట్రుని తో సంభాషించుట:

రాయబార కార్యాన్ని నిర్వహించిన సంజయుడు హస్తినాపురానికి తిరిగి వచ్చి ద్వారపాలకుని ద్వార ధృతరాష్ట్రుని అనుమతితో అంతఃపురంలోకి ప్రవేశిస్తాడు. పాండవులు ధృతరాష్ట్రుని యోగ క్షేమాలను అడిగినట్లు ధృతరాష్ట్రుడికి తెలియజేస్తాడు అంతేకాకుండా

ధృతరాష్ట్రుని బుద్ధి మార్చుకోమని అనేక విషయాలను ప్రస్తావిస్తాడు. అలా చెప్పేదానిలో ధర్మరాజు గుణాన్ని చెప్తూ

*చ. అనయము పుట్టె జూదమున యప్పుడ యెంతయుఁ జిచ్చువెట్టి కా*

*ల్చినయది నీ యుపేక్షయ, వశీకృతచిత్తుఁడు ధర్మసూతి మె*

*త్తని పులి యెల్లవారలు నధర్మము నీపయిఁ బెట్టునంతకు*

*న్వినఁడును గానఁడుం బిదప నీకును నాకు మరల్పవచ్చునే? (ఆంధ్ర మహాభారతం, ఉద్యోగ పర్వం, ద్వితియాశ్వాసం, 14 వ పద్యం,)*

జూదం లోనే అవినీతి ఏర్పడంది దానితో పెద్ద ప్రమాదం వచ్చింది. ఆ ఆపదకూడా ధృతరాష్ట్రుడు వారించక పోవడం వలనే వచ్చింది. వచ్చిన ఆ ఆపద మనసులను దహించివేస్తుంది. ధర్మరాజు ఓర్పుగా ఇవన్నీ భరిస్తున్నాడని నీవు అనుకుంటున్నావు అలా తాను ఉండడంలోని ఆంతర్యాన్ని గమనిస్తే లోకుల దృష్టిలో నీవు అన్యాయం చేసినట్లు ధర్మబద్ధంగా వారు ఉన్నట్లు ఉంటుంది. ధర్మరాజు ఏమి మాట్లాడకుండానే తన కార్యాన్ని నెరవేర్చుకోగల సమర్థుడు ఒకసారి నింద పడిన తర్వాత అతడిని ఆపడం ఎవరి తరం కాదు.

సంజయుడు ఈ విధంగా పలికి తన ప్రయాణ బడలిక చేత సవివరంగా మరునాడు నిండు సభలో చెప్తానని తన నివాసానికి వెళ్ళిపోతాడు. సంజయుడి మాటలు ధృతరాష్ట్రుడిలో అలజడిని రేపుతాయి.

### 3.15.35. సంజయుడు రాయబార విశేషాలు తెలుపుట:

విదురుడిని పిలిపించుకుని నీతులను చెప్పించుకున్నాడు. ధర్మరాజును వదిలి పెట్టబోకు కొడుకులకు మంత్రులకు నచ్చజెప్పి సంధి కుదిరేట్లు సాధించమని దాని వలన ధర్మం, కీర్తి లాభం కలుగుతాయని విదురుడు బోధిస్తాడు. అయినా కూడా మనశ్శాంతి కలుగక సనత్సుజాతుడితో ఆధ్యాత్మ ప్రవచనాన్ని వినిపించుకుంటాడు. మరునాడు కొలువులో సంజయుడు తన రాయబార వృత్తాంతాన్ని చెప్పడం ప్రారంభిస్తాడు. శ్రీకృష్ణుడి

అభిప్రాయాన్ని మొదట తెలుపమంటాడు సంస్కృత భారతంలో ధృతరాష్ట్రుడు మొదట అర్జునుడు ఏమన్నాడో తెలియపరచమంటాడు.

### 3.15.36. అర్జునుని అభిప్రాయాన్ని సంజయుడు తెలుపుట:

*"పృచ్ఛామి త్వాం సంజయ రాజమధ్యే*

*కిమబ్రవీద్వాక్య మదీనసత్త్వః*

*ధనంజయస్తాత యుధాం ప్రణేతా*

*దురాత్మానాం జీవితచ్ఛిన్మహాత్మా (సంస్కృత భారతం , ఉద్యోగ పర్వం, 48 వఅధ్యాయం,1 వ శ్లోకం).*

అర్జునుడు తరగని బలం గల యుద్ధ నాయకుడు దుర్మార్గాలను అణచగల మహాత్ముడతడు. కాబట్టి అర్జునుడు ఏమన్నాడో తెలుపమంటాడు.

నర నారాయణులు ఎదుర్కొనవలసి వస్తే వారిని ఎదుర్కోవడం కష్టతరమని వారి బలాబలాలను తెలియజేసాడు. అర్జునుడు ధర్మరాజు మనసు అదుపు చేసుకుని ఎన్నోఏళ్ళు ఉన్నాడు.అలా అణచుకున్న ఘోరమైన కోపాగ్నిని ఒక్కసారిగా కౌరవుల మీద ప్రయోగిస్తే అప్పుడు దుర్యోధనుడు యుద్ధం వద్దని పరితపిస్తాడని అటువంటి సమయం రాకముందే మేల్కొనమని చెప్తాడు.

మానవుడు కర్మను అనుసరించే జీవిస్తాడు మా కష్టాలకు కర్మమే అని మేము భావిస్తున్నాము ఈ విషయం దుర్యోధనుడు గ్రహించలేకపోతే కృష్ణుని కలిసి నేను సహచరులతో సహా దుర్యోధనుని చంపుతాను (**సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 48 వ అధ్యాయం, 94 వ శ్లోకం**).

ఈ మాటలను చూస్తే అర్జునుడు కర్మద్వారా వచ్చిన మా కష్టాలను మా అజ్ఞానం చేత అని అనుకుంటాడేమో కర్మ సిద్ధాంతం తెలియకుండా దుర్యోధనుడు భావించినట్లైతే అతనని చంపుతానని చెప్తాడు. అర్జునుడు తన కోపాన్నంతా సంజయుడి ద్వారా సభలో వ్యక్తపరుస్తున్నాడని అతని వీరోచిత మాటల వలన తెలుస్తుంది.

చివరగా అర్జునుడు వేర్వేరు మార్గాల్లో వెళ్లే స్థూణాకర్ణం, పాశుపతం, బ్రహ్మాస్త్రం, ఇంద్రుడిచ్చిన ఐంద్రాస్త్రం మొదలైన అస్త్రాలు గ్రహించి వేసవిలో అడవిని అగ్నీ దహించి వేసినట్లు బాణాలు ప్రయోగిస్తూ వారి చావును చూస్తాను ఎవరిని మిగలనివ్వను అందరూ చచ్చాకనే నాకు శాంతి ఇది స్థిర నిశ్చయం వారికి చెప్పమని అర్జునుడు చెప్పిన మాటలు సంజయుడు చెప్తాడు.

ఈ విధంగా అర్జునుడు కౌరవులకు భయాన్ని కలిగించేలా చెప్పడం ద్వారనైనా దుర్యోధనాదులలో మార్పు వస్తుందేమోనని భావించి ఉంటాడు.

### 3.15.37. భీష్ముడు దుర్యోధనునికి హితవు పలుకుట:

భీష్ముడు దుర్యోధనునితో హితకరమైన మాటలను చెప్తాడు. చేటుకాలం రావడం చేతనే దుర్యోధనుడు హితవును లెక్కచేయడం లేదని శకుని, కర్ణ, దుశ్శాసనుల మాటలే వినబడతాయి కాని నా మాటలు పెడచెవిన పెడితే నష్టం వాటిల్లుతుందని చెప్తాడు. కర్ణుడు భీష్ముడి మాటలకు మండిపడతాడు. అనవసరంగా నన్ను నిందిస్తున్నావు యుద్ధంలో నిలిస్తే పాండవులందరిని నేనే చంపగలను ఎంత సజ్జనులయినా పూర్వమే విరోధించిన వారితో మళ్లీ శాంతి ఎలా ఏర్పడుతుంది. అనగా భీష్ముడు కర్ణుడి పరాక్రమం ఎటువంటిదో గుర్తుచేస్తే కర్ణుడు పొందిన అపజయాలను గుర్తుచేస్తాడు. ఉత్తర గోగ్రహణం సమయంలో కర్ణుడు అర్జునుడి చేత పొందిన పరాభవాన్ని భీష్ముడు గుర్తు చేస్తాడు.

### 3.15.38. ధృతరాష్ట్రునికి సంజయుడు పాండవుల పరాక్రమాన్ని వివరించుట:

ధృతరాష్ట్రుడు ఇక్కడ సైన్యమంతా సమకూర్చిన విషయం ధర్మరాజుకు తెలుసా ఒక వేళ తెలిస్తే ధర్మరాజు ఎలా స్పందించాడు అతని అభిప్రాయం ఎలా ఉందో చెప్పమనగానే సంజయుడు స్పృహ తప్పి పడిపోతాడు. తిరిగి తేరుకుని రాజు యొక్క అవివేకాన్ని తలచుకుని బాధపడుతాడు. ధర్మరాజు సంధినే కోరుకుంటున్నాడని ముందు చెప్పి వారి రాజ్యభాగం రాకపోతే మాత్రం దేనికైనా సిద్ధపడేలా ఉన్నారని చెప్తాడు. ధర్మరాజు

భీమాదుల పరాక్రమాలను తెలిపిన పద్ధతిని కూడా సంజయుడు స్పష్టపరుస్తాడు. ధృతరాష్ట్రుడు భీమ పరాక్రమాలను ప్రస్తుతిస్తాడు. పాండవుల దివ్య శక్తులను వివరిస్తాడు. ధృతరాష్ట్రుడు సంజయునితో కౌరవ వీరులు అసాధ్యులు కదా వారిని ఎట్లా సాధించగలమని పాండువులు భావిస్తున్నారో తెలుపమని అడుగగా సంజయుడు భీష్ముడు శిఖండి పాలవుతాడని, ద్రోణుడు దృష్టద్యుమ్ను పాలవుతాడని రారాజు అతని తమ్ములు భీముడి చేతిలో ప్రాణాలు వదులుతారని, కుమారులందరూ అభిమన్యుడి పాలు, ఇలా ఎవరి చేతిలో ఎవరు బలి అవుతారో ముందుగానే ఒక వ్యూహాన్ని వేసుకున్నారని చెప్తాడు. ధృతరాష్ట్రుడు దిగులు పడతాడు. దుర్యోధనుడిని పాండవులతో సంధి చేయమని చెప్తాడు. దుర్యోధనుడు తన బలపరాక్రమములను కీర్తించుకుంటాడు. దానికి కర్ణుడు తోడుగా వీర వాక్యాలు పలుకగా, భీష్ముడు దానిని ఖండిస్తాడు. ఇతడా కౌరవులను రక్షించేది అనగానే కర్ణుడు కోపగించి భీష్ముడు యుద్ధంలో నేలకూలేంత వరకు తాను యుద్ధంలో పాల్గొనని అస్త్ర సన్యాసం చేస్తాడు. సంజయుడి సందేశం దుర్యోధనుడు పెడచెవిన పెడతాడు. ధృతరాష్ట్రుడు మౌనం వహించగా సభాసదులందరూ వారి నివాసాలకు వెళ్ళిపోతారు. సంజయుడు మాత్రం తండ్రి కొడుకుల ముందు సాక్షిగా నిలుస్తాడు.

సంజయుడు రాయబారం వలన పాండవుల, కౌరవుల మనోభిప్రాయాలు తెలిసాయి అంతే కాదు రాయబారి అయిన వాడు ప్రభువు యొక్క మాటలనే మాట్లాడడం కాకుండా అక్కడి పరిస్థితులను అంచనా వేయగలగాలి సంజయుడు ధర్మరాజు కు సహాయులను వర్ణిస్తాడు. పాండవుల పరాక్రమ శైలిని అంచనా వేసి చెప్తాడు. రాయబారిగా తాను సాధించవలసిన కార్యాలను పూర్తిచేసుకున్నాడు.

### 3.15.39. సంజయ రాయబారం చర్చ:

సంజయ రాయబారం లో ధృతరాష్ట్రుని మనసు తో పాటు సంజయుని ఉపన్యాస నైపుణ్యాన్ని గమనించవచ్చు.

*నేతి అనంత రామ శాస్త్రి" కవిత్రయ భారతం – రాజనీతి" గ్రంథంలో సంజయుని దౌత్యాన్ని వివరిస్తూ ఈ విధంగా అంటాడు" సంజయుడు దూత ధర్మాన్ని పాటించాడు ఇటువంటి కార్యనిర్వహణకు కౌరవ పక్షంలో ఇద్దరున్నారని వారు విదుర సంజయులని విదురుడు పాండవ పక్షపాతి అని దోషాన్నంతా దుర్యోధనులోనే చూస్తుంటాడు. కౌరవ సామ్రాజ్యాన్ని సరియైన మార్గంలో నడిపించే ప్రధాన సచివుడు ఇక సంజయేడు ధృతరాష్ట్రుని ఆంతరంగిక సచివుడు ప్రభుభక్తి పరాయణుడు . రాచ కార్యాన్ని సమర్థవంతంగా చిత్తశుద్ధితో నిర్వహించగల దక్షుడు సంజయుని రాయబారం విశిష్టమైన పద్ధతిలో నడిచింది. పనిని సాధించనెంచిన రాయబారి మాట్లాడే విధానంలో మెత్తని మాటలతో సంభాషించి కార్యం సాధించడం గమనించాలని చెప్తాడు."*

*(అనంతరామ శాస్త్రి ,నేతి, కవిత్రయ భారతం – రాజనీతి, పుట: 265.)*

వీరి మాటల్లో విదురుడు దుర్యోధనులోనే తప్పులు వెతికాడని చెప్తాడు దుర్యోధనుని ప్రవర్తన అలా ఉండడం ఒక కారణమైతే విదురుడు ధర్మం ఎక్కడ ఉందో అక్కడ తన మనసు ఆకర్షితమౌతుంది కాబట్టి ఎప్పుడు పాండవులకు కష్టం వచ్చినా తనకు కష్టం వచ్చినట్లు భావించి రక్షిస్తూఉంటాడు. ఇక సంజయుడు ప్రభు భక్తి కలిగినవాడు కాబట్టే ధృత రాష్ట్రుడు చెప్పిన మాటలను యథాతథంగా చెప్పినప్పటికి వారు శాంతి పొందేలాగా మాట్లాడమని చెప్పడంతో సంజయుడు ఆ విధంగా ప్రయత్నం చేసాడు. అతని మాటల్లో ప్రభుభక్తి వెల్లడి అయ్యేలాగా దుర్యోధనాదులది తప్పే దానికి ధృతరాష్ట్రుడు బాధపడుతున్నాడని తన ప్రభువు యొక్క పశ్చాత్తాపాన్ని వెల్లడించే ప్రయత్నం చేసాడు.

### *3.15.39.1. రాయబార లక్షణం – అన్వయం:*

*1. రహస్య సమాచారమును సేకరించుట*

*2. శత్రురాజ యొక్క మాటలలో, ముఖములో కండ్లలో సౌమ్యత, (దూతయొక్క) మాటల పట్ల గౌరవభావము, అతని అభిమతమును గురించి కుశల ప్రశ్న. (తన రాజును గురించిన) గుణ కథనమునందు ఆసక్తి, (సింహాసనముకు) సమీపముగా ఆసన మిచ్చుట. సత్కారము, ఇష్టాగోష్ఠులలో (దూతను గురించి), స్మరణ, (దూతలో) విశ్వాస ప్రదర్శనము,*

*ఇవి అనుకూలుడగు శత్రు రాజు లక్షణములు. (వేంకట రంగయ్య మామిడి పూడి,కౌటిల్యుని అర్ధశాస్త్రం(తెలుగు అనువాదం), పుట:40.)*

ఈ రాయబార లక్షణాలు పరిశీలిస్తే సంజయుడు తన ప్రభువు యొక్క మాటలను తెలపడమే కాకుండా ధృతరాష్ట్రుడు రాయబార విశేషాల్ని అడిగినప్పుడు పాండవుల సందేశాన్ని వివరించడంతో పాటు పాండవుల యొక్క సైనిక బలాన్ని , వారి యుద్ధ ప్రయత్నాలను గమనించి చెప్తాడు. దూతగా వెళ్ళిన సంజయుడు తగిన గౌరవాన్ని అందుకోవడమే కాకుండా అక్కడి యుద్ధవాతావరణ పరిస్థితులను తెలియజేయడం దూత యొక్క ప్రధాన లక్షణం. అవి సంజయునిలో ప్రస్ఫుటించాయి.

శ్రీ నండూరి బంగారయ్య **'ఆంధ్రమహాభారతోపన్యాసములు'** గ్రంథంలో **'తిక్కన – ఉద్యోగ పర్వము'** వ్యాసంలో సంజయుని రాయబార నైపుణ్యమును ఈవిధంగా చర్చిస్తాడు. సంజయుడు చతురభాషణుడని, ధర్మరాజు మెప్పును అందుకున్నాడని, ఎంత కఠినమైన భావమునైనా మధురంగా ప్రదర్శించగల శక్తి అతనికున్నదని చెప్తాడు అంతేకాదు కౌరవులుచేసిన దుర్మార్గాలు అనేకం ఉన్నాయి వానిని సమర్థించుట చాలా దుస్తరము. సంజయుడైనను వానిని సమర్థించడం లేదు తాను అవలంబిందలచుకున్న పక్షమున ఉన్న నీరసము అంతయు ముందే అంగీకరించడంలోనే అతని గడుసుదనముందని ఈ గుణాన్ని మనవారు concession) అను కళా ప్రావీణ్యంగా పరిగణిస్తున్నారు. అసమర్థమైన దానిని ముందుగా ఒప్పుకోవడం వలన ఇతడు చాలా ఉదార స్వభావుడో అనే భావం ఎదుటి వారికి కలిగి వారి మనసును వశం చేసుకోవడానికి సాధనమవుతున్నది. ఎదుటివారితో ఏకీభవించినట్లుగా కనబడుతూ వారిని మెల్లగా బాట తప్పించి తనవంకకు త్రిప్పుకొనుట ఇందున్న నేర్పు కౌరవపక్షమునకు అనుకూలంగా వాదించుట అత్యంత దుర్ఘటమైన సన్నివేశము ఈ దుర్బల వాదమునకు కూడా సంజయుని నైపుణ్యం అమోఘంగా శక్తిని ప్రసాదిస్తున్నది. '' **(బంగారయ్య నండూరి , ఆంధ్రమహాభారతోపన్యాసములు, పుట:139,140).**

ఈ అభిప్రాయాలను పరిశీలిస్తే ఎదుటి వారిని మాటలనే అస్త్రాలతో ఎలా వశపరచుకోవాలో తెలిసిన సంభాషణా చాతుర్యం కలిగినవాడు సంజయుడని తెలుస్తుంది.

దుర్యోధనాదులు దుష్టబుద్ధి ని తెలుపుతూనే తన ధృతరాష్ట్రుని పై నింద పడనీయకుండా ప్రస్తావించి ప్రభుభక్తిని చాటుకున్న వ్యక్తి సంజయుడు. కౌరవపక్షం తరపున సమాచారాన్ని చేరవేయడం ఒక ఎత్తైతే సాక్షాత్తు పరమాత్ముడైన శ్రీకృష్ణుని ముందు పాండవుల ముందు మాట్లాడే నైపుణ్యాన్ని ప్రదర్శిచడం ఒక ఎత్తు. ఈ ఇరుపక్షాల వారిని సమన్వయపరుచుకుంటూ తన రాయబార కార్యాన్ని పూర్తిచేసుకున్నాడు సంజయుడు.

బి.వి.యస్ మూర్తి **"తిక్కన భారతావలోకనం"** గ్రంథంలో సంజయ రాయబారం గురించి ఈ విషయాలను చర్చించాడు.

ఉపన్యాసాలు రెండు విధాలుగా ఉంటాయి. చెప్పదలచుకున్న విషయాన్ని చివరి వరకు దాచిపెట్టడం ఒక పద్ధతి ముందుగానే చెప్పేయడం మరొక పద్ధతి. సంజయ రాయబారం మొదటి పద్ధతికి చెందినది. శ్రీకృష్ణుని రాయబారం రెండవ పద్ధతికి చెందినది. దుర్యోధనునికి భీష్ముడు, ద్రోణుడు మహర్షులు బుద్ధి చెప్పడానికి ప్రయత్నిస్తారు. విషయమొక్కటే అయినా ఒకరు చెప్పినట్టు ఇంకొకరు చెప్పరు. చెప్పే వ్యక్తులను బట్టి విధానం మారుతూ ఉంటుంది.. శ్రీకృష్ణుని ఉపన్యాసం సభని సమ్మోహపరచడానికైతే మిగిలిన వారి ఉపదేశాలు వ్యక్తిని సంస్కరించడానికి చేయబడ్డాయి. కాబట్టి ప్రయోజనాన్ని బట్టి శైలికూడా ఉంటుంది.

సంజయ రాయబార సమయంలో ధృతరాష్ట్రుని మాటలు సభాసదులకు ఒక విధంగాను సంజయునికి ఒక విధంగాను అతని ఆంతరంగానికి ఒక విధంగాను అవడం పరిశీలించదగినది. అది వాచ్యం చేత సిద్ధించినది కాదు. **'కావ్యస్యాత్మ ధ్వనిః అన్న పూర్వాచార్చుల మతానికి అద్వితియమైన నిరూపణం ఈ ఉద్యోగ పర్వం నిర్వహణం**''( **మూర్తి, బి.వి.యస్. తిక్కన భారతాలోకనం,పుట:17.**).

వీరు చెప్పిన మాటలను పరిశీలిస్తే రాయబారాలలోని సారాంశం ఒక్కటే అయినప్పటికి చెప్పే వ్యక్తుల సంభాషణ పద్ధతి గాని, హావభావాలలోగాని, వాక్చాతుర్యం లో గాని విభిన్న పార్శ్వాలను గమనించవచ్చు. వారు చెప్పిన మాటలు ఒక్కో వ్యక్తికి ఒక విధంగా అర్థమవుతాయి. ఒక ఉద్దేశ్యంతో రాయబారం జరిపినా అది అనేక పరిణామాలకు దారితీస్తుందని వీరి మాటల్లో తెలుస్తుంది.

## 3.16. శ్రీకృష్ణ రాయబారం:

సంజయుడు వెళ్ళగానే ధర్మరాజు తన తమ్ముళ్లను కొడుకులను సామంత రాజులను తీసుకొని శ్రీకృష్ణుని తమ అభిప్రాయాలను కురుసభలో మాట్లాడమని వేడుకుందాం అంటాడు.

సంస్కృత భారతంలో

ధర్మరాజు భీమసేన నకుల సహదేవ విరాట ద్రుపద కేకయ రాజ మహారథులను కలసి మనము కృష్ణుని దగ్గరకు వెళ్లి కౌరవ సభకు వెళ్లి రమ్మని ప్రార్థిస్తామని అంటారు. ఆంధ్ర మహాభారతంలో కొడుకులను కూడా తీసుకొని వెళ్ళినట్లు ఉంటుంది.

**ఆంధ్ర మహాభారతంలో**

మహానుభావా! అనే సంబోధన చేసి ధర్మరాజు కష్టాలను ఎరిగించి శుభాలను సమకూర్చడానికి సమర్థుడైన నిన్ను మా తండ్రి నీవే దిక్కుగా చూపించి పాండు మహారాజు వెళ్లిపోయాడని ఉంటుంది.

**సంస్కృత భారతంలో**

**మిత్ర వత్సలా!** అని మొదట సంబోధిస్తాడు. ఈ సంబోధనలో ధర్మరాజు శ్రీకృష్ణుని మిత్రునిగా భావించి సహాయం అర్థించాడు. అందుకే ధర్మరాజు మిత్రుల సహాయం కోరవలసిన సమయం ఆసన్నమైంది. మమ్మల్ని ఆపదల నుండి గట్టెక్కించడానికి నీవు తప్ప మరెవ్వరూ కనిపించడం లేదు అంటాడు.

సాధారణంగా కుటుంబంలో తీవ్రమైన ఆపద కలిగినప్పుడు బంధువుల కంటే ముందు మిత్రులే గుర్తుకు వస్తారు. అదే భావము ధర్మరాజుకు స్ఫురించినట్లు తెలుస్తుంది. ఆ మిత్రుడు కూడా ఏ సహాయం చేయడానికి అయినా సిద్ధంగా ఉండాలి." నీవు దక్క అన్యథా శరణం నాస్తి" అనే విధముగా నీవు తప్ప మాకు మరెవ్వరూ కనిపించడం లేదని చెప్తున్నాడు. రెండవసారి

**మాధవా!** అని సంబోధించాడు.

మాధవుడంటే లక్ష్మీదేవిని ధరించిన వాడు.

ధర్మరాజు వచ్చింది రాజ్యలక్ష్మి ని అనుగ్రహింప చేయమనే భావము ఈ సంబోధనలో కలుగుతుంది. అందుకే నిన్ను ఆశ్రయించి నిర్భయులమై నిరుపయోగమైన గర్వాన్ని ప్రదర్శిస్తున్న దుర్యోధనుని ఆయన మంత్రులను కూడా స్వయంగా అర్థిస్తాము అంటాడు. తర్వాత సంబోధనలో

**శత్రుదమనా!** అంటే శత్రువులను నశింప చేసేవాడని సంబోధనలో కంసాది దానవులను సంహరించి వృష్టి వంశస్తులను అన్ని ఆపదల నుండి రక్షించినట్లే పాండవులను కూడా నీవు రక్షించాలి. మహాభయము నుండి మమ్మల్ని కాపాడమని అంటాడు. ఇందులోని అంతరార్థము అవసరమైతే శత్రుసంహారము జరిపించైనా పాండవులను రక్షించి మాకున్న భయాల నుండి కాపాడమని చెప్తున్నట్లు అర్థం అవుతుంది.

ఆంధ్ర మహాభారతంలో

*"ఆపద గడవం బెట్టగ నోపి శుభంబైనదాని నోడకూర్పను మా*

*కీపుట్టువునకుబాండు! క్ష్మాపాలుడు నిన్ను జూపి చనియె మహాత్మా!*

*( ఆంధ్ర మహాభారతం ఉద్యోగపర్వం,తృతీయాశ్వాసం అనే పద్యం, పుట,282).*

అనే పద్యం పైన ధర్మరాజు చెప్పిన మాటలకు సమానమైన భావార్థాన్ని కలిగిస్తుంది.

ధర్మరాజు మాటలకు **శ్రీకృష్ణుడు 'నీ పంచిన యట్ల చేయంగలవాఁడ నెయ్యం తలంపు సెప్పు"** అని అంటాడు ( ఆంధ్ర మహాభారతం, ఉద్యోగ పర్వం, తృతియాశ్వాసం, వచనం 8. పుట:283).

సంస్కృత భారతంలో శ్రీకృష్ణుడు ధర్మరాజు అభ్యర్థనను గ్రహించి

**"అయమస్మి మహాబాహో బ్రూహి యత్ తే వివిక్షితమ్**

**కరిష్యామి హి తత్ సర్వం యత్ త్వం వక్ష్యసి భారత" ( సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 72 వ అధ్యాయం, 5 వ శ్లోకం).**

అంటే నేను సర్వదా సంసిద్ధుడినే అనడంలో నీవనుకున్న ప్రయత్నాలన్నింటిని సాధించడానికి సంసిద్ధుడనే సంధి చేయాలనుకుంటే చేయిస్తాను యుద్ధమే నిశ్చయమైన దానికి సహకరించడానికి సిద్ధంగానే ఉన్నాను. నీవు ఏమి చెప్పాలనుకుంటున్నావో చెప్పు నీవు చెప్పినదంతా నేను చేస్తానని చెప్తాడు.

### 3.16.1. ధర్మరాజు శ్రీకృష్ణునికి తన అభిప్రాయాలను తెలుపుట:

ధర్మరాజు శ్రీకృష్ణుని రాయబారిగా గ్రహించి తాను చెప్పదలచిన విషయాలు చెప్పడం ప్రారంభించాడు. కృష్ణా కొడుకులతో కలిసి ధృతరాష్ట్రుడు చేయదలచిన పనిని నీవు కూడా విన్నావు సంజయుడు నాతో చెప్పినదంతా ధృతరాష్ట్రుని మనస్సనే సంజయుడు బయటపెట్టాడు. ‘‘

*యథోక్తం దూత ఆచష్టే వధ్యఃస్యాదన్యథాబ్రువన్’’ (సంస్కృత భారతం,ఉద్యోగ పర్వం, 72 వ అధ్యాయం, 7 వ శ్లోకం.).*

*దూత తన ప్రభువు చెప్పిన మాటలనే చెప్తాడు దానికి భిన్నంగా మాట్లాడితే మరణ శిక్షకు కూడా అర్హుడవుతాడు.*

ఈ విషయాలను చూస్తే ధృతరాష్ట్రుని మనసు సంజయుని మాటల ద్వారా బయటపెట్టడం రాజు ఏమి చెపితే దానిని యధాతథంగా చెప్పడం దూత లక్షణమని అలా కాకుండా రాజు అనుమతితో సంబంధం లేకుండా రాయబార కార్యాన్ని తన స్వంత ఆలోచనతో మాటలను మార్చి చెపితే ఒక్కోసారి రాయబారికి ఉరి శిక్ష విధించే అవకాశం ఉంటుందని తెలుస్తుంది. అంతే కాకుండా ధర్మరాజు రాయబార లక్షణాలను తెలిసినవాడుగా ఇక్కడ కనబడతాడు.

ఈ సంజయుడు ధృతరాష్ట్రుని ఆత్మ అని చెప్పినప్పుడు రాయబారి చెప్పిన మాటలు అతనివి కావు అతను చెప్పి పంపిన రాజువి. చూడడానికి అతనే మాట్లాడుతున్నట్లనిపిస్తుంది ఆ మాటలు శాంతివైనా కావచ్చు. క్రోధానికి సంబంధించిన వైనా కావచ్చు రాయబారి ఆ మాటల తీరుని బట్టి ఆంగికాభినయం ప్రదర్శించినప్పటికి రాయబారిని అవమాన పరచకూడదు రాయబారి కేవలం సందేశాన్ని అందించే వ్యక్తి తన ప్రభువు అనుమతితో మాత్రమే సొంత అభిప్రాయాలను వెల్లడిస్తాడు.

### 3.16.2. ధృతరాష్ట్రుని లోభత్వాన్ని తెలుపుట:

ధర్మరాజు సంజయుని మాటల ద్వారా ధృతరాష్ట్రుని బుద్ధి ఎటువంటిదో గ్రహించాడు. రాజైన వాడికి ఇటువంటి నిశితమైన పరిజ్ఞానం సూక్ష్మాన్ని గ్రహించడం

అవసరం అటువంటి జ్ఞానం కలిగిన వాడే రాజుగా విరాజిల్లడానికి అర్హుడు ధర్మరాజు మాటలు ఆ విషయాన్ని స్పష్టపరుస్తాయి. అందుకే ధర్మరాజు ధృతరాష్ట్రుడు రాజ్యభాగం ఇవ్వకుండానే శాంతికి ప్రయత్నం చేస్తున్నాడని చెప్తాడు. అంతేకాకుండా ధృతరాష్ట్రుడు లోభి స్వధర్మాన్ని గమనించకుండా పుత్ర వ్యామోహంతో సుయోధనుని మాటలనే వింటాడు. మాతో కపట ప్రేమను ఒలకబోస్తున్నాడని ధృతరాష్ట్రుని మనసును గ్రహించి కృష్ణునికి చెప్తున్నాడు.

### 3.16.3. ధర్మరాజు దైన్యం:

*ధర్మరాజు నేను నా తల్లిని మిత్రులను కూడా సరిగ్గా పోషించలేకపోతున్నాను. ఇంత కన్నా బాధాకరమైన విషయం ఏముంటుంది. (సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 72 వ అధ్యాయం, 13 వ శ్లోకం).*

ఈ మాటలను ధర్మరాజు అనడంలో ధర్మరాజు యొక్క దైన్యం వ్యక్తమవుతుంది. అంతేకాకుండా మేము రాజ్యాన్ని కోరేది విలాసంగా జీవించడానికి కాదు నన్ను నమ్ముకున్న వారిని కూడా పోషించలేని పరిస్థితి ఏర్పడింది. దీని కోసమైనా రాజ్య భాగం సంపాదించాలనే భావం ధర్మరాజు మాటల్లో తెలుస్తుంది. దాని కోసంగా అవి స్థలం, వృక స్థలం , మాకంది, వారణావతం ఈ నాలుగు నీకు ఇష్టమైనది మరొకటి కలిసి అయిదు నగరాలను కాని గ్రామాలను కాని మాకిమ్ము కురువంశం నశించకూడదనే కాదు నేను అడిగింది కాని దుర్యోధనుడు దానికి కూడా అంగీకరించడం లేదు . సర్వాధికారాలు తనవేనని భావిస్తున్నాడు. ఇంత కన్నా భయంకరమైనది లేదు

ఈ మాటలను గమనిస్తే ధర్మరాజు తమ ఐదుగురు అన్నదమ్ములకు ఐదు ఊర్లు ఇవ్వడానికి అంగీకరించినా మా ప్రాంతాలను అభివృద్ధిచేసుకుని సంతోషంగా జీవించగలము కాని దుర్యోధనుడు దానికి అంగీకరించే మనసు కాదు ఓర్వలేనితనం ఈర్ష్య, అసూయ లక్షణాలు దుర్యోధనునిలో ఉండడం చేత మా అభివృద్ధికి అతని మనసే అడ్డుగా ఉంటుంది. అనే భావన ధర్మరాజు మాటల్లో వ్యక్తమవుతుంది. అంతే కాకుండా అంతకుముందే నిర్జీవమైన అడవులను ధృతరాష్ట్రుడు ధర్మరాజుకు ఇచ్చినప్పుడు వారు ఇంద్రప్రస్థపురం గా తమ వైభవాన్ని నలుదిక్కులు వ్యాపించేలా కీర్తిగడించారు. మరల

ఇప్పుడు ఐదుమందికి ఐదు ఊళ్ళు ఇస్తే వారికి తిరుగుండదని దుర్యోధనుడు భావించి ఉంటాడు అందుకే యుద్ధంలో పాండవులను గెలిచి రాజ్యాన్ని చేజిక్కించుకోవాలని భావిస్తున్న అతని మనసు ఎన్ని రాయబారాలు జరిపినా మారదు.

ధర్మరాజు సంస్కృత భారతంలో శ్రీకృష్ణునితో చెప్పిన ఈ మాటలను గమనిస్తే

*“కులే జాతస్య వృద్ధస్య పరవిత్తేషు గృద్ధ్యతః*

*లోభః ప్రజ్ఞాన మహంతి ప్రజ్ఞాహంతి హతాహ్రియమ్” (సంస్కృత భారతం, ఉద్యోగపర్వం, 72 వ అధ్యాయం, పుట:504).*

ధర్మరాజు కృష్ణుని తో అన్న ఈ మాటలను పరిశీలిస్తే ధర్మరాజు పరోక్షంగా ధృతరాష్ట్రున్ని , దుర్యోధనుని తిట్టినట్లు తెలుస్తుంది. ఉన్నత వంశంలో పుట్టినప్పటికి వార్ధక్యంలో వచ్చినప్పటికి పరుల సొమ్ముకు ఆశపడితే ఆలోచిత్వం ఆలోచనను నశింపచేస్తుంది. నశించిన వివేకం సిగ్గును కూడా లేకుండా చేస్తుంది. ఇక్కడ పరుల సొమ్ముకు ఆశపడితేనే అది వారిని నశింపచేస్తుంది. అలాంటిది బంధువులకు న్యాయంగా మాకు రావలసిన ధనాన్ని ఇవ్వకపోవడమనేది వారి లోభత్వానికి కారణంగా చెప్పవచ్చు అది సంపదను కూడా నశింపచేస్తుంది.

### 3.16.4. ధర్మరాజు సంపద గొప్పతనాన్ని వివరించుట:

ధర్మరాజు ఇంకా ఈ విధంగా అంటాడు సిగ్గులేనితనం ధర్మాన్ని బాధిస్తుంది ధర్మం నశించి సంపదలను నశింపచేస్తుంది. సంపదలు నశిస్తే మనుషుడు నశించినట్లే ఎందుకంటే మనిషికి డబ్బులేకపోవడమే కారణం. పూలు పండ్లు లేని చెట్టుకు పక్షులు దూరమైనట్లు డబ్బులేని వాని నుండి దాయాదులు, బ్రాహ్మణులు వెళ్ళిపోతారు. ప్రేత శరీరం నుండి ప్రాణాలు వెళ్లిపోయినట్లు పతితుని నుండి మనుష్యులు దూరమైనట్లు నా దాయాదులు కూడా నా నుండి దూరమవుతారు. అది నాకు మరణంతో సమానం ( **సంస్కృత భారతం, ఉద్యోగపర్వం, 72 వ అధ్యాయం,).**

ధర్మరాజు పలికిన ఈ మాటల్లోని అంతరార్థాన్ని పరిశీలిస్తే ధనం లేకపోతే తనను నమ్ముకున్న వారంతా దూరమైపోతారు కాబట్టి ధనం కావాలి, ధనం కావాలి అంటే తన రాజ్యం తాను సంపాదించాలి. రాజ్యం సంపాదించాలంటే దుర్యోధనాదులు దానికి

అంగీకారయోగ్యంగా లేరు. ఇక చివరి అవకాశం యుద్ధమే జరగక తప్పదు. అనే భావన వ్యక్తమవుతుంది. తనను నమ్ముకున్న వారు దూరమవడమంటే మరణించడంతో సమానం కదా యుద్ధం గెలిచి వచ్చిన రాజ్యం వలన లాభమే కాని బంధువులను హింసించడం వలన కలిగే బాధ అది కూడా జీవించి ఉన్నా జీవించిలేనట్లుగానే అనిపిస్తుంది.

*“ నాతః పాపీయసీం కాంచిత్ అవస్థాం శంబరో2బ్రవీత్*

*యత్ర నైవాద్య న ప్రాతః భోజనం ప్రతి దృశ్యతే”*

*ధనమాహుః పరం ధర్మం ధనే సర్వం ప్రతిష్ఠితమ్”(సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం,72 వ అధ్యాయం,22,23 శ్లోకాలు).*

ఇప్పటికి రేపటి ఉదయానికి భోజనం లేకపోతే ఆ దారిద్ర్యం కన్నా దుఃఖకరమైన అవస్థ లేదని శంబరుడన్నాడు. ధనమే ఉత్తమ ధర్మ సాధనమంటారు. అంతా ధనంలోనే ఉంది లోకంలో ధనవంతులే బ్రతుకుతారు. ధనహీనులు మరణించిన వారి క్రింద లెక్కే.

ధర్మరాజు ధనం గురించి మాట్లాడిన ఈ మాటలు ధర్మరాజుకు రాజ్యకాంక్షను సూచిస్తుంది ధనం యొక్క ప్రాధాన్యతను చెప్పడంలో ధర్మబద్ధంగా సంపాదించిన ధనంలో ఆ ధనాన్ని తన వారిని పోషించడంలో కలిగే ప్రయోజనాన్ని సంతోషాన్ని రుచి చూసినవాడు ధర్మబద్ధంగానే రాజ్యాన్ని దక్కించుకోవాలని చూస్తాడు. అలా కుదరని పక్షంలో క్షత్రియ ధర్మం యుద్ధంతోనైనా రాజ్యం సంపాదించుకోవడం తప్పదు అనే భావన ధర్మరాజులో కలిగినట్లు తెలుస్తుంది.

*ఏతామవస్థాం , ప్రాప్యైకే మరణం వవ్రిరే జనాః*

*గ్రామాయైకే వనాయైకే నాశాయైకే ప్రవవ్రజుః” (సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 72 వ అధ్యాయం.25 వ శ్లోకం)*

*ఈ దరిద్రం వలన ధనం లేకపోవడం  వలన ఎందరో ఆత్మహత్యకు పాల్పడతారు. కొందరు గ్రామాన్ని విడిచి వలసలు వెళ్తారు. మరికొందరు అరణ్యాలకు వెళ్తుంటారు. ఇంకొందరు ప్రాణత్యాగం చేయాలని ఇల్లు విడిచి పోతుంటారు. కొంతమంది పిచ్చి వాళ్ళవుతారు. మరి కొందరు డబ్బు కోసం ఇతరులకు దాస్యం చేస్తుంటారు.*

ఈ మాటలను పరిశీలిస్తే ధర్మరాజు ధనాన్ని కోల్పోవడం వలన అతనికి కలిగిన కష్టాలను గుర్తు చేస్తున్నట్లు తెలుస్తుంది. ధనం కోల్పోవడం వలనే అరణ్య వాసాలు చేయవలసి వచ్చిందని, ధనం లేకపోవడం వలనే విరటుని దగ్గర అజ్ఞాతంగా దాస్యం చేయవలసి వచ్చిందనే అభిప్రాయం వ్యక్తమయ్యేలా శ్రీకృష్ణునికి చెప్తాడు.

ఇంకా ధర్మరాజు ఇలా అంటున్నాడు.

*'' న తథా బాధ్యతే కృష్ణ ప్రకృత్యా నిర్ధనోజనః*

*యథా భద్రం శ్రియం ప్రాప్య తయా హీనః సుఖైధితః (సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 72 వ అధ్యాయం, 29 వశ్లోకం).*

శుభప్రదమైన ఐశ్వర్యాన్ని పొంది సుఖాలతో అభివృద్ధి చెంది తర్వాత దానిని కోల్పోయిన వాడు పడే బాధ పుట్టుకతో దరిద్రుడైన వాడు ఎప్పుడూ పడడు.

ఇందులో కూడా వ్యంగ్య భావనే గోచరిస్తుంది పుట్టుకతోనే దరిద్రుడు అయినవాడు ఎక్కువ బాధపడడు వచ్చిన దానిలో సంతృప్తి చెంది జీవించేస్తూ ఉంటాడు అలా కాకుండా ధనంతో జీవనాన్ని గడిపి సుఖసంతోషాలు అనుభవించిన వ్యక్తి ఒక్కసారిగా ఆ ధనాన్ని కోల్పోతే అది చాలా భరించరాని బాధాకరమైనది అంటాడు.

ఇక్కడ పూర్వపు పరిస్థితిని ధర్మరాజు గుర్తు చేసుకుంటున్నట్లు ఉంటుంది ధర్మరాజు ధృతరాష్ట్రుడు ఇచ్చిన ఖాండవ వనాన్ని ఇంద్రప్రస్థంగా మార్చి ఎన్నో విజయాలు సాధించి ధనాన్ని వృద్ధి చేసి దానాలు ఇచ్చి అనేక మంది రాజుల కానుకలు అందుకున్న ధర్మరాజు ప్రస్తుతం ఏమీ లేని వాడిగా మిగిలిపోయాడు దానికి కృంగిపోతూ తన బాధను శ్రీకృష్ణునికి తెలుపుతున్నాడు

శ్రీకృష్ణునితో అంటున్నాడు ధర్మరాజు నేను ఏ విధంగా రాజ్యాన్ని కోల్పోయాను రోజులు ఎంత కష్టంగా గడుపుతున్నాను ఇదంతా నీవు ప్రత్యక్షంగా చూస్తూనే ఉన్నావని చెప్తాడు అంతేకాకుండా

*"తే వయం నశ్రియం హాతుమ్ అలం న్యాయేన కేనచిత్*

*అత్ర నోయతమానానాం వధశ్చేదపి సాధుతత్ " ('' సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 72 వ అధ్యాయం,41 వ శ్లోకం)*

ఏ విధంగా చూసినా పిత్రార్జితమైన సంపత్తిని విడిచిపెట్టడం వ్యక్తం కాదు సాధించుకునే ప్రయత్నంలో మేము మరణించినా అది సరైనదే అంటాడు. ధర్మరాజు చెప్పిన ఈ మాటల్లో తన తండ్రి ఆస్తిని మేము ఎప్పటికీ విడిచిపెట్టం అలా విడిచిపెట్టడం సరైనది కాదు దానిని సాధించాలంటే యుద్ధం జరగవలసిందే ఈ క్రమంలో మేము మరణించినా అది సరైనదేనని చెప్తున్నాడు.

### 3.16.5. ధర్మరాజు యుద్ధం వలన కలిగే అనర్థాలను తెలుపుట:

పాండవులు కౌరవులు ప్రశాంతంగా ఆ సంపదను సమానంగా అనుభవించాలనేది మొదటి లక్ష్యమని రెండవది కౌరవులను సంహరించి రాజ్యాన్ని చేజిక్కించుకోవడం చివరి లక్ష్యమని చెప్తూ యుద్ధం క్రూరమైన పని వినాశనం ద్వారా మాత్రమే సిద్ధిస్తుందని చెప్తాడు.

శత్రువులు నీచులైన ఏ సంబంధం లేని వారైనా చంపడం తగని పని ఆ పరిస్థితిలో దాయాదులైన వారిని చంప చూపడం తగిన పని కాదు జ్ఞాతులంతా మిక్కిలి పెద్దవారు సహాయకులు మా గురువులు వారిని వధించడం ఎంతో పాపం యుద్ధం వల్ల ఏం శుభం కలుగుతుంది మాకు అని ధర్మరాజు చెప్తాడు ఇదే ప్రస్తావన ఆంధ్ర మహాభారతంలో ఈ విధంగా కనబడుతుంది

*ఉ. అక్కట! లాఁతులైనఁ బగఱైనను జంపన కోర నేల? యొం*
*డొక్క తెఱంగు లేదె? యది యొప్పదె? బంధు సుహృజ్జనంబు లా*
*దిక్కున నున్నవారు గణతింపక సంపదకై వధించి దూ*
*ఱెక్కుట దోషమందు టను నీ దురవస్థల కోర్వ వచ్చునే?' (ఆంధ్ర మహాభారతం, ఉద్యోగ పర్వం, తృతీయాశ్వాసము, 13 వ పద్యం,).*

ధర్మరాజు ఇప్పటివరకు కౌరవులను సంహరించైనా రాజ్యాన్ని దక్కించుకోవాలని చెప్తాడు అది క్రూరమైన భావంతో కూడి ఉందని దాని వలన బంధుమిత్రులు దూరమవుతారని చెప్తాడు ఇప్పుడు తన క్షత్రియ ధర్మాన్ని గుర్తు చేస్తున్నాడు.

### 3.16.6. ధర్మరాజు క్షత్రియ ధర్మాన్ని తెలుపుట:

*"పాపః క్షత్రియ ధర్మో 2యం వయంచ క్షత్ర బాంధవః*

*సనః స్వధర్మో 2 ధర్మోవా వృత్తి రన్యావిగర్హితా" ( సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 72 వ అధ్యాయం, 46 వ శ్లోకం).*

యుద్ధం చేయడమని క్షత్రియ ధర్మం పాపానికి కారణమే అవుతుంది కానీ మేము క్షత్రియులం కాబట్టి అధర్మమైన సరే క్షత్రియ ధర్మము మాకు స్వధర్మమే అవుతుందని దానిని విడిచిపెట్టి మరొక వృత్తిని స్వీకరించడం నిందకు గురవుతుందని చెప్తాడు.

ఈ మాటల్లో ధర్మరాజు క్షత్రియ ధర్మాన్ని విడిచిపెట్టి యుద్ధం చేయకుండా మరో వృత్తిని స్వీకరించి జీవించడం ధర్మమైన పద్ధతి కాదని అంటాడు అంటే యుద్ధానికి సుముఖత చూపుతున్నట్లు ఇక్కడ తెలుస్తుంది.

యుద్ధం నిత్య కలహం దాని వలన ఎన్నో ప్రాణాలు పోతాయి

*"బలంతు నీతి మాధాయ యుధ్యే జయపరాజయౌ " ( సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 72 వ అధ్యాయం, 49 వ శ్లోకం).*

నైతిక బలంతో యుద్ధాన్ని చేస్తాను గెలుపు ఓటమి దైవాధీనం అంటాడు. ఇక్కడ ధర్మరాజు యుద్ధమైతే చేస్తాను కానీ గెలుపు ఓటములు అనేవి మన చేతుల్లో లేవు అన్నీ భగవంతుడికే వదిలేస్తున్నాను అంటాడు. మాట్లాడుతున్నది శ్రీకృష్ణునితో శ్రీకృష్ణుని దైవంగా భావించే వాళ్ళు ధర్మరాజు నేనైతే యుద్ధం చేస్తాను కానీ గెలుపును ఇచ్చేది మాత్రం నీవే అన్నట్లు ఇందులోని ఆంతర్యం కనబడుతుంది.

ఆంధ్ర మహా భారతము లో

*''క. జయమగు నోడుదు మను ని –*

*శ్చయ మొక్కఁడు లేదు, వినుము! సమరమునఁబరా*

*జయము మరణంబు కంటె హ్రా –*

*దయపుట భేదనము సేయుఁదథ్యం బనఘా!'' ( ఆంధ్రమహాభారతం, ఉద్యోగ పర్వం, తృతీయాశ్వాసం, 18 వ పద్యం,).*

యుద్ధంలో గెలుస్తామని కానీ ఓడిపోతామని కానీ నిశ్చయంగా చెప్పడానికి లేదని యుద్ధంలో అపజయమే వస్తే మరణం కంటే గుండెను బద్దలు కొట్టుకునేంత బాధను కలిగిస్తుందని అంటాడు. యుద్ధం అన్ని అనర్థాలకు కారణం అవుతుంది తెలివిగలవారు శత్రువులను అణిచివేసే ఉపాయాన్ని ధైర్యాన్ని వహిస్తాడో వాడు ప్రశాంతంగా నిద్రపోతాడు.

ఒకవేళ శత్రుత్వం ఏర్పడితే అది ఎలా ఉంటుందో చెప్తూ పామున్న ఇంటిలో కాపురం ఉన్నట్లు ఒక నిమిషం కూడా మనసు విశ్రాంతి ఉండదు కాబట్టి ఎవరితోనూ దీర్ఘకాలం శత్రుత్వం ఉండకూడదని చెప్తాడు.

విరోధాన్ని మనిషి వేయడం గొప్పదైన పని అని చెప్తూ

*చ. పగ యడఁగించు టెంతయు శుభం బది లెస్స యడంగునే పగం*
*బగ? వగ గొన్న మార్కొనక పల్కక యుండఁగ వచ్చునే? కడుం*
*దెగ మొదలెత్తిపోవఁగ బగ దీర్పఁగ వచ్చినఁ గ్రౌర్య ముందు నే*
*మి గతిఁ దలంచినం బగకు మేలిమి లేమి ధ్రువంబు గేశవా ! ( ఆంధ్ర మహాభారతం, ఉద్యోగ పర్వం, తృతీయాశ్వాసము, 21 వ పద్యం, .)*

ఈ పద్యమంతా పగ వలన అనర్థమే తప్ప లాభం ఉండదు అనే విషయాన్ని ధర్మరాజు చెపుతున్నాడు. పగను నిర్మూలించే ప్రయత్నం చేయడం సాహసంతో కూడిన పని అని అది దారుణమైన కృత్యాలకు దారితీస్తుందని విరోధం వల్ల విరోధం అనిగిపోదని ధర్మరాజు చెప్తాడు.

సంస్కృత భారతం లోని ఈ మాటలే ఉన్నప్పటికీ శత్రుత్వాన్ని అగ్నితో పోల్చడం కనబడుతుంది.

*"న చాపి వైరం వైరేణ కేశవ వ్యుపశామ్యతి*
*హవిషాగ్నిర్యథా కృష్ణ భూయ ఏవాభివర్ధతే" (సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 72 వ అధ్యాయం, 63 వ శ్లోకం ).*

మండుతున్న అగ్నిలో ఆహుతులను వేస్తే అది మరీ ప్రజ్వరిల్లినట్లు శత్రుత్వంతో శత్రుత్వం పెరుగుతుందే కానీ ఉపశమించదని చెప్తాడు.

ఆంధ్ర మహాభారతంలో శత్రుత్వం వలన ప్రయోజనం ఉండదు. నేను సంపద కావాలి యుద్ధం జరగకూడదని కోరుకుంటున్నాను అంటాడు ఇక్కడ ధర్మరాజుకి రాజ్యసంపద వాళ్ళు దక్కించుకోవాలి యుద్ధం జరగకుండా అది నెరవేరాలి అంటాడు. ఈ రెండింటిని దృష్టిలో పెట్టుకొని రాయబారం నడిపే బాధ్యతను శ్రీకృష్ణునిపై ఉంచుతాడు.

*చ . మనమునఁ బక్షపాతగతి మాదెస మానుము ధర్మనీతి వ*
*ర్తనముల రెండు దిక్కుల హితంబును బెంపును గల్గునట్టి చొ*
*ప్పున విదురాది సజ్జనుల బుద్ధికి రా నుచితంబుతోడి మె*
*ల్పునఁ బరుసందనంబునను భూపతులెల్ల నెఱుంగ నాడు మీ! (ఆంధ్ర మహాభారతం, ఉద్యోగపర్వం, తృతీయాశ్వాసం, 23 వ పద్యం).*

ధర్మరాజు శ్రీకృష్ణునితో మా విషయంలో పక్షపాతం చూపకుండా ధర్మమును అనుసరించి ఇరువైపుల వారికి మేలు కలిగేలా విదురులు మొదలైన వారు అంగీకరించే విధంగా మృదువుగాను అవసరమైతే కఠినంగానూ ఉంటూ ఇరుసభలు రాజులందరూ గ్రహించే విధంగా మాట్లాడమని చెప్పినప్పుడు రాయబారి ఎటువంటి విషయాలు దృష్టిలో పెట్టుకొని మాట్లాడలో ధర్మరాజు చెప్తాడు.

### 3.16.7. ధర్మరాజు చెప్పిన దూత లక్షణాలు:

ధర్మరాజు దూత లక్షణాలు తెలిపేటటువంటి పద్యం ఇది
కృష్ణుడు ధర్మం ఎటువైపు ఉందో వారి పక్షాన ఉండి విజయం చేకురుస్తాడని ధర్మరాజుకు తెలుసు వీరు నా వారు వీరు కాదు అనే భావనను వదిలి యుద్ధ ప్రసక్తి లేకుండా అందరికీ ఆమోదయోగ్యమైన విషయాలను తెలుపమని ఈ మాటలోని ఆంతర్యం

ఈ పద్యంలోని ఆంతరంగికాన్ని సంపాదకులు ఈ విధంగా విశ్లేషిస్తారు

1. మనసులో పక్షపాత గతి మానాలి.
2. ధర్మ నీతి పథంలో తప్పకుండా నడవాలి.
3. ఉభయ పక్షాలకు మేలు అభ్యుదయం కలిగేటట్లు మాట్లాడాలి.
4. సభ్యులలో విదురాది సత్పురుషులకు సమ్మతమయ్యేటట్లు మాట్లాడాలి.

5. అవసరాన్ని బట్టి మెత్తగాను కఠినంగాను మందలిస్తున్నట్లుగాను సంభాషణ నిపుణంగా సాగించాలి

6. సభలో ఉన్న రాజులందరూ పాండవుల ఉద్యోగాన్ని సక్రమంగా తెలుసుకొనగలిగేటట్లు మాట్లాడాలి.

దూతకు ఉండదగిన లక్షణాలు అన్ని ధర్మరాజు చెప్పాడు శ్రీకృష్ణుడు ఆచరించి చూపాడు.(ఆంధ్రమహా భారతం, తృతియాశ్వాసం, ఉద్యోగ పర్వం, 23వ పద్యం ).

### 3.16.8. **ధర్మరాజు యుద్ధాన్ని కుక్కల కోట్లాటగా పోల్చడం:**

ధర్మరాజు యుద్ధాన్ని కుక్కల కోట్లాటగా పండితులు భావిస్తారని చెప్తాడు.

*" లాంగూలచాలనం క్ష్వేడా ప్రతివాచో వివర్తనం*

*దంత దర్శన మారావః తతో యుద్ధం ప్రవర్తతే "*

*(సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 72 వ అధ్యాయం, 71 వ శ్లోకం).*

తోకను ఊపడం గుర్రె పెట్టడం, బదులు అరవడం ఒకదాని చుట్టూ మరొకటి తిరగడం దంతాలు చూపించడం మొరగడం ఆపై కలయబడటం ఇది కుక్కలు గొడవ చేసుకునే పద్ధతి వాటిలో ఎక్కువ బలం కలది గెలిచి ఆ మాంసాన్ని తింటుంది మనుషుల్లో కూడా ఇదే స్థితి విశేషం ఏమీ లేదని చెప్తాడు.

ఏ విధంగా అయితే కుక్కలు ఆహారం కోసం బలాబలాలు నిరూపించుకునే ప్రయత్నం చేసి ఆహారాన్ని దక్కించుకుంటాయో అలాగే మనుషులు కూడా రాజ్యం మాకేదక్కాలని కాలుదువ్వి మరి కోరుకుంటున్నారు దాని వలన అరుచుకోవడం విరుచుకు పడటం క్రోధంతో ఊగిపోవడం చేసి చివరకు అపజయం కలుగుతుందనే విషయాన్ని గ్రహించి పారిపోవడం దాక్కోవడం లాంటివి చేస్తారు అనే భావం ఈ మాటల్లో స్పష్టం అవుతుంది. గమనించి చూస్తే యుద్ధం యుద్ధం అని మాట్లాడిన వాడు దుర్యోధనుడు అతని చేష్టలు గుర్తుకు వస్తాయి యుద్ధ కాంక్షతో రాయబారిగా వచ్చిన కృష్ణుడిని బంధించాలని చూసాడు గదా యుద్ధంలో తనంతవాడు లేడని గర్వపడ్డాడు చివరకు యుద్ధంలో పోరాడలేక మడుగులో దాక్కున్నాడు ఇలాంటి సంఘటనలు పై పద్యంలో ప్రస్ఫుటించేలా ఉన్నాయని భావించవచ్చు.

### 3.16.9. ధర్మరాజు శ్రీకృష్ణునికే కార్యభారాన్ని అప్పగించుట:

ధర్మరాజు ఇంకా ఇలా చెప్తున్నాడు కృష్ణునితో దృతరాష్ట్రునికి పుత్ర ప్రేమ ఎక్కువ మా విన్నపాన్ని పరిహాసిస్తాడు ఈ స్థితిలో ఏమి చేస్తే బాగుంటుందో నీవు అనుకుంటున్నావు మేము ధర్మార్థాలను కోల్పోకుండా నిలువగల మార్గమేది నీవెంతో మాకు ఇష్టమైన వాడు మా మనోభాధను తొలగించడానికి తగిన వాడవు. నీవు కాక మాకు ఇంకా ఎవరూ లేరు. నీవు మమ్మల్ని ఏ మార్గంలో నడిపిస్తావో ఆ మార్గంలో నడవడమే నాకు సమ్మతం.

ధర్మరాజు శ్రీకృష్ణుడిని పరమాత్మగా భావించి తన బాధను ఆజ్ఞాపించకుండా నివేదిస్తున్నాడు. ఈ భావం ఎంతో నైపుణ్యంతో కూడి ఉంది కృష్ణుని పై భక్తి నమ్మకం ఉండడం వల్లనే సర్వ కార్య భారం శ్రీకృష్ణునిపై ఉంచాడు ధర్మరాజు.

ధర్మరాజు ఇంకా ఈ విధంగా పలుకుతున్నాడు. నీవు దుర్యోధనుడి దగ్గరకు వెళ్లడం నా అభిమతం కాదు నీవు ఎన్ని మంచి మాటలు చెప్పినా ఆ దుర్యోధనుడు వినడు. ఆచరించడు అంతేకాకుండా దుర్యోధనుని అధీనంలో ఉన్న సమస్త రాజులు అక్కడకు చేరారు వారి మధ్యకు నీవు వెళ్లడం నాకు ఇష్టం లేదు. ఒకవేళ దుర్యోధను ని కారణంగా నీకు ద్రోహం కలిగినట్లయితే ధనము దివ్యతము సుఖము సకల సంపదులైన మాకు అవసరం లేదని చెప్తాడు.

ఈ విషయాలను పరిశీలిస్తే ప్రస్తుతం ధర్మరాజు ఉన్న పరిస్థితి తనకు రావలసిన రాజ్యసంపదలు దక్కించుకొని తనను నమ్ముకున్న వారిని ప్రజలను పోషించడానికి, సంజయ రాయబారం వలన రాజ్యభాగం వస్తుందన్న ఆశ పోయింది. అయినప్పటికీ యుద్ధం జరిగితే తీరని నష్టం జరుగుతుంది కదా అని శ్రీకృష్ణుని రాయబారిగా పంపుతాడు ధర్మరాజు చెప్పవలసిన మాటలు అన్ని చెప్పి ఒకవేళ శ్రీకృష్ణుడికి ఆపద కలిగించే పరిస్థితి వస్తే మాత్రం ఏ సంపద అవసరం లేదని చెప్పి తనకు శ్రీకృష్ణునిపై ఉన్న భక్తి భావాన్ని ప్రకటించుకున్నాడు.

### 3.16.10. శ్రీకృష్ణుడు తన శక్తిసామర్థ్యాలను ధర్మరాజుకు తెలుపుట:

ధర్మరాజు మాటలను విన్న శ్రీకృష్ణుడు దుర్యోధనుడు ఎటువంటి దుర్మార్గుడో నాకు తెలుసు కానీ సంధికి ప్రయత్నిస్తే ఏ రాజు కూడా తప్పు పట్టడానికి అవకాశం ఉండదు. అయినా సింహం ముందు ఇతర జంతువులు నిలబడలేవు నాకు కోపాన్ని కలిగిస్తే రాజులందరూ ఒక్కటై నన్ను ఎదురు నిలిచిన వారు సరితూగరు.

*" అథచేత్ తే ప్రవర్తంతే మయి కించి దసాంప్రతమ్*

*నిర్దహేయం కురూన్ సర్వాన్ ఇతి మే ధీయతే మతిః " ( సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 72 వ అధ్యాయం,87 వ శ్లోకం,).*

ఒకవేళ కౌరవులు శ్రీకృష్ణుని ఎదిరించి అనుచితంగా ప్రవర్తించినట్లయితే వారి అందర్నీ బూడిద చేస్తాను ఇది నా నిర్ణయం అని శ్రీకృష్ణుడు కఠినంగా తీసుకున్న నిర్ణయం ఆంధ్ర మహాభారతంలో ఉండదు.

### 3.16.11. శ్రీకృష్ణ రాయబార కార్య రహస్యం:

శ్రీకృష్ణుడు ఇంకా ధర్మరాజుతో ఇలా అంటాడు నేను సంధికై అక్కడకు వెళితే దానివలన ప్రయోజనం లేకుండా ఉండదు. వెళ్లిన రాయబారకార్యం జరగవచ్చు కార్యభంగమైన కలగవచ్చు మనలను వేలెత్తి చూపే అవకాశం ఇతరులకు ఉండదని చెప్తాడు.

ఇది కూడా రాజనీతి ఉపాయంగా భావించవచ్చు శ్రీకృష్ణుడు ధర్మరాజును ఓదార్చే వాక్యాలు ఇవి. శ్రీకృష్ణుడు రాయబారిగా వెళ్లడం వలన భవిష్యత్తు కార్యం ఏమిటో స్పష్టంగా నిర్ణయించబడుతుంది సంధికి అందరూ అంగీకరించేలా మాట్లాడి ఒప్పించడం రాయబారి కార్యం నెరవేర్చినట్లు అవుతుంది. అలా సంధికి వారు ఆమోదయోగ్యంగా లేకపోయినా రాయబారకార్యం విఫలమైనా సంధి ప్రయత్నం చేసాము కాబట్టి ఎవరు కూడా  మన లోపాన్ని ఎత్తిచూపే పరిస్థితి రాదు ఆ విధంగానే నేను కార్య భారం నిర్వహిస్తాను అనే భావం శ్రీకృష్ణుని మాటల్లో వ్యక్తం అవుతుంది.

### 3.16.12. శ్రీకృష్ణునికి రాయబార స్వేచ్ఛను ధర్మరాజు తెలుపుట:

ధర్మరాజు కూడా కురుసభకు వెళ్లి నీకు ఏది తగినదో అది చేయి వాళ్ళు మేము కలిసి ఉండేటట్లు సంధి చేయము. అన్ని విధాలా వారితో సంధి కుదుర్చుకోవడమే మంచిదని చెప్తాడు.

*“అస్మాన్ వేత్త పరాన్ వేత్త వేత్థార్థాన్ వేత్త భాషితమ్*
*యద్ యదస్మద్ధితం కృష్ణ తత్ తద్ వాచ్యః సుయోధనః ” (సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 72వ అధ్యాయం, 92 వ శ్లోకం).*

ఇదే శ్లోకాన్ని తిక్కన చక్కని పద్యంతో వివరిస్తాడు.

*క. మమ్మెఱుఁగు దెదిరి నెఱుఁగుదు – నెమ్మి యెఱుఁగు ధ్ధరసిద్ధి నెఱి యెఱుఁగుదు వా*
*క్యమ్ముల పద్ధతి నెఱుఁగుదు – పొమ్మెవ్వఁడ నేను నీకు బుద్ధులు సెప్పన్.”( ఆంధ్ర మహాభారతం , ఉద్యోగ పర్వం, తృతీయాశ్వాసం, 34 వ పద్యం, పుట:301).*

పాండవులు ,కౌరవులు ఎట్లాంటివారో నాకు తెలుసు స్నేహమంటే ఎలా ఉంటుందో తెలిసిన వాడివి. కార్యసాధన విధానం కూడా బాగా తెలిసిన వాడివి మాట్లాడే పద్ధతి తెలిసిన వాడివి అటువంటి నీకు ఉపాధి చెప్పేటంతటి వాడను కాదు వెళ్లిరమ్మని చెప్తాడు.

### 3.16.13. శ్రీకృష్ణుడు ధర్మరాజుకు యుద్ధసన్నాహాలు చేయమని తెలుపుట:

ధర్మరాజు మాటలు విన్న శ్రీకృష్ణుడు ధర్మరాజుతో సంజయుని  మాటలు, నీవు పలికిన మాటలు విన్నాను నీవు ధర్మంతో జీవించాలని కోరుకునే వాడివి కౌరవులు శత్రుత్వం కలిగిన మనసు కలవారు భీష్మ ద్రోణులు తమ వైపున్నారని  తముకుతాము బలవంతులుగా ఊహించుకుంటున్నారు. అనాయాసంగా వచ్చిన రాజ్యాన్ని అనుభవిస్తున్న వారు నీకు భాగం ఇవ్వడానికి అంగీకరించరు దుర్యోధనాదులు  నిందకు అధర్మానికి భయపడరు నీవు దుఃఖాన్ని వదిలి యుద్ధం జరుపు శత్రు సమూహాన్ని జయించడం వలన శాశ్వత కీర్తి లభిస్తుంది.

నిండు సభలో పాండవులకు అపకారం తలపెట్టినప్పటికీ కౌరవులు తర్వాత అయినా అది తప్పని భావించలేదు  పశ్చాత్తాపం కూడా పొందలేదు అటువంటి వారి విషయంలో బంధు భావాన్ని విడిచిపెట్టు వారి యొక్క దుష్టమైన ఆలోచనలు క్రౌర్యం చూస్తే ఎవరికైనా కోపం వస్తుంది

ఈ విషయాలు దుర్యోధనాదుల స్వభావాన్ని వ్యక్తం చేయడమే కాకుండా క్షత్రియ ధర్మాన్ని శ్రీకృష్ణుడు గుర్తు చేస్తున్నాడు. అంతేకాకుండా మిమ్మల్ని మోసపు జూదంలో ఓడించి అడవులకు పంపేటప్పుడు పరిహాసాలడుతూ నోటికి వచ్చినట్లు మాట్లాడారు ఆ ధార్తరాష్ట్రులు  అందరి చేత చంపదగిన వారు ఇక నీవు చంపడంలో తప్పులేదు. మాయా ద్యూతం నాడు దుశ్శాసనుడు  ద్రౌపది జుట్టు పట్టుకుని రాజ్యసభకు ఈడ్చుకొని వచ్చి భీష్ముడు , ద్రోణుడు వంటి పెద్దల సమక్షంలోనే ఆమెను పరాభవించారు.

నీవు అడవులకు వెళ్లేటప్పుడు కూడా అవమానకరమైన కఠినమైన మాటలు మాట్లాడాడు అక్కడున్న రాజులు బ్రాహ్మణులు అందరూ దుర్యోధనుని అభినందించలేదు నిందిస్తూనే ఉన్నారు నిందించదగిన వానిని శిక్షించడమే మంచిదని కృష్ణుడు చెప్తున్నాడు.

కృష్ణుడు ద్రౌపదికి కలిగిన అవమానాన్ని గుర్తు చేయడంలో గల అంతర్యాన్ని గమనిస్తే భర్త ముందు భార్యకు అవమానం కలుగుతుంటే ఎటువంటి వారైనా సహించలేరు అందులో ధర్మాత్ముడైన ధర్మరాజు న్యాయానికి కట్టుబడి కురుసభలో మౌనం వహించాడు కానీ ఇప్పుడు అరణ్య అజ్ఞాతవాసాలు పూర్తయినప్పటికీ కౌరవులు తమ రాజ్యభాగం ఇవ్వడానికి అంగీకరించలేకపోతున్నారు. వీటన్నింటికంటే గొప్ప అవమానం తన ఇంట ఇల్లాలిని అవమానించడం దానిని ధర్మరాజుకు గుర్తుచేయడం వలన అతనిలో యుద్ధోత్సాహం కలుగుతుందని ప్రయత్నించినట్లు తెలుస్తుంది.

అంతేకాక రాయబారిగా వెళ్లే కృష్ణుడు రాజు యొక్క ప్రవర్తనను ధర్మ మార్గాన్ని అనేక రాజులు, మిత్రులుబంధువులు అందరికీ తెలిసేటట్లు మాట్లాడుతాను. దుర్యోధనుని లోపాలను ఎత్తిచూపుతాను.సంధి కోసం చేసే ప్రయత్నం చేస్తాను కుదరకపోతే ఆ సభలోని వారి ప్రయత్నాలు ఎలా ఉన్నాయో యుద్ధం చేయగల వారి ప్రవర్తనలు వారి సామర్థ్యాలు ఏ పాటివో గ్రహించి నీకు విజయం కలిగించే విధంగా మళ్లీ వస్తాను.

*" రాయబారికి ఉండవలసిన లక్షణం శత్రుబలాలను అంచనా వేయగల సామర్థ్యం ఆ ప్రయోగాన్ని శ్రీకృష్ణుడు సభలో ప్రయోగిస్తానన్నాడు. ఇది రాజనీతి చతురతతో కూడిన రాయబారం."*

ఆ దుర్యోధనుడు నీకు రాజ్యభాగం ఇవ్వడు.యుద్ధం తప్పదు యుద్ధం జరిగే శకునాలే కనబడుతున్నాయి కాబట్టి యుద్ధోత్సాహాన్ని కలిగి ఉండు.

*వ. చతురంగ బలంబుల నాయితంబు గావించుచు దొదలం బురి కొల్పికొనుచు నాలస్యంబులేక సమరంబునకు సన్నాహంబు సేయుచుండవలయునని పలికిన విని వృకోదరుండు దామోదరునకిట్లనియె. (ఆంధ్ర మహాభారతం, ఉద్యోగపర్వం, తృతీయాశ్వాసం, 42 వ వచనం, ).*

రథాలు, ఏనుగులు, గుర్రాలు ,కాలిబంటులు, అనే నాలుగు రకాల సేన విశేషాన్ని సంసిద్ధం చేసుకొని యుద్ధానికి ప్రేరేపిస్తూ ఆలస్యం జరగకుండా యుద్ధసన్నాహాలు సాగించమని శ్రీకృష్ణుడు అన్నాడు.

ఈ మాటలను పరిశీలిస్తే శ్రీకృష్ణుడు యుద్ధమే కోరుకుంటున్నట్లు అందరికీ అర్థమవుతుంది కానీ పరిశీలనగా గమనిస్తే సంధి చేయడానికి అనేక విధాలుగా ప్రయత్నిస్తానని చెప్తాడు. సంధి కుదరకపోతే చేయవలసిన విధి విధానాలను ముందుగానే అంచనా వేయగల శక్తి సామర్థ్యాలు ఉన్నవాడు, మనోగతాలు అణువణువునా పరిశీలించగల జ్ఞాని శ్రీకృష్ణుడు దుర్యోధనుడు ఎంతటి మూర్ఖుడో అందరికీ తెలిసినప్పటికీ దుర్యోధనుని ఆంతర్యం శాంతిని కోరుకోదని యుద్ధానికి కాలు దువ్వేరకమని శ్రీకృష్ణుడికి తెలుసు కాబట్టి ధర్మరాజును చతురంగబలాలను సిద్ధం చేసుకోమని చెప్తున్నాడు.

### 3.16.14. .శ్రీకృష్ణుడిది రాయబారమా? యుద్ధప్రేరణా? – ప్రముఖుల అభిప్రాయాలు:

కొంత మంది ఆధ్యాత్మిక వేత్తలు ముఖాముఖిలో శ్రీకృష్ణుడు యుద్ధానికి ప్రేరేపించాడా లేదా సంధికి ప్రయత్నం చేసాడా అనే విషయంపై వారి అభిప్రాయాలను ఈ క్రింది విధంగా తెలుపుతారు.

బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ కృష్ణుడుని దైవమని ప్రక్కన పెడితే, కృష్ణుడుగా ఆయన చేయవలసిన ప్రయత్నాలన్నీ చేసాడు. అంత అద్భుతంగా ఎవరూ చెప్పలేదు. కాని

దుర్యోధనుడు వినడని ఆయనకు తెలుసు వినడు కాబట్టే చివరికి బెదిరించికూడా చూసాడని కర్ణుడుని కూడా తన వైపు రావడానికి గట్టిగా ప్రయత్నం చేసాడు కాబట్టి చివరి వరకు కృష్ణుడు పూర్తిగా రాయబారానికి ప్రయత్నం చేసాడని వీరు తెలిపారు.( చూడు: అనుబంధం2, బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్, ముఖాముఖి).వీరుచెప్పిన ప్రకారం యుద్ధసన్నాహాలు చేస్తున్నప్పటికి రాయబారం చేయడానికే తీవ్రప్రయత్నం చేసాడని వీరు అభిప్రాయపడ్డారు.

ఇదే విషయమై గణపతి సచ్చిదానంద స్వామి

శ్రీకృష్ణుడు శాంతికాముకుడు. ఉభయపక్షాల వారికీ మేలు చేకూరాలి అనే ఉద్దేశ్యమే ఉంది. ఆయన మనస్ఫూర్తిగానే శాంతి స్థాపన కోసమే ఆయన రాయబారం చేశాడు. ఆయన యుద్ధానికి ఎవరినీ ప్రేరేపించ లేదు. యుద్ధాన్ని ఆపుదామనే ఎంతగానో ప్రయత్నించాడు.ఇంకా కౌరవులకూ,పాండవులకూ సంధి చెయ్యాలని ఎలాంటి కపటమూ లేకుండా ప్రయత్నిస్తూనే ఉన్నానని విదురునితో కూడా చెప్పాడని వీరుతెలిపారు.(చూడు: అనుబంధం:అవధూత గణపతి సచ్చిదానంద స్వామి, ముఖాముఖి).

వీరి అభిప్రాయంలోనూ శ్రీకృష్ణుడు రాయబారానికే ప్రయత్నించాడని వివరించారు. ఇదే విషయమై చాగంటి కోటేశ్వర రావు చెప్తూ శ్రీకృష్ణుడు చివరి వరకు సంధి కోసం రాయబారానికే ప్రయత్నించాడని అందులో ఎటువంటి అనుమానం లేదని వీరు తెలిపారు.(చూడు: అనుబంధం2,బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు, ముఖాముఖి).

వీరి అభిప్రాయం ప్రకారం మూర్ఖుడైన దుర్యోధనుని వలన యుద్ధం సంభవించింది కాని శ్రీకృష్ణుడు మాత్రం రాయబారానికే ప్రయత్నించాడని చెప్తారు.

బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ ముఖాముఖి లోశ్రీకృష్ణుడు యుద్ధం జరిగితీరుతుందని తెలిసినవాడే కాని, యుద్ధానికి ప్రేరేపించలేదు. పాండవుల బలాన్ని తక్కువ అంచనా వేయవద్దని కూడా హెచ్చరించాడని వీరు తెలిపారు.(బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ, ముఖాముఖి).

వీరు కూడా శ్రీకృష్ణుడు రాయబారానికే ప్రయత్నించాడని పాండవుల బలాలను గుర్తిచేసి ప్రమాదం ఎవరికోవారు జాగ్రత్తపడితే యుద్ధం జరిగే అవకాశాలుండవని హెచ్చరించినట్లు తెలుస్తుంది.

ప్రాచార్య శలాకరఘు నాథ శర్మ ముఖాముఖి లో యుద్ధము అభిమతమే సంధి అభిమతమే కాని ప్రధానమైనటువంటి ధ్యేయం ఏమిటంటే భూభారాన్ని తగ్గించడం దాని కోసం వచ్చాడు కనుక యుద్ధోద్యోగము ఉంది యుద్ధ విరమణోద్యోగం కూడా ఉంది. యుద్ధానికి సిద్ధమే అనే విషయాన్ని ధృతరాష్ట్రునికి, దుర్యోధనునికి చెప్పేసారు దాపరికం ఏమి లేదు, కృష్ణుని దగ్గర నీళ్ళు ఒదిలే ధోరణి లేదు స్పష్టంగా చెప్పేసారని వీరు తెలిపారు (చూడు: అనుబంధం –2, ప్రాచార్య శలాక రఘునాథ శర్మ ముఖాముఖి).

వీరి అభిప్రాయం మరింత లోతులకు వెళ్ళి పరిశీలన చేస్తే పాపాత్ముల భారాన్ని మోయలేని భూభారాన్ని తగ్గించడానికి శ్రీకృష్ణుడు ప్రయత్నం చేసినట్లు వీరి అభిప్రాయం అంతే కాకుండా సంధి ప్రయత్నం చేసినప్పటికి శాశ్వత ప్రయోజనాన్ని చేకూర్చేవిషయం ఏదైతే ఉందో శ్రీకృష్ణుడు దాని గురించి ఎక్కువగా ఆలోచించినట్లు వీరి మాటల వలన తెలుస్తుంది.

నా దృష్టిలో శ్రీకృష్ణరాయబారం తాత్కాలికం ఈ రాయబారంలోని అంతర్గత విషయాలను పరిశోధన చేస్తే తేలే ఫలితాంశం యుద్ధం . ఈ యుద్ధమనే కారణం చేత జరిగిన భూభారాన్ని తగ్గించే లోకరక్షణార్ధకమైన కార్యమని నా భావన.

సద్గురు శ్రీదేవిసెట్టి చలపతి రావు,ముఖాముఖిలో శ్రీకృష్ణుడు వెళ్ళేటప్పుడు అందరి అభిప్రాయాలు చెప్పారు సహదేవుడు, ద్రౌపది యుద్ధమే జరగాలని అభిప్రాయపడ్డారు. ధర్మరాజుతో సహ తక్కిన వారందరూ సంధి చేయమనే కోరారని రాయబారి ఎప్పుడూ సౌమ్యంగా ఉండాలి కాబట్టి వారి కున్ను కోపం రాయబారికి ఉండకూడదు. అలా రాయబార లక్షణాలన్నీ పునికి పుచ్చుకుని సామ దానభేద దండోపాయాలను ప్రయోగించాడు.భారతంలో ఖచ్చితంగా భవిష్యత్తులో ఎవరూ కూడా ఆయనను వేలు పెట్టి

చూపించడానికి వీలు లేని విధంగా సంధి కోసమే ప్రయత్నం చేసాడు కుదరకపోతే దండానికి సిద్ధపడేటట్లు చేసాడు. ఇది నూటికి నూరు పాళ్లు సరైనటువంటిదని వీరు తెలిపారు. (చూడు: అనుబంధం 2 , సద్గురు శ్రీదేవి సెట్టి చలపతి రావు, ముఖాముఖి).

ఈ అభిప్రాయాలను పరిశీలిస్తే నాకు తెలిసిన విషయమేమిటంటే ఎవరిలో సంధి చేయాలనే కోరిక ఉందో ఎవరిలో యుద్ధోత్సాహం ఉందో గమనించాడు. ధర్మరాజు రాయబారిగా పంపుతున్నాడు కాబట్టి అతడు సంధి ప్రయత్నమే చేయమని నిశ్చయించాడు. అదే ధోరణితో భీముడు చెపితే పరిహాసాలాడి అతనిలో ఉన్న స్వభావాన్ని గుర్తుచేసాడు. అర్జునుడు నకులుడు అన్నగారి మాటకే ప్రాధాన్యం ఇచ్చారు. సహదేవుడు ద్రౌపది యుద్ధమే జరగాలని తేల్చిచెప్పారు. ఇవన్నీ గ్రహించిన శ్రీకృష్ణుడు  వీరి మాటలను విశ్లేషించుకుని కురు సభలో ఏమి మాట్లాడాలో ఎవరిని హెచ్చిరంచాలో ఎవరిని అదుపులో పెట్టాలో ఒక నిర్ణయానికి వచ్చి ఉంటాడు. అయితే రాయబారిగా వెళ్తున్నారు కాబట్టి వారి యొక్క కోపాన్ని గ్రహించకుండా రాయబారిగా తాను నిర్వర్తించవలసిన బాధ్యాతను నిర్వహిస్తూనే పాండవులకు ఆపద్ధర్మ బాంధవుడుగా తాను చేయవలసిన కార్యాలను పూర్తిచేసిన రాజనీతిజ్ఞుడు శ్రీకృష్ణుడు.

బ్రహ్మశ్రీ చిర్రావూరి శివరామకృష్ణ శర్మ ముఖాముఖిలో

శ్రీకృష్ణుడు ధర్మం అతిక్రమించకుండగా  భూభారం తగ్గించడానికి యుద్ధం జరగడానికి కారకుడయ్యాడు. రాయబారంలో శాంతిపడేటట్టుగా కాకుండా వారు చాలా పరాక్రమవంతులు జాగ్రత్త అని చెప్పాడు ఇలాంటి మాటలు చెప్పాడు లేనివి చెప్పలేదు కాని ఆ మాటలు చెప్పడంలో ఒక పద్దతి ఉంటుంది కదా ఆ పద్దతిలో వాళ్లకు బాగా క్రోధాలు వచ్చేట్లుగానే చెప్పాడని వీరు తెలిపారు.(చూడు: అనుబంధం 2, బ్రహ్మశ్రీ చిర్రావూరి శివరామ కృష్ణ శర్మ.)

వీరి అభిప్రాయాలను పరిశీలిస్తే శ్రీకృష్ణుడు ధర్మరక్షణార్థం భూభారాన్ని తగ్గించడం కోసం వచ్చాడని చెప్తారు శ్రీకృష్ణుడు యుద్ధం జరగడానికి కారణం అయినప్పటికి

అంతకంటే ఎక్కువగా దుర్యోధనాదుల మూర్ఖత్వం వలన యుద్ధం సంభవించిందని తెలియజేసారు. ఒకసారి ద్వైత వనంలో దెబ్బతిని పాండవుల చేత రక్షించబడినప్పటికి మరలా మరలా అహంకారంతో ప్రవర్తించడం మూర్ఖంగా ఆలోచించడం, శ్రీకృష్ణున్ని బంధించడం వంటి చర్యల వలన యుద్ధం తప్పలేదనే భావం వ్యక్తమవుతుంది.

వెంపరాల వెంకట లక్ష్మీ శ్రీనివాసమూర్తి గారు ముఖాముఖిలో సంధి జరుగుతుందని తలచి శ్రీకృష్ణుడు ఈ రాయబారానికి పూనుకోలేదు. పొందు పొసగదని, సమరం అనివార్యమని, అది విధి నియతి అని తెలిసి ప్రయత్నం చేయడంలోనే శ్రీకృష్ణతత్వంలోని విశిష్టత గోచరిస్తుందని తెలిపారు.(చూడు: అనుబంధం –2, వెంపరాల వేంకట లక్ష్మీ శ్రీనివాస మూర్తి).

వీరు చెప్పిన దాన్ని ప్రకారం శ్రీకృష్ణుడు సంధి జరుగుతుందని రాయబారానికి అంగీకరించలేదని విధి ని ఎవరూ తప్పించలేరని కాలాన్ని దాటి ఎవరూ ముందుకు అడుగు వేయలేరని యుద్ధం తప్పని సరైతే ఎన్ని ప్రయత్నాలు జరిపినా ఆగదని వీరి మాటల్లో వ్యక్తమవుతుంది. అంతే కాకుండా ధర్మసంస్థాపన కోసం అవతరించిన పురుషోత్తముడు కావున భూభారాన్ని తగ్గించే నేపథ్యంలో యుద్ధానికి కారణమై ఉంటాడని తెలుస్తుంది.

పైన తెలిపిన ప్రముఖుల అభిప్రాయాలన్ని గమనించిన తర్వాత శ్రీకృష్ణుడు శాంతికాముకుడు యుద్ధానికి ప్రేరేపించలేదని సంధికి ప్రయత్నించాడని కొందరు, భూభారాన్ని తగ్గించడానికి యుద్ధం జరిపించాడని కొందరు తెలియజేసారు.

నా అభిప్రాయం ప్రకారం రాయబారి గా వెళ్ళే వ్యక్తి ఎలా ప్రవర్తించాలో అలా ప్రవర్తించాడు. పాండవుల తరపున రాయబారిగా వెళ్ళాడు కాబట్టి వారి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తన వాక్చాతుర్యాన్ని ప్రదర్శించాడు.

ఎమ్బియస్ ప్రసాద్ **శ్రీకృష్ణ రాయబారమనే** వ్యాసంలో ఈ విధంగా వివరించారు. వీరు రెండు ప్రతిపాదనలను తీసుకువచ్చారు.

1.కృష్ణుడు యుద్ధాన్ని ఎందుకు కోరుకున్నాడు అనే విషయంపై మాట్లాడుతూ కొంతమంది శ్రీకృష్ణుడు గొల్లవాడని అందుకే క్షత్రియుల మధ్య యుద్ధం పెట్టి వాళ్ళ నాశనం అయ్యేటట్లు చూసాడనే వాదన సరియైనది కాదని చెప్తూ యయాతి యాదవులకు ఇచ్చిన శాపాన్ని వివరిస్తాడు. శ్రీకృష్ణుడు పెరిగిన విధానాన్ని తెలియజేస్తూ కృష్ణుడి బాల్యం నందుడి వద్దే వ్రేపల్లెలో గోవుల మధ్య, గోపాలుర మధ్య నడిచింది. కంససంహారం తర్వాత అతను విద్యను అభ్యసించి అన్నగారితో కలిసి రాజ్యనిర్వహణలో పడ్డాడని వృత్తిగా పశుపోషణను ఎంచుకోలేదని క్షత్రియోచితంగా యుద్ధాలు చేసి రాజ్యాన్ని విస్తరించాడు. రాజుగా మాత్రం పట్టాభిషేకం చేసుకోలేదు. క్షత్రియులతో వైవాహిక సంబంధాలు ఏర్పరచుకున్నాడు, కాబట్టి కృష్ణుడు ముమ్మాటికి క్షత్రియుడే. కృష్ణుడు రాయబారానికి వస్తున్నాడని తెలిసి ధృతరాష్ట్రుడు విదురుడితో '' అతడు ఆహుక వంశక్షత్రియులకు అధిపతి అంటాడు. అందువలన కృష్ణుడు క్షత్రియుడే అనే మాటను స్పష్టపరుస్తాడు.

*''ఈ గోపాల శబ్దమును అర్థాన్ని ఇస్తూ బత్తుల లక్ష్మయ్య 'రాజ వంశ ప్రదీపక'' గ్రంథంలో ఈ విధంగా ప్రస్తావిస్తారు. ''గురుబాలప్రబోధిక 462 వ శ్లోకంలో గోపోగ్రామేషు భూరిషు, అంటే అనేక గ్రామములయందు అధికారం కలవాడు, గోపుడు అనబడును. గాం – భూమింపాతీతి- గోపః పా రక్షణే= భూమిని పాలించువాడని తెలియజేస్తారు .అంతేకాకుండా గోపాల శబ్దము బ్రహ్మయందును, విష్ణువు యందును, శివుని యందును, ఇంద్రుని యందును, రాజు యందును వర్తించునని వీరు తెలుపుతారు.'' (లక్ష్మయ్య, బత్తుల, రాజవంశ ప్రదీపిక, పుట:9.).*

ఈ వివరాలు ను గమనించినట్లైతే శ్రీకృష్ణుడు క్షత్రియుడనే చెప్పుకోవడానికి ఆస్కారం ఉన్నట్లు తెలుస్తుంది.

అలాగే శ్రీకృష్ణుడు జనక్షయం కోసం యుద్ధానికి సిద్ధపడలేదని ఎమ్ బి.యయస్ ప్రసాద్ అభిప్రాయపడుతారు.

''ఇక భూభారం తగ్గించడానికి అవతారమెత్తి యుద్ధం చేయించాడన్నది కూడా విశ్వసనీయం కాదు. గతంలో కంటె యిప్పుడే జనాభా విపరీతంగా పెరిగింది. మరి విష్ణువు

అవతారం యిప్పట్లో లేదు కదా! పైగా కృష్ణావతారంలో కురుక్షేత్రం జరిగింది భరతఖండంలో మాత్రమే. ప్రపంచంలోని తక్కిన భూభాగాల్లోని జనాభా మాటేమిటి? అక్కడ తగ్గలేదు కదా! నిజానికి ప్రకృతే ఎప్పటికప్పుడు తన భారాన్ని తగ్గించుకుంటూ ఉంటుంది. ఏదో రోగమో, ప్రకృతి వైపరీత్యమో తెచ్చిపెట్టి కొంత జనాభాను తుడిచిపెడుతూ ఉంటుంది. విష్ణువు అవతారాలెత్తవలసిన అవసరాన్ని కల్పించదు. అయినా అవతారాల్లో జనక్షయం జరిగిన యుద్ధాలు చేసినవెన్ని కనుక? పరశురాముడు, రాముడు, కృష్ణుడు, రాబోయే కల్కి! గౌతమబుద్ధుణ్ని విష్ణువు అవతారంగా అంగీకరిస్తే యుద్ధాలు ఆపించి భూభారం పెంచాడని అనాల్సి వస్తుంది. అందువలన జనక్షయం కోసం కురుక్షేత్ర యుద్ధం జరిగేట్లా చూశాడనేది కూడా ఒప్పుకోలేము.

భారతం పరికిస్తే కురువంశంలో ఉన్న దాయాదుల తగాదాలో కృష్ణుడు తలదూర్చి, అండర్‌డాగ్స్ పక్షం వహించి, వాళ్లకు అడుగడుగునా, అన్నివిధాలా వెన్నుదన్నుగా నిలిచి, కింగ్‌మేకర్ అయ్యాడని, పాండవుల చేత ప్రత్యక్షదైవంగా మన్ననలు అందాడని అనుకోవాల్సి వస్తుంది. తన పాండవపక్షపాతం కౌరవులకు తెలుసని తెలిసినా కృష్ణుడు రాజీ కుదర్చడానికి వెళ్లిన రాయబారిగా వెళ్లాడు. ఎందుకు? తమ స్వార్థం కోసం పాండవులు భీకరయుద్ధాన్ని తెచ్చిపెట్టి జననాశనానికి కారకులయ్యారని రాజలోకం అనుకోకూడదని! రాజీ కోసం సిన్సియర్‌గా ప్రయత్నించారనీ, కానీ కౌరవుల మూర్ఖత్వం కారణంగానే యుద్ధానికి దిగవలసి వచ్చిందనీ లోకానికి ఎస్టాబ్లిష్ చేయడానికి! అంతకు ముందు రాయబారులుగా వ్యవహరించిన ద్రుపద పురోహితుడు, సంజయుడు స్టేచర్‌లో చిన్నవాళ్లు. 'సాక్షాత్తూ కృష్ణుడంతటివాడు నచ్చచెప్పినా కౌరవులు వినలేదు, యుద్ధానికి కారణభూతులయ్యారు' అని తక్కిన రాజులందరూ అర్థం చేసుకోవాలంటే యీ ప్రయత్నం చేసి తీరాలనుకుని ఆ భారాన్ని తన మీద వేసుకున్నాడు కృష్ణుడు."( https://telugu.greatandhra.com/articles/mbs/krishna-rayabaram-127950.html

ఈ వివరాలను పరిశీలిస్తే శ్రీకృష్ణుని రాయబారమంతా రాజనీతితో జరిగిందని సంభాషణా చాతుర్యం గల శ్రీకృష్ణుడు తన సామర్థ్యనైపుణ్యంతో రాయబారం చెడిపోయే విధంగా ప్రవర్తించాడని పైకి ఈ విషయం ఎవరికి అనుమానం రాకుండా జాగ్రత్త పడ్డాదని వీరి మాటల్లో వ్యక్తమవుతుంది. శ్రీకృష్ణ రాయబారం విఫలమైనది అంటే అది రాయబారి లోపం కాదు వెళ్ళిన వ్యక్తి సాక్షాత్తు పురుషోత్తముడు ఈ భావన ఉన్న వారంతా అతని ప్రకారమే నడుచుకోవడానికి ప్రయత్నించారు. దుర్యోధనాదులు వినరని ముందే తెలుసు కాబట్టి అదే సభలో నిరూపించబడింది. దురహంకారంతో ప్రవర్తించడం సభలోని అందరూ గమనిస్తూ నే ఉన్నారు. రాయబారం విఫలమయితే ఎవరికి ప్రయోజనమని గమనిస్తే ద్రౌపది తన అవమానానికి ప్రతీకగా ఆమె మనసులో రగిలే పగ చల్లారడానికి ఈ రాయబారం విఫలమవ్వడం ఒక ఘట్టమని అర్థమవుతుంది. కుంతి కూడా రాయబారం విఫలమయ్యినందుకు సంతోషించింది. తన పుత్రులు పరాక్రమంతోనే రాజ్యాన్ని చేజిక్కుంచుకోవాలని ఆమె కోరింది.

జనక్షయం జరగాలని శ్రీకృష్ణుడు అవతారమెత్తలేదు అనే విషయం నిజమే కాని జనక్షయం కోసం కాదు అధర్మపరులను అంతమొందించి ధర్మాన్ని నిలబెట్టడం కోసం అవతరించాడు. ఆ ధర్మం ఎవరిలో ఉందో వారికి సహాయపడ్డారు ఎవరిలో లేదో వారిని మార్చడానికి ప్రయత్నించాడు. మారలేదు కాబట్టి దుర్యోధనుడు తన మీద నమ్మకమున్నవారు, శ్రీకృష్ణునిపై కోపమున్నవారు అంతా దుర్యోధనుని సైన్యంలో చేరి యుద్ధంలో మరణించారు. ఇలా జనక్షయం జరిగింది. ద్రోణ , భీష్ములు లాంటి వారు తమ మరణం ఎలా సంభవిస్తుందో ధర్మరాజు అడగగానే తెలిపారు. వారికి తెలుసు తాము అధర్మం వైపు ఉండి యుద్ధం చేస్తున్నామని యుద్ధంలో తమ శక్తిసామర్థ్యాలను నిరూపించుకునేంత వరకు అందరికి తెలిసేంత వరకు పోరాడారు. ధర్మరాజు ముందుగానే వారి మరణ రహస్యాలు తెలిసిన వాడు కాబట్టి ఆ ప్రకరాంగానే వారి మరణం సంభవించింది. దానికి వారు ఎటువంటి కోపాన్ని పాండవులపై ప్రదర్శించలేదు. భీష్ముడైతే శ్రీకృష్ణుడిచ్చిన శక్తితో అనేక ధర్మసందేహాలను అంపశయ్యపై నుండే ధర్మరాజుకు

తెలియజేసాడు. అధర్మం నిర్మూలించడానికి యుద్ధం కాని జనక్షయం కోసం కాదు. జనక్షయం అనే పదం వాడితే అందులో మంచి వారు చెడ్డవారు అందరూ వస్తారు.

పుట్టపర్తి నారాయణాచార్యులు "**మహాభారత విమర్శనము**" నందు శ్రీకృష్ణుని అవతారోత్పత్తికి కారణమును తెలియజేస్తారు. *భగవద్గీతలో చెప్పినట్లు ఎప్పుడు ధర్మానికి గ్లాని కలుగునో అధర్మమునకు అభివృద్ధి ఏర్పడుతుందో అప్పుడు ప్రపంచమున నన్ను నేను సృజించుకుంటాను. సాదువులను రక్షించుట కొరకు, దుష్టులను శిక్షించుట కొరకు, ధర్మమును స్థాపించుటకు, ప్రతియుగమునందు నేను జన్మిస్తానని చెప్తాడు. శ్రీకృష్ణుడు అద్వితీయుడు, ఈ విషయము లో ఎటువంటి వాదన లేదు. మనుష్య స్వభావమునకు సంబంధించిన వికారములు అతనిని అంటలేదు అసంపూర్ణత కృష్ణపరమాత్ముని జీవనమున కనబడదు. అతడు పూర్ణ స్వరూపుడు. ఆ యుగ పురుషుడు ధర్మమును ప్రతిష్ఠించెను. అధర్మమును నాశన మొనర్చెను. సాధువులను రక్షించెను.పరమేశ్వరుని అవతారము ప్రతియుగమునను పవిత్రమైన భరత భూమి యందు కల్గుతునే ఉండును. ఆత్మజ్ఞానము మానవునకు ఉత్తమోత్తమైన ధర్మము ఆ ఆత్మ ను మరచిపోతే అది గొప్ప అధర్మమవుతుంది. పరధర్మముల ఆక్రమణముల వలన మానసిక చాపల్యములచేత వ్యతిరేకమువలన భారతజాతి యెప్పుడెప్పుడు అధోగతిపాలవడానికి మొదలవుతుందో అప్పుడు భగవంతుడు ఈ దేశమున అవతారమెత్తును. అతని అంశము ప్రపంచమున ఆక్రమించును. ఆత్మజ్ఞానరూపమైన ధర్మమును ప్రతిష్ఠించును. ఈ కారణం చేతనే శ్రీకృష్ణుడు అవతరించారని తెలియజేస్తారు."* ***(నారాయణాచార్యులు, పుట్టపర్తి, మహాభారత విమర్శనము, (ప్ర.భా), పుట:38.).***

వీరి అభిప్రాయాన్ని గమనిస్తే ప్రతి ఒక్కరు తన శరీరానికి కాకుండా తనలో ఉన్న ఆత్మకు ప్రాధాన్యం వహించి ఎటువంటి మార్గంలో తన ఆత్మ ప్రయాణిస్తుందో దాని గమనించుకుని మసలుకోవాలని చెప్తాడు. తన ఆత్మ తప్పు దోవ పట్టినప్పుడు దాని ప్రభావం అతని వ్యక్తిత్వానికే కాదు తన చుట్టూ ఉన్న సమాజాన్ని తప్పుదోవ పట్టించగలదు.

భారతంలో దుర్యోధనుని మనసు సరైన మార్గంలో నడుచుకోలేకపోవడం చేతనే అనర్థమంతా జరిగింది.

శ్రీ గడియారం వేంకటశేష శాస్త్రి '**ఆంధ్రమహాభారతోపన్యాసములు**' గ్రంథంలో 'యుద్ధ షట్కము' అను వ్యాసంలో యుద్ధానికి ఇద్దరిని కారణాలుగా చెప్తాడు. ''*లోక దృష్టితో చూస్తే ధృతరాష్ట్రుడు, దైవ దృష్టితో చూస్తే శ్రీకృష్ణుడు అని తెలియజేస్తారు. ధృతరాష్ట్రుడు యుద్ధానికి మూలకారణం ఎందుకు అయ్యాడో చెప్తూ రాజ్యభాగం పరిష్కరించుటకు గాని , పాండవ కౌరవుల తప్పొప్పులు తడవి దండించుటకు కాని, అన్ని విధముల అధికారము బాధ్యతకలిగిన వాడు ధృతరాష్ట్రుడు. ప్రభువు కూడా అతడే హృదయపూర్వకమైన అతని తీర్పును కాదనేవాడు ఎవ్వరూ లేడు. నెరవేర్చుటకు సమర్థులై వారున్నారు. కౌరవుల దుర్నయములన్ని అతనికి తెలిసే జరిగినవనియో జరిగిన మీద తెలిసినవైన కావలయును, జరగకుండా చేయుటకు గాని జరిగిన మీదట ఏదో ఒక్క పరిహారము చేయుటకు గాని అతడు చేసిన ప్రయత్న మేదియు ఉన్నట్లు కనబడదు. అతని లోభము చేత, దుస్సంకల్పము చేత, ఉపేక్ష చేతనే యుద్ధానికి కారణమని తెలియజేస్తారు. అలాగే శ్రీకృష్ణుడు యుద్ధానికి కారకుడయ్యాడని చెప్తూ అనేక అతిమానుషములైన అనేక కార్యములు యుద్ధరంగమున శ్రీకృష్ణుని చేతనే నిర్వహించబడినది. గాంధారి నీవే యుద్ధమునకు కారణమని శ్రీకృష్ణుని తో అనుట, గురుబంధు మిత్రాది సంహారమునకు విముఖుడైన అర్జునుని ప్రోత్సహింపుచునే శ్రీకృష్ణుడు ' నాచేతంజచ్చిన వీరినెల్లను జయించుటకు నిమిత్తమాత్రముగమ్మని తానే చెప్పియున్నాడు. ఇలాంటి సంఘటనల ద్వారా శ్రీకృష్ణుడే యుద్ధానికి కారణమయ్యేనని చెప్పెను. అలాగే దేవ సభలో భూదేవి తనకు భూభారం తొలగించమని అడుగగా నారాయణుడు నవ్వుచూ కురుక్షేత్ర సంగ్రామమమున ధృతరాష్ట్ర పెద్ద కొడుకు దుర్యోధనుడు కారణమంగా వివరించారు. ఇది దైవం చేసిన పనిగా అన్వయించాడు''.***(వేంకటశేష శాస్త్రి, గడియారం, ఆంధ్ర మహాభారతోపన్యాసములు, పుట186.).***

ఈ విధంగా వీరు యుద్ధానికి కారణమైనవారిని గురించి తెలుపుతారు.

## 3.16.15. భీమసేనుడు సంధి వాక్యాలు పలుకుట:

శ్రీకృష్ణుడు సన్నాహాలు మొదలుపెట్టమని చెప్పిన వెంటనే భీముడు యుద్ధం జరుగుతుందని మమ్మల్ని భయపెట్టవద్దు. దుర్యోధనుడిని బుజ్జగించైనా యుద్ధ విముఖత సాధించే లాగా రాజ్యభాగం ఇచ్చేటట్లు చేయాలని కోరుతాడు. అంతేకాకుండా దుర్యోధనుని దుర్గుణాలను ప్రస్తావిస్తాడు,

దుర్యోధనుడికి భీముని పై ఉన్న కోపాన్ని తెలియజేస్తాడు చిన్నప్పటినుండి దుర్యోధనుడికి నా పైనే పగ ఎక్కువ నన్ను చంపడానికే ప్రయత్నాలు చేస్తుంటాడు ధర్మరాజు యుద్ధానికి అంగీకరించకపోవడం వలన భీమునితో కలిసి జీవించడం తప్పనిసరి అయ్యేటట్లు ఉంది దుర్యోధనుడే కురువంశ నాశనానికి కారణం అటువంటి అహంకారిని, గర్వం కలవానిని, కోపము కల వానిని దారిలో పెట్టే ప్రయత్నం చేయమని అడుగుతాడు. ఆ దుర్యోధనుడు క్రూరత్వాన్ని మోసమును విడిచిపెట్టడు కాబట్టి నీచమైన పని అయినప్పటికీ అతనిని. బతిమిలాడైనా  సంధి చేసుకుంటే మంచిది.ఆ కురుసభలో నా మాటగా అన్నదమ్ములై ఉండి కూడా మనం కొట్లాడుకుంటూ ఉంటుంటే లోకమంతా చిన్నచూపు చూస్తుంది అది మంచిది కాదు హస్తినాపూర సామ్రాజ్యాన్ని పెద్దల మాట ప్రకారం పంచుకొని సుఖంగా ఉండటం మంచిది కదా అని అంటాడు.

ఈ అభిప్రాయాలే సంస్కృత భారతం

లో ఉన్నప్పటికీ దుర్యోధనుడు ఏ విధంగా అయితే కురువంశం నాశనానికి  కారణం అవుతున్నాడో దుర్యోధనుల కంటే ముందు కొంతమంది రాజుల పేర్లు తెలిపి వారిలాగే దుర్యోధనుడు వంశనాశనానికికి పుట్టిన వాడని చెప్తాడు.

*" ధర్మ విప్లవ కాలం సంభవించినపుడు రాక్షసుల మధ్య భయంకరమైన కలహం ఏర్పడింది హైహయ వంశస్థుడైన ముదావర్తుడు , నీప వంశస్థుడైన జనమేజయుడు,  తాల జంఘ వంశస్థుడైన బహులుడు,  కృమి వంశ శ్రేష్ఠుడు వసువు,  సువీర  వంశస్థుడైన అజబిందువు,  సురాష్ట్ర వంశస్థుడు రుషర్ధికుడు , బలీహవంశస్థుడు అర్కజుడు, చీన వంశస్థుడు ధౌతమూలకుడు,  విధేహ వంశస్థుడు హయగ్రీవుడు,  మహౌజస వంశస్థుడు వరయువు,  సుందర వంశస్థుడు బాహువు,  దీప్తాక్షవంశస్థుడు పురూరవుడు,  చేది మత్స్య*

*దేశాల్లో సహజుడు, ప్రవీర వంశంలో వృషధ్వజుడు, చంద్రవత్స వంశాల్లో ధారణుడు, వంశస్థుడు విగాహనుడు, నంది వేగ వంశస్థుడు శముడు వీరంతా నరాధములైన క్షత్రియులు ప్రళయకాలం రాబోతుంది. కాబట్టి వంశనాశనం కోసం ఆయావంశాలలో పుట్టినవారని చెప్తాడు. వీరిలాగే దుర్యోధనుడు ద్వాపర యుగాంతంలో కురువంశనాశనానికై పుట్టినవాడని కాబట్టి దుర్యోధనునితో మృదువుగా , నెమ్మదిగా మాట్లాడాలి, తీవ్రంగా మాట్లాడవద్దని నీ మాటలు అతని కోరికకు అనుగుణంగానే వినిపించాలని చెప్తాడు. అంతేకాకుండా అవసరమైతే దుర్యోధనుని క్రిందపడి వినయంగా దుర్యోధనునే అనుసరించడానికైనా సిద్ధమే అంతేగాని మా వలన భరతవంశం నశించకూడదని చెప్తాడు.( సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 74 వ అధ్యాయం).*

### 3.16.16. శ్రీకృష్ణుడు భీమున్ని ఉత్తేజపరుచుట:

శ్రీకృష్ణుడు భీముని మాటలకు నవ్వుకున్నాడు ఇలా శ్రీకృష్ణుడు నవ్వడంలోని అంతర్యాన్ని పరిశీలిస్తే శ్రీకృష్ణుడు భీమసేనుని ఉత్సాహపరచడం:

చిన్నప్పటినుండి భీముడిని చంపడానికి ప్రయత్నించిన దుర్యోధనుని క్షమించగల ఓర్పు భీమునికి ఎలా వచ్చిందని ఆశ్చర్యపోతున్నాడు అంతే కాకుండా సభలో భీముడు మాటలను పరిశీలిస్తే ద్రౌపదికి జరిగిన అవమానాన్ని చూసిన భీముడు సభలో దుశ్శాసన గురించి చెపుతూ

*"యద్యేత్ దేవ ముక్త్యాహం న కుర్యాం పృధివీశ్వరాః*

*పితామహానాం పూర్వేషాం నాహం గతిమవాప్నుయామ్*

*నపి చేయం బలాద్ వక్షః భిత్త్వా చేద్ రుధిరం యుధి" ( సంస్కృత భారతం,సభా పర్వము .68అధ్యాయం,పుట: 1026).*

పాపాత్ముడైన ఈ దుశ్శాసనుడు దు భరత వంశానికి అపకీర్తి తెస్తున్నాడు యుద్ధంలో ఇతని గుండెను చీల్చి నెత్తురు త్రాగుతాను లేకపోతే నాకు ఉత్తమ గతులు ఉండవని చెప్తాడు. అంతేకాకుండా సభలో దుర్యోధనుడు భీముని రెచ్చగొట్టే విధంగా ద్రౌపదిని చూచి నవ్వుతూ తన వస్త్రాన్ని పైకెత్తి తన ఎడమ తొడను ద్రౌపదికి చూపించాడు అది చూసి భీముడు యుద్ధంలో నీ తొడును బ్రద్దలు కొడతానని ప్రతిజ్ఞ చేస్తాడు.

అంతటి క్రోధంతో ఊగిపోయే భీముడు తన ఇంటి ఇల్లాలికి జరిగిన అవమానాన్ని అంతలోనే మరిచిపోయి ఈ శాంతి వచనాలు పలకడం ఆశ్చర్యాన్ని, హాస్యాన్ని శ్రీకృష్ణునికి కలిగించాయి ఆ భీమసేనుని సహజమైన లక్షణాలను బయటకు తీసుకురావడం కోసం శ్రీకృష్ణుడు ప్రయత్నిస్తున్నాడు.

ఉ.'' *యుద్ధము మీఁది వేడ్కయు మహోగ్ర విరోధుల నల్కఁజేయు ద*
*ర్పోద్ధతియున్ సుయోదనుని యున్నతి సొఁపని యేపు రాజ్య సం*
*సిద్ధి నిజాగ్రజన్మునకుఁజేయు తలంపును గల్గు నీ వసం*
*బద్ధములైన వాక్యములు పల్కుట యొప్పునె కీచకాంతకా!''*
*(ఆంధ్రమహాభారతం, ఉద్యోగ పర్వం, తృతీయాశ్వాసం,55 వ పద్యం, ).*

ఎప్పుడు యుద్ధం మీద ఆసక్తి గల భీముడు శత్రువులను భయపెట్టే పరాక్రమం గల భీముడు దుర్యోధనుని గొప్పతనాన్ని సహించని వాడు ధర్మరాజుకు రాజ ప్రాప్తి కలిగించాలని ఆశపడే నీవుశాంతంగా మాట్లాడటం ఆశ్చర్యం కలిగిస్తుందని అంటాడు. అంతేకాకుండా నీకు ఇంత పిరికితనం ఎవరు అలవాటు చేశారోనని పరిహసిస్తాడు శ్రీకృష్ణుడు.

సంస్కృత భారతంలో భీమసేనుడి హృదయం చలిస్తుందని, శిథిలమవుతుందని, భీముని తొడలు పటుత్వం కోల్పోయాయని అందుకే సంధిని కోరుకుంటున్నావని అంటాడు. అంతేకాకుండా భీమునిలో ఉన్న బలహీనత సరైనది కాదని తన పరాక్రమంతో సాధించని దానిని అనుభవించడానికి క్షత్రియుడు ఇష్టపడడని అంటాడు.

### 3.16.17. భీముడు తన సామర్థ్యాన్ని తెలుపుట:

ఈ విధంగా శ్రీకృష్ణుని మాటలకు భీముడు ఈ విధంగా సమాధానం ఇస్తాడు.

కృష్ణునితో భీముడు నా గురించి తెలిసే మాట్లాడుతున్నావా కృష్ణా ధర్మరాజు మాటలకు అడ్డు చెప్పలేము కాబట్టి అలా మాట్లాడాను.

నా శక్తి సామర్థ్యాలు తెలుసుకోకుండా ఇలా మాట్లాడుతున్నావు నా బలం ఎటువంటిదంటే నింగి నేల తలకిందులైనప్పటికీ వెనుకాడకుండా నా చేతులు అడ్డుపెట్టి వాటిని వాటిస్థానాలకు నెట్టి వేయగల బలం కలవాడినని చెప్తాడు.

*క.	నా కొలఁది విచారింపక । నీ కిట్లనఁ దగునె? మిన్ను నేలయు నిమ్మెఁ
గాక తిరుగంగఁబడినం। బోకే ముంజేతు లొడ్డి పోవఁగఁద్రోతున్ (ఆంధ్రమహా భారతం, ఉద్యోగ పర్వం, తృతీయాశ్వాసం, 60 వ పద్యం, ).*

సంస్కృత భారతంలో హనుమంతుడు సముద్రుడు, వజ్రధారియైన ఇంద్రుడు ముగ్గురు తమ బలాలను సమీకరించుకొని వచ్చినా నా చేత చిక్కిన వాడు తప్పించుకోలేడు. నా ఎముకల సారం తరిగిపోవడం లేదు నా మనసు చలించదు లోకమంతా కోపంతో చుట్టి వచ్చినా నాకు భయం లేదు.నేను శాంతిని గురించి మాట్లాడటం నా మంచితనానికి సంబంధించింది దయతో సమస్త కష్టాలను సహించగలను మా కారణంగా భరత వంశం వినాశనం జరగకూడదని చెప్తాడు.

ఈ మాటలను పరిశీలిస్తే యుద్ధం చేయాలనీ కుతూహలం ఉన్నప్పటికీ శాంతంగా మాట్లాడటం వలన  భీముని మంచితనం వ్యక్తమవుతుంది. ఒకవేళ యుద్ధమే సంభవిస్తే భీమునిలో దాగి ఉన్న క్రోధాగ్ని ఒక్కసారిగా ప్రజ్వరిల్లి శత్రునాశనం జరుగుతుందనే భావం భీముని మాటల్లో స్పష్టం అవుతుంది.

### 3.16.18. శ్రీకృష్ణుడు భీముడికి దైవపురుష ప్రయత్నాన్ని గురించి తెలుపుట:

భీముని మాటలకు శ్రీకృష్ణుడు నీ యొక్క ఆలోచనలు తెలుసుకోవాలని  పరిహాసానికి అన్నాను నీ అసామాన్య వీరుడివి సాధు స్వభావం నీవంటి రాచబిడ్డలకు  తగినది కాదు నీ భుజసారం నాకు తెలుసని చెప్తాడు.**(ఆంధ్ర మహాభారతం, ఉద్యోగ పర్వం, తృతీయాశ్వాసం, 61 వ పద్యం).**

భారతంలో శ్రీకృష్ణుడు భీముడికి దైవ పురుషాకారాల సమన్వయంతో కార్యం ఎలా సిద్ధిస్తుందో వివరిస్తాడు.

*"తత్రేయ మనుమాత్రా మే భీమసేన వివక్షితా।
నైకాంత సిద్ధిర్వక్తవ్యా శత్రుభిః సహ సంయుగే"।। ( సంస్కృత భారతం , ఉద్యోగ పర్వం, 77 వ అధ్యాయం, 13 వ శ్లోకం).*

శత్రువులతో యుద్ధానికి సిద్ధపడినప్పుడు గెలిచి తీరుతామని చెప్పకూడదని చెప్తాడు.అలాగే ఆలోచనలు మారినా ప్రారబ్ధాన్ని అనుసరించి విపరీతమైన సంఘటనలు

జరిగినా తేజస్సును కోల్పోకూడదు నిరుత్సాహపడి దుఃఖానికి లోను కాకూడదని చెప్తాడు.ధృతరాష్ట్రుడి దగ్గరకు పోయి మీ అర్థ సిద్ధికి భంగం కలగని విధంగా సంధి చేయడానికి ప్రయత్నిస్తాను. వారు సంధి చేసుకుంటే నాకు అఖండ కీర్తి వస్తుంది. మీ కోరిక నెరవేరుతుంది వారికి కూడా అది శ్రేయస్కరం లేదంటే భీకరమైన యుద్ధం జరుగుతుంది ఆ యుద్ధంలో అర్జునునికి నేను రథసారథిగా ఉంటానని చెప్తాడు.యుద్ధ భారమంతా నీ మీద ఆధారపడి ఉందని చెప్పడంలో భవిష్యత్తులో దుర్యోధనుని జయించి విజయం అందుకోగల శక్తి సామర్థ్యాలు భీముని దగ్గరే ఉన్నాయని తెలుస్తుంది.

సంస్కృత భారతంలో యుద్ధ భారం భీమునితో పాటు అర్జునుడు కూడా భరిస్తాడు భారమంతా మీ ఇద్దరే మోయవలసి ఉంటుందని చెప్తాడు.

*'' అస్మిన్ యుద్ధే భీమసేన త్వయి భారః సమాహితః*
*ధూరర్జునేన ధార్యా స్యాద్ వోఢవ్య ఇతరో జనః'' (సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 77 వ అధ్యాయం,18 వ శ్లోకం).*

ఈ విషయాన్ని పరిశీలిస్తే అర్జునుని పరాక్రమం భీముని బలం ఈ రెండే యుద్ధంలో కీలకంగా మారి విజయాన్ని తెచ్చిపెట్టే అంశాలుగా ఉన్నాయని శ్రీకృష్ణుడి అభిప్రాయంగా కనబడుతుంది.

### 3.16.19. అర్జునుడు తన అభిప్రాయాలను విన్నవించుట:

రాయబారిగా వెళ్తున్న శ్రీకృష్ణునికి అర్జునుడు చెప్పిన విషయాలను గమనిస్తే ధర్మరాజు చెప్పిన విషయాల మీదే మేము కట్టుబడిఉన్నాము. అయినా చెప్పవలసిన మాటలను చెప్తున్నాను.ధృతరాష్ట్రుడు దురాశకలిగిన వాడు అతని కొడుకు మూర్ఖుడు కాబట్టి సంధి జరగదని నీవు అనుకుంటున్నట్లు ఉన్నావు. నీవు తలచుకుంటే శాంతిని సాధించగలవు.

*ఉ. నీ వొనరింపబూనిన పనిం గమలోదర కీడు పుట్టునే?*
*కా వనినట్ల యుండి యవుఁగార్యము లట్లగుటంబ్రయత్న సం*
*భావన సేఁత పౌరుషము పద్ధతి తప్పల సిద్ధివొందు చో*

*దైవముదోద్భుడన్ వలయుఁదథ్యము రెండును నీ వినోదముల్ (ఆంధ్ర మహాభారతం, ఉద్యోగ పర్వం తృతీయాశ్వాసం, 73 వ పద్యం,.)*

శ్రీకృష్ణుడు సాధించని కార్యమంటూ ఏదీ ఉండదని కొన్ని పనులు ఫలించినట్లే ముందు కనిపిస్తాయి కాని చివరకు ఫలితాన్నిస్తాయి. మానవ ప్రయత్నం చేస్తేనే దైవ సహకారం లభిస్తుంది. కార్యం ఫలించాలా ఫలించకూడదా అనే రెండు అంశాలు నీ అధీనంలోనే ఉంటాయి. మోసపు జూదంలో ఓడించి అవమానించిన వారు వధింప తగిన వారని అందరికి తెలిసిన విషయమే ప్రేమకొలది మాకు జరిగిన పరాభవానికి దుఃఖము వారిపై కోపము కలగడం సహజమే ఆ కారణం చేత యుద్ధం రాజ్య భాగం తీసుకోవడం మంచిదని చెప్పావని అర్థమవుతుంది. నిండు సభలో ద్రౌపదికి జరిగిన అవమానాన్ని సహించాము. వీటినన్నింటిని మన్నించి మాకు సంధి పొసగేటట్లు చేయమని అర్జునుడు చెప్తున్నాడు. పాండవులకు ఇది తగినది ఇలా చేస్తే వారికి ఉపయోగముంటుందని ఏదైతే భావిస్తావో అలాగే చేయుము. మా తక్షణ కర్తవ్యంగా దానినే నిర్ణయించమని అర్జునుడు చెప్తాడు.

అర్జునుని మనసులో కూడా వారు పొందిన పరాభవాలు ద్రౌపదికి అవమానాలు గుర్తున్నాయి. ధర్మరాజును  అనుసరించిన మార్గాన్ని అనుసరిస్తూనే చివరకు శ్రీకృష్ణునికే కర్తవ్య బాధ్యతలు అప్పజెప్పాడు. దీని వలన శ్రీకృష్ణునికి భవిష్యత్ లో జరగబోయే పరిణామాలు అంచనా వేయగలడు కాబట్టి అతని నిర్ణయానికే వదిలేసాడు.

### 3.16.20. అర్జునుడికి శ్రీకృష్ణుని సమాధానం:

శ్రీకృష్ణుడు సంధి కోసమైతే ప్రయత్నం చేస్తాను. అయితే ఈ ప్రయత్నం ఎలాంటిదంటే పొలాన్ని దున్ని పదును చేసి నీటితో తడిపినా ఒక్కొక్కసారి వాన లేకపోతే సరిగ్గా ఫలించదు. చిన్నప్పటి నుండి ఎన్నో దుర్మార్గాలకు పాల్పడిన దుర్యోధనుడు రాజ్య భాగం ఇవ్వడం దైవం ఏమి చేయదలచాడో చెప్పలేమని అంటాడు.

*''అహం హితత్ కరిష్యామి పరం పురుషకారతః*
*దైవం తున మయా శక్యం కర్మ కర్తుం కథంచన.(సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 79 వ అధ్యాయం, 5వ శ్లోకం).*

పురుష ప్రయత్నంగా చేయగలిగినంత చేస్తాను. దైవికమైన ప్రారబ్ధ ఫలాన్ని నేను ఏమి చేయలేను. ఫలితాన్ని కల్పించడం కాని, మార్పు చేయడం కాని నా వల్ల కాదని చెప్తాడు. ఈ మాటలు ఆంధ్రమహాభారతంలో ఉండవు.

శ్రీకృష్ణుడు పాండవుల నుండి దూరం చేయాలని దుర్యోధనుడు ఎన్నో సార్లు ప్రయత్నించాడు కాని నేను సుయోధనుని కోరికను అంగీకరించలేదని అంటాడు. నేను ధర్మరాజుకు మేలు చేయడానికి ఇష్టం కలిగిన వాడినని ఆ దుర్యోధనుడు గట్టిగా అభిప్రాయపడుతున్నాడని చెప్తాడు.అంతేకాక అంతకు పూర్వపు సంఘటనను శ్రీకృష్ణుడు అర్జునునకు గుర్తు చేస్తున్నాడు

ఉత్తర గోగ్రహణ సమయంలో భీష్ముడు దుర్యోధనునికి రాజ్యాన్ని పాండవులకు ఇవ్వమని అడిగితే దుర్యోధనుడు తిరస్కరిస్తాడు యుద్ధం ద్వారా సమస్త రాజ్యాన్ని నేనే పొందుతానని అహంకారంతో పలుకుతాడు. ఉత్తర గోగ్రహణంలో విజయం ఎవరిని వరించిందో తెలిసినప్పటికీ మూర్ఖంగా ఇప్పుడు ప్రవర్తిస్తున్నాడు. నేను ధర్మరాజు కోరిన విధంగా రాయబారం నడపడానికి కురు సభకు వెళ్తాను ధర్మరాజు ఆదేశాన్ని పాటిస్తాను దుర్మార్గుడైన ఆ సుయోధనుని పాపకర్మలకు తగిన శిక్షణ కూడా ఆలోచించాలి అంటాడు.

ఈ విధంగా పలికిన శ్రీకృష్ణుని మాటల్లోని అంతరార్థం దుర్యోధనుని బుద్ధి ఏమాత్రం మారదని స్పష్టంగా తెలిసిపోతుంది కాబట్టి యుద్ధం నిశ్చయం దుర్యోధనుని శిక్షించడం తప్పదు సంధి ప్రయత్నం కేవలం పాండవుల స్వభావాన్ని కురువంశీయులందరికి చాటి చెప్పడానికి కౌరవుల దుర్బుద్ధులను అందరికీ తెలిసేలా చేయడానికని అర్థమవుతుంది.

### 3.16.21. **నకులుని అభిప్రాయం:**

నాకు ధర్మరాజు అర్జునుడు భీముడు నీవు అందరూ వారి యొక్క అభిప్రాయాలను ప్రకటించారు వాటిని అన్నింటిని ఆలోచించకుండా శత్రువుల అభిప్రాయాన్ని తెలుసుకొని అప్పటికి ఏది మంచిదో దానిని పాటిస్తే బాగుంటుంది. ఆలోచన విధానం ఎప్పటికప్పుడు మారిపోతూ ఉంటుంది మనుషుల బుద్ధి స్థిరమైనది కాదు మేము అరణ్యవాసంలో ఉన్నప్పుడు మా ఆలోచన ఒకరకంగా అజ్ఞాతవాసంలో మరొక రకంగా ఉండేవి. ఇప్పుడు

మరొక రకంగా ఆలోచిస్తున్నాం ఇప్పుడు నీ అనుగ్రహం వలన ఏడు అక్షౌహిణుల సేన ఏర్పడింది. వారి పరాక్రమం అసామాన్యమైనదని చెప్తూ ఉత్తర గోగ్రహణం అనంతరం కౌరవులు అంతకు ముందు ఉన్న కఠినత్వాన్ని వదిలిపెట్టి ఉంటారు అంతేకాక పాంచాలి ,యాదవ ,పాండ్య, మత్స్య దేశాల రాజుల సాహసకృత్యాలు ఎలాంటివో వారికి తెలుసు భీమార్జునుల పరాక్రమం ధర్మరాజుకు నీ సహకారం ఉన్నాయని వారికి తెలిసే ఉంటుంది. ద్రోణ ,కృపాచార్యుడు ,బాహ్లికుడు , భీష్ముడు వారికి బుద్ధి చెప్పే ఉంటారు.నీవు చెప్పే కర్తవ్యబోధ వాళ్ళు తిరస్కరించలేరని చెప్తాడు.ఇక్కడ పాంచాల ,యాదవ ,పాండ్య, మత్స్య దేశాల రాజుల పరాక్రమం చెప్పబడి ఉంది. **(ఆంధ్ర మహాభారతం, ఉద్యోగ పర్వం, తృతియాశ్వాసం, 92 వ పద్యం, ).**

సంస్కృత భారతంలో సాత్యకి, విరాటుని, ద్రుపదుని, దృష్టద్యుమ్నుని కాశీరాజు, ఛేది భూ పాలుడు ధృష్టకేతుని ఎదిరించగల వారు లేరని ఉంటుంది.(**సంస్కృత భారతం , ఉద్యోగ పర్వం,805వఅధ్యాయం.**

చివరలో నకులడు నీవు కౌరవుల దగ్గరకు వెళ్తే వారు నిన్ను అనాదరించకపోవడానికి భయపడతారు నీవు వెళ్లిన వెంటనే కార్యం సఫలం అవుతుందని చెప్పి పంపుతాడు.నకులుడు మాట్లాడిన మాటలు శ్రీకృష్ణుని పై ఉన్న అపారమైన భక్తి అందరూ అలాంటి స్వభావం కలవారుగా ఉంటారని భ్రమించి కౌరవుల ప్రవృత్తి మారిపోయి ఉంటుందనే భ్రమలో ఉన్నట్లు తెలుస్తుంది. ఇలా చెప్తూనే పరాక్రమవంతుల పేర్లు తీసుకురావడంతో ఒకవేళ యుద్ధం జరిగితే వీరిని ఎదిరించే వారు ఎవరూ ఉండరనే అభిప్రాయాన్ని వెల్లడించినట్లు తెలుస్తుంది.

### 3.16.22. సహదేవుడి అభిప్రాయం:

తర్వాత సహదేవుడు ధర్మరాజు భీమార్జునులు శాంతియుతంగా సంధి ప్రయత్నం చేయమంటున్నారు నేను మాత్రం యుద్ధం జరగాలని కోరుకుంటున్నాను ఆ విధంగా నువ్వు ప్రయత్నించాలి సంస్కృత భారతం లో కంటే ఆంధ్ర మహాభారతంలో సహదేవుడి ఆంతర్యం చక్కగా ఆవిష్కరించబడుతుంది దానికి ఉదాహరణగా ఈ పద్యాన్ని గమనించవచ్చు

*‘‘మ. తలఁపం గూడునె యింత లేసి దొర లీ దైన్యంబు? చుట్టంబులుం*

*జెలులుం దిట్టరె? లాఁతిరాజులకు మెచ్చె యి వ్విధం బట్టిదిం*

*గలదే? వేఁడగ ధర్మజు డడుగఁ బోఁగాఁ గృష్ణుఁడా ధార్తరా*

*ష్ట్రులు పాలీక చలంబునం బెనఁగ నిట్లుం గూడు దీపయ్యెనే?( ఆంధ్రమహాభారతం, ఉద్యోగ పర్వం, తృతియాశ్వాసం,95 వ పద్యం).*

ధర్మరాజు అంతటి గొప్పవారు ఇంతటి దైన్యానికి దిగజారడం ఊహించలేకపోతున్నాం ఈ విషయాన్ని ఎవరు సహించలేరు యుద్ధం చేయడానికి వచ్చిన పాంచాలాది రాజులకు ఈ విధంగా సంధి కోసం చేసే రాయబారం వారికి గౌరవంగా ఉండదు. ధర్మరాజు రాజ్య భాగాన్ని యాచించడమేమిటి పరమ పురుషుడైన శ్రీ  కృష్ణుడు అడగడం ఏమిటి అంటూ తన ఆవేశాన్ని వ్యక్తం చేస్తాడు.

సంస్కృత భారతంలో భీముడు, అర్జునుడు, ధర్మరాజు ధర్మ మార్గాన్ని అనుసరించినా నేను మాత్రం ధర్మాన్ని వదిలి యుద్ధంలో పోరాడాలని కోరుకుంటున్నానని చెప్తాడు.సూటిగా చెబుతున్నట్లు ఉంటుంది.

*మ. తుది రాజ్యమ్ము సగమ్ము గొ ,మ్మడవియందుం బేరు వంచించియుం*

*బదుమూఁడేఁడులు నీవునుం దిరిగిరాఁ బాలీకపోవచ్చునే?*

*యది గాదేఁదెగి బంటవై యఱుము మామల్ వన్ను నేర్పింకఁజె*

*ల్లదుసూ నీ కని యా సుయోధనుని యుల్లం బుచ్చిపోనాడుమీ!''(ఆంధ్ర మహాభారతం , , ఉద్యోగ పర్వం, తృతియాశ్వాసం, 97 వ పద్యం, ).*

సహదేవుడు శ్రీకృష్ణునితో ధృతరాష్ట్రుడు 13 ఏళ్లు అరణ్యవాసాలు ముగించేసి వచ్చిన తర్వాత రాజ్యభాగం మీకు ఇవ్వకుంటే ఒప్పుకుంటావా?

అలాగే మా విషయంలో కూడా రాజ్యభాగం ఇవ్వకుండా ఉండడానికి వీలు లేదు అలా ఇవ్వడానికి నీకు ఇష్టం లేకపోతే యుద్ధంలో చావుము, నీ మాయలు సాగవని దుర్యోధనునికి చెప్పమని చెప్తాడు, అయితే ఈ మాటలకు సాత్యకి సంతోషించి సహదేవుడు నిర్ణయం చాలా బాగుందని మెచ్చుకుంటారు. దుర్యోధనుడితో మంతనాలు జరిపితే మన గౌరవం భంగపడుతుంది ఇక్కడ ఉన్న యోధులందరికీ యుద్ధమే ఇష్టమని చెప్తాడు. వీరులంతా సాత్యకి మాటలను ప్రశంసిస్తారు.

సంస్కృత భారతంలో  సాత్యకి అరణ్యవాసంలో పాండవుల స్థితిని గుర్తు చేస్తూ

*“నజానాసి యథా దృష్ట్వా చీరాజిన ధరాన్ వనే1*

*తవాపి మన్యురుద్భూతో దుఃఖితాన్ ప్రేక్ష్య పాండవాన్”( సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 81 వ అధ్యాయం, 6 వశ్లోకం).*

కృష్ణునితో ఈ విధంగా అంటాడు అరణ్యంలో నార చీరలను, జింక చర్మాలను ధరించి తిరుగుతున్న పాండవులను చూసి నీకు కూడా కోపం కలిగింది కదా అని గుర్తు చేస్తాడు ఇలా గుర్తు చేయడం వలన ధర్మపరులైన పాండవుల దైన్యస్థితి మరల ఒకసారి గుర్తు చేయడం వలన ధర్మపరులైన పాండవుల పక్షం రాయబారం సఫలీకృతం కావడంలో ఈ మాటలు తోడ్పడుతాయని తెలుస్తుంది.

### 3.16.23. ద్రౌపది కృష్ణునితో తన కష్టమును తెలుపుట:

ధర్మరాజు మాటలు ద్రౌపదికి బాధను కలిగించాయి. అందరి మాటలు విన్న ద్రౌపది కోపించి శ్రీకృష్ణుడితో తన బాధను చెప్తుంది. అంతేకాకుండా భీమసనుడు కూడా శాంతంగా మాట్లాడటం తట్టుకోలేక పోతుంది శ్రీకృష్ణునితో ఈ విధంగా అంటుంది. ధర్మరాజు దుర్యోధనాదులు తమ్ముళ్లనే భావంతో వారిచే పొందిన అవమానాలు సహించినప్పటికీ రాజ్యంలో భాగం తీసుకోకుండా సంధికి అంగీకరిస్తే అందరూ పాండవులు అవివేకులని అనుకుంటారు కదా  సంధి కౌరవులకి లాభాన్ని చేకూరుస్తుంది తమయొక్క కౌరవులు యొక్క బలాబలాలు పోల్చి చూసుకుంటే పాండవులు కార్యం సాధించగలుగుతారు సంధి కుదరకపోతే యుద్ధం చేయాల్సిన తలంపు వీరికి లేదు అలా ఉంటే గెలవడంలో అనుమానానికి ఆస్కారమే ఉండదు. ఏ తప్పు చేసినా మనం విడిచి పెట్టడానికి దుర్యోధనాదులు బ్రాహ్మణులు కాదు కదా అని అంటుంది ద్రౌపది.

ఈ మాటలు పరిశీలిస్తే బ్రాహ్మణులు శిక్షార్హులు అయినప్పటికీ వారిని చంపకూడదు అనే సూక్ష్మధర్మాన్ని తెలియజేస్తుంది దుర్యోధనుడు అలాంటి బ్రాహ్మణ స్వభావం కలిగిన వాడు కాదు కదా అతను పైగా మూర్ఖుడు అతను క్షమార్హుడు కాదని ద్రౌపది అభిప్రాయం. అంతేకాదు సుయోధనుడి మనసులో భయం కొంచెం కూడా లేదు నీవు చెప్పే మాటలు లెక్క చేయక అవమానపరిచే మార్గాలు వెతుకుతాడు ఆ కురుసభలో

యుద్ధమే నిశ్చయమైతే అప్పటికైనా పాండవులు యుద్ధానికి సిద్ధపడతారా లేదంటే శాంతి అందరికీ మంచిదని అడవులకు వెళ్లడానికి సిద్ధపడతారా అని మనసులో నిండిన ఆవేదనతో అడుగుతుంది నీవు ధర్మరాజు అతని తమ్ముళ్లు కలిసి ఏది తగినదో దానినే నిశ్చయించండి అయితే నా మాటలు జ్ఞాపకం ఉంచుకొని వారి గౌరవం చెడకుండా ఉండే విధంగా సంధి ప్రయత్నం చేయమని చెప్తుంది.

*చ. వరమున్ బుట్టితిన్, భరత వంశముఁ జొచ్చితి, నందుఁ బాండు భూ*

*వరునకుఁ గోడలైతి, జనవంద్యులఁ బొందితి , నీతి విక్రమ*

*స్థిరులగు పుత్రులం బడసితిన్, సహజన్ముల ప్రాపు గాంచితిన్*

*సరసిజనాభ! యిన్నిటఁబ్రశస్తికి నెక్కినదాన నెంతయున్.( ఆంధ్ర మహాభారతం, ఉద్యోగ పర్వం, తృతియాశ్వాసం, 108 వ పద్యం, ).*

ద్రౌపది వరప్రసాదం వలన పుట్టానని భరత వంశంలో అడుగు పెట్టాను. పాండురాజు వంటి పరాక్రమవంతునికి కోడలినయ్యాను జనులంతా పూజింపదగిన భర్తలను పొందాను రాజనీతి, సౌర్యం ఉట్టిపడే  తమ పుత్రుడు కన్నాను తోబుట్టువుల అండదండలున్న నేను అనేకవిధాల ప్రఖ్యాతి గడించాను అంటుంది. అటువంటి ఉత్తమ చరిత్ర గల నాకు  కురుసభలో అవమానం జరిగింది.సుభద్ర కంటే మిక్కిలి గౌరవిస్తావు నన్ను అటువంటి నీ చెల్లెలు యొక్క క్షోభను తీర్చే భారం నీ పైన ఉందనే అభిప్రాయాన్ని ద్రోపది వెల్లడిస్తుంది. దుశ్శాసనుడు నా జుట్టు పట్టుకుని సభకు ఈడ్చుకుని వచ్చాడు నా భర్తలు బాధపడ్డారే కానీ ఏమీ చేయలేకపోయారు ఈ పరాభవాన్ని కురుసభలో గుర్తు చేయమని చెప్తుంది. ద్రౌపది ఇలా మాట్లాడుతూ తన కొప్పును విప్పి శిరోజాలను కుడి చేతి దాల్చి తన మనసులో చెలరేగే దుఃఖాన్ని, కోపాన్ని ఆపుకోలేక పీఠం నుండి వెంటనే లేచి ఇలా అంటుంది.ఈ శిరోజాలు దుశ్శాసనుడు నన్ను బలత్కారంగా సభకు ఈడ్చి తెచ్చేటప్పుడు అతని వేళల్లో చిక్కుకొని తెగిపోగా మిగిలినవి. కౌరవుల దగ్గర మాట్లాడే సమయంలో వీటిని గుర్తు చేసుకోవాలి. అటువంటి దుశ్శాసనుడి హస్తం అతని శరీరం యుద్ధంలో ముక్కలు ముక్కలుగా చెల్లా చెదురై పడి ఉన్నప్పుడు మాత్రమే నాకు మనశ్శాంతి యుద్ధరంగంలో దుర్యోధనుడిని  చూడలేనప్పుడు గదను ధరించిన భీముని భుజబలం

గాండీవాన్ని ధరించిన అర్జునుని సౌజన్యము వృథాయే కదా అని పరోక్షంగా మాట్లాడుతుంది ఆ మాటల్లోనే రెచ్చగొడుతున్నట్లు కనబడుతుంది.

సంస్కృత భారతంలో ద్రౌపదీ తన కురులను ఎడమ చేతితో పట్టుకున్నట్లు ఉంటుంది.

*''కేశ పక్షం వరారోహా గృహ్య వామేన పాణినా*

*పద్మాక్షీ పుండరీకాక్షమ్ ఉపేత్య గజగామినీ*

*అశ్రుపూర్ణేకషణా కృష్ణా కృష్ణం వచమబ్రవీత్ '' ( సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 82 వ అధ్యాయం, 34,35 శ్లోకాలు).*

మహా సర్పం వంటి కాంతి కలవి అయిన తన కురులను ఎడమ చేతితో పట్టుకొని శ్రీకృష్ణునితో బాధను తెలుపుతుంది.

## 3.16.24. శ్రీకృష్ణుడు ద్రౌపదిని ఓదార్చుట:

తన బాధ తెలిపి ఏడుస్తుండగా ఆమెను శ్రీకృష్ణుడు ఓదార్చి ద్రౌపదితో శ్రీకృష్ణుడు ఇలా అంటాడు దుఃఖాన్ని విడిచి పెట్టు నీవు ఎంత బాధ పడ్డావో దుర్యోధనాదల భార్యలు కూడా దుఃఖపడే సమయం ఎంతో దూరంలో లేదు అంటే దుర్యోధనునికి కాలం దగ్గర పడిందని అర్థం.

భక్తుల బాధలు కృష్ణుడికే అర్థమవుతాయి అసలు కృష్ణ పదానికి అర్థం గమనిస్తే ''కర్షయతి కృష్ణః'' అని కృష్ణ శబ్దానికి వ్యుత్పత్తి సర్వజీవాత్మలను ఆకర్షించేవాడని అర్థం.కృష్ణ శబ్దములోని 'కృష్' ధాతువుకు 'భక్తి' అని 'న' అంటే దాస్యమని అర్థాలున్నాయి.(శ్రీనివాస్ రెడ్డి,ఎ.భాగవత సంప్రదాయంలోని కృష్ణ చరిత కావ్యాలు: ఒక పరిశీలన'' (ఎం.ఫిల్ .పరిశోధనా వ్యాసం),

కౌరవులు సంధి మాటలకు లొంగేవారు కాదు నేను ఊహించిన మాటే నిజం అవుతుంది దైవం నిర్ణయం కూడా ఇదే. శత్రువులను విధ్వంసం చేసి పాండురాజు పుత్రులు మహా వైభవంతో తులతూగే సమయం ఆసన్నమవుతుందని చెప్తాడు.తర్వాత అర్జునుడు కురుపాండవులు ఇద్దరు నీకు బంధువులే కనుక ఇరువర్గాలకు మేలుకూర్చే విధంగా కార్యాన్ని నిర్వహించమని చెప్తాడు.

శ్రీకృష్ణుడు నేను ఆవిధంగానే తలుస్తున్నాను ధర్మరాజు పని మీద ధృతరాష్ట్రుడి దగ్గరకు మిక్కిలి సంతోషంతో వెళ్తున్నాను అనగానే ఆ మాటలు విన్న ధర్మరాజు సంతోషపడి నీవన్నట్లు చెయ్యి మా ఆలోచన కూడా అదే అని చెప్తాడు.

### 3.16.25. శ్రీకృష్ణున్ని సంధికి అంగీకరించవద్దని చెప్పుట:

సంస్కృత భారతంలో దుర్యోధనుడు రాజ్యభాగం ఇవ్వకుండా సంధికి అంగీకరిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోవద్దని చెపుతుంది.

*“అప్రదానేన రాజ్యస్య యది కృష్ణ జుయోధనః1*
*సంధిమిచ్ఛేన కర్తవ్యం తత్ర గత్వా కథంచన11 (సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 82 వ అధ్యాయం, 10 వ శ్లోకం).*

*“ యది భీమార్జునౌ కృష్ణ కృపణౌ సంధికాముకౌ1*
*పితా మే యోత్స్యతే వృద్ధః సహపుత్రై ర్మహారథైః11”(సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 82 వ అధ్యాయం, 37 వ శ్లోకం).*

ఒకవేళ దీనత్వం కలిగి భీమార్జునులు సంధినే కోరుకున్నట్లయితే నా తండ్రి వృద్ధుడైనప్పటికీ మహా రథులైన తన కొడుకులతో కలిసి యుద్ధం చేస్తాడు మహా పరాక్రమవంతులైన ఐదుగురు కొడుకులు అభిమన్యుని ముందుంచుకొని కౌరవులతో యుద్ధం చేస్తారని అంటుంది. భర్తలు మౌనంగా ఉంటే తనను అర్థం చేసుకోలేక తనకు జరిగిన అవమానాన్ని గుర్తు చేసుకోకుండా సంధికే ప్రయత్నిస్తానని చెప్పినట్లయితే తన పుట్టింటి వారు తోబుట్టువులు యుద్ధం చేస్తారని వారితో పాటు పాండవుల పుత్రులు అభిమన్యుడిని ముందుంచుకొని యుద్ధం చేస్తారని వారు శత్రువులను నశింప చేయడంలో వెనుతిరగని పరాక్రమ సంపద కలిగిన వారని చెప్తుంది ఇలా చెప్తే అయినా భీమార్జునులకు పౌరుషం కలుగుతుందని ద్రౌపది భావించినట్లనిపిస్తుంది.

### 3.16.26. శ్రీకృష్ణుని హస్తిన ప్రయాణం:

శ్రీకృష్ణుడు రాయబారానికై హస్తినకు బయలుదేరడం రాయబారిగా వెళ్ళేది శ్రీకృష్ణుడు అక్కడ ఏమి జరుగుతుందో ఊహించినవాడు కావునయోధులు అతనిని

అనుసరించే వారు దుర్మార్గులని భావించి శంఖచక్ర గదా మొదలగు ఆయుధాలను రథంలో పెట్టించాడు. శత్రువు బలహీనుడైనా సరే బలవంతులు వారిని తేలికగా తీసుకోకూడదని చెప్తాడు.

చెప్పిన ఈ మాటల్లో దుర్యోధనాదులు బలహీనులని స్పష్టంగా అర్థమవుతుంది శ్రీకృష్ణుడు వారి శక్తి యుక్తుల మీద నమ్మకం ఉంది కాబట్టి బలవంతుడైనప్పటికీ బలహీనులైన శత్రువులను తేలికగా తీసుకోకుండా ముందు జాగ్రత్తగా ఆయుధాలను రథంలో పెట్టిస్తాడు రాయబారికి ఉండవలసిన సూక్ష్మ దృష్టికి ఈ మాటలు నిదర్శనంగా ఉంటాయి. శ్రీకృష్ణుడు హస్తినాపురానికి బయలుదేరుతున్న సమయంలో పాండవులు, యాదవులు, పాంచాల విభుడైన ద్రుపదుడు కేకేయ రాజు పాండ్యవల్లభుడు, విరాట మహారాజు శ్రీకృష్ణుని మొదలగు వారు శ్రీకృష్ణుని అనుకరించారు.

సంస్కృత భారతంలో శ్రీకృష్ణులు హస్తినకు బయలుదేరి సమయంలో వశిష్ఠుడు ,వామదేవుడు భూరిద్యుమ్నుడు, గయుడు, క్రథుడు, శుక్రుడు, నారదుడు ,వాల్మీకి ,మరుత్తుడు, కుశికుడు, భృగుడు, మొదలైన దేవర్షులు, బ్రహ్మర్షులు కూడా శ్రీకృష్ణుని ఎదుట నిలుస్తారు. వారి పేర్లు ఆంధ్ర మహాభారతంలో కనబడవు.

### 3.16.27. ధర్మరాజు కుంతిదేవికి సందేశాన్నందించుట:

ఆ సమయంలో ధర్మరాజు శ్రీహరితో ఇలా అంటాడు.

కుంతి దేవికి సందేశాన్ని పంపుతాడు ఆ సందేశంలో కుంతీదేవి పడిన కష్టాలను తెలియజేస్తూ క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకోమంటాడు దుఃఖాలు అనుభవించడం పూర్తయింది కష్టాలు తొలగే సమయం వచ్చిందని ధర్మరాజు చెప్పినట్లు చెప్పమంటాడు.

ఈ మాటలను పరిశీలిస్తే ధర్మరాజుకు సంధి కుదరదని యుద్ధం తప్పదని యుద్ధానంతరం రాజ్యం దక్కించుకొని అన్నదమ్ములంతా కలిసి సుఖంగా పరిపాలన చేసే రోజులు వస్తాయని భావం వ్యక్తం అవుతుంది ఈ అభిప్రాయాన్ని తల్లిని కుంతీదేవికి ధర్మరాజు తెలిపినట్లు తెలుస్తుంది.

కుంతీదేవికి ఓదార్పు నీవేనని నిన్ను నమ్మి జీవిస్తూ ఉంటుంది. ఇలా అంటూ గురవగు ద్రోణాచార్యులకు బాహ్లికుడు మొదలగువంశ పెద్దలు చెలికాండ్రు సకల రాజులు

సంతోషపడేటట్లు ఏది సరైనదో ఆ విధంగా నమస్కారాలు నా మాటగా వారికి చెప్పుము, ప్రేమతో పాండవులను కౌరవులను పక్షపాతం లేకుండా మేలుకోరే విదురుడిని కౌగిలించుకొని గౌరవంగా మాట్లాడుము.

### 3.16.28. అర్జునుడు శ్రీకృష్ణునికి చెప్పిన తీర్మానం:

తర్వాత అర్జునుడు.

*చ.''జనులు వినంగ రాజ్యమున సాము గొనంగలవారమన్న యీ*
*జనపతి కార్యనిశ్చయము సమ్మతి గైకొని చేసినన్ సుయో*
*ధనుఁడును దమ్ములున్ సఖులు దానికి నేమను నియ్యకొందు మొం*
*దనిన సపుత్త్రమిత్త్రముగ సద్దెస నందఱ గ్రొచ్చి పాఁతుదున్'' (ఆంధ్రమహాభారతం, ఉద్యోగ పర్వం, తృతీయాశ్వాసం, 142 వ పద్యం,).*

జనమంతా వింటున్న సమయంలోనే రాజ్యభాగం సగం మేము తీసుకుంటామని ధర్మరాజు తీర్మానించాడు ఆ తీర్మానానికి సంబంధించి దుర్యోధనుడు అతని తమ్ముళ్లు అతని స్నేహితులు అర్ధరాజ్యమిస్తే మేము అంగీకరిస్తాం. ఇందుకు మరో విధంగా చెపితే కౌరవ పక్షంలో ఉన్న వారినందరినియుద్ధరంగంలో సుతులతో, హితులతో సహా గోతులు త్రవ్వి పూడ్చి పెడతానంటాడు .ఈ మాటలు భీమున్ని ఉత్తేజపరుస్తాయి. నకుల సహదేవులు కూడా సంధి లేక యుద్ధము నిశ్చయించుకుని రమ్మంటారు .

సంస్కృత భారతంలో

*'' యదస్మాకం విభో వృత్తం పురా వై మంత్రనిశ్చయే1*
*అర్ధరాజ్యస్య గోవింద విదితం సర్వ రాజసు11 ( సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 83 వ అధ్యాయం, 51 వ శ్లోకం).*

శ్రీకృష్ణునితో అర్జునుడు మేము రహస్య సమాలోచన జరిపాము మా ఆలోచన అంతా అర్ధరాజ్యాన్ని ఇస్తేనే సంధి చేసుకోవాలని నిశ్చయించుకున్నాము. దీనికి భిన్నంగా దుర్యోధనుడు వ్యవహరిస్తే క్షత్రియులందరినీ అంతం చేస్తాను ఇది నిశ్చయమని చెప్తాడు.

ఈ మాటలను పరిశీలిస్తే ధర్మరాజు శాంతియుతమైన సంధిని కోరుకుంటున్నట్లే ఉంటుంది. మేము రహస్యంగా ఆలోచన చేసి ఒక నిర్ణయానికి వచ్చాము అనడంతో

పాండవులంతా కలిసి ఒక నిర్ణయానికి వచ్చినట్లు అర్థమవుతుంది. సంధి కుదరాలి ఏ విధంగా అర్ధరాజ్యం ఇస్తానని వారు ప్రకటించినప్పుడు మాత్రమే లేదంటే యుద్ధం తప్పనిసరని వాళ్ళు నిశ్చయించినట్లు తెలుస్తుంది.

### 3.16.29. రాయబారానికి వెళ్తున్న శ్రీకృష్ణున్ని దర్శించిన మహర్షులు:

శ్రీకృష్ణుని యొక్క రాయబార విశేషాలు వినాలని కుతూహలంతో శ్రీకృష్ణుని బాటలో మహర్షులు ఎంతోమంది వచ్చారు వారందరినీ శ్రీకృష్ణుడు ఆదరంతో పలకరించారు.

అక్కడ నారదుడు ,అథశ్శిరుడు, సర్పమాలి, దేవల మహర్షి ,ఆరువా వసువు సుజానవు మైత్రేయుడు ,శౌనకుడు, బలి, బకుడు దాల్భ్యాడు స్థూలశిరుడు ,కృష్ణ ద్వైపాయనుడు, అయోధ ధౌమ్యుడుఅణి మాండవ్యుడు, కౌశికుడు, దామోష్ణీషుడు త్రిష వణుడు ,పర్ణాదుడు, ఘటజానుకుడు, మౌంజాయనుడు, వాయు భక్షుడు, పారాశర్యుడు, శాలికుడు ,శీలవంతుడు, అశని, ధాత శూన్యపాలుడు ,అకృతవ్రణుడు ,శ్వేతకేతువు కహోలుడు ,పరశురాముడు శ్రీకృష్ణుని అభినందించారు.

*" తమబ్రవీజ్జామదగ్న్యః ఉపేత్య మధుసూదనమ్1*
*పరిష్వజ్య చ గోవిందం సురాసురపతేః సభా11 " ( సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 83 వ అధ్యాయం, 65 వ శ్లోకం).*

పరశురాముడు శ్రీకృష్ణుని కౌగిలించుకొని మునుల రాకకు గల కారణాన్ని తెలుపుతాడు. వారంతా హస్తినకు బయలుదేరి కౌరవ సభా మధ్యంలో రాజుల సమక్షంలో శ్రీకృష్ణుడు చెప్పబోయే మాటలను ధర్మాలను వినాలని కుతూహలంతో వచ్చారని చెప్తాడు. అలాగే నీవు భీష్మాదులు పలికే హితమైన మాటలను వినాలని కోరుకుంటున్నాం నీ ప్రయాణం నిర్విఘ్నంగా సాగనివ్వు మేము హస్తినలో సభలో నిన్ను దర్శించుకుంటామని చెప్తాడు.

ఆంధ్రమహాభారతంలో

*"..... యొక్క యెడ నారద జమదగ్ని కణ్వాదులగు మహామునులం గొందఱం గని రథంబు డిగ్గి నమస్కరించి సభక్తి తాత్పర్యంబునఁ గుశలం బడిగి మీ రిక్కడకు విజయం చేయుటకుఁగతం బేమి? సేయంగల పని యెయ్యది? నా కానతిండనిన*

*నారాయణునకు నారదుండిట్లనియె'' ( ఆంధ్ర మహాభారతం, ఉద్యోగ పర్వం, తృతియాశ్వాసం, 145 వ వచనం).*

ఆంధ్ర మహాభారతంలో ముందుగా రాకకు గల కారణాలను నారదుడు శ్రీకృష్ణుడికి చెప్పినట్లు ఉంటుంది.

ఈ సన్నివేశంలోని మరొక ముఖ్య విషయం మనం గమనిస్తే విష్ణు స్వరూపాలైనటువంటి వ్యాసుడు, పరశురాముడు, కృష్ణుడు ఈ సందర్భంలో ఒకేసారి దర్శనమివ్వడం మనం గమనించవచ్చు.

అలాగే సంస్కృత భారతం లో శ్రీకృష్ణుడు ప్రయాణ సమయంలో శత్రువులను జయించగల మహారథులు, మహా బాహువులు పదిమంది సైనికులు వేయమంది, అశ్వికులు వెయ్యి మంది ఆయుధాలు ధరించి అనుసరించారు విస్తారమైన భోజన సామగ్రి ,వందల కొలది పరిచారకులు కూడా వెంట వచ్చారు.

ఈ వివరాలను పరిశీలిస్తే రాయబారిగా వెళ్ళేది సాక్షాత్తు సమస్త ప్రాణికోటిని సృష్టించిన పరమాత్మ అటువంటి పరమాత్మ ధర్మం కోసం నిలబడి పాండవుల తరపున ఒక రాయబారకార్యాన్ని నిర్వహించడానికి వెళ్తున్నాడు. కృష్ణుడు అవతార పురుషుడు అయినప్పటికీ సామాన్యమైన వ్యక్తిగా అందరితో ఉంటూనే జగత్ కళ్యాణం కోసం పాటుపడే వ్యక్తిగా ఆయా సందర్భాలలో కనబడుతూనే ఉంటాడు. అటువంటి శ్రీకృష్ణుడు హస్తినకు బయలుదేరినప్పుడు ఋషులు శ్రీకృష్ణుని దర్శనం చేసుకోవడం, శ్రీకృష్ణునికి శుభప్రదం శ్రీకృష్ణుని దర్శించిన వారు పునీతులై తరించినట్లు భావిస్తారు. ఇంకేముంది అనేక శుభ శకునాలతో శ్రీకృష్ణుడు ఏది సంకల్పించాడు అదే జరిగేటట్లు హస్తిననకు బయలుదేరుతాడు శ్రీకృష్ణుడు రాయబారిగా వెళ్లిన శ్రీకృష్ణుడు ఎక్కడ విడిది చేయాలో ఎక్కడ విశ్రమించాలో పరిజ్ఞానం ఎరిగిన వాడు కావున హస్తినాపురానికి దగ్గరలో ఉన్న వృక స్థలంలో విడిది చేస్తాడు.

### 3.16.30. ధృతరాష్ట్రుని అత్యవసర సమావేశం:

ధృతరాష్ట్రుడు, శ్రీకృష్ణుడు తమ దగ్గరకు వస్తున్నాడని తెలుసుకొని భీష్మ ,ద్రోణ ,విదుర దుర్యోధన, కర్ణ ,సైంధవుడిని ,శకుని పిలిపించాడు.

*ధృతరాష్ట్రుడు అందరినీ పిలిపించి దుర్యోధనునితో శ్రీకృష్ణుడు పూజింపదగిన వాడని లోకమంతా అతని దగ్గరకు వెళ్తే అతనే స్వయంగా మన దగ్గరికి వస్తున్నాడని శ్రీకృష్ణుని పూజింపకపోతే మనకు కష్టం కలుగుతుంది మన సత్కారాలతో సంతోషిస్తే సమస్త రాజుల విషయంలో మన కోరికలు సఫలం చేసుకోవచ్చు. ఆయనకు నీపై ప్రేమ కలగడానికి తగిన విధంగా ఏర్పాట్లన్నీ చేయి ఈ విషయంలోని నీ అభిప్రాయం ఏమిటి అనగానే దుర్యోధనుడు పరిచారుకులను పిలిపించి భవనాలు అలంకరింప చేయడం విడిది ఏర్పాట్లు ఘనంగా నిర్వహించడం చేసాడు .ఆంధ్ర మహాభారతంలో ద్వారాలుకు మణులతో కూడిన దండలు వ్రేలాడ తీయమని చెప్తాడు. సుగంధ ద్రవ్యాలు ,పూలదండలు ,రత్నాల నగలు, వస్త్రాలు రుచికరాలైన వంటకాలు కమ్మని పానీయాలు సిద్ధం చేయండని పరిచారికలను ఆదేశిస్తాడు. (ఆంధ్ర మహాభారతం, ఉద్యోగపర్వం, తృతీయాశ్వాసం, 155 వచనం, ).*

సంస్కృత భారతంలో శ్రీకృష్ణుని ఆకట్టుకోవడానికి రత్నాలతో కూడిన సభలను నిర్మించాడు. అన్ని ఏర్పాట్లు చేసి ధృతరాష్ట్రులకు తెలియజేస్తాడు. శ్రీకృష్ణుడు దుర్యోధనుడు ఏర్పరచిన సభలను కానీ అక్కడ కల్పించిన రత్నాలను కానీ చూడకుండానే కౌరవ నివాస స్థానమైన హస్తినా వైపు సాగిపోయాడు.

*“ తాః సభాః కేశవః సర్వా రత్నాని వివిధాని చ1*

*అసమీక్షైవ దాశార్హః ఉపాయాత్ కురుసద్మ తత్” ( సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 85 వ అధ్యాయం, 18 వ శ్లోకం).*

ఈ సన్నివేశంలోని ఆంతర్యాన్ని పరిశీలిస్తే రాయబారిగా వచ్చే వ్యక్తి ఎటువంటి ప్రలోభాలకు లొంగకూడదు. తాను వచ్చిన కార్యం వైపే దృష్టిని ఉంచాలి. ఆ పని శ్రీకృష్ణుడు నెరవేర్చాడు ఇందులో మరో అంతరార్థాన్ని గమనిస్తే మహాత్ముడైన వాడు ప్రధానంగా పరమాత్మ స్వరూపమైన శ్రీకృష్ణుడు కలుషితమైన మనసు కలిగిన దుర్యోధనుడు చూపిన ఆడంబారాలకు లొంగలేదు. ఆంతర్యం ఎరిగి మసులుకొనేవాడు కావున రాయబారాన్ని దిగ్విజయంగా పూర్తి చేయడానికి సన్నద్ధత వహించాడు శ్రీకృష్ణుడు. కొడుకు చేసిన పనే తర్వాత రాజనీతి బుద్ధితో ధృతరాష్ట్రుడు చేస్తాడు విదురునితో శ్రీకృష్ణుడికి మణులు పొదిగిన రథాలు ,వేగంగా పరిగెత్తగల గుర్రాలు, భద్రజాతికి చెందిన గజాలు,

రత్నాల సొమ్ములు ,అనేకమంది పరిచారకులు ఇస్తాను దుర్యోధనుని, దుశ్శాసనుని మందిరంలో శ్రీకృష్ణుడు ఏది కోరితే అది ఇచ్చి వేస్తానంటాడు.

ధృతరాష్ట్రుడు ఇచ్చే గుర్రాలు ఏనుగులు రకాల సంఖ్యను చెప్తాడు **(సంస్కృత భారతం లో 86 వ అధ్యాయం** )బాహ్లిక జాతికి చెందిన నాలుగు గుర్రాలను పూచిన బంగారు రథాలు 16, మదజలాన్ని స్రవించే ఒక్కొక్క ఏనుగుకు ఎనిమిది మంది సేవకులు ఉండే 8 ఏనుగులను ఇస్తానంటాడు. అందంగా శుభంగా కనిపించే దాసీలను 100 మందిని ఇస్తాను వారంతా సంతానాన్ని పొందని వారు వారితో పాటు 100 మంది దాసులు కూడా ఇస్తాను గిరిజనులు ధృతరాష్ట్రునికి కానుకగా ఇచ్చిన 18 వేల కంబళ్లను ఇస్తానని చెప్తాడు .చీన దేశంలో తయారైన మృగ చర్మాలు ఒక రోజులో 14 యోజనాల దూరాన్ని చేరగల కంచర గాడిదల రథం ఒకటుంది దానిని కూడా శ్రీకృష్ణునికి కానుకగా ఇస్తానని చెప్తాడు.

ఆంధ్ర మహాభారతంలో ఇన్ని రకాల కానుకలను పేర్కొనలేదు దుర్యోధనుడు దుశ్శాసనుని భవనాన్ని అలంకరించమని చెప్పినట్లు ఉంటుంది.

సంస్కృత భారతం లో దృతరాష్ట్రుడే దుశ్శాసనని ఇల్లు చాలా గొప్పది మహా ధనరాశితో వెలసిల్లుతుంది నా దగ్గర దుర్యోధనుని దగ్గర ఉన్న రత్నాలన్నీ కూడా దుశ్శాసనుని భవనంలో ఉన్నాయి శ్రీకృష్ణుడు వాటి మీద మనసు పడితే వాటిని శ్రీకృష్ణుడికి ఇస్తానని చెప్తాడు.

ఈ వివరాలను గమనిస్తే రాయబారిగా శ్రీకృష్ణుడంతటివాడు వస్తున్నాడని అతనికి తగ్గ గౌరవాన్ని ఏర్పాటు చేస్తే సంతోషపడి పాండవులను మరిపించే విధంగా సత్కరిస్తే మనకే ప్రసన్నడౌతాడు శ్రీకృష్ణుడు అనే భావం ధృతరాష్ట్రుడి లో ఏర్పడింది సాధారణంగా భగవంతుడు ప్రసాదించిన ధన ధాన్యాదులను ఎవరికి తోచినంతలో వారు సమర్పిస్తే భగవంతుడు మనల్ని సిరిసంపదలతో వర్ధిల్లేలా చేస్తాడని ఒక భక్తి భావం అందరిలో ఉంటుంది. ఇక్కడ ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణుడిని అన్ని లోకాలను పూజింపదగినవాడని పరమాత్మగా గుర్తిస్తాడు అంతే భక్తి భావం అనేది సంపూర్ణమైన విశ్వాసంతో ఉండదు. తన దగ్గర ఉన్న సంపాదనతో ఆశపెట్టి ప్రయత్నం చేయాలని నిశ్చయించుకుంటారు.

స్వార్థపూరితమైన రాజనీతి ఆలోచన శక్తిగా నాకు అనిపిస్తుంది శ్రీకృష్ణుని ఏ విధంగానైనా లోబరుచుకునే ప్రయత్నం చేయడానికి సిద్ధపడ్డాడని తెలుస్తుంది .

ఎస్ ఎల్. వి. ఉమా మహేశ్వర రావు నేడు అంతర్జాతీయ న్యాయవ్యవస్థ రూపొందించిన రాయబార లక్షణాలను వివరించాడు. **1. రాయబారిని దేశ అతిథిగా పరిగణించాలి.** అనేది నేటి అంతర్జాతీయ న్యాయవ్యవస్థ రూపొందించిన లక్షణాలలో ఒకటి. **(ఎస్. ఎల్. వి. ఉమా మహేశ్వర రావు, తిక్కన రాయాబారాలు రాజనీతి– దౌత్య రీతి, పుట:04)** ఈ లక్షణం ధృతరాష్ట్రుడు కృష్ణునికి ఆతిథ్యమివ్వడానికి సిద్ధపడే సందర్భంలో గమనించవచ్చు. ఆతిథ్యంగా వచ్చే వ్యక్తిని ఏ విధంగా ఆకట్టుకోవాలో ధృతరాష్ట్రుడు ప్రణాళిక వేసినట్లు కనబడుతుంది. ఎక్కువ శాతం అతిథిని ఆకర్షించడానికి తన సంపద వివరాలను తెలియజేస్తాడు.

విదురుడు ధృతరాష్ట్రుని మాటల్లోని ఆంతర్యాన్ని కనిపెట్టాడు. అందుకే ప్రత్యక్షంగా దృతరాష్ట్రుని బుద్ధి ఎటువంటిదో అతనికి గుర్తు చేస్తాడు. నీవు ఇవ్వాలనుకున్న కానుకలు సదాభిప్రాయంతో అయితే సరైనదే కానీ పాండవులు అడిగిన ఐదు ఊర్లు ఇవ్వడానికి కూడా మనసు ఒప్పని నీవు శ్రీకృష్ణునికి ఇన్ని కానుకలు సిద్ధం చేస్తామని చెప్తున్నావు .

**" మయైషా సత్యమేవైతత్ ఛద్మైతద్ భూరి దక్షిణ1**

**జానామి త్వన్మతం రాజన్ గూఢం బాహ్యేన కర్మణా11" (సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 87 వ అధ్యాయం, 8 వ శ్లోకం.**

ఇదంతా నీ నటన,మోసం మాత్రమే బాహ్య వ్యవహారంతో నీ బుద్ధిని కప్పిపుచ్చుకుంటున్నావు నువ్వు ఎన్ని విధాలగా లొంగ తీసుకోవాలనుకున్న లొంగిపోయే తత్త్వం శ్రీకృష్ణునిది కాదు. అర్జునుని శ్రీకృష్ణుని వేరు పరచడం ఎవరితరం కాదు కేవలం నీవిచ్చే వస్తువుల్లో జనంతో నిండిన కలశాన్ని పాదోదకాన్ని ప్రశ్నలను తప్ప మరి దేనిని శ్రీకృష్ణుడు స్వీకరించడు. శ్రీకృష్ణుని మనోభిప్రాయాన్ని నెరవేర్చడమే అతని మిత్రుడు చెప్తాడు.

సంస్కృత భారతంలో విదురుడు మరో మాట కూడా చెప్తాడు.

**"పితాసి రాజన్ పుత్రాస్తే వృద్ధస్త్వం శిశవః పరే1**

**వర్తస్వ పితృవత్తేష్ వర్తంతే తే హి పుత్రవత్11'' (సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 87 వ అధ్యాయం, 17 వ శ్లోకం).**

ధృతరాష్ట్రుడితో విదురుడు రాజా నీవు తండ్రివి వారు పుత్రులు, నీవు వృద్ధుడవు వారు శిశువులు తండ్రిలా నీవు ప్రవర్తించు పుత్రులవలే వారు ప్రవర్తిస్తున్నారు కదా అని చెప్తాడు. ఇక్కడ పరోక్షంగా ధృతరాష్ట్రునికి ధర్మాన్ని తెలియజేస్తున్నాడు వృద్ధుడుగా అయితే సరిపోదు బుద్ధిలో కూడా జ్ఞాన వృద్ధి ఉండాలి ఆ జ్ఞానంతో తండ్రి స్థానంలో ఉండి నీవు హెచ్చరిస్తే పుత్రుడు బాగుపడతారు నువ్వు ఎలా ఉంటే నీ పుత్రుడు అలానే తయారవుతారు కాబట్టి పెద్దరికంగా మెలుగు పుత్రులను దారిలో పెట్టమని హెచ్చరిస్తున్నట్లు ఉన్న ఈ మాటలు ఆంధ్ర మహాభారతంలో కనబడవు.

### 3.16.31. విదురుని మాటలకు దుర్యోధనుని అభిప్రాయం:

విదురుని మాటలు విన్న దుర్యోధనుడు శ్రీకృష్ణుడు పాండవులను విడిచిపెట్టడు మనం ఇప్పుడు కానుకలిస్తే మనం భయపడిన వాళ్ళం అవుతాం అంతే కాకుండా లోకమంతా చులకనగా చూస్తుంది శ్రీకృష్ణుడు మూడు లోకాల్లోనూ పూజింపదగిన వాడని తెలుసు కానీ క్షత్రియులు అవమానం కలిగించే పనిని చేయరు. శ్రీకృష్ణునికి ఏమి కానుకలు ఇవ్వకూడదు యుద్ధం ప్రారంభమైతే యుద్ధంతో తప్ప శాంతి మార్గం కుదరదని చెప్తాడు.

భీష్ముడు దుర్యోధనుని మాటలు విని ధృతరాష్ట్రులతో సత్కరించినా సత్కరించక పోయినా శ్రీకృష్ణుడు కోపగించడు ఆయన అవమానించదగినవాడు కాదు శ్రీకృష్ణుడు చేసే సంధి ప్రయత్నాన్ని అందరూ అంగీకరిస్తే మంచిదని చెప్తాడు.

### 3.16.32. దుర్యోధనుని దురహంకారం:

దుర్యోధనుడు శ్రీకృష్ణుడు పాండవులకు అర్ధరాజ్యం ఇమ్మంటాడు నేను ఇవ్వను. అంతేకాకుండా మరో పని కూడా చేయదల్చాలని చెప్తూ పాండవులకు పెద్ద దిక్కున శ్రీకృష్ణుని ఇక్కడ బంధిస్తాను శ్రీకృష్ణుడుని బంధిస్తే పాంచాల పతి, యాదవులు

మొదలగువారు  చుట్టుపక్కల మిత్రులు నేను చెప్పినట్లు మెలుగుతారు దేశాలన్నీ నేనే ఏలుతాను ఇందుకు తగిన ఉపాయం సిద్ధం చేసుకుంటానని భీష్ముడితో అంటాడు.

సంస్కృత భారతంలో ఇటువంటి మాటలే దుర్యోధనుడు పలికి చివరిలో

*" అత్రోపాయాన్ యథా సమ్యక్ న బుద్ధ్యతే జనార్దనః1*

*న చాపాయో భవేత్ కశ్చిత్ తద్ భవాన్ ప్రబ్రవీతు మే11" ( సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, తృతియాశ్వాసం, 88 వ అధ్యాయం, 15 వ శ్లోకం).*

నేను శ్రీకృష్ణుని బంధించడం అనే ఆలోచన శ్రీకృష్ణుడికి తెలియకుండా ఎటువంటి అపాయం కలుగకుండా ఉండేవిధంగా ఉపాయాన్ని చెప్పమని భీష్ముడిని అడుగుతాడు.

ఈ మాటలను పరిశీలిస్తే తాను చేసిన పనిని బట్టి అర్థమవుతుంది మూర్ఖమైన ఆలోచన అని పైగా భీష్ముడు అంతటి జ్ఞానిని తాను చేసే అజ్ఞానపు పనికి సహాయం చేయమని కోరడం దుర్యోధనుని అవివేకత్వం తెలుస్తుంది.

ఇటువంటి నిర్ణయం తీసుకున్న దుర్యోధనుని ఆలోచనను మానుకోమని దూతగా వచ్చిన శ్రీకృష్ణుని  బంధించకూడదని మహాత్ముడని, న్యాయం కోసం పాటుపడే వాడిని బంధించకూడదని ధృతరాష్ట్రుడు చెప్తాడు.

*అంతర్జతీయ న్యాయవ్యవస్థ రూపొందించిన రాయబార లక్షణం. అంతర్జాతీయ రాయబారిని నిర్భంధించకూడదు(అరెస్ట్ చేయకూడదు).( (ఎస్. ఎల్. వి. ఉమా మహేశ్వర రావు, తిక్కన రాయాబారాలు రాజనీతి– దౌత్య రీతి, పుట:04*)

పై వివరాలు ఈ లక్షణానికి విరుద్ధంగా జరుగుతున్నట్లు తెలుస్తుంది. దుర్యోధనుడు వచ్చిన రాయబారిని బంధించాలనే ప్రయత్నాలు రాయబారి అయిన కృష్ణుడు రాకముందే ప్రణాళికను రూపొందించుకున్నాడు అక్కడున్న పెద్దవారిని తానుచేసే పనికి సహాయాన్ని అడుగుతాడు. తండ్రి ధృతరాష్ట్రుడు ఆ ఆలోచన తప్పని దూతగా వచ్చిన వ్యక్తిని బంధించకూడదని వారిస్తాడు.

### 3.16.33. భీష్ముని హెచ్చరిక:

భీష్ముడు దుర్యోధనుని మాటలకు అనర్థాలు తెచ్చిపెట్టే వ్యవహరించాలని నీ కొడుకు భావిస్తున్నాడు, దుష్టులతో చేరి నీ కొడుకుని నీవు మందలించకుండా అనుసరిస్తున్నావు,

శ్రీకృష్ణుని ఎదిరిస్తే దుర్మార్గుడైన నీ కొడుకు మంత్రులతో సహా క్షణంలో  నశిస్తాడు ధర్మాన్ని విడిచిపెట్టి ప్రవర్తిస్తున్న దుర్యోధనుని మాటలు వినడానికి ఇష్టపడక కోపంతో అక్కడి నుండి వెళ్లిపోతాడు.

### 3.16.34. శ్రీకృష్ణుడు నగర ప్రవేశం:

శ్రీకృష్ణుడు నగరానికి బయలుదేరాడు దుర్యోధనుడు తప్ప మిగిలిన ధృతరాష్ట్ర కుమారులు భీష్మ ,ద్రోణుడు ,కృపాచార్యులు అంతా శ్రీకృష్ణుని ఎదురు వెళ్లారు. శ్రీకృష్ణుడు దృతరాష్ట్ర భవనాన్ని ప్రవేశించాడు. శ్రీకృష్ణుడు రాగానే ద్రోణ భీష్ములు  శ్రీకృష్ణుడు రాయబారే కానీ పరమాత్మ అని గుర్తించిన వారంతా శ్రీకృష్ణుని గౌరవార్థం కృపుడు, సోమ దత్తుడు, బాహ్లిక మహారాజు ఇతరులందరూ కూడా జనార్ధనుని గౌరవిస్తూ తమ ఆసనాల నుండి పైకి లేచారు.

శ్రీకృష్ణుడు వారందరిని పలకరించి మధుపర్కాన్ని నీటిని గ్రహించి ధృతరాష్ట్రుని అనుమతితో అక్కడి నుండి వెళ్ళిపోతారు. విదురుని గృహానికి వెళ్తాడు.

శ్రీకృష్ణుడు నగరానికి వచ్చిన వెంటనే రాయబారం జరపలేదు కొంత సమయాన్ని కేటాయించాడు. రాయబారి విశేషాలు సభలో తెలపకు ముందే విదురుని, కుంతిని కలుసుకున్నాడు దీనికి అర్థం మొదట రాయబారి అనేవాడు అక్కడ వాతావరణాన్ని పరిశీలించాలి తర్వాత రాయబారం ఎవరికోసమైతే చేస్తున్నాడో వారికి  అనుకూలమైన వారిని పలకరించి వివరాలు సేకరించడం రాయబారికి ఉన్నటువంటి జ్ఞానానికి సంబంధించినదని  శ్రీకృష్ణుని వ్యవహారంలో స్పష్టం అవుతుంది.

### 3.16.35. శ్రీకృష్ణుడు కుంతిదేవిని పరామర్శించుట – కుంతిదేవి సందేశం:

శ్రీకృష్ణుడు కుంతీదేవి ఆతిథ్యాన్ని స్వీకరించిన తర్వాత కుంతీ తన కుమారులు పొందిన అవమానాలను ముఖ్యంగా ద్రౌపదీపరాభావానికి బాధపడుతుంది తన కొడుకులకు సందేశంగా కొన్ని మాటలను శ్రీకృష్ణునితో చెప్తుంది కుంతి వీరమాత కావున మొదట పుత్రవాత్సల్యంతో వారి కష్టాలను తలచుకొని బాధపడుతుంది ఇకపై వారు కష్టాల నుండి బయటపడి  సుఖశాంతులతో రాజ్యమేలే కాలాన్ని నిను చూడాలి పాండవులకు ఓటమి

కలుగకూడదు అర్జునుడు పుట్టినప్పుడే అశరీరవాణి పలికింది అర్జునుడు భూమండలాన్ని జయిస్తాడు రాజ్యాధికారాన్ని పొంది సోదర సహితంగా మూడు అశ్వమేథయాగాలు నిర్వహిస్తాడని చెపుతుంది ఆ చెప్పిన మాటలన్నీ సత్యాలు కావాలంటే దానికి నీవే సహకరించాలి వారిని చూడకపోవడం ఇది 14 సంవత్సరాలు అవుతుందని చెప్తుంది.

తన మాటగా కుంతీదేవి పాండవులకు చెప్పమంటుంది ధర్మరాజుతో ధర్మానికి హాని కలుగుతుంది అలా జరగకుండా చూడాలి. ఇతరుల ఆశ్రమంలో జీవించే స్త్రీ జీవితం నిందార్హం కావున క్షత్రియ ధర్మాన్ని పాటించమని పరోక్షంగా చెప్పినట్లు ఉంటుంది.

అర్జునునితో భీమునితో క్షత్రియ కాంతకు పుట్టిన పిల్లలు ఆ ధర్మాన్ని అనుసరించాలి. క్షత్రియ ధర్మంతో విరోచితంగా పోరాడే సమయం ఆసన్నమైందని అవసరమైతే ప్రాణాలు విడిచి పెట్టడానికైనా సిద్ధపడమని చెప్పమంటుంది.

ద్రౌపదికి జరిగిన అవమానానికి ప్రతిఫలంగా దుర్యోధనాదులు అనుభవిస్తారు. భీముడు శత్రువులందరిని సంహరించే దాకా శాంతించడు. కృష్ణునితో రాజ్యాన్ని కోల్పోవడం, జూదంలో ఓడిపోవడం ,కొడుకులు అరణ్యాలకు వెళ్లడం, కానీ నన్ను బాధించడం లేదు ఉత్తమురాలైన ద్రౌపది కురుసభలో అవమానించబడింది ఆ బాధ నన్ను ఎక్కువ బాధిస్తుంది పాండవుల కర్తవ్యం ఏమిటో ద్రౌపదిని అడిగి తెలుసుకోమని చెప్తుంది.

కుంతీ దేవి పాండవులకు పంపిన సందేశంలో మొదట పాండవుల దైన్య స్థితిని గుర్తు చేస్తుంది తర్వాత రాజ్యాన్ని తెప్పించుకోవడం క్షత్రియ పుత్రులకు భావ్యం కాదని అది అవమానించదగినదని చెప్తుంది అర్జునుని పరాక్రమ విషయాన్ని అశరీరవాణి చెప్పిన విషయాలను శ్రీకృష్ణుడిని నెరవేర్చే విధంగా సహకరించమంటుంది.

పాండవులను ధర్మహితంగా పోరాడమని ద్రౌపది యొక్క మనసును గ్రహించగలిగిన అత్తకుంది కాబట్టి ఆమె మాటనే పాండవులను వినమంటుంది. ఒక స్త్రీని అగౌరవ పరిస్తే కలిగే దుష్పరిణామాలు ఎలా ఉంటాయో వాటిని దుర్యోధనునికి చూపించమని పాండవులను పౌరుషాన్ని ఉద్దీపన చేసే విధంగా కుంతి మాట్లాడింది కుంతీదేవి మాటలకు శ్రీకృష్ణుడు పాండవుల యొక్క మనోభిప్రాయాన్ని చివరిలో కుంతిదేవి అభిప్రాయాన్ని తెలుసుకున్న తర్వాత ఈ విధంగా తెలియజేస్తాడు.

*''క. నీ కొడుకు లొండు సుఖములు1 చేకొన రవ్వీర సుఖమ చిత్తములఁగరం*

*బాకాంక్షింతు రలంతులఁ 1 బోక గలుగు నెట్టు? లల్పబుద్ధులె వారల్?'' (ఆంధ్రమహా భారతం, ఉద్యోగ పర్వం, తృతియాశ్వాసం, 205 వ పద్యం,).* నీ కుమారుడు సాధారణమైన సౌఖ్యాలు అనుభవించడానికి ఇష్టపడరు. క్షత్రియ ధర్మాన్నే కోరుకుంటారు వారు ఉన్నత సామ్రాజ్యాన్ని పొంది రాజ్య పరిపాలన చేసే రోజు నువ్వు చూడగలవని చెప్తాడు.

పాండవులు ద్రౌపది తో సహా నీకు నమస్కారాలు అందించమని క్షేమసమాచారాలను అడిగి తెలుసుకోమని చెప్పారని శ్రీకృష్ణుడు చెప్తాడు.

### 3.16.36. శ్రీకృష్ణుడు దుర్యోధనుని ఆతిథ్యాన్ని తిరస్కరించడం:

కుంతి ఇంటి నుండి శ్రీకృష్ణుడు దుర్యోధనుని భవనానికి బయలుదేరుతాడు.దుర్యోధనునికి దగ్గరగా ఆసనాలపై కూర్చుని ఉన్న దుశ్యాసనని ,కర్ణుని సౌబలుడైన శకునిని చూస్తాడు. దుర్యోధనుడు శ్రీకృష్ణుని భోజనానికి ఆహ్వానిస్తాడు.దానికి శ్రీకృష్ణుడు తిరస్కరిస్తాడు.ఎందుకు తిరస్కరించాడు తెలుపుతూ రాయబారి లక్షణాన్ని గుర్తు చేస్తాడు.

*క. అనుడు నుపేంద్రుఁడు మనుజేం1 ద్రుని ' దూత లెందుఁదొలిదొలి గుడువం*

*గొనఁగట్టఁ దొడఁగుదురె? వ 1చ్చిన కార్యము దీర్చి పిదపఁజేయుదురెల్లన్'' ( ఆంధ్ర మహాఆభారతం , ఉద్యోగ పర్వం, తృతియాశ్వాసం, 218 వ పద్యం, ).*

రాయబారి వచ్చిన పనిని ముందు పూర్తి చేయాలి అప్పటివరకు ముందు భుజించడం ,వస్తువులను స్వీకరించడం వంటివి చేయకూడదు వచ్చిన కార్యం పూర్తయిన తర్వాత అన్ని మర్యాదలు స్వీకరిస్తాను.

దానికి దుర్యోధనుడు ఇలాంటి మాటలు నీవు పలకడం సరికాదు నీతో మాకు శత్రుత్వం లేదు, యుద్ధము లేదు అదంతా నీవు ఆలోచించాలి ఇటువంటి మాటలు పలకడం తగదు.

అనగానే శ్రీకృష్ణుడు దుర్యోధనుని వైపు చూసి నిర్మోహమాటంగా ప్రేమతో పిలిచి పెట్టే భోజనాన్ని నేను ఇష్టపడతాను. ఆపద కారణంగా కానీ, ఇతరుల ఇంట భోజనం చేస్తాం నీకు నాపై ప్రేమ లేదు, నాకు ఏ ఆపద లేదు.

శత్రువుల ఇండ్లలో భోజనం చేసేటప్పుడు వారు తనకు ఏం పెడతారోనని సందేహం కలుగుతుంది. శత్రువుల ఇంట భుజించరాదని చెప్తాడు. ధర్మాత్ములైన పాండవులను నిరంతరం ద్వేషించి దూషించే నీ బుద్ధి దుష్టమైనది అటువంటి నీ ఇంట భోజనం అంతా కలుషితమే కాబట్టి అటువంటి అన్నం నేను తినలేను విదురుని ఇంటే భోజనం చేస్తానని అక్కడ నుండి బయలుదేరుతాడు ద్రోణ, కృప, భీష్మ, బాహ్లికుడు, శ్రీకృష్ణుని అనుసరించారు మా ఆతిథ్యం స్వీకరించమని చెప్పగా మీరు నాకు చేయవలసిన సత్కారం అంతా పూర్తయినట్లేనని ఇళ్లకు వెళ్లి రండని చెప్పి విదురుని ఇంట ప్రవేశిస్తాడు.

ఈ విషయాన్ని పరిశీలిస్తే రాయబారిగా వచ్చిన శ్రీకృష్ణుడు దుర్యోధనుని భవనానికి వెళ్లి అతని భోజనం స్వీకరించకపోవడంలో ఆంతర్యాన్ని పరిశీలిస్తే దుర్యోధనుని భోజనం తిరస్కరించడంతోపాటు దుర్యోధనుని కపట ప్రేమను దుశ్చేష్టలను ప్రత్యక్షంగానే అడుగుతాడు. దీనివలన శత్రువు అయిన దుర్యోధనునికి అవమానం కలిగినట్లు అయింది. శత్రువును మానసికంగా కొంచెం దెబ్బతీసే ప్రయత్నం శ్రీకృష్ణుడు చేశాడనిపిస్తుంది. ఇది కూడా రాజతంత్రంలోని భాగంగా అభిప్రాయపడవచ్చు.

### 3.16.37. దుర్యోధనాదుల దుర్బుద్ధిని విదురుడు కృష్ణుడికి విన్నవించుట:

విదురుని ఇంట భోజనం అనంతరం విదురుడు శ్రీకృష్ణునితో నీవు రాయబారిగా ఇక్కడకు రావడం నాకు ఇష్టం లేదు. ఆ దుర్యోధనుడు హితాన్ని వినేవాడు కాదు దురహంకారి వారు నీ ఆజ్ఞను పాటించరు. దుర్యోధనుడు భీష్మ, కృప, కర్ణ, అశ్వత్థామ, సైంధవులను చూసుకొని అహంకరిస్తున్నాడు. సంధికి మాత్రం అంగీకరించడు పాండవులకు రాజ్య భాగాన్ని ఇవ్వకూడదని ధార్తరాష్ట్రులందరు భావిస్తున్నారు. దుర్యోధనాదులు పాపిష్టిమైన ఆలోచనలు చేస్తున్నారు. వారి మధ్యకు నీవు వెళ్లడం నాకు అంగీకార యోగ్యంగా లేదు. ఆ దుర్యోధనుడు సమస్త భూమండలాన్ని పాలించాలని ఆశపడుతున్నాడు. వారంతా పరమ మూర్ఖుడు నీ యొక్క ప్రజ్ఞా పాతవం సామాన్యమైనది కాదనీ బుద్ధి కుశలత నాకు తెలుసు నీ మీద ప్రేమ భావంతో చెప్తున్నానని అంటాడు.

శ్రీకృష్ణుడు నా మీద స్నేహంతో ఆప్యాయతతో మంచి విషయాన్ని నాకు చెప్పావు తల్లిదండ్రుల వలె నీవు మంచి విషయాలను తెలియజేసావు. నేను సంధి చేయడానికి వచ్చిన

ఆంతర్యం ఏమిటో ఇప్పుడు చెప్తాను. దుర్యోధనాదుల బుద్ధి వారి శత్రుత్వం తెలిసికూడా కౌరవుల దగ్గరకు వచ్చాను. భూమండలమంతా గుర్రాలు, రథాలు, ఏనుగులతో సహా వినాశం కావడానికి సిద్ధంగా ఉంది అటువంటి భయంకరమైన ఆపదనుండి తప్పించేవాడు ఉత్తమ ధర్మాన్ని పాటించేవాడు అవుతాడు.

*''ధర్మ కార్యం యతన్ శక్త్యా నో చేత్ ప్రాప్నోతి మానవః*

*ప్రాప్తో భవతి తత్ పుణ్యమ్ అత్ర మే నాస్తి సంశయః'' (సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 93 వ అధ్యాయం, పుట:561).*

మానవుడు ధర్మం కోసం ప్రయత్నించాలి ఒకవేళ అందులో విఫలమైనప్పటికీ పుణ్యాన్ని మాత్రం పొందగలడని చెప్తాడు. శ్రీకృష్ణుడి మనసులో సంధి కోసం ప్రయత్నించి అందరినీ ఏకం చేసే పనిలో ఉంటాను నా ప్రయత్నం విఫలమైనప్పటికీ దాని వలన కూడా ఫలితం ఉంటుందని భావం. స్ఫురిస్తుంది. ఆ ఫలితం ఏమిటని ఆలోచిస్తే ధర్మం జీవించాలి పాండవులకు యుద్ధ విజయం ద్వారా లభించే రాజ్యలక్ష్మిని శ్రీకృష్ణుని రాయబారం విఫలమవడం ద్వారా అందించవచ్చనే భావం కూడా స్పష్టమవుతుంది.

కురు పాండవుల మధ్య సంధి కొరకే ప్రయత్నం చేస్తాను. దాని వలన లోకులు కూడా నన్ను నిందించే అవకాశం ఉండదు. ఇలా కౌరవుల పాండవుల మధ్యవర్తిత్వం చేయకపోతే అన్నదమ్ముల మధ్య వైరాన్ని కృష్ణుడు కార్యం చక్కదిద్దకుండా ,సర్దిచెప్పకుండా ఊరకే ఉన్నాడని అవివేకులు నన్ను ఆడి పోసుకుంటారు. దుర్యోధనాదులు నా మాటలు వింటే సరి లేదంటే వారు నాముందు నిలువలేరని శ్రీకృష్ణుడు విదురునితో అంటాడు.

సంస్కృత భారతంలో అసలు రాయబారాలు , కౌరవు పాండవుల మధ్య వైరం ఏర్పడడానికి ప్రధాన కారకులు కర్ణదుర్యోధనాదులు ఈ రాజులందరూ కూడా ఆ ఇద్దరి మార్గాన్ని అనుసరిస్తున్నారు.

*''సేయ మాపన్మహాఘోరా కురు ష్వేన సముత్థితా*

*కర్ణ దుర్యోధన కృతా సర్వే హ్యేతే తదన్వయాః''(సంస్కృత భారతం , ఉద్యోగ పర్వం, 93 వ అధ్యాయం, 9 వ శ్లోకం).*

వ్యసనాలలో కానీ ఆపదలో ఉన్న మిత్రుని ప్రయత్న పూర్వకంగా నైనా వారించకపోతే క్రూరకర్ముడని పండితులు భావిస్తారు .యథా శక్తిగా ప్రయత్నించి జుట్టు పట్టుకుని అయినా  మిత్రుని అకృత్యాలు నుండి కాపాడాలి అప్పుడు ఎవరిని నిందకు గురికారని చెప్తాడు.

ఈ  మాటలను పరిశీలిస్తే దుష్టుల మనసు మార్చడానికి అనేక విధాల ప్రయత్నించి క్రూరమైన మనసు కలిగిన వారిని దండించి అయనా ఆపదల నుండి గట్టెక్కించాలి అప్పుడు అతను నిందను పొందడు. చివరకు శ్రీకృష్ణుడు దుర్యోధనాదులు నా మాటలను గౌరవించి పాటిస్తే బాగుపడుతారు నీచ బుద్ధితో తిరగబడటానికి ప్రయత్నిస్తే నా ముందు ఎవరూ నిలువలేరని శ్రీకృష్ణుడు విదురునితో చెప్తాడు.

ఈ సంఘటనను గమనిస్తే ప్రతిపక్షము నుండి వచ్చిన శ్రీకృష్ణునికి విదురుడు దుర్యోధనాదుల కుట్రలను గురించి చెప్పడం ఎంతవరకు సమంజసమో పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఈ సంఘటన గురించి ‘‘**ఆంధ్రమహాభారతంలో చిత్రించిన విదురుడు**’’, సిద్ధాంత గ్రంథంలో ఎస్. వెంకటేశులు ఈ విధంగా తెలియజేసారు.

*‘‘ప్రతిపక్షముల నుండి రాయబారిగానే వచ్చిన శ్రీకృష్ణునికి తమ రాజ్యాంగములోని రహస్యాలోచనలను గూఢముగ నేకాంతమున తెలియపరచడంలో విదురుడు స్వామి ద్రోహమును తలపెట్టెను అపప్రథ కు అవకాశమున్నది కాని భారత కథయందు శ్రీకృష్ణుడు ఒనర్చిన పెక్కు అమానుష చర్యల వలన శ్రీకృష్ణునకు దైవ స్వరూపమాపాదింపబడినది అనుటలో సందేహం లేదు విదురుడు ఆ భగవత్స్వరూపుడగు  వాసుదేవునకు తన మనోభావమును వెల్లడించెను కాని ప్రతిపక్షమున ఉన్న యుధిష్ఠరునికి కాదు. లాక్షాగృహ దహన విసయమున సత్యమును ఎఱిగినను అవి ఏమియు ధర్మజును తెలియజేయలేదు. విదురుడు పరమ భాగవతుడగుటచే భగవత్ భక్తులలో విధురునకు ఉత్తమ స్థానమీయబడింది. విదురుడు రాయబార ఫలాఫలములు చెప్పినను చెప్పకున్నను కృష్ణునకు ఆ విషయము అవగతమేనని విదురుడుకు తెలుసు. ఆ వాసుదేవుడు సర్వమును తెలిసినవాడని తెలిసినప్పటికి హితాహితములను తెలియజేస్తాడు ’’ (వెంకటేశులు, ఎస్. ఆంధ్ర మహాభారతంలో చిత్రించిన విదురుడు , పుట:20)*

సహజంగా మంత్రి లక్షణం **పరిశుద్ధాత్ముడు రాజు పట్ల భక్తి గౌరవాతిశయాలతో సుఖదుఃఖాలను సమంగా స్వీకరించగల వాడు.**

ఈ గుణం విదురుడిలో ఉన్నప్పటికి శ్రీకృష్ణున్ని మానవ మాత్రునిగా కాకుండా పరమాత్మగా గుర్తించాడు కావున తాను తన ప్రభు రహస్యాలు చెప్పినప్పటికి అది పరమాత్మ అధీనంలోనే ఉంటాయనే భావన విదురునిలో కలిగిఉండవచ్చు అంతే కాకుండా అలా చెప్పడం వలన తనకు ధర్మం మీద ఉన్న ఆసక్తి ఎటువంటిదో కూడా అర్థమవుతుంది. ఒక వంశం నాశనం అవ్వడానికి ఇష్టపడని మంత్రి విదురుడు తన ప్రయత్నం తాను చేసాడు. అన్నింటికంటే ఎక్కువగా శ్రీకృష్ణున్ని బంధించాలనే వ్యూహాన్ని తట్టుకోలేకపోయాడు. తన పరమాత్మకు ఏమి కాదని తెలిసినా పరమాత్మకే జాగ్రత్తలు చెప్పేటంత భక్తి విదురునిలో గమనించదగినది.

### 3.16.38. శ్రీకృష్ణుడు కౌరవ సభ ప్రవేశం:

శ్రీకృష్ణుడు దగ్గరకి దుర్యోధనుడు, శకుని కలిసి ధృతరాష్ట్ర మహారాజు సభలో కొలువుదీరి ఉన్నాడని తెలియజేస్తారు. శ్రీకృష్ణుడు సభలోకి ప్రవేశించగానే సభా సమావేశాలు జరిపేటప్పుడు కూర్చునే స్థలంలో కూడా ఒక మర్యాదను భద్రతను పాటించినట్లు కౌరవసభను గమనిస్తే తెలుస్తుంది.

రాయబారిగా వస్తున్న శ్రీకృష్ణుడికి తగిన మర్యాదను ఇస్తూ ధృతరాష్ట్రుడు బంగారంతో అలంకరింపబడిన సర్వతోభద్రమను ఆసనం శ్రీకృష్ణునికి ఏర్పాటు చేసాడు.

శ్రీకృష్ణుని సభలోకి అడుగుపెట్టిన వెంటనే ధృతరాష్ట్ర మహారాజు భీష్మ ద్రోణులు అందరూ పైకి లేచి శ్రీకృష్ణునికి తగిన గౌరవాన్ని అందిస్తారు.కృష్ణుడు అందరినీ స్థాయిని బట్టి పలకరించాడు శ్రీకృష్ణుడు సభా ద్వారం వద్ద ఉన్న మునులను భీష్ముడికి తెలిపి వారికి అర్ఘ్యపాద్యాదులతో సత్కరించండి వారి కొరకు వెంటనే పీఠాలు వేయించండి. వారంతా ఈరోజు సభను చూడాలని వచ్చారు వారు కూర్చోక పోతే మన వాళ్లు ఎవరు ఆసీనులు కాలేరు అనగానే భీష్ముడు తగిన ఏర్పాట్లు చేయించాడు నారదాది మునులు వారికి ఏర్పరిచిన పీఠాలపై ఆసీనులయ్యారు అది ఆ తర్వాతనే శ్రీకృష్ణుడు ఇతర రాజులు ఆసనాలపై కూర్చున్నారు.

శ్రీకృష్ణుడు వచ్చిన కార్యాన్ని ముందుగా ప్రారంభించకుండా ఎవరికి ముందు గౌరవాన్ని ఇవ్వాలో వారికి తగిన ఏర్పాట్లు చేయించాడు దీనిని బట్టి మునులపై శ్రీకృష్ణునికి ఉన్న భక్తి వెల్లడవుతుంది.

మునులేమో శ్రీకృష్ణ పరమాత్మ దర్శనానికి వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు శ్రీకృష్ణుని దర్శన భాగ్యానికి సంతోషించే ఆ మునులు శ్రీకృష్ణుని మాటలకైఎంతో ఆసక్తితో ఎదురుచూస్తూ ఉన్నారు.

దుశ్శాసనుడు సాత్యకికి, వివంశతి కృతవర్మకు ఆసనాన్ని చూపించారు కర్ణ దుర్యోధనాదులు శ్రీకృష్ణునికి దగ్గరగా ఒకే ఆసనంపై కూర్చున్నారు.

శకుని సైనిక రక్షణలో కుమారునితో ఆసీనుడయ్యాడు విదురుడు శ్రీకృష్ణుని ఆసనానికి తగులుతున్న మృగ చర్మం పరిచిన ఆసనంపై కూర్చున్నాడు.

## 3.16.39. శ్రీకృష్ణుని సందేశం:

ఇలా ప్రముఖులంతా ఆసీనులయ్యాక శ్రీకృష్ణుని మాట కొరకు ఎదురు చూస్తూ ఉన్నారు. ఆ సమయంలో శ్రీకృష్ణుడు దృతరాష్ట్రునితో మహారాజా నీకు తెలియని విషయాలు ఏమున్నాయి అయినప్పటికీ భరత వంశం సంతోషించే విధంగా ఇరు కుటుంబాలు సుఖశాంతులతో వర్ధిల్లాలని భావించి నేను ఇక్కడకు వచ్చాను .పాండవులు ,కౌరవులు కలిసి జీవించడం మంచిది అలా వారు ఉండేలా చేయవలసిన బాధ్యత నీపై ఉందని చెప్తూ పాండవులు వేరు కౌరవుల వేరు అనే భేద బుద్ధి నీకేమైనా ఉందా అని ప్రశ్నించడంలో దృతరాష్ట్రుని మనసులోని అభిప్రాయం గ్రహించినవాడు శ్రీకృష్ణుడు కానీ నిండు సభలో అలా అడగడం ద్వారా ధృతరాష్ట్రుని మనసు అందరూ గ్రహించే అవకాశం ఉంటుందని అడిగి ఉండవచ్చని నా అభిప్రాయం.

భరతవంశం యొక్క గొప్పతనాన్ని వర్ణిస్తాడు. ఈ భరత వంశం దయ, జాలి, కరుణ, క్రౌర్య రాహిత్యం, ఋజుత్వం, ఓర్పు. సత్యం ఈ సద్గుణాలన్ని కలిగి ఉంది అటువంటి వంశం యొక్క ఔన్నత్యాన్ని ఇప్పుడు తగ్గించే పరిస్థితి ఏర్పడుతుంది. అలా కాకుండా చూసే బాధ్యత నీ పై ఉందని చెప్తాడు.

సంస్కృత భారతంలో

*'' త్వయ్యధీనః శమో రాజన్ మయి చైవ విశాంపత్*

*పుత్రాన్ స్థాపయ కౌరవ్య స్థాపయిష్యామ్యహంపరాన్*

(సంస్కృతభారతం, ఉద్యోగ పర్వం, 95 అధ్యాయం,13 వ శ్లోకం ).

సంధిని చేయడం నీ చేతుల్లోనే ఉంది. నీ కుమారుని అదుపులో పెడితే ఇతరులను ( పాండవులను నేను నియంత్రిస్తాను.

ఈ విషయాలను పరిశీలిస్తే రాజైన ధృతరాష్ట్రుడు పుత్ర వాత్సల్యం వదిలి వారిని హెచ్చరించమంటున్నాడు. వారి దుశ్చర్యలను నియంత్రించమంటున్నాడు. అంతటి అధికారం ధృతరాష్ట్రునికి ఉందని అదే జరిగితే సంధి ప్రయత్నం సఫలమవుతుందని శ్రీకృష్ణుని వైపు ఉన్న వారిని అంటే పాండవులకు తాను నచ్చజెప్పి ఇలా ఇరువురం కలిస్తే సంధి సఫలమవుతుంని చెప్పినట్లు తెలుస్తుంది.

కురు పాండవులు పొందే మంచి చెడులకు కారణం ధృతరాష్ట్రుడేనని చెప్తూ తిక్కన ఈ పద్యాన్ని తెలుపుతాడు.

*శా. ఈ వంశంబున కెల్ల నీవ కుదురిందెవ్వారి చందంబు లె*

*ట్లై వర్తిల్లినఁగీడు మేలు దుది నీయందొందెడుం గాన స*

*ద్భావం బారసి లోని పొత్తు వెలివృత్తంబున్ జనస్తుత్యముల్*

*గావింపందగు నీక యెవ్విధమునం గౌరవ్యవంశాగ్రణీ*

*(ఆంధ్రమహాభారతం, ఉద్యోగ పర్వం, తృతియాశ్వాసం, 260 వ పద్యం, ).*

వంశానికి అంతటికి ధృతరాష్ట్రుడే అగ్రగణ్యుడని అతడే ఆధారమని అతని కుటుంబంలో ఎవరైనా విపరీత బుద్ధిని ప్రదర్శించి ఆపదలు తీసుకొని వచ్చినా మంచి కార్యాలు చేసినా దాని ఫలితం అనుభవించేది నీవే కాబట్టి ఈ మాటలు దృష్టిలో ఉంచుకొని అందరూ మెచ్చేటటువంటి నిర్ణయం తీసుకోమని చెప్తాడు.

దుర్యోధనాదులైన వీరు అధర్మపరులై సత్కార్యాలు ఆచరించక బంధువులందరి మనసులను బాధపెట్టే పనులు చేస్తున్నారు వంశానికి చెడ్డ పేరు తెస్తున్నారు ఈ ఆపద నుండి తప్పించే సమర్థుడవు నీవే కౌరవులు పాండవులు ఒక మంచి నిర్ణయానికి వచ్చి శాంతం వహించి జీవించడం మంచిది. కురు వంశానికి రాజ సమూహానికి ఈ భూ

మండలానికి శ్రేయస్కరం అలాకాక యుద్ధమే సంభవిస్తే మనందరికీ ఆపద కలుగుతుంది కాబట్టి సంధి జరిగే విధంగా ఆలోచించమని శ్రీకృష్ణుడు చెప్తున్నాడు.

ఇక్కడ శ్రీకృష్ణుడు సంధి జరగకపోతే కలిగే నష్టాన్ని యుద్ధం జరిగితే కురువంశ వినాశనాన్ని తెలియజేస్తున్నాడు. శ్రీకృష్ణుడు తన మాటల్లోనే ఫలితాన్ని గుర్తు చేస్తున్నాడు .

ఆంధ్ర మహాభారతంలో శ్రీకృష్ణుడు

*ఉ. అందు వృకోదరార్జునుల నాహవ రంగమునందు మీఱువా*
*రెందరు యెన్నుమా యిచట , నీగురు భీష్ములు(గ్రేణి సేయు వా*
*రెందఱొ వారు వీరు నని నీల్గుట కంటె భవద్బలంబులై*
*యందఱు(గూడు టొప్పదె జనాధిప శాంతి యొనర్పుయెమ్మెయిన్.(*
*(ఆంధ్రమహాభారతం, ఉద్యోగ పర్వం, తృతియాశ్వాసం, 264 వ పద్యం, )*

ఇందులో యుద్ధరంగంలో పాండవుల్లో భీమార్జునులను సభలో ఉన్న ద్రోణభీష్ముల పరాక్రమాలను ఎదిరించేవారు ఎవరూ లేరు కాబట్టి వీరిని శాంతింపజేయమని చెప్తాడు.

సంస్కృత భారతంలో వీరుల పేర్లను తెలుపుతాడు.

భీష్ముడు, ద్రోణుడు, కృపుడు, కర్ణుడు ,వివంశతి అశ్వత్థామ, వికర్ణుడు, సోమ దత్తుడు, బహ్లికుడు, సైంధవుడు, కళింగుడు ,కాంబోజుడు, సుదక్షణిడు, యుధిష్ఠరుడు, భీమసేనుడు, అర్జునుడు, నకుల సహదేవులు, సాత్యకి ,యుయుత్సుడు వీరంతా యుద్ధ పరాక్రమం కలిగిన వారిని చెప్తాడు.

తిక్కన వీరందరి పేర్లను పేర్కొనక ప్రధానమైన వ్యక్తుల్ని మాత్రం పేర్కొన్నాడు. కౌరవులో భీష్మ, ద్రోణులు కీలకమైన వ్యక్తులు పాండవులలో భీమార్జునుల పరాక్రమం వలనే ఎన్నో కార్యాలు సిద్ధించాయి. కాబట్టి వారంతటి పరాక్రమవంతుల మధ్య యుద్ధం జరిగితే కురువంశం నశిస్తుంది కాబట్టి ఏ విధంగానైనా శాంతిస్థాపన చేయమని చెప్తాడు.

తర్వాత శ్రీకృష్ణుడు కౌరవులు పాండవులు కలిసి ఉండడం చేత ధృతరాష్ట్రుడు పొందే యోగాన్ని రాజ వైభవాన్ని చెప్తాడు .లోకంలోని రాజులందరూ నిన్ను సేవిస్తుంటే నీవు రాజ్యాన్ని ఏకచ్ఛత్రంగా పరిపాలించగలవని చెప్తాడు. నీవు కురు పాండవుల

విషయంలో శ్రద్ధ వహించకపోతే ఉభయ వర్గాలకే కాదు భూమిలోని జనులందరికీ పాపం చేసినట్లు అవుతుంది. చివరకు నీకే హాని కలుగుతుందని చెప్పి శ్రీకృష్ణుడు మొదట సభలో తన అభిప్రాయ విశేషాలన్నింటిని సంధి కోసం చేసే ప్రయత్నానికి తగిన మాటలన్నీ శ్రీకృష్ణుడు చెప్తాడు. ఇప్పుడు పాండవులు అభిప్రాయాలను వెల్లడిస్తున్నాడు.

### 3.16.40. శ్రీకృష్ణుడు తెలిపిన పాండవుల అభిప్రాయాలు:

పాండవులు భక్తితో నమస్కరించి కొన్ని మాటలు మీకు చెప్పమని పంపించారు.మేము నీ ఇష్టప్రకారం అరణ్య అజ్ఞాతవాసాలు పూర్తి చేసాము ఒడంబడిక పూర్తయింది. కావున మాకు రావాల్సిన రాజ్యభాగాన్ని మేము పొందుతామనే అభిప్రాయంతో ఉన్నాము. మాకు తల్లిదండ్రి అన్ని నీవే. మా వలన పొరపాటు ఉంటే సరిదిద్దితే సరి చేసుకుంటాము.

నీవు మంచి అభిప్రాయాన్ని కలిగి నిర్ణయం తీసుకుంటే వంశధర్మం నిలుస్తుందని చెప్తాడు.

ఈ వివరాలను పరిశీలిస్తే మేము ధర్మబద్ధంగా మీ ఆజ్ఞను పాటించాము నీవు నీ మాటలు నిలబెట్టుకోగలిగితే అందరి గౌరవాన్ని పొందుతావు రాజ్యభాగాన్ని మాకు ఇస్తే మేము మీరు అందరు సుఖంగా బ్రతకవచ్చు అనే భావం పై మాటల్లో వ్యక్తం అవుతుంది మమ్మల్ని మంచి మార్గంలో పెట్టి నీవు కూడా సన్మార్గం వైపు నడవడానికి ప్రయత్నించి మాట నిలబెట్టుకోమనే అభిప్రాయాలు పై మాటల్లో తెలుస్తుంది.

*ఉ. సారపు ధర్మమున్ విమల సత్యముబాపము చేత బొంకుచే*
*బారము బొందలేక చెడఁదారినదైన యవస్థ దక్షులై*
*వ్వారలుపేక్ష సేసిరది వారల చేటగు గాని ధర్మ ని*
*స్తారకమయ్యు సత్య శుభ దాయక మయ్యును దైవముండెడున్''((ఆంధ్రమహాభారతం, ఉద్యోగ పర్వం, తృతియాశ్వాసం, 273 వ పద్యం,)*

ధర్మం సత్యం అనేవి అధర్మం , అసత్యం చేత పరాభవం పొందే స్థితి వచ్చినప్పుడు వాటిని రక్షించేశక్తి కలిగి ఉండి కూడా అడ్డుపడకపోతే అశ్రద్ధ వహిస్తే అది వారికే నష్టాన్ని

కలిగిస్తుంది ఇటువంటి సంకట స్థితి వచ్చినప్పుడు సత్యమును కాపాడడానికి ధర్మాన్ని నిలబెట్టడానికి భగవంతుడు ముందుకు వస్తాడు .

ఈ మాటల్లోని ఆంతర్యాన్ని పరిశీలిస్తే పాండవులు న్యాయంగా ధర్మంగా సత్య వాక్కుకు భంగం కలగకుండా వారు అరణ్య అజ్ఞాతవాసాలు పూర్తి చేశారు ఇప్పుడు ధృతరాష్ట్రుడు సభలోని వారు వారి యొక్క ధర్మాన్ని పాటించే అవకాశం ఉండి కూడా లోభంతో దాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేయడం కానీ సత్యాన్ని నిర్లక్ష్యం చేసి వితండవాదం చేయడం కానీ చేసినట్లయితే అది వారి వంశానికి నష్టం కలిగిస్తుంది. వారిని కష్టాలపాలు చేస్తుంది అటువంటి సమయంలో ధర్మరక్షణకు భగవంతుడే వస్తాడు అలా వస్తే అధర్మ పరులు నశిస్తారు. ధర్మ పరులు మాత్రమే మిగిలి రాజ్యాన్ని పరిపాలిస్తారని శ్రీకృష్ణుని మాటల్లోని అంతరార్థంగా తెలుస్తుంది. శ్రీకృష్ణుడు పాండవులు చెప్పిన మాటలను చెప్తూనే భవిష్యత్ కార్యాచరణను కూడా గుర్తు చేశాడు సంధి కోసం ప్రయత్నం చేస్తూనే మూర్ఖంగా సంధిని అంగీకారయోగ్యం కాకపోతే కలిగే దుష్పరిణామాలను కళ్ళకు కట్టినట్లు వివరించారు ఎలాగైనా నయానో భయానోసంధి కోసం ప్రయత్నంచేసాడు శ్రీకృష్ణుడు.

పాండవులు చెప్పిన మాటలు చెప్పిన తర్వాత వారు కౌరవులు వలన పొందిన అవమానాలను సభాముఖంగా తెలియజేస్తాడు శ్రీకృష్ణుడు. కోపం, గర్వం, ద్వేషం వదిలి నేను చెప్పినట్లు చేయమని చెప్తాడు .శ్రీకృష్ణుడు తన ఆజ్ఞనైన పాటిస్తారేమోనని ఆశతో తన మాటలుగా ఈ విధంగా చెప్తాడు. పాండవులకు సగభాగం పంచి ఇవ్వడమే న్యాయమని ధర్మరాజు యొక్క సత్యం, ధర్మం నీకు తెలుసు మిమ్మల్ని ఆశ్రయించుకుని నీకు ఇచ్చే గౌరవం ఎటువంటిదో కూడా నీకు తెలుసు అయినప్పటికీ స్పష్టంగా చెప్తాను విను ధర్మరాజు ఇంద్రప్రస్థ పురాన్ని పరిపాలిస్తూ అనేకమంది రాజుల గర్వం అణచి వారందరూ నిన్ను కొలిచేటట్లు చేసాడు. అయినప్పటికీ వారు నీ ఆదేశాన్ని అతిక్రమించలేదు. దుర్యోధనుని చెడ్డ పనులకు నీవు సహకరించావు, శకుని చేత మాయ జూదం ఆడి రాజ్యం కోల్పోయారు అంతేకాకుండా అరణ్య అజ్ఞాతవాసాలు చేసారు. ద్రౌపదిని అవమానించారు, ఇన్ని జరిగినప్పటికీ నీతో సంధినే కోరుకుంటున్నారు. ధర్మరాజు యొక్క ధర్మాన్ని ఎవరు కొనియాడలేరు ఆయన శాంత స్వభావుడు సత్యనిష్ఠ కలిగినవాడు నీ బిడ్డలుగా భావించి

కురుపాండవుల క్షేమాన్ని కోరి నీకు ఇన్ని మాటలు చెప్పవలసి వచ్చింది. నీ పుత్రులైన దుర్యోధనుని మనసులో దురాశను తొలగించి పాండవులను పిలిపించమని చెప్తాడు. శ్రీకృష్ణుడు రాయబారానికి రాకముందు పాండవులు ఔన్నత్యాన్ని సభలోని రాజులందరికీ తెలిసేటట్లు చెప్తారు ఆ విధంగానే సభలో మాట్లాడాడు దీని వలన అక్కడున్న వారికి ఏది న్యాయమో ఎవరిది అన్యాయమో విచారణ చేసుకోగలిగే ఆలోచన కలిగి ఉంటారు. సభలో మాట్లాడడం చేత ధృతరాష్ట్రుడు ఇచ్చే సమాధానం కోసం అందరూ ఎదురు చూస్తూ ఉంటారు వారిచ్చే సమాధానాన్ని బట్టి ఎవరు ధర్మాత్ములు ఎవరు దురాత్ములో తెలుసుకొనే అవకాశం ఉంటుంది. ఇన్ని ఆలోచించి శ్రీకృష్ణుడు సభలో తన వాక్చాతుర్యాన్ని ప్రదర్శించాడు .

చివరిగా కొస మెరుపుగా ఈ విధంగా శ్రీకృష్ణుడు అంటాడు

*ఉ. వారలు శాంతశూరులు భవచ్చరణంబులు గొల్వఁబూని యు*

*న్నారటుఁగాక మీ కది మనంబున కప్రియమేని నింతకుం*

*బోరికి వచ్చుచుందురు భూవర రెండు దెఱంగులందు నీ*

*కారయఁబథ్యమేది యగు నవ్విధ మేర్పడ నిశ్చయింపుమా( ఆంధ్ర మహాభారతం, ఉద్యోగ పర్వం, తృతియాశ్వాసం, 284 వ పద్యం).*

పాండవులు ఎంతటి ఓర్పు ,సహనం, శాంతం కలవారో అంతటి పరాక్రమ వంతులు అటువంటివారు నీ పాద సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నారు వారు మీతో కలిసి ఉండడానికి ఇష్టం లేకపోతే ఈ పాటికి యుద్ధం చేయడానికి బయలుదేరి వస్తూ ఉంటారు సంధినా, సమరమా మాకు ఏది హితమో దానిని నిర్ణయించిండని చెప్తాడు.

చివరకు శ్రీకృష్ణుడు అన్నీ చెప్పవలసిన విషయాలను కొన్ని సౌమ్యంగాను, కొన్ని హితంగాను, కొన్ని హెచ్చరించే విధంగానూ చెప్పి చివరకు వారి నిర్ణయానికి వదిలేసాడు తన తప్పు ఏమీ లేదు అన్నట్లుగా సంభాషించాడు హితము చెప్పే రీతిలోనూ మాట్లాడాడు అన్ని రకాల వాక్ నైపుణ్యాలను ప్రదర్శించి సభలోని వారందరి మన్ననలను అందుకున్నాడు. శ్రీకృష్ణుని మాటలు అందరి మనసులోనూ సంతోషాన్ని కలిగించాయి.

### 3.16.41. దుర్యోధనునుకి మహర్షుల హిత బోధ:

తర్వాత సభలోని మహర్షులలో పరశురాముడు దుర్యోధనుడికి  గర్వం వలన కలిగే నష్టాన్ని తెలియజేస్తూ దంభోద్భవుని రాజు కథను   కణ్వుడు మాతలి ఉపాఖ్యానమును, తర్వాత నారదుడు గాలవుని వృత్తాంతమును చెప్తారు నారదుడు శ్రీకృష్ణుని మాటలు విని కురువంశాన్ని కాపాడమని దుర్యోధనునితో అంటాడు. దుర్యోధనుడు వారి మాటలను లెక్క చేయలేదు. వారి మాటలు వల్ల ఎటువంటి ప్రయోజనం లేదని చెప్తాడు. ధృతరాష్ట్రుడు నారదుని మాటలను సమ్మతిస్తూ నీవు చెప్పిందంతా నిజమే నేను అదే అనుకుంటున్నాను కానీ నా వల్ల కావడం లేదని చెప్తాడు.

పాండవులకు రాజ్య భాగం ఇచ్చే స్థాయిని నేను కోల్పోయాను. అది నా చేతుల్లో లేదు దుర్యోధనుడు చేతిలో ఉంది అతనిని మార్చి అంగీకరింప చేస్తే ఎవరు అడ్డుపడరని పరోక్షంగా ధృతరాష్ట్రుని ఆంతర్యంగా తెలుస్తుంది. తర్వాత ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణునితో కూడా శ్రీకృష్ణుని మాటలను సమర్థిస్తూనే దుర్మార్గులైన నా కొడుకులు నా మాటను లెక్కచేయడం లేదని చెప్తాడు. అంతేకాకుండా తనపై నింద పడకూడదని  భీష్మ, ద్రోణులు, విదురుడు , తల్లి అయిన గాంధారి చెప్పిన మాటలు కూడా వినడు నీవు చెప్పగలిగితే చెప్పమని తనకు అధికారబలమే లేనట్లు ధృతరాష్ట్రుడు మాట్లాడుతాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు దుర్యోధనునితో నీవు ఉత్తమ వంశంలో జన్మించావని దుష్టులు మాత్రమే  అన్యాయ కార్యాలకు పాల్పడతారని నీ పుత్రులు తమ్ములు, స్నేహితులు  చెడు దారిలో పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత నీపై ఉందని నీ బంధువులు పెద్దలు, తండ్రి అంగీకరించే విధంగా పాండవులతో సంధికావించుకోమంటాడు. అల్ప బుద్ధి కలిగిన వారి మాటలు  విని చెడిపోవద్దని చెప్తాడు. ఇక్కడున్న భీష్మ ద్రోణ ధృతరాష్ట్ర బహ్లిక వంటి వారి అందరికీ మీరు కలిసి ఉండటమే ఇష్టమని చెప్తాడు.

ఇక్కడ శ్రీకృష్ణుడు దుర్యోధనునికి మంచిగా నచ్చజెప్పే ప్రయత్నం చేసాడు. తర్వాత ఇంకా చెప్తూ పరాక్రమవంతులైన భీమార్జునులను పరాయి వారిగా భావించి వారిని బాధపెట్టాలని కుత్సుతతో స్నేహం చేసుకుంటున్నావు. పాండవులు మిమ్మల్ని శత్రువులుగా భావించడం లేదు కానీ నువ్వు ఎందుకు అలా భావిస్తున్నావో తెలియడం లేదు .ఒకవేళ

యుద్ధమే సంభవిస్తే వారిని ఎదిరించడానికి ఎవరి వల్ల కాదు అంటారు కర్ణుడు ఉన్నాడని విర్రవీగుతున్నావేమో కర్ణాదులకే కాదు దేవదానవులకు కూడా కౌంతేయులను ఎదుర్కొనలేరు కాబట్టి పాండవులతో పోరాడటానికి నిర్ణయం చేయకుండా సంధి చేసుకోమని చెప్తాడు.

తర్వాత భీముని బలాన్ని అర్జునుని పరాక్రమాన్ని గుర్తు చేస్తాడు ఉత్తర గోగ్రహణం లో అర్జునుని పరాక్రమం ఎటువంటిదో నీకు ప్రత్యేకంగా చెప్పవలసిన పనిలేదు. దానిని గుర్తు చేసుకోమని చెప్తాడు నేను చెప్పేది కోపగించుకోకుండా విను యుద్ధరంగంలో నేను సహాయకుడిగా వచ్చి నిలిచిన అర్జునుని ఎవరు ప్రతిఘటించలేరు నీకు యుద్ధం అశక్యమైనదని  కృష్ణుడు చెప్తాడు.

భీష్మ ద్రోణులు దుర్యోధనునికి కౌరవ వంశం నాశనం కాకుండా కాపాడమని చెప్తారు. మీరు కలిసి ఉంటే కురువంశం చక్కగా అభివృద్ధి చెందుతుందని చెప్తారు ఆ మాటలు విన్న దుర్యోధనుడు శ్రీకృష్ణునికు భీష్మ ద్రోణ ధృతరాష్ట్రుడు నన్ను అనవసరంగా నిందిస్తున్నారు. నువ్వు కూడా నన్ను ఎందుకు నిందిస్తావు నా తప్పేముంది ధర్మరాజు జూధ వ్యసనుడై శకుని చేతిలో ఓడిపోయి రాజ్యమంతా పోగొట్టుకున్నాడు మూర్ఖంగా మళ్ళీ మళ్ళీ ఆడాడు శకుని తన ప్రావీణ్యంతో గెలిచాడు అంతేకానీ పాండవుల కష్టాలకు నేను బాధ్యుడను కాదని చెప్తాడు.

ముందుగానే మత్స్య, పాంచాలి పాండ్యాది దేశాల రాజులందరిని కూర్చుకొని యుద్ధం మీద కోరికతో ఉన్నారు వారు.  మేము ఇలాంటి కృత్యాలకుపాల్పడలేదు క్షత్రియులకు యుద్ధమే  మంచిది వీర స్వర్గాలు చేకూరుతాయి. చిన్నతనంలో ఉన్నప్పుడే రాజ్యభాగం ఇచ్చారు అప్పుడు నేను వారించలేకపోయాను ఈనాడు పాండవులకు రాజ్యాన్నివ్వడం దుర్లభం.

*ఉ. “ ఏమును వారుఁబంచికొని యేలుట గల్గదు పల్కకుండు మిం*
*కేమియు వాఁడి సూది మొన యించుక మోపిన యంతమాత్రమున్*
*భూమి మొనర్చి పాండునృప పుత్త్రుల కిత్తునె 1 యెవ్వరైన సం*

*గ్రామమునన్ జయంబుఁ గొని రాజ్యము సేయుట నిశ్చయించితిన్."*
*((ఆంధ్రమహాభారతం, ఉద్యోగ పర్వం, తృతియాశ్వాసం, 363 వ పద్యం, )*

నేను వారికి వాడి సూది మొన మోపినంత భూమిని కూడా ఇవ్వను.మాలో ఎవరో ఒకరు యుద్ధంలో జయించి రాజ్యం పొందాలి. దుర్యోధనుని అహంకార మాటలకు కోపగించాడు శ్రీకృష్ణుడు రాయబారిగా వచ్చిన స్పృహ చేత మరలా ప్రశాంత చిత్తుడై దుర్యోధనా నీవు చెప్పినట్లే యుద్ధంలో నశిస్తావు నీవు కోరినట్లే యుద్ధం జరుగుతుంది. నీ తప్పు ఏమీ లేదని చెప్పడం నీ అవివేకం చిన్నప్పటి నుండి చేసిన దుశ్చర్యలు, సభలోకి ఆడపడుచు ద్రౌపదిని అవమానించడం.సభలోకర్ణుడు, దుర్యోధనుడు మాట్లాడిన మాటలను గుర్తు చేస్తాడు.

శ్రీకృష్ణుడు పలుకుతున్న సమయంలో దుశ్శాసనుడు నీ అంతట నీవుగా పాండవులతో సంధి చేసుకోకపోతే కౌరవులే నిన్ను బంధించి యుధిష్ఠిరుడి చేతిలో పెడతారేమో భీష్మ, ద్రోణ, మన తండ్రి కలిసి కర్ణుడిని ,నిన్ను, నన్ను పాండవుల వశం చేస్తారేమో అనగానే.ఆ మాటలను విన్న దుర్యోధనుడు సభా మర్యాదలు పాటించకుండా గర్వంతో అక్కడి నుండి వెళ్ళిపోతాడు తర్వాత భీష్ముడు ఇంతటి దురహంకారి ధర్మార్థాలను పాటించకుండా వెళ్లిపోయాడు కొద్ది కాలంలోనే కష్టాల పాలవుతాడు అంటారు.

తర్వాత శ్రీకృష్ణుడు పెద్దలందరికీ చెప్తూ ఈ దుర్యోధనుడు ఇంత అహంకారంతో ఉన్నాడు ఇతని అనుచిత ప్రవర్తన మాన్పడానికి మరో మార్గం లేదా సద్వంశాన్ని సంరక్షించడానికి ఆ కుటుంబంలో పుట్టిన దుష్టచిత్తుడిని ఒకరిని వదిలిపెట్టడం సాధ్యపడదా

కంసుడు తండ్రి జీవించి ఉండగానే అధికారం చేజిక్కించుకొని అరాచకాలు చేస్తూ ఉంటే సంహరించి ఉగ్రసేనుడికి రాజ్యం అప్పగించాను. దుర్యోధనుడు పీడ తొలగితే అన్ని కష్టాలు తీరుతాయి కురువంశానికి గౌరవం లభిస్తుంది ఈ విధంగా దుష్ట చతుష్టయాన్ని బంధించి పాండవుల వశం చేస్తే కురువంశం బాగుంటుందని చెప్తాడు. అనగా ధృతరాష్ట్రుడు బెదిరిపోయి విదురునితో దుర్యోధనాదులను పిలిపించి నీచమైన వారితో స్నేహం చేసి పాపపు పనులు చేయాలనుకుంటున్నావని హెచ్చరిస్తాడు.

ధృతరాష్ట్రుడు  వెంటనే విదురునితో తల్లి మాటైన వింటాడేమోనని గాంధారిను పిలిపిస్తాడు ఆమె మాటలు కూడా దుర్యోధనుడు వెంటనే లెక్క చేయక కర్ణాదులతో కలిసి దుష్ట ఆలోచన చేస్తారు.

### 3.16.42. శ్రీకృష్ణ విశ్వరూపం:

శ్రీకృష్ణుడిని బంధిస్తే పాండవు లు  మన  దారికి  వస్తారు  లేకపోతే  శ్రీకృష్ణుడుని బంధిస్తాం కాబట్టి వారిని సులువుగా  గెలవవచ్చని  శ్రీకృష్ణుడిని బంధించాలనుకుంటారు.

ఈ విషయం గ్రహించిన సాత్యకి కృతవర్మను యుద్ధానికి సిద్ధంగా ఉండమని చెప్తాడు సభలో సంగతి తాను చూసుకుంటానని సమయస్ఫూర్తిగా వ్యవహరిస్తాడు. సభలోకి వచ్చి శ్రీకృష్ణుడికి విషయం తెలియజేస్తాడు తర్వాత విదురునికి తెలియజేస్తాడు విదురుడు ప్రముఖ సభా ప్రముఖులతో కౌరవులు బుద్ధిహీనులై శ్రీకృష్ణుడిని బంధించే ప్రయత్నం చేస్తున్నారు. పురుషోత్తముడిని బంధించడం అంటే అగ్నిని వస్త్రంలో మూట కట్టడమే అవుతుంది .విదురుడు వెంటనే ధృతరాష్ట్రునితో దుర్యోధనుని దుష్ట బుద్ధితో శ్రీకృష్ణుని సామాన్య మానవుడిగా భావించి బంధించాలని ప్రయత్నం చేస్తున్నారని చెప్పగానే శ్రీకృష్ణుడు నా మీద కోపంతో నన్ను బంధించాలని చూస్తున్నారు. నీవు రాజాధికారంతో అనుమతిస్తే వీరందరి విరోధాన్ని ఇక్కడే చక్కబెట్టి వెళ్తానని చెప్తాడు.

వెంటనే ధృతరాష్ట్రుడు విదురునీతో దుర్యోధనని సభకు తీసుకుని రమ్మంటాడు. శ్రీకృష్ణుడు తన పుత్రులను ఏమి చేస్తాడన్న ఆత్రుత తప్ప గట్టిగా దండించైనా దుర్యోధనుని మనసు మార్చే ప్రయత్నం కాదని అతని తొట్రుపాటులో వ్యక్తం అవుతుంది. సభలో అందరూ ఉంటారు కాబట్టి పిలిపిస్తాడు కర్ణుని శకుని దుశ్శాసనులతో కలిసి వచ్చిన దుర్యోధనునితో నీకు చెడు ఆలోచన కలిగి దుష్ట సహాయకులతో శ్రీకృష్ణుని బంధించడానికి ప్రయత్నిస్తున్నావు అది జరిగే పనేనా ఊరక నాశనం అయిపోతారు. నేను ఏమి చేయగలనని ధృతరాష్ట్రుడు మందలించాడు తర్వాత విదురుడు బాల్యం నుండి శ్రీకృష్ణుని చర్యలను శ్రీకృష్ణుని పరాక్రమాన్ని గొప్పతనాన్ని తెలియజేస్తాడు. విదురుడు మాట్లాడిన తర్వాత శ్రీకృష్ణుడు నేను ఒంటరి వాడినని నన్ను అవమానించి బంధించాలనుకుంటున్నావని శ్రీకృష్ణుడు విశ్వరూపాన్ని చూపిస్తాడు. శ్రీకృష్ణుడు తన

విశ్వరూప ప్రదర్శనలో నుదుట బ్రహ్మ వక్షస్థలంలో  రుద్రుడు ఇలా ఇంద్రాది దేవతలు, ద్వాదశాదిత్యులు ,విశ్వదేవతలు అశ్విని జనిస్తారు.

అతని శరీరంలో పాండవులు ఉద్భవించిన దృశ్యం, ఆయుధాలు, అనేకమంది రాజులు ఆ విశ్వరూప దర్శనంలో సాక్షాత్కరించాయి ఇంత మందిని ఎలా బంధించగలవు అనే ప్రశ్న పరోక్షంగా తెలిపినట్లు తెలుస్తుంది. నారదాది ఋషులకు భీష్ముడు ,విదురుడు, ద్రోణుడు సంజయునికి దివ్య దృష్టిని ప్రసాదించాడు. ధృతరాష్ట్రుడు దయతో చూడమనగా శ్రీకృష్ణుడు అతని దర్శన భాగ్యాన్ని కలిగించి మరలా అతని కోరిక మేరకు చూపు లేకుండానే చేస్తాడు. శ్రీకృష్ణుడు ఆ విధంగానే అనుగ్రహిస్తాడు. తర్వాత తన విశ్వరూపం ఉపసంహరించుకొని శ్రీకృష్ణుడు ఆ సభ నుండి వెళ్లిపోతాడు.

ఈ విశ్వరూపం సన్నివేశాన్ని పరిశీలిస్తే శ్రీకృష్ణుడు భగవద్గీతలో చెప్పిన మాటలను గమనించవచ్చు. *“ నేను సమస్త ప్రాణుల యొక్క హృదయంలో ఉన్నవాడను నా వలననే జీవునకు జ్ఞాపకశక్తి జ్ఞానము (తెలివి),మరపు ఏర్పడుతున్నాయి. వేదములన్నీ నన్నే తెలియజేస్తున్నాయి. వేదాలన్నింటిని తెలియదగిన వాడను నేనే అయిఉన్నాను. అంతేకాదు వేదము నెఱిగినవాడను కూడా నేనే  అయిఉన్నాను.అంటూ విష్ణువు సకల వేదవేద్యుడని తెలియజెప్పాడు. (వేంకట సుబ్రహ్మణ్య సత్యనారాయణ, మద్దూరి,* ***శ్రీమహాభాగవతము–భగవద్గీత”(ధర్మైక్యము –స్వరూప నిరూపణము), పుట: 181).***

## 3.16.43. ధృతరాష్ట్రుడు తనపై నింద పడకుండా సమర్థించుకోవడం:

రథం ఎక్కి బయలుదేరుతున్న సమయంలో ధృతరాష్ట్రుడు తన తప్పులేదని నేను ఎన్నో విధాలుగా  ప్రయత్నించాను నీవే కళ్ళారా చూశావని తనపై ఎటువంటి నింద లేదని చెప్తాడు సంధి కోసమే ప్రయత్నించినట్లు ధృతరాష్ట్రుడు మాట్లాడుతాడు. శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రునితో, ద్రోణ భీష్మ ,విదుర ,బాహ్లిక, కృపులతో కౌరవసభలో జరిగినదంతా చూశారని సభ నుండి మూర్ఖుడైన దుర్యోధనుడు సభ నుండి వెళ్లిపోవడం గమనించారని చెప్పి  మహారాజైన ధృతరాష్ట్రుడు తాను అసమర్థుడనని చెప్తున్నాడని ధర్మరాజు వద్దకు ఈ సంగతులు చెప్పాలని బయలుదేరుతాడు.

ఈ వివరాలు పరిశీలిస్తే సభలో **రాయబారిగా వచ్చిన వ్యక్తిని అవమానించకూడదు(రాయబార లక్షణం).** కానీ దుర్యోధనుడు పెద్దలందరూ ఉండగానే మాట్లాడుతుండగానే చెప్పకుండా అమర్యాదగా లేచి వెళ్లిపోయాడు. అంతే కాకుండా రాయబారిని శ్రీకృష్ణుని బంధించే ఆలోచన చేశారు. ఇది రాయబార లక్షణాలలో వచ్చిన రాయబారిని బంధించకూడదు దానికి విరుద్ధంగా దుర్యోధనుడు ప్రవర్తించాడు. అటువంటి దురహంకారిని శిక్షించడం మంచిదని శ్రీకృష్ణునితో సహా అందరికీ అందరి మనసుల్లో ఒక అభిప్రాయం అయితే ఏర్పడినట్లు అక్కడి వాతావరణాన్ని బట్టి అంచనా వేయవచ్చు. ధృతరాష్ట్రుడు తన మాట వినకపోవడం చేత ఇదంతా జరిగిందని శ్రీకృష్ణుడు గమనిస్తూనే ఉన్నాడని చెప్తాడు.

### 3.16.44. కుంతీ సందేశం:

శ్రీకృష్ణుడు కుంతీదేవి దగ్గరకు వెళ్లి కురు సభలో జరిగిన వృత్తాంతాన్ని
చెప్పి నేను పాండవుల దగ్గరకు వెళ్తున్నాను వారికి చెప్పవలసిన విషయాలను చెప్పమంటాడు కుంతి దేవి పరాక్రమం యొక్క గొప్పతనాన్ని తెలుపుతూ ముచుకుందుడు శృంగేరి యొక్క పరాక్రమవంతుల కథలను చెప్పి ధర్మరాజును మేల్కొల్పమంటుంది. రాజులు పరాక్రమంతోనే వీరత్వంతో జీవించాలి అంతే కాని పౌరుషాన్ని విడిచిపెట్టి కుల ధర్మాలను పాటించకపోతే దైన్యాన్ని పొందుతారు.సంధి కుదరకపోవడమే మంచిది. నీవు ఈ విషయంలో శంకించవద్దు.తన కొడుకులను యుద్ధానికి సిద్ధం కమ్మని చెప్తుంది .చివరలో తన యోగక్షేమాలను తెలియజేస్తూ భుజపరాక్రమంతో సంపాదించిన జీవితాన్నే గడపమన్నానని చెప్పమంటుంది.

సంస్కృత భారతంలో రాజుకి కుచేలుడు భూమిని ఇస్తాడు కాని ముచకుందుడు దానిని గ్రహించలేదు తన బాహు బలంతో సంపాదించినదే తాను పొందుతానని చెప్తాడు ఈ విధమైన ముచకుందుని వృత్తాంతం ధర్మరాజుకు తెలియడం వలన అతనిలో పౌరుషం కలిగి యుద్ధోన్ముఖుడు కాగలరని వీరమాత అయిన కుంతీదేవి భావించింది.

అలాగే ఆంధ్ర మహాభారతంలో సృంజయుని వృత్తాంతం కుంతిదేవి చెప్పిందని ఉంది ,సంస్కృత భారతం లో విదుల పుత్రుడు సంజయుడు అనే పేరు ఉంది. విదుల సింధు

రాజు చేతిలో ఓడిపోయిన తన కుమారుడిని నిందిస్తుంది. పరాక్రమవంతుల లక్షణాలను చెపుతుంది క్షత్రియ ధర్మం తెలిపి వీర స్వర్గం పొందడము రాజ్యసంపదను పొందడము అనేది యుద్ధరంగంలో వీరుడైన వాడు పోరాడి తేల్చాలి. అంతేకాని పిరికితనంతో వెనుదిరిగి రాకూడదని తన కుమారుని యుద్ధం చేయడానికి ప్రోత్సహిస్తుంది. శత్రురాజులను ఎలా జయించాలో చెప్తుంది.

### 3.16.45. శ్రీకృష్ణుడు – కర్ణుని సంభాషణ:

శ్రీకృష్ణుడు కుంతి దగ్గర పాండవులకు తెలుపవలసిన సమాచారాన్ని తీసుకొని వెళ్తూ కర్ణుడిని మాత్రం తన రథంపై ఎక్కించుకొని మిగతా వారిని వారించి దూరంగా తీసుకొని వెళ్లి మంతనాలు జరుపుతాడు. శ్రీకృష్ణుడు కర్ణుడి యొక్క జన్మ రహస్యం చెప్పి పాండవుల్లో చేరమని ధర్మరాజు నిన్ను పట్టాభిషిక్తున్ని చేస్తాడని రాజ్య భారం నీవు వహించవచ్చని పాండవులు, పాండవుల వైపు వచ్చిన రాజులందరూ నీ పాదాల చెంతకు చేరుతారని చెప్తాడు.

*క. “ పాంచాల రాజపుత్రుయు1 నంచితముగ నిన్ను బొందు నాఱవ వరుసన్*

*సంచిత పుణ్యుఁడు వీ వొక 1 యించుకయును వేఱు సేయ కేతె మ్మెలమిన్”*

*(ఆంధ్రమహాభారతం, ఉద్యోగ పర్వం, చతుర్థాశ్వాసం, 31 వ పద్యం,)*

శ్రీకృష్ణుడు కర్ణుని మీద సామదాన భేదోపాయాలను ప్రయోగిస్తున్నాడు. ఇప్పుడు పాండవులలో కర్ణుడు చేరడం వలన ద్రౌపది నిన్ను ఆరవ భర్తగా స్వీకరిస్తుంది కాబట్టి ఏమీ ఆలోచించక పాండవ పక్షాన చేరమంటాడు.

ఈ విషయంలో శ్రీకృష్ణుడు అలా అడగడం లోని ఆంతర్యాన్ని తెలియక కొంత అసందిగ్ధత ఏర్పడుతుంది. సంస్కృత భారతంలో వ్యాఖ్యానంలో ఈ విషయం గురించి స్పష్టంగా ఈ విధంగా చెప్పబడింది.

*“ షష్ఠే త్వాం చ తథా కాలే ద్రౌపద్యుపగమిష్యతి” (సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 140 వ అధ్యాయం, 15 వ శ్లోకం),*

ఆ సమయంలో ద్రౌపది నిన్ను ఆరవ వానిగా పొందుతుందనే విషయంలో గీత ప్రెస్ వారి పుస్తకంలో సంపాదకులు ఈ విధంగా విశ్లేషణ చేశారు. ఇందులో శ్రీకృష్ణుడు

ఇలా మాట్లాడటం అనుచితమని **'షష్ఠే' 'కాలే'** అంటే అభిషేక కాలంలో ఆరవ కాలంలో అందరితో పాటు ద్రౌపది కూడా నిన్నుసేవిస్తుంది. దగ్గరకు వచ్చి నీరాజనాలు ఇస్తుందని వ్యాఖ్యానిస్తారు.

అప్పుడది ప్రలోభం కాదు ఆ మాట అనుచితం అగునా శ్రీకృష్ణుడు అలా మాట్లాడటంలో అనౌచిత్యం లేదు కాకపోతే ప్రలోభం ఉంది అనౌచిత్యం లేదు అనడానికి రెండు కారణాలు

*1.ఈ విషయం కర్ణునికి కృష్ణునికి తప్ప మరి ఎవరికి తెలియదు కనుక*

*2. ఈ ప్రలోభానికి కర్ణుడు లొంగడని శ్రీకృష్ణునికి ముందే తెలుసు కనుక ఈ ప్రసంగం కర్ణుని మానసిక ఔన్నత్యాన్ని ప్రతిఫలింప చేయడానికి కృష్ణుడు సంకల్పించాడు ఏమైనా ధర్మరాజు శాశ్వతంగా రాజ్యమేలాలని కర్ణుడు అనడం గమనించాలి. గీత ప్రెస్ వారి ముద్రణలో "**షష్ఠేకాలే**" అని ఉండదు మిగిలిన అన్ని పాఠాలలో ఉంటుంది.*

*ప్రలోభంలో కూడా శ్రీకృష్ణుని ధర్మనిష్ఠ గోచరిస్తుంది. భేదోపాయంతో యుద్ధం ఆపడానికి ప్రయత్నం చేసాడు అది ధర్మమే కాని అధర్మం కాదు ధర్మ ప్రభువునకు అది తగినది.*

ఈ వివరాలను పరిశీలిస్తే శ్రీకృష్ణుడు కురువృద్ధులైన భీష్మ ద్రోణులను కూడా వదిలిపెట్టి కర్ణుడిని మాత్రమే సుదూర ప్రాంతానికి తీసుకొని వెళ్లి ఎవరికీ వినబడకుండా ఉండే విధంగా చేసిన చర్చలో శ్రీకృష్ణుడు కీలకమైన విషయాల గురించి మాట్లాడుతాడు కర్ణుని ఆంతర్యం సమూలంగా గ్రహించాలనే ఉద్దేశంతోనే ద్రౌపదిని ఆరోవవానిగా స్వీకరిస్తుందని చెప్తాడు కర్ణుడు ఎటువంటి సమాధానం ఇస్తాడో ముందే ఊహించగల శక్తి సంకల్పసిద్ధి కలిగిన వ్యక్తి శ్రీకృష్ణుడు కాబట్టి సంధి కోసం చేసే ప్రయత్నంలో ఇది కూడా ఒక అంతర్భాగమేనని స్పష్టమవుతుంది.

ఆంధ్ర మహాభారతంలో శ్రీకృష్ణునితో నీవు చెప్పిన విషయం నేను కొంచెం కొంచెమే విని ఉన్నాను కుంతీదేవి నన్ను కనికరం లేనిదై గంగలో త్రోసి వెళ్ళింది సూతుడు నన్ను రాధకిచ్చాడు, ఎంతో ప్రేమతో నన్ను పెంచింది నా మలమూత్రాదులను ఎత్తింది అటువంటి వారిని ఇప్పుడు వదిలివేస్తే అధర్మం అవుతుందని చెప్తాడు.

మొత్తంగా కర్ణుడు తనను పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను విడిచి రానని చెప్తాడు. దుర్యోధనుడు సూతజాతి వాడి కొడుకని భావించకుండా నన్ను తనతో సమానంగా

చూసాడు. అటువంటి దుర్యోధనునికి నమ్మకద్రోహం చేయలేనని చెప్తాడు. ఇప్పటివరకు జరిగిన విషయాలు రహస్యంగానే ఉండాలి ధర్మరాజుకు తెలిస్తే రాజు కావడానికి అంగీకరించడు కానీ అలాంటి ధర్మరాజు భూమండలానికి రాజు కావాలి.ధర్మరాజు యుద్ధమనే యజ్ఞం చేసే క్రమంలో కురుక్షేత్రంలో మా వంటి వారంతా ఉత్తమ గతులు పొందగలరు.

ఈ విధంగా పలికిన కర్ణుని ఆంతరంగిక భావాలను పరిశీలిస్తే శ్రీకృష్ణుడు అడిగిన ద్రౌపదిని శ్రీకృష్ణుడు ద్రౌపదిను ఆరవ వానిగా నిన్ను స్వీకరిస్తుంది అన్న మాటకు సమాధానం ఇవ్వడు దీనిని బట్టి ఆ మాట అప్రస్తుతమని దీని ప్రస్తావన అసంగతమని అనుకొని ఉంటాడు. దాని గురించిన సమాధానమే ఇవ్వలేదు. అంతేకాదు శ్రీకృష్ణుడు పాండవుల వైపు చేరమని చెప్పడానికి ఇన్ని మాటలు మాట్లాడుతున్నాడని అంచనా వేసే సామర్థ్యం కర్ణుడికి కూడా ఉందని తెలుస్తుంది.

పాండవుల వద్దకు తాను రాకపోవడానికి ప్రధాన కారణమని చెప్పి ధర్మరాజే రాజు కావాలంటే తాను చనిపోయిన ఫర్వాలేదు ,దుర్యోధనుని వైపే తాను ఉండాలని కోరుకుంటున్నట్లు తెలుస్తుంది.

కర్ణుడు పాండవుల పక్షం వస్తే నమ్మకద్రోహి అవుతాడని భయపడతాడు .సంస్కృత భారతం లో పాండవుల వైపుకు రాకపోవడానికి ఇంకా లోతైన విషయాలు చెప్తాడు. కర్ణుడికి రాజ్యసంపద వస్తే దానినంతా దుర్యోధనునికి ఇవ్వాల్సి వస్తుందని చెప్తాడు. దుర్యోధనుని మనసు ఏ విధంగా ఉంటుందో చెప్తూ దుర్యోధనుడు కర్ణుడిని చేరదీసిన తర్వాతనే యుద్ధానికి సిద్ధమయ్యాడని. అసలు నన్ను దగ్గరకు తీసుకున్న తర్వాత నే పాండవులతో విరోధం పెట్టుకున్నాడని చెప్తాడు.అర్జునుని ఎదిరించడానికే తనను దుర్యోధనుడు ఎంచుకున్నాడని చెప్తాడు.

పాండవులను తిట్టినందుకు బాధపడతారు తిట్టడానికి గల కారణాలు చెపుతూ

*"యదబ్రువమహం కృష్ణ కటుకాని స్మ పాండవాన్*

*ప్రియార్థం ధార్తరాష్ట్రస్య తేన తప్యేహ్యకర్మణా" (సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 141 వ అధ్యాయం , 45 వ శ్లోకం).*

దుర్యోధనుని సంతోషం కోసమే పాండవులను పరుషంగా మాట్లాడనని  చెప్తాడు.

దీనివలన కర్ణుడికి పాండవులపై అనురాగం ఉందని అది బయటకు కనబడనీయకుండా బాధలను దాచిపెట్టి బ్రతుకుతున్నాడని అతని మాటల్లో తెలుస్తుంది.

యుద్ధంలో ఎవరు ఎవరి చేతిలో మరణిస్తారో ముందుగానే కర్ణుడు నిర్ణయించి కొన్ని విషయాలను వ్యక్తం చేస్తాడు. అర్జునుని చేత కర్ణుడు చనిపోవడం అనేది యజ్ఞానికి 'పునశ్చిత్తి' అవుతుందని చెప్తాడు. పునశ్చిత్తి అంటే యజ్ఞం పూర్తయ్యాక చేసే చయనారంభం అనే కార్యం.

దుశ్శాసనుని రక్తాన్ని భీముడు త్రాగుతాడని ధృష్టద్యుమ్నుడు ద్రోణుని, శిఖండి భీష్మున్ని పడగొట్టడాన్ని యజ్ఞంలో జరిగే కార్యాలుగా చెప్తూ భీముడు దుర్యోధనుని చంపడంతో ధార్త రాష్ట్ర యజ్ఞం పూర్తవుతుందని చెప్తాడు.

ఈ రాజుల సమూహం అంతా ఒక్కసారిగా స్వర్గం పొందే ఏర్పాటు చూడు అదే అందరికీ కావలసిందని కర్ణుడు  చెప్పిన మాటల్లో పాండవుల కౌరవుల మనోగతాలు యుద్ధం కొరకే పరితపిస్తున్నాయని ముందుగానే కర్ణుడు అంచనా వేసాడని తెలుస్తుంది.

మహాభారత యజ్ఞాన్ని క్షత్రియుల కీర్తి ధనంతో పోల్చి ఈ ఘట్టాన్ని బ్రాహ్మణ సమూహాల్లో, సభల్లో చెప్పుకుంటారని చెప్పడంలో భవిష్యత్తు కూడా కర్ణుడు చెప్పడంలో జ్ఞానం కలిగిన వాడని తెలుస్తుంది.దీనితో భారత యుద్ధానికి ప్రాధాన్యతను కల్పించాడు.

కర్ణుడు  పాండవుల వైపు రాకపోవడంతో శ్రీకృష్ణుడు నా మాటలను లెక్క చేయడం లేదు అహంకారం దుఃఖాన్ని కలిగిస్తుంది .అర్జునుడిపై ద్వేషముతో ఇదంతా చేస్తున్నావు నీకు విజయం అయితే రాదని చెప్తాడు.

అన్ని విధాల పాండవులదే విజయమని చెప్తూ భీష్మ, ద్రోణ, కృపనకు ఈ విధంగా చెప్పమంటాడు. ఆంధ్ర మహాభారతంలో దుర్యోధనుడు, భీష్మ, ద్రోణులకు ,సహాయకులైన రాజులందరికీ చెప్పమని ఉంటుంది.

ఏడు రోజుల తర్వాత అమావాస్య వస్తుంది ఆ రోజుకు ఇంద్రుడు అధి దేవత ఆ రోజునే యుద్ధం జరగాలని యుద్ధానికి వచ్చిన రాజులందరికీ వారు కోరిన  దానిని

సంపూర్ణంగా తీరుస్తానని, దుర్యోధనుని వశం అయిన రాజులు రాజకుమారులు మరణం పొంది ఉత్తమ గతి పొందుతారని చెప్తాడు.

తర్వాత కర్ణుడు శ్రీకృష్ణునితో శకునాలు, పీడకలలు యుద్ధాన్ని సూచిస్తున్నాయి. ధర్మరాజుకి గెలుపు తథ్యమని యుద్ధానికి శకుని నేను కారణభూతులం ఇది నిజమని చెప్తాడు. ఈ కురు పాండవుల యుద్ధం లో గెలిస్తే నిన్ను ఇక్కడే దర్శిస్తాను లేదా వీర స్వర్గం చేరి పరమేశ్వరుడువైనా నిన్ను చూస్తానని సెలవు తీసుకుంటాడు శ్రీకృష్ణుడిని కర్ణుడు కౌగిలించుకుంటాడు.

### 3.16.46. శ్రీకృష్ణుడు రాయబార విశేషాలు పాండవులకు తెలుపుట:

శ్రీకృష్ణుడు హస్తినాపురం నుండి ఉపప్లావ్యానికి వెళ్లి కౌరవ సభలో జరిగిన విశేషాలను అన్నిటిని చెప్తాడు శ్రీకృష్ణుడు సంధి కోసం ఎంత ప్రయత్నించినప్పటికీ దుర్యోధనుడు మూర్ఖపు పట్టుదలతో ఉన్నాడని భీష్మ, ద్రోణాదులు చెప్పినా ధృతరాష్ట్ర,గాంధారి చెప్పిన నారదాది మునులు చెప్పినా పట్టించుకోకుండా వారి మాటలను నిర్లక్ష్యం చేసి యుద్ధానికి కాలుదువుతున్నాడు అయినప్పటికీ శాంతిగా మాట్లాడినప్పటికీ నన్ను బంధించే ప్రయత్నం చేశాడు . యుద్ధం చేతనే రాజ్యాన్ని పొందాలి అంతకంటే మరో మార్గం లేదు.

దుర్యోధనుని మీద సామ దాన భేదోపాయాలను ఉపయోగించాను అయినా దుర్యోధను రాజ్య భాగం ఇవ్వడానికి అంగీకరించలేదని చెప్తాడు. ధర్మరాజు శ్రీకృష్ణుని మాటల విన్న తర్వాత తన తమ్మునితో యుద్ధ సన్నాహాలు ప్రారంభిస్తాడు.

శ్రీకృష్ణుడు రాయబారం జరపడానికి సంపూర్ణ స్వేచ్ఛ ఉంది కావుననే పాండవులు చెప్పిన మాటలతో పాటు తాను సమయస్ఫూర్తి గా చెప్పదలచుకున్న మాటలను మాట్లాడుతాడు. అంతేకాకుండా రాయబారిగా వెళ్ళిన వ్యక్తి సామాన్యమైన వ్యక్తి కాదని దుర్యోధనుడు వంటి మూర్ఖులకు తెలియజేయడానికి విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. ధర్మాన్ని వ్రతంగా పెట్టుకున్నవారు తల్లి కి అత్యంత ప్రాధాన్యత ఇస్తారు కాబట్టే కుంతి దేవి ఆంతర్యాన్ని తెలుసుకుని ధర్మరాజు కు తెలియజేస్తాడు. తల్లి మాటకు గౌరవించైనా ధర్మరాజు యుద్ధోన్ముఖుడు అయ్యే అవకాశం ఉంది. ఈ ఆలోచనా నైపుణ్యం శ్రీకృష్ణుడికే

సాధ్యం తను ఏమి నిర్ణయం తీసుకున్నా పాండవులు అంగీకరిస్తారు అనే భావన, పాండవులకు తన పై ఉన్న అత్యంత నమ్మకం ఉండడంచేతనే శ్రీకృష్ణుడు యుద్ధానికి ముహూర్తం కూడా నిర్ణయించి మరి వస్తాడు. ఒక రాయబారిగా, తాను చేయవలసినదంతా సంపూర్ణంగా పూర్తి చేసాడు.

### 3.16.47. శ్రీకృష్ణ రాయబారం చర్చ:

శ్రీకృష్ణుడు జరిపిన రాయబారం గొప్పదైనటువంటిది శ్రీకృష్ణుడు అవతలి దుర్యోధనాదులు మూర్ఖులని తెలిసినా రాయబార కార్యం సఫలం కాదని తెలిసినా అక్కడకు వెళితే ఎటువంటి అవమానాలు కలుగుతాయో ముందుగా ఊహించినప్పటికి రాయబారానికి వెళ్లడానికి పూనుకుంటాడు. శ్రీకృష్ణుడు హస్తినాపురానికి వచ్చిన క్షణం నుండి అక్కడి పురజనులు శ్రీకృష్ణున్ని చూడాలనే ఉత్సుకత వారి భక్తిని తెలియజేస్తుంది. ధర్మానికి అధర్మానికి మధ్య సఖ్యతను చేకూర్చుడానికి శ్రీకృష్ణుడు న్యాయసమరానికి వెళ్లాడానిపిస్తుంది. సంధి కార్యం విఫలమయినప్పటికి ఎవరికి ఎలా చెప్పాలో చెప్పి తన విశ్వరూప ప్రదర్శనను చూపి మరి సభ నుండి నిష్క్రమిస్తాడు.

నేతి అనంతరామ శాస్త్రి శ్రీకృష్ణరాయబారాన్ని గురించి కొన్ని విషయాలు ప్రస్తావిస్తాడు. *“ శ్రేష్ఠమైన రాజనీతిజ్ఞుడు, అత్యంత పరిపాలనా దక్షుడు, మహాప్రతిభావంతుడైన పాండవుల రాయబారి శ్రీకృష్ణుడు. కౌరవులతో సంధిని నడిపేందుకు అన్ని అధికారాలు కలిగిన రాయబారిగా వ్యవహరించాడని వీరు తెలియజేస్తారు. అంతే కాకుండా ద్రుపద పురోహితుని మాటల కఠినత్వానికి కృష్ణుని మాటల కాఠిన్యానికి భేదం లేదు కాకపోతే కృష్ణుడు తనకున్న ప్రాచుర్య ప్రభావాలతో ఎక్కువ సమయాన్ని కురురాజు కొలువులో వినియోగించుకోవడం జరిగింది. సంధిపొసగకూడదనే కృష్ణుని ఆంతర్యం కాని చూచేవారికి సంధిపొసగడానికి ఎంతగానో కృషి చేసినట్లు కనిపిస్తుంది. వీరి రాయబారాల్లో చిత్తశుద్ధి లేనికారణంగా సంధి పొసగలేదని వీరు అభిప్రాయపడతారు” ( అనంతరామ శాస్త్రి నేతి, కవిత్రయ భారతం రాజనీతి, పుట:266, 267).*

వీరు వివరించిన విషయాలు గమనిస్తే శ్రీకృష్ణుడు సంధిప్రయత్నించడానికి దృఢమైన సంకల్పంతో చేయలేదని కేవలం ప్రయత్నం మాత్రమే చేసాడని అందుకే సంధి కార్యం విఫలమైందని వీరి మాటల్లో వ్యక్తమవుతుంది. పైగా శ్రీకృష్ణుడు అందరికి అనుమానం రాకుండా సంధి కోసమే ప్రయత్నించినట్లు రాయబారం నిర్వహించాడని లోపల సంధివిఫలమవ్వడానికే దూత కార్యం నిర్వహించాడని వీరి మాటల్లో ఉన్నటువంటి విషయం.

*అమాత్యులకు ఉండే గుణ సంపద అంతా ఉన్న దూత "నిసృష్టార్థుడు" అనగా కార్యభారం అంతా అతని మీద విడిచి వేయవచ్చని అర్థం. ( పుల్లెల శ్రీ రామచంద్రుడు (వ్యాఖ్యాత), కౌటిలీయమ్ అర్థశాస్త్రం., పుట:64.).*

ఈ రాయబార లక్షణాన్ని శ్రీకృష్ణుడికి సరిపోలుతుంది. ఎందుకనగా పాండవులు తమ అభిప్రాయాలను శ్రీకృష్ణుడికి తెలిపినప్పటికి రాయబార కార్యాన్ని నిర్వహించడాని . సంభాషణా చాతుర్యంతో ఎదుటి వారి మనసులు చలించి ఆలోచింపచేయడానికి సంపూర్ణమైన స్వేచ్ఛ కలిగిన రాయబారి శ్రీకృష్ణుడు.

శలాక రఘునాథ శర్మ **"భారతం ధ్వని దర్శనము " గ్రంథంలో** శ్రీకృష్ణ రాయబారం లో శ్రీకృష్ణుడు చెప్పిన మాటల్లోని అంతరార్థాన్ని ఈ విధంగా తెలియజేసారు.

*రాయబారమునకు వచ్చిన శ్రీకృష్ణుని మాటలు పెడచెవిన పెట్టటమే కాకుండా అతని బంధించి తులువ తనము చూపడానికి ఎంచిన దుర్యోధనాదులను చూసి ధృతరాష్ట్రున్ని ఉద్దేశించి శ్రీకృష్ణుడు ఇట్లు చెప్తాడు.*

*"రోషము నాపయింగలిగి క్రూరతఁగౌరవులింత సేఁత సం*
*తోషమ నీవు ప్రాభవముతోఁదగ నాకు ననుజ్ఞ యిమ్ము ని*
*ర్దోషత నేను నోపుగతిదోర్బలదుర్జయులైనవారి వి*
*ద్వేషముఁజక్కఁబెట్టి జగతీపర యంతకు పోయివచ్చెదన్" 5.3.400*

*ఇందులో శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుని అనుమతిని కోరుకోవడం ప్రధానముగా దుర్యోధనాది దుర్జనుని వధించుటకే అనునది స్ఫురిస్తున్నప్పటికి ప్రాభవముతో నిర్దోషతన్, ఓపుగతిన్, దోర్బలదుర్జయులైన వారి ద్వేషము చక్కబెట్టి అనే మాటలవలన సామాది*

*ఉపాయములతో ఇంకనూ ప్రయత్నింతునను అర్థము స్ఫురించుటకు వీలులేకపోలేదు. ఇట్లు కృష్ణుడు అనుమతిని కోరుట దుర్యోధనాదులను వధించుటకొరకా? సంధి కూర్చడానికా? అను రెండు అంశములకు అవకాశమున్నది. ఇంతే కాకుండా విశ్వరూపం ప్రదర్శించుట చేత శ్రీకృష్ణుడు తన మహత్త్వరూపమున భయపెట్టి వశీకరించుకునే ప్రయత్నం చేస్తున్నాడనే భావము కూడా కృష్ణునికి లేకపోలేదని భావించుటకు అవకాశము కలదు కావున వధించుటకే అనుమతి నిమ్మని అడిగెనని నిర్ణయించుటకు వీలులేదు ఇట్లు పద్యములో సందేహసంకరము గోచరించునని తెలియజేసారు.(రఘునాథ శర్మ, శలాక, భారతము ధ్వని దర్శనము, పుట:194).*

శ్రీకృష్ణుని ఆంతర్యమును రెండు విధములుగా ఆలోచించే విధంగా తిక్కన కూర్చాడని ఈ వివరణను బట్టి తెలుస్తుంది. శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రునిని అనుమతి కోరడంతో ధ్వని తో కూడిన సంభాషణను శలాకరఘునాథ శర్మ వివరణాత్మకంగా వివరించారు.

శ్రీకృష్ణరాయబారం గురించి ఒక్కో వ్యక్తి ఒక్కో అభిప్రాయాన్ని తెలియజేసారు. శ్రీ వి.యస్ రాఘవన్, ***"తమిళాంధ్రమహాభారతముల తులనాత్మక పరిశీలనము" గ్రంథంలో*** *తన అభిప్రాయాన్ని ఈ విధంగా తెలిపారు. " శ్రీకృష్ణుని దూతగా పొమ్మని ధర్మరాజు వేడుకొనెను. ఇక్కడ చర్చింపవలసిన విషయం ఒకటున్నది ఉత్తములను దూతగా పంపరు. 'నహి ప్రకృష్టాః ప్రేష్యంతే ప్రేష్యంతే హి ఇతరే జనాః". అటువంటప్పుడు ఉత్తముడైన కృష్ణపరమాత్మను దూతగా ధర్మరాజు నిర్ణయించుట తప్పుకదా ? ప్రస్తుత స్థితిలో కృష్ణుడు తప్ప మరెవ్వడు ఈ పనిని సాధించలేడు . ఇప్పటికి దూతల వచ్చిపోవుచున్నారు. తనకు విశ్వాసమున్న వారిని పంపుట రాజధర్మము. నీచ వృత్తిని కృష్ణుడు స్వీకరించవచ్చునా? భక్తా పరాధీనుడు గనుక నీచ వృత్తియైనను చేసి భక్తులకు మేలు చేయదలచెను. పరమాత్మ భక్తులకై బిచ్చము కూడా ఎత్తను కదా ! అదియుగాక యుద్ధము జరగవలె భూభారము* తొలగవలె కావున కృష్ణుడు దూతగా వెళ్ళుట కు అంగీకరించెను." ( రాఘవన్, శ్రీ.వి.వియస్, **తమిళాంధ్రభారతముల తులనాత్మక పరిశీలనము,** పుట:329).

ఈ విషయాలను గమనిస్తే రాయబారం జరపడం మంచిదే కాని అటువంటి పనికి తక్కువ వారిని కదా నియమించాలి. సాక్షాత్తు సర్వాంతర్యామిని ఈ పనికి నియమించడం శ్రీకృష్ణుని గౌరవానికి భంగం కలిగినట్లు ఉంటుందని వీరి అభిప్రాయం. అయితే ధర్మానికి, భక్తికి పరమాత్మ దాసుడై సేవచేస్తాడు అనడానికి పాండవులకు శ్రీకృష్ణుని మధ్య గల సంబంధాన్నే గమనించవచ్చని నా అభిప్రాయం. పరమాత్మ భక్త సేవకుడనే విషయం మనం గమనించాలి.

## 3.17. ఉలూకుని రాయబారం:

ధృతరాష్ట్రుడు సంజయుని పిలిపించి ఇరుపక్షాల వారు కురుక్షేత్రంలో దిగిన తర్వాత జరిగిన విశేషాలను అడుగుతాడు. సంజయుడు ఈ విధంగా తెలియజేస్తాడు. దుర్యోధనుడు దుశ్శాసన శకుని కర్ణులతో కలిసి ఉలూకుడనే శకుని పుత్రుడిని పాండవుల దగ్గరకు వెళ్లి శ్రీకృష్ణుడు విరాటుడు వింటుండగా మాట్లాడవలసిన మాటలను చెప్పి పంపుతాడు.

ఉలుకుడు వెళ్లి ధర్మరాజుతో దుర్యోధనుడు కొన్ని మాటలను ఆజ్ఞాపించిన విషయాలను చెప్తాను కోపగించుకోవద్దని అంటాడు. ధర్మరాజు భయపడక సవిస్తరంగా వినిపించమని చెప్తాడు.

ఇక్కడ ఉలూకుడు కోపగించవద్దని అన్నప్పుడే దుర్యోధనాదులు ఏ విధమైన దురాలోచనతో మాటలను మాట్లాడారో అర్థం అవుతుంది. రాయబారైన ఉలుకుడు భయపడతాడు ధర్మరాజు ధైర్యం ఇవ్వడంతో వివరంగా తెలియజేస్తాడు.

ఉలుకుడు ఈ విధంగా వివరిస్తున్నాడు చాలా కాలం నుండి వేచి చూస్తూ సంజయుడితో మీ యోగ్యతకు మించి మాటలు ఎన్నో అన్నావు రాజ్యభాగం పోగొట్టుకున్నందుకు ద్రౌపది భంగపాటుకు పగ తీర్చుకునే సమయం వచ్చిందని యుద్ధానికి సిద్ధం కమ్మని తెలియజేస్తాడు.

భీష్ముని భుజ శక్తి ,ద్రోణాచార్యుల బాణాల పరంపరను ఎలాంటిదో మీకు తెలుసని మీరు శ్రీకృష్ణుని **చేతినే** చక్కబెట్టుకోండని చెప్తాడు.భీష్మ ద్రోణులు ఉండగా అర్జునుడు బ్రతకడం

సాధ్యం కాదని చెప్తాడు .భీముడు దుశ్శాసనుని నెత్తురు యుద్ధంలో త్రాగుతానని చెప్పాడు కదా అదే సాధ్యమైతే త్రాగమని ఆలస్యం ఎందుకు భీముడిని బావిలోని కప్ప వలె అతని బలం ఏమిటో అతనికి తెలుసని ఎదుటివారి బలం ఏమిటో తెలుసుకోలేకున్నావు ఒక్కసారి మా చేతికి చిక్కి దెబ్బలు తినకుండా పోలేవని చెప్తాడు.తర్వాత అర్జునునితో తాటి చెట్టు అంత గాండీవం ఉందని కృష్ణుడు సాయంగా ఉన్నాడని మాకు తెలుసు అయినా భయపడి మీకు భూమిలో భాగం మీకు ఇయ్యము. ద్రౌపదిని అవమానపరిచేటప్పుడు భీముని గదా అర్జునుని గాండీవం ఏమీ చేయలేకపోయాయని అవమానం మర్చిపోయావా పౌరుష మాటలు ఎందుకు మాట్లాడతావని అంటాడు.

*ఉ. మాయలు నింద్రజాలములు మాధవుఁడిందును గొన్ని వన్నినన్*
*బాయవు రజ్జు లెప్పుడు నవారణ నీ వెటు లాడితేనియున్*
*వేయును నేల? పార్థులను విష్ణులు నేఁబదివేలు వచ్చినం*
*జేయుదు మేము గయ్య మొకచీరియు సంపదఁబంచియిత్తుమే?(ఆంధ్ర మహాభారతం, ఉద్యోగ పర్వం, చతుర్థాశ్వాసం, 201 వ పద్యం).*

అజ్ఞాతవాసంలో విరాటుని కొలువులో వంటల వాడుగా భీముడు బృహన్నలగా అర్జునుడు పడిన కష్టాలను గుర్తు చేస్తూ ఇవి శూరుని లక్షణం కాదని బహు పరాక్రమం కాదని హేళన చేసే మాటలను మాట్లాడుతాడు. చివరికి శ్రీకృష్ణుని వదలక శ్రీకృష్ణుడు ఇంద్రజాలం చేసే వాడుగాను మాయలు పన్నేవాడుగాను ప్రగల్భాలు పలికేవాడుగాని పేర్కొంటూ 50 వేల మంది శ్రీకృష్ణార్జునులు వచ్చిన వారిని ఏమీ చేయలేరని భూమి భాగం ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్తాడు.

### 3.17.1. ఉలూకుని మాటలకు భీముని సమాధానం:

ఉలూకుడు మాటలు విన్న భీమార్జునా నకుల సహదేవులు కోపోద్రేక్తులైన ముఖాలతో ఉండగా శ్రీకృష్ణుడు చిరునవ్వుతో ఉలుకుడితో దుర్యోధనుడికి చెప్పవలసిన మాటలను చెప్పి పంపిస్తాడు. యుద్ధం రేపే వీరుడవైతే ధైర్యమును వహించి మరణించుము. మరణం తప్పదని శ్రీకృష్ణుడు సారథ్యంవహించగా వెడలిన విజయుని రథం దుర్యోధనుడు

ఎక్కడకి వెళ్తే అక్కడికి తరుముతుందని భీముడు 10,000 ఏనుగులతో సమం కలవాడని యుద్ధంలో దుశ్శాసన రక్తాన్ని దుర్యోధనుడు చూస్తుండగానే త్రాగగలడని తెలియజేస్తాడు.

ఆంధ్రమహాభారతంలో కూడా  అర్జునుడు కూడా ఉలుకునితో భీష్మ, ద్రోణ పరాక్రమాలు చూసి మురిసిపోతున్నావు ముందుగా గాంగేయుడిని, ద్రోణాచార్యులనే మొదట మట్టు  పెడతాము కర్ణుని తరిమికొడతాము అప్పటికి కానీ దుర్యోధనుడు ఆశ వదులుకోడు అప్పటికి గాని దుర్యోధనుడు తన వారి మరణాలు చూచి భీముని గద దెబ్బకి పడిపోయినప్పుడు కానీ తన పాపకార్యాలను స్మరించగలరని తొందరగా వెళ్లి మీ రాజుని యుద్ధానికి పంపమని అర్జునుడు పలుకుతాడు.

సంస్కృత భారతంలో ఉలూకుని మాటలకు కోపంతో ఉన్న భీముని మూర్తిని శ్రీకృష్ణుడు  గమనించి ఉలూకునితో త్వరగా వెళ్ళు సుయోధనునితో చెప్పు నీవుచెప్పించిన మాటలు విన్నాం నీ ఇష్ట ప్రకరామే జరుగుతుందని చెప్పమంటాడు. అక్కదున్న వారంతా ఉలూకుని మాటలకు కృష్ణార్జునులను తక్కువ చేసి మాట్లాడటం సహించలేకపోయారు. క్రోధంతో భీముడు రాజులందరి మధ్య కర్ణుదు, ఉలూకుని తండ్రి శకుని వినేటట్లు నేను చెప్పిన మాటలను చెప్పమంటాడు.  మా పెద్దన్నగారికి సంతోషం కలిగించాలని ఇన్ని రోజులు సహించాము అది నీవు తెలుసుకోలేకపోతున్నావు. బుద్ధిమంతుడైన ధర్మరాజు శాంతికోసం ప్రయత్నించాడు. కాని నీవు మాత్రం చావాలనుకుంటున్నావు రేపే యుద్ధం జరుగుతుంది సిద్ధంగా ఉండమని చెప్తాడు. **(సంస్కృత భారతం, ఉద్యోగం పర్వం,162 వ అధ్యాయం,).**

### 3.17.2. ఉలూకుని మాటలకు సహదేవుని సమాధానం:

భీముడు    మాట్లాడిన దర్వాత సహదేవుడు కోపంతో ఉలూకుని తండ్రి శకునితో ఈ మాటలను చెప్పమంటాడు. శకునితో సంబంధం లేకపోతే కౌరవులకు పాండవులకు మధ్య భేదం వచ్చేది కాదని ఇంతటి అనర్థాలకు కారణం శకునే అని చెప్తూ ముందుగా శకుని చూస్తుండగా ఉలూకుని, అందరూ చూస్తుండగా శకునిని చంపితే ఈ శత్రుత్వం నశిస్తుందని కోపంతో మాట్లాడుతాడు.

### 3.17.3. ఉలూకునికి అర్జునుని సమాధానం:

భీమార్జునుల మాటలు విన్న అర్జునుడు భీమునితో  నీతో వైరం పెట్టుకున్నవారు ఎవరూ బ్రతకరు కాని ఇప్పుడు వచ్చిన ఉలూకుడు రాయబారి అతనితో కఠినంగా మాట్లాడకు, దూతలు ఏమి తప్పు చేయరు అవతలి వారు ఏమి మాట్టాడమంటే అదే మాట్లాడుతారు. అంతేకదా

ఇలా అర్జునుడు పలకడంలో దూత యొక్క లక్షణాలు తెలియడం చేత ఎంత కోపం ఉన్నప్పటికి ఉలూకుని పై కోపగించవద్దని చెప్తాడు. తర్వాత అర్జునుడు మాట్లాడుతాడు. ఉలూకుడు మాట్లాడిన మాటలకు సమాధానం మాటలతో కాదు గాండీవంతో సమాధానం చెప్తానంటాడు. తర్వాత ధర్మరాజు కూడా మొదట మృదువుగా పలకరించి కోపంతో కొన్ని మాటలను చెప్తాడు. ఉలూకా వెళ్ళు కులాన్నినాశనం చేసే దుర్యోధనునితో చెప్పు ఇతరుల పరాక్రమం చూసి యుద్ధానికి కాలుదువ్వుతున్నావు నపుంసకత్వం అంటే ఇదే అని చెప్తాడు. అర్జునుని తిట్టిన మాటలకు ధర్మరాజు ఈ విధంగా సమాధానమిస్తున్నాడు. ఇతరుల పరాక్రమాన్ని ఆశ్రయించుకుని శత్రువులను యుద్ధానికి పిలిచే వాడు క్షత్రియుడనిపించుకోడని చెప్తాడు.

### 3.17.4. ఉలూకునితో శ్రీకృష్ణ సంభాషణ:

చివరలో కృష్ణుడు రేపే యుద్ధానికి రమ్మని దుర్యోధనుడితో చెప్పమంటాడు పురుషుడిలాగా ప్రవర్తించమంటాడు. ధర్మరాజు యొక్క ఆజ్ఞ చేత అర్జునుడికి సారథ్యం వహిస్తున్నాను అంతే నీవు ముల్లోకాలకు ఎగిరి పోయినా భూమిలోకి దూరిపోయినా సరే తెల్లారేసరికి నీ ఎదుటనే అర్జునుడు రథాన్ని చూసి తీరుతావని హెచ్చరిస్తాడు.

తర్వాత ఉలూకుడు వీరి మాటలను గ్రహించి దుర్యోధనునికి ఆవేశపూరితంగా పాండవులు మాట్లాడిన మాటలను యథాతథంగా చెప్తాడు. దుర్యోధనుడు సేనలను సమకూర్చుకోవడానికి సిద్ధపడుతాడు.

### 3.17. 5. ఉలూకున్ని ధర్మరాజు గౌరవించి పంపుట

ధర్మరాజు ఉలుకుడికి తాంబూల ఆభరణాలు ఇచ్చి వెళ్ళమని చెప్తాడు. సంస్కృత భారతంలో ఈ మర్యాద కనబడదు. ధర్మరాజు ఉలూకా నీవు ఆలస్యం చేయకు ఉండాలంటే ఇక్కడే ఉండు, నీకు మేము బంధువులమేని చెప్తాడు.( సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం,163 వ అధ్యాయం, ).

ధర్మరాజు ధృష్టద్యుమ్నుని తో యుద్ధసన్నాహాలు చేయమని చెప్తాడు. ఉలుకుని మాటలను విన్న దుర్యోధనుడు యుద్ధానికి సిద్ధమవుతారు.భీష్ముడు నా పరాక్రమమే సైన్యానికి రక్షక కవచమని గ్రహించమని దుర్యోధనునికి ధైర్యం చెప్తాడు.

ఈ ఉలుకుని రాయబారంలో దుర్యోధనుని మాటలు పాండవులను రెచ్చగొట్టే విధంగా కనబడతాయి. అంతేకాకుండా దుర్యోధనుని దురహంకారం బయటపడుతుంది. చివరికి అజ్ఞానాంధకారుడై శ్రీకృష్ణుని కూడా నిందిస్తాడు .ఈ మాటలన్నీ పాండవులకు కోపావేశాన్ని కలిగించాయి వచ్చినవాడు రాయబారి కావున అతనిపై ఆ కోపాన్ని ప్రదర్శించకూడదు. కావున ఉలూకునితో శ్రీకృష్ణుడు చిరునవ్వుతోనూ అర్జునుడు పౌరుషంతోను దుర్యోధనునికి తెలియజేయవలసిన మాటలను తెలుపుతారు అవమానపరచకూడదు కావున ధర్మరాజు ఆభరణాలతో సత్కరించి గౌరవంగా తిరిగి పంపిస్తారు. ఈ ఘట్టం రాయబారిని ఎలా గౌరవించాలి వారితో ఎలా ప్రవర్తించాలో, రాయబారి తెచ్చే సమాచారం ఆవేశపూరితమైనప్పటికీ వారిని ఎలా సమాధానపరచాలో తెలియజేస్తుంది.

### 3.18.ఉద్యోగ పర్వం (ఇతర రాయబారాలు):

ఉద్యోగ పర్వంలో రాయబారాలుగా, స్వీయ రాయబారాలుగా పేర్కొనదగినవి కొన్నింటిని ఇక్కడ వివరించాను.

### 3.18.1. దుర్యోధన, అర్జున రాయబారులు(స్వీయ రాయబారులు):

పాండవులు రాయబారిగా ద్రుపద పురోహితున్ని నియమించిన తర్వాత వారు రాయబారం జరుపుతూనే యుద్ధ ప్రయత్నంలో భాగంగా రాజులందరిని యుద్ధానికి సహకరించే ప్రయత్నాలు మొదలు పెడతారు.

*వ. అంత నక్కడ దుర్యోధనుండు, సకల రాజన్య సామాన్యంబుగా గోపాలదేవు పాలికి దూతం బుచ్చుట దగవగునే ? అని విచారించి " (ఆంధ్ర మహాభారతం, ఉద్యోగ పర్వం, ప్రథమాశ్వాసం,62 వచనం).*

దుర్యోధనుడు కూడా ఆ నెపంతోనే హస్తినాపురంలోని రాజులందరి వద్దకు రాయబారానికి పంపించి శ్రీకృష్ణుడి వద్దకు రాయబారిని పంపిద్దామా వద్దా అని ఆలోచిస్తూ తానే స్వీయ రాయబారియై కొంతమంది పరిజనులను తీసుకుని వెళ్తాడు.

ఇక్కడ దుర్యోధనుడు శ్రీకృష్ణుని దగ్గరకు దూతలను పంపాలా వద్దా అని ఆలోచించి స్వయంగా తానే రాయబారి కార్యాన్ని నిర్వహించుకున్నాడు. దీనికి గల కారణం శ్రీకృష్ణుని పై భక్తి కాదు శ్రీకృష్ణుని దగ్గర ఉన్న సైనిక బలం, ఇదే విషయాన్ని సంస్కృత భారతంలో గమనిస్తే

పాండవులు సహాయం కోసం రాజుల వద్దకు దూతలను పంపారు. అర్జునుడు మాత్రం తానే స్వయంగా ద్వారకకు  వెళ్ళాడు. పాండవుల కదలికలు అన్నింటిని దుర్యోధనుడు నమ్మకమైన గూఢచారుల ద్వారా తెలుసుకున్నాడు.  వాయువేగం గల గుఱ్ఱాలపై కొద్ది సైన్యాన్ని వెంటబెట్టుకుని ద్వారకా పురానికి బయలుదేరాడు.

సంపాదకులు దూత గురించి ఈ విధంగా అంటారు.

*దూతైః ప్రాణహితైశ్చరైః అని పాఠాంతరం.*

*దూతలు = ప్రత్యక్షంగా విషయసేకరణ చేయువారు*

*చారులు = గూఢంగా విషయ సేకరణ చేయువారు. ( సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 7 వ అధ్యాయం,3,4 శ్లోకాలు).*

ఈ మాటను పరిశీలిస్తే దూతకు , చారునికి మధ్య ప్రత్యక్ష పరోక్ష సంబంధం మాత్రమే ఉన్నట్లు తెలుస్తుంది. దుర్యోధనుడు పరోక్షంగా విషయ సేకరణ చేసి ప్రత్యక్షంగా స్వీయరాయబారాన్ని నిర్వహించినట్లు అర్థమవుతుంది. అర్జునుడు కూడా దూతలను ఇతర రాజ్యాలకు పంపించి శ్రీకృష్ణుడి దగ్గర కు మాత్రం తానే స్వయంగా వెళ్ళడం రాజమర్యాదను సూచిస్తున్నట్లు తెలుస్తుంది.

దుర్యోధనుడు వెళ్ళగానే శ్రీకృష్ణుడు శయనించి ఉండగా ముందుగా వచ్చిన దుర్యోధనుడు శ్రీకృష్ణుని తల దగ్గర ఉన్న పీఠం మీద ఆసీనుడవుతాడు. అర్జునుడు కూడా అదే రోజు రావడం శ్రీకృష్ణపాదాల దగ్గర వినయంతో నిలబడటం జరుగుతుంది. శ్రీకృష్ణుడు నిద్ర లేవగానే ముందుగా అర్జునుడిని  తర్వాత దుర్యోధనుని చూస్తాడు. వారు వచ్చిన పనిని తెలుపమని అడుగుతాడు. అడగగానే ఆ దుర్యోధనుడు యుద్ధం చేయాలనే కోరికతో నీ సహాయం కోరి నీ దగ్గరికి వచ్చాము. పాండవులమైనా కౌరవులైనా నీకు దగ్గర చుట్టాలమే కనుక ముందుగా నేను నిన్ను చూడవచ్చాను. ముందు వచ్చిన వాళ్లను సజ్జనులు ఆదరిస్తారు. నీవు మంచివాడవు కాబట్టి లోకంలో ఉన్న న్యాయాన్ని పాటించి తనకు సహాయపడమని అడుగుతాడు. దానికి శ్రీకృష్ణుడు ముందు నేను అర్జునుడిని చూచాను. మీ ఇద్దరికి సహాయం చేయడం మంచిదని చెప్పి శ్రీకృష్ణుడు వారి కోరికలు అనుసరించి క్రమ పద్ధతిలో తన సహాయాన్ని రెండు భాగాలుగా చేస్తాడు. యుద్ధ పాండిత్యం తెలిసిన పదివేల మంది వీరులైన గోపాలురు ఒక వైపు ఆయుధాలు జోలికి పోకుండా హితుడుగా ఒకచోట ఉండి ఉంటానని విభాగం చేసి ఎవరికి ఏమి కావాలో కోరుకోమంటాడు. ముందుగా చిన్నవాడు కోరుకోవడం న్యాయం అని  పలికి అర్జునుడిని అడుగుతాడు. అర్జునుడు సంతోషంతో శ్రీకృష్ణుని కోరుకుంటాడు. ఆనిర్ణయానికి దుర్యోధనుడు సంతోషానికి అవధులు లేకుండా పోతాయి. ఎక్కడ పదివేల మంది గోపాలురను కోరుకుంటాడోనని భయపడతాడు. అర్జునుడు శ్రీకృష్ణున్ని కోరుకోవడం విని ఆనందపడతాడు. తన సేనలను తీసుకుని బలరాముడి ఇంటికి ఆనందంతో వెళతాడు. బలరాముడికి తాను వచ్చిన పనిని తెలుపుతాడు. బలరాముడు తాను అభిమన్యుడి పెళ్ళి సందర్భంగా వచ్చిన రాజులందరూ సమావేశమైనప్పుడు దుర్యోధనుని పక్షాన పలకడం దానికి కొంతమంది వ్యక్తులు ఇష్టపడక పోవడం  ఇలా కొన్ని విషయాల కారణంగా బలరాముడు ఎవరికి సహాయం చేయనని చెప్తాడు. దుర్యోధనుడు అందుకు అంగీకరించి వినయపూర్వకంగా అతడిని వేడుకుని కృష్ణున్ని మరలా పలుకరించి కృతవర్మ వద్దకు వెళ్తాడు. అతను ఒక అక్షౌహిణి సేనతో తోడ్పడివస్తానని చెప్పగా సంతోషించి తన నగరానికి హస్తినా పురికి వెళ్తాడు. **(ఆంధ్రమహాభారతం, ఉద్యోగ పర్వం, ప్రథమాశ్వాసం, 92 వ పద్యం నుండి)**

ఈ సన్నివేశంలోని అంతరార్థాన్ని శ్రీకృష్ణుడు ఇచ్చిన సందేశాన్ని గమనిద్దాం. శ్రీకృష్ణుడు శయనించి ఉన్నప్పుడు దుర్యోధనుడు తల దగ్గర ఉన్నత ఆసనం పై కూర్చోవడం అతని అహంభావానికి ప్రతిక . మహాత్ముల దగ్గరకు, పెద్దవాళ్ళ దగ్గరకు వెళ్ళినప్పుడు వారికి తగిన రీతిలో గౌరవం ఇవ్వాలి. ధనముందనో, పదవి ఉందనో, చదువు ఉందనో అహంకరించి గొప్పవారిని సామాన్యమానవులుగా భావించి ప్రవర్తిస్తే వారు ఎప్పటికి విజయాన్ని పొందరు అందుకే దుర్యోధనుడు అల్పమైన సంతోషం కోసం అశాశ్వతమైన ఆనందం కోసం ఉత్సాహం చూపి చివరకు అపజయంపాలయ్యాడు. అదే అర్జునుడు శ్రీకృష్ణున్ని సాక్షాత్తు పరంధామునిగా, భక్తితో వినయంతో నిలబడ్డాడు. అంతటి మహోన్నతమైన భావాలు భక్తునిలో ఉన్నాయి కాబట్టి శ్రీకృష్ణుని దృష్టి మొదట అర్జునుపై పడింది. తన సామర్థ్యం మీద అర్జునునికి నమ్మకం ఉంది. దానికి తోడు శ్రీకృష్ణుడు తనకు సలహాదారుడుగా, తన రథ సారథిగా ఉంటే చాలనుకున్నాడు చివరకు విజయం సాధించాడు.

ఇక్కడ స్వీయరాయబారియై దుర్యోధనుడు సైన్యాన్ని సమకూర్చుకునే ప్రయత్నంలో కృష్ణుని వద్ద నుండి సైన్యాన్ని దక్కించుకుంటాడు. అజ్ఞానం చేత పరమాత్మయైన శ్రీకృష్ణున్ని వదులుకుంటాడు. అర్జునుడికి మొదటి అవకాశం ఇచ్చినప్పుడు ఎక్కడ సైన్యాన్ని కోరుకుంటాడోనని భయపడుతాడు. శ్రీకృష్ణున్ని కోరుకోవడంతో సంతోషపడుతాడు. కృతవర్మ వద్దకూడా సైన్యాన్ని యుద్ధరంగంలో సంపాదించుకుని తన రాయబార కార్యాన్ని నెరవేర్చుకుంటాడు.

### 3.18.2. మునుల రాయబారం:

శల్యుడు ధర్మరాజు వద్దకు వచ్చి ధర్మరాజును పలుకరించే సమయంలో ధర్మరాజు అడవులలో అతడి కష్టాలను తలచుకుని బాధపడుతాడు. ఇంద్రుడి వంటి దేవతలకే కష్టాలు తప్పలేదని చెప్తాడు. ధర్మరాజు ఇంద్రుడు ఏ విధంగా కష్టాలు అనుభవించాడో శల్యుడిని తెలియజేయమంటాడు. శల్యుడు ఇంద్రుడికి ఏ విధంగా బ్రహ్మహత్యాపాతకం చుట్టుకున్నది. దానికి ఏవిధంగా పరిష్కారం లభించింది. మున్నగు వాటిని తెలియజేస్తూ

వృత్రాసురుని వృత్తాంతాన్ని తెలుపుతాడు. ఇంద్రుడు బ్రహ్మహత్యాపాతకాన్ని సముద్రంలో కొంతభాగాన్ని చెట్లలో నేలమీద, స్త్రీల యందు విభజించి పెట్టి పాపం పోగొట్టుకుంటాడు.. ఇంద్రుడికి శత్రువైన త్వష్ట కోపించి ఇంద్రున్ని మింగి వేయగల వ్యక్తిని నియమంతో హోమం చేసి అగ్నిలో కుమారుడిని పుట్టించి,వృత్రుడనే పేరు పెట్టి ఇంద్రుడితో యుద్ధం చేయడానికి పంపాడు. ఆ వృత్రుడు ఇంద్రుడు భయంకర యుద్ధం చేసారు. ఆ సమయంలో వృత్రుడు ఇంద్రున్ని మింగేస్తాడు. వృత్రుడు శరీరాన్ని విరుచుకుని ఆవలించగా ఆ సమయంలో ఇంద్రుడు తన శరీరాన్ని చిన్నదిగా చేసుకుని భుజబలానికి భయపడి మంథర పర్వతం వద్దకు వెళ్ళిపోతాడు. ఇంద్రుడు చెప్పిన విధంగా దేవతలు, మునులు ఇంద్రుడుని ముందు ఉంచుకుని ఒక ఉపాయం ఆలోచించి విష్ణుమూర్తి దగ్గరకు వెళ్తారు.

విష్ణుమూర్తి ఇంద్రునికి వృత్రునికి మధ్య సంధి చేయమని దేవతలకు, మునులకు చెప్తాడు. ఇంద్రాది దేవతలు సంతోషంతో తిరిగి వచ్చి మునులను వృత్రాసురుడి దగ్గరకు పంపారు. మునులు వృత్రాసురుడి దగ్గరకు వచ్చి ఇంద్రుడు నువ్వు ఇద్దరూ జయింపరానివారే మీ ఇద్దరికి గెలుపు లభించదు. మీరు విజృంభించి లోకాలను బాధపడేటట్లు యుద్ధం చేయడమెందుకు మీరు సఖ్యంగా ఉండండని ఇదే ఇద్దరికి మంచిదని తెలియజేస్తాడు. వృత్రాసురుడు స్నేహం కుదరడం సాధ్యం కాదని చెప్తాడు. మునులు సజ్జనుడైన ఇంద్రునితో బంధుత్వం మంచిదని చెప్తారు. దానికి వృత్రుడు ఒక పద్ధతిని వారికి తెలియజేస్తానని దానికి ఇంద్రుడు అంగీకరించే విధంగా సంధిచేయమని చెప్తారు. అది ఏమిటంటే తడిసిన దాని చేతకాని, ఎండిన దాని చేతకాని, కర్రచేతగాని,రాయిచేతగాని, శస్త్ర అస్త్రాల చేతకాని, పగలు, రాత్రి గాని నేను చావకూడదు అనగా దానికి వార అంగీకరించి వరాలిచ్చి వృత్రుడికి ఇంద్రుడికి సంధి చేసి తిరిగి వెళ్ళి ఆ ప్రకారం ఇంద్రుడికి చెప్పి తమ తమ ఇండ్లకు వెళ్ళిపోతారు. **(ఆంధ్ర మహాభారతం, ఉద్యోగ పర్వం, ప్రథమాశ్వాసం, 123 వ పద్యం ).**

ఈ విషయాలను పరిశీలిస్తే విష్ణుమూర్తి ఇంద్రుడిని కాపాడడానికి చేసిన ఉపాయంలో భాగంగా ఇంద్రాది దేవతలు మునులను వృత్రుడి దగ్గరకు రాయబారులుగా పంపుతాడు. అయితే వృత్రుడికి ఇంద్రునికి సంధి చేయడానికి ఎటువంటి విషయాలు

మాట్లాడాలో తెలుపక పోయినప్పటికి మునులు వారి అభిప్రాయాలను అనుసరించి వృత్రాసురుడిని ఇంద్రునితో సంధి చేయమని అడుగుతారు. దైవ కార్యం ఇంద్రుని కోరిక నెరవేరాలి కనుక వృత్రాసురుడు అడిగిన వరాలను వారు ప్రసాదించి జరిగిన విషయాలను ఇంద్రునికి తెలియజేస్తారు. ఇక్కడ మునులు సహజంగా ఆలోచనాపరులు మంచి చెడు విజ్ఞత కలవారు. కావునే రాయబారులైనప్పటికి స్వతహాగా నిర్ణయం తీసుకుని వరాలు ఇవ్వడం సంధికి కుదర్చడం జరిగిందని తెలుస్తుంది. ఇతని వరాలకు ఎటువంటి ఆటంకం లేకుండా సముద్రపు నురగను వజ్రాయుధంగా ప్రయోగించే సమయంలో విష్ణుమూర్తి ఆ సముద్రపు నురగలో ప్రవేశించి రాక్షసుడిని సంహరిస్తాడు. ఇంద్రుడు విష్ణుమూర్తిని పూజించాడు. ఈ రాయబారం కారణంగా విష్ణుమూర్తి రాక్షస సంహారం జరిగింది ఇంద్రుడి శత్రుత్వం నశించింది.

**సంస్కృతభారతం:**

ఇదే విషయం సంస్కృత భారతంలో ఈ కథే ఉన్నప్పటికి వృత్రునితో సంధి కూర్చే సందర్భంలో

*''దదృశుస్తే తతో వృత్రం శక్రేణ సహ దేవతాః'' (సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 10 వఅధ్యాయం, 16 వ శ్లోకం).*

ఇంద్రుడు కూడా దేవతలు, ఋషులతో కలిసి వృత్రుణి దగ్గరకు వస్తారు. ఇంద్రుని ముందు ఉంచుకునే మునులు వృత్రుణ్ణి దగ్గరకు వెళ్ళి సంధి చేసే ప్రయత్నం చేస్తారు. ఈ విధమైన మార్పును నేను గమనించాను.

ఇక్కడ ఎవరిమధ్య అయితే సంధి కుదర్చాలో వారు ప్రత్యక్షంగా ఒకే దగ్గర ఉన్నారు. మాట్లాడి వరాలతో సంధి కుదిర్చేటట్లు చేసింది మాత్రం మునులు. తర్వాత ఇంద్రుడు, వృత్రుడు కలసి సంతోషంతో ఉన్నప్పటికి ఇంద్రుడు వృత్రాసురుని సంహరించే ఉపాయలను మనసులో అలోచిస్తూనే ఉంటాడు.

## 3.18.3. అగ్ని రాయబారం:

ఇంద్రుడు బ్రహ్మహత్యాపాతకానికి భయపడి నిషధపర్వతానికి వెళ్ళిపోతాడు. తరువాత ఋషులు, దేవతలు ఇంద్రుని స్థానంలో నహుషుడికి శక్తి సామర్థ్యాలు ప్రసాదించి ఇంద్ర పదవిని అప్పజెప్పతారు, కాని కామానికి వశుడై శచీదేవిని కోరుకుంటాడు.

శచీదేవి ఇంద్రున్ని కానలేక ఉపశ్రుతిని పూజించగా దాని అధిష్టాన దేవత ఆధారంగా భర్తను కనుగొంటుంది. ఇంద్రుడు నహుషుడి భుజ బల గర్వం మునుల చేత ఆదరించబడి ఉందని అతను అనల్పమైన బలంతో ఉన్నాడని సమయం కోసం వేచి ఉన్నారు. సమయం వచ్చేదాక శత్రుని ఉద్ధతిని సహించి ఉండడం రాజనీతని చెప్తాడు. ఇక్కడ రాజనీతి పద్ధతిని ఇంద్రుడు అవలంబిస్తున్నట్లు తెలుస్తుంది. శచీదేవి తన భర్త ఇంద్రుడు ఎక్కడ ఉన్నాడో తెలుసుకోవడం కోసం ప్రయత్నాలు చేస్తుంది. నహుషుడు శచీదేవిని కామిస్తాడు. ఏదో ఒక ఉపాయం చేత శచీదేవి కొంత సమయం గడువు కోరుకుంటుంది. ఇప్పుడు నహుషుడికి ఇచ్చిన సమయం దూరంలో లేదు. తనను రక్షించుకోవడానికి బృహస్పతి వద్దకు వెళుతుంది. బృహస్పతి ఉపాయంతో ఇంద్రుడిని వెతికించడానికి అగ్నిని పూజించి ఇంద్రుడి వృత్తాంతం చెప్పి అతడిని వెదకమని పంపుతాడు. ఆ విధంగా బృహస్పతి పంపగా అగ్ని స్త్రీ వేషం ధరించి మనోవేగం కలవాడు అవడం చేత అన్ని దిక్కులు భూమ్యాకాశాలు, కొండలు,అడవులు కొంచెం సేపటిలోనే చూసి ఇంద్రుడు కనబడలేదని బృహస్పతికి తెలిపి నీళ్ళలో ప్రవేశించడానికి అలవి కాలేరని తెలుపగా బృహస్పతి అగ్ని దేవుడిని ప్రశంసించి అతనికి నీళ్ళలో కూడా వెళ్లేలాగే వేద మంత్రాలతో అగ్నిదేవుడికి బలం చేకూర్చాడు. అగ్ని మరలా నదులు, సముద్రాలు వెదుకుతూ ఇంద్రుడున్న సరస్సులో తామర పువ్వులను వెదకి ఒక దానిలో ప్రవేశించి దాని కాడ దారంలో ఉన్న ఇంద్రుడిని చూసాడు. అగ్ని దేవుడు ప్రీతితో బృహస్పతి వద్దకు త్వరగా వచ్చి తాను చూసిన విధానాన్ని తెలుపుతాడు. బృహస్పతి సంతోషించి దేవతలను మునులను వెంట తీసుకుని ఇంద్రుడి వద్దకు వెళ్ళి అతనికి ధైర్యం చెప్పి నహుషుడి వృత్తాంతం దేవేంద్రుని గొప్పతనాన్ని తెలియజేస్తారు. (ఆంధ్రమహాభారతం, ఉద్యోగ పర్వం , ప్రథమాశ్వాసం, 185 వ పద్యం నుండి)

పై విషయాలను పరిశీలిస్తే శచీదేవికి ఆపద నహుషుడి చేతిలో ఉంది. ఆ ఆపద పోవాలంటే ఇంద్రుడు దగ్గరకు శచీదేవి చేరాలి. ఇంద్రుడు ఎవరికీ కనబడకుండా ఎక్కడ ఉన్నాడో అతనిని వెతికించడానికి బృహస్పతి అగ్నిని రాయబారిగా పంపాడు. అగ్ని బృహస్పతి తనకు అప్పజెప్పిన కార్యాన్ని నెరవేర్చడానికి ఒక స్త్రీ రూపం కూడా ధరించడం కనబడుతుంది. అంతే కాకుండా తన శక్తి సామర్థ్యాలు ఉన్నంత వరకు ఇంద్రుడిని వెదుకుతారు. నీటిలోని ఇంద్రున్ని వెదకి ఎక్కడ ఉన్నాడో బృహస్పతికి తెలియజేసి తన కార్యాన్ని దిగ్విజయంగా పూర్తిచేస్తాడు. భవిష్యత్ కార్యానికి పునాది వేస్తాడు. ధర్మకార్యాలకు నిలయమయ్యాడని తెలుస్తుంది.

## 3.19. కర్ణ పర్వం రాయబారాలు:

కర్ణ పర్వంలో నేను పరిశీలించిన రాయబారం.

### 3.19.2. దుర్యోధనుని రాయబారం

కర్ణుడు దుర్యోధనునితో నీకు యుద్ధంలో విజయం చేకూర్చడానికి

*“అయం తు సదృశః శౌరేః శల్యః సమితిశోభనః1*

*సారథ్యం యది మే కుర్యాద్ ధ్రువస్తే విజయో భవేత్11(సంస్కృత భారతం, కర్ణపర్వం, 58 వ శ్లోకం).*

శ్రీకృష్ణునితో సమానమైన రథ సారథి కావాలని ఆరథ సారథి శల్యుడని నీవు ఆ శల్యుడిని ఒప్పించి నాకు రథ సారథిగా తీసుకుని వస్తే నేను నీకు విజయాన్ని తప్పక చేకూరుస్తానని అంటాడు.

అప్పుడు దుర్యోధనుడు అలాగేనని శల్యుని దగ్గరకు వెళ్ళి తనని కర్ణునికి సారథ్యం చేయమని ప్రాధేయపడతాడు. శల్యుడు రథసారథిగా ఉండడాన్ని చిన్నచూపుగా భావించి కోపపడతాడు. దానిని దుర్యోధనుడు సామోపాయంతో  అతని కోపాన్ని తగ్గించి కర్ణునికి రథసారథిగా శల్యుడుని అంగీకరింపచేస్తాడు.

శల్యున్ని దుర్యోధనుడు అంగీకరించే సమయంలో శల్యున్ని శ్రీకృష్ణుని కంటే గొప్పవాడని పొగుడతాడు ఆ పొగడ్తలకు శల్యుడు పడిపోతాడు. దానికిఉదాహరణగా ఈ పద్యం గమనించవచ్చు.

*"క. ననుఁగృష్ణుకంటె నధికుం1డని యిమ్మనుజేంద్రకోటి యా కర్ణింపం*

*గొనియాడితి విమల యశో1 ఘనుఁడగు కర్ణునకు రథము గడపెద నధిపా1*

శల్యుడు అంతమంది రాజుల ముందు కృష్ణుడికంటె గొప్పవాడవని పొగిడావు కనుక నేను కర్ణునికి రథసారథి నవుతానని చెప్తాడు .

అంతేకాకుండా రథసారథ్యం వహించడానికి కర్ణున్ని నా ఇష్టమొచ్చిన మాటలు మాట్లాడుతాను అలాగైతే రథసారథ్యం చేస్తానని చెప్తాడు. దానికి దుర్యోధనుడు అంగీకరిస్తాడు.

దుర్యోధనుడు తనకు విజయం చేకూరుతుందని కర్ణుని కోసం చేసిన రాయబారంలో శల్యుని ఒప్పించి సఫలీకృతుడవుతాడు.

## 3.20. అశ్వమేథ పర్వం రాయబారాలు:

అశ్వమేథ పర్వంలో రాయబారాలను ఈ క్రింది విధంగా పరిశీలించాను.

### 3.20.1.ఇంద్రుడు కోసం అగ్ని చేసిన రాయబారం:

**నాల్గవ వంతు గుణాలు తక్కువ ఉన్నవాడు "పరిమితార్థుడు" (పరిమితమైన ప్రయోజనం కలవాడు. అనగా కొంత వరకే అతనికి కార్యభారం అప్పగించాలి). పుల్లెల శ్రీ రామచంద్రుడు (వ్యాఖ్యాత), కౌటిలీయమ్ అర్థశాస్త్రం., పుట:64.)**

ఈ లక్షణం ఈ రాయబారంలో కనబడుతుంది. పరిమితమైన ప్రయోజనం కోసం ఇక్కడ అగ్ని రాయబారిగా నియమించబడుతాడు.

మరుత్తుడు ఒక యాగం చేయడానికి ఉపక్రమిస్తాడు ఆ యాగానికి ఉపద్రష్టగా బృహస్పతిని కాకుండా అతని తమ్ముడు సంవర్తుడిని ఉపద్రష్టగా ఉండమంటాడు. సంవర్తడు మా అన్న బృహస్పతిని అనుమతి తీసుకోమని చెప్పగా మరుత్తుడు నేను వెళ్ళి బృహస్పతిని ప్రార్థించాను నా పై అసూయతో  ఇంద్రుడు బృహస్పతిని రాకుండా చేశాడు. బృహస్పతి కూడా దేవతలకు యజ్ఞాలను జరిపించే నేను మానవులకు ఉపాధ్యాయుడిగా ఉండనని చెప్పాడు. అనగా సంవర్తుడు మరుత్తుడు చేసే యాగానికి ఉపద్రష్టగా ఉంటానంటాడు. సంవర్తుడు  చెప్పిన విధంగా మరుత్తుడు శివుని ప్రార్థించి యాగానికి కావలసిన బంగారు రాసులను, కోకొల్లలుగా మూటలు కట్టించి బంగారు శిలలను మోపులు కట్టించుకుని పనివారిచేత మోయించుకుని హిమాలయాలు దాటి నగరం చేరుకున్నాడు. అది తెలుసుకున్న బృహస్పతి దానిని అవమానంగా భావిస్తాడు. బృహస్పతి దుఃఖానికి కారణం తెలుసుకున్న ఇంద్రుడు అగ్నిని రాయబారిగా నియమించి మరుత్తుడి దగ్గరకు వెళ్ళి ఆ యాజకత్వాన్ని బృహస్పతి వహించేటట్లు ఏమి చేయాలో అలా చేసి రమ్మని పంపుతారు. అగ్నిదేవుడు ఆ మరుత్తుని దగ్గరకు వెళ్ళి ఇంద్రుడు పంపగా నీ వద్దకు దూతగా వచ్చాను. అనగా దూతను గౌరవించాలి గనుక మరుత్తుడు అగ్ని దేవునికి అతిథి సత్కార్యాలు చేశాడు. ఇంద్రుడు యొక్క క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నాడు. అగ్ని దేవుడు నేను వచ్చిన పని నీకు తెలియజేస్తున్నానని చెప్పి నీ యాగానికి బృహస్పతి యాజకుడుగా ఉంటే నీకు అన్ని శుభాలు కలుగుతాయి, ఇంద్రడు నీకు మహా పుణ్యలోకాలు అతిసులభంగా దొరికేటట్లు చేస్తాడు. అది కూడా మంచిదే కదా అన్నాడు. దానికి సంవర్తుడు బృహస్పతి అంగీకరించకపోవడం వలనే నేను అతని తమ్ముడు సంవర్త మహామునిని భక్తితో ప్రార్థించి అంగీకరింపచేసుకున్నాను. అంటాడు. అగ్నిదేవుని మాటలకు సంవర్తుడు మిక్కిలి కోపించి అగ్ని దేవుడితో నీవు ఇట్లాగే మాట్లాడితే నా భయంకరమైన చూపుతోనే నిన్ను కాల్చి వేస్తాను వెళ్ళిపొమ్మంటాడు. మరలా ఇక్కడికి  వచ్చే ప్రయత్నం చేయవద్దు అంటాడు. అక్కడ జరిగిన విషయాన్నంతా ఇంద్రుడికి అగ్నిదేవుడు వివరిస్తాడు. ఇంద్రుడు అగ్నిదేవునితో మరోసారి దూతగా వెళ్ళమని తన ఆజ్ఞను అతిక్రమిస్తే వజ్రాయుధాన్ని ప్రయోగిస్తానని చెప్పు అనగా అగ్ని దేవుడు మరోసారి వెళ్తే నన్ను

కంటి చూపులతో కాల్చేస్తానని చెప్పాడు కావున మరొకరిని ఎవరినైనా పంపమని చెప్తాడు. దానికి ఇంద్రడు నువ్వే అందరిని కాలుస్తావు నిన్ను ఎవరైనా కాలుస్తారా అనగా అగ్ని దేవుడు యోగశక్తి చాలా గొప్పదని తెలియజేస్తూ ఇంద్రుడు వజ్రాయుధాన్ని నిలువరించి అతని గర్వాన్ని అణచే భార్గవ చ్యవన మహర్షి కథను తెలియజేస్తాడు.

ఈ విషయాలను పరిశీలిస్తే అగ్ని దేవుడు రాయబారిగా మరుత్తుని దగ్గరకు వెళ్ళి దూత పొందవలసిన మర్యాదలు పొందాడు. తర్వాత తను వచ్చిన కార్యం గురించి తెలియగానే మరుత్తుడు అసహనం వ్యక్తం చేస్తాడు. సంవర్తుకునితో మాట్లాడటానికి అగ్ని రాకపోయినప్పటికి , ఇంద్రుడు చెప్పిన వృత్తాంతాన్ని విని కోపగించిన సంవర్తకుడు దూతగా వచ్చిన అగ్ని దేవుని మీద కోపం ప్రదర్శిస్తాడు. వచ్చిన దారినే వెళ్ళిపోమంటాడు. మరలా తిరిగి వస్తే చూపులతోనే భస్మం చేస్తానని చెప్తాడు. దానికి రాయబారి గా వచ్చిన అగ్ని దేవుడు అవమానంతో, భయంతో ఇంద్రుని దగ్గరకు వెళ్ళిపోతాడు.ఆ భయం చేతనే మరలా ఇంద్రుడు మరోసారి దూతగా వెళ్ళమని చెప్పినా వెళ్ళడానికి ఇష్టపడడు. పైగా యోగశక్తి యొక్క గొప్పదనాన్ని తెలియజేస్తాడు. ఇక్కడ అగ్నిదేవుని రాయబారం విఫలమైనట్లు స్పష్టంగా తెలుస్తుంది.

### 3.20.2. గంధర్వరాజు ధృతరాష్ట్రుని రాయబారం:

ఇంద్రుడు అగ్నిదేవుని రాయబారం విఫలమైనదని తెలుసుకుని చేసేది ఏమి లేక మరత్తుని ఎలాగైనా ఎదుర్కోవాలని ఈ సారి గంధర్వరాజైనటువంటి ధృతరాష్ట్రుడిని దూతగా పంపుతాడు. అతనిని దూతగా వెళ్ళేటప్పుడు కొన్ని విషయాలను తెలుపమని చెప్తాడు. బృహస్పతిని ఉపద్రష్టగా తీసుకోవడం అభిలషణీయం, అట్లా చేయకపోతే ఇంద్రుడికి కోపం వస్తుందని, వజ్రాయుధాన్ని ప్రయోగిస్తానని జాగ్రత్త వహించమని చెప్పమంటాడు. ఈ మాటలన్ని సంవర్తకుడు ఎదురుగా ఉన్నప్పుడే చెప్పమని చెప్తాడు. ధృతరాష్ట్రుడు అలాగేనని అంగీకరించి సంవర్తకునితో ఉన్న మరుత్తుడిని చూచి తాను గంధర్వుడునని ఇంద్రుడు పంపగా వచ్చానని తెలియజేస్తాడు. రాజుతో నా మాట విని నీ యాగానికి బృహస్పతిని

ఉపద్రష్టగా గ్రహించుము అలా చేయడం ఇంద్రుడికి ఇష్టాన్ని కల్గిస్తుంది. లేకపోతే వజ్రాయుధానికి బలి అవుతావు ఈ మాటలన్ని సభా ముఖంగా తెలియజేస్తున్నాను అంటాడు. ఇక్కడ దూత సభాముఖంగా అని చెప్పడంలో అంతరార్థం సంవర్తుకునిని పరోక్షంగా హెచ్చరిస్తున్నట్లు అని అర్థమవుతుంది. మరుత్తుడు బృహస్పతి రావడానికి అంగీకరించకపోతేనే సంవర్తక మహర్షిని తీసుకుని వచ్చాను. ఇలా చేయడం ధర్మబద్ధమని బృహస్పతికి కూడా తెలుసు అంటుండగా ధృతరాష్ట్రుడు రాజా అదిగో భీకర శబ్దం తో వజ్రాయుధం వస్తుందని చెప్పగా మరుత్తుడు భయపడతాడు. సంవర్తుడు వజ్రాయుధం రాకుండా ఆపి దూతగా వచ్చిన ధృతరాష్ట్రుడిని పంపించివేస్తాడు. తర్వాత యాగం నిర్వహించి ఇంద్రుడిని శాంతపరచి సంతోషపరుస్తాడు. మరుత్తుని యాగానికి ఇంద్రాది దేవతలు తమ భాగం హవ్యాన్ని స్వీకరిస్తారు.

ధృతరాష్ట్రుని, అగ్నిదేవుని రాయబారాలో దూతగా వారు చెప్పవలసిన విషయాలను పొల్లు పోకుండా ఇంద్రుడు చెప్పినట్లు చెప్పారు. అగ్ని దేవుడు అవమానింప బడతాడు. ధృతరాష్ట్రుడు తెచ్చిన సమాచారాన్ని వినడంతో పాటు అతని మాటలు ధిక్కరించినందునా మరుత్తుని మీదకు వజ్రాయుధం వస్తుందని దూత చెప్పి భయానికి గురిచేస్తాడు. ఈ ఘటన జరుగుతున్నప్పటికి గంధర్వుడైన ధృతరాష్ట్రుడికి వీడ్కోలు పలుకుతాడు. ఇక్కడ దూతను మర్యాదగానే వీడ్కోలు చేసి పంపినట్లు తెలుస్తుంది.

## 3.21. స్వర్గారోహణ పర్వం –రాయబారం:

స్వస్వరూప స్థితిని పొందడం స్వర్గారోహణ పర్వం (వెంకట శ్రీనివాసాచార్యులు, తిరుమల, శ్రీమహాభారత వైజ్ఞానిక సమీక్ష ఆది పర్వము, పుట42.)

### 3.21.2. ఇంద్రుడు నియమించిన దేవదూత:

ఈ పర్వంలో ఇంద్రుడు స్వర్గానికి వచ్చిన ధర్మరాజు ఏ ప్రదేశాలు చూడాలని అనుకుంటున్నాడో ఆ ప్రదేశాలన్నీ చూపించమని ఒక దేవదూతని నియమిస్తాడు.

అలా నియమించబడ్డ దేవదూత అన్ని ప్రదేశాలను చూపిస్తుండగా దుర్యోధనుడు సుఖంగా , సంతోషంగా ఉండడం చూస్తాడు. అలాగే తన సోదరులు, భార్య ద్రౌపది వీరంతా నరక బాధలు అనుభవించడం చూసి అక్కడే ఉంటానంటాడు. అది చూసిన దేవదూత వెంటనే ఆ విషయాన్ని ఇంద్రునికి తెలియజేస్తాడు.

ఇక్కడ దేవదూత విధి ధర్మరాజుకు ప్రత్యేకంగా నియమించబడ్డాడని తెలియజేస్తాడు. రాయబారం అనేది రాజనీతిలో ఒక భాగం రాజనీతి అంశాలను మహాభారతంలో గమనించాను. మహాభారతంలో మోసాన్ని మోసపు పద్ధతులతోనే జయించాలని శ్రీకృష్ణుడు ధర్మరాజుకి తెలియజేస్తాడు. మడుగులో దాక్కున్న దుర్యోధనుని బయటకు రప్పించే ప్రయత్నంలో భాగంగా శ్రీకృష్ణుడు ధర్మరాజుకు కొన్ని విషయాలను తెలియజేస్తాడు. వాటన్నింటిని పరిశీలిస్తే అజ్ఞానులైన రాక్షసులు దేవతల వరాలు పొందినప్పటికి దేవతల మాయా ఉపాయాల చేత వారి వరాలు పనిచేయలేని విధానాలను ఎంచుకుని వారిని హతమార్చడం జరుగుతుంది. అటువంటి మాయ పద్ధతులతో ధర్మరాజు మడుగులో దాగి ఉన్న దుర్యోధనుని రెచ్చగొట్టి బయటకు తీసుకుని వచ్చే ప్రయత్నం చేస్తాడు. రాజనీతి లో భాగమైన దండోపాయం ఇందులో కనబడుతుంది.

### 3.22. ఆధునిక రాయబార తత్త్వం:

ఆధునిక కాలంలో రాయబారం సమాజానికి ఉపయోగపడుతుందా లేదా దాని వలన ఆ దేశ రహస్యాలు తెలుసుకుని దెబ్బతీయడమూ లేదా స్వాధీన పరచుకోవడమో జరుగుతున్నాయా అనే కోణంలో పరిశీలిస్తే చాలా సంఘటనలు కనబడుతాయి నా దృష్టికి వచ్చిన ఉదాహరణ.

*“సర్ థామస్ ఒక ప్రత్యేక పనిపై ఇంగ్లండ్ నుంచి భారతదేశం వచ్చారు. ఆయన ఎలాగోలా ఒక ఒప్పందంపై సంతకాలు పూర్తిచేస్తే, దాని ప్రకారం భారతదేశంలో ఒక చిన్న బ్రిటిష్ కంపెనీ తెరవచ్చని ఆ దేశం ఆశపడుతోంది. కానీ సర్ థామస్ డైరీని బట్టి ఇక్కడ తెలుస్తున్న విషయం ఏంటంటే.. ఆ పని అంత సులభంగా పూర్తికాలేదు. దాని కోసం*

*ఈ ఆంగ్లేయుల దూత చాలా కష్టపడాల్సి వచ్చింది. చాలా గొప్పలు చెప్పుకోవాల్సి వచ్చింది. దానికి కారణం ఒక్కటే. ప్రపంచంలో ఒక్క ఇరాన్ సఫ్వీ చక్రవర్తి ఉస్మానీ ఖలీఫా మాత్రమే తన ప్రత్యర్థి అని మొఘల్ చక్రవర్తి భావించేవాడు.ఆయన దృష్టిలో ఇంగ్లండ్ పెద్దగా ప్రాధాన్యం లేని ఒక చిన్న దీవి. దానిని ఒక చక్రవర్తితో, ఒక సామ్రాజ్యంతో పోల్చడం అనేది మొఘలుల పరువుప్రతిష్టలకే భంగం. అయితే సర్ థామస్ మాత్రం తన ధైర్యం కోల్పోలేదు. మూడేళ్లు కష్టపడి ప్రయత్నించి దౌత్య ముడుపులు, బహుమతులు ఇచ్చి జహంగీర్‌ను కాకపోయినా ఆయన సంరక్షకుడు అహద్ షాజహాన్‌ను బుట్టలో వేసుకోగలిగారు. నాలుగు వందల ఏళ్ల క్రితం 1618లో ఒక ఒప్పంద పత్రంపై సంతకం చేయించుకోగలిగాడు. దాని ప్రకారం ఆ కంపెనీకి సూరత్‌లో వ్యాపారం చేసుకోడానికి జహంగీర్ అనుమతి లభించింది. దాని పేరు ఈస్ట్ ఇండియా కంపెనీ. ఈ ఘటన చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోయింది. మొఘల్ పాలకులు నేరుగా ఒక యురోపియన్ దేశంతో న్యాయసమ్మతంగా వ్యాపారం చేయడం అదే మొదటి సారి. అలా వారు ఆ కంపెనీని ప్రోత్సాహించారు. దానికి ముందు ఈస్ట్ ఇండియా కంపెనీ, బ్రిటిష్ పాలకుల వల్ల భారతదేశంపై పడిన ప్రభావం, దేశంలోని సంపద దోపిడీ కంటే ఎన్నో రెట్లు భయంకరమైనది"*

*(https://www.bbc.com/telugu/india-45244229)*

పై విషయాలను పరిశీలిస్తే రాయబారి అనే వ్యక్తి ఖచ్చితంగా తాను ఏ దేశానికి వెళ్ళాలనుకుంటున్నాడో ఆ దేశ అనుమతిని ఖచ్చితంగా పొందాలి. సర్ థామస్ మన్రో బ్రిటీష్ రాయబారిగా వచ్చాడు. మొఘలుల సంపద మీద కన్నేశాడు. తాను ప్రత్యేక విషయమై రాయబారిగా వచ్చి భారతదేశంలో బ్రిటీష్ కంపెనీ ఏర్పాటుచేయడానికి సన్నాహాలు ప్రారంభించాడు. జహంగీర్ సంరక్షకులకు ధనాశ చూపి ఒప్పంద సంతకం పైన సంతకం చేసుకున్నాడు. సూరత్ లో వ్యాపారం ప్రారంభించారు. మన దేశ సంపదను దోచుకెళ్లారు మనల్ని బానిసలుగా చేసి పరిపాలించారు. ఇదంతా రాయబారి వ్యక్తిత్వం, అతని ఆలోచనా విధానం, ఎందుకు రాయబారి గా వస్తున్నాడు, ఏ పని మీద వస్తున్నాడు. మన దేశానికి వచ్చి ఏ వివరాలు తెలుసుకోవాలనుకుంటున్నాడు వంటి విషయాలు ఏమి

ఆలోచించకుండా ఒక చక్రవర్తి అనుమతి ఇవ్వడంతో ఇంత ప్రమాదం భారతదేశానికి జరిగింది. నాకు తెలిసినంత వరకు సర్ థామస్ రో ధృతరాష్ట్ర బుద్ధిని ఉపయోగించి ఉంటాడు. ఎందుకంటే దుర్యోధనుడు ధృతరాష్ట్రుని జూదానికి అనుమతింపచేస్తాడు , ధృతరాష్ట్రుడు అనుమతి కారణంగానే కౌరవ వంశానికి ప్రమాదం జరిగింది. కాబట్టి రాయబారికి అనుమతి ఇవ్వడం చాలా కుశల బుద్ధితో ఆలోచించాలి లేకపోతే భారతదేశంలాగే ప్రమాదానికి గురి కావల్సి వస్తుంది. ఇకనైనా అటువంటి ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే ధర్మరాజు బుద్ధని, కృష్ణుని వాక్చాతుర్యాన్ని , క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. మహాభారతంలోని రాయబార విశేషాలను ప్రజానికానికి అందించాలి. అందులోని రాజనీతిని అర్థం చేసుకుని మసలుకోవాలి.

### 3.23. **రాయబారం – సమకాలీనత**:

కాలం మారుతున్న కొద్ది సాహిత్యంలోనూ సమాజంలో నూ ఆయాకాలాల యొక్క పరిస్థితులను బట్టి మార్పులు చోటుచేసుకుంటాయి. ప్రాచీన సాహిత్యంలోని రాయబారా లక్షణాలను ఆధారంగా చేసుకుని కొద్దిరకాల మార్పులతో నేటి రాయబార లక్షణాలు రూపొందించారు వాటిని ఎస్. ఎల్. వి ఉమామహేశ్వర రావు ఈ విధంగా కొన్ని విషయాలను అందించారు.

‘‘ప్రాచీన సాహిత్యంలో రాయబారితో వ్యవహరించాల్సిన తీరుతో పాటు రాయబారికుండాల్సిన లక్షణాలు కూడా ప్రధానంగా కన్పిస్తున్నాయి. రాయబారి వ్యక్తిగత లక్షణాలకు కూడా ఎంతో ప్రాధాన్యం ఉండేది. ఆధునిక కాలంలో రాయబారి వ్యక్తిగత లక్షణాలకు ప్రత్యేక అస్తిత్వం లేదు. కేవలం వారి ప్రవర్తనా నియమావళి మాత్రమే ఉంది. 1815 లో దీనికి సంబంధించి ఒక సామూహిక వ్యవస్థను ప్రపంచం రూపొందించుకుంది. కానీ 1945 లో అన్ని దేశాలు, అన్నీ దేశాల్లో రాయబారుల్ని నియమించే ప్రయత్నం చేశారు. 1961 లో వియన్నా కన్వెన్షన్ ఇన్ డిప్లొమాటిక్ రిలేషన్స్ (Vienna Convention Diplomatic Relations) పేరుతో ఒక ప్రత్యేక నియమావళి ఏర్పడింది. అంతర్జాతీయ న్యాయవ్యవస్థ (International Law Commission) 18-4-1961)

లో దీనికి ఒక నియమావళిని రూపొందించింది. ఇందులో 53 ఆర్టికల్స్ ను పొందుపరిచింది. Optional Protocal Concerning the compulsory settlement of disputes పేరుతో 10 ఆర్టికల్స్ రూపొందించింది. ఇవికాక Vienna Convention on Consular relations అనే పేరుతో 24/4/1963 న మరో 79 ఆర్టికల్స్ ను రూపొందించారు. (ఎస్. ఎల్. వి. ఉమా మహేశ్వర రావు, తిక్కన రాయబారాలు రాజనీతి – దౌత్య రీతి, పుట:03).

ఈ విషయాలన్ని రాయబారం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రపంచం గుర్తించి అన్ని దేశాలలోనూ రాయబారుల్ని నియమించే ప్రయత్నం చేశారని తెలుస్తుంది.

## 3.24. **అంతర్జాతీయన్యాయవ్యవస్థ రూపొందించిన రాయబారలక్షణాలు:**

1. రాయబారి తన దేశానికి, ఆతిథ్య దేశానికి మధ్య స్నేహ వారిధిగా ఉండి ఇరుదేశాల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక సంబంధాల్ని పెంపొందింపజేయాలి.(ఆర్టికల్ 3).
2. రాయబారిని దేశ అతిథిగా పరిగణించాలి.
3. రాయబారిని నిర్బంధించకూడదు(అరెస్ట్ చేయకూడదు). ఆర్టికల్ 27 & ఆర్టికల్ 29).
4. రాయబారిని గానీ, అతని వస్తువుల్ని గానీ సోదా చెయ్యకూడదు(ఆర్టికల్ 27).
5. రాయబారి అనుమతి లేకుండా ఆతిథ్యదేశానికి సంబంధించిన అధికారులు వారి నివాస పరిసరాల్లోకి వెళ్ళకూడదు(ఆర్టికల్ 22).
6. రాయబారుల ఆస్తుల పరిరక్షణ బాధ్యత ఆతిథ్యదేశానిదే(ఆర్టికల్ 22).
7. రాయబారులు తమ దేశ పతాకాన్ని వారి కార్యాలయం వద్ద, నివాసం వద్ద వాహనంపైన పెట్టుకోవచ్చు (ఆర్టికల్ 20).
8. రాయబారికి పన్నులో మినహాయింపు ఉంటుంది.( ఆర్టికల్ 23,28, 34,36).
9. రాయబారి వ్యక్తిగత లాభాన్ని పొందే వృత్తి వాణిజ్య కార్యకలాపాల్లో పాలు పంచుకోకూడదు. (ఆర్టికల్ 42).

10. రాయబారులకు సమాచార వ్యవస్థను ఉచితంగా కల్పించాలి.(ఆర్టికల్ 27).

11. రాయబారులు తమ దేశంతో మాట్లాడే విషయాల్ని కాన్ఫిడెన్షియల్ గా పరిగణించాలి.

రాయబారులు తమ ఇంట్లో ఉంచుకునే వ్యక్తిగత సేవకుల్ని (ప్రైవేట్ సర్వెంట్స్) రాయబార ఉద్యోగిగా పరిగణించరు (ఎ 1).

**12.** రాయబారి ప్రవర్తన అభ్యంతరకరంగా, అనుమానాస్పదంగా ఉందని ఆతిథ్య దేశం భావిస్తే Persona Non – grata నియమం క్రింద, ఆదేశానికి సమాచారమిచ్చి రాయబారిని వెనక్కు పంపించవచ్చు. (ఆర్టికల్ – 9). **(ఎస్. ఎల్. వి. ఉమా మహేశ్వర రావు, తిక్కన రాయాబారాలు రాజనీతి– దౌత్య రీతి, పుట:04)**

ఈ లక్షణాలలో ఒకటి రెండింటిని మహాభారతం లో కి అన్వయించి పరిశీలన చేద్దాం. ఉదాహరణకు

## 3.25. రాయబారిని దేశ అతిథిగా పరిగణించాలి:

నేటి అంతర్జాతీయ న్యాయవ్యవస్థ రూపొందించిన లక్షణాలలో ఒకటి. ఈ లక్షణాన్ని మహాభారతంలో పరిశీలిన చేస్తే రాయబారికి శ్రీకృష్ణుడు వస్తున్న విషయం తెలుసుకున్న ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణుని మెప్పించడానికి అతిథి సత్కారాలు ఘనంగా చేయడానికి సిద్ధపడతాడు ఆ సమయంలో ధృతరాష్ట్రుడు దుర్యోధనునితో శ్రీకృష్ణుడు సనాతన ధర్మ స్వరూపుడు, నరశ్రేష్ఠుడైన ఆయన పూజింపదగిన వాడు ఆయనను సత్కరించినచో మనకు సుఖం కలుగుతుంది, పూజింపకపోయినచో కష్టం కలుగుతుంది.

*"సచేత్తుష్యతిదాశార్హఃఉపచారైరరిందమః*

*కృష్ణాత్ సర్వానభిప్రాయాన్ ప్రాప్స్యామః సర్వరాజను"*

*సంస్కృత భారతం,ఉద్యోగ పర్వం, ఎనభైఐదవ అధ్యాయం,8వ శ్లోకం).*

శత్రుసంహర్త అయిన శ్రీకృష్ణుడు మన సత్కారాలతో సంతోష పడితే ఆయిన ద్వారా సమస్త రాజుల విషయంలో మన కోరికలను సఫలం చేసుకోవచ్చని అనడంలో శ్రీకృష్ణునికి

ఆతిథ్యం ఇవ్వడం ద్వారా తమ కోరికలను నేరవేర్చుకునే రీతిలో ఆలిచించినట్లు తెలుస్తుంది దాని ప్రకారంగా దుర్యోధనుడు అందమైన సభామంటపాలను నిర్మింపచేసాడు. శిల్పులు సమస్త రత్న సంపన్నులయిన సభలను ఎన్నింటినో నిర్మించారు. ప్రత్యేకించి వృకస్థలంలో నివాసార్థం దుర్యోధనుడు అనేక రత్నాలతో కూడి మనోహరమైన విశ్రాంతి మంటపాన్ని నిర్మించాడు.

మానవులకు దుర్లభమై దేవతావాసయోగ్యంగా కనపడే ఈ వ్యవస్థను పూర్తిచేయించి దుర్యోధనుడు ధృతరాష్ట్రునకు తెలియజేసాడు అయితే శ్రీకృష్ణుడు ఆ సభలను కాని అక్కడ కల్పించిన వివిధ రత్నాలను కాని కనీసం చూడనైనా చూడకుండా నివాసస్థానమైన హస్తిన వైపు ప్రయాణమయ్యాడు ఈ లోపల ధృతరాష్ట్రుడు విదురునితో శ్రీకృష్ణుడు వృకస్థలంలో ఉన్నాడు రేపు ఉదయం ఇక్కడకు వస్తాడు అతనికి అనేక కానుకలు ఇస్తానని శ్రీకృష్ణ పరిచారకులందరికి కూడా ఎప్పటికప్పుడు అవసరమైన భోజనం కన్నా ఎనిమిది రెట్లు ఎక్కువ నేను సమకూర్చిపెడతానని చెప్పి దుర్యోధనుడు తప్ప మిగిలిన నా అందరి కుమారులు మనుమలు వస్త్రభూషణాదులను అలంకరించుకుని అందమైన రథాలతో శ్రీకృష్ణుని స్వాగతించండని చెప్తాడు. (సంస్కృత భారతం,ఉద్యోగ పర్వం, ఎనభైఐదవ అధ్యాయం, పుట:540.)

రాయబారిగా వచ్చిన వ్యక్తికి ఈ రకమైన ఆతిథ్యంను మహాభారతంలో గమనించదగినది.

## 3.26. రాయబారిని నిర్భంధించకూడదు (అరెస్ట్ చేయకూడదు):

శ్రీకృష్ణుడికి ఆతిథ్యం ఇచ్చినప్పటికి రాజ్యాల మధ్య సఖ్యత ఏర్పరచడానికి రాయబారిగా వచ్చిన శ్రీకృష్ణున్ని దుర్యోధనుడు నిర్బంధించడానికి ఏర్పాట్లు చేసుకుంటాడు ఈ విషయం సాత్యకి సభలో వ్యక్తపరుస్తాడు. విదురుడు దుర్యోధనుని కి కృష్ణుని పరాక్రమాలను వివరిస్తాడు. శ్రీకృష్ణుడు కూడా దుర్యోధనునితో నీ అహంకారంతో నన్ను ఒంటరివాడిని అనుకుని బంధించాలనుకుంటున్నావు అంటూ విశ్వరూప ప్రదర్శన చేస్తాడు.(సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 131 వ అధ్యాయం)

నేటి కాలంలో అనేక విధాలుగా ప్రభుత్వం రక్షణ కల్పిస్తుంది కనుక రాయబారిని నిర్బంధించడం, చంపడం లాంటివి జరగేఅవకాశాలు తక్కువని అర్థమవుతుంది.

ఆనాటి కాలంలో రాయబారికి భద్రత లేదు అవతలి వ్యక్తి రాయబారి తెలిపిన అభిప్రాయాలు రాయబారివి కాకపోయినా ఆవేశానికి లోనయ్యి రాయబారిని బంధించేప్రయత్నం చేయడమో చంపడమో జరిగిన సందర్భాలు ఉన్నాయని తెలుస్తుంది.

ఈ విషయాలను గమనిస్తే రాయబారి జాతీయ అంతర్జాతీయాల దేశాల మధ్య వారధిగా ఉండి దేశ ఉన్నతికి తోడ్పడుతున్నట్టు అర్థమవుతుంది. అంతే కాకుండా రాయబారికి ఉండవలసిన లక్షణాలను, వారి భద్రతకు, గౌరవానికి భంగం వాటిల్లకుండా కొన్ని నియమ నిబంధనలను ఏర్పరచి వారికి సంపూర్ణ రక్షక వ్యవస్థను ఏర్పాటు చేయడం ఈనాడు గమనించవలసిన ప్రధానమైన విషయం. https://www.auchithyam.com/2023/apr_2023/full_papers/april23_09.php

“ప్రాచీన కాలంలో రాయబారమన్నది రాజ్యాల మధ్య ఆయా సమస్యలు, ఉత్పన్నమైనప్పుడు, యుద్ధం తప్పనిసరైన పరిస్థితుల్లో దానికి కాస్త ముందుగా ప్రయోగించే రాజకీయ ప్రక్రియగానే ఉండేది. కానీ ఆధునిక కాలంలో రాయబారం అనే ఒక శాశ్వత వ్యవస్థగా రూపు దిద్దుకుంది. ప్రపంచంలోని ప్రతి దేశానికి , ప్రతి దేశంలోనూ ఒక రాయబారి(ఎంబాసిడర్) అతనికొక విస్తృత కార్యాలయం(ఎంబసి), సిబ్బంది శాశ్వత ప్రాతిపదికన ఏర్పడ్డాయి. ఆధునిక అవసరాలు దానికి కారణం. ప్రాచీన కాలంలో ఇరుగు పొరుగు రాజ్యాలతో తప్ప దూర రాజ్యాలతో సంబంధాలు తక్కువ. ఆధునిక కాలంలో రవాణా, సమాచార వ్యవస్థల కారణంగా దూర దేశాలతో సంబంధం ఆధునిక అవసరాల్ని బట్టి అనివార్యమైంది. ఎక్కడైతే రాజకీయ సంబంధం అనివార్యమో అక్కడ రాయబార వ్యవస్థ కూడా అవసరం. అయితే ఈనాటి రాయబార వ్యవస్థకు మూలం ప్రాచీన కాలం నాటి రాయబార తంత్రాలే. కావ్యేతిహాసాల్ని పరిశీలించినప్పుడు మనకు బోధపడే సత్యమిది. దూతగా వచ్చిన వాణ్ణి రాజు, అతని పరివారం ఎలా చూడాలి? అతనితో ఎలా ప్రవర్తించాలి? అతనికి ఎటువంటి సౌకర్యాలు కల్పించాలి అతని భద్రత విషయంలో

ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అతడు తన రాజ్యంలో ఉన్నంత కాలం అతనికి ఎటువంటి హక్కులు , ప్రత్యేక హోదా, మినహాయింపులు కల్పించాలి? అన్నవి మనకు ప్రాచీన సాహిత్యంలో కన్పిస్తూనే ఉన్నాయి. రామాయణం సుందర కాండంలో హనుమంతుడు రావణ ఆస్థానంలో ఉన్నప్పుడు విభీషణుడి ముఖతః మనకు తెలుస్తున్నాయి.'' **(ఎస్. ఎల్. వి. ఉమా మహేశ్వర రావు, తిక్కన రాయబారాలు రాజనీతి–దౌత్యరీతి, పుట:02, 03).**

నేడు ఎన్నో రాయబారాలకు మూలం ప్రాచీన కాలంలో మన ఇతిహాసాల్లో చోటుచేసుకున్న రాయబారాలే మూలమని పై విషయాలను పరిశీలిస్తే తెలుస్తుంది. నేడు అనుసరిస్తున్న రాజకీయలలో ని ఆనాటి రాజనీతి ఛాయలు ఉన్నాయనడంలో అతిశయోక్తి లేదు. నేటి రాజకీయ వ్యవస్థను పరిశీలిస్తే రాజనీతి ప్రత్యక్షంగానో పరోక్షంగానో కనబడుతుంది. ప్రాచీన కాలంలో రవాణా సౌకర్యాలు లేకపోవడం వలన దూర ప్రాంతాల లోని రాజ్యాలతో సంబంధాలు తక్కువగా ఉండేవి. నేడు ఆ లోటు లేదు కాబట్టి రాయబారాల ద్వారా తమ దేశ ఆర్థిక, సామాజిక వ్యవస్థను బలపరచుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అర్థమవుతుంది.

నేటి రాజకీయ నాయకులు మహాభారతంపై అనేక చర్చలు చేస్తున్నారు వారి పరిపాలనలో వాటిని అమలుపరిచేలా ప్రయత్నిస్తున్నారు. అంతేకాకుండా ఆదర్శవంతమైన భావాలను తమ ఉపన్యాసంలో ప్రస్తావిస్తూ స్ఫూర్తి దాయకంగా ఉంటున్నారు. అందులో ఒకప్పటి రాయబారి ప్రస్తుత కేంద్ర విదేశాంగ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్,జై శంకర్ తన స్వీయ రచన ' ద ఇండియా వే స్ట్రాటజీస్ ఫర్ యాస్ అన్ సర్టెన్ వరల్డ్'' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో రామాయణ, మహాభారత ఇతిహాసాలను ప్రస్తావిస్తారు. ప్రపంచంలోనే అతిగొప్ప దౌత్యవేత్తలు శ్రీకృష్ణుడు, హనుమంతుడని అన్నారు. అలాగే రాజనీతి అంశాలను నేటి సమాజానికి అన్వయించే ఘట్టాలనుకూడా ఉదాహరించాడు. కౌరవుల పాండవుల మధ్య మహాభారత యుద్ధం జరిగిన కురుక్షేత్రను బహుళ ధ్రువ భారతదేశంగా జయ శంకర్ పోల్చారు. దేశ ప్రయోజనాల విషయంలో వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి ముఖ్యమని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి భారతదేవం ఇదే విధానాన్ని అనుసరిస్తుందని

తెలియజేస్తారు. అంతే కాకుండా పొరుగు దేశాలతో ఇండియా భౌగోళిక పరిమితులపై మంత్రి మాట్లాడుతూ పాండవులు తమ బంధువులును ఎంచుకోలేదని అలాగే మనం కూడా మన పొరుగువారిని ఎంచుకోలేమని అన్నారు. పొరుగు వారు సద్భావనతో ఉండాలని మాత్రమే మనం ఆశించగలమని చెప్పారు. ‘‘రూల్స్ బేస్డ్ ఆర్డర్ గురించి ప్రస్తావిస్తూ భారతంలో కర్ణుడు, దుర్యోధనుడు ఈ నిబంధనలను అతిక్రమించారని వివరించారు. కర్ణుడి, దుర్యోధనుడి స్నేహం వలన వారితో పాటు వారి కుటుంబాలకు కూడా ఎలాంటి లబ్ధి చేకూరలేదని అన్నారు. చివరకు ఆ ఇద్దరూ ప్రాణాలు కోల్పోవడంతో పాటు భారీ వినాశనం జరిగిందని సర్వజనులతో సహా సర్వాన్ని కోల్పోయారని అన్నారు. అలాగే అణ్వస్త్రదేశాలు పరస్పరం బెదిరించుకుంటూపోతే అది ఒకరినొకరు తుడిచిపెట్టేందుకు భారీ విధ్వంసాన్ని మరింత వేగవంతం చేయడానికి దారితీస్తుందన్నారు.( https://www.andhrajyothy.com/2023/national/lord-krishna-hanuman-greatest-diplomats-in-world-s-jaishankar-999958.html

ఈ వివరాలను పరిశీలిస్తే ఇటువంటి చర్చల ద్వారా ఇటువంటి నాయకుల ద్వారా దేశ పురోగతి జరుగుతుందని భావించాలి. మహాభారతం కాలం నాటి పరిస్థితులునేడు మన సమాజంతోఎలా ముడిపడి ఉన్నాయో ప్రతినాయకుడు చెప్పే ప్రయత్నం చేయగలిగితే నేటి యువతరానికి ఆదర్శవంతమైన భావాలు వారి మనసులో ముద్ర ఏర్పరచుకునే అవకాశం ఉంది.

కర్ణదుర్యోధనుల స్నేహం ఎలాంటిదో బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ ముఖాముఖిలో ఈ విధంగా తెలియజేసారు. *‘‘కర్ణుడు మీద అతనికేమి ప్రేమ లేదు. మహాభారతం సంపూర్ణంగా చదివిన వారికి తెలుస్తుంది. అందుకే భారతంలో అరణ్య పర్వంలో గంధర్వులు చావగొట్టినప్పుడు కర్ణుడు పారిపోయాక దుర్యోధనుడు చచ్చిపోవడానికి ప్రాయోపవేశం చేసాడు. ప్రాయోపవేశం చేసినవాడు ఎందుకు ప్రాయోపవేశం ఆపాడో చెప్పండి. వాడిని కృత్య ఒకటి రాక్షసుల దగ్గరకు పాతాళానికి పట్టుకుపోయింది. . అక్కడ రాక్షసులు నువ్వు ప్రాయోపవేశం చేసి చావకు నువ్వు మాకు నాయకుడివి మేము పూర్వజన్మలో శివుడిని*

*ప్రార్థించి నిన్ను తయారు చేసుకున్నాము. తప్పకుండా మేము నీకు సాయం చేస్తాము. భీష్ముడిని గురువుని కూడా మా రాక్షసాంశ ఆవేశిస్తుంది. మేము ఆవేశించడం వల్ల వారు కూడా క్రూర యుద్ధంచేసి పాండవ సైన్యాన్ని నాశనం చేస్తారు. చనిపోయిన నరకాసురుడంశ ఏమో కర్ణున్ని ఆవహిస్తుంది. కర్ణుడు అందుకే విజృంభిస్తాడు. మా అంశ పాండవులను చంపుతాం. పాపాత్ములకు నువ్వే మా రాజువి సుస్పష్టంగా చెప్పారు. మా కలి పురుషునికి నువ్వే మా రాజువి, కాబట్టి నువ్వు చావవద్దు అనగానే అలాగే అన్నాడు. పైకి వచ్చాక ఈ విషయం కర్ణుడికి కూడా చెప్పలేదు.రాక్షసుల విషయం చెప్పడు. వీరిద్దరి మధ్య అరమరికలు లేవంటారు . ఇదేమిటి అరమరికలంటే కర్ణుడు విషయం చెప్పేస్తాడు. వీడు చెప్పడు. కర్ణుడు కూడా చెప్పాడు అనడానికి వీలులేదు. ఎందుకో తెలుసునా కర్ణుడికి ఈ బ్రహ్మాస్త్రం చివరి క్షణాల్లో పని చేయదని తెలుసు కదా పరశురాముడు శాపం పెట్టిన విషయం దుర్యోధనుడికి చెప్పాడా చెప్పలేదు. వాడు చేశాడు మోసమే. ముందేచెప్పేస్తే అసలు సిసలు సమయంలో  ప్రాణాపాయ స్థితిలో నా రథం భూమిలో దిగి పోతుంది. పరశురాముడు శాపం పెట్టాడు. అస్త్రాలు పని చేయవు అని చెపితే అప్పుడు దుర్యోధనుడు ఇంకో మార్గం చూసుకునేవాడు. కాబట్టి ఒక విధంగా చెప్పాలంటే కర్ణుడు దుర్యోధనుడు, దుర్యోధనునికి కర్ణుడు స్నేహితులుగా భావిస్తూ ఇద్దరూ ఒకరికొకరు మోసం చేసుకున్నారు.'' (పద్మాకర్, వద్దిపర్తి, ముఖాముఖి).*

వీరి వివరాలను పరిశీలిస్తే అందరి దృష్టిలో మావంటి స్నేహం ఎక్కడా ఉండదని తెలియజేయడానికి పైకి ప్రేమ ఉన్నట్టు కర్ణదుర్యోఃధనులు నటించినట్లు పై చెప్పిన సన్నివేశాలను గమనిస్తే అర్థమవుతుంది.

ఈ అభిప్రాయాలను ఏకీభవిస్తున్నట్లు నందూరి గోపాలకృష్ణ మూర్తి **''ఆంధ్రమహాఃభారతము – ఉపదేశము''** పుస్తకంలో ఈ విధంగా తెలియజేసారు.

*''శ్రీకృష్ణార్జున మైత్రి వలె కర్ణదుర్యోధన మైత్రి ఆదర్శప్రాయమైనది కాదు. అది స్వార్థమునకు, మాత్సర్యమునకు, ఉత్తమావమానమునకు హేతువగుట శోచనీయము. కుమారాస్త్ర విద్యాప్రదర్శనమున అర్జునుడు చూపిన అస్త్రశస్త్రాది విద్యలన్నింటిని కర్ణుడు అశ్రమముగా ప్రదర్శించెను. కర్ణుడు అర్జునుని జయింపవలెనను ఊహతో ద్వంద్వ*

*యుద్ధమునకు ఆహ్వానించెను. కర్ణుని అస్త్రశస్త్ర విద్యానైపుణ్యము దుర్యోధనుని ఆకర్షించింది అదే సమయమున రాజ రాజునకు కర్ణుని అండగాగొని అర్జునుని అడ్డులేకుండా ఎదిరింపవచ్చునను భావము కలిగినది.'' (గోపాలకృష్ణమూర్తి, నందూరి, ఆంధ్రమహాభారతము– ఉపదేశము'' ,పుట:289).*

వీరి అభిప్రాయం ప్రకారం స్వార్థచింతనతో కూడిన స్నేహం కర్ణ దుర్యోధనులదని అర్థమవుతుంది.

నందూరి గోపాలకృష్ణమూర్తి వీరి స్నేహం గురించి మరొక మాట చెప్తూ ఈ విధంగా అంటారు. *''దుర్యోధనుడికి అర్జునుడంటే భయం కలదు. ఇక కర్ణునికి అర్జునుడు అనిన ఎంతయో మాత్సర్యము. అందుచే తుల్య భావములు కలిగిన కర్ణ దుర్యోధనులు మిత్రులగుట తటస్థించినది. ఈ ఉభయుల మైత్రి స్వార్థపూరితమై జగత్ప్రళయ కారణమైనది. లోకానర్థప్రదమైన మైత్రి ఎంతగొప్పదైనను నింద్యార్హమే ''*
*'' (గోపాలకృష్ణమూర్తి, నందూరి, ఆంధ్రమహాభారతము– ఉపదేశము'' ,పుట:290).*

లోకానికి అనర్థాలను కలిగించే వారు చాలా మంది ఉంటారు. వారు స్నేహితులుగా ఏర్పడితే అది లోక వినాశనానికే కాని లోక రక్షణకు ఉపయోగపడదు. అందులో ఒకరి మీద పగతో మరొకరితో స్నేహం చేయడం అది చాలా ప్రమాదకరమైనది వారి మాటల్లో వ్యక్తమవుతుంది. చివరగా తెలిసినది ఏమిటంటే కర్ణ దుర్యోధనులు స్నేహ ధర్మానిని పాటించలేదని అర్థమవుతుంది.

ఈ అధ్యాయంలో ఆంధ్రమహాభారతంలోని రాయబారాలను పేర్కుంటూ ఆ రాయబారాలు సంస్కృత రాయబారాలలో ఏ విధమైన మార్పును పొందాయో వివరించాను. అంతేకాకుండా రాయబార లక్షణాలను, దూత శబ్దం ఎక్కడ నుండి వచ్చింది వంటి విషయాలను ప్రస్తావించాను. నేటి కాలపు రాయబార విశేషాలును కూడా ఈ అధ్యాయంలో పేర్కున్నాను. తర్వాతి అధ్యాయంలో ఆంధ్రమహాభారతంలోని రాజనీతి అంశాలను వివరిస్తాను.

### నాల్గవ అధ్యాయం

# ఆంధ్ర మహాభారతం లో రాజనీతి

సమాజం కాలక్రమేణ అనేక మార్పులతో క్రొత్తదనం సంతరించుకుంటుంది. ప్రజల్లోనూ ప్రజా పరిపాలకుల్లోనూ మార్పులు చోటుచేసుకుంటున్నాయి.

సమకాలీన పరిస్థితులుకు అనుగుణంగా మనం మన అభిప్రాయాలను, అలవాట్లనూ మార్చుకుంటున్నాము. ఎటువంటి మార్పులు వచ్చినప్పటికి ప్రజలను పరిపాలించడంలో రాజు అనుసరించడంలో మెలకువలను, రాజనీతి శాస్త్రాలలోని విషయాలను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని అమలు పరిస్తే ప్రజారంజకంగా పరిపాలన కొనసాగుతుంది.

**4.1. రాజ్యము – వివరణ:**

రాజ్యం అంటే ప్రజలు ప్రజల పరిపాలనే కాదు భూభాగం యొక్క విస్తరణ, భూభాగం యొక్క పరిమితి వీటిని కూడా రాజ్య పరిధిలోకి వస్తాయని ఈ క్రింది వివరాలను పరిశీలిస్తే తెలుస్తుంది.

*‘‘రాజ్యమనునది యొక ప్రత్యేక భూభాగమునకు పరిమితమైనది. అందు ప్రజలు స్థిరముగా నివసించువారై యుండవలెను ఆ ప్రజలను దండనాధికారమున పాలించుటకు ప్రభుత్వమొకటి యుండవలె ఆ ప్రజా సముదాయము సర్వ స్వామ్యము గల సంఘమై యుండవలెనని అదే రాజ్యమని అందులో ఏది లోపించినా ఆ భూభాగము రాజ్యము అనిపించుకొన జాలదని భూభాగము లేకున్న ప్రజలు స్థిరముగా నిలువజాలరు. ప్రజలు లేకున్న పరిపాలనకు అవకాశము ఉండదు. ప్రజలపై ప్రభుత్వం లేకున్న శాంత్యభ్యుదయములుండవు. అరాజకత ప్రబలుతుంది. కనుక రాజ్యమెంతఅవసరమైనదో తెలుస్తుంది’’. (గోదావరి బాయి, సంధ్యావందనం, భారతము రాజనీతి విశేషాలు, పుట: 06).*

ఈ వివరాలు ఒక భూభాగాన్ని ఎంచుకుని దానిని నివాస యోగ్యంగా మార్చుకుని ఒక పరిపాలనా విధానాన్ని ఏర్పరచి ప్రజలను అదుపులో ఉంచడానికి ఒక అధికారాన్ని కలిగి ఉండే ఒక వ్యవస్థ రాజ్యమని తెలుస్తుంది.

*'' మానవుడు సంఘ జీవి స్వేచ్ఛా ప్రియుడు. సంఘ జీవికి సంపూర్ణ స్వేచ్ఛ సాధ్యము కాదు . స్వేచ్ఛా ప్రియుడు కనుక అతడు హద్దు మీరి ప్రవర్తించవచ్చును. అప్పుడతని స్వేచ్ఛ మరొకనికి బాధ కలిగింప వచ్చును. అప్పుడు అరాజకత ప్రబలుతుంది. అట్టి అరాజకతను తొలగించుటకు ప్రభుత్వం అవసరం. ఇట్లు ప్రభుత్వం ఏర్పడుతుంది. సంఘము రాజ్యముగా మారుచున్నది. ఆ రాజ్యము హద్దుమీరిన స్వేచ్ఛను అదుపులో పెట్టును. అట్లు అదుపులో ఉంచుటకు అధికారము అవసరము.''(గోదావరి బాయి, సంధ్యావందనం, భారతము రాజనీతి విశేషాలు, పుట: 07).*

ఈ విషయాలు చూస్తే ప్రతి వ్యక్తి తన దైనందిన జీవితంలో తన కుటుంబంలో స్వేచ్ఛగా ఇంటిలో కొంతమందికి ఉంటుంది. మరి కొంతమందికి ఉండదు. అలా స్వేచ్ఛ లేకుండా ఉండే వ్యక్తి కి కలిగే మనోవేదనను తొలగించడానికి ఆ కుటుంబ పెద్ద సహకరిస్తాడు. ఒక కుటుంబ సమూహంలో జరిగే వాదోపవాదాలు ఆ కుటుంబాన్ని ఆ కుటుంబంలోని వ్యక్తుల్ని సంతోషంగా జీవనం సాగించేలా చేస్తుంది. ఆ కుటుంబం నుండి బయటకు వచ్చే వ్యక్తి ఇంటిలో ఉన్నంత స్వేచ్ఛగా ఉండలేడు. ఉండాలని ప్రయత్నించినా విభిన్న మనస్తత్వాలు గల ఈ సమాజంలో భేదాభిప్రాయాలు వస్తాయి. దానితో సంఘర్షణ మొదలవుతుంది. ఆ సంఘర్షణ తాత్కాలికమైనప్పటికి జీవితాన్ని శాసించేదిగా మారుతూ ఉంటుంది. ఆ సమస్యను రూపుమాపడానికి అధికారం కావాలి. అధికారం రాజ్యంగా ఏర్పడి ప్రజా అవసరాలను తీర్చాలని ఈ విషయాలు స్పష్టం చేస్తున్నాయి.

*''అధికారమురము అనునది ఒక శక్తి ఇతరులకు ఇష్టమున్నను లేకున్నను వారి ప్రవర్తనను బలవంతంగా మార్చి వారి చేత పనులు చేయింపగల సామర్థ్యమునకు శక్తి అని పేరు అట్టి శక్తి ని వినియోగించుటకు నైతికమగు అర్హత అవసరము అప్పుడే అధికారము చెల్లును సంఘజీవికి సంపూర్ణ స్వేచ్ఛ సాధ్యము కాదు అతని స్వేచ్ఛ హద్దు మీరి నప్పుడు*

*అధికారము అనగా రాజ్య శక్తి అంకుశమై అణచును బలవంతుడు బలహీనుని అణచుటకు ప్రయత్నించునపుడు  రాజ్య శక్తి ఆ బలవంతునుని అణచుటకు ప్రయత్నించును.'' (గోదావరి బాయి, సంధ్యావందనం, భారతము రాజనీతి విశేషాలు, పుట: 07).*

అధికారమనేది రాజ్యంలో ప్రబలినప్పుడు ఆ జీవికి సంపూర్ణమైన స్వేచ్ఛ ఉండదు రాజ్యంలో తిరగడానికి తినడానికి ప్రకృతిని ఆస్వాదించడానికి స్వేచ్ఛ ఉంటుందేమో కాని ఒక వ్యాపారం పెట్టడానికి రాజు అనుమతి కావాలి. ఎందుకంటే దాని ద్వారా వచ్చే ఆదాయంలో కొంత పన్ను ద్వారా రాజుకి చేరి వాటిని రాజు మరలా ప్రజలకు అందించడానికి ఇక్కడ నుండి సమాజంలో కొంత స్వేచ్ఛను కోల్పోతాము రాజు నియమాలకు కట్టుబడి ప్రవర్తించాలి. దానిని ఉల్లంఘించిన వారు శిక్షార్హుడు అవుతాడు. కాబట్టి రాజ్యానికి ఆ శక్తి ఉంది కాబట్టి రాజ్యం చాలా అవసరం.

**4.2. రాజ్యం – విధులు:**

రాజ్యం సుపరిపాలనతో సాగడానికి కొన్ని విధులను ఏర్పరచుకుంటుంది.

1. **అంతర్ రాజ్యాల దండయాత్రల నుండి ఆంతరంగిక రుగ్ణతల నుంచి ప్రజలను కాపాడడం.** (అనంతరామ శాస్త్రి, నేతి, కవిత్రయ భారతం, రాజనీతి, పుట:56).

   పై విధుల్లో మొదటి విధిని చూస్తే తన రాజ్యం ఇతర దేశాల రాజులు ఆక్రమించకుండా ఉండడానికి ఆ రాజు తన రాజ్యం యొక్క సరిహద్దులను గుర్తించి అక్కడ కొంత పరివారాన్ని ఉంచి  రాజ్య రక్షణకు తోడ్పడాలి. అంతే కాకుండా రాజ్య పరిరక్షణకు సరిపడ ఉపాయాలన్నింటిని ఆలోచించి వాటిని అమలుపర్చేలా చేయాలి. ఇలా ఉన్నట్లయితే కొంత వరకు రాజ్యాన్ని కాపాడుకోగలుగుతాము.

2. **ఆస్తులకు రక్షణ కల్పించి , కుటుంబం, వర్ణము మొదలైన సాంఘిక వ్యవస్థలను కాపాడి వర్ణాశ్రమ ధర్మాన్ని నెలకొల్పడం,** (అనంతరామ శాస్త్రి, నేతి, కవిత్రయ భారతం, రాజనీతి, పుట:56).

రాజు తన రాజ్యంలోని కోశాగారాన్ని నిత్యం స్వంతంగా తానే పర్యవేక్షించాలి. అలా కాని పక్షంలో నిరంతరం దాని గురించి పరామర్శించాలి ఈ విధంగా రాజ్యాం యొక్క ఆస్తులను రక్షించుకోవాలి. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య , శూద్ర మొదలైన చతర్వర్ణ వ్యవస్థను కాపాడాలి. కుల మతాలకు తావు లేకుండా వృత్తినిబట్టి వారిని ప్రోత్సహించి వారికి ఆర్థికంగానూ, సాంఘికంగానూ రక్షించగలగాలి.

3. **బలహీనులను, వృద్ధులను పేదలను, వికలాంగులను, అసహాయులైన పిల్లలను ,వితంతువులను అనాథలను కాపాడడం. (అనంతరామ శాస్త్రి, నేతి, కవిత్రయ భారతం, రాజనీతి, పుట:56).**

రాజరిక వ్యవస్థ చాలా పెద్దది కావున రాజు రాజ్యంలో ఎంత మంది ప్రజలు ఉన్నారు తెలుసుకుని వారి అవసరాలను గమనించి సహకరించాలి.

4. **సంఘంలో నెలకున్న వివిధ దురాచారాలను నిరోధించి నిర్మూలించడం.** (అనంతరామ శాస్త్రి, నేతి, కవిత్రయ భారతం, రాజనీతి, పుట:56).

ప్రజలు అనేక భిన్నమనస్తత్వాలను కలిగి ఉంటారు. మనస్పర్థలు రావడం సహజం కాని కొన్ని మనస్పర్థలు ఇతరుల జీవనానికి ఆటంకం కలిగిస్తాయి. మరొకరిని చంపే స్థాయికి వెళ్ళగలిగిన సందర్భాలు కూడా ఉండవచ్చు. ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని రాజు ప్రజలను రక్షించాలి. స్వంత నిర్ణయాలతో అస్తవ్యస్తమవుతున్న రాజ్యాన్ని ఒకే మార్గంలోకి తీసుకురావాలి.

5. **విద్వాంసులను ఆదరించడం** . (అనంతరామ శాస్త్రి, నేతి, కవిత్రయ భారతం, రాజనీతి, పుట:56).

విద్వాంసులు అంటే పండితులు ధర్మాధర్మ విచక్షణ కలిగిన వారు వీరు రాజుకు సంబంధించిన అనేక విషయాలను పరిశీలించి మంచి, చెడులను వివరించి చెప్పగలగాలి

అటువంటప్పుడే రాజు సరైన నిర్ణయం తీసుకుని రాజును ఉద్ధరింపచేస్తాడు.(అనంతరామ శాస్త్రి, నేతి, కవిత్రయ భారతం, రాజనీతి, పుట:56).

ఇవి రాజ్యం యొక్క ముఖ్య విధులు.

### 4.3. **రాజనీతి శాస్త్రం:**

రాజనీతి శాస్త్రం ప్రధానంగా వ్యక్తి యొక్క వ్యక్తిత్వాన్ని రూపుదిద్దడానికి తోడ్పడుతుంది. నియమాలను , శాసనాలను ఏర్పరచడం ద్వారా ప్రజలు వాటికి కట్టుబడి తమ దైనందిన జీవితంలో సమస్యలను ఎదుర్కొని వాటిని పరిష్కరించడానికి ఈ శాసనాలు, నియమ నిబంధనలు ఉపయోగపడుతాయి. మానవుని ప్రవర్తనలో మార్పు తేవడానికి రాజనీతి శాస్త్రం ప్రధాన పాత్ర పోషిస్తుంది.

మహాభారత కాలంనాటికి రాజరిక వ్యవస్థ ఉన్నది, రాజే సర్వాధికారి రాజు అధీనంలోనే సమస్త ప్రజలు సేవలు అందుకుంటారు, రాజు ను నిర్ణయించే అధికారం ప్రజలకు లేదు, రాజరికం కూడా వంశపారం పర్యంగా వస్తుంది. నేడు ప్రజాస్వామ్య వ్యవస్థ నడుస్తుంది. స్వేచ్ఛగా ప్రజలు తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి వ్యక్త పరుస్తూ సమాజ పురోగతికి పాటుపడుతున్నారు అంటే మన దేశంలో ప్రతిపాదించబడిన రాజ్యాంగ వ్యవస్థ అటువంటిది. *''మన రాజ్యాంగం యొక్క గొప్పతనాన్ని ఆచార్య దార్ల వేంకటేశ్వర రావు ''దేశ పునర్నిర్మాణం లో భాగమే ఆజాది కా అమృత మహోత్సవ్'' అనే వ్యాసంలో మన రాజ్యాంగం గురించి కీలకమైన అంశాలను ప్రతిపాదించారు.*

*''మన భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక మనల్ని మనం పరిపాలించుకోవడానికి ఒక రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకోవడం మనం ఒక గొప్ప సవాల్. దాన్ని మనం సాధించుకున్నాం.*

*రాజ్యాంగం భారతీయులను స్వేచ్ఛ సమావేశం కృషిచేసి భారత పార్లమెంటరీ వ్యవస్థను పటిష్టంగా ఈనాటికి ఉంచగలిగింది అది మనం సాధించిన మహోన్నతమైనటువంటి విజయం ప్రపంచ దేశాలలో మనకు ఉన్నంత రాజ్యాంగం ఏ దేశానికి లేదు.*

“(https://vrdarla.blogspot.com/search?updated-max=2022-08-12T23:48:00%2B05:30&max-results=2&start=99&by-date=false

వీరి మాటల్లో ని అభిప్రాయాలను గమనిస్తే అనేక దేశాలలో ఉన్న పాలనా వ్యవస్థ ప్రజలకు స్వేచ్ఛ విషయంలో పరిపూర్ణతను సాధించలేదని ఆ విషయంలో భారతీయులే మేలని మన దేశాన్ని మనమే పరిపాలించుకునే గొప్ప రాజ్యాంగ వ్యవస్థ మనదని అర్థమవుతుంది.

*“రాజనీతి శాస్త్రమంటే గత కాలంలో రాజ్యాలెల్లా ఉండేవనే చారిత్రక పరిశీలన ఈనాడు రాజ్యాలెట్లా ఉన్నవనే విశ్లేషణాత్మక అధ్యయనం. రాజ్యాలెట్లా ఉంటే బాగుంటాయనే రాజకీయ నైతికాత్మకమైన చర్చ, ఈ శాస్త్రాధ్యయనంలో చర్చించే మౌలికాంశాలు, రాజ్యం పుట్టుక, దాని స్వభావము, రాజకీయ సంస్థల వివిధ రూపాలు, వాటి స్వభావాలు వీటి ద్వారా రాజనీతి శాస్త్రం పెరుగుదలకు, అభివృద్ధికి మూలమైన కొన్ని సామాన్యీకరణలు చేయడం. (విఠల్ రావు, వై, (సంకలనం,) రాంరెడ్డి, జి. (పరిశీలన), చరిత్ర రాజనీతి శాస్త్రము., పుట:80).*

ఈ విషయాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే రాజనీతి శాస్త్రం యొక్క భావాలను సంపూర్ణంగా అర్థం చేసుకోగలుగుతాము, అంతే కాకుండా ప్రాచీన కాలం నాటి రాజరిక వ్యవస్థకు నేటి కాలం ప్రజాస్వామ్య వ్యవస్థకు మధ్య వ్యత్యాసాన్ని గుర్తించగలము. వ్యవస్థ మారినప్పటికి ప్రధానంగా ప్రజల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకునే పరిపాలన కొనసాగాలి.

*“ప్రఖ్యాత రాజనీతి శాస్త్ర పితామహుడు ఆయన అరిస్టాటిల్ మానవుడు సంఘజీవి అని పేర్కొన్నాడు. మానవుడు సమాజంతో సంబంధం లేకుండా స్వతంత్రంగా జీవించగలిగితే దేవుడైనా అయి ఉండాలి. తప్పితే పశువైనా అయి ఉండాలని వివరించాడు. అదే విధంగా మానవుడు రాజకీయ జీవిగా మారి రాజ్య ప్రభుత్వాలను ఏర్పరచుకున్నాడు. కావున రాజ్య ప్రభుత్వాలతో వ్యక్తికి గల సంబంధాలను గూర్చి వివరించునదే రాజనీతి శాస్త్రం. ”(రాజనీతి శాస్త్రము, సీనియర్ సెకండరీ స్థాయి కోర్సు ఇంటర్మీడియట్ కోర్సు, తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటి పుట:07)*

దేశంలో ఏ వ్యక్తి అయినా సమాజంతో సంబంధాలను ఏర్పరచుకునే జీవిస్తాడు. ఆ వ్యక్తి జీవించడానికి అవసరమైన ఆర్థిక వనరులను సంపాదించడానికి కనీస మౌలిక సదుపాయాలు అవసరం. ఈ అవసరాలను తీర్చడానికి ప్రజలు ఏర్పరచుకున్న ప్రభుత్వం ఒక వ్యవస్థను నిర్మిస్తుంది. అందులో ఎన్నో ఉపాధి అవకాశాలను ప్రభుత్వం ఏర్పరస్తుంది. దీనితో సమాజానికి వ్యక్తికి మధ్య సంబంధాలు బలోపేతమవుతాయి. ఇలా వివరించడమే రాజనీతి శాస్త్రమని అర్థమవుతుంది.

*"అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం రూపొందించిన రాజనీతి శాస్త్రం, రాజనీతి భావాలు – సంస్థలు పుస్తకంలో రాజనీతి శాస్త్రం గురించి ఈ విధంగా అంటారు." రాజనీతి శాస్త్రం కేవలం మనిషి ప్రవర్తనను మార్గదర్శకంగా ఉండే నియమ నిబంధనలు , శాసనాలను గురించి చర్చిస్తుంది. " (రాజనీతి శాస్త్రం, రాజనీతి భావాలు – సంస్థలు, పుట:5).*

*రాజనీతి శాస్త్రమంటే గత కాలంలో రాజ్యాలెల్లా ఉండేవనే చారిత్రక పరిశీలన ఈనాడు రాజ్యాలెట్లా ఉన్నవనే విశ్లేషణాత్మక అధ్యయనం. రాజ్యాలెట్లా ఉంటే బాగుంటాయనే రాజకీయ నైతికాత్మకమైన చర్చ, ఈ శాస్త్రాధ్యయనంలో చర్చించే మౌలికాంశాలు, రాజ్యం పుట్టుక, దాని స్వభావము, రాజకీయ సంస్థల వివిధ రూపాలు, వాటి స్వభావాలు వీటి ద్వారా రాజనీతి శాస్త్రం పెరుగుదలకు, అభివృద్ధికి మూలమైన కొన్ని సామాన్యీకరణలు చేయడం. (విఠల్ రావు, వై, (సంకలనం,) రాంరెడ్డి, జి. (పరిశీలన), చరిత్ర రాజనీతి శాస్త్రము., పుట:80).*

ఈ విషయాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే రాజనీతి శాస్త్రం యొక్క భావాలను సంపూర్ణంగా అర్థం చేసుకోగలుగుతాము, అంతే కాకుండా ప్రాచీన కాలం నాటి రాజరిక వ్యవస్థకు నేటి కాలం ప్రజాస్వామ్య వ్యవస్థకు మధ్య వ్యత్యాసాన్ని గుర్తించగలము. వ్యవస్థ మారినప్పటికి ప్రధానంగా ప్రజల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకునే పరిపాలన కొనసాగాలి.

రాజనీతి శాస్త్రం లేదా న్యాయ లేదా ధర్మశాస్త్రం

రాజనీతితత్త్వ

శాస్త్రంతో
వ్యవహరించే విధాయక శాఖ

రాజనీతి సంస్థలతో
వ్యవహరించే సంవర్థకశాఖ

సైద్ధాంతిక ఆదర్శాలు లేదా
కేవల సిద్ధాంతాలు(అనువర్తిత ఆదర్శాలు)
లేదా విభిన్న ఆలోచనల పరంపర

ఉదార వాదం ఫాసిజం, శ్రామిక సంఘవాదం

న్యాయం విషయకం రాజ్యం

న్యాయేతర విషయంకం రాజ్యం
ఇక్కడ రాజకీయ పక్షాలు, కార్మిక సంఘాలు,
సమాచారపత్రాలు ప్రాధాన్యత వహిస్తాయి.

రాజ్యాంగం ప్రభుత్వ పరిపాలన

జాతీయ లేదా అంతర్జాతీయ సంబంధాలు

రాజనీతికి సంబంధించిన ముఖ్యమైన పారిభాషిక పదాల యొక్క అర్థాలను పండితులు ఈ క్రింది విధంగా వివరించారు.

రాజధర్మం = law for rules , దండ నీతి= Principles of government , అర్థ శాస్త్రం code of common wealth , రాజ్య శాస్త్రం= code for rulers , నీతి

న్యాయం, =policy of principels **(రామనాథం, మనస, తెలుగు ప్రబంధాలలో రాజనీతి, (సి.వ్యా), పుట:09).**

**4.4. రాజనీతి – రాజు పరిపాలన :**

*" ప్రాచీన కాలం నాటి మన ప్రభుత్వం, భారత రాజ్యాంగ చరిత్ర, వ్రాయాలంటే వేదాల దగ్గరకు పోవాలి. ఒక విధంగా భారత రాజ్యాంగం చరిత్ర వేదాలంతా ప్రాచీనమైనవన్నమాట. కోట్లు లక్షల సంవత్సరాల మాట అలా ఉంచి యీ వేదాలను గూర్చి వేయబడిన బహు కనీసపు మదింపునే స్వీకరిద్దాము ఈ వేదాలు క్రీ.పూ 1000 సంవత్సరాలకు పైగా కాలమునాటివి గాని లోపలివి కావు*

*" సామాజికాభివృద్ధి పరిణామ దశలో వివిధ శాస్త్రాలు వెలిసాయి. కాని మహాపురుషుల స్వానుభవంతో రచించబడ్డాయి. ఇలాంటి శాస్త్రాలలో రాజనీతి శాస్త్రం ఒకటి. ప్రొఫెసర్ నిట్జ్ . పి.వి కానే దండనీతి(రాజనీతి) ధర్మశాస్త్రాల నుండి ఆవిర్భవించిందని పేర్కొన్నారు. రాజనీతి శాస్త్రం అతి ప్రాచీన శాస్త్రం. "చర్చనీయమైన విషయాన్ని గురించి రుజువు చేయదగిన సూత్రాల సముదాయానికి శాస్త్రమని పేరు దీనిని రెండు విధాలుగా వర్గీకరించవచ్చు. ఒకటి సామాజిక శాస్త్రం రెండు ప్రకృతిశాస్త్రం, రాజనీతి శాస్త్రాన్ని సామాజిక శాస్త్రంగా చెప్పవచ్చు. (దామోదర్ రెడ్డి, పామిరెడ్డి, ప్రాచీనాంధ్ర కావ్యాలు రాజనీతి(సి.గ్రం), పుట:1.)*

సమాజం అంటే ప్రజలు వారి పరిపాలనా బాధ్యతలు స్వీకరించువాడు రాజు, రాజు చేసిన చట్టాలను, ప్రతిపాదనలను సరిగ్గా అమలు అవుతుందా లేదా పరిశీలిస్తూ తన రాజ్యాన్ని లేదా దేశాన్ని పురోభివృద్ధి పరచడమే రాజనీతి అని తెలుస్తుంది.

రాజనీతి ని గురించి ప్రాచీన గ్రంథాల్లో చర్చించబడ్డాయి వాటిలో మార్కండేయ పురాణంలో ఈ విధంగా చెప్పబడింది. మదాలస అలర్కునకు రాజనీతిని ఈ విధంగా చెప్తుంది. రాజు ధర్మయుక్తంగా పాలన చేయాలంటే ద్యూతము, పానము, వాక్పారుష్యము, అను సప్త వ్యసనాలను వదిలిపెట్టాలి. శత్రువుల వలన అపజయము కలుగునట్టి మార్గాలను తెలిసి జాగ్రత్తగా ఉండాలి. మంత్రుల స్వభావం తెలుసుకుని ఉండాలి. చారుల వలన

శత్రువుల సంగతి తెలుసుకొనుచుండాలి. రాజు మిత్ర, ఆప్త, బంధు వర్గంబును నమ్మి ఉండరాదు. సమయోచితముగా ఒకానొకప్పుడు శత్రువులనైనను నమ్మి ఉండాలి. రాజుకు మంత్రులు, భృత్యులు, ఆత్మవంటి వారు. ప్రజానురాగం కలవారై ఉండవలెను. ఇటువంటి రాజును ఎవరూ జయింపలేరు. రాజు కామ, క్రోధ, లోభ, మద, మోహ , మాత్సర్యములగు ఆరు వికారములను జయించాలి. ఇంద్రియాలను జయింపలేని వారు ముఖ్యంగా ఇహపరములు చెడిపోతారు. కామము చేత పాండుమహారాజు, లోభంబున ఇలుందును, మదం చేత వేనుడు, సంతోషం చేత పురంజయుడు నశించారు. కావున కామ క్రోధాదులను వదిలి సంచరించుము,( వేంకట లక్ష్మీ నృసింహ శర్మ, శ్రీ వోలేటి, మార్కండేయ పురాణం, పుట:02).

రాజనేవాడు పరిపాలనా సంబంధమైన విషయాలను తెలుసుకుని పరిపాలన చేస్తే సరిపోదు ఇంద్రియ నిగ్రహం రాజుకు ప్రధానమైనది , కామ, క్రోధ, లోభ , మోహ, మద, మాత్సర్యం అనే శత్రువులను రాజు ముందుగా జయించాలి తరువాత బాహ్య శత్రువులను జయించగలిగే నైపుణ్యాన్ని, పరాక్రమాన్ని కలిగిఉంటాడని పై విషయాలలోని అంతరార్థం గా నేను భావిస్తున్నాను. అలాగే ప్రముఖులైన రాజులు ఈ కామ, క్రోధాదుల వల్లే నశించిపోయారు వారి కథలను కూడా గుర్తు పెట్టుకుని రాజు పరిపాలన చేయాలని మదాలస చెప్పిన మాటల్లో అర్థమవుతుంది.

*''గాలి అన్ని ప్రాణుల యందు సంచరించే విధంగా రాజు ప్రజల మనసుల్లో తలచుకుండే విధంగా మెలగాలి. ధర్మయుక్తంగా పరిపాలన చేయు రాజు ప్రజలు చేయు పుణ్య కార్యంబుల ఆరవ బాగం పుణ్యం పొందుతాడు. అధర్మ పరిపాలన చేసే రాజు ప్రజలు చేసే పాపములో సగ భాగం పొందుతాడు. అని చెపుతాడు.'' ( వేంకట లక్ష్మీ నృసింహ శర్మ, శ్రీ వోలేటి, మార్కండేయ పురాణం, పుట:02.)*

రాజు పరిపాలన విధానాలతో పాటు పాపపుణ్యాల పరిశీలన కూడా తెలుసుకోవడం అవసరం. రాజు ప్రజలందరి యోగ క్షేమాలను చూసేవాడు కాబట్టి వారి పాప పుణ్యాలను కూడా రాజు పంచుకోవలసి వస్తుంది. రాజు ఈ విషయాన్ని గుర్తించి ప్రజారంజకంగా పాలన కొనసాగించాలి. గాలి లేని చోటు ఎక్కడా ఉండదు ప్రతి ప్రాణిలోనూ సంచరిస్తున్న

విధంగా రాజు ఎప్పుడూ ప్రజల మనసులో స్థానం సంపాదించుకుని ఉండాలని వివరంగా తెలియజేసారు.

రాజనీతి ఇంత విపులంగా తన పుత్రునికి బోధించి అటు పుత్రున్ని సరైన మార్గంలోనూ పుత్రుని ద్వారా రాజ్యాన్ని పరిపాలించే విధానం రెండింటిని ఒకేసారి పురోగమించే రీతిలో మదాలస రాజనీతిని తెలియజేసింది.

### 4.5. రాజనీతి పుట్టుక:

మహాభారతం లోని రాజనీతిని చర్చించేముందు అసలు రాజు అనేవాడు ఎలా పుట్టాడు అనే విషయాన్ని కూడా చర్చించుకోవలసిన అవసరం ఉంది. ఈ విషయం గురించి మహాభారతం శాంతి పర్వంలోనే ధర్మరాజు భీష్ముడుని అడుగుతాడు. రాజు అనే శబ్దం ఎలా పుట్టింది? శూరులు వీరులు, ఆర్యులతో కూడిన భూమినంతటిని రాజు ఒక్కడూ ఎలా రక్షించగలుగుతున్నాడు? లోకులు అతని యెడల ప్రసన్నులై ఉండాలని ఎలా అనుకుంటాడు? వంటి అనేక ప్రశ్నలను అడుగుతాడు దానికి భీష్ముడు చెప్పనారంభించాడు. *‘‘మొదట రాజ్యము లేదు, రాజు లేదు, దండం లేదు, దండించే వాడు లేదు ప్రజలందరూ ధర్మంతోనే ఒకరినొకరు రక్షించుకునే వారు. కొంతకాలానికి చాలా దుఃఖం పొందారు. వారికి మోహం ఆవేశించింది. మోహవశులైన ఆ మానవులలో సరైన జ్ఞానం పోయింది. దానితో వారిలో ధర్మం నశించింది. జ్ఞానం నశించి మోహ పరవశులయిన నరులు అందరూ లోభానికి వశులయ్యారు. దానితో మానవులు లభించని దానిని పొందడం కోసం ఎగబడ్డారు. దానితో ప్రజలు పొందరాని స్త్రీలను పొందడం, ఇది తప్పు ఇది ఒప్పు అని తెలియకపోవడం. ఇలా సమాజం అంతా అల్లకల్లోలం అయిపోయింది. అప్పుడు వేదం, ధర్మం నశించడంతో దేవతలంతా బ్రహ్మ దగ్గరకు వచ్చి శరణు వేడారు. అప్పుడు బ్రహ్మ తన బుద్ధి నుండి లక్ష అధ్యాయాల శాస్త్రం రచించాడు. ఇందులోనే సర్వరాజ్య పరిపాలనకు సంబంధించిన విషయాలన్ని ప్రస్తావించబడ్డాయి. ఇందులో కొన్నింటిని గమనిస్తే మంత్రుల రక్షణ, రాజదూత, రాజపుత్రుని లక్షణం గూఢచారుల విచారణకు గూఢచారులను నియమించడం, చెప్పబడ్డాయి. సామ, భేద, దానం , దండం ,ఉపేక్ష అనే అయిదు*

ఉపాయాలు సంపూర్ణంగా చెప్పబడ్డాయి. పౌరుల రక్షణ, రాష్ట్రం అభివృద్ధి పరచడం, ఒక్కొక్క మండలంలో 12 మంది రాజులను నిలపడం డెబ్బది రెండు చికిత్సా విధానాలు, దేశ, జాతి కులాల ధర్మాలు వర్ణించాడు.

లక్ష అధ్యాయాల శాస్త్రాన్ని అందించినప్పటికి లోకహితం కోసం ధర్మ స్థాపన కోసం సరస్వతి దేవి ఈ నా బుద్ధిని ప్రభావితం చేసిందని బ్రహ్మ చెప్తాడు . దండ నీతి ముల్లోకాలలోనూ వ్యాపించింది బ్రహ్మ నుండి శివుడు ప్రజల ఆయువు తగ్గిపోతుందని తెలుసుకుని శివుడు బ్రహ్మచేసిన శాస్త్రాన్ని సంగ్రహంగా వ్రాసాడు. దాని పేరు 'వైశాలాక్షం', దానిని ఇంద్రుడు గ్రహించాడు., పదివేల అధ్యాయాలున్న ఆ మహాశాస్త్రాన్ని ఇంద్రుడు ఐదు వేల అధ్యాయాలలో సంక్షేపించాడు దాని పేరు 'బహుదంతకం', తర్వాత బృహస్పతి ఆ శాస్త్రాన్ని మూడు వేల అధ్యాయాలతో సంక్షపేంచాడు. దాని పేరు బార్హస్పత్యం'. తర్వాత శుక్రాచార్యుడు దానిని వేయి అధ్యాయాలతో సంగ్రహం చేసాడు. ఇలా రాజనీతి పుట్టుకువచ్చింది.''(సంస్కృత భారతం, శాంతి పర్వం, యాభైవ తొమ్మిదవ అధ్యాయం, ).

ఈ వివరాలను పరిశీలిస్తే సమాజంలో రాజనీతి విస్తరణకు ప్రధాన కారణాలను గమనించవచ్చు. ధర్మంతో జీవిస్తున్నంత కాలం రాజు,రాజనీతి వీటి అవసరం లేకుండా ఉన్నది కాని ఎప్పుడైతే ధర్మం తప్పి మానవులు సంచరించడం ప్రారంభించారో అప్పటి నుండి రాజనీతి సమాజానికి అవసరమైనదని తెలుస్తుంది.

**రాజ్యానికి ఏడు అంగాలు ప్రధానమైనవి 1. రాజు2. మంత్రులు3. రాజ్యం4. కోశం5. సైన్యం 6. మిత్రులు 7. దుర్గాలు**

''రాజు రక్షింపబడకపోతే రాజ్యమంటూ ఉండదు. అది ఇతర రాజ్యాలలో చేరిపోతుంది. మంత్రులు లేకపోయినా రాజుకు తగిన సలహాలిచ్చే వారుండరు. రాజులెంత గొప్పవారైనా మంత్రులు లేకుండా పరిపాలన దక్షతతో కొనసాగించలేరు. అందువల్ల సరియైన మంత్రుల నియామకం, వారి రక్షణ తప్పనిసరిగ్గా అవసరం. రాజు మంత్రులు రాజ్యాన్ని రక్షించాలి. రాజ్యాన్ని రక్షించడానికి ధనాగారం అత్యవసరం. ధనం లేకపోతే సైన్యాన్ని ఏర్పాటు చేయడానికి వీలుగాదు. సైన్యాలు లేకపోతే రాజ్యాన్ని రక్షించడానికి

*సాధ్యం కాదు. దుర్గాలు లేకపోతే సైన్యాలకు, ప్రభుత్వానికి రక్షణ ఉండదు. మిత్రులు లేకపోతే ఒంటరిగా శత్రురాజుల్ని ఎదిరించడం చాలా కష్టం. అందువల్ల ఒక రాజ్యం నిలబడాలంటే దానికి ఈ ఏడు అంగాలు ఉండాలి. అవి శక్తి వంతం కావాలి. రక్షించబడుతూ ఉండాలి. ఇది భీష్ముడు చెప్పిన రాజనీతిలోని ప్రథమ సూత్రం. (రాజగోపాల నాయుడు, పి. కురుక్షేత్రే, పుట:87).*

రాజ్యానికి ఉండవలసిన ఏడు అంగాలు ఎంత అవసరమో వాటిని పటిష్ఠంగా అమలు చేయగలిగితే ఆ రాజ్యం రాజు సుస్థిరమైన , శాస్వతమైన కీర్తిని గడిస్తుందని పై విషయాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ క్రింద రాజ్యానికి ఉండవలసిన ఈ ఏడు అంగాలను గురించి క్లుప్తంగా చర్చిస్తున్నాను.

**4.6.రాజు –రాజ ధర్మాలు:**

రాజు తన రాజ్యపరిపాలనలో కొన్ని ధర్మాలను పాటిస్తూ పరిపాలన కొనసాగించాలి. అలా ప్రజారంజకంగా పరిపాలన కొనసాగించాలంటే రాజ ధర్మాలను తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

కొడి మడుగు నాగేశ్వర శాస్త్రి'' **శాంతి పర్వము తులనాత్మక పరిశీలన''** గ్రంథంలో రాజ ధర్మాన్ని గురించి ఈ విధంగా తెలియజేసాడు. *'' హింసతో కూడిన ధన భోగాలు ధర్మ విరుద్ధమని సామాన్య ప్రజలు అనుకుంటారు. ధర్మ సూక్ష్మం తెలిసిన వారు యుక్తాయుక్తముల గురించి ఆలోచిస్తారు. రాజు భోగాలకు అలవాటు పడి రాజ్యమును కోరుకున్నట్లయితే అది ధర్మ విరుద్ధము. ధర్మాన్ని ఉద్ధరించడం కోసం యుద్ధం చేత రాజ్యాన్ని ఆక్రమించడం అనేది హింసగా పరిగణించబడదు. ఒక వేళ ధర్మోద్ధరణమై చేయు యుద్ధమున జనహింస జరిగినను రాజన్యుడు పట్టాభిషిక్తుడై ప్రజానీకమును ధర్మ బద్ధముగా పరిపాలించినచో ఆ దోషము తొలగి పోతుంది. అధర్మపాలన లోకమంతటిని నిరంతరం హింసిస్తూనే ఉంటుంది.. శాశ్వత ధర్మమును పురస్కరించుకుని కొంత ప్రజాహింస జరిగినను రాష్ట్ర ప్రజలు అంతా సుఖంగా ఉంటారు. ఇట్టి విశ్వ ధర్మమును సాధించుటకు ధర్మ సంస్థాపకులు సాయుధులై పోరాటము జరపవచ్చును. దాని వలన*

*లోకహితమధికముగా ప్రవర్తిల్లుటచే తత్సాధనలో కలుగు హింస ఉత్తమ ప్రయోజన నిమిత్తమై ఉజ్జ్వలముగా భాసించును.'' (నాగేశ్వర శాస్త్రి, కొడు మడుగు, శాంతి పర్వము ( తులనాత్మక పరిశీలన), పుట:20,21).*

*రాజ ధర్మాన్ని వివరిస్తూ*

*'' సీ  ఏనుంగు హజ్జలో నెల్ల సత్త్వంబుల – హజ్జలు నడఁగిన యట్ల పోలె.*
*రాజిత క్షత్ర ధర్మమును లోనయి – సర్వ ధర్మంబులు జను మఖములు*
*వేదంబులును శుభవృత్తంబులును దండ – నీతి మాసినఁజెడు భూతలంబు*
*సంస్కార రహితమై చాల హీనతఁ బొందు– నట్లైన ప్రజకు జేటావహిల్లు*
*తే. రాజు లరసిన నెమ్మది బ్రదుకుఁగాన రాజు సర్వోత్తముఁడు ధర్మరాజుయందు*
*రాజ ధర్మంబుయెక్కుడు రా జనంగ– ధర్మదేవత యన వేఱె ధర్మతనయ (ఆంధ్ర మహాభారతం, శాంతి పర్వం, ద్వితియాశ్వాసం, పుట:264.).*

*ఏనుగు పాద ముద్రలలో సమస్త ప్రాణుల అడుగులు అణగిపోయినట్లే విశిష్ట రాజ ధర్మానికి సమస్త ధర్మాలు లోబడి ఉంటాయి. దండనీతి చెడితే వేదాధ్యయనము, యజ్ఞ ఆచరణము, శుభకార్యాచరణకు వినాశనం ఏర్పడుతుంది. ఈ భూమి అంతా సంస్కార రహితమై హీన స్థితిని పొందుతుంది. ప్రజలకు కీడు కలుగుతుంది. రాజు ప్రజలను ప్రేమతో పరిపాలిస్తే హాయిగా బ్రతుకుతారు. రాజు సర్వశ్రేష్ఠుడు ఈ ధర్మాలన్నింటిలో రాజధర్మం శ్రేష్ఠమైనది రాజంటే ధర్మ దేవతే కాని వేరు కాదు. ''*

ఈ వివరాలన్ని రాజు యొక్క గొప్పతనాన్ని తెలియజేస్తాయి రాజు లేకపోతే దండన ఉండదు దండన లేకపోతే ప్రజల్లో అధర్మం తాండవిస్తుంది. దాని ద్వారా సాధువులు , మంచి వారు బాధింపబడుతారు. రాజ్య పరిపాలనే అస్తవ్యస్తమైపోతుంది కాబట్టి రాజే ప్రజలకు ఆధారభూతుడై వారి అవసరాలను తీరుస్తూ మెలగాలని ఇందులో వివరించారు.

*'' రాజు చార చక్షువై ప్రజలను పాలించునప్పుడు అతనిని సూర్యుడు అందురు. ఆ కార్య కరులను దునుమునపుడు అతడు యముడు అతడు ప్రజలపై ధనమును వర్షించును. ఉపకార పరులకు ప్రత్యు పకృతి యొనర్చును అప్పుడు అతడు కుబేరుడు. ఈ*

*కర్తవ్యములను సాధించనినాడు అతడు నృపుడు కాదు తస్కరుడు రాజ రూపమున ఉన్న కలి." (గోదావరిబాయి సంధ్యా వందనం, భారతము రాజనీతి విశేషములు, పుట:26).*

సూర్యుడు తన కిరణాలతో సమస్త ప్రపంచాన్ని రక్షిస్తున్నట్లు రాజు ప్రజలను కనిపెట్టి వారిని రక్షించాలని అధర్మాన్ని నిర్మూలించేటప్పుడు యమునిగాను, దౌర్జన్యంగా సంపాదించే వారి ధనాన్ని కొల్లగొట్టి కోశాగారాన్ని అభివృద్ధి చేసేటప్పుడు అతనిని కుబేరుడు గాను ఇందులో వర్ణించడం గమనించదగిన అంశం.

### 4.7. రాజు లక్షణములు:

కౌటిల్యుడు రాజైన వానికి మూడు గుణాలు ఉండాలని చెప్తాడు.

1. అభిగామిక గుణములు, 2. ప్రజ్ఞా గుణములు, 3. ఉత్సాహ గుణములు

#### 4.7.1. అభి గామిక గుణాలు :

**మహాకులీనత, దైవబుద్ధి, సత్త్వ సంపన్నత, వృద్ధ దర్శిత, ధార్మికత , సత్యవాక్కు , కృతజ్ఞత, ఉన్నతాభిలాష, మహోత్సాహము, అదీర్ఘ సూత్రత, దృఢ బుద్ధి వశీకరణ శీలము, అక్షుద్ర పరిషత్ యుక్త వినయము ఇవి అభిగామిక గుణాలు. (గోదావరిబాయి సంధ్యావందనం, భారతము రాజనీతి విశేషములు, పుట:31).**

రాజు మంచి వంశం నుండి వచ్చిన వాడై ఉండాలని దైవ చింతన కలిగి ఉండాలి. అంటే భగవంతుడు సర్వాంతర్యామి మనం చేసే ప్రతి పని గమనిస్తూనే ఉంటాడు అనే భావన కలిగి ఉండాలి. సత్త్వ సంపన్నుడై ఉండాలి. ధర్మబద్ధుడై పరిపాలన కొనసాగించగలిగిన వాడై ఉండాలని సత్యాన్నే మాట్లాడాలని ఇక్కడ రాజు సత్యం మాట్లాడే అవకాశాలు తక్కువ అనే అభిప్రాయం కొంత మంది లో ఉండవచ్చు ప్రజల కోరికలు నెరవేర్చే ప్రతిజ్ఞలు చేసినప్పుడు దాన్ని నిలబెట్టుకోవాలి. సత్యాన్ని అనుసరించి పక్షపాతం లేకుండా దండన విధించడం. రాజు కర్తవ్యం. ఎవరైనా రాజుకు సహాయం చేస్తే వారికి కృతజ్ఞతా పూర్వకంగా భవిష్యత్తులో సహాయం చేయగలిగే మనసు కలవాడై ఉండాలి. రాజ్యాభి వృద్ధికి ఉన్నతమైన కోరికను కలిగి ఉండాలని , వశీకరణ శీలము గలవాడై

ఉండాలి. ఎదుటి వ్యక్తుల్ని తన మాటల్తో మంత్ర ముగ్ధుల్ని చేసి వారిని తన మాటను వినేటట్లు నేర్పును కలిగి ఉండాలని పై వివరాల్లోని భావము వీటిని అభిగామిక గుణాలని చెప్తాడు.

### 4.7.2.ప్రజ్ఞా గుణములు:

*"శాస్త్ర చర్చ శాస్త్ర జ్ఞానము ప్రత్యేక విషయమును గ్రహించుట, గ్రహించిన విషయమును జ్ఞాపకము నందు ఉంచుకొనుట విశేష జ్ఞానము తర్క వితర్కముల ద్వారా విషయతలమును గ్రహించుట చెడు పక్షమును వదలుట గుణవంతుల పక్షమును గ్రహించుట ఇవి రాజునకు ఉండవలసిన ప్రజ్ఞా గుణములు."( (గోదావరిబాయి సంధ్యావందనం, భారతము రాజనీతి విశేషములు, పుట:31).*

ఈ విషయాలు శాస్త్ర చర్చ శాస్త్ర జ్ఞానము ప్రత్యేక విషయాలపై ఆసక్తి రాజుకు ఉండాలి. రాజుకు తనకు తానే మంచి చెడులను నిర్ణయించుటకు పూర్వులు చెప్పిన శాస్త్రాలలోని సారాంశాన్ని గ్రహించినట్లయితే తప్పు ఒప్పు ఏదో తెలుసుకోగలుగుమతాడు. చెడ్డవారిని దూరం పెట్టి జ్ఞానం కలిగిన పండితులను దగ్గర చేర్చడం రాజుకు ఉండవలసిన ప్రజ్ఞా గుణములు.

### 4.7.3. ఉత్సాహ గుణములు:

*శౌర్యము, ఆమర్షము, క్షిప్ర కొరిత, దక్షత ఈ నాలుగు ఉత్సాహ గుణములు" (గోదావరిబాయి సంధ్యావందనం, భారతము రాజనీతి విశేషములు, పుట:31).*

శూరత్వమే రాజు యొక్క ప్రధాన లక్షణం. అది లేని రాజు శత్రువులను జయించలేడు కాబట్టి శూరత్వం రాజుకు ఉండాలని చెప్తాడు.

## 4.8. రాజుకు ఉండకూడని లక్షణాలు:

రాజు ఆదర్శ వంతుడు కాబట్టి రాజు ఎటువంటి వ్యసనాలకు ఆకర్షితుడు కాకుండా ఉండాలి.

మనుస్మృతిలో రాజు ఏ వ్యసనాల వలన భ్రష్టుడు అవుతాడో వివరిస్తారు. " వేట పాచికలాట, పగలి నిద్ర పరనింద, స్త్రీ సంభోగం, మద్యం, నృత్త గీత వాద్యాల , వ్యర్థ సంచారాలనే పది కామం వల్ల పుట్టిన వ్యసనాలు, కొండెములు చెప్పుట, ఇతరులు యొక్క మంచి గుణాలను సహింపకపోవుట, డబ్బు దొంగలించుట, ఇవ్వదగిన వానిని ఇవ్వకపోవుట పరుషంగా మాట్లాడుట, పరుషమైన దండం ఇవన్నీ కొపం వలన కలిగే దుర్వ్యసనాలు.ఈ వ్యసనాలు ఏ రకంగానైనా విడిచి పెట్టినవాడు రాజ్య పరిపాలన సాగింగగలుగుతాడు. **(లక్ష్మీ నరసింహాచార్యులు, నల్లందిఘళ్, మనుస్మృతి, పుట:163).**

పై వ్యసనాలను మహాభారతంలో గమనిస్తే ధర్మరాజు, నలుడు జూదం వలన, పాండు రాజు వేట వలన కష్టాలు పాలవ్వవలసి వచ్చింది . వీరు వారి కర్మ ద్వారా ఈ విధమైన వ్యసనాల వలన నష్టాన్ని చూసినప్పటికి తిరిగి వారి కీర్తిని పొందగలిగారు. కాని దుర్యోధనాదులకు మనసులో ఏర్పడిన వ్యసనం అసూయ , ఓర్వలేనితనం, వీటి వలన వంశానికి వంశమే నశించేపోయేలా చేసింది. అంటే బాహ్య వ్యసనాలకంటే అంతరింగకంలో ఏర్పడిన వ్యసనాలు చాలా ప్రమాదకరమైనవని తెలుస్తుంది.

ద్యూతం విషయంలో స్మృతి కర్తలు కొన్ని పరిమితుల్ని విధించడానికి ప్రయత్నించారు. బృహస్పతిలో నారదుడు కూడా పుర ప్రధానుల అధీనంలో జూద గృహ నిర్వాహకులు ధర్మ విపర్యయం జరగకుండా జాగ్రత్త వహించాలి అన్నారు.

*''పుర ప్రదానం సంభేదః ప్రకృతినాం తథైవ చ*

*పాసణ్డ వైగమ శ్రేణి గణాధర్మ విపర్యయ''*

తర్వాత నారదుడు మోసపూరితమైన పాచికలతో జూదం అనే నేరస్థున్ని గుర్తిస్తే పాచికల్ని అతని మెడలో వేలాడదీయాలి అన్నాడు. అధికరణం కాని పాచికలను ఉపయోగించడం నేరం కాని రాజు అనుమతించిన అధికారిక పాచికలతో జూదం ఆడటం నేరం కాదని నారద స్మృతి చెప్పింది. **(వెంకటరావు బెండి, ఆంధ్ర సాహిత్యంలో ప్రతిబింబించిన నేరాలు శిక్షలు –రక్షణ అంశాలు– పోలీస్ వ్యవస్థ తీరుతెన్నులు అనుశీలన''(సి.గ్ర),పుట:112.).**

ఈ వివరాలను గమనిస్తే ధర్మరాజు రాజమర్యాద పూర్వకంగా జూదం ఆడినట్లు శకుని మోసపూరితమైన జూదం ఆడిగెలుస్తాడు. శకుని ఈ ప్రకారం శిక్షింపదగిన వాడుగా కనబడుతాడు. కాని విధి వలన పాండవులు అరణ్య అజ్ఞాత వాసాలు చేయవలసి వచ్చింది.

## 4.9. ద్రౌపది రాజుయొక్క కర్తవ్య అకర్తవ్యాలను తెలుపుట:

కీచకునిచే అవమానించబడిన ద్రౌపది విరాటరాజు కొలువు తీరన సభలోకి ప్రవేశిస్తుంది. రాజైన విరాట రాజు అంతటి దుశ్చర్యను చూసి కూడా ఊరకే ఉండడం మరింత బాధ కలిగిస్తుంది. ఆ సమయంలో ద్రౌపది విరాటమహారాజుతో సహజంగా రాజ ధర్మం ప్రజలను రక్షించడం, ఎప్పుడూ సత్యధర్మ మార్గాలలో నడుస్తూ తన పిల్లలకు, ప్రజలకు ఎటువంటి భేదాన్ని పాటించకుండా ఆశ్రయించిన వారిని రక్షించడం. కాబట్టి ధర్మాసనం మీద కూర్చొన్న విరాటమహారాజును రక్షించమని కోరుతుంది. అంతే కాకుండా మత్స్య వంశం యొక్క గొప్పతనాన్ని చెప్తుంది. రాజులు చేయకూడని పనులు చేయకపోవడం వలన చేయవలసిన పనులను నిరంతరం చూస్తూ ఉండడం వలన ప్రజలపట్ల సరైన ప్రవర్తనను కలిగిన రాజులు స్వర్గాన్ని పొందుతారని చెప్తుంది. రాజు తన కర్తవ్యాన్ని సక్రమంగా వినియోగించుకోవడం వలన వచ్చే పుణ్యం యజ్ఞం చేత గాని, దానం చేత కాని గురు సేవచేత కాని పొందలేరని చెప్తుంది. ఇన్ని చెప్తున్నప్పటికి తన పట్ల విరాట రాజు కీచకుడిని శాసించలేదు దానితో ద్రౌపది రాజు యొక్క బలహీనతను నిందిస్తుంది. ఇది రాజు యొక్క లక్షణం కాదని చెప్తుంది.

పరోక్షంగా తన భర్తలకు సందేశాన్ని ఇస్తూనే రాజు కర్తవ్యాన్ని బోధిస్తుంది. కీచకుని పట్ల విరాటరాజు చూపిన విధానం సహించక ద్రౌపది సభలోనే రాజుని ధర్మదూషకుడని నిందించింది. అంతేకాకుండా రాజు అయి ఉండి కూడా కీచకునిని యందు రాజు చేయవలసిన కొద్ది పాటి న్యాయం కూడా ఈ మత్స్య రాజు చేయలేకపోయాడు. ఇది బందిపోటు ధర్మం ఈ ధర్మం రాజసభకు మంచిదికాదు. కీచకునికి ధర్మజ్ఞానం లేదు సరే ఈ రాజు కూడా ధర్మజ్ఞుడు కాదని ఇటువంటి రాజుదగ్గర ఉన్న సభాసదులు కూడా ధర్మాన్ని

గుర్తించలేకపోతున్నారని చెప్తుంది. దానికి సమాధానంగా విరాట రాజు  మీ మధ్య ఎటువంటి తగువుందో నాకు తెలియదు నిజమేంటో తెలుసుకోకుండా న్యాయం నేను ఏమి చెప్పగలనని ఊరకున్నాడు. **(సంస్కృత భారతం, విరాట పర్వం, 16 వ అధ్యాయం.).**

ఆంధ్రమహాభారతంలో

*ఉ. ఐనను మత్స్యదేవమున యాజ్ఞ కితం డొడయుండు గాన నా*
*కీ నరనాథు దూఱఁదగు నెయ్యది యేని నధర్మ మెవ్వ రెం*
*దైన నొనర్చినం బ్రభువు లారసి దండన మా చరింతు, రి*
*చ్చో ననుఁదన్ను కీచకునిఁ జూచియు నూరక యున్కి పాడియే?''(*
ఆంధ్రమహాభారతం, విరాట పర్వం, ద్వితియాశ్వాసం,143 వ పద్యం).

ద్రౌపది విరాటరాజు అధర్మాన్ని చూస్తూ ఉండడం చూసి ఈ విరాట రాజు నిందించదగిన వాడు ధర్మలోపం ఎక్కడైనా జరిగితే రాజు దానిని గమనించి శిక్షించాలి. ఈ సభలో కీచకుడు అవమానపరుస్తుంటే తనను తన్నుతూ ఉంటే దానిని నివారించకపోవడం అధర్మమని చెప్తుంది.

ఈ విషయాలను పరిశీలిస్తే రాజులకు రాజ ధర్మాన్ని గుర్తు చేస్తున్న స్త్రీగా ఆ సమయంలో ద్రౌపదిని గమనించవచ్చు. అంతే కాకుండా విరాటరాజు తన కళ్ళఎదుటే అంతటి అన్యాయం జరుగుతున్నా సున్నితంగా కీచకుడిని వెళ్ళిపోమని చెప్పాడే కాని చేస్తున్న పని తప్పని చెప్పలేదు , దండించలేదు. ఇక్కడ న్యాయం కంటే కీచకుని బలం అధికం కావడం చేత  న్యాయం మూగబోయిందని తెలుస్తుంది.

### 4.10. రాజు శబ్దం పుట్టుక – వివరణ:

*''రాజ్యానికి కావలసిన ఏడు ప్రధానాంగాలలో ప్రధానంగా పేర్కొనబడినది రాజు. ఇతడు రాజ్యమనే రాజకీయ సౌధానికి పునాది రాయి వంటివాడు. 'రాజన్' శబ్దానికి 'రాజృదీప్తౌ ' అనే ధాతువు మూలమని నిరుక్తము 'రాజ్' అంటే ప్రకాశించేది అని అర్థం. ప్రజలను రంజింపచేసేవాడు కాబట్టి 'రంజ్' అనే ధాతువు నుండి కూడా రాజు  శబ్దం*

*వచ్చిందని చెప్పవచ్చు. 'క్షత – త్రయ్' అనే ధాతువుల నుండి క్షత్రియ శబ్దం నిష్పన్నమైనది అంటే గాయము నుండి ఉపద్రవము నుండి స్వస్థత చేకూర్చేవాడు క్షత్రియుడు ' క్షత్రియైర్ధార్యతే చాపోనార్తశబ్దో భవే దితి' అని రామాయణమున చెప్పబడింది.*

ఇవి రాజు శబ్దం ఎలా పుట్టిందో చెప్తున్నాయి. రాజు శబ్దంలోనే రంజకత్వం ఉండడం వలన రాజుకి ప్రజారంజకుడుగా పరిపాలన కొనసాగించాలని తెలుస్తుంది. రాజు అంటేనే క్షత్రియుడు కాబట్టి దాని వివరణలో గాయం నుండి స్వస్థత చేకూర్చేవాడు అంటే ప్రజల సమస్యలను తొలగించి అవసరాలను తీర్చి అనేక భయాలనుండి ప్రజలను కాపాడి ప్రజలకు స్వాంతన చూకూర్చేవాడు రాజు అని అర్థమవుతుంది.

## 4.11. రాజు దైవాంశ సంభూతుడు:

రాజ్యాంగాలన్నింటిలోను కేంద్ర బిందువు అన్నదగు రాజు పుట్టుక విషయమై మనువు.

*''ఆ రాజకేవాలోకేస్మిన్ సర్వతో విధృతో భయాత్*
*రక్షార్ధమస్య సర్వస్య రాజాన్ మసృజత్ప్రభుః*
*ఇంద్రానిల యమార్కణా మగ్నేశ్చవరుణ్య చ*
*చంద్ర విత్తేశయోశ్చైవ మాత్రానిర్వృత్య శాశ్వతీః''*

*రాజులేని కారణంగా జగత్తు బలవంతుల వలన భీతిచే బాధపడుతుంటే బ్రహ్మ జగద్రక్షణకు రాజును ఇంద్రుడు, వాయువు, యముడు, సూర్యుడు , అగ్ని, వరుణుడు, చంద్రుడు , కుబేరుడు మొదలగు వారి అంశలతో సృజించెనని తెలిపెను. దీనిని బట్టి జగద్రక్షణకు దేవతాంశములచే రాజు సృజింపబడెనని తెలుస్తుంది. (అనంత రామ శాస్త్రి, నేతి, ప్రసిద్ధ సంస్కృతాంధ్ర రామాయణాల్లో రాజనీతి తత్త్వము, పుట:17.)*

ఏ విధంగా దిక్పాలకులు అన్ని దిక్కులను రక్షిస్తూ సృష్టిని కాపాడుతున్నాడో బ్రహ్మ సృష్టించిన రాజు తన రాజ్య క్షేమానికి తన చుట్టూ ఉన్న పొరుగు రాజ్యాల నుండి

సంబంధాలను నెలకొల్పుకుంటూ అవసరమైతే యుద్ధం చేస్తూ రాజ్యవిస్తరణతో పాటు ప్రజాకాంక్షలను నెరవేరుస్తున్నాడని అర్థమవుతుంది.

*''రాజు దైవాంశ సంభూతుడు అనే విషయం వాల్మీకమున కలదు.*

*జేష్ణ్యం తథా విక్రమం చ సౌమ్యం దండం ప్రసన్నతామ్*

*ధారయన్తి మహాత్మానం రాజానః క్షణ దాచరః ''(అనంత రామ శాస్త్రి, నేతి, ప్రసిద్ధ సంస్కృతాంధ్ర రామాయణాల్లో రాజనీతి తత్త్వము, పుట:17.)*

*మహాత్ములకు రాజులు అగ్ని యొక్క వేడిని ఇంద్రుని యొక్క పరాక్రమాన్ని చంద్రుని యొక్క చల్లదనాన్ని వరుణుడి ప్రసన్నతను యముని యొక్క దండమును ధరించెదరని తెల్పెను.*

రాజులు అగ్నియొక్క వేడిని ధరిస్తారు అంటే అగ్ని దేనినైనా దహించి వేస్తుంది. పవిత్రం చేస్తుంది. అలాగే రాజు అవసరమైన చోట కోపాగ్నిని ప్రదర్శిస్తాడు. దీని వలన ప్రజలలో తప్పులు చేయాలనే ఆలోచన రాదు రాజు చూపే భయం ధర్మం నిలబెడుతుంది అనుకున్నప్పుడు రాజు అగ్ని యొక్క వేడిని ధరిస్తాడని తెలుస్తుంది.

ఇంద్రుని యొక్క పరాక్రమాన్ని ధరిస్తాడని చెప్పడంతో రాక్షసులను ఇంద్రుడు తన పరాక్రమంతో ఎప్పటికప్పుడు రాక్షసులను జయిస్తుంటాడు. అలాగే రాజు తన పరాక్రమ బలంతోనే శత్రువులను జయించి రాజ్య రక్షణను ధరిస్తాడని భావన.

చంద్రుని యొక్క చల్లదనాన్ని ధరిస్తాడు రాజు అంటే ప్రజలను ఆదరించడంలో ఇటువంటి గుణాన్ని రాజు ధరించడం వలన ప్రజలలో రాజుపై మమకారం ఏర్పరచుకుని తమ సమస్యలను స్వచ్ఛందంగా స్వేచ్ఛగా చెప్పగలుగుతారు.

వరుణుడి ప్రసన్నత ధరించడమంటే రాజు సంగీత, సాహిత్య, నాట్య కళాకారులను పోషించడం వలన వారి చేత కార్యక్రమాలు చేయించడం వలన ప్రజలల్లోని ఆనందానుభూతిని పొందుతారు. ఇది ప్రసన్నతకు కారణమవుతుంది.

- యముని యొక్క దండము ధరించడమంటే తప్పు చేసిన వారిని దొంగతనం చేసిన వారిని , రాజ్యం యొక్క ఆర్థిక వనరులను నష్ట పరిచేవారిని, ప్రజలను బాధించే వారి క్రూర మనస్తత్వం కలిగే వారిని రాజు శిక్షించి వారిని సరైన మార్గంలో నడిపిస్తారు కాబట్టి రాజు దైవ స్వరూపుడని చెప్పడం జరిగింది.

**విశుద్ధ మనుస్మృతి**'లో మను మహర్షి చెప్పిన వాటిని పి.వి రమణారెడ్డి దేవతలతో రాజును పోలుస్తూ ఈ క్రింది విధంగా వర్ణించారు.

- ఇంద్రుడు:- వృష్టి కారక శక్తి కావలసినంత జలమును వర్షింపచేసి ప్రాణి కోటిని తృప్తిపరచునట్లు, రాజును ప్రజలకు సుఖములను కలుగచేసి ఐశ్వర్యమును ప్రదానం చేసి ప్రజల కోరికలను పూర్తి చేసి సంతుష్టులునుగా ఉంచవలెను.
- వాయువు :- ఏ విధంగా వాయువు ప్రాణులందరిలో అన్ని స్థానములలో ప్రవేశించి వివరించునట్లు రాజు తన గుప్తచరుల ద్వారా సర్వత్రా ప్రవేశించి సర్వ ప్రాంతములందు తనవి మరియు శత్రువుకు సంబంధించిన ప్రదేశములందున్న ప్రజల విషయాలను తెలుసుకుంటూ ఉండాలి.
- యముడు:-

ఈశ్వరుని మారణ శక్తి లేక నియంత్రణ శక్తి కర్మ ఫల సమయము రాగా నీ, నా అనుభవమును చూపకుండా శత్రు,మిత్ర భావము లేకుండా ధర్మము ను అనుసరించి న్యాయానుకూలంగా దండన చేయునో అదే ప్రకారంగా రాజుకున్నూ అపరాధులైన ప్రజలను ఆత్మీయ పరాయిభావము లేకుండా , న్యాయ పూర్వకముగా దండన చేయవలెను ప్రజలను తన నియంత్రణలో ఉంచుకోవలెను.

- అర్కుడు :- సూర్యుడు తన కిరణముల ద్వారా తపింపచేయకుండానే జలమును తీసుకొనునట్లు రాజునూ ప్రజలకు కష్టము కలిగించకుండా పన్ను వసూలు చేయుగాక
- అగ్ని- అగ్ని ఏ విధంగా అశుద్ధిని నాశనం చేసి శుద్ధి చేయునో మరియు తేజోవంతముగా ఉండునో అదే విధంగా ప్రభువైన వాడు అపరాధము హాని లేక దౌష్ట్యమును కలిగించి ప్రజా పీడకులైన వారికి ప్రభావ శాలిగా ఉండి ప్రజా పీడకులను సంతృప్తులుగా చేసి దండన చేసి  అదుపులో ఉంచుకోవలెను.
- వరుణుడు :- నీరు తన తరంగములలో లేక గుండములో ప్రాణులను ఉంచునట్లు పరిపాలకుడునూ అపరాధులను శత్రువులను కారాగారంలోనే నిర్బంధించ వలెను.
- చంద్రుడు- ఏ విధంగా చంద్రుడు శైత్యమును ప్రదానము చేయునో మరియు పూర్ణిమ నాటి చంద్రుని చూచినప్పుడు హృదయము ఎట్లు ప్రసన్నమగునో, అదే విధంగా రాజైనవాడు ప్రజలకు శాంతి ప్రదాతగా ప్రసన్నతను కలిగించేవాడుగా ఉండవలెను. వీరు మా ప్రభువులు అని ప్రజలు చెప్పుకునేటట్లు ఉండాలి.
- విత్తేశుడు(ధనాద్యుడు), – ఏ విధంగా పృథ్వి లేక ధనాధిపతి పరమేశ్వరునితో సమానంగా  సర్వ ప్రాణులను పాలించి పోషించుచున్నదో అదే విధంగా రాజు పక్షపాత రహితుడై సమాన భావంతో ప్రజలను పుత్రుల వలె పాలించుగాక.**( శ్రీ రాజవీర శాస్త్రి, (సంపాదకులు), విశుద్ధ మనుస్మృతి, ( తెలుగు అనువాదకులు, (పి.వి రమణా రెడ్డి,) హింది మూలం(సురేంద్ర కుమార్). పుట:03.)**

## 4.12. రాజు ఆవిర్భావ విశేషాలు:

రాజు అనే వాడు ఎలా వచ్చాడు రాజు ఎందుకు సమాజానికి కావలసి వచ్చింది అనే విషయాలను చర్చించడం అవసరం.  *"దేవతలు విష్ణు సన్నిధికి వెళ్ళి నీతి శాస్త్రం పుట్టుకను వివరించి దాన్ని అభ్యసించి తదుచితంగా నడపగల సమర్థుడిని నిర్దేశించుమని*

ప్రార్థించారు. విష్ణువు తనతో సమాన తేజస్సు గల మానసపుత్రుని సృష్టించి విరజుడని నామకరణం చేసాడు. అతడు రాజు కావడానికి అంగీకరించలేదు. అతడి కుమారుడు కర్దముడు రాజ్యాపాలనకు ఇష్టపడక తపస్సుకు వెళ్ళిపోయాడు. అతడి కుమారుడు అనంగుడు దండనీతిని అనుసరించి ప్రజలను పాలించాడు. అతడి పుత్రుడు నీతి అనేవాడు రాజ్యాభిషిక్తుడై సునీతను వివాహమాడి ఆవిడయందు వేనుడనే కుమారుడిని పొందాడు. మాతామహుడి దోషం వలన వేనుడు రాగద్వేషాల కారణంగా ప్రజా విరుద్ధుడయ్యాడు. అలా కావడంతో మహామునులు కలిసి వచ్చి మంత్రాలతో పవిత్రీకరించిన దర్భలతో అతడిని ఉపశమింపచేసి అతడి కుడి తొడను మథించారు దాని నుండి కాలిన కొరవి వలె నల్లనై మిక్కిలి పొట్టి శరీరంతో ఎర్రని కన్నులు కలిగి అశుచి అయిన ఒకడు జన్మించాడు. వారే నిషాదులుగా పిలువబడ్డారు. వీరు క్రూర స్వభావంతో జీవించేవారు. మళ్ళీ వేనుడి కుడి బాహువును మథించగా వేద వేదాంగాలలోని ధనుర్వేదంలోను పారంగతుడు ప్రకాశించే కవచంతో ధనుర్బాణాలతో మహాపురుషుడు జన్మించాడు. ఆ వెంటనే దండనీతి ఆ మహాపురుషుడిని ఆశ్రయించింది ఆ పురుషుడు మునుల ఎదుట నిలిచి వినయంతో నమస్కరిస్తాడు. అతను వైన్యుడిగా పిలువబడుతాడు సంస్కృత భారతంలో పృథుడు అని పేరు ఉంటుంది. వైన్యుడికి బ్రాహ్మణులకు సహాయకులుగా అనుమతించారు. ఆ సందర్భంలో ప్రేమతో సమస్త దేవతలతో కూడిన వారైన బ్రహ్మ విష్ణువులూ మహర్షులూ సమస్త భూమికి వైన్యుడిని రాజుగా అభిషేకించారు. మహోన్నతమైన వైన్యుడు అధికార పదివిని అలంకరించిన ఆ వైన్యుడు శాస్త్రోక్తంగా దండనీతితో ధర్మానురక్తుడై పరిపాలన సాగించాడు. అతని సంతానమంతా అతడితో సమానులై దండనీతిని అనుసరించి రాజ్యం చేసారు. రాజనేవాడు పుట్టుక అనేది విష్ణు నిర్ణయించిందే విష్ణువు రాజు యందు తన తేజో భాగాలను ప్రవేశింపచేయడం వలన రాజు దైవసమానుడై ప్రజలు నమస్కారాలకు అర్హుడయ్యాడు. ప్రజా సంరక్షణం ఒకడి అధీనంలో ఉండటం అనేది దైవాంశ సంబంధం. దండనీతిని ప్రాప్తింపచేయడానికి స్వర్గం నుండి దిగి వచ్చి శ్రీమహావిష్ణువు మహిమను భావించే మహానుభావుడు కావడం వలన చతుర్వర్ణాలు, చతురాశ్రమాలు, వీటిని

*ఆచరించడానికి ఆధారాలైన వేదాలు పురాణాలు, ఇతి హాసాలు రాజునకు వశమై ఉంటాయి వాటి మహిమచేతనే రాజులలో పరాక్రమము, నైపుణ్యము మొదలైన గుణాలు ఉంటాయని ప్రజలు భావించి రాజాజ్ఞ కు బద్ధులై ఉంటారని చెప్తాడు భీష్ముడు. ఈ విధంగా రాజు పరిపాలన కొనసాగింది. (ఆంధ్ర మహాభారతం, శాంతిపర్వం, ద్వితియాశ్వాసం, 205 వ పద్యం నుండి 218 వరకు).*

ఈ వివరాలను బట్టి రాజు దైవాంశ సంభూతుడని రాజు మాటను ప్రజలు ఆచరించినట్లైతే ఆ రాజ్యం అభివృద్ధి చెందుతుంది.

## 4.13. సార్వభౌమాధికారం:

శ్రీకృష్ణుడు  ధర్మరాజు రాజసూయ యాగం చేయడానికి అనుమతించి ధర్మరాజు కోరిక మేరకు కొన్ని సూచనలు చేస్తాడు. అప్పుడు సమ్రాట్టు కావలంటే ఏమి చేయాలో చెప్తూ  పరశురాముడు క్షత్రియ సంహారం చేసిన తర్వాత మిగిలిన రాజులు తక్కువ సంఖ్యమాత్రమే మిగిలిందని

'' క్షత్రియులంతా కలిసి క్షత్రియులను అందరిని జయించిన వాడే సమ్రాట్టు కాదగినవాడని ఒక కుల నియమాన్ని  ఏర్పాటు చేసుకున్నారని అందరికి తెలిసిన విషయమేనని చెప్తాడు.

రాజుగా అధికారం పొందడం వేరు సమస్తభూమండలాన్ని తన అధీనంలో ఉంచుకున్న రాజును గెలిచి సార్వభౌమాధికారం పొందవచ్చని పై మాటల్లో వ్యక్తమవుతుంది.

జరాసంధుని గురించి ధర్మరాజు భీముడు, శ్రీకృష్ణుడు చర్చించే సందర్భంలో ధర్మరాజు ఒక మాట అంటాడు

*'' గృహే గృహే హి రాజానః స్వస్య ప్రియంకరాః*

*నచ సామ్రాజ్యమాప్తాస్తే సమ్రట్ఛబ్దో హి కృచ్ఛ్రభాక్''( సంస్కృత భారతం ,సభా పర్వం, 15 వ అధ్యాయం,  2 వ శ్లోకం)*

ప్రతి ఇంటిలోనూ రాజులున్నారు తమకు ఇష్టమైన పనులు చేసుకుంటున్నారు కాని వారంతా సామ్రాట్టులుగా పిలువబడం లేదు సామ్రాజ్య పదవి కష్ట సాధ్యమని ధర్మారాజు చెప్తాడు. శ్రీకృష్ణుడు ఇప్పటి వరకు యవనాశ్వకుమారుడు మాంధాత, భగీరథుడు ప్రజాపాలన చక్కగా చేసి కార్తవీర్చుడు తపోబలాన్ని బట్టి భరతమహారాజు బలాన్ని బట్టి సమ్రాట్టులయ్యారు. అలాగే మరుత్తుడు. ఈ ఐదు మంది మాత్రమే సమ్రాట్టులుగా ఉన్నారు. ఇప్పుడు ధర్మరాజా అటువంటి సమ్రాట్టు అధికారాన్ని నీవు పొందాలనుకుంటున్నావు. దానికి సంబంధించిన అర్హతలు నీలోఉన్నాయి. శత్రుజయం, ప్రజాపాలనం,, తపశ్శక్తి ధన సమృద్ధి రాజనీతి నీ దగ్గరున్నాయని చెప్తూ సమస్త రాజులను బందీలుగా ఉంచుకున్న జరాసంధుడిని జయిస్తే నీవు సమ్రాట్టు కాగలవని చెప్తాడు.**(సంస్కృత భారతం, 15 వ అధ్యాయం 17 శ్లోకం మరియు 25 వ శ్లోకం).**

ఈ వివరాలన్ని రాజు కంటే గొప్పదైన స్థానం సమ్రాట్టు పదవని తెలుస్తుంది అంతే కాకుండా రాజులందరిని తన అధీనంలో ఉంచుకున్నటువంటి జరాసంధుని వంటి వారిని జయించడం సామాన్యమైనది కాదు అలాంటి గొప్ప బలవంతులను, పరాక్రమవంతులను జయిస్తే ఈ సామ్రాట్టు పదవిని అలంకరించవచ్చని తెలుస్తుంది.

### 4.14. **రాజనీతి పాశ్చాత్యుల నిర్వచనం:**

పాశ్చాత్య కాలంలో రాజనీతికి సంబంధించిన విషయాలను ప్రస్తావించారు. వారిలో అరిస్టాటిల్ ఒకరు.

*‘‘పాశ్చాత్య దేశములందు రాజనీతి విశారదుడని వాసి గాంచిన అరిస్టాటిల్ అను అతడు తన రాజనీతి (politics) అను గ్రంథము నందు రాజ్యము, పౌరుఁడు, ప్రభుత్వము, రాజకీయాదర్శములు మొదలగు విషయములను గురించి విశదముగా వివరించెను. కనుక రాజనీతి ఈ పై అంశములకు సంబంధించిన విషయ వివరణయే అని తెలియుచున్నది.*

*గార్నర్ అను అతని రాజనీతి శాస్త్రమున ప్రాథమికమగు కొన్ని మౌలిక సమస్యల గురించి చర్చింపబడినది. అందు లో రాజనీతి పుట్టుక స్వభావము- రాజకీయ సంస్థల వివిధ రూపములు పరిశీలింపబడినవి.*

*గెట్టల్ అను అతడు*

*" political science is historical investigation of what the state has been an ana'ytical study of what the state is and a politico ethical discussion of what the state should be" అని నిర్వచించాడు. (గోదావరి బాయి, సంధ్యావందనం, భారతము రాజనీతి విశేషాలు, పుట: 01).*

ఈ నిర్వచనాలను అనుసరించి రాజ్యము ఎలా ఉన్నది, నేడు రాజ్యం ఎట్లా ఉన్నది అను విశ్లేషణాత్మకమైన అధ్యయనము తద్వారా రాజ్యమెట్లుండవలెననెడి రాజకీయ నైతిక చింతన వీని సమాహార స్వరూపమే రాజనీతి శాస్త్రమని తెలియుచున్నది.

*" మానవుడు వేదనా యంత్రమున ఒకప్పుడు నలిగి పోవుచుండును. ఒకప్పుడు హర్షాంబుధి యందు మునిగి పోవుచుండును. జీవితమున అడుగడుగునా జరుగు ఈ మానవ సంఘమున సహకారమున కు ఎంత తావున్నదో సంఘర్షణకును అంతే తావున్నది. సంఘర్షణను తొలగించి సహకారంతో మెలగాలి. అందులకు కొన్ని నియమాలను పాటించాలి. అట్లు నియమములను సంఘటిత పరచి అమలు జరుపుటకు అధికాముండవలెను." (గోదావరి బాయి, సంధ్యావందనం, భారతము రాజనీతి విశేషాలు, పుట: 02).*

ఈ విషయాలు అన్ని రాజ్య నిర్వచనాలను తెలియజేయడంతో పాటు రాజనీతి ఆవశ్యకతను నాటి నేటి రాజకీయ పరిణామాలను తెలియజేస్తున్నాయి. అంతే కాకుండా మానవుడు అనేక రకమైన బాధల నడుమ చిక్కి విలవిల్లాడి పోతుండేవాడు. ఒక్కొక్కసారి సంతోషంతో మునిగిపోతాడు. జీవితంలో అడుగడుగునా జరిగే ఈ చర్యల వలన మానసికమైన దుఃఖాన్ని అనుభవిస్తాడు. ఇటువంటి వికారాలు తగ్గాలంటే ప్రతి వ్యక్తికి సహకారం కావాలి. దాని ద్వారా వారి జీవితం నుండి లేదా కుటుంబం నుండి

సంఘర్షణలు కూడా జరిగే అవకాశం ఉంది. అందుకని ప్రతి వ్యక్తి లేదా సమాజం కొన్ని నియమాలు పాటించాలి. అది ఎవరికి వారే ఏర్పరచుకుంటే కొంత నిర్లక్ష్యం చేయవచ్చు కాబట్టి ఆ నియమాలను అమలు పరచడానికి అధికారం ఉండాలి. ఆ అధికారమే ప్రభుత్వం ఆ ప్రభుత్వాన్ని శాసించే సార్వభౌమాధికారముంటే రాజ్యం అవుతుంది. అటువంటి రాజ్యాంగ వ్యవస్థ దాని గురించి తెలిపేదే రాజనీతి శాస్త్రం.

*" ఆంధ్రుల మనస్తత్వము సంప్రదాయములు జీవితానుభూతులు భారతమున ప్రతిబింబింబించినంతగా రామాయణము ప్రతిబింపలేదనిన రామాయణమును కించపరచినట్లు భావించరాదు. రామాయణం ఆదర్శవంతమగు జీవితమును ప్రోత్సహించిన భారతము మానవుని నిత్య జీవితము నందలి రాగ ద్వేషాది ద్వంద్వములను అందుండి మానవుని అంతరంగము పొందు సంఘర్షణలను జయాపజయములను ఉన్నది ఉన్నట్లుగా చిత్రించుచున్నది. కనుక ప్రజల జీవితమునకు భారతము సన్నిహితమైనంతగా రామాయణము కాలేక పోయినది. " (గోదావరి బాయి, సంధ్యావందనం, భారతము రాజనీతి విశేషాలు, పుట: 03).*

ఈ విషయాలను పరిశీలిస్తే రామాయణం ఆదర్శవంతమైన జీవితాన్ని ప్రజలకు అందిస్తే భారతం ఆదర్శవంతమైన జీవితాన్ని గడపడానికి అనుసరించవలసిన విధి విధానాలను నిత్య జీవితంలో జరిగే సంఘర్షనలు , ఆకర్షణలను మానవుని అంతరంగంలో జరిగే చర్చోపచర్చలు ఇవన్నీ ఉన్నది ఉన్నట్లుగా చిత్రీకరించింది భారతమని అందుకే రామాయణం కంటే భారతం ఒకడుగు ముందుకేసి ప్రజల మనసుల్లో చేరిందని సంధ్యావందనం గోదావరిబాయి గారు అభిప్రాయపడ్డారు. అంతే కాదు భారతమంతా రాజనీతి శాస్త్రమేనని ఈ భారతము, పురాణము, పురాణమే కాదు కావ్యమని, కావ్యమే కాదు శాస్త్రమని శాస్త్రమే కాదు సమగ్ర రాజనీతి శాస్త్రమని వీరు ప్రస్తావించారు.

**" అరిస్టాటిల్ అను రాజనీతి వేత్త ' మానవుడు రాజకీయ జంతువు' అన్నాడు. " (గోదావరి బాయి, సంధ్యావందనం, భారతము రాజనీతి విశేషాలు, పుట: 06).**

మానవుడు రాజకీయ జంతువు అన్నారు. అంటే జంతువుల్లో కలిగేటటువంటి ఆలోచనలు మానవుల్లో స్పృశించాయని ఈ మాటను ఉపయోగించాడా లేదా మనిషి అప్పుడప్పుడు జంతువుల ఆలోచనల్లా ప్రవర్తిస్తారనే ఉద్దేశంతో ఈ మాటను అన్నారో గమనించాలి. అయితే ప్రాచీన కథల్లో మనం చెప్పుకొనేటప్పుడు నక్కల యొక్క జిత్తుల మారితనాన్ని అంటే ఏ విధంగా ఇతరులను మోసగించి ఆహారాన్ని సేకరిస్తుందో ఆ విధంగా మానవుల్లో కూడా అటువంటి వారు ఉన్నారు కాబట్టి ఈ మాటను ప్రయోగించి ఉంటాడు. రాజకీయంలో కూడా వ్యక్తి అనేక కపటో పాయాలతో రాజ్యాన్ని దక్కించుకునే ప్రయత్నం చేస్తారు. అనే భావన కూడా కనబడుతుంది. అలాగే సింహం , పులి వీటి యొక్క గంభీరత్వాన్ని రాజు కలిగి ఉన్నట్లయితే ప్రజలు ఆ రాజు మీద భయంతోనైనా సక్రమంగా నడుచుకుంటారు అనే భావన కలుగుతుంది. ఇలా జంతువుల్లో ఉన్న లక్షణాలు మానవునిలో కొంత కనబడడం చేత మానవుడు రాజకీయ జంతువు అన్నారని నా అభిప్రాయం.

## 4.15. రాజ్యం పాశ్చాత్యుల నిర్వచనం:

రాజ్యం గురించి పాశ్చాత్యులు ఈ క్రింది విధంగా నిర్వచనాలను అందించారు.

*వుడ్రో విల్సన్ '' ఒక నిర్ణీత ప్రదేశములో శాసన బద్ధులై నివసించు ప్రజలు రాజ్యము'*

*హాలాండ్ '' రాజ్యమనగా ప్రజానీకము నివసించు నిర్ణీత ప్రదేశము.''*

*గార్నర్ : రకరకాల మానవ సమాజములు ఒక నిర్ణీత భూభాగంలో స్థిరపడి బాహ్యాది పర్యమునకు లోనైయుండక క్రమబద్ధమైన ప్రభుత్వానికి విధేయులై ఉండిన రాజ్యమని చెప్పుట జరుగును. (గోదావరి బాయి, సంధ్యావందనం, భారతము రాజనీతి విశేషాలు, పుట: 08).*

ఈ నిర్వచనములన్నీ రాజనీతి శాస్త్రములు రెండును ఒక శాసనమునకు నిబద్ధమైన నిర్ణీత భూభాగము రాజ్యమని తెలుస్తుంది.

*" రాజ్యమనే మాటకు మన ప్రాచీన సాహిత్యంలో నిర్దిష్ఠమైన నిర్వచనం లేదు కాని వివిధ అంగాల సమిష్ఠి ప్రయత్నం రాజ్య నిర్వచనాన్ని తెలియజేస్తుంది నిర్దిష్ఠమైన రాజకీయ ఆధిపత్యము కలిగిన సాంఘిక వ్యవస్థగా రాజ్యం చెప్పబడుచున్నది. రాజ్యం ఒక్కసారిగా ఆవిర్భవించినది కాదు భిన్న సామాజిక కార్యకలాపాలు శాంతియుతంగా కొనసాగడానికి రాజ్యాన్ని ఉద్దేశించారు దాన్నిబట్టి రాజ్యం ఒక సామాజిక వ్యవస్థగా చెప్పబడింది. పరిపాలనావశ్యకతయే రాజ్యనిర్మాణానికి దారి తీసింది అనడంలో సందేహం లేదు." (అనంత రామ శాస్త్రి, నేతి, ప్రసిద్ధ సంస్కృతాంధ్ర రామాయణాల్లో రాజనీతి తత్త్వము, పుట:15.).*

ఈ మాటలను పరిశీలిస్తే ప్రజలు తమ నిత్య కార్యక్రమాలను నిర్వహించడంలో సమాజంలో జీవనానికి సంబంధించిన వ్యాపారాలు చేయడంలోనూ కుటుంబ పోషణ చేయడానికి అనేక వృత్తులు చేపడుతుంటారు. ఇటువంటి క్రమంలో ప్రజలు అందరూ ఏకాభిప్రాయంతో న్యాయబద్ధంగా సంపాదించడంలో ఒడిదుడుకులు ఏర్పడుతుంటాయి. తప్పు ఒప్పులు జరుగుతుంటాయి. ఇలా జరగకూడదు అంటే ఒక ప్రభువు సామాజిక బాధ్యతను స్వీకరించి ప్రజలందరిని ఏకం చేసి వారి కార్యకలాపాలలో భంగం వాటిల్లకుండా న్యాయ మార్గాన్ని ప్రజలు అనుసరించేలా చేయడానికి సమిష్ఠిగా రాజ్యం అవసరం.

*" రాజ్యానికి సంబంధించి యాజ్ఞ్యవల్క్య స్మృతిలో , గౌతమ స్మృతిలో , విష్ణు ధర్మ సూత్రాలలో , మనుస్మృతిలో కౌటిల్యుని అర్థశాస్త్రంలో అనేక నిర్వచనాలు ఇవ్వబడినాయి. దానిని బట్టి రాజు, అమాత్యుడు, రాష్ట్రం, కోశం, సైన్యం, మిత్రుడు పురం అని సప్తాంగాలుంటే రాజ్యమని పిలువబడుచున్నది.*

*శుక్రనీతిసారం సప్తాంగాలను మానవ శరీరభాగాలతో పోల్చిచెప్పింది. రాజు శిరస్సుగా, మంత్రులు కన్నులుగా, చెవులు కోశంలా, సైన్యం మనస్సులా, దుర్గం చేతులుగా రాష్ట్రం పాదాలుగా, పోల్చబడింది. ఇట్టివి సమన్వయం ద్వారా మానవ మనుగడకు*

*శరీరాంగాలు దోహదపడే విధంగానే రాజ్యాంగాలు రాజ్యముల మనుగడకు దోహదపడుతున్నాయని స్పష్టమవుతున్నది.( (అనంత రామ శాస్త్రి, నేతి, ప్రసిద్ధ సంస్కృతాంధ్ర రామాయణాల్లో రాజనీతి తత్త్వము, పుట:16)*

ఈ విషయాలలోని అంతర్లీనంగా దాగి ఉన్న సమన్వయాన్ని పరిశీలిస్తే శరీరానికి శిరస్సు ఎంతో ప్రధానమైనది. శిరస్సులో ఏ విధంగా కన్నులు, ముక్కు చెవులు, నోరు, భాగాలుగా ఉంటాయో మంత్రులు కోశాలు, సైన్యం, దుర్గాలు, రాష్ట్రం, ఇవన్నీ ప్రజాక్షేమానికి కేంద్రీకరించబడి ఉంటాయి. మంత్రులే కన్నులు అనడంతో మంత్రులు ఆలోచనా విధానంలో రాజు క్షేమానికి రాజ్య విస్తరణకు సలహాలను అందిస్తూ ప్రజాభిప్రాయాలను చేరవేయడానికి జ్ఞానమనే నేత్రాలుగా చేసుకుని సహకరిస్తాడు. కన్నులు లేకపోతే అంధకారంలో ఎటువంటి బాదను అనుభవిస్తామో మంత్రులు లేకపోతే రాజ్యవ్యవహారాలు అస్తవ్యస్తమయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి మంత్రులే కన్నులు.

–చెవులు కోశాగారాలుగా చెప్పబడ్డాయి. వార్తలు విన్నంతనే రాజు ఒక నిర్ణయానికి వస్తాడు. వినడానికి చెవులు ప్రధానం కోశాగారం అంటే భాండాగారం రాజు నిధులను ఆర్థిక వనరులను భాండాగారంలో భద్రపరుస్తాడు. ఇవి ప్రజల అవసరాలను తీర్చేవి అలాగే చెవుల ద్వారా విన్న సమాచారం ద్వారా నిర్ణయం తీసుకుని ప్రజలకు కావలసిన అవసరాలను సమస్య పరిష్కారాలను రాజు చేస్తాడు. అనే భావం ఇందులో వ్యక్తమయినట్లు తెలుస్తుంది.

–సైన్యాన్ని మనసుతో పోల్చబడింది. అంటే ప్రతి మనిషిలో దాగిన ఆంతరంగిక భావాలు మనసులో ప్రక్షిప్తమై ఉంటాయి. మనసు చాలా వేగంగా పరుగెడుతుంది. ఆలోచనా విధానం అంతా మనసు ద్వారానే జరుగుతుంది. మనసు ఏ విధంగా వేగంగా పరిగెడుతూ నిర్ణయాలను తీసుకుంటుందో సైన్యం రాజ్యానికి రక్షకులుగా పని చేస్తూ శత్రువుల నుండి రక్షిస్తారు. యుద్ధం వచ్చినప్పుడు సామర్థ్య బలాలలో శత్రువులను జయిస్తారు. అనే భావన సైన్యం మనస్సులా అనే మాటలో దాగి ఉందని నా అభిప్రాయం.

–దుర్గం చేతులతో పోల్చబడ్డాయి. అన్నారు దుర్గం అంటే కోట శత్రువులు చొరబడడానికి వీలుకాని దుర్భేద్యమైన కోట రాజ్యాన్ని రక్షించడంలో తోడ్పడుతుంది. మన శరీరంలోని అవయవాలలో చేతులు ఏవిధంగా దోహదపడుతాయో ఆ విధంగా దుర్గం రాజ్యాన్ని రక్షిస్తుంది అనే విషయం ఈ మాటలో వ్యక్తమవుతుంది.

–రాష్ట్రం పాదాలుగా చెప్పబడింది.

రాష్ట్రం ప్రజలు నివసించడానికి యోగ్యమైన ప్రదేశం. ఆ రాష్ట్రంలోని ప్రజలు ప్రభువు ఆదేశానుసారం నడుచుకుంటారు. ప్రజలకు ఆవాసంగా మారిన వారు ఒక సరైన మార్గంలో నడవడానికి అభివృద్ధి మార్గంలో పయనించడానికి రాష్ట్రం ప్రధానం పాదాల మీదే శరీర భారమంతా మోపబడుతుంది అలాగే ప్రజల భారం అంతా అంటే ప్రజల అవసరాలు అన్నీ రాష్ట్రమే భరిస్తుందని ఈ మాట వలన తెలుస్తుంది.

మన శరీర అవయాలలో రాజ్యం యొక్క సప్తాంగాలను సమన్వయం పరచడం ద్వారా ప్రజా క్షేమం ఆధారపడి ఉందని తెలుస్తుంది.

### 4.16. అమాత్యుడు:

రాజుతో పరిపాలనా సంబంధమైన చర్చలు జరిపి వాటిని సమాజంలో అమలు పరచడానికి మంత్రి కీలకమైన వ్యక్తి అటువంటి మంత్రిని ఎన్నుకోవడంలో రాజు ఏకాగ్రత, శ్రద్ధను వహించాలి ఏమాత్రం మంత్రి విషయంలో ఏమరపాటు వహించినా ఆ రాజ్యం అభివృద్ధి ని సాధించలేదు భారతం అందుకే మంత్రి గుణాగుణాలను ఎలా నిర్ణయించాలి. ఎవరిని నియమించాలి ఎటువంటి వారితో రాజ రహస్యాలు చెప్పాలి, చెప్పకూడదు అనే విషయాలను స్పష్టంగా తెలియజేస్తుంది.

మంత్రులు ఎలాంటి వారై ఉండాలని ధర్మరాజు భీష్ముడుని అడిగినప్పుడు భీష్ముడు చెపుతున్నాడు.

*‘‘ఆపదలలో కూడా విడువని విద్వాంసులు, సత్ప్రవర్తనతో వ్రతాచరణం చేసేవారు, సత్యం పలికేవారు, ద్రోహం చెయ్యని వారు వీరిని మంత్రులుగా చేయాలి. అలాగే అతనిలో*

*పరాక్రమం ఉండాలి కీర్తే ముఖ్యం అనుకుంటాడు. చెప్పిన మాట మీద నిలుస్తాడు . పోటి పడరాని వారితో పోటి పడడు కోరికతో కాని, భయంతో కాని క్రోధంతో కాని లోభంతో కాని ధర్మం విడిచి పెట్టడు. అహంకారం లేనివాడు, సత్యవంతుడు ఓర్పుకలిగి, మనసును అదుపులో పెట్టుకుంటాడు. ఆత్మాభిమానం కలవాడు ఈ లక్షణాలు కలవానిని అన్నింటిని పరీక్షించి మంత్రులుగా నియమించాలి వారితోనే మంత్రాంగాన్ని గురించి చర్చించాలి. రాజు అమాత్యుల గుణగణాలను పరిక్షించి నియమించుకోవాలి. చుట్టరికం కల ఆప్తులు, సద్వంశంలో , తన దేశంలో పుట్టినవారు, అమ్ముడు పోని వారు హద్దుమీరి ప్రవర్తించని వారు, బాగా పరిక్షింపబడినవాడు, ఉత్తములకు జన్మించిన వారు వేదవిధులెరిగిన వారు తాత తండ్రుల వరుసలో సేవించేవారు, అహంకార రహితులు ఇటువంటి వారిని ఆత్మోన్నతి కోరే పురుషుడు మంత్రులుగా చేసుకోవాలి. మంత్రికి రాజు మీద భక్తి ఉండాలి. లేకపోతే అతనితో మంత్రాంగం జరపడం రహస్యం చెప్పడం చేయకూడదు. కోపించిన రాజు ఒక్కొక్కప్పుడు ఎవరినయినా పదవి నుండి లాగి వేస్తాడ. మాటలతో తీసిపారవేస్తాడు. కాని మళ్ళీ వెంటనే ప్రసన్నుడవుతాడు.అటువంటి వాటినన్నింటిని మంత్రి భరించగలిగే ఓర్పు ఉండాలి. (సంస్కృత భారతం, శాంతి పర్వం, 83వ అధ్యాయం. )*

మంత్రి యొక్క లక్షణాలు ఆనాటి మంత్రిత్వానికే కాకుండా నేడు అటువంటి గుణాలు కలిగిన మంత్రులు ప్రభుత్వంలో ఉన్నట్లయితే ఈనాటి వ్యవస్థే కాదు భవిష్యత్తరాలలో ఏర్పడ్డ నూతన రాజకీయ వ్యవస్థకూడా ఉన్నతమైన స్థానాన్ని అధిరోహించగలదు. కాబట్టి ప్రభుత్వ అధికారి కంటే అతని దగ్గర పనిచేసే వారి మనస్తత్వాలు, వ్యక్తిత్వాలే ప్రధానమని గుర్తించాలి.

పింగళి లక్ష్మీ కాంతం ''ఆంధ్ర సాహిత్య చరిత్ర''లో మంత్రుల గురించి తెలుపుతూ **మంత్రి హితమును పాటింపలేని రాజు రాజ్యమును చేయలేడు. ప్రజా హితమును కోరని మంత్రి మంత్రిత్వమును చేయలేడు. (లక్ష్మీకాంతం, పింగళి, ఆంధ్ర సాహిత్య చరిత్ర, పుట:154).**

ఈ విషయాలను భారతంలో గమనిస్తే మంత్రిగా విదురుడు చెప్పిన అనేక మైన నీతి వాక్యాలను పెడచెవిన పెట్టిన ధృతరాష్ట్రుడు తన రాజ్యాన్ని కుమారులను పోగొట్టుకున్నాడని చెప్పవచ్చు. ధృతరాష్ట్రుడు అన్ని నైతిక ఆధ్యాత్మిక విషయాలను విన్నాడు వాటిలో ఏ ఒక్కటి పాటించడానికి ప్రయత్నించలేదు. కావున మంత్రి  చెప్పిన విషయాలు రాజ్యానికి హితము చేకూర్చేది గా ఉంటే రాజు వాటిని పాటించి రాజ్యాభివృద్ధికి తోడ్పడాలని తెలుస్తుంది.

## 4.17. భృత్యుల నియామకం:

*''ఉద్యోగ అవకాశాలను పొందానికి కావలసిన అర్హతల గురించి అయిదో అధికరణంలో నాలుగు, అయిదు అధ్యాయాలలో విపులంగా పేర్కొనబడ్డాయి. ఇవి నేటి పోటి పరిక్షలలాగే కన్పిస్తున్నాయి. శాస్త్రాలను క్షుణ్ణంగా చదివి ఉండటమనేది తప్పనిసరిగా ఉండాల్సిన అర్హత, తర్వాత రాజుగారిని సందర్శించడానికి ఆయన కిష్టులయిన వారి ద్వారా వెళ్ళాలి. రాజు గారు తనకు ఇంటర్వ్యూ ఇచ్చినప్పుడు తన శాస్త్ర పరిజ్ఞానాన్నాంతా ప్రదర్శించాలి. ఈ సందర్భంలో రాజు పట్ల విధేయత ప్రదర్శిస్తూ రాజుకు సంబంధించిన వారిని దండింపకూడదని రహస్యాలను వెల్లడించకూడదనే మొదలైన నియమాలను ఒప్పుకోవాలి. ''(సత్యనారాయణ, నెల్లూరి, కౌటిల్యుని అర్థశాస్త్రం,పుట:61).*

ఈ వివరాలు అన్నీ రాజు దగ్గర ఉండడానికి కావలిసిన అర్హతలను తెలియజేయడంతోపాటు వారి నైపుణ్యాన్ని, సమయస్ఫూర్తిని తెలియజేస్తాయి.

## 4.18. ఆంధ్రమహాభారతంలో మంత్రులు:

ఆంధ్ర మహాభారతంలో కొంత మంది మంత్రులు రాజు చెప్పినట్లే చేసేవారున్నారు. అయితే మంత్రి అనేవాడు రాజుకు మంచి పేరు తేవడం కోసం ప్రయత్నించాలి. రాజు ఒకరి కీడును ఆశించి మంత్రులను నియోగిస్తే రాజుకు తెలియకుండానే అపకీర్తి దావానంలా వ్యాపిస్తుంది.

*దుర్యోధనుడు రహస్యంగా తన మంత్రి అయిన పురోచనుని పిలిపించి ఏకాంత ప్రదేశానికి తీసుకువెళ్ళి అతని కుడి చేయి పట్టుకుని పురోచనునితో ధనధాన్యాలతో తులతూగుతున్న ఈ భూమండలం నాకు సొంతమైనట్లే నీకు సొంతం అవుతుంది. కనుక దీన్ని మనం జాగ్రత్తగా రక్షించుకోవాలి. (సంస్కృత భారతం, ఆదిపర్వం, 143 వ అధ్యాయం).*

ఈ విషయాలు గమనిస్తే దుర్యోధనుని ఆలోచనను తిరస్కారానికి గురికాకూడదని మంత్రికి ముందుగా ధనాశ చూపాడు. తర్వాత పొగడ్త ద్వారా మంత్రిని మెప్పించే ప్రయత్నం చేస్తున్నాడు.

*" నాకు నీ అంత విశ్వాసపాత్రుడు మరొకడు లేడు కనుకనే నీతో ఇంత ముఖ్యమైన విషయాన్ని సంప్రదిస్తున్నాను నీ సహాయాన్ని అర్థిస్తున్నాను. నా రహస్యాన్ని రక్షించు నా శత్రువులను నాశనం చేయి నేను చెప్పిన దానిని నీవు నేర్పుగా సాధించాలి" అంటాడు. (సంస్కృత భారతం, ఆదిపర్వం, 143 వ అధ్యాయం).*

ఈ విషయాలు ముందుగా చేయవలసిన కార్యక్రమం చెప్పకుండా నేను చెప్పేది ఎంతటి రహస్యమైనా సరే దానిని కాపాడు అన్నప్పుడే అది దురాలోచన అనే విషయం తెలిసి పోతుంది.

తర్వాత విషయాన్ని వివరిస్తాడు. పాండవులను చంపే ఉపాయాన్ని తెలిపి దానికి తగ్గట్లు ఏర్పాట్లు చేయిస్తాడు. అది కూడా ఎవరికి అనుమానం రాకుండా లక్కయిల్లు నిర్మించి అది నేతితో తయారు చేయమని, వారణావతంలోని ప్రజలకు అనుమానం రాకుండా దానిని ముట్టడించమని చెప్తాడు.

ఇక్కడ మంత్రి అయిన పురోచనుడు రాజుకు భవిష్యత్తులో జరగబోయే అపకీర్తిని ఊహించలేదు కేవలం దుర్యోధనుడు ఇచ్చే ధనం కోసం ఆశ పడ్డాడు. రాజు చెప్పినట్లే చేసాడు కాని చివరకు అది విఫలమయ్యి అందరూ దుర్యోధనాదులే ఈ పని కి పూనుకుని ఉంటారనే అనుమానం వచ్చేటట్లు చేసింది. పరోక్షంగా నైనా ధృతరాష్ట్ర, దుర్యోధనాదులకు

అపకీర్తినే తెచ్చిపెట్టింది. కాబట్టి మంత్రి అనేవాడు చాలా తెలివైన ఉపాయంతో రాజు యోగక్షేమాలను కాంక్షించాలి.

### 4.19. మంత్రి లక్షణాలు–

ఆంధ్ర మహాభారతంలో మంత్రి కి ఉండవలసిన గుణాలు తిక్కన చాలా సంక్షిప్తంగా చెప్పాడు.

*సీ. జ్ఞాన పరుఁడు పౌర జానపదాప్తుండుఁ / గార్యజ్ఞుఁడును ధైర్య శౌర్య ఘనుఁడు*

*నక్రూరుఁడును విశుద్ధాత్ముండుఁ బతియెడ/ భక్త్యను రాగ సంభ్రమము లెసఁగ*

*సమ సుఖదుఃఖుఁడై చెమరు నెత్తురు గాఁగఁ/ దలఁచుచు నరయక తప్పు మీఁదఁ*

*బెట్టిన నలుకమైఁ దిట్టినఁ గలఁకదా/ నొందక తేర్చుచోఁబొందు సెడక*

*తే. మెలఁగు వాఁడును నిజరంధ్రములకు మాటు/*

*సేయఁ బర రంధ్రములు గని చిక్కువఱుపఁ*

*జాలు నిపుణుండు నైన విశాల బుద్ధి /*

*గావలయు మంత్రి ముఖ్యుండు గౌరవేంద్ర.*

*(ఆంధ్రమహాభారతం,శాంతిపర్వము, ద్వితియాశ్వాసం,369 వ పద్యం).*

జ్ఞాన సంపన్నుడూ పౌర జానపదులకు ఆప్తుదు కార్యవేత్త ధైర్య పరాక్రమాలలో గొప్పవాడు, క్రౌర్యం, లేనివాడు. పరిశుద్ధాత్ముడు రాజు పట్ల భక్తి గౌరవాతిశయాలతో సుఖదుఃఖాలను సమంగా స్వీకరించగల వాడు చెమటను రక్తంగా భావించి తెలియక తనపై దోషారోపణ చేసినా కోపంతో దూషించినా ఏ మాత్రం కలతచెందక అనునయంతో రాజు పొందు చెడకుండా మసలు కొనగలడు తమ దోషాలను కప్పి పుచ్చుతూ శత్రువుల లోపాలను గుర్తించి వాళ్ళను చిక్కుల పాలు చేయగల నైపుణ్యం కలవాడు అయిన విశాల బుద్ధి కలవాడు మంత్రిగా ఉండడానికి అర్హుడు.

ఈ వివరాలను గమనిస్తే మంత్రి శత్రువుల మనోభావాలను అంచనా వేయగల సమర్థుడై ఉండాలి. రాజు కోపగించినా సహనంతో అతని మేలునే కోరుకునే గుణం కలిగిఉండాలని కార్యాన్ని నిర్వహించడంలో ఘనుడై ఉండాలని తెలుస్తుంది.

మహాభారతంలో విదురుడిని గొప్ప మంత్రిగా చెప్పవచ్చు. దుర్యోధనుడు ద్యూత ప్రస్తావన తెచ్చినప్పుడు ధృతరాష్ట్రుడే విదురుని సలహా అడగడానికి ఇష్టపడతాడు. ఆ సమయంలో

*''క. ధీరమతి విదురతోడ వి– చారింతము వాఁడు నయవిశారుదుఁడు కళా*

*పారగుడు దీర్ఘ దర్శి య / పార హితరంభుఁ డుభయపక్షంబులకున్'' (ఆంధ్ర మహాభారతం, సభాపర్వం, ద్వితియాశ్వాసం, 124 వ పద్యం).*

అని ధృతరాష్ట్రుడే విదురుని గురించి చెప్పడంలో అతని మంత్రిత్వ లక్షణాలు స్పష్టంగా గోచరిస్తాయి. విదురుడు మేధావి  నీతి కోవిదుడు దూరదృష్టి కలవాడు కురుపాండవుల క్షేమం కోరేవాడని చెప్తాడు.

విదురుడు రాజనీతితత్పరుడని చెప్తూ ఎస్. వెంకటేశులు తన సిద్ధాంత ''**గ్రంథమైన ఆంధ్ర మహాభారతంలో చిత్రించిన విదురుడు**'' గ్రంథంలో ఈ విధంగా తెలియజేసాడు.''రాజ్యాంగ విషయాలలో ఎటువంటి దుర్భర పరిస్థితి వచ్చినప్పటికి విదురుని ప్రమేయం లేనిదే ఏ నిర్ణయమును కౌరవ సభ యందు జరగడం లేదు రాజ్యాధినేతగా విదురునికి ధృతరాష్ట్రుడు ఒక ఉన్నతమైన స్థానమును ఇచ్చెనని చెప్తాడు.

మంత్రికి ఉండవలసిన మరో లక్షణం ''**తనపై దోషారోపణ చేసినా కోపంతో దూషించినా ఏ మాత్రం కలతచెందక అనునయంతో రాజు పొందు చెడకుండా మసలు కొనగలడు''** ఒకానొక సందర్భంలో విదురుడు దుర్యోధనాదుల ఆగడాలను చెప్తుంటే సహించని ధృతరాష్ట్రుడు విదురుని తిట్టి పంపించేస్తాడు. విదురుడు మౌనంగా వెళిపోతాడు. మరలా ధృతరాష్ట్రుడు సంజయుని పంపి విదురుని పిలుచుకుని రమ్మంటే మరలా వస్తాడు.

ఇలా ప్రభువు విసుక్కున్నా వారిపై మంత్రి అయిన విదురుడు కోపగించక తన కర్తవ్యమును నెరవేర్చాడని తెలుస్తుంది.

## 4.20. మంత్రిమండలి నియామకం:

సంస్కృత భారతంలో మంత్రి మండలిని ఏ విధంగా విభాగం చేయాలో చెప్తారు. విద్యా వంతులను, ప్రజ్ఞావంతులను వేద విద్యను పూర్తి చేసిన శుద్ధ మనస్కులు అయిన నలుగురు బ్రాహ్మణులను, బలవంతులై, ఆయుధ విద్యలలో ఆరి తేరిన ఎనిమిది మంది క్షత్రియులను, ధనవంతులయిన ఇరవై ఒక్క మంది వైశ్యులను, వినయం, పవిత్రత , శ్రద్ధ కల ముగ్గురు శూద్రులను, మంత్రులుగా నియమించుకోవాలి. శుశ్రూష, శ్రవణం, గ్రహణం, ధారణం, ఊహ, అపోహ, విజ్ఞానం, తత్త్వ జ్ఞానం అనే ఎనిమిది గుణాలు కలిగిన సూతుని పౌరాణికునిగా నియమించుకోవాలి. అతని లక్షణాలు ఇలా ఉండాలి. యాభై ఏళ్ళ వయసు ఉండాలి. చురుకుదనం, అసూయ లేకపోవడం, వేదాలు ధర్మ శాస్త్రాలు చదివి గుర్తులో ఉన్నవాడు వినయం సమదృష్టి కలవాడు వివాదాలను పరిష్కరింపగలవాడు సప్తవ్యసనాలు లేని వాడు అయి ఉండాలి పౌరాణికుడు. రాజు మంత్రాలోచనను ఎనిమిది మంది దగ్గర మాత్రమే చర్చించాలి. నలుగురు బ్రాహ్మణులు, ముగ్గురు శూద్రులు, ఒక సూతుడు మొత్తం ఈ ఎనిమిది మంది మంత్రుల దగ్గర మాత్రమే రాజ రహస్యాలు చర్చించాలి.

ఇటువంటి విషయాలు ఇందులో చర్చించబడ్డాయి, రాజు పరిపాలన సంబంధమైన వ్యవహారం ఎంత రహస్యంగా కఠిన నియమాలతో ఉండి మంత్రాంగం జరపాలో అర్థమవుతుంది. ఇలా నియమాలను అనుసరించి చేసిన నిర్ణయం ఎంతో ప్రామాణికంగా ప్రజలకు సంతోషాన్ని కలిగించే విధంగా ఉంటుంది. మంత్రాలోచనం చేసేటప్పుడు బ్రాహ్మణులకు, వైశ్యులకే కాకుండా శూద్రులకు కూడా అవకాశాన్ని ఇవ్వడం మనం గమనించాలి. దీనిని బట్టి ఏ కులం వారైనప్పటికి ప్రజాక్షేమాన్ని కాంక్షించే రాజుకు సహాయపడడానికి రాజ వ్యవహారాలలో సహాయం, సలహాలు ఇవ్వడానికి మినహాయింపు

కారు. వారి గుణం పవిత్రం, ధర్మం మీద ఆసక్తి, ఇంద్రియ నిగ్రహం చురుకుగా తెలివిగా సమస్యలు పరిష్కరించే నేర్పరితనం ఉన్నవారు ఏ కులం వారైనా సరే రాజుకు రాజ రహస్యాలను చర్చించడంలో అర్హులే అనే విషయం పై విషయాలను బట్టి అర్థమవుతుంది.

## 4.21. మంత్రం:.

రాజు మంత్రులతో నిత్యం మంత్రం గురించి చర్చిస్తాడు. ఇక్కడ మంత్రం అంటే ఆలోచన రాజ్య వ్యవహారాలు అన్నింటిని చర్చించిన తరువాతనే నిర్ణయం తీసుకోవాలి. అయితే ఈ మంత్రం వినడానికి మంత్రులకు కొన్ని అర్హతలు ఉండాలి ఎవరు వినకూడదు అనే దానికి సంస్కృత భారతంలో ఈ విధంగా చెప్తారు.

రాజు మీద అనురాగం ఉన్నా ఇతర సద్గుణాలు ఎన్ని ఉన్నా జ్ఞాన యుక్తుడయిన ఋజు ప్రవర్తన లేకపోతే అట్టివాడు రాజు యొక్క రహస్యం వినదగడు. శత్రువులతో చేతులు కలిపి పురజనులను గౌరవించని వాడు శత్రువనియే భావించాలి. వాడు రాజ రహస్యం వినదగడు. పండితుడు కాని వాడు, మనశ్శుద్ధిలేని వాడు జడుడు శత్రువులను సేవించేవాడు ఆత్మస్తుతి చేసుకునేవాడు స్నేహితుడు కానివాడు. కోపం కలవాడు లోభి వీరెవరూ మంత్రాన్ని వినదగరు. అనురాగం కలిగి ఉన్నా బహు శత్రువయినా సత్కారాలు పొందినా ప్రత్యేకతలు కలిగినా కొత్తగా వచ్చిన వారు మంత్రాన్ని వినదగడు. చిన్న అపరాధం వలన రాజుచేత ఒకడు ధనమంతా కోల్పోయాడు మళ్ళీ మంచిగుణాలతో ఉంటున్నాడు. వాడు మంత్రం వినదగడు. చాలా కాలం దండధారణం చెయ్యాలనుకున్నవాడు, లోకమంతటిని తన మృదుశక్తితోవశం చేసుకునే వాని కోసం మంత్రాన్ని ప్రయోగింపచెయ్యాలి. సర్వప్రకృతులను తెలిసినవారిని మహత్త్వాన్ని పొందగోరే వారిని ముగ్గురికి తగ్గకుండా మంత్రులుగా నియమించుకోవాలి. తమ ప్రధాన ఉద్యోలలోను శత్రువుల ప్రధానోద్యోగులలోను దోషాలను వారు పసిగట్టుతూ ఉండాలి. మంత్రుల మంత్రమే మూలం రాజు రాజ్యానికి ఆ రాష్ట్రం ఎప్పుడూ వర్ధిల్లుతుంది. (**సంస్కృ భారతం, శాంతి పర్వం, 83 వ అధ్యాయం,** ).

రాజు రహస్యాలు చర్చించేటప్పుడు కొన్ని సూచనలను ఆచరించాలి వాటిలో తెలివైన మంత్రులు రాజ్యం యొక్క మంత్రాన్ని రహస్యంగా ఉంచాలి. రాజుకు మంత్రమే రక్షణ కవచం. మిగిలిన ప్రజలంతా మంత్రానికి అంగాలు. ప్రజలను ఆకట్టుకోవడంలో మంత్రమే సమర్థమయినది ఆ మంత్రాన్ని రక్షించుకోవాలని చెప్తూ

*“మంత్రాలోచన చేసే చోట మరుగుజ్జులు, గూని వారు, బక్కచిక్కిన వారు, కుంటి, గ్రుడ్డి వారు, జడులు, స్త్రీలు, నపుంసకులు, పశు పక్ష్యాదులు ముందు గాని, వెనుక గాని, పైని గాని ఏ విధంగానే సంచరించరాదు. ఒక ఎత్తయిన భవనం ఎక్కి గాని, దర్భ పొదలు, రెల్లు పొదలు లేని శూన్య ప్రదేశంలో కాని దూరంగా మాత్రమే కనపడే చోట మంత్రాలోచన చెయ్యాలి. ఆ ఆలోచనలో దోషాలు ఉండకూడదు. వాగ్దోషాలు అవయవాల కదలికలలో దోషాలు ఉండకూడదు తగినంత సమయంలో పూర్తి చేయాలి.( సంస్కృత భారతం, శాంతి పర్వం, ఎనభై మూడవ అధ్యాయం).*

ఈ వివరాలన్ని ఒక మంత్రిని నియమించేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు మంత్రే సక్రమంగా లేకపోతే రాజ్యవ్యవస్థ గాడి తప్పుతుంది. కాబట్టి మంత్రి నియామకం చాలా ప్రధానమైనది. అంతే కాకుండా రాజ రహస్యాలు ఎక్కడ చర్చించాలి, ఎవరి దగ్గర చర్చించకూడదు వంటి విషయాలలోని అంతరార్థాన్ని తెలుసుకునట్లయితే రాజ్యపరిపాలన అభివృద్ధి చెందుతుంది.

## 4.22. **జనపదం**:

ప్రజా సమూహం నివసించడానికి యోగ్యమైన ప్రదేశం గ్రామం, లేదా దేశం, లేదా రాష్ట్రం గా చెప్పవచ్చు. రాజు తన పరిధిలో తన దేశంలో ఉన్న ప్రజలను తను నిర్ణయించుకున్న నియమాల ప్రకారం అమలు చేస్తూ ప్రజా సంరక్షణగావిస్తాడు.

*“మహారాజునకు సంబంధించిన జనపదము లెప్పుడును సమృద్ధములై యుండవలెను. మంత్రులు సంతుష్టులై యుండవలెను. ప్రజలు రాజునందు ప్రీతిగలవారై యుండవలెను. ఇట్టి రాజుయొక్క రాజ్యమే ధృడమూలము. పౌర జానపదు లెప్పుడును, శ్రీమంతులై*

ధనధాన్య సమృద్ధి గలిగి ప్రాణి మాత్రములందు దయగలవారై మెలగ వలెను. ఇట్టి పౌర జానపదులు గల రాజు రాజ్యము సుస్థిరము.

నాటి పౌర జానపదులకు రాజు పైనను, రాజరికము పైనను, గొప్ప యధికారములు ఉండెడివి. క్లుప్తముగ వివరించినచో పౌర జానపదుల యధికాలములు ఇట్లుండును.

1. ఒక రాజు వెనుక ఆ రాజ్యమునకు వారసుడెవ్వరో వారు నిర్ణయింతురు.

2. వారసుడు సమర్థుడు గాక పోయినచో వానిని దొలగించి వేఱొక వానిని నియమింతురు.

3. రాజు సమర్థుడైనచో వానిని పదచ్యుతునొనర్తురు.

4. ధర్మశాస్త్రము చేత నిర్ణయింపబడిన పన్నుకంటెను అధికముగ గైకొనుటకు రాజునకు హక్కులేదు. అట్లు గైకొన వలసి వచ్చినప్పుడు పౌర జానపదుల సమ్మతి నాతడు బొందవలెను.

5. ప్రధాన మంత్రిని నియమించుటలో పౌర జానపదుల యొప్పుదల గావలెను.

6. తమ కధికారి యెవ్వరు గావలెనో పౌర జానపదులే నిర్ణయించుకొనుచుండిరి. తమ కయిష్టుడైన యధికారిని తీసి వేయించుటకు గూడ వారికి క్రమప్రాప్తమైన యధికారము గలదు.

7. రాజ్య పరిపాలన మంతయు వీరి సమ్మతిపైననే సాగవలెను. కనుక అష్టప్రధానులతో యోచించి నిర్ధరింప బడిన రాజ నిర్ణయము, వీరికిని వీరి ప్రతినిధులకును, యెఱుక పఱుపబడవలెను. వీరి సమ్మతిలేనిది అది అమలులో వచ్చుటకు వీలులేదు. (నారాయణా చార్యులు, పుట్టపర్తి, మహాభారత విమర్శనము, (ప్ర.భా), పుట:79,80).

పై వివరాలను పరిశీలిస్తే అప్పటి ప్రజలు తమకు ఏ రాజు పరిపాలనలో నివసిస్తే సుభిక్షంగా ఉంటామో నిర్ణయించే అధికారం ఉన్నట్లు తెలుస్తుంది. అలాగే పరిపాలన సరిగ్గా జరగకపోతే వారు రాజును నిందించే అధికారాన్ని కూడా కలిగి ఉంటారు.

పాండవులు అజ్ఞాత వాస సమయంలో ఏ ప్రదేశంలో తమ నియమాన్ని అమలుచేయాలో నిర్ణయించుకునే సందర్భంలో అర్జునుడు కొన్ని సుసంపన్న మైన ప్రదేశాలను ధర్మరాజుకు వివరిస్తాడు.

*'' కురు రాష్ట్రానికి చుట్టూరా రమ్యమైన జనపదాలు ఉన్నాయి. అవి సుసంపన్నంగా కలవు అవి పాంచాల, చేది, మత్స్య, శూరసేన, వటచ్చర, దశార్ణ, నవరాష్ట్ర, మల్ల, శాల్వ, యుగంధర, విశాల, కుంతి రాష్ట్ర, సౌరాష్ట్ర ,అవంతి రాష్ట్రాలు. పేర్లు తెలియజేస్తాడు, ధర్మరాజు వీటిఅన్నింటికంటే మనం నివసించే ప్రదేశం సుఖప్రదమైనది, శుభంకరమైనది కావాలి దానికి మత్స్యదేశం అనువైనది విరాటురాజు కొలువు మన అజ్ఞాత వాసానికి సౌకర్యవంతమైనదని విరాటరాజు యెక్క గొప్పతనాన్ని కూడా వివరించి నిర్ణయం తీసుకుంటారు.**(సంస్కృత భారతం, విరాట పర్వం, 1 అధ్యాయం,12,13, 16,17శ్లోకాలు).***

ఈ వివరాలు జనపదం గురించిన వివరాలను తెలియజేస్తాయి.

### 4.23. **రాష్ట్రం**:

'' ప్రదేశం లేక రాజ్య విస్తీర్ణాన్ని రాష్ట్రమంటారు. భూభాగం అందలి ప్రజలు కలిసి రాజ్యానికి భౌతిక ప్రాతిపదికలౌతారు. ఇవి రాజ్యం యొక్క అస్తిత్వానికి, అభివృద్ధికి విస్తారంగా ప్రభావితం చేసే నిర్దుష్టమైన అంశాలు.

*''ఋగ్వేదంలో రాష్ట్రమనే పదం కనబడుతున్నది 'రాష్ట్రోరాజన్య'*

*జాంగలం సస్య సంపన్న మార్యప్రాయ మనావిలమ్*

*రమ్య మానత సామంతం స్వాజీవ్యం దేశమావసేత్ '*

*సారవంతమైనది, నీటి వసతి కలది, పుష్కలంగా గడ్డి కలది, మంచిగాని ఎండ గలది, ధన ధాన్య సంపన్నమైనది ఉపద్రవాలు లేనిది, పుష్పఫల తరులతాదులచే మనోహరమైనది కృషి వాణిజ్యాది జీవనోపాయం గల దేశాన్ని రాజు ఆశ్రయించాలని మనుస్మృతిలో చెప్పబడింది.(అనంతరామ శాస్త్రి,నేతి, కవిత్రయ భారతం రాజనీతి, పుట:38, 39.)*

ఈ వివరాలను పరిశీలిస్తే రాష్ట్ర అభివృద్ధి జన సమూహంతో నే కాదు ఆ ప్రదేశాన్ని నిర్ణయించుకోవడంలో కూడా రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని అర్థమవుతుంది. నివాస యోగ్యమైన ప్రదేశాన్ని కోరుతున్నప్పుడు ఆ ప్రదేశం యొక్క బాగును గురించి కూడా ఆలోచించాలి. నేల పంటలు పండడానికి అనుకూలమైనది కానప్పుడు ప్రజలు ఆహారాన్ని సేకరించడానికి కష్టాలు ఎదుర్కొవలసి వస్తుంది. తగినంత నీరు ఆ నేల ఇవ్వలేనప్పుడు రాష్ట్రం మొత్తం బాధ పడవలసి వస్తుంది. చెట్లతో, పూలతో నిండిన ప్రదేశం ఆహ్లాదం తో పాటు రాష్ట్రం సుఖంగా జీవించడానికి తగిన వనరులను అందిస్తుంది.

*"యాజ్ఞ వల్క్య స్మృతి విష్ణు ధర్మ సూత్రాలు కూడా సర్వ సమృద్ధమైన ప్రదేశాన్నే రాజు ఆశ్రయించాలని చెప్పబడింది. ప్రదేశం సప్తాంగాలో అతి ముఖ్యమైనదని అగ్ని పురాణం చెప్తున్నది. ప్రదేశం లేకపోతే రాజేలేడు. కాబట్టి రాష్ట్రం ప్రధానమైనది. అడవులు, ఎడారులు వర్షాధార భూములు, పాములు అధికంగా గల భూములు రాష్ట్ర శబ్దానికి అనర్హాలు,( అనంతరామ శాస్త్రి, నేతి, కవిత్రయ భారతం, రాజనీతి, పుట: 39.).*

*భారతంలో ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో నా కొడుకులు మాట వినేవారు కాదు వారి వలన ఎటువంటి ప్రమాదం రాకుండా ఉండడానికి అర్ధరాజ్యం గా ఖాండవప్రస్థం ను మీరు ఆశ్రయించాలని చెప్పి రాజ్యపట్టాభిషేకం చేయిస్తాడు. పట్టాభిషేకం ముగిసిన తరువాత ధృతరాష్ట్రుడు నీవు పూర్వీకుల రాజ్యాన్ని పొందగలిగావు. ఆ ఖాండవప్రస్థం పౌరవుల రాజధాని బుధపుత్రుని కారణంగా ఋషులు నాశనం చేసారు నీవు మరలా ఖాండవ ప్రస్థాన్ని వృద్ధి చేయాలి బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు, ఇతరులు నీమీద భక్తితో నిన్ను అనుసరించడానికి సిద్ధంగా ఉన్నారు. ఆ నగరం ధన ధాన్య సమృద్ధి కలది నీ తమ్ములతో కలిసి వెంటనే బయలుదేరు అనగానే ధర్మరాజు నమస్కరించి భయంకర వనమైన ఖాండవప్రస్థానికి చేరారు. తర్వాత శ్రీకృష్ణుడి అనుగ్రహంతో ఇంద్రుడు విశ్వకర్మను నియమించి సుందరమైన ఇంద్రప్రస్థం పేరు మీదుగా ఆ నగరాన్ని అభివృద్ధి చేసారు." ( సంస్కృత భారతం, ఆది పర్వం, 206 వ అధ్యాయం, ).*

ఈ విషయాలను పరిశీలిస్తే న్యాయం ప్రకారం ధ్వంసమైన ప్రదేశాన్ని ధృతరాష్ట్రుడు ఇవ్వకూడదు, ధర్మరాజు స్వీకరించ కూడదు కాని మహాభారతంలో ఇది విభిన్నంగా జరిగింది సహన శీలురైన ధర్మరాజు ధృతరాష్ట్రుడు ఇచ్చిన అభివృద్ధి కానటువంటి నగరాన్ని స్వీకరించి తర్వాత జనులు నివాస యోగ్యమైన నగరంగా తీర్చుదిద్దుతారు. ఆంధ్రమహాభారతంలో ఖాండవ ప్రస్థం ను అంతకు ముందు పౌరవుల రాజధాని అని బుధ పుత్రుని కారణంగా నాశనమైందని అనే విషయాలు ప్రస్తావించబడలేదు.

## 4.24. రాష్ట్ర ప్రజలు కర్తవ్యం:

రాష్ట్ర ప్రజల యొక్క ముఖ్య కర్తవ్యాలు కూడా తెలుసుకోవలసిన అవసరం ఉంది రాజుకు రాష్ట్రం యొక్క ప్రజలకు సమన్వయం చాలా అవసరం. *"రాష్ట్రం యొక్క ముఖ్య కర్తవ్యం రాజును అభిషేకించడమే పాలకుడు లేకపోతే దుర్బలమైన రాజ్యాన్ని దొంగలు కొల్లగొడతారు. రాజులేని రాష్ట్రాల్లో ధర్మం నిలువదు. ప్రజలు పరస్పరం తినేస్తారు. ఇంద్రుడినే రాజుగా వరించు నని వేదం అందుచేత శుభం కోరేవారు ఇంద్రుని వలె రాజును పూజించాలి. అరాజకాలైన రాష్ట్రాలను రాజ్యకాంక్షతో బలియుడెవడైనా ఆక్రమించాలని వస్తే ఆ రాజును రాష్ట్ర ప్రజలు ఎదురేగి సత్కరించాలి. ఆ సమయంలో ఎందుచేతనంటే అరాజకం కంటే మించిన పాపం మరొకటి లేదు. ఆ బలీయుడు చక్కగా పాలిస్తే రాజ్యమంతా నిశ్శేషమయిపోతుంది ఏమి మిగులదు." (సంస్కృత భారతం, శాంతి పర్వం, అరవై ఏడవ అధ్యాయం, ).*

ఈ విషయాలను పరిశీలిస్తే రాజు పరిపాలించడం ఒక ఎత్తైతే ప్రజలు రాజుకు సహకరించడం మరొక ఎత్తు ప్రజలు రాజు ఆజ్ఞను పాటించి సుఖంగా భయం లేకుండా జీవించాలి. రాజు ప్రజల అవసరాలను తెలుసుకుని పాలన కొనసాగించాలి. అవసరమైతే అరాచకత్వంతో రాష్ట్రం దుస్థితి పాలు అయ్యేసమయంలో ఎవరైనా బలవంతుడు ఆ రాజ్యాన్ని ఆక్రమించడానికి వస్తే వారికి ఆ రాష్ట్ర ప్రజలు సత్కరించాలని చెప్తాడు.

ఎందుకంటే బలవంతుడైన వాడికే అధికారం ఉండాలి ఆ బలం భుజ బలం, కావచ్చు, ధన బలం, శౌర్య బలం కావచ్చు రాజ్యాన్ని పరిపాలించగల ధీరత్వం అతనిలో ఉండాలి అలాంటి రాజునే ప్రజలు కోరుకోవాలని పై మాటల వలన తెలుస్తుంది.

## 4.25. పురజనులు:

రాజు పరిపాలన ఎలా ఉందో ప్రధానంగా తెలియజేసేది ఆ రాజ్య పురజనులు వారి మనోభిప్రాయాలు తెలుసుకుని నడవడం రాజు ధర్మం. పాండవులు ఏకచక్రపురంలో ఉన్నప్పుడు అక్కడి ప్రజలు రాక్షసునిచే బాధించబడుతున్నారు. దానికి శాశ్వతమైన పరిష్కారం రాజు చూపలేదు అక్కడి ప్రజలకు రాజు పై చులకన భావం ఏర్పడుతుంది.

*“పాండవులు ఏక చక్రపురం వెళ్ళి నివాసం ఉంటున్నారు అక్కడ బకుడనే రాక్షసునితో ప్రజలు  చేసిన ఒప్పందం ప్రకారం రోజుకు ఒక మనిషి బండెడు అన్నము, రెండు దున్నపోతులు, ఆహారంగా నిర్ణయించబడుతారు. పాండవులు ఆశ్రయం పొందిన వారి ఇంటిలో ఒకరు ఆ రాక్షసుని దగ్గరకు వెళ్ళే వంతు వచ్చింది. ఆ ఇంటి వారి ఆర్తనాదాలు విన్న కుంతి వారి పరిస్థితికి గల కారణం తెలియజేయమంటుంది. ఆ బ్రాహ్మణుడు యమునా నది తీరంలో ఒక గుహలో నివసిస్తున్న బకాసురుని గురించి చెప్తాడు. అతనే ఈ దేశాన్ని, నగరాన్ని కూడా ఆ రాక్షస రాజే తన రాక్షస బలంతో రక్షిస్తుంటాడు. ఆ కారణంగా శత్రువుల నుండి కాని ఇతర ప్రాణుల నుండి కాని మాకు భయం లేదని చెప్తాడు అంతేకాకుండా ఇటువంటి ఆహారాన్ని చాలా సంవత్సరాల తర్వాత ఒకసారి వచ్చినప్పటికి మానవులకు అది ఆచరించడానికి కష్టం ఉండేదని చెప్తూ ఈ దేశానికి రాజు వేత్రకీయగృహమనే ప్రదేశంలో నివసిస్తుంటాడు. మంద బుద్ధి గల రాజు ఏదో ఒక నీతినో ఉపాయాన్నో ఆలోచించి గట్టి ప్రయత్నం చేయడం లేదు. అలాచేసి ఉంటే ఈ నగరంలోని జనులందరికి ఈ బకుని పీడ శాశ్వతంగా వదిలిపోయి ఉండేది. మాకు ఈ గతికి తగిన వారమే ఎందుకంటే చెడ్డ రాజును ఆశ్రయించాము. దుర్బలుడైన రాజు కల దేశంలో శాశ్వతంగా నివసిస్తున్నాము. ముందుగా మంచి రాజును పొందాలి. తర్వాత*

*భార్యను పిదప ధనాన్ని సంపాదించుకోవాలి. ఈ మూడు సంపాదించుకున్న పిదప బంధువులను, పుత్రులను ఉద్ధరించే ప్రయత్నం చేయాలి. నేను మూడింటిని సాధించాను కాని అవన్నీ తారు మారుగా చేసాను ఆ కారణంగానే మేము ఆపదను పొంది అందరం దుఃఖిస్తున్నామని చెప్తాడు. (సంస్కృత భారతం, ఆదిపర్వం, 159 వ అధ్యాయం).*

ఈ విషయాలను పరిశీలిస్తే ఒక మంచి రాజు లేకపోవడం చేత ఆ రాజ్యం రాక్షసుల వశమైనదని అర్థమవుతుంది. అంతే కాకుండ రాజు అసమర్థత వలన రాక్షసులను నివారించే ప్రయత్నం చేయకపోవడం వలన ప్రజల్లో రాజు పై అసహనాన్ని వ్యక్తం చేసారని అర్థమవుతుంది. అటువంటి రాజు వలన ఎటువంటి ప్రయోజనం ఉండక పోగా ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కుంటారు.

అలాగే రాజు మంచి పరిపాలకుడు అయితే రాజు అడవులకు వెళ్ళినా వారి వెంట రావడానికే ఇష్టపడుతారు.

''పురజనులు రాజు గుణగణాలను స్తుతించే సందర్భాన్ని భారతంలో పరిశీలించవచ్చు.

*''పురజనులు పాండవుల గుణ సంపదను చూసి సభల్లో సమావేశాల్లో వారి గుణగణాలను ప్రస్తుతించడం ప్రారంభించారు. వారు వీధుల్లో కూడా పాండుపుత్రుల్లో పెద్దవాడైన ధర్మరాజుకు రాజ్యాన్ని అప్పగించే కాలం దగ్గర ఉందని ధృతరాష్ట్ర మహారాజు కన్నులు లేని కారణంగా పూర్వం రాజ్యాధికారాన్ని పొందలేక పోయాడు ప్రజ్ఞయే కన్నులు గా కల అతడు ఇప్పుడు మాత్రం రాజు ఎలా అవుతాడు? సత్య సంధుడు గొప్ప వ్రతనిష్ఠకలిగిన భీష్ముడు రాజ్యాన్ని తిరస్కరించాడు. అతడెప్పటికి రాజ్యాన్ని తిరిగి స్వీకరించడు. పాండు పుత్రులలో జ్యేష్ఠుడు ధర్మరాజు యువకుడైనా పెద్దరికం కలవాడు సత్యము, దయ, కలవాడు వేదవేత్త ఇపుడతనికి రాజ్యాభిషేకం చేద్దాము అతడు సకల ధర్మవేత్త భీష్ముని, ధృతరాష్ట్రుని పూజిస్తూ వారికి సకల భోగాల్ని సమకూరుస్తాడు. పురజనులు అన్ని ఈ మాటలను విన్న దుర్యోధనుడు ఓర్వలేకపోతాడు.''( సంస్కృతభారతం, ఆదిపర్వం, 140 వ అధ్యాయం).*

ఈ వివరాలను గమనిస్తే పురజనులు ఎవరిని రాజు గా నియమించాలో వారి ప్రవర్తనను అనుసరించి నిర్ణయానికి వస్తారని అర్థమవుతుంది. రాజ్యం వంశపారం పర్యంగా వచ్చినప్పటికి ఎవరు ధర్మాత్ముడో వారినే ప్రజలు ఎన్నుకునే వారని ఈ మాటల వలన వ్యక్తమవుతుంది.

అయితే ఒక రాజు ప్రజల మన్ననలు ఓర్వలేని వారు ప్రజలను తమ వైపుకు తిప్పుకునే ప్రయత్నాలు రహస్యంగా జరిగేవని దుర్యోధనుని మాటల వలన తెలుస్తుంది. *దుర్యోధనుడు ధృతరాష్ట్రునితో ఈ విధంగా అంటాడు. ఈ రాజ్యం మొదటి నుండి నీది ఒకవేళ స్వామి అమాత్య సుహృత్కోశాదులకు సంబంధించిన వాళ్ళు. విధేయులు కాకున్నా అప్రయత్నంగా రాజ్యం క్రమపద్ధతిలో మా చేతికందుతుంది. ఇది వరకుపాండు రాజు రాజై తన గుణ గణాల చేత ప్రజానురాగం పొందిన కారణంగా ధర్మరాజును రాజ్యాన్ని కోరుకుంటున్నారు. దానిని నేను గ్రహించి ప్రతిదినం దానాలు, సమ్మానాలచేత ప్రకృతి జనులను సంతోషపరుస్తున్నాము. కాబట్టి పాండవులను, కుంతి దేవిని అమాత్యులతో వారణావతం పంపుతాము మనకు రాజ్యాధికారం స్థిరపడిన తర్వాత వాళ్ళిక్కడికి వస్తారు. ( ఆంధ్ర మహాభారతం, ఆది పర్వం, షష్ఠాశ్వాసం, 129వ పద్యం).*

ధృతరాష్ట్రుడు పాండవులను వారణావతానికి పంపుతున్నప్పుడు అక్కడ ఉన్నటువంటి పౌరులు ఈ విధంగా అంటాడు.

*“ సీ. ఇప్పాండు పుత్త్రుల నేలకూ ధృతరాష్ట్రుఁ – డేకత మనుపంగ నిచ్చగించె*
*నిది యధర్మం బని యెఱిఁగి గాంగేయాదు – లేల వారింపరో యెఱుఁగరొక్కొ*
*పితృపితామహులచే భృత పూర్వమై క్రమా –గత మైన రాజ్యంబుఁ గరము నెమ్మిఁ*
*బాండు సుతజ్యేష్ఠు భరత కుల శ్రేష్ఠు – ధర్మజుఁ(జూన్పక ధర్ము వుడిపి*
*ఆ. యేల వృద్ధ రాజు లెడసేసిరో, పార్థు – డరుకు నెడక మనము నరికి యతని*
*యున్న చోన ప్రీతి నుండుద మిందుండ నేల?– యనుచు బోరులెల్లఁదెరలి. ( ఆంధ్ర మహాభారతం, ఆది పర్వం, షష్ఠాశ్వాసము, 143 వ పద్యం.).*

ఈ పద్యంలో ప్రజలు ధృతరాష్ట్రుడు ఎందువలనో పాండవులను హస్తిన నుండి పంపేయాలనుకుంటున్నాడు ఇది అధర్మమని తెలిసినా పాండవులు అడ్డగించడం లేదు, వంశపారం పర్యంగా వచ్చిన రాజ్యాన్ని ధర్మరాజుకు ఇవ్వకుండా ఎందుకు చేయాలని చూస్తున్నారో తెలియదు కాని ధర్మరాజు వెళ్లే చోటుకే మనం కూడా వెళ్లుదాము, అతడున్న చోటనే మనం కూడా ప్రీతితో ఉందాం ఈ హస్తినలో ఉండడం ఎందుకని పౌరులంతా బయలుదేరుతారు. దానికి ధర్మరాజు వారిని ఓదార్చి వెనుకకు పంపుతాడు.

ఇలా ప్రజలు రాజు యొక్క గొప్పతనాన్ని సమర్థించగలరు, అవసరమైతే నిరసనను తెలుపగలరని అర్థమవుతుంది. రాజు ప్రజల కష్ట సుఖాలను అడిగి తెలుసుకోవడం, తప్పు చేసిన వారిని దండించడం ప్రజల సమస్యలను పరిష్కరించడం వంటి ద్వారా ప్రజలు ఏ రాజ్యంలో మనం జీవించగలుగుతామో నిర్ణయించుకుని నివసించేవారని తెలుస్తుంది.

పురజనులు రాజు ఏదైనా యుద్ధంలో పాల్గొన్నప్పుడు రాజుకు సహకరించడానికి వెనుకాడరు అనే దానికి *ఉదాహరణగా కౌరవులు, పాండవులు ద్రుపదుని పట్టి తీసుకురావడానికి వెళ్ళినప్పుడు అక్కడున్న కాంపిల్య నగరంలోని ప్రజలు కౌరవులపై విజృంభించి సింహనాదాలు చేసి, కత్తులు, రోకళ్ళు, కర్రలు చేతపట్టి కౌరవసేనలోని మేటి వీరులందరు బడలిక పొందేటట్లు యుద్ధం చేసారు. ( ఆంధ్ర మహా భారతం, ఆది పర్వం, షష్ఠాశ్వాసము, పద్యం, 72)* సంస్కృత భారతంలో కూడా ఇదే విషయాన్ని చెప్తూ నగరంలోని పౌరులు ఆబాలవృద్ధంగా కౌరవులను ఎదిరించారని ఉంటుంది.

ఈ వివరాలు పౌరులు రాజుకు ఏ విధంగా సహాయకులుగా ఉంటారో తెలియజేస్తుంది.

*'' జీవ కోటిలో ఎల్లప్పుడును పరస్పర సంఘర్షణము కలదు. ఏది బలవత్తరమైనదో అదే సృష్టిలో నిలుచునని జీవ శాస్త్రము నందు ఒక సిద్ధాంతం కలదు. '' (గోదావరి బాయి, సంధ్యావందనం, భారతము రాజనీతి విశేషాలు, పుట: 10).*

బలవంతుడే నిత్యం గెలవగలడనే సిద్ధాంతం ద్వారా ప్రజల్లో రాజకీయంలోకి అడుగు పెట్టాలనే కుతూహలం కూడా ఉంటుంది. అలా రాజకీయ బలం కలిగిన వ్యక్తి తన

ఉనికిని నిలుపుకోవడానికి రాజ్యాన్ని విస్తరింపచేసుకోవడానికి అనేక ప్రయత్నాలు చేస్తారని ఈ విషయాలు స్పష్టం చేస్తున్నాయి.

కీచకుడు మరణించిన తర్వాత అక్కడి ప్రజలు కీచకుడు మహాపరాక్రమవంతుడు, రాజు కు ఇష్టమైన వాడు కాని అతనిది దుర్బుద్ధి వాడు పరస్త్రీలను బలాత్కారం చేసే పాపాత్ముడు , దుష్టుడు కాబట్టి గంధర్వులు అతనిని సంహరించారని మాట్లాడుకుంటారు. ప్రజలు రాజు యొక్క మంచి చెడులను గమనిస్తారని ఈ సన్నివేశాలను బట్టి తెలుస్తుంది.

## 4.26. **కోశం:**

కోశాగారం లేదా భాండాగారం వీటి వలనే రాజు దేశాభి వృద్ధి గావిస్తాడు. అటువంటి ఈ కోశాగారానికి రాజు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ధనం మూలానా అందరూ సుఖమయ జీవనాన్ని గడుపుతున్నారు. కాబట్టి ధనాన్ని ఆర్జించే నేపథ్యంలో రాజును మోసగించే వారు కూడా లేకపోలేదు. కోశాగార విషయాన్ని రాజే స్వయంగా చూసుకోవడం మంచిది అది కుదరని పక్షంగా కోశాధికారానికి ఒకరిని నియమించి అతనిని ఎల్లవేళలా రాజు పర్యవేక్షణలో ఉండడం మంచిదని నా అభిప్రాయం.

*క. ‘‘విను కర్షకులును వణిజులు / ననఘా గోరక్షకులు ధరాధీశునకున్*

*ధన మొదఁ గూడెదు చోటుల / ననేక విధములకు నెల్ల నాద్యస్థలముల్*

*రాజుకు ధనం సమకూర్చుకోవడంలో కృషీవలురు, వర్తకులు , గోపాలకులు ముఖ్యమైన ఆధారాలు. ( ఆంధ్ర మహాభారతం, శాంతిపర్వం, ద్వితియాశ్వాసం, 391 వ పద్యం).*

ఈ విషయాలను పరిశీలిస్తే కోశాగార అభివృద్ధికి ప్రధానమైన వారి గురించి తెలియజేస్తున్నారు. వారిలో ప్రథమ స్థానం కృషీ వలురకు ఇచ్చారు అంటే ప్రతి వ్యక్తి ప్రాణాలు నిలబడడానికి ఆధారమైన ఆహారాన్ని పండించే వ్యవసాయదారులు వారు పండించిన ధాన్యాలు, వరి , మున్నగు ధాన్యాలు అన్నీ పండించే వ్యవసాయదారుని వలన రాజు రాజ్యం అభివృద్ధి చెందుతుంది, అలాగే వ్యాపారం నిత్య అవసరాలను తీర్చే

వ్యాపారస్తులు, పశు పోషణ , గోవుల రక్షణా బాధ్యతలు స్వీకరించే గోపాలకుల ద్వారా కోశాగారం అభివృద్ధి చెందుతుందని పై విషయాలను బట్టి తెలుస్తుంది.

*"సమాహర్త కోశాన్ని సంగ్రహిస్తాడు. వివిధ ముఖాల నుండి రాజుకు రావలసిన ఆదాయాన్ని వసూలు చేయడం దాన్ని వృద్ధి చేయడం వ్యయాన్ని తగ్గించడం విపర్యయాన్ని నివారించడం మొదలైనవి వారి కర్తవ్యాలు, యుద్ధం దుర్భిక్షం మొదలైన ఉపద్రవాల వల్ల కోశానికి నష్టం వస్తే సమాహర్త స్వబుద్ధిని ఉపయోగించి ఏదో ఒక మిషతో యాచన చేసి మోసానికి దిగి బెదిరించి ప్రజలనుండి ధనాన్ని రాబట్టాలి కోశాన్ని నింపడానికి పన్ను లోక ప్రధాన సాధనం. కాని కోశాన్ని అంతా పన్నుల మూలకంగా నింపడానికి ప్రయత్నిస్తే ప్రజలపై వారు భరించలేనంతటి భారం పడుతుంది. అందువల్ల కోశ సంగ్రహానికి సాధనాంతరాల్ని అన్వేషించాలి." (అనంత రామ శాస్త్రి, నేతి, కవిత్రయ భారతం, పుట: 40).*

కోశాగార అభివృద్ధికి పై విధానాలను అమలు పరచవలసిన అవసరం ఎంతైనా ఉంది. ధనార్జనలో భాగంగా ప్రజలు నుండి పన్ను వసూలు చేయాలని ఆ పన్ను కూడా బలవంతంగా కాకుండా ప్రజావసరాలను దృష్టిలో ఉంచుకుని చేయాలని దాని వలన కోశాగారానికి నష్టం కలగకుండా ప్రజలు ఇబ్బంది పాలు కాకుండా ఉంటారని తెలుస్తుంది.

*క. పులి గూనల దినుచందము / గలిగిన నంతటన నిలుచు గాక ధనంబుల్*
*గలుగునె మీఁదం గావున / జలగ దిగిచినట్లు గొనఁగ జను నిల సొమ్ముల్(ఆంధ్రమహాభారతం, శాంతిపర్వం, ద్వితీయాశ్వాసం, 393 వ పద్యం).*

ఈ పద్యంలో రాజు ప్రజల నుండి పన్ను ఏ విధంగా వసూలు చేయాలి అనే దానికి పై ఉదాహరణలను తెలుసుకోవచ్చు . ఆకలితో పులి తన పిల్లలను తానే తిన్నట్లుగా రాజు ప్రజల నుండి పన్నులు వసూలు చెయ్యడం ప్రారంభిస్తే కోశాభివృద్ధి చెందక ఆగిపోతుంది. అందువలన ఇతరులకు బాధ కలగనీయకుండా తెలియకుండా జలగ నెత్తురు పీల్చిన విధంగా రాజు ప్రజల నుండి ధన సంపాదన చేస్తే కోశం అభివృద్ధి చెందుతుంది.

ఈ వివరాలు అన్నీ కోశాగారాన్ని ఖాళీ చేయకుండా ఎప్పటికప్పుడు ధనార్జన సేకరించే విధానంలో పన్ను వసూలు చేయడం ఒకటని తెలుస్తుంది.

సంస్కృత భారతంలో పన్నును వసూలు ప్రజల నుండి ఏ విధంగా చేయాలో మరి కొన్ని ఉదాహరణలు ఇచ్చారు.

*"మధు దోహం దుహేద్రాష్టం భ్రమరా ఇవ పాదపమ్*

*వత్సాపేక్షీ దుషేచ్చైవ స్తనాంశ్చ న వికుట్టయేత్ "(సంస్కృత భారతం, శాంతి పర్వం, ఎనభై ఎనిమిదవ అధ్యాయం, 4 వ శ్లోకం).*

తేనెటీగలు చెట్టునుండి తేనెను గ్రహించినట్లు, రాజు ప్రజలనుండి ధనం గ్రహించాలి. దూడ చక్కగా పెరగడానికి తగినన్ని పాలు విడిచి మిగిలినవి పిండు కోవాలి. అంతే కాని పొదుగు కోయకూడదు. ఈ విధంగా రాజు ప్రజల నుండి పన్ను వసూలు చేయాలి.

*"రాజ్యం యొక్క వ్రేళ్ళు కోశం ద్వారానే ప్రాకి విస్తరిస్తాయని చెప్తారు. దేశీయ వ్యవహారాల పరిపాలన సమర్థవంతమైన రాజ్య రక్షణ, రాజ్యం యొక్క కోశం పై ఆధారపడి ఉంటాయి. ధన సమృద్ధమైన కోశాన్ని తన అధీనంలో పెట్టుకుని రాజ్యం యొక్క ఆర్థిక సంబంధమైన విషయాలను తన ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహించాలని రాజుకు మాటిమాటికి హితవు చెప్పబడింది. రాజకీయ సుస్థిరత్వానికి సైన్యానికి అర్థమే ప్రధాన కారణం. అది సమర్థులైన వ్యక్తుల సేవను రాజుకు సమకూరుస్తుంది. రాజ్యంలోని శక్తికి ఇది ప్రాథమికమైన ఆధారం. రాజు యొక్క ధర్మసాధనకు ఇది మూలం. శత్రువు యొక్క కోశం హరించడం శత్రువుని జయించడానికి ముఖ్యమైన మార్గంగా రాజుకు సూచింపబడింది. కోశమూ రాజ్యం యొక్క శాంతి సౌభాగ్యాలకు మూలం". ( అనంతరామ శాస్త్రి, నేతి, కవిత్రయ భారతం రాజనీతి, పుట:42).*

రాజ్యం అభివృద్ధి చెందడానికి ఆ రాజ్యంలోని రాజు ఇతర దేశాల రాజులతో సత్సంబంధాలు ఏర్పరచుకుని కోశాగారాన్ని అభివృద్ధి పరచుకుంటారు. భారతంలో ధర్మరాజు యుద్ధానంతరం పట్టాభిషేకం పూర్తి అయిన తరువాత ధర్మరాజు కొంతమందికి

కొన్ని బాధ్యతలు అప్పజెప్పతాడు అందులో సంజయున్ని ఆదాయ వ్యయాలు గురించి వివరాలను అందించడానికి సంజయున్ని నియమిస్తాడు.

*“ కృతాకృపరిజ్ఞానే తథాయవ్యయచింతనే*

*సంజయం యోజయామాస వృద్ధం సర్వగుణైర్యుతమ్11 (సంస్కృత భారతం, శాంతి పర్వం, నలభై ఒకటవ అధ్యాయం, 11 వ శ్లోకం).*

ఆదాయ వ్యయాలు అనేవి రాజ్యానికి చాలా అవసరం. ధనాన్ని సంపాదించడం ఒక పద్ధతి అయితే ఆ ధనాన్ని ఖర్చు చేయడం కూడా నేర్పరి తనం కావాలి. అనవసరమైన ఖర్చులు తగ్గించాలి. ధనం ఖర్చుపెట్టిన చోటే ఆదాయాన్ని కలిగించే మార్గాలు వెతకాలి. ఇటువంటి వన్నె అనుభవం కలిగిన వారికే సాధ్యమవుతుంది. కాబట్టే వృద్ధుడై జ్ఞానాత్ముడైన సంజయున్ని ఈ ఆర్థిక వ్యవహార బాధ్యతను ధర్మరాజు అప్పగించాడని అర్థమవుతుంది.

ధర్మరాజు రాజ్య పరిపాలనను తిరస్కరిస్తున్న సందర్భంలో ధర్మరాజుకు అర్జునుడు ధనం యొక్క గొప్పతనాన్ని చెప్తాడు.

*“ధనం ,గోవులు, సేవకులు, అతిథులు వీరు కృశించిన వాడే నిజంగా కృశుడు కేవలం శరీరం కృశించినంత మాత్రం చేత వానిని చిక్కిపోయిన వాడు అనరు అంటాడు”. ( సంస్కృత భారతం, శాంతిపర్వం, ఎనిమిదవ అధ్యాయం, 24 వ శ్లోక భావం).*

ఈ విషయాలను పరిశీలిస్తే మానవునికి ధనం , గోవులు, సేవకులు, అతిథులు వీరంతా మానవుని జీవితంలో అత్యంత ప్రాముఖ్యతను కలిగిస్తాయి. వ్యక్తి గౌరవానికి నాందిగా నిలుస్తాయి. ధనమున్న వ్యక్తి దానిని  సద్వినియోగం చేసుకునే కొలది ధనాభివృద్ధి కలగడంతో పాటు బంధుమిత్రాదులతో సుఖ జీవనాన్ని పొందగలడు. ఆ ధనానే దుర్వినియోగం చేసుకున్నట్లయితే సమస్తాన్ని కోల్పోతాడు అప్పుడు అతని జీవితం ఎండమావి లాగే ఉండిపోతుందనే భావన పై మాటల్లో వ్యక్తమవుతుంది.

## 4.27. సైన్యం:

రాజ్య రక్షణకు సైనికులే కీలకం సైనిక బలం ఉన్న రాజులు ఎక్కువగా రాజ్య విస్తరణ  గావించి సుపరిపాలన సాగిస్తారు. అటువంటి సైన్యాన్ని ఎన్నుకోవడంలోనూ సైనాధ్యక్ష బాధ్యతలను స్వీకరించే వ్యక్తి బలాబలాలను తెలుసుకుని నియమించడంలో నూ జాగ్రత్త పడవలసిన అవసరం ఎంతైనా ఉంది. అయితే ఈ సైన్యం ప్రధానంగా చతురంగ బలాలతో కూడుకుని ఉంటుంది. అశ్వ, గజ, రథ, కాల్బలాల మూలంగా రాజ్య విస్తరణ కొనసాగుతుంది. అనేక వ్యూహ నిర్మాణాల ద్వారా యుద్ధ రంగంలో కి వచ్చిన రాజులు వాటిని తమ తెలివితేటలతో ఛేదించి విజయం సాధిస్తారు.

*"మానుష, అచల, క్రౌంచ, గరుడ, అర్ధేందు, మకర, శ్యేన, మండల, వజ్ర, కూర్మ శృంగాటక, సర్వతోభద్ర, శకట, మండలార్థ, చక్ర సూచి, దుర్జయ అనే పేరుగల వ్యూహాలు పద్దెనిమిది దినాలు రిగిన భారత యుద్ధంలో పాండవ, కౌరవులు పన్నారు. " (అనంత రామ శాస్త్రి నేతి, కవిత్రయ భారతం-రాజనీతి, పుట:43).*

*ఒక సైనికునికి ఉండవలసి లక్షణాలను భారతం చెపుతుంది.*

*"క. మొనదీర్పు వెరవు, యంత్రము, / లనేకము లొనర్చు నేర్పు నాయుధముల వి*

*న్న నువును బూటుల కర్జం / బును సేనాపతికి నైజములు గావలయున్.*

*(ఆంధ్రమహాభారతం, శాంతిపర్వం, ద్వితియాశ్వాసం, 380 వ పద్యం).*

*యుద్ధ వ్యూహం పన్నే ఉపాయం, అనేక యంత్రాల నిర్మాణంలో నైపుణ్యము, ఆయుధాలను ప్రయోగించడంలో నేర్పు, యుద్ధ కార్యాలలో సామర్థ్యము, సైన్యాధిపతికి ఉండవలసిన సహజ గుణాలు.*

ఈ విషయాలను పరిశీలిస్తే శత్రురాజులను ఓడించడానికి సైనాధిపత్యం చాలా ప్రధానమైనది అటువంటి సైనాధిపత్యాన్ని అధిరోహించన వ్యక్తి యుద్ధ వ్యూహాల ద్వారా తన రాజుకు విజయాన్ని అందించాలంలే యుద్ధ ప్రణాళికను నిర్మించుకుని దాని ప్రకారం అశ్వ,

రథ , గజ, తురగ, పదాతి దళాల సైన్యాన్ని అనేకమైన వ్యూహాలతో ముందుకు వెళ్లగలగాలి అప్పుడే విజయం లభిస్తుందని తెలుస్తుంది.

తన రాజు కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధపడిన సైన్యం కోసం రాజు ప్రతేక్యమైన సుఖజీవనాన్ని అందించడానికి ప్రయత్నించాలి. యుద్ధం గెలిస్తే ఆ సైనికునికి జీవితాంతం బ్రతకడానికి సరిపడ ధనాన్ని ఇవ్వడమో వంటి  కానుకలను ప్రకటించాలి. ఒక వేళ మరణిస్తే ఆ సైనికుని కుటుంబ పోషణ భారమంతా రాజే భరించాల్సి వస్తుంది. వారికి తగిన ధనధాన్యాలను సమకూర్చాలి. సైన్యం రాజ్యాన్ని రక్షించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది కాబట్టి వారికి ప్రత్యేకమైన గౌరవం

4.28. **సైన్యం రకాలు**:

*"ధృతరాష్ట్రుడు రాజనీతి విషయాలను ధర్మరాజుకు వివరిస్తూ శత్రు రాజులను జయించే విధానంలో సైన్యాలను సమకూర్చే విధానాన్ని తెలుపుతాడు. యుద్ధానికి వెళ్లే ముందు రాజు శక్తి త్రయాన్ని అంచనా వేసుకోవాలి సైన్యానికి కోశం మూలం. మూల బలం అంటే ధన బలం అని అర్థం వంశపారపర్యంగా రాజసేవలో కొనసాగిస్తున్న సైన్యం మూలబలం.*

*శ్రేణి బలం : కొంతమందిని కూర్చుకుని సైనికుల వలె తీర్చి వారికి ఒకడు నాయకత్వం వహిస్తూ ఉంటాడు ఇలా కొంతమంది సైనికుల సమూహాలకు నాయకులైన వారి ద్వారా ఉపయోగించే బలం శ్రేణి బలం.*

*మిత్ర బలం:  స్నేహితులైన రాజులు తనకు సహకారులుగా పంపే సైన్యం మిత్ర బలం*

*శత్రుబలం:  యుద్ధంలో తన చేతిలో ఓడిపోయి సామంతుడై ఉన్న రాజులు విధిగా పంపడం వలన వచ్చే సైన్యం అవకాశం దొరికితే ఎదురు తిరిగే వాళ్ళు కాబట్టి వీళ్ళు సామంతులై కప్పాలు పడుతున్నా శత్రువులే కాననబలం : కిరాతాది సైన్యం భృత్య బలం: జీతమిచ్చి తాత్కాలికంగా పెట్టుకున్న సైన్యం ఈ ఆరు విధాలైన*

*బలగాలను సమయోచితంగా ఉపయోగించాలి''. (ఆంధ్ర మహాభారతం ఆశ్రమ వాస పర్వం ప్రథమాశ్వాసం 73వ పద్యం).*

## 4.29. సేనానీతి– యుద్ధ ప్రదేశం:

సేనానీతిలో సైన్యం యుద్ధానికి సిద్ధమయ్యేముందు ఎటువంటి ఆయుధాలను సిద్ధ చేసుకోవాలో, ఎటువంటి వాతావరణం యుద్ధానికి అనువైనదో తెలుసుకుని ముందుకు వెళ్ళాలి అప్పుడే యుద్ధం లో విజయం లభిస్తుందని భారతం చెప్తుంది . వాటిలో కొన్నింటిని పరిశీలిస్తే

1. *ఇనుప ముళ్ళ లోహాలతో తయారయిన కవచాలు, చామరాలు, తెల్లగా మెరుస్తూ పదునుగా ఉన్న ఆయుధాలు, ఎఱ్ఱని పసుపు పచ్చని రంగు కల కవచాలు అనేక రంగులతో శోభిల్లే ధ్వజాలు, పతాకాలు, తోమరాలు, ఖడ్గాలు, వాడియైన పరశువులు, పలకలు, డాళ్లు వీనినన్నింటిని అధిక సంఖ్యలో ఉంచుకోవాలి. చైత్రంలోగాని, మార్గశీర్షంలో కాని పూర్ణిమ తిథినాడు సైన్యాన్ని యుద్ధానికి బయలుదేర తీయడం ప్రశస్తమైనదిగా భావిస్తారు.*
2. *సైన్యం వెళ్లే మార్గంలో నీరు, గడ్డి సమృద్ధిగా ఉండాలి. వెళ్ళే మార్గం సమ ప్రదేశం అయితే మంచిది. గూఢచారులు బాగా తెలిసి అలవాటు పడినది కావాలి.*
3. *సేనలు అరణ్యంలో జంతువుల వలె సుఖంగా వెళ్ళలేరు కనుక జయాన్ని కోరుకునే రాజులు సేనలకు తగిన మార్గాలను కూర్చుకోవాలి.*
4. *సేన ముందు భాగంలో కులీనులు, సమర్థులు ఉండాలి. మధ్యలో నిలిచే చోటు నీళ్ళు ఉన్నది. ఇతరులు ప్రవేశింపశక్యం కానిది బయలు ప్రదేశము అయిఉండాలి. అలా ఉంటే శత్రువులు చొరబడడానికి వీలుండదు. సేనలకు దగ్గరలో యుద్ధ నిపుణులు, గుణవంతుల రక్షణలో ధనాగారం ఉండాలి.*
5. *అశ్వ దళం , రథాలు నడిపే చోటు బురద లేనిది, గుట్టలు లేనిది , రాళ్ళు లేనిది కావాలని యుద్ధనిపుణులు చెపుతారు.*

*6. గజ బలంలో ముందుకు వెళ్ళే సేనకు చిన్న చిన్న చెట్లు, పెద్ద పొదలు, వెదురు పొదలు కల ప్రదేశం అయి ఉంటే మంచిది.*

7. *పదాతి దళానికి పర్వాతాలు, ఉపవనాలు, దుర్గాలు, వెదురు పొదలు ఉండే ప్రదేశం అనువైనది ఈ విధంగా చక్కగా ఆలోచించి తిథి వార నక్షత్రాలు బాగున్నప్పుడు రాజు సేనను దండయాత్రకు ప్రయోగిస్తే తప్పక విజయం లభిస్తుంది. ( సంస్కృత భారతం, శాంతి పర్వం, నూరవ అధ్యాయం).*

ఈ విషయాలను పరిశీలిస్తే సైన్యం యుద్ధరంగానికి ఎంతటి ప్రధానమూ ఆ సైన్యానికి ప్రకృతి కూడా సహకారాన్ని అందిస్తే విజయం లభిస్తుంది. వాతావరణ విశేషాలను గమనించి చతురంగ బలాలతో ఉన్న సైన్యానికి ఏ చోటు అనువైనదో ముందుగా బాగా పరిశీలించి యుద్ధ రంగంలోకి దిగడం వలన రాజు విజయాన్ని అందుకోగలడనే విషయం పై మాటల వలన తెలుస్తుంది.

## 4.30. మహాభారతం లో యుద్ధ శిబిరాలు:

యుద్ధానికి సిద్దమయినప్పుడు ఆ ప్రాంతంలో శిబిరాలు ఏర్పాటు చేసుకుని యుద్ధం జరిగినన్ని రోజులు యుద్ధసామగ్రిని నిల్వచేసుకోవడం, ఆహారధాన్యాలను సమకూర్చుకోవడం చేస్తారు.

*“కురు క్షేత్ర యుద్ధ భూమిలో ధర్మరాజు తన పరివారంతో చేరుకుని తన సైన్యాన్ని అనువైన చోటు చూసి వారిని అక్కడ ఉంచారు. ఆ ప్రదేశం దట్టంగా గడ్డి ఇంధనాలు పెరిగి ఉన్న ప్రదేశంలో నిలిపాడు. దృష్టద్యుమ్నుడు, ద్రుపదుడు, ప్రతాపవంతుడయిన సాత్యకి శిబిరాన్ని వేయించారు. వీరంతా హిరణ్వతి అనే నదీ తీరంలో రాళ్ళు , బురద లేని చోట శిబిరాన్ని ఏర్పాటు చేసారు. శ్రీకృష్ణుడు అక్కడ పరిఖను త్రవ్వించి కాపలాగా కొందరిని నియమించాడు. రాజులందరికి ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసుకున్నారు.*

*చాలా గుడారాలు ఏర్పాటు చేసి అందులో వంటచెరకు , భక్ష్య, భోజ్య అన్నపానాదులకు లోటు లేకుండా సామగ్రిని ఏర్పరచారు. అలాగే సైన్యాలలో*

*విద్వాంసులను, వైద్యులను, జీతాలిచ్చి నియమించారు. ప్రతి శిబిరంలో కూడా అల్లెత్రాళ్ళు, ధనుస్సులు, కవచాలు, అస్త్ర శస్త్రాలు, తేనె, నేయి, యక్ష ధూపపు పొడులు ఏర్పరచారు. నీరు, గడ్డి, ఊక, బొగ్గులు , పెద్ద పెద్ద యంత్రాలు, బాణాలు, తోమరాలు, గొడ్డళ్ళు ధనుస్సులు, కవచాలు, ఏర్పాటు చేయించారు. (సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం,152 వ అధ్యాయం).*

ఆంధ్ర మహాభారతంలో సైన్యం యొక్క దండును వారి ప్రయాణ సాధనాలు , డేరాలు కావలసిన వస్తువులను సమకూర్చుకోవడం దీనినంతటిని కదిలిపోతున్న ఆ దండు సముద్రమే కాపురం పెట్టడానికి కురుక్షేత్రానికి తరలిపోతున్నట్లు పోలికను చెప్పాడు తిక్కన.

## 4.31. సైన్య వ్యూహం ఎలా ఉండాలి:

సైన్యం ముందు భాగంలో ఎలా ఉండాలో ఈ శ్లోకం వలన తెలుస్తుంది.

*“అగ్రతః పురుషానీకమ్ అసి చర్మ వతాం భవేత్*

*పృష్ఠతః శకటానీకం కలత్రం మధ్యతస్తథా11( సంస్కృత భారతం, శాంతి పర్వం, నూరవ అధ్యాయం, పుట: 43 వ శ్లోకం).*

ముందు భాగంలో కత్తి , డాలు, పట్టిన యోధుల సేన, వెనుక భాగాన రథసేన మధ్యలో రాజు ఉండాలి.

ఈ విధానాన్ని గమనిస్తే రాజు రక్షణోపాయంగా కనిపిస్తుంది. రాజు మధ్యలో ఉండడాన్ని గమనిస్తే ఎంతటి శత్రువైనా రాజు ముందు ఉన్న సైన్యాన్ని దాటాలి. అందుకే సైన్యం బలంగా ఉండాలని అర్థమవుతుంది.

## 4.32. యుద్ధనివారణోపాయాలు:

యుద్ధమనేది పాప కృత్యమని అందువలన ముందుగా సంధి కోసం ప్రయత్నించి తరువాత యుద్ధం జరిపితే శ్రేయస్కరమని భారతం లో చెప్పబడింది.

*చ. సమరము సాహసం బధిక సంపద లమ్మెయిఁ దెచ్చికోలు వ*

*థ్యమె రిపు లేల కల్గు దురహంకృతి పెంపును నుత్కటంపుఁ గో*

*పము మగిడింపఁజాలు నర పాలున కట్లగుటన్ హితంబు సా*

*మము దనయంతవాఁడయిన మానవ నాథునెడన్ మహేశ్వరా! (ఆంధ్ర మహాభారతం, శాంతి పర్వం, ద్వితియాశ్వాసం,414 వ పద్యం).*

యుద్ధం చేయడం పాపమని శత్రువులను చంపి సాధించిన విజయం మేలు కాదని అహంకారానికి పోకుండా, అత్యధిక కోపాన్ని తగ్గించుకోగలిగిన సమర్థుడైన రాజుకు శత్రువులు ఉండరని అందువలన శత్రువుని తెలిసినప్పుడు తనంతట తాను సామోపాయంతో ప్రవర్తించడం మంచిదని పై పద్యంలోని భావం.

*"ఒక వేళ తన సైన్యంలోని అంతః కలహాలు చెలరేగితే బలహీనుడైన శత్రువునైనా ధనం ఇచ్చి సంతృప్తి పరచడం మంచిది. రాజునకు తన కంటే బలవంతుడైన శత్రువును దానం అనే ఉపాయంతో వశం చేసుకోవాలి. సామ దాన దండోపాయాలకు అవకాశం లేనప్పుడు శత్రువు పట్ల కలిగిన లోపాలను పరిశీలించి తగిన విధంగా బాధించే అవకాశం కలిగినప్పుడు శ్రద్ధతో కార్యాన్ని సాధించగల వారిని భేదోపాయానికి వినియోగించడం మంచిది. ( ఆంధ్ర మహాభారతం, శాంతి పర్వం, ద్వితియాశ్వాసం,415, 416 పద్యాలు).*

ఈ వివరాలు యుద్ధం ప్రమాదకరమని సాధ్యమైనంత వరకు సంధి ప్రయత్నాలు జరగాలని సామ దాన భేదోపాయాలను ప్రయోగించి శత్రువును వశపరచుకోవాలని ఈ ఉపాయాలు ఫలించనప్పుడు మాత్రమే దండోపాయాన్ని ప్రయోగించి శత్రురాజులను ఓడించి రాజ్యాన్ని నిలుపుకోవాలని తెలుస్తుంది.

ఈ ఉపాయాలు కాకుండా ఉపేక్షతో ఉండడమనే ఐదో ఉపాయాన్ని శుక్రుని అభిప్రాయం. అంటే

*'' మ. కలహంబుల్ దమలోనఁ జేసిన నుపేక్షా నైపుణం బొప్ప శ*

*త్రుల జూడందగు భూత దానవుల పోరుం జూచిన ట్లిమ్మెయి*

*న్మలు ముంటం దగఁబుచ్చు భంగి గలుగు న్భూనాథ కీడైన మం*

*త్రుల యేపున్ విభుఁడిట్లు మాపునది నేర్పుం బెంపుఁబొల్పారఁగన్(ఆంధ్ర మహాభారతం, శాంతి పర్వం, ద్వితియాశ్వాసం,418 వ పద్యం).*

శత్రుత్వం తమలో తమకే కలిగితే భూత, రాక్షసులకు యుద్ధంజరిగితే ఉపేక్షించినట్లు శత్రువులను ఉపేక్షాభావంతోనే చూడాలని , ఏ విధంగానైనా ముల్లును ముల్లుతోనే తీయాలని , రాజు మంత్రుల ఆలోచనలు ప్రమాదకరంగా ఉంటే వారిని నైపుణ్యంతో తొలగించాలని, ఉపేక్ష భావంతోనే ఇది సాధ్యమవుతుందని ఇదే శుక్రనీతి సారమని పై పద్యం వివరిస్తుంది.

4.33. **మిత్రుడు:**

శత్రువులను రూపుమాపడానికి రాజు మిత్ర సంపదను కలిగి ఉండాలి. అయితే మిత్రత్వం మాటల ద్వారానే కాదు ఆయా రాజు ల మధ్య స్నేహం బలపడడానికి వైవాహిక సంబంధాలు ఏర్పరచుకోవడం . దీని వలన మిత్రులు బంధువులుగా మారి రాజ్య బలాన్ని పెంపొందించుకుని శత్రురాజులను జయించగలరు.

ఈ మిత్ర రాజ్యాలు ఎలా రూపొందాయనేదానికి పి.వి రెడ్డి హైందవ రాజ్యాంగ వ్యవస్థలో ఈ విధంగా తెలియజేస్తారు.

*" సామ్రాజ్యాన్ని పటిష్టపరచడానికి అత్యవసర పరిస్థితులలో సహాయం చేయడానికి మిత్ర రాజ్యాల ఆవశ్యకతను గుర్తించారు. సామ, దాన ఉపాయాలను ఈ విషయంలో పాటించేవారు. సామ , దానాలకు లొంగనట్లైతే తటస్థ రాజ్యాలుగా గుర్తించేవారు. మిత్ర రాజ్యలకు అవసరమైనప్పుడు సహాయం అందించేవారు. చేసుకున్న ఒడంబడికలు తు.చ తప్పకుండా ఆచరణకు నోచుకునేవి ధర్మాత్ములు, మంచివారైన రాజుల మీద దండయాత్రలుండేవి కావు.(శ్రీరామకృష్ణ ప్రభ, మాసపత్రిక, పుట:13).*

వీరి అభిప్రాయం ప్రకారం మిత్రరాజ్యాలు ఉండడం వలన శత్రువులు దాడి కి దిగినప్పుడు వారిని ఎదిరించడానికైనా ఒప్పందానికైనా సహాయం చేసేవారని. రాజు

శత్రువుల కంటే మిత్రరాజ్యాలను సంపాదించుకోకలిగితే రాజ్య క్షేమం, శాంతి స్థాపన రెండు జరిగే అవకాశాలు ఉంటాయని వీరి మాటల వలన తెలుస్తుంది.

*“మండల సిద్ధాంతంలో ఆరవ అధ్యాయంలో మిత్రుని గురించి వివరించారు. మిత్రుడంటే మరొక రాజ్యానికి సర్వం సహాధికారం కలిగిన పాలకుడు. ఇతర రాజ్యాలతో ఏర్పడ్డ వైవాహిక సంబంధాల వల్ల మండల సిద్ధాంతంతో కూడిన సంబంధ బాంధవ్యాల వల్ల కలిగిన మైత్రీ విధానం ఆంధ్ర మహాభారతంలో కన్పిస్తుంది. ( అనంతరామ శాస్త్రి , నేతి, కవిత్రయ భారతం – రాజనీతి, పుట: 45).*

ప్రధానంగా మనం చెప్పుకోవలసిన వివాహ ఘట్టం ఉత్తర , అభిమన్యుల వివాహం , విరాటరాజు కొలువులో అజ్ఞాత వాసం పూర్తి చేసుకున్న పాండవులు విరాటు రాజుతో అర్జునుని పుత్రుడు అభిమన్యునితో వివాహ నిశ్చయం చేస్తారు. వీరి వివాహం తో ధర్మరాజుకు విరాటు రాజకు మధ్య సంబంధాలు బలపడతాయి. యుద్ధ సమయంలో పాండవుల పక్షాన విరాటరాజు రావడం మనం గమనించవచ్చు. అలాగే శ్రీకృష్ణుని చెల్లెలు సుభద్రతో అర్జునుని వివాహం ద్వారా శ్రీకృష్ణునితో పాండవుల బాంధవ్యం మరింత చేరువయ్యింది. అన్నింటి కంటే ముఖ్యమైనది ద్రుపద రాజు పుత్రిక ద్రౌపది వివాహం పాండవుల తో జరిగింది. ఈ వివాహం చూసి ధృతరాష్ట్రుడు మనసులో బాధపడ్డాడు. ద్రుపదుని బలం తన వైపు వస్తుందని ఆశ పడ్డాడు. కాని అది జరగలేదు ద్రుపదుని సైన్య బలం అంతా పాండవుల పక్షానే చేరింది. ఈ విధంగా వివాహ సంబంధాల ద్వారా రాజు తమ మైత్రిని బలపరచుకుని శత్రు రాజులను ఓడించడానికి సిద్ధ పడేవారు.

*క.	మిత్రుం దైహికములు నా / ముత్రికములు నైన భద్రములు దలకొలువున్*

*మిత్ర ధనంబులలోనను / మిత్త్రుడ యెక్కు డను మాట మెత్తురు ప్రాజ్ఞుల్ (ఆంధ్ర మహాభారతం, శాంతి పర్వం, తృతియాశ్వాసం,526 వ పద్యం).*

స్నేహితుడు ఉంటే ఇహములోను, పర లోకములోనూ సౌఖ్యాలను కలిగిస్తాడు. మిత్రుడు , ధనాన్ని రెండింటిలో ఏది ముఖ్యం అన్నపుడు స్నేహమే గొప్ప అని చెప్తారు. అయతే స్నేహితున్ని ఎంచుకోవడంలో జాగ్రత్త తీసుకోవాలి ఒకరితో స్నేహం చేసుకున్నాక

ఆ స్నేహం చిరస్థాయి ప్రయోజనాలను కలిగించాలి. ప్రధానంగా రాజు తన రాజ్య విస్తరణకు, కోశాగార అభివృద్ధికి ఎక్కువ మంది రాజులతో సంబంధాలు ఏర్పరచుకోవాలని పై విషయాలు స్పష్టం చేస్తున్నాయి.

అలాగే జనమేజయుడికి అతని మంత్రులు కాశీరాజు అయిన సువర్ణ వర్మ కుమార్తె వపుష్టమతో వివాహం జరిపిస్తారు.( సంస్కృత భారతం, ఆదిపర్వం, 44 వ అధ్యాయం, పుట177.) ఇలా రాజవంశాభివృద్ధికి వివాహాలు కూడా ఒక ప్రముఖ పాత్రను పోషిస్తున్నాయి.

అలాగే పాండురాజు కుంతిభోజుని కుమార్తె కుంతి వివాహం, రాజ్య విస్తరణలో భాగంగా భీష్ముడు స్వయంగా మద్రదేశానికి వెళ్లి శల్యునికి కన్యాశుల్కాన్ని సమర్పించి మాద్రిని తీసుకుకుని వచ్చు పాండురాజుకు వివాహం చేయడం ఇవన్నీ కూడా రాజ్య విస్తరణ బలాన్ని పెంపొందించుకోవడానికి ఉపయోగపడతాయి.

## 4.34. దుర్గం:

ప్రజలందరి యోగ క్షేమాలను, ప్రజాభివృద్ధిని కాంక్షించే రాజు  నివసించే ప్రదేశం చుట్టూ భేదించడానికి వీలుకాని కోటను నిర్మించడం ప్రధానం.

*‘‘దుర్గం అంటే పొందరానిది అని అర్థం సాధారణంగా దుర్గానికి కందకం, కోటగోడ, పెద్ద పెద్ద కవాటాలు, కోట బురుజులు, శతఘ్నులు ఇవన్నీ అంగాలుగా ఉంటాయి. వాటిని పరిరక్షించడానికి మంచి సేన ఉంటుంది. ’’ ( రాజగోపాల నాయుడు, పి. కురుక్షేత్రే, పుట:189. )*

కోట ను దాటడానికి వీలు లేని విధంగా నిర్మించబడితే రాజ్యానికి అది రక్షణ కవచంగా పనిచేస్తుంది. శత్రువులు వెళ్ళడానికి వీలు లేని విధంగా మార్గాలను , కోట నిర్మాణాలను గావించాలి.

*‘‘దుర్గం ను ఆరు విధాలుగా ఏర్పరచుకోవాలి. వానికి నగరాలు, ఏర్పరచుకోవాలి. సంపదలకు మూలంగా అన్ని సమృద్ధిగా ఉండేట్లు దుర్గం ఉండాలి. ధన్వ దుర్గం,*

*మహాదుర్గం, మనుష్య దుర్గం. జల దుర్గం, వన  దుర్గం వీటిలో ధన్వ దుర్గం అంటే భూదుర్గం దాని చుట్టూ నీరులేని ప్రదేశం ఉంటుంది. అదే మరు దుర్గమని కూడా అంటారు. పురం భూ దుర్గం తో చుట్టి ఉండాలి. ధాన్య సంపన్నమయ్యి ఆయుధాలతో కూడా, చక్కని దృఢమైన ప్రాకారం అగడ్త కలిగి ఏనుగులు, గుర్రాలు, రథాలతో నిండి ఉంటుంది. విద్వులు శిల్పులు, ధనాగారాలతో ఉంటుంది. ధార్మికులయిన ప్రజలు సమర్థులయిన ఉత్తమ జనులతో కూడి ఉండాలి. శక్తి కల నరులు, ఏనుగులు, గుర్రాలు, కలిగి నాలుగు రోడ్ల కూడళ్ళు వర్తక శాలలు, న్యాయస్థానాలు, కలిగి ప్రశాంతంగా నిర్భయంగా తిరిగేటట్లు ఉండాలి. (సంస్కృత భారతం, 86 వ అధ్యాయం).*

ఇవే దుర్గాల గురించి ఆంధ్ర మహాభారతంలో కూడా ప్రస్తావించబడ్డాయి.

*వ. దుర్గంబు లనేక విధంబులు గలవు వాని యందు నర దుర్గంబు వరిష్ఠంబు గావున వర్ణంబులు నాలిగింటి మీదను మేదినీశ్వరుండు దయ గలుగవలయు గేవల క్షమావంతుండగుటకు సాదుటేనుంగు చందంబై యుందు నివ్విషయంబున బృహస్పతి వచనంబులు గలవు తదీయార్థంబులు వివరించెద.''( అంధ్ర మహాభారతం, శాంతి పర్వం, ద్వితియాశ్వాసం,177 వ వచనం).*

దుర్గాలలో నర దుర్గం గొప్పది అని చెప్పారు. ఈ నర దుర్గం శత్రువులు చొరబొడకుండా ఉండడానికి శ్రేష్టమైనది గా చెప్తారు. ధన్వదుర్గం అంటే నలుప్రక్కలా అయిదామడల మరుభూమి  కోట, మహీదుర్గం అంటే చుట్టూ మట్టి దిబ్బలు గల కోట, వార్ క్ష దుర్గం (చుట్టూ వృక్షాలు గల కోట, నర దుర్గం అంటే చుట్టూ చతురంగ బలాలు గల కోట, జల దుర్గం అంటే చుట్టూ నీరుగల కోట, గిరి దుర్గం అంటే చుట్టూ కొండలు గల కోట. ( ఆంధ్ర మహాభారతం, శాంతి పర్వం, ద్వితియాశ్వాసం, 177 వ వచనం).

ఈ వివరాలను పరిశీలిస్తే కోట యొక్క నిర్మాణం బట్టి రాజ్య రక్షణ ఆధారపడి ఉంటుందని అర్థమవుతుంది. రాజ్యం రక్షణ వలయంలో ప్రజలు సుఖశాంతులతో జీవనం సాగించగలరు.

*చ. బహుధనధాన్య సంగ్రహము బాణ శరాసన యోధ వీర సం*

*గ్రహము నిరంతరాంతరుదకంబులు ఘాసర సేంధనౌఘ సం*

*గ్రహము ననేక యంత్రములుఁగలగి యసాధ్యములై ద్విషద్ధయా*

*వహు లగుచుండ నొప్పు నె భవత్పరిరక్ష్య ములైన దుర్గముల్. (ఆంధ్ర మహాభారతం, సభా పర్వం, 53 వ పద్యం).*

ధర్మరాజు రక్షణలో ఉన్న కోటలన్నీ ఎక్కువగా ధన ధాన్యాల్ని ధనుర్బాణాల్ని యుద్ధ వీరుల్ని ఎప్పుడూ తరుగని నీళ్లని పశువుల గడ్డిని ఉప్పు , పులుపు కారం వంటి పదార్థాల్ని వివిధ పానియాల్ని వంట కట్టెల్ని సమృద్ధిగా కలిగి అనేక యంత్ర సాధనాలతో ఉండి దుర్భేద్యాల శత్రు భయంకరాలై ఒప్పుతున్నాయా అని పరామర్శిస్తాడు నారదుడు.

*సంస్కృత భారతంలో " కట్టెలు, లోహాలు, ఊక, బొగ్గులు, చెక్కలు , కొమ్ములు, ఎముకలు, వెదురు వస్తువులు, కొవ్వు, నూనె, వస,తేనె, జనపనార, ధూప ద్రవ్యాలు, ధాన్యం, ఆయుధాలు, బాణాలు, చర్మాలు, నరాలు, బెత్తం, ముంజగడ్డి, తుంగ, భేరి మొదలయిన వాద్యాలు. వీటిని రాజు నిల్వ ఉంచాలి. (సంస్కృత భారతం, శాంతి పర్వం, ఎనభై ఆరవ అధ్యాయం).*

ఈ విషయాలను గమనిస్తే కొందరు రాజులు చెప్పకుండానే యుద్ధానికి వచ్చేవారు ఉంటారు. అటువంటప్పుడు కోట లో అన్ని రకాల పదార్థాలు, ఆయుధాలు సిద్ధంగా ఉండాలి. కోట కు ముఖ్యమైన విషయాలు ఇక్కడ ప్రస్తావించబడ్డాయి.

### 4.35. **రాజ పదవి:**

*" పదవికి రామాయణం కొన్ని యోగ్యతలను సూచిస్తుంది. రాజు యొక్క జ్యేష్ఠ పుత్రుడు అనంతరమే రాజు కాదగిన వాడని పేర్కొనెను. అతడు లోక కంటకుడైనప్పుడు ఆ అర్హతను కోల్పోవును. అప్పుడతడు దేశము నుండి వెడలగొట్టదగిన వాడు అగును. " (అనంత రామ శాస్త్రి, నేతి, ప్రసిద్ధ సంస్కృతాంధ్ర రామాయణాల్లో రాజనీతి తత్త్వము, పుట:22.)*

మహాభారతంలో ఈ రకమైన రాజన్యాయాన్ని గమనిస్తే శంతనుడు తర్వాత భీష్ముడు పెద్ద కుమారుడు అయినప్పటికి భీష్ముడు రాజ్య పరిత్యాగం చేయడం వలన సత్యవతి శంతనునికి కలిగిన పెద్ద కుమారుడు చిత్రాంగదుడు రాజు అవుతాడు. అయితే యద్ధం మీద ఆసక్తి ఎక్కువై చిత్రాంగదుడనే గంధర్వునితో యుద్ధం చేసి మరణిస్తాడు. అతని తర్వాత విచిత్ర వీర్యుని రాజుగా చేస్తే అతను భోగలాలసపై వ్యాధితో మరణిస్తాడు. వీరు వంశ పారం పర్యంగా రాజులైనప్పటికి రాజ్య పరిపాలనా విషయాలలో కంటే సుఖాల మీద ఆసక్తి ఇంద్రియాలను జయించక పోవడంతో నశించారు. ఇటువంటి రాజుల వలన ఎప్పటికైనా రాజ్యానికి ప్రమాదమే. సత్యవతి పరాశరునికి కలిగిన పెద్ద కుమారుడు వ్యాసుని పిలిచి రాజ్య భ్రష్టత్వం కాకుండా అంబికా, అంబాలిక యందు ధృతరాష్ట్రుడు, పాండురాజు, దాసి ద్వారా విదురుడు జన్మించాడు. రాజ్య పరిపాలనను కొనసాగించారు.

దుష్యంతుడు శకుంతల పాతివ్రత్యమును పరిక్షించి అతని కొడుకును భరతునికి యువరాజ పట్టాభిషిక్తున్ని చేసాడు. యయాతి తన జ్యేష్ఠ పుత్రునికి కాకుండా తన మాట విని తన ముసలి తనాన్ని తీసుకున్న పూరునికి తన తరువాత చక్రవర్తిని చేసాడు. రాజ్య పదవి అనేది వంశపారం పర్యం అయినప్పటికి రాజ్యార్హత కలిగిన వాడే రాజు కాగలడు అతని ప్రవర్తన అధర్మంగా ఉంటే అతను రాజ్య పదవిని కోల్పోతాడు.

*‘‘రాజ్యం వంశపారంపర్యంగా ఆనాటి కాలంలో ఉంది అనడానికి ఉదాహరణగా పరిక్షిత్తు మరణించిన  తర్వాత అతని కుమారుడు శిశువయినా జనమేజయునికి పట్టాభిషేకం చేసారు. జనమేజయుడు శత్రునాశన సమర్థుడు ప్రజలు అందరు అతనిని జనమేజయుడనే పిలుస్తున్నారు. (సంస్కృతభారతం, ఆదిపర్వం, 44 వ).*

ఇక్కడ వంశపారం పర్యంగా రాజ్యం రావడమే కాకుండా రాజ్యాన్ని పరిపాలించే వయసు లేనప్పటికి శక్తి సామర్థ్యాలు ఉండడం చేత జనమేజయునికి పురోహితులు,మంత్రులు కలిసి పట్టాభిషేకం చేసారు.

## 4.36. రాజనీతి భాగాలు:

దండనీతి, అర్థశాస్త్రం , నీతి శాస్త్రం. రాజనీతి శాస్త్రం, రాజ శాస్త్రం, రాజ ధర్మం, క్షత్రియ ధర్మం, అనేవి కనిపిస్తాయి.

### 4.36.1. దండనీతి:

దండం నిర్వచనాన్ని గౌతముడు ఇలా పేర్కొన్నాడు, దండము అనే పదం 'డం' అనే మూల పదం నుండి వచ్చింది. డం' అనగా నియంత్రణ చేయు అని అర్థం, రాజు వర్ణాశ్రమ ధర్మాల్ని అతిక్రమించిన వారిని దండన ద్వారా నియంత్రణ చేస్తాడు.( దామోదర్ రెడ్డి, పామిరెడ్డి, ప్రాచీనాంధ్ర కావ్యాలు రాజనీతి(సి.గ్రం), పుట:04)

దీనినిబట్టి దోషులను శిక్షించి వారి దురలవాట్లను దుర్బుద్ధిని నియంత్రణలోకి తీసుకునిరాగలిగేవాడు రాజు  అతను విధించే శిక్షే దండం.

దండం గురించి మహాభారతం విస్తృత మైన చర్చను అందించింది. అసలు మొదట దండం ఎలా ఆవిర్భవించింది, దండం యొక్క ఉపయోగాలు ఏమిటి అనే విషయాలు కూడా మనం తెలుసుకోవలసిన అవసరం ఉంది.

*''రాజ్యాన్ని అనుశాసించే శక్తినే దండం అంటారు. దండనీతి రాజ్యాభివృద్ధిని , రాజ్య సుస్థిరత్వాన్ని సాధించడానికి ప్రముఖ పాత్ర వహిస్తున్నది. వశం కాని వారిని దండం చేత వశం చేసుకోవాలి. దుష్టులను రక్షించాలి. దండం మీద భయంతో మానవులు నియమాల్ని పాటిస్తారు. శాంతి యుతంగా జీవిస్తారు. స్వధర్మానుష్ఠానం చేస్తారు. దండం ధర్మాన్ని రక్షిస్తుంది. ధర్మానికి సంబంధించిన వివిధాంశాలు దండం ద్వారా ప్రకటితమవుతాయి. దండమే త్రివర్గాలైన ధర్మార్థ కామాలకు మూలా ధారం దండం లేని చోట అరాచకం ప్రబలి. కుటుంబాలు, ఆస్తిపాస్తులు నశిస్తాయి. కాబట్టి దండాన్ని రాజ్య నిర్మాత అనవచ్చు సర్వజీవరాసులే కాదు మర్త్య, స్వర్గ లోకాలు కూడా దండం మీదే ఆధార పడ్డాయి. '' ( అనంత రామ శాస్త్రి ,నేతి, కవిత్రయ భారతం – రాజనీతి, పుట:87.)*

ఈ విషయాలను పరిశీలిస్తే ఒక కుటుంబంలో ఇంటి పెద్ద బాధ్యతలను నిర్వహిస్తూ ఎంత కుటుంబంతో అనుబంధంగా ఉంటాడో అలాగే అవసరమైనప్పుడు దండన కూడా అవసరం మేరకు వినియోగిస్తూ ఉండాలి. ఇంట్లో కొడుకు అక్రమ మార్గంలో వెళుతుంటే దానిని మొదట్లోనే ఖండించగలగాలి. ఇలా దండన అనేది ఉన్నప్పుడు తక్కిన కుటుంబ సభ్యులు కూడా అధర్మ మార్గంలో నడవడానికి భయపడతాడు. అన్నిటి కంటే ప్రధానం ఆ కుటుంబ పెద్ద ధర్మ మార్గంలోనడిచేవాడై ఉండాలి. అలా కానప్పుడు అతను దండన విధించడం వలన ప్రయోజనం ఉండదు. ఇంట్లో కుటుంబ సభ్యులను ఒకే మార్గంలో నడిపించడానికి ఎంత శ్రద్ధ అవసరమో దేశాన్ని రాజు తన అదుపులో ఉంచుకుని పరిపాలించేటప్పుడు ఎటువంటి అధర్మాలు, అన్యాయాలు జరగకుండా చూసుకోవలసిన బాధ్యత ఉన్నప్పుడు అంత మంది ప్రజలను కాపాడే రాజు దండన విధించడంలో ఎటువంటి తప్పు లేదు. తనను నమ్ముకున్న ప్రజల విశ్వాసం దండన ద్వారా సరిదిద్దగలిగితే ప్రజలందరూ సుఖమయమైన భయంలేని జీవితాలను గడుపుతారు.

ఆంధ్ర మహాభారతంలో దండం యొక్క స్వరూపాన్ని తిక్కన ఈ విధంగా వర్ణించాడు.

'' సీ. అసితోత్పల చ్ఛాయమై దంష్ట్రికాచతు –
షయమును, భుజ చతుష్టయము, జిహ్వ
కలు రెండుఁ బాదాష్టకంబును, శంకు క–
ర్ణములును,, బమఉ నయనములుఁ గల్గి
యూర్ధ్వ రోమంబులు నుగ్రారుణాస్యంబు–
గపిల జటాజాలకంబు నొప్ప
నసి గదా శక్తి శరాసన ముసల చ–
క్ర ప్రాస శర తోమర త్రిశూల
తే. పరశు ముఖ సాధనంబులఁ బాపజనులు–
దరతరంబ సంఛేదన తాడనాడు

లైన వివిధ ప్రహతుల నే పడుచుచును జ–

రించు దండంబు సుజనులు ప్రియము నొంద.

ఈ దండనీతి మంచి వాళ్లను మెప్పిస్తుంది. చెడ్డ వాళ్ళ పొగరును అణచివేస్తుంది. కత్తి గద, తోమరం, విల్లమ్ములు, రోకలి, చక్రం, ఈటె, చిల్లకోల, త్రిశూలం, గొడ్డలి మొదలైనవి పదకొండు ధర్మనీతికి పనిముట్లు దాని ఒంటి రంగు నల్లటి నలుపు, దానికి నాలుగు కోరలు, నాలుగు చేతులూ ఎనిమిది కాళ్లు ఉంటాయి. (అనేకాలైన చెవులు, కళ్ళు ఉంటాయి) చూచీ చూడగానే భయపడేటట్లు ఎఱ్ఱటి ముఖం. గోరోజనం వన్నెతో ఉండే జడలు ఉంటాయి. ఇవి దండం యొక్క రూపు రేఖలు లని వర్ణించాడు తిక్కన

**(ఆంధ్ర మహాభారతం, శాంతి పర్వం, తృతియాశ్వాసం, 109 వ పద్యం.).**

ఈ ఆయుధాలు దండనీతికి బాగా ఉపయోగపడతాయి కాని నేటి కాలం దండ స్వరూపం మారింది. తుపాకులు, కారాగారంలో చేసిన తప్పుకు తగిన శిక్షను అనుభవించడం. నేరం యొక్క తీవ్రతను బట్టి శిక్ష యొక్క కాలాన్ని పెంచడం. లేదా ఉరి శిక్షను లేద యావజ్జీవితం చరశాలలోనే ఉంచడం. వంటివి చేస్తారు. చాలా వరకు తప్పు చేసిన వారి మనస్తత్వాన్ని పరిశీలిస్తూ బయట ప్రపంచానికి, స్వేచ్ఛకు దూరంగా కారాగారంలో ఉండడం వలన అతని ప్రవర్తనలో ఏదైనా మార్పు ఉందేమో గమనించడం, ఒక వేళ అలా ఉన్నట్లయితే వారికి శిక్షా కాలం తగ్గించడమూ చేసే వెసులుబాటు ను నేటి కాలంలో గమనిస్తున్నాము. ఇవన్నీ కూడా ప్రధానంగా రాజు చేయదు రక్షభటులు అనే ఒక వ్యవస్థ ను ఏర్పరచి వారి ద్వారా చుట్టూ ఉన్న ప్రాంతాలలో నేరాలు జరగకుండా చూసుకుంటాడు.

దండం గురించి సంస్కృత భారతంలో విపులంగా చర్చించబడింది. ''*లోకమంతా దేనికి అధీనమై ఉంటుందో దానిని దండం అని అంటారు. ధర్మానికి మరో పేరు వ్యవహారం లోకంలో శ్రద్ధ కలవానికి ఎలాంటి లోపం కలగకూడదు దాని కోసం దండం అవసరం.ఈ దండానికి అసి, విశసనం, ధర్మం, తీక్ష్ణ వర్మ, దురాధరం, శ్రీ గర్భం, విజయం, శాస్త, వ్యవహారం, సనాతనం, శాస్త్రం, బ్రాహ్మణుడు, మంత్రం, శాస్త్ర, ప్రాగ్వదతాంవరుడు, ధర్మ*

*పాలుడు, అక్షరుడు, దేవుడు, సత్యగుడు, నిత్యగుడు, అగ్రజేడు, అసంగుడు, రుద్ర తనయుడు, మనువు, జ్యేష్ఠుడు, శివ శంకరుడు, ఇవి దండానికి ఉన్న పేర్లు,*

*దండం సర్వత్రా వ్యాపించి ఉండడం వలన విష్ణువు నరులకు ఆశ్రయం కావడం వలన నారాయణుడు, ప్రభావ శాలి అవడం వలన ప్రభువు అని చెప్పబడుతుంది. అలాగే దండ నీతిని బ్రహ్మ యొక్క కుమార్తెగా చెప్తారు. ఇంకా లక్ష్మీ, వృత్తి సరస్వతి, జగద్ధాత్రి అని కూడా దీనికి పేర్లు*

*లోకంలో ఈ దండమే లేకుంటే లోకులు ఒకరినొకరు చంపుకుంటారు. దండం వలన భయం చేతనే మనుష్యులు ఒకరి నొకరు చంపుకోవడం లేదు.ఈ దండం వలన రక్షణ పొందుతున్నారు. కనుకనే ప్రజలు ప్రతిదినం రాజును ధన ధాన్యాలతో వృద్ధి పొందిస్తున్నారు. కనుక దండమే అందరికి ఆశ్రయించతగినది. ( సంస్కృత భారతం, శాంతి పర్వం,122 వ అధ్యాయం).*

పై వివరాలన్నీ ఉలి దెబ్బలకు శిల శిల్పంగా ఎలా మారుతుందో మానవుడు పుట్టిన దగ్గర నుండి ఏదో ఒక పొరపాటు చేయకుండా ఉండదు. ఆ తప్పు తగిన ఫలితం అనుభవానికి వస్తే తప్ప తను చేసింది తప్పు అనే స్పృహకు రాదు. అలా తప్పు చేయడానికి ముందే దండం గురించిన భయం ఉన్నట్లయితే తప్పు చేయడానికి వెనకడుగు వేస్తాడు. అప్పుడు సక్రమ మార్గాన్ని ఎంచుకుని ఇతరులకు నష్టం కలిగించకుండా పద్ధతి ప్రకారం నడుచుకుంటాడు ఆ శక్తి దండానికి ఉంది.

### 4.36.2. దండం పుట్టుక:

దండం ఎలా ఆవిర్భవించిందో తెలుసుకోవలసిన అవసరం ఉంది.

భీష్ముడు ధర్మరాజుకు దండం గురించిన వివరాలను తెలుపుతూ వసుహోముడు మాంధాత మహారాజుకు చెప్పిన దండోత్పత్తి విధానాన్ని తెలియజేస్తారు. *‘‘వసుహోముడు అంగదేశాన్ని పరిపాలిస్తున్నాడు. ఒక సారి భార్యతో కలిసి ముంజపృష్ఠమనే తీర్థానికి వెళ్ళాడు.అక్కడ మాంధాత మహారాజు ను సమీపించి దండం గురించి అడుగుతాడు.*

*అప్పుడు వసుహోముడు దండం యొక్క పుట్టుకను గురించి చెప్తాడు.  సర్వలోక పితామహుడు , భగవానుడు అయిన బ్రహ్మ యజ్ఞం చేయగోరాడు తనతో సమానమైన ఋత్విజుడు కోసం వెతికాడు. ఎక్కడా కనపడలేదు తానే స్వయంగా వేయ్యేళ్ళు పాటు గర్భం ధరించాడు. (సంస్కృతంలో బ్రహ్మ తన తలమీద ఒక గర్భాన్ని ధరించాడు అని ఉంటుంది.) వేయి సంవత్సరముల తర్వాత అతనికి ఒక తుమ్ము వచ్చింది. దానితో ఆ గర్భం కిందపడింది ఆ తుమ్ము కారణంగా పుట్టినవాడికి క్షుతుడనే పేరు పెట్టారు( సంస్కృత భారతంలో క్షుపుడు అని ఉంటుంది). ఆ క్షుతుడు ఋత్విజుడుగా బ్రహ్మ యాగం చేస్తున్నాడు. ఆ దండం ఇష్టం వచ్చినట్లు నడుచుకునేది కాబట్టి కనబడకుండా పోయింది. దాని వలన ఏ పని చేయవచ్చు? ఏ పని చేయకూడదు అనే జ్ఞానం శూన్యమైనది. అందువలన ప్రజలంతా కలవర పడ్డారు. మర్యాద మంటకలిసింది. బ్రహ్మ విష్ణువును ఆశ్రయించాడు. ఆ తర్వాత విష్ణువును ఆసరాగా చేసుకుని బ్రహ్మ దండనీతి మాయం అవడం వలన ప్రపంచం ఎలా అల్లకల్లోలం అయ్యిందో వివరించి చెప్పాడు. ఆ బ్రహ్మ శివునికి నమస్కరించాడు. వెంటనే తన మహిమతో దండాన్ని కల్పించాడు ఆ దండానికి తానే ఆధారమయ్యాడు. ( ఆంధ్ర మహాభారతం, శాంతి పర్వం, తృతియాశ్వాసం,115 నుండి118 పద్య, వచనాలు).*

దండం వల ధర్మ రక్షణ జరుగుతుంది కాని ఎవరు దండాన్ని ప్రయోగించి పరిపాలన చేస్తారు అంటే రాజు అనే మాటే వినబడుతుంది. శివుడు కొన్ని సమూహాలకు కొందరిని అధిపతులుగా చేసాడు. వాటిని పరిశీలిస్తే ఆ అధిపతులు తమ ఆధీనంలో ఉన్న వారిని దండం చేత ధర్మాభివృద్ధి గావిస్తాడు. *''ఇంద్రుని దేవతలకు రాజుగా, చేసాడు. సూర్య పుత్రుడు యముని పితరులకు రాజుగా చేసాడు. కుబేరుని ధనానికి, రాక్షసులకు అధిపతిగా , మేరువునకు పర్వతాలకు అధిపతిగా సముద్రుని నదులకు అధిపతిగా చేసాడు. నీటికి, అసురుల యొక్క రాజ్యానికి వరుణుని ప్రభువుగా చేసాడు. మృత్యువును ప్రాణాలకు, అగ్ని దేవుని తేజస్సుకు, శివుడు తనను తాను రుద్రులకు అధిపతిగా చేసుకున్నాడు. విప్రులకు వసిష్ఠుని, వసువులకు జాతవేదుడనే అగ్నిని ,*

*తేజస్సులకు భాస్కరుని , నక్షత్రాలకు చంద్రుని , అంశుమంతుని లతలకు, పన్నెండు భుజాలతో అలరారే శక్తి శాలి అయిన కుమారస్కందుని భూతాలకు రాజుగా నియమించాడు. కాలుని నాలుగు విభాగాలుగా ఉండే మృత్యువుకు సుఖానికి, దుఃఖానికి స్వామిగా చేసాడు. బ్రహ్మ యొక్క చిన్న కొడుకుగా పుట్టిన క్షుపుని ప్రజలకు సమస్త ధర్మ ధరులకు అధిపతి గా చేసాడు .తర్వాత బ్రహ్మ యొక్క యజ్ఞం పూర్తయిన తర్వాత మహాదేవుడు ధర్మాన్ని రక్షించే దండాన్ని సత్కార పూర్వకంగా విష్ణువుకు సమర్పించాడు. విష్ణువు అంగిరసునికి ఇచ్చాడు. అంగిరసుడు ఇంద్ర మరీచులు ఇద్దరికి ఇచ్చాడు, మరీచి భృగువును ఇచ్చాడు. భృగువు ఋషులకు ఇచ్చాడు, ఋషులు క్షుపునకు, క్షుపుడు సూర్యపుత్రుడైన మనువుకు మనవు సూక్ష్మమైన ధర్మార్ధాల కోసం దానిని తన పుత్రులకు ఇచ్చాడు. ధర్మానుసారంగా న్యాయాన్యాయాలను పరిశీలించిన తర్వాతనే దండాన్ని ప్రయోగించాలి. ( సంస్కృత భరతం, శాంతి పర్వం, 122 వ అధ్యాయం).*

దండన ఈ లోకంలో చాలా అవసరం బలవంతులే దండనను ఉపయోగించగలరు.

మహాభారతంలో అర్జునుడు గురువైనా ద్రోణాచార్యుడికి గురుదక్షిణగా ద్రుపద మహారాజుతో యుద్ధం చేసి ద్రుపదుని రథానికి కట్టి తెచ్చి ద్రోణాచార్యునకు అప్పజెప్పాడు. ఒకప్పుడు గర్వంతో ద్రోణాచార్యుని అవమానించిన రాజును ద్రుపదుడు అర్జునుని పరాక్రమం ద్వారా దండన గావించి ద్రుపదుని అహంకారాన్ని అణచాడని తెలస్తుంది.

*''క. వీరెవరయ్యా ? ద్రుపదమ / హారాజులె! యిట్లు కృపణులయిపట్టువడన్*

*వీరికి వలసెనె? యహహ ! మ హారాజ్యమదాంధకార మది వాసెనొకో?*

*(ఆంధ్ర మహాభారతం, ఆది పర్వం, షష్ఠాశ్వాసము,90 వ పద్యం).*

ద్రోణాచార్యుడు ద్రుపదునితో వ్యంగ్యంగా వీరెవరయ్యా ద్రుపద మహారాజులే ఈ విధంగా దిక్కు లేక పట్టుపడవలసిన పరిస్థితి ఏర్పడిందే అహహా మహారాజ్య మదం చేత కలిగిన కన్ను గానని తనం తొలగిపోయిందా? అని మాట్లాడిన తీరు రాజు గర్వాన్ని అణచేరీతిలో మాట్లాడేవిధంగా ఉంది. అప్పుడు ద్రుపదుడు కార్యం చేతనే మిత్రత్వం ఏర్పడుతుంది అన్న మాటకు ఈ విధంగా దిక్కులేని స్థితిలో ఉన్నావని వ్యంగ్యంగా

అంటున్నాడు. ఇక్కడ ఒక రాజుకు దండన విధించడం జరిగింది. ఈ దండన ద్వారా రాజుకు పశ్చాత్తాపం కలిగింది.

సంస్కృత భారతంలో ద్రోణుడు ద్రుపదునికి అర్జునుని పరాక్రమం ద్వారా గురుదక్షిణగా స్వీకరించిన ద్రుపదునికి బుద్ధి చెప్పడమే కాకుండా ఆనాడు ద్రుపదుడు అన్నమాటలు గుర్తుచేస్తాడు. రాజు కానివాడు రాజుకు మిత్రుడు కాలేడు అన్నావు కదా అందువలనే నేను నీ రాజ్యాన్ని అధీనం చేసుకునేందుకు ప్రయత్నించాను. బ్రాహ్మణునికి దయాగుణం ఎక్కువ అందుకని ద్రుపదుని క్షమించి తన రాజ్యంలో అర్థభాగానని ద్రుపదునికి ఇస్తాడు. అంతేకాకుండా భాగీరథికి దక్షిణ భాగానికి ద్రుపదుని, ఉత్తరభాగానికి ద్రోణుడు రాజుగా అవుతారు. ఇప్పుడు ద్రోణాచార్యుడు కూడా రాజు అయ్యాడు కాబట్టి మిత్రునిగా స్వీకరించమని ద్రుపదుని అడుగుతాడు. దానికి ద్రుపదుడు సంతోషించి శాశ్వత మైత్రిని కోరుకుంటాడు. **(సంస్కృత భారతం, ఆది పర్వం, 137 వ అధ్యాయం).**
రాజులు మధ్య స్నేహం ఒక్కొక్కప్పుడు పైకి ప్రేమ లోపల ద్వేషం గా ఉంటుంది కావునే ద్రోణుని ఓడించగల శక్తి సంపన్నుడైన పుత్రున్ని కనాలని ద్రుపదుడు భావిస్తాడు.

హిడింబ, బకాసుర, కీచక, జరాసంధుడు, దుర్యోధనుడు మున్నగువారిని భీముడు చంపుతాడు. ఈ దండన వలన లోకరక్షణ జరిగింది. వీరంతా రాక్షసాంశ వీరందరికి దండన విధించడం వలన ప్రజలు ప్రశాంతంగా జీవించగలుగుతారు. వీరు అందరూ ఏదో రకంగా ప్రజలను , స్త్రీలను , పీడించేవారే అవమానించిన వారే వీరి వలన లోకానికి ఉపయోగం లేని కారణంగా వీరిని దండించడంలో తప్పులేదు.

### 4.36.3. దండం – పూజా విధానం:

దండం అంటే కర్ర అని అర్థం ఇంద్రుడు ప్రజారక్షణార్థం ఉపరిచర వసువు రాజుకు ఒక వెదురు కర్రను ఇస్తాడు. దాని యొక్క ప్రయోజనాన్ని చెప్తాడు. రాజు దానిని గౌరవంగా భావించి పూజలు చేస్తాడు. ఇలా దండాన్ని పూజించడం వలన ఆ రాజ్యం సుభిక్షంగా ఉంటుంది.. సంస్కృత భారతంలో ఈ విధంగా వెదురు కర్ర ప్రాముఖ్యత ఉంటుంది.

*"ఇంద్రుడు ఒక వెదురు కర్రను ఇస్తాడు అది కోరికలను తీరుస్తుంది. సజ్జనులకు రక్షిస్తుంది. అప్పుడు రాజు ఇంద్రుని గౌరవార్థం ఆ కర్రను భూమి మీద ప్రతిష్ఠించి పూజించాడు. ఒక సంవత్సరం గడిచింది. అప్పటి నుండి నేటి వరకు రాజశ్రేష్ఠులు ఆ రాజు చేసినట్లు యష్టి ప్రవేశం చేసేవారు. యష్టి ప్రవేశం జరిగిన మరుసటి రోజున దానికి ఉత్సవం చేస్తారు. దానితో పిటకాలతో గంధమాల్యాలతో భూషణాలతో అలంకరిస్తారు. పూలదండలతో కప్పి దానిని యథావిధిగా హంసరూపంలో ఈశ్వరునిగా పూజించేవారు.*

*ఇంద్రుడు వసురాజుపై ప్రీతితో స్వయంగా హంసరూపం దాల్చి అతడు చేసిన శుభమైన పూజను గ్రహించి సంతుష్టుడై ఇలా అన్నాడు. చేది రాజు ఉపరిచరవసువు చేసిన విధంగా నా పూజ చేసి ఉత్సవం చేసిన రాజులు విజయ సంపన్నులవుతారు వారి రాజ్యాలు సంపదలతో విజయాలతో విలసిల్లుతాయి అంతేకాకుండా ఆ రాజుల ఏలుబడిలోని జనపదాలు క్రమక్రమంగా ఉన్నతిని పొందుతాయి ఇలా అని మహేంద్రుడు ఉపరిచరవుసువును ప్రీతితో సత్కరించాడు. భూమి రత్నాది దానాలతో ఇంద్రోత్సవాన్ని చేసిన మానవులు వరదాన మహాయజ్ఞాదులచే పూజనీయులవుతారు. ఇలా ఇంద్రునిచే పూజింపబడిన వసువు చేది దేశంలో ఉండి ఈ భూమిని ధర్మంగా పరిపాలించసాగాడు. ఇంద్రుని మీద ప్రీతితో చేదిరాజయిన వసువు ప్రతి సంవత్సరం ఇంద్రోత్సవం చేసాడు. (సంస్కృత భారతం, ఆదిపర్వము, 63 వ అధ్యాయము).*

ఈ వివరాలను పరిశీలిస్తే ఇంద్రుని ఆరాధించడం వల్ల ఆ రాజ్యం సుభిక్షంగా ఉంటుందని అర్థమవుతుంది. నేటి పరిపాలకులు కూడా అలా ఇంద్రుడు ఇచ్చిన వెదురు దండాన్ని సంప్రదాయకంగా రాజ్యం కోసం ఆరాధించినట్లైతే భారతదేశం సిరి సంపదలతో తులతూగుతుంది అనడంలో సందేహం లేదు.

నేటి కాలంలో పార్లమెంటు భవనంలోని లోక్ సభ జరిగే హాల్ లో స్పీకర్ స్థానానికి సమీపంలో ఒక రాజదండాన్ని (Sengol) ఏర్పాటు చేసారు. ఇది దేశ గౌరవాన్ని నిర్దేశిస్తుందని భావించాలి.

## 4.37. అర్థశాస్త్రం:

రాజనీతి శాస్త్రాన్ని అర్థశాస్త్రం అన్నారు. భూ సంపాదన పరిపాలనను ఉద్దేశించి చెప్పబడిందని చెప్పబడం చేత న్యాయ పరమైన సంపాదనను రాజు ప్రజల అవసరాలకు వినియోగించి పరిపాలన చేయాలి.

*"రాజ్యం ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలయ్యే రెవిన్యూ మీద ఆధారపడేది. వివిధ వృత్తులలో ఉన్న ప్రజలు ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తుండేవారు. ఆ రోజుల్లో ప్రధానమైన వృత్తులు మూడు అవి కృషి, ( వ్యవసాయం), పశుపాలన, వాణిజ్యం(వ్యాపారం), ఈ మూడింటిని కలిపి వార్త అని పిలిచేవారు. (సత్యనారాయణ, నెల్లూరి, కౌటిల్యుని అర్థశాస్త్రం, పుట:39)*

రాజ్యానికి వచ్చే పన్నుల ద్వారా రాజ్యాభివృద్ధి జరగడం వలన రాజ్య ఆర్థిక పరిస్థితి మెరుగుపడే అవకాశాలు ఉన్నాయని తెలుస్తుంది.

మహాభారతంలో వ్యాసుడు ధర్మరాజు మనశ్శాంతి కోసం అశ్వమేథ యాగం చేయమంటాడు. ఆ యాగంలో అనేక దానాలు, చేయమంటాడు దానికి ధర్మరాజు సరేనని ఒప్పుకుంటాడు వెంటనే అశ్వమేథ యాగంలో అధికంగా దక్షిణలు ఇవ్వవలసిన ఉంటుందని చెప్పారు. ఇప్పుడు నా వద్ద ధనం లేదు యుద్ధంలో చనిపోయిన రాజుల భార్యలు ,శిశువులు మిగిలారు. వారు దుఃఖ సముద్రంలో మునిగి ఉన్న ఈ సమయంలో నేను వారి నుండి ధనం తీసుకోవడం సరియైనది కాదు అంటారు. అది సాధ్యమైన పని కాదు. దుర్యోధనుడు మాపై అసూయతో ఎంతో మంది వ్యసనపరులైన రాజులను అతిగా గుంపులను చేరదీసి ధనాన్ని వ్యర్థంగా  ఖర్చుపెట్టడంవలన  ధనాగారం, భూమి నాశనం అయ్యాయి. దీనికి ప్రత్యామ్నాయ మార్గాన్ని చెప్పమని వ్యాసున్ని అడుగుతాడు.

ఈ మాటల వలన యుద్ధానంతరం ఆర్థిక వ్యవస్థ ఎంతటికి దిగజారిపోయిందో గమనించాలి అంతే కాకుండా ఆర్థికఇబ్బందులు రాజు ఎదుర్కోవడం చేత వాటి భారాన్ని ప్రజలపై మోపడానికి ఇష్టపడటం లేదు. ఇది రాజు యొక్క ఔదార్య గుణం, అయితే

ఆర్థికంగా రాజ్యం పుంజుకోవాలంటే కోశాగారం అభివృద్ధి చెందాలి దానికి ఉపాయం తెలియజేయమని వ్యాసుడుని  అడుగుతాడు.

*అప్పుడు వ్యాసుడు ఒక రెండు గడియలు ఆలోచించి హిమవత్పర్వత ప్రాంతంలో(ఆంధ్ర మహాభారతంలో హిమవత్పర్వతం అని లేదు ) ధనం సమృద్ధిగా ధనం ఉంది దానిని తీసుకుని యాగం చేయమని చెప్తాడు. మరుత్తుని యజ్ఞంలో దానం తీసుకున్న బ్రాహ్మణులు దానిని వదిలి పెట్టేసారు దాని తీసుకురమ్మని చెప్తాడు.'' ( ఆంధ్రమహాభారతం, అశ్వమేధ పర్వం, ప్రథమాశ్వాసం, 14, 15 పద్యాలు,).*

దుర్యోధనుని వంటి ఈర్ష్యా అసూయల చేత రాజ్యంలోని ఖజానా అంతా అనవసరంగా వ్యర్థమయిపోయింది కాబట్టి ధనాన్ని అవసరం మేరకు ఖర్చు చేయాలి కాని ఒకరి మీద విజయం సాధించాలని ధనాన్ని అంతా ఖర్చు చేస్తే అది ఆ రాజ్యానికి ఆర్థిక పరిస్థితులు తగ్గుముఖం పడుతుంది. దుర్యోధనుడు పరాక్రమ పరంగా ఓడిపోయినప్పటికి ఖజానాన్ని అంతా ఖాళి చేసి ఆర్థికపరంగా ధర్మరాజును దెబ్బతీసేడేమో అనిపిస్తుంది. వ్యాసుడే కాని సలహా ఇచ్చి ఉండకపోతే ధనాన్ని సేకరించే మార్గం చెప్పకపోయి ఉంటే రాజ్యాన్ని పోషించడం కష్టమయ్యి ఉండేది.

అంతకు ముందు కూడా పురోచనునితో పాండవులను చంపడం కోసం వారణావతానికి ఒక భవనాన్ని కట్టించమంటాడు ఆ నగరానికి సమీపంగా ఉండాలి. ఎంత ఖర్చు చేసినా సరే మిక్కిలి అందంగా ఉండాలి. జనుము , మద్ది చెట్టు, జిగురు మొదలైన తేలికగా మండే స్వభావం ఉన్న ద్రవ్యాలన్నింటిని భవన నిర్మాణంలో ఉపయోగించమంటాడు. నెయ్యి, నూనె, కొవ్వు, లక్క వంటి వస్తువులను అధికంగా ఉపయోగించి వాటిని  మట్టిలో కలగలసి గోడలన్నింటి తయారికి పై పూతలకు ఉపయోగించమని చెప్తాడు.( సంస్కృత భారతం, ఆది పర్వం, 143 వఅధ్యాయం,).

దుర్యోధనుడు  పదిమందికి ఉపయోగపడవలసిన ధనాన్ని కేవలం రాజ్య కాంక్షతో ధర్మపరులైన పాండవులపై కక్ష పెంచుకుని వ్యర్థం చేసాడు. మూర్ఖుని ఆలోచనలు ఇలానే

ఉంటాయనిపిస్తుంది. భవిష్యత్తును ఏ మాత్రం ఆలోచించకుండా ధనాన్ని విచ్చలవిడిగా ఖర్చుపెడితే దాని వలన కలిగే ప్రయోజనం కన్నా అనర్థాలే ఎక్కువగా ఉంటాయి.

*" పాండవులు చనిపోయిన బంధుమిత్రులందరికి జలతర్పణాలు ఇచ్చారు. మృతశౌచాన్ని పోగొట్టుకోవడానికి గంగానదీ తీరంలో ఒక సమతల ప్రదేశంలో గుడ్డల గుడారాలు ఎత్తించారు. ధృతరాష్ట్ర విదురాదులను,.భరతవంశీయుల భార్యలను ఆ గుడారాలలో ఒక నెలరోజులు ఉంచారు. ఆ సందర్భంలో ధర్మరాజును దర్శించడానికి వ్యాసుడు, నారదుడు, దేవలుడు, దేవస్థాణుడు, కణ్వుడు మొదలైన మునీంద్రులెందరో శిష్యులతో సహా విచ్చేసారు. ధర్మరాజు వారందరికి ఎదురుపోయి నమస్కరించి అర్ఘ్య పాద్యాది పూజా విధులతో సత్కరించి వారిని సంతోషపెట్టాడు. శ్రీకృష్ణుడు, సోదరులూ ఎల్లప్పుడూ తనతో కలిసి ఉంటూ ఉండగా ఆ మహర్షులను ధర్మజుడు సేవించారు. ......(ఆంధ్ర మహాభారతం, శాంతి పర్వం, ప్రథమాశ్వాషము, 2వ వచనం).*

మహాభారతంలోని ఈ వివరాలను కల్లూరి భాస్కరం "**మంత్ర కవాటం తెరిస్తే మహాభారతం మన చరిత్రే**" 'శ్రాద్ధ ఆర్థికత' అనే వ్యాసంలో చర్చిస్తారు. మహాభారతంలో అనేక ఘట్టాలు విశేషాలు ప్రచారంలో లేవు ఎన్నో ఆసక్తికర విషయాలు మరుగున పడిపోయాయి. వాటిలో శ్రాద్ధకర్మ గురించిన విశేషాలు ఒకటి ' ఆదాయం కౌరవుల తద్దినానికి ఖర్చైపోయిందనే నానుడి ఇప్పటికి వింటుంటాం ఇది సహజమైన మాటే తప్ప ఏ మాత్రం అతిశయోక్తి కాదని చెప్తారు. అంతే కాకుండా శాంతి పర్వమే కాకుండా అది ఆత్మ శాంతి పర్వం కూడా భరతవంశీయులందరూ నెలరోజులు రాజధానిని విడిచి పెట్టి గంగా తీరంలో మైల పాటించడం అంటే సామాన్యమైన విషయం కాదంటారు. అక్కడ కుటీరాలు నిర్మింపచేయడానికి శ్రామిక శక్తిని కూడా వినియోగించి ఉండాలి. ఆపైన వంటలు వార్పులకు, ఇతర సేవలు అందించడానికి ఏ సంఖ్యలో సిబ్బందిని నియమించి ఉంటారో ఊహించుకోవచ్చు. దీనికి తోడు, పరామర్శకు శిష్య పరివార సమేతంగా వచ్చే మునుల బతికున్న ఇతర రాజబంధువుల వసతికి, భోజన సత్కారాలకుకూడా పెద్ద ఎత్తున ఏర్పాట్లు జరిగే ఉంటాయి. ఇక చనిపోయిన వీరులకు వారి వారి స్థాయిని బట్టి నిర్వహించే పరలోక క్రియలలో సువర్ణదానం, గోదానం, భూదానం వగైరాలు విధిగా ఉండి తీరుతాయి. ఇలా

లెక్కిస్తే మృతవీరుల అంత్య క్రియలకు పాండవులు వెచ్చించిన సంపద అనూహ్యప్రమాణంలో ఉండడంలో ఆశ్చర్యం లేదు. ఇలా ధన వ్యయాన్ని గురించి కల్లూరి భాస్కర రావు చర్చించారు.

సాధారణంగా మనం గమనిస్తే వీరు చెప్పినట్లు చనిపోయిన వారందరికి శ్రాద్ధ కర్మలు నిర్వహించాలంటే ఖర్చుతో కూడిన మాట నిజమే కాని అదే ప్రధానమైనది అనే విషయాన్ని మనం లోతుగా ఆలోచన చేస్తే అర్ధమవుతుంది.

యుద్ధంలో మరణించిన వారి సంఖ్య గురించి ధర్మరాజు ధృతరాష్ట్రునికి స్త్రీ పర్వంలో తెలియజేసాడు. *యుద్ధంలో నూట అరవై ఆరు కోట్ల ఇరవై వేల మంది చనిపోయారు. (1,66,00,20,000 ) ఇది గాక ఇరవై నాలుగు వేల నూట అరవై అయిదుగురు జాడ తెలియదు. ధృతరాష్ట్రుడు చనిపోయిన వారి సంఖ్యను విని ధర్మరాజుతో చనిపోయిన వారిలో అనాథలు, సనాథులు ఉన్నారు వారి శరీరాలకు విధిపూర్వకంగా దహన సంస్కారాలు చేయగలవా? అని అడిగినప్పుడు వెంటనే ధర్మరాజు కౌంతేయుడైన యుధిష్ఠిరుడు సుధర్ముని, ధౌమ్యుని, సూతుడైన సంజయుని మహామతి అయిన విదురుని కౌరవుడైన యుయుత్సుని ఇంద్రసేనుడు మొదలైన సేవకులను, సారథులందరిని వీరికి ప్రేతకార్యాలను పూర్తిగా జరిపించండి. అనాథ శవం వలె ఏ శరీరము నశింపరాదని ఆదేశిస్తాడు. (సంస్కృత భారతం, స్త్రీ పర్వం,26 వ అధ్యాయం).*

ఈ విధంగా శ్రాద్ధకర్మలు నిర్వహించడంలో ఆర్ధికపరమైన వ్యవహారాన్ని నడిపినట్లు తెలుస్తుంది.

## 4.38. నీతి శాస్త్రం:

నీతి అన్న పదానికి తీసుకుని పోయేది 'చేర్చేది' అని అర్థం అంటే మానవుని సన్మార్గంలోకి తీసుకుని పోయేది. సదాచారణ వైపు చేర్చేది నీతి అని చెప్పవచ్చును. పాలకులను, పాలితులను సన్మార్గంలోకి సదాచారణ వైపునకు తీసుకుపోవడానికి నీతిశాస్త్ర గ్రంథాలు వ్రాయబడ్డాయి.( దామోదర్ రెడ్డి, పామిరెడ్డి, ప్రాచీనాంధ్ర కావ్యాలు రాజనీతి(సి.గ్రం), పుట:05.).

రాజనీతిని శాస్త్రాన్ని ఆకళింపుచేసుకోగలిగితేనే రాజ్యాన్ని సుభిక్షంగా శాంతియుతంగా పరిపాలించగలడని అర్థమవుతుంది.

మహాభారతం ఆనుశాసనిక పర్వంలో శివుడు పార్వతి దేవికి రాజ ధర్మాలను తెలియజేస్తాడు. నీతి పరుడైన రాజు చేతనే ప్రజలు నీతి మార్గంలో వెళతారు.

*"సీ. అధికపుఁదపమున నైనది రాజత్వ – మట్లు గావునఁబేర్మి నతిశయిల్లు*

*జనములచే మ్రొక్కుగొనుటకు నిగ్రహం –బునకు నను గ్రహంబునకు శక్తు*

*డై యుండు నతఁడు తదీయ సనీతియ – విను ముదమున రాజు వినయపరునిఁ*

*జేసి యెల్ల జనంబు శిక్షించు, నింద్రియ – జయమును నరి వర్గజయముఁబడయు*

*తే. నఱఁగి యుపధా విశుద్ధుల నిడు నమాత్య – పదవి , కనురక్త సారవద్బలముఁబ్రోచు*

*హిత వరుల మిత్రులుగఁగొను నెలకు మేలు– వర్చు, దుర్గంబు రక్షించుఁ గూర్చు*

*ధనము.( ఆంధ్ర మహాభారతం, అనుశాసనిక పర్వం, పంచమాశ్వాసం, 45 వ పద్యం).*

రాజనేవాడు ఎలా ఉండాలో ఈ పద్యం వివరిస్తుంది. ఎన్నో తపస్సులు చేస్తే తప్ప రాజ పదవి రాజు గౌరవపాత్రుడై వెలుగొందుతాడు. భూపతి జనుల నమస్కారాలు గైకొనడానికి వారిని దండించడానికి దయతో కాపాడటానికి తగిన వాడై ఉంటాడు. అతడు అనుసరించే మంచినీతి అతనిని అణకువగా కలవాడినిగా తీర్చిదిద్ది ప్రజలందరిని నీతి మార్గంలో నడిపిస్తుంది. ఆ నీతి వలననే రాజు ఇంద్రియ జయం పొంది శత్రువులను జయించగలుగుతాడు. చక్కగా యోచించి గుణ శీల పరిక్షలో ఉత్తీర్ణులైన పవిత్రులను మాత్రమే మంత్రి పదవులలో నియమిస్తాడు. తనయందు ప్రేమ విశ్వాసాలనున్న చేవగలిగిన సేనలను దయతో పోషిస్తాడు. తనకు మేలు చేసే వారితోనే స్నేహం చేస్తాడు వారితో తన దగ్గరకు చేర్చుకుంటాడు. అతడు అనుసరించే నీతి జనులకు క్షేమం కలిగిస్తుంది. దుర్గాన్ని రక్షిస్తుంది. ధనాన్ని సమకూరుస్తుంది.

## 4.39. **రాజనీతి – రాజ్య పరిపాలన – ప్రముఖుల అభిప్రాయాలు:**

రాజనీతి పరిపాలన గురించి రాజ్యం లో రాజు ఏ విధంగా తన పరిపాలన కొనసాగితే రాజ్యం బాగుంటుందో ఆధ్యాత్మిక ప్రముఖులు ముఖాముఖిలో వివరించారు. పరిపాలకుల గురించి బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ ముఖాముఖిలో

మహాభారతంలో కృష్ణున్ని , ధర్మరాజును, దుర్యోధనుడిని, కర్ణుడిని వీరినందరి ప్రవర్తనలను బాగా పరిశీలించి పరిపాలకులు ఎలా ఉండాలి, ఎలా ఉండకూడదో తెలుసుకొని పరిపాలన చెయ్యాలని తెలియజేసారు. (చూడు: అనుబంధం 2, వద్దిపర్తి పద్మాకర్ ముఖాముఖి).

ఈ వివరాలను గమనిస్తే నేటి పరిపాలకులు కృష్ణుణ్ణి, ధర్మరాజును, దుర్యోధనుడిని, కర్ణుడిని వీరందరి వ్యక్తిత్వాలను వారు చేసినటువంటి కార్యాలను, ధర్మాలను, తెలుసుకుని పాటించడం ఒక పద్ధతి అయితే దుర్యోధనాదులు ,కర్ణుడు మున్నగువారు వారి దురాలోచనతో ఏ విధంగా చివరకు అధోగతి పాలయ్యారో తెలుసుకుని వారి ఆలోచనల్లాగా మనం ఆలోచించకుండా జాగ్రత్త వహించాలని తెలుస్తుంది. చేదు రుచి తెలిస్తేనే తీపి యొక్క గొప్పతనం తెలుస్తుంది. అలాగే చెడ్డవారి చెడు పనులను దాని ఫలితంగా వారు నష్టపోవడాన్ని గమనిస్తేనే మంచి యొక్క విలువను గుర్తించగలుగుతాము.పుత్రుడు సక్రమంగా లేకపోతే ఆ వంశం నశిస్తుంది భారతంలో కురువంశం నాశనమవ్వడానికి  పరోక్షంగా గాంధారి పాత్ర కూడా ఉందని వీరు తెలియజేసారు.

*బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ ముఖాముఖిలో  భర్తకు కళ్ళు లేవని గాంధారి తన కళ్లకు గుడ్డ కట్టుకోవడం వలన పాతివ్రత్యం అనిపించుకోదు భర్తకు అవయవ లోపం ఉన్నప్పుడు దగ్గరుండి సేవ చేయాలి కాని ఇలా గుడ్డకట్టుకోవడం వలన తను ఇంకొకరి మీద ఆధారపడవలసి వచ్చింది. దుర్యోధనుని దారిలో పెట్టలేక పుత్రశోకానికి గురైందని వీరు వివరించారు.* (చూడు: అనుబంధం 2, వద్దిపర్తి పద్మాకర్ ముఖాముఖి).

ఈ విషయాన్ని గమనిస్తే వంశం బాగుపడడానికి తల్లి పాత్ర కీలకమైనదిగా తెలుస్తుంది. వీరు చెప్పినట్లు గాంధారి తన పుత్రున్ని భయం చేతనైనా అదుపులో పెట్టుకోగలిగితే ఇంత నాశనం జరిగేది కాదు తప్పంతా తన దగ్గర పెట్టుకుని చివరలో శ్రీకృష్ణుడే కురు వంశనాశనానికి కారణమని నిందిస్తుంది, శపిస్తుంది. ఇది కేవలం మూర్ఖత్వపు ఆలోచనతో చేసిన పని, శ్రీకృష్ణుడికి భవిష్యత్తు తెలిసిన వాడు కాబట్టి గాంధారి పై కోపపడకుండా వంశనాశనానికి కారణాన్ని తెలియజేసాడు.

*" యత్ త్వం పుత్ర దురాత్మానమ్ ఈర్షుమత్యంతమానినమ్*
*దుర్యోధనం పురస్కృత్య దుష్కృతం సాధు మన్యసే*
*నిష్ఠురం వైరపురుషం వృద్ధానాం శాసనాతిగమ్*
*కథమాత్మకృతం దోషం మయ్యాధాతుమిహేచ్ఛసి" ( సంస్కృత భారతం, స్త్రీ పర్వం, 25 వ అధ్యాయం, 3 వ శ్లోకం).*

గాంధారితో ఈ విధంగా అంటాడు. గాంధారి వలనే కౌరవులు నశించారని, దుర్యోధనుడు దురాత్ముడు, ఈర్ష్యకలవాడు, ఆత్మాభిమాని , క్రూరుడు , రూపు కట్టిన శత్రుత్వం వంటి వాడు పెద్దల మాటను అతిక్రమించేవాడని, చెడ్డపనులపై ఆసక్తిగలవాడు. అటువంటి వాడిని ముందు నిలుపుకుని మంచి వాడని భావిస్తున్నావు నీవు చేసిన తప్పును ఇక్కడ నామీద ఎలా పెడతావని అడుగుతాడు.

ఈ విషయాలను చూస్తే గాంధారి తన కళ్ళకు గంతలు కట్టుకుని ఎవరో చెపితే తప్ప తన కుమారుడు ఏమి చేస్తున్నాడు, ఎలాంటి మార్గంలో ప్రయాణం చేస్తున్నాడు తన వంశాన్ని అభివృద్ధిచేసే పనులు చేస్తున్నాడా లేదా వంశవినాశనానికి కారకుడవుతున్నాడా వంటి అంశాలను గ్రహించకుండా దాని గురించి ఆలోచించకుండా తన పుత్రులంతా మరణించాక శోకాన్ని పొంది ఇతరులను నిందిస్తే ఎటువంటి ప్రయోజనం లేదు. పైగా పుత్రునిలో దుర్మార్గపు బీజాన్ని గమనించాల్సింది తల్లే అలా లేనప్పుడు కొడుకు చెడ్డవాడై పాడైపోతాడు. అందులో క్షత్రియకాంత పుత్రుడుని మరింత జాగ్రత్తగా పెంచాలి అలా పెంచినప్పుడే రాజ్య పరిపాలన చేసేటప్పుడు నిజాయితీగా పరిపాలిస్తాడు. దుర్యోధనుడు లా

స్వేచ్ఛగా జీవించే వ్యక్తికి రాజ్యపరిపాలన కాంక్ష ఉండడమనేది ప్రమాదకరమైనది. శ్రీకృష్ణుడు చెప్పిన దుర్యోధనుని అవగుణాలు రాజుకు అనర్థాలు. అయినప్పటికి మూర్ఖత్వంతో దుర్యోధనుడు తన వంశవినాశనాన్ని తానే తెచ్చుకున్నాడు.

ఇదే విషయమై ఇంద్రంటి నరసింహ మూర్తి '**ఈనాడు అంతర్యామి** లో ఈ విధంగా చెప్పాడు.'' గాంధారి పుత్రులపై వ్యామోహంతో తన పుత్రుడు దుర్యోధనుడు యొక్క దుష్టత్వాన్ని మంచి వ్యక్తిత్వం కలవాడుగా భ్రమించిందని, వ్యర్థంగా కలహాలు పెట్టుకుని , పెద్దలు, వృద్ధుల ఆజ్ఞలను ఉల్లంఘించిన దుర్యోధనున్ని అదుపులో పెట్టుకోలేకపోయిందని వీరు తెలుపుతారు. (https://www.eenadu.net/telugu-news/antaryami/general/1100/123165923

ఈ చర్చనంతటిని గమనిస్తే రాజు అయినా ఒక తల్లికి పుత్రుడే ఆ పుత్రుడు చెడ్డవాడైతే రాజ్యపరిపాలన కూడా దెబ్బతింటుంది. కాబట్టి రాజనీతిలో స్త్రీ పాత్ర కూడా ప్రధానమైనదిగానే పరిగణించాలని ఈ విషయాలు స్పష్టం చేస్తున్నాయి.

అవధూత గణపతి సచ్చిదానంద స్వామి రాజనే వాడు ఎలా ఉండాలో, ముఖాముఖిలో

రాజు ధర్మాన్ని ఆచరిస్తూ సుఖంగా ఉండాలి. తన శక్తినీ, శత్రువుల శక్తినీ బాగా పరిశీలించుకొంటూ ఉండాలి. శత్రువు బలిష్ఠుడైనప్పుడు సంధి చేసుకోవాలి. వ్యవసాయం, వ్యాపారం, యుద్ధం, సేతువు, గజబంధనం, గనులలో రాజాదాయాన్ని పొందటం, బంగారు గనులు వెతికించటం అనే అష్టకర్మలు చేసి కోశాగారం పెంచుకోవాలని ఇంకా నారదుడు సభాపర్వం లో ధర్మరాజుకు చెప్పి ఉన్నాడని తెలియజేసారు.

వీరు చెప్పిన ఈ వివరాలను గమనిస్తే రాజు రాజుయొక్క కోశాగారం ఎలా పెంచుకోవాలి. భగవంతుడే రాజు రూపంలో ఎలా వచ్చాడు వంటి విషయాలన్నీ ప్రస్ఫుటంగా వివరిస్తారు. మనం భగవంతుడిని ఏ విధంగా ఆరాధిస్తామో రాజు ను ఆ విధంగా గౌరవించడం వలన మనం మన ప్రాంతం సుభిక్షంగా ఉంటుందని తెలుస్తుంది.

బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ముఖాముఖిలో రాజు తన గీత కర్మ యందు శ్రద్ధాసక్తుడై ఉండాలి. తాను ఏది చేయాలో దాని యందు ఏమరపాటు ఉండకూడదు. ఏది నిషిద్ధములో రాజు వేటికి వశపడితే పరిపాలన దెబ్బతినే అవకాశం ఉంటుందో అటువంటి నిషిద్ధమైన విశేషాలు జోలికి రాజు వెళ్ళకుండా ఉండడమే రాజుకు ఉండవలసిన ప్రధాన లక్షణం నియమం. (చూడు:అనుబంధం -2 బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు , ముఖాముఖి).

రాజు ఎటువంటి వ్యసనాలకు గురికాకుండా రాజు జాగ్రత్తవహించాలని వీరి మాటల్లో తెలుస్తుంది.

*బ్రహ్మశ్రీ సామవేద షణ్ముఖ శర్మ ముఖాముఖిలో రాజు భోగలాలసుడు కారాదు. ధర్మం ప్రజారంజనం ప్రధానంగా ఉండాలి. ప్రధానంగా భీష్ముడు శాంతి పర్వంలో చెప్పిన రాజధర్మాలు, ఉద్యోగపర్వంలో విదురుని మాటలు, నారదుడు (సభాపర్వం), ధర్మ రాజుకు చెప్పినవి రాజలక్షణాలను వివరిస్తాయని చెప్తూ నేటి కాలంలో పరిపాలకులకు మహాభారతం ఇచ్చే సందేశం ఏమిటో వివరించారు.*పాలకునకు *ప్రజలే శరీరం ప్రజలకు పాలకుడు ఆత్మ ఒకరి నొకరు రక్షించుకోవాలి. ప్రజాక్షేమమే పాలకునకు ప్రధాన ధర్మం 'ఇది భారతం చెప్పిన సందేశమని వీరు తెలిపారు.* (చూడు:అనుబంధం -2, సామవేదం షణ్ముఖ శర్మ, ముఖాముఖా).

ప్రజలు సంతోషంగా ఉన్నారు అంటే పరిపాలకుడు సరైన పద్ధతిలో పరిపాలన చేస్తున్నాడని అర్థం. అంటే ప్రజల క్షేమమే పరిపాలకుడకు ప్రధాన విషయంగా ఉండాలని వీరి మాటల్లో వ్యక్తమవుతుంది. అయితే నేటి కాలంలో పరిపాలకులు ఏదైనా సభలు సమావేశాలు ఏర్పాటు చేస్తే ప్రజలు ఆ పరిపాలకుల ఉపన్యాసం వినడానికి ఆసక్తిని చూపలేకపోతున్నారంటే దానికి అనేక కారణాలు చెప్పుకోవచ్చు ఒకటి పరిపాలన కుంటుపడి ఉంటుందని ఎప్పుడు పరిపాలన కుంటుంపడుతుంది. అంటే ప్రజలు నివసించడానికి , సమాజంలో తన కర్తవ్యాన్ని నెరవేర్చడానికి కావలసిన వనరులు ప్రభుత్వం కల్పించకపోయినప్పుడు , కనీస అవసరాలు ప్రజలకు అందకపోవడం, ఇవన్నీ

కారణాలుగా చెప్పవచ్చు. ఇటువంటి చిన్న చిన్న సమస్యలను పరిష్కరించకుండా పథకాల పేరుతో ప్రజలకు దగ్గర అయ్యి రాజకీయ జీవితాన్ని పరిపాలకుడు గడపాలనుకోవడం ఎంత వరకు సమంజసమో మనకు మనమే ప్రశ్న వేసుకుంటే అర్థమవుతుంది. కాబట్టి బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గారి మాటల్లోని ప్రధాన విషయం ఏమిటంటే పాలకునకు ప్రజలే శరీరం గా పాలన చేయాలి. ఏ తప్పు జరిగినా మన శరీరం మన వశం తప్పుతుంది అలాగే పాలన ఏ కోణంలో దెబ్బతినినా ప్రజల్లో తీవ్రమైన మార్పు వచ్చి తిరగబడే అవకాశం ఉందని నా అభిప్రాయం. అలాగే ప్రజలకు పాలకుడు ఆత్మ అన్నారు. అంటే పాలకుడు వేసే ప్రతి అడుగు ప్రతి చర్య ప్రజలు గమనిస్తూనే ఉంటారు. మనం ఒక తప్పు చేస్తే మన అంతరాత్మ ఏ విధంగా హెచ్చరిస్తుందో పాలకుడు తప్పు చేస్తే ప్రజలు కూడా అలాగే హెచ్చరిస్తారు,

రాజు అనే వాడు ఎలా ఉండాలో ప్రాచార్య శలాక రఘునాథ శర్మ గారు ముఖాముఖి లో

రాజైనటువంటి వాడు ప్రజలందరిని నడిపించేవాడు కనుక స్వార్థ రాహిత్యంతో రాజు ఉండాలి..భీష్ముడు  శంతనుడు ఒకసారి రాజ ధర్మానికి విరుద్ధంగా తన ధర్మాన్ని వ్యక్తి ధర్మం మీద దృష్టి పెడితే కొడుకు తండ్రిని సుకుమారంగా దారిలో ఎలా పెట్టాడో వీరు వివరించారు.(చూడు: అనుబంధం 2, ప్రాచార్య శలాక రఘునాథ శర్మ, ముఖాముఖి).

ఈ విషయం చాలా రాజరిక వ్యవస్థలో చాలా కీలకమైనది రాజు ఇంద్రియనిగ్రహం కోల్పోయి ప్రవర్తిస్తే ప్రజాపరిపాలన దెబ్బతినే అవకాశం ఉంది. రాజు అనగానే అతను ధీరోదాత్తుడుగా జీవించాలి అంటే దుఃఖాన్ని, సుఖాన్ని సమానంగా స్వీకరించాలి. ఒక రకంగా చెప్పాలంటే స్థితప్రజ్ఞుడిగా జీవించాలి. అలాంటి రాజే సౌఖ్యాల కోసం తను ఉన్న స్థానాన్ని మరచి పోయి ప్రవర్తిస్తే అది రాజ్యానికి ప్రమాదకరమనే విషయాన్ని భీష్ముడి పరోక్ష సంభాషణ వ్యక్తం చేస్తుందని ప్రాచార్య శలాక రఘునాథ శర్మగారు చెప్పిన దానిలోని అంతరార్థమని తెలుస్తుంది.

సద్గురు శ్రీదేవి సెట్టి చలపతిరావు ముఖాముఖిలో ‘‘రాజైనటువంటి వాడు మొట్టమొదటిది ఏమిటంటే ప్రజల యొక్క క్షేమాన్ని కాంక్షించాలి. ఏ పని చేసినా ప్రజలకు మేలు కలుగుతుందా లేదా అని జాగ్రత్తగా ఆలోచించి చేయాలి. రాజే స్వయంగా మారు వేషంలో ప్రజల్లోకి వెళ్ళి పరిపాలన ఎలా సాగుతుందో గమనించాలని వీరు తెలియజేసారు.(చూడు: అనుబంధం 2, సద్గురు శ్రీదేవిసెట్టి చలపతిరావు ముఖాముఖి).

రాజు ప్రజలలోకి చేరి వారి సమస్యలను పరిష్కరించాలని ఈ మాటలను బట్టి తెలుస్తుంది. అంతేకాకుండా తనవారు ఇతరులు అనే భేదం లేకుండా అందరికి సమన్యాయం చేసేవాడు నిజమైన రాజు అనే భావం వారి మాటల్లో స్ఫురిస్తుంది.

వెంపరాల వెంకట లక్ష్మీ శ్రీనివాసమూర్తి గారు ముఖాముఖిలో

‘‘రాజనీతి అంటే ఒక స్వలాభ ఆపేక్ష లేకుండా ఒక ఋజు ప్రవర్తన ద్వారా ఒక ధార్మికంగా చక్కని పరిపాలనను అందించడమే రాజనీతి. రాజనీతి అనేది ఎప్పుడూ సూక్ష్మంగా , స్థూలంగా ఒక మంచి పరిపాలనను సంక్షేమాన్ని అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు అందివ్వడమే రాజనీతి. మారుతున్న కాలంలో రాజనీతి అంటే ప్రజాస్వామ్య పరిపాలన కొనసాగుతుంది ప్రజాస్వామ్యానికి ఎప్పుడైనా విఘాతం కలిగితే ప్రజల్లో చైతన్యం వస్తుందని వీరు తెలియజేసారు.(చూడు: అనుబంధం 2, వెంపరాల వెంకట లక్ష్మీ శ్రీనివాస మూర్తి, ముఖాముఖి).

పరిపాలకుడు అనే వాడు ప్రజల యోగ క్షేమాలే ధ్యేయంగా ఎంచుకుని పరిపాలన సాగినప్పుడే ప్రజాస్వామ్య పరిపాలనకు సార్థకత ఏర్పడుతుందని వీరి మాటల్లో వ్యక్తమవుతుంది. అలాగే పరిపాలన వ్యవస్థ కుంటుపడినప్పుడు పరిపాలనలో లోపాలు జరిగినప్పుడు ఆ లోపాలు దీర్ఘ కాలం అలానే కొనసాగినప్పుడు ప్రజలు సహనాన్ని కోల్పోయి ప్రజారక్షణ కోసం క్రొత్త విధానాలను తీసుకువచ్చే పరిస్థితి నెలకుంటుంది. పరిపాలన వ్యవస్థ అంతతారుమారు అయిపోతుంది. ఇటువంటి పరిస్థితి రాకముందే పరిపాలకులు జాగ్రత్త వహించాలని, న్యాయమైన పరిపాలనను ప్రజలకు అందించాలని వీరి మాటల్లో వ్యక్తమవుతుంది.

*"మహాభారతల కాలంలో రాజరిక వ్యవస్థ నడుస్తుంది, ఈ కాలంలో ప్రజాస్వామ్య వ్యవస్థ నడుస్తుంది. ఆ కాలానికి ఈ కాలానికి భేదమే లేదు. నేటి కాలంలో స్వలాభాపేక్ష ఎక్కువగా ఉంది. ( చిర్రావూరి శివరామ కృష్ణ శర్మ, ముఖాముఖి).*

రాజరిక వ్యవస్థలో రాజే ప్రధాన సూత్రధారియై పరిపాలన సాగిస్తాడు రాజ శాసనం ప్రజలు చక్కగా పాటించేవారు, నేటి కాలంలో స్వార్థ పూరితమైన రాజరికం నడవడంతో ప్రజలు కష్టాలు పడే సందర్భాలు వస్తున్నాయని వీరి అభిప్రాయంగా తెలుస్తుంది.

"పౌరుల గురించి  చెప్పుకొచ్చేది రాజ్యాంగాన్ని గురించి చెప్పుకువచ్చేది రాజకీయ ఉద్యమాల గురించి చెప్పుకు వచ్చేది భిన్నమైన అంశాల గురించి వివరించే టటువంటిదే ఈ రాజనీతి అనేటటువంటిది.  రాజుగా అధికారంలో కూర్చుని ప్రజలపై అధికారాన్ని చెలాయిండం మాత్రమే రాజనీతి కాదు ఒక వేళ అధికారం నియంతృత్వంగా ఒక డిక్టోరియల్ గా అథారిటీయల్ గా తయారైనప్పుడు దానిని ప్రశ్నించడం కూడా రాజనీతే అని

పాలకులకు ప్రజలను అణచి వేసో  లేకపోతే ఆధిపత్యాన్ని కొనసాగించడానికి అధికారాన్ని ఉపయోగించి చేయడానికి రాజ్యం ఎప్పుడు కూడా సిద్ధాంతీకరించుకుంటుంది. న్యాయబద్ధత కల్పించుకుంటుంది. అంటే కోర్టు ద్వారా కాని శాసనసభ ద్వారా కాని లేకపోతే కార్య నిర్వహణ శాఖ దగ్గర కాని మీడియా నుండి కాని ఇంకా ఈ మతం కాని సంస్కృతి కాని వీటినుండి అంటే భిన్నమైనటువంటి వాటి నుండి కూడా సూత్రీ కరించుకుంటుంది. న్యాయబద్ధత చేసుకుంటుంది. లెజిస్లేటివ్ సంపాదించుకుంటుంది. అది same time అధికారమనేటటువంటిది ప్రజలకు వ్యతిరేకంగా తయారైనప్పుడు ప్రజలు ప్రశ్నించడం కూడా రాజనీతి సిద్ధాంతం అది కూడా రాజనీతి భావనే ప్రశ్నించడం, తిరుగుబాటు చేయడం ఆందోళన చేయడం, ఉద్యమాలు చేయడం కూడా రాజనీతే

అందుకని రాజనీతి అనేది ఒక మల్టిడైమన్షియల్ కాన్సెప్ట్ అంటే భౌముఖ్యమైన కాన్సెప్ట్.(చూడు:అనుబంధం –2).

ఒక పదవిని పొందడమే రాజనీతి కాదు ప్రజాపరిపాలనలో ప్రజలు తమ హక్కులకు భంగం కలిగిందని భావించినప్పుడు చేసే ప్రజాఉద్యమాలు కూడా రాజనీతి క్రిందకు వస్తాయని వీరు వివరించారు. పరిపాలకులు సక్రమంగా ఉన్నప్పుడు ప్రజలకు ఎటువంటి అసౌకర్యం ఉండదు పాలన అస్తవ్యస్తమైనప్పుడు మాత్రమే ప్రజలు ఆ పరిపాలకుని పాలన వద్దని, ధర్నాలు, ఉద్యమాలు చేసే అవకాశం ఉందని వీరు తెలియజేసారు.

పాండవులు ఏక చక్రపురం వెళ్ళి నివాసం ఉంటున్నారు అక్కడ బకుడనే రాక్షసునితో ప్రజలు  చేసిన ఒప్పందం ప్రకారం రోజుకు ఒక మనిషి బండెడు అన్నము, రెండు దున్నపోతులు, ఆహారంగా నిర్ణయించబడుతారు. పాండవులు ఆశ్రయం పొందిన వారి ఇంటిలో ఒకరు ఆ రాక్షసుని దగ్గరకు వెళ్ళే వంతు వచ్చింది. ఆ ఇంటి వారి ఆర్తనాదాలు విన్న కుంతి వారి పరిస్థితికి గల కారణం తెలియజేయమంటుంది. ఆ బ్రాహ్మణుడు యమునా నది తీరంలో ఒక గుహలో నివసిస్తున్న బకాసురుని గురించి చెప్తాడు. అతనే ఈ దేశాన్ని, నగరాన్ని కూడా ఆ రాక్షస రాజే తన రాక్షస బలంతో రక్షిస్తుంటాడు. ఆ కారణంగా శత్రువుల నుండి కాని ఇతర ప్రాణుల నుండి కాని మాకు భయం లేదని చెప్తాడు అంతేకాకుండా ఇటువంటి ఆహారాన్ని చాలా సంవత్సరాల తర్వాత ఒకసారి వచ్చినప్పటికి మానవులకు అది ఆచరించడానికి కష్టం ఉండేదని చెప్తూ ఈ దేశానికి రాజు వేత్రకీయగృహమనే ప్రదేశంలో నివసిస్తుంటాడు. మంద బుద్ధి గల రాజు ఏదో ఒక నీతినో ఉపాయాన్నో ఆలోచించి గట్టి ప్రయత్నం చేయడం లేదు. అలాచేసి ఉంటే ఈ నగరంలోని జనులందరికి ఈ బకుని పీడ శాశ్వతంగా వదిలిపోయి ఉండేది. మాకు ఈ గతికి తగిన వారమే ఎందుకంటే చెడ్డ రాజును ఆశ్రయించాము. దుర్బలుడైన రాజు కల దేశంలో శాశ్వతంగా నివసిస్తున్నాము.

ముందుగా మంచి రాజును పొందాలి. తర్వాత భార్యను పిదప ధనాన్ని సంపాదించుకోవాలి. ఈ మూడు సంపాదించుకున్న పిదప బంధువులను, పుత్రులను

ఉద్ధరించే ప్రయత్నం చేయాలి. నేను మూడింటిని సాధించాను కాని అవన్నీ తారు మారుగా చేసాను ఆ కారణంగానే మేము ఆపదను పొంది అందరం దుఃఖిస్తున్నామని చెప్తాడు. (సంస్కృత భారతం, ఆదిపర్వం, 159 వ అధ్యాయం).

ఈ కథ వలన ఒక మంచి రాజు లేకపోవడం చేత ఆ రాజ్యం రాక్షసుల వశమైనదని అర్థమవుతుంది. అంతే కాకుండ రాజు అసమర్థత వలన రాక్షసులను నివారించే ప్రయత్నం చేయకపోవడం వలన ప్రజల్లో రాజు పై అసహనాన్ని వ్యక్తం చేసారని అర్థమవుతుంది. అటువంటి రాజు వలన ఎటువంటి ప్రయోజనం ఉండక పోగా ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటారు.

అలాగే ఒక వ్యక్తి ముందు తను ఏ రాజ్యంలో ఉంటే సుఖంగా జీవించగలుగుతానో తెలుసుకుని రాజు యొక్క గుణగణాలను విచారణ చేసి ఆ రాజ్యంలోకి అడుగుపెట్టాలని, తర్వాత భార్యను, ధనాన్ని సంపాదించాలని తర్వాత తన వారందరి బాగోగులను చూసే స్థితికి చేరినట్లయితే ఆ వ్యక్తి జీవితం సజావుగా సాగుతుంది. ప్రజలందరూ కూడా సుఖ జీవనాన్ని గడుపుతారని తెలుస్తుంది.

## 4.40. గణజనులు – పాలించే విధానం:

గణజనులను మహాభారతం ఈ విధంగా వివరించింది. గణజనులు అంటే వివరణ ఇస్తూ కోశాగారం నింపే కోశాధికారులూ, ఎంతో చాకచక్యంగా పనులను చక్కబెట్టే అమాత్యులు, ఆయుధ ధారలైన సైనికులు మిగతా పనులు చేసే పరిజనం గణ జనులవుతారు. ప్రిజనులు ఒకే తరగతికి చెందిన సామాన్యులుగా ఉంటారని వీరినే గణ జనులు అంటారని ఆంధ్రమహాభారతంలో ధర్మరాజుకు భీష్ముడు చెప్తాడు. రాజు వీళ్లందరిని ఒక కంట కనిపెడుదూ వారికి శుభాలను కలిగించే ఉపాయాన్ని సిద్ధింపచేయడానికి ఆయా వాళ్ల తీరులను తెలుసుకోవాలి.

*సీ. కుల మొక్కఁడైనఁదేకువ లేక బుద్ధియు / శౌర్యంబుఁ బెంపును సరకుగొనక*

*యెట్టి వారలతోడ నెవ్వరైనను మత్స / రంబు గల్గుదురు గణంబు జనులు*

*దాన నంతర్భేదమైన శత్రులు వాపి / కొంద్రు గొందఱ నది గ్రొచ్చురాజ్య*

*మూలంబుఁ గావున మున్ను భూపాలుండు/ వారినందఱఁదగు వచన రచన*

*తే. నీగి మన్ననఁ గలఁగంగనీక పొదివి/ యధికముగ గణముఖ్యుల నాదరించి*

*పనులు గొనునది తమలోనఁ బాయకుండఁ / బ్రోవు లెడలిన రాజ్యంబు పులుపు దప్పు.( ఆంధ్ర మహాభారతం, శాంతి పర్వం, తృతియాశ్వాసం, పద్యం, 40).*

గణజనులు కొంత పౌరుషంతో జీవిస్తారని ఎవరిని లెక్కచేయరని, అంతర్గతంగానే విరోధాలు ఏర్పరుచుకుంటారని వీరి బలహీనతలను ఆసరాగా తీసుకుని శత్రువులు వీరిని చేరదీసే అవకాశం ఉందని వాళ్లందరిని రాజు మంచి మాటలు చెప్పి దాన ధర్మాలు చేసి, గౌరవించి ఆదరించాలని వాళ్ళు విడిపోకుండా పనులు చక్కదిద్దుకోవాలి వీరు కలిసి ఉంటేనే రాజ్యానికి సంపద చేకూరుతుందని తెలుస్తుంది.

ఈ గణ జనుల గురించి మూలంపల్లి చంద్ర శేఖర శర్మ ఈ విధంగా చర్చిస్తారు. *"వ్యాసుడు గణములను సంఘాత వృత్తులని అన్నాడు (గణాస్సంఘాత వృత్తయః)అనగా గుంపులుగా కలసి పని చేయువారని భావము. ఇంకను వారిని గూర్చి ఇట్లు వివరించెను. వారు శాస్త్ర ప్రకారంగ ధర్మిష్ఠమైన వ్యవహారములను స్థాపించుచు తత్త్వము ఉన్నది ఉన్నట్లుగా జూడగలుగటచే వ్యవహారమున వృద్ధి చెందుదురు. వీరు గుణోత్తములు, న్యాయవాద వృత్తిని న్యాయాధికార వృత్తిని బాగుగా నిర్వహింపగలవారు. వారు పుత్రులను సోదరులను నిగ్రహించి వారిని తమ వెంట వేసుకుని వినీతులను చేసి యెక్కు ధనమార్జింతురు. చార, మంత్ర విధానములలోను కోశములు గూర్చుటలోను నిత్య సమర్థులై యుందురు. వారు ప్రాజ్ఞులను శూరులను పనులలో మహోత్సాహులను, స్థిరమైన పౌరుషము కలవారిని గౌరవించు విజ్ఞతా సామర్థ్యములు కలవారుగా ఉంటారు. గణములతో పాటు 'కులములు' అను జాతులున్నట్లు 'గణానాంచ కులానాంచ' అను శ్లోకమున సూచితమగుచున్నది. శైవ శాక్తేయులు చెప్పే గుణాచార కులాచారములు ఈ గణకులములకు చెందినవై ఉండునని ప్రమథ గణములలోని గణములు కూడా వీరే కావచ్చును కౌలమార్గము అవలంబించుకులము కావచ్చును.మొత్తం పై నీ గణజాతి*

*కులజాతియు రాజున కన్ని  రంగములలోను మిక్కిలి ఉపయోగించు సర్వ సమర్ధములైన జాతులని తూచును. ప్రపంచ జాతులలో యూదులకు ఈ జాతి లక్షణములు పట్టుచున్నవి. వారి భేదమునే జర్మన్ దేశము ఓడవలసి వచ్చినది. అది బుద్ధిజాతియు, బల శౌర్య జాతియునైన ఒక విశిష్ట జాతియని వ్యాసుని వివరణములను బట్టి ఊహింపవీలగుచున్నది.'' ( చంద్ర శేఖర శర్మ, మూలం పల్లి, మహాభారతము విశ్వ విజ్ఞానకోశము ,పుట: 335,336).*

ఈ విషయాలన్నీ సమూహంగా జీవించే వారు రాజ్యానికి రాజుకు ఏ విధంగా ఉపయోగపడతారో తెలియజేయడంతో పాటు గణ సమూహాలుగా ఉన్న వారు ఏ వృత్తులను ఆశ్రయించిన వారై ఉంటారని వారు ఏ జాతి లక్షణాలు కలిగిన వారై ఉంటారని మున్నగు విషయాలను పైన ప్రస్తావించడం జరిగింది.

గణజనులు ప్రధానంగా విడిపోవడానికి గల కారణాలను సంస్కృత భారతంలో ఈ విధంగా వివరిస్తారు.

*''లోభమేకో హి వృణుతే తతో2మర్షమనంతరమ్*

*తౌ క్షయవ్యయసంయుక్తౌ అన్యోన్యం చ వినాశినౌ'' (సంస్కృత భారతం, శాంతి పర్వం, 107 వ అధ్యాయం, ).*

గణాలలో కాని కులాలలోగాని రాజులలో కాని విరోధాన్ని కలిగించేవి లోభము, ఆర్షము అని చెప్తూ ఒక లోభాన్ని కావాలని అనుకుంటాడు అంటే ఇతరుల ధనం తనకు కావాలని అనుకుంటాడు. తర్వాత ఎదుటి వానిలో ఆమర్షం కలుగుతుంది. (లోభి పట్ల కోపం ఏర్పడుతుంది ) వీటి పట్ల బానిసుడైన వాడు వ్యక్తుల సమూహానికి హాని కలిగిస్తూ పరస్పరం వినాశకులు అవుతారు. సంఘబద్ధులై జీవనం గడుపుకునే గణ రాజ్యాల సైనికులు సమయానికి తిండి దొరకక వేతనాలు అందక పోతే విడిపోతారు. విమనస్కులై విడిపోయిన వారు భయంతో శత్రువులకు లొంగిపోతారు. సంఘటితమైన బల పౌరుషాలు కలవారికి అభీష్ట ప్రయోజనాలన్నీ సిద్ధిస్తాయి. వీరు గూఢచర్యంలోనూ మంత్రాంగంలోను, కోశాగారాన్ని నింపడంలోను ఎప్పుడూ తత్పరులై ఉంటారు. కాబట్టే అన్ని విధాలా

గణరాజ్యాలు వృద్ధి పొందుతాయి. గణ రాజ్యంలోని నాగరికులందరూ ధనవంతులు, పరాక్రమవంతులు, శస్త్ర ప్రయోగం తెలిసినవారు, శాస్త్ర పారంగతులు, ఆపదలో చిక్కుకుని దిక్కు తోచని స్థితిలో ఉన్న వారిని వారు ఒడ్డుకు చేరుస్తారు. అయితే క్రోధం, భేదం , భయం ,దండన, బలహీన పరచడం, బంధించడం, వధించడం వంటి గుణాలు పుడితే గణరాజ్యాలు వెంటనే శత్రువుకు లోబడి పోతాయి. గణముఖ్యులందరూ తమలో తాము కలుసుకుని గణాలకు హితమైన దానిని చేయాలి. అలా కాక గణాలు వేరుపడితే విడి విడిగా అనేక దళాలు పుట్టుకుని వస్తాయి. అప్పుడు సమస్త ప్రయోజనాలు దెబ్బతింటాయి. అనర్థాలు కూడా సంభవిస్తాయి. కులాలలో కలహాలు బయలుదేరినప్పుడు కుల వృద్ధులు ఉపేక్షిస్తే గణాలలో భేదాలు పుట్టడానికి కారణమై వంశనాశనం జరుగుతుంది. జాతి చేతను, కులం చేతను అందరూ సమానులే కాని ప్రయత్నం చేతను, బుద్ధి చేతను, రూప, ధనాదుల చేతను అలా సమానులుగా ఉండరు. **(సంస్కృత భారతం, శాంతి పర్వం, 108 వ అధ్యాయం).**

ఈ వివరాలన్నీ గణతంత్ర రాజనీతిలో సమూహాలుగా నివసిస్తున్నవారి గుణ దోషాలను, వాటిని నివారించడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించడం కనబడుతుంది.

## 4.41. సభలు –సమావేశాలు:

ఏదైనా భవిష్యత్ కార్యాచరణకు సంబంధించి చర్చించడానికి, కీలక విషయాలను పరిశీలించడానికి రాజు ముఖ్యమైన వ్యక్తుల సమక్షంలో కూలంకషమైన చర్చను జరుపుతారు. మహాభారతంలో కూడా అటువంటి సమావేశాలు కనబడుతాయి .

ఉత్తర అభిమన్యుల వివాహానంతరం ధర్మరాజు తన తమ్ములందరితోనూ, కుమారులందరితోనూ విరాట రాజు సభాభవనానికి వెళ్తారు అక్కడ

*“ విరటుఁడు బాంచాలుండును, హరియును, రాముండు, వారి యనుజ తనూజుల్*

*పరిణయ సమాగతాఖిల ధరణీశులు బలసియుండఁదద్దయు నెమ్మిన్ ''(ఆంధ్రమహాభారతం, ప్రథమాశ్వాసం, 5 వ పద్యం).*

విరాటరాజు,ద్రుపదుడు, శ్రీకృష్ణుడు , బలరాముడు, వారి తమ్ములు, కుమారులు, వివాహానికి విచ్చేసిన రాజులందరూ ఆసీనులై ఉండగా మిక్కిలి ప్రీతితో వారందరూ అనేక రీతులుగా కృష్ణుడితోనే ధర్మరాజుతోనూ మాటలాడుతుండగా శ్రీకృష్ణుడు పాండవుల కార్యం కోరినవాడయి వారి మాటలను ఆపి వారినందరిని కలయ చూచి ఇట్లా అన్నాడు. ఈ విధంగా శ్రీకృష్ణుని సంభాషణ ప్రారంభమ

సంస్కృత భారతం లో రాజ మర్యాదను సూచిస్తూ తగిన ఆసనాలను ఆయా స్థానాలలో ఏర్పరిచారు పెద్ద పెద్ద రాజులు అక్కడకు చేరుకున్నారు.

*''అథాసనాన్యావిశతాం పురస్తాత్*

*ఉభౌ విరాటద్రుపదౌ నరేంద్రౌ1*

*వృద్ధౌ చ మాన్యౌ పృథివీపతీనాం*

*పిత్రా సమం రామజనార్దనౌ చ11''(సంస్కృత భారతం, ప్రథమాధ్యాయం, 3 వ శ్లోకం).*

ఆ సభలో అందరికి ముందు విరాటరాజు , ద్రుపదుడు ఆసనాలపై కూర్చొన్నారు. వారు రాజులందరిలో వృద్ధులు పూజ్యులు, తమ తండ్రి వసుదేవునితో కలిసి బలరామ కృష్ణులు కూడా ఆసనాలపై కూర్చొన్నారు.

ఈ విషయాలు చూసే వారికి సామాన్యంగానే అనిపించవచ్చు కాని ప్రధానంగా భవిష్యత్ కార్యం ఎవరి సహాయం అవసరమవుతుందో వారు పెద్దలైనటువంటి ప్రముఖులైనటువంటి విరటుడు, ద్రుపదుడు అందరికి ముందు కూర్చొన్నారు. ఇది మర్యాదను సూచిస్తున్నట్లు నాకనిపిస్తుంది. అంతేకాదు

*పాంచాల రాజస్య సమీకతస్తు*

*శినిప్రవీరః సహరౌహిణేయః1*

*మత్స్యస్య రాజ్ఞస్తు సుసంనికృష్టః*

*జనార్దనశ్చైవ యుధిష్ఠిరశ్చ11 (సంస్కృత భారతం, ప్రథమాధ్యాయం, 4 వ శ్లోకం).*

పాంచాల రాజు ద్రుపదుని ప్రక్కన శినివంశ శ్రేష్ఠుడు, వీరుడు అయిన సాత్యకి,రోహిణి దేవి కుమారుడైన బలరామునితో కలిసి కూర్చున్నాడు. మత్స్యరాజైన విరాటునికి మరింత దగ్గరగా శ్రీకృష్ణుడు, ధర్మరాజు కూర్చొన్నారు. తర్వాత ద్రుపద రాజు పుత్రులు, భీమార్జునులు, నకుల సహదేవులు ,యుద్ధ వీరులు, ప్రద్యుమ్నుడు, సాంబుడు, విరాటుని పుత్రులలో కలిసి అభిమన్యుడు, ద్రౌపది పుత్రులు, కూర్చున్నారు.

ఈ విషయాలను కూడా పరిశీలిస్తే విరాట రాజునికి దగ్గరగా ప్రధాన సూత్రధారులు శ్రీకృష్ణుడు , ధర్మరాజు కూర్చుని ఉన్నారు. దీనిని బట్టి భవిష్యత్ కార్యాచరణ చేయడంలో వీరి పాత్ర ప్రధానమైనదిగా తెలుస్తుంది. రాజుల పుత్రులు ఒక చోట, రాజులు ఒక చోట కూర్చోవడం ఒక మర్యాదను పాటించినట్లు క్రమపద్ధతిని ఆచరించినట్లు అనిపిస్తుంది. అందరూ మాట్లాడుతూ ఒక్కసారిగా కృష్ణుని వైపు చూసి కొద్ది సేపు మౌనంగా ఉన్నారు అందరూ సంభాషణలు ఆపిన తర్వాత పాండవుల ప్రయోజనం కోసం వచ్చిన వారంతా శ్రీకృష్ణుని మాట వినడానికి సిద్ధంగా ఉన్నారు.

ఆంధ్ర మహాభారతంలో శ్రీకృష్ణుడే వారందరి మాటలను ఆపి అందరితో మాట్లాడినట్లు ఉంటుంది.

ఈ విషయాలన్నీ భవిష్యత్ కార్యాచరణను సాధారణమైన వారు సాధించలేరు. దానికి భగవంతుని సహకారం భగవంతుని సంకల్పం ప్రధానం అందుకు శ్రీకృష్ణుడు పాండవుల పక్షాన ధర్మం పక్షాన మాట్లాడడానికి పూనుకున్నాడు. అసాధ్యమైన దానిని సాధ్యమైనదిగా చేసేది భగవంతుని వలనే సాధ్యమవుతుంది. శ్రీకృష్ణుడు న్యాయన్యాయాల గురించి మాట్లాడుతూ అక్కడ ఉన్న రాజులందరికి పాండవుల ధర్మ బుద్ధిని , వివరిస్తున్నాడు.

పాండవులు బాల్యంలో ఉన్నప్పుడే వీరి రాజ్యాన్ని అపహరించడానికి ఉగ్రస్వభావులైన దుష్టులతో కలిసి కుట్రలు పన్ని వీరిని చంపడానికి ఎన్నో ఎత్తులు వేసారన్న విషయం మీకందరికి తెలుసు అని చెప్పడంలో అక్కడున్న వారందరికి జరిగిన విషయం మరోసారి గుర్తుచేసి పాండవుల పక్షాన వారు నిలిచేటట్లు చేస్తున్నట్లు అనిపిస్తుంది. ఈ విషయం ఆంధ్ర మహాభారతంలో ఉండదు.

## 4.42. కణికుని రాజనీతి

పాండవుల పరాక్రమాన్ని ఓర్వలేని దుర్యోధనుడు కణికుడిని రాజనీతిని ఉపదేశించండని కోరుతాడు. సంస్కృత భారతంలో ధృతరాష్ట్రుడు కణికుడి దగ్గర రాజనీతిని విన్నట్లు ఉంటుంది.

1. ప్రభువు ప్రబలమైన అధికారం కలవాడై తగిన దండనీతిని అవలంబించి ప్రజలను ధర్మ మార్గాన నడిపించి మంచి ప్రవర్తన కలవాడుగా ఉండాలి. దండనీతిలో స్వపర భేద భావం లేకుండా సమ బుద్ధితో ఉండే రాజు యొక్క అనుమతి చేత అన్ని జాతుల వాళ్ళూ తమ తమ జాతి ధర్మాలను ఉల్లంఘించక ప్రవర్తిస్తారు. ( ఉత్తమ పాలనకు అధికార బలం ఒక్కటే ప్రభువుకు చాలదు, నిష్పక్షపాతం, సత్ప్రవర్తనం ప్రభువుకు పెద్ద బలాన్ని కూర్చే గుణాలు. ఇవి కూడా ప్రభువుకు ఉండాలి.

కణికుడు చెప్పిన పై నీతిని విరాట రాజు విషయంలో గమనించవచ్చు. తన రాజ్యంలో ఆశ్రయం పొందిన స్త్రీ గౌరవాన్ని కాపాడలేకపోయాడు కారణం కీచకుడుని సేనాపతిగా చేయడం అతనిని తన అధీనంలో కాకుండా తానే కీచకుని అధీనంలో ఉండేలా ప్రవర్తించడం. ఇక్కడ రాజు పదవి కంటే బలం ప్రధానమైనదిగా తెలుస్తుంది. అంతే కాకుండా రాజు అధికారంలో ఉండి ఒకరికి భయపడి దండన విధించలేదు కదా పైగా కీచకుడు చనిపోయిన తర్వాత కూడా మేల్కోలేదు. కీచకుడు చనిపోయిన తర్వాత ఉపకీచకులు విరాట రాజు దగ్గర కు వెళ్ళి ద్రౌపది వలన కీచకుడు చనిపోయాడు ఆమెను

మేము కాల్చి బూడిద చేస్తాము అనుమతి అడగగానే విరాటరాజు అక్కడ కూడా ఉప కీచకుల భయంచేత వారి పరాక్రమం చేత భయపడి సైరంధ్రిని కీచకుడితో పాటు తగులబెట్టడానికి అనుమతి ఇచ్చాడు. (సంస్కృత భారతం, విరాట పర్వం, 23 వ అధ్యాయం).

కాబట్టి రాజు అనే వాడు ఇతరుల పరాక్రమం , బలం చూసి భయపడే వాడుగా ఉండకూడదు దాని వలన ధర్మాన్ని నిలబెట్టలేడు. అధర్మాన్ని ప్రోత్సహించవలసి వస్తుంది.

2. ఇవి చేయదగిన పనులు, ఇవి చేయకూడని పనులు అని తెలుసుకోకుండా చెడు నడవడి కలవాడై మేలు కోరేవాడు కాకుంటే తండ్రినైనా సరే విడిచి పెట్టక వివేకంతో ప్రజలందరికి తెలిసేటట్లు అతడిని ప్రభువు శిక్షించాలి.
3. ఏ పనినైనా బుద్ధిమంతులతో ముందుగా విచారించి చేయాలి.ముందుగా విచారించి చక్కగా ప్రారంభించిన పని చెడిపోకుండా సఫలమవుతుంది.
4. రాజు నేర్పుతో మెత్తని పనిచేత గాని భయంకర మైన పనిచేత కాని మొదట తనను తాను రక్షించుకోవాలి. తనకు ప్రమాదం లేకుండా చూచుకుని రాజు ధర్మాన్ని నడపాలి.
5. అచ్చపు బుద్ధితో తన లోపాలు ఇతరులు తెలుసుకోకుండా ఇతరుల లోపాలను తాను తెలుసుకుంటూ దేశ కాల పరిస్థితులను ఎరిగి, మిత్ర బలం గలవాడై రాజు తన రాజ ధర్మాలను నిర్వర్తించాలి.
6. బలహీనులైనప్పుడే శత్రువులను చంపటం రాజనీతి. వాళ్ళ అధిక బాహుబలం, మిత్ర బలం కూర్చుకొన్న తర్వాత వాళ్ళని చంపటం సాధ్యమా? జయించటం సాధ్యమా?
7. రాజు విసుగు లేకుండా తన పనులను గురించి శత్రువుల పనులను గురించి దూతల వలన తెలుసుకోవాలి. శత్రు దేశ విషయాలను తెలుసుకోవడానికి పలు విధాలైన పాషండుల సమూహాల్ని పంపాలి.( శత్రువుల కృత్యాలను గూర్చి దూతల

వలన తెలుసుకోవలసిన అవసరం రాజులకు ఉన్నది. అంతే కాదు. తమ పనులను గూర్చి ప్రజలు ఏమి అనుకుంటున్నారో తమ పనుల ప్రభావం దేశ ప్రజల మీద శత్రువు మీద ఏ విధంగా ఉన్నదో మదింపువేసుకోవడం రాజులకు అవసరం, పాషండులు అంటే వేద బాహ్యులు.

### 4.42.1. రాజు స్వీయరక్షణ:

- పలు విధాలైన క్రీడాపర్వతాలకు, ఉద్యానాలకు సభలకు, పుణ్య తీర్థాలకు, దేవాలయాలకు, వేటాడే ప్రదేశాలకు, వెళ్ళేటప్పుడు, ప్రభువుకు ప్రమాదాలు కలుగకుండా ఆయా ప్రదేశాలను ముందుగా తగు విధంగా పరిశీలించి, ప్రమాదం కలిగించే వ్యక్తులు, ఆయుధాలు, ఉంటే తొలగించి పరిశుద్ధంగా ఉండేట్లు చేయాలి.
- రాజైన వాడు నాకు వీరు నమ్మదగిన వారు, వీరు నమ్మకూడని వారు అని అనకూడదు నిశ్చయ బుద్ధి చేత ఎవ్వరిని నమ్మకుండా తన రక్షణ తానే ప్రధానంగా చూచుకోవాలి.
- ప్రభువు తనను తాను జాగ్రత్తగా రక్షించుకున్నట్లే తన రహస్యాలోచన కూడా రక్షించుకోవాలి. రహస్యాలోచన వెల్లడి కాకుండా రక్షించుకునే బలం చేతనే అన్ని పనులు ఫలవంతమవుతాయి. రహస్యాలోచన వెల్లడి అయితే పనులను ఫలవంతం కావించటం ఆ బృహస్పతి కైనా సాధ్యం కాదు.

*“పలుమాఱు శపథంబులు నం 1 జలియును నభివాదనమును సామప్రియభా*

*షలు మిథ్యావినయంబులు 1 గలయవి దుష్ట స్వభావకాపురుషులకున్*

*(ఆంధ్రమహాభారతం, ఆదిపర్వం, షష్ఠాశ్వాసం,112 వ పద్యం).*

చెడు స్వభావం గల నీచులు మాటిమాటికి ఒట్టుపెట్టుకుంటారు. చేతులు జోడిస్తారు. నమస్కారాలు చేస్తారు. సామోపాయంతో కూడిన ఇంపైన మాటలు మాట్లాడుతారు. కపటపు వినయాలు ప్రదర్శిస్తారు.

*కం. తనకిమ్మగు నంతకు దు1ర్జనుఁడపోలె నుండి సరపమపోలెం*

*దన కిమ్మగుదును గఱచును 1 ఘనదారుణ కర్మగరళ ఘనదంష్ట్రములన్(ఆంధ్రమహాభారతం, ఆదిపర్వం, షష్ఠాశ్వాసం, 113 వ పద్యం).*

దుర్మార్గుడు తనకు అనుకూల మయ్యేంతవరకు మిత్రుడి వలె నటించి అనుకూలత ఏర్పడిన వెంటనే పాములవలె తన క్రూర కృత్యాలనే కోరలతో కరుస్తాడు.

తగిన సమయం వచ్చేవరకు శత్రువును భుజం మీదికి ఎక్కించుకుని మోస్తూ తగిన సమయం రాగానే మట్టికుండను రాతిమీద ఎత్తి కొట్టినట్లు అతడిని నాశనం చేయాలి.ఇంతకుముందు తనకు అపకారం చేసిన మానవుడు తక్కువ వాడు కదా అని అతడిని ఆదరించకూడదు, ముల్లు చిన్నదే అయినా అది పాదంలో ఉంటే నడవడానికి సాధ్యమవుతుందా కాదని అర్థం. బాలుడు కదా అని చులకన భావం వహించి శత్రువుతో కలిసి ఉండకూడదు. భయంకరాలైన పర్వారణ్యాలను కాల్చడానికి కనకనలాడే చిన్న నిప్పురవ్వ చాలదా , ప్రయత్నించి తనకు అపకారం చేసినవాడిని దగ్గర ఉంచుకున్న బుద్ధిహీనుడు ఏమరుపాటుతో ఎత్తైన చెట్టు కొమ్మ చివర నిద్రించేవాడితో సమానం.

అపకారాలు చేసిన వాళ్ళను సామదాన భేదోపాయాలచేత లేదా దయ చూసి నమ్మకం కలిగేట్లుగా మాట్లాడి లేదా ఒట్టు పెట్టుకుని నమ్మకం కలిగించి ఆలస్యం జరగకుండా చంపాలి. ఇది శుక్రుని అభిప్రాయం. ఆత్మరక్షణ కోసం అన్ని విధాల వాళ్ళను హతమార్చాలని కణికుడు చెప్తాడు.(ఆంధ్రమహాభారతం, ఆదిపర్వం,షష్ఠాశ్వాసము, 101 నుండి,119 పద్యం వరకు).

### 4.42.2. సంస్కృత భారతంలో కణికుడు చెప్పిన కూట నీతి :

ధృతరాష్ట్రుడు పాండవులు బలవంతులు, అభివృద్ధి చెందుతున్నారని మనసులో బాధపడి రాజనీతి వేత్తలలో గొప్పవాడైన కణికుడిని పిలిపించి

*ఉత్సిక్తాః పాండవా నిత్యం తేభ్యో2సూయే ద్విజోత్తమ1*

*తత్ర మే నిశ్చితతమం సంధి విగ్రహ కారణమ్11 (సంస్కృత భారతం, ఆదిపర్వం,139 వ అధ్యాయం, 3 వ శ్లోకం).*

బ్రాహ్మణోత్తమా పాండవులు అనుదినమూ అభివృద్ధి చెందుతున్నారు నాకు వారిపై అసూయకలుగుతుంది, కాబట్టి బాగా నిశ్చయించి సంధి తగినదో విగ్రహం తగినదో తెలియజేయండి అనగా కణికుడు ఈ విషయంలో నా అభిప్రాయం చెపుతాను విని నన్ను తప్పు పట్టకూడదని చెప్తాడు.

#### 4.42.2.1. రాజు దండ ప్రయోగం:

రాజు ఎప్పుడూ దండాన్ని ఎత్తి పట్టే ఉండాలి. నిత్యమూ పౌరుషాన్ని కలిగి ఉండాలి. రాజు అనుక్షణము దండాన్ని ఎత్తి ఉన్నప్పుడే ప్రజలు భయపడుతారు. కాబట్టి అన్ని పనులనూ దండం ద్వారానే సాధించాలి. **( సంస్కృత భారతం, ఆది పర్వం, 139 వ అధ్యాయం, 6వ శ్లోకం)**

అంటే ఈ మాటలను బట్టి సామోపాయం తో సమస్యను సరిదిద్దుకోవడం కంటే ఎప్పుడూ శిక్షద్వారానే పనులను సాధించుకోవాలని చెప్తున్నాడు కణికుడు చెప్పిన ఈ మాట చాలా ప్రమాదకరమైనదిగా నేను భావిస్తున్నాను అన్ని పనులు దండం ద్వారానే నెరవేర్చుకుంటుంటే ప్రజల్లో భయం తో పాటు ఆ రాజు మీద అసహ్యం కూడా కలిగే ప్రమాదం ఉంది. ప్రజలు తమ అధీనంలో ఉన్నారు కదా అని ఎప్పుడూ దండాన్నే ప్రయోగించకూడదు అవసరమైనప్పుడు మాత్రమే దండాన్ని ప్రయోగించాలి. ప్రజలలో దోపిడి దారులు ఉంటే దండాన్ని వారిపై ప్రయోగించాలి. రాజ్యం యొక్క ఆస్తులను ధ్వంసం చేస్తుంటే అంటే ప్రజాపరిపాలనకు భంగం కలిగించే వారిని దండించాలి. అంతే కాని

ఎప్పుడూ దండాన్ని ప్రయోగించకూడదు అది రాజుకు తాత్కాలిక ఆనందాన్ని కలిగించినప్పటికి భవిష్యత్తులో ఆ ఉపాయం సమస్యగా మారవచ్చునని నా అభిప్రాయం.

### 4.42.2.2. రాజు తీసుకోవలసిన జాగ్రత్తలు:

1. శత్రువు తన లోపాలను గ్రహించలేనంత జాగరూకుడై రాజు మెలగాలి. శత్రువుల లోపాలు బయట పడితే తప్పక అతనిపై దండెత్తాలి. తాబేలు అంగాలను ముడుచుకొనినట్లు రాజు తన సప్తాంగాలను రక్షించుకోవాలి.
2. ప్రారంభించిన పనిని ఎప్పుడూ మధ్యలోనే వదిలివేయకూడదు. ముల్లునైనా సరే సగం తీసి మిగిలిన భాగాన్ని శరీరంలోనే విడిస్తే చాలా కాలం వరకు ఆ గాయం మానదు.
3. అపకారం చేసిన శత్రువులను చంపటమే అభినందనీయమైన పని గొప్ప పరాక్రమం గల శత్రువునైనా ఇబ్బందులలో పడినప్పుడు తేలికగా నష్టపరచవచ్చు. మేటి యోధుడైనా కష్ట కాలంలో ఉన్నప్పుడు తేలికగా చంపవచ్చు. ఆపదలో ఉన్న శత్రువులను తప్పక దాడి చేయాలి. ఆ సమయంలో వారి పై దయ చూపకూడదు. శత్రువు బలహీనుడైన కూడా వాడిని విడిచిపెట్టకూడదు. **( సంస్కృత భారతం, ఆది పర్వం, 139 వ అధ్యాయం, 7 నుండి 11వ శ్లోకం వరకు)**

ఈ విషయాలను పరిశీలిస్తే శత్రువు దీన స్థితిలో ఉన్నప్పటికి ఎటువంటి ఆధారము లేకుండా ఉన్నప్పటికి అతనిని హతమార్చాలి అంటున్నాడు కణికుడు ఇది సరియైన పద్ధతి కాదని నాకు అనిపిస్తుంది. ఎందుకంటే శరణు జొచ్చిన శత్రువు మరలా తిరిగి దాడి చేసే ప్రమాదం అంతగా ఉండదు ఒక వేళ ఆ శత్రువు పై అనుమానం ఉంటే నిఘా ద్వారా అతని చర్యలు గమనించాలే తప్ప అతనిని చంపకూడదు. తనకు ఆ శత్రువు నుండి ప్రాణాపాయం ఉంది, తన రాజ్యానికి ప్రమాదమని బలంగా నమ్మకం కలిగినప్పుడు మాత్రమే శత్రువును చంపాలని నేను అభిప్రాయ పడుతున్నాను.

### 4.42.2.3. శత్రువుకు నమ్మకం కలిగించి మట్టుపెట్టడం:

*కుర్యాత్ తృణమయం చాపం శయీత మృగశాయికామ్1*

*సాంత్వాదిభిరుపాయైస్తు హన్యాచ్ఛత్రుం వశే స్థితమ్11( సంస్కృత భారతం, ఆది పర్వం, 139 వ అధ్యాయం, 13వ శ్లోకం)*

అవసరమైనప్పుడు తన వింటిని గడ్డి పోచగానే భావించాలి. అల్పజంతువులకు నమ్మకం కలిగే దాకా నిద్ర నటిస్తున్న మృగం లాగా అసమర్థునివలెనే కనిపించాలి. శత్రువు తనను సమీపించిన తరువాత సాంత్వనం మొదలగు ఉపాయంతో నమ్మించి సంహరించాలి.

- సహజ శత్రువును దానాదుల చేత నమ్మకం కలిగించి చంపాలి. ఒకప్పుడు అపకారం చేసి ప్రస్తుతం ఆశ్రయించి ఉన్న వానిని కూడా చంపాలి. ఎప్పుడూ శత్రు పక్షం యొక్క ములాన్నే ముందు నరకాలి. ఆ తరువాత శత్రు సహాయకులను చంపాలి. ఆ పై ఆ పక్షానికి చెందిన అందరినీ సంహరించాలి. చెట్టు మొదలు నరికిన తరువాత కొమ్మలు నిలువలేవు కదా! (**సంస్కృత భారతం, ఆది పర్వం.139 వ అధ్యాయం, 16,17, శ్లోకాలు**).

కణికుడు చెప్పిన ఈ కూటనీతి నియమం మహాభారతంలో కొన్ని సందర్భాలలో శ్రీకృష్ణుడు ఉపయోగించినట్లు కనబడుతుంది. రాజసూయ యాగానికి ముందు శ్రీకృష్ణుడు ధర్మరాజుకు జరాసంధుని యొక్క బలాలు గురించి వివరిస్తున్న సందర్భంలో జరాసంధుడు మధుర పై దండెత్తి వచ్చినప్పుడు యదు వృష్ణి భోజాంధక శ్రేష్ఠులు (సంస్కృత భారతంలో భోజవంశానికి చెందిన పద్దెనిమిది కులాలకు చెందిన వారమని ఉంది) పద్దెనిమిది వేల మంది రథికులతో అతణ్ణి ఎదిరించినప్పటికి విజయం లభించడంలేదని జరాసంధుని బలాన్ని నాశనం చేయడానికి నిరంతరం మహాయుధాలతో పోరాడినా మూడు వందల సంవత్సరాలు పడుతుందని(సంస్కృత భారతం, సభా పర్వం 14 వ అధ్యాయం, 36 వ శ్లోకం.) జరాసంధుని అనుచరులు హంసడింభకులు చాలా పరాక్రమవంతులు వరం

వలన శస్త్రాల వలన అస్త్రాల వలన మరణం లేకుండా ఉండే వారని వారిని చంపడం కష్టమని చెప్తూ ఒక ఉపాయాన్ని పన్నామని హంసుడు యుద్ధంలో మరణించాడని డింభకునికి చెప్పిపంపగా ఆ మాటలు విని బాధపడి యమున నదిలో దూకి మరణించాడు. తర్వాత ఈ విషయం తెలుసుకున్న హంసుడు డింభకుని మీద ప్రేమతో అతను మరణించాడు. సంస్కృత భారతంలో  జరాసంధునితో 17 సార్లు పోరాడేసమయంలో యుద్ధంలో బలరాముడు హంసుడని పేరుగల ఒక రాజును చంపాడు. ఆ సమయంలో ఎవరో హంసుడు మరణించాడని అన్నారు ఈ విధంగా డింభకుడు, అతని తర్వాత హంసుడు మరణించినట్లు ఉంటుంది. **(సంస్కృత భారతం, సభాపర్వం, 14 వ అధ్యాయం, 40 వ శ్లోకం)**

ఈ వార్త తెలుసుకున్న జరాసంధుడు చాలా బాధపడ్డాడని. మరలా శ్రీకృష్ణుడు వారి పరివారము సంతోషంగా మధురలోనివసిస్తూ ఉన్నామని చెప్తాడు.

ఇక్కడ శత్రువు కంటే శత్రువు యొక్క బలాన్ని సమూలంగ నశింపజేయడం గమనించదగిన విషయం అందులో హంస డింభకులు వరం పొందిన పరాక్రమవంతులు అటువంటి వారిని మాయోపాయాలచేతనైనా సరే సంహరించడం అనేది రాజనీతిలో ప్రధానం పైగా వారి వలన లోకానికి ప్రమాదం అనుకున్నప్పుడు ఇటువంటి కూటనీతిని ఉపయోగించడం లో తప్పులేదని హంసడింభకుల మరణించడంలో జరిగిన చర్యల వలన తెలుస్తుంది.

### 4.42.2.4. ధనాశ చూపుట:

- పేరాసతో ఉన్నవానిని  డబ్బుతో వశపరచుకోవాలి. తక్కువ వారినీ, తనంత వారినీ పరాక్రమంతో లొంగదీయాలి. రాజా ఇంత వివరంగా నీకు చెప్తున్నాను మరొక మాట కూడా విను. రాజు ఐశ్వర్యాన్ని కోరుతుంటే కుమారుని అయినా మిత్రునయినా , సోదరునైనా ,తండ్రినయినా, గురువునయినా సరే శత్రు స్థానంలో

నిలిస్తే సంహరించాలి. **( సంస్కృత భారతం, ఆది పర్వం, 139 వ అధ్యాయం, 51వ శ్లోకం)**

ఈ విషయాలను పరిశీలిస్తే ధనాశతో ఉన్నవారు తనకు లాభం వస్తుంది అనుకుంటే ఎవరిమాటనైనా వింటారు ఏ కార్యానికైనా సిద్ధపడతారు అటువంటి వారు శత్రు పక్షంలో ఉంటే వారి బలహీనతను గ్రహించి సంహరించమని చెప్తున్నట్లు అనిపిస్తుంది. అవసరమైతే ధనం మీద ఆశతో ఉన్న రాజు తన వారిని కూడా చంపడంలో తప్పులేదని చెప్తున్నాడు. ఈ మాట చెడు ప్రవర్తనకు దారి తీసేటట్లు ఉంది కాని వంశాన్ని నిలబెట్టేదిగా లేదని నాకు అనిపిస్తుంది.

- ధనమిచ్చి కాని ,విషం పెట్టి కాని, మాయలు పన్ని కాని, మాటలతో బెదిరించి కాని శత్రువును చంపవలసిందే ఏ విధంగానూ ఉపేక్షించడం తగదు. ఇద్దరు రాజుల మధ్య గెలుపు అటుఇటుగా ఉన్నప్పుడు శ్రద్ధగలవాడే గెలుస్తాడు.

దుర్యోధనుడు చిన్నప్పటి నుండి పాండవుల పై అసూయ కారణంగా ప్రధానంగా భీముని పై ద్వేషంతో ఎన్నో దుశ్చర్యలు చేసాడు. కౌరవుల స్వభావం ఎటువంటిదో జి.వి సుబ్రహ్మణ్యం ‘‘**మహాభారతం భీష్మ పర్వము**’’ గ్రంథానికి **‘గీతాంజలి’** అనే పేరుతో ముందు మాట వ్రాస్తూ కౌరవుల యొక్క చిత్తవృత్తిని ఈ విధంగా వివరిస్తాడు.‘‘ దుర్యోధనుడు మూర్తి కట్టిన క్రోధం ఆ క్రోధానికి కారణం పాండవుల రాజ్యం పై ఉన్న తీవ్రమైన కాంక్ష పాండవులను చంపి కాని అన్యాయంగా వారిని మోసగించి గాని రాజ్య సంపదను కాజేయాలన్న దురాశ అతని క్రోధానికి బీజం ఆ క్రోధం అనేక అధర్మ కార్యాలను అతని చేత చేయించింది. అతని కోపం అతనిలోని వివేకాన్ని జ్ఞానాన్ని మట్టుపెట్టింది. సద్ జ్ఞానం కోల్పోయి బుద్ధి హీనుడయ్యాడు. చివరకు పాండవులతో కోరి తననూ తన వారిని నాశనం చేసుకున్నాడు. ఇటువంటి కృపణు స్థితి అర్జునునికి, పాండవులకు రాకుండా శ్రీకృష్ణుడు గీత

బోధ వలన రక్షించాడు. ''( లక్ష్మణ శాస్త్రి కప్పగంతుల, మహాభారత – భీష్మ పర్వము, పుట: 40).

### 4.42.2.5. కపట ప్రేమ:

- కోపం ఉన్నా లేనట్టు కనిపించాలి. చిరునవ్వుతో పలుకరించాలి. కోపంతో ఎప్పుడూ ఎవ్వరిని తిరస్కరించకూడదు. శత్రువును దెబ్బ తీయదలచినప్పుడు, దెబ్బతీస్తున్నప్పుడు కూడా ప్రియంగానే మాటాడాలి. దెబ్బ తీసిన తరువాత కూడా దయచూపాలి. అతనికై దుఃఖించాలి.
- శత్రువును కు ధర్మాన్ని బోధించి ధనాన్ని ఇచ్చి మంచిగా వ్యవహరించి బాగా నిదానింపజేయాలి. సమయం వచ్చినప్పుడు ఆ శత్రువు దారి తప్పి ఉంటే సంహరించాలి.

- ఎవరినైనా సత్వరమే చంపవలసి వస్తే అతని ఇంటిని తగులబెట్టాలి. దరిద్రులను, నాస్తికులను, దొంగలనూ తన రాజ్యంలో నిలువనీయకూడదు. ( **సంస్కృత భారతం, ఆది పర్వం, 139 వ అధ్యాయం, 53 నుండి59వ శ్లోకం వరకు**)

శత్రువును ఎలా ముందుగా చంపాలో చెప్తున్నాడు. అయితే రాజు అనేవాడు ప్రజలకు ఉపాధి చూపి దారిద్ర్యం నుండి విముక్తి కలిగించాలి. దొంగలను శిక్షించి వారిని మంచి వారుగా మార్చాలి. నాస్తికులకు ధర్మాధర్మాలు నిజాలను తెలియజేసి ఆస్తికులుగా మార్చాలి అంతేగాని రాజ్యం నుండి బహిష్కరించకూడదని నా అభిప్రాయం.

### 4.42.2.6. శత్రువును లోభ పెట్టుట:

- శత్రువు దగ్గరకు వస్తే ఎదురు వెళ్ళడం, ఆసన భోజనాదులతో ఆదరించడం, ఏదైనా వస్తువును కానుకగా ఇవ్వడం అతనిలో నమ్మకాన్ని కలిగిస్తాయి. నమ్మకం కలిగిన తరువాత అవసరమైతే చంపివేయాలి. ( **సంస్కృత భారతం, ఆది పర్వం, 139 వ అధ్యాయం, 60వ శ్లోకం**)

ఇక్కడ శత్రువును దుర్బుద్ధితో ఎలా చంపాలో చెప్తున్నాడు , సాధారణంగా అన్నం పెట్టిన వారిని చంపకూడదు కాని ఇక్కడ శత్రువును అన్నిరకాలుగా ఆకర్షించి చంపాలి అంటున్నాడు.

ధృతరాష్ట్ర , దుర్యోధనాదులు తర్వాత రోజుల్లో ఉద్యోగపర్వంలో శ్రీకృష్ణుడు రాయబారిగా వచ్చినప్పుడు ఈ కూటనీతిని అవలంబించినట్లు తెలుస్తుంది. ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణునికి ఏఏ సంపదలను, ఇచ్చి కృష్ణున్ని సంతృప్తి పరచాలో విదురునకు చెప్తాడు. దుర్యోధనుడు శ్రీకృష్ణుని ఆకర్షించేవిధంగా అనేక ఏర్పాట్లు , సభామండపలాను మణులతో అలంకరించడం వంటి వి చేస్తాడు.

- తనకు ఇబ్బంది లేదు అనుకునే వారిని , ఇబ్బంది అనుకునే వారిని అందరిని అనుమానించాలి(( **సంస్కృత భారతం, ఆది పర్వం, 139 వ అధ్యాయం, 61శ్లోకాలు)**

ఇక్కడ ప్రతి ఒక్కరిని అనుమానిస్తే కొంత కాలం తరువాత అతనిలో లేని పోని భయాలు చోటుచేసుకుంటాయి దానితో జీవితాన్ని సంతృప్తిగా గడపలేడని అర్థమవుతుంది.

ఇలా అనేక విషయాలను చెప్పి చివరలో లోహంతో చేసిన చురకత్తిని పదును పెట్టి చర్మంలో చుట్టబడితే అవసరపడినప్పుడు అది వెంద్రుకులను ఖండించగలుగుతుంది. అదే విధంగా రాజు సర్వ సన్నద్ధుడై ఉండి తగిన వేళలో శత్రువులను సమూలంగా నరికి వేయాలి. పాండవుల విసయంలో అయినా ఇతరుల విషయంలో అయినా ఈ రాజనీతి అనుసరించియే ప్రవర్తించాలి. నీవు మునిగిపోకుండా ఉండేట్లు వ్యవహిరించాలి. నిన్ను నీవు పాండుకుమారుల నుండి రక్షించుకోవాలి. నీ తమ్ముని పాండుకుమారులు పాండవులు బలవంతులు కాబట్టి నీవు పశ్చాత్తాపపవడవలసిన అవసరం కలుగకుండునట్లు నీతి మార్గాన్ని అనుసరించు అని పలికి కణికుడు వెళ్ళిపోతాడు. ధృతరాష్ట్రుడు ఆ మాటలు విని బాధపడుతాడు.**( సంస్కృత భారతం, ఆది పర్వం, 139 వ అధ్యాయం, 89,90 శ్లోకాలు)**

ఈ విషయాలు అసూయ చేత బాధపడుతున్న ధృతరాష్ట్రుడు పాండవుల ఔన్నత్యాన్ని ఓర్చుకోలేక కణికుడి చేత కూట నీతిని చెప్పించుకున్నాడు.

ఈ విషయంలో కణికుడు చెప్పిన కూటనీతిని ధృతరాష్ట్రుడు మహాభారతం మొత్తం అనుసరించాడని మనం భావించే అవకాశాలు ఉన్నాయా అని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు ముఖాముఖిలో అడిగినప్పుడు వారు ఈ విధంగా సమాధానం తెలియజేస్తారు.

‘‘అలా అనడానికి అవకాశం లేదు కణికుడి యొక్క కూట నీతి ఆ సమయంలో అక్కడ వరకు ఆ యుద్ధం ప్రారంభం అయ్యే ముందు చెప్పబడిందే కానీ ధృతరాష్ట్రుడికి కూట నీతి అనే మాట కన్నా ధృతరాష్ట్రునికి ఎంతసేపు రాశిభూతమైన స్వార్థం. ఆయన అన్ని వింటాడు ధర్మాధర్మములు తెలుసు ఎందుకంటే ఎప్పుడు విదురుడు పక్కన ఉంటాడు విదురుడు చెప్తాడు నీ బుద్ధి మారదు పాడైపోతావు ధర్మరాజు యందు ధర్మం ఉంది కాబట్టి ధర్మరాజు ఎప్పటికైనా విజయం సాధిస్తాడని కుండలు బద్దలు కొట్టినట్టు చెప్తాడు అతను తనకు ఉన్నటువంటి అవగుణాన్ని వదల లేకపోయాడు ఆ స్వార్థం పిల్లల మీద ఉన్నటువంటి పిచ్చి మమకారం ఆ దుర్యోధనుడు అంటే అంత. అతనికి ఏది ఏమైపోయినా మా పిల్లలకి రాజ్యం ఇచ్చేయాలి ఎంత స్వార్థం పిల్లలందరూ చచ్చిపోయారని తెలిసినా భీమసేనుని కౌగిట్లో బంధించి చంపేద్దామని ప్రయత్నించాడు కదా అంత ఆక్కసు ఉన్నవాడు ఆ గుణం చాలు కాల్చేయడానికి(చూడు : అనుబంధం -2).

ధృతరాష్ట్రుడికి అసూయ, స్వార్థం అనేవి సహజంగా అతనిలో ఉన్న లక్షణాలని వాటిని కొడుకు పై ప్రేమతో మరింత బలోపేతం చేసుకోవడానికే అతని మనసు అంగీకరిస్తుంది. విదురుని వంటి వారు ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్నా తన బుద్ధిని మార్చుకోకపోవడానికి అతనిలో ఉన్నటువంటి అసూయ , స్వార్థ చింతన తన కొడుకుపై ఉన్న అత్యంత మమకారమని వీరి మాటల్లో వ్యక్తమవుతుంది.

కణికుడు మరో కూట నీతి విషయాన్ని పరిశీలిస్తే అగ్ని హోత్రాలను యజ్ఞాలను ఆచరిస్తూ కాషాయాలను, జటలను , మృగ చర్మాలను ధరిస్తూ లోకానికి నమ్మకాన్ని

కలిగించాలి. ఆ తర్వాత తోడేలు వలె మొత్తం నాశనం చేయాలి.**(సంస్కృత భారతం, ఆదిపర్వం, 139 వ అధ్యాయం, 19 వ శ్లోకం).**

ఈ విషయాలను మహాభారతంలో గమనిస్తే జరాసంధుని వంటి పరాక్రమవంతున్ని రాజుల పట్ల ఏ మాత్రం దయ చూపకుండా బలి ఇవ్వడానికి తీసుకువచ్చిన క్రూర స్వభావుడు అతని దగ్గరకు శ్రీకృష్ణార్జున, భీములు వెళ్ళినప్పుడు జరాసంధుడు బ్రాహ్మణ పక్షపాతి అని తెలుసుకుని ముగ్గురు బ్రాహ్మణ రూపాలు ధరించి జరాసంధుని కొలువులోకి ప్రవేశిస్తారు.

*''స్నాతకవ్రతినస్తే తు బాహుశస్త్రా నిరాయుధా*

*యుయుత్సవః ప్రవివిశుః జరాసంధేన భారత''(సంస్కృత భారతం, సభా పర్వం, 21 వ అధ్యయం, 24 వ శ్లోకం).*

భుజపరాక్రమాలే ఆయుధాలుగా భావించి స్నాతక వ్రతం ఆచరిస్తున్న బ్రాహ్మణులులా నగరంలోకి శ్రీకృష్ణుడు, అర్జునుడు, భీముడు ప్రవేశించారు.

ప్రవేశించడమే కాకుండా అక్కడ మాలలు అమ్మేవారి నుండి బలవంతంగా మాలలు తీసుకుని ప్రధాన ద్వారం గుండా ప్రవేశించారు. వీరి నిజస్వరూపం తెలియని జరాసంధుడు వారిని సత్కరించి విడిది ఏర్పాటు చేసాడు. అంతే కాకుండా వారు అర్ధరాత్రి వచ్చిన తర్వాత మాత్రమే మాట్లాడుతారు అనగానే జరాసంధుడు అర్ధరాత్రి వచ్చి వారితో మాట్లాడుతారు. జరాసంధుడికి వారిపై అనుమానం వచ్చి చైత్యకపర్వత శిఖరాన్ని పగలకొట్టి రహస్య వేషాలతో రాజాపరాధాన్ని లెక్కచేయకుండా ఏ కారణంచేత వెనుకు వాకిలి గుండా ప్రవేశించారని అడుగుతాడు.

దాపిరి శ్రీకృష్ణుడు శత్రువుల గృహాల్లోకి గుమ్మాల గుండా ప్రవేశించరు. మేము కార్యార్థమై మీ ఇంటికి వచ్చాము శత్రువైన నీ నుండి మేము పూజను గ్రహించమని చెప్తాడు.

ఈ వివరాలను పరిశీలిస్తే ఒక బలమైన శత్రువును సంహరించడానికి మాయా ఉపాయాలచేత బ్రాహ్మణ రూపం ధరించి వచ్చి లోకకళ్యాణార్థం జరాసంధుని సంహరించి శత్రుసంహారం చేస్తారు.

### 4.43. నారదుడు బోధించిన రాజనీతి:

నారదుడు ధర్మరాజుతో ప్రశ్నల రూపంలో రాజనీతి విషయాలను చర్చించుట మొదట నారదుడు తెలిపిన విధంగా రాజశ్రేష్ఠులు ఏర్పరచిన ధర్మ పద్ధతిని తప్ప ఆచరణలో ఉంటుంది కదా అని ధర్మరాజును విచారిస్తున్నాడు అలాగే వంశపారం పర్యంగా వస్తున్న పద్ధతులను ధర్మాన్ని ఆచరిస్తున్నారో లేదో తెలుసుకుంటున్నాడు.

### 4.43.1. రాజు న్యాయ విచారణ చేయవలసిన సమయం:

రాజకార్యాలను స్వబుద్ధితో ఎల్లప్పుడు అర్థరాత్రి దాటిన తరువాతే ఆలోచిస్తున్నావు కదా అని అడుగుతాడు.

ఈ విషయాలను పరిశీలిస్తే రాజకార్యాలను జరిపేటప్పుడు సరైన ఆలోచన చేయాలంటే అందరూ నిద్రపోతున్న సమయంలో ప్రశాంత వాతావరణం చుట్టు పక్కల ఉన్నప్పుడు అర్థరాత్రి దాటిన తర్వాత చేసే ఆలోచన క్రమబద్ధంగాను, ఉంటుందని నారదుని మాటల్లో తెలుస్తుంది. అలాగే ప్రభుత్వ ఉద్యోగాల్లో శక్తి సామర్థ్యాలను అనుసరించి వారి ప్రతిభాపాటవాలను గుర్తించి వారిని ఉద్యాగాల్లో స్థిరంగా ఏర్పరచడం కూడా రాజ్యానికి లాభదాయకమైన విషయంలో నారదుని మాటల్లో వ్యక్తమవుతుంది.

### 4.43.2. మంత్రుల ఎన్నిక:

3. తరతరాల నాటి నుండి రాజ్య క్షేమం కొరకు పాటుపడిన వాళ్ళు రాజ్యంలో కొలువున్న వాళ్లను బ్రాహ్మణోత్తములను రాజకార్య నిర్వహణకు మంత్రులుగా ఏర్పరచుకుంటున్నావు కదా అని అడగడంలో బ్రాహ్మణులు మంచి చెడు తెలిసినవారు కావడం చేత తరతరాలు

అనుభవం వారికి ఉండడం చేత మంత్రులుగా నియమించడం రాజనీతిలో భాగంగా ఉందని తెలుస్తుంది.

### 4.43.3. రహస్యాలోచనం– రాజు ప్రధాన కర్తవ్యం:

రాజుకు ఉండవలసిన మరొక ముఖ్య లక్షణం గురించి నారదుడు వివరిస్తున్నాడు. అది రహస్యాలోచనం. రహస్యంగా ఆలోచించిన విషయాలను ప్రజల చెవిన పడకుండా జాగ్రత్త పడటం.

అలాగే యజ్ఞం చేసేవాడు. నిపుణుడో కాదో , సైనాధ్యక్షులుగా అర్హత గల వాళ్ళను నియమించడం. ఎక్కువ పలుకుబడి కలిగిన క్రియాశాలి, సమర్థవంతుడైన మంత్రి పరిధులు దాటి రాజ పుత్రులకు ధనాశ చూపి నీకు వ్యతిరేకంగా ఉండడం లేదు కదా అని ప్రశ్నించినప్పుడు మంత్రి ఆలోచనా విధానాన్ని అతని ప్రవర్తనను పరిశీలించడం రాజ్య క్షేమానికి ప్రథమ కర్తవ్యంగా తెలుస్తుంది.

జ్యోతిష్యం చేత భూమండలంలో గ్రహాల స్థితిని తెలుసుకుని దానికి తగ్గట్లు రాజ్య క్షేమం కొరకు శాంతి క్రియాదులు జరపడం.

ఇక్కడ సమస్త ప్రపంచం కాలాన్ని అనుసరిస్తూ ముందుకు నడుస్తుంది. అందుకని గ్రహస్థితి ఎలా ఉందో తెలుసుకుని ఏదైనా దోషం ఉంటే దానిని నివారించే ఉపాయాన్ని ఆలోచించడం ద్వారా రాజ్యం సుభిక్షంగా ఉంటుందని నారదుని ప్రశ్నలోని అంతరార్థం.

4. పన్నులు వసూలు చేయడం, యోగ్యులైన వారిని ఉద్యోగాల్లో నియమించి జీతాలను సకాలంలో అందజేయడం.
5. యుద్ధంలో మరణించిన వారిపైన కుల కుటుంబాలకు కూడు గుడ్డకు లోటు లేకుండా ఇవ్వడం.

ఈ మాటను బట్టి యుద్ధమంటూ జరిగితే యుద్ధానికి అర్హత కలిగిన వారినే అనుమతించి ఒక వేళ వారు మరణిస్తే వారి కుటుంబ పోషణ రాజు భరిస్తాడని అర్థం అవుతుంది. ( ఇది నేటి కాలంలో ఫించన్ రూపంలో అందజేయడం లాంటిది.).

6. పేద రైతులకు ధాన్యపు విత్తనాలు, వర్తకులకు నూటికి ఒక రూపాయి వడ్డీ వంతున అప్పులు ఇవ్వడం.
7. వికలాంగులను దయతో పోషించడం, చేసిన మేలు గుర్తించి ఆ మేలు చేసిన వ్యక్తిని పదిమంది పెద్దలున్న సభల్లో ఉచిత రీతిని సత్కరించగల రాజు ప్రజలను పరిపాలించగలడని చెప్తాడు.

రాజుకు వచ్చిన ఆదాయంలో ఎంత ఖర్చు చేయాలో నారదుడు వివరిస్తాడు. ఆదాయంలో నాల్గవ భాగాన్ని లేద మూడవ భాగాన్ని లేద సగభాగాన్ని మాత్రమే ఖర్చు చేయాలి కాని అంతకు మించి చేయకూడదని గ్రహించమన్నాడు. అలాగే గురువుల్ని, వృద్ధశిల్పుల్ని వ్యాపారుల్ని పోషించడం. (ఆంధ్ర మహాభారతం, సభాపర్వం, ప్రథమాశ్వాసం, 26 వపద్యం ).

### 4.43.4. రహస్య గూఢచార కార్యం:

గూఢచార వ్యవస్థ లో శత్రురాజుల ప్రవర్తనను తెలుసుకోవాలని చెప్తున్నాడు.(ఆంధ్ర మహాభారతం, సభాపర్వం, ప్రథమాశ్వాసం, 26 వపద్యం పుట:13).

నారదుడు చెప్పిన ఈ గూఢచార లక్షణం మహాభారతంలో పరిశీలించవచ్చు. దుర్యోధనుడు యుద్ధభయం చేత తనకు వచ్చిన క్షుద్ర విద్య ద్వారా నీటి మడుగున తడవకుండా దాక్కుని ఉంటాడు. పాండవులు దుర్యోధన జాడ కోసం వెతుకుతుంటారు. ఆ సందర్భంలోనే ధర్మరాజు బోయవానితో దుర్యోధనుడు తప్పించుకున్నాడని చెట్లు చేమలలో దాగి ఉండవచ్చని మీరు తిరిగేటప్పుడు గుర్తించండని చెప్పి ఉంటాడు, బోయవారు మాంస భారంతో అలసి ఒక మడుగు దగ్గరకు నీరు త్రాగేందుకు వస్తారు. అక్కడ కృప, కృత వర్మ,

అశ్వత్థామలు దుర్యోధనుతో మాట్లాడిన విధానాన్ని బట్టి వారు దుర్యోధనుడు మడుగులో దాక్కున్నాడని తెలుసుకున్నారు. ఈ విషయాన్ని ధర్మరాజుకు చెప్పి బహుమతి పొందాలనుకున్నారు. ముందుగా భీముడిని సమీపించి వివరాలు తెలియజేయగా భీముడు వారికి చాలా సంపదను ఇచ్చాడు. అలాగే ఆ కిరాతకులను ధర్మజుడికి భీముడు దుర్యోధనుడు ద్వైపాయన హ్రదంలో దాగి ఉన్నాడు. క్షుద్ర విద్య ద్వారా అతడి శరీరానికి నీరు తగలకుండా ఉన్నాడని ఈ సంగతి నీకు తెలపడానికి వీరు వచ్చారని తెలుపగా ధర్మరాజు వారు చెప్పిన వార్తకు సంతోషించి వారిని సత్కరించి పంపిస్తారు.

ఇక్కడ ఒక రహస్య విషయాన్ని ఛేదించడానికి బోయవారిని గూఢచారులుగా పంపడం. వారు వారికి అప్పజెప్పిన కార్యాన్ని దిగ్విజయంగా పూర్తి చేశారు. కాబట్టి రాజు వారికి తగిన బహుమతులతో సత్కరించి ఆదరంగా పంపించారు. బోయవారి రాయబారం వలన పాండవులు దుర్యోధనుని వెదికే శ్రమ తగ్గింది, అంతేకాదు అధర్మపరుడైన దుర్యోధనుని సంహారం ఈ గూఢచారం వలనే కలిగిందని అర్థమవుతుంది.

### 4.43.5. ఉద్యోగుల నియామకం:

**నారదుడు ధర్మరాజుతో ఉద్యోగులను ఎలా నియమించాలో చెప్తాడు.**

*ఉ. ఉత్తమ మధ్యమాధమ నియోగ్యత బుద్ధి నెఱింగి వారి న*
*య్యుత్తమ మధ్యమాధమ నియోగములన్ నియమించితే నరేం*
*ద్రోత్తమ భృత్య కోటికి ననూనముగాఁదగు జీవితంబు లా*
*యుత్తము నేసి యిత్తే దయ నయ్యయికాలము దప్పకుండఁగన్*

*(ఆంధ్రమహాభారతం, సభాపర్వం, ప్రథమాశ్వాసం, 37 వ పద్యం).*

ధర్మారాజు తో నారదుడు ఈ విధంగా అంటాడు. వ్యక్తుల యొక్క ఉత్తమ మధ్యమ అధము యోగ్యతలు తెలుసుకుని వాళ్ళను ఉత్తమ, మధ్యమ, అధమ ఉద్యోగాల్లో నియమించావు కదా సేవకులందరికి కొరత లేకుండా తగు జీతాలు దయతో సకాలంలో

అందజేస్తున్నావు కదా? తాము పొందవలసిన సమయంలోజీతాన్ని పొందక శుష్కించే సేవకుల దారిద్ర్య దుఃఖాలు ప్రభువుకు అతడు దేవేంద్రుడైనా సరే తప్పక కీడు కలుగిస్తాయి.

ఈ విషయాలను గమనిస్తే రాజు సేవకులకు ఇచ్చే ఉద్యోగాలు కూడా ఎవరికి ఏస్థాయి వారికి ఎలా నియమించాలో అలా వారిని నిర్ణయించి ఉద్యోగాల్లో చేర్చుకోవాలని అర్థమవుతుంది అంతే కాకుండా శ్రమకు తగిన జీతం వారికి ఖచ్చితంగా ఇవ్వాలని అలా ఇవ్వకపోతే అది రాజుకు మంచిదికాదని చెప్తున్నాడు. ఇదే విషయాన్ని నేటి కాలంలో ప్రస్తావిస్తే దాని యొక్క పరిణామాలు ఎలా ఉన్నాయో తెలుస్తుంది.

*ప్రకాశిక సమగ్ర సాహిత్య సామాజిక పత్రిక కు వరిష్ట సంపాదకులు ఆచార్య దార్ల వేంకటేశ్వర రావు, ప్రధాన సంపాదకులు కొవ్వలి గోపాల కృష్ణ వ్రాసిన 'మేడే –నాడు ,నేడు' వ్యాసంలో నేటి కాలంలో శ్రమ దోపిడికి గురి అవుతున్న వారి స్థితిని వివరించారు. " పనికి ఒక నిర్ణీత సమయాన్ని కేటాయించుకోవడం వల్ల ఆ సమయంలో లక్ష్యాన్ని పూర్తి చేయడానికి ప్రయత్నిస్తుంటాం. అలా పనిచేయడానికి తగిన జీతం కూడా తీసుకోవడం సర్వ సాధారణంగా జరగుతుంది. యంత్రాలను కనిపెట్టక ముందు చేసే పనికి, అవి వచ్చిన తర్వత చేస్తున్న పనికి మధ్య ఎంతో వ్యత్యాసం కనిపిస్తుంది. పని సులభంగా కావడంతో పాటు వేగవంతంగా జరుగుతుంది. నిర్ణీత కాలానికి చేసే పనికి నిర్ణీతమైన జీతాన్ని కూడా ముందుగానే నిర్ణయిస్తున్నారు. దీని వల్ల యజమానికి, శ్రామికునికి మధ్య సాధారణంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తవు ఇరువురు సక్రమంగా ఉన్నంత వరకు ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కావు, కాని వీరిలో ఎవరైనా తమ తమ నిర్ణయానికి కట్టుబడకుండా ఉన్నప్పుడు సమస్యలు తలెత్తుతాయి. పనికి తగిన వేతనం ఇవ్వకపోయినా వేతనానికి తగిన పనిచేయకపోయినా సమస్యలు మొదలవుతాయి . ఒక వేళ అదనంగా పనిచేస్తే దానికి కూడా ఒక నియమం ప్రకారం వేతనాన్ని చెల్లించాలనే ఒప్పందం ఉంటుంది. పారిశ్రామిక యుగానికి ముందు ఇటువంటి ఒప్పందాలు పెద్దగా ఉండేవి కాదు. అంటే అవి అమలుఅయ్యేవి కాదు. అందువల్ల శ్రామికునికి యజమానికి మధ్య నిరంతరం*

*సంఘర్షణలు జరుగుతుండేవి. పారిశ్రామిక విప్లవం తరువాత యజమానుల్లోని ఫ్యూడల్ స్వభావం వల్ల శ్రమదోపిడి మరింతగా బయటపడింది. దీని వల్ల కార్మికులు సంగాలు స్థాపించడం. కొన్ని ఒప్పందాలు జరగడం వాటిని యాజమాన్యాలు అమలు చేయకపోవడం వంటి వాటి వల్ల నిత్యం ఘర్షణలు జరుగుతుండేవి." ( ప్రకాశిక సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక, పుట:3,4).*

ఈ వివరాలను పరిశీలిస్తే నారదుడు చెప్పిన రాజనీతి సూత్రాన్ని యజమాని సక్రమంగా సరిచూసుకోగలిగితే సమస్యలు ఉత్పన్నమయ్యేవి కావు శ్రమకు తగిన జీతం ఇవ్వడం యజమాని కర్తవ్యం కాని ధనం పోగేసుకోవడం కోసమనో లేక అధికారాన్ని చెలాయించడం కోసమనో పనిని చేయించుకుని దాని ద్వారా లబ్ది పొంది వారికి సరియైన జీతం ఇవ్వకపోవడం వలన శ్రామికుల్లో ఒక నిరాశకు గురవుతారు తమ కష్టానికి ప్రతి ఫలం వచ్చేంత వరకు విప్లవాలనో, నిరాహార దీక్షలనూ చేస్తారు దీని వలన ఎటువంటి ప్రయోజనం ఉండదు. ఇటువంటి పరిస్థితి రాకముందే యజమాని నిబద్ధతతో మెలిగినట్లయితే కార్మికులకు యజమానుల మధ్య సఖ్యత ఏర్పడి సమాజాభివృద్ధి జరుగుతుంది.

### 4.44. **రాజు పట్టాభిషేక మహోత్సవం:**

*ధృతరాష్ట్రుడు ధర్మరాజుకు అర్ధరాజ్యంగా ఖాండవ ప్రస్థం ఇచ్చేటప్పుడు రాజ్యాభిషేకం గావించాడు ఆ సమయంలో విదురునితో చెప్పి పుణ్యాహవాచనం చేయించి బ్రాహ్మణులకు భూరి దక్షిణలు ఇమ్మని, గోవులు, గ్రామాలు దానం చెయ్యి ముత్యాలహారాలు, కోటి సూత్రం, ఉదర బంధం తెప్పించు, బ్రాహ్మణుల స్వారికి వీలైన వెయ్యి ఎనిమిది ఏనుగులను సిద్ధం చేయి పురోహితులు, ఏనుగులు పోయి గంగాజలం తేవాలి. యుధిష్ఠిరుని సర్వాభరణాలతో అలంకరించాలి అంబారి ఏనుగు, సువర్ణాభరణాలు, శ్వేత ఛత్రం , చామరాలతో సిద్ధం చేయాలని చెప్పాడు విదురుడు ఆ విధంగానే ఏర్పాట్లు చేసాడు. వ్యాస భగవానుడు పట్టాభిషేకం పూర్తిగావించాడు.*

ఒక రాజు యుద్ధ రంగంలో గెలిచిన తర్వాత పురజనులు, బంధు మిత్రాదుల సమక్షంలో నిర్వహించే మహోత్తర కార్యక్రమం రాజుకు చేసే పట్టాభిషేక మహోత్సవం సంస్కృత భారతంలో ధర్మరాజు బంగారు సింహాసనం మీద సంతోషంతో తూర్పు ముఖంగా కూర్చున్నాడు. బంగారు పీఠం మీద సాత్యకి వాసుదేవులు ధర్మరాజును అభిముఖంగా కూర్చొన్నారు. ధర్మరాజును ముందు పెట్టుకుని భీమార్జునులు ఇరువురూ ఇరువైపులా కొంచెం ఎత్తు తక్కువై మణిపీఠాల మీద కూర్చొన్నారు. బంగారు పూలు పొదిగిన తెల్లని దంతపు సింహాసనం మీద నకుల సహదేవులను చెరొక వైపున పెట్టుకుని కుంతీ దేవి కూర్చొంది. సుధర్ముడు , విదురుడు, ధౌమ్యుడు, ధృతరాష్ట్రుడు, వేరు వేరు ఆసనాల మీద కూర్చున్నారు. యుయుత్సుడు, సంజయుడు, యశస్విని అయిన గాంధారి వీరంతా ధృతరాష్ట్రుని వైపు కూర్చున్నారు. సింహాసనం మీద కూర్చున్న ధర్మరాజు తెల్లని పువ్వులను స్వస్తికములను అక్షతలను భూమిని బంగారాన్ని వెండిని మణిని స్పృశించాడు. తరువాత ప్రజలంతా పురోహితుని ముందుంచుకొని మంగళ ప్రదమయిన చాలా వస్తువులను తీసుకుని వచ్చి ధర్మరాజును దర్శించారు. పుట్టమట్టి బంగారం, వివిధ రత్నాలు, అభిషేకం చేసే కుశం ఇలా అన్ని సంబరాలు సిద్ధం చేసారు. బంగారంతో రాగితో, వెండితో మట్టితో తయారు చేసిన పూర్ణకుంభాలు పువ్వులు, పేలాలు దర్భలు, ఆవుపాలు సిద్ధం చేసారు జమ్మి పిప్పల మోదుగ సమిధలు, తేనే నెయ్యి మేడి కర్రతో చేసిన స్రువమూ బంగారం పొదిగిన శంఖము సిద్ధపరిచారు.

పురోహితడైన ధౌమ్యుడు ముందుగా శ్రీకృష్ణుని అనుమతిని గ్రహించారు. ఈశాన్యం వైపు వేదికను ఏర్పరచి లక్షణంగా ముగ్గు పెట్టారు. పులిచర్మం పై భాగం లో తెల్లని దృఢమైన కోళ్ళతో అగ్ని కాంతులు కల సర్వతోభద్రమనే ఆసనం మీద ధర్మరాజును ద్రౌపదిని కూర్చుండపెట్టాడు. తరువాత యథావిధిగా మంత్ర పూర్వకంగా ధీమంతుడైన ధౌమ్యుడు అగ్నిలో హోమం చేసాడు. తరువాత కృష్ణుడు లేచిపూజింపబడిన శంఖం తీసుకుని కుంతి పుత్రుడైన ధర్మరాజును భూమికి రాజుగా అభిషేకించాడు. రాజర్షి అయిన ధృతరాష్ట్రుడు ప్రజలంతా ధర్మరాజును అభిషేకించారు. కృష్ణుని అనుమతితో తమ్ములతో

కూడిన ధర్మరాజు పాంచజన్యంతో అభిషిక్తుడయి రాజయి అమృతముఖుడయ్యాడు. తరువాత పణవాలు, ఆనకాలు, దుందుభులు. మొదలగు వాద్యాలను మ్రోగించారు. దానినంతటిని ధర్మరాజు ధర్మంగా కర్తవ్యంగా స్వీకరించారు. భూరి దక్షిణలతో వారినందరిని ధర్మరాజు యథావిధిగా పూజించాడు. వేదాధ్యయన సంపన్నులూ ధైర్య సచ్ఛీలాలు గల బ్రాహ్మణులచే స్వస్తి వచనాలు స్వీకరించి వారిని వేల కొలది నిష్కాలతో సత్కరించాడు. సంతుష్టులైన బ్రాహ్మణులు జయాన్ని స్వస్తిని చెపుతూ హంసల వలె కలనాదులు చేస్తూ ధర్మరాజును ప్రశంసించారు. అందరి చేత పూజింపబడటం చేత స్నేహితులతో కలిసిన ధర్మరాజు మహారాజ్యాన్ని  పొందాడు. ( **సంస్కృత భారతం, శాంతిపర్వం,40 వ అధ్యాయం**).

## 4.45. రాజు పుర ప్రవేశం:

ధర్మరాజు పట్టాభిషేకానికి ముందు పుర ప్రవేశాన్ని చేసిన విధానాన్ని తిక్కన వర్ణించిన తీరు అంతా తిక్కన కాలపు విశేషాలుగా చెప్పవచ్చు.

*‘‘ధర్మరాజు ధృతరాష్ట్రుడిని గాంధారిని గొప్ప పల్లకిలో కూర్చుండ బెట్టి తన ముందుంచుకొని శైబ్య, సుగ్రీవ, మేఘ పుష్ప వలాహకాలు అనే గుర్రాలను పూన్చిన రథంపై సాత్యకితో కలిసి శ్రీకృష్ణుడు వెనుక వస్తుండగా ప్రక్కనే మనోవేగంతో పరుగెత్తే గుర్రాలను పూన్చిన  శ్రేష్ఠమైన రథంపై యుయుత్సుడు వస్తుండగా తనకు యోగ్యమై వాహనాన్ని అధిరోహించి కుంతి దేవి మొదలైన అంతఃపుర స్త్రీలను పల్లకిలో ఉంచి విదురుడు వెనుక వస్తుండగా రాజులు అన్ని వైపుల నుండి సైన్యాలతో కలిసి సేవిస్తుండగా బయలుదేరే సమయంలో ఆ విధంగా సాగుతున్న ధర్మరాజు ప్రయాణం ఏనుగులు, రథాలు, గుర్రాలు బంటులు వాద్యాలు వింజామరలు, ఛత్రాలు ధ్వజాలతో అధికంగా ప్రకటితమయ్యింది. వేద పఠనం వంశ చరిత్రకు ప్రతిష్ఠను కీర్తించే మాగధులు సంతోషంగా పాడుతుండగా ధర్మరాజు హస్తినాపురంలో ప్రవేశించాడు. ( ఆంధ్ర మహాభారతం, శాంతి పర్వం, ప్రథమాశ్వాసం, 350 నుండి 354 పద్య,వచనాలు).*

సంస్కృత భారతంలో పుర ప్రవేశం, రాజువారితో కలిసి నక్షత్రాల్లో చంద్రుని వలె ప్రకాశిస్తూ ధృతరాష్ట్రుని ముందుంచుకొని నగరం ప్రవేశిస్తాడు ధర్మరాజు ఎద్దులకు పూన్చిన రథం ఎక్కుతారు పూజ్య మంత్రాలతో ఆ రథం పవిత్రం చేసారు. వందిమాగధులు స్తోత్రం చేస్తున్నారు. మహారాజు పురప్రవేశ సమయంలో ఎద్దులు పూన్చిన రథం ఎక్కి ప్రవేశించాలని వేద ప్రమాణం ఉంది (నీల కంఠీయ వ్యాఖ్య), పురం ప్రవేశించేటప్పుడు భీముడు పగ్గాలు, అర్జునుడు తెల్లగొడుగు పట్టుకున్నారు నకుల సహదేవులు తెల్లని వింజామరులు పట్టారు. ఇలా స్తోత్ర పాఠకులు స్తోత్రాలు చేస్తూ ఉండగా ధర్మరాజు హస్తినాపురంలో ప్రవేశించినట్లు ఉంటుంది.( **సంస్కృత భారతం, శాంతిపర్వం,37 వ అధ్యాయం**).

ఈ విషయాలను పరిశీలించిన మీదట తిక్కన తన కాలపు రాజనీతి పద్ధతులను రచనలో ప్రవేశపెట్టినట్లు తెలుస్తుంది. తనకు యోగ్యమైన వాహనాన్ని ధర్మరాజు అధిరోహించాడని ఉంటుంది. సంస్కృతభారతంలో ఎద్దులను పూన్చిన రథాలను ధర్మరాజు ఎక్కినట్లు ఉంటుంది.

## 4.46. రాజు ఉద్యోగులను నియమించుట:

రాజ్యపరిపాలన సుఖంగా సాగాలంటే ప్రసిద్ధులు, అనుభవజ్ఞులైన వారిని నియమించాలి. ధర్మరాజు రాజుగా పట్టాభిషిక్తుడయిన తర్వాత కొన్ని పదవులను కొంతమందికి అప్పగించాడు. వాటిని ఈ విధంగా వివరించారు.

**భీముడు**: యువరాజ పదవి

**విదురుడు:** కార్యాలోచనం చేయడం లోనూ నిశ్చయించడంలోనూ బుద్ధిమంతుడైన విదురుని మంత్రిగా నియోగించాడు.

**సంజయుడు:** చేసినపని, చేయవలసిన పని ఈ రెండింటిని తెలిసుకోవడానికి ఆదాయ వ్యయాలు ఆలోచించడానికి సంజయుని నియమించాడు. ఒక రకంగా ఆర్థిక వ్యవహారాలు సంజయునికి అప్పగించాడు.

**నకులుడు:** సైనిక దళాధిపతి గా నియమించాడు. సైనికుల పరిమాణంలోనూ ఆహారం, జీతం నిర్ణయించి ఇవ్వడం, సైనికుల ఇతరకార్యాలు మొత్తం నకులుని పర్యవేక్షణలో జరుగాతాయి.

**అర్జునుడు:** రాజ్య రక్షణా బాధ్యతలు శత్రుసేనలను అడ్డుకోవడంలోనూ దుష్టసంహారంలోనూ ధర్మరాజు అర్జునుని ఆదేశించాడు.

**ధౌమ్యుడు:** బ్రాహ్మణుల సంబంధించిన కార్యక్రమాలు, దైవ సంబంధ కార్యక్రమాలు మొత్తం పురోహితుడైన ధౌమ్యుడికి అప్పగించాడు.

**సహదేవుడు:** ధర్మరాజుకు తనకు అంగ రక్షకుడుగా నియమించుకున్నాడు. సర్వ కాల సర్వావస్థల యందు సహదేవుడు ధర్మరాజును రక్షిస్తూ ఉండాలి. (సంస్కృత భారతం, శాంతి పర్వం, 42 వ అధ్యాయం).

ధర్మరాజు ఎవరు ఏ పదవికి సరిపోతారో బాగా తెలిసిన వాడు అర్జునుని పరాక్రమం తెలిసిన వాడు కాబట్టే రాజ్యరక్షణ బాధ్యతలు అర్జునునికి అప్పజెప్పుతాడు.

ప్రస్తుత కాలంలో ఎన్నికల్లో పాల్గొనకపోయినప్పటికి వారి రాజకీయ చతురతా మంత్రి పదవుల్ని నిర్వహించే సామర్థ్యత కలిగిన వారిని గుర్తించి మంత్రులుగా నియమిస్తున్నారు. ఉదాహరణకు ఒకప్పటి రాయబారిగా ఉన్న ఒక వ్యక్తిని విదేశాంగా మంత్రిగా 2019 లో ను భారత ప్రభుత్వం నియమించింది. వారిలో ఎస్. జయ్ శంకర్ ను చెప్పుకోవచ్చు.

ఒక భారతీయ దౌత్యవేత్త, రాజకీయ నాయకుడు. అతను 31 మే 2019 నుండి భారత ప్రభుత్వంలో విదేశాంగ మంత్రిగా పనిచేస్తున్నాడు. https://en.wikipedia.org/wiki/S._Jaishankar

ఇదే విషయం పై రాజనీతి నిపుణుడు ఇ. వెంకటేశు చర్చిస్తూ ఈ విధంగా అంటారు.

*''జయ శంకర్ అనే వ్యక్తి IFS ఆఫీసర్ ఇతను విదేశాంగ మంత్రి ఎలా అయ్యాడు. దేశంలో చాలామంది IFS ఉన్నారు. ఇతనే ఎందుకు అయ్యాడు. అంటే ఇతను అంబాసిడర్ గా పనిచేసాడు. పనిచేసే వ్యక్తిత్వంతో పాటు పాలకులతో చాల చొరవగా ఉంటాడు. తర్వాత అక్కడున్న వాతావరణాన్ని సిట్యుయేషన్ ని అర్థం చేసుకోగలిగే శక్తి , నాలెడ్జ్ ఉన్న వ్యక్తి. ఇంటర్నెల్ గా గాని ఎక్స్టర్నెల్ గా కాని చొరవతో వెళ్ళి వారితో మాట్లాడి చర్చించేటటువంటి శక్తి ఉండాలి. ఇటువంటి గుణాలు ఇతనిలో ఉన్నాయి కాబట్టి మంచి అధికారంలోకి రాగలిగాడని వీరు అభిప్రాయపడ్డారు. (వెంకటేశు, ఇ . ముఖాముఖి)*

వీరి అభిప్రాయం ప్రకారం సమర్థవంతులే ఉన్నత స్థానాన్నిఅధిరోహించడానికి అర్హులని అర్థమవుతుంది.

## 4.47. క్షత్రియసంహారానంతరం రాజ్యపరిపాలన కొనసాగిన విధానం:

ధర్మరాజుకు శ్రీకృష్ణుడుతో పరశురాముడు క్షత్రియులనందరిని సంహరించిన తర్వాత మరలా ఏ విధంగా రాజ్య పరిపాలన కొనసాగిందని పరశు రామ వృత్తాంతాన్ని అడుగుతాడు. ఆ సందర్భంలో శ్రీకృష్ణుడు చెప్పిన వివరాలు భూమి మీద మరలా రాజ్య స్థాపన, రాజ్య విస్తరణ ఎలా జరిగిందనే విషయం తెలుస్తుంది.

*''పరశురాముడు తన తండ్రి తలను కార్తవీర్యార్జునుడి పుత్రులు నరికి వెళ్ళిన సంగతి తెలిసిన పరశురాముడు అత్యంత భయంకరమైన హైహయవంశ రాజులను మొదలుకుని సమస్త క్షత్రియ రాజులను తుద ముట్టించి అత్యంత రౌద్రంతో రాజులను సంహరించాడు. ఇరవై ఒక్క సార్లు దండెత్తి క్షత్రియ సంహారం చేసాడు. భూమి పై రాజులు లేకుండా చేసి అశ్వ మేధయాగం చేసి ఈ భూమినంతటిని కశ్యప ప్రజాపతికి దానమిచ్చాడు. ఆ కశ్యపుడు పరశు రామునితో ఇలా అన్నాడు. పరశురామా నీకు ఈ భూమి మీద నీకు అధికారం లేదు కాబట్టి దక్షిణ సముద్రాలు హద్దుగా కలిగిన ప్రదేశానికి వెళ్ళమని చెప్తాడు. కశ్యప ప్రజాపతి*

అవశేషం లేకుండా రాజలోకం నశించి పోయిందేమోనన్న అనుమానంతో దానంగా నాకిచ్చిన రాజ్యంపై పరశు రాముడు అధికారం లేకుండా చేసి తపోవనానికి వెళ్ళమని చెప్పాడు. అదే విధంగా పరశురాముడు వెళ్ళిపోయాడు. పరశురాముని వలన దానంగా పొందిన భూమినంతటిని బ్రాహ్మణుల సమూహానికి సమర్పించి కశ్యపుడు తపోవనానికి వెళ్లిపోయాడు. అప్పటి నుండి భూమి 'కశ్యపి' అని పిలువబడింది. కొంత కాలానికి వైశ్య శూద్రులలో శ్రేష్ఠులైన వాళ్ళు మిక్కిలి గర్వించి అనేక రీతులుగా బ్రాహ్మణుల భార్యలను ధన ధాన్యాలను మొదలగు వాటిని దొంగిలిచంచడం ప్రారంభించారు. కశ్యప ప్రజాపతి బ్రాహ్మణ సమూహానికి రాజ్యం అప్పగించి వెళ్ళిపోయాడు. ఆ తరువాత బ్రాహ్మణులు ధర్మమార్గాన్ని వదిలి పెట్టి కారణ రహితంగా వధించడం మద్యం సేవించడం ఉత్తమ మార్గంలో నడుస్తూ ఉన్న సాధుజనుల భార్యలను ధనధాన్యాలను దొంగిలించడం మొదలగు పనులు చేస్తూ అధర్మానికి పాల్పడ్డారు. తాము నిర్వహించవలసిన యజ్ఞయాగాదులను చెరపట్టడం సామాన్యమైపోయింది ఈ విధంగా అధర్మమార్గమే ప్రధానమై రాజులు లేకుండటం వలన అరాజకత్వం వలన భూమి క్రుంగిపోయింది. భూమి భరించలేక క్రిందికి వెళ్ళి పోయింది. ఈ విషయం తెలుసుకున్న కశ్యప ప్రజాపతి తన ఊరువులను ఆధారంగా చేసి భూమిని పైకి ఎత్తాడు ఇలా భూమిని ఊరువుల ఆధారంగా పైకి ఎత్తడం వలన ఈ భూమి ఉర్వి అని ప్రసిద్ధి కెక్కింది. ఆ సమయంలోనే ఉత్తమ రాజులు దండనీతి మార్గాన్ని అనుసరించి ధర్మాన్ని రక్షించి తనను సురక్షితను చేయగలవారుగా కశ్యపుని వరం పొందడానికి ఆ మహర్షితో భూదేవి పరశురాముడి  పరాక్రమానికి భయపడి కనిపించకుండా తప్పించుకున్న రాజులు అక్కడక్కడా ఉన్నారు. అటువంటి నాయకులను నా సంరక్షణార్థం పంపమని ప్రార్థించింది.

భూదేవి రక్షించగా చావకుండా తప్పించుకుని హైహయ వంశరాజులు కొందరు బతికిపోయారు.  కురువంశంలో జన్మించిన విదురథుడు, సుదాసు వంశంలో జన్మించిన సర్వ కర్ముడు,  శిబి చక్రవర్తి మనుమడు ప్రతర్దన కుమారుడు వల్సుడు, బృహద్రథ వంశంలో పుట్టిన భూరి, నయత్తు యొక్క సంతానం వలన పుట్టిన నాలుగేళ్ల వయసున్న

*ముగ్గురు సముద్రుడి రక్షణలో పెరిగి పెద్దవారయ్యారని చెప్పి వాళ్ళంతా ఉత్తమ క్షత్రియులు. పరిపాలనలో పాలించగలవారిగా నాకు ప్రసాదించడండి అనగా కశ్యప ప్రజాపతి భూదేవి వలన రాజులందరిని పిలిపించి చూచి రాజ్యాధిపత్యానికి అర్హులని భావించి ఉచితమైన రీతిగా భూమిని విభాగించి వారిని రాజ్యాభిషిక్తులను చేసాడు. ఇలా రాజవంశాలు అభివృద్ధి చెందాయి ఆ రాజులు భారత యుద్ధంలో సంహరించబడ్డారు. రాజులు రాజవంశాలు ఈ విధంగా పునర్జీవితులయ్యాయని ధర్మరాజుకు శ్రీకృష్ణుడు చెప్తాడు. (ఆంధ్ర మహాభారతం, శాంతి పర్వం, ద్వితియాశ్వాసం, 83 వ పద్యం నుండి)*

ఈ వృత్తాంతాన్ని పరిశీలిస్తే కశ్యప ప్రజాపతి నశించిపోతున్న రాజవంశాలని పునరుద్ధరింప చేసాడని తెలుస్తుంది. అంతకు ముందు రాజు లేని రాజ్యంలోని ప్రజలు అధర్మానికి బానిసై విహరించారు. కారణం రాజు లేకపోవడం వలన రాజు చేత దండన ఉంటేనే ప్రజలు అదుపు ఆజ్ఞలలో ఉంటారు. లేకుంటే అధర్మం వ్యాప్తి ఎక్కువగా ఉండేదని తెలుస్తుంది.

## 4.48. రాజ్యావిర్భావ సిద్ధాంతాలు:

రాజ్యావిర్భావ సిద్ధాంతాలను గమనిస్తే అందులో ప్రధానంగా 1. దైవదత్తాధికార సిద్ధాంతం, 2. సాంఘిక ఒడంబడిక సిద్ధాంతం ఈ రెండు సిద్ధాంతాలు మహాభారతంలో పరిశీలన చేయడానికి ప్రయత్నిద్దాం.

### 4.48.1. దైవదత్తాధికార సిద్ధాంతం:

రాజు దైవాంశ అని రాజుకు దైవానికి భేదం లేదని ఈ సిద్ధాంతం తెలుపుతుంది. అధర్మ

నిర్మూలన కోసం రాజు ఆవిర్భావం అవసరమయ్యింది.

*" ప్రకృతిలో మానవునికి ఎంతో ఉపకరించే శక్తులు లేక ధర్మాలే దేవతలు. ఇంద్రుణ్ని దేవలోక సార్వభౌమాధిపత్యం మానవుని భూలోక సార్వభౌమాధిపత్యానికి*

*ప్రతిబింబం మాత్రమే అని ఆచార్య డి.ఆర్. భండార్కర్ అభిప్రాయం. ప్రపంచాన్ని పరిపాలించడానికి భగవంతుడు క్షత్రియుల్ని సృష్టించాడని ప్రపంచాన్ని పరిపాలించడం వారి కర్తవ్యమనే సిద్ధాంతం ఆంధ్ర మహాభారతంలోని రాజ్యం యొక్క దైవదత్తాధికార సిద్ధాంత పరిణామంలో ప్రముఖ పాత్ర వహించాయి. (అనంతరామ శాస్త్రి, నేతి, కవిత్రయ భారతం, రాజనీతి, పుట: 16.)*

ఇందులో రాజు దైవానికి ప్రతిబింబంగా చెప్పబడింది అంటే రాజే దైవం అనే భావం కలుగుతుంది. అటువంటి రాజు ప్రజలను పరిపాలించడానికి సింహాసనాన్ని అధిష్ఠించే సమయంలో ఒక ప్రతిజ్ఞ ను మహర్షులు పృథు మహారాజు దగ్గర చేయించారు.

''ధర్మముట్లు ఉండమని చెప్తుందో దానినే అనుసరించాలి, ఇష్టానిష్టాలు మానసిక వికారాన్ని కలిగిస్తాయి. వాటిని విడిచి పెట్టి అన్ని ప్రాణుల యందు సమ భావంతో వర్తించాలి. కామ క్రోధాదులను జయించి ప్రజారక్షణే కర్తవ్యం. శాశ్వతమైన ధర్మమే నీకు రక్ష కర్తవ్యము నుండి తొలగిన వాడు ఎవ్వరైనా అతనిని బాహుబలంతో నిగ్రహించాలి. త్రికరణ శుద్ధిగా నీ భూమండలమును బ్రహ్మ స్వరూపముగా దలచి దీనికి సేవచేస్తానని ప్రతిజ్ఞ చేయుము. పెద్దలు చెప్పిన ఈ వాక్యముల అన్నింటిని పృథుమహారాజు మరలా అనువదించి పలికుతాడు.'' (నారాయణాచార్యులు, పుట్టపర్తి, మహాభారత విమర్శనము, పుట:65.)

ఈ ప్రతిజ్ఞ యందు రాగద్వేషములు లేవు ఈ ప్రతిజ్ఞ యందు చెప్పబడిన ప్రతి అక్షరము రాజు ఆచరణయోగ్యమైనప్పుడు మాత్రమే ఆ రాజు యొక్క ధ్యేయం విజయవంతమవుతుంది. అప్పుడు మాత్రమే రాజు దైవాంశసంభూతుడుగా పిలువబడుతాడు. రాజుకు దైవత్వాన్ని ఆపాదించి అతనిని ఎలా గౌరవించాలో కూడా ఈ సిద్ధాంతంలోని ప్రధాన విషయం.

రాజును మనుష్యులుగా భావించకూడదు అవమానించకూడదు. అతడు మానవ రూపంలో ఉన్న ప్రత్యక్ష దైవము. విశిష్టకాలమందు అతడు విశిష్ట దేవతల ఆకారాలు ధరిస్తాడు. కోపంతో పాపులతో సంహరించే సమయమున అతను అగ్ని వంటి వాడు

లోకానికి మంగళ మొనర్చు బుద్ధితో చారులను చక్షువులను ధరించి సమాజ స్థితిగతులను అవగతమొనర్చుకున్నప్పుడు రాజు సూర్యుడు, దుర్మార్గుడైన జనులను బంధుమిత్ర సహితంగా  నాశనం చేసే సమయంలో అతను మృత్యువు, అధర్మపరులను శిక్షించి ధార్మికులను రక్షించునప్పుడు అతడు యముడు అతడు ప్రజలపై ధనమును వర్షించును. ఉపకారం చేసిన వారికి ప్రత్యుపకారం చేస్తాడు. అపకారం చేసిన వారి సంపదలను హరించి కోశ సంగ్రహమును వృద్ధిపరచుకుంటాడు. అట్టివేళ అతడు కుబేరుడు. ఈ కర్తవ్యములను సాధింపని వాడు రాజరూపమును ఉన్న కలి. **(నారాయణాచార్యులు, పుట్టపర్తి. మహాభారత విమర్శనము, పుట:66)**

ఈ విషయములను పరిశీలిస్తే ప్రజలు రాజును దైవంగా భావించినప్పుడే ప్రజలలో భయం భక్తి రాజు మీద ఏర్పడుతాయి. దాని వలన రాజు పరిపాలనా వ్యవహారాలను పటిష్ఠంగా అమలు పరిచి రాజ్యాభివృద్ధికి పాటుపడుతాడు. ఒక్కో చర్యను అమలు చేస్తున్నప్పుడు రాజు అనేక దేవతా రూపాల యొక్క ఉనికిని కలిగి దుష్టులను  శిక్షించడం మంచివారిని రక్షించడం జరుగుతుంది.

### 4.48.2. వైన్యుడుని రాజును చేయడం:

> *"వైన్యుడు ప్రతిజ్ఞ అనంతరం వైన్యుని కోరిక మేరకు బ్రాహ్మణులను సహాయకులుగా నియమించబడ్డారు. ఆ సందర్భంలో సమస్తదేవతలతో కూడినవారైన బ్రహ్మవిష్ణువులు, మహర్షులు, సమస్త భూమికి వైన్యుడిని రాజుగా అభిషేకించారు. ఆ వైన్యుడికి శుక్రాచార్యుడు పురోహితుడుగా సారస్వత గణం మంత్రులుగా గర్గుడు జ్యోతిష్కుడుగా వర్తించారు. అంతకు ముందు భూమి మిట్టపల్లాలతో ఉన్న భూమినంతటిని వైన్యుడు సమతలం చేసాడు. వైన్యుడి సంతానం అంతా అతడితో సమానులై దండనీతిని అనుసరించారు. (ఆంధ్ర మహాభారతం, శాంతి పర్వం, 211 వచనం,).*

ప్రజలకు రాజు ఎంత అవసరమో ఈ విషయాలు ప్రస్ఫుటంచేస్తాయి.

**వ.** *తత్సంతతి జాతు లెల్లను దత్కల్పులై రాజత్వంబు వహించి దండనీతి పాలించిరి. రాజని యొకండు కలిగిన తెఱంగును రాజ్య స్థాపనంబును రాజు మిగిలి వర్తింపం దక్కిన జనంబులకు రాకుండుటయు విష్ణు విహితంబులు విష్ణుండు రాజుల నిజ తేజోంశంబులం ప్రవేశించి యుండునట్లగుటంజేసి దైవ నిహభుండగుచు రాజెల్ల వారి చేతను మ్రొక్కుం గొనజాలుఁ దద్రక్షణంబును నాచరించు, నొక్కని వశంబున లోకంబంతయు వర్తిల్లుటకు దేవ సంబంధకలితంబయిన గుణంబువెలిగా నుండు కారణంబు కలదే? యాకర్ణింపుము. (ఆంధ్రమహాభారతం, శాంతి పర్వం, ద్వితియాశ్వాసం, 216 వచనం).*

ఆ వైన్యుడి సంతానమంతా అతడితో సమానులై దండనీతిని అనుసరించి రాజ్యం చేసారు. రాజనేవాడు పుట్టిన విధానము , రాజ్య స్థాపనం, రాజును అతిక్రమించకుండా ప్రజలు ప్రవర్తించడం అనే అంశాలన్నీ విష్ణు నిర్ణయకాలే విష్ణువు రాజులందు తన తేజో భాగములను ప్రవేశింపచేయడం వలన రాజు దైవ సమానుడై ప్రజల నమస్కారాలకు అర్హుడయ్యాడు. ప్రజా సంరక్షణం ఒకడి అధీనంలో ఉండడం అనేది దైవాంశ సంబంధమైన గుణం కాక మరొకటి లేదు.

*మ. హరిఫాలంబునుఁబుట్టి ధర్మమున కాలై యర్థమన్పుత్రకున్*
*సిరి కాంచెన్ దగ వారు ముప్పురును సుస్థేమ్నోన్నతిన్ సంశ్రయిం*
*తురు భూపాలకు నాతఁడన్య జనతా తుల్యోద్భవుండెట్లు ని*
*ర్జర లోకార్హ సమగ్ర పుణ్య వితతి ప్రాప్తుండు గా కారయన్. ( ఆంధ్ర మహాభారతం, శాంతిపర్వం, ద్వితియాశ్వాసం, 217 వ పద్యం).*

ఈ విషయాలు రాజులోని దైవగుణాలను ప్రస్ఫుటిస్తూనే ధనము, ధర్మము, రాజుని ఆశ్రయించి ఉండడం చేతనే రాజు స్వర్గలోకాన్ని పొందడానికి అర్హత సాధించాడని తెలుస్తుంది.

### 4.48.3. ఒడంబడిక సిద్ధాంతం:

భీష్ముడు ఒడంబడిక ద్వారా రాజ్య పరిపాలనను ఏ విధంగా నిరాటంకంగా కొనసాగించవచ్చో శాంతి పర్వంలో తెలియజేస్తాడు. మనువు ప్రజలను పరిపాలించడానికి ఇష్టపడకపోతే ఏ విధంగా ఒప్పందం చేసుకుని పరిపాలన కొనసాగించడానికి ఆమోదయోగ్యమైనదో ఈ క్రింది వివరాలు తెలియజేస్తాయి.

**సీ.**_జనులొక్కతఱిఁ దొల్లి సమయంబు దమలోనఁ –_
_జేసి క్రూరతయు మ్రుచ్చిమియు ఱంకు_
_సైఁపక యట్టి దుర్జను నందఱును గూడి–_
_శాసించువారుగాఁ జాలి తమకు_
_నధిపతియుఁగ నొరునాసపడక యుండి –_
_నడవడి బహు కారణములఁ జిక్కు_
_వడిన విషణ్ణులై బ్రహ్మగానగఁ బోయి –_
_మాకు రక్షకుఁడుగా మహిపుఁడొకఁడు_
_తే. వలయు రూపింపు మాతని గెలిచి బ్రదుకు –_
_వార మనుటయు నజుఁడును వారి వలని_
_కరుణ మనువు నిరూపించె నరు లసత్య–_
_చరితులని పాలనమునకుఁ జొరడ యతఁడు. (ఆంధ్రమహాభారతం, శాంతి పర్వం, ద్వితీయాశ్వాసం, 277 వ పద్యం)._

ఒకప్పటి కాలంలో ప్రజలు తమలోనే ఉన్న క్రూరత్వం, దొంగతనం వ్యభిచారం, మొదలగు దుర్గుణాలను సహించక అలాంటి పనులను చేస్తున్న దుర్మార్గుడిని అందరూ కలిసి వారే నియంత్రించడానికి ప్రయత్నించారు, కాని అది సాధ్య పడలేదు చివరకు బ్రహ్మ మనువును ప్రజలను పరిపాలించానికి నియమించాలని అనుకుంటాడు దానికి మనువు అంగీకరించకపోవడంతో ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుంటారు. ప్రజల నుండి పశువులోని

బంగారంలోనూ సగ భాగం నీ సొత్తు పంటలలో పదవ భాగాన్ని కోశం కొరకు గ్రహించి ఆయుధాలతో జీవించేవారిని నీ వారుగా చేసుకుని దుష్ట శిక్షణ , శిష్ట రక్షణ కావించుము మేమంతా నీ ఆజ్ఞను పాలిస్తాం. దుర్మార్గులు నశిస్తారు. ధర్మాత్ములు చేసిన ధర్మంలో ఆరోవంతు నీకు చెందేటట్లు అంగీకరిస్తున్నామని ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుని ప్రజలను పాలించడం ప్రారంభిస్తారు.

### 4.49. రాజ పురోహితుడు:

రాజునకు పురోహితుడు ప్రధానంగా ఉండాలి. మంత్రశాస్త్ర నిపుణుడైన పురోహితుడు రాజు దగ్గర అనేక యజ్ఞాలను చేయించి రాజ్య క్షేమానికి పాటుపడుతాడు. శకునములు , అపశకునములను ఎప్పటికప్పుడు తెలియజేస్తూ రాజు క్షేమానికి పెద్దపీట వేస్తాడు.

*‘‘పురోహితం ప్రకుర్వీత దైవజ్ఞముదితోదితమ్*
*దండనీత్యాంచ కుశలమధర్వాంగిరసే యథా*

పురోహితుడు దైవజ్ఞుడై ఉండాలి. అతడు గ్రహ ఉత్పాతాలు కలిగినప్పుడు వాటిని శాంతింప చేయుటకు, వాటి గురించిన శాస్త్రాలను చక్కగా తెలుసుకున్న వాడై ఉండాలి. దండనీతి యందు సంపూర్ణ పరిజ్ఞానం కలిగి ఉండాలి. అటువంటి వారిని పురోహితులుగా చేసుకోవాలి.( **గోదావరిభాయి, సంధ్యావందనం, మహాభారతం, రాజనీతి విశేషాలు, పుట:65).**

శ్రీకృష్ణార్జునులు, భీముడు మగధరాజధాని గిరివ్రజపురంలో ప్రవేశించగానే జరాసంధునికి అపశకునాలు మొదలవుతాయి. వెంటనే అక్కడి బ్రాహ్మణులు ఆ విషయాన్ని తెలియజేస్తారు. పురోహితులు జరాసంధుని ఏనుగుపై కూర్చుండబెట్టి చుట్టూ నీరాజనాలతో అగ్నిని ప్రజ్వలింజచేసాడు. జరాసంధుడు అనిష్టం శాంతించడానికి వ్రతదీక్షను తీసుకుని నియమాలను, ఆచరిస్తూ ఉపవాసం చేసాడు. ( సంస్కృత భారతం, సభాపర్వం, 21 అధ్యాయం, 23 వశ్లోకం).

పురోహితుడు బ్రాహ్మణ రూపంలో ఉండడమే ఎక్కువగా కనబడుతుంది.

ఈ బ్రాహ్మణత్వం యొక్క లక్షణం పూర్వం ఎలా ఉండేదో పిల్లల మర్రిరాములు, *''తెలుగులో భక్తి కవిత్వం-సామాజిక విశ్లేషణ'' గ్రంథంలో ఈ క్రింది విధంగా చర్చిస్తారు..'' ద్విజులుగా పరిగణింపబడిన మూడు వర్ణాల్లో ప్రముఖమైనది సులభంగా గుర్తించగలట్టిది బ్రాహ్మణ వర్ణం , వివిధ కర్మకాండల్లో పాల్గొనే అవకాశం వల్ల సమాజంలో బ్రాహ్మణులకు విశిష్టత ఏర్పడింది. ఆ విశిష్టత కలగడానిక పుట్టుకే కారణమైనప్పటికి ఆ సంప్రదాయాలను క్రమపద్ధతిలో పాటించవలసిన అవసరమూ ఉండేది. అటువంటి బ్రాహ్మణు సంరక్షణా బాధ్యతను రాజు నిర్వహించేవాడు. సమాజం స్థిరంగా ఉండడానికి బ్రాహ్మణ ధర్మాలను రక్షించడం రాజ్యం యొక్క ప్రధాన ధ్యేయమని చాణుక్యుడు బోధిస్తాడు. బ్రాహ్మణుల ప్రత్యేకతను రక్షించవలసిన బాధ్యత రాజ్యంపై ఉండడం వల్ల సహంగానే బ్రాహ్మణ, క్షత్రియుల మధ్య సత్సంబంధాలు కొనసాగేవి. వీరిరువురి మధ్య స్నేహ సంబంధాలు నెలకొనడానకి చారిత్రకులు మరొక కారణం కూడా పేర్కొంటారు. ఉత్పాదిక వర్గాల నుండి వచ్చే మిగులును ఈ రెండు వర్ణాలు పంచుకోవడం. ఈ రెండు వర్గాలు భిన్నమైన పనులు చేయడం వలన వృత్తిలో పోటీలేదు. పరస్పర అవసరాలు ఉండడమే కాక బ్రాహ్మణులు, క్షత్రియుల ఆధిపత్యాన్ని తాత్త్వికంగా నిలబెట్టడానికి కృషి చేసారు. క్షత్రియేతరులు రాజ్యాధికారంలోకి వచ్చినప్పటికీ వారికి రాజబిరుదులను ప్రసాదించి ప్రముఖవంశాలతో సంబంధం కలపడం ద్వారా వారిపాలనను ప్రజల చేత ఆమోదయోగ్యం చేసేవారు. దీని వల్ల రాజులకు బ్రాహ్మణుల అవసరం నిరంతరం ఉండేది. బ్రాహ్మణ క్షత్రియు సంబంధాలను పదకొండవ శతాబ్దంలో రచన చేసిన నన్నయ్య కూడా ప్రత్యేకంగా ప్రస్తావించాడు. మహాభారతంలోని ఆదిపర్వంలో దీర్ఘతముడనే బ్రాహ్మణుడు 'బలి' అనే రాజుకు సంతాన ప్రాప్తిని కలిగించి వెళ్లిపోయిన సందర్భంలో నన్నయ్య 'ఉత్తమ క్షత్రియక్షత్రేములందు ధర్మమార్గంబున బ్రాహ్మణు వలనంబుట్టి వంశకరులయిన క్షత్రియులు అనేకులు కలరుఅంటాడు. నన్నయ కాలంనాటికి ఈ సంబంధాలు కొనసాగకపోయినా బ్రాహ్మణ క్షత్రియుల మధ్య గల పటిష్ఠమైన సంబంధాలను*

*ఊహించవచ్చు. (రాములు, పిల్లలమఱ్ఱి, తెలుగులో భక్తి కవిత్వం –సామాజిక విశ్లేషణ'', పుట:23).*

ఈ విషయాలను పరిశీలిస్తే క్షత్రియులైన రాజులకు బ్రాహ్మణులకు మధ్య ఎటువంటి సంబంధాలు ఉండేవో తెలుస్తుంది అంతే కాకుండా బ్రాహ్మణులు రాజ్య క్షేమం కోసం తగిన సలహాలు ఇచ్చేవారని తెలుస్తుంది.

### 4.49.1. నారదుడు తెలిపిన పురోహిత లక్షణాలు:

సభాపర్వంలో నారదుడు పురోహితుని లక్షణాలను తెలియజేస్తాడు.

*క. ధీరుఁడు ధర్మాధర్మ వి– శారదుఁడు బహుశ్రుతుండు సమచిత్తుఁడు వా*
*ణీ రమణీ శ్రిత వదన స – రోరుహుఁడనఁజనునె నీ పురోహితుఁడధిపా*
*(ఆంధ్రమహాభారతం, సభాపర్వం, ప్రథమాశ్వాసం, 29 వ పద్యం).*

పురోహితుడైన వాడు ధైర్యవంతుడు, ధర్మాధర్మాలు తెలిసి వివిధశాస్త్రాలలో బాగా అధ్యయనం చేసినవాడు రాగద్వేషాలు లేనివాడు. సరస్వతి దేవి కొలువున్న ముఖపద్మం కలవాడై ఉండాలని ఈ పద్యం యొక్క అర్థం,
ఇక్కడ ధైర్యవంతుడు అంటే రాజు కదా అని భయంతో ధర్మాలు అధర్మాలు చెప్పకుండా ఉండకూడదు ఈ పని చేయకూడదని పురోహితుడు చెప్పినప్పుడు రాజు పురోహితుడు చెప్పేది రాజు క్షేమానికి రాజ్యం సుభిక్షానికని గ్రహించి ఆ పనిని చేయగలగాలి.

మహాభారతంలో అంగారపర్ణుని సలహామేరకు పాండవులు ఉత్యచం అనే పుణ్య తీర్థం దగ్గర తపస్సు చేసుకుంటున్న ధౌమ్యుల వారిని పురోహితులుగా చేసుకోవడానికి నిశ్చయించారు. ఆ ధౌమ్యుని లక్షణాలను ఈ విధంగా తెలియజేస్తారు.

*ఉ. వీత సమస్త దోషుఁడయి వేడ్కఁ దపం బొనరించుచున్నవి*
*ఖ్యాతుఁబురోహిత ప్రవరుఁగా వరియించిరి భక్తితో జగ*
*త్పూత చరిత్రు సాధు జనపూజితు ధార్మికుధౌమ్యు దేవల*

*భ్రాతృవరున్ మహాత్ము హిత భాషణుభూసురవంశ భూషణున్. (ఆంధ్రమహాభారతం, ఆదిపర్వం, సప్తమాశ్వసం, 158 వపద్యం).*

పాపరహితుడు, తపస్సుమీదే ధ్యాస కలిగిన వాడు, ప్రసిద్ధుడు, లోకంలో పుణ్య మైన పవిత్రమైన చరిత్ర కలవాడు సజ్జనులచేత పూజింపబడేవాడు, ధర్మమూర్తి, శుభాన్ని కలిగించే మాటలు పలికేవాడు దేవలుని తోబుట్టువులలో గొప్పవాడైన ధౌమ్యుడిని పాండవులు పురోహితునిగా స్వీకరించారు.

ఈ ధౌమ్యుడు అజ్ఞాత వాస సమయంలో ధర్మరాజుకు అనేక రాజనీతి ధర్మాలను బోధించి విరటుని కొలువులో ఎలా నడుచుకోవాలో తెలియజేసాడు.

*"జనమేజయుడు యజ్ఞం చేస్తున్న సమయంలో అతని తమ్ముళ్లు సరమ అనే పేరుగల దేవతల కుక్కకు పుత్రుడైన సారమేయుడనే కుక్క పిల్లను అకారణంగా కొట్టడం వలన సరమ జనమేజయునికి కారణం లేకుండానే ఆపదలు కలుగుతాయని అకారణంగానే భయం కలుగుతుందని చెప్తుంది. జనేమేజయుడు సరమ మాటలకు బాధపడి ఉపశాంతి కలిగించుకోవడం కోసం పురోహితున్ని వెతుకుతాడు. అప్పుడు అతనికి శ్రుతశ్రవసుడు అనే ఒక గొప్ప మునిని చూచి పవిత్రుడు, గొప్ప తపస్సులో నిష్ఠ కలిగిన వాడు ఇంద్రియ నిగ్రహం కలిగిన అతని కుమారుడు సోమశ్రవుడిని పురోహితునిగా సమర్పించండని కోరుకుని సోమశ్రవుడిని పురోహితునిగా స్వీకరించాడు.( ఆంధ్రమహాభారతం, ఆది పర్వం, ప్రథమాశ్వాసం, 87 వ పద్యం) సంస్కృత భారతంలోనూ ఈ విధంగానే పురోహితున్ని స్వీకరించడానికి పురోహితుడైన సోమశ్రవసుని యొక్క నియమాన్ని తెలియజేస్తాడు. ఏ బ్రాహ్మణుడైనా ఏదైనా అర్థాన్ని యాచిస్తే దానిని అతనికి ఇచ్చివేస్తాడు దానిని నీవు సహించగలగాలి అనగానే జనమేజయుడు అంగీకరిస్తాడు. (సంస్కృత భారతం, ఆదిపర్వం, 3 వ అధ్యాయం,)*

ఈ విషయాలను గమనిస్తే రాజు యొక్క అంతరంగంలో కలిగిన వ్యథను

తొలగించడానికి పురోహితుని ఆవశ్యకత ఎటువంటిదో తెలుస్తుంది. పురోహితుని నియమాలను రాజు పాటింపచేయడానికి అంగీకరించడం వలన రాజు పురోహితునికి ఇచ్చే గౌరవం ప్రాధాన్యత వ్యక్తమవుతుంది. పురోహితునిగా స్వీకరించిన తర్వాత జనమేజయుడు తక్షశిలపైకి దండెత్తి దానిని స్వాధీనం చేసుకున్నాడు.

మరుత్త మహారాజు యజ్ఞం చేయాలని సంకల్పించాడు. ఆ యజ్ఞానికి ఉపద్రష్టగా ఉండడానికి బృహస్పతిని అడిగి విఫలుడు అవుతాడు. బృహస్పతి తండ్రి అంగిరస మహర్షి మరుత్తుని తాతగారైన కరంధముడికి ఉపద్రష్టగా ఉన్నాడు అన్న విషయాన్ని గుర్తు చేసి బృహస్పతిని ఉపద్రష్టగా పిలుస్తాడు. దానికి బృహస్పతి అంగీకరించడు. తర్వాత నారదుని సలహా మేరకు మరుత్తుడు బృహస్పతి తమ్ముడు సంవర్తుడిని ఆశ్రయిస్తాడు. అతనిని ఉపద్రష్టగా పొందడానికి కొన్ని పరిక్షలు ఎదుర్కుంటాడు. సంవర్తుడు యజ్ఞం చేయించడానికి అంగీకరిస్తాడు. అయితే ఎన్ని ఆటంకాలు వచ్చినా యజ్ఞం విరమించుకోకూడదని ఒక నియమం ఆ రాజుకు తెలియజేస్తాడు. మరుత్తుడు అలాగే అంటాడు. మరుత్తుడు సంవర్తుడిని ఉపాధ్యాయుడిగా స్వీకరించడం వలన హిమాలయాలకు ఉత్తర భాగంలో ముంజవంత పర్వతమున్నది అక్కడ శివుని ప్రార్థించి అక్కడున్న బంగారాన్ని తీసుకొండని అనగా మరుత్తుడు ఆ విధంగానే శివుని స్తుతించి బంగారు రాసులను కోకొల్లలుగా కట్టించి బంగారు శిలలను మోపులు కట్టించి హిమాలయములు దాటి నగరం చేరుకున్నారు. పురోహితుని మీద రాజుకు ఉన్న భక్తే అతనిని ధనవంతునిగా, కీర్తిమంతునిగా చేసింది. యాగానికి అడ్డుకోవాలని ఉన్న ఇంద్రుణ్ణి కూడా హవ్యభాగం స్వీకరింపచేసి రాజు యొక్క భయాన్ని తొలగింపచేస్తాడు. పురోహితునికున్న యోగ శక్తి అటువంటిది.( ఆంధ్రమహాభారతం, అశ్వమేధ పర్వం, ప్రథమాశ్వాసం, 58 వ పద్యం, ).

## 4.49.2. భీష్ముడు తెలిపిన పురోహిత లక్షణాలు:

భీష్ముడు ధర్మరాజుకు పురోహిత లక్షణాలను తెలియజేస్తున్నాడు.

*తే. అమర గరుడ గంధర్వ విద్యాధరాది – దివ్యులకు నధ్వరంబుఁదృప్తి నేసి*
*పరమ శుభములఁబొందు భూవరుడు దాని – కెల్ల మూలంబు దగు పురోహితుని బుద్ధి*
*( ఆంధ్రమహాభారతం, శాంతి పర్వం, ద్వితీయాశ్వాసం, 306 వ పద్యం,).*

రాజు ఆచరించే యాగాదుల చేత దేవతలు గరండ, గంధర్వ విద్యాధరులు మొదలగు సమస్త దేవలోక వాసులకు సంతృప్తి కలిగించే అత్యంత శ్రేష్ఠమైన శుభ పరంపరను పొందుతాడు. దీనికి అంతటికి పురోహితుడి బుద్ధిబలమే కారణమని పై పద్యంలో భావం.

రాజ్యవ్యవహారాలలో బ్రాహ్మణుల స్థానం ఎలా ఉండేదో వివరిస్తూ పిల్లలమర్రి రాములు '' **తెలుగులో భక్తి కవిత్వం –సామాజిక విశ్లేషణ''** గ్రంథంలో ఈ విధంగా తెలియజేసారు. '' భారతీయ సామాజిక వ్యవస్థకు తాత్త్విక పునాదిని కూర్చినవారు బ్రాహ్మణులు వర్ణవిధానంలో మేధాగతమైన కార్యక్రమాలను నిర్వహించేవారిగా అత్యున్నత గౌరవం పొందడం వల్ల భారత సామాజిక ఆధిపత్య వర్ణానికి బ్రాహ్మణ వర్ణ పర్యాయపదమైంది. రాజ్య వ్యవహారాలు మొత్తం బ్రాహ్మణుల భావాలకనుగుణంగా నిర్వర్తించబడుతాయి. రాజ్యం అనుసరించాల్సిన విధానాలను రాజులకు బోధించడం. వాటిని అమలు పరిచేలా చేయడం వీటితో పాటు మత కర్మకాండల్లాంటి అంశాలలో బ్రాహ్మణులకున్న ప్రాధాన్యం వల్ల బ్రాహ్మణ భావజాలాన్ని ఆధిపత్య భావజాలమని వ్యవహరిస్తున్నారు. రాజ్యతంత్రంలోని అంశాలే గాక పూర్వ విజ్ఞానానికి వారసులుగా వేద ఉపనిషత్తుల భావాలను కొనసాగించి తర్వాతి వారికి అందించడంలో వారి పాత్రను బట్టి బ్రహ్మణ సంప్రదాయాన్ని వైదికమతమని, బ్రాహ్మణ మతమని సామాజిక శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారని వీరు తెలిపారు.'' **(రాములు, పిల్లలమర్రి, తెలుగులో భక్తి కవిత్వం – సామాజిక విశ్లేషణ'', పుట:26,27).**

రాజులు బ్రాహ్మణులకు ఎంతటి ప్రాధాన్యం ఇచ్చేవారో ఈ విషయాలు స్పష్టం చేస్తున్నాయి.

## 4.50. యుద్ధ తంత్రం – అస్త్ర శస్త్రాలు:

అస్త్రాలు:

యుద్ధ రంగంలో శత్రువులపై ప్రయోగించే అస్త్రాలు పూర్వం నుండే వాడుకలో ఉన్నాయి. ఇక్కడ ప్రస్తావిస్తున్న అస్త్రాలు గురించి నీతి ప్రకాశికలో ఉపసంహరించగలిగిన అస్త్రాల పట్టిక ఇవ్వబడింది. వీటి సంఖ్య యాభై మూడు వీటి పేర్లను రాజగోపాలనాయుడు ''కురుక్షేత్రే'' గ్రంథంలో ఈ విధంగా పేర్కొన్నాడు.

1.సత్యవాన్=బహుశా ఇది ఇష్టానుసరించి వదులబడేది

2. సత్య కీర్తి

3. రభస=చాలా వేగంగా శబ్దం చేస్తూ వెళ్ళేది

4.దృష్టము=ఒక బండి ఇరుసు లాటిది

5. ప్రతిహారతరము=దాడినెదుర్కొనగలిగినది.

6. అవాఙ్ముఖము=ముఖం కిందై ఉండేది

7. పరాఙ్ముఖము=ఆకు రూపంలో ఉండేది

8. ద్రుతనాభము=పడవ రూపం గలది

9. అలక్ష్యము=లక్ష్యం లేకుండా వదిలేది

10. లక్ష్యము=గురిపెట్టి వదిలేది

11. ఆవిలము=గొట్టె రూపంలో ఉండేది.

12. సునాభకము=బలమైన దిండు కలిగినది

13. దశాక్షము=పది రంధ్రాలు కలిగినది

14. శతవక్త్రము=నోరు నోళ్లు గలది

15. దశశిరము=పది తలలు గలది

16. శతోదరము=నోరు రంధ్రాలు గలది

17. ధర్మనాభము=ధర్మాన్ని నిలబెట్టడానికి కుపయోగించేది.

18. మహానాభము=పెద్ద కేంద్రము గలది

19. దుందునాభము=మధ్య ఒక పీపా లాగా ఉండేది.

20. నాభకము=చక్రపు దిండులాటిది.

21. జ్యోతిషము=ప్రకాశమానమైనది

22.విమలకూలము=పవిత్రమైనది.

23.నైరాశ్యము=నిరుత్సాహాన్ని కలిగించేది.

24. కృశానము=చిన్నది

25.యౌగంధరము=అమానుషమైనది.

26. సనింద్రము=ఇంద్రునికి సంబంధించినది

27. ధైత్యము≠రాక్షసులకు సంబంధించినది

28. ప్రమతనము=చిత్రహింస చేసేది

29.సార్చిర్మాతి=పూలదండలాటిది.

30.ధృతిర్మాతి=పట్టుకోగలిగింది.

31. వృత్తి మాన్=కదిలి తిరగగలిగింది.

32.రుచిరము=పునరుద్ధరించదగినది.

33. పిత్ర్యము=మఖా నక్షత్రము లాటిది.

34.సామనసము=పూలలాటిది

35. విధూతము=అస్థిరమైనది

36. మకరము=మకర స్వరూపము గలది

37. కరవీరము=కత్తిలాంటిది

38. ధనరతి=ధనాన్ని చేకూర్చేది

39. ధాన్యము=ధాన్యాలను ఇచ్చేది

40. కామరూపకము=ఇష్టం వచ్చిన రూపాన్ని ధరించేది

41.జృంభకము=వెడల్పైన వక్త్రం కలిగినది.

42. ఆవరవము=రక్షించేది

43. మోహనము=స్మరణ తప్పించేది

44. కామరుచి=ఇష్టం వచ్చినట్లు ఉపయోగపడేది

45. వారుణము =వరుణునికి సంబంధించినది.

46. సర్వదమనము=అన్నిటినీ లోబరుచుకొనేది.

47. సంధానము=బాగుగ లక్ష్య పెట్టగలిగినది.

48.సర్పనాభకము=సర్పంలాటిది.

49. కంకళాస్త్రము=క్రౌంచ పక్షి ఈకలు కలిగినది.

50 మౌసలాస్త్రము=రోకలి లాంటిది

51. కపాలాస్త్రము=తల బుర్రలాటిది

52. కంకణము=గాజులాటిది

53. పైశాచాస్త్రము=పిశాచం లాగా భయాన్ని కలిగించేది.

ఉపసంహరించరాని అస్త్రాలు 43 రకాలు అవి నలభై మూడు:

1. దండ చక్రము=చక్రము

2. ధర్మచక్రము=ధర్మాన్ని నిలబెట్టేది

3. కాలచక్రము=మరణాన్ని ఇచ్చే చక్రము

4. ఐంద్రచక్రము=ఇంద్రునికి సంబంధించినది

5. శూలవాతము=శివునికి సంబంధించినది

6. బ్రహ్మ శీర్షము=బ్రహ్మకు సంబంధించినది

7. మోదకి=బ్రహ్మ గొలుపేది.

8. శిఖరి=తల తరిగే దానికి వీలైనది.

9. ధర్మపాశము=వరుణునికి సంబంధించిన పాశము

10.వరుణపాశము=వరుణునికి సంబంధించిన పాశము.

11. పినాకాస్త్రము=శివునికి సంబంధించిన అస్త్రము

12. వాయువ్యము=వాయువు కు సంబంధించినది

13.శుష్కము=ఎండబెట్టగలిగేది.

14. అర్ధము=తడిపేది.

15. శిఖరాస్త్రము=మంటల్ని గ్రక్కేది

16. క్రౌంచాస్త్రము=క్రౌంచ పక్షి లాటిది

17. హయ శీర్షము=గుఱ్ఱం తలలాటిది.

18.విద్యాస్త్రము=అద్భుతమైనది.

19. అవిధ్యాస్త్రము=శ్రమ గొలుపేది.

20. గాంధర్వాస్త్రము=విష్ణువుకి సంబంధించినది

21. వర్షణము=చినుకుల్ని రాల్చేది

22. శోషణము=మదనునికి సంబంధించినది

23. ప్రశ్వాపనము=గాఢ నిద్ర పుచ్చేది

24. ప్రశమనము=శమింప చేసేది

25. సంతాపనము=మరణాన్ని చేకూర్చేది

26. విలాపనము=రోధించేది

27. మదనము=విశ్వాస పాత్ర మైనది

28. మానవాస్త్రము=మనవుకి సంబంధించినది

29. నామనము=విమానము నుండి చేసేది

30. తమనము=చీకటిని కూర్చేది

31. సంవర్తము=తెరను కల్పించేది

32. మౌసలము=రోకలి లాంటిది

33. సత్యము=ఖగోళానికెగిసేది

34. సౌరము=సూర్యునికి సంబంధించినది.

35. మాయాస్త్రమ=

36. త్వాష్ట్రము=విశ్వకర్మకు సంబంధించినది

36. నాగాస్త్రము=సర్పము లాంటిది

37. సోమాస్త్రము=ఈశ్వరునికి సంబంధించినది

38. సంహారము=సంహరించేది

39. మాదాసనం=విష్ణువు కి సంబంధించినది

40. గారుఢాస్త్రము=గరుడని వంటిది

35. మాయాస్త్రము=మాయ గొలిపేది

36. త్వాష్ట్రము= విశ్వకర్మకు సంబంధించినది.

37. నాగాస్త్రం=సర్పము లాంటిది

38. సోమాస్త్రము=ఈశ్వరునికి సంబంధించినది

39. సంహారము=సంహరించేది

40. మాదసనం=విష్ణుకు సంబంధించినది

41. గారుఢాస్త్రము=గరుడని వంటిది

42 శైవేశీనము=రాతితో చేయబడినది

43.నందనాస్త్రము=కుమారునిలాటిది.

ఈ అర్థాలను ప్రాచీన భారతదేశంలో యుద్ధం ’ అనే గ్రంథంలో దీక్షితర్ ఇచ్చారు. ప్రయోగించి ఉపసంహరించ కలిగినవి, ఉపసంహరింపలేనివి మొత్తం కలిసి తొంభై ఆరు అస్త్రాలున్నప్పటికి కురుక్షేత్ర సంగ్రామంలో వీటిలో కొన్ని మాత్రమే ఉపయోగింపడినట్లు తెలుస్తుంది. ( రాజగోపాల నాయుడు, పి. కురుక్షేత్రే, పుట: 153, నుండి 157 వరకు).

## 4.51. మనుస్మృతి – రాజనీతి– మహాభారతాంశాలు:

మనుస్మృతి లోని రాజనీతి అంశాలు ఏ మేరకు మహాభారతంలో నిక్షిప్తమై ఉన్నాయో సంక్షిప్తంగా ఈ క్రింది వివరిస్తున్నాను.

ధర్మమనేది గొప్ప కాంతి వంటిది. దాన్ని సామాన్యులు మోయలేరు అందువల్ల ధర్మం తప్పిన రాజును ఆ దండం బంధుమిత్రాదులతో సమూలంగా నాశనం చేస్తుంది. ( లక్ష్మీ నరసింహాచార్యులు, నల్లందిఘళ్, మనుస్మృతి, పుట:157).

ఆంధ్రమహాభారతంలో దుర్యోధనుడు ధర్మం తప్పి ప్రవర్తించడం వలన దురాలోచన వలన తన రాజ్యాన్ని బంధు మిత్రులను కోల్పాయాడు, ధృతరాష్ట్రుడు పుత్ర వాత్సల్యం చేత కొడుకు తప్పు చేస్తే అతనిని మందలించాలనే ధర్మాన్ని అనుసరించకపోవడం వలన వంశనాశనం జరిగింది అనడానికి పైన చెప్పిన మనుస్మృతి వాక్యాలు ప్రతిబింబంగా నిలుస్తాయి.

**''వృద్ధులను ఎల్లప్పుడు సేవించేరాజును రాక్షసులు సైతం గౌరవిస్తారు. తాను అర్థశాస్త్రం మొదలగు వానిని నేర్చుకున్నా ఇతర విషయజ్ఞానమంతా ఉన్నా వినయ విధేయలలున్న మహారాజు వృద్ధుల దగ్గర నీతిని తెలుసుకోవాలి అట్టిరాజు ఎప్పటికి నశింపడు.'' ( లక్ష్మీ నరసింహాచార్యులు, నల్లందిఘళ్, మనుస్మృతి, పుట:157).**

ఈ విషయాలను పరిశీలిస్తే ధర్మరాజు అర్థశాస్త్రజ్ఞానం, పరిపాలనా విధానం తెలిసిఉన్నప్పటికి వినయ విధేయతలను వహించేవాడు. నారదాది మహర్షులు రాజనీతి అంశాలను చెప్పినప్పుడు శ్రద్ధగా విని అనుసరించాడు. అంతే కాకుండా సంపద కోల్పోయి అడవులలో తిరిగి కష్టాలు అనుభవించినప్పటికి తన గుణాలను వదులుకోలేదు. యుద్ధానంతరం రాజ్యభాగం స్వీకరించనప్పటికి అహం భావం లేకుండా ఆశ్రమవాసం ప్రయాణ సమయంలో ధృతరాష్ట్రుడు రాజ్యపాలనా విషయాలను చెప్పేటప్పుడు శ్రద్ధగా విని తెలసుకోదగ్గ విషయాలను

తెలుసుకున్నాడు. శత్రువులను కూడా మిత్రునిగా భావించే ఉదార స్వభావం కలవాడు కావుననే సశరీరంగా స్వర్గానికి చేరుకోగలిగాడు.

### 4.52. కౌటిల్యుడు– మాకియోవెల్లి – ఆలోచనా విధానం:

పుల్లెల శ్రీ రామచంద్రుడు తన కౌటిలీయమ్ అర్థశాస్త్రము అనే తన గ్రంథంలో మాకియో వెల్లి రచించిన 'ద ప్రిన్స్ ' పుస్తకంలో ని విషయాలను ఈ విధంగా చర్చించాడు.

### 4.52.1. కౌటిల్యుడు – మాకియోవెల్లి మధ్య పోలిక:

*" సాధారణంగా కౌటిల్యుణ్ణి మాకియోవెల్లితో పోలుస్తూ ఉండడం అలవాటు 1494లో ఫ్రాన్సు ఇటలీమీద దండయాత్ర చేసినది మొదలు ఫ్లారెన్స్ అనేక బాధలకు గురి అయ్యింది. తరువాత 20 సంవత్సరాలలో ఆ నగరరాజ్యం గణ రాజ్యం చేయబడింది. మళ్ళీ ఫ్రాన్స్ దాడి చెయ్యడంతో ఆ ఫ్లారెన్స్ పరిపాలనా విధానం అంతా అస్తవ్యస్తం అయిపోయింది. ఇలాంటి పరిస్థితులను కళ్ళారా చూచిన మాకియో వెల్లి మానసిక స్థితి ఎలా ఉంటుందో మనం ఊహించుకోవచ్చును. అతని అభిప్రాయం ప్రకారం ప్రపంచం ఇంతకంటే మంచిదవుతుందనే ఆశ లేదు. ఇంతకంటే చెడ్డదీ కాకపోవచ్చు. ఎల్లప్పుడూ ఇది ఇలా ఉండేదే. ఒక సారి జరిగిన మంచి విషయాలైనా చెడ్డవిషయాలైనా మాటి మాటికీ జరుగుతూ ఉండవచ్చును. మానవుడెప్పుడూ స్వార్థపరుడే, సామాజిక శ్రేయస్సు అనే దృష్టి లేకుండా స్వలాభం కోసమే ప్రయత్నిస్తూ ఉంటాడు. మానవుడు కృతఘ్నుడు, వంచకుడు, చపల స్వభావుడు, పిరికి పంద, దురాశపరుడు, అవసరాన్ని బట్టి మాత్రమే మంచితనం చూపిస్తూ ఉంటాడు. అందుచేత చక్రవర్తి మానవుణ్ణి భయపెట్టి పరిపాలించాలి. కాని అతనిలో ప్రేమభావాన్ని పుట్టించి పాలించడం అనేది కల్ల. ఇలాంటి నిరాశావాదం, ఈతని 'రాజు' 'ద ప్రిన్స్ ' అనే గ్రంథంలో కనబడుతుంది. సంపూర్ణ ఆధిపత్యం సాధించడం కోసం ఎలాంటి సాధన్నానైనా అవలంబించవచ్చు అనేది ఈయన సిద్ధాంతం.*

జాగ్రత్తగా గమనిస్తే కౌటిల్యునికి ఇతనికి ఏ విధమైన పోలికలూ లేవనే విషయం స్పష్టం అవుతుంది. కౌటిల్యుడు దండానికి ప్రాధాన్యం ఇచ్చినా అపరాధాన్ని మించిన దండాన్ని నిషేధించారు. ధర్మానికి, అర్థానికి, కామానికి సమ ప్రాధాన్యం ఇస్తూ శాంతిని పరిరక్షించడమే రాజు యొక్క ప్రధాన కర్తవ్యం ఈ శాంతి సాధనం అనే పరమాదర్శం కేవలం భయపెట్టడం వల్ల సాధ్యం అయ్యేది కాదు. ప్రజల మనఃపూర్వకమైన సహకారం వల్లే మాత్రమే సాధ్యం అవుతుంది. వర్ణ ధర్మం, ఆశ్రమ ధర్మం ఈ రెండింటిని జాగ్రత్తగా పరిరక్షిస్తే సమాజానికి శ్రేయస్సు లభిస్తుందని నమ్మిన వ్యక్తి కౌటిల్యుడు. వర్ణ ధర్మం సాంఘికాభివృద్ధికి హేతువైతే ఆశ్రమ ధర్మం వైయక్తికమున్నతికి సాధనం అని నమ్మిన రోజులు అవి. బహుశా వర్ణ ధర్మం అనేది జన్మతః సిద్ధము అనే మాట వదిలేస్తే (వేద కాలంలో ఆ విధంగానే ఉండేదని విమర్శకుల అభిప్రాయం)

ఇది ఈనాడు కూడా కొంతవరకు ఉపయోగకరం కావచ్చునేమో . ఇలాంటి ప్రధానమైన భేదం ఉండడంచేత కౌటిల్యుణ్ణి మాకియోవెల్లి తో పోల్చడం అంత యుక్తం కాదు. తన కాలంలో ఫ్లారెన్సు నగర రాజ్య వ్యవస్థ ఛిన్నా భిన్నం అవడం చూచి మాకియోవెల్లి  ప్రభావితుడయినట్టు, ఆనాటి కొన్ని సంఘరాజ్య గణ రాజ్యాలలోని పరిస్థితులను చూచి కౌటిల్యుడు ప్రభావితుడై ఏకరాజరాజ్య స్థాపనాన్ని సమర్థించి ఉండవచ్చు. అంతవరకే వారిద్దరి మధ్య ఉన్న పోలిక. ఇలాంటి సామ్య వైషమ్యాలను ఇటు కౌటిల్యునికి అటు ఇతర దేశ రాజ్య శాస్త్ర నిపుణులకి మధ్య ఎన్నో చూపవచ్చును.

అయితే కొన్ని ఊహలకు అవకాశం లేకపోలేదు. మాకియోవెల్లి కౌటిల్యుని అర్థశాస్త్రం చేత ప్రభావితుడై తాను రచించిన 'ది ప్రిన్స్' అనే గ్రంథంలో రాజకీయ కుటిలత్వం విషయంలో  కౌటిల్యుని కంటే ఒక అడుగు ముందుకు వెళ్ళి ఉంటాడు.

## 4.53. మాకియోవెల్లి రాజనీతి :

*'' ఏదెన్స్ నగర రాజ్యంలో సిరిక్యూస్ దుర్మార్గానికి జన జీవనంలో నైతిక విలువలు బలికాగా సౌశీల్యమే జ్ఞానం, జ్ఞానమే సౌశీల్యం అనే నినాదంతో సోక్రటీస్ నైతిక విలువల్ని*

*ఉద్ధరించడానికి ప్రయత్నించాడు. రాజనీతికి, నీతి శాస్త్రానికి దగ్గర సంబంధం ఉందని, అవినీతిగా ప్రవర్తించే పాలకులు ఉత్తమ రాజకీయ వ్యవస్థను స్థాపించలేరని, అదే విధంగా నీతి బాహ్యంగా వ్యవహరించే ప్రజలు ఉత్తమ రాజ్యాన్ని రూపొందించలేరని ఆయన పేర్కొన్నారు. సోక్రటీస్ శిష్యుడైన ప్లేటో 'రాజనీతి శాస్త్రం, నీతి శాస్త్రంలో ఒక భాగం మాత్రమే. ప్రజలకు న్యాయం, ధర్మం, ప్రయోజనం చేకూర్చడమే రాజ్య లక్షణం, అందుచేత తత్త్వ వేత్తఅయిన రాజులు పరిపాలించడం ఉత్తమ పద్ధతి అని ధర్మ శాస్త్రాధిక్యాన్ని పవిత్రతను ప్రశంసించాడు. మధ్య యుగంలో రాజనీతి మతాన్ని ఆశ్రయించింది. రాజులకు పీఠాధిపతులకు, మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఇటలీ దేశంలో అరాచక పరిస్థితి నెలకొని ఉంది. ఇలాంటి దశలో మెకియ వెల్లి 'ద ప్రిన్స్' అనే గ్రంథాన్ని రచించి అసాధారణ రాజనీతిజ్ఞతను కనబరిచాడు. మాకియోవెల్లి రాజనీతి శాస్త్రానికి స్వతంత్ర ప్రతిపత్తి కల్పించి వాస్తవిక ఆచరణాత్మక రాజకీయాలకు రాజనీతి సిద్ధాంతాన్ని సన్నిహిత పరిచాడు. రాజనీతి శాస్త్ర స్వతంత్ర ప్రతిపత్తికి అడ్డుగా నిలిచే మతాన్ని నైతిక శాస్త్రాన్ని రాజనీతి శాస్త్రం నుండి స్పష్టంగా వేరు చేసినాడు. కార్య సాధనలో మాత్రమే మత సంస్థలను ఉపయోగించుకొనవలెను. కాని వాటి ప్రభావానికి మాత్రం గురి కాకూడదు. వీటి ద్వారా సుస్థిరత, శాసన విధేయత, రాజ్యంలో ఏర్పరచవచ్చు. మత నైతిక ధర్మాలు రాజనీతికి లోబడి ఉండవలెనని మెకియో వెల్లి వక్కాణించాడు. కౌటిల్యుని అర్థశాస్త్రం మెకియోవెల్లి 'ద ప్రిన్స్' అనే గ్రంథాలు సిద్ధాంత వివరణలో పోలికల్ని కలిగి ఉన్నాయి. జయాభిలాషి అయిన రాజుకు ఉండాల్సిన గుణాల్ని చెప్పడంలో ఇద్దరు పరస్పర సంబంధాన్ని కలిగి ఉన్నారు. వీరిద్దరు ప్రయోగాత్మక పరిపాలనా పద్ధతుల గురించి చెప్పడం వల్ల వాస్తవిక రాజకీయాలతో సన్నిహిత సంబంధాన్ని ఏర్పరచుకున్నారు. ప్రయోగాత్మక రాజనీతికి ఇరువురూ నూతన దృక్పథాన్ని కలుగజేయడంలో సఫలీకృతులైనారు.* *(దామోదర్ రెడ్డి, పామిరెడ్డి, ప్రాచీనాంధ్ర కావ్యాలు, రాజనీతి,(సి.గ్రం), పుట:02).*

పై విషయాలను పరిశీలిస్తే మెకియో వెల్లి కి, కౌటిల్యునికి పరిపాలనా సిద్ధాంతాలను పొందుపరచడంలో ఒక క్రొత్త అధ్యాయాన్ని రూపొందించారని దామోదర్ రెడ్డి

అభిప్రాయపడ్డాడు. అయితే నైతికతను రాజనీతి నుండి దూరం చేయవలసిన అవసరం లేదని నాకనిపిస్తుంది. రాజు తన ఆలోచనా ధోరణులను ప్రజలపై బలవంతంగా ప్రయోగిస్తే అది పరిపాలనా అనబడదు బానిసత్వ పాలనా అనబడుతుంది. అదే నైతిక విలువల సారాంశాన్ని గ్రహించి ప్రజలను తన బిడ్డల వలె రాజు పరిపాలిస్తే అది ప్రజారంజక పరిపాలన అనిపించుకుంటుందని నా అభిప్రాయం. తండ్రి తన పిల్లలను అవసరమైనప్పుడు కొడతాడు, తిడతాడు. భయం పెడతాడు. ఇది తన పిల్లవాడు మంచి మార్గంలోకి వెళ్ళడానికి ఉపయోగించే దండన. అదే రోజు కారణం లేకుండా దండం విధిస్తే ఆ పిల్లవాడు మారకపోగా క్రూరత్వ భావనను తన మనసులో ఏర్పరచుకుంటాడు. దండం ఎప్పుడూ పనికి రాదని నా అభిప్రాయం.

ఉత్కర్ష్ పన్వార్ The Mahabharata, Machiavelli and the Modern Management Thought (మహాభారతం, మాకియవెల్లి మరియు ఆధునిక నిర్వహణ ఆలోచన) వ్యాసంలో మాకియో వెల్లి యొక్క భావాలలో ఆంతర్యాన్ని తెలియజేస్తూ ఈ విధంగా కొన్ని విషయాలను చర్చిస్తాడు.

నేటి మంచి మరియు సున్నితమైన ప్రపంచంలో మాకియవెల్లి సూత్రానికి పెద్దగా అవకాశాలు లేవని చాలా మంది భావిస్తున్నారు, అయితే అతని సూత్రాలు నైతిక దళానికి ఎంత వంచకమైనవిగా అనిపించవచ్చు, అయితే అతని ఆలోచనలను జాగ్రత్తగా చదవడం మానవీయతను ఏర్పరుచుకునే సాంకేతికతలను చూపుతుంది. మరియు స్థిరమైన ప్రభుత్వం. మాకియవెల్లి కుట్రపూరితంగా ఉంటాడని చాలా మంది అనుకోవచ్చు, అయితే వాస్తవం ఏమిటంటే, మాకియవెల్లి తన తత్వశాస్త్రంలో ప్రేరేపించబడ్డాడు మరియు ప్రభుత్వంలో స్థిరత్వం ద్వారా ప్రజల మంచి కోసం అంతర్లీన శ్రద్ధ కలిగి ఉన్నాడని వీరు అభిప్రాయపడ్డారు. దీనికి మహాభారతం నుండి కొన్ని ఉదాహరణలను ఇస్తూ ఉదాహరణకు, చిన్న జ్ఞానం ప్రమాదకరమైన విషయమని ఇది మనకు బోధిస్తుంది. చక్రవ్యూహాన్ని ఎలా ఛేదించాలో అర్జునుడికి మరియు ద్రోణుడికి మాత్రమే తెలుసు – ఇది

ఒక రోజులో యుద్ధాన్ని ముగించేంత ఘోరమైన ఒక అజేయమైన నిర్మాణం. అభిమన్యుడు సుభద్ర గర్భంలో ఉన్నప్పుడు చక్రవ్యూహాన్ని పగులగొట్టడం నేర్చుకున్నాడు, కానీ దాని నుండి ఎలా బయటపడాలో అతనికి తెలియదు. ఫలితంగా చక్రవ్యూహంలోంచి బయటకు రాలేక లోపలే చంపబడ్డాడు. నిజ జీవితంలో తన జ్ఞానాన్ని అన్వయించేటప్పుడు ఒకరు జాగ్రత్తగా ఉండాలని ఇది మనకు బోధిస్తుంది. అలాగే, ఒక వ్యక్తి తన వనరులను గుడ్డిగా విశ్వసించకూడదు ఎందుకంటే అవి ఎప్పుడు విఫలమవుతాయో అతనికి ఎప్పటికీ తెలియదని వివరిస్తాడు. (https://edtimes.in/mahabharata-machiavelli-modern-management-thought/#

మాకియోవెల్లి భావాలు సమాజానికి కఠినంగా ఉన్నాయనే చెప్తూ అందులోని అంతర్లీనంగా దాగి ఉన్న భావాలను మహాభారతానికి అన్వయించాడు. అభిమన్యుడు తన జ్ఞాన పరిశీలనలో విఫలమయ్యాడని వీరి అభిప్రాయం. తనకు తెలిసిన విద్య మీద నమ్మకంతో పద్మ వ్యూహాన్ని ఛేదించాడు దాని నుండి బయట పడే మార్గాన్ని మాత్రం తెలుసుకోలేక సంహరించబడ్డాడని కాబట్టి జ్ఞాన పరిశీలన జాగ్రత్తగా చేయాలని వీరు సూచించారు. ఇంది నిజమైన విషయమే కాని లోక రక్షణార్థం క్షత్రియ పోరాటం చేయాలనే తపన ధర్మ సంస్థాపన జరగాలనే ఆలోచన ఉన్న అభిమన్యుడు  సాధ్యమైనంత వరకు తన శక్తిసామర్థ్యలను  శత్రువులకు చూపించాడు అది ఓర్వలేని శత్రువులు కుట్రపూరితంగా అతనిని సంహరించారే కాని లేకుంటే అభిమన్యుడు ఒక్కడే ప్రధానమైన మహావీరులను సంహరించి యుద్ధానికి ముగింపు పలికేవాడని నా అభిప్రాయం.

వీరి అభిప్రాయం వారు మాకియోవెల్లిని అర్థం చేసుకున్న దానిని బట్టి మాకియో భావాలను సమర్థించాడు. అంతే కాకుండా మాకియో భావాలు సమాజానికి కఠినంగా ఉంటాయని ప్రజలపట్ల క్రూరమైన భావనను ఎవరూ సమర్థించరని ఈ వ్యాసం లో పొందుపరిచారు. మొత్తంగా వ్యాపార రంగంలో మాకియోభావాలు పనికి వస్తాయని వీరి అభిప్రాయంగా గుర్తించవచ్చు.

## 4.54. ద ప్రిన్స్ – మహాభారత అన్వయం:

మెకియోవెల్లి చెప్పిన విషయాలను ' ద ప్రిన్స్' పుస్తకం నుండి కొన్ని మాటల ద్వారా పరిశీలించాల్సిన అవసరం ఉంది. వాటికి కొన్ని క్రింద ఉదాహరణలను గమనించాను.

*"కొత్తగా సాధించిన రాజ్యంలో శత్రువుల నుండి తమను కాపాడుకోవడం కొత్త మిత్రులను ఏర్పరుచుకోవడం, బల ప్రయోగం ద్వారానో లేక ఎత్తుగడల ద్వారానో ప్రాబల్యాన్ని సాధించడం, ప్రజలలో తన యెడల భయ భక్తులు కలిగించడం, సైనికులచే గౌరవించబడి వారి విధేయతను పొందడం, తనకు హాని తలపెట్ట కలిగిన శక్తి గాని లేక అలా చేయాలనే తలపు గాని ఉన్న వారందరిని తుద ముట్టించడం, పాత విధి విధానాలను తొలగించి నూతన విధానాలను ప్రవేశ పెట్టడం కఠినంగాను, అలాగే దయతోనూ, ఉదారతతోనూ, మరియు విశాల దృక్పథంతోనూ మెలగడం రాజ భక్తిలేని సైన్యాన్ని రద్దు చేసి నూతన సైన్యాన్ని నిర్మించడం రాజులు, రారాజులు, తనకు సహాయం చేయడంలో వారి లాభమున్నట్లు తనకు ఆగ్రహం కలిగించడం వారికి ప్రమాదమన్నట్లు వారు భావించే విధంగా వారితో సంబంధాలను కలిగి ఉండడం ఇలా ఇవన్నీ అవసరమని భావిస్తాడు.*

*ఒక రాజు తన రాజ్యాన్ని సంరక్షించుకోవడానికి ఇతర విధానాలన్నీ విఫలమైనప్పుడు క్రూరత్వం, మోసం, బలవంతం వాటిలో అవసరమైన ఏ మార్గాన్నైనా అనుసరించవచ్చని, మాకియోవెల్లి బోధించాడు. (http://shankharavam.blogspot.com/2011/08/blog-post.html)*

ధనమిచ్చి కాని ,విషం పెట్టి కాని, మాయలు పన్ని కాని, మాటలతో బెదిరించి కాని శత్రువును చంపవలసిందే ఏ విధంగానూ ఉపేక్షించడం తగదు. ఇద్దరు రాజుల మధ్య గెలుపు అటుఇటుగా ఉన్నప్పుడు శ్రద్ధగలవాడే గెలుస్తాడు. **(సంస్కృత భారతం, ఆది పర్వం, 139 అధ్యాయం,53 వ శ్లోకం).**

కణికుడు చెప్పిన కూట నీతికి మాకియో వెల్లి చెప్పిన రాజనీతికి పోలికలు ఉన్నాయని తెలుస్తుంది. దీనిని బట్టి కణికుడి ఆలోచనా విధానం మాకియో వెల్లిలో

ప్రతిబింబించినట్లు తెలుస్తుంది.ఇక్కడ రాజ్యాన్ని సంరక్షించుకోవడం అంటే రాజ్యంలోని ప్రజలందరిని కాపాడుకోవడం, అనే అర్థాన్ని గ్రహించినట్లైతే రాజు తన రాజ్యం కోసం దాన భేద, దండోపాయాలను ప్రదర్శించవచ్చు కాని రాజ్యం మీద కాంక్షతో , అధికారం పై మమకారం తో క్రూరత్వాన్ని, మోసాన్ని , బలవంతాన్ని ప్రయోగించకూడదని నేను భావిస్తున్నాను. ఈ ధోరణి కొంత హింసతో ముడిపడి ఉంది. కాబట్టి ఇటువంటి అంశాలు పరిశీలన చేసేటప్పుడు రాజు లేదా పరిపాలకులు న్యాయాన్యాయాలను గమనించి నిర్ణయం తీసుకోవాలి. స్వంత అభిప్రాయం ఈ విషయంలో తీసుకుంటే ప్రజల నుండి వ్యతిరేకత కలుగుతుంది.

మహాభారతంలో రాజ్య కాంక్షచేత దుర్యోధనుడు మొదటి మోసపూరితమైన కుట్ర ద్వారా పాండవులను చంపాలని నిర్ణయించి లాక్షాగృహ దహన ఏర్పాట్లను పురోచనుడు ద్వారా ఏర్పాటు చేయిస్తాడు. ఇది అన్యాయం కాబట్టి ఈ విషయాన్ని గ్రహించిన విదురుడు ఒక దూత ను పంపి వారి రక్షణ బాధ్యాతలను తీసుకున్నాడు. పాండవులు రక్షించబడి కొంతకాలం బ్రాహ్మణ రూపాలు ధరించి ద్రౌపదిని వరించి ద్రుపద మహారాజుతో సంబంధం కలుపుకుని అప్రయత్నంగానే రాజ్యవిస్తరణ ఏర్పాట్లు చేసుకున్నారు. పాండవుల పట్ల ధృతరాష్ట్రునికి, దుర్యోధనునికి ఉన్న కుటిలత్వాన్ని గ్రహించిన ప్రజలు రాజును తిట్టుకున్నారు. అయినా దుర్యోధనుడు అసూయ మార్గంలోనే ప్రవర్తించి శకుని చేత మోసపు జూదం ఆడింపచేసి పాండవుల రాజ్యాన్ని గెలుచుకున్నారు. వారిని అడవులకు పంపించారు. అంతటితో ఆగాడా వారి అజ్ఞాత వాసాన్ని భంగం చేసే ప్రయత్నాలు చేసాడు. చివరకు అది సఫలం కాలేదు. రాజ్యాన్ని వారికి ఇవ్వలేదు యుద్ధం నిశ్చయమైంది సైన్యాన్ని సమకూర్చుకున్నారు. చివరకు అపజయం పాలయ్యారు. కాబట్టి మాకియోవెల్లి చెప్పిన ఈ సూత్రం ప్రమాదకరమైనది రాజు అనే వాడు రాజ్యంకోసమే కాకుండా రాజ్యంలోని ప్రజల యోగ క్షేమాలను కాంక్షించేవాడై ఉండాలి. రాజ్యాన్ని మాత్రమే కాంక్షించే రాజు హింస ప్రవృత్తిని ప్రదర్శించి చివరకు నశించిపోతాడని నా అభిప్రాయం. రాజు తన అర్హతను

పరిశీలించుకున్న తర్వాతనే రాజ్య పరిపాలన గురించి ఆలోచిస్తే బాగుంటుందని నా అభిప్రాయం.

### 4.54.1. వంశపారమైన పాలనా విధానం:

*"గతంలో పాలించిన పాలిస్తున్న అన్ని రాజ్యాలు, అన్ని అధికారాలు, కూడా ప్రాతినిధ్య ప్రభుత్వాలు, లేద సంస్థానాలు, సంస్థానాలను మరలా అనువంశికితమైనవి, నూతనమైనవి , అనువంశికతమైన సంస్థానాలలో రాజ్యాధికారం రాజు యొక్క కుటుంబం చేతుల్లో చిరకాలంగా కొనసాగుతూ రాజుకి వంశపారం పర్యానుగతంగా సంక్రమిస్తుంది".(* *http://shankharavam.blogspot.com/2011/08/blog-post.html*

పై విషయాలను పరిశీలిస్తే సంస్థానాలలోని అనువంశికత్వం, మహాభారతంలో వంశాన్ని నిలబెట్టుకోవడం కోసం దేవర న్యాయ పద్ధతిలో పిల్లల్ని కనడం ఒక ఎత్తైతే వంశానుగుణంగా రాజ్యాన్ని పరిపాలించడం మరో ఎత్తని అయితే పెద్ద వాడైన ధృతరాష్ట్రుడు అంధుడు కావడంతో పాండురాజు పుత్రులు తరువాత రాజ్యానికి రాజు కావలసిన నేపథ్యంలో రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవాలనే తపన కలిగిన దుర్యోధనాదులకు కలిగిన ఈర్శ్య, అసూయలే మహాభారత యుద్ధానికి నాంది.

### 4.54.2. మిశ్రమ సంస్థానాల గురించి

మనుషులతో మంచిగానైనా ప్రవర్తించాలి లేదంటే వారిని పూర్తిగా నాశనమైనా చేయాలి. ఎందుకంటే కొద్దిపాటి హాని వలన వారు ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తారు. కాని తీవ్రంగా హానిచేస్తే ఆ విధంగా చేయలేరు, కనుక మనం ఒక వ్యక్తికి చేసే హాని ప్రతీకార భయం కలిగించని విధంగా ఉండాలి.

ముందుచూపు కలిగిన వారు ప్రస్తుత సమస్యలనేకాక ఎదుర్కోవడానికి సర్వశక్తులతో సంసిద్ధులై ఉండవలసిన భవిష్యత్ సమస్యలను కూడా దృష్టిలో

ఉంచుకుంటారు. ఎందుకంటే సమస్యలను ముందుగానే అంటే అవి  సుదూరంగా ఉన్నప్పుడే గమనించగలిగితే వాటిని నివారించడం సులభం. ఒక వేళ నీవు గనుక ఈ సమస్య సమీపించే వరకు వేచి ఉన్నట్లైతే నివారణోపాయాలేవి పని చేయక పరిస్థితి చేజారి పోతుంది. వైద్యులు చెప్పే విధంగా విషజ్వరం సోకినప్పుడు ప్రారంభంలో ఆ జబ్బును తగ్గించడం తేలిక అయితే గుర్తించడం కష్టం కనుక దానిని గుర్తించకపోవడం వలన ఆరంభంలోనే నివారించకపోవడం వలన కాలం గడిచే కొలది అది తేలికగా గుర్తించగలిగే విధంగా నివారించడానికి కష్టసాధ్యమయ్యేటట్లు గానూ తయారవుతుంది. రాజ్య వ్యవహారాలలో కూడా ఇలానే జరుగుతుంది. ముందుగానే పసిగట్టబడిన దుష్పరిణామాలు వెను వెంటనే నివారింపబడుతాయి. కాని అలా ముందుగా పసిగట్టలేకపోతే అవి అందరూ కనబడేంతగా పెరిగి పెద్దదైపోతాయి. అప్పుడు వాటికి నివారణే ఉండదు.( http://shankharavam.blogspot.com/2011/08/blog-post.html

*"అపకారం చేసిన శత్రువులను చంపటమే అభినందనీయమైన పని గొప్ప పరాక్రమం గల శత్రువునైనా ఇబ్బందులలో పడినప్పుడు తేలికగా నష్టపరచవచ్చు. మేటి యోధుడైనా కష్ట కాలంలో ఉన్నప్పుడు తేలికగా చంపవచ్చు.  ఆపదలో ఉన్న శత్రువులను తప్పక దాడి చేయాలి. ఆ సమయంలో వారి పై దయ చూపకూడదు. శత్రువు బలహీనుడైన కూడా వాడిని విడిచిపెట్టకూడదు". (సంస్కృత భారతం, ఆది పర్వం, 139 వ అధ్యాయం. 10,11, శ్లోకాలు).*

ఇక్కడ మాకియో వెల్లి  శత్రువులను సమూలంగా నాశనం చేయమన్నాడు అంటే శత్రువు ఏ పరిస్థితిలో ఉండనీ కాని అతను తిరిగి ప్రతికారం తీర్చుకోలేనంతగా దెబ్బ కొట్టాలి, లేదా వారిని సమూలంగా నాశనం చేయాలి. ఈ విషయం కూడా కణికుడు చెప్పిన కూట నీతికి సరిపోలుతుందని నేను భావిస్తున్నాను.

### 4.54.3. సైన్యాన్ని సమకూర్చుకోవడం:

*"విజయాన్ని పొందాలనే కోరిక మనుషులలో చాలా సహజం మరియు సాధారణం, నిజంగా వారికి అంత సామర్థ్యమున్నపుడు వారు విజయాన్ని తప్పక పొందుతారు. అందుకొరకు వారు ప్రశంసించబడతారే కాని నిందించబడరు. కాని వారికి అంత సామర్థ్యం లేనప్పుడు కూడా వారు ఏదో విధంగా విజయాన్ని పొందాలనుకుంటే ఖచ్చితంగా అది పొరబాటే నిందార్హమే"(http://shankharavam.blogspot.com/2010/07/3.html*

ఈ విషయాన్ని పరిశీలిస్తే దుర్యోధనుడు యుద్ధానికి సిద్ధమై 11 అక్షౌహిణుల సైన్యాన్ని సమకూర్చుకుని విజయాన్ని తప్పక పొందుతాననే అత్యాశతో ఉన్నాడు. అంతే గాక తన బలం కంటే భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడుశక్తివంతమైన యుద్ధ నిపుణులు తన వైపు ఉండడం చేత యుద్ధంలో విజయం తననే వరిస్తుందని ఆరాటపడ్డాడు. పాండవుల సైన్యం తక్కువైనప్పటికి వారి శక్తిసామర్థ్యాలను ఏ మాత్రం అంచనా వేయకుండా వారి తక్కువ సైన్యాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకుని మూర్ఖమైన ఆలోచనలతో అందరిని అవమానపరుస్తూ తన వంశ వినాశనాన్ని తానే సృష్టించుకున్నాడు.

### 4.54.4. రాజు వనరులను సమకూర్చుకోవడం:

రాజు అవసరమైన సందర్భంలో తన స్వంత వనరులతో తనను తాను కాపాడుకోగలిగేంత సామర్థ్యం కలిగి ఉన్నాడా లేక అతడు ఎల్లప్పుడూ ఇతరుల సహాయం యొక్క అవసరం కలిగి ఉన్నాడా అని ఈ విషయాన్ని మరింత స్పష్టం చేయడానికి ధనం కాని , వ్యక్తులు కాని, సమృద్ధిగా ఉండడం వలన తమ మీద దండెత్తే వారికి వ్యతిరేకంగా యుద్ధంలో చేరడానికి తగినంత సైన్యాన్ని పెంపొందించగలిగే వారిని తమ స్వంత వనరుల ద్వారా తమను తాము కాపాడుకోగలిగే వారుగా నేను పరిగణిస్తాను." పదవ అధ్యాయంలో వివరించాడు. (http://shankharavam.blogspot.com/2011/08/blog-post.html

మహా భారతంలో పాండవులు , కౌరవులు రాయబార ప్రయత్నాలు సాగిస్తూనే యుద్ధానికి సైన్యాన్ని సమకూర్చుకుంటున్నారు. పాండవులు ఏడు అక్షౌహిణులను మాత్రమే సంపాదించుకోగలిగారు. పాండవుల సేన సాత్యకి చతురంగ బలాలతో ఒక అక్షౌహిణి సైన్యంతో ధర్మరాజును చేరాడు. చేదిరాజు ధృష్టకేతువు పాండవులను చేరాడు., జరాసంధుని కొడుకు మహాబలుడు, మగధరాజు అయిన జయత్సేనుడు ఒక అక్షౌహిణి సేనతో , పాండ్యరాజు ఒక అక్షౌహిణి సేనతోనూ, ద్రుపదుడు, విరాటుడు చెరో ఒక అక్షౌహిణులతో ధర్మరాజును చేరారు. ఇంకా అక్కడక్కడా నుండి వచ్చిన సేనలు వివిధ ధ్వాజాలతో మొత్తం పాండవులకు చేరిన సేనలు ఏడు అక్షౌహిణులు అయ్యాయి. వీరంతా పాండవులకు సహాయం చేయడానికి వచ్చిన సేన సంఖ్య తక్కువే అయినప్పటికి పాండవులకు రాజ్య భాగం రావడంలో న్యాయం ఉందని భావించి బహుపరాక్రమంతో యుద్ధం చేసి విజయం సాధించాలనే ఒక సంకల్పంతో ధర్మరాజు దగ్గరకు చేరారు.

రాజ్యం ఏమాత్రం పాండవులకు దక్కకూడదు నేనే పరిపాలించాలి దానికి ఎన్ని కుట్రలు , మోసాన్నైనా సరే చేయడానికి సిద్ధపడిన వాడు దుర్యోధనుడు న్యాయం గా పాండవులకు ఇవ్వవలసిన రాజ్యభాగాన్ని కూడా ఇవ్వడానికి మనసు అంగీకరించని జీవి దుర్యోధనుడు అందుకే యుద్ధం ద్వారానైనా సరే పాండవులను గెలిచి రాజ్యాన్ని చేజిక్కించుకోవాలని సైన్యాన్ని సమకూర్చుకుంటున్నాడు. దుర్యోధనుని వైపు వచ్చిన సేనల వివరాలు. చీనులతో, కిరాతులతో కలిసి భగదత్తుడు , భూరి శ్రవుడు, శల్యుడు, భోజులు, అంధకులు, కుకురులతో కలసి కృతవర్మ, సింధు, సౌవీర దేశస్థులైన జయద్రథుడు ఒక అక్షౌహిణి సేనతో వచ్చారు. కాంబోజరాజు సుదక్షిణుడు యవనులు, శకులతో కలిసి ఒక అక్షౌహిణి సైన్యంతో దుర్యోధనుని చేరాడు. మహిష్మతీ పుర రాజు నీలుడు నీలాయుధాలతో కూడిన దక్షిణ దేవస్థులతో వచ్చాడు., విందానువిందులు అవంతి రాజులు ఇద్దరు ఒక్కొక్క అక్షౌహిణితో, కేకయ రాజులు ఒక అక్షౌహిణి సేనతో పరువున వచ్చారు. ఇంకా ఇతర రాజుల సేనలన్నీ కలిసి మూడు అక్షౌహిణులు అయ్యాయి. **(సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 19 వ అధ్యాయం).**

ఇలా దుర్యోధనుడు శత్రువులను ఎదిరించడానికి సైన్యాన్ని సమకూర్చుకున్నాడు. మాకియో వెల్లి సైన్యాన్ని సమకూర్చుకున్నవాడు తనను తాను కాపాడుకోగలుగుతాడని చెప్పాడు. ఇక్కడ దుర్యోధనుడు తాను విజయం సాధించడానికి పెద్ద సైన్యాన్నే సమకూర్చుకున్నాడు వినయంతో అతిథి మర్యాదలతో శల్యున్ని ఒక తెలివైన ఉపాయంతో తన దగ్గరకు రప్పించుకున్నాడు. ఈ 11 అక్షౌహిణుల సైన్యం దుర్యోధనుని కాపాడలేకపోయింది ఇక్కడ సైన్యం యొక్క సంఖ్య ప్రాధాన్యతను ఇవ్వలేకపోయింది, పాండవుల సంఖ్య తక్కువైనప్పటికి వారి ఏడు అక్షౌహిణుల భుజ బల పరాక్రమాలతో 11 అక్షౌహిణుల సైన్యాన్ని జయించగలిగారు. కారణం సైన్య సంఖ్య ప్రధానమైనది కాదు సైన్యం యొక్క బలాబలాలు ప్రధానమైనవని అర్థమవుతుంది.

### 4.54.5. రాజు యొక్క ద్వంద్వ భావం:

*"ఒక రాజు విశ్వసనీయుడుగా ఉండటం, అలాగే మోసంతో కాక నిజాయితీతో మనుగడ సాగించడం అనేది ఎంతో ప్రశంసనీయమైన విషయం అని అందరూ అంగీకరిస్తారు. కాని మన అనుభవం ఏమిటంటే గొప్ప పనులు చేసిన రాజులు తమ మాటను అంతగా నిలుపుకోలేదు అలాగే వారు తమ జిత్తుల మారి తనంతో మనుషులను ఏమార్చేవారుగా పేరు పొంది చివరకు నిజాయితీగా వ్యవహరించే వారిని సైతం అధిగమించారు. అధికార పోరాటానికి రెండు మార్గాలు ఒకటి న్యాయచట్టమైనది. మరొకటి బలప్రయోగం ద్వారా చేసేది మొదటి పద్ధతి మనుషులకు తగినటువంటిది రెండవ పద్ధతి పశువులకు తగినటువంటిది.*

*"ఒక రాజు తనలోని మనిషిని అలాగే పశువును రెండింటిని ఉపయోగించడాన్ని అర్థం చేసుకుని ఉండాలి. 'రాజుకు సగం పశువుగా సగం మనిషి ఈ రెండు స్వభావాలను ప్రదర్శించడం ఎలాగో తెలియడం అవసరం. అలాగే ఈ రెంటిలో ఒకటి లేకుండా మరొకటి స్థిరత్వాన్ని కలిగి ఉండదు అయితే ఒక రాజుకు పశు స్వభావాన్ని వివేకవంతంగా ఎలా ఉపయోగించాలో తెలిసి ఉండాలి కనుక అతడు పశువులలో నక్కను మరియు సింహాన్ని*

రెండింటిని ఎంపిక చేసుకోవాలి. ఎందుకంటే సింహం ఉచ్చుల బారి నుండి తనను తాను రక్షించుకోలేదు, అలాగే నక్క తోడేళ్ళ బారి నుండి తనను తాను రక్షించుకోలేదు. కనుక తోడేళ్ళను హడల గొట్టడానికి సింహం గాను, ఉచ్చులను కనిపెట్టడానికి నక్కగాను ఉండటం అవసరం. కనుక వివేకవంతుడైన రాజు మాట నిలుపుకున్న పక్షంలో అది తనకు నష్ట దాయకంగా పరిణమించేటప్పుడు అలాగే మాట ఇవ్వడానికి దారితీసిన కారణాలు కనుమరుగై పోయినప్పుడు మాట నిలుపుకోలేదు, నిలుపుకోకూడదు మనుషులందరూ మంచి వారైనట్లైతే ఇది మంచి సలహా అవబోదు కాని వారు చెడ్డవారు అవడం వలన మరియు వారు నీకిచ్చిన మాట నిలుపుకోవలసిన అవసరం లేదు. ఈ విధంగా ఆడి తప్పడాన్ని సమర్థించుకోవడానికి ఆమోద యోగ్యంగా కనిపించే కారణాల కొరకు ఒక రాజుకు ఎప్పుడూ కొరత ఉండదు.

నక్క స్వభావాన్ని ఎలా ఉపయోగించుకోవాలో బాగా తెలిసినవాడు ఎక్కువగా విజయాన్ని పొందాడని చూపించే ఆధునికమైన ఉదాహరణలను అంతులేకుండా ఇవ్వవచ్చు. అయితే ఈ స్వభావానికి మంచి ముసుగు ఎలా వేయాలో తెలియడం అవసరం. అంతేకాకుండా తన ఆలోచనలను దాచి ఉంచడంలో పైకి వాటికి భిన్నంగా కనిపించేటట్లుగా నటించడంలో నైపుణ్యాన్ని కలిగి ఉండాలి.

‘‘ఒక రాజు లక్షణాలన్నింటినీ కలిగి ఉండవలసిన అవసరం లేదు. వాటిని కలిగి ఉండటం మరియు ఎల్లప్పుడూ వాటిని ఆచరించడం హానికరం వాటిని కలిగి ఉన్నట్లుగా కనబడటం ఉపయోగకరం అని సైతం చెప్పడానికి నేను సాహసిస్తున్నాను. దయగా , విశ్వాసనీయంగా మానవీయంగా మతపరంగా నిజాయితీగా, కనబడటం మంచిది. అయితే నీ మనస్సు ఎలాంటి సమతుల్యతతో ఉండాలంటే ఒక వేళ అలా ఉండకూడని అవసరం కలిగినట్లైతే వాటికి విరుద్ధంగా మారడం ఎలానో తెలిసి ఉండాలి. ఆ ప్రకారంగామారగలగాలి.’’

HTTP://SHANKHARAVAM.BLOGSPOT.COM/2011/08/BLOG-POST.HTML

పాండవులు కౌరవులు బాల్యక్రీడల సమయంలో భీముని యొక్క బల పరాక్రమాన్ని చూసి దుర్యోధనుడు ఓర్వ లేకపోతాడు.

*“తతో బలమతి ఖ్యాతం ధార్తరాష్ట్రః ప్రతాపవాన్*

*భీమసేనస్య తద్ జ్ఞాత్వా దుష్టభావ మదర్శయత్ (సంస్కృత భారతం, ఆదిపర్వం, 127 వ అధ్యాయం, 25 వ శ్లోకం)*

దుర్యోధనుడు భీమునిలోని బలాన్ని గ్రహించి అతని విషయంలో చెడుగా ప్రవర్తించడం ప్రారంభించాడు. ఇలా దుర్యోధనునిలో ఒక చెడు బీజం ఏర్పడింది. ఒక సారి దురాలోచన మనిషిలో ప్రవేశించిందంటే దాని నుండి బయటపడటం చాలా కష్టం అది గమనించుకుని ఆత్మపరిశీలన చేసుకుని మంచి మార్గం లోకి వెళ్లేవారి విషయాలను పక్కన పెడితే నిరంతరం కుట్రలు , కుతంత్రాలతో జీవించేవారు ఎవరి మాటలను లెక్కచేయక మూర్ఖంగా ప్రవర్తిస్తుంటారు. దుర్యోధనునిలో ఇటువంటి మార్పు రావడానికి మొదటి కారణం భీమునిలో ఉన్న బలపరాక్రమం తనలో లేకపోవడం అతనిని ఈ సృష్టిలో లేకుండా చేస్తే తన బలపరాక్రమానికి సాటి వచ్చే వారు ఇంక ఎవరూ ఉండరు. అనే భావం దుర్యోధనునిలో ఏర్పడింది.

*తస్య ధర్మాదపేతస్య పాపాని పరిపశ్యతః*

*మోహాదైశ్వర్యలోభాశ్చ పాపా మతి రజాయత (సంస్కృత భారతం, ఆదిపర్వం, 127 వ అధ్యాయం, 26 వ శ్లోకం)*

ఈ శ్లోకాని అర్థం గమినిస్తే దుర్యోధనుడు ధర్మానికి దూరమైన వాడు పాప దృష్టి కలవాడని చెపుతూ ఈ మార్పు , ఈ చెడు బుద్ధి అతనిలో ఎందుకు కలిగిందంటే మోహం వలన , ఐశ్యర్య లోభం వలన కలిగిందని చెప్తారు.

అంటే ధన వ్యామోహం అతని లో మంచి తనం నుండి చెడు ప్రవర్తన లో జీవించేటట్లు చేసిందని అర్థమవుతుంది. దాని కారణంగా భీముని విషయంలో వీడు బలవంతుడు. పరాక్రమవంతుడు, మహాశూరుడు, మనమంతా కలిసి ఉన్నా ఆ భీమసేనుడు ఒక్కడే పోటి కి వచ్చి గెలుస్తున్నాడు. అతను నిదురించే సమయంలో గంగా నదిలో పడవేద్దాం

ఆ తరువాత , తమ్ముడు అర్జునుని, అన్న యుధిష్ఠిరుని బలాత్కారంగా బంధించి ఈ భూమిని పరిపాలిస్తానని భీముని చంపడానికి ప్రయత్నాలు ప్రారంభిస్తాడు. మాకియో వెల్లి చెప్పినట్లు దుర్యోధనుడు దుర్మార్గంగా ఎలా ప్రవర్తించాలో తెలిసినవాడు కావుననే శత్రువులు ఆకర్షించేవిధంగా ఉద్యానాన్ని ఏర్పాటు చేసి దానికి ఉదక క్రీడనమం అని పేరు పెట్టి ధర్మరాజాదులను ఆహ్వానించాడు. అక్కడి సౌందర్యాన్ని తిలకిస్తూ ఉద్యానంలోకి అందరూ ప్రవేశించారు., కౌరవులు పాండవులు ఒకరి నోట ఒకరు ఆహారాన్ని అందించుకుంటూ ఉంటారు అదే సమయమని దుర్యోధనుడు విషం కలిపిన పదార్థాన్ని భీమునిపై ప్రేమ ఉన్నట్లు నటిస్తూ తినిపించసాగాడు. అలా భీమసేనుడు అచేతనంగా పడి ఉన్న సమయంలో గంగా నదిలో పడవేసారు. మాకియో వెల్లి ఆలోచన అవసరమైతే దుర్మార్గంగా ప్రవర్తించడం తెలిసి ఉండాలి అనే దానికి ఇది ఉదాహరణగా చెప్పవచ్చని నేను భావిస్తున్నాను.

ఇక్కడ సన్మార్గం నుండి దుర్యోధనుడిలో అతనిలో ఉన్న సహజమైన గుణాలన్నింటిని నెట్టుకుని ఎదుటి వారి విషయంలో దుర్మార్గంగా ప్రవర్తించే విధంగా అతని మనసు ప్రేరేపించింది. దాని వలన అతను లాభం పొందాలి అనుకున్నాడు.

## 4.55. యుద్ధనీతి:

మనుస్మృతిలో యుద్ధ నియమాలు తెలుపుతూ రణరంగంలో ఒకరినొకరు చంపచూచే రాజులు వెనుతిరుగక యుద్ధం చేస్తూ చనిపోతే స్వర్గాన్ని పొందుతారు. మోసపూరితంగా పైకి ఒక విధంగా లోపల ఒక విధంగా ఉండే ఆయుధాలతో కర్ణమున్న ఆయుధాలతో , విషం పూసిన బాణాలతో, నిప్పుతో గాచిన బాణాలతో యుద్ధం చేస్తూ శత్రువులను చంపకూడదు. తాను రథంపై ఉన్నప్పుడు భూమి పై ఉన్న శత్రువును చంపవద్దు. నపుంసకుని చంపవద్దు. భయంతో శరణుజొచ్చిన వానిని చంపకూడదు. తల విరబోసుకున్న వానిని, కూర్చొన్న వానిని శరణన్న వానిని చంపకూడదు. అట్లే నిద్రిస్తున్న వానిని యుద్ధ ప్రయత్నాలు ఏవి చేయకుండా ఉన్న వానిని నగ్నంగా ఉన్న వానిని ఆయుధాలు లేని వానిని యుద్ధం చేయువానిని యుద్ధం ఇంకా మరొకరితో యుద్ధం చేస్తున్న వానిని చంపకూడదు.

ఆయుధాలు విరిగిపోయిన వానిని ఆర్తి చెందిన వానిని మిక్కిలి దెబ్బలు తిన్నవానిన భయపడ్డ వానిని భయంతో వెనుకకు తిరిగిన వానిని క్షత్రియుల ధర్మాన్ని స్మరిస్తూ చంపకూడదు. యుద్ధంలో శత్రువులకు భయపడి పరిగెత్తే వానిని చంపిన వాడు తాను చేసిన పుణ్యాన్నంతా పోగొట్టుకుంటాడు.( **లక్ష్మీ నరసింహాచార్యులు, నల్లందిఘళ్, మనుస్మృతి, పుట:169).**

పై విషయాలను పరిశీలిస్తే మహాభారతంలో యుద్ధనీతిని అనుసరించి యుద్ధం జరిగినప్పటికి కొన్ని చోట్ల యుద్ధనీతిని పాటించలేదని అర్థమవుతుంది. కర్ణుడు రథం భూమిలో క్రుంగి పోయినప్పుడు కర్ణుడు దానిని సరిచుసేలోపు యుద్ధానికి సిద్దమవుదామని చెప్పినప్పటికి కృష్ణ సారథ్యంలో అర్జునుడు కర్ణుని పై బాణాలు విడిచాడు. ఇక్కడ యుద్ధనీతి తప్పినట్లు కనబడుతుంది. కర్ణునికి ఉన్న శాపాల కారణంగా అతనిని మృత్యువు వెంటాడిందని చెప్పినప్పటికి యుద్ధనీతి పాటించలేదనే స్పృహ చూసిన వారికి తెలుస్తుంది. ఈ ఘటన లోక కళ్యాణం కోసం రాజకీయ వ్యూహం పన్నినట్లు తెలుస్తుంది.

## 4.56. శ్రీకృష్ణ రాజనీతి:

మహాభారతంలో శ్రీకృష్ణుడు రాజనీతి చాతుర్యంతో పాండవులకు కలిగిన ఆపదలను రూపుమాపుతాడు. అది ప్రత్యక్షంగా చేయకపోయినప్పటికి పరోక్షంగా సూచనలు సలహాలను ఎప్పటికప్పుడు పాండవులు గ్రహించేలా చేయడం వలన పాండవులు అనేక విజయాలను పొందగలుగుతారు.

4 లీడర్ షిప్ లెసన్స్ ఫ్రమ్ మహాభారతం అనే వ్యాసంలో ప్రదీప్ కుమార్ రాజనీతి విషయాలను చర్చిస్తారు.

శ్రీకృష్ణుడు ఒక గొప్ప ఆచరణాత్మక మరియు తెలివైన నాయకుడు మానవ వనరులను మరియు భౌతిక వనరులను అత్యంత సమర్థవంతంగా మరియు క్రియాశీలంగా ఉపయోగించాడు. కార్పోరేట్ ప్రపంచంలోని ఒక నాయకుడు సరిగ్గా అదే చేయడానికి ప్రయత్నిస్తాడు. ''

https://pureecoindia.in/4-leadership-lessons-from-the-mahabharata/

అంటే మన చుట్టూ ఉన్న వనరులను ఎలా ఉపయోగించుకోవాలో శ్రీకృష్ణుడి పాత్ర ద్వారా నేర్చుకోవాలని వీరి అభిప్రాయం.

మహాభారతంలో అర్జునుడు శ్రీకృష్ణుడితో మాకు మేలు చేయడానికి నీవు ఏయే ఉపాయాలతో జరాసంధాదులయిన నరేంద్రులను సంహరింపజేసావని అడిగితే శ్రీకృష్ణుడు

**"జరాసంధశ్చేదిరాజః నైషాదిశ్చ మహాబలః**

**యది స్యుర్న హతాః పూర్వమ్ ఇదానీం స్యుర్భయంకరాః(సంస్కృత భారతం ద్రోణ పర్వం, 181 వ అధ్యాయం, 2 వ శ్లోకం).**

జరాసంధుడు, శిశుపాలుడు, మహాబలుడైన ఏకలవ్యుడు, మొదలైన వారు పూర్వం మరణించకుండా ఉండి ఉంటే వారు మహాభయకరులుగా మారేవారని చెప్తాడు. అంతే కాకుండా వీరంతా బతికిఉంటే దుర్యోధనుని ఆశ్రయించేవారు అప్పుడు వారిని ఎదిరించడం దేవతలకు ఇంద్రుడుకు కూడా సాధ్యపడదని చెప్పిన శ్రీకృష్ణునిలో ని బుద్ధికుశలత రాజనీతిని కనబరుస్తుంది.

వాడవల్లి చక్రపాణి రావు శ్రీకృష్ణుని రాజనీతి తత్త్వాన్ని ' *ఆంధ్రమహాభారతము ద్రౌపది ఒక ఇతిహాసిక విశ్లేషణ ఆంధ్రమహాభారతంలో ద్రౌపది యొక్క పురాణ విశ్లేషణ" తన సిద్ధాంత గ్రంథంలో ఈ విధంగా తెలియజేసారు.*

*"మహాభారతంలోని ప్రముఖ పాత్రధారి శ్రీకృష్ణుడు . శ్రీకృష్ణుడు చారిత్రక వ్యక్తి మాత్రమే కాదు చరిత్రాత్మకమైన వ్యక్తి. ఆయన మన దేశ భవిష్యత్తునే తీర్చిదిద్దిన నవభారత నిర్మాత. అనేక రాష్ట్రాలుగా, రాజుకు ఆ రాజు వేరేవేరయ్యి ఐకమత్యం లేక కోట్లాడుకుంటున్న సమయంలో ఆయన జన్మించాడు. దేశాన్ని సంఘటితం చేసి రాజసూయ యాగం కారణం చేత దేశాన్ని 18 రాష్ట్రాలతో కూడిన ఏకైక ప్రభుత్వాన్ని స్థాపించడానికి తన జీవితం అంకితం చేసి అందులో ఎందరో వీరులు బంధువులు అభిమన్యుని వలె, మిత్రులు, రాజులు ఆహుతి అయిపోయినా సరే లెక్క చేయక మహాభారత*

*స్వాతంత్ర్య సంగ్రామాన్ని విజయవంతంగా పూర్తిచేసి ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వాన్ని స్థాపించి దానిని ప్రజారంజకుడు ధర్మమూర్తి అయిన యుధిష్ఠురుని పట్టాభిషిక్తున్ని చేసి నిస్వార్ధంగా తానేమి పుచ్చుకోకుండా తిరిగి ద్వారకకు చేరిన దేశ భక్తుడు. త్యాగి, మహారాజనీతి దురంధురుడు, అందుకే భారతదేశ చరిత్రలోనే ఈయన ఒక శక కర్త ,యుగ పురుషుడు , భారతం అన్న పేరుతో ఈ నాటికీ మనదేశమంటూ ఒకటున్నదంటే అది ఈయన పెట్టిన భిక్షే. అందుకే మనం ఈనాడు మన చరిత్రలో శ్రీకృష్ణ దేవుని భారతదేశ భాగ్య విధాతగా పూజిస్తున్నాము. మహానాయకుడు, కర్మయోగి ఈయన మన భారతదేశ నిర్మాత'' (చక్రపాణి వాడపల్లి, ' ఆంధ్రమహాభారతము ద్రౌపది ఒక ఇతిహాసిక విశ్లేషణ ఆంధ్రమహాభారతంలో ద్రౌపది యొక్క పురాణ విశ్లేషణ'' , పుట:79,80).అని వీరు అభిప్రాయపడ్డారు.*

వీరు ప్రకటించిన అభిప్రాయాలు శ్రీకృష్ణున్ని పరమాత్మ దృష్టితో కాకుండా ఒక ప్రజాపరిపాలకుడుగా చూసినప్పుడు శ్రీకృష్ణుని రాజనీతి భావ పరంపర వెల్లడవుతుందని తెలియజేస్తారు.

ఒక దేశానికి అధిపతిగా ఉంటూ ఎవరిని ఏ స్థానంలో ఉంచితే సమాజం బాగుపడుతుందో గ్రహించి వారిని ఆయా స్థానాలకు అధిపతిని చేసాడు . ఉదాహరణకు జరాసంధుని సంహరించడం వలన ధర్మమార్గాన్ని అనుసరించే అతని కొడుకు సహదేవుడు రాజు కాగలిగాడు.దీని వలన ధర్మమార్గంలో సమాజాన్ని ఉద్ధరించవచ్చని శ్రీకృష్ణుని భావన. శ్రీకృష్ణుడు ఒక్కడే ధర్మసంస్థాపన చేయడానికి అవతరిస్తే సరిపోదు ధర్మపథాన పయనించే వారిని ప్రోత్సహించి వారి ద్వారా మరొకరు ఇలా ప్రతి ఒక్కరు న్యాయ మార్గంలో నడవడానికి ప్రయత్నిస్తేనే సమాజం పురోగతిని సాధిస్తుంది. దానికి సాధనాలుగా పాండవులను ఎన్నుకున్నాడు. అందుకే వారి విజయానికి సహకరించాడు. చివరకు ఎవరికి తెలియకుండా తాను నిర్వర్తించవలసిన బాధ్యతలను తన తరవాత తరం వారికి అప్పగించి రహస్యంగా తనువు చాలించాడు. తాను ప్రత్యక్షంగా లేకున్నా శ్రీకృష్ణుని భావాలను పుణికి

పుచ్చుకున్న తరవాతి తరం వారు వారి రాజ్యపాలనలో శ్రీకృష్ణుని అంతరంగాన్ని దర్శిస్తూ పరిపాలన కొనసాగించారని నా అభిప్రాయం.

శ్రీకృష్ణుడు రాజకీయ నాయకుడు అనడానికి మహాభారతంలో అనేక సన్నివేశాల్లో స్పష్టమవుతాయి. పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రి **"మహాభారత చరిత్రము"** లో శ్రీకృష్ణుడిని రాజకీయ దురంధరుడుగా పేర్కొంటాడు.

*"రాజకీయ దురంధరునకు స్వపక్షవిజయము, పరపక్ష అపజయము ప్రధానము. అందులో ధర్మము వాక్కులలో ప్రధానము. చేతలలో అప్రధానము. సామదానభేదోపాయములు అవసరమును అనుసరించి తారుమారు అవుతుంటాయి. పరపక్ష ధర్మమును గోరంత దానిని గొండంతగాను స్వపక్షాధర్మమును గొండంత దానిని గోరంతగాను లేక తమయందు ఎంత మాత్రము అధర్మము లేదనియు లోకమునకు చాటించి శత్రుపక్షమునకు బలహీనము కలిగించును. రాజకీయ పురుషుడు అంటే సమయజ్ఞుడని చెప్పాలి. ఇట్టి రాజకీయ లక్షణములు వేదకాలము నుండియు నేటి వరకు సమస్త రాజ పురుషులలోను ఇంచుమించు ప్రతిఫలిస్తున్నాయి. అవి సర్వాంగోపేతమై శ్రీకృష్ణునిలో నిండిఉన్నాయి. శ్రీకృష్ణుడు రాజకీయ పురుషాగ్రేసరుడు అతడు రాజకీయ దురంధరాగ్రేసరుడు అనుట కంటే రాజకీయ దురంధరాగ్రేసర ప్రపితామహుడని కాని రాజకీయ పురుష వంశ వృక్షమునకు మూలమని కాని చెప్పుట యుక్తము. శ్రీకృష్ణుని రాజకీయ లక్షణములు మహాభారతమున సంపూర్ణముగ ద్యోతమగును అట్టి రాజకీయ దురంధరాగ్రేసరుని సహాయము చేతనే పాండవులకు విజయము లభించినది. లేని యెడల భీష్ముడు చెప్పినటుల అతడొక ధనస్సు చేతనే పాండవులను జయించి ఉండును.*
*భీష్మ ద్రోణ విదుర సంజయులకు ధర్మజార్జునులకు శ్రీకృష్ణుని రాజకీయ పరిజ్ఞానము బాగా తెలుసు భీష్మాదులు ఈ సంగతిని దుర్యోధనునికి అనేకసార్లు తెలిపాడు. కాని నేటి కాలమున కేవలము పశుబలమునే నమ్మి మోసపోయిన జర్మనీకైసరు వలె దుర్యోధనుడు కేవల సైన్య బలాధిక్యమునే నమ్మి మోసపోయి యున్నాడు. " (వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, పెండ్యాల, మహాభారత చరిత్రము, పుట:120.).*

శ్రీకృష్ణుని నాయకత్వ పటిమ వల్లనే పాండవులకు విజయం లభించిందని ధర్మపరిపాలన చేయగల సమర్థులు పాండవులు కాబట్టి శ్రీకృష్ణుడు ధర్మవిజయాన్ని వారికి అందించినట్లు తెలుస్తుంది.

శ్రీకృష్ణుడు అవతారపురుషుడుగా జనియించి ధర్మానికి కట్టుబడి ఉన్నాడని, నీతిని రాజనీతిలో సమన్వయపరచిన ఘనత శ్రీకృష్ణుడిదని చెప్తూ నందుల గోపాలకృష్ణమూర్తి **'ఆంధ్రమహాభారతము– ఉపదేశము'** గ్రంథంలో ఈ విధంగా తెలియజేసారు.

*''శ్రీకృష్ణుడు ధర్మసేతువు భంజించిన దుష్టులను తాను సంహరించి పాండవుల చేత సంహరింపచేసి తన అవతార ప్రయోజనమును సాధించెను. శాస్త్రహాని, లోక లంఘనము కలుగకండా ధర్మమెట్లు అవలంబించవలయునో భారతము ఉపదేశించుచున్నది. నీతి, రాజనీతి పరస్పర విరుద్ధములు. శ్రీకృష్ణుడు అవతారపురుషుడుఅవడం చేత నీతిని రాజనీతిలో మేళవించి సమన్వయం చేసెను. యుగ ప్రవృత్తులను బట్టి ధర్మాధర్మముల స్వభావము మారుచుండును. మహోద్యమము సాగించుటలో మహాత్ములకు లోకకల్యాణమే పరమార్థము ఉత్తమాశయము సాధించినప్పుడు ఒక్కొక్కసారి లోకసామాన్యా దృష్టిలో అన్యాయమా అను భ్రమ కలిగించినట్లు మహాపురుషులు వ్యవహరిస్తారు. అట్టి సందర్భంలో పవిత్రమైన ఆదర్శము సాగించుటకొరకు ధర్మము సంరక్షించుట కొరకు ఆ క్లిష్టమైన పరిస్థితులలో ఒకింత అధర్మము అనుసరించినను అధర్మము కాదు. శ్రీకృష్ణుడు రాజనీతిని మహనీయ వ్యక్తిత్వమును, సంభాషణమును, సర్వమును జగత్కల్యాణ కాంక్షతో నిర్వహించెను. స్వార్థముమందుకైనను లేదు. చక్రముత్రిప్పునే కాని ఫలము ఆ మహాపురుషునకు అక్కర లేదు. ఫలభోక్తలు, ధర్మశీలురు , భారతకథారంభమ నుండియు శ్రీకృష్ణుడు సూత్రధారియ కథ నడిపి ధర్మరాజును ధర్మసింహాసనముపై అధిష్ఠింపచేసెను. వ్యక్తియొక్క వ్యాపారము యొక్క ప్రధాన ధ్యేయమును పరిగణించవలయును. ఆచరణములో పవిత్రత ఉన్నదా లేదా అని చూడరాదు. స్థూల దృష్టికి అధర్మము వలె కనిపించినను సూక్ష్మదృష్టికి అది ధర్మమేనని సిద్ధాంతము''త( గోపాలకృష్ణమూర్తి, నందుల, ఆంధ్రమహాభారతము–ఉపదేశము'', పుట:117,118.).*

వీరి మాటల్లో శ్రీకృష్ణుడు దుష్టులయందు కఠినంగా శిష్టులయందు సౌమ్యంగా ప్రవర్తించాడని అందులో ఎటువంటి దోషము లేదని శ్రీకృష్ణుని చేష్టలు పైకి అధర్మంగా గోచరించినప్పటికి చివరి వరకు ధర్మసంస్థాపనకు మాత్రమే పాటుపడ్డాడని. తెలియజేసారు. శ్రీకృష్ణుని యొక్క అంతరంగంలో ఉన్న ప్రధాన లక్ష్యం ఏమిటో అది బయట వారికి కనబడదు. దానికి అనుగుణంగానే శ్రీకృష్ణుని రాజనీతి చాతుర్యం కనబడుతుందని తెలుస్తుంది.

పి. రాజగోపాల నాయుడు'' **కురుక్షేత్రే" పుస్తకంలో రాజనీతిలో మూడు** *ధోరణులున్నాయని చెప్పాడు. 1. అధర్మపరులైన శత్రువుల యెడల కూడా ధర్మాన్ని పాటించడం.*

*2. ధర్మవర్తనులైన శత్రువుల యెడల ధర్మాన్ని పాటించి, అధర్మవర్తనులైన శత్రువుల యెడల అధర్మాన్ని పాటించడం.*

*3. శత్రువులెటు వంటి వారైనా వారి యెడల అధర్మనిని పాటించడం.*

*ఈ లక్షణాలలో శ్రీరామచంద్రుడు, భీష్ముడు, పృథ్వీరాజు, ప్రతాపచంద్రుడు, గాంధీ మొదలైన వారు మొదటి లక్షణానికి చెందిన వారని*

*శ్రీకృష్ణుడు, చాణక్యుడు, శివాజి తదితరులు రెండవ పద్ధతికి చెందినవ రని,*
*కణికుడు, ఘోరి, ఔరంగజేబు, మేక్యవల్లి మొదలైన వారు మూడవ ధోరణికి చెందిన వారని చెప్పాడు.*

*అంతేకాకుండా మొదటి రాజనీతి ధోరణి అత్యుత్తమైనదని ధర్మం, దానికి ఫలితాలతో నిమిత్తంలేదు. అది ఒక జీవన విధానం, కాని రెండవ నీతి అలాంటిది కాదు. అధర్మాన్ని నాశనం చేయాలంటే అధర్మాన్ని ఉపయోగించాలి. ఈ లక్షణాన్నే శ్రీకృష్ణుడు భారతంలో ఉపయోగించాడు. ఇక్కడ ధర్మానికంటే ఫలితానికే హెచ్చు ప్రాధాన్యం ఇవ్వబడింది.*

*ధర్మంతో నిమిత్తం లేకుండా రాజ్య తంత్రాలను నిర్వహించాలన్నవారు ఇతర దేశాలలో లేకపోలేదు. మాక్యోవెల్లి, మార్క్స్, హాబ్స్, హెగెల్, మొదలైనవారికి ధర్మంతో పనిలేదు. ఎదుటివారెంత ధర్మమార్గాన్ని అనుసరించేవారు అయినప్పటికి, తమ దేశం కోసం తమ లాభం కోసం ఇతరుల్ని ఇతర దేశాలను ఏమైనా చేయవచ్చు. అందుకోసం ఏ అధర్మానికైనా పూనుకోవచ్చు. అందులో ఏదోషం లేదు. దీనికి కణిక నీతికి ఎక్కడా భేదం లేదు.''(రాజగోపాల నాయుడు, పి. కురుక్షేత్రే, పుట:93).*

వీరి వివరాలను గమనిస్తే మాకియో వెల్లి చెప్పిన రాజనీతి అంశాలు స్వార్థప్రయోజనానికే ఉపయోగపడ్డాయని తెలుస్తుంది.

## 4.57. ద్రౌపది దండనీతి:

ధర్మరాజు యుద్ధం వలన కలిగిన పరిణామాలకు దుఃఖిస్తున్న సమయంలో అర్జున , భీముడు , నకుల సహదేవులు రాజ్య స్వీకరణ చేయమని అనేక విధాలుగా చెప్తారు. అయినప్పటికి ధర్మరాజు నిశ్చేతనంగా నే ఉంటాడు. ఆ సమయంలో ద్రౌపది కొన్ని రాజనీతి విషయాలను ధర్మరాజుకు గుర్తుచేస్తుంది.

రాజును బ్రహ్మ సృష్టించింది మౌనంగా బాధపడుతూ ఉండమని కాదు ధైర్యంతో ముందుకు వెళ్తూ క్షత్రియ ధర్మాన్ని నిర్వర్తించమని చెప్తుంది.

అంతే కాకుండా

*'' కం. నరరూపుంబునఁబరఁగెడు– పరదేవత గాక నృపుడు బాలుఁడయిన న*

*పురుషు నెడ నేమి వొమ్మని – తిరిగిన దుర్మతులఁబొందదే కీ దధిపా!*

*(ఆంధ్రమహాభారతం, ప్రథమాశ్వాసం, 92 వ పద్యం.*

ఇలా చెప్పడంలో ప్రభువు మనిషిరూపంలో ఉన్న దైవం వంటి వాడు దైవమే దిగులు చెందితే చిన్నపిల్లవాడిలా ప్రవర్తిస్తే అతని పట్ల అందరూ నిర్లక్ష్య భావంతో ఉంటారని చెప్పి ధర్మరాజులో రాజోత్సహాన్ని కలిగించే ప్రయత్నం చేసింది.

ద్రౌపది తనకు జరిగిన అవమానాలకు దుర్మార్గులకు తగిన శిక్షే పడింది దానికి నీవు బాధపడవలసిన పనిలేదని చెప్తూ ఈ విధంగా అంటుంది.

*“సీ. నృపునందు విధి దండనీతి ప్రతిష్ఠించెఁ గావున నపరాధగతి యెఱింగి*
*దండించు నృపతికి రెండు లోకంబులుఁ / జేకుఱుఁదోషంబు సేయ నుదుట*
*నచ్చొత్తి వెడలంగ నడుచు విప్రుని నైన / భూవరుండిది మెచ్చు దేవకోటి*
*సభ కేకవస్త్ర రజస్వల యనక నన్ / దలపట్టి యీడ్చిన తప్పుఁ దనదు*
*తే. తొడలు సూపిన తప్పును దుష్ట కష్ట/ తర వచనములఁబఱిచిన తప్పు ననుజు*
*నందు దుర్యోధనుని యందు ననుఁగు నందుఁ గాంచి దండించి తిట్టిది కల్మషంబె? ( ఆంధ్రమహాభారతం, ప్రథమాశ్వాసం, 94 వ పద్యం,).*

ఈ మాటల్లో బ్రహ్మ రాజునందు దండనీతిని ప్రతిష్ఠించాడు దానిని క్షత్రియుడు సక్రమంగా ఉపయోగించుకోవాలి. అది అపరాధం చేసిన వారిని శిక్షించేందుకు పుట్టింది. దానిని దుర్మార్గులకు వినియోగిస్తే ఇహపరాలు రెండు సిద్ధిస్తాయి. బ్రాహ్మణుడు తప్పు చేసినా అతనిని దేశ బహిష్కరణ చేస్తారు. సభలో ఒంటి చీరను ధరించి రజస్వల అయిన నన్ను జుట్టుపట్టి ఈడ్చిన తప్పు తన తొడలు చూపిన తప్పు , దుష్టమైన మాటలను ఆడిన తప్పు  తమ్ముడైన దుశ్శాసనుడిని, దుర్యోధనుని, అతడి ప్రియమిత్రుడు కర్ణుడిని దండించావు ఇదిపాప కార్యం కాదని చెప్తుంది.

ఈ విషయాలను పరిశీలిస్తే రాజ్యం కోసం యుద్ధం జరిగిన సంగతి కంటే ఒక స్త్రీని అవమానించడం ఎంత ప్రమాదకరమో తెలుస్తుంది. పైకి రాజ్యం కోసంగా యుద్ధం అని ప్రచారంలో అందరూ అనుకునేలా ఉన్నప్పటికి అసలు కారణం ద్రౌపదికి జరిగిన అవమానం ఆమెను అవమానించిన వారందరూ యుద్ధమనే నెపంతో సంహరించబడటం అనేది తప్పుకాదని ద్రౌపది భావంగా తెలుస్తుంది.

రాజు ఎవరిని శిక్షించడం ద్వారా పుణ్యాత్ముడు అవుతాడో ఈ విధంగా చెప్తుంది

విషం పెట్టే వాడిని, ఇల్లు తగులబెట్టే వాడిని రాజకీయ తంత్ర రహస్యాలను బయటపెట్టేవాడిని, వధను విధించే వాడిని పర సతులను హరించే వాడిని బంధువులను

చంపేవాడిని ఇతరుల సంపదలు దొంగిలించేవాడిని చంపి రాజు పుణ్యాతుడౌతాడని చెప్పి ధర్మరాజుకు దండనీతి యొక్క గొప్పతనాన్ని చెప్తుంది.

## 4.58. ధర్మరాజు రాజనీతి:

ధర్మరాజు రాజనీతి ఎటువంటిదో మహాభారతంలోని కొన్ని విషయాల ద్వారా స్పష్టమవుతాయి. ధర్మరాజు నాయకుడుగా ఎందుకు అర్హుడూ కూడా మహాభారతంలో చాలా సన్నివేశాలు విశదపరుస్తాయి. వాటిని ఇక్కడ చర్చిస్తున్నాను.

నందుల గోపాలకృష్ణ మూర్తి'**ఆంధ్రమహాభారతము– ఉపదేశము''** గ్రంథంలో ఈ విధంగా అంటారు. ''*శ్రీకృష్ణుని రాజనీతి విషయంలో ధర్మరాజు సమానుడని చెప్పవచ్చు. ఉత్తమరాజనీతికి ప్రధానలక్షణము లోకారాధనము, రాజు అనగా రంజింపచేయువాడు. ప్రజల కన్నీళ్ళు తుడిచి ఆనందము కలిగించువాడు. అట్టి రాజునకు సంబంధించినది రాజనీతి. కేవలము స్వార్థముకు అధికార దుర్వినియోగమునకు ఉపయోగించు నీతి కూట రాజనీతి. ధర్మజుని రాజనీతి సర్వోత్తమమైనది. అది పాలకునకు పాలితులకు మేలు గూర్చునదై ఉన్నది. ఉత్తమ రాజన్యుడు స్వసుఖ నిరభిలాషియై వృక్షముల లాగా శిరోభారముచే ఎండవానలకు ఓర్చి తనను ఆశ్రయించిన సకల జీవులను నీడను, పుష్ప ఫలములొసగి కాపాడవలెను. తల్లిదండ్రులుప్రజలకు కేవలము జన్మహేతువులు, ప్రజలకు తండ్రి రాజు. ఈ సంప్రదాయము శ్రీరామచంద్రుని నుండి అనుస్యూతముగా ప్రవహించుచున్నది. ధర్మజ భీమార్జున, నకుల సహదేవులు అరణ్య అజ్ఞాత వాసములలో అనేక కష్ట నష్టాలకు అవమానములకు గురయ్యారు. ప్రతి కారం చేయుట మాని శాంతమును కోల్పోక కౌరవులతో సంధి చేసుకొనుటకు చివరకు ఐదుగ్రామాలు సంధికైనా ఒప్పుకుని ఉంటే యుద్ధమును నివారించి సకల జన శ్రేయమును కోరుట స్పష్టమగును. యుద్ధము చరమోపాయము ధర్మరాజు కౌరవులతో యుద్ధం జరిగినచో సంభవించు అనర్థములన్ని ముందుగా ఊహించి దానిని నివారించుటకు ఎంతయో ప్రయత్నించెను. ఇది అతని శాంతి కాముకత్వాన్ని సూచిస్తుంది. ఆయా సందర్భాలలో ధర్మరాజు మిత్ర, హిత*

*సత్య వాక్య పరిపాలకుడై సంభాషించినను ఘట్టములు ఉదాత్త రాజనీతికి రమణీయ మణిదర్పణములు.( గోపాలకృష్ణమూర్తి,నందుల. "ఆంధ్ర మహా భారతము – ఉపదేశము.పుట: 128).*

ఈ వివరాలు నాయక లక్షణాలు ధర్మరాజులో నిక్షిప్తమై ఉన్నాయని ఆ రాజనీతి నిస్వార్థమైన ప్రజాపరిపాలనను అందించే స్వచ్ఛమైనదని తెలుసుకోవచ్చు. ధర్మరాజు ధర్మశీలుడు, సత్యశీలుడు శాంతి స్వరూపుడు అతని చర్యలన్నీ ఆచరణీయంగాను. ఆదర్శంగాను ఉంటాయి. అయితే అతని అంతరంగంలో దాగి ఎవరికి తెలియని రాజనీతి లక్షణాలు ఇతనిలో దాగిఉన్నాయి. ఆ మర్మాలు శ్రీకృష్ణునికి తప్ప ఎవరూ గ్రహించలేరు. ఉదాహరణకు కొన్నింటిని ఇక్కడ పరిశీలిస్తున్నాను.

పాండవుల దూతల ద్వారా సందేశాన్ని అందుకున్న శల్యుడు పాండవులకు సహాయం చేయడానికి బయలుదేరుతాడు. కాని దుర్యోధనుని తెలివితేటలతో శల్యున్ని తన పరివానరంతో సేవలతో సంతృప్తి పరచి ధర్మరాజే ఈ సేవలు అందిస్తున్నాడేమో అనే భ్రమను కలిగించాడు ఈ సేవలను ఏర్పాట్లు చేసిన వారికి ఏదైనా ఇద్దాము అనుకున్న సమయాన దుర్యోధనుడు ఎదుటపడి తన కోరిక శల్యున్ని యుద్ధరంగంలో తనకు సహకరించమని చెప్తాడు. శల్యుడు ముందుగానే మాట ఇవ్వడం వలన సేవలకు సంతోషించిన కారణంగా దుర్యోధనుని వైపు యుద్ధానికి సిద్ధమవుతాడు.

ఈ విషయాన్నంతా శల్యుని ద్వారా విన్న ధర్మరాజు మంచిపని చేసావని ప్రశంసిస్తాడు. తనకు కావలసినది కూడా అదేనని సంతోషిస్తాడు.

ఇక్కడ ధర్మరాజు తన బంధువులు శత్రువుకు సహాయం వెళ్లగానే సంతోషించాడంటే అందులోని ఆంతర్యం ఎంతలోతుగా ఉంటుందో ఊహించాలి. ధర్మరాజు శల్యున్ని ఒక సహాయం అడుగుతాడు. నీవు రథం నడపడంలో శ్రీకృష్ణునితో సమానమైన వాడివి కర్ణార్జునులకు యుద్ధం వచ్చినప్పుడు కర్ణుని ని సారథ్యం వహించు నీవు మా మేలు కోరేవడైతే అర్జునుని రక్షించాలి. మాకు జయం కలిగేటట్లు నీవు కర్ణునికి

మనసును గాయపరిచేవిధంగా మాట్లాడు. ఈ పని ఒక్కటి చేసిపెట్టమని అడుగుతాడు.దానికి శల్యుడు అంగీకరిస్తాడు.

*“తస్యాహం కురు శార్దూల ప్రతీమహితం వచః/*

*ధ్రువం సంకథ యిష్యామి యోద్ధుకామస్య సంయుగే//*

*యథా స హృత దర్పశ్చ హృతతేజాశ్చ పాండవ/*

*భవిష్యతి సుఖం హంతుం సత్యమేతద్ బ్రవీమి తే// (సంస్కృత భారతం, ఉద్యోగ పర్వం, 8 వ అధ్యాయం, 47,48 శ్లోకాలు)*

యుద్ధ రంగంలో కర్ణునికి నిరుత్సాహ పరిచేవిధంగా మాట్లాడుతాను అతని పొగరును తేజస్సును అణగిపోతాయి.అతనిని తేలికగా చంపవచ్చునని చెప్తాడు.

ఈ విషయాలను పరిశీలిస్తే ధర్మరాజు యొక్క రాజనీతి బోధపడుతుంది. మిత్రుడు శత్రుపక్షం వైపు వెళితే వెళ్లాడు దానికి ప్రతిఫలంగా కర్ణున్ని లక్ష్యం చేసుకున్నాడు. విజయాన్ని అందించే అర్జునునికి ఎవరూ ప్రతిబంధకంగా ఉండకుండా చేసేదానిలో ఈ ఉపాయం బాగా పనికి వస్తుందని అనుకున్నట్లున్నుడు ధర్మరాజు. శల్యుడు కూడా దుర్యోధనుని పక్షం చేరానని చెప్పడమే కాని అతని మనసు ధర్మరాజు వైపే ఉండడంతో శల్యుడు ఇంతకంటే మన వాళ్ళకు సహాయం చేసే అవకాశం రాదేమోనని సంతోషించాడు.

మరొక సందర్భంలో శత్రువులకి మరణం ఎలా సంభవిస్తుందో వారినే అడిగి తెలుసుకునేటటువంటి రాజనీతి ఉపాయం ధర్మరాజు కాకుండా మరొకరి రాదు. అది కూడా యుద్ధానికి సిద్ధంగా ఉన్న రెండు సేనల మధ్య ధర్మరాజు భీష్మాదుల దగ్గరకు వెళ్తాడు ఎవరికి అర్థం కాదు అతని మనసులోని రాజతంత్రం. అర్జునుడు, కవచాలు, ఆయుధాలు, వదిలి శత్రుసేన వైపు ఎందుకు వెళ్తున్నావని అడుగుతాడు. నకుల సహదేవులు కూడా అలాగే ఆలోచిస్తారు. సోదరులంతా ప్రశ్నిస్తున్నా ధర్మరాజు మౌనంగా ఉంటాడు. రాజనీతిలో తాను ఏ ఉపాయం పన్నబోతున్నాడో ఎవరికి చెప్పడు నేరుగా కార్యంరూపుదాలుస్తుంది. అది ధర్మరాజులో వ్యక్తమవుతుంది.

ధర్మరాజు మనసు ఏమిటో శ్రీకృష్ణునికి అర్థమయ్యింది. యుద్ధానికి ముందు గురువుల ఆశీర్వాదం తీసుకోవడం మర్యాద ఆ మర్యాద ఇక్కడ ధర్మరాజు పాటించాడు. భీష్ముడి దగ్గరకు వెళ్తున్నారు ఆ వెళ్లే సమయంలో శత్రుపక్షం లోని సైన్యం ధర్మరాజు చేసే పని అవహేళనగా భావిస్తారు.ధర్మరాజు రాజు కాదని అతనికి పౌరుషం లేదని, శరణు వేడడానికి భీష్ముడి దగ్గరకు వెళ్తున్నాడని అనుకుంటారు.

*‘‘న నూనం క్షత్రియకులే జాతః సంప్రథితే భువి/*

*యథాస్య హృదయం భీతమ్ అల్పసత్త్వస్య సంయుగే//( సంస్కృత భారతం, భీష్మ పర్వం ,43 వ అధ్యాయం,29 వ శ్లోకం).*

*ధర్మరాజు క్షత్రియ వంశంలో పుట్టలేదని ధైర్యం లేదని అందుకే భయపడుతున్నాడని అనుకుంటారు. అంతే కాకుండా ఆ చర్యతో తమకే విజయం అన్నట్లు వారి వారి ఉత్తరీయాలను గిరగిరా ఊపుతారు. అలా వారు నిందించి మరలా ధర్మరాజు భీష్ముడితో ఏమి మాట్లాడుతాడు, భీష్ముడు ఏమి చెప్తాడు. శ్రీకృష్ణార్జునులు ఏమి మాట్లాడుకుంటారు అనే కుఃతూహలంతో ఉంటారు. (సంస్కృత భారతం, భీష్మ పర్వం, 43 వ అధ్యాయం, ).*

ఈ విషయాలను పరిశీలిస్తే యుద్ధానికి ముందే శత్రువుల మనసులో ఒక అలజడి అయితే కలిగింది. ధర్మరాజు భయపడే వ్యక్తి , పిరికి వాడనే భావన శత్రువలలో కలిగే విధంగా ఈ చర్య కనబడుతుంది.

ధర్మరాజు భీష్ముని దగ్గరకు వెళ్ళి నమస్కరించాడు. ధర్మరాజు రావడం వలన భీష్ముడు సంతోషించాడు. నీవు కనుక నా దగ్గరకు రాని పక్షంలో నిన్ను శపించేవాడినని చెప్పి ఆశీర్వదించాడు. అంతే కాకుండా వరం కోరుకోమన్నాడు. ఇంకేముంది ధర్మరాజు రాజనీతి ఫలించింది. భీష్ముడిని ఓడించే ఉపాయం చెప్పమన్నాడు. భీష్ముడు అది సాధ్యం కాదని చెప్పాడు. ధర్మరాజు మరలా అడుగుతున్నాను నీవు పరులతో యుద్ధం చేస్తున్నప్పుడు నిన్ను చంపే ఉపాయం ఏమిటో చెప్పు అనగా ఇది సమయం కాదు మరలా రమ్మని చెప్తాడు.

మరలా ధర్మరాజు భీష్ముని శిబిరానికి వెళ్ళినప్పుడు భీష్ముడు తనను ఎలా చంపాలో వివరంగా చెప్తాడు.

*“నొక్క వ్రతంబు పూనిని వాఁడం బుట్టినప్పుడు లేకనడుమ దైవంబిచ్చిన పురుషత్వంబు గలవానితోఁగయ్యంబు సేయం గావున మీకు నొక్క యుపాయంబు సెప్పెద. ద్రుపదు నపత్యం బైన శిఖండి యట్టి వాడగుట మీరెఱుంగు దురకాదె? విశేషించి ముందటి పుట్టువున నంగన యగుట వాని కెడు రేయకుండుదు నర్జునుండు వానిం బురస్కరించుకుని వచ్చి యే నేయుట మానినయెడ నొప్పించి పడవైచునది. పడంపడి బంధుమిత్రులకు ధార్తరాష్ట్రుల గెలుచుట సుకరం బగునిది నాపను పేను బనిచి నట్ల చేయుండని సహృదయంబుగా జెప్పిన నట్లు దేవవ్రతుని చేత ననుజ్ఞాతు లై వార లతనికి నమస్కరించి వీడ్పుని విడిదలకుం బోవుచున్న సమయంబున భీభత్సుండు.”(ఆంధ్రమహాభారతం, భీష్మ పర్వం, తృతీయాశ్వాసం, 303 వ వచనం).*

భీష్ముడు ఆయుధం పట్టకుండా ఉన్నప్పుడు అతనిని జయించాలని చెప్పాడు. కవచం లేని వాడిని ఆయుధం క్రింద పడేసిన వానిని ధ్వజాన్ని క్రిందికి దించిన వాడితోనూ ఆడవారితోనూ అంతకు పూర్వం ఆడది అయిఉండి పురుషుడుగా మారిన వానిని ఆడవారి పేరు గల వాడిని తలపాగా ఊడిపోయిన వాడిని అన్నదమ్ములు లేని వాడిని, బిడ్డలు లేనివాడిని బాణాలతో కొట్టను , ముందు మగతనం లేకుండా మధ్యలో దైవం చేత మగతనం పొందిన వాడితో కూడా యుద్ధం చేయను ద్రుపదుని కొడుకు శిఖండి అట్లాంటి వాడనే సంగతి అందరికి తెలిసిందని చెప్తాడు. అతనిని ముందు ఉంచుకుని అర్జునుడు నాపై బాణాలు వేసి పడగొట్టవచ్చు. ఈ విధంగా చేయండని భీష్ముడు చెప్పి వారిని ఆశీర్వదించాడు.

ఇలా విజయోపాయాన్ని ధర్మరాజు పొందుతాడు.

భీష్ముడి దగ్గరకే కాకుండా ద్రోణుని దగ్గరకు వెళ్ళి ద్రోణున్ని జయించే ఉపాయం అడుగుతాడు. ద్రోణుడు కూడా నీవు నా దగ్గరకు రాకపోయి ఉంటే నిన్ను శపించేవాడినని చెప్తాడు

అంతే కాకుండా *"న తే2స్తి విజయస్తావద్ యావద్ యుద్ధ్యామ్యహం రణే*

*మమాశు నిధనే రాజన్ యతస్వ సహ సోదరైః(సంస్కృత భారతం, భీష్మ పర్వం, 43 వ అధ్యాయం,62 వ శ్లోకం).*

ద్రోణుడు చెప్తున్నాడు నేను యుద్ధంచేస్తున్నంత సేపు నీకు విజయం కలుగదు నాకు త్వరగా మరణం కలిగేటట్లు నీ తమ్ములతో కలిసి ప్రయత్నించమని చెప్తాడు.నాకు త్వరగా మరణం కలిగేటట్లు నీ తమ్ములతో కలిసి ప్రయత్నించమని చెప్తాడు.

అలాగు ద్రోణుడు శస్త్ర సన్యాసం చేస అచేతనంగా ప్రాయోపవేశం చేస్తే తప్ప ఎవకే నన్ను ఎవరూ జయించలేరు. అలాగే మహాత్ముల నుండి అప్రియమైన విషయం వింటే యుద్ధంలో శస్త్రం విడిచిపెడతానని చెప్తాడు.

అలాగే కృపాచార్యుని, శల్యుని ఆశీస్సులు తీసుకున్నాడు. ఎవరైతే కీలకమైన వ్యక్తులో వారే ధర్మరాజుకు విజయం కలగాలని ఆశీర్వదించారు.

చివరకు కౌరవుల వైపు ఎవరైనా నా వైపు వచ్చి యుద్ధం చేసేవారుంటే రమ్మని చెప్తాడు. దీనితో ధృతరాష్ట్ర పుత్రుడు యుయుత్సుడు ధర్మరాజు వైపు వస్తాడు. దుర్యోధనుడు కనీసం తన వైపు పోరాడుతున్న పెద్దవారి ఆశీర్వచనాలు కూడా తీసుకోలేని అహంకారి కావున అపజయం పొందాడు. ధర్మరాజు సంస్కారవంతుడు కాబట్టి చివరకు పాండవులను విజయం వరించింది.

ఈ విధంగా ధర్మరాజు తాను అభిమానించేవారు, బంధువులు శత్రుపక్షం వైపు ఉన్నప్పటికి వారినుండి తమ పక్షం విజయం పొందే ఏర్పాట్లు చేసుకున్నాడు.

ధర్మరాజు మెత్తనిపులి అంటుంటారు దీని గురించి శలాకరఘునాథ శర్మ **కవిత్రయ భారత జ్యోత్స్న** గ్రంథంలో ఈ విధంగా తెలుపుతాడు.

*"నిజానికి పులి క్రూర జంతువు దాని కన్నులలో కదలికలలో, గాండ్రింపులో నిలువెల్లా క్రూరత్వం నిండి ఉంటుంది. కానీ ఈ పులిలో అదేమి కనబడదు. కనబడకపోతే వివేకం లేనివాడు అదేమి చేస్తుందిలే అని దగ్గరకు చేరుకుంటాడు. బెదిరిస్తాడు. బెడ్డలు విసురుతాడు. కర్రలు పుచ్చుకుంటాడు.గట్టిగా దెబ్బకొట్టడానికి పూనుకుంటాడు. అది*

*మెల్లగా పంజా విప్పి పట్టుకుని ఏ ఉద్వేగమూ లేకుండా మడిచి నోట్లోపెట్టుకుంటుంది. మళ్ళీ మామూలుగా విలాసంగా చూస్తూ ఉంటుంది. అదిగో అది మెత్తని పులి అంటే ఇట్టి స్థితి అతనికి ఎందుకు వచ్చింది అంటే వశీకృతచిత్తుడు కనుక తన చిత్తాన్ని తన వశంలో పెట్టుకుని గట్టిగా పట్టుకోగల శక్తి ఉన్నవాడు. ఈ మెత్తని పులి లక్షణం మరింత విష్పష్టంగా దౌత్యానికి శ్రీకృష్ణుని పంపే సందర్భంలో ధర్మరాజు పలికిన మాటలలో కనబడుతుంని తెలియజేస్తాడు.(రఘునాథ శర్మ, శలాక, కవిత్రయ భారత జ్యోత్స్న, తెలుగు మహాభారత రత్నమాల-3, పుట:117).*

ఈ విధంగా ధర్మరాజు తన రాజనీతి ని ప్రదర్శించాడు ప్రదర్శించే విధానం ఎవరికి తెలియని రీతిలో అంతర్గతంగా దానిని ఉపయోగించారని చెప్పవచ్చు.

సంజయ రాయబారంలో ధర్మరాజు చెప్పిన విషయాలన్నీ రాజనీతితో కూడినవని నందుల గోపాలకృష్ణ మూర్తి, '**ఆంధ్రమహాభారతము- ఉపదేశము**' గ్రంథంలో ఈ విధంగా తెలియజేసారు. *''ఈ ధర్మజుని ప్రసంగమంతయు అతని రాజనీతి నైపుణ్యమును తెలుపుతున్నది. అతనికి తన తమ్ముల పరాక్రమమునందు అచంచల విశ్వాసము కలదు. ధృతరాష్ట్రుని దుష్టత్వమును పేరు పేరున ఖండించెను. వజ్రమును వజ్రముతోనే కోయవలెను. అన్నట్లు సంజయుని వాక్చాతుర్యమును వాక్చాతుర్యముతో ఖండించెను. ధర్మరాజు వంటి మహాపురుషులకు కోపము కూడా అలంకారమే అని నిరూపించెను. అల్పక్షరములలో అనల్పార్థము నిక్షేపించబడినది. (గోపాలకృష్ణ మూర్తి, నందుల.'' ఆంధ్రమహాభారతము – ఉపదేశము'' , పుట:133).*

వీరు చెప్పిన విషయాలను గమనిస్తే ధర్మరాజుకు పెద్దలంటే గౌరవమే దానిని వ్యక్తపరుస్తూనే దుర్యోధనాదులను తీర్చిదిద్దిన తీరుకు ధతరాష్ట్రున్ని వ్యంగ్యంగా విమర్శించే నిపుణత ధర్మరాజు మాటల్లో తెలుస్తుంది. ధర్మరాజు యుద్ధానికంటే ముందు తన మాటలనే యుద్ధాన్ని ప్రయోగిస్తున్నట్లు తెలుస్తుంది.

ఘోషయాత్రా సమయంలో కూడా ధర్మరాజు రాజనీతి ప్రస్ఫుటిస్తుంది. నాయకుడుగా తనకు అపకారం చేసిన దుర్యోధనుని గంధర్వులు పట్టుకుని పోతున్నప్పుడు

తగిన శాస్తి జరిగిందని అనుకోకుండా తన తమ్ములను పంపించి రక్షిస్తాడు. ఆ సమయంలో ధర్మరాజు దుర్యోధనునికి ఈ విధంగా బుద్ధులు చెప్తాడు.

*“ఎన్నడు నిట్టి సాహసము లింక నొనర్పకుమయ్య దుర్జనుం*
*డన్నన సాహసక్రియల యందు గడంగి నశించు గావునం*
*గ్రన్నన తమ్ములన్ దొరలగైకొని యిమ్ములబొమ్ము వీటికిన్*
*సన్నుత దీని కొండొక విషాదము బొందకుమీ మనంబునన్” (అరణ్య –పంచమ–434).*

*నాయనా ఎప్పుడూ ఇటువంటి సాహసములు చేయవద్దు. దుర్జనుడు దుస్సాహములయందు నశిస్తాడు. దీనికి విషాదము పొందకు, తమ్ములతో మెల్లగా వీటికి పొమ్ము. అని చెప్తాడు. ఇవి మాటలా కావు ఈటెలు ధర్మరాజు మొత్తని పులి వలె వ్యంగ్యంగా గర్భితముగా మాట్లాడాడు. ఇంత గడుసుగా మాట్లాడుట ధర్మరాజుకు తప్ప ఎవరికి సాధ్యం కావు. ప్రీతి కల్గుటలో ఎంత పేశలుడో మెత్తని చివాట్లు పెట్టుటలో అంత మేటి ఘోషయాత్ర నిజముగా ధర్మజుని కీర్తి ఘోషయాత్రగా పరిణమించుటకు ధర్మజుని రాజనీతి ధౌరంధర్యమే కారణము.” (గోపాలకృష్ణ మూర్తి, నందుల, ఆంధ్రమహాభారతము – ఉపదేశము, పుట:130).*

ఈ విషయాలు ధర్మారాజు రాజనీతి నైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తాయి. అంతే కాదు శత్రువును సున్నితంగా హెచ్చరించాడు. ఇది ధర్మరాజు కీర్తికి తార్కాణంగా చెప్పవచ్చు.

### 4.59. శివుడు పార్వతి దేవికి చెప్పిన రాజనీతి:

అనుశాసన పర్వంలో శివుడు పార్వతి దేవికి చెప్పిన రాజనీతి అంశాలను కొన్నింటిని ఇక్కడ పేర్కొంటున్నాను.

పార్వతి దేవి శివుడుని రాజు అనేవాడికి మనుషుల్లాగే శరీరమున్నది కదా వారి లాగే ఆహారాలు స్వీకరించడం ఉంటుంది కదా అయినప్పటికి తక్కిన వారి కంటే రాజే అధికుడు

గా ఉంటూ అందరి గౌరవాలను అందుకుంటాడు. ప్రజలను అదుపులో పెట్టడానికి దోషులను శిక్షించడానికి అర్హత పొంది ఉంటాడు. దీనికి గల కారణమేమిటో తెలియజేయమనగా శివుడు రాజత్వ మహిమను చెప్తాడు.

మనం చేసిన తపస్సుకారణంగానే రాజు జన్మ వస్తుందని రాజు గౌరవప్రదమైన స్థానాన్ని పొంది ప్రకాశిస్తాడు . రాజు జనుల నమస్కారాలు గ్రహించడానికి వారిని దండించడానికి దయతో కాపాడడానికి తగిన వాడై ఉంటాడు. అతడు అనుసరించే మంచినీతి అతడిని అణకువ కలవాడినిగా తీర్చిదిద్ది ప్రజలందరిన నీతి మార్గంలో నడిపిస్తుంది. ఆ నీతి వలన రాజు ఇంద్రియాలను , శత్రువులను జయిస్తాడు. గుణశీల పరిక్షల్లో ఉత్తీర్ణులైన వారిని మాత్రమే మంత్రి పదవులలో నియమిస్తాడు. తనయందు నమ్మకం కలిగి ఉన్నవారిని పోషిస్తాడు. రాజు అనుసరించే నీతి ప్రజలకు క్షేమం కలిగిస్తుంది. ధనాన్ని సమకూరుస్తుంది.(ఆంధ్రమహాభారతం, ఆనుశాసనిక పర్వం, పంచమాశ్వాసం,45 వ పద్య భావం).

ఈ వివరాలన్నీ రాజు కు సాధారణ వ్యక్తి కి మధ్య వ్యత్యాసాన్ని తెలుపుతుంది ఎందుకంటే ఒక అధికారం లో ఉన్న వ్యక్తి స్వీకరించే బాధ్యతలకు , ఇంటి యజమాని స్వీకరించే బాధ్యతలకు చాలా భేదం ఉంటుంది. ఇంటి యజమాని తన సంసారాన్ని చక్కదిద్దుకోగలడు, అదే రాజు సమాజాన్ని మార్చగలడు. అందుకే రాజు గొప్పవాడు ఆ అధికారం లోకి వచ్చిన ఏ వ్యక్తి అయినా ప్రతి అడుగు జాగ్రత్తగా వేయాలి. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా సమాజమే క్షీణిస్తుంది.

క. ఉద్యోగము ప్రియవాదిత/ విద్యా పరినిష్ఠ సంధి విగ్రహ విహతా

వద్యత దీనానాథ వి/ పద్యాపన మాజ్ఞవెరవు వాటించుఁదగన్

రాజు అయిన వాడు నిత్యం ప్రయత్నశీలుడై ఉండాలి. ఎప్పుడు ప్రియంగానే మాట్లాడాలి, విద్య యందు శ్రద్ధాసక్తులు కలిగి ఉండాలి, సంధి విగ్రహాదుల వలన

కలిగినటువంటి దోషాలను ఎప్పటికప్పుడు పోగొట్టుకుంటూ ఉండాలి. పేదవారి యొక్క బాధలను ఆపదలను తొలగించాలి సేవకులకు ఆజ్ఞలిచ్చి చాతుర్యంతో పని చేయించుకోవాలి ఇవి రాజులు అనుసరించవలసిన ప్రధాన ధర్మాలు.

ఈ అధ్యాయంలో రాజు, రాజ్యం, రాజ్య పరిపాలన సంబంధిత విషయాలను చర్చించాను.రాజు పుట్టుక నుండి రాజ్య విస్తరణకు రాజులు అనుసరించే విధివిధానాలను ఈ అధ్యాయంలో వివరించాను.గణజనుల గురించి రాజు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి, శ్రీకృష్ణ, ధర్మరాజు, ద్రౌపది వీరు ఉపయోగించిన రాజనీతి గురించి ఈ అధ్యాయంలో వివరించాను.కౌటిల్యుడు రాజనీతి విధానాలను, మాకియోవెల్లి భావాలు కణికనీతితో సమానమైన పోలికలతో ఉన్నాయని ఉదాహరణలతో వివరించాను.

తర్వాతి అధ్యాయంలో రాజనీతిని వివరిస్తూనే రాజనీతికి సంబంధించిన కథలను కొన్నింటిని వివరిస్తాను.

ఐదవ అధ్యాయం

# రాజనీతి కథలు – రాజకీయ వ్యవస్థ

## 5.1.మహాభారతం చారిత్రక దృష్టి:

చరిత్ర ఎప్పుడూ నిజమైనదే.

గతించిన సంఘటనలు పోరాటాలు, భవిష్యత్తు తరాలు వారు అనుసరించవలసిన విధానాలను ఏర్పరుస్తుంది. జరిగిపోయిన సమాజంలోని ప్రజల మానసిక ప్రవర్తన కాలం మారే కొద్దీ అనేక కొత్త రూపురేఖలు సంతరించుకుంటుంది. దానిని దృష్టి లో పెట్టుకుని ప్రస్తుత సమాజంలోని వ్యక్తుల జీవన విధానాలను అనుసరించి వారి మానసిక స్థితికి అనుగుణంగా పరిశోధనలు, రచనలు వచ్చినప్పుడే సమాజం పురోగతి చెంది ప్రజలు జ్ఞానంతో జీవించడం నేర్చుకుంటారు.

మహాభారతం జరిగింది అనడానికి చారిత్రక దృష్టితో చూసినప్పుడు కొన్ని వివరాలు గమనించదగినవి.

ఈ 21 వ శతాబ్దం లో ఉత్తర భారతదేశం లో జరిగిన ఒక గొప్ప అన్వేషణ పేరే సినౌలి సీక్రెట్.ఉత్తర భారతదేశం లో జరుగుతున్న త్రవ్వకాలు, అధ్యయనాల ద్వారా ఒక మహా చరిత్ర (Mahabharat) తనంతట తానే బయటకు వచ్చేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. మూడు సంవత్సరాల పాటు లక్షకు పైగా శ్లోకాలతో వేద వ్యాస మహర్షి ద్వారా విరచితమయిన భారతం నిజంగానే జరిగిందనే వాదన కు బలం చేకూర్చే తిరుగులేని సాక్ష్యాలు ప్రపంచాన్ని విస్మయ పరుస్తున్నాయి. భారతం, మనకు చరిత్ర ప్రసాదించిన ఒక మహా గ్రంథం (Mahabharat) . ఈ మహా గ్రంథాన్ని అర్థం చేసుకోవడం లో ఇప్పటికీ ఎవరి ఆలోచనలు వారివి.1950 నుంచి 1960 వరకు ప్రచారం లో వెస్ట్రన్ థియరీ ద్వారా భారతదేశం చరిత్ర అణిచివేత కి గురయింది. చరిత్రను పక్కదారి పట్టించారు. ఇది చారిత్రక గ్రంథంగా గుర్తించకపోవడం, ఒక మతానికి సంబంధించినదిగా జరిగిన ప్రచారం కారణంగా ప్రపంచం కళ్ళు తెరవకముందే జరిగిన ఒక గ్రేట్ సివిలియన్

ఎపిక్ ను అవమానకర రీతిలో రామాయణం కు రంకు, అని భారతం బొంకు అన్న అర్థం లేని సామెతలను వ్యాప్తి లోకి తెచ్చి ఆ మహా గ్రంథాలను పుకిట పురణాలుగా తేల్చే ప్రయత్నం చేశారు. కథల్లోనూ, కావ్యాల్లోను నిజమయిన ప్రదేశాల పేర్లను ప్రస్తావించడం మనం గమనిస్తూ ఉంటాం. త్రవకాల్లో బయటపడిన ఆధారాలను పరిశోధిస్తే ఆ ప్రదేశాలు సదరు రచనలలో రాసినట్లు గా ఉంటాయి. క్రీస్తు పూర్వం రెండువేల సంవత్సరాలు వరకు ఆర్యుల భాష అయిన సంస్కృతం భారతదేశం లో లేదని మహాభారతం (Mahabharat) లో సన్నివేశాలు కల్పితాలు అంటూ ఒక పెను ప్రచారం జరిగినది, కానీ తాజాగా బయటపడిన రహస్యాలు అసలు ఆర్యుల తీరునే సవాలు చేస్తునాయి. ఆర్యులు ఎక్కడినుంచో రాలేదు, ఆర్యులు భారతదేశం నుంచే ప్రపంచానికి విస్తరించారనే కోణం ఇప్పుడు ప్రకంపనలు రేపుతుంది. నిజానికి మహాభారతం (Mahabharat) లోహ యుగంలో జరిగినది అంటారు. అంటే రాగి ని ఆ కాలంలో ఎక్కువగా వాడారు అన్నమాట, అందుకే దానిని కాపర్ టైమ్ అనుకోవచ్చు. అందుకే ఎక్కడ చూసిన రాగి లోహాన్ని అన్నీ రకాలుగా వాడే యుగంలో మహాభారతం కొనసాగింది. ఆనాటి కాలం లోనే కాపర్ వల్ల మానవాళికి ఒరిగే లాభం గురుంచి ఆలోచించారని అనుకోవచ్చు. సినౌలీ అన్నది ఉత్తర ప్రదేశ్ లోని ఒక ప్రాంతం, మహా భారతం (Mahabharat) ఉత్తరాదిన జరిగిందన్న విషయాన్ని బలపరిచేలా అన్ని ఉదాహరణలు అక్కడే కనిపిస్తాయి. https://latests.in/mahabharat-place-2021-sources-in-north-india.html

ఇతిహాసాలు, పురాణాలు వీటి గురించిన సత్యాన్వేషణ నిరంతరం జరుగుతున్నప్పుడే ప్రజలు నిజాలను , ధర్మాలను తెలుసుకోగలుగుతారు. చాలా మంది సత్యాన్వేషణ చేయక మాకు తెలిసినదే ధర్మం అంటూ మాట్లాడేవారు ఎక్కువ గా ఉన్నంత కాలం సత్యాన్ని గ్రహించలేరు. ఏమాత్రం పురాణాల మీద పట్టు లేకుండా ప్రామాణికతను చూపకుండా మిడి మిడి జ్ఞానంతో సత్యాలను మరుగుపరిస్తే తర్వాతి తరాల వారికి ధర్మం మీద సత్యం మీద ఆసక్తి తగ్గి అక్రమాలకు, దురాచారాలకు పాల్పడే అవకాశం ఉంది. పై

వివరించిన విధంగా ఇంకా లెక్కలేనన్ని పరిశోధనలు జరిగినప్పుడే , కూలంకష చర్చ జరిగినప్పుడే మన హైందవ సంస్కృతిని కాపాడుకోగలుగుతాము.

## 5.2. రాజనీతి కథలు – పరిచయం:

ప్రజలు రాజు పరిపాలనలో సురక్షితంగా ఉన్నప్పటికి ప్రతి ఒక్కరు రాజనీతి కి సంబంధించిన విషయాలను తెలుసుకోవల్సిన అవసరం ఉంది. మనల్ని పరిపాలించే రాజు యొక్క మానసిక స్థితి ఎలా ఉంది వారు ప్రజల్ని ఏ విధంగా ప్రణాళికలు వేసి పరిపాలిస్తున్నారు. దండనీతి ని ఏ విధంగా అమలు చేస్తారు వంటి అనేక రాజనీతి సంబంధించిన అంశాలను ప్రజలందరూ తెలుసుకోవల్సిన బాధ్యత ప్రజలకు ఉండాలి. అయితే వాటిని ప్రత్యక్షంగా ప్రజలకు చర్చల ద్వారా చెపితే వారి మనసు లగ్నమవ్వడానికి అవకాశాలు ఎక్కువగా ఉండవు రాజనీతిలో రాజు హృదయం రాజు దగ్గర పనిచేసే వారి ప్రవర్తన ఎలా ఉండాలి వంటి అంశాలు కథల ద్వారా తెలియజేయగలిగితే వారు ఆ కథలను ఆకళింపుచేసుకోవడమే కాకుండా ఆ కథలోని నీతిని గ్రహించి రాజరిక వ్యవస్థ ఈ విధంగా ఉంటుందా అనే ఒక ఆలోచన వారిలో కలుగుతుంది. అలా కలగడం వలన వారు రాజును రక్షించడానికి వారి వంతు సహాయం చేయడం కాని లేదా రాజు దగ్గర ఎలా మెలగాలో ఆ రకంగా తమ ప్రవర్తనను మార్చుకోవడం గాని చేస్తారు ఇలా ప్రతి ఒక్కరు భావించడం వలన సమాజపురోగతి జరుగుతుంది.

మహాభారతంలో రాజనీతి సంబంధిత కథలను కొన్నింటిని ఈ క్రింది తెలియజేస్తున్నాను.

## 5.3. సుద్యుమ్న చరిత్ర:

దండనీతి యొక్క గొప్పతనాన్ని ధర్మరాజుకు వ్యాసుడు వివరిస్తున్నాడు. *అందులో భాగంగా సుద్యుమ్న చరిత్ర ను చెప్తాడు. బాహుదానది తీరంలో ధర్మ స్వరూపం కలిగిన శంఖుడు, లిఖితుడు అనే పేర్లు కల అన్నదమ్ములైన బ్రాహ్మణోత్తములు ఉన్నారు. వీరికి రెండు ఆశ్రమాలు ఉన్నాయి. వీరి ఆశ్రమాలు పండ్లు, పూలతోనూ, నిండి ఉంటాయి*

ఒకసారి శంఖుడు ఇంటి దగ్గర లేని సమయం చూసి లిఖితుడు అక్కడికి వెళ్ళి చెట్టున ఉన్న పళ్ళను చూచి ముచ్చటపడి కోసుకుని తింటాడు. అంతలో అక్కడికి వచ్చిన శంఖుడు ఆ పండ్లు ఎక్కడవని ప్రశ్నించాడు. దానికి లిఖితుడు ఆచమించి అన్నకు నమస్కరించి ఇక్కడివే అని సమాధానం ఇచ్చాడు. శంఖుడు తన అనుమతి లేకుండా కోయకూడదు అలా కోసావు కాబట్టి ఇది దొంగతనంతో సమానం ఈ పాపాన్ని పోగొట్టడానికి రాజు చేత శిక్షించబడి పాపాన్ని పోగొట్టుకోమని చెప్తాడు. రాజు దగ్గరికి వెళ్ళి నువ్వు చేసిన పని తప్పని చెప్పి దండించమని అడుగమని  తమ్ముడితో అంటాడు. అతడు తన తప్పు తెలుసుకున్నవాడై సరేనని సుద్యమ్న అనే రాజు వద్దకు వెళ్తాడు. లిఖితుడు వచ్చిన విషయం తెలుసుకుని రాజు స్వయంగా మంత్రులందరితో కలసి అతని వద్దకు వచ్చి కారణాన్ని తెలుపుతారు దానికి లిఖితుడు నా అన్న అనుమతి లేకుండా అతడు చెట్టు పళ్ళు కోసుకుని తిన్నాను. దానిని మీ చేత శిక్షను అనుభవించి పాపరహితుడు కావాలి అనుకుంటున్నాను రాజ దండన పొందిన వాడికి యమదండన ఉండదని చెప్తారు. కాబట్టి శిక్షించమని అడుగుతాడు. రాజుకు  ఇష్టం లేక పోయినప్పటికి ఆ పాపానికి తగిన శిక్షగా రెండు చేతులు నరికించి వేస్తాడు. దానితో లిఖితుడు రాజును ఆశీర్వదించి అన్న దగ్గరకు వెళతారు అన్న లిఖితుడు చేసిన దానికి సంతోషించి ప్రాయశ్చిత్తం చేసుకున్నావు కదా నీవలన వంశం ప్రకాశిస్తుంది వెళ్ళి బాహుదానదిలోని పుణ్యప్రదమైన నీటిలో దేవతలకు , మునులకు పితరులకు తర్పణాలు ఇవ్వమని చెప్తాడు.

సురాపానం, గురుపత్నిని కోరడం, బ్రాహ్మణుడిని చంపడం బ్రాహ్మణుల ధనాన్ని దొంగిలించడం, ఈ నాలుగు లక్షణాలు కలవారితో ఇష్టంతో కలిసి ఉండటం మహాపాపాలు. ఈ ఐదు మహాపాతకాలలో ఏ ఒక్కటి చేసినా ఏ వర్ణస్థుడైనా దండించడానికి తగినవాడే కాబట్టి రాజు దండన పొందిన వారు పుణ్యాత్ముల వలె పుణ్య లోకాలకు వెళ్తారు. నీవు సుద్యుమ్న మహారాజు చేత దండన పొందావు కనుక పుణ్యాత్ముడివి పరమపావనుడివి అయ్యావు. దానికి సంతోషించి ఇక వెళ్ళు అనగా బాహుదా నదిలో మునగగానే లిఖితుడికి చేతులు వస్తాయి.శంఖుడు ఇది నా తపో మహిమ వలనే ఇలా

*జరిగిందని  భగవంతుడు అద్భుతం చేసాడు నీవు పరిశుద్ధుడువు అయ్యావని చెప్తాడు. కాబట్టి ధర్మరాజా రాజనీతిలో దండన ప్రాధాన్యత వహించిందని చెప్తాడు. (ఆంధ్ర మహాభారతం, శాంతి పర్వం, ప్రథమాశ్వాసం, పుట: 63.)*

ఈ కథను బట్టి రాజు యొక్క దండన చేతనే ధర్మం నిలబడుతుంది. దొంగతనానికే చేతులు నరికేశిక్ష ఆనాటి కాలంలో ఉంది అంటే నేటి  కాలంలో దొంగతనం కంటే ఎక్కువ నేరాలు చేసిన వారికి ఎటువంటి శిక్ష వేయాలో తెలుసుకోవాలి. ఆనాడు శిక్షలు అంత కఠినంగా ఉన్నాయి కాబట్టే ప్రజల్లో భయం కలిగి ధర్మం మీద ఆసక్తి చూపేవారు దొంగతనాలు వంటి నేరాలకు పాల్పడే వారు కాదని అర్థమవుతుంది. దండన అనేది మనిషి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే ప్రక్రియ అది రాజు చేత సాధ్యమవుతుంది. కాబట్టి వ్యాసుడు ధర్మరాజును రాజ్యం యొక్క పగ్గాలను స్వీకరించి రాజ్యాన్ని పరిపాలించమంటాడు.

### 5.3.1. సుద్యుమ్న చరిత్ర – చర్చ

పుట్టపర్తి నారాయణాచార్యులు **'మహాభారత విమర్శనము "** గ్రంథములో ఈ కథని వివరణాత్మకంగా తెలియజేస్తారు.  **ధర్మదృష్టి గల ఒక జాతిపై మరలా రాజు కల్పించుకొన చేయవలసిన విచారణం ఏమిలేదని అందుకు వారు నిందింపతగిన వారు కాదని బ్రతకడానికి తాము ఎవరిని ఆశ్రయించక పేదరికాన్నే అనుభవిస్తూ లోక కల్యాణమును ఆ జాతి బ్రదుకుచుండెను. అట్టి వారిపై ఈర్ష్య ఎవరికి ఉండదు. ఇటువంటి జాతి నశించినప్పుడు భారత సంస్కృతి నశిస్తుందని చెప్తాడు. (నారాయణా చార్యులు, పుట్టపర్తి, మహాభారత విమర్శనము,(ప్ర.భా), పుట:42.).**

వీరి మాటల్లో బ్రాహ్మణుడనే వాడు ధర్మపరుడైతే ఆ రాజ్యం కూడా ధర్మంతో కూడి ఉంటుంది. ఈ కథలో బ్రాహ్మణుడు లిఖితుడు తనకు తగిన శిక్షను వేయమని చెప్పినప్పుడు రాజు అతని ధర్మప్రవృత్తికి శిక్ష వేయవలసిన అవసరం లేదని చెప్తాడు. కాని అతని పట్టుదలను గమనించి అతని చేతులు నరికించి వేయించాడు. బ్రాహ్మణుడు ధర్మవిచారణ తెలిసిన వాడు కాబట్టి రాజ ధర్మాన్ని నిర్వర్తింపచేసాడు. రాజు యొక్క కర్తవ్యాన్ని

అమలుపరిచేలా చేసాడు. ఇటువంటి బ్రాహ్మణులు నశించకూడదు అటువంటి వారి ఉన్నతిని సమాజం కోరుకోవాలని వీరి మాటల వలన తెలుస్తుంది.

## 5.4. కాలక వృక్షీయ క్షేమ దర్శి సంవాదం :

రాచరిక వ్యవస్థలో రాజు ఎన్నో సవాళ్లను ఎదుర్కోవాలి. అందులో చాలా మంది రాజుకు కీడు చేయడానికి ఆ సమయం కోసం ఎదురు చూస్తూ ఉంటారు. తమ బలాన్ని చూపి భయపెడుతూ ఉంటారు. దుష్టులైన అలాంటి వారిని కనిపెట్టి రాజు వారిని నాశనం చేయడం రాజనీతి అని భీష్ముడు ధర్మరాజుకు చెప్తాడు అంతేకాదు రాజుకు ధనార్జన పరుడైన వ్యక్తి ఎంతో అవసరం దాని కోసం ఒకరిని నియమించినప్పుడు అతనికి కూడా కీడు చేయాలని చూస్తూ ఉండే దుర్మార్గులు ఉంటారు. రాజు ఆ విషయాన్ని గ్రహించి అవధాన పరతత్వంతో అతడిని సంరక్షించుకోవడం చాలా అవసరం రాజుకు జాగ్రత్త అవసరం ఇందుకు తగిన కథ కాలక వృక్షీయ , క్షేమదర్శికి మధ్య జరిగిన సంవాదం ద్వారా తెలుసుకోవచ్చు.

‘‘కాలక వృక్షీయుడు అనే ఒక ముని అతడు కోసలాధిపతి క్షేమదర్శి రాజ్యానికి వెళ్లాడు. పంజరంలో ఉంచిన కాకిని చూపుతూ **‘ఇది త్రికాలవేది’** అనేవాడు కాకిని రాజుకు చూపించి ధనాన్ని సంపాదించడంలో నీకు ఏమరపాటు ఉన్నది దాని వలన అనేకమైన ఆపదలకలుగుతాయి. అటువంటి ఆపదలు కలగకుండా ఉండడానికి ఈ కాకి రాజుకు ఆపదలను తెలియజేస్తూ రాజును మేల్కొల్పుతుందని చెప్పి ఆ ముని తన నివాసానికి వెళ్ళిపోతాడు ఆ రాత్రికి రాత్రే రాజాధికారులు కొంతమంది ఆ కాకిని ఒక ఉపాయంతో చంపుతారు. ఆ రహస్యాన్ని కాలకవృక్షీయుడు రాజుకు తెలియజేసాడు. ఈ విధంగా అధికారుల మోసం వలన కాకి చంపబడటాన్ని ఉదాహరణ పూర్వంకంగా నిరూపించి తాను రాజు తండ్రికి మిత్రుడునని అతడి మరణించిన తరువాత అధర్మపరుల గల ఈ దేశంలో నివసించడం ఇష్టం లేక అరణ్యంలో తపస్సు చేసుకుంటూ వచ్చానని రాజు మీద ప్రేమతో అతనికి హితబోధ చేయడానికి వచ్చానని చెప్తాడు. నేను ఆడిన నాటకంలో కాకి చంపబడింది అంటే నీకు దాని వలన రాజ్యాధికారుల్లో మోసగాళ్ళు ఉన్నారన్న విషయం

నీకు అర్థమవుతుంది.  అంతేకాకుండా మోసకారులైన రాజాధికారులకు నేర్పుతో వారిలో వారికే విరోధాలు కల్పించి వాళ్ళ సంతోషాన్ని భంగపరచి ఒక్కొక్కళ్ళను శిక్షించమని చెప్తాడు. అలాగే క్షేమదర్శి వారిని శిక్షించి అతడిని మంత్రి గా నియమించి అతడి సలహాలతో రాజ్యపాలన కొనసాగిస్తాడు. (ఆంధ్ర మహాభారతం, శాంతి పర్వం, ద్వితియాశ్వాసం, 363 వ పద్యం నుండి.)

ఆ కథ వలన రాజు ధనాన్ని ఆర్జించడం అతని కర్తవ్యం దాని వలన రాజ్యం అభివృద్ధి చెందుతుంది. లేదంటే అక్కడున్న రాజ్యాధికారులు రాజు యొక్క  ఏమరుపాటును గ్రహించి ఖజానాను ఖాళి చేయించగలరు దీని వలన అపార నష్టం కలుగుతుంది. కాబట్టి అటువంటి ప్రమాదకరమైన వ్యక్తులను తొందరగా గుర్తించి శిక్షించడం వలన రాజ్యం సుభిక్షంగా ఉంటుందని ఈ కథ ద్వారా తెలుస్తుంది.

### 5.4.1. **సంస్కృత భారతం లో ఉన్న కాలక వృక్షీయ క్షేమ దర్శి కథ:**

సంస్కృత భారతంలో ఈ కథ ఈ విధంగా చెప్పబడుతుంది. ప్రధాన సారాంశం ఒక్కటే అయినప్పటికి కాలకవృక్షీయ ముని చెప్పిన అనేక మాటలు ఆంధ్ర మహాభారతంలో ప్రస్తావించబడవు వాటిలో కొన్నిటిని ప్రస్తావిస్తూ ధర్మారాజు అడిగిన ప్రశ్నకు భీష్ముడు కథ ద్వారా ఇచ్చిన సమాధానాన్ని క్లుప్తంగా పేర్కుంటున్నాను.

ధర్మారాజుకు భీష్ముడు చెపుతున్నాడు. ఎవరయినా రాజు యొక్క ధనం వృద్ధి చేస్తే రాజు వానిని సదా రక్షించాలి. రాజు యొక్క ధనాన్ని మంత్రి అపహరిస్తూ ఉండడం సేవకుడూ, మరొకడో చూసి రాజుకు చెపితే అది రాజు రహస్యంగా వినాలి. వెంటనే అతనిని మంత్రినుండి రక్షించాలి. మంత్రి ఇంకా అపహరించే వాళ్ళూ కలిసి ఈ చెప్పిన వానిని చంపేస్తారు, అలాగే కోశాధికారిని కూడా రక్షించాలి అతనిని రక్షించకపోతే రాజధనం అపహరించే వాళ్లంతా కలిసి కోశాధికారిని బాధిస్తారని చెపుతూ దానికి ఉదాహరణగా కాలకవృక్షీయము అనే కథను చెప్తారు, కాలకవృక్షీయుడు అనే  ముని కోసల రాజుతో చెప్పిన కథను తెలియజేస్తాడు. ఆ కథలో కోసల రాజ్యం క్షేమదర్శికి సంక్రమించింది. అప్పుడు క్షేమదర్శి దగ్గరకు కాలకవృక్షీయ ముని వచ్చాడు. అతడు ఒక

కాకిని పంజరంలో బంధించి ఒక పని కోసం క్షేమ దర్శియొక్క రాజ్యంలో మాటిమాటికి తిరుగుతున్నాడు. అయ్యా ఈ కాకి విద్యను నేర్చుకోండి ఈ కాకి భూత భవిష్యత్ వర్తమానాలు చెపుతాయి. ఇలా చెపుతూ చాలామందితో కలిసి రాష్ట్రం అంతా తిరుగుతూ రాజోద్యోగుల చెడ్డపనులన్నీ ఆ ముని చూస్తాడు. కోసల రాజును చేరి అలంకారాలు ధరించిన మంత్రి ఎదుట నిలుచుకుని కాకి మాటగా నీవు రాజు యొక్క కోశాగారం దొంగిలించావు వీడు ఎరుగును అని కాకి చెప్తుంది. రాజధనం అపహరణ కు గురైన విషయం నిజమని తెలిసి రాజోద్యోగులు తిరస్కరించబడుతారు. వారంతా కాకి మీద పగ తీర్చుకోదలచి చీకట్లో నిద్రిస్తున్న అతని కాకిని పంజరంలోనే బాణాలతో పొడిచి చంపుతారు. అది చూసి బ్రాహ్మణుడు రాజుకు కొన్ని రాజనీతి విషయాలు తెలియజేస్తాడు. హితులెవరో, శత్రువులెవరో తెలుసుకోండి నీ భవనంలో ఉండి నీ నుండి దొంగలించే వారిని గురించి అటువంటి వారిని ఉద్దేశించి చెపుతున్నాను. వారు ప్రజల ఐశ్వర్యాన్ని కోరరు. నీ వినాశం చేత నీ తరువాతి రాజ్యం కోరే వాడుంటే నీ ఆంతరంగికుల వల్లనే ఆ వినాశం సిద్ధిస్తుందని చెప్పి రాజుకు కొన్ని రాజనీతి విషయాలను ప్రస్తావిస్తాడు. అందులో ప్రధానంగా రాజు ఎటువంటి ఆపదలో ఉన్నాడో వివరిస్తాడు. దానికి ఉదాహరణలను కొన్ని చూపుతూ కుక్కలు గ్రద్దలు నక్కలతో కూడిన రాజహంస లాంటి వాడు రాజని, ఒక పెద్ద చెట్టును ఆశ్రయించుకుని పొద పెరుగుతుంది. కొంతకాలానికి ఆ పొద పెరిగి వృక్షం కనబడనంతగా అల్లుకుపోతుంది. ఆ పొదయే చివరకు ఇంధనంగా మారి దావాగ్ని విజృంభించడంతో వృక్షాన్ని బూడిద చేస్తుందని చెప్పి రాజు ను చుట్టముట్టిన మంత్రులు పొదలాంటి వారని వారిని కనిపెట్టమని చెప్తాడు. అటువంటి వారిని విచక్షణ లేకుండా నీవే నియమించావు నీవే పరిపాలిస్తున్నావు. కాని నిన్ను వారు మోసగించి నీకు ఇష్టమైన దానిని నీకు లేకుండా చేస్తున్నారని చెప్తాడు ఆ ముని వచ్చిన కారణాన్ని చెపుతూ ఈ రాజు ఇంద్రియాలను గెలిచినవాడేనా? తన ఉద్యోగంలో తన వశంలో ఉన్నాడా? ప్రజలకు రాజు ప్రియంగా ఉన్నాడా? లేక రాజుకు ప్రజలు ప్రియంగా ఉన్నారా? ఈ విషయాలను తెలుసుకోవడానికి వచ్చానని చెప్తాడు. ఇక్కడకు వచ్చిన తరువాత నీ మంత్రుల దుష్ట

ఆలోచనలు బయటపడ్డాయి నేను ప్రమాదంలో ఇరుక్కున్నానని  చెప్తాడు. రహస్యం బయట పడినందువలన ప్రమాదం ఉంది కాబట్టి వారిని వెంటనే శిక్షించమని చెప్తాడు. అతని మాటను విన్న రాజు ఆ మునిని అనుసరించి అతని మాటలకే ప్రాధాన్యం ఇచ్చి  వారిని శిక్షించి కీర్తిని పొందాడు.  (సంస్కృత భారతం,శాంతి పర్వం, ఎనభైమూడవ అధ్యాయం).

ఈ కథ ద్వారా రెండు విషయాలు స్పష్టమవుతాయి ఒకటి రాజు దగ్గరే ఉండి మోసానికి సిద్ధపడిన మంత్రులను రాజు తెలుసుకోకపోవడం వలన కలిగే నష్టం, రెండవది రాజు యొక్క బాధ్యతలు రాజు యొక్క గొప్పతనం తెలుసుకున్న కాలకవృక్షీయ ముని రాజు మేలు కోరి రాజు పరిపాలనను గమనించి రాజుకు మంచివారు ఎవరో చెడ్డవారు ఎవరో తెలియజేయాలని ప్రయత్నించడం, రాజు మరలా భవిష్యత్తులో మోసపోకుండా ఉండడానికి రాజనీతి విషయాలను తెలియజేసి రాజు కర్తవ్యాన్ని ధర్మంగా అమలుపర్చేలా చేయడం వంటి విషయాలు ఈ కథ ద్వారా అర్థమవుతుంది.

### 5.5. జనక సులభ సంవాదం:

రాజంటే రాజ్య పరిపాలనతో పాటు కుటుంబాన్ని కూడా కలిగి ఉంటాడు. అంటే రాజు గృహస్థాశ్రమ ధర్మాన్ని నిర్వహిస్తూనే రాజ్య పరిపాలన కొనసాగించాలి. రాజ్యం అధీనంలో ఉన్న రాజుకు ధర్మార్థకామాలను జయించి మోక్షాన్ని పొందడం సాధ్యం కాదు. ధర్మరాజు అడుగుతున్నాడు భీష్ముడిని గృహస్థ ధర్మాన్ని వదలకుండా మోక్షం పొందవచ్చునా అని అడుగగా భీష్ముడు ధర్మరాజుకు జనక, సులభ మధ్య జరిగిన సంవాదాన్ని వివరిస్తాడు యోగ ధర్మాలను ఒక వ్యసనం లాగా ఆదరిస్తున్న జనక మహారాజును పరిక్షించాలని అతడి జ్ఞానం తాలూకు  లోతు ఎంతో తెలుసుకోవాలని ఆవిడకు ఒక కోరిక కలిగింది. ఆమె యోగ ప్రభావంతో చిక్కిపోయిన తన శరీరాన్ని మరుగుపరిచి అందమైన శరీరాన్ని తెచ్చిపెట్టుకుని జనకుడి వద్దకు వెళ్ళి తాను భిక్షుకి అన్నట్లుగా జనకుడితో మాట్లాడి జనకుని ఆతిథ్యాన్ని స్వీకరించింది. జనకుడిని పరిక్షిద్దామని తన చేష్టలతో మన్మథ వికారాన్ని కలిగించబోయింది. దానికి జనకుడు నేను పంచశిఖుడు అనే మునీశ్వరునికి నేను శిష్యుడను ఆయన నాకు సాంఖ్యంలోనూ యోగంలోనూ

రాజ్యపరిపాలనలోనూ ఈ మూడింటి ముక్తి పొందే మార్గాలు ఉపదేశించాడు. అందుచేత ఎటువంటి సందేహం లేకుండా ఈ మూడు మార్గాల్లోనూ పరమాత్మకు సన్నిహితంగా ఉంటున్నాను. ముక్తికి జ్ఞానంతో కూడిన వైరాగ్యం మూలమని విరక్తి నీ అంతరంగంలో ఉండడం వలన సుఖదుఃఖాలు రాగద్వేషాలు వంటి ద్వంద్వాలను అతీతంగా జీవించగలుగుతున్నాను ఇలా సులభ మీద శ్రద్ధ లేకుండా మాట్లాడుతున్న జనకమహారాజుతో వీరు శత్రువులని వారు మిత్రులని వీరు మధ్యస్థులని జనులను విభజించి చూస్తూ వాళ్ళ మీద విజయం సాధించడానికి ఆరు రకాల రాజనీతి ఉపాయాలను పన్నుతూ ఉండే రాజు నిజమైన జ్ఞాని ఎలా అవుతాడు. ముక్తి మార్గం ఇలానే ఉంటుంది. కాబట్టి నీవు ముక్తి పొందడానికి అర్హుడు కావు నిన్ను నీవు ముక్తిగా భావించుకోవడమనేది మానసిక రుగ్మత అని చెప్తుంది. అంతే కాకుండా ఏ విధంగా ముక్తి పొందేవాడవు గావో చెపుతూ రాజ్యం యొక్క పద్ధతిని చెప్తుంది.

*సీ. వర్గ త్రయంబున వలనను సప్తాంగ / ముల యందు జిత్తంబు మెలగుచుండ*
*రాజులు మజ్జన భోజన నిద్రావ / సరములు లోనుగా జనులు సేయు*
*విజ్ఞాపనము విని యాజ్ఞాపనం బొన / రించుచు మంత్రులు బ్రేమ పాత్ర*
*తరుణులు న స్వతంత్రత జేయనర్థుల / కొసరి తిండియు ధనగుప్తిమీఁది*
*తే. భరముఁదమలో విరోధులై పట్టి మనసు*
*జిక్కువఱుపంగఁ జెక్కుంద్రు సిరికి నడువ*
*బరి హరించుచు బహుదుఃఖ పరులు నల్ప*
*సౌఖ్యులును నగుచునికి రాజ్యంబు తెఱఁగు.*

'' రాజుల హృదయంలో ఎప్పుడూ వర్గత్రయ కాంక్ష (ధర్మార్థకామ) పై కోరిక, సప్తాంగాల పైన జాగ్రత్త ఇవే ఉంటాయి వారి స్నాన సంధ్యాదులు దాస దాసీ జనం గుర్తుచేస్తే జరుగుతాయి. మంత్రులు తరుణులూ రాజులను పూర్తిగా అస్వతంత్రులను చేసేస్తారు. ధనాగారం కాపాడుకోవడం ఒక వైపు అర్థులకు దానం చెయ్యడం మరొక వైపు రాజుల మనస్సులను పట్టిపీడిస్తూ ఉంటాయి. తన సిరికి ఆశపడేవాళ్ళను పరిహరించడం

ఒక బాధ్యత మొత్తం మీద పరిపాలకులకు దుఃఖాలు ఎక్కువ సౌఖ్యాలు తక్కువ ఇది రాజ్యం పద్ధతి దీని వలన ముక్తి కోసం ప్రయత్నించడం కష్టమని చెప్తుంది. (ఆంధ్రమహాభారతం, శాంతి పర్వం, షష్ఠాశ్వాసం, 200 వ పద్యం).

### 5.5.1. సంస్కృత భారతం జనక సులభ సంవాదం:

సంస్కృతభారతంలో కూడా ఇదే విషయాలను సులభ ప్రస్తావిస్తుంది. అయితే అందులో మరికొన్ని లోతైన విషయాలను చెప్తుంది.

*' నాస్త్యా సాధారణో రాజా నాస్తి రాజ్యమరాజకమ్*

*రాజ్యేసతి కుతో ధర్మః ధర్మే2సతి కుతః పరమ్( సంస్కృత భారతం, శాంతి పర్వం,320 అధ్యాయం,పుట: 1021.)*

సాధారణ ప్రజలు లేకపోతే ఎవడూ రాజు కాలేదు రాజు లేకపోతే రాజ్యం నిలువదు. రాజ్యం లేకపోతే ధర్మం ఎక్కడ ఉంటుంది. ధర్మం లేకపోతే పరమాత్మ ప్రాప్తి ఎలా కలుగుతుంది.

ఇలా ప్రశ్నించడంలో రాజధర్మాన్ని ఆశ్రయించిన వారికి పరమాత్మను ఎలా పూర్తిగా దర్శించకలుగుతాడని అంటుంది. ప్రజలు లేకపోతే రాజు పరిపాలన సాగించడం కష్టం ప్రజలచేత ఏర్పడిన రాజ్యం నిలవాలంటే రాజు తప్పని సరిగా ఉండితీరాలి. రాజ్యం లేకపోతే అధర్మాన్ని నిర్మూలించే శక్తి రాజుకు ఉంటుంది కావున ధర్మమనేది రాజ్యం లేకపోతే నిలువదని పై మాటల్లో అర్థమవుతుంది. ఈవిధంగా జనక సులభ సంవాదంలో రాజ్యం పైన గల చర్చ జరుగుతుంది.

### 5.6. కణికుడు చెప్పిన కూట నీతి కథ:

ధృతరాష్ట్రుడు శత్రువును సామ, దాన,భేద, దండోపాయాలతో ఎలా చంపగలం, దానిని నాకు యథాతథంగా చెప్పు. అనగా కణికుడు అడవిలో నివసిస్తున్న ఒక నక్క కథను చెపుతాడు.

ఒక అడవిలో స్వార్థపూరితమైన ఒక నక్క ఉండేది. దానికి పులి, ఎలుక, తోడేలు, నెమలి. మిత్రులుగా ఉన్నారు. అవి అన్ని కలిసి ఒక జింకల రాజును చూచాయి. అది

బలిష్ఠమైనది దానిని పట్టుకోవడం కుదరక అవన్నీ కలిసి ఒక ఉపాయం ఆలోచించాయి. నక్క పులితో అడవిలో దీనిని చంపడానికి నేను ఎన్నో సార్లు ప్రయత్నించాను. అది తెలివైనది వయస్సులో ఉన్నది. యౌవనంలో ఉన్నది కాబట్టి వేగంగా పరుగెత్తగలదు. పట్టుకోవడం వీలు కాదు అది నిదురిస్తున్న సమయంలో ఈ ఎలుక వెళ్ళి దాని పాదాలు కొరకాలి. అప్పుడు అది వేగంగా పరిగెత్తలేదు ఆపై పులి దానిని పట్టుకోవాలి. అప్పుడు అందరమూ ఆనందంగా దానిని తిందాము అనగా అవన్నీ అలాగే చేసాయి. పులి జింకను చంపేసింది. నక్క అందరూ నా ఉపాయాన్ని బాగా చేసారు స్నానం చేసి రండి అప్పటిదాకా దీనిని నేను కాపాడుతానని పలికింది. ఆపై నక్క మాటవిని అన్ని జంతువులు నది దగ్గరకు వెళ్ళాయి. తీవ్రంగా ఆలోచిస్తూ నక్క అక్కడే ఉండిపోయింది. ముందుగా పులి అక్కడకు వచ్చి నక్కను ఏమిటి విచారిస్తున్నావు మన అందరిలో నీవే తెలివైనవాడివి ఈ రోజు ఈ మాంసం తిని హాయిగా తిరగవచ్చు. అనగా నక్క ఎలుక నాకు ఈ మాట చెప్పింది ఛీ ఈ పులి ది ఏమి బలం ఈ రోజు జింకను నేనే చంపాను నా బాహు బలం మీద ఆధరాపడి ఈ రోజు ఆ పులి ఆకలి తీరబోతుందని ప్రగల్భాలు పలుకుతుంటే దాని సహాయంతో పొందిన ఈ మాంసాన్ని తినాలనిపించడం లేదు అనగానే పులి పౌరుషంతో అయితే నా బాహు బలాన్ని ప్రదర్శించే వాటన్నింటిని చంపి వాటి మాంసాన్ని తింటానని పులి అడవిలోకి వెళ్ళిపోయింది. ఆ సమయంలో ఎలుక అక్కడకు వచ్చింది. దానితో నక్క ఎలుకా ! నెమలి నాతో ఈ మాట అన్నది నేను జింక మాంసం తినను ఇది విషంతో కూడుకున్నది కాబట్టి నేను ఎలుకను తింటాను అనగానే ఎలుక భయపడి పారిపోయి కలుగులో దూరింది. ఆ తర్వాత తోడేలు స్నానం చేసి అక్కడకు వచ్చింది. దానితో నక్క మృగరాజుకు నీమీద బాగా కోపం ఉంది నీకేదో కీడు రాబోతుంది. భార్యతో సహా ఇక్కడకు రాబోతుంది. ఏమి చేస్తే బావుంటుందో ఆలోచించి చేయి అనగానే పచ్చి మాంసం తినే ఆ తోడేలు ఎగిరి దూకి పారిపోయింది.

ఆ సమయంలోనే నెమలి అక్కడకు వచ్చింది. నక్క నెమలితో ఇలా అన్నది. నా బాహు బలానికి ఓడిపోయి మిగిలిన వారంతా ఎటో వెళ్ళిపోయారు. నీవు నాతో యుద్ధం

చేసి గెలిచి స్వేచ్ఛగా మాంసం తినవచ్చు. అనగా నెమలి తోడేలు, తెలివిగల ఎలుక, పులి ఈ వీరులందరిని ఓడించిన నీతో యుద్ధం చేసే ఉత్సాహం లేదని నెమలి కూడా వెళ్ళిపోయింది. ఇవన్నీ వెళ్ళిపోయిన తర్వాత తన ఆలోచన పనిచేసినందుకు ఆనందించి నక్క అప్పుడు ఒంటరిగా మాంసాన్ని భుజించిందని కణికుడు చెప్పి ఈ విధంగా రాజు నిత్యం ఇటువంటి తెలివిని ఉపయోగిస్తూ సుఖంగా ఉండాలి. పిరికి వారిని భయపెట్టాలి, వీరులకు మ్రొక్కి లొంగదీసుకోవాలనిచెప్పి ఇంకా కొన్ని విషయాలను చెప్తాడు. **(సంస్కృత భారతం, శాంతి పర్వం, 160 వ అధ్యాయం).**

ఈ కథ ద్వారా నక్క జింక మాంసాన్ని తాను ఒక్కటే తినాలని భావించింది దానికి తగిన ఉపాయం పన్నీ తన కోరిక నెరవేర్చుకుంది. ఈ కథలో నక్క పరాక్రమవంతమైన పులిని ముందు తగిన ఉపాయంతో దానికి పౌరుషం వచ్చేటట్లు ప్రవర్తించి , అడవికి వెళ్ళిపోయేట్లు చేసింది. తరువాత నెమలి నిన్ను తినాలని కోరుకుంటుందని అబద్ధం చెప్పి ఎలుకను భయపెట్టి దానిని వెడల గొట్టింది. తోడేలుకి పులి వలన ఆపద ఉందని చెప్పి భయపెట్టి పంపేసింది, చివరకు నెమలితో తన భుజ బలం చేత మిగతా జంతువులన్నీ పారిపోయాయని చెప్పి నీతో యుద్ధం చేస్తాను ఎవరు గెలిస్తే వారు ఈ మాంసం తిందాము అని చెప్పగానే నెమలి కూడా నీవు పరాక్రమవంతుడవు నిన్ను నేను గెలవలేనని అది కూడా వెళ్ళిపోతుంది. ఇలా నక్క తెలివితో అందరిని పంపించి తను ఒక్కటే ఆ మాంసం తింటుంది. ఇటువంటి కూటనీతితో రాజు ఉండాలని చెప్తాడు. ఇది స్వార్థపూరితమైన కథ. నిస్వార్థమైన పరిపాలన అందించడానికి ఇలాంటి స్వార్థపూరితమైన కథలు కూడా తెలుసుకోవలసిన అవసరం ఉంది.

### 5.7. వ్యాఘ్ర గోమాయు సంవాదం:

రాజధర్మం రాజు అందరు చెప్పిన మాటలు వినాలి కాని ఏది సత్యమో ఏది అసత్యమో తెలియకుండా శిక్ష విధించడం, చేయరాదు. ఈ సూత్రాన్ని రాజు అవలింబించగలిగితే రాజ్యం బాగుంటుంది . దీనికి సంబంధించిన కథ మహాభారతంలో ఉంది.

రాజు కు ఎవరిని నమ్మాలో ఎవరిని నమ్మకూడదో తెలియకపోతే గొప్ప తెలివితేటలు గల వ్యక్తిని రాజ్యాన్ని రక్షించే మంత్రిని కోల్పోవలసి వస్తుంది దానితో రాజుకు నష్టం కలుగుతుందని తెలియజేసే కథ.

పూర్వజన్మలో పురిక అనే నగరాన్ని పౌరికుడు అనే రాజు పాలించేవాడు అతడు చేసిన పాపముల కారణం చేత పూర్వజన్మ జ్ఞాపకాలతో నక్క జన్మ ఎత్తుతాడు. ఆ రాజు కు పూర్వ జన్మ గుర్తుండడం చేత మాంసాహారాన్ని మాని జీవహింస ను విడిచి పెట్టి జీవనం కొనసాగిస్తున్నది. ఈ విషయం తెలుసుకున్న ఆ అడవి పులి రాజు నక్క దగ్గరకు వచ్చి తనతో ఉండి ఎన్నో సౌఖ్యాలు అనుభవించుము అంటే నక్క నేను సుఖాల మీద ఆశ చూపను నీవు అడుగుతున్నావు కాబట్టి మంచి చెడు తెలియజేస్తూ స్నేహంగా ఉంటాను తర్వాత నీ దగ్గరున్న భృత్యులు ఓర్వలేని తనంతో ఏదైనా చెప్తే అవీ నీవు వినకుండా నా మీద నమ్మకంతో ఉంటేనే ఉంటాను అనగానే పులి సరే అని చెప్పింది. రాజ్య పరిపాలన సజావుగా కొనసాగుతూ ఉంది. నక్క ఊహించినట్లుగానే అక్కడున్న కొంత మంది సేవకులు నక్కకు పులికి భేదం కలిగించాలని నిర్ణయించి పులి రాజు తినే పదార్థాలను భద్రపరిచే బాధ్యత నక్కది కాబట్టి అదే నెపముగా నక్క ఇంట్లో మాంసాన్ని ఉంచి పులికి అనుమానం వచ్చేటట్లు చేసారు. నక్క నిజాయితి పరుడు కాదని తన సేవకులు చెప్పిన మాటలు విని పులి కోపపడుతుంది. నక్కను తీసుకురమ్మని దానిని చంపమని శాసిస్తుంది. ఈ విషయం తెలుసుకున్న పులి తల్లి వచ్చి పులితో నువ్వు ఎంత మూర్ఖుడివి సేవకులు పుట్టుకతోనే వంచకులు ఈ లోకం మంచి వాళ్ళను చూసి చెడ్డవాళ్ళు గొప్పవాళ్లను చూచి తక్కువ వాళ్ళు ఇలా సహించలేని వాళ్ళు ఉంటారని గ్రహించలేకపోయావా నక్క చేసిన మంచి పనులన్నీ మరచిపోయావా ఇట్లాంటి నక్క ఇలా చేస్తుందా అనే ఆలోచన నీకు రాలేదా, ధర్మం అధర్మంగాను , అధర్మం ధర్మంగానూ కనబడుతాయి కాని మన తెలివితో , వివేచనతో ఆలోచించి మంచి చెడులు తెలుసుకోవాలి. ఎవరో చెప్పారని ఇలా చేయడం భావ్యమేనా నక్కను చంపాలనుకోవడం న్యాయమేనా అడిగే సరికి పులి రాజుకు జ్ఞానోదయమయ్యి నక్క రాగానే తన దగ్గరకు చేర్చుకుంది, ఆత్మీయంగ మాట్లాడింది. కాని

నక్క పులి రాజు ఇచ్చిన మాట తప్పి ప్రవర్తించాడని తనను అవమానించాడని చెప్తుంది. ఒకసారి అవమానించి తర్వాత దగ్గర చేయడం భావ్యమైన పనికాదని చెప్పి అడవులలోకి వెళ్ళి తన శేష జీవితాన్ని గడిపి పరమపదిస్తుంది.(ఆంధ్ర మహాభారతం, శాంతి పర్వం, తృతీయాశ్వాసం, 52 వ పద్యం నుండి 79 వరకు).

ఈ కథలోని ప్రధాన అంశం రాజు తెలివితక్కువ నిర్ణయాలను తీసుకోకూడదు. ఒకరు చెప్పిన మాటలే నిజమని భావించి నిజాయితీ పరులను అవమానించకూడదు అలా చేయడం వలన రాజుకు మేలు జరగక పోగా కీడే ఎక్కువ జరుగుతుంది. ఒక వ్యక్తిని నమ్మి తన దగ్గర పనికి కుదుర్చుకున్నప్పుడు ఆ వ్యక్తి స్వభావం పనితనం బాగుంది అనిపించినప్పుడు. అతని మీద ఎవరో లేనిపోని అబద్దాలు చెపితే రాజు విచారణను చేపట్టి నిజనిజాలను తెలుసుకోవాలి కాని తొందరపడి అందరి ముందు అవమానించి పంపించేయడమో, చంపమనడమో చేయడం న్యాయమైనది కాదు దాని వలన రాజు ధర్మానికి కళంకం తెచ్చినవాడవుతాడు. కాబట్టి రాజు వేసే ప్రతి అడుగు జాగ్రత్తగా వేయాలని ఈ కథ వలన తెలుస్తుంది.

### 5.8. సముద్ర సరిత్సంవాదము:

శత్రువుల అధిక బలం కలవారైతే అల్పబలం కలిగిన రాజు కష్టాల నుండి ఎలా బయట పడగలడని ధర్మరాజు అడుగగా భీష్ముడు దానికి సముద్రానికి నదికి మధ్య జరిగిన సంభాషణను తెలియజేస్తాడు.

‘‘ సముద్రం ఒక సారి నదులతో మీరు మంచి వేగంతో ప్రవహించేటప్పుడు ఎన్నో చెట్లు కూలిపోతుంటాయి కాని ప్రబ్బలి చెట్లు కూలిపోవు ఎందుకని అవి మీకు ఏమైనా మేలు చేసాయా వాటిని పెల్లగించడంలేదు కారణం ఏమిటి? అని అడిగితే వాటిలో గంగా నది సముద్రుడితో చెప్తుతుంది.

గట్లమీద ఉన్న చెట్లన్ని తమ బింకం సడలనీయకుండా నిలబడుతాయి. అందువలన నీటి వేగాన్ని తట్టుకోలేక నిట్టనిలువునా కూలిపోతుంటాయి. ప్రబ్బలి చెట్లు ఆ

విధంగా కాకుండా నీటి వేగాన్ని బట్టి వంగి ఉండి నీటి ప్రవాహ వేగం తగ్గాక ఎప్పటివలె సహజ స్థితికి వచ్చేస్తాయని గంగ సమాధానం చెప్తుంది.

*“ఆ. అరి నృపాలు పెంపు నాత్మీయ శక్తియు– నెఱిఁగి మూర్ఖవృత్తి నెదురుపడక*

*యుచిత వృత్తి నతని యుద్ధతి మేవడిఁ – గడిపి హీన బలుఁడు సెడక నిలుచు.(ఆంధ్రమహాభారతం, శాంతి పర్వం, తృతియాశ్వాసం, 90 వ పద్యం).*

బలహీనుడైన రాజు ఎదుటి వారి బలాన్ని అంచనా వేసుకుని మొండిగా యుద్ధానికి దిగకుండా శత్రువు యొక్క మిడిసిపాటును తెలివితో తొలగించుకోవాలి.

అప్పుడే ఆ రాజు ఎట్లాంటి చెరుపు లేకుండా నిలబడగలుగుతాడు.

సమయానుకూలతను బట్టి పనులు చేసుకోవాలని ఈ కథలోని అంతరార్థం,

ఇదే కథ సంస్కృతంలో ఉన్నప్పటికి ప్రబ్బలి చెట్టు కి వేతస వృక్షమని తెలుపబడుతుంది.ఈ కథలోని రాజనీతి సంస్కృతంలో ఈ విధంగా చెప్పబడుతుంది.

*“ఏకమేవ యదా విద్వాన్ మన్యతే2తిబలం రిపుమ్*

*సంశ్రయేద్వైతసీం వృత్తీమ్ ఏతత్ప్రజ్ఞాన లక్షణమ్ (సంస్కృత భారతం, శాంతి పర్వం, 114 వ అధ్యాయం).*

రాజు శత్రువును బలవంతునిగా భావించినప్పుడు వైతసీ వృత్తిని ఆచరించాలని అంటే తలవంచాలని ఇది తెలివైన వారి లక్షణమని తెలుపబడుతుంది.

ఈ కథ వలన శత్రురాజులు బలవంతులై పరాక్రమానికి దిగినప్పుడు అవతలి రాజు శత్రువుయొక్క శక్తి యుక్తులను గ్రహించి మెలగాలని అలా కాని పక్షమున అపజయం పొందవలసి వస్తుందని తెలుస్తుంది.

## 5.9. కుర్కురోపాఖ్యానం:

అల్పులైన వారికి అధికారమిస్తే వారు తమలో ఉన్న స్వార్థచింతనను విడిచిపెట్టకుండా తనకు ఆశ్రయమిచ్చిన వారినే నాశనం చేయడానికి ప్రయత్నిస్తాడు. ఈ విషయంలో ఋషికి కుక్కకు జరిగిన సంవాదమును భీష్ముడు, ధర్మరాజుకు చెప్తాడు.

ఒకానొక మహారణ్యంలో ఇంద్రియనిగ్రహం కల ఒక ఋషి ఉండేవాడు. ఆ అడవిలోని క్రూరమైన మృగాలు, మదించిన ఏనుగులు పెద్ద పులులు అతని వద్దకు వస్తూ ఉండేవి. ఇక కుక్క మాత్రం ఎప్పుడూ ముని వద్దనే ఉండేది అతనిని వదిలి వెళ్లేది కాదు ఉపవాసాలు చేసి కృశించిపోయింది. ఫలమూలాలు తింటూ శాంతంగా సాధుపురుషుని వలె ఉంది. ఒకసారి ఆ కుక్క తన మీదకు వస్తున్న పులిని చూసి భయపడుతుంది, ఆ భయం నుండి తనను కాపాడమని మునిని వేడుకుంటుంది . ఆ ముని ఆ చిరుపులికి భయపడనవసరం లేకుండా ఆ కుక్కకు చిరుత పులి రూపాన్ని ఇస్తాడు. దానితో ఆ చిరుతవలన కలిగిన భయాన్ని తొలగించుకుంటుంది. మరలా పెద్దపులిని చూసి భయపడి మునిని శరణువేడింది. ఆ చిరుత పులిని శత్రువులకంటే బలవంతమైన పెద్ద పులి గా మార్చాడు. ఆ పెద్ద పులి మాంసాహారానికి అలవాటు పడి బలంగా తయారయ్యింది. ఆ పెద్ద పులి మదపుటేనుగును దాని యొక్క ఘీంకారాన్ని చూసి భయపడి మునిని మరలా శరణువేడింది. దానితో ముని మరలా దానిని ఏనుగుగా మార్చాడు. ఇలా కొన్ని రోజులు గడిచిన తర్వాత ఒక సింహం అక్కడకు వచ్చింది. ఆ సింహాన్ని చూసి ఏనుగు కంగారు పడుతూ ఉంటే ఆ ఏనుగును సింహంగా మార్చాడు. దానిని చూసి ఆ వన్య సింహం పారిపోయింది. ఇలా కొంతకాలం గడిచాక సమస్త ప్రాణులను హింసించే శరభమృగం ఆ సింహాన్ని చంపడానికి ఆ ముని ఆశ్రమం వైపు వచ్చింది. అది ఎనిమిది కాళ్ళతో కళ్ళు మీదికి ఉండి భయం కలిగించేదిగా ఉంటుంది. వస్తున్న శరభాన్ని చూసి సింహం మిక్కిలి భయంతో వణుకుతూ చేతులు జోడించగా ఆ ముని దానిని శరభంగా మార్చాడు. ఇక నుండి ఆ శరభం అన్ని ప్రాణులను చంపుతూ మిక్కిలి సంతోషంగా ఉంది.

పూర్వం కుక్కగా ఉన్న శరభమృగం ఇప్పుడు తన మనసులో ఈ విధంగా అనుకుంటుంది.

చ. ననుఁగని యొందు సత్త్వము మనంబున బెగ్గిలి పాఱునప్పుడి
మ్ముని వరుఁడిట్లపోలె గృప మొక్కలమై శరభంబుఁగాగఁజే
యునో తగ దాని నట్లయిన నుద్ధతి నాకుఁజరింప లేదు గా

వున నితనిన్ వధింతు వెరవున్ బలమున్ సరి నుల్లసిల్లఁగన్.(ఆంధ్ర మహాభారతం, శాంతి పర్వం, తృతియాశ్వాసం, 95 వ పద్యం.)

ఈ ముని మహిమ వలన కేవలం నోటిమాటతోనే నన్ను శరభాన్ని చేసాడు. రేపు నా లాగే సమస్త ప్రాణుల ను ప్రేమించే ఈ ముని తనను ఆశ్రయించి ఉన్న జంతువులను కూడా వాటి భయం పోగొట్టడానికి శరభమృగంగా మార్చవచ్చు, పక్షులకు గరుత్మంతుని రూపాన్ని కూడా ఇస్తాడు. వాటిలో దేనికైనా బలం ప్రసాదించకముందే నేను ఈ విప్రున్ని శీఘ్రంగా చంపివేస్తాను. ముని చనిపోయాక నేను ఇక్కడ ఉండడానికి సాధ్యమవుతుంది. సందేహం లేదు అనగానే ఆ దురాలోచన జ్ఞాన నేత్రంతో తెలుసుకున్న ఆ ముని కుక్కగా నీవు చిరుతగానూ, పెద్ద పులిగానూ, ఏనుగుగాను, సింహం గానూ, శరభంగానూ మరావు స్నేహంతో ఉన్న నేను నీ జాతిని విస్మరించాను. ఏ పాపం తెలియని నన్ను చంపాలనుకుంటున్నావు కనుక నీవు నీ జాతి అయిన కుక్కగానే మారపోమని శపించి తన ఆశ్రమం నుండి వెళ్ళగొట్టాడు.

*"ఏవం రాజ్ఞా మతిమతా విదిత్వా సత్య శౌచతామం*

*ఆర్జవం ప్రకృతిం సత్యం శ్రుతం వృత్తం కులం దమమ్*

*అను క్రోశం బలం వీర్యం ప్రభావం ప్రశ్రయం క్షమామ్*

*భృత్యా యే యత్ర యోగ్యాః స్యుః తత్ర స్థాప్యాః సురక్షితాః' ( సంస్కృత భారతం, శాంతి పర్వం, 118 వ అధ్యాయం 3వ శ్లోకం).*

రాజు బుద్ధిమంతుడై సేవకుల యొక్క నిజమైన స్వభావాన్ని, పాండిత్యాన్ని, సత్యవాదిత్వాన్ని కులాన్ని ఇంద్రియనిగ్రహాన్ని దయను, బలాన్ని పరాక్రమాన్ని స్వభావాన్ని ఎవరు ఎక్కడ యోగ్యులో వారిని అక్కడ నియమించి చక్కగా రక్షించాలి.

ఈ కథ ద్వారా ఎదుటి వారి స్వభావాన్ని ముందు గ్రహించాలి అతని దీనావస్థ అప్పటికి జాలి కలిగి చేరదీస్తే భవిష్యత్తులో కూడా ఇలానే ఒకే బుద్ధితో ఉంటాడా లేదా అతను చంచల స్వభావంతో మారే అవకాశం ఏమైనా ఉందా అని ముందుగానే గ్రహించగలగాలి లేకపోతే అతని స్వభావం మారితే ఎటువంటి ప్రమాదకరమైన నిర్ణయాలు

తీసుకుంటాడో నని అనుమానం వ్యక్తంచేయాలి. అంతేగాని తనను ఆశ్రయించుకుని వచ్చిన వారి మీద అతి ప్రేమను ప్రదర్శించకూడదు. స్నేహభావాన్ని వ్యక్తం చేస్తూనే అతని చర్యలను కనిపెడుతూ ఉండాలి అనే సూచన ఈ కథ ద్వారా తెలుస్తుంది.

## 5.10.. ఉష్ట్రగ్రీవోపాఖ్యానం:

రాజు ఏమిచేయాలి? ఏమి చేస్తే రాజు సుఖంగా ఉంటాడు? అని ధర్మారాజు అడిగినప్పుడు భీష్ముడు ఈ కథను వివరిస్తాడు. ఈ కథ వలన ఏమరపాటు లేకుండా అలసత్వం వహించకుండా ఉండే రాజు సుఖాన్ని పొందుతాడని తెలుస్తుంది.

''సత్య యుగంలో ఒక గొప్ప ఒంటె ఉండేది దానికి పూర్వజన్మ జ్ఞానం ఉండడం చేత కఠోర నియమాలను పాటిస్తూ అడవిలో తపస్సు చేసింది తపస్సు పూర్తయ్యాక బ్రహ్మదేవుడు సంతోషించి వరం కోరుకోమన్నాడు. అప్పుడు ఒంటె తన మెడ పోడవుగా కావాలని దాని వలన వంద యోజనాల వరకు మేయడానికి మెడతో ముందుకు సాగగలనని చెప్పగానే బ్రహ్మ సరే అలాగే అవుతుందని వరమిచ్చాడు. గొప్పదైన ఆ వరాన్ని పొంది ఒంటె అడవికి వెళ్ళింది ఆ వరం వలన ఆ ఒంటె సోమరిగా మారిపోయింది. మేయడానికి వెళ్లడానికి బద్ధకం ఏర్పడిపోయింది. ఒకసారి తన పొడవైన మెడను వందయోజనాల దూరం వరకు చాచి ఆహారాన్ని తినసాగింది. ఇంతలో గాలి దుమ్ము లేవడంతో ఆ ఒంటె తన తలను మెడను ఒక గుహలో దాచుకుంది. పెద్దవాన కూడా రావడంతో తన తలను అక్కడే ఉంచేసింది. ఇంతలో ఆకలితో ఉన్న నక్క తన భార్యతో కలిసి ఆగుహలోకి వచ్చింది. మాంసం తిని బ్రతికే నక్క ఒంటె మెడను చూసి తినడం ప్రారంభించింది. ఆ ఒంటె తనను ఏదో తినేస్తుందని గ్రహించి అతికష్టం మీద ముడుచుకోవడానికి ప్రయత్నించింది. ఆ ఒంటె ఎంతవరకు తన మెడను కదిలిస్తుందో అంతవరకు నక్క తన భార్యతో కలిసి తినేసింది. ఆ ఒంటె చచ్చిపోయింది. ఈ విధంగా ఆ ఒంటె సోమరితనం కారణంగా దాని వలన వచ్చే నష్టాన్ని గ్రహించక చనిపోయింది. కాబట్టి రాజు జాగ్రత్తగా ఉండాలని భీష్ముడు ధర్మరాజుకు తెలియజేస్తాడు. ఇంకా కొన్ని విషయాలను ప్రస్తావిస్తూ విజయానికి బుద్ధే కారణమని గ్రహించమంటాడు.

*''బుద్ధి శ్రేష్ఠాని కర్మాణి బాహుమధ్యాని భారత*

*తాని జంఘాజఘన్యాని భార ప్రత్యవరాణిచ''(సంస్కృత భారతం, శాంతి పర్వం,* **112 వ అధ్యాయం, 18 వ శ్లోకం.)**

బుద్ధిబలం తో చేసే పనులు ఉత్తమమైనవని బాహుబలంతో చేసే పనులు మధ్యమైనవని కాలి బలంతో చేసే పనులు అధమమైనవని బరువెత్తుకొని పనులు అన్నింటి కంటే అధమమైనవని చెప్తాడు అంతే కాకుండా రాజుకు సంపదలు ఎలా నిలుస్తాయో చెపుతూ

'' పరీక్ష్యకారిణో హ్యర్థాః తిష్ఠంతీహ యుధిష్ఠిర

సహాయ యుక్తేన మహీ కృత్స్నా శక్యా ప్రశాసితుమ్''(సంస్కృత భారతం, శాంతి పర్వం, 112 వ అధ్యాయం, 20 వ శ్లోకం).

మంచి సహాయకులు ఉన్నవారికి ఏ పనైనా విమర్శనాత్మకంగా ఆలోచించి చేసేవారికి, ఈ లోకంలో సంపదలు వస్తాయి. సహాయకులతో కూడిన రాజు మాత్రమే ఈ భూమండలాన్ని పాలించే సామర్థ్యం కలిగిన వాడు అవుతాడని చెప్తాడు.

ఈ కథ వలన రాజు సోమరితనాన్ని విడిచిపెట్టి ఇంద్రియలోలుడు కాకుండా జాగ్రత్త వహించాలని లేకపోతే తనతో పాటు తన రాజ్యానికి ముప్పువాటిల్లే ప్రమాదముంటుందని. తెలుస్తుంది.

నేటి సమాజంలో నాయకులకు ప్రధానంగా బద్ధకం ఉండడం వలనే వారు ప్రకటించిన పథకాలును సరైన సమయంలో అమలు చేయకపోవడం, ప్రజలకు చేరవలసిన సహాయం సరైన రీతిలో అందకపోవడం జరుగుతున్న సందర్భాలు కనబడుతూనే ఉంటాయి. వాటి వలన సమాజం అభివృద్ధిలోకి రావడం మాని క్రమక్రమంగా వారి పనుల్లోనూ వారిలోనూ సోమరితనం, ఆవహించే ప్రమాదం ఉంది.

## 5.11. మహాభారతం –రాజనీతి –నేటి పరిణామం:

రాజనీతిలో ప్రధానమైనది నాయకత్వం నాయక స్థానంలో ఉన్న వ్యక్తి తన సంస్థకు, ప్రత్యర్థి సంస్థలకు గల బలాలు, బలహీనతలు, సంస్థలు ముందున్న అవకాశాలు, పొంచి ఉన్న ప్రమాదాలు చక్కగా విశ్లేషించుకోవాలి.

సభాపర్వంలో రాజనీతికి సంబంధించిన అంశాలు ప్రస్తావించబడ్డాయి. ఇవి నారదుడు ధర్మరాజుని కుశల ప్రశ్నల రూపంలో ఉంటాయి. ఇందులో ప్రధానంగా కొన్ని విషయాలను గమనిస్తే రాజు యొక్క ప్రధానమైన విధివిధానాలు ఎలా ఉండాలో తెలుస్తుంది.

1. **రాజ్య కార్యాలను స్వబుద్ధితో ఎల్లప్పుడూ అర్థరాత్రి దాటిన తర్వాతే ఆలోచించాలని, రహస్యంగా ఆలోచించిన విషయాలను ప్రజల చెవిన పడకుండా జాగ్రత్త పడటం.**

నేటి కాలంలో దీనిని పరిశీలిస్తే ఎవరూ ఊహించని విధంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడి జమ్మూ కాశ్మీర్ కి సంబంధించిన ఆర్టికల్ 370 ని తొలగించడం. ఇది చరిత్ర లో ఒక చారిత్రాత్మకమైన ఘట్టం. ఇలాంటి సంఘటనలు అప్పుడప్పుడు చోటుచేసుకోవడం వంటివి రాజనీతిలో భాగమే.

2. **అలాగే ప్రభుత్వ ఉద్యోగాల్లో శక్తి సామర్థ్యాలను అనుసరించి వారి ప్రతిభాపాటవాలను గుర్తించి వారిని ఉద్యోగాల్లో స్థిరంగా ఏర్పరచడం కూడా రాజ్యానికి లాభదాయకమైన విషయాలలో ఒకటని నారదుడు వివరిస్తాడు.**

   నేడు శక్తి సామర్థ్యాలకు కాకుండా ధనానికి ప్రాముఖ్యత లభించడం , పలుకుబడికి లోబడి స్వార్థ పూర్వకంగా ఉద్యోగాలను నియమించడం జరుగుతుంది. దాని వలన పాలన తప్పు దోవ పట్టే ప్రమాదం ఉంది.

3. **ఎక్కువ పలుకుబడి కలిగిన క్రియాశీలి, సమర్థవంతులైన మంత్రులను నియమించడం. ఇక్కడ మంత్రి ఆలోచన విధానాన్ని అతని ప్రవర్తనను పరిశీలించడం, రాజ్య క్షేమానికి ప్రథమ కర్తవ్యంగా తెలుస్తుంది.**

**4. జ్యోతిష్యం చేత భూమండలంలో గ్రహాల స్థితిని తెలుసుకుని దానికి తగ్గట్లు రాజ్య క్షేమం కొరకు శాంతి క్రియాదులు జరపడం.**

నేటి కాలంలో కూడా పాలకులు తమ దేశ క్షేమాన్ని కోరి యాగాలు చేయడం, లాంటివి గమనిస్తూనే ఉన్నాము. పండగలను గౌరవించి సెలవలను ప్రకటించడం వలన ప్రజల్లో భక్తి భావాలను కలిగింపజేసి పూర్వ సంస్కృతి విధానాలను మరగుపరచకుండా కాపాడడం నేటి కాలంలో గమనించదగ్గ విషయం.

5. పన్నులు వసూలు చేయడం, యోగ్యులైన వారిని ఉద్యోగాల్లో నియమించి జీతాలను సకాలంలో అందజేయడం.

దేశంకాని రాష్ట్రం కాని అభివృద్ధి జరగాలంటే పాలకులు ఒక్కరి చేతిలోనే ఉండదు ప్రజలందరిని అభివృద్ధి కార్యక్రమంలో భాగస్వామ్యులను చేయడం ఒక పద్ధతి .ఆ పద్ధతిని ఉద్యోగ రూపంలో సరైన వారిని నిర్ణయించి వారికి తగిన వేతనాన్ని అందిస్తూ ఉండడం వలన దేశం పురోగతి చెందుతుంది.

6. యుద్ధంలో మరణించిన వారి పైన కుల కుటుంబాలకు కూడు గుడ్డకు లోటు లేకుండా ఇవ్వడం.

ఈ మధ్య జరిగిన భారత్ చైనా సైన్యం ఘర్షణలో మరణించిన కల్నల్ సంతోష్ కుటుంబానికి భరోసాగా ప్రగతి భవన్ లో అతని భార్య సంతోషికి ముఖ్యమంత్రి కే.సి.ఆర్ డిప్యూటి కలెక్టర్గా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. అలాగే ఇళ్ళస్థలాలను, ఐదు కోట్ల రూపాయాలను అందజేశారు. ఇలాంటివి భరతమాత కోసం ప్రాణాలు విడిచిన వారి కుటుంబాలను ఆదుకోవడమనేది ఆనాటి నుండే అమలులో ఉందని అర్థమవుతుంది.

**7. పేద రైతులకు ధాన్యపు విత్తనాలు, వర్తకులకు నూటికి, ఒక రూపాయి వడ్డి వంతున అప్పులు ఇవ్వడం.**

నేటి కాలంలో చాలా మంది రైతులు అప్పులు తీర్చలేక పండిన పంటకు సరైన ధర అందక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అలాంటి పరిస్థితి అప్పట్లో లేదు ఎందుకంటే పంటలు, ధాన్యాన్ని పండించే రైతుల విలువ ఆనాటి రాజులకు తెలుసు. ఎంతో మంది ఆకలి చావులు చూసిన తర్వాత గాని ప్రభుత్వం మేల్కోలేని పరిస్థితి నేడు కనబడుతుంది. రైతులకు ఊరటనిచ్చే అంశాలను చూస్తే ప్రధానమంత్రి కొన్ని మార్గదర్శకాలను వారి కోసం కేటాయించడం. అవి రూపాయికే పంట బీమా, ప్రీమియం చెల్లిస్తే ఫసల్ బీమా వర్తింపు, రైతుల వాటా ప్రభుత్వమే చెల్లింపు, రైతులందరికి వర్తింపజేయాలని ఉత్తర్వులు , ఖరీఫ్ బీమా యోజనకు మార్గ దర్శకాలు ఇలాంటి పథకాలు రైతులు కోసం ప్రవేశ పెట్టడం చూస్తున్నాము.

8. చేసిన మేలు గుర్తించి ఆ మేలు చేసిన వ్యక్తిని పదిమంది పెద్దలున్న సభలో ఉచిత రీతిని సత్కరించగల రాజు ప్రజలను పరిపాలించగలడని చెప్తాడు.

ఇప్పటి కాలంలో వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన భారతీయు పౌరులకు పద్మ భూషణ్, భారత రత్న, పద్మ విభూషణ్ లాంటి పురస్కారాలను అందజేసి వారిని సత్కరించడం లాంటిది.

**క.''పంగుల మూకాంధుల విక / లాంగులను నబాంధవుల దయవ బ్రోతే? భయా**

**ర్తుం గడిఁది శత్రునైనను / సంగర రంగమునఁ గాతె శరణం బనినన్.**

**(ఆంధ్రమహాభారతం సభాపర్వం 45వ పద్యం).**

కుంటి వాళ్ళను, మూగ వాళ్ళను, గ్రుడ్డి వాళ్ళను, అంగ విహీనులైన వాళ్ళను, బంధువులు లేని వాళ్ళను దయతో పోషిస్తున్నావు కదా! అని నారదుడు అడుగుతాడు.

నేటి కాలంలో వికలాంగులకు ఫించన్ రూపంలో చేయుతనివ్వడం మహాభారత కాలం నాటి నుండే ప్రారంభమైందని అర్థమవుతుంది. నేటి కాలంలో వారిని పిలిచే పిలుపులో కూడా గౌరవం ఉండాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడి గారు వికలాంగులు పేరుకు బదులుగా దివ్యాంగులుగా పేరు మార్చడం జరిగింది. విభిన్న సామర్థ్యపు వ్యక్తులు కోసం జాతీయ విధానం( National Policy for with Disabilities) వారు వారి

కోసం ప్రత్యేక చట్టాలను తీసుకొచ్చింది, అలాగే వారి కోసం ప్రత్యేక సంస్థలను ఏర్పాటుచేసింది.

1.శారీరక వికలాంగుల సంస్థ, న్యూఢిల్లి,

2. జాతీయ మానసిక వికలాంగుల సంస్థ, సికింద్రాబాద్.

3. జాతీయ పునరావాస శిక్షణ మరియు అధ్యయన సంస్థ, కటక్

4. జాతీయ బహుళ వికలాంగత్వ సాధికారత సంస్థ చెన్నై వంటి సంస్థ లు వారి ప్రత్యేక అవసరాలు తీర్చడం కోసం ఏర్పడ్డాయి.

10. రాజుకు వచ్చిన ఆదాయంలో ఎంత ఖర్చు చేయాలో నారదుడు వివరిస్తాడు. ఆదాయంలో నాల్గవ భాగాన్ని లేద మూడవ భాగాన్ని లేద సగ భాగాన్ని మాత్రమే ఖర్చు చేయాలి కాని అంతకు మించి చేయకూడదని గ్రహించమన్నాడు.

దేశ ఆర్థిక వ్యవస్థ తీరు తెన్నులు మార్చి ఆధునిక భారతానికి దారిని నిర్మించిన ఆర్థిక సంస్కరణలు ప్రవేశ పెట్టి దేశానికి అంతర్జాతీయ ఖ్యాతి సాధించిన వ్యక్తి గా పి.వి నరసింహారావు గారిని చెప్పుకోవాలి. ఇలాంటి వారెందరో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశారు.

9. గూఢాచార వ్యవస్థ గురించి, శత్రురాజుల ప్రవర్తనను తెలుసుకోవాలని చెప్తున్నాడు.

ఈనాడు రాజకీయ నాయకులు వారి గురించి కాకుండా ప్రతిపక్ష నాయకుల గురించి తెలుసుకోవాలనే కుతూహలంతో వారి వివరాలను సేకరించి విమర్శించడం మనం చూస్తూనే ఉన్నాం.

**ఆ. 'వార్తయంద జగము వర్తిల్లుచున్నది / యదియు లేనినాఁడ యఖిల జనులు**
**నంధి కారమగ్ను లగుదురు గావున/ వార్త నిర్వహింపవలయుఁబతికి.''**
**(ఆంధ్రమహాభారతం, సభాపర్వం, 51 వ పద్యం).**

వార్తను ప్రభువులు సక్రమంగా నడపాలి, వార్తలను సేకరించడం, ప్రసరించడంలో నిపుణతను కలిగి ఉండాలి. అలా లేకపోతే ప్రజలంతా అజ్ఞానాంధకారంలో ఉండవలసి వస్తుందని తెలుస్తుంది.

ప్రపంచ సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో వార్తలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. అటువంటి వార్తను ప్రచురించడంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్తున్నాడు. నేడు చాలా పత్రికలు, దూర దర్శన్ లు, రక రకాల కార్యక్రమాలతోనూ, రాజకీయ వార్తలతోనూ పోటి పడుతున్నాయి ఈ పోటి కారణంగా వాస్తవాన్ని చెప్పడం మరచి పోయి, గుర్తింపు కోసం పాటుపడుతున్నట్టు తెలుస్తుంది. కొన్ని పత్రికలు మాత్రమే నిజాన్ని నిర్భయంగా తెలియజేయకలుగుతున్నాయి.

10. ఆయుర్వేదంలో సమర్థులైన వైద్యులు లోకానికి మేలు చేసే బుద్ధితో ప్రజల మీద ప్రేమతో ఎనిమిది శాఖలుగా వ్యాపించిన ఆ వైద్య విధానంలో సేవలు చేస్తున్నారా అని విచారిస్తాడు.

నారదుడు వైద్యులను జగద్ధిత బుద్ధిన్ అని విశేషించి ప్రయోగించాడు. బాధా పీడితుడై ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగికి చికిత్స చేసి, అతని బాధను తొలగించి, ప్రాణం నిలిపే వైద్యుణ్ణి భారత దేశం విష్ణు స్వరూపునిగా భావించాలి. 'వైద్యో నారాయణో హరి:' అని ప్రవచించింది.

ఇప్పటి కాలంలో కొంత మంది వైద్యులు ధనాన్ని బట్టి మెరుగైన వైద్యాన్ని అందిస్తారు. ఇక్కడ వ్యక్తి ప్రాణం కంటే ధనానికి ప్రాముఖ్యతను ఇస్తారు. కొన్ని ప్రైవేటు హాస్పిటల్స్ లక్షలు రుసుము తీసుకుని ఆ వ్యక్తి మరణించినా ఆ శవాన్ని తీసుకుని వెళ్ళడానికి కూడా డబ్బు చెల్లించాలని చెప్పే మనస్తత్వం గల వైద్యులు అక్కడక్కడా కనబడుతున్నారు.

11. ధర్మరాజు భుజ బలంతో నీవు పరిపాలిస్తున్న భూమిలో అనావృష్టి భయం లేకుండా చెరువులు నిండి కనుల పండువుగా ఉన్నాయి కదా

ఇప్పటి కాలంలో చెరువులు అన్నింటినీ ఆక్రమించి భవనాలు కట్టి వరదలు వస్తే నిలువు లోతు నీళ్ళలో మునిగి తేలుతున్నాము ఇది నేటి పరిస్థితి.

12. ముందుగా నిర్ణయించుకున్న పనులు చేయక పోవడం.

సంవత్సరంలో పూర్తి కావల్సిన పనులు వాయిదాల మీద పదేళ్ళయినా పూర్తి చేయకపోవడం , ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయడం నేడు మనం గమనిస్తున్నాము.

13. **"చోర భయ వర్జితముగా / ధారుణిఁ బాలింతె యధికధనలోభమునం జోరుల రక్షింపరుగా/ వారలచే ధనముగొని భవద్ భృత్యవరుల్."**
**(ఆంధ్రమహాభారతం, సభాపర్వం, 42 వ పద్యం)**

దొంగ భయం లేకుండా నీవు రాజ్యాన్ని ఏలుతున్నావు కదా నీ ప్రభుత్వోద్యోగుల్లో ముఖ్యులైన వాళ్ళు ధనాశపరులై ఆ దొంగల దగ్గర డబ్బు పుచ్చుకొను వాళ్ళకు రక్షణ కల్పించడం లేదు కదా!

ఆధునిక కాలంలో దొంగల సంఖ్యతో పాటు రకరకాల దొంగలు పుట్టుకొస్తున్నారు. కొత్తగా ఇంటర్నెట్ వచ్చినప్పటి నుండి సాంకేతికత అభివృద్ధి చెంది చదువుకున్న దొంగలు కొంతమంది సైబర్ నేరస్థులుగా మారుతున్న వైనం మనం ఇప్పుడు చూస్తున్నాము.

నారద మహర్షి వేసిన కుశల ప్రశ్నలు ఏ ప్రభువుకైనా ఉత్తమ రాజనీతి పాఠాలు.

## 5.12. సనాతన రాజనీతికి నవీనాంశాలు:

శ్రీకృష్ణుని రాజనీతి ఈ కాలంలోనూ కొనసాగుతుందని తెలియజేస్తూ పి. భాస్కర యోగి '**శ్రీకృష్ణ రాజనీతి ' తక్షణ అవసరం**" అనే వ్యాసంలో వివరించారు.

**ఈనాటి రాజకీయాల్లోని అనేక అంశాలు భారతంలో శ్రీకృష్ణుడి కేంద్రంగా నడిచాయి. అందుకే వ్యాసుడు భారతంలో ఉన్నవి ప్రపంచంలో ఉన్నాయని, ప్రపంచంలో ఉన్నవి భారతంలో ఉన్నాయని ఘంటాపథంగా చెప్పాడు.కంసుడు, జరాసంధుడు, నరకాసురుడు, కాలయవనుడు, శిశుపాలుడు, దుర్యోధనుడు మొదలైన రాజుల చేతిలో ముక్కలు ముక్కలుగా ఉన్న భారతదేశాన్ని– అలాంటివారి కబంధ హస్తాల నుండి విడిపించి 'అఖండ భారతంగా' శ్రీకృష్ణుడు నిర్మించాడు. కేంద్ర పాలనా వ్యవస్థను ధర్మరాజు ద్వారా స్థాపించిన శ్రీకృష్ణుడు రాజ్యవ్యవస్థకు ఓ రూపం ఇచ్చాడు. ప్రపంచంలోనే రాజ్యవ్యవస్థకు సంబంధించి ఎన్నో యుక్తులను ప్రదర్శించిన శ్రీకృష్ణుడు 'అఖండ భారతావని' కలను ఆనాడే**

**సాకారం చేశాడు. దీని ఆధారంగానే కదా 'ఉక్కుమనిషి' సర్దార్ వల్లభభాయ్ పటేల్ ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు వ్యవహరించే ఆనాటి సంస్థానాధీశుల మెడలు వంచి 560 సంస్థానాలను భారతదేశంలో విలీనం చేశాడు!"**

http://andhrabhoomi.net/content/bhaskarvani-13

(09జ08జ2018).

వీరి అభిప్రాయం ప్రకారం నేటి కాలంలో మౌనంగా ఉండి సమస్యలను చూస్తూ ఉండడం కంటే ఒక్క అడుగు ధైర్యంగా ముందుకు వేసి శ్రీకృష్ణుని వంటి ఆలోచనా ధోరణితో సమాజాన్ని బాగు పరిచే ప్రయత్నం చేయగలిగితే మన భారతదేశం అభివృద్ధి చెందుతుందని తెలుస్తుంది. ఆంగ్లేయుల పాలన కావచ్చు, మరో మతం కావచ్చు ఎక్కడినుండైనా సరే మన భారతీయ మూలల్ని నాశనం చేసే ఆలోచన వచ్చినవారందర్ని ఏదో ఒక రూపంలో ఎదుర్కోకలిగే శక్తి సామర్థ్యాలను ప్రతి నాయకుడు కలిగిఉండి మన ఉనికిని కాపాడుకోవాలి. అందుకు ఉదాహరణగా సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి వారు నేడు నరేంద్ర మోదిగా మనం గమనించవచ్చు. ఇంకా ఎందరో మహానుభావులు తమ జీవిత సర్వస్యం వారికి నీడనిచ్చిన దేశం కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధపడినవారిని మనం గమనిస్తూనే ఉన్నాము.

మన భారతదేశం అఖండ దేశంగా మారడానికి పి. భాస్కర యోగి శ్రీకృష్ణుని రాయబార చాతుర్యం మనం కూడా ప్రదర్శించాలని చెప్తూ ఈ విధంగా అంటాడు.

*"క్రీస్తు పూర్వం నుండి వేల ఏళ్ళుగా గోనందుడు, అశోకుడు, లలితాదిత్యుడు, అవంతీవర్మ, రాజా హరిసింగ్ వంటి యోధానుయోధులు పాలించిన కాశ్మీరంలో కల్లోలం తగ్గాలంటే శ్రీకృష్ణ రాయబారం ఐక్యరాజ్యసమితిలో, బ్రిక్స్‌లో వినిపిస్తూనే అపుడపుడు శాంతి కపోతాలను పంజరంలో దాచి శస్త్రాస్త్రాలకు పదునుపెట్టాల్సిందే. సౌదీ అరేబియా, ఇరాన్‌ల నుండి మొదలుపెట్టి వియత్నాం, కంబోడియా, థాయ్‌ల్యాండ్, మలేషియా, సింగపూర్, మాల్దీవుల వరకు విస్తరించిన శ్రీకృష్ణ ప్రబోధిత హైందవ సంస్కృతికి జవజీవం పోయాలంటే దేశ దేశాలను తనవైపు త్రిప్పేందుకు శ్రీకృష్ణుడు ధర్మయుద్ధం చేయించినట్లే ఈ రోజు ధార్మిక రాయబారం చేయడానికి మోదీ లాంటి నాయకుడి అవసరం ఉందని వీరు*

*తెలియజేస్తారు.* *http://andhrabhoomi.net/content/bhaskarvani-13 (09జ08జ2018).*

ఎక్కడ అధర్మం వ్యాపిస్తుందో అక్కడ భగవంతుడు అవతరిస్తాడని మనం వింటూనే ఉంటాము భగవంతుడు ప్రత్యక్షంగా అన్ని కాలాల్లోనూ రావలసిన అవసరం లేకుండా ప్రజల్లోనే వారి కి ఒక శక్తిని కల్పించి వారిచేత సమాజాన్ని ప్రక్షాళన చేయిస్తున్నాడని మనం భావించవచ్చు. ఆ శక్తి మానవునికి ఏ రూపంలోనైనా అందవచ్చు.ముఖ్యంగా సమాజాన్ని పట్టిపీడిస్తున్న దుర్గంధాలన్నింటిని నిర్మూలించడానికి అందరిని శాసించే అధికారం గల పదవిని ఆ వ్యక్తి అధిరోహించాలి. ఆ అధిరోహించే వ్యక్తి సామాన్యమైన వాడుకాకుండా మహాధర్మశాలియై, మన దేశ గౌరవాన్ని పరాయి పాలు కాకుండా కాపాడగలిగే సమర్థుడై ఉండాలి. ఆ శక్తి ఉన్నప్పుడే అవినీతిని అక్రమాలను ,అడ్డుకోగలుగుతాము. ఇలా జరగాలంటే శ్రీకృష్ణుడు రాయబారం లో చూపించిన రాజనీతిని అందరికి అర్థమయ్యే లా నేటి సమాజానికి అందించవలసిన అవసరముందని వీరి అభిప్రాయం.

శ్రీకృష్ణుడు భీముడు కొడుకు ఘటోత్కచుడు కర్ణుని శక్తి ఆయుధానికి బలైపోతే పరమ సంతోషంతో నృత్యం చేసాడు. తక్కిన పాండవులంతా దుఃఖాన్ని పొందుతారు. ఇదేమిటని అర్జునుడు అడిగితే కర్ణుడు దగ్గర కవచకుండలాలను ఇంద్రుడు తీసుకుని శక్తి ఆయుధాన్ని ఇచ్చాడు అది ఉన్నంతకాలం నేను కాదు కదా ఎవరూ కూడా అతనిని ఎదిరించలేరు. అటువంటి శక్తి ఆయుధం నీపై ప్రయోగించకుండా ఘటోత్కచుని పై ప్రయోగించాడు అంతే కాకుండా ఈ ఘటోత్కచుడు రాక్షస లక్షణాల కలవాడు తర్వాతి కాలంలో భయంకరుడుగా మారగలడు తరువాత నేను సంహరించడానికి మరలా అవతారం ఎత్తవలసి వచ్చేది అది లేకుండా ఈ శక్తి ఆయుధం ఘటోత్కచున్ని నేలకూల్చిందని శ్రీకృష్ణుడు తెలియజేస్తాడు. ఈ రకమైన రాజనీతి నేటి పాలకులలో కూడా ఉందని పి.భాస్కర యోగి ప్రస్తావించాడు. అధికారంలో ఉన్నవాళ్లు ప్రశాంతంగా పనిచేయాలంటే స్వంత పార్టీలో శత్రువులు ఉండకూడదని వీరు అభిప్రాయపడ్డారు.

## 5.13. నాయకుడు ఎలా ఉండాలి?

నాయకుడు ఎలా ఉండాలో భీష్ముడు ధర్మరాజు కు చెప్తాడు. రాజుకు ఉండవలసిన36 గుణాలను ప్రస్తావిస్తాడు.

1. రాగద్వేష రహితుడై ధర్మాలు ఆచరించాలి.
2. ఆస్తికుడై స్నేహం విడువకూడదు.
3. క్రూరత లేకుండా ధనం ఆర్జించాలి
4. ఉద్దతుడు కాకుండా కామాన్ని సాధించాలి.
5. దైన్యం లేకుండా ప్రియం పలకాలి
6. శూరుడై కూడా ఆత్మస్తుతి చేసుకోరాదు.
7. దానం చేయాలి కాని అపాత్రులకు కాదు.
8. ప్రతిభకలవాడవ్వాలి కాని కఠినుడు కారాదు
9. దుష్టులతో కలియకూడదు.
10. బంధువులతో విడిపోరాదు
11. రాజభక్తిలేనివాని చేత గూఢచారి పని చేయింపకూడదు
12. పీడించకుండా పని చెయ్యాలి
13. ఇష్టమైన దానిని దుష్టుల దగ్గర చెప్పకూడదు
14. తన గుణాలు తాను చెప్పుకోరాదు
15. సజ్జనుల నుండి ధనం గ్రహంపరాదు
16. దుష్టుని ఆశ్రయింపరాదు
17. పరీక్షించకుండా దండింపకూడదు
18. రహస్యాలు బయట పెట్టరాదు
19. పిసినారులకు ధనం ఇవ్వరాదు
20. అపకారులను నమ్మరాదు
21. అసూయ లేకుండా భార్యను రక్షించాలి
22. శుద్ధమనసుండాలి కాని శిక్షవిషయంలో నిర్దయుడు కావాలి

23. స్త్రీలను అతిగా సేవింపరాదు

24. స్వాదువయిన భోజనమే కాని అహితమైనది తినరాదు

25. స్తబ్ధత లేకుండా వినయంతో మాన్యులను పూజించాలి

26. గురువులను కపటం లేకుండా సేవించాలి.

27. ఆర్భాటం లేకుండా దైవాన్ని ఆరాధించాలి

28. అనిందితమయిన ధనం కోరుకోవాలి

29. ప్రేమతో సేవించాలి

30. సమయం తెలిసి కార్యాచరణానికి పూనుకోవాలి.

31. మృదుత్వం ఉండాలి విడిచి పారెయ్యడానికి కాదు

32. అనుగ్రహిస్తూ ఆక్షేపించరాదు

33. తెలుసుకోకుండా దండింపరాదు

34. శత్రువును చంపినా వారి బంధువులను దుఃఖపెట్టరాదు

35. అకస్మాత్తుగా కోపం పొందకూడదు

**36.** అపకారుల పట్ల మృదుత్వం పనికి రాదు.( **సంస్కృత భారతం, శాంత పర్వం, 70 వ అధ్యాయం,1 నుండి 11 శ్లోకాలు**).

ఇవి ఆనాటి భీష్ముడు చెప్పిన రాజుకు ఉండవలసిన లేదా నాయకునకు ఉండవలసిన లక్షణాలు.

ప్రయాగ రామకృష్ణ “**భీష్మ@మేనేజ్ మెంట్ &గవర్నెన్స్** ” పుస్తకంలో నాయకత్వం వహించడం నాయకునిగా చలామణి అవ్వడమనేది చాలా క్లిష్టమైన పని అని తెలియజేస్తారు. An essential aspect of great leadership is a high level of personal integrity. A strong value system goes a longway in creating the right role model for team members. పాటలి పుష్పం తన సువాసనల్ని మట్టిముద్దలోకి కూడా ఎలా ప్రవేశపెడుతుందో అలాగే నాయకుడన్నవాడు తన జ్ఞానాన్ని , వివేకాన్ని, అనుభవాన్ని తన వెంటే నడుస్తున్నవాళ్ళకు పంచాలి. వాళ్ళలో ఉన్న అవలక్షణాలను నివారించాలి. This is the hall matk of every good leader.

ఉద్యమమూ, సంస్థో , దేశమో ఏదైనా కానివ్వండి ఎవరు దేనికి నాయకత్వం వహిస్తుంటే వారు దాని పర్పస్ నెరవేరేలా నిర్దేశించుకున్న ప్రయోజనాలు సిద్ధించేలా చూడాలి. That is the primary task of the leader. ఇందు కోసం దీర్ఘదర్శి కావాలని వీరు వివరించారు.(**రామకృష్ణ,ప్రయాగ, భీష్మ@మేనేజ్ మెంట్ &గవర్నెన్స్, పుట:35.**).

వీరి అభిప్రాయాన్ని గమనిస్తే మహాభారతంలో కాయవ్యోపాఖ్యానం లో ఇలాంటి ధర్మాలే చెప్పబడ్డాయి.

## 5.14. కాయవ్యోపాఖ్యానం:

ఈ కథలో భీష్ముడు దొంగలైనా విరోధులైనా ధర్మపరులైతే గౌరవించబడుతారు. సిద్ధి పొందుతారని చెప్తాడు. దానికి కాపవ్యుని కథను చెప్తారు (సంస్కృత భారతంలో కాయవ్యుడు అని ఉంటుంది). ఇతను పారియాత్ర పర్వతం మీద ఒక బోయవాడు అతడు న్యాయపరుడు. (సంస్కృత భారతంలో క్షత్రియునకు, ఒక నిషాద స్త్రీకి కాయవ్యుడు పుట్టినట్లు ఉంటుంది). విలు విద్యలో,మంచి నేర్పరి జంతువులను వేటాడడం లోనూ నైపుణ్యం కలవాడు. అడవిలోని ప్రదేశాలన్నింటిని బాగా తెలిసన వాడు తల్లిదండ్రులన్నా, బ్రాహ్మణులన్నా భక్తి తో ఉండేవాడు. శత్రువని ఎవరైనా ఉంటే యుద్ధంలో ఒక్కడే వేయిమందిని చంపేవంటి పరాక్రమం కలవాడు. ఇతని పరాక్రమం విన్న అక్కడ దొంగలు ఒక గుంపుగా చేరి కాయవ్యుడిని తమకు నాయకుడుగా ఉండమని, తమకు రక్షకుడుగా ఉండమని చెప్తారు.

అయితే నాయకుడైన మాత్రం సరిపోదు వారికి కొన్ని నియమాలను ఏర్పాటు చేసి వాటిని కఠినంగా అమలయ్యేలా చేసాడు. కాపవ్యుడు దొంగలతో ఇలా అంటాడు.

‘ ‘*సీ. శిశుజన ముని జన స్త్రీజనంబులఁ /జంపఁగా దెట్టివాఁడైనఁ గడఁగి మీఁదఁ*
*గవియక పాడుచుట కల్మషం బంగనఁర / జెఱపట్టఁ దగదు విశేష మొకఁడు*
*వినుఁడెల్ల సత్త్వంబులను బెంటిఁ జంపుట/ పాపంబు గోవుల బ్రాహ్మణులను*
*సంకటపెట్టంగఁ జనదు తదీయ హి / తము గోరి పూని యుద్ధంబు సేఁత*
*తే.          యధిక పుణ్యంబు సస్యక్రియావిఘాత/*
*మాచరించుట గదు దోష మవని ప్రజకు*

*బాధ గివించి కుడిచి శవంబు దొలుచు/ప్రవ్వగతినది వొలియంగఁ బొలియు నతఁడు.(ఆంధ్రమహాభారతం, శాంతి పర్వం, తృతియాశ్వాసం, ప్రథమ సంపుటం,182 వ పద్యం)*

ఆడవారిని, పసిపిల్లలను, భయపడిన వారిని, ఋషులను చంపకూడదు, యుద్ధం చేయని వానిపై పోకూడదు, ఆడవారిని బలాత్కరించకూడదు. క్రూర సాధు జంతువుల్లో ఉన్న ఆడవాటిని కూడా చంపకూడదు. బ్రాహ్మణులను, ఆవులను కష్టపెట్టకూడదు వాటిన కాపాడడం కోసం యుద్ధం చేస్తే మంచిది. ప్రజలను పీడించి తన పొట్టనింపుకునేవాడు నశించి పోతాడని తెలియజేస్తాడు.

మీరంతా న్యాయాన్యాయాలను పరిశీలించి బ్రతకండి మీకు నాయకుడిగా నేను ఉంటాను. మీ మంచి చెడ్డలు చూసుకుంటాను. అనగానే దొంగలు సంతోషించారు. అతని మాటలకు కట్టుబడి అభివృద్ధిలోకి వచ్చారు. ఇలా కాపవ్యుడు మంచి వాళ్లకు మేలు కలిగేటట్లు దొంగలను కూడా పాప కర్మలనుండి తప్పించాడు.

ఇలా నాయకుడు ఏ రంగంలో ఉన్నప్పటికి వారు తమతో పాటు తన వారందరి యోగ క్షేమాలు మెరుగు పడతాయని తెలుస్తుంది. ఈ విధంగా కాపవ్యోపాఖ్యానం దొంగైనా ధర్మాన్ని ఆచరించితే వారికి సద్గతులు కలుగుతాయని తెలుస్తుంది. అంతే కాకుండా ప్రయాగ రామకృష్ణ చెప్పినట్లు తన దగ్గర ఉన్నవాందరిని కాపవ్యుడు సన్మార్గంలో నడిపే విధంగా మార్చాడు.

## 5.15. భారతీయ రాజనీతి:

భారతీయ రాజనీతి వ్యవస్థ గురించి శాంతిత్రయము వ్యాసంలో శ్రీకురుగంటి సీతారామయ్య **''ఆంధ్రమహా భారతోపన్యాసములు''** గ్రంథములో చర్చిస్తూ ఆనాటి రాజ్య పద్ధతిని నేటి ప్రజాస్వామ్యమును విశ్లేషించి వివరించారు.

ప్రాచీన కాలం నుండి భారత జాతి చక్రవర్తుల చేతను, మహారాజుల చేతను పరిపాలింపబడుతూ ఉండేది.ప్రజా పరిపాలన కుంటుపడుతున్న సమయంలో మనువును ప్రజలు పాలించమని అడిగితే పరిపాలన సాగించాడు తరువాత చక్రవర్తులు మహారాజులు మహర్షుల సలహాలతో పరిపాలన కొనసాగించేవారని రాజులు ఒకరిపై ఒకరు యుద్ధములు

చేస్తున్నారన్న వాదమప్రస్తుతము. యుద్ధములు ప్రపంచము, మానవజాతి ఉన్నంత కాలము ఉండును. రెండవ ప్రపంచ యుద్ధము ఆగి ఎన్నో సంవత్సరములు గడిచినప్పటికి మరలా యుద్ధజ్వాలలు రగుల్కొను సూచనలు కనబడుతున్నాయి. కావున యుద్ధము లేకుండా ఉండుటకు ప్రజారాజ్యము కావెలెను అనే వాదముకు ఎంత మాత్రము చోటు లేదని వీరు తెలిపారు. **(నారాయణ రెడ్డి, సి.(ప్ర.సం), ఆంధ్రమహాభారతోపన్యాసములు,పుట:238.).**

నేడు ప్రజాస్వామ్యము అంటున్నాము కాని అది ప్రజలకు కాకుండా పాలకులకు మాత్రమే వర్తించే విధంగా రాజనీతి నడుస్తుందని వీరి అభిప్రాయంగా కనబడుతుంది. సమాజంలో ఏ సమస్య వచ్చినా దాని వలన కలిగే నష్టాన్ని ప్రజలే భరిస్తున్నారు. ప్రజాస్వామ్యం అన్నప్పుడు ప్రజలు ఎంచుకున్న పాలకుడు ఎవరైనా సరే ప్రజలకు కష్టం కలగకుండా చూడాలి. యుద్ధం అనాదికాలం నుండి జరుగుతున్నప్పటికి వాటి వలన రాజులు రాజ్య విస్తరణ చేసుకోవడానికి ఉపయోగపడింది దాని ద్వారా ప్రజాపాలన సాగించారు. ఈ నాడు పాలనా పగ్గాల కోసం జరిగే వివాదాల్లో ప్రజలు ఇబ్బంది నెలకునే పరిస్థితులు గమనించాలి.

వద్దిపర్తి పద్మాకర్  కూడా ఆనాటి రాజకీయ వ్యవస్థను నేటి రాజకీయ వ్యవస్థ యొక్క తీరు తెన్నులను రాజకీయ నాయకుల స్వభావాలను ముఖాముఖి లో ఈ విధంగా వివరించారు.

అప్పటి రాజకీయాలలో కుళ్లు కుతంత్రాలు , కుట్రలు ఉన్నా ఈ దారుణం లేదు. వాళ్ళు ముఖాముఖి యుద్ధం చేసేవారు. ఎక్కడో దుర్యోధనునిలాంటి వారు మోసం చేసి లక్కయిల్లు తగులబెట్టినా, విషం పెట్టడం వంటి సంఘటనలు పక్కన పెడితే, యుద్ధంలోకి వెళ్ళాక పరాక్రమంతో యుద్ధం చేసారు. భీముడు, దుర్యోధనుడు కూడా ఘోర యుద్ధం చేసారు. ఇప్పుడు రాజకీయం అంతా కుళ్లు కుతంత్రాలు, ఇప్పుడు పొద్దున ఒక పార్టీ సాయంత్రం ఒక పార్టీ ఎవరో కొంత మంది మంచి పరిపాలకులు మహాత్ములు  లాంటి వారిని , సాధువులను ప్రక్కన పెడితే, ఎక్కడ చూసినా మోసమే అప్పుడు రాజ్యాలు విడిపోయాయి. ఇప్పుడు రాష్ట్రాలు విడిపోతున్నాయి. అప్పుడు రాజధాని లేకపోతే ఖాండవ వనాన్ని తగులబెట్టి కొత్త రాజధానిని కట్టుకున్నారు. ఇప్పుడు అలానే కట్టుకుంటున్నారు.

కొట్టుకు చచ్చిపోతున్నారు. ధర్మం కోసం నిలబడే వారు కొంతమంది ఉన్నారు. మహాభారతం కాలం నాటి కాలుష్యం ఉన్నా ధర్మం పూర్తిగా పోలేదు. ఉదాహరణకు దుర్యోధనునికి పాండవుల మీద ద్వేషం ఉంది కాని నాస్తికుడు కాదు, దైవ ద్వేషి కాదు, దుర్యోధనుడు పౌండరీకం వంటి యజ్ఞాలు చేసాడు. దాన ధర్మాలు చేసాడు, దుర్యోధనుడు, చచ్చిపోయాక కూడా ధర్మరాజు పట్టాభిషిక్తుడు అయినప్పుడు అందరూ వచ్చి దుర్యోధనుడికి నీకు  ఏమి తగాదాలు ఉన్నయో తెలీదు. ప్రజల విషయంలో మాత్రం ఏకరవు పెట్టలేదు. మమల్ని ఇంత అన్నం పెట్టారు అన్నారు. ఆ రోజుల్లో కులాలు, మతాలు లేవు ఆ రోజుల్లో ఉన్నదంతా ఒకటే మతం. అందువల్ల రాజులు కొట్టుకున్నారు కాని ప్రజలకు ఆపద రానీయలేదు.

ఇప్పుడు ప్రత్యక్ష యుద్ధం లేదు, ఇప్పుడు అంతా పరోక్ష యుద్ధమే, అప్పుడు బాణాల తోటి కత్తుల తోటి గదా యుద్ధం  చేసారు. కుస్తీ పట్టుకుని యుద్ధం చేసారు. కీచకుడిని ముద్ద ముద్ద చేసారంటే మల్లయుద్ధం తప్ప ఒక్క ఆయుధం ముట్టలేదు. ఇప్పుడు దొంగ చాటుగా శబ్దాలు వచ్చే అణుబాంబులతో పేల్చేయడం, అడ్డదిడ్డంగా బాంబులు పెట్టేయడం, కాబట్టి సర్వనాశనమై పోయిన పాపాలతో, కుళ్ళు కుతంత్రాలతో నిండిపోయిన కపట విజ్ఞానంతో కూడిన సర్వ నాశపమైపోతున్న రాజకీయాలివి. అప్పుడు ధర్మయుద్ధమైన రాజకీయాలు, పదవి ఉండి కూడా ధర్మం తప్పని రాజకీయాలు, అందుకే నీల కంఠేశ్వర శతకం లో ఒక పద్యం ఉదాహరణగా చెప్పవచ్చు.

**మ. శివా! ఫాలోద్గతవహ్ని నీది మరు, భస్మీభూతునిం జేసె గా**
**ని, వసంతమ్మును గాడొనర్పదు గదా  నిక్కంబుగా నేటి మా**
**నవ దుర్వారమహాణు సంకలిత విజ్ఞానశాస్త్ర ఘోరార్భటిన్**
**భువి కాడోనొకొ ప్రోవరాదె దయ, శంభూ! నీల కంఠేశ్వరా!**

భావం:– శివా! శంభూ ! నీల కంఠేశ్వరా ! నీ నుదిటిలో గల మూడవ కన్ను నుండి పుట్టిన అగ్ని, మన్మథుని భస్మం చేసింది, కాని వసంతాన్ని ప్రకృతిని స్మశానంగా మార్చలేదు, నేటి

మానవులు తయారుచేసిన అడ్డగించడానికి వీలులేని, మహా అణువులతో కూర్చబడిన, విజ్ఞానం వల్ల కనిపెట్టబడిన అస్త్రాల మహాశక్తి వల్ల ఆటంబాంబుల వల్ల భూమి స్మశానంగా మారిపోతుందేమో నని భయంగా ఉంది దయతో రక్షించకూడదా స్వామీ ( శ్రీ నీల కంఠేశ్వర వైభవం 25 వ పద్యం, ( శివా ఆనాడు శివుని మూడవ కన్ను తెరిచి అందులో నుండి అగ్నిని సృష్టించి అగ్నితో మన్మథుని భస్మం చేశావు కాని మన్మథుని స్నేహితుడు వసంతాన్ని నాశనం చేశావా చేయలేదు. , వసంతం ప్రకృతి పాడవలేదు, ఒక్క మన్మథుడే నశించాడు. మన్మథుడు, వసంతుడు ఇద్దరూ స్నేహితులే కాని కోరికయైన మన్మథుని నాశనం చేసాడు. కాని పక్కనున్న ప్రకృతిని పాడు చేయలేదు. ఇవాళ మానవులు దుర్వార మహాణుసంకలిత విజ్ఞానశాస్త్ర ఘోరార్భటిన్, ఈ మానవులు తయారుచేసిన, ఎవరూ ఆపడానికి వీలుకాని అణువులతో కూడిన విజ్ఞానశాస్త్రాలు ఉన్నాయే ఇవి భూమిని వల్లకాడు చేసేస్తున్నాయి. మన అస్త్రాలు, సర్వనాశనం చేస్తాయి. ఆ అస్త్రాలు ఎవరి మీద వేస్తే వారినే చంపేవి. ఆ అస్త్రాలు లేవు ఇప్పుడు. ఈ అస్త్రాలు మొత్తం లోకాలను నాశనం చేసేస్తున్నాయి. ఈ రాజకీయమంతా నీచమైన విజ్ఞానంతో కూడిన రాజకీయం.(వద్దిపర్తి పద్మాకర్ ,ముఖాముఖి)

నేటి కాలంలో రాజకీయ నాయకులు ధనానికి, ప్రలోభాలకు లొంగి రాజకీయ పార్టీలనే మార్చేసి ప్రభుత్వాలను కూలదోయటం కొన్ని దేశ,రాష్ట్ర ప్రభుత్వాలలో జరుగుతున్న విషయం గమనిస్తున్నాము. ఎప్పుడైతే ప్రలోభాలకు లోబడకుండా ప్రజాక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని స్థిరంగా పాలకులు నిలబడినప్పుడే సుస్థిర పరిపాలన అందించగలరని నా అభిప్రాయం.

### 5.16. మహాభారతం కాలం నాటి రాజనీతి:

మహాభారతం కాలం నాటి రాజకీయ వ్యవస్థ అనగానే ప్రధానంగా గుర్తుకువచ్చేది వంశపారం పర్యంగా రాజ్యాన్ని పరిపాలించడం. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆనాటి

పరిస్థితులను వి.ఎం. మోహన్ రాజు **"యోధుడు సారథి"** పుస్తకంలో ఈ విధంగా చర్చించారు.

*"మహాభారత యుద్ధ కాలం నాటి రాజకీయ వ్యవస్థ ఇది. ఆర్య సమాజం గంగా సింధు మైదానంలో విస్తరించివుంది. అది అనేక చిన్న పెద్ద భూభాగాలుగా విభజితమై వుంది. వాటిలో ప్రతిదాన్ని ఒక నిరంకుశ సమితులు నియంత్రించే పరిస్థితి లేదు. అతడు ఏదైనా చేయగలిగిన వాడు. గణాల లక్షణమైన సమానత్వం, ప్రాచీన నిరంకుశత్వాలలో మిగిలి ఉన్న ప్రజాస్వామ్యం అదృశ్యమై పోయాయి కొత్త సమాజం నాలుగు వర్ణాలుగా లేదా వర్గాలుగా విభజించబడింది. అందులో అట్టడుగున ఉన్న వారు ఇది వరకే చెప్పుకున్నట్లుగా శూద్రులు. వారే బానిస వర్గంగా ఉండేవారు. రాజకీయంగా ప్రతి తెగ ఏదో ఒక ప్రాంతానికి పరిమితమై ఉండేది. అదే ఆ తెగవార తమ కోసం ఏర్పరచుకున్న రాజ్యం. దానిపై రాజు నిరంకుశ అధికారం చలాయించగలిగేవాడు. రాజరికం వంశ పారం పర్యంగా వచ్చేది. ఉదాహరణకు విచిత్ర వీర్యుడి తర్వాత అతని కొడుకలైన పాండు రాజు, ధృతరాష్ట్రుడు అధికారంలోకి వచ్చారు. ఆతర్వాత పాండవులలో అగ్రజుడైన యుధిష్ఠిరుడు వారసుడయ్యాడు. సాధారణంగా అన్ని నిరంకుశ రాజరికంలోనూ అధికారం వంశ పారంపర్యంగా తండ్రి నుంచి కుమారుడికి సంక్రమిస్తుంది. (మోహన్ రాజ్, వి.ఎం.యోధుడు సారథి(భగవద్గీతకు భౌతికవాద వ్యాఖ్యానం), పుట:116).*

ఈ వివరాలు ఆనాటి కాలపు పరిస్థితులతోపాటు రాజుగా నియమించుకోవడానికి ప్రధానంగా వంశపారంపర్యం ఉందని తెలుస్తుంది.

మహాభారతం రాజనీతితో ఉందని చెప్పడానికి ఈ క్రింద వివరాలను నందుల గోపాలకృష్ణమూర్తి **'ఆంధ్రమహాభారతము–ఉపదేశము''**, గ్రంథంలో ఈ విధంగా వివరించారు. *"భారతము రాజనీతి రత్నాకరము, ఈ గ్రంథంలో అధిక భాగము రాజన్యుల చరిత్ర ఉండడంచేత రాజనీతి అనేక పాత్రల ముఖమున ప్రబోధించబడింది శకుని, కణికుడు, సంజయుడు, ధృతరాష్ట్రుడు మొదలైనవారు రాజనీతిని ఉపదేశించిరి. శ్రీకృష్ణుడు, విదురుడు, ధర్మరాజు మొదలైన వారు ప్రదర్శించిన రాజనీతి సర్వోత్తమమై*

*సర్వజన సౌఖ్యసంధాయకమై సర్వరాజర్షి సేవితమై అలరారుచున్నది. ”*
*(గోపాలకృష్ణమూర్తి, నందుల. “ఆంధ్రమహాభారతము–ఉపదేశము”, పుటం127.*

ఈ విషయాలు మహాభారతంలో రాజనీతి భాగం ఎక్కువ గా ఉందని, ఆయా పాత్రల ద్వారా అది ప్రస్ఫుటమై భావితరాల వారికి ఆదర్శంగా ఉందని అర్థమవుతుంది.

## 5.17. ప్రజాస్వామ్యం అవగాహన:

రాజరిక వ్యవస్థలో రాజు యుద్ధాల ద్వారా రాజ్యాన్ని పాలించడం గమనించవచ్చు అయితే దాని కంటే భిన్నమైన పరిపాలన విధానం ఆధునిక కాలంలో గమనించదగినది. దానినే ప్రజాస్వామ్య పరిపాలన అంటున్నాము. ఈ ప్రజాస్వామ్యం గురించి న అవగాహన నేటి కాలం ప్రజలకు చాలా అవసరం.

ప్రజాస్వామ్యం గురించి రాజనీతి నిపుణుడు ఇ. వెంకటేశు ఈ విధంగా చెప్తారు. *ఇవాళ రాజ్యాంగం అనేటటువంటిది మన రాజకీయ వ్యవస్థకు పునాది ఈ రాజకీయ వ్యవస్థ రాజ్యాంగం ఏమి చెపుతుంది. ప్రజా స్వామ్యం అనే విలువ మహాభారతంలో ఎక్కడైనా కనబడుతుందా ప్రజాస్వామ్యం అనేది ఆధునికమైనది ప్రజాస్వామ్యంతో పాటు స్వేచ్ఛా సమానత్వం, సౌభ్రాతృత్వం తర్వాత పౌరసత్వం అనేవి చాలా ముఖ్యమైనవి. (వెంకటేశు, ఇ. ముఖాముఖి).*

ఆర్థిక విజ్ఞానం గ్రంథంలో శ్రీ. వి.వి. నరసింహారావు ప్రజాస్వామ్య వ్యవస్థ గురించి ఈ విధంగా చర్చిస్తారు. *“మానవ జాతి సుదీర్ఘ చరిత్రలో అనేకరకాల ప్రభుత్వాలు రూపొందినవి. ఈ ప్రభుత్వ వ్యవస్థలన్నింటిలో పలుకుబడి కలిగిన కొందరు స్వలాభం కోసం ప్రజలనందరిని తమ అదుపాజ్ఞలలో ఉంచుకోవడం అనేది అంతా చెల్లుబాటవుతుంది. కాని దీనికి విరుగుడుగా రూపొందిన ఆధునిక రాజకీయ వ్యవస్థ ప్రజాస్వామ్యం.*

*విజ్ఞాన పిపాసులైన అధిక సంఖ్యాకులు సంఘ సంబంధమైన వ్యవహారాలలో జోక్యం కలిగించుకోవడానికి సంసిద్ధులైనప్పుడు సక్రమ పద్ధతిని పరిపాలన కొనసాగడమే*

*ప్రజాస్వామ్యం. పరిపాలనకు బాధ్యత వహిస్తున్న అధికార వర్గాలను శాంతియుతంగా పదభ్రష్టులను చేయడానికి ప్రజల మేలు కోసమే పరిపాలన కొనసాగించాలని ఒత్తిడి చేయడానికి పూర్తి స్వేచ్ఛ ఒక్క ప్రజాస్వామిక వ్యవస్థలో మాత్రమే ప్రజలకు ఉంటుంది. ప్రజాస్వామ్య ప్రభుత్వ వ్యవస్థలో వ్యక్తులకు సర్వ స్వాతంత్ర్యాలు ఉంటాయి. స్వాతంత్ర్యం శూన్యమైనప్పుడు మానవులు బాధ్యతలు గుర్తించిన పౌరులుగా గాని ఆదర్శ సాధనాపేక్షులైన వ్యక్తులుగాగాని రూపొందరు సముచిత జ్ఞానం, స్వాతంత్ర్యావకాశాలు కలుగజేసినప్పుడు వ్యక్తులు తమ సహజ శక్తులను అభివృద్ధి చేసుకోవడానికి గల పరిస్థితులను సద్వినియోగం చేసుకొనగలరుకూడా ప్రపంచం మొత్తం మీద సహన భావం కొరవడడం జాతి విద్వేషం రాజకీయ అవినీతి ప్రబలడం వల్లను, పౌర బాధ్యతల పట్ల అధిక సంఖ్యాకులు అలసత్వం చూపుతున్న ఫలితంగాను, అసలు ప్రజాస్వామ్యానికి భవిష్యత్తు కలదా అనే ప్రశ్న నేడు సర్వత్రా వినిపిస్తున్నది.''( నరసింహారావు,పి.వి.వి., ఆర్థిక విజ్ఞానము, పుట:174,175).*

వీరి అభిప్రాయం ప్రకారం పైకి ప్రజాస్వామ్య వ్యవస్థ అంటున్నాము కాని ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రభుత్వము ప్రజలకు కావలసిన అవసరాలను సంపూర్ణ స్థాయిలో అందింస్తుందా లేదా అనేది ఆలోచించవలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజలు స్వేచ్ఛగా తిరగడానికి , సంపాదించుకోవడానికి, తగిన అవసరాలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమాలోచించుకొంటూ ప్రజాపరిపాలన కొనసాగించాలని అప్పుడే ప్రజాపాలన కాగలదని వీరి మాటల్లో అర్థమవుతుంది. ప్రజాపాలనలో ఎప్పుడూ అవినీతి రాజకీయ అంశాలు చోటుచేసుకోకుండా పరిశీలించడం గమనించదగినది.

అయితే ఇటువంటి ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రాచీన రాజనీతి వ్యవస్థలో కూడా ప్రజాస్వామ్య ఛాయలు కనబడుతున్నాయని అప్పటి రాజనీతి పూర్తి రాజరిక వ్యవస్థ కాదని చెప్పే వారు ఉన్నారు వారిలో పి.వి రెడ్డి శ్రీరామకృష్ణ ప్రభ మాస పత్రికలో హైందవ రాజ్యాంగ వ్యవస్థ అంశంలో ఈ విధంగా తెలియజేస్తారు.

*"ప్రాచీన మధ్య యుగాల భారతదేశానికి ప్రజాస్వామ్యం తెలియదనుకోవడానికి వీలు లేదు గ్రామ పంచాయతీలు, సభలు, సమితులు, మహానాడుల లాంటి ప్రజాసంస్థలు ప్రజాస్వామ్యాన్ని పాటించాయి. ఈ సంస్థలలో నాయకులను ఎన్నుకునే పద్ధతులను కొన్ని గ్రంథాలు శిలాశాసనాలు వివరించాయి. వైదిక కాలంలో రాజులు ప్రజలు ఎన్నుకున్న సామాజిక నాయకులు యువరాజుకు పట్టాభిషేకం చేసే ముందు కూడా ప్రజల అనుమతి తీసుకునే వారు. రాజ్యమనేది రాజు యొక్క వ్యక్తిగత ఆస్తి కాదు కాని ఆయన తన ఆదాయం నుండి భూములు భవనాలు ఇతర ఆస్తులు సంపాదించుకోవచ్చు. ఐతరేయ బ్రాహ్మణం కాలం (క్రీ.పూ. 3000) నాటికే ప్రజాతంత్ర రాజ్యాలుండేవి. పరిపాలకులు, సత్య ధర్మాలను పాటించాలని ఆశించేవారు. వారు మంత్రి పరిషత్ నిర్ణయాలను పాటించాల్సిన ధర్మం ఉండేది. దుర్మార్గులైన రాజులను తొలగించడం చంపివేసిన సందర్భాలు ఉన్నాయి." (శ్రీరామకృష్ణ ప్రభ మాస పత్రిక, పుట:12.).*

వీరి అభిప్రాయం ప్రకారం రాజరిక వ్యవస్థ అనేది మాత్రమే ఆనాడు ఉందని ప్రజలకు స్వేచ్ఛ లేదని అనడానికి వీలు లేదు ప్రజాభిప్రాయంతో పాలన సాగించిన రాజులు కూడా ఆనాడు కనబడుతున్నారని వీరి మాటల వలన తెలుస్తుంది.

### 5.18. నన్నయ కాలం నాటి రాజకీయ వ్యవస్థ:

నన్నయ కాలం నాటి రాజకీయ పరిస్థితులను గమనిస్తే మహాభారతంలో నన్నయ తన కాలం నాటి పరిస్థితులు ప్రతిబింబించే అంశాలు ఏమైనా ఉన్నాయేమో తెలుసుకునే వీలుంది.

జి. నాగయ్య తెలుగు సాహిత్య సమీక్షలో నన్నయ కాలం నాటి రాజకీయ పరిస్థితులను ఈ విధంగా చర్చించాడు.

"భారత కృతిపతియైన రాజ రాజ నరేంద్రుడు క్రీ.శ. 1022 ఆగష్టు 22 న పట్టాభిషిక్తుడై క్రీ.శ 1061 వరకు రాజ్య పరిపాలన చేసెను. కాని ఆ పరిపాలనను అవిచ్ఛిన్నముగ జరగలేదు. రాజరాజు సవతి సోదరుడైన విజయాదిత్యుడు కర్ణాట కళింగ

గాంగుల సహాయంతో వేగి సింహాసనమును ఆక్రమించాడు. చోళుల సహాయంతో రాజరాజు మరల వేగిని స్వాధీనము చేసుకొనెను. రాజరాజు పది సంవత్సరములు పరిపాలన సాగించిన తరువాత క్రీ.శ 1031 లో విజయాదిత్యుడు కర్ణాటక సైన్యముతో బెజవాడను స్వాధీనము చేసుకొనెను. పది సంవత్సరాల తరువాత రాజరాజు మరలా కష్టాలనుభవించాడు. క్రీ.శ 1047 లో మరల రాజరాజు వేగిని స్వాధీనము చేసుకొనెను. చేతనభట్టు రణస్థపూడి శాసనంలో కలిదిండి యుద్ధమును వర్ణించాడు. ఈ యుద్ధములో కర్ణాట రాజ్య సైన్యముతో విజయాదిత్యుడు, చోళ సైన్య సహాయంతో రాజరాజు పోరాడినట్లు తెలియుచుననన్నది. కొల్లిపాక యుద్ధములో రాజరాజు విజయాదిత్యుని సంపూర్ణముగా ఓడించాడు. తరువాత దక్షిణాపథంలో కొంత శాంతి కలిగింది. ఆ పన్నెండు సంవత్సరాల కాలంలోనే రాజరాజు విద్యాపోషకుడుగా , అగ్రహార దాతగా, ప్రజాశ్రేయస్కాముడుగా సుపరిపాలన చేసిఉన్నాడు. ఆ కాలమునే భారత రచనకు నన్నయను వినియోగించి యుండునని పలువురి అభిప్రాయం. రాజరాజు తన రాజధానిని మొదట బెజవాడకు తరువాత రాజ మహేందర వరమునకు మార్చినాడు. కుప్పము యుద్ధము (క్రీ.శ1053) రాజరాజును అడుగడుగ ఆదుకుంటున్న చోళుఃలకు పరాజయము కలిగినది. త్రైలోక్య మల్లుని సామంతుడగు దడిగదేవుడు చోళచక్రవర్తి రాజాధిరాజు శిరమును ఖండించి తన ఏలికకు కానుకగ పంపెను. రాజాధిరాజు తమ్ముడు రాజరాజు బావమరిది అగు రాజేంద్రదేవుడు యుద్ధరంగము నుండి పారిపోయెను. కుప్పము యుద్ధము తరువాత రాజరాజుకు పశ్చిన చాళుక్యులతో సంధితప్ప మరి గత్యంతరమ లేదు. పశ్చిమ చాళుక్యుల ప్రధానామాత్యుడు వాసనమధుసూదనయ్య అతని బంధువైన నారాయణ భట్టు నన్నయకు సహాధ్యాయి . నన్నయ రాయబారియై త్రైలోక్య మల్లదేవర ఆస్థానమున వెళ్ళి నారాయణ భట్టు సహాయముతో రాజరాజుకు పశ్చిమచాళుక్యుల రాయబారిగా కుదుర్చుకున్నాడు. నన్నయ తనను గురించి పాత్రు అను విశేషణమును చెప్పుకున్నాడు. సంధి విగ్రహ పాత్రుడనెడు ఉద్యోగి నేటి రాయబారం వంటి వాడు నారాయణ భట్టు నన్నయకు భారత రచనమున తోడ్పడ్డాడు.(నాగయ్య.జి.తెలుగు సాహిత్య సమీక్ష, పుట:101,102).''

నన్నయ కాలం నాటి చారిత్రక అంశాలు ఎలా ఉన్నాయో పై వివరాలను పరిశీలిస్తే తెలుస్తుంది.

### 5.18.1. నన్నయ కాలం నాటి రాజకీయ విశేషాలు:

నన్నయభారతి (వ్యాససంకలనం) లో ఖండవల్లి లక్ష్మీరంజనం '**నన్నయనాటి సాంఘిక, రాజకీయ పరిస్థితులు** ' వ్యాసంలో ఈ విధంగా తెలియజేసారు.

*"ఆంధ్రమహాభారత కాలం నాటికి ప్రజాభిప్రాయము ప్రాముఖ్యతను కోల్పోయి రాజుల ఆధిక్యత సుస్థాపితమయ్యెను సంస్కృత భారతములో రాజుల వంశనామములుగాని వారి పేర్లు కాని తరచు పేర్కొనబడవు. తరచుగా ప్రజానామములు వినబడుచుండును. కురువులు పాంచాలురు. మాగధులు, యదు వృష్ణిభోజులు, వంగ, కళింగ, కాశ్మీర, కాంభోజ, గౌడాంధ్రులు, ఇట్లు రాజులు తాము పాలించు ప్రజానామములచే పేర్కొనబడుచుండిరి. రాజరాజనరేంద్రుని ఉత్తమ చాళుక్యుడు, విమలాదిత్య తనూజుడు రాజమహేంద్రుడు అనినన్నయ సంబోధించునేగాని ఆంధ్రుల పేరుతో పిలువడు. రాజసూయాధ్వరమప్పుడు ధర్మరాజుకు కానుకలు చెల్లించినవారని చెప్పిన వారిలో అనేకమంది రాజులు లేనివారుగా ఉన్నారు. (నన్నయభారతి, జగన్నాథం పేర్వారం, (గౌరవ సంపాదకులు), రామబ్రహ్మం, బేతవోలు, సూర్య భాస్కరరావు గొల్లకోట(సంపాదకులు),పుట:205).*

ధర్మరాజును యువరాజుగా చేయగోరి ధృతరాష్ట్రుడు ప్రజల యొక్క కోర్కెలను కూడా మనసులో ఉంచుకొనెను. ధర్మరాజు సద్గుణములను బట్టియే అతని యువరాజును చేసెను.

*"ధృతి స్థైర్యసహిష్ణుత్వా దానృశం స్యాత్తధార్జవాత్*
*భృత్యానా మనుకంపార్థం"*

నన్నయ ధృతరాష్ట్రుడు యుధిష్ఠరుడు రాజ్య భార దురంధరునిగా నెఱింగా భీష్మ విదురులతో ఆలోచించి యౌవరాజ్యాభిషిక్తుని చేసెను. సద్గుణములు కలవాడని కాని, ప్రజలను సంతోషపెట్టుటకై చేసెనని గాని చెప్పకపోవడం చేత నన్నయ యౌవరాజ్యమునకు వయస్సు ఒక్కటే ప్రధానమైనట్లు సూచించినాడు. అతని కాలములో యువరాజును చేయుటకు ప్రజాభిప్రాయమక్కరలేదు. రాజకుమారుడైనంత మాత్రముచేత యువరాజగుట సహజమని అతని అభిప్రాయము. **(నన్నయభారతి, (వ్యాససంకలనం), జగన్నాథం పేర్వారం, (గౌరవ సంపాదకులు), రామబ్రహ్మం, బేతవోలు, సూర్య భాస్కరరావు గొల్లకోట(సంపాదకులు),పుట:206).**

### 5.18.2. పౌరుల హక్కులు:

పౌరుల హక్కుల గురించి **నన్నయభారతి (వ్యాససంకలనం)** లో ఖండవల్లి లక్ష్మీరంజనం '**నన్నయనాటి సాంఘిక, రాజకీయ పరిస్థితులు** ' వ్యాసంలో ఈ విధంగా తెలియజేసారు.

*"పౌరులు సంస్కృత భారతము వ్రాయబడ్డ రోజులలో తమ అధికారమును గుర్తెరిగి సభలలోను, చతుష్పథములందును తమ అభిప్రాయములను నిస్సందేహముగా వెలిబుచ్చుచుంటిరి. రాజులను చేయుటకు వారిని సింహాసన భ్రష్టుల చేయుటకును వారికి అధికారము కలదని వారికి తెలుసు. రాజు ధృతరాష్ట్రుడైనను అతని కుమారుడైన దుర్యోధనుని కాదని యుధిష్టురుని రాజుగా చేయగోరుచున్నాడు.*

*గుణైస్సముదితాన్ దృష్ట్వా పౌరాః పాండుమతాం స్థథా*
*కథయాం చక్రిరే తేషాం గుణాన్ సంసత్సుభారత*
*రాజ్య ప్రాప్తించ సంప్రాప్తం జ్యేష్ఠం పాండుసుతం తథా*
*కథయంతి స్మ సంభూయ చత్వరేషు సభాసు చ*
*తే వయం పాండవ జ్యేష్ఠం తరుణం యుద్ధశీలినమ్*
*అభిషించామ సాధ్వద్య సత్య కారుణ్య వేదినమ్"*

మూలంలో ఇంత స్పష్టముగా ఉన్నను. నన్నయ పౌరసభలను గురించియు చత్వారముల గురించియు ఏమి చెప్పదు. ఆ సభలు ఎట్టివో ప్రజలే మరచిపోయారు. నన్నయ కాలం నాడు ప్రజలు కేవలం ధనకనక వస్తువాహనముల లాగా ఒక రాజు నుండి మరియొక రాజునుకు ఇవ్వబడువారే కాని వారు రాజుల సింహాసనమెక్కించుట. పదభ్రష్టుంచేయుట తమ హక్కులని యెరుగరు. ((నన్నయభారతి, (వ్యాససంకలనం), జగన్నాథం పేర్వారం, (గౌరవ సంపాదకులు), రామబ్రహ్మం, బేతవోలు, సూర్య భాస్కరరావు గొల్లకోట(సంపాదకులు),పుట:208).

ఈ వివరాలన్ని నన్నయ కాలం నాటి రాజ్యపరిపాలనా విషయాలను రాజరిక వ్యవస్థను తెలుపుతున్నాయి.

## 5.19. తిక్కన కాలం నాటి రాజకీయ వ్యవస్థ:

"క్రీ.శ 12 వ శతాబ్దము చివరి భాగములో మహమ్మదీయులు భారతదేశములో చాలా భాగమును ఆక్రమించినందున నూతన పరిస్థితులు నెలకొన్నది. దక్షిన భారతములో చోళులు,చాళుక్యులతో పాటు కాకతీయులు తమ తమ రాజ్యములను స్థాపించుకొని పరిపాలించుచుంటిరి. తెలుగు దేశమునంతటిని ఒకే పరిపాలన క్రింద మొట్టమొదట తీసుకు వచ్చిన వారు కాకతీయులు. కాకతి గణపతి దేవుని కాలము (క్రీ.శ 1199-1261), లో సకలాంధ్రము ఏక ఖండముగా పరిపాలితమైనది. కాకతీయులు బలపడినందున చిన్న చిన్న మాండలిక ప్రభువుల మూలమున కలుగుచుండిన కల్లోలములు నశించి దేశము ప్రశాంతమైనది. సారస్వత సృష్టికి విద్య విస్తఈతికి తగిన అవకాశం ఏర్పడినది. ఈ అవకాశమును పురస్కరించుకుని భారతస్థమగు ఆర్ష విజ్ఞానమున దేశమును వ్యాపింప జేసినవాడు తిక్కన.(నాగయ్య,జి. తెలుగు సాహిత్య సమీక్ష, పుట:286).

తెలుగు చోళులైన తిక్కన భూపతి మనుమసిద్ధి మొదలగు వారు ఓరుగంటి కాకతీయులకు సామంతులు, తిక్కన నెల్లూరు ప్రాంతమును పరిపాలించిన మనుమసిద్ధి

తిక్కనను మామా అని పిలిచెడివాడు. మనుమసిద్ధి రాజ్యము ఆరంభ కాలమున ప్రశాంతంగా సాగినట్లు కనిపించదు. తిక్కన బయ్యనలను దాయాదులను అతని సింహాసన భ్రష్టుని గావించి రాజ్యము ను ఆక్రమించిరి అప్పుడు మంత్రియు మిత్రుడనైన తిక్కన తిరిగి మనుమసిద్ధి రాజ్యమతనికి ఇప్పించుటకు ఆంధ్రచక్రవర్తియైన గణపతి దేవమహారాజు సహాయం అర్థించినాడు. ఓరుగల్లులో తిక్కనకు గణపతి దేవుడు బ్రహ్మాండమైన స్వాగతమిచ్చినట్లు కాసెసర్వప్పకవి రచించిన సిద్ధేశ్వర చరిత్రను బట్టి తెలియుచున్నది. తిక్కన ఓరుగంటిలో బౌద్ధ పండితులతో చర్చలు గావించి వారిని ఓడించి గణపతి దేవుని ప్రశంసలు పొంది అతని సహాయంతో తిరిగి నెల్లూరుకువ్చి మనుమసిద్ధిని పట్టాభిషిక్తుని గావించాడు. గణపతి దేవుని ఆస్థానములో తిక్కన భారతమును చదివినట్లు మనకు తెలియుచున్నది. అప్పటికి తిక్కన ఇంకను నిర్వచనోత్తర రామాయణమును కాని భారతమును కాని రచించలేదు. అతడు తనఅత్యంత అభిమానపాత్రమైన సంస్కృత భారతమును పురస్కరించుకొనియే భారత కథాయుద్ధ విశేషములను ధర్మ తత్త్వములను గణపతి దేవునకు చెప్పియుండెను. ఆ రాజుఅతని పాండితీ పాటవమునకు వివరణ పద్ధతికి వాద ప్రౌఢికి మెచ్చి అతనిని బహువిధముల గౌరవించియుండెను. ఇట్లు గణపతి దేవుడే కాక తిక్కన కూడా మనుమసిద్ధి రాజ్యస్థాపనాచార్య బిరుదమునకు తగియున్నాడు. తిక్కన మనుమ సిద్ధికి పోయిన రాజ్యమును సంపాదించి పెట్టినాడు. ఉన్నదాయాదులను రూపు మాపినాడ. మనుమసిద్ధికి అతని దాయాదులకు జరిగిన కలహము మహాభారతములోని జ్ఞాతుల కలహమువంటిది కావచ్చును. దీనిని బట్టి నెల్లూరు చోడుల అంతఃకలహములో తిక్కన పూర్తిగా పాల్గొనియుండును. ఈ యుద్ధములకు ముందు రాయబారాములలో సంధిబేరములలో సహాయ సంపత్తులు సేకరించుటలో తిక్కనక ఉద్యోగపర్వము అనుభవమునకు వచ్చి ఉండెను. యుద్ధపంచకము కళ్ళకు కట్టినట్లుండును. నిజజీవితంలో భారత కథను చూచిన తిక్కన నన్నయ వదిలి పెట్టిన మహాకావ్యమును పూర్తిచేయాలని సంకల్పించెను.

తిక్కన రాజ్యతంత్రము రణతంత్రము సమానముగానిర్వహించిన కుటుంబమునకు చెందినవాడు. అతని తాత మంత్రి భాస్కరుడు .గుంటూరు విభుడు, విశేషించి సారకవితాభిరాముడు. అతని తండ్రి కొమ్మన దండనాథుడు. మహావీరుడగు ఖడ్గతిక్కన అతనికి సోదరుని వరుసవాడు. అటువంటి ఉదాత్త సంస్కృతికి ఆటపట్టయిన వాతావరణంలో పుట్టి పెరిగిన ప్రజ్ఞాశాలి తిక్కన ఒక సామంతరాజుకు మంత్రిగా ఉండుట వలన భారతదేశ పరిస్థితులు ఇరుగు పొరుగు ప్రాంతమందలి పరిస్థితులు తెలుగు దేశ పరిస్థితులు ఆనాటి సమాజము అందలి గుణదోషములు ఆ సమాజము త్రొక్కవలసిన మార్గము మొదలైనవి తిక్కనకు కరతలామలకములు పరిపక్వమైన అనుభవముతో పరిపూర్ణమైన విద్యాబలముతో సామాజిక అవగాహనతో తిక్కన కవితారంగమున ప్రవేశించాడు. పంచమవేదమని ప్రసిద్ధిపొందిన జనులందరికి ఆరాధ్య గ్రంథమైన మహాభారతమును భవ్యపురుషార్థఫలము కొరకు ఆంధ్రావళికి మోదముకలుగునట్లుగా తెలుగు భాషలో రచించాడు.(నాగయ్య,జి. తెలుగు సాహిత్య సమీక్ష,పుట:287,288).

తిక్కన సంగ్రామకళావ్యూహరచనములందు అగ్రేసరుడు. అతని భారతం లోకోత్తరమైన వీర కావ్యం విరాటుడు ఉత్తరుని యుద్ధపద్ధతిని అడిగే సందర్భంలో తిక్కన వర్ణించిన తీరు ఈ విధంగా ఉన్నది.

''బాసట లేదు క్రొవ్వడర బంటు తనంబున దాకి తేనియుం
బాసిన చోట వాయుఁచెఱిపట్టుల వీరులు దగ్రవృత్తిమై
మూసికొనంగ వతురొకమోహర మమ్ముల మ్రగ్గనేని నా
సానల నొక్కరుండ యనునాగ్రహవృత్తిబలంబుపై బడున్ (విరాట.5.280).

ఇందులో ఒకవీరుడు పలువురు యోధులను తాకు సందర్భంలోని చిక్కులను తిక్కన విశదంగా వివరించాడు. ఇతర కవులవలె పాఠకులకును కేవల బాణ సంఖ్యావివరాల్తోనూ సైనికుల కోలాహలంతోను విసిగింపక తిక్కన ఆయా సందర్భాల యందలి క్లిష్ట పరిస్థితులను యోధుల శౌర్య ధైర్యాలను ధర్మాధర్మాల చర్చను దైవ పౌరుష చర్చలను హృదయసంవాదాలను చక్కగా వివరించి సహజత్వాన్ని ఆపాదించాడు.

*తిక్కన ఇరుపక్షాలలోని ప్రధానవీరులెవరితో తలపడి యుద్ధం ఎలా సాగించారో నిపుణంగా వర్ణించాడు. అతడు ఏకైక వీర విజృంభణాన్ని జంటవీరుల యుద్ధ క్రమాన్ని సంకుల సమరాన్ని ద్వంద్వయుద్ధాన్ని శస్త్రాస్త్ర గదాయుద్ధములను ప్రత్యేక నైపుణ్యంతో విశదీకరించాడు. (అనంతరామ శాస్త్రి, నేతి, కవిత్రయభారతం- రాజకీయ నేపథ్యం, పుట:9).*

తిక్కన రాజనీతిజ్ఞత గురించి ఎంత చెప్పినా తక్కువే కేవలం అతని కాలం నాటి రాజకీయ పరిస్థితులు భారతరచనకు ప్రేరణ కావచ్చు కాని తిక్కనే స్వయంగా రాయబారాలు నడపడం, యుద్ధనైపుణ్యాన్న తెలిసినవాడు కావున భారతం భావితరాల వారికి అమృతమయమైన ఇతిహాసంగా గుర్తించబడుతూ వస్తుంది. ద్రుపద పురోహిత రాయబారం, సంజయరాయబారం, శ్రీకృష్ణరాయబారం లలో వారు చూపిన ప్రతిభా చాతుర్యం, రాజనీతిని క్షుణ్ణంగా పరిశీలిస్తే వారి మనోగతం సంపూర్ణంగా తెలుస్తుందని నా అభిప్రాయం.

### 5.20. ఎఱ్ఱన కాలం నాటి స్థితి:

ఎఱ్ఱన కవి కాకతీయ సామ్రాజ్య పతనానంతరం ప్రాగాంధ్ర దేశాన్ని ఉద్ధరించిన ప్రోలయ వేమారెడ్డి ఆస్థాన కవి కాబట్టి ఇతడు 1323-49 సంవత్సరాల మధ్య జీవించి ఉంటాడని ఊహించవచ్చు. ఎఱ్ఱన కవిత మూర్తి గానే కాని అతని జీవిత విశేషాలను తెలుసుకోవడానికి తగిన ఆధారాల్లేవు. ఎఱ్ఱాప్రగడ అరణ్య పర్వ శేషాన్ని పూరించాడు.(అనంతరామ శాస్త్రి, నేతి,కవిత్రయ భారతం-రాజనీతి', పుట:13).

ఈ అధ్యాయంలో రాజనీతి అంశాలను పేర్కుంటూనే రాజనీతి కథలను కొన్నింటిని పేర్కున్నాను. అలాగే నన్నయ, తిక్కన, ఎఱ్ఱన కాలం నాటి రాజనీతి విశేషాలను లోతులకు వెళ్లకుండా కొంత వరకు పరిచయం చేసాను. మహాభారతం కాలం నాటి రాజనీతి వ్యవస్థను కూడా ఈ అధ్యాయంలో వివరించాను.

## 5.21. . ముగింపు:

నా అవగాహన మేరకు మహాభారతాన్ని పరిశీలించాను మహాభారతాన్ని పరిశీలించడమంటే మహాసాగరాన్ని ఈదడం ఎంత కష్టమో మహాభారతాన్ని పరిశీలించి అందులోని అన్ని విషయాలను వెలికితీయడం అంతే కష్టం. ఆంధ్రమహాభారతంలో ఉన్న పద్దెనిమిది పర్వాలు, సంస్కృత భారతంలో ఉన్న నూరు పర్వాలను కేవలం చదవడానికే రెండు సంవత్సరాలు పట్టింది. నా కాల వ్యవధిని దృష్టిలో ఉంచుకుని నా పరిశోధనకు సంబంధించిన అంశాలను కొన్ని అంశాలను మాత్రమే నా ఆలోచన మేరకు నాకు కలిగిన భావాలను కొన్నింటిని మాత్రమే తెలియజేసాను. నా పరిశోధనలో భాగంగా తొమ్మిది మంది ప్రముఖులతో ముఖాముఖిని నిర్వహించాను. ఇంకా పరిశీలించాల్సిన అంశాలు చాలా ఉన్నాయి. భావి తరాల జ్ఞానులు వీటి మీద విస్తృత పరిశోధనలు చేస్తారని ఆశిస్తున్నాను.

ఈ విధంగా రాయబారాలు రాయబారాలలో జరిగిన రాజనీతి ని పరిశీలించడం జరిగింది. కొన్ని రాయబారాలు స్వప్రయోజనం కోసం జరిగితే హంస రాయబారం వంటివి,కొన్ని రాయబారాలు లోకహితం కోసం జరిగాయి శ్రీకృష్ణ రాయబారం వంటివి, కొన్ని రాయబారాలు తమ కార్యాన్ని సఫలం చేసుకోకలిగాయి కొన్ని రాయబారాలు విఫలం చెంది తగిన ఫలితాంశాలను నెరవేర్చుకోలేకపోయాయి. ఇప్పటి వరకు పేర్కొన్న రాయబారాలు ప్రధానమైనవిగాను కొన్ని అప్రధానమైనవిగానూ గోచరిస్తాయి వాటిని ఆయా సందర్భాలలో వివరించాను. అంతే కాకుండా నేటి అంతర్జాతీయసంస్థ రూపొందించిన రాయబారాలను కొంత వరకు పరిచయం చేసి మహాభారతానికి దగ్గరగా ఉన్న రాయబారాలను మహాభారతంలోని సంఘటనలను ఉదాహరించాను.

రాయబారాలు లో ఎటువంటి విషయాన్ని ప్రస్తావించారనే విషయాన్ని పరిశీలిస్తే అనేక అంశాలు బోధపడతాయి. అయితే ఆ రాయబారం జరగకపోతే కలిగే పరిణామాలు ఊహిస్తే రాయబారం యొక్క ప్రాముఖ్యత ఆ కాలంలో ఎటువంటిదో తెలుస్తుంది.

అలా ప్రతి రాయబారాన్ని లోతుగా పరిశీలిస్తే ఆ రాయబారానికి తర్వాత జరగబోయే సంఘటనలకు ఏమైనా సంబంధం ఉందా లేదా అనే విషయం స్పష్టమవుతుందని నా అభిప్రాయం.

అలాగే రాజనీతి ఈ పదం యొక్క చరిత్రను పరిశీలిస్తే ఆ పదం యొక్క పవిత్రత ఎటువంటిదో తెలుస్తుంది.

పవిత్రత అనే పదం ఎందుకు ఉపయోగించవచ్చనే ప్రశ్న వేసుకుంటే రాజనీతి అనేది వ్యక్తి సంస్కరణకు, సమాజ పురోగతికి సంబంధించింది.

కాని నేటి కాలంలో క్రొత్త అర్థంగా రాజనీతి పదం ఉపయోగపడుతుంది. ఎవరైనా అర్హత లేని వ్యక్తి ఉన్నత పదవి చెపడితే రాజకీయం చేసి ఆ స్థాయికి వచ్చాడని చెప్పుకుంటారు. ఇలా అక్రమంగా జరిగే వాటికి రాజకీయ పదం ఉపయోగించడం అక్కడక్కడ కనబడుతుంది.

ఈ పరిశోధనలో మహాభారతం లో చెప్పిన రాజనీతి అంశాలను చర్చిస్తూనే నేటి రాజకీయంలో ఎటువంటి పరిణామాలు చోటుచేసుకున్నాయో వివరించాను. వీటిని అనుకరించినట్లైతే మన సమాజం సంస్కరణ సమాజంగా రూపుదిద్దుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని నా అభిప్రాయం.

# పరిశోధన ఫలితాంశాలు:

ఆధునిక  ప్రపంచంలో ముఖ్యంగా నేటి తరం వారికి ప్రాచీన సాహిత్యం పట్ల అవగాహన, ఇతిహాసాల పట్ల సదభిప్రాయాన్ని కలిగించడానికి ఈ పరిశోధన ఉపయోగపడుతుందని భావిస్తున్నాను.

రాయబారం అంటే అందరికి శ్రీకృష్ణ రాయబారం,ద్రుపద పురోహితుని రాయబారం, సంజయ రాయబారం, ఉలూకుని రాయబారం వీటినే చెప్తారు. కాని ఒక సందేశాన్ని అందించడమే రాయబారమని అభిప్రాయపడితే చాలా రాయబారాలు మహాభారతంలో స్ఫురిస్తాయి. వాటిని పొందుపరిచే ప్రయత్నం ఈ పరిశోధనలో చేసాను. రాయబార లక్షణాలను, రాజనీతి అంశాలను పేర్కుంటూ అవి మహాభారతంలో ఎంత వరకు నిక్షిప్తమయ్యాయో పరిశీలించాను. అంతే కాకుండా నేటి ఆధునిక రాజకీయాలను పరిచయం చేస్తూ ఏ సూత్రాలను పాటించడం ద్వారా పరిపాలన  ప్రజారంజకంగా ఉంటుందో వివరించాను. దీని వలన నేటి తరం వారికి పరిపాలన పట్ల సమాజం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించడం నేర్చుకుంటారు.

# సింహావలోకనం

**"ఆంధ్రమహాభారతంలో రాయబార ఘట్టాలు రాజనీతిజ్ఞత "** అనే సిద్ధాంత వ్యాసాన్ని ఐదు అధ్యాయాలుగా విభజించాను ఒక్కొక్క అధ్యాయంలో నిక్షిప్తం చేసిన అంశాలను ఈ క్రింది సంక్షిప్తంగా వివరిస్తున్నాను.

**మొదటి అధ్యాయం ()మహాభారత ప్రాశస్త్యం):**

మహాభారతం యొక్క గొప్పతనాన్ని వివరించడమే కాకుండా ఈ అధ్యాయంలో ప్రధానంగా మహాభారతం పేరులోని అంతరార్థాన్ని వివరించాను. ప్రామాణికమైన అంశాలను ఉదాహరణలుగా తీసుకుని మహాభారతం 'జయ' కావ్యంగా ఎలా పరిణమించిందో వివరించాను. మహాభారతాన్ని ప్రపంచ దేశాలు ఏ విధంగా గౌరవించాయి ఏ విధంగా ప్రపంచానికి విస్తరించిందో ఈ అధ్యాయంలో పేర్కొన్నాను. మహాభారత ప్రాశస్త్యంతో పాటు గురు ప్రాముఖ్యతను వివరించే ప్రయత్నం చేసాను. అలాగే గురుశిష్యుల కథలను కొన్నింటిని వివరించాను. అన్నింటి కంటే ప్రదానంగా మహాఆభారత ప్రాశస్త్యాన్ని ఆధ్యాత్మిక ప్రముఖుల అభిప్రాయాలను పొందుపరిచి వాటిని విశ్లేషించాను.

**రెండవ అధ్యాయం(మహాభారతంలో ధర్మనీతి దృక్పథాలు పరిశీలన:**

ఈ అధ్యాయంలో ధర్మం అంటే ఏమిటి ధర్మంలో గల భేదాలు ధర్మం ధర్మ సూక్ష్మాల మధ్యగల భేదం ఏమిటి? ఆంధ్రమహాభారతంలో ధర్మానికి సంబంధించిన బోధనలు మహర్షులు చెప్పిన ధర్మాలు ధర్మం ధర్మ సూక్ష్మం గురించి ప్రముఖులు చెప్పిన అభిప్రాయాలను వివరిస్తూ విశ్లేషించాను.

వ్యాసుని పుట్టుకలో ద్రౌపది వివాహ విషయంలోనూ అనేకమంది సందేహాలు వ్యక్తం చేస్తుంటారు ఆ సంఘటనల్లోని ధర్మ విచారణను ఈ అధ్యాయంలో వివరించే ప్రయత్నం చేసాను.

**మూడవ అధ్యాయం(సంస్కృతాంధ్ర మహాభారతాలు రాయబార ఘట్టాలు పరిశీలన)**

రాయబారం గురించి పరిచయం చేసి దూత శబ్దం ఎలా పుట్టిందో ఈ అధ్యాయంలో పేర్కున్నాను. రాయబార లక్షణాలను రాయబార నియమాలను సంస్కృత భారతంలో శ్రీకృష్ణుడు చెప్పిన రాయబార లక్షణాలను విశ్లేషించడం దూత ఎలా ఉండాలో బలరాముడు, సాత్యకి, ద్రుపదుడు తెలిపిన రాయబార లక్షణాలను వివరించి . సాధ్యమైనంత వరకు పర్వాలలోని రాయబారాలను పేర్కొంటూనే సంస్కృత భారతంలో రాయబారాలను ఆంధ్రమహాభారతంలోని రాయబారాలకు మధ్య వ్యత్యాసం ఏమైనా ఉందా అని పరిశీలించాను. సంభాషణల్లో మార్పులు గమనించినంత వరకు సూచించాను. అంతే కాకుండా రాయబార లక్షణాలను మహాభారతంలో ఏ సందర్భంలో ఏ సన్నివేశంలో ఉందో అన్వయించాను.

**నాల్గవ అధ్యాయం: ఆంధ్రమహాభారతం రాజనీతి:**

ఈ అధ్యాయంలో రాజ్యము వివరణ రాజ్యం యొక్క విధులు , రాజనీతి , రాజు పరిపాలన రాలు లక్షణాలు వీటిని వివరిస్తూనే రాజనీతి లక్షణాలు మహాభారతంలో ఏ మేరకు ప్రస్తావించబడ్డాయో వివరించాను. మనుస్మృతిలో చెప్పిన రాజనీతి అంశాలు. మహాభారతానికి అన్వయించడం, కౌటిల్యుడు మాకియోవెల్లి, ఆలోచన విధానం ఏ విధంగా సాగింది. మాకియోవెల్లి భావాలను కొంతమంది సమర్థించారు మరికొంతమంది విమర్శించారు. ఈ వివరాలను పొందుపరిచి విశ్లేషించాను. మాకియో వెల్లి ఆలోచన రీతిని, రాజనీతి విషయాలను ద ప్రిన్స్ గ్రంథంలో పొందుపరిచాడు. ఆ గ్రంథంలోని విషయాలు మహాభారతంలోని కణికుడు చెప్పిన కూటనీతికి దగ్గరగా ఉన్నాయనిపించింది. ఆ వివరాలను సంస్కృత భారతంలోని శ్లోకాలను ఉదాహరిస్తూ వివరించాను. కూటనీతి అనేది కపటమైన వ్యక్తుల దగ్గర రాక్షస స్వభావం కలిగిన వారి దగ్గర ఉపయోగించడంలో తప్పులేదని శ్రీకృష్ణ రాజనీతి తెలియజేస్తుంది. ఏ సందర్భంలో శ్రీకృష్ణుడు ఈ రాజనీతిని ఉపయోగించాడో వివరించాను.

**ఐదవ అధ్యాయం( రాజనీతి కథలు రాజకీయ వ్యవస్థ):**

ఈ అధ్యాయంలో రాజనీతికి సంబంధించిన కొన్ని కథలను పరిచయం చేస్తూ రాజనీతి అంశాలను వివరించాను. ఆధునిక రాజకీయ పరిణామాలను కొన్నింటిని వివరించాను. కాలం మారుతున్న కొద్ది పరిసరాలలోనూ పరిపాలనా విధానంలోనూ అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. పరిపాలన ఎంత పారదర్శకంగా ఉంటే ప్రజారక్షణ అంత పటిష్ఠంగా ఉంటుంది. వాటిని ఈ రాజనీతి కథల ద్వారా  రాజు లేదా అధికారి తన వ్యవస్థను ఏ విధంగా రూపుదిద్దుకోగలడో ఈ కథలు వివరిస్తాయి.అలాగే మహాభారతం కాలం నాటి రాజకీయ వ్యవస్థను , కవిత్రయం కాలం నాటి రాజకీయ వ్యవస్థను క్లుప్తంగా వివరించాను.

**భవిష్యత్ పరిశోధనాంశాలు:**

మహాభారతంలోని రాయబారాలను, రాజనీతి అంశాలను పరిశీలించే కొద్ది కొత్త విషయాలు ప్రస్ఫుటమవుతుంటాయి.  నిరంతర పరిశోధన చేసినప్పటికి తెలియని అంశాలు లేదా కొత్త ఆలోచనను కలిగిస్తుంటాయి. మారుతున్న సమాజం దృష్ట్యా రాయబారాలను, రాజనీతి అంశాలను ఇంకా లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

# ఉపయుక్త గ్రంథ సూచికలు


- అనంతరామ శాస్త్రి, నేతి, ***ప్రసిద్ధ సంస్కృతాంధ్ర రామాయణాల్లో రాజనీతి తత్త్వము*** , అరుణా పబ్లికేషన్స్, గుంటూరు.
- ***ఉపన్యాస వ్యాస మంజరి***, (వ్యాస సాహితీ సంహిత,), (ప్ర.ము) యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ, సికింద్రాబాద్, 1985,
- ఉషశ్రీ***,   ఎవరు ఎలా మాట్లాడుతారు***?(మహాభారతంలో రాయబారాలు), ఉషశ్రీ ప్రచురణ, విజయవాడ, 2015.
- కమలా దేవి, ఆంద్ర, ***తిక్కన భారతము- రసపోషణము***,(సి.గ్రం), ఆంధ్ర విశ్వ విద్యాలయం, హైదరాబాద్, 1991.
- ***కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతం***, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి, 2008.
- కృపాకర రెడ్డి, ***ప్రాచీన కావ్యాల్లో సందేశాలు- రాయబారాలు, (సి.వ్యా),*** శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటి,1992.
- గోదావరి బాయి, సంధ్యావందనం, ***భారతము రాజనీతి విశేషాలు***, తిరుమల తిరుపతి దేవస్థానం.
- గోపాలకృష్ణమూర్తి, నందుల, ***ఆంధ్ర మహాభారతము – ఉపదేశము*** ( ప్ర.ము) , శ్రీపతి ప్రెస్, మార్చి , 1982, కాకినాడ.
- గోపాలకృష్ణమూర్తి, నందుల, **ఆంధ్రమహాభారతము- ఉపదేశము (సిద్ధంత నిబంధన), (ప్ర.ము),**ఆంధ్రవిశ్వ విద్యాలయం , పీఠికాపురాధీశ్వర ప్రభుత్వకళాశాల, కాకినాడ,1982.
- చంద్ర శేఖర శర్మ, మూలం పల్లి, ***మహాభారతము- విశ్వ విజ్ఞాన కోశము (ప్రథమ ముద్రణ),*** తిరుమల తిరుపతి దేవస్థానం , 1911.

- చంద్రేయుడు,సి. ***తెలుగు భారతంలో సంబోధనలు- సూక్తులు***, (సి. వ్యా), శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటి,2000.
- చక్రపాణి, వాడపల్లి, ***ఆంధ్రమహాభారతము- ద్రౌపది, -ఒక ఐతిహాసిక విశ్లేషణ,***(సి.వ్యా), ఆంధ్రవిశ్వవిద్యాలయం, 1987.
- చలపతిరావు, దేవిసెట్టి, ***వ్యాస మహాభారతము, విశేషములు, విశ్లేషణలు***, ఆధ్యాత్మిక జ్ఞాన పీఠం, చిలకలూరి పేట,
- జయరామి రెడ్డి, డి. ***ఆంధ్ర మహాభారతంలో వరాలు-శాపాలు ఒక పరిశీలన(సి.వ్యా),*** శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటి, 1990.
- దామోదర్ రెడ్డి, పామిరెడ్డి, ***ప్రాచీనాంధ్ర కావ్యాలు రాజనీతి( సి.గ్రం), (ప్ర.ము),*** శ్రీ సత్యతీర్థ ప్రింటింగ్ ప్రెస్, అనంతపురం, 1994.
- ***నన్నయ భారతి( వ్యాస సంకలనం)***'', జగన్నాథం పేర్వారం(గౌరవ సంపాదకులు), రామబ్రహ్మం, బేతవోలు, సూర్య భాస్కరరావు(సంపాదకులు),తెలుగు విశ్వవిద్యాలయం,హైదరాబాద్,1993.
- నరసింహ శాస్త్రి, కేశవ పంతులు, ***సంస్కృతభారతం – ధర్మనీతి దృక్పథాలు,*** యువభారతి ప్రచురణలు, వ్యాస సాహితీ సంహిత , హైదరాబాద్, 1985.
- నరసింహాచార్యులు, నల్లంతిగళ్, ***బోధాయన ధర్మసూత్రములు***, గాయత్రి ప్రచురణలు, 2008, హైదరాబాద్.
- నరసింహారావు. వి.వి. , ***ఆర్థిక విజ్ఞానం,*** కవిరాజ పబ్లిషర్స్, సికింద్రాబాద్, 1957.
- నాగయ్య, జి. ***తెలుగు సాహిత్య సమీక్ష*( ప్రథమ సంపుటి),** ఎనిమిదవ ముద్రణ, నవ్య పరిశోధక ప్రచురణలు, హైదరాబాద్.2021.
- నాగేశ్వర శాస్త్రి, కొడి మడుగు , ***శాంతి పర్వము (తులనాత్మక పరిశీలన),*** శ్రీ నికేతన ప్రచురణ, ఆంధ్ర ప్రదేశ్, 2013.

- నారాయణ రెడ్డి, సి. (ప్ర.సం), శివారెడ్డి, ఎల్లూరి( సంపాదకులు), ***ఆంధ్రమహాభారతోపన్యాసములు,(ఉపన్యాస సంకలనం)*** ,(ఆరవ ముద్రణ), ఆంధ్ర సారస్వత పరిషత్తు,2007, హైదరాబాద్.
- నారాయణాచార్యులు, పుట్టపర్తి,***మహాభారత విమర్శనము(ప్ర.భా).*** టి.టి.డి. ప్రచురణ. 2002.
- పద్మాకర్, వద్దిపర్తి, ***శ్రీగరుడ పురాణం( ఉపన్యాస సుధాలహరి),*** మోహన్ పబ్లికేషన్స్, రాజమహేంద్రవరం, 2023.
- పద్మాకర్, వద్దిపర్తి, ***సంపూర్ణ శివపురాణము***, శ్రీ లక్ష్మీ గణపతి ఆర్ట్ ప్రింటర్స్, (ప్ర.ము), 2000, గుంటూరు.
- పురుషోత్తమ, జటా వల్లభుల***, ధర్మమంజరి***, 1994, తిరుమల తిరుపతి దేవస్థానము, తిరుపతి.
- ***ప్రకాశిక*** (సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక), వరిష్ట సంపాదకులు, ఆచార్య దార్ల వేంకటేశ్వర రావు, సంచిక 2, ఏప్రిల్, జూన్, 2023.
- ***ప్రసన్నకథావిపంచి***,(సంపాదకులు ఇరివెంటి కృష్ణమూర్తి), (నన్నయ భారతంలోని కొన్ని ఉపాఖ్యానాలకు సరళ వ్యాఖ్యానం.), (ప్ర.ము), ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాద్, 1983.
- బాలకృష్ణ శర్మ, తోటపల్లి. ***గురు విజ్ఞాన సర్వస్వం***, (ప్ర.ము), సుందర్ గ్రాఫిక్స్, హైదరాబాద్, 2006.
- బులుసు హేమలత, ***తెలుగు కన్నడ భారతముల తులనాత్మక పరిశీలనము***, రాజమండ్రి, 1991.
- భూమయ్య, అనుమాండ్ల, (ప్ర. సంపాదకులు),***వాఙ్మయి,*** **(సాహిత్య చారిత్రక, పరిశోధన పత్రిక,(రజతోత్సవ ప్రత్యేక సంచిక,)**సంచిక 1-4, సంపుటి 13, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 2010.**మార్చి 26, 2018.**

- మూర్తి బి.వి.యస్, ***తిక్కన భారతాలోకనం,*** విజయ ప్రింటింగ్ వర్క్స్, రాజమండ్రి,2004.
- మోహన్ రాజ్,వి.ఎం. ***యోధుడు –సారథి(భగవద్గీతకు భౌతికవాద వ్యాఖ్యానం).*** ప్రజాశక్తి బుక్ హౌస్,హైదరాబాద్,2008.
- రఘునాథ శర్మ , ***శలాక, కవిత్రయ భారత జ్యోత్స్న***, శ్రీ వేదభారతి, హైదరాబాద్,(తృ.ము), నవంబర్, 2005.
- రఘునాథ శర్మ, శలాక, ***కవిత్రయ భారత జ్యోత్స్న (తృ.ము),*** శ్రీ వేదభారతి , హైదరాబాద్,2023.
- రఘునాథ శర్మ, శలాక***, తైత్తిరీయ విద్య సౌరభము***, ఆనంద వల్లీ గ్రంథమాల, రాజమహేంద్రవరం, 202
- రఘునాథ శర్మ, శలాక, ***భారత ధ్వని దర్శనము, (ద్వి.ము),*** ఆనందవల్లి గ్రంథమాల, అనంతపురం, 2000.
- రాఘవన్, శ్రీ,వి.యస్. రాఘవన్, ***తమిళాంధ్రమహాభారతముల – తులనాత్మక పరిశీలనము, (ప్ర.ము),*** ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి . కళాభవన్, హైదరాబాద్,1982.
- రాజగోపాల నాయుడు, పి. ***కురుక్షేత్రే,*** ఎమెస్కో బుక్స్, హైదరాబాద్,2012.
- రాజగోపాల శర్మ, బాపట్ల***, తెలుగు సందేశకావ్య సమాలోచనం***,( సి.వ్యా), గాయత్రి ప్రచురణలు, విజయవాడ,శుక్ల కార్తిక పూర్ణిమ.
- ***రాజనీతి శాస్త్రము***, సీనియర్ సెకండరీ స్థాయి కోర్సు, ఇంటర్మీడియట్ కోర్సు, తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటి, హైదరాబాద్,2018.
- రామకృష్ణ , ప్రయాగ. ***భీష్మ@మేనేజ్ మెంట్ &గవర్నెన్స్,కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్,*** ఫిబ్రవరి , 2010.

- రామనాథం, మనస, ***తెలుగు ప్రబంధాలలో రాజనీతి***, (సి.గ్రం), ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 2017.
- రాములు, పిల్లల మర్రి,***తెలుగులో భక్తి కవిత్వం-సామాజిక విశ్లేషణ, (ప్ర.ము),*** రోషణ్ ప్రింటర్స్, హైదరాబాద్,1999.
- లక్ష్మణ శాస్త్రి, కప్పగంతుల,***మహాభారత – భీష్మ పర్వము(ప్ర.ము),*** ఆర్ష విజ్ఞాన ట్రస్టు, శివాజి ప్రెస్, సికింద్రాబాద్, 1999.
- లక్ష్మయ్య,బత్తుల,***రాజవంశప్రదీపిక,*** ముద్రాక్షరశాల,తెనాలి,1958.
- లక్ష్మీ నరసింహాచార్యులు, ***నల్లందిఘళ్,(ప్ర.ము),*** శ్రీదత్తసాయి గ్రాఫిక్స్, హైదరాబాద్, 2000.
- లక్ష్మీకాంతం, పింగళి.***ఆంధ్ర సాహిత్య చరిత్ర,(ప్ర.ము.)***, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాద్, 1974.
- విఠల్ రావు, వై. (సంకలనం), రాంరెడ్డి, జి( పరిశీలన), ***చరిత్ర, రాజనీతి శాస్త్రము***, తెలుగు అకాడమి, హైదరాబాద్, 1983.
- విద్యాలత , వల్లివేడు, ***దూత్య సౌవర్చసము ప్రబంధ సాహిత్యము***, మద్రాసు విశ్వవిద్యాలయం, సిద్ధాంత వ్యాసం, 1983.
- విద్యాలత, వల్లివేడు, ***దూత్య సాహిత్యము,*** విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, ప్రథమ సంపుటం, 2004.
- విద్యేశ్వరి,డి. ***ఆంధ్ర మహాభారతం– ధర్మతత్త్వం***, కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, 1998, హైదరాబాద్.
- విశ్వనాథమయ్య,శ్రీవింజమూరి(సంపాదకులు),***ఆంధ్ర మహాభారతం – కథా పరమార్థం,*** కళా కౌముది, హైదరాబాద్,1993.
- వీరేశలింగము, ముదిగొండ, ***జైమినిభారతము సంశోధనాత్మక పరిశీలనము(ప్ర.ము)",*** (ఉస్మానియా విశ్వవిద్యాలయం వారి డాక్టరేట్ పొందిన సిద్ధాంత వ్యాసము), శ్రీమతి ముదిగొండ జ్ఞాన ప్రసూన, వరంగల్, 1983.

- వెంకట రంగయ్య, మామిడి పూడి(అనువాదకులు), ***కౌటిల్యుని అర్థశాస్త్రం(అనువాదం),*** ఆంధ్ర యూనివర్శిటి, ప్రెస్సు, విశాఖపట్టణం, 1981.
- వెంకట శ్రీనివాసాచార్యులు,తిరుమల. ***శ్రీ మహాభారత వైజ్ఞానిక సమీక్ష(ఆది పర్వము),***శ్రీనివాస భారతి, భీమవరం, 1986.
- వెంకటరావు, బెండి, ***ఆంధ్రసాహిత్యంలో ప్రతిబింబించిన నేరాలు శిక్షలు, రక్షణ అంశాలు పోలీస్ వ్యవస్థ తీరుతెన్నులు***, అనుశీలన.(సి.గ్ర). ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖ పట్నం, 2018.
- వెంకటేశులు, ఎస్. ***ఆంధ్రమహాభారతంలో చిత్రించిన విదురుడు',*** (సి.గ్రం). మద్రాస్ విశ్వ విద్యాలయం, మద్రాస్, 1993.
- వేంకట లక్ష్మీ నృసింహ శర్మ, శ్రీ వోలేటి, ***మార్కండేయ పురాణం***, శ్రీకాళహస్తి తమ్మారావు అండ్ సన్స్, సంస్కృతాంధ్ర గ్రంథాలయం, రాజమహేంద్ర వరం, 1965.
- వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, పెండ్యాల, ***మహాభారత చరిత్రము***, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1849.
- వేంకట సుబ్రహ్మణ్య సత్యనారాయణ, మద్దూరి. ***శ్రీమహాభాగవతము – భగవద్గీత; ధర్మైక్యము – స్వరూప నిరూపణము*** ,(సి.వ్యా), నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్, 2015.
- వేంకటేశ్వర రావు, దార్ల, ***జ్ఞానానంద కవి ఆమ్రపాలి పరిశీలన*** (ప్ర.ము),జ్యోత్స్న కళాపీఠం, హైదరాబాద్,1999.
- శ్రీ రాజవీర శాస్త్రి (సంపాదకులు), ***విశుద్ధ మనుస్మృతి,*** ఆంధ్రానువాదకులు (పి.వి రమణా రెడ్డి), హింది మూలం(మూ కుమార్), వేద ధర్మ ప్రచార సంస్థ నరసారావు పేట, 1997.
- శ్రీ రామ చంద్ర మూర్తి, ఎం.జి.పి., ***ఆంధ్ర మహాభారతంలో ధర్మ సూక్ష్మములు, (సి.గ్రం)*** ,కాకతీయ విశ్వవిద్యాలయం,2000.

- శ్రీ రామచంద్రుడు, పుల్లెల.(వ్యాఖ్యాత), ***కౌటిలీయమ్ అర్థశాస్త్రామ్*** ,శ్రీ గోపాల్ పబ్లికేషన్స్, హైదరాబాద్,2004(ద్వి.ము).
- శ్రీ విద్య ప్రకాశనందగిరి స్వాముల వారు, ***భారత రత్నాకరము***, శ్రీ శుక బ్రహ్మాశ్రమము, 1987, శ్రీకాళహస్తి.
- శ్రీనివాస్ రెడ్డి , ఎ.భాగవత సంప్రదాయంలోని కృష్ణ చరిత కావ్యాలు, ఒక పరిశీలన( ఎం.ఫిల్. పరిశోధన వ్యాసం), హైదరాబాద్ విశ్వవిద్యాలయం, 2007.
- షణ్ముఖ శర్మ, సామవేదం, ***ఇదీ యదార్థ మహాభారతం***, ఋషి పీఠం ప్రచురణలు, (నాల్గవ ముద్రణ), హైదరాబాద్, నవంబర్ 2022.
- సంపత్ కుమార్, బానోజి ***మహాభారత ఔచిత్యమ్.***(పరిశోధన పత్రం), https://www.auchithyam.com/advanced/october22_Special_Issue_01.html
- సత్యనారాయణ, నెల్లూరి, ***కౌటిల్యుని అర్థశాస్త్రము***, జయంతి పబ్లికేషన్స్, విజయవాడ, 2017.
- సత్యనారాయణ,విశ్వనాథ. ***నన్నయగారి ప్రసన్న కథా కలితార్థయుక్తి,*** **సేకరణ(అర్కైవ్), 1954.**
- సుబ్బారావు, కొండేపూడి, ***మహాభారత ధర్మ శాస్త్రము,***(శాంతి అనుశాసనిక పర్వములు,) ప్రసన్న భారతీ గ్రంథమాల, విశాఖ పట్టణము,2001.
- సుబ్రహ్మణ్య శర్మ, నందూరు. ***మహాభారతోపన్యాసములు,***(అరణ్య విరాట పర్వములు),(ప్ర.ము), ఆర్ష విజ్ఞాన గ్రంథమాల, విజయవాడ, 1979.
- సుబ్రహ్మణ్య శాస్త్రి, వారణాసి, ***మహాభారత తత్త్వ కథనము***, శ్రీ శారదా ముద్రణాలయం,1948.
- సుమతి నరేంద్ర, పి. ***తిక్కన చేసిన మార్పులు ఔచిత్యపు తీర్పులు***( విరాటోద్యోగ పర్వములు),(ప్రథమ ముద్రణ), బాలకృష్ణ భారతి, హైదరాబాద్, 1982.

- స్వర్ణ, వాచస్పతి, ***శ్రీ మహాభారత స్వస్వరూపము***, స్వర్ణ శ్రీ గ్రంథమాల, దాచేపల్లి, 1998-99.
- స్వామి జ్ఞానానంద(నిర్వాహక సంపాదకులు), స్వామి పరిజ్ఞేయానంద, (సంపాదకులు). ***శ్రీరామకృష్ణ ప్రభ మాసపత్రిక*** శ్రీరామకృష్ణ మఠం,జూన్ 2014, హైదరాబాద్.
- స్వామి పరమానంద నాథ (డా// క్రోవి పార్థ సారథి ***), శ్రీ గురు తత్త్వము,*** శివకామేశ్వరి గ్రంథమాల, నవంబర్ 2007, విజయవాడ.
- స్వామి విజయేశ్వరా నంద, (సం), ***గురువాణి*** ( శ్రీ హనుమత్ కాళీ వర ప్రసాద బాబుజీ ఆధ్యాత్మిక ప్రసంగములు). సద్గురు పబ్లికేషన్స్ , గుంటూర్.
- హరి రామనాథ్ ***,ధర్మఘంట***, తిరుపతి తిరుమల దేవస్థానం.
- ( https://tharjani.in/whose-is-this-nishada-tribes/), నవంబర్ 11, 2020.
- (https://edtimes.in/mahabharata-machiavelli-modern-management-thought/#
- **http://www.andhrabhoomi.net/content/sub-feature-904**
- http://www.teluguyogi.net/2014/08/blog-post_17.html
- https://eemaata.com/em/issues/201603/8395.html
- https://en.wikipedia.org/wiki/S._Jaishankar
- https://isha.sadhguru.org/in/te/blog/article/dharamam-vayakataigata-saaaravataraika-dharamaaalau)
- https://latests.in/mahabharat-place-2021-sources-in-north-india.html
- https://telugu.greatandhra.com/articles/mbs/krishna-rayabaram-127950.html (జూన్ 2022).

- **https://vrdarla.blogspot.com/search?updated-max=2022-08-12T23:48:00%2B05:30&max-results=2&start=99&by-date=false**
- https://vsktelangana.org/divine-gifts-to-the-givers-of-knowledge (జ్ఞాన ప్రదాతలకు దివ్య జోతులుNEWSTELUGUTELUGU ARTICLES By vsk team – July 13, 2022 )
- https://www.andhrajyothy.com/2023/national/lord-krishna-hanuman-greatest-diplomats-in-world-s-jaishankar-999958.html
- https://www.auchithyam.com/2023/apr_2023/full_papers/april23_09.php
- https://www.eenadu.net/telugu-news/antaryami/general/1100/123165923

## అనుబంధం – 1

ఆంధ్రమహాభారతంలో రాయబారఘట్టాలు –రాజనీతిజ్ఞత అంశంపై సమర్పించిన పరిశోధన పత్రాలు



VSR Tenali Webinar Book.p...




# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)



Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.



**Vol. 17 - Issue. 8 - August 2020 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**



**EDITORIAL BOARD**

*Chief Editor*
**PITTA SANTHI**
***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,***
**C/o. Dr. Busi Venkataswamy**
Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

**ADVISORY COMMITTEE**

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San).,
M.A (Ling)., PhD.
HOD & Research Guide, Dept. of Telugu
PAS College, Pedanandipadu.
5. **Prof. V. Sankara Rao**, M.A.,M.A.,M.Phil, PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
6. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., Ph.D.
Dept. of Telugu,
Central University of Hyderabad, Hyderabad. Telangana.

**ASSOCIATE EDITORS**

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **THOTTEMPUDI SREE GANESH,** M.A., M.Phil
(Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics
and Transalation Studies, Universityof Heidelberg, Germany.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

## Contents (విషయ సూచిక)


1. సాహిత్యం - ఆధునికత - సమకాలీనత - డా॥ పి. విజయకుమార్ 16
2. భగవద్గీత - భక్తి తత్వం - డా॥. ఆవుల గిరిబాబు 23
3. కొలకలూరి ఇనాక్ 'రంధి' నవల - సమకాలీనత - తోట రామకృష్ణ 26
4. ఆధునిక మహేతిహాసం - కన్యాశుల్కం - సమకాలీనత - డా॥. యన్.సి. సంజీవ రెడ్డి 29
5. చండాలుడు నవల - సమకాలీనత - తంగి ఓగేశ్వరరావు 32
6. కందుకూరి 'బ్రహ్మ వివాహం' - సాంఘిక విశ్లేషణ - డా॥. కిలారి గౌరినాయుడు 37
7. కవిత్రయ మహాభారతం - నామాల విశ్లేషణ - తోట వెంకటస్వామి 40
8. ఆంధ్ర మహా భారతం లో రాజనీతి - సమకాలీనత - కె. సుజన 49
9. తెలుగు జాతీయోద్యమ, దేశభక్తి సాహిత్యం - సమకాలీనత - డా॥. కొయ్యా శ్రీనివాసులు 54
10. నన్నయ భారతంలో సమకాలీనత - తంత్రవహి శ్రీరామమూర్తి 59
11. గుణనిధి కథ - సమకాలీనత - డా॥. ఏ. వెంకటప్రసాదు 63
12. తెలుగు కథా కావ్యాలు : సమకాలీన పరిస్థితులు - కె.ఎస్. అన్నపూర్ణాదేవి 67
13. 'రక్తస్పర్శ' కవుల కవిత్వం - సమకాలీనత - భూక్యా కాశీరామ్ 71
14. భాగవతం - సమకాలీనత - డా॥. బ్రహ్మానందరెడ్డి 74
15. చిలుకూరి నారాయణరావు 'అంబ' (మొండి శిఖండి) నాటకం - డా॥. చుక్కా యశోద 78
16. ఆధునిక వేమన శతకము - సమకాలీనత - డా॥. నల్లపనేని విజయలక్ష్మి 82
17. జానపదకళలు - సమకాలీనత - డా॥. రాచపాళెం పురంధీశ్వరి 85
18. తొలితరపు తెలుగు నవలలు - సమకాలీనత - డా॥. వి. బాలిరెడ్డి 89
19. లయాత్మక భావరూపం - వచనకవితా ప్రస్థానం - డా॥. వి. శివనాగార్జున రెడ్డి 93
20. 'శారద లేఖలు' ఆధునిక భావ, రాగాల స్వరపేటికలు - గొల్లంగి చిన్నబాబు 96
21. 'ఒక పరిమళ కాంతిదీపం' కవిత్వం - సమకాలీనత - శశికళ యస్. 103
22. యువతరం భవిష్యత్తుకు నిలువుటద్దం 'ప్రలోభం' నవల - అంకిరెడ్డి సునీల్ కుమార్ రెడ్డి 106
23. అతడు అడవిని జయించాడు - ఏరుకల జీవిత అధ్యయనం - చౌట బాలకృష్ణ 111
24. గిరిజన సాహిత్యంలో సుగాలీల మౌఖిక సాహిత్యంలో కథా సాహిత్యం - డా॥. భూక్యా జ్యోతి 114
25. రాయలసీమ రాగాల సౌరభాలు - డా॥. జి. స్వర్ణలత 118
26. జానపద కళల పరిరక్షణ - డా॥. కొమ్మనబోయిన సుజాత 122
27. సమకాలీన సమాజ ప్రతిఫలనం ప్రాచీన సాహిత్యం - డా॥. ఒభిన్ని శ్రీహరి 125
28. కవి శిఖామణి కవిత్వం - సమకాలీనత - ఎలగొండ రాములు 129
29. స్వేచ్ఛనవల పాత్రలు - సమకాలీనత - కవాడపు లలిత 133
30. సమకాలీన తెలుగు సాహిత్యంలో 'హైకూ' ప్రక్రియ విశిష్టత - మాదా శంకరబాబు 138
31. జానపదవైద్యం - సమకాలీనత - పి. దర్గాబాబు 141
32. మహాభారతంలో కొన్ని స్త్రీ పాత్రలు సమకాలీనత - పప్పుల శైలజ 145

| | | |
|---|---|---|
| 33. ఆధునిక సాహిత్య కవిత ప్రక్రియలో - మొగ్గలు కవిత ప్రక్రియ | - బసవరాజప్ప | 150 |
| 34. శైవ సాహిత్యం - నవవిధ భక్తి మార్గాలు | - చంద్రమౌళి నాగమహాలక్ష్మి | 153 |
| 35. ఆముక్త మాల్యద - సామాజికాంశాలు | - డా॥. భూపతిరాజు బంగార్రాజు | 161 |
| 36. ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి కథలలో స్త్రీ వాదం-సమకాలీనత | - డా॥. కాగిత సుబ్బారావు | 164 |
| 37. ఆధునిక దళిత కథానిక - సమకాలీనత | - డా॥. తొండాటి రాజశేఖర్ | 169 |
| 38. "తూరుపు" పొలికేక | - డా॥. జి.వి.యస్. జయపాలరావు &<br>- డా॥. బి. వేణుగోపాల్ | 173 |
| 39. తెలంగాణ ఉద్యమ కవిత్వం - ప్రాంతీయ అస్తిత్వం | - గడ్డం నాగేందర్ | 178 |
| 40. ఆముక్తమాల్యద - వ్యవసాయ జీవన ప్రతిఫలనం | - గల్లా వెంకటేష్ | 184 |
| 41. మధ్య యుగ ధిక్కార స్వరాలు : శివ కవులు | - నందిగామ నిర్మల కుమారి | 188 |
| 42. నువ్వు లేవు నీ కథ ఉంది | - సుంకర గోపాలయ్య | 193 |
| 43. రామాయణంలో 'పిల్లల పెంపకం' - సమకాలీనత | - బమిడిపాటి గౌరీశంకర్ | 196 |
| 44. దళిత ధిక్కార స్వరం "నిప్పుల వాన" | - డా॥. ఎ.ఎ. నాగేంద్ర | 199 |
| 45. విశ్వగీతి - సమకాలీన అభ్యుదయ దృక్పథం | - డా॥. సిహెచ్. పవన్‌కుమార్ | 203 |
| 46. వేమన శతకం - మానవతా విలువలు | - డా॥. ఎం. ప్రభావతి | 209 |
| 47. ఉత్తరాంధ్ర గిరిజనుల జీవనం - సమకాలీనత | - డా॥. ఎం. ప్రసాదరావు | 213 |
| 48. తొలి తెలుగు వీధి నాటకం - క్రీడాభిరామం | - డా॥. మూల మల్లికార్జునరెడ్డి | 216 |
| 49. ప్రాచీన సాహిత్యం - రామాయణం - సమకాలీనత | - డా॥. వైరాగ్యం ప్రభాకర్ | 221 |
| 50. తెలంగాణ గిరిజనుల జాతరలు - పరిచయమం | - కుర్రా ఝాన్సీ | 225 |
| 51. దళిత స్త్రీవాద కవిత్వం - సమకాలీన ధోరణులు | - సూరేపల్లి పద్మావతి | 229 |
| 52. గురజాడ రచనల్లో సమకాలీనత | - రవిందర్ అచ్చ | 232 |
| 53. చిల్లర దేవుళ్ళు నవల విశ్లేషణ | - బి. మోహన్ నాయక్ | 235 |
| 54. 'బంజారా పండుగలు - మానవ సంబంధాలు' | - బానోత్ స్వామి | 241 |
| 55. శైవసాహిత్యం- పాల్కురికి సోమన - సమకాలీనత | - డా॥. ఏటూరు జ్యోతి | 244 |
| 56. ఆంధ్రుల జానపద కళా సాహిత్యం - సమకాలీనత | - డా॥. బి. సరస్వతి | 248 |
| 57. పోతన భాగవతం - సమకాలీనత | - డా॥. బశెట్టి ఉపేంద్ర | 252 |
| 58. భాగవతంలో నవవిధ భక్తి మార్గాలు, అనుసరణ | - డా॥. బోడిరెడ్డి మహేంద్రరెడ్డి | 255 |
| 59. రాయల కాలంలో ఆవిర్భవించిన శైవ ప్రబంధం | - డా॥. కె. ఈశ్వరమ్మ | 259 |
| 60. ఆధునిక కవిత్వ రూపం - సమకాలీనత | - డా॥. గోనిపాటి ధర్మారావు | 262 |
| 61. వేమన శతకం - సమకాలీనాంశాలు | - డా॥. కె. శ్యామలాదేవి | 267 |
| 62. సినిమా ముసుగులో నవ్య సంప్రదాయం | - డా॥. పి.ఎ. సత్యనారాయణ | 270 |
| 63. అంటరాని వసంతం - సమకాలినత | - డా॥. పి.సి. వెంకటేశ్వర్లు | 272 |
| 64. గుర్రం జాషువగారి ఖండకావ్యాలు - సమకాలీనత | - డా॥. టి. జాన్ కిరణ్ బాబు | 276 |
| 65. అస్తిత్వవాదం - సమకాలీనత | - డా॥. ఉడుము ఝాన్సీ | 283 |

| | | |
|---|---|---|
| 66. తీరాన్ని చేరిన 'అల్పజీవి' మనోవ్యథలు - మనోవైజ్ఞానిక దృక్పథాలు | - డా॥. జాడ సీతాపతిరావు | 287 |
| 67. మాడభూషి కవిత్వం - సమకాలీనత | - జి. యన్. శ్యామలరాణి | 294 |
| 68. యన్.పూజిత ప్రేమకు పట్టాభిషేకం నవల - సమకాలీనత | - పి. జ్యోతి | 298 |
| 69. అత్యాధునిక సాహిత్య ధోరణులు - సమకాలీనత | - డా॥. పి. కాళియప్ప | 302 |
| 70. గురజాడ రచనల్లో స్త్రీలు - సమకాలీనత | - పల్లెమోని జయమ్మ | 307 |
| 71. పింగళి నాగేంద్రరావు నాటకం-పరిశీలన-సమకాలీనత | - పేరం శాంతి | 311 |
| 72. 'మోడి' - జానపద కళారూపం | - ఆచార్య డి.వి. శ్రవణ్‌కుమార్ | 314 |
| 73. డా॥ దేవపాలన "బతుకు పాట" - సమకాలీనత | - తన్నీరు బాలాజి | 319 |
| 74. చలం వ్యాసా - పరిశీలన | - ఆంజనేయులు.బి. | 323 |
| 75. దోనయమాత్యుని సస్యానందము - సమకాలీనత | - డా॥. అప్పిరెడ్డి హరినాథరెడ్డి | 326 |
| 76. దాశరథి "నేనంటాను"లో నేటి రాజకీయ పరిస్థితులు | - డా॥. ఆర్. హరీన కళ | 331 |
| 77. హెలన్ కెల్లర్ స్త్రీవాదం - సమకాలీన దృకోణం | - వై. బుజ్జి | 335 |
| 78. దళిత సాహిత్య రచనలు - సమకాలీనత | - సారంగపాణి బండి | 339 |
| 79. వర్తమాన సమకాలీన కవిత్వం - పరిశీలనం | - ఆచార్య జి.బి. అనందకుమార్ | 342 |
| 80. స్త్రీవాదకవిత్వంలో - వాస్తవిక అంశాలు | - డా॥. కసప నరేందర్ | 345 |
| 81. జాషువా రచనల్లో దేశభక్తి | - డా॥. మందలపు నటరాజ్ | 350 |
| 82. సమకాలీనతకు అద్దం పట్టే చా.సో గారి "ఎంపు" కథ | - డా॥. ఢిల్లీశ్వరరావు సనపల | 353 |
| 83. తెలుగు కథాసాహిత్యం - ముస్లిం స్త్రీల జీవన చిత్రణ | - పి. ఉషారాణి | 356 |
| 84. బసవేశ్వరుడు మరియు దళిత మూల వచన కారులు | - డా॥. సి. శివన్న | 359 |
| 85. దక్షిణాంధ్రయుగ కవయిత్రులు | - డా॥. ఎన్. దీపిక | 366 |
| 86. మూడో కన్నీటి చుక్క - సామాజిక దర్శనం | - డా॥. ఎన్. సుజాత | 370 |
| 87. నా ఊరు (దీర్ఘ కవిత) - సమకాలీనత | - డా॥. శివ కుమార్ నందనవనం | 372 |
| 88. స్వాతంత్రోద్యమంలో స్త్రీవాదుల పాత్ర హక్కులు | - డా॥. ఉమ్మిడి శాంతి | 377 |
| 89. సామాజిక సమస్యలపై సమర శంఖారావం-అలిశెట్టి ప్రభాకర్ కవిత్వం | - శ్రీమతి నారోజు వెంకటరమణ | 379 |
| 90. జగదభిరాముడు శ్రీరాముడు | - యం. రామనాథం నాయుడు | 382 |
| 91. 'కాలుష్యం కోరల్లో' కథలోని సమకాలీనత | - డా॥. చిలక అనిత | 388 |
| 92. తెలుగు సాహిత్యం - సమకాలీనత | - కె.వి. పద్మావతి & చెళ్ళపిళ్ళ శ్యామల | 390 |
| 93. 1980వ దశకం నవలలు - సమకాలీనత | - డా॥. గఢ్ఢం శ్యామల | 393 |
| 94. భాగవత సప్తమ స్కంధం - సమకాలీనత | - డా॥. పైడిపాటి ఉమానాథశర్మ | 397 |
| 95. తెలంగాణ కథ - సమకాలీనత | - భానోతు కిష్ణ | 401 |
| 96. మధుసూదన్ కవిత్వం - మానవతా దృక్పథం | - డా॥. ఎ. విజయలక్ష్మి | 403 |
| 97. 'ప్రజల మనిషి' నవలా కాలంనాటి పరిస్థితులు, సందేశం | - డా॥. దేవినేని జ్యోతి | 407 |
| 98. రామాయణం - సమకాలీనత | - పరుచూరి విజయలక్ష్మి | 412 |

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# ఆంధ్ర మహా భారతం లో రాజనీతి - సమకాలీనత

- కె. సుజన, తెలుగు శాఖ, హైదరాబాద్ విశ్వ విద్యాలయం, హైదరాబాద్.

ప్రాచీన గ్రంథాలలో అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్న గ్రంథం మహాభారతం. మహాభారతాన్ని సూక్ష్మంగా పరిశీలిస్తే అందులో చెప్పబడిన ప్రతి మాట ఆచరణీయమే, విద్యా విధానం మొదలుకొని సూక్ష్మ ధర్మాలు తెలుసుకునేంత వరకు, జ్ఞానాన్ని సముపార్జించడం మొదలుకొని ఆధ్యాత్మికతను సాధించడం వరకు, భూమండలం యొక్క స్థితి గతుల దగ్గర నుండి తీర్థ యాత్రల విశేషాల వరకు, దౌత్య సంబంధాలు మొదలుకుని రాజనీతి చాతుర్యతను ప్రదర్శించేంత వరకు ప్రతి అంశం, ప్రతి కథ ఒక విశిష్టతను సంతరించుకుంది. వేదసారాంశాన్నంతా పునికి పుచ్చుకున్న పవిత్ర గ్రంథం మహాభారతం. లౌకిక జ్ఞానానికి పునాది వంటిది మహాభారతం. ఇందులోని రాజనీతి విషయాలు రాజ్యాన్ని సక్రమంగా పరిపాలించడానికి, రాజ్యాభివృద్ధికి తోడ్పడుతాయి.

రాజనీతి శబ్దం నేటి 'పాలిటిక్స్'కి పర్యాయంగా వాడబడినది. ప్రస్తుతం మనం ప్రజాస్వామ్యంలో ఉన్నా మన ప్రాచీన చరిత్ర నిండా రాజరికాలే. రాజులు, చక్రవర్తులు వారి వంశాలు. వారి జయాపజయాలు, సాహస పరాక్రమాలు, స్థూలంగా ఇదే చరిత్ర. కాగా ప్రజా పరిపాలనా విధానమనేది రాజరికంతో అవినాభావం సంబంధం కలిగిఉండేది. రాజు లేకుండా పాలన లేదన్నట్లు ఉండేది మన ప్రాచీన సామాజిక వ్యవస్థ. అందుకనే నేటికి మనం సత్ పాలనకు పర్యాయంగా 'రామరాజ్యం' అన్న పదాన్ని వాడుతున్నాం.రాజుకి చెందినది రాజ్యం, సమ్రాట్టుకి చెందిన సామ్రాజ్యం రాజ్యమంటే స్థూలంగా ప్రజా సమూహంతో కూడిన భూభాగం, రాజ్యానికి రాజరికపు పుట్టుకకు సప్త ప్రకృతులుండాలంటారు విజ్ఞులు. అవి స్వామి(రాజు), అమాత్యులు, జనపదం(జన ఆవాసం), దుర్గం, కోశం(ధన ఆకారం), దండం(సేన), మిత్రులు( మిత్ర రాజులు, రాజ్యాలు), ఇవీ సప్త ప్రకృతులు, వీటిలో మనం గమనించవలసిన అంశమేమిటంటే రాజ్యానికి మొదట కావలసినది రాజు. అందుకే నిన్న మొన్నటిదాకా మన దేశంలో రాజరికాలు వర్ధిల్లినప్పుడు రాజు సంతతికి అమిత ప్రాధాన్యముండేది. ఆ సంతతిని భద్ర పరచడం, ఒక అపరిహార్యమైన అంశంగా రాజ్యాధికారులు వ్యవహరించేవారు.

రాజరికం ఉన్న చోట దేశకాల భేదం లేకుండా ఎక్కడైనా పైన చెప్పిన ప్రాథమిక స్థితి గతులు ఉండవలసిందే అన్నది వాస్తవం. అలాగే మనకు రాజ్య తంత్రంలో చతుర్విధ ఉపాయాలు సామ, దాన, భేద , దండములు, చతురంగ బలాలు (రథ, గజ, తురగ, పదాతులు), శక్తులు(ప్రభు, మంత్ర, ఉత్సాహములు), ఇలాంటివి రాజనీతికి అన్వయించే సామాన్య లక్షణాలు, వీటిని ప్రయోగించే రీతులలో భేదాలుండవచ్చు, కాలాలనుబట్టి, స్థలాలను బట్టి, పరిస్థితులను బట్టి, మనిషి ప్రాకృతికంగా ప్రాణి మాత్రుడే అయినా అతని బుద్ధి కారణంగా సృష్టిలో సర్వోన్నత స్థితిని పొంది ప్రకృతినే శాసించే స్థితికి ఎదిగాడు. ఆ ఎదుగుదలకు సమిష్టి జీవనం మూలం, సమిష్టి జీవనం లేనిదే భాష లేదు, భాష లేనిదే పురా సముపార్జిత జ్ఞానాన్ని దాచి భావితరాలకు అందించే మార్గమేలేదు. కాగా మనిషికి సంఘ జీవనం అనివార్యం, ఆ సంఘముండే రాజు అతనితో పాటు మిగిలిన అంగాలు, రాజనీతి, విజ్ఞానము, వికాసము అన్నీ ఆవిర్భవిస్తాయి.

రాజనీతిలో ప్రధానమైనది నాయకత్వం నాయక స్థానంలో ఉన్న వ్యక్తి తన సంస్థకు, ప్రత్యర్థి సంస్థలకు గల బలాలు, బలహీనతలు, సంస్థలు ముందున్న అవ

కాశాలు, పొంచి ఉన్న ప్రమాదాలు చక్కగా విశ్లేషించుకోవాలి. సభాపర్వంలో రాజనీతికి సంబంధించిన అంశాలు ప్రస్తావించబడ్డాయి. ఇవి నారదుడు ధర్మరాజుని కుశల ప్రశ్నల రూపంలో ఉంటాయి. ఇందులో ప్రధానంగా కొన్ని విషయాలను గమనిస్తే రాజు యొక్క ప్రధానమైన విధివిధానాలు ఎలా ఉండాలో తెలుస్తుంది.

1. రాజ్య కార్యాలను స్వబుద్ధితో ఎల్లప్పుడూ అర్ధరాత్రి దాటిన తర్వాతే ఆలోచించాలని, రహస్యంగా ఆలోచించిన విషయాలను ప్రజల చెవిన పడకుండా జాగ్రత్త పడటం.

   నేటి కాలంలో దీనిని పరిశీలిస్తే ఎవరూ ఊహించని విధంగా జమ్మూ కాశ్మీర్ కి సంబంధించిన ఆర్టికల్ 370 ని తొలగించడం. ఇది చరిత్ర లో ఒక చారిత్రాత్మకమైన ఘట్టం. ఇలాంటి సంఘటనలు అప్పుడప్పుడు చోటుచేసుకోవడం వంటివి రాజనీతిలో భాగమే.

2. అలాగే ప్రభుత్వ ఉద్యోగాల్లో శక్తి సామర్థ్యాలను అనుసరించి వారి ప్రతిభాపాటవాలను గుర్తించి వారిని ఉద్యోగాల్లో స్థిరంగా ఏర్పరచడం కూడా రాజ్యానికి లాభదాయకమైన విషయాలలో ఒకటని నారదుడు వివరిస్తాడు. నేడు శక్తి సామర్థ్యాలకు కాకుండా ధనానికి ప్రాముఖ్యత లభించడం, పలుకుబడికి లోబడి స్వార్థ పూర్వకంగా ఉద్యోగాలను నియమించడం జరుగుతుంది. దాని వలన పాలన తప్పు దోవ పట్టే ప్రమాదం ఉంది.

3. ఎక్కువ పలుకుబడి కలిగిన క్రియాశీలి, సమర్థవంతులైన మంత్రులను నియమించడం. ఇక్కడ మంత్రి ఆలోచన విధానాన్ని అతని ప్రవర్తనను పరిశీలించడం, రాజ్య క్షేమానికి ప్రథమ కర్తవ్యంగా తెలుస్తుంది.

4. జ్యోతిష్యం చేత భూమండలంలో గ్రహాల స్థితిని తెలుసుకుని దానికి తగ్గట్లు రాజ్య క్షేమం కొరకు శాంతి క్రియాదులు జరపడం.

5. పన్నులు వసూలు చేయడం, యోగ్యులైన వారిని ఉద్యోగాల్లో నియమించి జీతాలను సకాలంలో అందజేయడం.

6. యుద్ధంలో మరణించిన వారి పైన కుల కుటుంబాలకు కూడు గుడ్డకు లోటు లేకుండా ఇవ్వడం.

   ఈ మధ్య జరిగిన భారత్ చైనా సైన్యం ఘర్షణలో మరణించిన కల్నల్ సంతోష్ కుటుంబానికి భరోసాగా ప్రగతి భవన్ లో అతని భార్య సంతోషికి ముఖ్యమంత్రి కే.సి.ఆర్ డిప్యూటి కలెక్టర్గా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. అలాగే ఇళ్ళస్థలాలను, ఐదు కోట్ల రూపాయాలను అందజేశారు. ఇలాంటివి భరతమాత కోసం ప్రాణాలు విడిచిన వారి కుటుంబాలను ఆదుకోవడమనేది ఆనాటి నుండే అమలులో ఉందని అర్థమవుతుంది.

7. పేద రైతులకు ధాన్యపు విత్తనాలు, వర్తకులకు నూటికి, ఒక రూపాయి వడ్డీ వంతున అప్పులు ఇవ్వడం.

   నేటి కాలంలో చాలా మంది రైతులు అప్పులు తీర్చలేక పండిన పంటకు సరైన ధర అందక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అలాంటి పరిస్థితి అప్పట్లో లేదు ఎందుకంటే పంటలు, ధాన్యాన్ని పండించే రైతుల విలువ ఆనాటి రాజులకు తెలుసు. ఎంతో మంది ఆకలి చావులు చూసిన తర్వాత గాని ప్రభుత్వం మేల్కొలేని పరిస్థితి నేడు కనబడుతుంది. రైతులకు ఊరటనిచ్చే అంశాలను చూస్తే ప్రధానమంత్రి కొన్ని మార్గదర్శకాలను వారి కోసం కేటాయించడం. అవి రూపాయికే పంట బీమా, ప్రీమియం చెల్లిస్తే ఫసల్ బీమా వర్తింపు, రైతుల వాటా ప్రభుత్వమే చెల్లింపు, రైతులందరికి వర్తింపజేయాలని ఉత్తర్వులు, ఖరీఫ్ బీమా యోజనకు మార్గ దర్శకాలు ఇలాంటి పథకాలు రైతులు కోసం ప్రవేశ పెట్టడం చూస్తున్నాము.

8. చేసిన మేలు గుర్తించి ఆ మేలు చేసిన వ్యక్తిని పదిమంది పెద్దలున్న సభలో ఉచిత రీతిని సత్కరించగల రాజు ప్రజలను పరిపాలించగలడు అని చెప్తాడు.

ఇప్పటి కాలంలో వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన భారతీయు పౌరులకు పద్మ భూషణ్, భారత రత్న, పద్మ విభూషణ్ లాంటి పురస్కారాలను అందజేసి వారిని సత్కరించడం లాంటిది.

9. "పంగుల మూకాంధుల విక / లాంగులను నబాంధవుల దయవ బ్రోతే? భయా

ర్తుంగడిఉది శత్రునైనను / సంగర రంగమున ఉ గాతె శరణం బనినన్.

కుంటి వాళ్ళను, మూగ వాళ్ళను, గ్రుడ్డి వాళ్ళను, అంగ విహీనులైన వాళ్ళను, బంధువులు లేని వాళ్ళను దయతో పోషిస్తున్నావు కదా! అని నారదుడు అడుగుతాడు.

నేటి కాలంలో వికలాంగులకు ఫించన్ రూపంలో చేయుతనివ్వడం మహాభారత కాలం నాటి నుండే ప్రారంభమైందని అర్థమవుతుంది. నేటి కాలంలో వారిని పిలిచే పిలుపులో కూడా గౌరవం ఉండాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడి గారు వికలాంగులు పేరుకు బదులుగా దివ్యాంగులుగా పేరు మర్చడం జరిగింది. విభిన్న సామర్థ్యపు వ్యక్తులు కోసం జాతీయ విధానం (National Policy for with Disabilities) వారు వారి కోసం ప్రత్యేక చట్టాలను తీసుకొచ్చింది, అలాగే వారి కోసం ప్రత్యేక సంస్థలను ఏర్పాటుచేసింది.

1. శారీరక వికలాంగుల సంస్థ, న్యూడిల్లి, 2. జాతీయ మానసిక వికలాంగుల సంస్థ, సికింద్రాబాద్.3. జాతీయ పునరావాస శిక్షణ మరియు అధ్యయన సంస్థ, కటక్ 4. జాతీయ బహుళ వికలాంగత్వ సాధికారత సంస్థ చెన్నై వంటి సంస్థ లు వారి ప్రత్యేక అవసరాలు తీర్చడం కోసం ఏర్పడ్డాయి.

10. రాజుకు వచ్చిన ఆదాయంలో ఎంత ఖర్చు చేయాలో నారదుడు వివరిస్తాడు. ఆదాయంలో నాల్గవ భాగాన్ని లేద మూడవ భాగాన్ని లేద సగ భాగాన్ని మాత్రమే ఖర్చు చేయాలి కాని అంతకు మించి చేయకూడదని గ్రహించమన్నాడు.

దేశ ఆర్థిక వ్యవస్థ తీరు తెన్నులు మార్చి ఆధునిక భారతానికి దారిని నిర్మించిన ఆర్థిక సంస్కరణలు ప్రవేశ పెట్టి దేశానికి అంతర్జాతీయ ఖ్యాతి సాధించిన వ్యక్తి గా పి.వి నరసింహారావు గారిని చెప్పుకోవాలి. ఇలాంటి వారెందరో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశారు.

9. గూఢాచార వ్యవస్థ గురించి, శత్రురాజుల ప్రవర్తనను తెలుసుకోవాలని చెప్పున్నాడు.

ఈనాడు రాజకీయ నాయకులు వారి గురించి కాకుండా ప్రతిపక్ష నాయకుల గురించి తెలుసుకోవాలనే కుతూహలంతో వారి వివరాలను సేకరించి విమర్శించడం మనం చూస్తూనే ఉన్నాం.

10. "వార్తయంద జగము వర్తిల్లుచున్నది / యదియు లేనినాఉడ యఖిల జనులు

నంధ కారమగ్ను లగుదురు గావున/ వార్త నిర్వహింప వలయుఉబతికి."

వార్తను ప్రభువులు సక్రమంగా నడపాలి, వార్తలను సేకరించడం, ప్రసరించడంలో నిపుణతను కలిగి ఉండాలి. అలా లేకపోతే ప్రజలంతా అజ్ఞానాంధకారంలో ఉండవలసి వస్తుందని తెలుస్తుంది.

ప్రపంచ సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో వార్తలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. అటువంటి వార్తను ప్రచురించడంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పున్నాడు. నేడు చాలా పత్రికలు, దూర దర్శన్ లు, రకరకాల కార్యక్రమాలతోనూ, రాజకీయ వార్తలతోనూ పోటి పడుతున్నాయి ఈ పోటి కారణంగా వాస్తవాన్ని చెప్పడం మరచి పోయి, గుర్తింపు కోసం పాటుపడుతున్నట్లు తెలుస్తుంది. కొన్ని పత్రికలు మాత్రమే నిజాన్ని నిర్భయంగా తెలియజేయకలుగుతున్నాయి.

11. ఆయుర్వేదంలో సమర్థులైన వైద్యులు లోకానికి మేలు చేసే బుద్ధితో ప్రజల మీద ప్రేమతో ఎనిమిది శాఖలుగా వ్యాపించిన ఆ వైద్య విధానంలో సేవలు చేస్తున్నారా అని విచారిస్తాడు.

నారదుడు వైద్యులను జగద్ధిత బుద్ధిన్ అని విశేషించి ప్రయోగించాడు. బాధా పీడితుడై ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగికి చికిత్స చేసి, అతని బాధను తొలగించి, ప్రాణం నిలిపే వైద్యుణ్ణి భారత దేశం విష్ణు స్వరూపునిగా భావించాలి. 'వైద్యో నారాయణో హరి:' అని ప్రవచించింది.

ఇప్పటి కాలంలో కొంత మంది వైద్యులు ధనాన్ని బట్టి మెరుగైన వైద్యాన్ని అందిస్తారు. ఇక్కడ వ్యక్తి ప్రాణం కంటే ధనానికి ప్రాముఖ్యతను ఇస్తారు. కొన్ని ప్రైవేటు హాస్పిటల్స్ లక్షలు రుసుము తీసుకుని ఆ వ్యక్తి మరణించినా ఆ శవాన్ని తీసుకుని వెళ్ళడానికి కూడా డబ్బు చెల్లించాలని చెప్పే మనస్తత్వం గల వైద్యులు అక్కడక్కడా కనబడుతున్నారు.

12. ధర్మరాజు భుజ బలంతో నీవు పరిపాలిస్తున్న భూమిలో అనావృష్టి భయం లేకుండా చెరువులు నిండి కనుల పండువుగా ఉన్నాయి కదా

ఇప్పటి కాలంలో చెరువులు అన్నింటినీ ఆక్రమించి భవనాలు కట్టి వరదలు వస్తే నిలువు లోతు నీళ్ళలో మునిగి తేలుతున్నాము ఇది నేటి పరిస్థితి.

13. ముందుగా నిర్ణయించుకున్న పనులు చేయక పోవడం.

సంవత్సరంలో పూర్తి కావల్సిన పనులు వాయిదాల మీద పదేళ్ళయినా పూర్తి చేయకపోవడం , ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయడం నేడు మనం గమనిస్తున్నాము.

14. "చోర భయ వర్జితముగా / ధారుణిఉ బాలింతె యధికధనలోభమునం
జోరుల రక్షింపరుగా/ వారలచే ధనముగొని భవద్ భృత్యవరుల్."

దొంగ భయం లేకుండా నీవు రాజ్యాన్ని ఏలుతున్నావు కదా నీ ప్రభుత్వోద్యోగుల్లో ముఖ్యులైన వాళ్ళు ధనాశ పరులై ఆ దొంగల దగ్గర డబ్బు పుచ్చుకొను వాళ్ళకు రక్షణ కల్పించడం లేదు కదా!

ఆధునిక కాలంలో దొంగల సంఖ్యతో పాటు రకరకాల దొంగలు పుట్టుకొస్తున్నారు. కొత్తగా ఇంటర్నెట్ వచ్చినప్పటి నుండి సాంకేతికత అభివృద్ధి చెంది చదువుకున్న దొంగలు కొంతమంది సైబర్ నేరస్థులుగా మారుతున్న వైనం మనం ఇప్పుడు చూస్తున్నాము.

నారద మహర్షి వేసిన కుశల ప్రశ్నలు ఏ ప్రభువుకైనా ఉత్తమ రాజనీతి పాఠాలు.

ఆశ్రమ వాస పర్వంలో ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో రాజైన వాడు అతని తప్పులు కొంచెం కూడా ఇతరులకు తెలియకుండా దాచి పెట్టుము. ఇతరుల దోషాలు మాత్రం జాగ్రత్తగా తెలుసుకోవాలని శత్రువుల వద్ద ఉన్న వాళ్ళలో బుద్ధిమంతులూ, శక్తిమంతులూ అయిన వ్యక్తులను దానాదులతో సత్కరించి వాళ్ళ మనసులు నీ వైపు తిప్పుకొనుము, అంటారు ఇది రాజకీయ మంత్రం ,తనతో సమానమైన బలం కలిగిన రాజుతో తగు విధంగా అతడిని గౌరవించి సంధి చేసుకోవాలి. అని చెప్తారు.

తిననివ్వదగిన సమయం ఏదో, కక్కించవలసిన సమయం ఏదో గ్రహించి శత్రు రాజును పుల్లావు వలె పొడుగాటి త్రాడు తో స్వేచ్ఛగా విడిచి పెట్టుము, లోబరుచుకొమ్ము, లోబరుచుకున్నప్పుడు ఆ శత్రు రాజువలన లాభాలు జాగ్రత్తగా పిండుకొమ్ము అని తెలియజేస్తాడు.

ఎక్కడ తగ్గాలో ఎక్కడ నెగ్గాలో తెలుసుకుని శత్రువులను విడిచి పెట్టడము, లోబరచుకోవడమనే రాజనీతి తత్వాన్ని పగ్గాలుగా తన చేతిలో ఉంచుకుని శత్రురాజుల లాభాలను ఆర్జించాలని అర్థమవుతుంది.

ద్వాపరమైనా, కలియుగమైనా నాటి చక్రవర్తుల నుంచి నేటి ప్రధాన మంత్రులు దాకా అధికారమే పరమా వధిగా వ్యూహ ప్రతి వ్యూహాలతో సాగిపోయే ఓ పద్మవ్యూహమే రాజకీయం. అధికారంలో లేనివారు దాన్ని సాధించుకోవడం కోసం తాపత్రయపడితే, ఉన్న వారు దాన్ని ఎలా

నిలుపుకోవాలని ఆలోచిస్తారు. నిలుపుకోవడమే కాదు దానిని తమ వారసులకు అప్పగించడంలోనూ రాజనీతిని ప్రదర్శిస్తారు. ఈ కోవకు చెందిందే మహాభారత సంగ్రామం.

రాజనీతి విషయాలు గురించి మాకియో వెల్లి వ్రాసిన 'ద ప్రిన్స్' అనే పుస్తకంలో ప్రస్తావించడం కనబడుతుంది. రాజు ఆలోచన తీరు ఏ విధంగా పని చేయాలో ప్రస్తావించారు. 'రాజుకు సగం పశువుగా సగం మనిషి ఈ రెండు స్వభావాలను ప్రదర్శించడం ఎలాగో తెలియడం అవసరం. అలాగే ఈ రెంటిలో ఒకటి లేకుండా మరొకటి స్థిరత్వాన్ని కలిగి ఉండరు  అయితే ఒక రాజుకు పశు స్వభావాన్ని వివేకవంతంగా ఎలా ఉపయోగించాలో తెలిసి ఉండాలి కనుక అతడు పశువులలో నక్కను మరియు సింహాన్ని రెండింటిని ఎంపిక చేసుకోవాలి. ఎందుకంటే సింహం ఉచ్చుల బారి నుండి తనను తాను రక్షించుకోలేదు, అలాగే నక్క తోడేళ్ళ బారి నుండి తనను తాను రక్షించుకోలేదు. కనుక తోడేళ్ళను హడల గొట్టడానికి సింహం గాను, ఉచ్చులను కనిపెట్టడానికి నక్కగాను ఉండటం అవసరం. కనుక వివేకవంతుడైన రాజు మాట నిలుపుకున్న పక్షంలో అది తనకు నష్ట దాయకంగా పరిణమించేటప్పుడు అలాగే మాట ఇవ్వడానికి దారితీసిన కారణాలు కనుమరుగై పోయినప్పుడు మాట నిలుపుకోలేడు, నిలుపుకోకూడదు అని వివరిస్తారు. ఇలాంటి రాజనీతి విషయాలు అనేకం ఈ గ్రంథంలో ప్రస్తావించబడ్డాయి.

నేడు ఇలాంటి రాజకియ వ్యవస్థలే కనిపిస్తున్నాయి.

**ఆధార గ్రంథాలు :**

1. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతం, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి, 2008.
2. రాజేంద్ర కుమార్, చెక్కిళ్ళ, శ్రీ రాముడు నీతి, నేత, నేతృత్వం.
3. జగన్నాథం, పేర్వారం. సాహిత్యం -సమాజం- రాజకీయాలు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 1997
4. http://shankharavam.blogspot.com/

⌘⌘⌘



భాగవతం - పఠన సంప్రదాయం
ఆమె సుత ఒక తల్లే కదా !
మనం మరచిపోయిన మహా విద్యాలయం
బ్రహ్మశ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రి
ఉపనిషత్తులలో సరస్వతీ ప్రస్తావనలు
మహాభారతానికి నాయకుడెవరు ?
గురజాడ 'తొలి కొత్త తెలుగు కథలు' - విశ్లేషణ
ఆంధ్ర మహాభారతంలాంటి అసామాన్య కావ్యం 'బాపూజీ ఆత్మకథ'
మూసీ
MUSI
Samputi : 26 Sanchika : 09 Pages : 64 Rs. 20
July 2023
UGC Care List
Approved Journal



వ్యవస్థాపకులు
**శ్రీ బి.ఎన్.శాస్త్రి**
సంపుటి : 26 సంచిక : 9
జులై - 2023
'శోభకృత్' ఆషాఢ మాసం
సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA
సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM
Printed and Published by
**B. Anantha Laxmi**
*Type Setting at :*
Kavyasree Graphics
Ph: 934 797 1177
Printed at : Sri Sai Process
Ph. 27563075
విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)
చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine) పేరుపై మాత్రమే పంపాలి.
వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక, 2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013
ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com
INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796
UGC APPROVED JOURNAL



# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

**చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక**

## ఈ సంచికలో ...

### వ్యాసాలు

భాగవతం - పఠన సంప్రదాయం ... డా. కాకునూరి సూర్యనారాయణ మూర్తి 7
పద్య మనోహరం - 43 ... డా. గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు 12
అమె మత ఒక తల్లే కదా! (బందారం కథలు -19) ... డా. నందిని సిధారెడ్డి 13
మనం మరచిపోయిన మహా విద్యాలయం ... పేపకాయల ప్రసాద్ 17
భారతీయీకరణ13 : ఆంగ్లమూలం : బలరాజ్ మధోక్, తెలుగు : కోవెల సంపత్కుమార 21
బ్రహ్మశ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రి : షష్టిపూర్తి సంచిక (గ్రంథాంతరంగం-25) ... మట్టమరాజు 25
ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డితో చివరి ముఖాముఖి... పరిశోధక విద్యార్థులు 29
ఉపనిషత్తులలో సరస్వతీ ప్రస్తావనలు ... శ్రీవైష్ణవ వేణుగోపాల్ 33
తెలుగు భాష - సి.పి. బ్రౌన్ కృషి ... కొల్లేటి రవిబాబు 36
ఉస్మానియా విశ్వవిద్యాలయ తొలి తెలుగు అధ్యాపకురాలు : గాలి ఇందిరావందనం ... ఆచార్య వెలుదండ నిత్యానంద రావు 39
కె. విశ్వనాథ్ చలన చిత్రాలు, సామాజిక అవలోకనం - 32 .. టి. లక్ష్మీనారాయణ 41
మహాభారతానికి నాయకుడెవరు? ... కె. సుజన 44
తెలంగాణ కథా ప్రక్రియ - కాలువ మల్లయ్య ... అడావతు రాగ్యానాయక్ 47
గురజాడ 'తొలి కొత్త తెలుగు కథలు' - విశ్లేషణ ... డా. ఎస్. రజని 51
ఆంధ్ర మహాభారతం వంటి అసామాన్య కావ్యం 'బాపూజీ ఆత్మకథ' ... చిటిప్రోలు వేంకటరత్నం 54

### కవితలు

బోనాల పండుగ ... అవధాని భానుప్రకాశాచార్య - 5; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ -6; దారిదీపాలు ... షట్టి గిరిధర్ - 6; నా కవనాలు ... ఆర్. నవజీవన్ రెడ్డి -16; విసిరేయాలనిపిస్తోంది ... లక్ష్మీ శ్రీనివాస్ - 28; సత్యం ... యముగంటి ప్రభాకర్ - 53; సమయమెందుకో ఊగిసలాడింది ... బి. అంజనీదేవి - 58; జీవితం (తెలుగు గజల్) ... డా. ఆచార్య ఫణీంద్ర - 60; విజ్ఞాన చైతన్య ప్రదాత గురువు ... కనకయ్య నేదునూరి - 62;

### సమీక్షలు

శ్రీగోరిపెద్ది రామసుబ్బశర్మగారి శతజయంతి విశేష సంచిక ... శివప్రియ 57
శ్రీనివాస విలాస కావ్యద్వయం ... డా. శ్రీరంగాచార్య 59
స్వీకృతి ... 61

**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027, Telangana.
*Office* : 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor* : **Dr. Sagi Kamalakara Sharma.** **RNI No. 37723/80**

# మహాభారతానికి నాయకుడెవరు?

కె. సుజన, ఫోన్ : 99664 35902

ప్రాచీన గ్రంథాలలో అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్న గ్రంథం మహాభారతం. మహాభారతాన్ని సూక్ష్మంగా పరిశీలిస్తే అందులో చెప్పబడిన ప్రతి మాట ఆచరణీయమే. విద్యా విధానం మొదలుకుని సూక్ష్మధర్మాలు తెలుసుకునేంతవరకు, జ్ఞానాన్ని సముపార్జించడం మొదలుకుని ఆధ్యాత్మికతను సాధించడం వరకు, భూమండలం యొక్క స్థితిగతుల దగ్గర నుండి తీర్థయాత్రల విశేషాల వరకు, దౌత్య సంబంధాలు మొదలకుని రాజనీతి చాతుర్యతను ప్రదర్శించేంతవరకు ప్రతి అంశం, ప్రతి కథ ఒక విశిష్టతను సంతరించుకుంది. వేద సారాంశాన్నంత పుణికి పుచ్చుకున్న పవిత్ర గ్రంథం మహాభారతం. లౌకిక జ్ఞానానికి, ఆధ్యాత్మిక సాధనకు పునాది వంటిది మహాభారతం.

భారతమనగా 'భా' సూర్యః, ర - అగ్నిః, త - చంద్రః. **'చంద్ర సూర్యాగ్ని చంద్ర సంయోగాదేవ చరాచరాత్మ సృష్టిరిత్యర్థః'** అని బీజాక్షర నిఘంటువు.

సూర్య చంద్రాగ్నుల సంయోగం వలనే సమస్త చరాచర ప్రపంచం యొక్క సృష్టి జరుగుచున్నదని తాత్పర్యం. (శ్రీ రామచంద్రమూర్తి, యమ్.జి.పి. ఆంధ్రమహాభారతంలో ధర్మసూక్ష్మాలు, పుట: 10.)

శ్రీరామచంద్రమూర్తి గారు **"ఆంధ్ర మహాభారతంలో ధర్మ సూక్ష్మాలు"** తన సిద్ధాంత గ్రంథంలో పై విధంగా భారతానికి నిర్వచనం ఇచ్చారు. సూక్ష్మపరిశీలన చేస్తే ప్రపంచం అంతా సూర్యచంద్రుల పరిభ్రమణం చేత నడుస్తుంది. సృష్టి సరైన క్రమంలో నడవడానికి ప్రతి ప్రాణి తన జీవనశైలిని సక్రమంగా నిర్వర్తించు కోవడానికి ప్రధాన ఆధారం సూర్యచంద్రులే అనే విషయం స్పష్టమవుతుంది.

ప్రముఖ ఆధ్యాత్మిక గురువు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ ముఖాముఖి లో మహాభారతానికి నాయకుడు అంటూ ఎవరూ లేరు కృష్ణుడే ప్రధాన సూత్రధారి అని చెపుతూ మహాభారతమే విష్ణువు అని చెప్తారు. అలాగే భారతానికి ప్రధాన కారకులు అనలుడు అంటే అగ్నిహోత్రుడు, సూర్యుడు, చంద్రుడు అని ఈ విధంగా తెలియజేస్తారు.

మహాభారతం బహునాయకత్వంతో కూడింది. దీనికి నాయకుడు నడిపించే దైవమే, సూత్రధారి అంతా కృష్ణుడే -

**"అనలుడు భాస్కరుండును, సుధాంశుడు నధ్వర సంప్రర్తకుల్,
వినుము నరేంద్ర యీ క్రతువు విష్ణుమయంబిది నిర్వహించి ర
ర్జునుడును, గర్జుడున్, సమర రూపమునందగ నీ ప్రబంధ మిం
పొనర బఠించినన్ వినిన నొందు నరుం జిరసౌఖ్య సంపదల్"**

మహాభారతం అద్భుతమైన ఘట్టం. ఈ మహాభారత యజ్ఞానికి అనలుడు, భాస్కరుడు, సుధాంశుడు, (చంద్రుడు). వీరు ముగ్గురు మహాభారతం అనే యజ్ఞానికి సంప్రవర్తకులు అంటే నడిపినవారు. క్రతువు ఎవరిది. మహాభారతమే విష్ణువు, విష్ణువే మహాభారతం. విష్ణువుని నాయకుడు అని కూడా అనలేము, అసలు ఆయనే భారతం. భారతమే విష్ణువు కాబట్టి ఆయన దైవం. అగ్ని లేకపోతే మహాభారతమే లేదు. అసలు మహాభారతం ఆరంభమే జనమేజయ యజ్ఞంతో మొదలై యజ్ఞంతో ముగిసే అపూర్వమైన ఘట్టం. కాబట్టి అగ్నిహోత్రుడు ప్రధాన పాత్రధారి అని చెప్తారు.

మన నిత్య జీవితంలో మన అతిథి అగ్ని. అగ్ని లేనిదే సృష్టి జరగదు. సనాతన ధర్మంలోనూ అగ్నికి అత్యంత ప్రాధాన్యం ఉంది. పూర్వం ప్రతి ఇంటిలోనూ హోమాలు నిర్వహించేవారు. ఒక యాగం జరగాలంటే అగ్నినే ప్రధానంగా ఆరాధిస్తారు. (బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ ముఖాముఖి.)

మహాభారతం అంటేనే విష్ణువు అనడంతో మహాభారతాన్ని చదివితే విష్ణుహృదయం ఏమిటో తెలుస్తుంది. ధర్మంగా జీవించేవారికి విష్ణువే సహాయకారి, అధర్మంగా నడిచేవారికి ఆ విష్ణువే దండన విధించే వాడవుతాడు. సమాజ పురోభివృద్ధికి విభిన్న మనస్తత్వాలు కలిగిన ప్రపంచాన్ని ఒక మార్గం వైపు నడిపించే ప్రయత్నమే మహాభారతానికి నాంది అనే అభిప్రాయం పై మాటల్లో అర్థమవుతుంది. అగ్నితో అంటే యజ్ఞంతో ప్రారంభం అవుతుంది మహాభారతం అంటారు అంటే అగ్నికూడా ప్రధాన పాత్రధారి అని చెప్పడంలో అంతర్యాన్ని గమనిస్తే వ్యర్థపదార్థాలను కూడా దగ్ధం చేసి వాటి వలన హాని కలగకుండా చేయగల శక్తి అగ్నికి ఉంది. అలాగే మన ఆలోచనల్లోని మాలిన్యాన్ని భారతమనే అగ్ని దహింపచేసి క్రొత్త మార్గనిర్దేశాన్ని అందిస్తుంది. అగ్ని లేనిదే సృష్టి జరగదు అంటారు. అగ్నికి మన జీవన విధానానికి అంతటి అనుబంధం ఉంది.

భారతమను సూర్యుని చేత మానవులంతః కరణమందలి చీకట్లు తొలగిపోవును. ఇక్కడ భారతమును సూర్యుని చేత పోల్చారు. సూర్యుడు అగ్ని స్వరూపుడు. తన కిరణాలతో ప్రపంచ చీకట్లు తొలగించినట్లు భారతం ప్రజల అంతరంగంలోని అజ్ఞాన చీకట్లు తొలగిస్తుందని చెప్తాడు. అంతేకాదు. మానవులై పుట్టాక అనేక సందేహాలతో మానసిక ఆందోళనతో సతమతమవుతారు. ఆ ఆందోళన తొలగడానికే మహాభారతం ఉంది అని పై వాక్యాల ద్వారా తెలుస్తుంది.

**"పురాణ పూర్ణ చంద్రేణ శ్రుతి జ్యోత్స్నా ప్రకాశితా"** పురాణమను పూర్ణ చంద్రుని చేత వేదములనే వెన్నెల వెలుగొందబడింది. (శ్రీ రామచంద్రమూర్తి, యమ్.జి.పి. ఆంధ్రమహాభారతంలో

ధర్మసూక్ష్మాలు, పుట: 19.) ఈ వాక్యాలను పరిశీలిస్తే మహాభారతం పంచమవేదం. ఇతిహాసం. చతుర్వేదాలను తనలో ఇముడ్చుకున్న గొప్ప గ్రంథం. ఇక్కడ పురాణాలను పూర్ణ చంద్రునిలాగా వేదాలను వెన్నెల వెలుగును ఇస్తుంది అన్నాడు. అంటే పురాణాలలోని అంశాలు, ఎప్పుడూ క్రొత్తగా కనిపిస్తూ ఉంటాయి. వెన్నెల ఎంత చల్లదనంగా ఉంటుందో వేదాలలోని సారాంశం తెలుసుకుంటే అంతే ఆహ్లాదంగా ఉంటుంది. ప్రధానంగా మహాభారత కథలు పిల్లల దగ్గర నుండి ప్రతి ఒక్కరి ఆలోచనకు పదును పెట్టేవిగానూ, జీవితాన్ని సరైన క్రమంలో ఎలా సరిదిద్దుకోవాలో నేర్పుతాయి.

1. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు అవధూత బ్రహ్మశ్రీ గణపతి సచ్చిదానంద స్వామి ముఖాముఖిలో మహాభారతంలో శ్రీకృష్ణుడిని ప్రధాన సూత్రధారిగా పేర్కొంటేనే బాగుంటుందని తెలియజేస్తారు. శ్రీకృష్ణుడినే ప్రధాన సూత్రధారుడుగా ఎందుకు పేర్కొంటున్నారో తెలియజేస్తూ శ్రీకృష్ణుడే యోగేశ్వరేశ్వరుడు. ఆట ఆడించువాడు, నడిపించువాడు మాత్రమే. ఈ విషయం మనకు గీతలో, జ్ఞానయోగం లో 18వ శ్లోకంలో పరమాత్మే అర్జునుడికి యోగి లక్షణాలు చెపుతున్న సందర్భంలో బాగా తెలుస్తుంది.

**కర్మణ్య కర్మ యః పశ్యేదకర్మణి చ కర్మ యః**
**స బుద్ధిమాన్ మనుష్యేషు స యుక్తః కృత్స్నకర్మకృత్**

అర్జునా! కర్మలో కర్మ లేకపోవటాన్ని చూడగలగాలి. కర్మ లేకపోవటంలో కర్మను దర్శించగలగాలి. అదే నిజమైన తెలివి. అది కలవాడే యోగి. అతడే విహితకర్మలన్నీ చేసిన ముక్తపురుషుడు అన్నాడు. ఈ యోగి లక్షణాలన్నీ కృష్ణుడిలో ఉన్నాయి. కనుక ఆయన యోగేశ్వరేశ్వరుడు. సూత్రధారి మాత్రమే.

**"లోకవత్తు లీలా కైవల్యం"** అని బ్రహ్మసూత్రం. పరమాత్మ ఈ లోకమనే ఆట ఆడుతున్నా, ఈ ప్రపంచమనే పనిని చేస్తున్నా ఆయనకు ఏ ప్రయోజనమూ లేదు. అటువంటి వాడు పరమాత్మ. కనుక ఆయనను ఆట ఆడించేవాడు అనటమే బాగుంటుందని తెలియజేస్తారు. (బ్రహ్మశ్రీ గణపతి సచ్చిదానంద స్వామి, ముఖాముఖి)

వీరి అభిప్రాయం ప్రకారం ఎటువంటి స్వార్థపూరితమైన ఆలోచనలు లేకుండా ఎటువంటి ప్రయోజనాన్ని ఆశించకుండా ఒక వ్యవస్థను సరైన మార్గంలో పెట్టడానికి ఒక బాధ్యతను స్వీకరించి దానిని అమలు చేయడంలోనే పూర్తిగా నిమగ్నుడై లోకంలో శాంతి స్థాపనకు, కృషి చేసేవాడే నిజమైన నాయకుడని అటువంటి నాయకుడు శ్రీకృష్ణుడే అని తెలుస్తుంది.

ప్రముఖ ఆధ్యాత్మికవేత్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ముఖాముఖిలో మహాభారతానికి నాయకుడు శ్రీకృష్ణున్ని నిస్సందేహంగా పేర్కొనవచ్చని తెలియజేస్తారు. ఎందుకంటే భగవంతుడే స్వయంగా ప్రతిజ్ఞ చేసాడని.



**యథా యథా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత**
**అభ్యుత్థానమధర్మస్య తథాత్మానాం సృజామ్యహం**

ఆయన రాక్షసులను సంహరించడం కోసం, సాధువులను రక్షించడం కోసం తర్వాత ధర్మసంస్థాపన చేయడం కోసం అవతారం స్వీకరిస్తానని చెప్తాడు. అంతే కాకుండా కురుక్షేత్ర యుద్ధం ద్వారా చాలా మంది అధర్మాత్ములను చంపవచ్చని భావించాడు, జరాసంధుని అందుకే అన్నిసార్లు వదిలిపెట్టాడు. చివరి సమయంలో మల్లయుద్ధం లో భీమునిచేత చంపించాడు కాబట్టి ఆయన సూత్రధారి ఆయనే నాయకుడు శ్రీకృష్ణుని కాదని ఇంకొకరిని నాయకుడుగా స్వీకరించడం సాహసం అవుతుందని వీరు తెలియజేస్తారు. (బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావుతో ముఖాముఖి).

భగవంతుడు ధర్మంగా జీవించేవారికి హాని కలిగించే దుష్టబుద్ధి కలిగిన వారికి ఎన్ని విధాలా నచ్చజెప్పాలో అన్ని విధాలుగా వారిని మంచి మార్గంలో పెట్టడానికి ప్రయత్నించి అయినప్పటికి వారి నడవడిలో మార్పురానప్పుడు వారిని శిక్షిస్తాడు. ఇటువంటి ధర్మ నిర్ణయాలను పాటించే కృష్ణుడు అర్జునుడిని యుద్ధానికి ప్రేరణోన్ముఖుడిని చేసాడు. దురాత్ములకు శిక్ష పడేటట్లు చేసాడు.

ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చిర్రావూరి శివరామకృష్ణశర్మ గారు ముఖాముఖిలో మహాభారత దృష్ట్యా చూసినప్పుడు నాయకుడు ధర్మరాజు ఎందుకంటే చివరకు ఫలితం ఆయనకే దక్కింది. తర్వాత ప్రధాన సూత్రధారి అంటే భేదం వస్తుంది. నడిపించినటువంటి వాడు, ప్రత్యక్షంగా చూస్తే శ్రీకృష్ణుడే సూత్రధారిగా కనబడతాడని పరోక్షంగా ఈశ్వరుడు మహాభారతానికి సూత్రధారిగా కనబడతాడని తెలియజేస్తాడు. ఈశ్వరుడు సూత్రధారి ఎలా అవుతాడో వీరు కొన్ని ఉదాహరణలను చూపిస్తూ సైంధవుడిని చంపవలసి వచ్చినప్పుడు రాత్రి శ్రీకృష్ణ పరమాత్మ అర్జునున్ని కైలాసానికి తీసుకుని వెళ్ళి బాణం ఎలా ఉపయోగించాలో నేర్పుతాడు. అర్జునునికి బాణ విద్య నేర్పడం ఏమిటి అంటే పాశుపతాస్త్రాన్ని ఎలా పట్టుకోవాలో అవన్నీ నేర్పి మళ్ళీ పంపిస్తారు. అక్కడ ఈశ్వరుడే కారణం అని చెప్తారు. ఇలా

ఆయా సందర్భాలలో ఈశ్వరుడు పరోక్షంగా సూత్రధారిగా ఉన్నాడని హరిహరులకు భేదం లేదని భారతంలో నిరూపించబడిందని వారు తెలియజేస్తారు.

ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, సద్గురు శ్రీదేవిసెట్టి చలపతిరావు గారు ముఖాముఖిలో శ్రీకృష్ణున్ని మహాభారతానికి నాయకుడుగా పేర్కొనాలి అని చెప్తాడు అయితే మహాభారతానికి నాయకుడు, నాయకురాలు, ప్రతి నాయకుడు అనే పద్ధతిలో చూసుకుంటే ధర్మరాజు, ద్రౌపది, దుర్యోధనుడు ఇలా వస్తాడు. కాని మహాభారతాన్ని మొత్తంగా జాగ్రత్తగా పరిశోధన చేస్తే కేవలం శ్రీకృష్ణుడు మాత్రమే నాయకుడు. శ్రీకృష్ణుడే కథానాయకుడుగా ఎలా చెప్పవచ్చో చెప్తూ భగవద్గీతను ఉదహరిస్తారు. భగవద్గీత ఎటువంటిది, మానవ జీవితాన్ని ఎలా ఉన్నతమైన స్థితికి తీర్చిదిద్దుకోవాలో చెప్పేటటువంటిది. ఉపనిషత్తుల సారం అందులో ఉంది పరమాత్మను అందుకోవడానికి కావలసిన మార్గాలన్నీ ఉపనిషత్తులో చెప్పబడుతాయి. ఇటువంటి భగవద్గీతను అందించింది శ్రీకృష్ణ పరమాత్మ. భారతం గురించి చెప్పేటప్పుడు భగవద్గీత గురించి ఎందుకు వచ్చింది అంటే భారతానికి భగవద్గీతకు భేదం లేదు. భారతం లక్ష శ్లోకాల గ్రంథం భగవద్గీత 700 శ్లోకాల గ్రంథం ఈ భగవద్గీతను సాగదీస్తే భారతం అవుతుంది. కాబట్టి భగవద్గీతకు ప్రధానమైన నాయకుడు ఎవరో భారతానికి అతనే అంటే శ్రీకృష్ణుడే నాయకుడు అని వీరు తెలియజేస్తారు.

మహాభారతానికి నాయకుడుగా చెప్పదగిన వ్యక్తికి కొన్ని అర్హతలు ఉండాలి. కాని సూత్రధారుడు అంటే సమస్తాన్ని తన అధీనంలో ఉంచి ధర్మ సంస్థాపనకు కృషి చేసేవారు ఎవరోవారు శ్రీకృష్ణుడిని ప్రధానంగా చెప్పడం వీరి మాటల్లో అంతర్లీనంగా కనబడుతుంది.

ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మగారు మహాభారతానికి నాయకుడు శ్రీకృష్ణుడే అని తెలియజేస్తూ మహాభారతానికి కథా నాయకుడు శ్రీకృష్ణుడేనని స్పష్టంగా వ్యాసుడు పలుచోట్ల పేర్కొన్నాడని అవతారికలోనే ధర్మవృక్ష స్వరూపాన్ని చెప్తూ ధర్మరాజాదులతో విలసిల్లే ఆ వృక్షానికి శ్రీకృష్ణుడు మూలమని వర్ణించారని వీరు తెలియజేస్తారు.

ప్రాచార్య శలాక రఘునాథశర్మ మహాభారతానికి నాయకుడు ధర్మరాజే అని చెప్తాడు కాని నాయకుడినే నడిపించేవాడు సూత్రధారి శ్రీకృష్ణుడని తెలియజేస్తారు. భారతంలో నాయకుడు ధర్మరాజు, నాయక, నాయకుడు శ్రీకృష్ణుడు అయితే అటువంటి స్థితి తక్కిన వాటిలో ఉండరు. నాయకుడే ఉంటాడు. కాని ఇక్కడ నాయకుడినే నడిపించేటటువంటి వాడిగా శ్రీకృష్ణున్ని నిబంధించడం భారతంలో గొప్పవిషయం కాబట్టి ఆయన నాయక నాయకుడు.

వీరి అభిప్రాయంలోనూ మహాభారతానికి ప్రధాన సూత్రధారి శ్రీకృష్ణ పరమాత్మయే అని తెలుస్తుంది. వీరి మాటల్లోని అంతరార్థాన్ని పరిశీలిస్తే మహాభారతానికి కర్త, కర్మ, క్రియ అన్ని శ్రీకృష్ణుడే అని అర్థమవుతుంది.

ప్రముఖ సాహిత్యకారులు, ఆధ్యాత్మిక వేత్త వి.వి.ఎల్. శ్రీనివాస మూర్తి (వెంపరాల వెంకట కృష్ణ శ్రీనివాస మూర్తి) మహా భారతానికి నాయకుడు - ప్రధాన సూత్రధారి. ఎవరు అనే విషయాన్ని వివరిస్తూ ఈ విధంగా తెలియజేస్తారు. ఈ ప్రశ్నలో రెండు కోణాలు గోచరిస్తున్నాయి. ఒకటి మహాభారతానికి నాయకుడు - రెండవది సూత్రధారి. మహాభారత సూత్రధారి అన్నప్పుడు కచ్చితంగా ఈ జగన్నాటకానికి మూల పురుషుడు - కర్త, కర్మ, క్రియ అయిన పురుషోత్తముడు శ్రీకృష్ణ పరమాత్ముడే అనే విషయాన్ని స్పష్టం చేస్తూ మహా భారత కథాచిత్రణా పరంగా చూస్తే - ఆదిపర్వంలోని కుమారాస్త్ర విద్యా ప్రదర్శన ఘట్టం నుంచి, కురుక్షేత్ర సంగ్రామం వరకు కథలో నాయకుడిగా కనిపించేది 'అర్జునుడు' మాత్రమే. కానీ మళ్ళీ అంతా జగన్నాటకమే కదా అనుకున్నప్పుడు, ముందుండి యుద్ధాన్ని నడిపించిన రథసారథి కృష్ణుడే కదా. అంతిమంగా చెప్పాలంటే - నడిపేది, నడిపించేది పరమాత్ముడే కాబట్టి శ్రీకృష్ణుడే నాయకుడు, ప్రధాన సూత్రధారి.

వీరి అభిప్రాయాలను పరిశీలిస్తే అస్త్ర విద్యానైపుణ్యంతో అర్జునుడు ఒక్కొక్క విజయ శిఖరాన్ని అందుకున్నప్పుడు అర్జునుడే నాయకుడు అనిపించినట్లు ఉంటుంది. కాని పరోక్షంగా అర్జునుని అంతరంగంలో ఉండి ప్రత్యక్షంగా అర్జునునికి రథసారథిగా ఉన్న శ్రీకృష్ణుడే ప్రధాన సూత్రధారి అని అర్థమవుతుంది.

**ముగింపు**

ఈ వ్యాసంలో ప్రధానంగా మహాభారతం యొక్క గొప్పతనాన్ని క్లుప్తంగా వివరించి మహాభారతానికి నాయకుడు ఎవరు అని ప్రశ్న వేసుకున్నప్పుడు సందేహాలు ఏర్పడుతుంటాయి. ఆ సందేహాలను నివృత్తి చేసే క్రమంలో ప్రముఖుల అభిప్రాయాలను సేకరించి వాటిని వివరించడం జరిగింది. మహాభారతానికి నాయకుడు ఎవరు అని చర్చించే ముందు నాయకుడుగా ఉండడానికి కావలసిన అర్హతలను పరిశీలించాలి, అలా పరిశీలన చేసినప్పుడు శాంతికాముకుడు, ధర్మం పట్ల ఆసక్తితో ఉన్నవాడు, అయిన ధర్మరాజు మనకు వెంటనే గోచరిస్తాడు. అయితే మహాభారతాన్నంతటికి సూత్రధారుడు ఎవరని భావించినప్పుడు మాత్రం శ్రీకృష్ణుడే కనబడుతాడు. ఎందుకంటే మహాభారతంలో ధర్మ సంకటం ఎక్కడ కలిగినా పాండవులు శ్రీకృష్ణుని సలహాల మేరకే ముందుకు వెళ్ళి విజయాలను అందుకుంటారు. చివరకు ద్రౌపది వస్త్రాపహరణ సమయంలో కూడా శ్రీకృష్ణుడి ప్రమేయంతోనే ద్రౌపది అవమానం పాలు కాకుండా కాపాడబడుతుంది. ఇలా ధర్మానికి హాని కలుగుతుంది అనుకున్న ప్రతి సన్నివేశంలోనూ శ్రీకృష్ణుడి ప్రవేశం ఉండటాన్ని మనం గమనించవచ్చు ఏ రకంగా చూసినా మహాభారతానికి శ్రీకృష్ణుడే ప్రధాన సూత్రధారిగా మనం గ్రహించవచ్చు.


ISSN 2319-2550
బెంగుళూరు
తెలుగుతేజం
సామాజిక, సాంస్కృతిక, సాహిత్య, రాజకీయ మాస పత్రిక
సంపుటి -7, సంచిక - 3, (ప్రత్యేక సంచిక) సెప్టంబరు 2022
రామాయణ, భారత, భాగవతాలు -
వ్యక్తిత్వ వికాసం
సాహిత్య భారతి - అనంతపురము
పతికి రాజ్యలక్ష్మి ఫౌండేషన్ - అనంతపురము

# రామాయణ, భారత భాగవతాలు - వ్యక్తిత్వ వికాసం

(రెండు రోజుల జాతీయ సదస్సు ప్రత్యేక సంచిక)

8 & 9 తేదీలు, సెప్టంబరు 2022


సంపాదకులు & సదస్సు సంచాలకులు
డా॥ బత్తల అశోక్‌కుమార్
అధ్యక్షులు, శ్రీశ్రీ కళావేదిక ఎస్కేయూ శాఖ
అనంతపురము. -515003
సెల్ : 9490194780

సహ సంపాదకులు & సదస్సు సమన్వయకర్త
డా॥ జెన్నే యోగీశ్వర నాయుడు
తెలుగు అధ్యాపకులు,
ప్రభుత్వ డిగ్రీ & పీజీ కళాశాల
అనంతపురము. -515001
సెల్ : 94407 60136



సంపాదకమండలి
శ్రీగుంటి మురళీకృష్ణ భరద్వాజ్
డా॥ పతికి రమేష్ నారాయణ
శ్రీ గుత్తా హరిసర్వోత్తమనాయుడు



నిర్వహణ
సాహిత్య భారతి, అనంతపురము
పతికి రాజ్యలక్ష్మి ఫౌండేషన్, అనంతపురము

Vol. 15 Issue. 10 (Special Edition, September 2022)
ISSN No: 2319-2550 RNI No. KARTEL/2008/27162



## విషయ సూచిక

1. రామాయణం – శ్రీరామచంద్రుని వ్యక్తిత్వం 1
– ఆచార్య ఎం.రామనాథం నాయుడు

2. భీష్మ పితామహుని వ్యక్తిత్వం 8
– కందుల సావిత్రి

3. ఆంధ్ర మహాభారత విరాటపర్వం – వ్యక్తిత్వ వికాసం 16
– డా॥ రాంభట్ల వేంకటరాయశర్మ

4. ఆంధ్రమహాభారతంలో భీముని పాత్ర 21
– డా॥ కడియాల వెంకటరమణ

5. పోతన భాగవతం – వైశిష్ట్యం 26
– డా॥ బి.చక్రవర్తి

6. శ్రీరాముని వ్యక్తిత్వం – ప్రస్తుత సమాజానికి ఆదర్శనీయ అంశాలు 31
–మున్నం శశికుమార్

7. ఆదికవి నన్నయ శకుంతలోపాఖ్యానం – మానవ వికాసం 37
– డా॥ వొలుపు కనకరాజు

8. రామాయణం – వ్యక్తిత్వ సూత్రాలు 41
– భమిడిపాటి గౌరీశంకర్

9. మహాభారతంలో పాత్రలు – వ్యక్తిత్వ వికాసం 45
– డా॥ జూరెడ్డి నిర్మల

10. వామన చరిత్రము– బలిచక్రవర్తి పాత్ర – వ్యక్తిత్వ వికాసం 50
– రామస్వామి

11. కవిత్రయ భారతంలో భక్తియోగ పరమార్థం – వ్యక్తిత్వ వికాసం 53
–డా॥ అడపా కేదారి

12. మహాభారతంలో వ్యక్తిత్వ వికాసం 55
–డా॥ పి. కమల సుధారాణి

13. నన్నయ మహాభారతం – వ్యక్తిత్వ చిత్రణం 58
– డా॥ దార్లపూడి శివరామకృష్ణ

## విషయ సూచిక

1. రామాయణం – శ్రీరామచంద్రుని వ్యక్తిత్వం 1
– ఆచార్య ఎం.రామనాథం నాయుడు
2. భీష్మ పితామహుని వ్యక్తిత్వం 8
– కందుల సావిత్రి
3. ఆంధ్ర మహాభారత విరాటపర్వం – వ్యక్తిత్వ వికాసం 16
– డా॥ రాంభట్ల వేంకటరాయశర్మ
4. ఆంధ్రమహాభారతంలో భీముని పాత్ర 21
– డా॥ కడియాల వెంకటరమణ
5. పోతన భాగవతం – వైశిష్ట్యం 26
– డా॥ బి.చక్రవర్తి
6. శ్రీరాముని వ్యక్తిత్వం – ప్రస్తుత సమాజానికి ఆదర్శనీయ అంశాలు 31
–మున్నం శశికుమార్
7. ఆదికవి నన్నయ శకుంతలోపాఖ్యానం – మానవ వికాసం 37
– డా॥ వౌలుపు కనకరాజు
8. రామాయణం – వ్యక్తిత్వ సూత్రాలు 41
– భమిడిపాటి గౌరీశంకర్
9. మహాభారతంలో పాత్రలు – వ్యక్తిత్వ వికాసం 45
– డా॥ జూరెడ్డి నిర్మల
10. వామన చరిత్రము– బలిచక్రవర్తి పాత్ర – వ్యక్తిత్వ వికాసం 50
– రామస్వామి
11. కవిత్రయ భారతంలో భక్తియోగ పరమార్థం – వ్యక్తిత్వ వికాసం 53
–డా॥ అడపా కేదారి
12. మహాభారతంలో వ్యక్తిత్వ వికాసం 55
–డా॥ పి. కమల సుధారాణి
13. నన్నయ మహాభారతం – వ్యక్తిత్వ చిత్రణం 58
– డా॥ దార్లపూడి శివరామకృష్ణ

28. ఏకలవ్యుని వ్యక్తిత్వం 119
– డా॥ సముద్రాల ప్రిస్సిల్ల
29. కౌశికుడు వ్యక్తిత్వాన్ని వికసింపచేసిన ధర్మవ్యాధుడు 121
– డా॥ ఎం. పద్మగౌరి
30. శ్రీరామచంద్రుడు – వ్యక్తిత్వం 126
– సాకేటి సత్యనారాయణ
31. నన్నయ భారతము – నారద ప్రబోధం – వ్యక్తిత్వ చిత్రణ 130
– చిలుకమర్తి శారద
32. వాల్మీకి శ్రీమద్రామాయణంలో రామారి వర్గ పాత్రల వ్యక్తిత్వ వికాసం 135
– డా॥ ఒజ్జల శరత్‌బాబు
33. రామాయణం, మహాభారతాలలో పాత్రలు – వ్యక్తిత్వ వికాసం 144
– బి. రాధమ్మ
34. ధర్మవ్యాధుడు – వ్యక్తిత్వ వికాసము 147
– డా॥ బి. సునీత
35. భాగవతంలో కుచేలుని పాత్ర – వ్యక్తిత్వ వికాసం 150
– బి. వెంకటయ్య గౌడ్
36. సావిత్రుపాఖ్యానము – వ్యక్తిత్వ వికాసం 153
– కవాడపు లలిత
37. మహాభారతం – గురుభక్తి 154
– డా॥ మఠపతి మాంతయ్య
38. మహాభారతంలో శ్రీకృష్ణ సందేశం – వ్యక్తిత్వ వికాసం 162
– కె. సుజన
39. ఆంధ్ర మహాభారతం – అర్జున వ్యక్తిత్వ వికాసం 166
– తంత్రవహి శ్రీరామమూర్తి
40. రామాయణంలో పాత్రలు – వ్యక్తిత్వ వికాసం 172
– డా॥ జూరెడ్డి నిర్మల
41. రామాయణంలో శ్రీరాముడు – వ్యక్తిత్వ వికాస విశ్లేషణ 178
– సి. హెచ్. నాగలక్ష్మి

42. విదురనీతి – ధర్మ సూక్ష్మాలు 183
– మణినాథ్ కోపల్లె

43. భారత – భాగవతాలు – శ్రీకృష్ణుడు 188
– రాఘవేంద్రరావు

44. ఉత్తమ విద్యార్థి అర్జునుడు 192
– భక్తుల బిందుప్రియ

45. మహాభారతంలో వ్యాసుని ధర్మనిరతి – మానవ వికాసం 197
– కాళేశ్వరం కృష్ణమూర్తి

46. పోతన భాగవతం – అంబరీషుని పాత్ర – వ్యక్తిత్వ వికాసం 201
– కె. పురుషోత్తం

47. మహాభారతంలోని పాత్రలు – వ్యక్తిత్వ వికాసం 205
– డా॥ పలివెల చిరంజీవి రావు

48. రామాయణంలో ప్రసిద్ధ పాత్రలు – వ్యక్తిత్వ వికాసం 212
– బి. క్యాథరీనా

49. శిష్యవాత్సల్యం – శుక్రాచార్యుడు 218
– ముక్కపల్లి సాగర్

50. ధౌమ్యోపదేశం – ఉద్యోగి ప్రవర్తించవలసిన తీరు 224
– సంపత్ కుమార్ బానోజి

51. శకుంతలోపాఖ్యానం – స్త్రీ సాధికారత 228
– గోమారపు కవిత

52. బలరామకృష్ణుల బాల్య క్రీడాభివర్ణనము 234
– బుక్క సిరాజ్

53. రామాయణంలోని సీత వ్యక్తిత్వం 236
– బి. శశికళ

54. మహాభారతంలో వ్యక్తుల వ్యక్తిత్వ వికాసం 239
– పొన్నెకంటి స్వప్న

55. ఆదర్శ నారీమణులు – సీత, ద్రౌపది 247
– ఆవలకొండ అన్నపూర్ణ

**56.** కర్ణుడు - వ్యక్తిత్వ వికాసం **251**
- డా॥ ద్వారపూడి భానుప్రియ
**57.** మహాభారతంలోని శాంతి & అనుశాసనిక పర్వములు- వ్యక్తిత్వ వికాసం **257**
- డా॥ పెద్దాడ వేంకటలక్ష్మీ సుబ్బారావు
**58.** భగవద్గీత - వ్యక్తిత్వ వికాసం **264**
- డా॥ సూరపరాజు వసంతకుమారి
**59.** వసుసేనుని (కర్ణుడు) - వ్యక్తిత్వ వైశిష్ట్యం **269**
- ఇ. కల్యాణి
**60.** మహాభారతంలో దమయంతి వ్యక్తిత్వం **274**
- డా॥ బోడిరెడ్డి మహేంద్రరెడ్డి
**61.** సుధాసాగరం - రామాయణం **280**
- దామరాజు విశాలాక్షి
**62.** సుందరకాండము - సహాయక స్త్రీ పాత్రలు - ఉదాత్త వ్యక్తిత్వ వికాసం **286**
- డా॥ గజ్జెల ప్రమీల
**63.** శ్రీమన్మహాభారతం సురుచిరసూక్తులు - వ్యక్తిత్వ వికాసం **291**
- డా॥ జెన్నే యోగీశ్వరనాయుడు
**64.** జానపదుల గేయాల్లో రామాయణం - మానవీయ విలువలు **296**
- పి. శాలిని & ఆచార్య మూలె విజయలక్ష్మి,
**65.** భీష్మ ప్రతిజ్ఞ **300**
- కె. నికిత
**66.** సర్వభూషణం - ఏకాగ్రత **302**
- పి. సుజాత
**67.** తిక్కన భారతంలో ధర్మరాజు పాత్ర - వ్యక్తిత్వ వికాసం **304**
- నందూరి అనంతలక్ష్మి,
**68.** రామాయణంలో కైకేయి పాత్ర - వ్యక్తిత్వ వికాసం **306**
- నూనావతు పార్వతి
**69.** భారతంలో సీత **312**
- పంజాల రజిత

Vol. 15 Issue. 10 (Special Edition, September 2022)
ISSN No: 2319-2550 RNI No. KARTEL/2008/27162


70. మహాభారతంలో ఆదర్శపాత్ర - మహానుభావుడు విదురుడు 316
- రామకృష్ణ ఇడుకుల్ల
71. భారతంలో గురుదక్షిణ - సంబంధాలు వ్యక్తిత్వం 324
- డా॥ హెచ్.కిషన్
72. హనుమంతుని పాత్ర - వ్యక్తిత్వ వికాసం 329
- వేదాంతం శరత్‌చంద్ర
73. భగవద్గీత - వ్యక్తిత్వవికాస సూత్రాలు 332
- డా॥ కె. విజయవేణి
74. ఇతిహాస భారత సమకాలీన వ్యక్తిత్వ వికాసం 337
-పోలపల్లి శ్రీకాంత్
75. మహాభారతములో మహారాణి కుంతీదేవి వ్యక్తిత్వం 339
- జోషి మధుసూదన శర్మ
76. పోతన మహాభాగవత అవతారికా పద్యాలు - సద్గుణప్రేరకాలు 343
- ఆకొండి వెంకటలక్ష్మి
77. "భారతంలో ఉపాఖ్యానాలు - వ్యక్తిత్వ వికాసం" 348
- షేక్ షానాజ్ బేగం
78. రామాయణ భారత భాగవతాలు - స్నేహం - వ్యక్తిత్వ వికాసం 354
- డా. రాపోలు శ్రీనివాస్
79. ఆదర్శ వ్యక్తిత్వానికి ప్రతీక - సీతాదేవి 360
- డా॥ బత్తుల అశోక్ కుమార్
80. నలోపాఖ్యానం - దమయంతి పాత్ర చిత్రణ - వ్యక్తిత్వ వికాసం 365
- బి గంగాదేవి
81. భాగవతంలోని మానవ సంబంధాలు - వ్యక్తిత్వ వికాసం 368
- బి. ఈరనారప్ప
82. నన్నయ ఆంధ్రమహాభారత అవతారిక - సామాజిక సాంస్కృతిక దృక్పథం 372
డా॥ కొయ్యా శ్రీనివాసులు,
83. భాగవతంలో అంబరీషుడి వైశిష్ట్యం 376
- డా॥ ఎం.లక్ష్మయ్య
84. ఆంధ్రమహాభారతంలోఉదాత్తపాత్రలు- వ్యక్తిత్వవికాసం 380
- అంకే మదన్‌మోహన్

Vol. 15 Issue. 10 (Special Edition, September 2022)
ISSN No: 2319-2550 RNI No. KARTEL/2008/27162


85. భరద్వాజ,దుర్వసోమహర్షులవ్యక్తిత్వం–అధ్యయనము 384
– కె. హరీష్ కుమార్

86. శ్రీమద్భాగవత్‌పురాణ్ భక్తితత్త్వ – వ్యక్తిత్వ వికాస్ (సంస్కృతం) 389
– డా॥ అశావాది సుధామవంశీ

87. SRI ANJANEYA THE GREAT PERSONALITY OF RAMAYANA - SRI PANCHADARLA APPALAKONDA 393

88. IMPLEMENTATION AND EFFECTIVENESS OF MORAL VALUES AND ETHICS OF RAMAYANA IN THE PRESENT CONTEXT - DR. T. SURYA PRAKASH 400

89. MAHABHARATA OF NANNAYA IN HISTORICAL PERCEPTIVE - DR. JAMMANNA AKEPOGU 403

90. EFFECT OF RAMAYANA ON VARIOUS CULTURES AND CIVILISATIONS IN PERSPECTIVES OF COMPLETE LIFE OF REAL HUMAN 407
DR. REPALLI RAMUDU

భావాలు భక్తునిలో ఉన్నాయి కాబట్టి శ్రీకృష్ణుని దృష్టి మొదట అర్జునుడిపై పడింది. ఇప్పటి కాలంలో కూడా మన ప్రవర్తన భక్తి శ్రద్ధలను బట్టి ఆ పరమాత్మ చూపు మనపై ప్రసరిస్తుంది అనడంలో సందేహం లేదు. అటువంటి వారి జీవితం ఆనందదాయకంగా ఉండడమే కాకుండా ఇహ వర సౌఖ్యాలు అనుభవిస్తారు. శ్రీకృష్ణుని సన్నివేశం ద్వారా పరోక్షంగా దాగి ఉన్న ఈ సందేశం. వ్యక్తి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతుంది అనడంలో సందేహం లేదు.

పరమాత్ముని యొక్క దయ ఎలా ఉంటుందో మనం ఈ క్రింది విషయాలలో పరిశీలిద్దాము.

కం. సారథ్యం బొనరింపు మ/పార కృపాలీల నెల్లభంగుల నాః కీ
గౌరవమును జిరకాలము / గోరినయది దీని నెమ్ము గుణరత్ననిధీ ॥

(తిక్కన ఉద్యోగ పర్వం)

భక్తుడు ఏమి కోరితే అది ఇవ్వడం పరమాత్ముని లక్షణం. ఇక్కడ అర్జునుడు శ్రీకృష్ణుడినే తన రథానికి సారథ్యం చేయమని అడుగుతాడు. దానికి శ్రీకృష్ణుడు సంతోషంగా అంగీకరిస్తాడు.

నిజానికి శ్రీకృష్ణుడు సారథ్యం వహించేది రథానికి కాదు, ధర్మానికి, అర్జునుని వైపు ధర్మం, భక్తి అంతకంటే శ్రీకృష్ణునిపై నమ్మకం ఉన్నాయి. కాబట్టి భగవంతుడు భక్తుని విజయరథంపై సారథియై ఉన్నాడు.

ఉద్యోగ పర్వంలో సంజయ రాయబారం సమయంలో శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రునకు కొన్ని మాటలు చెప్పి పంపిస్తాడు. అందులో భగవద్గీతకు ముందే కర్మ యొక్క గొప్పతనాన్ని ఈ విధంగా తెలియజేస్తాడు. కొందరు కర్మయోగం ద్వారా పరలోక సిద్ధిని పొందవచ్చని చెప్పారు. మరికొందరు కర్మత్యాగం చేసి జ్ఞానం చేత మోక్షం పొందవచ్చన్నారు. విద్వాంసుడు కూడా ఈ లోకంలో భక్ష్యభోజ్యాలు తినకుండా తృప్తి పొందలేడు. అందువల్లే బ్రహ్మ విద్య నిష్ఠ కలవారికి ఆకలి తీరటం కోసం భోజన విధిని శాస్త్రం చెపుతుంది. (గార్హస్థ్యం, సన్యాసం రెండూ సమానమని శాస్త్రాలు విధించినా గృహస్థాశ్రమమే మిన్న. ఆశ్రమాంతర సాధ్యమైన జ్ఞానాన్ని గృహస్థుడు కూడా పొందవచ్చు కాని గృహస్థుడు చేయగల యజ్ఞాది కర్మలు ఇతర ఆశ్రమాలలో కుదరవు.)

1. జ్ఞాన మార్గం కూడా కర్మతో పాటు ఉండవలసిందే. జ్ఞానంలో కూడా కర్మ ఉంటుంది. కర్మ కంటే కర్మను విడిచిపెట్టడం గొప్పదని భావించేవాడు దుర్బలుడు, ఆతని మాటలు వ్యర్థములైనవి.

కర్మణామీ భాంతి దేవాః పరత్ర - కర్మణైవేహ ప్లవతే మాతరిశ్వా
అహోరాత్రే విదధత్ కర్మణైవ - అతంద్రితో నిత్యముదేతి సూర్యః

కర్మచేతనే ఈ దేవతలు స్వర్గలోకంలో ప్రకాశిస్తున్నారు. కర్మ వల్లనే ఇహలోకంలో గాలి వీస్తోంది. రాత్రింబవళ్లను ఏర్పరిచే సూర్యుడు కూడా కర్మ వల్లనే అలసత లేకుండా ప్రతిరోజూ ఉదయిస్తున్నాడు.

2. చంద్రుడు కూడా కర్మ చేతనే అలసత్వం లేక మాసాలను, పక్షాలను, నక్షత్రాలతో కలయిక పొందుతున్నాడు. అగ్ని కూడా అలసత్వం లేకుండా ప్రజల కోసం కర్మ చేస్తూనే ప్రజ్వలిసున్నాడు.

3. కర్మ చేతనే ఈ భూదేవి అలసత లేకుండా ఇంతటి మహాభారాన్ని మోస్తుంది. నదులు కూడా కర్మ వల్లనే సర్వ భూతాలను తృప్తి పరుస్తూ నీటితో వేగంగా ప్రవహిస్తున్నాయి.

Vol. 15 Issue. 10 (Special Edition, September 2022)
ISSN No: 2319-2550 RNI No. KARTEL/2008/27162 

వాసిలి వసంత కుమార్ "కొత్తకోణంలో గీతా రహస్యాలు" పుస్తకంలో గుహ్య, గుహ్యతర, గుహ్యాత్మక గీత అనే వ్యాసంలో "మనలోని ప్రతి ఒక్కరి జీవితమూ పోరు క్షేత్రమే, మనలోని ద్వంద్వ ప్రవృత్తులకు నిలువెత్తు రూపాలే కృష్ణార్జునులు, సంశయం మనలోనిదే, సామరస్యము మనలోనిదే, ప్రశ్న మనమే, సమాధానమూ మనమే. అయితే ప్రశ్నల రూపములో మనం అర్జునుడిని కౌగిలించుకుంటూ సమాధానాల రూపములో కృష్ణాంశను పొందుతుంటాం." అని అంటారు.

ఈ విషయాలను పరిశీలిస్తే మన మనసు పగ్గాలు లేని గుర్రం లాగా కోరికల వెంట పరిగెడుతూనే ఉంటుంది. దాని వలన అశాంతి ఏర్పడుతుంది. మనశ్శాంతి కోసం ఎన్నో ప్రయత్నాలు చేస్తాము, ఏమి చేయాలో తోచక నిరుత్సాహంతో జీవనం గడుపుతాము. అటువంటి వారికి భగవద్గీత మంచి ఔషధము.

అదుపు తప్పిన అర్జునుని మనస్సును శ్రీకృష్ణుడు తన వాక్ సారథ్యంతో ఓదార్చిన విషయాలే భగవద్గీతగా రూపొందాయి. శ్రీకృష్ణుడు సమస్త మానవాళికి వ్యక్తిత్వ వికాస రహస్యాలను భగవద్గీత రూపములో అందించాడు. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలతో నిండిన వ్యక్తి మనసును మధించి అమృత తుల్యమైన జీవన నైపుణ్యాలను, కలత లేని జీవన పరమార్థాన్ని, మనల్ని మనం మార్గ నిర్దేశకులుగా తీర్చి దిద్దుకోవడానికి కావలసిన వనరులని మనకు అందించాడు.

ఆధార గ్రంథాలు

1. సుబ్రహ్మణ్యం, జి.వి. (ప్రధాన సంపాదకులు), కవిత్రయ విరచిత మహాభారతం, తి . తి . దే . ప్రచురణ, 2008.

2. రామకృష్ణ మూర్తి, తిప్పాభట్ల, శ్రీనివాసులు, సూరం (సంపాదకులు), శ్రీ మహాభారతం (సంస్కృతం), గీత ప్రెస్, గోరఖ్‌పూర్, 2019.

3. వసంత కుమార్, వాసిలి, కొత్త కోణంలో గీత రహస్యాలు, మొదటి భాగం, జీవన గీత, యోగాలయ రీసెర్చ్ సెంటర్, 2015.165


ప్రభుత్వ డిగ్రీ కళాశాల
సదాశివపేట, సంగారెడ్డి జిల్లా తెలంగాణ
మోక్ష సోపానాలు
ISBN NO.978-93-85132-95-7
భారతీయ సాహిత్యం - అరిషడ్వర్గాలు
అంతర్జాతీయ సదస్సు
తేది : 22-11-2020
ప్రధాన సంపాదకురాలు
డా॥ ఎస్, బేబిరమణి
అసిస్టెంట్ ప్రొఫెసర్
తెలుగు శాఖాధిపతి,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సదాశివపేట,
సంగారెడ్డిజిల్లా, తెలంగాణ రాష్ట్రము.
Lobh
లోభము
Moha
మోహము
Mada
మదము
అరిషడ్వర్గాలు
Arishadvargas
Matsarya
మాత్సర్యము

# భారతీయ సాహిత్యం - అరిషడ్వర్గాలు

# అంతర్జాతీయ సదస్సు

ప్రధాన సంపాదకులు

డా. యస్. దేవేరమణి,

సహాయ ఆచార్యులు, తెలుగుశాఖ,

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సదాశివపేట,

సంగారెడ్డిజిల్లా, తెలంగాణరాష్ట్రము.

ISBN No. 978-93-85132-95-7

# మోక్ష సోపానాలు – వ్యాస సంపుటి

వ్యాస సేకరణ
**డా॥ ఎస్. బేబీరమణి**

ప్రథమ ముద్రణ : డిశెంబరు 2020
ప్రతుల సంఖ్య : 100

వెల : 400/-

ప్రతులకు సంప్రదించవలసిన చిరునామా :
ఇంటి నం : 12-135, శ్రీనగర్ కాలనీ
పటాన్‌చెరువు, సంగారెడ్డి జిల్లా,
తెలంగాణ రాష్ట్రం,
చరవాణి నం. 8332932330

ప్రచురణ సంస్థ
**మనస్వీ చంద్ర ప్రచురణలు**

ప్రతులపై హక్కులు : సదస్సు నిర్వాహకులవి

**ఐ.ఎస్.బి.ఎన్. నం: 978-93-85132-95-7**

కవర్ పేజి : సర్దార్

**ప్రచురణ కర్తలు :** వాగ్దేవి పబ్లిషర్స్,
2-2-1165/2/ఎ,
రైల్వేబిడ్జి సమీపంలో,
తిలక్ నగర్, నల్లకుంట,
హైదరాబాద్.

ISBN No. 978-93-85132-95-7


## విషయసూచిక


1. డా॥ **కాకునూరి సూర్యనారాయణ మూర్తి** : శ్రీ మహాభాగవతము అరిషడ్వర్గ నివారణోపాయం 1
2. డా॥ **కృష్ణవేణి** : లకుమ నవలలోని అరిషడ్వర్గాలు 6
3. డా॥ **ఒబిన్ని శ్రీహరి** : ఆంధ్రమహాభారతం – అరిషడ్వర్గాల ప్రస్తావన 10
4. డా॥ **కె.అరుణాబాయి** : 'కావ్యాలు –అరిషడ్వర్గాలు శీర్షికన శ్రీనాథుని శృంగార నైషధములో అరిషడ్వర్గాలు 13
5. **ఎమ్. రామలక్ష్మి** : ఇందీవరాక్షుని కథ – క్రోధ పరిణామం 18
6. డా॥ **ఎస్.పి.కృష్ణవేణి** : వృష్ఠి, సృష్టి మరియు పరమేష్ఠి 21
7. డా॥ **బూర్గుల స్వరూప** : శకుంతలోపాఖ్యానం – అరిషడ్వర్గాలు 23
8. డా॥ **ఏ.వేంకట ప్రసాద్** : వేమన పద్యాలు – అరిషడ్వర్గాలలో కామము 26
9. డా॥ **చింతనోళ్ళ నర్సింహులు** : వేమన పద్యాలు – అరిషడ్వర్గాలు 28
10. డా॥ రాచపాలెం **పురందీశ్వరి** : రామాయణం – అరిషడ్వర్గాలు 31
11. **బిజ్జ** నాగభూషణం : భారతీయ సాహిత్యం – అరిషడ్వర్గాలు 34
12. **తంత్రవాహి శ్రీరామమూర్తి** : ప్రబంధ కవులు చిత్రించిన అరిషడ్వర్గాలు 36
13. డా॥ బాచిమంచి **వెంకటేశ్వర్లు** : అరిషడ్వర్గాలు – వాటి ప్రభావం 38
14. **టి. గౌరయ్య** : ఇతిహాసాలు – అరిషడ్వర్గాలు 41
15. కాపర్తి **స్వరాజ్యం** : రామాయణంలో అరిషడ్వర్గాలు 43
16 డా॥ **ఎస్ బేబీ రమణి** : శశాంక విజయము – కామము వినాశహేతువు నిరూపణ 47
17. కె. **అనూరాధ** : మోహత్యాగమే ఉత్తమగతికి మార్గము – నిరూపణ 50
18. **ఆర్. కోటమ్మ** : అరిషడ్వర్గాలను జయించని దుర్యోధనుడు 52
19. **ఎఫ్. భవాని** : మదముచే వివేకము నశించుట – మతంగ చరిత్రముచే నిరూపణ 56
20. **చిట్టెమ్మ** : కోపము వివేకమును నశింపజేయుట – పర్వత నారదుల ద్వారా నిరూపణ 57
21. డా॥ **పైడిపాటి ఉమానాథ శర్మ** : శతక సాహిత్యంలో అరిషడ్వర్గాలు – పరిశీలన 58
22. **యు. ఝాన్సీ** : బుర్రకథలోని రంభ గర్వభంగం కథ – పరిశీలన 63

ISBN No. 978-93-85132-95-7



23. పి. నాగచందన : అరిషడ్వర్గాలు -ఇతిహాసాలు - ప్రస్తుత పరిస్థితులకు అన్వయం 67
24. ఖలీమ్ పాషా : పురాణేతిహాసాల్లో అరిషడ్వర్గాలు 70
25. డా॥ ఆర్. హరీనా కలా : భాగవతం - క్రోధం 74
26. సారంగపాణి బండి : గురజాడ కన్యాశుల్కం - స్త్రీలోలుడుగా గిరీశం 79
27. డా॥ అల్లంశెట్టి నాగజ్యోతి : కథా సాహిత్యం - తిలక్ కథలు అరిషడ్వర్గాల ప్రస్తావన 82
28. తాడేపల్లి వీరలక్ష్మి : ధ్రువోపాఖ్యానం - సురుచి - అరిషడ్వర్గాలు 85
29. డా॥ మంగమూర మునిలక్ష్మి : మనవ వినాశ హేతువు అహంకారం 88
30. డా॥ ఎస్.పి. కృష్ణవేణి & శ్రీపాద రమాదేవి : అరిషడ్వర్గాలతో ఆర్థికగమనం 91
31. ఎస్. మృదుల : ఆంధ్ర మహాభారతం - అరిషడ్వర్గాలు 93
32. డా॥ జె. అనూరాధ : సుమతీ శతకము - అరిషడ్వర్గ నిరూపణము 97
33. అరసవిల్లి మోహనరావు : మహాభారతంలో అసూయపర్వం 100
34. వి. చంద్రశేఖర రెడ్డి : అరిషడ్వర్గాల నియంత్రణ - సత్ప్రవర్తన 103
35. టేకుమళ్ల వెంకటప్పయ్య : అరిషడ్వర్గోపనిషత్ 105
36. అవధానం సుజాత : శ్రీ విశ్వనాథ సత్యనారాయణ వేయిపడగలలోని అరిషడ్వర్గాలు - కామం 109
37. వి.కె. సుజాత : అరిషడ్వర్గము 113
38. కె. సుజన : ఆంధ్రమహాభారతంలో అంత:శత్రువులు 116
39. డా॥ దార్లపూడి శివరామకృష్ణ : అరిషడ్వర్గాలను జయిస్తేనే విశ్వామిత్రుడు 120
40. ఎమ్.ఎస్.వి. సూర్యకుమారి : వ్యాసుని కోపం - పర్యవసానం 122
41. సోనబోయిన సతీష్ : జానపద గేయ సాహిత్యంలో అరిషడ్వర్గాలు 125
42. పి. అశోక్ : గజేంద్రమోక్షము - అరిషడ్వర్గాలు 127
43. డా॥ కోట లక్ష్మి అన్నపూర్ణ : అరిషడ్వర్గం - క్రోధం 131
44. చక్రహరి రమణ : మదమాత్సర్యము - మన భారతం 135
45. సంతోష్ కుమార్ ముత్తినేని : మనుచరిత్ర - అరిషడ్వర్గాలు 138
46. డా॥ వి.యస్. మంగాదేవి : అరిషడ్వర్గాలలో దేవయాని 141
47. డా॥ బాచిమంచి వెంకటేశ్వర్లు & ఆద్య వందన : అరిషడ్వర్గాలు - లోభం 145
48. ఎం. వేణుగోపాల్ శర్మ : అరిషడ్వర్గాలు - మోక్షమార్గము 148
49. వాగ్దేవు నాగమణి : అంత:శత్రు నిర్మూలన - మోక్షసాధన 150
50. నందిగామ నిర్మల కుమారి : పురాణ ప్రక్షిప్తాలలో జానపదులు 152

ISBN No. 978-93-85132-95-7




51. పి. ధనలక్ష్మి : అరిషడ్వర్గాలలోని కామం, క్రోధం, మోహం, లోభం 156

52. డా॥ పద్మకుమారి మొరంగపల్లి : ఆరు శత్రువులకు ధర్మమే ఆయుధం 160

53. జి.వి.ఎల్. నరసమాంబ : ఇతిహాస పాత్రలపై అరిషడ్వర్గ ప్రభావం ఆధునిక సమాజానికి వాటి సందేశం 163

54. దరిశెట్టి లక్ష్మి నరసింహం : ఇతిహాసాలు – అరిషడ్వర్గాలు 166

55. డా॥ పెండ్యాల అనసూయ ప్రసన్న లక్ష్మి : వ్యాస భారతం – అరిషడ్వర్గ వివరణము 169

56. రాఘవేంద్రరావు కోటకొండ : అరిషడ్వర్గాలు – కామక్రోధాలు 174

57. పి. దుర్గాదేవి : మరోచలం అక్షరంలో ప్రళయగ్నులలో ఆడవాళ్ళ ఆనవాళ్ళు 178

58. డా॥ ఎస్. నిశ్చల : భారతీయ సాహిత్యం – అరిషడ్వర్గాలు – క్రోధము 180

59. డా॥ ఎం. విజయశ్రీ : బొద్దులూరి వారి శాంతిపథ కావ్యదర్శనం 183

60. డా॥ రమేష్‌బాబు మామిడాల : సమకాలీన కథ స్కావెంజర్ – అరిషడ్వర్గాలు 185

61. డా॥ అనంతశంకర్ : భగవద్గీతలో అరిషడ్వర్గం 187

62. బి. మాధవి : భారతీయ సాహిత్యం – అరిషడ్వర్గ వివరణ 190

63. డా॥ ఎస్.బేబీరమణి & వై. రమేష్ బాబు : పారిజాతాపహరణము – మాత్సర్యము – దు:ఖహేతువు – నిరూపణ 192

64. పొన్నెకంటి స్వప్న : రుద్రమదేవి నవల – అరిషడ్వర్గ ప్రస్తావన 194

65: మొకురాల స్వర్ణలత : బుచ్చారెడ్డి కథలో అరిషడ్వర్గాలు 197

# ఆంధ్ర మహా భారతంలో అంతఃశత్రువులు

కె. సుజన (పి.హెచ్.డి)
హైదరాబాద్ విశ్వ విద్యాలయం

ఉపోద్ఘాతం:

అంతఃశత్రువులు అంటే కామ, క్రోధ,లోభ మోహ, మద, మాత్సర్యాలనే అరిషడ్వర్గాలు. ఇవి మన శరీరంలో మనకు తెలియకుండానే ప్రవేశించి మన జ్ఞానాన్ని నశింపచేస్తాయి. ఇందులో ప్రధానమైనది కామం. కామం అంటే కోరిక. పొందడానికి శక్యం కాని వాటిని పొందాలనే కోరిక. ఉన్న దానితో తృప్తి పడక అసాధ్యమైన వాటిని సాధించాలని మనిషి పడే తపనే కోరిక. కోరికలు అనేకం ప్రధానంగా ధనం సంపాదించాలనే కోరిక. ఈ కోరిక వలన మనిషి జీవిత విలువలు మరచి ఎవరిని గౌరవించాలి ఎవరిని దగ్గరకు చేరనీయకూడదు అనే విచక్షణా జ్ఞానం లేక నశించిపోతున్నారు. బ్రహ్మశ్రీ వద్దివర్తి పద్మాకర్ గారు వ్రాసిన 'మానవ కథ అనే పుస్తకంలో 'భిక్షకు చరిత్ర' కథ లో ధనం గురించి చాలా చక్కగా వివరిస్తారు.

సీ. అన్నదమ్ముల మధ్య నతి భయంకర యుద్ధ
మును రగిలించు సాధనము ధనము
గురు మిత్రబాంధవ కోటినైనను ద్రిప్పు
కొన జాలు గొప్ప సాధనము ధనము
పరమ నీచాత్ముని వ్యసనుని బిరుదిచ్చి
ఘనునిఁజేయఁగల సాధనము ధనము
బమ్మ తిమ్మినిఁ దిమ్మె బమ్మను జేయంగఁ
దగినట్టి మంచి సాధనము ధనము

తే.గీ. దారుణాజ్ఞానపావకేంధనము ధనము
దారపతిసుతనామబంధనము ధనము
దర్పమును బెంచునట్టి దంధనమయయ్యు
మనుజ దేహమ్మునకు మూల ధనము ధనము

ఈ పద్య భావాన్ని గమనించినట్లైతే అన్నదమ్ముల మధ్య తగాదా పెట్టేది ధనమే, నా అనుకునే గురువులు, బంధువులు, మిత్రులు వంటి వారిని కూడా తన వైపునకు తిప్పుకోగలిగే పదార్థం ధనమే. నీచుడిని, వ్యసన పరుడిని కూడా డబ్బు ఉంటే చాలు వారిని గొప్పవాడంటూ పొగుడుతాం. బిరుదులిచ్చి, సన్మానిస్తాం. బ్రహ్మను కోతిగాను, కోతిని బ్రహ్మ గాను కూడా డబ్బున్న వాడు మార్చగలడు. దారుణమైన అజ్ఞానమనే అగ్నికి ఇంధనం (వంట చెఱుకు) ధనం. భార్య భర్త కొడుకు అనే ఒక బంధం ఉండాలంటే దానికి ధనం ఉండాల్సిందే అహంకారాన్ని పెంచే వ్యర్థ పదార్థమైనప్పటికీ (మాయా వస్తువైనప్పటికి) మానవ జీవితం నడవాలంటే ధనం ఉండాల్సిందేనని తెలియజేస్తారు. (పద్మాకర్, వద్దివర్తి 'మానవ కథ,(ద్వి.ము), ప్రణవపీఠం, ఏలూరు, సెప్టెంబర్ ,2020) ధనమనే మాయ చేత మానవుడు తన వ్యక్తిత్వాన్నే కాక మంచి సంబంధ బాంధవ్యాలను పోగొట్టుకుంటున్నాడని, అశాశ్వతమైన ధనం కోసం వ్యర్థమైన జీవితాన్ని గడుపుతున్నాడని ఈ పద్యం లోని అంతరార్థం.

**పూర్ణస్థితిని మొదట పొందలేకపోయినను తమ సాధనను విడువక ఆచరించవలెను.**

ISBN No. 978-93-85132-95-7


అరిషడ్వర్గాలైన అంతఃశత్రువులు మన దగ్గరకు రాకుండా ఉండాలంటే మనం ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ఆచార్య దార్ల వేంకటేశ్వర రావు వ్రాసిన సాహితీ మూర్తులు –స్ఫూర్తులు అనే పుస్తకంలో శ్రీమతి పెయ్యేటి లక్ష్మీకాంతమ్మ గారు ఈ విధంగా వివరించారని తెలియజేస్తారు. "ఈ జీవించే శరీరం నీకు సాధనం మాత్రమే అనుకోవాలి. కాని అది నేనే అనుకోవడం కూడదు. నేను ఈ శరీరం కంటే విభిన్నుడనైయ్యే ఉన్నాను అనే అనుభవాన్ని నీవు పొంది ఉండాలి. నీ వాహనాన్ని నీ పనులు జరుపుకోవడం కోసం చక్కగా నీవు ఎప్పటికప్పుడు శుభ్రపరచి మలినం లేకుండా ఉంచుకున్నట్లుగానే ఈ శరీరాన్ని కూడా నీలోని జన్మ వాసనలన్నింటినీ నాశనం చేసి మరణాంతంలో నీకు కైవల్యాన్ని సమకూర్చేందుకు పరిశుద్ధ ఆహారవిహారాల నియమంతో శుభ్రపరచి ఉంచుకునే ఉండాలి. నీ లక్ష్యం సిద్ధించే వరకు దానిని అలక్ష్యం చెయ్యకూడదని కూడా గ్రహించాలి"అని వివరించారు.ఈ విషయాలను పరిశీలిస్తే మనం ఆచరించే నియమాలు శ్రద్ధతో అవలంబిస్తే మానసిక శుద్ధి , శారీరక శుద్ధి అవుతుంది దాని వలన అంతఃశత్రువులను అదుపులో పెట్టిన వారమవుతాము అనే అంతరార్థం ఇందులో కనబడుతుంది.

ఆంధ్ర మహా భారతంలో అంతఃశత్రువులు :

ఆంధ్ర మహాభారతాన్ని పరిశీలించినట్లైతే ఇందులో శాంతి పర్వం చతుర్థాశ్వాసంలో మంకె అనే బ్రాహ్మణుని కథ ద్వారా కామం గురించిన కొన్ని విషయాలు వ్యక్తమవుతాయి. ధనార్జన అనే కోరిక మంకెకు జనించడం ఆ కోరిక వలన పొందిన ధన సంపాదన మార్గాన్ని (కోడె దూడలను కొని ఒంటె కారణం చేత వాటి మరణాన్ని వెంటనే చూడటం)వెంటనే పోగొట్టుకోవడం జరుగుతుంది. ఆ సంఘటనను చూసి మనసులో ఇలా ప్రశ్నించుకుంటాడు. మనస్సుకు ఆహ్లాదం కలగాలంటే తప్పకుండా అది కోర్కెల తీవ్రతతో నిండి ఉండకూడదు. కోర్కెల తీవ్రతను మనస్సు నుండి తోసి వేయాలంటే ఏమి చేయాలి? అనే ఆలోచనతో తన మనసులో కోరికలను ప్రశ్నిస్తాడు. ఓ కోరికా! నీ మూలాన్ని కనుగొన్నాను నీవు సంకల్పం నుండి జన్మిస్తున్నావు అంటాడు. ఇక్కడ మాటలను పరిశీలిస్తే మనిషి సంకల్ప మాత్రంచేత అశాశ్వతమైన కోరికల మాయలో పడి తను పొందవలసిన శాశ్వతమైన ఆధ్యాత్మిక ఆనందాన్ని దూరం చేసుకుంటున్నాడని తెలుస్తుంది.

అలాగే కామం అన్ని దుఃఖాలకు కారణమని అనుకుంటాడు. అటువంటి కామాన్ని సంకల్ప స్పర్శ ఉండని మనోముద్రను వహించి నిన్ను నశింపచేస్తాను అని అంటాడు. అంతేగాక ఓ కామమా నీ దృష్టి నీది కాని నీ కన్ను పడిన వస్తువు సులభమూ కాదో నీవు పట్టించుకోవు. అమాంతంగా దానిని ఆక్రమించి స్వాధీన పరచుకోవాలని చూస్తావు. ఆ విధంగా నరుడిని కష్టాలపాలు చేస్తావు. అగాధమైన పాతాళ లోకం వలె నీవు ఎన్ని కబళించినా నిండవు. ఇంకా పూర్తి కావలసింది మిగిలే ఉంటుంది. కాబట్టి నీవు వెళ్ళే దారిలో వెళ్ళకుండా నీకు దూరంగా ఉండి నిన్ను రంగుతో ఏర్పడిన ఆకారాన్ని తొలగించినట్లు తొలగించి రూపుమాపుతాను అంటాడు. మంకె ఈ విధంగా మనసులో కామంతో పరిపరివిధాలైన ప్రశ్నల రూపంలో తనకు తాను సమాధాన పరచుకుని కాంక్ష పరిత్యాగి అవుతాడు. దాని వలన అతనికి కలిగిన లాభం కోపం నశించింది, ఇంద్రియ నిగ్రహం కలిగింది, ఓర్పు నెలకొన్నది. ప్రాణులయెడల కరుణ కలిగింది." ఇవి అతను పొందినటువంటి లాభాలు, దీని వలన తెలుసుకోవల్సింది కోరికలు కలగడం సహజమే కాని మన కోరిక విఫలమైనప్పుడు ఆత్మపరిశీలన చేసుకోవడం వలన ఏ కోరిక మన జీవితాన్ని సఫలీకృతం చేస్తుందో లోకోపకారానికి ఉపయోగపడుతుందో అటువంటి కోరికను ఏర్పరచుకోవాలని తెలుస్తుంది. కోరికలు విపరీతంగా పెరగడం వలన ధర్మాచరణ తప్పుతుంది, ధర్మం తప్పడం వలన తనకు అసాధ్యమైన కోరికను నెరవేర్చుకోవడానికి కోపం వహిస్తాడు. కోపం కలన బుద్ధిని నశింపచేసుకుంటాడు, దాని వలన బాహ్య శత్రువులను ఏర్పరుచుకుంటాడు.

" వ్యాస మహర్షి శాంతి పర్వం పంచమాశ్వాసంలో శుకునితో ఈ విధంగా అంటాడు. " కామమనే వృక్షం మోహమనే బీజం నుండి మొలుస్తుంది. ఏమరపాటు అనే నీటితో పెరుగుతుంది. అజ్ఞానమే దాని స్థిరమైన ఆధారపు వేళ్ళు. అసూయే దాని ఆకులు, అది చాలా చిత్రంగా ఉంటుంది. మానమనే కాండంతో దృఢపడి ఆ వృక్షం పైకి ఎదుగుతుంది.

కోరికలే కొమ్మలుగా, అనేక చింతలే రెమ్మలుగా పూర్వం చేసిన కర్మల బలమే చేవగా పెరిగిన ఆ చెట్టు ఆశలనే తీగలతో చుట్టుకుంటుంది, లోభులు ఆ చెట్టు పండ్లకాశించి ఎక్కి తుదకు పతనమైపోతారు, ఆత్మజ్ఞుడైన పండితుడు త్యాగమనే శక్తితో ఆ చెట్టును తెగనరికి దుఃఖాలకు దూరమవుతాడు. " కోరికల గురించి వ్యాస మహర్షి చెప్పిన ఈ మాటలు అందరూ ఆచరించదగినది.

కోరిక ధర్మబద్ధమైనప్పుడు అది లోక కళ్యాణానికి దారి తీస్తుంది. ఉదాహరణకు ఆంధ్ర మహాభారతంలో కౌరవులు రాజ్య కాంక్ష చేత అసూయ, ద్వేషాలు ఏర్పరుచుకుని ఎన్నో దుష్కార్యాలు చేసి చివరికి నశించిపోయారు. పాండవులు ధర్మ కాంక్ష చేత ఇంద్రియాలను జయించి విజయం పొందగలిగారు. ఇక్కడ పాండవుల విజయం లోక శ్రేయస్సుకు ఉపయోగపడింది.

అరిషడ్వర్గాలలో భాగమైన తమ తప్పును ఒప్పుకోకపోవడం అది అబద్ధమైనప్పటికి దానిని నిజం చేయాలనే తపన మనకు కద్రువ వినతుల కథలో కనబడుతుంది. విహారం కోసం సముద్రం దగ్గరకు వచ్చిన కద్రువ, వినతలు ఒక ఉచ్ఛైశ్రవం అనబడే గుర్రాన్ని చూస్తారు. కద్రువ వినతతో తెల్లనైన గుఱ్ఱంలో తోక భాగం మాత్రం నల్లగా ఉన్నది అంటుంది. వినత లేదు అక్కా గుఱ్ఱం తెల్లనిదై ప్రకాశిస్తుందని చెప్తుంది. కద్రువ తన మాటను ఎలాగైనా గెలిపించుకోవాలని తెల్లని దేహంలో నల్లని మచ్చ ఉంటే నీవు నాకు దాసివి కావాలని ఆ శరీరంలో మచ్చ లేకుంటే నేను నీకు దాసిని అవుతాను అని పందెం వేసుకుంటారు. వినత అలాగేనని ఇప్పుడే ఆ గుఱ్ఱం దగ్గరకు వెళ్ళి చూద్దాము అనగా కద్రువ సమయం మించిపోయింది రేపు ఉదయం చూద్దామని చెప్తుంది. కద్రువకు ఆ గుఱ్ఱం తెల్లని గుఱ్ఱమని తెలుసు ఎలాగైనా తన మాట నెగ్గించుకోవాలని తన పుత్రులు నాగులను పిలిచి గుఱ్ఱం తోకను నల్లగా చేయమంటుంది. ఇక్కడ మనం గమనించవలసింది అంతఃశత్రువులనేవి నిజాన్ని అబద్ధం చేయడానికి ఎంతటి పనికైనా సిద్ధపడుతాయి. కొన్ని నాగులు ఇది అధర్మమైన పని అని చెప్పినా కద్రువ వినక పోగా తన పిల్లల్ని తల్లికే ఎదురు చెబుతారా అంటూ శపిస్తుంది. పుత్రులనే శపించే స్థాయికి  ఆమె కోరిక వెళ్ళిపోయిందని తెలుస్తుంది. చివరకు మరి కొన్ని నాగులు అమ్మ శాపానికి భయపడి ఆమె చెప్పినట్టే చేశాయి, వినత కద్రువకు బానిస అయ్యింది. అధర్మం తాత్కాలికమైన ఆనందం ఇచ్చినప్పటికి ఎక్కువ రోజులు బ్రతకలేదు కనుక వినత గర్భమున గరుత్మంతుడు జనించి తల్లిని దాస్యవిముక్తిని చేస్తాడు.

ఆంధ్రమహాభారతం లో ధృతరాష్ట్రుని పుత్ర వాత్సల్యం కౌరవ నాశనానికి దారితీస్తుంది.  పాండవులు రాజ్యానికి వారసులు కాకూడదనే అసూయ, ద్వేషాలు. ఓర్వలేని తనంతో రగిలిపోతున్న దుర్యోధనుని ఆలోచనను ధృతరాష్ట్రుడు నివారించకపోగా సమర్థించడం  ఆది పర్వం షష్ఠాశ్వాసంలో కనబడుతుంది.

ధృతరాష్ట్రుడు దుర్యోధనునితో ఇలా అంటున్నాడు. భరత వంశ శ్రేష్ఠుడైన పాండురాజు శత్రు భయంకరుడై శత్రువులను అణచి , కప్పం గ్రహించి ధనరాసులు వెంటనే తెచ్చి ఇచ్చి నా చేత అనేక యజ్ఞాలు చేయించాడని అతని కంటే గుణాలలో అధికులై ప్రజల ప్రేమ కలిగి ప్రకాశిస్తున్న పాండవులను ఏ విధంగా తొలగించగలనని? ధృతరాష్ట్రుడు దుఃఖిస్తాడు.  అలాగే  మరోచోట దుర్యోధనుడు పాండవులను ఉపాయాలతో వారణావతం పంపుతాము మనకు రాజ్యాధికారం స్థిరపడిన తర్వాత
వాళ్ళు ఇక్కడకు వస్తారు. అని దుర్యోధనుడనగా అతనితో ధృతరాష్ట్రుడు ఇలా అన్నాడు.

"ఏ నెల్లప్రొద్దు నాయెడలోనఉదలతు నాయభిప్రాయంబ యిది దారుణంబు
గాన వాకునకుఉజుల్కన తీర నోపఉగడఉగి పాండవులనేకత యెట్టులనుప
గానగు? మఱి దీని గాంగేయ విదుర కలశజాశ్వత్థామ గౌతముల్ బుద్ధి
గా నొడంబడుదురే? కాదయ్య యనినఉగౌరవజ్యేష్ఠుండు ఘనుఉడిట్టులనియె"

ధృతరాష్ట్రుని మనసులో కూడా దుర్యోధనుని అభిప్రాయమే ఉన్నదట అది దారుణమైనది కావున బయట

ISBN No. 978-93-85132-95-7


చెప్తుంటా ఉన్నాడంటు, ధృతరాష్ట్రుని అంతర్యం ఎటువంటిదో ఈ పద్యం మొదటి పాదంలోనే వ్యక్తమవుతుంది. వాళ్ల ఒకరిగా ఏ విధంగా వంపడానికి వీలవుతుంది, దీనికి భీష్మ ద్రోణ, విదుర, అశ్వత్థామలు కృపులు మనస్ఫూర్తిగా అంగీకరిస్తారా సాధ్యం కాదని ధృతరాష్ట్రుడు దుర్యోధనునితో అంటాడు. అంటే ఇలాంటి ఒత్తిడిని తప్ప ఆలోచన పెద్దలు కూడా మెచ్చరని భావం. అది తప్పని తెలిసినా దుర్యోధనుని మాటలపైపే అతను వేసే ప్రణాళిక పైపే మొగ్గుచూపుతాడు ధృతరాష్ట్రుడు చేసిన భావన చాలా ప్రమాదకరమైనది. మనసులో ఉన్న భావాన్ని మంచిదైనా చెడ్డదైనా బయటకు వ్యక్త పరచడం కొంత మేలును కలిగిస్తుంది. బయటకు ప్రేమ నటిస్తూ మనసులో ద్వేషం పెంచుకోవడం అనేది భయంకరమై అవమానాలను, ప్రమాదాలను తెచ్చిపెడుతుంది.

మనం అరిషడ్వర్గము అని పిలిచే కామ, క్రోధ, లోభ, మోహ , మద , మాత్సర్యాలు అనునవే ఈ అంతశ్శత్రువుల ఇవే మాయ యొక్క ఆరుగురు సేనాపతులు. ఇవి మానవుల మనస్సులలో భయోత్పాతాలను వాటి వారిని తమ దారిలో తెచ్చుకుని వారిని తమ అదుపాజ్ఞలలో ఉండేలా చేస్తాయి.”

మహాభారతంలో అంతఃశత్రువులకు లోనైన వారూ కనబడుతారు, జితేంద్రియులు కనబడుతారు, ఏది ఏమైనా అధ్యాత్మిక సాధనతో అంతఃశత్రువులను జయించే మార్గాన్ని కనిపెట్టి జీవితాన్ని సార్థకం చేసుకోవాలి.

ఉపయుక్త గ్రంథాలు:

1. పద్మాకర్, వద్దిపర్తి, 'మానవ కథ,(ద్వి.ము), ప్రణవపీఠం, ఏలూరు, సెప్టెంబర్ ,2020.
2. వెంకటేశ్వర రావు, దార్ల. సాహితీ మూర్తులు %--% స్ఫూర్తులు ( సాహిత్య వ్యాసాలు), సొసైటీ అండ్ ఎడ్యుకే... ట్రస్ట్, హైదరాబాద్.
3. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతం, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి, 2008.

భావవీణ ప్రత్యేక సంచిక

టి.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
కందుకూరు ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు జిల్లా

&

కె.ఆర్.కె. ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
అద్దంకి, బాపట్ల జిల్లా

అంతర్జాతీయ సదస్సు

# తెలుగు సాహిత్యం - విభిన్న ప్రక్రియలు, ధోరణులు

తేదీలు 24, 25 ఆగష్టు 2022

International Journal of Telugu Literary, Culture and Language Studies

Vol. 19-Issue-08 SPL.Edition-Monthly-August, 2022-ISSN No.2456-4702

UGC Care Journal

నిర్వహణ :

ఇరు కళాశాలల తెలుగు శాఖలు




మాతెలుగు తల్లికి మల్లెపూదండ – మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావవీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య - సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishna Rao
E-mail : parisodhanatelugu@gmail.com

Ph : 7989781963, 9490847482
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

**Vol. 19, Issue. 8, August 2022 (Spl. Issue) ISSN No.2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**



**EDITORIAL BOARD**

*Chief Editor*

**Dr. PITTA SANTHI**

***M.A.(Tel), M.Sc(Psy)., M.Ed.,M.PMl(Edu), Ph.D.,***

**C/o. Dr. Busi Venkataswainy**

Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 798978 1 963.

**ADVISORY COMMITTEE**

1. **Prof. G Yohan Babu,** MA., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi, M.A., PhD.**
   Dept. of Telugu,
   Sri Padmavathi Mahila University,Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy, M.A., PhD.**
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi** Venkataswainy, M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   Associate Professor, Dept. of Telugu &
   Chairman, BOS Philothrophy& Religion Studies,
   Andhra University, Visakhapatnam.
5. **Dr. Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) Ph.D
   Research Scientist, Centre for Applied Linguistics and Transaction Studies, Universityof Heidelberg, Germany.
6. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., Ph.D.
   HOD, Dept. of Telugu,
   Hyderabad Central University, Hyderabad, Telangana.
7. **Prof. T. Ramaprasad Reddy**
   Dean, Faculty of Arts & Education,
   Yogi Vemana University Kadapa, Andhra Pradesh.
8. **Dr. T. Swaruparani,** M.Sc., M.Ed., M.Phil., Ph.D.
   Principal,
   St Joseph's College of Education for Women,
   Sambasivapet, Guntur, Andhra Pradesh.

**ASSOCIATE EDITORS**

1. **Dr. N. R. SADASIVA REDDY,** M.A.,M.Phil,PhD.
   Associate Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO,** M.A.,M.A.,M.Phil,PhD.
   HOD, Dept. of Telugu, Madras University,
   CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU,** M.A., M.Phil, PhD.
   Associate Professor, Dept.of Hindi,
   Moulana Azad National Urdu University,
   HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD. HOD,
   Dept. of Telugu
   Telangana University, Dichpally,
   Nizamabad, Telangana.

# CONTENTS (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | "ఆధునిక తెలుగు కవిత్వ వికాసం - ధోరణులు" | రాధిక మంగిపూడి | 18 |
| 2. | "పౌరాణిక, చారిత్రక నాటకాలు - చలం విలక్షణ దృష్టికోణం" | డా॥ ఇరపని మాధవి | 21 |
| 3. | "తెలుగు సాహిత్యం - విభిన్న ప్రక్రియలు" | డా॥ రేవూరు అనంత పద్మనాభరావు | 31 |
| 4. | చిత్తూరు కథా సాహిత్యం | ఆచార్య ఎం.రామనాథం నాయుడు | 34 |
| 5. | మాండలిక కథా సాహిత్యం | డా॥ కొమ్మనబోయిన సుజాత | 39 |
| 6. | రంగనాయకమ్మ నవలల్లో స్త్రీ పాత్రలు | డా॥ చిలకా అనిత | 43 |
| 7. | "సినిమాలు, సీరియళ్ళలో బాలల సమస్యల చిత్రణ" | షేక్ షానాజ్ బేగం | 50 |
| 8. | స్త్రీవాదం | డా॥ గుంటుపల్లి గౌరి | 56 |
| 9. | ఆముక్తమాల్యద-వర్ణనా వైశిష్ట్యం | డా. నల్లపనేని విజయలక్ష్మి | 61 |
| 10. | ఆనందమే అందం - హాస్యం | పరుచూరి విజయలక్ష్మి | 66 |
| 11. | అన్నమాచార్య సంకీర్తనల్లో మానవహక్కుల పరిశీలన | డా॥ డి. ధాత్రికుమారి | 70 |
| 12. | అస్తిత్వవాద నవలలు - అధీరనాయకులు | డా.టి. జాన్‌కిరణ్‌బాబు | 75 |
| 13. | శ్రీ గుర్రం జాషువా ఖండకావ్యాలు - భారతీయత | డా॥ పైడిపాటి ఉమానాథ శర్మ | 80 |
| 14. | ఆధునిక కవిత్వం - వివిధ ఉద్యమాలు | డా. బి. సరస్వతి | 86 |
| 15. | అజంతా 'స్వప్నలిపి' - సహస్రముఖీనత | డా॥ పి. విజయకుమార్ | 90 |
| 16. | దళితవాద సాహిత్యధోరణులు-పరిశీలన | డా॥ టి. వెంకటస్వామి | 98 |
| 17. | ధిక్కార స్వరం 'దిగంబర కవిత్వం' | భమిడిపాటి గౌరీ శంకర్ | 104 |
| 18. | తెలుగు సాహిత్య ప్రస్థానం నన్నయ నుండి నేటివరకు | డా॥ కపిల భారతి | 108 |
| 19. | ఇతి బాధల్లో కలసి నడిచే స్నేహం | డా. మెండా దేవానంద్ కుమార్ | 110 |
| 20. | రాట్నవి బ్రహ్మపత్రము - విభిన్నధోరణి | డా॥ సి. నర్సింహులు | 114 |
| 21. | సీమ కథలు - విద్యావిధానం | కె. గీత | 118 |
| 22. | ప్రాచీన సాహిత్యం చదవాలా? ఎందుకు? | డా॥ పి.ఎ. సత్యనారాయణ | 123 |
| 23. | 'వందేళ్ల కథకు వందనాలు' కథలు - శిల్ప వైవిధ్యం | మళ్ళా పెంచల ప్రసాద్ | 126 |
| 24. | దక్షిణాంధ్ర యుగంలోని వర్ణ వ్యవస్థ | వై. శివకుమార్ | 131 |
| 25. | శ్రీకాళహస్తి మాహాత్మ్యం - పాత్రల వైశిష్ట్యం | డా॥ఎం.లక్ష్మయ్య | 134 |
| 26. | ధూర్జటి మాధురీ మహిమ - శ్రీకాళహస్తీశ్వర శతకం | డా॥ అడపా కేదారి | 138 |
| 27. | తెలుగువీరుల శౌర్యపరాక్రమాలకు ప్రతీక 'ఓరుగల్లు-వీరగల్లు' | తంగి ఓగేశ్వరరావు | 143 |
| 28. | "బోయి భీమన్న రాభీలు - పరిశీలన" | రుద్రపాక జితేంద్రకుమార్ | 150 |
| 29. | తెరచాటు - సాంఘిక నాటకం | డా. జూరెడ్డి నిర్మల | 153 |
| 30. | సమసమాజ స్థాపనకు ఆలంబన అభ్యుదయ కవిత్వం | దేవరపల్లి రామయ్య | 157 |

| | | |
|---|---|---|
| 31. దళిత సాహిత్య - నేపథ్యం - ఆవిర్భావ వికాశాలు - ప్రసార సాధనాల పాత్ర | డా॥ యస్. శారద | 162 |
| 32. అస్త్ర విద్యలు నాడు - నేడు | డా॥సముద్రాల ప్రిస్కిల | 166 |
| 33. నన్నయ సూక్తులు | డా॥ దొప్పలపూడి సుజాత | 168 |
| 34. పోతన భాగవతం - వైశిష్ట్యం | డాక్టర్ బి.చక్రవర్తి | 170 |
| 35. పాతికేళ్ల తెలుగు కథ (1990-2014) - కుటుంబ జీవన చిత్రణ | తలారి హరిష్ కుమార్ | 174 |
| 36. శ్రీవేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనసంస్థ ప్రచురిత 'హితోపదేశ' గ్రంథ విశిష్టత | వడ్లమూడి యోగీశ్వరరావు | 177 |
| 37. జిల్లేళ్ళ బాలాజీ "నా బాల్యం కతలు" రూప వైవిధ్యం | డా॥ జంపాల అనూరాధ | 182 |
| 38. మనిషి కోసం వెతికే "తవ్వకం" | డా॥ సుంకర గోపాలయ్య | 187 |
| 39. నానీలు - చేనేత జీవన చిత్రణ | డా. రాపోలు శ్రీనివాస్ | 190 |
| 40. పేరెన్నిక గన్న పేరులేని పేరంటాలు నిగమశర్మ యక్క | డా॥ (శ్రీమతి) ఎ. ఈశ్వరమ్మ | 194 |
| 41. ముస్లిం మైనార్టీల కథలు సాంస్కృతిక అంశాల పరిశీలన | మహ్మద్ నౌరీన్ | 199 |
| 42. చారిత్రక నవల - 'కన్నగి'- ఇతివృత్త పరిశీలన | డా॥ కుమ్మెత లక్ష్మీనారాయణరెడ్డి | 204 |
| 43. రుబాయి ప్రక్రియ - ఒక పరిశీలన | గుత్తికొండ చంద్రకళ | 209 |
| 44. దళిత స్త్రీ వాద చైతన్యం | డాక్టర్ డి. కృపారావు | 213 |
| 45. రాయలసీమ కన్నీటి కావ్యం 'పెన్నేటిపాట' | డా. కటుకం శారద | 215 |
| 46. యుగాంతంలో స్నేహబంధం | ఎస్ రామస్వామి | 219 |
| 47. అత్యాధునిక ప్రక్రియలు - వీక్షణం | డా. పాండురంగం కాళియప్ప | 223 |
| 48. ఆదివారం ఆంధ్రప్రభ కథలు - ఇతివృత్త వైవిధ్యం | పి.దర్గాబాబు | 228 |
| 49. నాయుని కృష్ణమూర్తి కథలు - కుటుంబ సంబంధాలు | యం.దీనదయాళం | 231 |
| 50. దిగంబర కవిత్వంలో జ్వాలాముఖి - సూర్యస్నానం | డా॥ లోపింటి గిరీష్ కుమార్ | 235 |
| 51. 'కళాకేళి' సాహిత్య పత్రిక అవతరణ - వికాసం | డా॥ కిలారి గౌరినాయుడు | 238 |
| 52. ఆచార్య గుండెడప్పు కనకయ్య కథలు - దళిత నేపథ్యం | కోష్టు గోవిందరావు | 241 |
| 53. లఘు కవితా ప్రక్రియ - రెక్కలు | డా॥ కె.చెన్నకేశవ రెడ్డి | 245 |
| 54. పురాణ వాఙ్మయం - తెలుగు వారి జీవన పథం | డా॥ పి. మాధవి | 249 |
| 55. కలం వారధిపై కళాకారులు | డా ఎం.సమత, ఎం.టి.జ్యోత్స్న | 253 |
| 56. ఎన్ పూజిత నవలల్లో స్త్రీ చైతన్య పాత్రలు | పి.జ్యోతి | 258 |
| 57. నండూరి హృదయాంతరంగంలో "ఎంకి" సోయగం | డా॥ వి. శివనాగార్జున రెడ్డి | 263 |
| 58. రావిశాస్త్రి బుచ్చిదం కథ - మానవ జీవన చిత్రణ | డా॥ బత్తుల అశోక్ కుమార్ | 267 |
| 59. శ్రీముకుంద శతకము - భక్తితత్త్వం | గుడేలి రమేష్ | 272 |

| | | |
|---|---|---|
| 60. ఆధునిక తెలుగు సాహిత్యం – మానవతావాదం | డాక్టర్ ఎం.రవీంద్రబాబు | 276 |
| 61. రాయలనాటి ప్రబంధ కవులు – ప్రసిద్ధ కావ్యాలు | డా॥ చుక్కా యశోద | 280 |
| 62. మహాభారతంలో రాజనీతి | కె. సుజన | 284 |
| 63. నీతిశతకాల్లో మానవీయ విలువలు | డా॥ బి. సునీత | 287 |
| 64. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం – ముందడుగు, మా భూమి నాటకాల పాత్ర | డా॥ లావూరి విజయ | 291 |
| 65. తెలుగు సాహిత్యంలో – భావకవిత్వం విశిష్టత | సాకేటి సత్యనారాయణ | 295 |
| 66. పురాణ వాఙ్మయము – తెలుగు సాహిత్యము | డా॥ హరీష్ కుమార్ శ్రీధర | 298 |
| 67. ప్రయోగాత్మక నాటకం త్రిజాకీ యమదర్శనం | డాక్టర్ వై. శ్రీలత | 303 |
| 68. ముదిగంటి సుజాతారెడ్డి అలంకార విమర్శ ధోరణి–విశ్లేషణ | శ్రీపతి మారుతి | 306 |
| 69. భానుమతి నవలలో సంఘ సంస్కరణ భావాలు | అంకిరెడ్డి సునీల్ కుమార్ రెడ్డి | 312 |
| 70. తెలుగు నాటికలు – సమకాలీన స్త్రీల స్థితిగతులు | డా॥ వి.కె.టి. మహాలక్ష్మి | 318 |
| 71. స్వీయచరిత్ర – ఒక పరిశీలన | కె.విజయలక్ష్మి | 321 |
| 72. శ్రీశ్రీ మహా ప్రస్థానం – అభ్యుదయ దృక్పథం | డా॥ బూర్గుల స్వరూప | 324 |
| 73. ఆరుద్రగారి అద్వితీయ రచనలు – అభ్యుదయం | సాకే సాయిసుష్మా, సాహితి మోదుగుల | 326 |
| 74. తెలంగాణ గిరిజన కథ –సామాజిక విశ్లేషణ | బానోత్ స్వామి | 330 |
| 75. తెలుగులో శతక సాహిత్యము | డా॥ పాందుల సాయిలు | 336 |
| 76. బి.సి. అస్తిత్వవాద కవిత్వం – 'సమూహం' సంకలనం | డా॥ పెబ్బేటి మల్లికార్జున్ | 340 |
| 77. తెలుగు సాహిత్యంలో ద్విపద కావ్యాలు | వంగాల సంపత్ రెడ్డి | 344 |
| 78. భావకవిత్వం – ఎంకి పాటలు | డా॥ సూరపరాజు వసంత కుమారి | 347 |
| 79. ప్రొఫెసర్ తుమ్మపూడి భారతి గారు రాసిన 'ఫ్రీజర్ కథలు'లోని సామాజికత | సాహితి మోదుగుల | 350 |
| 80. తెలంగాణ వీరోచిత కథ 'గొల్లరామవ్వ' | వి. రాజేశ్వరి | 354 |
| 81. రాళ్ళపల్లివారి "తారాదేవి" ఖండకావ్యం– ఒక పరిశీలన | కె. సంగాలు | 359 |
| 82. తెలుగు సాహిత్య ప్రక్రియా పారిజాతం –దండకం | ఎమ్. ప్రదీప్ | 362 |
| 83. ఆధునిక వచన కవిత్వ ప్రకియ – నానీలు విశిష్టత | నిదానకవి. నీరజ | 366 |
| 84. కథాసాహితి కథల సంకలనాలు – కులవివక్ష కథాంశాల పరిశీలన (2008 నుండి 2019 వరకు) | లెంక సత్యనారాయణ | 370 |
| 85. రావిశాస్త్రి కథలు – శిల్పం – భాష | డా॥ యస్.సి. సంజీవరెడ్డి | 376 |
| 86. స్త్రీవాద కవిత్వం – పరిశీలన | నూనావతు పార్వతి | 379 |
| 87. తెలుగులో స్త్రీల కథా సాహిత్య ధోరణులు | డా॥ మురాడి శ్యామల | 383 |
| 88. ఆధునిక తెలుగు కథ (2001–2010) –మధ్యతరగతి కుటుంబాల దీనస్థితి | డా. కోలా శేఖర్ | 388 |

| | | | |
|---|---|---|---|
| 89. | తెలుగు కవయిత్రుల కవిత్వం ఆనాటి స్త్రీల సామాజిక స్థితిగతుల చిత్రణ | డా॥ ఎన్. సూర్యకాంతి | 393 |
| 90. | వేయి పడగలు నవల – సామాజిక దృక్పథం | తురంగి విశ్వనాథము | 398 |
| 91. | భావకవి కృష్ణశాస్త్రీ కవిత్వం | వై. విజయలలిత | 403 |
| 92. | యిక్కుర్తి నరసింహారావు – "చైతన్య స్వరాలు" చదువు ప్రాధాన్యత గేయాలు | డా॥ జి.శ్రీనివాస్ | 406 |
| 93. | శ్రీ ముప్పాళ్ళ రంగనాయకమ్మగారి బలిపీఠం నవల – సామాజిక చిత్రణ | యం. భీమయ్య | 409 |
| 94. | కవితా ప్రక్రియలో 'సినీవాలి' నివాళులు | డా. యస్. బేబీ రమణి | 413 |
| 95. | ఆర్థిక దుస్థితి వికృత రూపం – ఆశాకిరణం | శ్రీకాంత్ నామ | 416 |
| 96. | అలిసెట్టి ప్రభాకర్ వచనకవిత్వం | పిన్నోజి నరేశ్ | 419 |
| 97. | అమెరికా తెలుగు కథలు – స్త్రీ – పురుష సంబంధాలు | డా. పలివెల చిరంజీవిరావు | 421 |
| 98. | కర్నూలు జిల్లా రైతు కథలు – కరువుచిత్రణ | పూలరాతి నరసప్ప | 426 |
| 99. | ఒంటెద్దు రామలింగారెడ్డి గారి ఆధుని భారతం 'అవినీతి పర్వం' – సింహావలోకనం | యస్. విద్యాసాగర్ | 431 |
| 100. | బెజ్జంకి శ్రీ లక్ష్మీ నరసింహ శతకం– సమీక్ష | గూడూరి శైలజ | 435 |
| 101. | వర్ణవ్యవస్థను నిరసించిన 'దళిత సాహిత్యం' | డా॥ దార్లపూడి శివరామకృష్ణ | 439 |
| 102. | దళిత వాదం – కవిత్వం | డా॥ బి. వెంకటయ్య | 443 |
| 103. | తెలంగాన ఉద్యమంలో పాట – భాషా సాహిత్యాంశాలు | డా॥ ఎన్. దీపిక | 447 |
| 104. | "పునశ్చరణం" – కవితా సంపుటిలో సమకాలీన సాహిత్యం | డా॥ జె.వి. సుధీర్ కుమార్ | 451 |
| 105. | "మెదక్ జిల్లా కథా సాహిత్యం : వస్తు విశ్లేషణ" | జి. దుర్గాప్రసాద్ | 454 |
| 106. | కాశీఖండాంతర్గత గుణనిధి పాత్ర ఔపదేశిక ప్రతిపత్తి | గోమారపు కవిత | 457 |
| 107. | గురజాడ కవిత్వం – సార్వజనీనత, సార్వకాలీనత | డా॥ కొయ్యా శ్రీనివాసులు | 460 |
| 108. | భారతీయ సంస్కృతి–విశిష్టత | కె.యన్.సుందరేశ్వరరావు | 464 |
| 109. | తెలుగు సాహిత్యంలో వైష్ణవ భక్తి ఉద్యమం | డా॥ కె. సుధాకర్ | 468 |
| 110. | ఒంద్రుమట్టి నవల – సామాజిక పరిశీలన | ఇనమల కళ్యాణి | 471 |
| 111. | తెలుగు సాహిత్యం – విభిన్న ప్రక్రియలు – ధోరణులు సమకాలీన తెలుగు నవలలలో సంఘం – సామాజిక దృక్పథం | డా॥ హెచ్. కిషన్ | 476 |
| 112. | వేమన పద్యాలలో మూర్ఖత్వ ఖండన | డా॥ ఇ. కోన ప్రభ | 485 |
| 113. | కోడూరి కౌసల్యాదేవి నవలలు–ఒక పరిశీలన | డా॥ దండెబోయిన పార్వతీదేవి | 488 |
| 114. | "నేటి సాంఘిక జనజీవనంపై ఇతిహాసాల ప్రభావం" | మాల్యాద్రి మార్తాటి & ఎం. సుధామయి | 493 |
| 115. | బోయి భీమన్న రచనలు పరిశీలన | ఎల్లోజ మమత | 495 |

| | | |
|---|---|---|
| 116. మన నిత్యజీవితంలో వేమన పద్యాల ప్రాధాన్యం | కే.హరీష్ కుమార్ | 497 |
| 117. సాక్షి 'ఫన్‌డే' కథల్లోని – మానవ సంబంధాలు | పరుసు మణి | 501 |
| 118. నా వచన కవిత రూపాలలో – సమాజహితం | కవాడపు లలిత | 505 |
| 119. ప్రసన్నధర్మం సావిత్రోపాఖ్యానం తులనాత్మక పరిశీలన | పిండి నాగరాజు | 509 |
| 120. "పరదేశి రూతు హరికథలో స్త్రీ పాత్ర చిత్రణ" | పెరుమాళ్ళ దైవకృప | 512 |
| 121. తెలుగు కవిత్వంలో – మానవతావాదం | డా॥ పొందరి లక్ష్మణరావు | 515 |
| 122. తెలుగు సాహిత్యంలో అధివాస్తవికత ధోరణి – ఒక పరిశీలన | ఆర్. రమాదేవి | 519 |
| 123. ఆధునిక కాలంలో ఇతిహాస సంబంధ రచనలు – భిన్న దృక్పథాలు | సంపత్ కుమార్ బానోజి | 522 |
| 124. పల్లెనీ, ప్రకృతినీ సత్కరించిన కవి గోరటి వెంకన్న | డా॥ చింతల రాకేశ్ భవానీ | 528 |
| 125. శ్రీకాళహస్తీశ్వర శతకం | డా॥ ఏ.వెంకటప్రసాదు | 533 |
| 126. శ్రీనాథుని కవితా వైదుష్యము | కానాల రామచంద్రారెడ్డి | 536 |
| 127. శ్రీరామ్మూర్తిగారి కథలు– సామాజిక చిత్రణ | బలరామమహంతి శశికళ | 539 |
| 127. రావిశాస్త్రి కథలు – శిల్పం – అనుభూత ఐక్యత | డా॥ ఆర్.యన్. రవికుమార్ | 541 |
| 129. స్త్రీవాద సాహిత్యం – సామాజికాంశాలు | తేలు వెంకట కుమారి | 544 |
| 130. తెలుగు నాటకం – సామాజిక చైతన్యం | డాక్టర్ నేలటూరి అనిత మార్గరెట్ | 548 |
| 131. 'తెలుగు సాహితి ప్రక్రియలలో శతకాలు, ప్రాధాన్యత: ఒక అవలోకనం' | డా॥ డి.సహదేవుడు, డా॥ యం.హరిప్రసాద్ | 552 |
| 132. దేవరకొండ బాలగంగాధర తిలక్ 'అమృతం కురిసిన రాత్రి' కవితా సంపుటి: సామాజిక జీవన చిత్రణ | రామకృష్ణ ఇరుకుల్ల | 555 |
| 133. కూచిమంచి తిమ్మకవి శతకాలలో సమాజం–భాష–సంస్కృతి | తంత్రవహి శ్రీరామమూర్తి | 566 |
| 134. ఆధునికతకు అద్దం – గురజాడ కన్యాశుల్కం | డా॥ వొలుపు కనకరాజు | 572 |
| 135. కావ్యప్రక్రియలో గంగుల శాయిరెడ్డి "కాపు బిడ్డ" విశిష్టత | డా॥ మామిడాల రమేశ్ బాబు | 577 |
| 136. భావకవిత్వం – ఎంకి పాటలు | డా॥ సూరపరాజు వసంత కుమారి | 580 |
| 137. భాగవతం – అంబరీషుని వైష్ణవభక్తి | కె.మహేష్ | 584 |
| 138. తెలుగులో కరోనా వ్యాధిపై వచ్చిన సాహిత్యం – పరిశీలన | ముత్తినేని సంతోష్ కుమార్ | 588 |
| 139. History of Journals in Nellore and Bapatla during Colonial period In India; 1882-1947 | Dr. Seelam Srinivasa Rao | 591 |
| 140. Poet-Saint Fusion: Analysing the Works of the MedievalIndian Bhakti Poets | Dr. Ratnottama Das | 596 |

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 8, August 2022 (Spl. Issue)
ISSN No.2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
Under Arts and Humanities Category

# మహాభారతంలో రాజనీతి

**కె. సుజన,** (పి.హెచ్.డి తెలుగు), యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్.

సమాజం కాలక్రమేణ అనేక మార్పులతో క్రొత్తదనం సంతరించుకుంటుంది. ప్రజల్లోనూ ప్రజా పరిపాలకుల్లోనూ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. సమకాలీన పరిస్థితులుకు అనుగుణంగా మనం మన అభిప్రాయాలను, అలవాట్లనూ మార్చుకుంటున్నాము . ఎటువంటి మార్పులు వచ్చినప్పటికి ప్రజలను పరిపాలించడంలో రాజు అనుసరించడంలో మెలకువలను, రాజనీతి శాస్త్రాలలోని విషయాలను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని అమలు పరిస్తే ప్రజారంజకంగా పరిపాలన కొనసాగుతుంది. ఆ రాజనీతి విశేషాలు అతి ప్రాచీన గ్రంథమైన మహాభారతం నుండి కొన్ని విషయాలను తెలుసుకునే ప్రయత్నం చేద్దాం."మనకు లభించిన మహొన్నతమైన ఇతిహాస గ్రంథాలు రామాయణ, మహాభారతాలు. ఇందులో మహాభారతం ఒక ప్రపంచాన్ని తనలో ఇముడ్చుకుందా అనిపిస్తుంది. సృష్టి తత్త్వం పై తేలియాడుతున్న మానవ మనస్తత్వాలన్నిటినీ పద్దెనిమిది పర్వాల్లో సర్దుకునేటట్లు చేసాడా వ్యాసభగవానుడు అనిపిస్తుంది. సృష్టిలో ఉన్న మనస్తత్వాలన్నీ ఇందులో ఉన్నాయి ఆ మనస్తత్వాలన్నీ దేని కోసం వెతుక్కుంటున్నాయో దేని కోసం మథన పడుతున్నాయో ఎలాంటి స్థితిలో సుఖపడుతున్నాయో ఎలా ఉన్నప్పుడు దుఃఖాల పాలవుతున్నామో జరిగిన కథను జరిగినట్లు చెపుతూ దర్శింపచేస్తాడు వ్యాసుడు. అని మోపిదేవి కృష్ణ స్వామి, భారతం ధర్మాద్వైతం వ్యాస నిదర్శనం, తిక్కన సందర్శనం. లో తెలియజేస్తారు.

పై విషయాలను పరిశీలిస్తే మహాభారతం మానవుని ప్రతి కదలికను వారి ఆలోచనలను తనలో ఇనుమడింప చేసుకుంది. మన ప్రవర్తన సన్మార్గంలోకి తీసుకువెళ్ళి మన కర్తవ్యాన్ని గుర్తుచేస్తుంది. మహా భారతంలోని ప్రతి మాట హృదయాంతరాలలోకి ప్రవేశించి మన లక్ష్యాన్ని ఛేదించేట్లు ప్రోత్సాహాన్ని అందిస్తుంది. అనే విషయాలు స్పష్టమవుతున్నాయి.

**మహాభారతం రాజనీతి :**

మహాభారతంలోని రాజనీతిని చర్చించేముందు అసలు రాజు అనేవాడు ఎలా పుట్టాడు అనే విషయాన్ని కూడా చర్చించుకోవలసిన అవసరం ఉంది. ఈ విషయం గురించి మహాభారతం శాంతి పర్వంలోనే ధర్మరాజు భీష్ముడుని అడుగుతాడు. రాజు అనే శబ్దం ఎలా పుట్టింది? శూరులు వీరులు, ఆర్యులతో కూడిన భూమినంతటిని రాజు ఒక్కడూ ఎలా రక్షించగలుగుతున్నాడు? లోకులు అతని యెడల ప్రసన్నులై ఉండాలని ఎలా అనుకుంటాడు? వంటి అనేక ప్రశ్నలను అడుగుతాడు దానికి భీష్ముడు చెప్పనారంభించాడు. మొదట రాజ్యము లేదు, రాజు లేదు, దండం లేదు, దండించే వాడు లేదు ప్రజలందరూ ధర్మంతోనే ఒకరినొకరు రక్షించుకునే వారు. కొంతకాలానికి చాలా దుఃఖం పొందారు. వారికి మోహం ఆవేశించింది. మోహవశులైన ఆ మానవులలో సరైన జ్ఞానం పోయింది. దానితో వారిలో ధర్మం నశించింది. జ్ఞానం నశించి మోహ పరవశులయిన నరులు అందరూ లోభానికి వశులయ్యారు. దానితో మానవులు లభించని దానిని పొందడం కోసం ఎగబడ్డారు. దానితో ప్రజలు పొందరాని స్త్రీలను పొందడం, ఇది తప్పు ఇది ఒప్పు అని తెలియకపోవడం. ఇలా సమాజం అంతా అల్లకల్లోలం అయిపోయింది. అప్పుడు వేదం, ధర్మం నశించడంతో దేవతలంతా బ్రహ్మ దగ్గరకు వచ్చి శరణు వేడారు. అప్పుడు బ్రహ్మ తన బుద్ధి నుండి లక్ష అధ్యాయాల శాస్త్రం రచించాడు. ఇందులోనే సర్వరాజ్య పరిపాలనకు సంబంధించిన విషయాలన్ని ప్రస్తావించబడ్డాయి. ఇందులో కొన్నింటిని గమనిస్తే మంత్రుల రక్షణ, రాజదూత, రాజపుత్రుని లక్షణం గూఢచారుల విచారణకు

గూఢచారులను నియమించడం, చెప్పబడ్డాయి. సామ, భేద, దానం, దండం, ఉపేక్ష అనే అయిదు ఉపాయాలు సంపూర్ణంగా చెప్పబడ్డాయి. పౌరుల రక్షణ, రాష్ట్రం అభివృద్ధి పరచడం, ఒక్కొక్క మండలంలో 12 మంది రాజులను నిలపడం డెబ్బది రెండు చికిత్సా విధానాలు, దేశ, జాతి కులాల ధర్మాలు వర్ణించాడు. లక్ష అధ్యాయాల శాస్త్రాన్ని అందించినప్పటికి లోకహితం కోసం ధర్మ స్థాపన కోసం సరస్వతి దేవి ఈ నా బుద్ధిని ప్రభావితం చేసింది అని బ్రహ్మ చెప్తాడు. దండ నీతి ముల్లోకాలలోనూ వ్యాపించింది బ్రహ్మ నుండి శివుడు ప్రజల ఆయువు తగ్గిపోతుందని తెలుసుకుని శివుడు బ్రహ్మచేసిన శాస్త్రాన్ని సంగ్రహంగా వ్రాసాడు. దాని పేరు 'వైశాలాక్షం', దానిని ఇంద్రుడు గ్రహించాడు., పదివేల అధ్యాయాలున్న ఆ మహాశాస్త్రాన్ని ఇంద్రుడు ఐదు వేల అధ్యాయాలలో సంక్షేపించాడు దాని పేరు 'బహుదంతకం', తర్వాత బృహస్పతి ఆ శాస్త్రాన్ని మూడు వేల అధ్యాయాలతో సంక్షేపించాడు. దాని పేరు బార్హస్పత్యం'. తర్వాత శుక్రాచార్యుడు దానిని వేయి అధ్యాయాలతో సంగ్రహం చేసాడు. ఇలా రాజనీతి పుట్టుకువచ్చింది. విష్ణువు, ఇంద్రుడు, దేవతలు, మహర్షులు ప్రజాపాలకులు, బ్రాహ్మణులు అంతా వేనుని కుమారుడు పృథువుకు రాజ్యాభిషేకం చేసారు. ఇలా రాజు పుట్టుకు వచ్చాడు. నేడు భారతీయ ప్రజాస్వామ్యము రాజ్యమునకు ఆదర్శ ప్రాయులములగు అంశాలు భారతంలో అనేకం కలవు నామ రూపాలు మారినను దేశ కాలములు మారినను. ఆనాటి రాజనీతి విధానం ఈ నాటికి అనేక విధముల అనుసరింపబడుతూనే ఉంది. భారతం శాంతి పర్వంలో

యథా రాజన్ హస్తి పదే పదాని
సంతియంతే సర్వసత్వోద్భవాది
సర్వే ధర్మా రాజధర్మేషు యుక్తాః
సర్వేలోకాః రాజ ధర్మే ప్రవిష్టాః

"ఏనుగు యొక్క అడుగు నందు తక్కిన జంతువుల పాదములన్నియును ఇమిడిపోవునట్లు రాజధర్మమునందు సమస్త ధర్మములు ఒదిగి పోవుచున్నది.

ఈ విషయాలు కుటుంబం యొక్క యోగ క్షేమాలు ఇంటి యజమాని ఏ విధంగా చూసుకుంటాడో రాజ్యంలోని ప్రజల కదలికల్ని వాని అవసరాలను తీర్చకలిగేది రాజు ఒక్కడే.అందుకే " భారతం రాజనీతి విశేషాలు పుస్తకంలో సంధ్యావందనం గోదావరిబాయి గారు ఈ విధంగా అంటారు. "ఒక ప్రత్యేక కుటుంబ చరిత్రనాధారంగా గాని ఆ కాలం నందలి సమగ్ర జీవిత విధానమును చిత్రీకరించు చున్నది. ఈ ఇతిహాసము భారత వంశ మహారాజుల చరిత్ర ఇది. ధర్మాధర్మములకు, సత్యాసత్యముకు జరుగు సంఘర్షణయే ఈ ఇతి వృత్తం.

చేదు రుచి తెలిస్తేనే తీపు యొక్క మాధుర్యం అనుభవించగలం తియ్యదనం యొక్క గొప్పదనం తెలుస్తుంది. భారతంలో అధర్మం యొక్క పునాదుల్ని ధర్మం ఏ విధంగా పెకలించి తన స్థిరత్వాన్ని నిలుపుకుందో భారతంలో మనం గమనించవచ్చు.

సంధ్యావందనం గోదావరి బాయి భారతంలో రాజనీతి విశేషాలు లో " ఒక ఉన్నత జాతి ఆత్మాభిమానం గల జాతి వివిధ వ్యక్తిత్వములతో నిండిన జాతి, సజీవ చైతన్యము గల జాతి, ఆ జాతి జీవనము ఆ జాతి రాజకీయ చైతన్యము పలు పోకడలను ఈ భారతములో దర్శింపవచ్చు".

ఈ విషయాలను గమనిస్తే వ్యక్తి గత చైతన్యంతో పాటు సమాజ చైతన్యాన్ని కలిగిస్తుంది భారతం. ప్రధానంగా రాజనీతి మన పరిపాలనా విధానంలోని లోటుపాట్లను పరోక్షంగా తెలియజేస్తూనే రాజు యొక్క సర్వలక్షణాలు నేటి పరిపాలకులు అనుసరిస్తే కలిగే ప్రయోజనాలు ఎలా ఉంటాయో కూడా భారతంలో మనం గమనించవచ్చు.

ధర్మారాజుకు భీష్ముడు చెప్తున్నాడు. ఎవరయినా రాజు యొక్క ధనం వృద్ధి చేస్తే రాజు వానిని సదా రక్షించాలి. రాజు యొక్క ధనాన్ని మంత్రి అపహరిస్తూ ఉండడం సేవకుడూ, మరొకడో చూసి రాజుకు చెపితే అది రాజు రహస్యంగా వినాలి. వెంటనే అతనిని మంత్రినుండి రక్షించాలి. మంత్రి ఇంకా అపహరించే వాళ్ళూ కలిసి ఈ

చెప్పిన వానిని చంపేస్తారు, అలాగే కోశాధికారిని కూడా రక్షించాలి అతనిని రక్షించకపోతే రాజధనం అపహరించే వాళ్లంతా కలిసి కోశాధికారిని బాధిస్తారు. అని చెపుతూ దానికి ఉదాహరణగా కాలకవృక్షీయము అనే కథను చెప్తారు, కాలకవృక్షీయుడు అనే ముని కోసల రాజుతో చెప్పిన కథను తెలియజేస్తాడు. ఆ కథలో కోసల రాజ్యం క్షేమదర్శికి సంక్రమించింది. అప్పుడు క్షేమదర్శి దగ్గరకు కాలకవృక్షీయ ముని వచ్చాడు. అతడు ఒక కాకిని పంజరంలో బంధించి ఒక పని కోసం క్షేమ దర్శియొక్క రాజ్యంలో మాటిమాటికి తిరుగుతున్నాడు. అయ్యా ఈ కాకి విద్యను నేర్చుకోండి నా కాకులు భూత భవిష్యత్ వర్తమానాలు చెపుతాయి. ఇలా చెపుతూ చాలామందితో కలిసి రాష్ట్రం అంతా తిరుగుతూ రాజుద్యోగుల చెడ్డపనులన్నీ ఆ ముని చూస్తాడు. కోసల రాజును చేరి అలంకారాలు ధరించిన మంత్రి ఎదుట కాకి మాటగా నీవు రాజు కోశాగారం దొంగిలించావు వీడు ఎరుగును వీడు ఎరుగును అని కాకి చెప్తుంది. రాజధనం అపహరణ కు గురైన విషయం నిజమని తెలిసి రాజోద్యోగులు తిరస్కరించబడుతారు. వారంతా చీకట్లో నిద్రిస్తున్న అతని కాకిని పంజరంలోనే బాణాలతో పొడిచి చంపుతారు. అది చూసి బ్రాహ్మణుడు రాజుకు కొన్ని రాజనీతి విషయాలు తెలియజేస్తాడు. హితులెవరో, శత్రువులెవరో తెలుసుకోండి నీ భవనంలో ఉండి నీ నుండి దొంగలించే వారిని గురించి అటువంటి వారిని ఉద్దేశించి చెపుతున్నాను. వారు ప్రజల ఐశ్వర్యాన్ని కోరరు. నీ వినాశం చేత నీ తరువాతి రాజ్యం కోరే వాడుంటే నీ ఆంతరంగికుల వల్లనే ఆ వినాశం సిద్ధిస్తుంది. అంటూ చాలా విషయాలను తెలియజేస్తాడు. (సంస్కృత భారతం,శాంతి పర్వం,)

ఈ విషయాలన్నీ రాజు నిరంతరం మెలకువతో ఉంటూ తననూ తన ధనాగారాన్నీ పరిశీలన చూస్తూ ఉండాలి ఎంత నమ్మకస్తుడైనా సరే పూర్తిగా నమ్మకుండా తన బుద్ధి తో రాజ్యాన్ని పరిపాలించాలని, ప్రత్యక్షంగా , పరోక్షంగా రాజ్యంలోని రహస్యాలను తెలుసుకుంటూ రాజ్యాభివృద్ధికి తోడ్పడాలని అర్థమవుతుంది.

రాజనీతికి సంబంధించిన కథలు, రాజనీతి విషయాలు భారతంలో చాలా కనిపిస్తాయి. అనుశాసనిక పర్వంలో శివపార్వతుల సంవాదంలోనూ శివుడు పార్వతికి రాజధర్మాలను తెలియజేస్తాడు, అలాగే ధృతరాష్ట్రుడు అరణ్యాలకు వెళుతూ ధర్మరాజుకు రాజనీతి విషయాలను ఎలా పరిపాలించాలో కొన్ని సూచనలను, తెలియజేస్తాడు. రాజుకు పురోహితుడు కూడా ప్రధానమైన వాడు అని, ప్రజా పాలనకు బ్రాహ్మణుల సూచనలు కూడా విజయాన్ని అందిస్తాయని చెపుతూ ఉదాహరణగా ఐల కశ్యప సంవాదము, ముచకుందోపాఖ్యానము వంటి కథలు వివరిస్తాయి.

**ఆధార గ్రంథాలు:**

1. రామకృష్ణ మూర్తి, తిప్పాభట్ల, శ్రీనివాసులు, సూరం.(సంపాదకులు), శ్రీ మహాభారతం (సంస్కృతం), శాంతి పర్వము, ఆరవ భాగము, గీత ప్రెస్, గోరఖ్ పూర్, 2019.
2. కృష్ణస్వామి, మోపిదేవి, భారతం ధర్మాద్వైతం, వ్యాస నిదర్శనం, తిక్కన సందర్శనం, (సి.వ్యా) ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ ప్రచురణ (ప్ర.ము), 1981,
3. సంధ్యావందనం గోదావరి బాయి, భారతములో రాజనీతి విశేషాలు, తిరుమల తిరుపతి దేవస్థానం (ప్రచురణ).

AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies UGC-CARE listed Journal
ISSN: 2583-4797
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-4 | April 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2023/apr_2023/full_papers/april23_09.php

# 9. రాయబారాలు: సమకాలీనత



**కె. సుజన**
పరిశోధకురాలు, తెలుగుశాఖ
హైదరాబాద్ విశ్వవిద్యాలయం,
హైదరాబాద్, తెలంగాణ.
సెల్: +91 9381689235. Email: kamisettysujana@gmail.com

**వ్యాససంగ్రహం:**

అనాదికాలంనుండి దౌత్యవ్యవహారలకు రాజకీయంగా ఎంతో ప్రాధాన్యముంది. సామాజికమైన ఈ దూతకార్యనిర్వహణను కవులు తమ కావ్యాలలో లక్షణబద్ధం చేశారు. ఆదికావ్యమైన రామయణంలోనూ, భారతేతిహాసంలోను దూతక్రియాచాతురీ-మహిమను ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దారు. సంస్కృతకావ్య, నాటకాలలో కూడా ఈ దౌత్యప్రక్రియ విశిష్టస్థానాన్ని ఆక్రమించింది. మహాభారతాంతర్గత దూత్యసన్నివేశాలు ఆలంబనగా రాయబారుల ఆవశ్యకాన్ని, కవిత్రయం ఆయా ఘట్టాలను సమున్నతంగా నిర్వహించిన విధానాన్ని విపులీకరించడం, అంతర్జాతీయన్యాయవ్యవస్థ రూపొందించిన రాయబారి మార్గదర్శకాలు – ప్రాచీన-సాహిత్యంలోని దౌత్యసంబంధాల మధ్య భేదసారూప్యాలను చర్చిస్తూ, రాయబారాల సమకాలీనతను దర్శించడం ఈ వ్యాసం ప్రధానోద్దేశం.

**Keywords:** ప్రాచీనసాహిత్యం, రాయబారాలు, అంతర్జాతీయన్యాయస్థానం, లక్షణాలు, సుజన.

## ఉపోద్ఘాతం:

రాయబారం అంటేనే ఒకరి అభిప్రాయాలు మరొకరికి చేరవేయడానికి అవతలి వారి అభిప్రాయాలను తెలుసుకుని ఎవరైతే రాయబారానికి పంపారో వారికి సమాచారం అందించడానికి ఉపయోగపడేది. అతిపురాతనకాలంలో ఆధునిక సాంకేతికత లేకపోవడం వలన వ్యక్తులునే ప్రధానంగా రాయబారానికి వినియోగించేవారు ,రాయబారానికి వెళ్ళే వ్యక్తి ధైర్యంతో ఉండాలని, సమయస్ఫూర్తితో వ్యవహరించాలని ఇలా రాయబారికి కొన్ని లక్షణాలను ఆపాదించారు. ఈ రాయబారం లక్షణాలను గురించి, ఆంధ్రమహాభారతంలోని రాయబారాల గురించి చర్చిస్తూ నేటి కాలంలో రాయబారం ఎటువంటి రూపురేఖలను మార్చుకుందో తెలియజేయడమే ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

AUCHITHYAM
ISSN: 2583-4797
International Research Journal for Telugu Language & Literary Studies UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-4 | April 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2023/apr_2023/full_papers/april23_09.php

### ప్రధానవిషయం:

"ఇద్దరు వ్యక్తుల మధ్యకానీ, రెండు పక్షాల మధ్య కానీ స్పర్థలు, అపోహలు, జగడాలు ఉన్నప్పుడు వారిద్దరి మధ్య సయోధ్య ఏర్పరచడానికి మధ్యవర్తులు అవసరం ఉంటుంది. మనస్పర్థలు పోగొట్టడానికీ లేదా రాజులకూ, రాజ్యాలకూ మధ్య యుద్ధం నివారించడానికో సహాయ సహకారాలు అందించుకోవడానికీ ఈ మధ్యవర్తిత్వం అవసరం. దీనినే రాయబారం అంటారు." (కృపాకరరెడ్డి, ప్రాచీనకావ్యాల్లో సందేశాలు- రాయబారాలు, (సి.వ్యా), పుట:62).

ఈ అభిప్రాయాలను గమనిస్తే రెండు రాజ్యాల మధ్యగాని లేక వ్యక్తుల మధ్యకాని ఒక ఒప్పందం జరగడానికి సమస్య పరిష్కారానికి లేదా అభిప్రాయ భేదాలు రాకుండా చూడడానికి ఈ రాయబారం ఉపయోగపడుతుందని తెలుస్తుంది. ఈ అభిప్రాయాలను జోడిస్తూ రాయబారికి ఉండవలసిన మరొక ప్రధాన లక్షణం జ్ఞాపకశక్తి ఆ రోజుల్లో వ్యక్తులే రాయబారానికి ప్రధాన అనుసంధాన కర్త కాబట్టి వ్యక్తుల మధ్య జరిగే చర్చలను వారు చెప్పింది చెప్పినట్లుగా ఉంటేనే అవతలి వారి అభిప్రాయాలు తెలుస్తాయి. స్వంతనిర్ణయాలు తీసుకుని రాయబారం జరిపినప్పటికి విషయాన్ని వివరించడంలోనూ, సమాచారాన్ని అందుకోవడంలోనూ లోపం రాకూడదు అంటే జ్ఞాపకశక్తి అవసరమని నా అభిప్రాయం నేటి కాలంలో అయితే ఆధునిక సాంకేతికతతో అనేక మాధ్యమాలు పుట్టుకు వచ్చాయి రికార్డింగ్ ద్వారా అందరి అభిప్రాయాలను బంధించి సమాచారాన్ని సేకరించవచ్చు లేద మరొకరికి అందించవచ్చు. కాని ఆనాటి కాలంలో రాయబారం చాలా ప్రధానమైనదిగా భావించవచ్చు.

### అర్థశాస్త్రం- రాయబారలక్షణాలు:

కౌటిల్యుని అర్థశాస్త్రంలో రాయబారలక్షణాలు ఈ విధంగా తెలియజేయబడ్డాయి.

**శ్లో|| ప్రేషణం సంధిపాలత్వం ప్రతాపో మిత్ర సంగ్రహః**

**ఉపజాపః సుహృద్భేదో దణ్డ గూఢాతిసారణమ్,**

**బన్ధురత్నాపహరణం చారజ్ఞానం పరాక్రమః**

**సమాధిమోక్షో దూతస్య కర్మయోగస్యచాశ్రయః**

పై శ్లోకంలోని అర్థాన్ని పరిశీలిస్తే వార్తలు పంపడం, ఇతర రాజులలో తన స్వామి చేసుకున్న సంధులను గట్టిచేయడం, తన స్వామి గొప్పతనాన్ని చాటడం, మిత్రుల్ని సంపాదించడం, కృత్యాదుల్ని రెచ్చగొట్టడం, శత్రువుల స్నేహితులలో భేదం కలిగించడం (వాళ్ళని విడదీయడం), సైన్యాన్ని, గూఢ పురుషుల్ని, శత్రు రాజ్యంలోకి ప్రవేశ పెట్టడం, శత్రువుల బంధువులను రత్నాలను(ధనాన్ని)

AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies UGC-CARE listed Journal
ISSN: 2583-4797
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-4 | April 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2023/apr_2023/full_papers/april23_09.php

అపహరించడం, రహస్య సమాచారాలు తెలుసుకోవడం, పరాక్రమం చూపడం, సమాధిని విడిపించడం, రహస్యమైన ఉపాయాలు పన్నడం, ఇవి దూతలు చేయవలసిన పనులు. (పుల్లెల శ్రీ రామచంద్రుడు (వ్యాఖ్యాత), కౌటిలీయమ్ అర్థశాస్త్రమ్, పుట:68).

పై విషయాలను పరిశీలిస్తే రాయబారిగా నియమితుడైన వాడు తాను చేయవలసిన కర్తవ్యాన్ని నిర్వహిస్తూ శత్రురాజుల యందు సమయానుకూలంగా సంభాషిస్తూ వాక్చాతుర్యాన్ని ప్రదర్శిస్తూ రాయబార కార్యాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకురాగల సమర్థుడై ఉండాలని తెలుస్తుంది. అలాగే రాయబారానికి పంపే వ్యక్తి కూడా సమర్థవంతంగా కార్యాన్ని పూర్తి చేసుకురాగల వారినే ఎన్నుకోవాలని అర్థమవుతుంది.

సంస్కృతభారతంలో ఉత్తర, అభిమన్యుల వివాహం తర్వాత తర్వాతి కార్యాచరణను గురించి సభ తీర్చిన సమయంలో శ్రీ కృష్ణుడు పాండవుల పరాక్రమాన్ని గురించి తెలుపుతూ ప్రస్తుతం రాయబారిని పంపాలి దుర్యోధనుని ఆలోచన ఎలా ఉందో తెలుసుకోవాలి అని చెప్తూ రాయబారి అనేవాడు ఎలా ఉండాలో కూడా చెప్తాడు.

**"తస్మాదితో గచ్ఛతు ధర్మశీలః**

**శుచిః కులీనః పురుషో2ప్రమత్తః"**

ధర్మశీలుడు, పవిత్రాత్ముడు, కులీనుడు, సావధానుడు, అయిన ఒక వ్యక్తి దూతగా అక్కడకు వెళ్ళాలి. అని చెప్తాడు. కృష్ణుడు చెప్పిన ఈ రాయబారాలను గమనిస్తే కౌరవుల దగ్గరకు వెళ్ళే దూత ధర్మశీలుడై ఉండాలి.

### 1. ధర్మశీలుడు:

సాధారణంగా బ్రాహ్మణుడు ధర్మాన్ని నిష్ఠతో అనుసరిస్తాడు అటువంటి వాడై ఉండాలి మరలా బ్రాహ్మణుడు అంటే వేదాలలోని లోతులను తెలిసినటువంటి వాడు. అనే అర్థంలో తీసుకోవాలి అటువంటి వాడు ధర్మాన్ని వ్రతంగా ఆచరించేవారు రాయబారిగా వెళ్లాలి అని అర్థం అవుతుంది. పాండవుల తరపున రాయబారి వెళ్లాలి కాబట్టి పాండవుల ధర్మాత్ములు అనే భావన దృష్టిలో పెట్టుకుని చెప్పగలగాలి అనే భావన ఇందులో కనబడుతుంది.

### 2. పవిత్రాత్ముడు:

అంటే మనసు కల్మషం లేకుండా తనను ఎవరైతే రాయబారానికి పంపించారో వారి పై భక్తితో , నమ్మకంతో వారి మాటలను శ్రద్ధతో చెప్పగలగాలి. అనే విషయం వ్యక్తమవుతుంది.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-4 | April 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2023/apr_2023/full_papers/april23_09.php

**౩. కులీనత:**

మంచి వంశమున లేదా కులమున పుట్టుట. మంచివంశము అంటే వంశపారం పర్యంతో వచ్చే రాజనీతిని తెలిసినవాడైతే రాయబారాన్ని సమర్ధంగా ఎదుర్కోగలడు అనే విషయం తెలుస్తుంది.

**౪. సావధానం:**

అంటే ఏకాగ్రత కలిగి ఉండాలి. చంచలమైన మనసుతో కాకుండా తాను చెప్పవలసిన విషయాలను జాగ్రత్తగా విని, ఆ విషయాలలోని అర్థం చెడకుండా ఏకాగ్రత బుద్ధిని కలిగి రాయబారి మాట్లాడాలి. మనసు ఏకాగ్రతతో విషయాన్ని ఆకళింపు చేసుకోగలిగితేనే రాయబారం విజయవంతమవుతుంది.

రాయబారి కౌరవుల ఆవేశాన్ని, అహంకారాన్ని శాంతింపచేసి ధర్మరాజుకు అర్థరాజ్యం ఇచ్చేటట్లు చేయగలవాడై ఉండాలి అని చెప్తాడు. కౌరవుల విషయం పక్కన పెడితే సాధారణంగా ఇందులోని అర్థం గ్రహిస్తే తన రాజు యొక్క గొప్పతనాన్ని, పరాక్రమతను దూత వర్ణించేటప్పుడు అవతలి వైపు రాజుకు అహంకారము, రావచ్చు లేదా కోపము రావచ్చు అలా వచ్చినప్పుడు వాటిని తన మాటలతో కార్యాన్ని సాధించుకురాగలిగిన సామర్థ్యం కలిగిన వాడు దూతగా వెళ్లాలి అనే భావం పై మాటల్లో వ్యక్తమవుతుంది.

**మహాభారతం - దూతకార్యాలు:**

పై లక్షణాలను ఆధారంగా చేసుకుని మహాభారతంలో అనేక రాయబారాలను మనం గమనించవచ్చు మహాభారతంలో పాండవుల అరణ్యవాసాలు పూర్తి అయిన తరువాత ఉపప్లావ్యంలో భవిష్యత్తు కార్యాచరణ చేయడానికి పాండవులు, శ్రీకృష్ణుడు, బలరాముడు మున్నగు ప్రముఖ రాజులంతా సమావేశమవుతారు. అక్కడ రాజ్యభాగం కోసం రాయబారానికి ఎవరిని పంపాలి , ఎటువంటి సందేశాన్ని కౌరవులకు పంపాలి ఎటువంటి వాక్చాతుర్యం కలిగిన వాడిని పంపాలి అనే దాని మీద చర్చలు కొనసాగే సమయంలో బలరాముడు తన అభిప్రాయాన్ని వెల్లడిస్తూ

**ఆ.వె. "మాట పొందెఱింగి, యోటమై నల్లన**
**చేరి కౌరవేంద్రు చిత్తవృత్తి**
**కనుగుణంబుగాఁగ నానతుం డగుచుఁ బ్రా**
**ర్థించి యడుగకున్నఁదెరగుపడదు"** **(కవిత్రయ మ.భా., ఉద్యోగ, ప్ర.ఆ., పుట. 09).**

AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies UGC-CARE listed Journal
ISSN: 2583-4797
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-4 | April 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2023/apr_2023/full_papers/april23_09.php

ఈ పద్యం యొక్క అర్థాన్ని చూస్తే మాటతీరు తెలిసి వినయంతో మెల్లగా చేరి దుర్యోధనుడి మనఃస్థితి కనుకూలంగా వినమ్రుడై వేడుకుని అడుగకపోతే వ్యవహారం చక్కబడదు. బలరాముడు చెప్పిన ఈ మాటల్లో రాయబారి లక్షణం కనబడుతుంది. మొత్తంగా బలరాముని అభిప్రాయం దుర్యోధనుని దగ్గరకు వెళ్ళేటటువంటి దూత వినయపరుడై రాయబార కార్యాన్ని సాధించుకురవాలని చెప్తాడు.

బలరాముని మాటను ఖండిస్తూ సాత్యకి ధర్మరాజాదుల ధర్మ గుణాన్ని, దుర్యోధనాదులు చేసిన దుశ్చర్యలను గుర్తుచేస్తూ యుద్ధం చేయడమే కర్తవ్యంగా చెపుతాడు ఒక వేళ దుర్యోధనుడి దగ్గరకు రాయబారిని పంపితే అతను ఎలా ఉండాలో సాత్యకి ఈ విధంగా చెప్తాడు.

**ఉ. "దైన్యము దక్కి దూత యుచితంబుగఁ బాండు నృపాలుపాలు రా**
**జన్య వరుండు ధర్మజుఁడు సమ్మతి వేఁడెడు నన్న, లోక సా**
**మాన్య విధిం దగంగ గరిమంబున నిచ్చెనఁ బుచ్చికొండ మ**
**న్యోన్యవిరుద్ధభాషణము లాడినఁదత్ఫల మాతఁడందెడున్"** (కవిత్రయ మ.భా., ఉద్యోగ, ప్ర.ఆ., పుట.14.)

ఈ పద్యభావాన్ని గమనించినట్లైతే ఏ మాత్రము దీనత్వం లేకుండా దూత సముచితంగా పాండ రాజ్యభాగం రాజోత్తముడైన ధర్మరాజు ఇష్టంతో వేడుకుంటున్నాడు అన్నప్పుడు లోకసాధారణమైన న్యాయం చొప్పున తగినట్లుగా సగౌరవంగా ఆ దుర్యోధనుడు ఇస్తే తీసుకుందాం. అట్లాకాక పరస్పర విరుద్ధంగా మాటలాడితే దాని ఫలం అతడు అనుభవిస్తాడు అని ఒక హెచ్చరిక రూపంలో తన అభిప్రాయాన్ని వెల్లడిస్తూ రాయబారి అనే వ్యక్తి మొదట సౌమ్యంగా మాట్లాడి దానికి తగిన సమాధానం అవతలి వారి దగ్గర నుండి రాకపోతే యుద్ధానికైనా సిద్ధపడేటట్లు రాయబార కార్యాన్ని జరుపుకుని రావాలి అనే భావం వ్యక్తమవుతుంది.

సాత్యకి అభిప్రాయాన్ని అంగీకరిస్తూ ద్రుపదుడు తన పురోహితునిని రాయబారిగా పంపడానికి నిశ్చయించి ద్రుపద పురోహితునికి కొన్ని మాటలను చెప్పి పంపే సందర్భంలోనూ రాయబారికి ఉండవలసిన లక్షణాలు కనబడుతాయి.

**కం. "హితుఁడవు, మతిమంతుండవు,**
**చతురవచనకోవిదుఁడవు, సమయజ్ఞుడ, వు**
**న్నతవంశవర్ధనుఁడ, విం**
**గితవేదివి, నెచ్చెలివి, సుకృతి వ ట్లగుటన్."** (కవిత్రయ మ.భా., ఉద్యోగ, ప్ర.ఆ., పుట. 21)

నీవు మాకు దగ్గరి వాడవు బుద్ధిమంతుడవు , నేర్పుగా ఎలా మాట్లాడాలో తెలిసిన పండితుడవు, సమయం తెలిసిన వాడవు ఉన్నత వంశాన్ని అభివృద్ధిపరిచేవాడవు, ఎదుటి వారి మనసులో ని అభిప్రాయాన్ని తెలుసుకునేవాడవు ప్రియమిత్రుడవు, పుణ్యాత్ముడవు.

AUCHITHYAM
ISSN: 2583-4797
International Research Journal for Telugu Language & Literary Studies UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-4 | April 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2023/apr_2023/full_papers/april23_09.php

ఇలా ద్రుపదుడు తన పురోహితునితో అన్న మాటలలో రాయబారిగా వెళ్ళవలసిన వ్యక్తి వాక్చాతుర్యంతో మాట్లాడాలని సమయానికి తగిన విధంగా మాట్లాడి కార్యం నెరవేర్చాలనే భావం వ్యక్తమవుతుంది.

అత్యంతప్రాచుర్యంలో ఉన్న రాయబారాలుగా మహాభారతంలో గమనిస్తే ద్రుపదపురోహితుని రాయబారం, సంజయరాయబారం, శ్రీకృష్ణరాయబారం, ఉలూకునిరాయబారం, ఇవే కాకుండా దేవదూత, కచునిరాయబారం, గౌరవముఖుని రాయబారం, నలరాయబారం... ఇలా అనేక రాయబారాలు భారతాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే గోచరిస్తాయి. నేటి కాలంలో రాయబారవ్యవస్థ ఏ విధంగా అభివృద్ధి జరిగిందో మనం గమనించదగిన ప్రధానఅంశం ఆ విషయాలను క్రింద చర్చిస్తున్నాను.

## రాయబారం - సమకాలీనత:

"ప్రాచీన సాహిత్యంలో రాయబారితో వ్యవహరించాల్సిన తీరుతో పాటు రాయబారికుండాల్సిన లక్షణాలు కూడా ప్రధానంగా కన్పిస్తున్నాయి. రాయబారి వ్యక్తిగత లక్షణాలకు కూడా ఎంతో ప్రాధాన్యం ఉండేది. ఆధునిక కాలంలో రాయబారి వ్యక్తిగత లక్షణాలకు ప్రత్యేక అస్తిత్వం లేదు. కేవలం వారి ప్రవర్తనా నియమావళి మాత్రమే ఉంది. 1815 లో దీనికి సంబంధించి ఒక సామూహిక వ్యవస్థను ప్రపంచం రూపొందించుకుంది. కానీ 1945 లో అన్ని దేశాలు, అన్నీ దేశాల్లో రాయబారుల్ని నియమించే ప్రయత్నం చేశారు. 1961 లో వియన్నా కన్వెన్షన్ ఇన్ డిప్లొమాటిక్ రిలేషన్స్ (Vienna Convention Diplomatic Relations) పేరుతో ఒక ప్రత్యేక నియమావళి ఏర్పడింది. అంతర్జాతీయ న్యాయవ్యవస్థ (International Law Commission) 18-4-1961) లో దీనికి ఒక నియమావళిని రూపొందించింది. ఇందులో 53 ఆర్టికల్స్ ను పొందుపరిచింది. Optional Protocal Concerning the compulsory settlement of disputes పేరుతో 10 ఆర్టికల్స్ రూపొందించింది. ఇవికాక Vienna Convention on Consular relations అనే పేరుతో 24/4/1963 న మరో 79 ఆర్టికల్స్ ను రూపొందించారు. (ఎస్. ఎల్. వి. ఉమా మహేశ్వర రావు, తిక్కన రాయబారాలు రాజనీతి – దౌత్య రీతి, పుట:03).

ఈ విషయాలన్ని రాయబారం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రపంచం గుర్తించి అన్ని దేశాలలోనూ రాయబారుల్ని నియమించే ప్రయత్నం చేశారని తెలుస్తుంది.

## అంతర్జాతీయన్యాయవ్యవస్థ రూపొందించిన రాయబారలక్షణాలు:

1. రాయబారి తన దేశానికి, ఆతిథ్య దేశానికి మధ్య స్నేహ వారిధిగా ఉండి ఇరుదేశాల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక సంబంధాల్ని పెంపొందింపజేయాలి.(ఆర్టికల్ 3).

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-4 | April 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2023/apr_2023/full_papers/april23_09.php

2. రాయబారిని దేశఅతిథిగా పరిగణించాలి.
3. రాయబారిని నిర్బంధించకూడదు (అరెస్ట్ చేయకూడదు). (ఆర్టికల్ 27 & ఆర్టికల్ 29).
4. రాయబారిని గానీ, అతని వస్తువుల్ని గానీ సోదా చెయ్యకూడదు (ఆర్టికల్ 27).
5. రాయబారి అనుమతి లేకుండా ఆతిథ్యదేశానికి సంబంధించిన అధికారులు వారి నివాసపరిసరాల్లోకి వెళ్ళకూడదు (ఆర్టికల్ 22).
6. రాయబారుల ఆస్తుల పరిరక్షణ బాధ్యత ఆతిథ్యదేశానిదే (ఆర్టికల్ 22).
7. రాయబారులు తమ దేశ పతాకాన్ని వారి కార్యాలయం వద్ద, నివాసం వద్ద వాహనంపైన పెట్టుకోవచ్చు (ఆర్టికల్ 20).
8. రాయబారికి పన్నులో మినహాయింపు ఉంటుంది. (ఆర్టికల్ 23,28, 34,36).
9. రాయబారి వ్యక్తిగత లాభాన్ని పొందే వృత్తి వాణిజ్య కార్యకలాపాల్లో పాలు పంచుకోకూడదు. (ఆర్టికల్ 42).
10. రాయబారులకు సమాచార వ్యవస్థను ఉచితంగా కల్పించాలి. (ఆర్టికల్ 27).
11. రాయబారులు తమ దేశంతో మాట్లాడే విషయాల్ని కాన్ఫిడెన్షియల్ గా పరిగణించాలి.
12. రాయబారులు తమ ఇంట్లో ఉంచుకునే వ్యక్తిగత సేవకుల్ని (ప్రైవేట్ సర్వెంట్స్) రాయబార ఉద్యోగిగా పరిగణించరు (ఎ 1).
13. రాయబారి ప్రవర్తన అభ్యంతరకరంగా, అనుమానాస్పదంగా ఉందని ఆతిథ్య దేశం భావిస్తే Persona Non – grata నియమం క్రింద, ఆదేశానికి సమాచారమిచ్చి రాయబారిని వెనక్కు పంపించవచ్చు. (ఆర్టికల్ – 9). (ఎస్. ఎల్. వి. ఉమా మహేశ్వర రావు, తిక్కన రాయబారాలు రాజనీతి- దౌత్య రీతి, పుట. 04)

ఈ లక్షణాలలో ఒకటి రెండింటిని మహాభారతం లో కి అన్వయించి పరిశీలన చేద్దాం. ఉదాహరణకు -

**రాయబారిని దేశ అతిథిగా పరిగణించాలి:**

నేటి అంతర్జాతీయ న్యాయవ్యవస్థ రూపొందించిన లక్షణాలలో ఒకటి. ఈ లక్షణాన్ని మహాభారతంలో పరిశీలిన చేస్తే రాయబారికి శ్రీ కృష్ణుడు వస్తున్న విషయం తెలుసుకున్న ధృతరాష్ట్రుడు శ్రీ కృష్ణుని మెప్పించడానికి అతిథి సత్కారాలు ఘనంగా చేయడానికి సిద్ధపడతాడు ఆ సమయంలో ధృతరాష్ట్రుడు దుర్యోధనునితో శ్రీ కృష్ణుడు సనాతన ధర్మ స్వరూపుడు, నరశ్రేష్ఠుడైన ఆయన పూజింపదగిన వాడు ఆయనను సత్కరించినచో మనకు సుఖం కలుగుతుంది, పూజింపకపోయినచో కష్టం కలుగుతుంది.

**"సచేత్తుష్యతి దాశార్హః ఉపచారైరరిందమః**

**కృష్ణాత్ సర్వానభిప్రాయాన్ ప్రాప్స్యామః సర్వరాజసు"**

AUCHITHYAM
ISSN: 2583-4797
International Research Journal for Telugu Language & Literary Studies UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-4 | April 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2023/apr_2023/full_papers/april23_09.php

(శ్రీ మహాభారతం, (సంస్కృతం), తిప్పాభట్ల రామకృష్ణ మూర్తి, సూత్రం శ్రీనివాసులు, (సంపాదకులు), ఉద్యోగపర్వం, ఎనభైఐదవ అధ్యాయం, పుట. 539).

శత్రుసంహర్త అయిన శ్రీ కృష్ణుడు మన సత్కారాలతో సంతోష పడితే ఆయిన ద్వారా సమస్త రాజుల విషయంలో మన కోరికలను సఫలం చేసుకోవచ్చు అని అనడంలో శ్రీ కృష్ణునికి ఆతిథ్యం ఇవ్వడం ద్వారా తమ కోరికలను నేరవేర్చుకునే రీతిలో ఆలిచించినట్లు తెలుస్తుంది దాని ప్రకారంగా దుర్యోధనుడు అందమైన సభామంటపాలను నిర్మింపచేసాడు. శిల్పులు సమస్త రత్న సంపన్నులయిన సభలను ఎన్నింటినో నిర్మించారు. ప్రత్యేకించి వృకస్థలంలో నివాసార్థం దుర్యోధనుడు అనేక రత్నాలతో కూడి మనోహరమైన విశ్రాంతి మంటపాన్ని నిర్మించాడు.

మానవులకు దుర్లభమై దేవతావాసయోగ్యంగా కనపడే ఈ వ్యవస్థను పూర్తిచేయించి దుర్యోధనుడు ధృతరాష్ట్రునకు తెలియజేసాడు అయితే శ్రీ కృష్ణుడు ఆ సభలను కాని అక్కడ కల్పించిన వివిధ రత్నాలను కాని కనీసం చూడనైనా చూడకుండా నివాసస్థానమైన హస్తిన వైపు ప్రయాణమయ్యాడు ఈ లోపల ధృతరాష్ట్రుడు విదురునితో శ్రీకృష్ణుడు వృకస్థలంలో ఉన్నాడు రేపు ఉదయం ఇక్కడకు వస్తాడు అతనికి అనేక కానుకలు ఇస్తానని శ్రీ కృష్ణ పరిచారకులందరికి కూడా ఎప్పటికప్పుడు అవసరమైన భోజనం కన్నా ఎనిమిది రెట్లు ఎక్కువ నేను సమకూర్చిపెడతాను అని చెప్పి దుర్యోధనుడు తప్ప మిగిలిన నా అందరి కుమారులు మనుమలు వస్త్రభూషణాదులను అలంకరించుకుని అందమైన రథాలతో శ్రీ కృష్ణుని స్వాగతించండని చెప్తాడు. (శ్రీ మహాభారతం, (సంస్కృతం) తిప్పాభట్ల రామకృష్ణ మూర్తి, సూత్రం శ్రీనివాసులు, (సంపాదకులు), ఉద్యోగ పర్వం, ఎనభైఐదవ అధ్యాయం, పుట. 540.)

రాయబారిగా వచ్చిన వ్యక్తికి ఈ రకమైన ఆతిథ్యంను మహాభారతంలో గమనించదగినది.

## రాయబారిని నిర్బంధించకూడదు (అరెస్ట్ చేయకూడదు):

శ్రీ కృష్ణుడికి ఆతిథ్యం ఇచ్చినప్పటికి రాజ్యాల మధ్య సఖ్యత ఏర్పరచడానికి రాయబారిగా వచ్చిన శ్రీ కృష్ణున్ని దుర్యోధనుడు నిర్బంధించడానికి ఏర్పాట్లు చేసుకుంటాడు ఈ విషయం సాత్యకి సభలో వ్యక్తపరుస్తాడు. విదురుడు దుర్యోధనునికి కృష్ణుని పరాక్రమాలను వివరిస్తాడు. శ్రీ కృష్ణుడు కూడా దుర్యోధనునితో నీ అహంకారంతో నన్ను ఒంటరివాడిని అనుకుని బంధించాలను-కుంటున్నావు అంటూ విశ్వరూపప్రదర్శన చేస్తాడు. (శ్రీ మహాభారతం, (సంస్కృతం,) తిప్పాభట్ల రామకృష్ణమూర్తి, సూరం శ్రీనివాసులు, (సంపాదకులు), ఉద్యోగ పర్వం, పుట. 649.)

నేటి కాలంలో అనేక విధాలుగా ప్రభుత్వం రక్షణ కల్పిస్తుంది కనుక రాయబారిని నిర్బంధించడం, చంపడం లాంటివి జరగేఅవకాశాలు తక్కువని అర్థమవుతుంది. ఆనాటి కాలంలో రాయబారికి భద్రత లేదు అవతలి వ్యక్తి రాయబారి తెలిపిన

AUCHITHYAM
ISSN: 2583-4797
International Research Journal for Telugu Language & Literary Studies UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-4 | April 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2023/apr_2023/full_papers/april23_09.php

అభిప్రాయాలు రాయబారివి కాకపోయినా ఆవేశానికి లోనయ్యి రాయబారిని బంధించేప్రయత్నం చేయడమో చంపడమో జరిగిన సందర్భాలు ఉన్నాయని తెలుస్తుంది. ఈ విషయాలను గమనిస్తే రాయబారి జాతీయ అంతర్జాతీయాల దేశాల మధ్య వారధిగా ఉండి దేశ ఉన్నతికి తోడ్పడుతున్నట్లు అర్థమవుతుంది. అంతే కాకుండా రాయబారికి ఉండవలసిన లక్షణాలను, వారి భద్రతకు, గౌరవానికి భంగం వాటిల్లకుండా కొన్ని నియమ నిబంధనలను ఏర్పరచి వారికి సంపూర్ణ రక్షక వ్యవస్థను ఏర్పాటు చేయడం ఈనాడు గమనించవలసిన ప్రధానమైన విషయం.

**ముగింపు:**

ఈ వ్యాసంలో ప్రధానంగా రాయబార లక్షణాలు ను తెలియజేస్తూ నేటి కాలంలో రాయబార వ్యవస్థ నూతన పరిణామలతో క్రొత్త నిబంధనలతో ఎటువంటి పురోగతిని సాధించిందో తెలియజేయబడింది. అంతేకాకుండా మహాభారతంలో ప్రధానంగా కౌరవుల దగ్గరకు రాయబారిగా వెళ్ళే వ్యక్తి ఎటువంటి గుణాలను కలిగిఉండాలో బలరాముని ద్వారా కొన్ని లక్షణాలు తెలియజేయబడుతాయి బలరాముని అభిప్రాయాలను ఖండిస్తూ సాత్యకి రాయబారిగా వెళ్ళే వ్యక్తి పాండవులకు జరిగిన అన్యాయాన్ని దృష్టిలో పెట్టుకుని సమయానుకూలంగా వ్యవహరించాలని చెప్తాడు. తరువాత ద్రుపదుడు తన పురోహితుని రాయబారికి పంపించేటప్పుడు అతనిని ప్రశించే సమయంలో రాయబార లక్షణాలు ప్రస్ఫుటమవుతాయి. ఈ లక్షణాలన్నింటిని క్లుప్తంగా ఈ వ్యాసంలో వివరించడం జరిగింది. అంతర్జాతీయ న్యాయ వ్యవస్థలో పొందుపరిచిన రాయబార లక్షణాలను మహాభారతంలో ఏ సన్నివేశాలకు అన్వయించవచ్చో ఒకటి రెండు ఉదాహరణలను ఈ వ్యాసంలో వివరించాను.

**ఉపయుక్తగ్రంథసూచి:**

1. కృపాకర రెడ్డి, ప్రాచీన కావ్యాల్లో సందేశాలు- రాయబారాలు, (సి.వ్యా), శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటి,1992.
2. శ్రీ రామచంద్రుడు, పుల్లెల.(వ్యాఖ్యాత), కౌటిలీయమ్ అర్థశాస్త్రమ్, (ద్వి.ము). శ్రీ గోపాల్ పబ్లికేషన్స్, హైదరాబాద్, 2004.
3. http://telugunighantuvu.com
4. రామకృష్ణ మూర్తి, తిప్పాభట్ల, సూరం శ్రీనివాసులు, సంస్కృత భారతం, (రెండవ ముద్రణ) గీతాప్రెస్, గోరఖ్ పూర్, 2019.
5. ఉమా మహేశ్వర రావు, ఎస్. ఎల్. వి, తిక్కన రాయబారాలు రాజనీతి- దౌత్యరీతి, చందన గ్రాఫిక్స్, నెల్లూరు, జూన్, 2014.
6. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతం, తి.తి.దే ప్రచురణలు. (ద్వి.ము.) తిరుపతి, 2008.

***

**గమనిక: ఈ పత్రికలోని వ్యాసాలలో అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి.**
**వాటికి సంపాదకులు గానీ, పబ్లిషర్స్ గానీ ఎలాంటి బాధ్యత వహించరు.**

## అనుబంధం -2

### ప్రముఖ ఆధ్యాత్మిక వేత్తలు , సాహిత్య వేత్తలతో ముఖాముఖి

### 1.బ్రహ్మశ్రీ వద్దిపర్తి, పద్మాకర్ –ముఖాముఖి (04-08-2021):

**(శ్రీ ప్రణవ పీఠాధిపతి, త్రిభాషామహా సహస్రావధాని, ప్రముఖ ఆధ్యాత్మిక గురువు)**

(మహాభారతం మీద పరిశోధన చేస్తున్నాను అనగానే చాలా సంతోషంతో ఆశీర్వదించారు. మహాభారతంలోని రాయబారాలు మీద రాజనీతి మీద ముఖాముఖిని అడిగిన వెంటనే అంగీకరించారు. అరగంట పైన వీరు నా పరిశోధనకు కావలసిన ముఖాముఖిని అందించారు.)

**1. శ్రీకృష్ణుడు మహాభారతానికి నాయకుడుగా, ప్రధాన సూత్రధారిగా పేర్కొనవచ్చా?**

జ. మహాభారతం బహునాయకత్వంతో కూడింది. దీనికి నాయకుడు నడిపించే దైవమే ఉంటాడు. సూత్రధారి అంతా కృష్ణుడే

మహాభారతం అద్భుతమైన ఘట్టం. ఈ మహాభారత యజ్ఞానికి అనలుడు, **అనలుడు భాస్కరుండును, సుధాంశుడు నధ్వర సంప్రర్తకుల్,**

**వినుము నరేంద్ర యీ క్రతువు విష్ణుమయంబిది నిర్వహించి ర**

**ర్జునుడును, గర్ణుడున్, సమర రూపమునం. దగ నీ ప్రబంధ మిం**

**పొనరఁబఠించినన్ వినిన నొందు నరుం జిరసౌఖ్య సంపదల్''**

భాస్కరుడు, సుధాంశుడు, (చంద్రుడు), వీరు ముగ్గురు మహాభారతం అనే యజ్ఞానికి వీరు సంప్రవర్తకులు. అంటే నడిపిన వారు. క్రతువు ఎవరిది. విష్ణుమయంబు మహాభారతం విష్ణుమయం. మహాభారతమే విష్ణువు, విష్ణువే మహాభారతం. విష్ణువుని నాయకుడు అని కూడా అనలేము, అసలు ఆయనే భారతం. భారతమే విష్ణువు కాబట్టి ఆయన దైవం. ధర్మరాజు నాయకుడుగా కనబడుతున్నాడు కాని ఆయనా నాయకుడు కాదు. ఈ క్రతువు అర్జునుడును, కర్ణుడును యుద్ధరూపమున నడిపారు. ఎంత టెక్నిక్ గా అంటే శిల్పంగా చెప్పారో మనం గమనించవచ్చు . అగ్ని లేకపోతే మహాభారతమే లేదు. అసలు మహాభారతం, ఆరంభమే జనమేజయ యజ్ఞం, యజ్ఞంతో మొదలై యజ్ఞంతో ముగిసే అపూర్వమైన ఘట్టం. కాబట్టి అగ్ని హోత్రుడు ప్రధాన పాత్రధారి తర్వాత రెండు భాస్కరుడు. సూర్యుని కొడుకు ఎవరు కర్ణుడు, సుధాంశుడు, మొత్తం పాండవులంతా చంద్రవంశం వాళ్ళే నేరుగా సూర్యపుత్రుడు కొడుకు అయిన కర్ణుడు ఈ పాండవ వంశాన్ని విడదీశాడు. ఒక్క సూర్య పుత్రుడు చంద్రవంశాన్ని విడదీసాడు. సూర్యుడు తలచుకుంటే ఏదైనా చేయగలడు. సూర్యుని యొక్క అంశతో జన్మించిన కర్ణుడు . అర్జునుడంటే చాలా

భయం  దుర్యోధనుడికి అందుకని దుర్యోధనుడి భయం తొలగించి తద్వారా మహాభారత యుద్ధం జరగడానికి పూర్తి కారకుడు కర్ణుడు అందుకని ఏమన్నారంటే, ఇటు చంద్రవంశం కథ ఆ చంద్రవంశ కథను విడగొట్టి యుద్ధమునకు మూల కారకుడైన వారేమో సూర్యుడు కొడుకైన కర్ణుడు. అందుకని సూర్యుడు, చంద్రుడు అన్నారు.

ఇక ఆ తర్వాత మహానుభావుడు అర్జునుడు. గాండీవం ఇచ్చిందే అగ్నిహోత్రుడు కదా, అగ్నిహోత్రుడి తోటే అర్జునునికి కొత్త శక్తులు ఆరంభమయ్యాయి. అనలుడు, అంటే అగ్ని మళ్ళీ సూర్యున్ని ఎలా తీసుకువస్తాం. అంతటి సూర్యుడు కర్ణుడిని ఎప్పటికప్పుడు వారించడం, కవచం వద్దు ఇవ్వవద్దు ఇస్తే కొంపమునుగుతుంది. ఇస్తే ఇంద్రుని శక్తి పుచ్చుకో, అని సలహా ఇచ్చి ఒక విధంగా కర్ణుడిని చివరి దాకా నిలబెట్టాడు.. చంద్రుడు దగ్గర నుండి గాండీవం అగ్ని హోత్రుడి దగ్గరకు వచ్చింది. చంద్రుడు అన్నింటికి మూల కారకుడు అభిమన్యుడు చనిపోయి చివరకు చంద్రలోకానికి వెళ్ళిపోయాడు. ఆ అభిమన్యుని కర్ణుడే వెనుక నుండి చంపాడు. ఒక విధంగా చెప్పాలంటే అర్జునుడు చేతికి ఉన్నటువంటి కొన్ని విద్యలు కవచధారణ అనే విద్య అభిమన్యుడికి ఇచ్చాడు. ఆయన కవచధారణ విద్య ఉన్నంతవరకు అభిమన్యున్ని ఎవరూ చంపలేదు. అందుకని ద్రోణాచార్యుడు  చేతిలో విల్లున్నంత వరకు అభిమన్యున్ని ఎవరూ చంపలేరు అనగానే వెనక్కు పారి పోయినట్టు పారిపోయి బాణంతో కొట్టేశాడు. విల్లు విరగ్గొట్టాడు దానితో అభిమన్యుడు చనిపోవడంతో అర్జునునికి కసి పెరిగింది. ఒక విధంగా చెప్పాలంటే సైంధవుడు మొదలుకొని అందరూ నాశనం కావడానికి మూల కారకుడయ్యారు. ఈ విధంగా మహాభారతం మొత్తం అంతా ముగ్గురు చుట్టూ తిరుగుతుంది.  అగ్ని, సూర్యుడు, చంద్రుడు, దానిని వివిధ విధాలుగా విశ్లేషణ చేసుకోవాలి. ముగ్గురు యజ్ఞం నడిపారు. యజ్ఞం మొత్తం విష్ణుమయం, దానితో మిగతా కథలో లాగా ఒక నాయకుడు అనడానికి వీలులేదు.

మన నిత్య జీవితంలో మన అతిథి అగ్ని అగ్ని లేనిదే సృష్టి జరగదు. సనాతన ధర్మంలోనూ అగ్నికి అత్యంత ప్రాధాన్యం ఉంది. పూర్వం ప్రతి ఇంటిలోనూ హోమాలు నిర్వహించేవారు. ఒక యాగం జరగాలంటే అగ్నినే ప్రధానంగా ఆరాధిస్తారు. సంజయుడు ధృతరాష్ట్రునితో  ఆకాశంలో దేవతలు అన్న మాట నీకు వినిపిస్తున్నాను వినుము ధృతరాష్ట్ర ఒక యజ్ఞం దేవతలు భూలోకంలో నిర్వహించారు ఆ యజ్ఞం యుద్ధ రూపంలో ఉన్న యజ్ఞం నిజానికి యుద్ధం క్రింద కనబడుతున్న ఈ యజ్ఞం ఈ  యజ్ఞానికి మూలం విష్ణువు , వైష్ణవ యాగం ఈ క్రతువు విష్ణుమయం ఇందులో గూఢార్థం ఉన్నది కర్ణార్జునులు చేసిన యుద్ధం మిగతావారిలాగా కాదు ఇది అద్భుతమైన విష్ణువు చేసిన యజ్ఞం.  యజ్ఞానికి నడిపే రుత్విక్కులు ఉండాలి కదా అనలుడు అగ్ని హోత్రుడు, సూర్యుడు, చంద్రుడు రుద్రుడు విష్ణు యాగం చేసాడు శివునకు మూడు కళ్ళు ఎవరు ఒకరు అగ్ని హోత్రుడు మరొక ఆయన సూర్యుడు చంద్రుడు అందుకే అగ్ని హోత్రుడు

ఇచ్చిన గాండీవం సూర్యుడి కొడుకు సూర్యవంశం, అర్జునుడు చంద్రవంశం వాడు ఈ ఇద్దరు కొట్టుకున్నారు ఈ మూడు కళ్ళతో రుద్రుడు వైష్ణవ యాగం చేసారు. ఈ యాగాన్ని అర్జునుడు , కర్ణుడు యుద్ధ రూపంలో నిర్వహించారు. ఈ కథ భారతానికి ఒక ప్రాణం ఈ ప్రబంధాన్ని చక్కగా చదివినా విన్నా సకల సంపదలు పొందుతారు.

## 2. మహాభారత విశిష్టతను సమాజానికి విస్తరింప జేసే మార్గాలు ఏవి?

భారతంలో ని ప్రతి పాత్ర , ప్రతి కథ , ప్రతి సంఘటన ఎప్పుడో అప్పుడు .జరుగుతూనే ఉంటాయి. మహాభారతం అంటే నిత్య జీవనం. రోజు ఇందులోని పాత్రలు కనబడుతారు. తాను అసమర్థత వలన తాను గొప్పవాడననుకొని భావించుకుని రాజును ఎలా పడగొట్టాలో తెలుసుకోవాలంటే కర్ణుడిని చూసి తెలుసుకోవాలి. అర్జునుడిని గెలవలేనని ఎంతోకొంత లోపల అనుమానం లేకపోలేదు. భయం ఉన్నా పైకి నటించి బిక్కం చూపించి చేజేతులా రెచ్చగొట్టాడు. నేటి రాజకీయాల్లో కొంతమంది వ్యక్తులు తాము గెలిపిస్తామంటూ పార్టీ నుండి ధనాన్ని తీసుకుని క్షవరం చేస్తాడు. తర్వాత నమ్ముకున్న వాడు దేనికి ఉపయోగపడకుండా పోతాడు. దుర్యోధనుడు లాంటి వాళ్ళు ఎలక్షన్లలో ఓడిపోతున్న వారి ప్రక్కనా పనికి మాలిన వాని మాటలు ఇవి.ద్రౌపది లాంటి వారు, కనబడుతారు, కృష్ణుని వంటి పాత్రలు కనబడుతుంటారు. ధైర్యంగా యుద్ధం చేసేవారు కనబడుతారు. శకుని లాగా మోసం చేసే వారుంటారు. ప్రతి కథ ప్రతి పాత్ర నిత్య జీవనమే. భారతం ఒక పురాణం ఇతిహాసం కాదు. ఆది ఒక జీవన విధానం. ధృతరాష్ట్రుడు చాలా గొప్పవాడే కాని రవ్వంత దుర్యోధనుని పక్షపాతం ఉంది. ఆ పక్షపాతంతో దెబ్బతిన్నాడు. కాబట్టి ఆ పాత్రలు ఉంటాయి. అందులో విశేషాలుంటాయి. మార్పులు ఉంటాయి.

## 3. మహాభారతం కాలం నాటి రాజకీయ వ్యవస్థకు నేటి రాజకీయ వ్యవస్థకు మధ్య భేదాలు ఏమిటి?

అప్పటి రాజకీయాలలో కుళ్లు కుతంత్రాలు , కుట్రలు ఉన్నా ఈ దారుణం లేదు. వాళ్ళు ముఖాముఖి యుద్ధం చేసేవారు. ఎక్కడో దుర్యోధనునిలాంటి వారు మోసం చేసి లక్కయిల్లు తగులబెట్టినా, విషం పెట్టడం వంటి సంఘటనలు పక్కన పెడితే, యుద్ధంలోకి వెళ్ళాక పరాక్రమంతో యుద్ధం చేసారు. భీముడు, దుర్యోధనుడు కూడా ఘోర యుద్ధం చేసారు. ఇప్పుడు రాజకీయం అంతా కుళ్లు కుతంత్రాలు, ఇప్పుడు పొద్దున ఒక పార్టీ సాయంత్రం ఒక పార్టీ ఎవరో కొంత మంది మంచి పరిపాలకులు మహాత్ములు లాంటి వారిని , సాధువులను ప్రక్కన పెడితే, ఎక్కడ చూసినా మోసమే అప్పుడు రాజ్యాలు విడిపోయాయి. ఇప్పుడు

రాష్ట్రాలు విడిపోతున్నాయి. అప్పుడు రాజధాని లేకపోతే ఖాండవ వనాన్ని తగులబెట్టి కొత్త రాజధానిని కట్టుకున్నారు. ఇప్పుడు అలానే కట్టుకుంటున్నారు. కొట్టుకు చచ్చిపోతున్నారు. ధర్మం కోసం నిలబడే వారు కొంతమంది ఉన్నారు. మహాభారతం కాలం నాటి కాలుష్యం ఉన్నా ధర్మం పూర్తిగా పోలేదు. ఉదాహరణకు దుర్యోధనునికి పాండవుల మీద ద్వేషం ఉంది కాని నాస్తికుడు కాదు, దైవ ద్వేషి కాదు, దుర్యోధనుడు పౌండరీకం వంటి యజ్ఞాలు చేసాడు. దాన ధర్మాలు చేసాడు, దుర్యోధనుడు, చచ్చిపోయాక కూడా ధర్మరాజు పట్టాభిషిక్తుడు అయినప్పుడు అందరూ వచ్చి దుర్యోధనుడికి నీకు ఏమి తగాదాలు ఉన్నయో తెలీదు. ప్రజల విషయంలో మాత్రం ఏకరవు పెట్టలేదు. మమల్ని ఇంత అన్నం పెట్టారు అన్నారు. ఆ రోజుల్లో కులాలు, మతాలు లేవు ఆ రోజుల్లో ఉన్నదంతా ఒకటే మతం. అందువల్ల రాజులు కొట్టుకున్నారు కాని ప్రజలకు ఆపద రానీయలేదు.

కీచకుడు సామ్రాజ్యం విరాటనగరం, మత్స్య రాజుగారికి పూర్తి ప్రతినిధి ఎవరు కీచకుడు కదా, కీచకుడికి పొలిమేరలో ఎవరున్నారు సుశర్మ, సుశర్మకి కీచకుడు కేవలం తగాదా సరిహద్దుల తగాదా,ఇవతలి కీచకుడు వెళ్ళి వాళ్ల ఆస్తి కొట్టేసేవారు. వాడు ఇటొచ్చి వీరి పొలాలు కోసుకుపోయేవారు. వీళ్లు వాళ్లు కొట్టుకున్నారు కాని మధ్యలో ప్రజల్ని ఎవరూ చంపలేదు. సైనికులు చచ్చిపోయారు కాని ప్రజల్ని చంపలేదు, ఇప్పుడు ప్రజల్ని చంపుతున్నారు. ఎంత దారుణంగా ఉంది. ఈనాడు కొంత మంది ప్రజా పరిపాలకులు అదేకదా చేస్తున్నది. రైతుల పేరుతో వచ్చి అనవసరంగా సామాన్య ప్రజల్ని తగులబెట్టారు. ఈ విషయంలో కాస్త తెలుగువాళ్లు నయం అనుకోండి, ఇప్పుడు ప్రత్యక్ష యుద్ధం లేదు, ఇప్పుడు అంతా పరోక్ష యుద్దమే, అప్పుడు బాణాల తోటి కత్తుల తోటి గదా యుద్ధం చేసారు. కుస్తీ పట్టుకుని యుద్ధం చేసారు. కీచకుడిని ముద్ద ముద్ద చేసారంటే మల్లయుద్ధం తప్ప ఒక్క ఆయుధం ముట్టలేదు. ఇప్పుడు దొంగ చాటుగా శబ్దాలు వచ్చే అణుబాంబులతో పేల్చేయడం, అడ్డదిడ్డంగా బాంబులు పెట్టేయడం, కాబట్టి సర్వనాశనమై పోయిన పాపాలతో, కుళ్ళు కుతంత్రాలతో నిండిపోయిన కపట విజ్ఞానంతో కూడిన సర్వ నాశపమైపోతున్న రాజకీయాలివి. అప్పుడు ధర్మయుద్ధమైన రాజకీయాలు, పదవి ఉండి కూడా ధర్మం తప్పని రాజకీయాలు, అందుకే నీల కంఠేశ్వర శతకం లో ఒక పద్యం వ్రాసాను.

మ. శివా! ఫాలోద్గతవహ్ని నీది మరు, భస్మీభూతునిం జేసె గా
ని, వసంతమ్మును గాడొనర్పదు గదా నిక్కంబుగా నేటి మా
నవ దుర్వారమహాణు సంకలిత విజ్ఞానశాస్త్ర ఘోరార్భటిన్
భువి కాడోనొకొ ప్రోవరాదె దయ, శంభూ! నీల కంఠేశ్వరా!

భావం:- శివా! శంభూ ! నీల కంఠేశ్వరా ! నీ నుదిటిలో గల మూడవ కన్ను నుండి పుట్టిన అగ్ని, మన్మథుని భస్మం చేసింది, కాని వసంతాన్ని ప్రకృతిని స్మశానంగా మార్చలేదు, నేటి మానవులు తయారుచేసిన అడ్డగించడానికి వీలులేని, మహా అణువులతో కూర్చబడిన, విజ్ఞానం వల్ల కనిపెట్టబడిన అస్త్రాల మహాశక్తి వల్ల ఆటంబాంబుల వల్ల భూమి స్మశానంగా మారిపోతుందేమో అని భయంగా ఉంది దయతో రక్షించకూడదా స్వామీ ( శ్రీ నీల కంఠేశ్వర వైభవం 25 వ పద్యం, ( శివా ఆనాడు శివుని మూడవ కన్ను తెరిచి అందులో నుండి అగ్నిని సృష్టించి అగ్నితో మన్మథుని భస్మం చేశావు కాని మన్మథుని స్నేహితుడు వసంతాన్ని నాశనం చేశావా చేయలేదు. , వసంతం ప్రకృతి పాడవలేదు, ఒక్క మన్మథుడే నశించాడు. మన్మథుడు, వసంతుడు ఇద్దరూ స్నేహితులే కాని కోరికయైన మన్మథుని నాశనం చేసాడు. కాని పక్కనున్న ప్రకృతిని పాడు చేయలేదు. ఇవాళ మానవులు దుర్వార మహాణుసంకలిత విజ్ఞానశాస్త్ర ఘోరార్భటిన్, ఈ మానవులు తయారుచేసిన, ఎవరూ ఆపడానికి వీలుకాని అణువులతో కూడిన విజ్ఞానశాస్త్రాలు ఉన్నాయే ఇవి భూమిని వల్లకాడు చేసేస్తున్నాయి. మన అస్త్రాలు, సర్వనాశనం చేస్తాయి. ఆ అస్త్రాలు ఎవరి మీద వేస్తే వారినే చంపేవి. ఆ అస్త్రాలు లేవు ఇప్పుడు. ఈ అస్త్రాలు మొత్తం లోకాలను నాశనం చేసేస్తున్నాయి. ఈ రాజకీయమంతా నీచమైన విజ్ఞానంతో కూడిన రాజకీయం.

### 4. కుంటుపడుతున్న నేటి పరిపాలనా విధానానికి మహాభారతం ఇచ్చే సందేశం ఏమిటి?

మహాభారతంలో కృష్ణున్ని , ధర్మరాజును, దుర్యోధనుడిని, కర్ణుడిని వీరినందరిని ఒకటికి రెండు సార్లు స్టడి చేసి దుర్యోధనుడిలాగా సూది మోపినంత స్థలం ఇవ్వనన్నవారు, ఎలా నాశనం అవుతారో తెలుసుకుని ఒక దుర్మార్గుడిని ప్రోత్సహిస్తే ఏమవుతుందో కర్ణుని చూసి తెలుసుకుని మోసంతో ఒకళ్ళ రాజ్యం లాక్కుంటే దాని వల్ల చివరకు వచ్చే నష్టం ఏమిటో శకుని చూసి తెలుసుకుని ఈ ముగ్గురుతో చేరి స్త్రీలకు అన్యాయం చేస్తే ఎలా రొమ్ము చీల్చబడి ఎలా రక్తం వరదల పాలై చస్తారో దుశ్శాసనుడిని చూసి తెలుసుకుని ఓపికగా, ఎలా ఉండాలో ధర్మరాజును చూసి తెలుసుకుని అర్జునుడు, భీముడులాగా బల పరాక్రమాలను పెంచుకుంటూ కూడా ధర్మం తప్ప అన్న గారిని విడిచి పెట్టకుండా ఉండే శత్రువులను ఎలా గెలుచుకుంటారో తెలుసుకుని ,కష్టాలలో ఉన్నప్పుడు భర్తను విడిచి పెట్టకూడదనే ద్రౌపది సిద్ధాంతాన్ని తెలుసుకుని ఇవన్నీ ప్రజలు ఎప్పటికప్పుడు బేరీజు వేసుకుని జీవితం గడిపితే ఎప్పటికీ జీవితంలో దుఃఖం రాదు. ద్రౌపది పుట్టింటికి వెళ్లిపోతుందా వెళ్లిపోలేదు. పాండవుల తోటే ఉంది. చివరి దాకా అందుకే మిగతా భార్యలందరూ భార్యలు కాదు. అజ్ఞాత వాసానికి కూడా వెళ్లిన ఏకైక వ్యక్తి ఆమె ఒక్కటే ఎంత గొప్ప ఆవిడ రెండో వాడికి చెప్పుకోవడానికి కూడా కొన్ని కష్టాలుంటాయి. కీచకుడు వచ్చి మీద పడుతూ కూడా నేను ద్రౌపదిని నన్ను రక్షించు అని మొగుడితో చెప్పుకోవడానికి కూడా దిక్కుతోచలేని స్థితిలో ఉంది

పాపం. అయినా విడిచి పెట్టిందా. అలాగని భర్త అపమార్గంలో వెళ్తే తిట్టకుండా ఉందా తిట్టింది. అప్పుడప్పుడు అంత జాగ్రత్తగా ఎలా భర్తను దారిలో పెట్టుకోవాలి. ఎలా విడిచి పెట్టకూడదు, ఇంత సందేశం ద్రౌపది ఇచ్చింది మనకి. సత్యభామను చూసి, రుక్మిణిని చూసి మనం ఎప్పటికప్పుడు నేర్చుకోవాలి. గాంధారి చేసిన పెద్ద పొరపాటు ఏమిటంటే భర్తకు కళ్ళు లేవు అతని రక్షించవలసింది పోయి. తన కళ్ళకు గుడ్డ కట్టుకుంటే భర్తకు ఏమి చేయగలిగింది. పాపం. తాను కూడా ఇంకొకరి మీద ఆధారపడిందా లేదా ఆ పాతివ్రత్యం గొప్ప ప్రాతివత్యం కాదు కాబట్టే ఆవిడకు పుత్ర శోకం వచ్చింది.

భార్య అంటే భర్తకు ఏదైనా అవయవ లోపం ఉంటే తను దగ్గరుండి సేవ చేయాలి. అంతేగాని మా ఆయనకు కళ్లు లేవు కాబట్టి నేను గుడ్డకట్టేసుకుంటాను అంటే మొత్తం భారతం దెబ్బ తినింది. ఆమె కనక కళ్లకు గుడ్డ కట్టుకోకుండా ఉంటే దుర్యోధనుడిని దారిలో పెట్టగలిగేది. అందువల్ల పాతివ్రత్యం పిచ్చి పాతివ్రత్యం అవ్వకూడదు. తెలివితేటలతో కూడిన పాతివ్రత్యం ఉండాలి. అది ద్రౌపది దగ్గర ఉంది అది కుంతి దగ్గరుంది. కుంతి కూడా భర్త చచ్చిపోతే నేను కూడా సహగమనం చేస్తానంది. కాని చిన్న భార్య ఏమంది మాద్రి నా దగ్గర తెలివితేటలు తక్కువ పిల్లలను అదుపులో పెట్టలేను కారణం చెప్పనా భర్త మనవల్ల చనిపోతాడని తెలిసికూడా భర్తను అదుపులో పెట్టలేకపోయాను. రేపొద్దున్న ఈ పిల్లల్ని నేనేమి కాపాడుతాను. కానీ నీవు ఇంద్రియ నిగ్రహం కలిగిన దానివి, సామర్థ్యం కలిగిన దానివి. ఈ పిల్లలు ఐదుగురిని సమానంగా పెంచే శక్తి నీకే ఉందని కనిపెట్టి కుంతికి అప్పగించి వెళ్ళి పోయింది. అది కుంతి గొప్పదనం. అంతే కాని నేను చచ్చి పోతానని భర్త తో పాటు చనిపోయి ఉంటే నేడు పాండువులు ఉండేవారు కాదు. కాబట్టి ఇలా ఏమి చేసినా ఒక క్షణంలో చెప్పడానికి వీలులేనంత మహాద్భుత గ్రంథం మహాభారతం. అది అన్ని కాలాలకి అందరికి పనికి వస్తుంది.

### 5. రాజుకు ఉండవలసిన ప్రధాన లక్షణాలు?

ఇవన్నీ మనం ధర్మరాజు దగ్గర నేర్చుకోవాలి. శాంతి పర్వం, అనుశాసనిక పర్వం, అశ్వమేధ పర్వం, ఆశ్రమవాస పర్వం ఇవన్నీ కలుపుకుని మహారాజు ఎంతో కోమలంగా ఉండాలో, అంత కఠినంగా ఉండాలి. అంత ధర్మంగా ఉండాలో, అవన్నీ తెలుసుకోవాలి. ధర్మరాజు దగ్గర ఉన్న గుణాలు ఇంక ఎవరి దగ్గర లేవు దానికి ఉదాహరణ

సీ. ఎవ్వాని వాకిట నిభమద పంకంబు
    రాజభూషణ రజో రాజి నడుఁగు
ఎవ్వని చారిత్ర మెల్ల లోకములకు

నొజ్జయై వినయందు నెరపు గఱపు
నెవ్వని కడకంటి నివ్వటిల్లెదు చూడ్కి
మానిత సంపదలీనుడుండు
నెవ్వని గుణలత లేదు వారాసుల
కడపటి కొండపైఁగలయ బ్రాఁకు
తే. నతడు భూరి ప్రతాప ,మహా ప్రదీప
దూర విఘటిత గర్వాంధ కార వైరి
వీర కోటీర మణి ఘృణి వేష్టితాంఘ్రి
తలుఁడు కేవల మర్త్యుడే ధర్మ సుతుడు.
అందుకని అజాత శత్రువు అనే పదం ధర్మరాజుకు తప్ప ఎవరికి చెల్లదు.

### 6. రాజ్య పరిపాలనలో గూఢచారుల ప్రాముఖ్యం ఎటువంటిది?

మహారాజుకు చెవులు, కళ్లు సమస్తం గూఢచారులే. ఉన్నది ఉన్నట్లుగా రాజుకు చెప్పగలిగిన వాడై ఉండాలి. ఇప్పుడు ఇంటలిజెన్స్ బ్యూరో ఉంది. గవర్నమెంట్ కి మంచి చెప్పరు, చెడు చెప్పరు. ఆ సమయానికి ఏది తోస్తే అది చెప్పేయడమే అవతలి వాడికి మనసుకు నచ్చిన విధంగా, ఎలక్షన్లలో ఓడి పోతావు అనే విషయం వాడు చెప్పాలా అవతల ఒకవేళ ఓడిపోయేట్లైతే నీకేం ఫర్వాలేదు నెగ్గేస్తావు నెగ్గిస్తాం అంటారు. అంతా వాడు ఓడిపోయాక వీడు ఏడుస్తూ కూర్చొంటారు. రాముడికి గూఢచారులు ఎంతో నిజాయితిగి ఉన్నారు. ఉన్నది ఉన్నట్లుగా చెప్తారు. నీ భార్య గురించి ఇలా అన్నారు. ఎవరో అని ఉన్నది ఉన్నట్లు భద్రుడు చెప్పాడు కదా అలాగే ఏ మూల ఏం జరిగినా తెలుసుకుని రెండవ వాడికి తెలియకుండా రహస్యాన్ని రాజుగారికి ఎలా చెప్పాలో అలా చెప్పాలి. మళ్ళీ అందులో తన స్వంత అభిప్రాయాన్ని చేర్చడం గాని లాంటివి చేయరు. కుండబద్దలు కొట్టినట్లు చెప్తారు. ఆ సమయంలో మనసుకు కష్టం కలిగినా ఉన్నది ఉన్నట్లు చెప్పాలి. అలాంటి గూఢచారి వ్యవస్థ కావాలి.

### 7. రాయబారికి ఉండవలసిన ప్రధాన లక్షణాలు ఏమిటి?

రాయబారి సూటిగా తన ప్రభువు మాట చెప్పాలి. ఆ మాట అవతలి వాడు బాధపడకుండా ఉండేట్లు చెప్పాలి. తానొక్కడే మళ్ళీ ఎదురుగా శత్రువు దగ్గరికి రాయబారిగా వెళ్లి వాడి చేతిలో చచ్చిపోయేవాడై ఉండకూడదు. వాడు బలవంతుడై ఉండాలి. అవసరమైతే సాధ్యమైనంత వరకు తగాదా పడకుండా రాగలిగిన వాడై ఉండాలి. కార్యం సాధించే వాడై ఉండాలి. పట్టుదల కలిగిన వాడై ఉండాలి. అన్నిటికి మించి అక్కడికి వెళ్లి తిరిగి రాగలిగిన వాడై ఉండాలి. రాయబారి అంటే తన తెలివితేటలు బలం యుక్తి శక్తి

అన్ని ఉపయోగించి తిరిగి వెనక్కి రాగలిగినవారై ఉండాలి. కృష్ణుడులా ఉండాలి. కృష్ణుడు వెళ్లాడు ధర్మరాజాదులు చెప్పినవి కాకుండా తాను చెప్పవలసినవి కూడా సూటిగా చెప్పాడు. కొంచెం బాధ కలిగించేలా చెప్తున్నా పక్కన భీష్మాదుల మద్దతును తెలుసుకోగలిగారు. వాళ్లందరి యొక్క మద్దతు తనదే అదే సమయంలో దుర్యోధనుడు బంధించడానికి ప్రయత్నిస్తే ఇరుక్కుపోకుండా వెనక్కి రాగలిగాడు. అది లేకపోతే ఉపయోగం లేదు. అంగదుడు వెళ్లి వెనక్కరాలేదు మరి. కొంతమంది రాయబారానికి వెళ్లినా అవతలి వారి చేతిలో చనిపోతారు. కుబేరుడు రాయబారిని పంపాడు రావణాసురుని దగ్గరకు రావణాసురుడు అతనిని చంపేసాడు. ఇక్కడ రాయబారి వలన ఉపయోగం ఏమిటి.

**8. రాయబారాలు జరగక ముందే యుద్ధానికి సైన్యాన్ని సమకూర్చుకున్నారు కదా మరలా రాయబారాలు జరపవలసిన అవసరం ఏమిటి? ఇందులో ఏమైనా అంతరార్థం ఉందా?**

జ. చైనాకి మనకి రోజు తగాదా వస్తుంది. వారు సైన్యం అక్కడ సిద్ధంగా ఉందా లేదా. రాయబారం వలన యుద్ధం ఆగుతుందని మనకు తెలుసు కాని రాయబారం అయ్యేలోపు ఒకవేళ తేడా వస్తే ఏమి చేయాలి. వెంటనే సిద్ధంగా ఉండాలి కదా వద్దా ఇంటికి దొంగ వచ్చాడు, గుమ్మం ముందు ఉన్నాడు కన్నం వేయడానికి సిద్ధంగా ఉన్నాడు. ముందు పోలిసులకు తెలిపి ఆ తరువాత కిందకు వచ్చి దొంగతనం చేయవద్దురా అని బతిమాలాలి. వింటే వాడు వెళ్ళి పోతాడు. లేదా పోలీసులు ఆ సమయానికి వస్తారు. జాగ్రత్త పడాలి కదా మరి అందువల్ల సైన్యం సమకూర్చున్నాక రాయబారానికి వెళ్లాలి తప్ప ముందు రాయబారానికి పంపి ఆ తర్వాత సైన్యాన్ని సమకూర్చుకునే లోపు అవతల రాయబారిని చంపి యుద్ధానికి వస్తే నువ్వు ఏమి చేయగలవు? అవునా రాజనీతి ఏమిటంటే అవతలి వాడిని చావు దెబ్బతీయడానికి కావలసిన వనరులు సమకూర్చున్నాకే అప్పుడు ఆఖరున రాయబారానికి వెళ్ళాలి. రాయబారం సక్రమంగా జరిగితే బాగుంటుంది, లేకపోతే అవతలి వారిని హతమార్చడమే.

**9. శ్రీకృష్ణుడు నిజంగా రాయబారం చేసాడా?లేదా యుద్ధానికి ప్రేరేపించాడా? అనే విషయాన్ని వివరణాత్మకంగా తెలియజేయగలరు.**

శ్రీకృష్ణుడు సుస్పష్టంగా చెప్పాడు. గాంధారితో చివరి దాకా ప్రయత్నించాను. కృష్ణుడుని దైవం గా ప్రక్కన పెడితే, కృష్ణుడుగా ఆయన చేయవలసిన ప్రయత్నాలన్నీ చేసాడు. అంత అద్భుతంగా ఎవరూ చెప్పలేదు. కాని దుర్యోధనుడు వినడని ఆయనకు తెలుసు వినడు కాబట్టే చివరికి బెదిరించికూడా చూసాడు. కర్ణుడుని కూడా తన వైపు రావడానికి గట్టిగా ప్రయత్నం చేసాడు. నా వైపు వచ్చేయ్ అన్నాడు అలాగైనా గెలుద్దామని ఎన్ని చేసినా ప్రయోజనం లేదు. చివరకు సంగ్రామం అయ్యింది. సంగ్రామం

అవుతుందో లేదో అని దివ్యదృష్టితో చూడటం ప్రక్కన పెడితే ఆయన మాత్రం రాయబారి కోసమే చివరి వరకు ప్రయత్నించారు. సినిమా వారిని నమ్మకూడదు ఆ విషయంలో సినిమా వారు

చిత్రీకరించడానికి కల్పనలు చేసి ఉన్నారు.

**ఉ. అందు వృకోదరార్జునుల నావహ రంగమునందు మీఱువా**
**రెందఱొయెన్నుమా యిచట, నీ గురు భీష్ములు గ్రేణి జేయు వా**
**రెందరో వారు వీరునని నీల్గుటకంటే భవత్బలంబులై**

**అందఱుః కూడుటొప్పెదే జనాధిపా శాంతి యొనర్పు యెమ్మెయిన్**

ఇంత కన్నా మహానుభావుడు ఇంకేమి చెప్పగలడు. అందు అన్నాడు కాని మా అనలేదు. ఆ వైపు పక్షంలో అర్జునుడిని భీముడిని జయించేవారు ఎంతమంది ఉన్నారు. ఇక్కడ గురువు గారిని, భీష్ముడిని జయించే వారు ఎవరున్నారు. నీ పక్షంలో భీష్ముడు, గురువు గారు గొప్ప వారు అక్కడ వృకోదరార్జునులు వీళ్ళు వాళ్లు కొట్టుకుని చనిపోయే కంటే అందరూ నీ బలమైతే మంచిది కదా అందరూ కూడుటొప్పదే జనాధిపా సంధి యొనర్పు మెమ్మయిన్ తిక్కన గారు రాయబారం లో చెప్పారు. అందులో వ్యంగ్యం ఉంటుంది యుద్ధం అంటూ జరిగితే చస్తారు రా.. అన్నాడు, పైగా వీరుడంటే ఎవరో చెప్పాడు. ఇక్కడ కేవలం గురువు గారు, భీష్ముడే మిగతా వాళ్ళంతా గొప్పవారు అనుకుంటున్నావు ఎవరూ పాండవుల ముందు ఆగరు. అటువైపు వారు హేమా హేమీలు అర్జునుడు, భీముడు, వీరు వారు కొట్టుకుని చనిపోవడం కంటే కలిసుంటే మంచిది కదా అని చెపితే వింటే కదా ఎవరైనా కాబట్టి కృష్ణుడు పూర్తిగా రాయబారానికి ప్రయత్నం చేసాడు.

## 2. శ్రీ దేవిసెట్టి చలపతిరావు: ముఖాముఖి: (06-12-2022 నుండి 23 -12-2022 వరకు )

### (ఆధ్యాత్మిక జ్ఞాన పీఠం వ్యవస్థాపకులు, మహాభారత పరిశోధకులు, ఆధ్యాత్మిక గురువు).

ప్రముఖ వేదాంతోపన్యాసకులు, మహాభారత పరిశోధకులు అభినవ వ్యాస జ్ఞాన ప్రపూర్ణ' బిరుదాంకితులు, ఆధ్యాత్మిక జ్ఞాన పీఠం వ్యవస్థాపకులు, శతాధిక ఆధ్యాత్మిక జ్ఞాన యజ్ఞ కర్త

సద్గురు శ్రీ దేవి సెట్టి చలపతిరావు గారితో ముఖాముఖి (ముఖాముఖి ప్రారంభ తేది: 06-12-2022 నుండి)

. (వీరు సత్సంగంలోని భక్తులకు, శిష్యుల సందేహాలు తీర్చడానికి జూమ్ మాధ్యమం ద్వారా రాత్రి ఏడు గంటల సమయంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. నేను ఆ కార్యక్రమంలో పాల్గొని జూమ్ మాధ్యమం ద్వారా ప్రశ్నలు అడగడానికి అనుమతించారు. నేను రోజుకు ఒక ప్రశ్న చొప్పున ముఖాముఖిని నిర్వహించాను).

### 1. శ్రీకృష్ణుడు మహాభారతానికి నాయకుడుగా, ప్రధాన సూత్రధారిగా పేర్కొనవచ్చా?

శ్రీకృష్ణున్ని మహాభారతానికి నాయకుడుగానే పేర్కొనాలి. ఎందుకంటే మహాభారతానికి నాయకుడు , నాయకురాలు, ప్రతినాయకుడు అనే పద్ధతిలో చూసుకుంటే ధర్మరాజు , ద్రౌపది, దుర్యోధనుడు అలా వస్తారు. కాని మహాభారతాన్ని మొత్తంగా జాగ్రత్తగా పరిశోధన చేస్తే కేవలం శ్రీకృష్ణుడు మాత్రమే నాయకుడు, ఆయనే కథా నాయకుడుగా ఈ విషయాన్ని మనం ఎలా చెప్తాము అంటే మనకు భగవద్గీత అనేటటువంటిది మానవ జీవితాన్ని ఎలా ఉన్నతమైన స్థితికి తీర్చిదిద్దుకోవాలో చెప్పేటటువంటిది. అలాగే ఉపనిషత్తుల యొక్క సారం కాబట్టి ఆ పరమాత్మను అందుకోవడానికి కావలసిన మార్గాలన్నీ కూడా ఉపనిషత్తులో ఉన్నటువంటి వన్నీ కూడా అందరికి అనుకూలంగా తెలియజెప్పడం జరిగింది. ఇక భారతం గురించి కదా రావాలి భగవద్గీత గురించి ఎందుకు వచ్చింది అంటే భారతానికి భగవద్గీతకు తేడా లేదు. భారతం లక్ష శ్లోకాల గ్రంథం. భగవద్గీత 700 వందల శ్లోకాలు గ్రంథం. ఈ భగవద్గీతలను అలా సాగదీస్తే భారతం. అవుతుంది. భారతాన్ని అలా కుదిస్తే భగవద్గీత అవుతుంది. కాబట్టి భగవద్గీతకు ప్రధానమైన నాయకుడు ఎవరు శ్రీకృష్ణుడే. మరి శ్రీకృష్ణుడు సాక్షాత్తు భగవానుడే కృష్ణస్తు స్వయం అని చెప్పారు. కనుక శ్రీకృష్ణుడు స్వయంగా భగవంతుడే భగవంతుడని మనం ఎలా అంగీకరిస్తాం అంటే భగవంతుడు అకర్త, అభోక్త ఏమి చేసేవాడు కాదు , ఏమి అనుభవించేవాడు కాదు. ఈ విషయం మనకు మహాభారతంలో ఎప్పుడు అర్థమవుతుంది. శ్రీకృష్ణుడు రాయబారం వెళ్ళి వచ్చిన తర్వాత యుద్ధం సిద్ధమయిపోయింది. కాని అంతకు ముందే యుద్ధం చేయాలని దుర్యోధనునికి ఉంది. దుర్యోధనుడు తప్పని సరిగ్గా యుద్ధం చేయాలి

అనుకుంటే పాండవులుకూడా యుద్ధం చేయాలి. అందుకని ముందుగా ఎవరు వెళ్ళి రాజును సహాయం అడిగితే వాళ్ళకి సహాయం చేస్తారని ముందుగా వెళ్లారు. శ్రీకృష్ణుడి దగ్గరకు వచ్చారు. స్వయంగా దుర్యోధనుడు వచ్చాడు. అలాగే ధర్మరాజు అర్జునుడిని పంపించారు. ముందుగా దుర్యోధనుడు వెళ్ళాడు . ఆలస్యంగా అర్జునుడు వచ్చాడు. ఇద్దరూ నాకు బంధువులు కాబట్టి నా బలాన్ని రెండు భాగాలుగా చేసి చేరో ఒకటి ఇస్తానని చెప్పాడు. ఆ భాగాలను 1. నాకున్న గోపాలురు పది వేల మంది ఉన్నారు. వారు మహావీరులు నాతో సమానమైన వారు వీరాధివీరులంతా ఒక పక్షం నేనొక పక్షం. పైగా నేనేమి చేయను ఊరికే కూర్చుని సలహాలు ఇస్తుంటాను.

''ఆయుధము ధరింపను కగ్గముగా నొక పట్ల నూరకే
సాయము సేయువాడ బెలుచన్ నను బిమ్మటనెగ్గులాడినన్
దోయిలి మొగ్గుదున్, నిజము తొల్త వచించితి గోరికొమ్ము
నీకేయది యిష్టమో కడమ యీతని పాలకు బొంకునందనా.....

కాబట్టి తాను ఏమి చేయకుండా అన్నీ చేస్తాడు.

2. మహాభారత వైశిష్ట్యాన్ని సమాజానికి విస్తరింపచేసే మార్గాలు ఏవి?

మహాభారతం యొక్క ఆంతర్యాన్ని కాని, వైశిష్ట్యాన్ని కాని సమాజానికి విస్తరింపచేయడమంటే అది ఎవరి వల్లనో ఒకరి వల్ల అయ్యే పని కాదు. ముఖ్యంగా ఇప్పుడు సినామాల వల్ల మహాభారతం కథ చాలామందికి తెలుసు కాని అది నిజమా కాదా అని తెలుసుకునేటటువంటి ఉద్ధేశం కాని ఆలోచన కాని అందరికి ఉండదు. కనుక అది ఎవరు కూడా ఏమి చేయలేరు ,. ఎటువంటి మహాత్ములైనా సరే మహాభారతాన్ని ఎంతో కొంత. లేదా ఒక సంఘటన చెప్ప కలుగుతారు కాని మొత్తం భారతాన్ని చెప్పేటటువంటి వారు కూడా వేళ్ళ మీద లెక్కపెట్టేట్టుగా ఉంటారు. ఒక వేళ చెప్పినా కూడా అందరి మనసుకు ఎక్కుతుందా అనే ఆలోచన లేదు. ఇన్ని సంవత్సరాలు వేదాంతం చెప్పుకుంటున్నాము. ఇది చెప్పుకుంటున్న మాత్రానా అందరికి చేరిందా అంటే లేదు పూర్వజన్మ సుకృతం ఉన్న వారికి చేరుతుంది. మహాభారతం అంటే మానవ జీవిత మహేతిహాసం కాబట్టి మానవ జీవితాన్ని సరైన పద్దతిలో నడుపుకోవాలి. అంటే మనకు ఒక నిఘంటువులంటిది. ఏది కావాలంటే అది మహాభారతంలో ఉంది. '' ధర్మేచ అర్థేచ .....'' ఇది ప్రతిజ్ఞా పూర్వకమైన శ్లోకం. ధర్మ, అర్థ కామ, మోక్ష సమస్తమైనటువంటి విషయాలు యదిహస్తి తదన్యత్ర ఏవైతే ఇందులో ఉన్నాయో, అవన్నీ ఇంకెక్కడ ఉన్నాయి దాంట్లో లేనిది ఇంకెక్కడా లేదు. ఇది మహాభారతంలోని ఒక ప్రతిజ్ఞ కాని అటువంటి మహాభారతాన్ని

తెలుసుకోవాలి. అనే ఆలోచన ఎంతమందికి ఉంటుంది. అందుకని సంస్కృత మహాభారతాన్ని తెలుసుకోవడం. కష్టమని కొద్దిగా భారతాన్ని తగ్గించి తెలుగులో ముగ్గురు కవులు మనకు అందించారు. ఆ తెలుగు భారతాన్ని చూసే వారు ఎంతమంది. ఉన్నారు. అది తక్కువే కాని ఎలా అందించడానికి వీలవుతుంది అంటే (కాలికి బలపం కట్టుకుని తిరిగినా ఎంతమందికి చెప్పినా చాల్లే పోవయ్యా నీ భారతం నాకు ఎందుకు మేమేదో హాయిగా పనులు చేసుకుని బ్రతకాలి అంటారు. )అందరికి అందించాలి అనేటటువంటిది లేదు మనం అందిస్తాం. అందుకునే వారు అందుకుంటారు. అందుకోలేనివారు అందుకోలేరు.

**3. మహాభారత కాలం నాటి రాజకీయ వ్యవస్థకు నేటి రాజకీయ వ్యవస్థకు మధ్య భేదాలు ఏమిటి?**

కావలసిన భేదాలున్నాయి. రాజకీయంగా చెప్పాలంటే సామాన్యంగా అందిరికి తెలిసిందే ఆనాటి వ్యవస్థకు దుర్మార్గుడు అనుకున్న దుర్యోధనుడు కూడా చక్కటి పరిపాలన చేసాడు. రావణాసురుడు కూడా రామాయణంలో ఆయన చక్కగా పరిపాలన చేసాడు. రావణాసురుని పరిపాలనకి వంకపెట్టడానికే వీలులేదు కనుక దుర్యోధనుడు పరిపాలన చేసినా ధర్మరాజు పరిపాలన చేసినా  ఎవరు పరిపాలన చేసినా ప్రజల యొక్క క్షేమాన్ని గురించిన ఆలోచనే ప్రధానంగా ఉండేది. ప్రజలకు ఏ ఇబ్బంది కలగకుండా ఉండాలి. నిరంతరం దాన్ని గురించే ఆలోచించేవాళ్లు. వాళ్ళలో వారు ఎన్ని కొట్టుకున్నా రాజ్యం కోసం తగాదా పెట్టుకుని ప్రజల యొక్క క్షేమాన్ని కాంక్షించేవారు. ఈ రోజు ప్రజల యొక్క క్షేమం మాత్రమే వదిలి పెట్టి కేవలం వాళ్ళ యొక్క స్వార్థం మాత్రమే ఉంది. అసలు మహాభారత కాలానికి ఈ కాలానికి కాదు. స్వాతంత్ర్యోద్యమ కాలానికి ముందు, స్వాతంత్ర్యోద్యమం తర్వాత  అంటే ఇప్పటికి యాభై, నలభై సంవత్సరాలు క్రిందటికి, ఇప్పటికి ఎంత తేడా ఉందో మనకు తెలుసు ఆనాడు రాజకీయ నాయకులందరికి రామాయాణమో, మహాభారతమూ కొన్ని ఉపనిషత్తులు , భగవద్గీత ఇటువంటివి తెలియనటువంటి వారు  లేరు. అందరూ తెలిసినటువంటి వారే ఈవేళ అవి అక్కరలేదు, ఏ ప్రకారంగా డబ్బు సంపాదించాలి. ఏ ప్రకారంగా నిలబెట్టుకోవాలి. ఎక్కడ ప్రభుత్వ ఆస్తులు ఉన్నాయి. ప్రైవేటు ఆస్తులు ఎక్కడ ఉన్నాయి. కాజేయడానికి ఎక్కడెక్కడ ఆస్తులు ఉన్నాయి. అని ఈ ప్రకారంగా మునిగి తేలుతున్నారు. ఆనాటి రాజకీయ వ్యవస్థలో చెప్పాలంటే భీష్ముడు గురించి చాలా మంది అనుకుంటూ ఉంటారు. పాండవుల వైపే ఎందుకు పోకూడదు. అని భీష్ముడు, ద్రోణాచార్యుడు ఎందుకు పాండవుల వైపు వెళ్ళలేదు ఈ ప్రశ్న ఎందుకు వచ్చిందంటే ఈ రోజున తెల్లవారేసరికి ఎవరు ఏ పార్టీలో ఉన్నారో తెలియనటువంటి పరిస్థితిలో

రాజకీయాలు ఉన్నాయి కాబట్టి ఏముంది అటు పోతే పోవచ్చు కదా ఇటు వైపు రావచ్చు కదా కాని ఒక నియమానికి కట్టుబడి ఒక ధర్మానికి కట్టుబడి ఏ పక్షంలో ఉన్నవారు ఆ పక్షంలోనే ఉంటారు కాని పార్టీలు మార్చేయడం అనేది లేదు అందువల్ల ఆనాటి రాజకీయాలకు ఈ నాటి రాజకీయాలకు ఎక్కడా పోలిక లేదు అన్నీ భేదాలు మాత్రము ఉన్నాయి. పోలిక మాత్రం అసలు లేదు.

4. **కుంటుపడుతున్న నేటి పరిపాలనా విధానానికి మహాభారతం ఇచ్చే సందేశం ఏమిటి?**

సందేశాలు బాగానే ఉన్నాయి కాని సందేశాలను ఆదేశాలుగా తీసుకుని ఆచరించే వారు ఉంటేనే ప్రయోజనం కాని లేకపోతే లేదు మొట్టమొదటిది. ఇప్పుడున్నటువంటి పరిపాలనా విధానం కాని రాజకీయ పరిస్థితులు కాని బాగు చేయడానికి వీలు లేనంతగా చెడిపోయాయి. దీనిలో ఏ సందేహము లేదు. ఎవరైనా ఏమైనా సందహాలు వ్యక్తం చేసినా వారి వారి అభిప్రాయాలే కాని నిజం మాత్రం ఉండదు. న్యాయంగా మహాభారతంలో దుర్మార్గుడు అనేటటువంటి ధృతరాష్ట్రుడు కూడా అరణ్యాలకు వెళ్ళేటప్పుడు అంటే 13 సంవత్సరాలు ధర్మరాజు దగ్గర ఉన్న తర్వాత కురుక్షేత్ర యుద్ధం తరువాత మూడు సంవత్సరాలు అరణ్యాలకు వెళ్ళాడు తపస్సుచేసుకుంటూ అలా వెళ్ళేటప్పుడు రాజనీతి మాటలు చెప్పాడు. అలాగే ప్రజల గురించి తన మనసులో ఉన్న బాధనంతా చెప్పాడు. అలా చెప్పేటటువంటి ధృతరాష్ట్రుడు ఎలాంటి వాడు అంటే దుర్మార్గుడు కాని ఆయన ప్రజాపరిపాలన చేయడం వలన ఏవిధమైన లోపము లేదు. ధృతరాష్ట్రుడు యొక్క ఇష్ట ప్రకారమే దుర్యోధనుడు కూడా పరిపాలన చేసాడు. కాకపోతే పాండవుల మీద ద్వేషం తండ్రి , కొడుకుల ఇద్దరికి ఉంది. కనబడూతూ చేసినవాడు దుర్యోధనుడు కనబడకుండా చేసిన వాడు ధృతరాష్ట్రుడు. అందువలన పరిపాలన బాగుంది అందులో అనుమానం లేదు ఎందుకంటే ప్రజలందరూ కూడా ధృతరాష్ట్రుడు యొక్క పరిపాలన అసలు ధృతరాష్ట్రుడు పరిపాలన చేయలేదు ఆయన చెప్పుకున్నాడు విచిత్రవీర్యుడు, తర్వాత పాండురాజు తర్వాత ఇప్పుడు ధర్మరాజు అని వరుస చెప్పాడు. అంటే తనను చెప్పుకోలేదు అంటే తాను రాజు కాదు కాబట్టి కేవలం సింహాసనం మీద కూర్చున్నాడు. చిక్కింది కదా అని పట్టుకుని కూర్చున్నాడు అంతే ధృతరాష్ట్రుడు , అసలు ధృతరాష్ట్రుడు అనే పేరు ఏమిటంటే ధృత రాష్ట్ర తనది కానటువంటి రాజ్యాన్ని గట్టిగా పట్టుకుని కూర్చున్నవాడని అర్థం. ఆయన రాజు కాదు అయినప్పటికి కూడా నాలుగు వేదాలను , వేదాంగాలను చదివినటువంటివాడు. అన్ని విషయాలను తెలిసినటువంటి వాడు పరిపాలన విషయంలో దుర్యోధనునికి మంచి సలహాలను

ఇచ్చినటువంటి వాడు పాండవుల మీద శత్రుత్వానికి కావలసినటువంటి ఆజ్యం పోసినటువంటి వాడు అందువల్ల వారు ఎలాంటి వారైనా ప్రజల్ని పరిపాలించే విషయంలో మాత్రం నికచ్చిగా ఉన్నారు. ఇక మహాభారతంలో పరిపాలకులకు ఏమైనా సూచనలు చెప్పారా అంటే అది అనుశాసనిక పర్వంలో వస్తుంది. భీష్ముడు అంపశయ్య మీద ఉన్నప్పుడు అంత్య కాలం సమీపించినప్పుడు శ్రీకృష్ణుడు పాండవులను వెంటబెట్టుకుని వస్తాడు. అప్పుడు ధర్మరాజుకి ఈ రాజధర్మాలను మోక్ష ధర్మాలను, స్త్రీ ధర్మాలను ,గృహస్థ ధర్మాలను ఇవన్నీ కూడా చెపుతూ ఉంటాడు. చెపుతూ రాజధర్మాలను చెపుతాడు. రాజనేవాడు ఎలా ఉండాలి. ప్రజల్ని ఎలా పరిపాలించాలి.అని అనుశాసనిక పర్వంలో కొన్ని వందల శ్లోకాలు ఉన్నాయి. సక్రమమైన పరిపాలన ఆశించడానికి వీలులేనటువంటి పరిస్థితులు ఇప్పుడున్నాయి. మహాభారతం ఎన్నో విషయాలు చెప్పింది. అరణ్య పర్వంలో ధర్మరాజుకు మహాత్ములైనటువంటి వారు వచ్చినప్పుడల్లా వారి దగ్గర అన్ని ధర్మాలు తెలుసుకుంటూ ఉంటారు. దానితో ఈ రాజ ధర్మాలు కూడా తెలుసుకుంటారు. అక్కడ ఉంది. అదే విధంగా శ్రీకృష్ణుడు రాయబారానికి వచ్చినప్పుడు మహర్షులు అయినటువంటి వారు నారదుడు మొదలైనటువంటి వారంతా వచ్చారు వారంతా ఎన్నో విషయాలు చెప్పారు దుర్యోధనునికి విన్నాడా దుర్యోధనుడు వినకపోతే దుర్యోధనుని బుద్ధికంటే ఇంకా హీనమైన బుద్ధి కలిగినటువంటి వాళ్ళు ఈ కలియుగంలో ఎవరు వింటారు ఎందుకు వింటారు కనుక సూచనలు కావలసినవన్ని ఉన్నాయి పాటించడానికి మాత్రం ఎవరూ సిద్ధంగా లేరు. ఇక ముందు కూడా ఎవరూ ఉండరు. ఇది ఎంత వరకు దిగజారాలో అంతవరకు దిగజారిన తర్వాతా మంచి పరిస్థితులు ఏమైనా భవిష్యత్తులో వస్తాయేమో అప్పుడు చూడాలి.

## 5. రాజుకు ఉండవలసిన లక్షణాలు నియమాలు ఏమిటి?

రాజుకు సంబంధించిన లక్షణాల గురించి అనుశాసనిక పర్వంలో భీష్ముడు ధర్మరాజుకి అంపశయ్య మీద ఉండి తెలియజేయడం జరిగింది. అక్కడ చాలా వివరంగా చెప్పారు. రాజైనటువంటి వాడు మొట్టమొదటిది ఏమిటంటే ప్రజల యొక్క క్షేమాన్ని కాంక్షించాలి. ఏ పని చేసినా ప్రజలకు మేలు కలుగుతుందా లేదా అని జాగ్రత్తగా ఆలోచించి చేయాలి. అలాగే ఆ కాలంలో ఎవరికైనా ప్రజలకు బాధ కలిగితే వాళ్ళే ప్రత్యక్షంగా రాజు దగ్గరకు వచ్చి అక్కడ ఒక గంట పెడతారు గంట కొట్టి రాజు గారిని రప్పించి ఆయనతో ప్రత్యక్షంగా చెప్పుకుంటారు. అంటే ప్రజల యొక్క కష్టాలు తీర్చడానికి డైరెక్ట్ గా రాజు దగ్గరకు పోవడమనేది ఒక సాంప్రదాయం ఆనాడు ఉంది. అలాగే రాజు ప్రజల యొక్క ఆలోచనా విధానం

ఎలా ఉంది అని తెలుసుకోవడానికి గూఢచారులను పెడతారు ఒక్కోసారి తానే మారు వేషంలో అప్పుడప్పుడూ వెళ్ళి తిరగి వస్తూ ఉంటాడు. ఇది కూడా ఆనాడు రాజు చేసేవాళ్ళు ఎందకంటే గూఢచారులు ఏమైనా పొరపాటుగా చెప్పవచ్చు రాజుకు వ్యతిరేకంగా చెప్పడానికి వెనకాడవచ్చు కాని తానే స్వయంగా వెళితే ప్రజల యొక్క అభిప్రాయం తెలుస్తుందని అలా వెళ్ళాలని చెప్తారు అలాగే న్యాయం అనేది అందరికి ఒకటే సామాన్యుడైనా, గొప్పవాడైనా ఎవరైనా సరే తన వాడైనా, పరవాడైనా అందరికి ఒక్కటే అదే ప్రకారంగా రాజైనటువంటి వాడు కేవలం ప్రజల యొక్క మేలు ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకోవడం కాకుండా ప్రజలందరికి కూడా ఏది ఉపయోగపడుతుందో దానిని తనకు కష్టమైనా నష్టమైనా దానిని కూడా ఆచరించాలి. అనేటటువంటి విషయాన్ని అక్కడ చెప్పారు. ఇలా అనేకమైనటువంటి విషయాలు ఉన్నాయి. శత్రువుమీద ఏమైనా యుద్ధం చేయవలసిన పరిస్థితి వస్తే శత్రువునకు ఉన్నటువంటి బలం ఏమిటో బలహీనత ఏమిటో తన బలం ఏమిటో బలహీనత ఏమిటో ఈ రెండు తెలుసుకున్న తర్వాతనే శత్రువుతో యుద్ధానికి సిద్ధం కావాలి. అలాగే యుద్ధం కనుక తప్పనిసరి అయినప్పుడు సామ దాన భేద దండోపాయాలను ప్రయోగించాలి. సామంగా చెప్పాలి తర్వాత అతనికి ఏదైనా ఆశ కలిగి ఉన్నట్లయితే దానిని ఇచ్చి ఈ యుద్ధం తప్పించాలి. లేదా అవతలి వారితో భేదం కలిగించి వారిని బలహీనులకు చేయాలి. ఏది సాధ్యం కాకపోతే దండోపాయం ఇలా అనేక ధర్మాలు రాజుకు చెప్పబడ్డాయి. భీష్ముడు చెప్పిన రాజ ధర్మాలు ఏనాటికైనా ఆచరించదగినవే కాకపోతే కాలాన్ని బట్టి వాటన్నింటిని ఊహించుకోవడానికి వీలులేనంత గా పరిస్థితికి వచ్చాము.

### 6. రాజ్య పరిపాలనలో గూఢచారుల ప్రాముఖ్యం ఎటువంటిది?

త్రేతా యుగంలో రాముడు కూడా గూఢచారులను పెట్టుకున్నాడు గూఢచారులు ఎలాంటి వారై ఉండాలా అనే విషయం కూడా రాజు యొక్క విజ్ఞత మీదనే ఆధారపడి ఉంటుంది. గూఢచారి అయినటువంటి వాడు ఖచ్చితంగా ఎవరు ఎలా మాట్లాడుతున్నారో ఎవరు ప్రభుత్వం వలన బాధపడుతున్నారో ఎవరు ప్రభుత్వం వలన సుఖపడుతున్నారో ఎవరు ఏమనుకుంటున్నారో పరిపాలన గురించి ఏమనుకుంటున్నారో ఆ రాజు ను గురించి ఏమనుకుంటున్నారో ఈ విషయాన్ని కూడా చక్కగా సేకరించి రాజుకు చెప్పాలి వాళ్ళే గూఢచారులు. గూఢచారులకు స్వంత అభిప్రాయాలు ఉండకూడదు. కేవలం ఇక్కడున్న విషయం అక్కడకు చేరవేయడం మాత్రమే చేయాలి. అలాంటిది కలియుగంలో కూడా ఈ రోజుల్లో కూడా రాజులైనవారు గూఢచారులను పెట్టుకునేవారు అలాగే కొంత మంది రాజులో మారు

వేషంలో తిరిగి ప్రజలు మన పరిపాలన గురించి రాజును గురించి ఏమనుకుంటున్నారా అని ప్రయత్నం చేసేవారు.ఈనాడు బ్యూరో అలా కొన్ని పేర్లతోటి ఉన్నాయి ఇవన్నీ కూడా ఎలా పనిచేస్తున్నాయి అనేటటువంటిది మనం జాగ్రత్తగా ఆలోచించాలి. ఆ కాలంలో పనిచేస్తున్నట్లు పనిచేయడంలేదు స్వతంత్రంగా కొన్ని ఆలోచనలు వ్యవహారాలు ఉన్నాయి. ఆ తరువాత ప్రభుత్వానికి అనుకూలంగా ప్రవర్తిస్తే వారికి అనుకూలంగా ఏమైనా మేలు జరుగుతుందని ప్రవర్తిస్తున్నారు ఇలా కాకుండా నిజంగా గూఢచారులు గూఢచారులుగా ఉంటే ప్రజలు ఏమనుకుంటున్నారో తెలియజేస్తే రాజుకు చాలా సులువుగా ఉంటుంది. పరిపాలన సక్రమంగా చేయడానికి ఈ రోజుల్లో పరిపాలన ఎలా చేయాలి ప్రజలకు ఎలా సుఖాన్ని కలిగించాలి అని కాకుండా ఎన్నికల్లో ఎలా గెలవాలి గెలవాలంటే ఏమి చేయాలి అనే ఆలోచనతో ఉన్నారు. దేశాన్ని,రాష్ట్రాన్ని చక్కగా పరిపాలించడం కాదు ఎన్నికల్లో ఎలా గెలవాలి అది ఏ రకంగా సాధ్యమవుతుంది. దానికి మనం ఎవరెవరిని పెట్టుకోవాలి. ఎవరెవరిని ఏర్పాటు చేసుకోవాలి. అనేటటువంటి స్థితికి దిగజారి పోయింది కాబట్టి ఈనాడు మాత్రం దానికి ప్రాధాన్యత లేదు మహాభారతంలో , రామాయణంలో కూడా ప్రాధాన్యత ఉంది, గూఢచారుల మాటలు విని గూఢచారులు చెప్పేటటువంటి సమాచారం మీద ఆధార పడి రాజులు తమ తప్పులను సరిచేసుకునే వారు

7. **రాయబారాలు జరగక ముందే యుద్ధానికి సైన్యం సమకూర్చుకున్నారు కదా మరలా రాయబారాలు జరపవలసిన అవసరం ఏమిటి? ఇందులో ఏమైనా అంతరార్థం ఉందా?**

   చాలా మందికి తెలియని విషయం ఏమిటంటే ఆ కాలంలో ఏ పార్టి వారు ఆ పార్టి వైపు పోతారు. పాండవులకు అనుకూలంగా ఉండేవారు మిత్రులు ,బంధువులు పాండవుల వైపు కౌరవులకు అనుకూలంగా ఉండేవారు వాళ్ళ బంధువులు వారి మిత్రులు వారి వైపుకు పోతారు. కాని అటు ఇటు కాకుండా తటస్థులు రాజులు ఉంటారు వారు ఏమి చేస్తారంటే వారు ముందుగా ఎవరిని రమ్మంటే వారి వైపుకు వెళ్ళాలి అనే నియమం పెట్టుకుని ఉంటారు. వాళ్లు వీళ్ళని, ధర్మం అధర్మం అని లేదు. ఎవరు ముందు గెలిస్తే వారి దగ్గరకు వెళ్తుంటారు. అందుకని ముందుగానే ఇలా రాజుల దగ్గరకు సహాయం కోరి వెళ్ళడం జరుగుతుంది. ఇంకో విషయం ఏమిటంటే ఎందుకు వెళ్తున్నారంటే రాయబారం అయిపోయిన తర్వాత యుద్ధానికి రోజులే ఉంటాయి అంటే ఏడు రోజులో ఎనిమిది రోజులో అలా ఉంటుంది సమయం ఈ పది పదిహైను రోజుల్లో ఎక్కడెక్కడో ఏ దేశంలో ఉన్నవారో వెంటనే రావాలంటే చాలా కష్టం పైగా గుఱ్ఱాలైతే పరుగులు తీసుకుంటూ వస్తాయి కాని ఏనుగులు మాత్రం అలా వచ్చేవి కావు ఆ ఏనుగులు నడుచుకుంటూ రావాలి అలా రావాలంటే నెలలు నెలలు కూడా పడుతుంది. ఇప్పుడు మనకు కాంధహార్ ఇప్పుడు ఆఫ్ఘనిస్తాన్ ఇది ఎవరిది శకునిది మరి

అక్కడనుండి ఇక్కడకు రావాలంటే ఎంత దూరం ఉంది. అక్కడ నుండి కురుక్షేత్రానికి రావాలి అలాగే టిబెట్ , చైనా, బర్మా, ఫిలోన్ ఇంకా చాలా దేశాలు కూడా ఆ రోజుల్లో ఉన్నటువంటి దేశాలు యుద్ధంలో పాల్గోన్నాయి. అంటే మహాభారత యుద్ధం ప్రపంచ యుద్ధం అంతేగాని పాండవులు, కౌరవులు కొట్టుకునే యుద్ధం కాదు ప్రపంచంలో ఉన్నటువంటి అందరు కూడా దీనిలో పాల్గొన్నారు. ఇద్దరు తప్ప ఆ ఇద్దరే బలరాముడు , రుక్మి వాళ్ళిద్దరు తప్ప మిగతావారంతా యుద్ధంలో పాల్గొన్నవారు. కాబట్టి ఎక్కడో కొన్ని వేల మైళ్ల దూరంలో ఉన్నటువంటి వారు వాళ్ళ యొక్క సేన రావాలంటే ఏనుగులు కాని, రథాలు కాని రావాలంటే చాలా సమయం పడుతుంది.అందుకని ముందుగానే సమకూర్చుకోవాలి. అలా సమకూర్చుకోకుండా చూద్దాం లే యుద్ధం ఎప్పుడో జరుగుతుందిలే అనుకుంటే ఆ యుద్ధం నిర్ణయం అయ్యేటప్పటికి ఏ సేనా కూడా ఇక్కడకు రాదు. కాబట్టి ముందుగానే అందర్ని పిలుచుకోవడం జరుగుతుంది. అయితే ముందుగా అందర్ని పిలుచుకున్నప్పటికి కూడా యుద్ధం అనేటటువంటిది ఆపడానికి ప్రయత్నాలు చేయవచ్చు ఎందుకని అంటే సామ దాన భేద దండోపాయాలనేవి ఉన్నాయి ఈ నాలుగు ఉపాయాలు ద్వారా యుద్ధం జరగకుండా జన నష్టం జరగకుండా చూసే అవకాశం ఉంటుంది. శ్రీకృష్ణుడే చెప్పాడు. నేటికి ఏడు వ రోజున అమావాస్య ఆ రోజే కురుక్షేత్రంలో యుద్ధం ప్రారంభమవుతుంది. అని అంటే శ్రీకృష్ణుడు రాయబారానికి వచ్చిన తరువాత ఏడు రోజులకు నిజంగా తిథి ఏమిటంటే వచ్చే అమావాస్య కాదు త్రయోదశి, చతుర్దశి , అమావాస్య మూడు కలిసినటువంటిది. ఈ రోజు ఎలాంటిది అంటే పూర్తిగా జనక్షయం జరిగేటటువంటిది. ఆ విషయం చెప్పి వెళ్ళాడు శ్రీకృష్ణుడు అందువల్ల రాజ్యానికి సంబంధించినటువంటి యుద్ధ తంత్రాల గురించి ముందుగానే ప్రణాళిక వేసుకోవాలి. యుద్ధం జరిగిందా ఉపయోగపడుతుంది.ఒక వేళ జరగలేదా అందరూ ఆనందంతో తిరిగి వెళతారు. ఈ ఉద్దేశం తోటి అందరిని సమకూర్చుకుంటారు. ఇందులో దుర్యోధనుడికి ఏ సందేహం లేదు యుద్ధం జరగాల్సిందే యుద్ధంలో ఏ విధమైనటువంటి మినహాయింపు లేదు వారు ఏమి చేసినా ఎన్ని రాయబారులును పంపినా సూది మొన మోపినంత స్థలం కూడా ఇచ్చేపని లేదు యుద్ధం జరగాలి అని నిశ్చయించుకున్నటువంటి వాడు. దుర్యోధనుని యొక్క ఆలోచనా విధానం తెలిసినటువంటి వారు పాండవులు శ్రీకృష్ణుడు అందరూ కూడా కాబట్టి వారు కూడా యుద్ధం ఎలాగో జరుగుతుంది కదా అని ముందుగానే ఏర్పాట్లు చేసుకున్నారు. వారికేమో ఏడు అక్షౌహిణులు చేరాయి. దుర్యోధనునికి పదకొండు అక్షౌహిణులు చేరాయి. ముందుగానే ఎందుకు ఏర్పాట్లు చేసుకున్నారు ఇది కారణం.

8. శ్రీకృష్ణుడు నిజంగా రాయబారాన్ని చేసాడా లేక యుద్ధానికి ప్రేరేపించాడా? అనే విషయాన్ని వివరణాత్మకంగా తెలియజేయగలరు?

రాయబారం అని అంటే సాధారణంగా ఎప్పుడైనా సరే పంపించేవారి యొక్క ఉద్దేశాన్ని బట్టి ఉంటుంది. భారతంలో ఖచ్చితంగా భవిష్యత్తులో ఎవరూ కూడా ఆయనను వేలు పెట్టి చూపించడానికి వీలు లేని విధంగా ఉండడం కోసమే మాట్లాడాడు. సంధి కోసమే ప్రయత్నం చేసాడు కుదరకపోతే దండానికి సిద్ధపడేటట్లు చేసాడు. ఇది నూటికి నూరు పాళ్లు సరైనటువంటిది.

మొట్ట మొదట ద్రుపద పురోహితుడు వచ్చాడు. ద్రుపద పురోహితుడు పంపించేటప్పుడు పాండవులు కాని శ్రీకృష్ణుడు కాని బంధువులు కాని ఏమి చెప్పి పంపించాడు. మీరు ఏ నియమం అయితే పెట్టుకున్నారో జూదమాడేటప్పుడు ఆ నియమం ప్రకారం పన్నెండు సంవత్సరాలు అరణ్య వాసం, ఒక సంవత్సరం అజ్ఞాత వాసం చేసి వచ్చారు కాబట్టి వాళ్ళ రాజ్యం వారికి ఇవ్వాలి అని ఆరోజు అనుకున్నారు.వారి రాజ్యం వారికివ్వడం ధర్మం అని ఉన్నది ఉన్నట్టు చెప్పాడు అయితే మాటల్లో సౌమ్యత లేదు కాని చెప్పిన విషయం మాత్రం నిజమైన విషయం. అప్పుడు కర్ణుడు, భీష్ముడు మధ్య వాదోపవాదాలు వస్తూ ఉంటే అయ్యా నేను సంజయుని పంపిస్తానని ద్రుపద పురోహితుని సత్కరించి పంపించారు. సంజయుడికి ఏమి చెప్పి పంపించాడు రాజ్యం ఇచ్చేది లేదు నువ్వు మాత్రం యుద్ధం చేయవద్దు మరి మేము ఎలా బ్రతకాలంటే అడుక్కుని బ్రతకండని చెప్తాడు. అయితే వారికి ఈ మాటలు ఇలా చెప్పకుండా ఎంతో మెత్తగా సౌమ్యంగా చెప్పమన్నాడు. అప్పుడు శ్రీకృష్ణుడు సంజయా ఇదంతా ఎందుకు నేనే వస్తున్నాను పదా అన్నాడు. శ్రీకృష్ణుడు వెళ్ళేటప్పుడు అందరి అభిప్రాయాలు చెప్పారు ఏదో ఒక రకంగా సంధి జరపమని ధర్మరాజు అన్నాడు. భీముడు కూడా అలాగే అనగానే శ్రీకృష్ణుడు ఏమయ్యా నీకేమైనా పౌరుషం తగ్గిందా అని ఎత్తి పొడిచాడు. అనగానే కోపంతో లేచాడు అర్జునుడు అన్నగారు చెప్పినట్లే అన్నాడు. నకులుడు అలాగే అన్నాడు సహదేవుడు మాత్రం యుద్ధం జరగాల్సిందే అన్నాడు. ద్రౌపది  యుద్ధం జరగాలి అనే తెలియజేసింది. నువ్వు అక్కడకు పోయిన తరువాత నేను విడిచి పెట్టిన ఈ జుట్టు ముడిని గుర్తుపెట్టుకో ఖచ్చితంగా యుద్ధం జరిగి తీరవలసిందే . ఇది జరిగింది కాని రాయబారి ఎప్పుడూ సౌమ్యంగా ఉండాలి వారి కున్న కోపం రాయబారికి ఉండకూడదు. అలా రాయబార లక్షణాలన్నీ పునికి పుచ్చుకుని సామ దానభేద దండోపాయాలున్నాయి ముందు సామ్యంగా చెప్పాలి కనుక సామంగా చెప్పాడు అయ్యా ధృతరాష్ట్ర మహారాజా వీళ్ళు కొడుకులే వారు కొడుకులే వారు వీరు అందరూ బాగుండాలా , మరి నీ ఎదురుగా జరిగినటువంటి ఆటలో జూదంలో ఏమైతే జరిపించాలో ఆ ప్రకారంగా జరిపించవలసిన ధర్మం నీకుంది కాబట్టి అలాగ జరిపించు అప్పుడు అందరూ కూడా నీ చెప్పు చేతల్లో ఉంటారు  మీరు మీ వంశం

బాగా అందరిలో  పేరు ప్రతిష్ఠలతో ఉంటుందని చెప్పారు. చెప్తే ఆ మాటలు దుర్యోధనాదులకు నచ్చలేదు, ధృతరాష్ట్రుడికి నచ్చక పోయినా ఏమి తెలియనట్లు ఉంటాడు. సరే ఇక లాభం లేదనుకని దానోపాయాన్ని ప్రయోగిస్తూ ఈ రాజ్యం పదమూడేళ్లు అనుభవించారు కాబట్టి ఆశ పుట్టి ఉండవచ్చు రాజ్యం  మొత్తం మీరే ఉంచుకోండి కాని పాండవులను పోషించవలసిన బాధ్యత మీ మీద ఉంది కదా కాబట్టి వారి పోషణ కోసం ఐదు ఊళ్ళు ఇవ్వండి కుశస్థలం,వృక స్థలం, మాకంది, వారణావతం, ఐదవది మీకు ఇష్టం వచ్చినది ఇవ్వండి దానితో వారు జీవిస్తారు రాజ్యం మొత్తం మీరే ఉంచుకోండని చెప్పాడు .చెప్తే ఐదు ఊళ్ళు కాదు కదా సంధి కుదరలేదు. యుద్ధం జరిగితే సర్వనాశనం జరుగుతుందని చెప్పేసి వారు కట్టడానికి వస్తే శ్రీకృష్ణుడు విశ్వ రూపం చూపించి వచ్చేసాడు. ఈయన సాగనంపడం కోసం భీష్మ ద్రోణాది వృద్ధులు ఈ కురు వీరులు ఆయన వెనుకాలే వచ్చి వీడ్కోలు చెప్పారు. కొంత దూరం వెళ్ళిన తరువాత అందరిని విడిచి కర్ణుణ్ణి తన రథం పైకి తీసుకుని వెళ్ళాడు. అక్కడకు పోయిన తరువాత చెప్పాడు. ఓ కర్ణా నువ్వు కుంతి దేవి కొడుకువు సూర్యుని వర ప్రసాదమున పుట్టావు జరిగిన విషయం అంతా చెప్పి నువ్వు పాండుపుత్రునివి నువ్వు ఇటు పక్కకు కాని వస్తే నీకు రాజ్యం ఇస్తారు. రాజ్యం ఇస్తే ధర్మరాజు నీకు యువరాజు అవుతాడు. భీముడు  నీకు ఛత్రం పడుతాడు. నకుల సహదేవులు నీ పాదాలు కడుగుతాడు. మేము అంతా నీకు మాతృ పక్షంలో ఉంటాము వారు పితృపక్షంలో ఉంటారు  నీ రాజ్యాన్ని నువ్వు హాయిగా పరిపాలన చేసుకోవచ్చు అంటే నేను రాను దుర్యోధనుడు నన్ను చూసి యుద్దానికి సిద్ధపడుతున్నాడు. ఇలాంటి సమయంలో నేను మోసం చేసి పక్కకు కనుక నా వాళ్ళని వస్తే అది నాకు చాలా తక్కువ అవుతుంది. దుర్యోధనుని మోసం చేయను నేను రాను రావటం ధర్మం కాదు శ్రీకృష్ణుడు అన్నాడు నువ్వు గెలుస్తావని ఆశ పడుతున్నావేమో మీర ఖచ్చితంగా ఓటమి ఖాయం అని చెప్తే కృష్ణా ఇంకా ఎందుకయ్యా నను మభ్య పెడతావు ఖచ్చితంగా గెలిచేది పాండవులే మేము అంతా శిథిలమై పోతాము అంతే కాదు నువ్వు చెప్పినట్టు పాండవులు వింటారు వారు కనుక నాకు రాజ్యం ఇస్తే నేను దుర్యోధనునికి ఆ రాజ్యం ఇస్తాను దుర్యోధనుని వంటి వాడు ఈ రాజ్యానికి పాలకుడు కాకూడదు ధర్మరాజే ఈ రాజ్యానికి శాస్వతంగా ప్రభువు కావాలని శ్రీకృష్ణుడితో చెప్పి కృష్ణా ఒక్కసారి నిన్ను ఆలింగనం చేసుకుంటాను ఇది నా చివరి కోరిక సరే ఆలింగనం చేసుకోమన్నాడు

09. **ధర్మానికి , ధర్మసూక్ష్మానికి వ్యత్యాసం తెలుపగలరు?**

ధర్మం తెలిసినవాళ్లు సాధారణంగా చెప్పడానికే వీలవుతుంది. ధర్మసూక్ష్మం అంటే ఎంతో సూక్ష్మమైనటువంటి ధర్మాన్ని గుర్తించగలగాలి. అది చాలా కష్టం అందుకని దానిని ధర్మసూక్ష్మం అంటాము. మనం వాడే అన్ని పదాలకి ధర్మ సూక్ష్మం అని వాడవచ్చు. భారతంలో ధర్మసూక్ష్మాలు, ధర్మ సందేహాలు చెప్తూ ఉంటారు. అయితే ధర్మం అంటే ఇది అని ఖచ్చితంగా చెప్పడానికి వీలయ్యేది ధర్మసూక్ష్మం అంటే దానిలో ఇంకేదో రహస్యం ఉంటుంది. దానిని చెప్పగలగాలి.

## 3. ప్రాచార్య శలాక రఘు నాథ శర్మ– ముఖాముఖి( 25-12-2022):

(సంస్కృతాంధ్ర పండితుడు, పురాణ ప్రవచన కర్త)

(వీరిని ఫోన్ ద్వారా సంప్రదించి ముఖాముఖి కావాలని అడిగాను వారు ఆ సమయంలో హైదరాబాద్ లో తన కూతురు ఇంట్లో ఉన్నారు. ఆ సమయంలో వారు ముఖాముఖి ఇవ్వడానికి అంగీకరించారు. నేను వారి ఇంటికి వెళ్లి గంటకు పైగా ముఖాముఖిని నిర్వహించాను).

1. **శ్రీకృష్ణుడిని మహాభారతానికి నాయకుడుగా ప్రధాన సూత్రధారిగా పేర్కొనవచ్చా?**

అది సరియైనదే భారతంలో నాయకుడు ధర్మరాజు , నాయక నాయకుడు శ్రీకృష్ణుడు అయితే అటువంటి స్థితి తక్కిన వాటిలో ఉండరు. నాయకుడే ఉంటాడు. కాని ఇక్కడ నాయకుడినే నడిపించేటటువంటి వాడిగా శ్రీకృష్ణున్ని నిబంధించడం భారతంలో గొప్పవిషయం కాబట్టి ఆయన నాయక నాయకుడు.

2. **మహాభారత వైశిష్ట్యాన్ని సమాజానికి విస్తరింపజేసే మార్గాలు ఏవి?**

మహాభారతాన్ని గురించి ముఖ్యంగా కీలకమైన అంశాలు ఉన్నాయి. మహాభారతం శాస్త్రేతేహాసం అంటారు. శాస్త్రం అంటే శాసించి చెప్పేది. మనిషికి ఈ పని చేయవచ్చు చేయకూడదు అనే దాన్ని స్పష్టంగా చేప్పేటటువంటి గ్రంథాన్ని శాస్త్రం అంటారు. ధర్మ శాస్త్రం, రాజనీతి శాస్త్రం , నీతి శాస్త్రం ఇలాగా అంశాలన్నీ ఉన్నాయి.ముఖ్యంగా భారతం అనేది వేదంలాంటిది అన్నారు గనుక. వేదములో ప్రధానంగా భగవంతుడు, దైవము, మొదలైన అంశాలు ప్రధానంగా ఉండితీరుతాయి. అవి అధ్యాత్మ విద్య కూడా అవుతుంది. వేదాంత శాస్త్రం అందుచేత మొత్తం అటువంటి గ్రంథ భాగాలు తొమ్మిది. మహాభారత అవతారికలు, పుస్తకాలు ఇవన్నీ మహాభారతం ప్రణవం అనే పేరుతో మహాభారతం తొమ్మిది పుస్తకాలు వచ్చాయి, మొదటిది అవతారిక, రెండవది యక్షప్రశ్నలు, మూడవది విదుర నీతి నాల్గవది సనత్సుజాతీయం, ఐదు భగవద్గీత, ఆరు భీష్మ స్తవ రాజం, ఏడు శివ సహస్ర నామం, ఎనిమిది విష్ణు సహస్ర నామం తొమ్మిది అనుగీత ఈ తొమ్మిది పుస్తకాలు విడిగా ముద్రితమయ్యాయి భారతం చాలా పెద్దది కనుక లక్ష 20 శ్లోకాలు అంటారు. అంత పుస్తకంలో సారంగా అంటే గుండెకాయ లాంటిది గా వీటిని చెప్పవచ్చు ఇలాంటి వి అధ్యయనం చేయడం వలన వాటి పరమార్థాన్ని లోకానికి వ్యాప్తి చేయడం అనేది చాలా ముఖ్యం అంటే శక్తి లేనివారికి ఇంత పెద్ద బరువు మోయ లేను అనుకునే వారికి ఈ పుస్తకాలు చదవాలి. చదవడం వలన మహాభారత వైశిష్ట్యం తెలుస్తుంది.

3. మహాభారత కాలం నాటి రాజకీయ వ్యవస్థకు నేటి రాజకీయ వ్యవస్థకు మధ్య భేదాలు ఏమిటి?

ఆనాటి కాలం నాటికి నేటి కాలానికి ఎటువంటి సంబంధం లేదు ఇప్పుడుండేటటువంటి రాజకీయ వ్యవస్థ అనేది పాత కాలంలో ఉండే రాజకీయ వ్యవస్థకు పోలికలే లేవు. ముఖ్యంగా ప్రజాస్వామ్యం అనేటటువంటి ఆదర్శప్రాయంగా చూడటానికి బాగానే ఉంటుంది కాని ఆచరణలో ఏ విధమైన పని సాధించాలన్నా అవరోధాలు ఎక్కువైపోయేటటువంటి అవసరం ఉంది. పాత కాలంలో ఏకస్వామ్యం ఉన్నప్పుడు అతడు ప్రజలందరికి సంక్షేపాన్ని కూర్చడానికి అవరోధాలుంటే వాటిని నిర్లక్ష్యంగా కోసి పారేసేటటువంటి పరిస్థితి వచ్చేది ఇప్పుడు ఆ పరిస్థితి లేదు కాబట్టి ఆ కాలం నాటి రాజకీయ వ్యవస్థకు ఏ సంబంధం లేదు. కాల ప్రవాహంలో వచ్చేటటువంటి ఒక ప్రళయం లాంటి స్థితి పరిపాలనకు సంబంధించి ఒక ప్రళయకాలాన్ని చూస్తున్నాం.

4. **కుంటుపడుతున్న నేటి పరిపాలన విధానానికి మహాభారతం ఇచ్చే సందేశం ఏమిటి?**

భారతంలో రాజనీతి, రాజ వ్యవహారం అనేది  చాలా విస్పష్టంగా ఎలా ఉండాలో చెప్పారు సభా పర్వంలో నారదుడు ధర్మరాజును కొన్ని ప్రశ్నలు అడిగాడు. ఒక సందర్భంగా వచ్చి కుశలు ప్రశ్నలు అడిగాడు, ఆ కుశల ప్రశ్నలలాగా ఇట్లా ఏలుతున్నావా, ఇలా పరిపాలిస్తున్నావా. ఒక సుదీర్ఘమైనటువంటి ప్రశ్నలు అడుగుతాడు. ధర్మరాజును అదంతా రాజనీతే. ఎట్లా ప్రవర్తించాలి., పరోక్షంగా చెప్పడం ఏమిటంటే రాజ్య పరిపాలన అంటే ప్రజలకు  ఈ సూత్రాలు పాటించాలని చెప్పడమే. ప్రశ్నలు అడిగినట్లు ఉంటుంది కాని రాజు అనే వాడు ఇలా ఉండాలని పరోక్షంగా చెప్పడం గా కనబడుతుంది. అందులో తెలుగు భారతంలో

కం. అనఘుల శాస్త్ర విధిజ్ఞుల , ననురక్తులఁ
బితృపితామహక్రమమున వ
చ్చిన విప్రుల మంత్రుల, గా నొనరించితె
కార్య సంప్రయోగము పొంటెన్,

అని ఒక ప్రశ్న ఉంది అందులో మంత్రి అనే వాడు ఎలా ఉండాలి. ఇప్పుడు ఒక ఉద్యోగానికి అర్హత (క్వాలిఫికేషన్) ఏమిటి అని అడుగుతున్నావు. అనుభవం ఏమిటని అడుగుతున్నావు మరి పాలకులకు అవసరం లేదా పది మంది ఎన్నుకుంటే వారు మంత్రిగా ఉంటున్నారు. ఉద్యోగానికి ఒక టీచర్ పోస్ట్ కి ఎం.ఎ చదివావా, బి.ఎ చదివావా, specialization ఏమిటి? దాని గురించి మీ అభిప్రాయం ఏమిటి అని ఇంటర్వ్యూని చేస్తున్నారు కదా పాలకులకు ఇటువంటి అర్హతలతో పనిలేదు. అందుకనే మంత్రి అనే వాడు ఎటువంటి వాడు అవ్వాలి నారదుడు ధర్మరాజు కు చెప్పినట్టుగా లోకానికి చెప్పారు. వ్యాసుల వారు

మొట్టమొదటిగా ఏ పాపము ఎరుగని వాడు మంత్రి కావాలి, అనఘుడు, పరిపాలనకు సంబంధించిన శాస్త్రాలు ఉన్నాయి రాజనీతి శాస్త్రాలు అవన్నీ క్షుణ్ణంగా తెలుసుకున్నటువంటి వాడు , శాస్త్ర విధిజ్ఞ శాస్త్రములు తెలిసినవాడు, అనురక్తుడు , రాజునందు చాలా ప్రీతి భావన కలిగిన వాడు. రాజును ఎప్పుడూ త్రోసి పారేద్దామా అనే ఆలోచన ఉండకూడదు. శ్రీకృష్ణ దేవరాయలకు తిమ్మరుసుకు ఉండే సంబంధం, అంటే కంటి రెప్పలాగా కృష్ణ దేవరాయలను కాపాడాడు. ఆ రకంగా అనురక్తుల పితృపితా మహుల క్రమమున వచ్చిన పితామహుల అంటే ఇవాళ మంత్రి అతని తండ్రి మంత్రి అయిఉండాలి. వాడి తండ్రి మంత్రి అయి ఉండాలి. అలా వంశపారంపర్యం వస్తే అప్పుడు ఆ మంత్రికి ఉండవలసిన మంచి లక్షణాలు రక్త నిష్ఠంగా ఉంటాయి. వారు విప్రులు కావాలి అన్నారు విప్రులు అంటే మామూలుగా బ్రాహ్మణులు అని అర్థం కాదు విప్రులు అంటే విద్య సంపన్నులు అంటే వేదాంత విద్య వేదాంత విద్యలో ఏమి వస్తుందంటే మోసం చేయాలి , స్వార్థం నింపుకోవాలి అని ఉండదు. త్యాగ శీలము అనే లక్షణము ఉంటుంది. అటువంటి త్యాగ శీలమైన లక్షణం కలిగిన వాడు విద్య కలిగిన వాడు మంత్రి కావాలి అంటారు. చిన్ని నా పొట్టకు శ్రీ రామరక్ష అంటూ పొట్ట పెంచుకోవడానికి ఇంట్లో వాళ్ళను పెంచుకోవడానికి అనేటటువంటి భావన ఉన్నవారిని మంత్రిగా చేయొద్దు అన్నారు.

అనఘుల శాస్త్ర విధిజ్ఞుల , ననురక్తులఁ

బితృపితామహక్రమమున వ

చ్చిన విప్రుల మంత్రుల, గా నొనరించితె ....'' ఇలాంటి వారందరిని మంత్రులుగా చేసావా ఈ లక్షణాలన్నీ ఉండాలి. ధర్మరాజు నేను అలాగే చేసానని సమాధానం చెప్పాడు. అది రాజనీతి.

05. **రాజుకు ఉండవలసిన ప్రధాన లక్షణాలు, నియమాలు ఏమిటి?**

రాజుకు ఉండవలసిన లక్షణాలు ప్రధాన ధర్మాలు అని శాంతి పర్వంలో చాలా సుదీర్ఘంగా చెప్పారు. శాంతి పర్వం మూడు భాగాలు, రాజధర్మ పర్వం, ఆపద్ధర్మ పర్వం, మోక్ష ధర్మ పర్వం అని రాజైనటువంటి వాడు ప్రజలందరికి నడిపించేవాడు కనుక రాజు నీతి, మంత్రులు, స్వార్థ రాహిత్యం ఉన్నటువంటి వారు, తండ్రి లాగా పిల్లలను యొక్క యోగ క్షేమాన్ని కాంక్షించేవాడు మొదలైన లక్షణాలన్నీ ఉండాలని అతి విస్తృతంగా భారతంలో చాలా చోట్ల చెప్పారు. భీష్ముడు శంతనుడు ఒకసారి రాజ ధర్మానికి విరుద్ధంగా తన ధర్మాన్ని వ్యక్తి ధర్మం మీద దృష్టి పెడితే కొడుకు తండ్రిని సుకుమారంగా దారిలో పెట్టడానికి ప్రయత్నం చేసాడు.

**చం. భవదభిరక్షిత క్షాతికి బాధ యొనర్పఁగ నోపునట్టి శా**

**త్రవ నివహంబు లేదు వసుధాప్రజకెల్ల ననంత సంతతో**

**త్సవముల రాజులెల్ల ననిశంబు విధేయుల నీకు నిట్లు మా**

**నవ వృషభేంద్ర యేలకొ మనఃపరితాపముఁ బొందియుండఁగన్**

అతను శంతనుడు రాజకార్యాలు మానేసి మనో వ్యాధితో కుమిలిపోతూ ఒక మూల కూర్చున్నాడు. కారణం ఏమటంటే పెళ్ళి చేసుకుందాం అనుకున్నాడు రాజు అనేటటువంటి వాడు పెళ్ళి చేసుకోవడం అనేది ధర్మ విరుద్ధమైన విషయం అయితే కాదు కాని ఆకోరిక ఉండడం వల్ల దుఃఖపడుతున్నాడు. దుఃఖపడుతుంటే రాజధర్మం చక్కగా తెలిసినటువంటి భీష్ముడు నువ్వు దుఃఖ పడుతున్నావు అని దుఃఖపడవలసిన పని రాజుగా ఏమి లేవు కదా అని ప్రశ్న వేస్తాడు. రాజు దుఃఖ పడితే రాజ్యానికి ఏదైన ప్రమాదం వస్తే, ప్రజలకు ఏమన్నా కష్ట నష్టాలు వస్తే మరి పండగలు సరిగ్గా నిర్వహించుకోలేకపోతే ప్రజలను దృష్టిలో పెట్టుకుని వారికి ఇబ్బంది వచ్చినప్పుడు తప్ప రాజనేవాడు స్వ విషయంగా దుఃఖపడకూడదు అనేటటువంటిది పరోక్షంగా బోధించాడు. అది పాత కాలపు రాజ్య వ్యవస్థ .

06. **రాయబారానికి ఉండవలసిన ప్రధాన లక్షణాలు ?**

రాయాబారికి దౌత్యం, రాజనీతి దూత ఎలా ఉండాలో ద్రుపద పురోహితుడు , సంజయుడు, కృష్ణుడు, ఉలూకుడు అని నాలుగు రాయబారాలు జరిగినాయి. అక్కడ రాయబారికి ఉండవలసిన లక్షణాలన్నీ చెప్పారు. కృష్ణ రాయబారం ఉంది ధర్మరాజు వాళ్లు తమ తమ అభిప్రాయాలు చెప్పారు. ఇందులో ఒక మాట

సుతుడై వినయంబు సేకొనక యేచొప్పున్ దగం జెప్ప కా
ధృతరాష్ట్రుం దవినీతిఁ జేసినను సంధింపంగ రాదంచు వే
గ తెగంబాఱకు తెంపుసేయునెడ లోకంబెల్ల మెచ్చం బ్రకా
శిత ధర్మ స్థితి నొంది మా మనము నిశ్చింతంబుగాఁజేయుమీ

రాయబారి అనేటటువంటి వారు రాజు హృదయాన్ని సంపూర్ణంగా ఆకళింపుచేసుకుని అవసరమొస్తే కొన్ని స్వతంత్రమైన నిర్ణయాలు ప్రతిపాదించి ఆ నిర్ణయము తన రాజుకి ఏ విధమైన మర్యాద భంగం రాకుండా చూడవలసినటువంటి పరిస్థితి ఉంది. గూఢచారులు ఎలా ఉండాలనేది భారతంలో చాలా చోట్ల ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ ఉన్నది..

07. **రాయబారాలు జరగక ముందే యుద్ధానికి సైన్యాన్ని సమకూర్చుకున్నారు కదా మరలా రాయబారాలు జరపవలసిన అవసరం ఏమిటి? ఇందులో ఏమైనా అంతరార్థం ఉందా?**

ఇప్పుడు ఉద్యోగం అంటే ప్రిపరేషన్, సైన్య సమీకరణ అయ్యింది. సైన్య సమీకరణతో పాటు సైమంటేనియస్ గా సంధి ప్రయత్నాలు కూడా జరిగాయి. సంధి ప్రయత్నాలు అన్నీ విఫలమైపోయిన తరువాత సైన్యాన్ని సమీకరించుకోవడం అనేటటువంటిది. చాలా సమయం, కావలసివస్తుంది. దాని దారి దానిదే . ఒక చోట అంటారు ప్రతి దేశము సైన్య సంపదను బాగా ప్రోత్సహిస్తుంది. యుద్ధమే రాకపోవచ్చు

ఒక కాలంలో ఒక వంద సంవత్సరాలలో ఏ యుద్ధము రాకపోవచ్చు కాని యుద్ధం వస్తుందా లేదా అనేటటువంటి దానికి సంబంధం లేకుండా వచ్చినప్పుడు పనికి రావడానికి సైన్యం ఎప్పుడూ సిద్ధంగా నే ఉంటుంది. సైన్య సమీకరణ చేసాము కనుక సంధి ప్రయత్నాలు చేయకూడదు అనేమి లేదు సంధి ప్రయత్నాలు చేస్తాం. సంధి సఫలమైతే సైన్యం ముందుకు వెళ్ళకుండా ఉంటుంది. సంధి కాకపోతే వచ్చేస్తారు అందుకే చెప్పాడు కృష్ణుడు

వారలు శాంత శూరులు భవచ్చరణంబులు గొల్వఁబూని యు
న్నారటు గాక మీకది మనంబున కప్రియమేని నింతకుం
బోరికి వచ్చుచుండుదురు భూవరా రెండు తెఱంగులందు నీ
కారయఁబథ్యమేది యగు నవ్విధ మేర్పడ నిశ్చయింపుమా''

సంధి ప్రయత్నం చేస్తాము. సంధి ప్రయత్నం శాంతి కోసం సంధి ప్రయత్నం విఫలమైతే సైన్యంతో సిద్ధంగా ఉండాలి. సేనోద్యోగం పర్వం అని పది పర్వాలు ఉన్నాయి అవాంతర పర్వాలు అందరిని కూర్చుకోవడం ఆ ప్రయత్నం ప్రయత్నమే సంధి కుదుర్చుకున్న తర్వాత యుద్ధం కాకపోతే ఇవన్నీ వ్యర్థంకదా అంటే ఎప్పుడూ అంతే సేనా వ్యవస్థ అనేది ఎప్పుడూ అవసరం ఉండదు. అలాగని అక్కరలేదని ప్రక్కన పెట్టకూడదు. దేశం సేనా వ్యవస్థను పోషిస్తుంది అంటే వారికి నిత్యం పని ఉండదు. వచ్చినప్పుడు దాని కోసం సిద్ధంగా ఉండాలి. ధాన్యాన్ని నిల్వ పెట్టుకుంటారు ఎప్పుడో ఏ అవసరం వస్తుందో అని అందుకే సైన్య సమీకరణం వేరు , సంధి ప్రయత్నాలు వేరు.

08 . **శ్రీకృష్ణుడు నిజంగా రాయబారం చేసాడా? లేదా యుద్ధానికి ప్రేరేపించాడా? అనే విషయాన్ని తెలియజేయగలరు?**

నిజం చెప్పాలంటే శ్రీకృష్ణుడికి యుద్ధం జరగడమే అభిమతం ఎందుకని యుద్ధం జరగడానికి అభిమతం అయినటువంటి వాడు భగవంతుడుగా ఎలా గ్రహింపబడుతాడని సందేహం ఉంటుంది. అసలు భూలోకానికి ఎందుకు వచ్చాడు. భూభారాన్ని తొలగించడం కోసం, భూభారాన్ని తొలగించడమనేది రెండు రకాలు యుద్ధం ద్వారా కొన్ని లక్షల మందిని చంపేయడం ఒక పద్ధతి, రెండవది అధర్మాన్ని తొలగించడం ద్వారా భూభారాన్ని తొలగించడం ఒకటి సంధి చేసి అందరూ తన మాటలు చక్కగా విని ఎవరి మానానా వారు ఉంటే అప్పుడు భూమికి భారం ఉండదు జనం ఎంత మంది ఉన్నా సరే, భారతంలో ఒక మాట చెప్పారు

శా. త్రేతాద్వాపర సంధి నుద్ధత మదాంధాభూత విద్వేషిజీ
మూతోగ్రశ్వసనుండు రాముఁడలుకన్ ముయ్యేడుమాఱుల్ రణ
ప్రీతిన్ వైరిధరాతలేశ్వరులఁజంపెం బల్వురన్ దీర్ఘని

ర్ధాత క్రూర కుఠారలూన నిఖిలక్షత్త్రోరుకాంతారుఁడై

ఇరవై ఒక్కసార్లు పరశురాముడు క్షత్రియులను ఏరి ఏరి చంపాడు ఎందుకు చంపాడు ‘ఉద్ధత మదాంధాభూత విద్వేషి జీ.. లు వారు బాగా గర్వం పొంది దేశాన్నంతా సర్వనాశనం చేస్తుంటే వాళ్లందరిని చంపాడు. కాబట్టి యుద్ధము అభిమతమే సంధి అభిమతమే కాని ప్రధానమైనటువంటి ధ్యేయం ఏమిటంటే భూభారాన్ని తగ్గించడం దాని కోసం వచ్చాడు కనుక యుద్ధోద్యోగము ఉంది యుద్ధ విరమణోద్యోగం కూడా ఉంది. ఆ విషయం భారతంలోనే స్పష్టంగానే చెప్పాడు

వారలు శాంత సూరులుభవచ్చరణంబు గొల్వ బూని యు
న్నారటు గాక మీకదిమనంబున ప్రియమేనని నింతకుం
బోరికి వచ్చు చుందుదురు భూవర, రెండు తెరంగు లందు, నీ
కారయబథ్యమే యగు నవ్విధ మేర్పడ నిశ్చయింపుమా’’

యుద్ధానికి సిద్ధమే అనే విషయాన్ని ధృతరాష్ట్రునికి, దుర్యోధనునికి చెప్పేసారు దాపరికం ఏమి లేదు, కృష్ణుని దగ్గర నీళ్ళు ఒదిలే ధోరణి లేదు స్పష్టంగా చెప్పేసారు.

**09. , ధర్మసూక్ష్మానికి ఉన్న భేదాన్ని వివరించగలరు?**

ధర్మసూక్ష్మము అంటే ఏమిటంటే ఎప్పరెంట్ గా ఉండే ధర్మం ఇంకొక ధర్మంతో పేచి వచ్చినప్పుడు అంటే రెండు ధర్మాలుంటాయి రెండు ధర్మాలలో అది చేయాలా ఇది చేయాలా ఈ ధర్మాన్ని అనుసరిస్తే వేరొక ధర్మానికి ప్రమాణం వస్తుంది. వేరొక ధర్మాన్ని అనుసరిస్తే దీనికి ప్రమాణం వస్తుంది. అటువంటప్పుడు సునిశితమైన దృష్టితో నిర్ణయాన్ని తీసుకోవాలి అనేటటువంటిది ధర్మ సూక్ష్మం . పరశురాముడు జమదగ్ని తన కొడుకులతో మీ తల్లి తలకాయ తీసేయండిరా అన్నాడు తక్కిన కొడుకులందరూ కూడా తల్లిని చంపడమేమిటి తండ్రి చెప్పినది విని అని ఇది సరియైన పద్ధతి కాదు అన్నారు పరశురాముడికి చెప్పాడు వెంటనే తల్లి తల కోసేసాడు. తండ్రికి సంతోషం వచ్చింది సంతోషం కలిగి నువ్వు ఏ వరం కావాలో కోరుకో అనగానే మా అమ్మను బ్రతికించమని అన్నాడు. ఇప్పుడు తల్లి మెడ కోయడమనేటటువంటిది సమర్థుడైనటువంటి తండ్రి ఏ అనుగ్రహ విశేషణం చేతనైనా తల్లిని బ్రతికిస్తాడు అనే నమ్మకం ఉంది కనుక ఈ అధర్మమైనది అయిన మాతృహననం చేసాడు. అటువంటి వాటిని ధర్మసూక్ష్మాలు అంటారు. అటువంటివి చాలా చోట్ల ఉన్నాయి. ఇప్పుడు రాముడు వాలిని చంపడం, అధర్మం అంటారు కాదు ధర్మమే ప్రతిపాదన చేసారు. హనుమంతుడు లంకలో గృహ దహనం చేసాడు

కొంప తగులబెట్టేవాడు దేవుడు ఎలా అవుతాడు అని  ఒకరు అడిగారు. ఎవరి కొంప తగులబెట్టాడు. లోకం కొంపలన్ని తగులబెట్టడానికి దీక్ష పట్టిఉన్న వారి కొంపలు తగులబెట్టారు. కాబట్టి కొంపలు తగులబెట్టడం అధర్మం అనేది ఎప్పరెంట్  కాని కొన్ని సందర్భాలలో ఆ పని కూడా చేయాలి అనేది ధర్మసూక్ష్మం.

## 4. అవధూత గణపతి సచ్చిదానంద స్వామి – ముఖాముఖి:(09/01/2023):

**(అవధూత , దత్తపీఠం వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక గురువు)**

(నేను మహాభారతం మీద పరిశోధన చేస్తున్నాను అనగానే వీరు సంతోషించి ఆశీస్సులు అందించారు, ముఖాముఖి ని అడగగానే అంగీకరించారు. నేను పంపించిన ప్రశ్నలకి సమాధానాలు టైప్ చేయించి పంపించారు.)

1. **శ్రీకృష్ణుడిని మహాభారతానికి నాయకుడుగా , ప్రధాన సూత్రధారిగా పేర్కొనవచ్చా?** మహాభారతంలో శ్రీకృష్ణుడిని ప్రధాన సూత్రధారిగా పేర్కొంటేనే బాగుంటుంది. ఎందుకంటే, శ్రీకృష్ణుడు యోగేశ్వరేశ్వరుడు. ఆట ఆడించువాడు, నడిపించు వాడు మాత్రమే. ఈ విషయం మనకు గీతలో, జ్ఞానయోగంలో 18వ శ్లోకంలో పరమాత్మే అర్జునుడికి యోగి లక్షణాలు చెపుతున్న సందర్భంలో బాగా తెలుస్తుంది.

**కర్మణ్యకర్మయఃపశ్యేదకర్మణిచకర్మయః।**

**సబుద్ధిమాన్మనుష్యేషుసయుక్తఃకృత్స్నకర్మకృత్॥**

అర్జునా! కర్మలో కర్మ లేకపోవటాన్ని చూడగలగాలి. కర్మ లేకపోవటంలో కర్మను దర్శించగలగాలి. అదే నిజమైన తెలివి. అది కలవాడే యోగి. అతడే విహితకర్మలన్నీ చేసిన ముక్తపురుషుడు – అన్నాడు. ఈ యోగి లక్షణాలన్నీ కృష్ణుడిలో ఉన్నాయి. కనుక ఆయన యోగేశ్వరేశ్వరుడు. సూత్రధారి మాత్రమే. "**లోకవత్తు లీలా కైవల్యం**" అని బ్రహ్మసూత్రం. పరమాత్మ ఈ లోకమనే ఆట ఆడుతున్నా, ఈ ప్రపంచమనే పనిని చేస్తున్నా ఆయనకు ఏ ప్రయోజనమూ లేదు. అటువంటి వాడు పరమాత్మ. కనుక ఆయనను ఆటఆడించేవాడు అనటమే బాగుంటుంది.

2. **మహాభారత వైశిష్ట్యాన్ని సమాజానికి విస్తరింప జేసే మార్గాలు ఏవి?** పిల్లలు, యువతే. మంచి మాటలతో వశం చేసుకొని, వారికి ధర్మం పట్ల శ్రద్ధ కలిగే లాగా చేసి, ధర్మాన్ని ఆచరింప చేస్తే చాలు. రాబోయే తరం బాగుంటుంది. సమాజమూ బాగుంటుంది. అందరికీ మహాభారతంయొక్క గొప్పదనం తెలిసి, మహాభారతం ఇచ్చిన ధర్మసందేశంయొక్క విలువేమిటో తెలుస్తుంది. ఎందుకోసం వ్యాసమహర్షి ఇంత మహాభారతాన్ని రచించి, ఆక్రోశించాడో, ఆ ఆక్రోశమూ అర్థమౌతుంది. (కవిత్రయం వారి బాధ కూడా తెలుస్తుంది.)

   **ఊర్ధ్వబాహుర్విరౌమ్యేషనచకశ్చిచ్ఛృణోతిమే।**

   **ధర్మాదర్థశ్చకామశ్చసకిమర్థంనసేవ్యతే॥**

నేను చేతులు పైకెత్తి ఇలా ఆక్రోశిస్తున్నాను. కానీ ఎవరూ కూడా నా మాట వినటం లేదు. **ధర్మంతోనే అర్థకామాలు సిద్ధిస్తాయి.** ఆ ధర్మాన్ని మీరు ఎందుకు సేవించరు?– అని.

**నజాతు కామాన్న భయాన్న లోభాద్ –ధర్మంత్యజేజ్జీవితస్యాపి హేతోః।**
**నిత్యోధర్మఃసుఖదుఃఖే త్వనిత్యే జీవో నిత్యో హేతురస్య త్వనిత్యః॥ (స్వర్గా. అ.5. శ్లో.63)**

కామం వల్ల కానీ భయం వల్ల కానీ, లోభం వల్ల కానీ, చివరికి ప్రాణాలు రక్షించుకోవటానికి అయినా కానీ, ధర్మాన్ని విడిచిపెట్టకూడదు. ఎందుకంటే – ధర్మం నిత్యమైనది. సుఖదుఃఖాలు అనిత్యమైనవి. జీవుడు నిత్యుడు. జీవబంధనాలు అనిత్యాలు – అని చెప్పాడు. పరలోకప్రయాణం చేసే సమయంలో ధర్మం ఒక్కటే తోడుగా వస్తుందని కూడా చెప్పాడు.

అందుచేత ఉగ్గుపాలతోనే పిల్లలకు మంచి మాటలు నేర్పాలి. మంచి పనులు చేయించటం నేర్పాలి. యువతకు కూడ ఇలాగే చెయ్యాలి. యువతకు అవగాహన ఉంటుంది కాబట్టి "ఇలా చేస్తే పుణ్యం వస్తుంది. అలా చేస్తే పాపం వస్తుంది" మహాభారతంలోని కథలను ఉదాహరణగా చూపించి బోధించాలి.

ఇవే ధర్మబీజాలు. ఇవి కనుక చిన్నతనంలో పసిమనసులలో నాటితే, ఇప్పుడు ఉన్న సంస్కృతిలో మార్పు వచ్చి, ఉత్తమ సంస్కృతి అవుతుంది. అలాగే అతిప్రధానమైన విద్యావిధానంలో కూడా మార్పు రావాలి. పాఠ్యాంశాలలోమహాభారతేతిహాసాలకు ప్రాధాన్యతను ఇవ్వాలి.

విస్తృతంగా సంస్కృత, తెలుగుభాషలను పోషించాలి. అధికారులు ఉభయసాహిత్యాలను ఆదరించి, పండితులు, కవులచేత ఆంధ్రదేశమంతటా విస్తృతంగా ఎల్లెడలా సభలు, సమావేశాలు పెట్టించాలి. ప్రజలకు బాగా చేరువ అయ్యే ప్రసారమాధ్యమాలన్నిటినీ కూడా ఉపయోగించుకొని, అధికభాగం ధర్మం, త్యాగము, నీతి న్యాయాలకు సంబంధించిన కథలనే ప్రసారం చేసే లాగా చూడాలి.

సంస్కృత మరియు తెలుగు సాహిత్య విద్యాసంస్థలను కాపాడాలి. అలా కనుక జరిగితే ఆయా గ్రంథాలలో ఆయా కవులు నిక్షిప్త పరిచిన రహస్యాలు వెలుగులోకి వచ్చి మహాభారత వైశిష్ట్యం అర్థం అవుతుంది. ఇవన్నీ కనుక చెయ్యకపోతే మాత్రం, మహాభారతం అర్థమే కాదు. ఎందుకంటే మహాభారతానికి వ్యాసమహర్షి ప్రతిజ్ఞ ఉంది. అదే **గ్రంథగ్రంథి పద్ధతి** (గూఢమైన అర్థం ఉండే విధంగా ముడులతో వ్రాసే పద్ధతి.) ఇది తెలియాలంటే పైన చెప్పుకొన్నవన్నీ ఆచరించవలసిందే.

3. **మహాభారత కాలం నాటి రాజకీయ వ్యవస్థకు నేటి రాజకీయ వ్యవస్థకు మధ్య భేదాలు ఏమిటి?**

నాడు కాస్త నీతి న్యాయమన్నా ఉండేది. చర్చలు, మాట్లాడుకోవటాలు, అరుచుకోవటాలన్నా ఉండేవి. నేడు అవి ఎంత వెతికినా మృగ్యం. లోపాలు వెతకటం, బెదిరించటం, నోరునొక్కటం, గొంతు కోయటం వంటివే ఉన్నాయి. రాజ్యానికి "అంధుడా? పాండురోగియా?" అని ఆలోచించి ఎన్నుకోవటం ఉంది.

గౌరవంగా పిలిపించి రాజ్యం లాక్కోవటం ఉంది. నేడు మాత్రం ఒకటే ఒకటి ఉంది. అర్థబలం, అంగబలం ఉన్నవాడే ముందుకు వస్తాడు. వాడే మాట్లాడతాడు. వాడినే రాజు అనాలి. వాడికే రాజ్యాన్ని ఇచ్చెయ్యాలి. వాడినే గౌరవించాలి. నాడు 'సు'యోధనుడు అని కాక, 'దుర్'యోధనుడు అన్న పేరునే బాగా తెచ్చుకొన్న పుత్రరత్నానికి, కన్నతల్లిదండ్రులు, ఎంతోమంది పెద్దవాళ్లు ఉద్యోగపర్వంలో "నాన్నా! బంగారుతండ్రీ! ఈ రాజ్యం పాండురాజుది రా" అని చిలకకు చెప్పినట్టుగానూ, సింహం గాండ్రించినట్టుగానూ, ఏనుగు ఘీంకరించినట్టుగానూ, ఫెళ ఫెళమని ఉరుము ఉరిమినట్టుగానూ చెప్పినా వాడు వినకుండా ఊర్కొన్నాడు. అదే నేడైతే చెప్పినవారు ఎలా చెప్పినా సరే, మరునాడు సూర్యోదయాన్ని చూస్తారో లేదో చెప్పలేం.

నాడు దుష్టచతుష్టయంగా పేరు పొందిన "దుర్యోధనుడు, కర్ణుడు, శకుని, దుశ్శాసనుడు" అనే నలుగురు చక్రాన్ని తిప్పి, కొంత సమయమిచ్చి యుగాంతంలో మారణహోమాన్ని సృష్టిస్తే, నేటి పరిస్థితి మాత్రం చెప్పలేము. ఎందుకంటే నేడు లోకంలో ఎంతోమంది దుర్యోధనులున్నారు. దుశ్శాసనులున్నారు. కర్ణులున్నారు. శకునులూ ఉన్నారు. వాళ్ల పని వాళ్లు చేస్తూనే ఉన్నారు. తెల్లవారితే చాలు, నలుదిక్కుల నుంచి ఒక చెడువార్త వినిపిస్తూనే ఉన్నారు. "**సంభవామి యుగే యుగే**" పరిస్థితి తీసుకురానే వస్తున్నారు.నాడు "ప్రేమ, భయము" ఉండేవి. నేడు అవి మృగ్యం. "అంతా నటన." ఇలా మహాభారతంలోని ప్రతిపర్వంలోకీ ప్రవేశించి, ప్రతిపాత్ర వ్యక్తిత్వాన్ని, పరిస్థితులను తెలుపుతూ వెళితే ఈ అంశమే మరొక సిద్ధాంత గ్రంథమౌతుంది. కనుక ఒక్క మాటలో – పెద్దల మీద కొద్దిగా ప్రేమాభిమానాలు ఉండటం వల్ల నాటి రాజకీయంలో కలుషితం తక్కువ. నేటి రాజకీయంలో ఎక్కువ. కొన్ని సందర్భాలలో పాండవుల నడకలో తేడా ఉన్నట్లుగా కనిపించి, "అరెరే ఇలా ఎందుకు చేశారు? ఇది ధర్మం కాదే" అనిపిస్తుంది. అది చూసి దొందూ దొందే అనుకోకూడదు. పాండవులు ధర్మాత్ములు అన్నమాట ముమ్మాటికీ సత్యం.

ఎందుకంటే సభాపర్వంలో యుద్ధనీతి గురించిన వర్ణన ఉంది. ఆ యుద్ధనీతి ప్రకారంగా **"క్షత్రియులు మోసాన్ని మోసంతో జయించటం తప్పు కాదు"** అని ఉంది. కాబట్టి మొదట ఘోరాతిఘోరంగా అవమానించినవారెవరు? మోసం చేసినదెవరు? ద్రోహం చేసిందెవరు? అశుచిగా ఉన్న సమయమని కూడా చూడకుండా భారతనారిని జుట్టుపట్టి బయటికి లాక్కుకొని వచ్చి, పదిమందిలో నిలబెట్టి, చూపించి, అవమానించి, కంటనీరు తెప్పించదెవరు? **కౌరవులు!** ఇటువంటివారు క్షమార్హులా? యుద్ధంలో వీరికి క్షమాభిక్ష పెట్టాలా? పోనీ క్షమాభిక్ష పెడితే మారుతారు అనే గ్యారంటీ ఏది? నరమాంసపు రుచి మరిగిన పులికి, కొన్ని రోజుల పాటు పాలు, పళ్లు ఇచ్చి, సాధుజంతువు అయిపోయిందని, ప్రేమగా దగ్గరికి వెళితే, అది ఊరుకొంటుందా?దండాలు పెట్టి

గౌరవిస్తుందా? పంజాలు విసిరి చంపెయ్యదూ! అందుచేత ఈ కారణాన్ని బట్టి యుద్ధంలో పాండవులు కొన్ని చోట్ల నడుచుకొన్న తీరును చూసి తప్పుపట్టకూడదు. ఆ సందర్భాలలో వారు యుద్ధనీతి ప్రకారం నడుచుకొన్నారు అని తెలుసుకోవాలి. కాబట్టి వారు ధర్మాత్ములే. కనుకనే వారి వెనుక కృష్ణుడున్నాడు. అందుచేత ఏ సందేహమూ లేకుండా పాండవులను అనుకరించాలి, ఆదర్శంగా తీసుకోవాలి కానీ కౌరవులను అనుకరించకూడదు, ఆదర్శంగా తీసుకోకూడదు. స్వస్తి.

4 . **కుంటుపడుతున్న నేటి పరిపాలనా విధానానికి మహాభారతం ఇచ్చే సందేశం ఏమిటి?**

దశరథ మహారాజుకు ఉన్నట్లుగా అష్టమంత్రులు లేకపోయినా "పంచ" పాండవుల వంటి అయిదుగురు అధికారులున్నా చాలు. పాలన కుంటుపడదు. వారికి తోడుగా భీష్మడి లాంటి పెద్ద ఉండాలి. విదురుడు లాంటి మంత్రి ఉండాలి. సంజయుడు లాంటి సేవకుడుండాలి. అతి ముఖ్యంగా వ్యాస, శ్రీకృష్ణల లాంటి గురువులు ఉండనే ఉండాలి. అప్పుడు లోపాలు పోయి పాలన బాగుంటుంది.

5. **రాజుకు ఉండవలసిన లక్షణాలు, నియమాలు ఏమిటి?**

బ్రహ్మదేవుడు జగత్తును కాపాడటానికై రాజును సృష్టించాడు. అంటే మామూలుగా సృష్టించటం కాదు. ఇంద్రుడు, వాయువు, యముడు, సూర్యుడు, అగ్ని, వరుణుడు, చంద్రుడు, కుబేరుడు అనే దేవతాంశాలను గ్రహించి సృష్టించాడు.అందుచేత గొప్ప దైవమే మానవరూపంలో అవతరించింది. అని రాజు విషయంలో గ్రహించాలి. అటువంటి రాజు ధర్మాన్ని ఆచరిస్తూ సుఖంగా ఉండాలి. తన శక్తినీ, శత్రువుల శక్తినీ బాగా పరిశీలించుకొంటూ ఉండాలి. శత్రువు బలిష్ఠుడైనప్పుడు సంధి చేసుకోవాలి. వ్యవసాయం, వ్యాపారం, యుద్ధం, సేతువు, గజబంధనం, గనులలో రాజాదాయాన్ని పొందటం,

బంగారు గనులు వెతికించటం అనే అష్టకర్మలు చేసి కోశాగారం పెంచుకోవాలి. దుర్గాధ్యక్షుడు, బలాధ్యక్షుడు, ధర్మాధ్యక్షుడు, సేనాపతి, పురోహితుడు, వైద్యుడు, జ్యోతిష్కుడు అనే ఏడుగురినీ బాగా చూసుకోవాలి. ఉదయం ధర్మమాచరించాలి. మధ్యాహ్నం అర్థాన్ని ఆర్జించాలి. సాయంకాలం కామమాచరించాలి. ఇలా ఇంకా మరిన్ని వివరాలు సభాపర్వంలో నారదుడు ధర్మరాజుకు రాజధర్మాలు బోధిస్తున్న సందర్భంలోనూ, తరువాతి పర్వాలలోనూ కనిపిస్తాయి.

6. **రాజ్య పరిపాలనలో గూఢచారుల ప్రాముఖ్యం ఎటువంటిది?**

గూఢచారి అన్ని శాస్త్రాలు చదివిన విద్వాంసుడై ఉండాలి. ఇతరుల మనస్సును తెలుసుకొనే మాటల నేర్పు, స్వభావము, ఆకారము, చేతులు మొదలైన వాటి ద్వారా అభిప్రాయాన్ని తెలిసినవాడై ఉండాలి. పరిశుద్ధుడై ఉండాలి. నేర్పరి అయి ఉండాలి. వంశపారంపర్యంగా వచ్చినవాడినే రాజు గూఢచారిగానియమించుకోవాలి.శత్రురాజులకు విరోధి కానివాడై ఉండాలి. ప్రజల పట్ల అనురాగం కలవాడై ఉండాలి. ధనం చేత కానీ, స్త్రీలచేత కానీ, దానం చేత కానీ భేద్యుడు కాకుండా ఉండాలి. కార్య కాలాన్ని మీరనివాడై ఉండాలి. చెప్పిన విషయాన్ని మరవనివాడై ఉండాలి.

దేశకాలాలను తెలిసినవాడై ఉండాలి. అంటే రాజు చెప్పినది వేరుగా ఉన్నా కూడా దేశకాలాలను తెలుసుకొని మాట్లాడి, మేలు కలిగేలా ప్రవర్తించేవాడై ఉండాలి. మాటను గ్రహించే చక్కనివాడై ఉండాలి. భయం లేనివాడై ఉండాలి. వివిధ భాషలు తెలిసినవాడై ఉండాలి. ఇటువంటి గూఢచారి వల్ల రాజ్యమెంతో అభివృద్ధి చెందుతుంది. గూఢచారి రాజ్యవిషయాలను, శత్రురాజ్య విషయాలను రాజుకు చెప్పి, తగిన సమయంలో చేయవలసిన కార్యాలను రాజుగారి చేత చేయించేవాడై ఉండాలి. దాంతో ప్రజలందరూ ఎలాంటిబాధలూ లేక సుఖసంతోషాలతో జీవిస్తారు.

7. **రాయబారికి ఉండవలసిన ప్రధాన లక్షణాలు ఏమిటి? రాయబారాలు జరగక ముందే యుద్ధానికి సైన్యాన్ని సమకూర్చుకున్నారు కదా! మరలా రాయబారాలు జరుపవలసిన అవసరం ఏమిటి? ఇందులో ఏమైనా అంతరార్థం ఉందా?**

తనను పంపేవాడి హితాన్ని రాయబారి త్రికరణ శుద్ధిగా కోరాలి. రాయబార కార్యం మిక్కిలి క్లిష్టమైనది కనుక చక్కగా నిర్వహించాలి. కార్యసిద్ధి కోసం దూత చాకచక్యంగా వ్యవహరించాలి. ప్రజ్ఞాప్రాభవం కలిగి ఉండాలి. ఎలాంటి విషయాన్ని అయినా ఎదుటి వారి మనస్సు నొచ్చుకోకుండా చెప్పే నేర్పరి అయి ఉండాలి. ఎంత మతిమంతుడైనా, చతురవచన కోవిదుడైనా, సమయజ్ఞత, పరేంగిత జ్ఞానం కలిగి ఉండాలి. ఇవీ రాయబారికి కావలసిన ముఖ్య గుణాలు. వీటికి ఆభిజాత్య గౌరవం మరింత వన్నె తెచ్చి పెడుతుంది.

**"మరల రాయబారాలు"** అనే విషయంలో పాండవులు కంగారుపడ్డారు కానీ, కౌరవులకే చీకూ చింతా లేదు. మూర్ఖంగా ప్రవర్తించారు. పాండవుల అభిప్రాయమేమంటే – కౌరవుల వైపు భీష్మద్రోణ విదురాదులు, మహర్షులు, పండితులు, మంచి బంధువులున్నారు, మంచి

సామంతరాజులున్నారు. మంచి స్నేహితులున్నారు. వీరందరి సదుపదేశాలతో కౌరవుల మనస్సు మారవచ్చు. దాని మూలంగా మారణహోమం ఆగవచ్చు.

పైగా యుద్ధంలో పణం అనేది సామాన్యమైనది కాదు. అత్యంత విలువైనది. అదే "ప్రాణం." ఇది పోతే మళ్లీ తిరిగి రానే రాదు. ఒక ప్రాణాన్ని నమ్ముకొని చాలా ప్రాణాలు ఆధారపడి ఉంటాయి. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కుటుంబమే, సంఘమే, రాజ్యమే అస్తవ్యస్తమై పోతుంది. కనుక దీని విషయంలో బాగా ఆలోచించి ప్రతి అడుగూ ఆచితూచి వెయ్యాలి. అలాగే పాండవులు వేశారు కానీ, కౌరవులిదిఆలోచించకమూర్ఖంగాప్రవర్తించారు.

దుర్యోధనుడి దృష్టిలో ప్రాణానికి విలువ లేదు. ధర్మరాజు దృష్టిలో ప్రాణానికెంతో విలువ ఉంది.

కాబట్టే ధర్మరాజుకు "సర్వక్షత్ర వినాశనం కావటం అనేది అస్సలు ఇష్టం లేదు. ఇది సభాపర్వంలోని ద్యూతపర్వంలో 46వ అధ్యాయంలో ధర్మరాజు ప్రతిజ్ఞ గమనిస్తే, తెలుస్తుంది. ఎట్టి పరిస్థితులలోనూ కలహం తెచ్చుకోవటం నాకిష్టం లేదు. సర్వనాశనం కావటం ఇష్టం లేదు.

**న ప్రవక్ష్యామి పరుషం భ్రాతౄనన్యాంశ్చ పార్థివాన్।**
**స్థితో నిదేశే జ్ఞాతీనాం యోక్ష్యే తత్సముదాహరన్॥**

నేను సోదరులను గానీ, ఇతర రాజులను గానీ పరుషంగా మాట్లాడను. జ్ఞాతుల ఆజ్ఞను పాటిస్తూ వారు అడిగినవన్నీ ఇవ్వటంలోనే నిమగ్నమవుతాను– అనే ప్రతిన పూనాడు. ఇదీ ధర్మరాజు అభిప్రాయం. ఇదే మిగతా పాండవుల అభిప్రాయం. కనుక ఇదే ధర్మాత్ములైన వారి వైపు నుంచి మరల మరల రాయబారాలు నడిపించటం, మాటలు, మంతనాలు చెయ్యటంలోని అంతరార్థం.

08. **శ్రీకృష్ణుడు నిజంగా రాయబారం చేశాడా? లేదా యుద్ధానికి ప్రేరేపించేడా ? అనే విషయాన్ని వివరణాత్మకంగాతెలియజేయగలరు?**

శ్రీకృష్ణుడు శాంతికాముకుడు. ఆయన మనస్సులో శాంతే ఉంది. ఉభయపక్షాల వారికీ మేలు చేకూరాలి అనే ఉద్దేశ్యమే ఉంది. ఆయన మనస్ఫూర్తిగానే శాంతి స్థాపన కోసమే ఆయన రాయబారం చేశాడు. యుద్ధం అనేది ఆయనకు ఇష్టం లేదు. ఆయన యుద్ధానికి ఎవరినీ ప్రేరేపించ లేదు. యుద్ధాన్ని ఆపుదామనే ఎంతగానో ప్రయత్నించాడు.

దీనికి సాక్షాత్తు శ్రీకృష్ణుడు చెప్పిన సమాధానమే వ్యాసభారతంలో ఉద్యోగపర్వంలో 93వ అధ్యాయంలో ఉంది. (కవిత్రయభారతంలో ఉద్యోగపర్వం తృతీయాశ్వాసంలో శ్రీకృష్ణుడు విదురుడితో సంభాషించుట అనే ఘట్టంలోనూ ఉంది.) పరమాత్మే విదురుడికిలా చెప్పాడు.

"విదురా! నాకు "సంధి చెడిపోతుంది. సమరమే జరుగుతుంది" అని ముందే తెలుసు. తెలిసే ఇక్కడికి వచ్చాను. ధృతరాష్ట్ర పుత్రుల చెడుబుద్ధి, చెడుప్రవర్తనవల్లే యుద్ధం వచ్చేసింది. ఇప్పుడు భూమి మీద ఉన్నవారంతా మృత్యుముఖంలో పడి నశించటానికి సిద్ధంగా ఉన్నారు. ఈ మృత్యుపాశం నుండి అందరినీ తప్పించేవాడు నిజంగా ఉత్తమధర్మాన్ని పొందుతాడు. కనుక దీనిని నుంచి అందరినీ తప్పిస్తాను.

**ధర్మకార్యం యతన్ శక్త్యా నో చేత్ ప్రాప్నోతి మానవః।**

**ప్రాప్తో భవతి తత్పుణ్యం అత్ర మే నాస్తి సంశయః॥**

మానవుడు తన శక్తిని అనుసరించి, ధర్మకార్యసాధనకై ప్రయత్నిస్తూ విఫలుడైనా కూడా తప్పకుండా పుణ్యాన్ని పొందుతాడు. ఈ విషయంలో నాకు సందేహం లేదు.

**సోఽహం యతిష్యే ప్రశమం క్షత్తః కర్తుమ మాయయా।**

**కురూణాం సృంజయానాం చ సంగ్రామే వినశిష్యతామ్॥**

కాబట్టి విదురా! యుద్ధంలో నశించటానికి సిద్ధంగా ఉన్నటువంటి కౌరవులకూ, పాండవులకూ సంధి చెయ్యాలని నేను ఎలాంటి కపటమూ లేకుండా ప్రయత్నిస్తూనే ఉన్నాను.

అసలు ఈ యుద్ధమంతా కర్ణదుర్యోధనుల మూలంగా వచ్చింది. వారిద్దరినే ఈ రాజులందరూ అనుసరిస్తున్నారు. మిత్రుడు వ్యసనాలలోనూ, ఆపదలలోనూ ఇబ్బంది పడుతూ ఉంటే తప్పకుండా ఉద్ధరించాలి. అలా ఉద్ధరించలేనివాడిని పండితులు క్రూరకర్ముడు అంటారు.

ఈ క్రూరకర్ముడి గురించి తెలుగు భారతం కూడా ఇలా చెప్పింది–

**చుట్టములలలోన నొప్పమి పుట్టినప్పు**

**డడ్డపడి వారితోడ గొట్లాడియైన**

**దాని నుడుపంగ జొరకున్నవాని గ్రూర**

**కర్ముడని చెప్పుదురు కర్మకాండవిదులు**

బంధువులలో పరస్పరం శత్రుత్వం ఏర్పడితే అడ్డం పడి, వారితో కొట్లాడి అయినా సరే, ఆ పగను మాన్పించాలి. మాన్పించకపోతే అలాంటి వాడిని క్రూరకర్ముడు అని కర్మకాండ విదులు చెపుతారు — అని. కనుక అందరికీ మేలు కలగటం కోసం, యథాశక్తిగా ప్రయత్నం చేసి, మిత్రుడి జుట్టుపట్టుకొని అయినా చెడుపనుల నుంచి మరలించాలి. అలా చేసినవాడు నిందార్హుడు కాదు. కాబట్టి నేను కౌరవులకు మంచి మాటే చెపుతాను.

**హితం హి ధార్తరాష్ట్రాణాం పాండవానాం తథైవ చ।**

**పృథివ్యాం క్షత్రియాణాం చ యతిష్యేఽహమమాయయా॥**

ధృతరాష్ట్రుడి పుత్రులకూ, పాండవులకూ లోకంలోని సకల రాజులకూ మేలు చెయ్యటానికి నేను నిష్కపటంగా ప్రయత్నిస్తాను.

ఈ శాంతి సాధనలో దుర్యోధనుడు నన్ను అవమానించినా ఫర్వాలేదు. దాయాదుల మధ్య వైరం ఏర్పడితే ఉభయులకు మిత్రుడైన వాడు మధ్యస్థుడిగా సర్వవిధాలా వారి సమైక్యసాధనకు ప్రయత్నించాలి. లేకపోతే ఆ మిత్రుడు మిత్రుడే కాడు" అన్నాడు.

తరువాత శ్రీకృష్ణుడే ఒక ప్రశ్న వేసుకొని, దానికి అద్భుతమైన సమాధానాన్ని చెపుతున్నాడు, గమనించండి.

**న మాం బ్రూయురధర్మిష్ఠాః మూఢా హ్యసుహృదస్తథా।**

**శక్తో నావారయత్ కృష్ణః సంరబ్ధాన్ కురుపాండవాన్॥**

లోకంలోని పాపాత్ములు, మూర్ఖులు, శత్రువులకు "కృష్ణుడు సర్వసమర్థుడై ఉండి కూడా కోపించిన కౌరవ పాండవులను యుద్ధం నుండి ఎందుకు ఆపలేదు" అని నన్ను అనే అవకాశమే ఉండదు.

ఉభయపక్షాల వారూ బాగుండాలనేదే నా కోరిక. వారికి మేలు కలిగించటం కోసమే నేనిక్కడికి వచ్చాను. ఇదే నా రాయబారం యొక్క ముఖ్యోద్దేశ్యం.

దుర్యోధనుడు, నా మాటలు విని కూడా ఆచరించకపోతే, మృత్యువుకు వశుడౌతాడు అన్నాడు.

చివరిగా విదురుడితో మరొక అద్భుతమైన మాటను ఇలా చెప్పాడు.

**అపి వాచం భాషమాణస్య కావ్యాం**

**ధర్మారామామర్థవతీమహింస్రామ్।**

**అవేక్షేరన్ ధార్తరాష్ట్రాః శమార్థం**

**మాం చ ప్రాప్తం కురవః పూజయేయుః॥**

నేను శాంతి కోసమై పండితులు మెచ్చుకొనే లాగా, ధర్మార్థాలతో కూడి ఉండే లాగా, హింస లేకుండా ఉండే మాటను చెపుతాను. ఆ నా మాటపై ధార్తరాష్ట్రులు దృష్టి పెడితే, శాంతిని స్థాపించటం కోసం వచ్చిన నన్ను వారు తప్పకుండా ఆదరిస్తారు. గౌరవిస్తారు.

లేదా, నా మాటను వినకపోతే సింహం ముందు ఇతర మృగాలు నిలవలేవు కదా! అలాగే రాజులందరూ కలిసి వచ్చినా సరే నా ముందు నిలువ లేరు– అని స్పష్టంగా పరమాత్మ తన మనస్సులోని మాటను చెప్పాడు.

కనుక పుక్కిట పురాణాలు విని, అదేపనిగా దోషారోపణలు చెయ్యకూడదు. ఒక వ్యాఖ్య చేసేటప్పుడు ఇలా ఆంతర్యాన్ని తెలుసుకొని మాట్లాడాలి అని పరమాత్మ సమాధానం ద్వారా తెలుసుకోవాలి.

**09. ధర్మానికి ,ధర్మ సూక్ష్మానికి మధ్య ఉన్న భేదం ఏమిటో వివరించండి.**

ధర్మము స్థూల సూక్ష్మాలని రెండు రకాలు. ఇందులో సూక్ష్మధర్మం తెలుసుకోవటం చాలా కష్టం. అందుచేత ధర్మనిర్ణయాన్ని ఎవరి బుద్ధికి తోచినట్లుగా వారు చెయ్యకూడదు. మరి ఆధారమేమిటి? అంటే వేదశాస్త్రస్మృతి పురాణాలు.

వాటిని ఆధారంగా చేసుకొనే ధర్మనిర్ణయం చెయ్యాలి. కనుకనే పరమాత్మ **"తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే"** అన్నాడు. కార్యాకార్య నిర్ణయం చేసేటప్పుడు శాస్త్రమే ప్రమాణం. శరణ్యం. శాస్త్రాన్ని తెలుసుకొనే కర్మను ఆచరించాలి.

రాజ్యం పాండవులదా? లేక కౌరవులదా? అనే విషయంలో ధృతరాష్ట్రుడు పుట్టు గ్రుడ్డివాడు కావటం చేత, రాజ్యాధికారం లేకపోవటం చేత "నాంధః కురూణాం నృపతిః ... ద్వితీయం రాజానం దాతుమర్హసి" అనే ప్రవృత్తి ధర్మసూక్ష్మాన్ని బట్టి పాండురాజే రాజు అనేది సత్యం.

ద్రోణుడు "యుద్ధంలో నన్ను వధించేవాడే లేడు. అయితే విశ్వాసపాత్రుడి వల్ల అప్రియమైన వార్తను కనుక వింటే నేను శస్త్రాన్ని విడిచిపెట్టేస్తాను" అని తన రహస్యాన్ని చెప్పాడు. యుద్ధంలో కొద్దిగా దారి తప్పి బ్రహ్మాస్త్రాన్ని విడిచిపెట్టి ఘోరంగా ప్రాణిహింస చేసేస్తున్నాడు. దీనిని అదృశ్యరూపంలో అక్కడే ఉన్న ఋషులు గమనించి ద్రోణుడి చేసిన తప్పును తెలిపారు.

అదే సమయంలో ధర్మరాజు, భీమ, శ్రీకృష్ణుల ప్రోద్బలంతో, పాండవసేనను చెండాడుతున్న ద్రోణుడి యుద్ధాన్ని వారించాలని ధర్మసూక్ష్మాన్ని అనుసరించాడు. **"అశ్వత్థామా హతః"** అని బిగ్గరగా అని, **"కుంజరః"** అని మెల్లగా అన్నాడు. ఇక్కడ అబద్ధమైనా ఆడవచ్చు కానీ, ప్రాణిహింస చెయ్యకూడదు అనే ధర్మసూక్ష్మాన్ని ధర్మరాజు అనుసరించాడు.

"**ధరతి లోకానితి ధర్మః**" లోకాలను ధరించేది ధర్మం. "**ధ్రియతే వా జనైరితి ధర్మః**" జనులచేత ధరించబడునది ధర్మం. అంటే జనులచేత ఆచరించబడేది ధర్మం.

సహజ ధర్మం నెరవేర్చలేని సమయంలో ఆపద ఏర్పడితే, అప్పుడు మాత్రమే ఆపద్ధర్మాన్ని ఆచరించాలి. అది అధర్మం కాదు. ధర్మమే అవుతుంది. కనుకనే అది ఆపద్ధర్మమైనది. "**యద్వై మనురవదత్ తద్భేషజమ్**" మనువు చెప్పింది మందు అని వేదమే చెప్పింది.

ఆపద్ధర్మం సూక్ష్మమైనది కదా! దీనికి సంబంధించిన కథ ఛాందోగ్యోపనిషత్తులో ప్రథమాధ్యాయంలో పదవ ఖండంలోని కథ ద్వారా తెలుస్తుంది.

పూర్వం కురుదేశంలో పిడుగులు పడి దేశమంతా నాశనమై, తీవ్రమైన దుర్భిక్షమేర్పడింది. అప్పుడు చక్రుడి కుమారుడైన చాక్రాయణుడనే మహర్షి తన భారత్యతో కలిసి ఆకలితో ఎంతో బాధపడసాగాడు. ఆ చాక్రాయణుడి పేరు ఉషస్తి.

అతడు ఆకలి బాధను తట్టుకోలేక, ఒక గ్రామానికి వెళ్లి, ఒక చోట ఒక మావటివాడు తింటున్న మినుపగుగ్గిళ్లను పెట్టమని యాచించాడు. మావటివాడు "ఇది ఎంగలి కూడయ్యా!" అన్నాడు. అందుకు ఉషస్తి "ఫర్వాలేదు పెట్టు" అన్నాడు.

వెంటనే మావటివాడు తన ఎంగిలికూడును పెట్టాడు. ఉషస్తి దానిని తిని ప్రాణాలు నిలుపుకొన్నాడు. మావటి వాడు ఈ ఘటనను చూసి చొరవ తీసుకొని "ఇంద కాస్త మంచి తీర్థం పుచ్చుకొని గొంతు తడుపుకోండి"అనినీటిచెంబునుఅందివ్వబోయాడు. ఉషస్తి దానిని పుట్టుకోకుండా ఠక్కున వెనక్కు జరిగాడు. అందుకు మావటివాడికి కోపం వచ్చి "ఏమిటయ్యా! నా దగ్గర నాటకాలు? ఎంగిలి కూడేమో పవిత్రం, ఈ నీళ్లు అపవిత్రమా? దానిని తినవచ్చు, దీనిని త్రాగకూడదా? ఎందుకిలా ప్రవర్తిస్తున్నావు?" అని నిలదీశాడు.

అప్పుడు ఉషస్తి "అయ్యా! మీరు నా ప్రాణదాతలు. కనుక సత్యం చెపుతున్నాను వినండి. మీరు పెట్టిన గుగ్గిళ్లు తినకపోతే నా ప్రాణాలే పోయేవి. అంటే అది ఆపత్సమయం. ఆ సమయంలో నేను మీ ఎంగిలిని తిన్నా దోషం ఉండదు. అది అధర్మం కాదు. ధర్మమే అవుతుంది.

గుగ్గిళ్లు తినటంతోనే ప్రాణాలు నిలిచాయి. శక్తి వచ్చింది. ఇక నేను నా ధర్మం నేను పాటించాలి. నాకు త్రాగటానికి నీళ్లు ఎక్కడైనా దొరుకుతాయి. ప్రాణాలు పోయే పరిస్థితి లేదు. నాకు లభించిన శక్తితో నీళ్లను సంపాదించి దాహం తీర్చుకొంటాను" అన్నాడు.

ఇదే ఆపద్ధర్మం యొక్క స్వరూపం. ఇదే ధర్మసూక్ష్మత. దీనిని ఆపత్కాలంలో మాత్రమే ఆచరించాలి. ప్రాణాల మీదకు వచ్చినప్పుడు ఆచరినప్పుడు దోషం ఉండదు. ఆపద తీరిన తరువాత "మళ్లీ అలా చేస్తే బావుంటుందిలే" అనుకొని చేస్తే మాత్రం అది దోషమవుతుంది. పాపం వస్తుంది. అది అధర్మమవుతుంది.

"**మందమతిభిరపి సుఖేన బుద్ధ్యమాన శౌచాచమన సంధ్యావందనాదిః స్థూలో ధర్మః**" మందమతులకు కూడా సుఖంగా తెలిసే శౌచాచమనం, సంధ్యావందనము మొదలైనవి స్థూలధర్మాలు.

"**శాస్త్రపారంగతైః పండితై రేవ బోద్ధుం యోగ్యః ఇతరేషాం అధర్మభ్రాంతి విషయః ద్రౌపదీ వివాహాది సూక్ష్మోధర్మః**"

శాస్త్రపారంగతులైన పండితులకు మాత్రమే తెలిసేవి, ఇతరులకు అధర్మభ్రాంతిని కలిగించేవి ద్రౌపదీవివాహాదికాలు సూక్ష్మధర్మాలు.

## 5. బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు – ముఖాముఖి: (03-02-2023)

## ( ప్రముఖ ఆధ్యాత్మిక, ప్రవచన కర్త)

(వీరు అనేక ప్రవచన కార్యక్రమాలలో తీరిక లేకుండా ఉన్నప్పటికి వారి సౌకర్యార్థం చరవాణిలోనే గంట పైన ముఖాముఖిని అందించారు. ఆ వివరాలన్నీ విని వ్రాసుకుని నా పరిశోధనలో ఉపయోగించుకున్నాను.)

1. శ్రీకృష్ణుడిని మహాభారతానికి నాయకుడిగా ప్రధాన సూత్రధారిగా పేర్కొనవచ్చా?
   నిస్సందేహంగా పేర్కొనవచ్చు, ఎందుకంటే భగవానుడే ప్రతిజ్ఞ చేసి ఉన్నాడు.

**యథా యథా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత**

**అభ్యుద్ధాన ధర్మస్య తథాత్మానాం సృజామ్యహం.**

ఆయనే రాక్షసులను సంహరించడం కోసం , సాధు పురుషులను సంరక్షించడం కోసం తద్వార ధర్మ సంస్థాపన కోసం అవతార స్వీకారం చేస్తాడని ప్రస్తుతం అసురులకు భయంకరుడు గాను, దేవతలకు ప్రసన్నుడిగాను ఉంటూ ధర్మ సంస్థాపన కోసం శ్రీకృష్ణుడే వచ్చాడని భీష్మాచార్యులు వారే స్వయంగా మనకు సభాపర్వంలో శిశుపాల వధ ఘట్టంలో చెప్తాడు.

‘‘ ఏవముషో సురాణాం చ సురాణాం చా పి సర్వశః

భయా భయకరః కృష్ణః సర్వ లోకేశ్వరః ప్రభుః

కృష్ణుడు అసురులకు భయంకరుడు అదే సమయంలో సాదువులకు దేవతలకు అభయంకరుడు కాబట్టి ధర్మ సంస్థాపనార్థం వచ్చిన అవతారం కాబట్టి భాగవతంలో చెప్పినట్టు

‘‘కన్నులు తెఱవని కడు చిన్ని పాపడైదాన వి జను బాలు ద్రాగి చంపె

ఇంకా కన్నులు కూడా తెరవక ముందే పూతనా సంహారంలో మొదలు పెట్టి అధర్మాత్ములందరిని తీసుకొస్తూ ఉంటాడు  చంపి మళ్ళీ పంపిస్తూంటే మళ్ళీ తీసుకొస్తూ ఉంటాడు. కురుక్షేత్ర యుద్ధం వంటి వాటి ద్వారా చాలా మంది అధర్మాత్ములను చంపవచ్చని . జరాసంధుడు అందుకే అన్ని సార్లు వదిలి పెట్టాడు చివరి సమయంలో మల్ల యుద్ధంలో భీముని చేత చంపించాడు. కాబట్టి ఆయనే సూత్రధారి ఆయనే నాయకుడు మహాభారతంలో ఆయనకున్న ఇంకో నాయకుడు ఉన్నాడు అని చెప్పడం సాహసం . ఖచ్చితంగా ఆయనే నాయకుడు ఆయనే సూత్రధారి.

2. మహాభారత వైశిష్ట్యాన్ని సమాజానికి విస్తరింపజేసే మార్గాలు ఏవి?

ఎప్పుడు మనకు సంప్రదాయకంగా వస్తున్న మార్గం ప్రవచనం, ప్రవచనం అంటేనే అవతలి వారి మనసుల్లో ఏ అనుమానం లేకుండా స్పష్టంగా ఉన్న అభిప్రాయాన్ని నాటుకునే విధంగా చెప్పగలిగినటువంటి కళ అట్లా ప్రవచనం ద్వారా మహాభారతం యొక్క గొప్పతనం ఏమిటి,మహాభారతంలో ఎన్ని విషయాలు చెప్పబడ్డాయి. ఒక్కొక్క విషయాన్ని మనం మహాభారతమన్న కళ్లజోడు పెట్టుకుని చూస్తే అసలు మహాభారతంలో కనబడనది అంటే ఏమి ఉంటుంది. ధర్మ పక్షపాతం ఉన్నవారు ఎలా ఉంటారు. విదురుడు ఎంత గొప్ప నీతిని చెప్పాడు. ఇది ఒక్కటి చాలదా ఒక్కొక్క పద్యం ఒక్కొక్క వజ్రం విదురుని నీతి తీసుకున్న లేదా గురు శిష్య సంబంధాలను తీసుకున్ని ఒక్కొక్క వ్యక్తి యొక్క త్యాగమయమైన జీవితం తీసుకున్ని మూర్ఖత్వాన్ని పరాకాష్ఠగా స్వీకరించి జీవితాన్ని పాడు చేసుకున్న వారిని చూసినా ఎంత గొప్ప విలాస విద్య చేతిలో ఉండికూడా పొగడ్తలకు లొంగిపోయే శల్యుని లాంటి వారిని చూచినా ఏ కోణంలో ఏ విషయాన్ని చూడండి మహాభారతం జవాబు చెపుతుంది. అయినప్పుడు మహాభారతాన్ని ప్రచారం చేయడానికి మొట్టమొదటిది ప్రవచనం రెండు చర్చా వేదిక చాలా ఉపయుక్తమవుతుందని నమ్ముతాను. ఏదైనా ఒక్క విషయాన్ని తీసుకుని ఆ విషయాన్ని ప్రతిపాదన చేస్తూ దాని మీద ఒక వ్యక్తిని మహాభారతం నుండి ఆధారంగా తీసుకుని చర్చ నిర్వర్తించండి అన్నారనుకోండి దానిని పరిశీలన చేయడం ఎంతో పరం. ఉదాహరణకు ఒక తప్పు మనిషి చేస్తాడు. కాని తప్పు దిద్దుకునే అవకాశం వైపు వెళ్ళడమా? దిద్దుకోకుండా మూర్ఖంగా వెళ్ళి నాశనం అయిపోవడమా అన్న విషయం మీదకు వస్తే సైంధవుడు చూడండి ద్రౌపది జోలికి వెళ్ళాడు. పరమశివుని గురించి తపస్సు చేసాడు నిజంగా పరమ శివుని దర్శనం అయిన తరువాత పాప ప్రక్షాళన అయ్యి నాక మోక్షం కావాలి అని ఉంటే సైంధవుని కథ అజరామరమయ్యేది. ఆయన పాండవుల మీద కక్ష పెంచుకున్నాడు కాని చివరకి ఏమైంది. ఆ సైంధవుని జీవితం అంటే ఆఖరికి తెలుగులో ఒక సామెతగా మిగిలిపోయిందనిపించింది. సైంధవుడిలా అడ్డు పడ్డార్రా అంటారు. సైంధవుడిగా జీవితంలో ఏమి సాధించాడు. ఏమి సాధించకపోగా ఒక సంఘటన జరిగింది. దాని ద్వారా తన జీవితాన్ని మార్చుకునే అవకాశం వచ్చింది. అంత తపస్సు చేసాడు. పరమ శివుని దర్శనం చేసాడు కాని అది తన దోషాన్ని దిద్దుకుని తాను చరిత్రలో ఒక గొప్ప పురుషునిగా నిలబడడానికి అవకాశం వైపు తిరగలేకపోయాడు. చివరకు తనకు తాను నాశనం చేసుకునే విధానం ఏమి ఉంటుందో ఆ వరం కోరుకున్నాడు. ఏమి పొందాడు చివరకు ఏమి లేదు. ఇటువంటి చర్చా వేదికల ద్వారా బాగా హత్తుకునేటట్లు చేయవచ్చు. విద్యార్థుల యందు మహాభారతాన్ని ఆధారంగా చేసుకుని మీరిచ్చే ఒక్కొక్క అంశం గురించి వాళ్ళు బాగా భారతాన్ని పరిశీలించి వ్రాయడం. అలవాటైతే పిల్లల్లో

మహాభారతం యొక్క వైశిష్ట్యం బాగా అర్థమవుతుంది. అలాగే పరిశోధన మహాభారతాన్ని అనేక కోణాల్లో పరిశీలించి పరిశోధిస్తే అందులో దాగి ఉన్న అమూల్యమైన వజ్రాలు బయటకు వస్తాయి కాబట్టి ఇటువంటి మార్గాల ద్వారా మహాభారత వైశిష్ట్యాన్ని సమాజానికి విస్తరింపచేయవచ్చు. మహాభారతం వైశిష్ట్యం ప్రచారం చేయడానికి ఏ మార్గాలు మంచివో అవే మనం చెప్పాలి.

**3. కుంటుపడుతున్న నేటి పరిపాలనా విధానానికి మహాభారతం ఇచ్చే సందేశం ఏమిటి?**

ఎప్పుడైనా ప్రజాక్షేమాన్ని ధర్మాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. రాజుకు ఉండవలసిన లక్షణం రాజకీయ వ్యవస్థకు ఉండవలసినటువంటి లక్షణం. పరిపాలనా విధానానికి ఎప్పుడూ గీటురాయి ప్రజాసంక్షేమం దేశాభివృద్ధి ధార్మికమైన పరిపాలన ప్రజలు ధర్మం పట్ల అనురక్తులు అయ్యేటట్లుగా ప్రభువు పరిపాలించాలి. ప్రభువు ధర్మాన్ని అంత గొప్పగా పాటించి ఆదర్శంగా నిలబడాలి. ప్రజలకి కూడా హితం కోసం ప్రభువు ప్రభుత్వం పనిచేస్తున్నారు. అన్న విశ్వాసం అంత బాగా కలిగితే చక్కగా పరిపాలనా విధానం నడుస్తుంది. అదే మహాభారతం ఇచ్చే సందేశం.

**4. రాజుకు ఉండవలసిన లక్షణాలు నియమాలు ఏమిటి?**

రాజుకు ఉండవలసిన లక్షణాలు నియమాలు రెండూ కూడా ఒక్క విషయంలోకే వచ్చేస్తాయి. రాజు తన గీత కర్మ యందు శ్రద్ధాసక్తుడై ఉండాలి. తాను ఏది చేయాలో దాని యందు ఏమరపాటు ఉండకూడదు. ఇది శాస్త్ర ప్రోక్తము. ఇది రాజుగా నేను చేయడం దేశ హితానికి చాలా అవసరం. అన్న దాని విషయంలో వ్యక్తిగతమైన అభిప్రాయం కన్నా ఇతఃపూర్వం పెద్దలు దేనిని పాటించడం చేత దేశక్షేమం సాధించబడిందో దేన్ని చేస్తే మంచిదని శాస్త్రాలు పెద్దలు పేర్కుంటున్నారో దానిని పాటించడం అలా పరిపాలన చేయడం. నిషిద్ధ కర్మల జోలికి వెళ్ళకుండా ఉండడం. హింస ,వేట, ఆవేశం, పొందడం, తొందరపాటు, తనం ఇటువంటి వాటికి దూరంగా ఉండగలగడం. ఏది నిషిద్ధములో రాజు వేటికి వశపడితే పరిపాలన దెబ్బతినే అవకాశం ఉంటుందో అటువంటి నిషిద్ధమైన విశేషాలు జోలికి రాజు వెళ్ళకుండా ఉండడమే రాజుకు ఉండవలసిన ప్రధాన లక్షణం నియమం.

**5. రాయబారికి ఉండవలసిన ప్రధాన లక్షణాలు ఏమిటి?**

రాయబారికి మొట్టమొదటి ఉండవలసిన లక్షణం ధైర్యం ఎందుకంటే ఒక్కొక్కసారి అవతలి దేశపు ప్రభువు ముందు మాట్లాడవలసి రావచ్చు శ్రీరామాయణంలో రావణాసురుని ముందుకు వెళ్ళి మాట్లాడుతున్నాడు హనుమ కాని ‘‘ఆహా రూప మహాధైర్య మహాసత్త్వ మహోద్యుతిః’’

అని ఉదాహరణ రావణాసురుని వైభవాన్ని పొగుడుతూనే తాను మాత్రం ఎక్కడా ధైర్యాన్ని కోల్పోకుండా తాను ఏపని మీద వచ్చాడో ఆ పనిని తాను ఏ మాటలను చెప్పవలసిందో ఆ మాటలను మింగేయకుండా ఈ మాట చెప్తే బాబోయ్ ఆయన ఏమి కోపం వస్తుందో నని భయం లేకుండా చెప్ప కలిగినటువంటి వ్యక్తిత్వం ఉండాలి.

రెండు భాష యందు పటుత్వం ఉండాలి. అభిప్రాయాన్ని వ్యక్తికరించాలి. అంటే తగిన భాష వాడలేకపోయాడనుకోండి ఒక సందేశాన్ని చెప్పబోయి వేరొక విశేషాన్ని చెప్పడం అవుతుంది. అప్పుడు అది అస్పష్టతకి అయోమయానికి దారి తీస్తుంది. అలా కాకుండా ఉండాలి అంటే తాను ఎవరి తరపున వెళ్లాడో వారి తరపున మాట్లాడాలి అంటే భాష మీద పటుత్వం ఉండాలి. తర్వాత ఏదైన అనుషంగికమైన ప్రశ్నవచ్చి అవతలి వారు విన్నవాడు ప్రశ్న వేస్తే దాన్ని చెప్పడానికి ఎవరి తరపున వచ్చాడో హృదయం బాగా అర్థం చేసుకున్న వాడై ఉండాలి. అప్పుడే ఆ చెప్పిన జవాబు ఉతంత్రణ కారణం కాకుండా ఎవరి ప్రతినిధిగా తాను వెళ్ళాడో వాళ్ళ యొక్క క్షేమాన్ని చూసిన వాడు అవుతాడు కీర్తిని తెచ్చిన వాడు అవుతాడు. అందుకని ఇవి చాలా ప్రధానంగా రాయబారానికి ఉండవలసిన లక్షణాలు.

**6. రాయాబారాలు జరగక ముందే యుద్ధానికి సైన్యాన్ని సమకూర్చుకున్నారు కదా మరలా రాయబారాలు జరపవలసిన అవసరం ఏమిటి? ఇందులో ఏమైనా అంతరార్థం ఉందా?**

మహాభారతం దగ్గరకి వచ్చేటప్పటికి ఏమైంది అంటే రెండు పక్షాల మధ్య సంధి కుదురుతుందా అంటే ఒక పక్షం ఏ కారణానికి సంధి కి సిద్ధంగా లేదు అనేది సుస్పష్టమైన విషయం. దుర్యోధనుడు ఎట్టి పరిస్థితిలో సంధికి సిద్ధం కాదు ఆయనకు పాండవులకు రాజ్యం ఇవ్వడం ఇష్టం లేదు. ఆ విషయం స్పష్టంగా తెలుసు తెలిసినా రాయబారిని పంపించకపోతే ధర్మరాజు గారు శాంతికి అసలు ప్రయత్నమే చేయలేదు .భగవానుడు కృష్ణుడు కూడా అటువంటి ప్రయత్నం చేయలేదు. కాని ప్రచారం చేయడానికి నిందమోపడానికి అవకాశం ఉంటుంది. ధర్మరాజు యొక్క హృదయం ఎప్పుడూ ఏమిటంటే పగ మంచిది కాదు యుద్ధం మంచిది కాదు అనేక మంది అందులో మరణిస్తారు. అంతకన్నా సంధి ద్వారా సంయమనంగా సమస్యను పరిష్కరించుకోవాలి అన్నది ఆయన ఉద్దేశ్యం కాని అది పొసగదని ఆయనకు తెలుసు అందుకని ఒక వైపు యుద్ధానికి సిద్ధపడుతూనే ఇంకొక వైపు సంధికి ప్రయత్నం చేస్తూ రాయబారాన్ని నడిపారు. కృష్ణుడు రాయబారానికి వెళ్ళాడు అనుకోండి ద్రుపద పురోహితుడు రాయబారానికి వెళ్ళాడు అనుకోండి పాండవుల యొక్క క్షేమాన్ని చూడవలసిన అవసరం ధృతరాష్ట్రుడు మీద ఉంది. పాండవులకు రాజ్య భాగం అన్నా ఇవ్వాలి లేద కనీసం ఐదు ఊళ్ళు ఇవ్వాలి అంటాడు అదే దుర్యోధనుడు రాయబారం పంపాడు అనుకోండి ఎప్పుడు రాయబారం అన్న ప్రసక్తి తీసుకురాలేదు. వీరు

ప్రశాంతంగా బ్రతికేయండి అంటారు. తప్ప ఆ ప్రశాంతంగా బ్రతికేయండి అంటే రాజకుమారులు వారు ఎలా ప్రశాంతంగా బ్రతకాలి అన్న దాంట్లో స్పష్టత ఉండదు. అందుకే సంజయ రాయబారంలో అది స్పష్టంగా కనబడుతుంది. అటువంటప్పుడు ఒకరు ఎటూ యుద్ధానికి సిద్ధంగా ఉన్నాడు దుర్యోధనుడు ఒక రెండో వైపు వారు సంధి పొసిగే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి అన్నప్పుడు వాళ్ళు తమ సైన్యాన్ని సమీకరించుకోవాలి. అకస్మాత్తుగా దుర్యోధనుడు యుద్ధప్రకటన చేస్తే తాము ఇంకా సైన్యాన్ని సమీకరించుకోలేదని కూర్చుంటే ఎలా సాధ్యమవుతుంది. అందుకని మహాభారతంలో మాత్రం అది తప్పనిసరి పరిస్థితి ఉభయ పక్షాలు సైన్యాన్ని సమీకరించు కోవలసి వచ్చింది తర్వాత రాయబారాలు అయ్యాయి.

### 7. శ్రీకృష్ణుడు నిజంగానే రాయబారం చేసాడా? లేదా యుద్ధానికి ప్రేరేపించాడా? అనే విషయాన్ని వివరణాత్మకంగా తెలియజేయగలరు?

శ్రీకృష్ణుడు రాయబారానికే ప్రయత్నం చేశాడంటే రాయబారానికే వెళ్ళాడు. రాయబారానికి ప్రయత్నించడం అనే మాట ఏముంది. రాయబారం చేసాడు అందులో అనుమానం ఏమి లేదు. రాయబారం చేసాడా అంటే శాంతిస్థాపనకు ప్రయత్నించాడా లేక యుద్ధానికి ప్రయత్నించాడా అని నిజంగా శ్రీకృష్ణ పరమాత్మ కొన్ని విషయాలు దుర్యోధనునితో చెప్పాడు. ఆయన అన్నాడు ఇంతమంది చచ్చిపోవడం దేనికయ్యా నేనొక ప్రశ్న అడుగుతాను అర్జునుడు అవతలి వైపు ఉండగా నీ పక్షానికి గెలుపు సాధ్యం కాదు అర్జునుడిని గెలువగలిగిన వీరుడు  ఇదిగో నా వైపు ఈయన ఉన్నాడు అని నమ్మిన వాడు ఎవరైనా నీకు ఉంటే ఆయనను ఒక్కడిని పంపించు ఆయనకు అర్జునుడికి యుద్ధం పెడదాం. అర్జునుడు గెలిస్తే పాండవులు గెలిచినట్లు ఒకవేళ నువ్వు పంపిన ఏ వీరుడైనా సరే ఆయన గెలిస్తే నీ పక్షం గెలిచినట్లు అప్పుడు రాజ్యం నీది వాళ్ళు ఓడిపోయినట్లు వారికి రాజ్యం రాదు దీనికింత జన నాశనం ఎందుకు అందుకు అర్జునుడితో యుద్ధం చేసేవాడు ఎవరైనా ఉంటే చెప్పు ఆయనను పంపిద్దాం అన్నారు. నిజంగా దానికి పరిష్కారంగా ఇదిగో ఫలాన వారిని నేను నమ్మి పంపిస్తానని చెప్పడానికి అర్జునుడితో యుద్ధానికి వచ్చినప్పుడు ఎవరు గెలిచారు. అర్జునుడి మీద దుర్యోధనుని దగ్గర ఉన్నవాళ్ళు కర్ణుడు గెలిచాడా, భీష్ముడు గెలిచాడా ఎవరు గెలిచారు. అయినప్పుడు నిజానికి వెళ్ళకూడదు కదా అంటే మూర్ఖత్వం ఎటు వైపుంది దుర్యోధనుడి వైపు ఉంది. మూర్ఖుడు ఏది చెప్పినా వినడు తన స్వాను భవంలో తనకు తెలుసున్నా నమ్మడు ఇక ఇక్కడ కృష్ణ పరమాత్మ రాయబారం చెడగొట్టడం అన్నమాట ఎక్కడొచ్చింది.

రెండు ఐదూళ్లు ఇస్తే చాలయ్య రాజ్యభాగం కూడా ఇవ్వక్కరలేదు నిజానికి వాళ్ళది కదా రాజ్య భాగం పెద్దవాడు ధృతరాష్ట్రుడు అంధుడు కాబట్టి పాండురాజుకు రాజ్యం వచ్చింది కదా ఆయన పెద్దకుమారుడు ధర్మరాజుది రాజ్యం కదా నీకు తెలుసు కదా కపట ద్యూతమని అయినప్పుడు వాళ్లు వాళ్ల మాటను నిలబెట్టుకుని అరణ్య అజ్ఞాత వాసాలు చేసి తిరిగి వచ్చారు కదా వాళ్ల భాగం వాళ్లకు ఇయ్యి కాదంటావా కనీసం ఐదు ఊళ్ళు ఇవ్వు ఊళ్లు కూడా ఇవ్వక పోతే వాళ్లు ఎట్లా మనకు కనిపెట్టుకుని ప్రవర్తించగలరు కాబట్టి దీనికి ఒకే ఒక పరిష్కారం నువ్వు ఈ విధంగా చెయ్యి వీటిల్లో ఏది చేసినా నువ్వు సాధించినవాడవే అవుతావు నా మాట విను అని ఆయన అంత స్పష్టంగా చెప్పాడు. పైగా అసలు ఆయన రాయబారానికి వస్తున్నాడు అంటే కృష్ణుడు చెప్పిన మాటలేవో విందాం విన్న తర్వాత కావాలంటే ఆగి చెప్తాము ఆలోచించి అందామని కాదు కదా వారు సిద్ధంగా ఉన్నది. ఆయనను ఎలా కట్టి పడేద్దామని ఆయనను ఎలా బంధించాలని ప్రణాళిక చేసుకున్నారు తప్ప అసలు ఆయన మాట విందామని ప్రయత్నమే చేయలేదు. విశ్వరూప సందర్శనం జరిగింది సభలో భీష్మాదులు చూసానే కళ్ళులేని ధృతరాష్ట్రుడు చూసారు అంతమంది కీర్తించారు ఇదంతా కనికట్టు అన్నాడు దుర్యోధనుడు. ఇది ఇంద్రజాలం అన్నాడు ఇక అప్పుడు అంత మూర్ఖత్వం దుర్యోధనుని వైపు ఉండి తీరుతుంది. ఎందుకంటే యుద్ధం జరగాలి ధర్మ సంస్థాపన జరగాలి. అప్పుడు శ్రీకృష్ణుడు రాయబారం ద్వారా పురిగొల్పాడు. అన్న మాట వాడటం ఎలా సాధ్యం అతను అలా చేయాలా అతను రాయబారం నడిపాడు శాంతికే ప్రయత్నించాడు. అలా చేయకపోతే వచ్చే విపరీత పరిణామాలు ఎలా ఉంటాయో ఎంత దెబ్బ తింటాడో దుర్యోధనునికి కూడా చెప్పాడు వినకపోతే ఆయనేం చేస్తాడు.

**8. ధర్మానికి ధర్మ సూక్ష్మానికి మధ్య ఉన్న భేదం ఏమిటో వివరించండి?**

ధర్మము అధర్మము అన్నవి స్పష్టంగా కనబడిపోతాయి. కొంచెం దానిని పట్టుకోవడం కూడా తేలికగానే ఉంటుంది. ఎందుకంటే శ్రుతి స్మృతి, పురాణము శిష్టాచారము, అంతరాత్మ ఈ ఐదు ప్రమాణములుగా ఉంటాయి కాబట్టి ధర్మ నిర్ణయానికి ఇది ధర్మమా ఇది అధర్మమా అన్నప్పుడు అక్కడక్కడ శృతి, స్మృతి , పురాణము, శిష్టాచారము ఎదురుగుండా లేకపోయినా అంతరార్థ ప్రబోధం వలన తెలిసిపోతుంది ఇది కర్మమని కాని ఒక్కొక్క సారి విచిత్రమేమిటంటే కళ్ళముందు జరుగుతున్నది అధర్మంగా కనబడుతుంది. అధర్మంగా కనబడి ఒక ప్రత్యేక కారణం చేత ధర్మ సూక్ష్మం అవుతుంది. ధర్మ సూక్ష్మం చేత ధర్మంగా మారుతుంది.

ఉదాహరణకు వారణావతంలో లక్క ఇంట్లో పెట్టి పాండవులను కాల్చడానికి ప్రయత్నం చేసిన తర్వాత వారు రహస్యంగా తప్పించుకుని విదురుడు ఇచ్చిన సహకారంతోటి గంగానది దాటి అరణ్యంలోకి ప్రవేశించారు. మిగిలిన పాండవులు కుంతీ దేవి నిదురపోతున్నప్పుడు భీమసేనుడు ఒక్కడే తెలివిగా ఉన్నాడు. ఆయన ఆ సమయంలో హిడింబాసురుని చెల్లెలు హిడించ రావడాన్ని గమనించాడు. ఆ హిడింబి భీమసేనుని యందు మరలుకుంది. కాని ఆయన తిరస్కరించాడు. తర్వాత హిడింబాసురునితో యుద్ధం జరిగింది. హిడింబాసురుడు మరణించాడు. ఈ లోపు కుంతి దేవి మిగిలిన నలుగురు పాండవులు నిద్ర లేచారు. ఆమె కుంతిదేవిని పట్టుకుని ఏడుస్తూ ఒక మాటంది నేను ఈ భీమసేనుడిని వలచాను నాకు ఈయన భర్తృస్థానంలో ఉండకపోతే ఈయనను నేను భర్తగా పొందలేకపోతే నాకు ప్రాణములు నిలబడవు నేను మరణిస్తానని చెప్పింది ఇప్పుడు అన్నిటి కన్నా ప్రధానమైన ధర్మం ఏమిటంటే ఎదురుకుండా ఉన్న మనిషి చచ్చిపోకుండా కాపాడాలి అది ప్రధాన ధర్మం ఆమె భీముడు తనకు భర్తకాకపోతే మరణిస్తానని చెప్తుంది. ఆమెనిజంగా అంత స్వచ్ఛమైన హృదయంతో ఉంది అనడానికి ఉదాహరణ అక్కడ హిడింబాసురునితో యుద్ధం జరుగుతున్నా హిడింబాసురుడు మరణిస్తున్నా ఆమె అన్నగారికి ఏమి సహాయం చేయలేదు అంటే ఆమెకు భీముని యందు మరులుకుంది అన్న విషయం సుస్పష్టం అప్పుడు ఆమెను బ్రతికించాలంటే అప్పుడు ధర్మరాజు పెద్దవాడు ఉన్నప్పటికి కూడా ఆయనకు వివాహం కానప్పటికి కూడా భీముడికిముందు భార్యతో సమాగమం చేయవలసి వచ్చింది హిడింబిని భార్యగా భీమునికి అంగీకరించవలసి వచ్చింది కుంతీ దేవి, ధర్మరాజు ఇప్పుడు అందులొ ప్రధానమైన ఉద్దేశం హిడింబ యొక్క ప్రాణాలను నిలబెట్టడం అంతే కాని దానిని ఉద్దేశం ఏమైందో ధర్మరాజు ఫెద్దవాడు ఉండగా కుంతీదేవి రెండవ వాడైన భీమసేనుడిని భార్యగా రావడానికి అంగీకరించింది. ధర్మం తప్పింది కదా అన్న మాట ఉండదు. హిడింబ యొక్క ప్రాణం నిలబెట్టడం ప్రధానమైంది కాబట్టి ఒక చిన్న ధర్మం పెద్ద ధర్మాన్ని నిలబెట్టింది కాబట్టి అది దర్మసూక్ష్మం చేత ధర్మమైంది. రామాయణంలో సీతమ్మ హనుమంతునిని గురించి రాక్షస స్త్రీలు అడిగితే ఏమోనాకేం తెలుసు పాము కాళ్ళు పాముకే తెలుస్తాయి. మీ దగ్గరకు వచ్చే వాళ్ళు కామరూపులై ఉంటారు కాబట్టి మీకే తెలియాలి. ఆవిడ  అబద్ధం ఆడలేదా అంటే పై కథాపరంగా చూస్తే అబద్దమాడింది. లోపలికి పరిశీలన చేస్తే ఉన్న నిజం చెప్పేసింది అనుకోండ అందరూ కలిసి ఆయనను పట్టుకుని ఇబ్బంది కల్పిస్తే ఆ హింసకు ఆమె కారణం అవుతుంది. అందుకని పెద్ద ధర్మాన్ని నిలబెట్టాలంటే ఒక అబద్ధాన్ని ఆడవలసి వచ్చింది. అప్పుడు అది దోషం కాలేదు. అట్లాగే ఇక్కడ కూడా ధర్మసూక్ష్మం అనేటటువంటిదాన్ని కొంత పరిజ్ఞానం ఉన్నవారు మాత్రమే పట్టుకుని ధర్మాధర్మ వివక్ష చేయగలరు తప్ప సర్వసాధారణంగా చూడగానే ఇది ధర్మం కాదు అని అనేయడం తేలిక కాని ధర్మ సూక్ష్మాన్ని పట్టుకుని

ధర్మాధర్మాలను నిర్ణయించాలంటే కొంత ప్రాజ్ఞత అవసరమవుతుంది. అప్పుడు ఆ సూక్ష్మ బుద్ధితో పరిశీలన చేత ఒక్కొక్కసారి అధర్మంగా కనబడింది. అధర్మం కాదు. ధర్మమని తేలుతుంది.

9. **కణికుడు చెప్పిన కూటనీతిని ధృతరాష్ట్రుడు మహాభారతం మొత్తం అనుసరించాడని భావించవచ్చా?**

అలా అనడానికి అవకాశం లేదు కణికుడి యొక్క కూట నీతి ఆ సమయంలో అక్కడ వరకు ఆ యుద్ధం ప్రారంభం అయ్యే ముందు చెప్పబడిందే కానీ ధృతరాష్ట్రుడికి కూట నీతి అనే మాట కన్నా ధృతరాష్ట్రునికి ఎంతసేపు రాశిభూతమైన స్వార్థం. ఆయన అన్ని వింటాడు ధర్మాధర్మములు తెలుసు ఎందుకంటే ఎప్పుడు విదురుడు పక్కన ఉంటాడు విదురుడు చెప్తాడు నీ బుద్ధి మారదు పాడైపోతావు ధర్మరాజు యందు ధర్మం ఉంది కాబట్టి ధర్మరాజు ఎప్పటికైనా విజయం సాధిస్తాడని కుండలు బద్దలు కొట్టినట్టు చెప్తాడు అతను తనకు ఉన్నటువంటి అవగణాన్ని వదల లేకపోయాడు ఆ స్వార్థం పిల్లల మీద ఉన్నటువంటి పిచ్చి మమకారం ఆ దుర్యోధనుడు అంటే అంత. అతనికి ఏది ఏమైపోయినా మా పిల్లలకి రాజ్యం ఇచ్చేయాలి ఎంత స్వార్థం పిల్లలందరూ చచ్చిపోయారని తెలిసినా భీమసేనుని కౌగిట్లో బంధించి చంపేద్దామని ప్రయత్నించాడు కదా అంత ఆక్కసు ఉన్నవాడు ఆ గుణం చాలు కాల్చేయడానికి నేను అన్నది అదే ప్రవచనాలు చర్చావేదికలు వ్యాసరచన వంటి ద్వారా మనిషిని పాదు చేసే పెను ప్రమాదము నుండి తప్పిస్తాయి.ఇప్పుడు గోరుచుట్టు వచ్చిందనుకోండి పర్వాలేదు పడిశం పట్టింది అనుకో ఫరవాలేదు దగ్గు వచ్చినా ఫర్వాలేదు గుండెపోటు వస్తే అత్యంత ప్రమాదం కొన్ని కొన్ని ఉండకూడదు అలా ఉండకూడదు ఏదో అది ధృతరాష్ట్రునికి ఉంది అందుకే మహాభారతంలో అందరూ నాశనం అయిపోవడం ప్రధాన కారణం ధృతరాష్ట్రుడే ఆయనకంటూ ఏదో ప్రత్యేకమైన నీతి ఏదో ఆసాంతం అన్వయమైందని చెప్పవలసిన అవసరం ఏమున్నది .

## 6. చిర్రావూరి శివ రామకృష్ణ శర్మ: – ముఖాముఖి: (21–3–2023):

### (ఆధ్యాత్మిక వేత్త, ప్రముఖ జ్యోతిష్య పండితులు)

(కంచిపీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ విజయేంద్ర సరస్వతి గురువుల అనుగ్రహంతో వారి ఆజ్ఞమేరకు వారి శిష్యుడు బ్రహ్మశ్రీ చిర్రావూరి శివరామకృష్ణ శర్మ గారితో ముఖాముఖి నిర్వహించాను. వీరు అనారోగ్య సమస్యలతో మంచం పై ఉన్నప్పటికి గంట పైన ముఖాముఖిని అందించారు.)

1. **మహాభారత వైశిష్ట్యాన్ని సమాజానికి విస్తరింపజేసే మార్గాలు ఏవి ?**

పూర్వం పొద్దున్నే మహాభారతం చదువు కోవాలి. మధ్యాహ్నం రామాయణం చదువుకోవాలి. సాయంకాలం భాగవతం చదవాలి అని నియమం ఉంది. ప్రాత ద్యూత ప్రసంగేన అంటే ప్రొద్దున్నే మహాభారతం జూదం అంటే ఇదే మధ్యాహ్నం స్త్రీ ప్రసంగేన అంటే ఆడవారి కథలు రామాయణం. సాయం చోర ప్రసంగేన చోరుడంటే కృష్ణుడు అంటే భాగవతం ఇవి వినాలి. వినడం అంటూ వస్తే లోకంలో ఇన్ని అరాచకాలు బయలుదేరవు. ప్రధానంగా అరాచకాలు అన్నీ జరగడానికి పూర్వం ఈ పాఠాలన్నీ తీసేశారు. గురువు గారి గురించి తెలుసుకుని వారి గురించిన పాఠాలు ఉంచాలి. ఈ ధర్మాలు బుర్రలో ఉండవలసిన ధర్మాలు ఇవి లేకపోవడం వలన అన్యాయమైన ప్రవృత్తి కలిగి ఉంటుంది. ఈ కీచకుడు లేకపోతే అడవిలో ఉన్నప్పుడు సైంధవుడు ద్రౌపదిని పరాభవించాడు. అదొక చరిత్ర ఇలాంటి ఘట్టాలు తెలుసుకున్నప్పుడు పరస్త్రీ జోలికి వెళితే ఇలాంటి ప్రమాదమన్నమాట అనే ఒక జ్ఞానం కలుగుతుంది. ఆ బుర్రరలో బాల్యంలో పడిపోతే తర్వాతి కాలంలో అటువంటి ప్రవృత్తికి సిద్దపడకుండా ఉంటారు. ఇప్పుడు అవి లేవు లేకపోయేటప్పటికి రకరకాల విధానాలు తయారవుతున్నాయి.

2. **రాయబారానికి వెళ్ళి వ్యక్తి ఎటువంటి లక్షణాలు గుణాలను అలవరచుకోవడం వలన విజయం సాధిస్తాడు?**

రాయబారానికి యథార్ధ వక్తృత్వం ఉండాలి. భీతి ఉండకూడదు. చంపే పరిస్థితులు వచ్చినప్పుడు వాటిని ధైర్యంగా ఎదర్కోకలగాలి.

3. మహాభారతంలో ఎవరిని నాయకుడుగా పేర్కొనవచ్చు;

ఫలితం ఎవరికి దక్కిందో వారు నాయకుడు అవుతాడు. ఆ లెక్క ప్రకారం చూస్తే మహాభారతానికి నాయకుడు ధర్మరాజు అలంకార చర్చల్లో ఈ విషయం పెద్ద విచారణ చేసారు. కాబట్టి మహాభారత దృష్ట్యా చూచినప్పుడు నాయకుడు ఎవరంటే ధర్మరాజు చివరకు ఫలితం ఆయనకే దక్కింది. తర్వాత

ప్రధాన సూత్ర దధారి అంటే భేదం వస్తుంది. నడిపించినటువంటి వాడు. డైరెక్టు అన్నమాట సూత్రధారుడు అనే శబ్దానికి అది అర్థం. అది ప్రత్యక్షంగా చూస్తే కృష్ణ పరమాత్మ పరోక్షంగా చూస్తే ఈశ్వరుడు . మహాభారతంలో ఈశ్వరుడు ఏమిటి అని లోకంలో అందరికి ఒక సమస్య వస్తుంది .అశ్వమేధ పర్వం జైమిని భారతంలో చెప్తారు అర్జునుని కంటే పరాక్రముడు అతని యుద్ధానికి వస్తే అర్జునుని కీర్తి అంతగా వ్యాపించకపోవచ్చు. కారణం ఈశ్వరుడు. మహాభారతంలో పద్దెనిమిది పర్వాలలో పద్దెనిమిది పర్యాయాలు ఈశ్వరుని ప్రవేశం ఉన్నది. దాని మీద వ్యాసం బొల్లిమల్ల సత్యనారాయణ గారు మహాభారత యజ్ఞం 30 వ్యాసాలు ముద్రణవేసారు. అందులో మహాభారతంలో ఈశ్వరుని యొక్క ప్రత్యేకత ఏమిటి అని చూస్తే మొత్తం ప్రతిదానికి మూలకారణం ఈశ్వరుడు అని చెప్పవచ్చు. చివరకు వచ్చేటప్పటికి కూడా నేను బాణ ప్రయోగం చేద్దామని ఎవరికైతే గురి చూస్తే వారిని శూలధారియైన పురుషుడు పొడిచేస్తాడు. తర్వాత నా బాణం వెళ్ళి అతన్ని గుచ్చుకుంటుంది. వాడు చచ్చిపోతున్నాడు. ఎవడు వాడు నాకు తెలియడం లేదని వ్యాసున్ని అడిగితే అతను ఈశ్వరుడయ్యా అని చూపించాడు. అట్లాగే సైంధవుడుని చంపవలసివచ్చినప్పుడు రాత్రి కృష్ణ పరమాత్మ అర్జునున్ని కైలాసానికి తీసుకుని వెళ్ళి బాణం ఎలా ఉపయోగించాలో నేర్పాడు. అర్జునునికి బాణ విద్య నేర్పడం ఏమిటి అంటే పాశు పతాస్త్రాన్ని ఎలా పట్టుకోవాలో అవన్నీ నేర్పి మళ్ళీ పంపించారు. అక్కడ కూడా ఈశ్వరుడే కారణం సరే పాశు పతాస్త్రం రావడానికి ఈశ్వరుడే కరుణించాడు. అనేది స్పష్టమే ఇక్కడ ప్రయోగంలో జరగలేదు. భీష్మున్ని , ద్రోణున్ని అడిగి నువ్వొక్కడివే అయితే పాండవుల సైన్యాన్ని ఎన్నాళ్లల్లో చంపేస్తావు అని అడిగితే వారు నెలనో రెండు నెలలనూ చెప్పుకువచ్చారు. చెప్పుకు వస్తే ధర్మరాజు మన సైన్యంలో కౌరవుల సైన్యాన్ని ఎవరెవరు ఎంతకాలం మట్టుపెడతారు అని అడిగితే ఆ ప్రశ్నించినప్పుడు అర్జునుడు ఆ ప్రశ్నేంటి ఒక్కళ్ళమే యుద్ధం చేయం కదా అంతమంది యుద్ధం చేస్తున్నాం. పైగా శత్రుసైన్యాన్ని సంహరించడమా కావలసింది విజయం కదా కావలసిందని తన పాశుపతాస్త్ర ప్రయోగం గురించి చెప్తాడు. ఈ అస్త్రాన్ని ప్రయోగిస్తే వారితో పాటు మనం కూడా చచ్చిపోతాం బాంబులాంటిది అది దానికెంతో సేపు అక్కరలేదు ఒక సెకన్ చాలు అన్నారు. అంతా అని పాశుపతాస్త్రాన్ని మానవ మాత్రుల మీద ప్రయోగించకూడదు. అటువంటి పాశు పతాస్త్రాన్ని సంపాదించడానికి ఈశ్వరునితో యుద్ధం చేయడం కారణం ఇలా చూస్తే వెనకాల ఉండే సూత్రధారి ఈశ్వరుడు అని వెనకాల నడిపించిన వాడు కృష్ణుడు శివ కేశవుల భేదం లేదని మహాభారతంలోనూ చాలాసార్లూ చెప్పారు.

### 4. శ్రీకృష్ణుడు నిజంగా రాయబారం కి ప్రయత్నించాడా లేదా యుద్ధానికి ప్రేరేపించాడా?

మౌలికంగా సమాధానం చెప్పాలి అంటే భూభారాన్ని అపహరించడం కోసం భూలోకానికి వచ్చాడు. ఇంతకు ముందు చాలా చాలా వేరు వేరు యుద్ధాలలో కృష్ణుడు ఎన్నో అక్షౌహిణులను సంహరిండం జరిగింది. అందుచేత రాయబారానికి ప్రయత్నించాలి కాబట్టి ధర్మ యుక్తంగా పరిపాలించాలి. కాబట్టి రాయబారానికి ప్రయత్నించాడు. ధర్మాన్ని అతిక్రమించి రాయబారం లేకుండా గానూ లేదా అర్ధరాత్రి వెళ్ళి కొట్టేయడం వంటిది జరగలేదు. అది ఒకటి ప్రధానంగా గుర్తించవలసిన అవసరం రాజనీతి ప్రకారం ఎన్ని ప్రయత్నాలు చేయాలో అన్ని ప్రయత్నాలు చేసారు. ఐదు ఊళ్ళు ఇచ్చినా సరిపోతుంది. ధర్మం అతిక్రమించకుండగా అతని భూభారం తగ్గించడానికి వచ్చినప్పటికి కూడా ఈ యుద్ధం జరగడానికి కారణ భూతుడయ్యాడు కృష్ణుడు. అప్పుడే చెప్పాను కదా రాయబారంలో శాంతిపడేటట్టుగా కాకుండా వారు చాలా పరాక్రమవంతులు జాగ్రత్త అని చెప్పాడు ఇలాంటి మాటలు చెప్పాడు లేనివి చెప్పలేదు కాని ఆ మాటలు చెప్పడంలో ఒక పద్ధతి ఉంటుంది కదా ఆ పద్ధతిలో వాళ్లకు బాగా క్రోధాలు వచ్చేట్లుగానే చెప్పాడు. సరే దుర్యోధనుడు మూర్ఖుడు కాబట్టి కొంచెం కూడా ఇవ్వను అని చెప్పాడు ఎన్నో సార్లు అనుభవమయ్యింది. ద్వైత వనంలో గంధర్వ రాజు వచ్చి దుర్యోధనాదులను రథానికి కట్టేసి వెళ్తుంటే కర్ణుడు ఏమి ప్రయోగించలేదు అయినా కాని పాండవులు వెళ్ళి రక్షించారు. అప్పుడైనా తెలుసుకోవాలి కదా అవి తెలుసుకోకుండా మూర్ఖుడుగా ప్రవర్తించడం కూడా ప్రధాన కారణం

5. **కణికుడు చెప్పిన కూట నీతిని ధృతరాష్ట్రుడు మహాభారతం మొత్తం అనుసరించాడని భావించవచ్చా?**

కణికుడు చెప్పక్కర లేదు కణికుడు కూటనీతిని చెప్పనైతే చెప్పాడు కాని మొత్తం ధృతరాష్ట్రునిలో ఉన్నదే ఆ భావన ఇది కొంచెం దోహదపడిందని చెప్పవచ్చు. కూట నీతి అనుసరించాడు అనేది మాత్రం వాస్తవం.

6. **ధర్మానికి ధర్మ సూక్ష్మానికి మధ్య వ్యత్యాసం తెలుపగలరు?**

తెల్లవారు నాలుగు గంటలకు స్నానం చేయడం ధర్మం. కాదండి నేను జ్వరంతో ఉన్నాను అంటే వేడి నీళ్ళతో స్నానం చేయి లేదా విభూతి పెట్టుకో స్నానం చేసినట్లే ఇవి ధర్మ సూక్ష్మాలు అంటే ఎక్కువగా ఆచరింపదగిన దానిని పరిస్థితులను అనుసరించి చేయలేనప్పుడు దానిని కొంచెం తగ్గించి ఎక్కువ శ్రమ లేకుండగా చేసేటటువంటి విధానాన్ని ధర్మసూక్ష్మమని పిలుస్తారు.

## 7. బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ – ముఖాముఖి: (31-03-2023):

### (ఋషి పీఠం వ్యవస్థాపకులు, ప్రముఖ ఆధ్యాత్మిక గురువు)

(వీరి ని ఫోన్ ద్వారా సంప్రదించగానే ముఖాముఖిని ఇవ్వడానికి సంతోషించి ఆశీర్వదించి అంగీకరించారు. వీరు అనేక ప్రాంతాలలో తిరుగుతూ తీరిక లేకపోవడం వలన వారు ప్రశ్నలను నెంబర్ కి వాట్సప్ పెట్టమన్నారు. నేను వాట్సప్ పెట్టిన తర్వాత అప్పుడప్పుడు వారిని చరవాణి ద్వారా సంప్రదించి గుర్తు చేస్తూ వచ్చాను. వారు నా పరిశోధనకు కావలసిన వివరాలన్ని చేతివ్రాతతో వ్రాసి వాట్సప్ లో పెట్టారు).

1. **శ్రీకృష్ణుడిని మహాభారతానికి నాయకుడుగా ప్రధాన సూత్ర ధారిగా పేర్కొనవచ్చా?**

   మహాభారతానికి కథా నాయకుడు శ్రీకృష్ణుడేనని స్పష్టంగా వ్యాసుడు పలుచోట్ల పేర్కొన్నాడు. అవతారికలోనే ధర్మవృక్ష స్వరూపాన్ని చెప్తూ ధర్మరాజాదులతో విలసిల్లే ఆ వృక్షానికి శ్రీకృష్ణుడు మూలమని వర్ణించారు. రోషమయ మహాతరువైన దుర్యోధనాదులకు ధృతరాష్ట్రుడు మూలమన్నారు.

2. **మహాభారత వైశిష్ట్యాన్ని సమాజానికి విస్తరింపచేసే మార్గాలు ఏవి?**

   దేశ కాలాలకు అతీతంగా ఏ సమాజానికైనా వర్తించే విషయాలు భారతంలో ఉన్నాయి. మానవ సంబంధాలలో ఉన్న అన్ని రకాలు సామాజిక రాజకీయ అంశాలు , సజీవ పాత్రలు, నైతిక ఆధ్యాత్మిక సందేశాలు పుష్కలంగా ఉన్న భారతం కంటే సమాజంలో విస్తరించకలెగే గ్రంథం మరొకటి లేదు. ఇప్పటికే విస్తరించి ఉన్న భారతంలోని మూల విషయాలను అసలు వాస్తవాలను చదువుకున్నవారు విస్తరింపజేయాలి. తెలియజేయాలి. వివిధ మాధ్యమాల ద్వారా అలాగే అధ్యయనాంశాలుగా మహాభారతంలోని భాగాలను పరిశీలించాలి.

3. **మహాభారత కాలం నాటి రాజకీయ వ్యవస్థకు నేటి రాజకీయ వ్యవస్థకు మధ్య భేదాలు ఏమిటి?**

   భారతంలో అన్ని రకాల రాజకీయ నైతిక సిద్ధాంతాలు ఉన్నాయి. అయితే ధార్మికత ప్రధానంగా ప్రజలకు జవాబుదారీతనం ఉన్న రాజకీయ వ్యవస్థ నాటిది. ఇప్పుడు కపటం, అవినీతి, ప్రధానంగా ఉంది.

4. **కుంటుపడుతున్న నేటి పరిపాలనా విధానానికి మహాభారతం ఇచ్చే సందేశం ఏమిటి?**

పాలకునకు ప్రజలే శరీరం ప్రజలకు పాలకుడు ఆత్మ ఒకరి నొకరు రక్షించుకోవాలి. ప్రజాక్షేమమే పాలకునకు ప్రధాన ధర్మం 'ఇది భారతం చెప్పిన సందేశం.

5. **రాజుకు ఉండవలసిన లక్షణాలు నియమాలు ఏమిటి?**

రాజు భోగలాలసుడు కారాదు. ధర్మం ప్రజారంజనం ప్రధానంగా ఉండాలి. అనేక అధ్యాయాలలో వందలాది లక్షణాలు రాజుకు ఉండవలసినవి బోధించారు. ప్రధానంగా భీష్ముడు శాంతి పర్వంలో చెప్పిన రాజధర్మాలు, ఉద్యోగపర్వంలో విదురుని మాటలు, నారదుడు (సభాపర్వం), ధర్మ రాజుకు చెప్పినవి రాజలక్షణాలను వివరిస్తాయి.

6. **రాయబారికి ఉండవలసిన ప్రధాన లక్షణాలు ఏమిటి?**

రాయబారికి ప్రధానంగా ఉండవలసినది తాను ఏ రాజ్యం, ఏరాజు పక్షాన ఉన్నాడో ఆ రాజ్యానికి రాజుకి హితం కలిగేలా ప్రవర్తించడం. సందేశాన్ని స్పష్టంగా ప్రయోజనకరంగా అందించడం. ద్రోహ చింతన లేని నిష్కపటత్వం అవసరం.

7. **రాయబారాలు జరగక ముందే యుద్ధానికి సైన్యాన్ని సమకూర్చుకుంటారు కదా మరలా రాయబారాలు జరపవలసిన అవసరం ఏమిటి? ఇందులో ఏమైనా అంతరార్థం ఉందా?**

రాయబారాలు ముందుగానే జరుగుతాయి. అవి యుద్ధానికి సైన్యాదుల్ని సమకూర్చుకుంటారు కాని యుద్ధానికి సమీపంలో మళ్ళీ మనసులు మారతాయేమోనని మళ్ళీ రాయబారం చేస్తారు. అది రాజనీతి లో భాగం. రామాయణంలో హనుమంతుని దౌత్యం తరువాత యుద్ధానికి ప్రారంభంలో అంగదుని రాయబారం జరిగింది కదా!

8. **శ్రీకృష్ణుడు నిజంగా రాయబారం చేసాడా? లేదా యుద్ధానికి ప్రేరేపించాడా? అనే విషయాన్ని వివరణాత్మకంగా తెలియజేయగలరు**?

శ్రీకృష్ణుడు రాయబారం జరిపినప్పుడు ఉత్తమ దౌత్యాన్నే నిర్వహించాడు. యుద్ధం జరిగితీరుతుందని తెలిసినవాడే కాని, యుద్ధానికి ప్రేరేపించలేదు. పాండవుల బలాన్ని తక్కువ అంచనా వేయవద్దని హెచ్చరించాడు. ఆ ధోరణిలోనే యుద్ధాలోచన నుండి విరమించుకోమని సూచననిచ్చాడు. దుర్యోధనుడు కర్ణాదుల భరోసాతో యుద్ధానికే కృతనిశ్చయుడై ఉన్నాడని సభలోనే స్పష్టమయ్యింది. ధృతరాష్ట్రుడు దుర్యోధనుని వారించదలచుకోలేదు.

9. **ధర్మానికి ధర్మసూక్ష్మానికి మధ్య ఉన్న భేదం ఏమిటో వివరించండి?**

ఇది స్పష్టంగా ధర్మమని సామాన్యులు కూడా కనిపించేది ధర్మం, సామాన్య దృష్టికి అధర్మం వలె కనబడినప్పటికి, సూక్ష్మంగా ఆలోచిస్తే ధర్మ విరుద్ధం కానిది 'ధర్మ సూక్ష్మం'.

## 8. బ్రహ్మశ్రీ వెంపరాల వెంకట కృష్ణ శ్రీనివాసమూర్తి (శ్రీ వి.వి.ఎల్ శ్రీనివాస మూర్తి) – ముఖాముఖి: (24-4-2023):

### ( శ్రీ వాగ్దేవి కళాపీఠం వ్యవస్థాపకులు, )

(వీరు తన ముఖాముఖిని వారే స్వయంగా ఒకటి రెండు ప్రశ్నలు ఫోన్ లో తెలియజేసారు. మిగతా ప్రశ్నలు వాట్సప్ లో టైప్ చేసి అందించారు.)

**1.** రాజనీతి అంటే ఏమిటి?

రాజనీతి అంటే ఒక స్వలాభ ఆపేక్ష లేకుండా ఒక రుజు ప్రవర్తన ద్వారా ఒక ధార్మికంగా చక్కని పరిపాలనను అందించడమే రాజనీతి అది ప్రత్యామ్నాయ పరిస్థితులను బట్టి అనేక కారణాల దృష్ట్యా అనేక పరిస్థితులు అనేక విధాలుగా ఉంటూ ఉంటుంది. రాజనీతి అనేది ఎప్పుడూ సూక్ష్మంగా , స్థూలంగా ఒక మంచి పరిపాలనను సంక్షేమాన్ని అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు అందివ్వడమే రాజనీతి. రాజనీతి అనేది అనేక మార్గాలు అని చెప్పుకుంటూ ఉంటాము కాబట్టి వివిధ పరిణామాలను పరిస్థితులను బట్టి వివిధ సందర్భాలలో వివిధ రకాలుగా గోచరించవచ్చు, అంతిమంగా రాజనీతి అనేది ప్రజలకు ఎలాంటి లోటు లేకుండా ప్రజలకు ఎలాంటి కష్టం కలగకుండా అన్ని రకాల పరిస్థితులలో క్లిష్ట పరిస్థితులలో కావచ్చు, అనుకూల పరిస్థితులలో కావచ్చు ఎప్పుడు కూడా ప్రజల సంక్షేమమే ముఖ్య దృష్టిగా పరిపాలన కొనసాగించడమే రాజనీతి. అది ప్రాథమిక ఉద్దేశం రాజనీతికి

మారుతున్న కాలంలో రాజనీతి అంటే ప్రజాస్వామ్య పరిపాలన కొనసాగుతుంది ప్రజాస్వామ్యానికి ఎప్పుడైనా విఘాతం కలిగితే ప్రజల్లో చైతన్యం వస్తుంది. మనిషికి ఆకలి ఎప్పుడైతే వేస్తుందో ఆవేదన మొదలవుతుంది, సంఘర్షణ మొదలవుతుంది. ఆ ఆవేదన నుండి, సంఘర్షణ నుండి మనిషి ఇంట్లో నుండి బయటకు వస్తాడు. దీనికి ప్రస్తుతం నిదర్శనం ఏమిటంటే నేపాల్ లో జరిగిన సంఘటన నేపాల్ లో ఏమైంది ప్రజాస్వామ్యం విఫలమైనప్పుడు రాజరికాన్ని రద్దుచేసుకుని ప్రజలందరూ కూడా బహిరంగంగా రోడ్ల మీదకు వచ్చి ఒక గొప్ప పరిపాలనా విధానాన్ని తీసుకువచ్చారు. అంటే ఇంత పరిణామం ఎప్పుడు జరుగుతుంది అంటే పరిపాలన స్వామ్యం విఫలమైనప్పుడు ఇది చాలా క్లిష్టమైనటువంటి సందర్భం ఎందుకంటే ఎక్కడా కూడా ఎటువంటి దేశాలలో కూడా ఎటువంటి ప్రజాస్వామ్యం విఫలమవ్వకూడదు, ఇప్పుడు జరుగుతున్న పరిపాలనా విధానానికి ఎప్పుడూ కూడా భంగం కలగకూడదు. భంగం కలిగినప్పుడు ప్రజలు ఆగ్రహకులవుతారు, ప్రజలు ఒక విప్లవాత్మకమైన మార్పును తీసుకువస్తారు. అంటే మనం ఊహించినటువంటి పరిణామాన్ని సంఘర్షణాత్మకమైన పరిణామాన్ని ప్రజలు కోరుకుంటారు. అటువంటి పరిణామలా వల్ల ఏమవుతుంది అంటే రాజకీయ వ్యవస్థ పూర్తిగా భిన్నంగా మారిపోతుంది.

ఎప్పుడైతే పరిపాలన వ్యవస్థ సక్రమంగా ఉంటూ ఉంటుందో అటువంటి వ్యవస్థ నుండి విభిన్నమైన వ్యవస్థ రావడానికి దోహదం చేస్తుంది. దాని వలన ఏమవుతుంది అంటే విపరీతమైన పరిణామాలు ఏర్పడతాయి రాజకీయ అశ్రద్ధ కావచ్చు రాజకీయ అశాంతి కావచ్చు, శాంతి భద్రతల విఘాతం కావచ్చు పరిపాలన వ్యవస్థ కుంటుపడటం కావచ్చు. అనేక రకాలైన మార్గాలు ఒక్క సారిగా ఒక కుదేలులాగా అవుతుంది అంటే ఒక కుదుపు జరిగినట్టు అవుతుంది. భూకంపం లాగా ఒక సునామి లాంటి పరిణామాలు ఏర్పడుతాయి. అందుకే రాజకీయ వ్యవస్థ ఎప్పుడూ ఎలా ఉండాలి అంటే ఒక సక్రమమైనటువంటి పనితీరులో ఒక పద్ధతిలో ఒక విధానంలో ప్రజాస్వామ్యానికి అనుగుణంగానే అది వెళ్ళాలి. అక్కడ రాజరికానికి స్థానం లేదు,  ఒక రాజరికమైన పరిపాలన దగ్గర ఒక ప్రజాస్వామ్యానికి అవకాశం లేదు. అక్కడ రాజరికమైన పరిపాలన ద్వారానే వెళ్లాలి. ఎందుకంటే రెండు భిన్నమైన కోణాలు కాబట్టి ఏది ఇంకోదానిని ప్రయోగించినా కూడా పరిపాలనా విధానం దెబ్బతింటుంది. కాబట్టి పరిపాలన అనేది ఎప్పుడూ ఎలా ఉండాలి, ఒక దానిని ఒకటి అనుసరణీయంగా ఉండాలి. ఒక పరిణామ క్రమం ద్వారా విధానాన్ని అనుసరిస్తూ ఉండాలి. అప్పుడు మాత్రమే ప్రజల్లో ఎటువంటిది ఉండదు. అలాంటి పరిణామాల ద్వారా ఏమవుతుంది అంటే రాజకీయ పరిణామాలు ఎటువంటి పరిస్థితులు కలిగిస్తుంది అనుకున్నప్పుడు ఇటువంటి పరిస్థితులే కల్పిస్తాయి రాజనీతి మారిపోతున్నప్పుడు ప్రజలకు ఇబ్బంది కలుగుతున్నప్పుడు ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నప్పుడు ప్రజలలో శాంతి భద్రతలు లోపిస్తున్నప్పుడు తీవ్రమైన , విప్లవాత్మకమైన పరిణామాలు చోటుచేసుకుంటాయి.

ఒకప్పుడు రాజకీయ పరిపాలనలో రాజే ప్రజలను పరిపాలిస్తూ ఉండే వారు ఇప్పుడు ప్రజాస్వామ్య పరిపాలన వచ్చింది కాబట్టి మనం ఎన్నుకున్న ప్రజలే పరిపాలిస్తుంటారు కాబట్టి వారు ప్రజలకు అనుగుణంగా పరిపాలించడం, లేదా వేరే ప్రభుత్వాన్ని కోరుకోవడం లేదా ప్రజలే ప్రభుత్వాలుగా రావడం జరుగుతుంది.రాజంటే ప్రజల క్షేమం కోరుకోవడమే కదా

**2, మహాభారతానికి నాయకుడుగా ,ప్రధాన సూత్రధారిగా ఎవరిని పేర్కొనవచ్చు?**

మహా భారతానికి నాయకుడు –ప్రధాన సూత్రధారి. ఈ ప్రశ్నలో రెండు కోణాలు గోచరిస్తున్నాయి. ఒకటి మహా భారతానికి నాయకుడు –రెండవది సూత్రధారి. మహా భారత సూత్రధారి అన్నప్పుడు ఖచ్చితంగా ఈ జగన్నాటకానికి మూల పురుషుడు –కర్త, కర్మ, క్రియ అయిన పురుషోత్తముడు శ్రీకృష్ణ పరమాత్ముడే కదా. అటు వేద వ్యాస విరచిత భారతాన్ని పరిశీలించిన, నన్నయాది కవుల రచనల్ని చూసినా అది మనకి తేట తెల్ల మవుతుంది. మహా భారతం భారతీయతకు, హైందవ సంస్కృతికి, కుటుంబ జీవన విధానానికి అద్దం పట్టిన ఇతిహాస దర్పణం.

"యదిహాస్తి తధన్యత్ర యన్నే హస్తి నతత్ క్వచిత్ "..

అన్న విషయం తెలిసిందే.

ఇక మహా భారత కథా చిత్రణా పరంగా చూస్తే –ఆదిపర్వంలోని కుమారాస్త్ర విద్యా ప్రదర్శన ఘట్టం నుంచి, కురుక్షేత్ర సంగ్రామం వరకు కథలో నాయకుడిగా కనిపించేది 'అర్జునుడు 'మాత్రమే,కానీ మళ్ళీ అంతా జగన్నాటకమే కదా అనుకున్నప్పుడు, ముందుండి యుద్ధాన్ని నడిపించిన రథసారథి కృష్ణుడే కదా.

అంతిమంగా చెప్పాలంటే –నడిపేది, నడిపించేది పరమాత్ముడే కాబట్టి శ్రీకృష్ణుడే నాయకుడు –ప్రధాన సూత్రధారి.

**2. రాయబారం అనేది రాజకీయపరమైనదిగా భావించవచ్చా ? లేదా? స్వప్రయోజనాల కోసం జరిపే చర్చలు కూడా రాయబారం కిందకే వస్తాయా?**

జ: రాయబారం అనగా దౌత్యమనే అర్థం కూడా ఉంది. సహజంగా రాయబారం అనేది ఇరుపక్షాల మధ్య లేదా ఇరు వర్గాల మధ్య సంధి చేసే ప్రక్రియనే రాయబారం అంటారు. సహజంగా రాయబారం అనేది అనేక సందర్భాలలో జరుగుతుంటాయి. అది కేవలం రాజకీయపరమైనదని గాని స్వప్రయోజనాల కోసమైన కావచ్చు.  ఎక్కడైనా ఇరుపక్షాల మధ్య వివాదం ఏర్పడినప్పుడు సంధి అత్యవసరంగా భావించబడుతుంది. అలాంటి సందర్భాల్లో రాయబారి పాత్ర కీలకంగా మారుతుంది. మనం మహాభారతాన్ని చూసినట్లయితే శ్రీకృష్ణ రాయబారం రాజకీయపరమైనదిగా భావించవచ్చు. శ్రీకృష్ణ రాయబారిగా తన శక్తికి మించి సంధిని నెలకొల్పడానికి ప్రయత్నించిన విషయం తెలిసిందే. అయినా యుద్ధం అనివార్యమైంది.అలాంటిదే జనార్ధన రాయబారం మొదలైనవి.రాజకీయ కారణాలతో చేసిన, స్వప్రయోజనాల కోసం చేసిన సంధి ప్రయత్నాలు ఎప్పుడు రాయబారాలే.

**3. రాజ్యాల మధ్య జరిగే చర్చల్లో రాయబారమే కీలకమైనదని అభిప్రాయ పడవచ్చా?**

శ్రీకృష్ణ రాయబార సమయానికి భారత కథ మిక్కిలి క్లిష్టమైన ఘట్టానికి చేరుకుంది.కౌరవ, పాండవులకు సంధి జరిగితే సర్వజన శ్రేయస్సు, సమరం జరిగితే సర్వజన క్షయం కలుగుతుంది.  యుద్ధం వలన జరిగే జనక్షయాన్ని తప్పించడానికి రాయబారమే సర్వ శ్రేయస్కరం.ఇది ఒక మచ్చుతునక మాత్రమే. రాజ్యాల మధ్య ఏర్పడిన వివాదాలు కావచ్చు, విభేదాలు కావచ్చు. అటువంటివి ఏర్పడినపుడు రాజీసూత్రాన్ని అవలంభించడం మంచి పద్ధతే.

**4. రాయబారి గా వెళ్ళే వ్యక్తి ఎటువంటి లక్షణాలను, గుణాలను అలవరచుకోవడం వలన విజయం సాధిస్తాడు?**

జ: " ధర్మశాస్త్ర మిదం పుణ్యం మర్థశాస్త్ర మిదం పరం

మోక్షశాస్త్ర మిదం ప్రోక్తం     వ్యాసేనామిత బుద్ధినా !!

రాయబారి తనను పంపే వాని హితం త్రికరణ శుద్ధిగా కోరాలి. రాయబార కార్యం మిక్కిలి క్లిష్టమైనది. ఆ కార్యనిర్వహణలో ఎంతో చాకచక్యం, ప్రజ్ఞా ప్రాతవం కావాలి. ఎట్టి విషయాన్నయినా ఎదుటి వారి మనసు నొచ్చుకోకుండా చెప్పే నేర్పు అవసరం.ఎంత మతిమంతుడైనా, చతుర వచన కోవిదుడైనా, సమయజ్ఞత, పరింగత జ్ఞానం దూతకు కావలసిన ముఖ్య గుణాలు. వీటికి అభిజాత్య గౌరవం మరింత వన్నె పెడుతుంది.దూత ముఖ్యంగా సహృదయుడై వుండాలి. వివాదాన్ని పరిష్కరించడానికి తన సాయశక్తుల కృషి చేయాలి. తర్వాత దైవేచ్ఛ ఎలా వుంటే అలా జరుగుతుంది. పైన తెలిపిన గుణాలు, లక్షణాల వలన రాయబారం సుగమం అవడానికి అవకాశం వుంటుంది.

**2. మహాభారతం కాలం నాటి రాజకీయ పరిస్థితులకు నేటి రాజకీయ పరిస్థితులకు మధ్య వ్యత్యాసం ఏమిటి?**

జ: మహాభారతం కాలంలో రాజకీయ వ్యవస్థ పూర్తిగా రాజరిక పరిపాలనలో నడిచేది. అంటే పూర్తి ఏకస్వామ్య వ్యవస్థ. మహారాజు కింద కొందరు మంత్రులు పరిపాలనాధికారులుగా ఉండేవారు. కానీ పూర్తి అధినాయకత్వము నిర్ణయాధికారము మహారాజు వద్దనే కేంద్రీకృతమై ఉండేది. ఆనాటి రాజరికంలో యుద్ధకాంక్ష ఎక్కువగా ఉండేది. పరాయి రాజ్యాన్ని జయించాలన్న కోరిక తీవ్రంగా ఉండేది. అప్పటి రాజకీయాలలో కుతంత్రాలు, కుట్రలు ఉన్నప్పటికీ యుద్ధ సమయంలో ఒక ధర్మాన్ని అనుసరించేవారు. ఆనాటి రాజుల్లో కొందరు దానధర్మాలు, యజ్ఞాలతో పాటు ధర్మపరిపాలన అందించిన వారు కూడా ఉన్నారు. ప్రజాభీష్టాన్ని, ప్రజాక్షేమాన్ని అభివృద్ధిని కాంక్షించి పరిపాలన చేసే వారు కూడా ఉండేవారు. నేటి రాజకీయ వ్యవస్థ పూర్తి ప్రజాస్వామ్య వ్యవస్థ.

7. **శ్రీకృష్ణుడు నిజంగా రాయబారం కి ప్రయత్నించాడా లేదా యుద్ధానికి ప్రేరేపించాడా?**

శ్రీకృష్ణుడు మానవ రూపంలో ఉన్న పురుషోత్తముడు.అట్టి కృష్ణుడు అఖిల జనక్షయాన్ని తప్పించడానికి ప్రయత్నించడం ధర్మం.అతను అలా చేయకపోతే "ఉపేక్షించాడు గాని పూనుకుంటే సంధి జరగు కదా' అని ప్రాజ్ఞులు కాకున్నా అజ్ఞులైన అనుకోక పోరు.

రాయబారిగా వెళ్ళినప్పుడు విదురునితో సంభాషించే సన్నివేశాలలో కృష్ణుడే ఈ విషయాన్ని వివరించడం గమనించవలసి ఉంది. అజ్ఞులకు కూడా అటువంటి అవకాశాన్ని ఇవ్వకుండా ఉండడానికి ఈ కార్య భారాన్ని తనమీద వేసుకున్నాడు.అంతేకాకుండా ఆ తరువాత పార్థసారధియై సర్వజన క్షయ కారకుడు కాబోతున్నాడు. అలా సర్వజన నాశనాన్ని చేయించిన కృష్ణుడు లోక కళ్యాణం కోసం ఎందుకు ప్రయత్నించలేదు. ప్రయత్నిస్తే ఫలితం ఉండేది కదా అని అనుకోవడానికి అవకాశం లేక పోలేదు.ఆ

ప్రయత్నాన్ని చేయవలసినంత చేసిన తర్వాత ధర్మ సంరక్షణార్థం కురుక్షేత్ర సంగ్రమానికి సూత్రధారుడు కావలసి వచ్చింది – అని చాటి చెప్పడం కోసమే రాయబార కార్యానికి పూనుకున్నాడు.

సంధి జరుగుతుందని తలచి శ్రీకృష్ణుడు ఈ రాయబారానికి పూనుకోలేదు. పొందు పొసగదని, సమరం అనివార్యమని, అది విధి నియతి అని తెలిసి ప్రయత్నం చేయడంలోనే శ్రీకృష్ణతత్వంలోని విశిష్టత గోచరిస్తుంది. " కర్మన్యే... "అన్న ఒక గీతా వాక్యంలో భగవద్గీత సారమంతా ఇమిడి ఉందని విజ్ఞులు చెబుతారు.

**8. కణికుడు చెప్పిన కూట నీతిని ధృతరాష్ట్రుడు మహాభారతం మొత్తం అనుసరించాడని భావించవచ్చా?**

జ: కణికుడు దుర్యోధనుని మంత్రి. ధర్మరాజును యువరాజ్య పట్టాభిషేకం చేసిన తర్వాత దుర్యోధనుడు దుఃఖించుచూ కణికుడు వద్దకు వచ్చి తానిప్పుడు చేయవలసిన పని చెప్పమని అడిగాడు . కణికుడు అతనికి రాజనీతిని నేర్పుచు శత్రువులైన వారిని, వారి బంధువులైనను, వారిని దూరంబు చేసి దూషించవలెను. ఎటులైనను వారిని వధించుటే రాజనీతి అని చెప్పెను. కణికుడు అలా చెప్పిన తర్వాతనే దుర్యోధనుడు పాండవుల కోసం లక్క ఇల్లు కట్టించెను.

కణికుని యొక్క కూటనీతి యుద్ధారంభం ముందు చెప్పబడింది. ధృతరాష్ట్రుడికి కూట నీతితో పాటు స్వార్థం, పుత్ర ప్రేమ మిక్కిలి మక్కుటములాయెను. ధర్మాధర్మ విచక్షణను కోల్పోయెను. పిల్లల మీద మమకారం ఎక్కువ అవ్వడం వల్ల విదురుడు చెప్పిన నీతి కూడా బుర్రకెక్కలేదు. అంతేతప్ప కణికుడు చెప్పిన కూటనీతి ధృతరాష్ట్రుడు మహాభారతం మొత్తం అనుసరించాడని భావించనక్కరలేదు.

## 9. రాజనీతి నిపుణులు ఆచార్య ఇ. వెంకటేశు తో ముఖాముఖి(27-2-2023) :

(వీరు రాజనీతి నిపుణులు హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో ఆచార్యులు రాజనీతి మీద, రాయబారాల మీద ముఖాముఖి కావాలని చరవాణి లో కోరగా సహృదయంతో అంగీకరించారు. వారిచ్చిన సమయంలో వెళ్లి వారితో ప్రత్యక్ష ముఖాముఖిని నిర్వహించాను.వీరిని చరవాణి ద్వారా సంప్రదించాను. వారు చెప్పిన సమయానికి హైదరాబాద్ విశ్వవిద్యాలయం కి వెళ్లి సోషల్ సైన్స్ డిపార్ట్మెంట్ లో ముఖాముఖి నిర్వహించాను. వీరు ఎంతో ఓర్పుతో గంటకు పైగా తన ముఖాముఖిని అందించారు.).

1. **రాజనీతి అంటే ఏమిటి మొదటగా ఎక్కడ ప్రస్తావించబడింది?**

రాజనీతి అనేటటువంటి ఒక భావనకు జ్ఞానానికి సంబంధించినటువంటి అంశం. రాజ్యమనేటటువంటిది ఏ విధంగా ఏర్పడుతుంది రాజ్యం అనేది దేని కొరకు ఏర్పడుతుంది. రాజ్యంలో ఎవరెవరు ఉంటారు. రాజ్యం ను ఎవరు పరిపాలించారు. రాజ్యాన్ని అసలు ఎందుకు పరిపాలించాలి. అసలు పరిపాలన అనేటటువంటిది రాజకీయ పరిపాలన రాజకీయ వ్యవస్థ ఎందుకుగ్గు అవసరము అనేటటువంటి దాన్ని చాలా వివరంగా పూర్తిగా డిటైల్ గా చర్చించేటటువంటి దాన్నే రాజనీతి అంటాము. ఈ రాజనీతి పైనే చాలా మంది తలలు బద్ధలు కొట్టుకున్నారు. సోక్రటీస్, ప్లేటో , అరిస్టాటిల్ మొత్తం చరిత్ర అంతా కూడా రాజనీతి శాస్త్ర చరిత్ర అంతా చూసుకున్నప్పుడు రాజ్యం ఏ విధంగా ఉండాలి. రాజ్యంలో సంస్థలు ఎలా ఉండాలి. ఒక పాలకుడకు ఎటువంటి లక్షణాలు ఉండాలి. ఎవరు పరిపాలకులు కావాలి. ఎటువంటి పరిస్థితులలో వారు ప్రాధికారాన్ని దేని కొరకు ఉపయోగించవచ్చు. పౌరుల గురించి చెప్పుకొచ్చేది రాజ్యాంగాన్ని గురించి చెప్పుకువచ్చేది రాజకీయ ఉద్యమాల గురించి చెప్పుకు వచ్చేది భిన్నమైన అంశాల గురించి వివరించే టటువంటిదే ఈ రాజనీతి అనేటటువంటిది. లేదంటే కేవలం ఒక ఎం.ఎల్ ఎ. గానూ ఎం.పి గానూ రాజుగా అధికారంలో కూర్చుని ప్రజలపై అధికారాన్ని చెలాయిండం మాత్రమే రాజనీతి కాదు ఒక వేళ అధికారం నియంతృత్వంగా ఒక డిక్టోరియల్ గా అథారిటీయల్ గా తయారైనప్పుడు దానిని ప్రశ్నించడం కూడా రాజనీతే పాలకులకు ప్రజలను అణచి వేసో లేకపోతే ఆధిపత్యాన్ని కొనసాగించడానికి అధికారాన్ని ఉపయోగించి చేయడానికి రాజ్యం ఎప్పుడు కూడా సిద్ధాంతీకరించుకుంటుంది. న్యాయబద్ధత కల్పించుకుంటుంది. అంటే కోర్టు ద్వారా కాని శాసనసభ ద్వారా కాని లేకపోతే కార్య నిర్వహణ శాఖ దగ్గర కాని మీడియా నుండి కాని ఇంకా ఈ మతం కాని సంస్కృతి కాని వీటినుండి అంటే భిన్నమైనటువంటి వాటి నుండి కూడా సూత్రీ కరించుకుంటుంది. న్యాయబద్ధత చేసుకుంటుంది. లెజిస్లేటివ్ సంపాదించుకుంటుంది. అది same time అధికారమనేటటువంటిది

ప్రజలకు వ్యతిరేకంగా తయారైనప్పుడు ప్రజలను ప్రశ్నించడం కూడా రాజనీతి సిద్ధాంతం అది కూడా రాజనీతి భావనే ప్రశ్నించడం, తిరుగుబాటు చేయడం ఆందోళన చేయడం, ఉద్యమాలు చేయడం కూడా రాజనీతే అందుకని రాజనీతి అనేది ఒక మల్టిడైమన్షియల్ కాన్సెప్ట్ అంటే భౌముఖ్యమైన కాన్సెప్ట్

**2. మహాభారతం మొత్తం రాజనీతితో జరిగిందని చెప్పవచ్చా?**

మహాభారతం నిజంగా జరిగిందా లేదా అనేదానికి సంబంధించి చరిత్ర కారుల మధ్య చాలా వివాదాలు ఉన్నాయి. నిజంగా ఆధారాలు ఉన్నాయా నిజంగా అది జరిగిందా అది ఒక కథ నా అనేటటువంటిది మొత్తం మహాభారతం అంతా చూసినప్పుడు కాని చదివినప్పుడు కాని అనిపించేది ఏమిటి రెండు కుటుంబాల మధ్య జరిగిన గొడవలు దేని కొరకు జరిగింది రాజ్య అధికారం కొరకు జరిగినటువంటిది.

సంస్కృతంలో మహాభారతం అనేటటువంటిది రీజనల్ లాంగ్వేజస్ లో  వెర్నాక్యులర్ లాంగ్వేజస్ లో వ్యాసుడు, వాల్మీకి, వ్రాసిన మహాభారతం ఒకటైతే లోకల్ గా వ్రాసిన మహాభారతం చాలా ఉన్నాయి. మెల్లరామాయణం, రీజనల్ గా ఉన్నటువంటి రామాయణం, మహాభారతాలు కూడా అలా ఉన్నాయి.మహాభారతం లో ఉన్నటువంటి ప్రతిదానికి ఎవిడెన్స్ అనేది మహాభారతంలో హస్తినాపురం అంటే ఇప్పుడు ఢిల్లి అంటారు. ఆనాడు ఉన్నటువంటి సామాజిక రాజకీయ ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకోవడానికి మహాభారత రామాయణ గ్రంథాలు అనేటటువంటివి ప్రామాణికమైన గ్రంథాలు అవి.. అధికారం కొరకు రెండు కుటుంబాల మధ్య జరిగేది. ఆనాడు భారతదేశంలో ఉన్నటువంటి ప్రాక్టీస్ ఏమిటంటే ప్రైమో జరిచల్ మైట్ ఈజ్ రైట్ అంటే ఎవడైతే బలవంతుడవుతాడో వారిదే రాజ్యాధికారం. ప్రైమోజనిచర్ ( ప్రథమ వారసత్వం). అంటే ఆ రాజ్యాధికారాన్ని ఆక్రమించుకున్నటువంటి కుటుంబంలో నలుగురు ఐదుగురు అన్నదమ్ములు ఉంటే మొట్టమొదట పుట్టినవాడే పాలకుడు కావాలి దానినే ప్రైమోజనిచర్ అంటారు.

మహాభారతం ఎటువంటి విలువ చెప్పింది అంటే రాజకీయ విలువ చెప్పింది అంటే నువ్వు యుద్ధం చేయి రాజకీయ అధికారాన్ని హస్తగతం చేసుకో వేరే రాజు వచ్చి దండయాత్ర చేసినంత వరకు నువ్వే పరిపాలకుడవు నువ్వు చేస్తే నువ్వు పెద్ద వాడవు అందులో పురుషుడు నువ్వు క్షత్రియుడు అయి ఉండాలి. ఇవి ప్రధానంగా మహాభారతంలో కనబడుతున్నటువంటి రాజకీయ విలువలు కాని రాజనీతి అనేటటువంటిది మనకు స్పష్టంగా కనబడుతుంది.

3. మహాభారతం కాలం నాటి రాజకీయ వ్యవస్థకు నేటి రాజకీయ వ్యవస్థకు మధ్య భేదాలు ఏమిటి?

చాలా పెద్ద ఎత్తున తేడాలున్నాయి ఈ దేశ చరిత్రను అర్థం చేసుకోవడానికి మహాభారతము ఒక అడ్మినిస్ట్రేటివ్ స్ట్రక్చర్ అనేటటువంటిది వచ్చింది. ఆ అడ్మినిస్ట్రేటివ్ స్ట్రక్చర్ లో రాజు ఎలా ఉండాలి. మంత్రి వర్గం ఎలా ఉండాలి. మిగిలిన యంత్రాంగం అనేటటువంటిది న్యాయ వ్యవస్థగా ఏ విధంగా పనిచేయాలి అనేది ఆనాడు కూడా ఉంది. న్యాయము, ధర్మము అనేది ఏ విధంగా ఉండాలో చెప్పుకొచ్చింది మహాభారతం కాలం నాడు ప్రధానంగా రాజతంత్రం, యుద్ధనీతి రాజధర్మము అనేటటువంటి భావాలపై నిర్మాణం జరిగింది. అది పౌరులకు ఇచ్చే స్వేచ్ఛా సమానత్వం వంటి వ్యవస్థ కాదు పాలకులకు రాజులకు అందరికి సరెండర్ అయి ఉండాలి. మిగిలిన వారంతా సెకండ్ రాజు అనేవారు. అల్టిమేట్ మరి ఇవాళ రామాయణం మహాభారతం జనం మధ్యలో నమ్మకంగా ఉండవచ్చు కాని ఇవాళ రాజ్యాంగం అనేటటువంటిది మన రాజకీయ వ్యవస్థకు పునాది ఈ రాజకీయ వ్యవస్థ రాజ్యాంగం ఏమి చెపుతుంది.

ప్రజాస్వామ్యం అనేది ఆధునికమైనది ప్రజాస్వామ్యంతో పాటు స్వేచ్ఛా సమానత్వం, సౌభ్రాతృత్వం తర్వాత పౌరసత్వం అనేవి చాలా ముఖ్యమైనవి ఇవాళ ఏదైనా ఒక పౌరుడిని గ్రీసువారు అటాక్ చేసినా కొట్టి చంపినా దానిని ప్రశ్నించడానికి పౌరుడికి హక్కుంది కోర్టు లెవల్ లో వెళ్లి ప్రశ్నించవచ్చు. అదే మహాభారత కాలంలో ఒక పౌరుడిని పోలీస్ రాజ్య యంత్రాంగం కొట్టి చంపినా ఒకవేళ పన్ను కట్టేదనో లేదా ఇంకేమైనా నేరం చేసినా బజారులో ఉరి తీసి చంపినా ఎవరూ అడిగే అవకాశం లేదు. అప్పీల్ లేదు న్యాయవ్యవస్థ కు అత్యంత అధీశుడు ఎవడు అంటే రాజు రాజును తీసుకున్న నిర్ణయాలు నిజంగా పౌరుడు తప్పు చేసాడా లేదా అనే దానిని సంబంధం లేకుండగా ఆ విలన్ ను శిక్షించవచ్చు. కాని ఈ ప్రజాస్వామ్యంలో నువ్వు అంత రూఢిగా శిక్షిస్తానంటే సాధ్యం కాదు. ప్రజాస్వామ్యంలో లిఖిత పూర్వకంగా ఆదేశ హక్కులను కల్పించింది. అందరూ సమానత్వమని చెపుతుంది.

మహాభారతం లోని విలువలన్నింటిని కూడా పాటించడమనేది ప్రజా స్వామ్య వ్యవస్థలో సాధ్యం కాదు. ఒకప్పుడు చారిత్రకంగా ఈ దేశంలో ఉంది ప్రామాణికంగా కొనసాగింది. చారిత్రక అనుభవం అంటే రాజరిక వ్యవస్థలో ఈ రాజరిక వ్యవస్థ ప్రజాస్వామ్య వ్యవస్థ దానికి భిన్నమైన రాజకీయ వ్యవస్థ రాజకీయ విలువలు భిన్నమైన రాజకీయ సంస్థలు భిన్నంగా పని చేస్తున్నటువంటి వ్యవస్థ .

రాజ్యాంగం అనేది మత విశ్వాసాలు లేక విశ్వాసాలు అయినా కూడా అవి అన్ని వ్యక్తిగతమైనది వ్యక్తి గతమైన జోలికి రాజ్యాంగం రాదు. ఒక పౌరుడికి రాజ్యం తరపున కాని ప్రైవేట్ సంస్థల తరపున

కాని హాని ఉంది అనుకున్నప్పుడు రాజ్యం ఇంటర్ ఫియర్ కావాలి. దానిని క్వశ్చిన్ చేయవచ్చు ఇక ఆ హక్కు ఆనాడు మహాభారతం కాలం నాడు లేదు. అప్పుడున్నటువంటి రాజకీయ వ్యవస్థ ప్రకారం అటువంటి హక్కులు ఇవ్వకపోవడాన్ని సిద్ధాంతీకరించారు. అదే న్యాయబద్ధత అయిపోయింది. దానిని ఎవరు ప్రశ్న వేయకూడదు. అటువంటి వ్యవస్థ ఉంది. మనం ఒక కోర్టులో శిక్ష పడింది అంటే ఆ విధంగా అప్పీల్ తీసుకునేటటువంటి అవకాశం ఉండదు. అందుకని ఈ రెండింటి మధ్య చాలా భిన్నమైన వ్యవస్థలు భిన్నమైన స్థలకాల పరిస్థితులు భిన్మమైన విలువలతో కూడుకున్నటువంటి రెండు వ్యవస్థల మధ్య కొనసాగుతుంది కాబట్టి ఆ వ్యవస్థలో పాటించవలసిన సూత్రాలను విలువలను రాజనీతిని ఈనాడు పాలకులు పాటించడం సాధ్యం కాదు. ఒక వేళ అలా పాటించాలని ప్రయత్నిస్తే చాలా సమస్యలు వస్తాయి. అది రాజ్యాంగ విరుద్ధమవుతుంది. మనం రాజ్యాంగాన్ని పాటించాలా; లేదా సంప్రదాయ బద్ధమైన విలువలను మహాభారతాన్ని పాటించాలా వైరుధ్యం వచ్చినప్పుడు కోర్టు ప్రకారంగానైనా దేని ప్రకారంగా నైనా ఇవాళ ఉన్న సూత్రం ప్రకారం రాజ్యాంగమే అత్యున్నతమైన శాసనం పాలకుడు కన్నా రాజ్యాంగం శాసనం అవుతుంది. ఎక్కువ ఓటు వేసే పౌరుడు ఎంత ముఖ్యమైన ఓటు వేయించుకునే అధికారులకు వచ్చినటువంటి వారు సమానం. పౌరుడు పాలకుల మధ్య సమానత్వం అనే సిద్ధాంతాన్ని చెప్పిందే ప్రజాస్వామ్యం ఎక్కడ కూడా యుద్ధం చేసి హింస చేసి ఎదుటి వారిని చంపి రాజకీయ అధికారంలోకి రమ్మని చెప్పింది కాదు. ప్రజల యొక్క సమ్మతితో ఎలక్షన్స్ ఎందుకు జరగాలి అనుకుని కొట్టుకుని అధికారంలోకి రావచ్చు కదా అది రూల్ మెథడ్ అది ప్రజాస్వామ్యం అందరి సమ్మతితో అంగీకారంతో ఎవరు మనకు పాలకుడుగా ఉండాలి అనేది నిర్ణయిస్తుంది. కాబట్టి ఆ భేదం అప్పటికి ఇప్పటికి పాటించడమనేది సాధ్యం కాదు.

### 4. రాయబారం అనేది రాజకీయ పరమైనదిగా భావించవచ్చా?

నెగోషియేషన్స్ అంటారు ఇంగ్లీష్ లో డెలిబ్రేషన్స్ అని కూడా అంటారు. ఒకటి రాయబారం అనేటటువంటిది ఎప్పుడు అవసరమొస్తుంది వివాదాలు, వచ్చినప్పుడు రాజ్యం అంతర్గతంగా సమస్యలు వచ్చినప్పుడు కావచ్చు రాజ్యాల మధ్య సమస్య వచ్చినప్పుడు కావచ్చు. ఒక రాజ్యానికి ఒక రాజ్యానికి మధ్య సంబంధించిన గొడవలు కావచ్చు ఒక రాజ్యం అనేక రాజ్యాల మధ్య ఘర్షణలు అనేవి వచ్చినప్పుడు ఘర్షణలు నివారించడానికి అంటే భౌతికమైన ఇద్దరూ హింసారూపం తీసుకోకుండగా ఈ రాయబారుల ద్వారానే పరిష్కరించడం.

రాయబారమనేది చాలా కీలకమైన పొలిటికల్ స్ట్రాటేజి అది ఇప్పుడు ఆ చర్చలు జరిపే వ్యక్తుల స్థాయిని బట్టి అది పబ్లిక్ లేదా ప్రైవేటా అని తెలుస్తుంది. ఇప్పుడు ఒక రాష్ట్రపతో , ప్రధానమంత్రో ఇద్దరు

కలిసి రెండు దేశాల మధ్య చర్చలు జరుపుతున్నప్పుడు ఇద్దరు వారి భార్యలతో కలిసి వెళతారు. ఇలా వెళ్ళినప్పుడు ఆ దేశ ప్రధాన మంత్రి భార్య, ఈ దేశ ప్రధాన మంత్రి భార్య వంట ఇంట్లోనో, లేదా ఇంకో రూమ్ లోనూ వెళ్ళినప్పుడు చర్చించడం మొదలు పెడతారు. కాని వారికి (ప్రధాన మంత్రులు) మాత్రం పబ్లిక్ గా డిస్కషన్స్ అనేవి జరుగుతాయి. ఇవి ఓపన్ గా డిబేటీస్ అనేవి జరుగుతాయి. వీటన్నింటిని ఏమి మాట్లాడినా ఏమి చేసినా డాక్యుమెంటరి ఇస్తారు. ప్రధానమంత్రి భార్యలు ప్రైవేట్ గా మాట్లాడుతున్నప్పుడు చాలా విషయాలు బయటకు వస్తాయి వారికి డాక్యుమెంటేషన్ ఎక్కడ ఉండదు ఆ విషయాలు తెచ్చే భార్యలు వాళ్లకు చెప్పినప్పుడు పాలసీ విధానంలో ఈ నెగోషియన్ చాలా కీలకమైనటువంటి అంశాలు చాలా ఇన్ఫర్మేషన్ వస్తుంది. కానీ వాటికంత పబ్లిక్ గా విలువ ఉండదు. ఇక్కడ చర్చలు చేసేటువంటి వారికే విలువ ఉంటుంది కనుక పబ్లిక్ గా చెరిపేటటువంటి డాక్యుమెంట్ లీగల్ అయితే ప్రైవేటుగా జరిగేటటువంటి రాయబారం ఏమైతే ఉందో పాలసీ నిర్ణయం ఏదైతే తీసుకోగలుగుతారో కావలసిన పరిష్కారం అవుతుంది. ఎల్టిటిఈ శ్రీలంకలో చాలా బలంగా ఉండి విపరీతమైన హింస జరుగుతున్నప్పుడు హోస్టింగ్స్ ల్యాండ్ మైనింగ్ చేసుకుని విపరీతంగా చంపుతున్న రోజుల్లో ఆర్మీ ని ఉపయోగించారు సాధ్యం కాలేదు ఫెయిల్ అయిపోయారు దేశాల మధ్య చర్చలు జరిగాయి సాధ్యం కాలేదు అంతర్గత ఎల్టిటిఇ శ్రీలంకకు ప్రభుత్వ చర్చలు జరిగాయి కాల్పుల విరమణ జరగలేదు దానిని ఏ విధంగా పరిష్కారం చేసారంటే పాలకులు అన్ని వైపుల వైఫల్యం చెందాయి కాబట్టి వాళ్ల తల్లుల్ని ఉపయోగించారు శ్రీలంక వారు వారి తల్లుల్ని ఉపయోగించి ఎల్టిటిఇ వారు ఎక్కడ ఉన్నారో తెలుసుకున్నారు. వీళ్లు క్లూ తీసుకు వచ్చిన తర్వాత ఈ జర్నలిస్టుల ద్వారా చర్చలకు ,రాయబరానికి వెళ్ళినటువంటి వారి ద్వారా వచ్చినటువంటి సమాచారం ఆధారంగా తీసుకొని వాళ్ల స్థావరాలు ఎక్కడున్నాయో తెలుసుకొని ఈజీగా పట్టుకొని కాల్చి చంపి అడ్రస్ లేకుండా వారి డప్పుల నుండి వారు ఆయుధాలు అనేవి తీసుకుని LTTE అనేది లేకుండా పూర్తిగా క్లోజ్ చేసి పడేశారు. ఇది రాయబారంగా జరగాలేదు ప్రైవేట్ గా జరిగిన వ్యవహారం మొత్తం రాజకీయ ఆందోళనని మొత్తం హింసతో జరిగిన దానిని నిర్మూలించగలిగారు. అనగా రాయబారం అనేటువంటిది రాజ్యం తరపున చేసినప్పుడు ప్రభుత్వం తరపున చేసినప్పుడు అది ఖచ్చితంగా పబ్లికే అదే సేమ్ టైం పబ్లిక్ ఎఫైర్స్ లో ఉన్నటువంటి కాన్ఫిడెంట్ రిజల్ట్స్ ప్రైవేట్ గా జరిగినటువంటి వాటికి అంత ప్రామాణికం లేకపోయినా పాలసీ నిర్ణయాలు తీసుకోవడంలో అత్యంత కీలకమైనటువంటివి.

5. **రాజుకు ఉండవలసిన లక్షణాలు, నియమాలు ఏమిటి?**

పూర్వం రాజులను గమనించినా, కౌటిల్యుని అర్థ శాస్త్ర ప్రకారం చేయాల్సింది ఒక్కటే చావో రేవో నువ్వు యుద్ధం చేయవలసిందనే మొట్టమొదటి క్వాలిఫికేషన్ నువ్వు పాలకుడవు అవ్వడానికి ఎం.ఫిల్, ఉందా, పి.హెచ్. డి ఉందా కాదు యుద్ధం చేయడం వచ్చా రాదా యుద్ధంచేస్తే కాని రాజ్యాధికారంలోకి వచ్చేది కాదు. ధైర్యం, సాహసం, పరాక్రమం కావాలి. ఇవి very important aspects రెండవది నిరంతరం నువ్వు రాజ్యానికి కాపలా కాస్తూనే ఉండాలి. రాజ్యంలో మొత్తం యంత్రాంగం కూడా సైన్యం కాని ఏనుగులు కాని , గుర్రాలు కాని, కాల్బలం కాని న్యాయ వ్యవస్థ కాని సమాచార యంత్రాంగం కాని ఈ రెవిన్యూ యంత్రాంగం కాని వనరులు వసూలు చేసేటటువంటి వారు కాని నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ఉండాలి కదా యుద్ధం చేసి రాజకీయ అధికారానికై రాజుగా ప్రకటించుకోవడం ఎంత ముఖ్యమో దానిని కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యం.

రాజు అనేటటువంటి వాడు మొత్తం రాజ్యం యంత్రాంగాన్నంతా కూడా కొనసాగిస్తూనే మరలా ఆ వ్యవస్థను కొనసాగించడానికి కావలసిన వారిని తయారు చేయాలి. అటువంటి పాలకులను కూడా తయారుచేసుకోవాలి. అటువంటిది ముఖ్యమైనటువంటి లక్షణం , రాజకీయ ప్రకారం ఈ దేశంలో సంపదలను పెంపొందించడం, పరిశ్రమలను తీసుకురావడం, అవన్నీ కూడా రాజ్య బాధ్యతలే కాని ఇవాళ ఉన్నటువంటి వెల్ఫేర్ యాక్టివిటీస్ అప్పుడు లేవు అందువలన రాజరిక వ్యవస్థ ఉన్నంత కాలం దేశంలో గ్రామాలు ఎప్పుడూ కూడా రాజు పైన ఆధారపడలేదు. ప్రజాస్వామ్య వ్యవస్థ అభివృద్ధి పేరుతో కాని రాజరిక వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వం పైన ప్రజలు ఏనాడు ఆధారపడలేదు. కేంద్ర ప్రభుత్వం రాజే గ్రామాలపైన ఆధారపడి ఉన్నారు. దేనికి ఆధారపడి ఉన్నారు. ఒకటి తనకు కావలసిన సైన్యమంతా కూడా గ్రామాల నుండే వెళ్ళాలి. సైన్యాలలో చేరి యుద్ధము చేసేటటువంటి వారు తన రాజ్యానికి కావలసిన ఆహార ధాన్యాలు కాని పంటలు కాని ధాన్యం కాని ఇవన్నీ పన్నుల రూపంలో ప్రజల నుండి వసూలు చేయడం రాజ్యం అనేది గ్రామీణంలో ఉన్న ప్రజలపైన ఆధారపడి ఉంది కాని ఈ వేళ అభివృద్ధి పేరుతో జరుగుతున్నటువంటి వాటిలో ప్రజల్ని ఎప్పుడుకూడా ప్రభుత్వము ఇంతగా ఆధారపడి బ్రతికేటటువంటి వారిని తయారు చేసుకోలేదు.

### 6. రాజ్య పరిపాలనలో రాయబారికి ఉన్నటువంటి ప్రాధాన్య ఎటువంటిది?

రాయబారం అనేటటువంటిది చాలా అత్యంత కీలకమైనటువంటిది. అది రాజరిక వ్యవస్థ కావచ్చు ప్రజాస్వామ్య వ్యవస్థ కావచ్చు రాజ్యాల మధ్య సంధి చేయాలన్నా యుద్ధం చేయాలి. సంధికైనా యుద్ధానికైనా రాయబారమే చేయాలి. అనేటటువంటిది ఒక అంశం.మ్యూచివల్ ఇంట్రస్ట్, ఒన్ సైడ్ ఇంట్రస్ట్ అది ఎటువంటి సందర్భంలో రాయబారం అవసరం వస్తుంది. ఒక బలహీనమైన రాజ్యం ఒక

బలవంతమైన రాజ్యం మధ్య కొన్ని సార్లు రాయబారం కూడా జరగకపోవచ్చు. ఈ రాయబారం సమానమైన రాజ్యాల మధ్య చాలా ఎక్కువ సార్లు రాయబారం అనేది జరుగుతుంది. ఈ రాయబారం చేస్తున్నటువంటి వ్యక్తి ఎటువంటి వాడై ఉండాలి ఎటువంటి లక్షణాలు ఉండాలి. అనేది ఇండియన్ ఫారెన్ సర్వీస్ అనే దాంట్లో క్వాలిఫై అయినటువంటి ఫారెన్ అంబాసిడర్ లేక మంచి పండితుడో స్కాలరో ఒక పొలిటీయనో విజ్ఞుడో అనేటటువంటి వారిని వేరే దేశాలకు నియమిస్తూ ఉంటారు.

రాజరిక వ్యవస్థలో వారసత్వానికి సంబంధించిన వారే ఉండాలి. రాయల్ ఫ్యామిలికి సంబంధించిన వ్యక్తులే కావాలి. మహాభారతంలో శ్రీకృష్ణుడు రాయబారం చేసాడు. యుద్ధం నివారించడానికి ప్రయత్నం చేసాడు. నెగోషియన్స్ అన్నిరకాలుగా ఫెయిల్ అయినప్పుడు యుద్ధమే అంతిమ పరిష్కారమవుతుంది.

ఇప్పుడు మనకు యుద్ధాలు జరగకూడదు అనడానికి చాలా సంస్థలున్నాయి. రెండవ ప్రపంచయుద్ధం జరిగినప్పుడు న్యూక్లియర్ బాంబు వలన హిరోషిమా, నాగసాకి మీదద చేసిన యుద్ధం వలన చాలా నష్టం జరిగింది. రాయబారం చేస్తున్నటువంటి సందర్భంలో వైఫల్యం చెందినప్పుడే ఈ యుద్ధాలనేటటువంటివి వస్తాయి. ఆ రాయబారం  సమయంలోనే ప్రాపర్ వే లో చేయగలిగితే శాంతి అనేది వర్ధిల్లుతుంది. శాంతికా యుద్ధానికా రాయబారం అనేటటువంటిది చాలా ముఖ్యం ఆ చేసే వ్యక్తిని తనకున్నటువంటి విజ్ఞానాన్ని బట్టి అనుభవాన్ని బట్టి ఆలోచనా విధానాన్ని బట్టి వారికున్న ప్రయోజనాన్ని బట్టి కూడా ఈ రాయబారం అనేది ఆధారపడింది..

### 7. రాజ్యాల మధ్య జరిగే చర్చల్లో రాయబారమే కీలకమైనదని అభిప్రాయపడవచ్చా?

ఒకానొకప్పుడు చాలా కీలకమైనదే రెండవ ప్రపంచ యుద్ధం అయిపోయిన తర్వాత ప్రపంచ శాంతి నిరంతరం పరిరక్షణ కొనసాగేలా ప్రపంచదేశాల మధ్య ఒప్పందాలు చర్చలు,నెగోషియన్స్ జరగడం వలనే జరిగాయి. ఐక్యరాజ్య సమితి ఒప్పందాలు చేస్తుంది. ప్రపంచంలో పేదరిక నిర్మూలనకు , ప్రపంచంలో లింగ వివక్ష తగ్గడానికి, పర్యావరణం కాపాడడానికి, కనీస వేతనాలు అమలు చేయడానికి ఒప్పందాలు చేసుకుంది. సురక్షితమైన తాగునీటిని అందించడానికి ఒప్పందాలు చేసుకుంది. స్త్రీల పైన అత్యాచారాలు, హంగులు తగ్గించడానికి ఒప్పందాలు చేసుకుంది. ఇవన్నీ కూడా చర్చల్లో పార్ట్ ఎవరో ఒక రాయబారి సందర్భంలో చర్చకు తీసుకు వస్తున్నారు.

ఈ ప్రపంచమంతా Universal climantary education no one left behind. సుస్థిరాభివృద్ధి సూచికలు ఇవన్నీ కూడా ఒప్పందాలలో భాగంగా వచ్చినటువంటిదే.

**8. రాయబారిగా వెళ్లే వ్యక్తి ఎటువంటి అవగుణాలను అలవరచుకోవడం వలన విజయాన్ని సాధించగలుగుతాడు?**

రాయబారిగా వెళ్లే వ్యక్తికి చారిత్రక పరిజ్ఞానం చాలా అవసరం తన దేశం నుండి ఏ దేశానికైతే చర్చలకు వెళతామో ఆ దేశానికి సంబంధించిన పరిజ్ఞానం ఉండాలి. రాజకీయ పరిజ్ఞానం ఉండాలి. తర్వాత పాలకులను ఒప్పించకలిగే శక్తి ఉండాలి. వివాదాలు ఉన్న అంశాలపైన ఒప్పించ కలిగే శక్తి ఉండాలి. తర్వాత తను దూసుకెళ్ళగల స్వభావం ఉండాలి. ఒక చర్చల్లో ఇంటియేషన్ తీసుకుని చర్చల్లో ప్రారంభించకలిగే కెపాసిటి ఉండాలి.

జయ శంకర్ అనే వ్యక్తి IFS ఆఫీసర్ ఇతను విదేశాంగ మంత్రి ఎలా అయ్యాడు. దేశంలో చాలామంది IFS ఉన్నారు. ఇతనే ఎందుకు అయ్యాడు. అంటే ఇతను అంబాసిడర్ గా పనిచేసాడు. పనిచేసే వ్యక్తిత్వంతో పాటు పాలకులతో చాల చొరవగా ఉంటాడు. తర్వాత అక్కడున్న వాతావరణాన్ని సిట్యుయేషన్ ని అర్థం చేసుకోగలిగే శక్తి ఉండాలి, నాలెడ్జ్ ఉండాలి. ఇంటర్నెల్ గా గాని ఎక్స్టర్నెల్ గా కాని చొరవతో వెళ్ళి వారితో మాట్లాడి చర్చించేటటువంటి శక్తి ఉండాలి. అతను బహుభాషా విదుడై ఉంటే మంచిది. చైనా, ఇండియా కూర్చున్నప్పుడు TRANSLATION చేసే వారు ఉండాలి. వారు ఏమిచెప్తారో తెలియదు. ఆ కమ్యునికేషన్ గ్యాప్ ని తొలగించడానికి  ఎన్ని ఎక్కువ భాషలు వచ్చుంటే అంతమంచిది..

అనుబంధం 3

ప్రముఖ ఆధ్యాత్మిక, సాహిత్య కారుల స్వదస్తూరి

బ్రాహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గారి స్వదస్తూరి



బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి స్వదస్తూరి



ప్రశ్న: రాయబారం అనేది రాజకీయపరమైనదిగా భావించవచ్చా? లేదా? స్వప్రయోజనాల కోసం జరిపే చర్చలు కూడా రాయబారం కిందకే వస్తాయా?

స: రాయబారం అనగా దౌత్యమని అర్థం వుంది. సహజంగా రాయబారం అనేది ఇరుపక్షాల మధ్య లేదా ఇరు వర్గాల మధ్య సంధి చేసే ప్రక్రియనే రాయబారం అంటారు. సహజంగా రాయబారం అనేది అనేక సందర్భాలలో జరుగుతుంటాయి. అది కేవలం రాజకీయపరమైనదే కానక్కరలేదు; స్వప్రయోజనాల కోసం కూడా కావచ్చు.

ఎక్కడైనా ఇరుపక్షాల మధ్య వివాదం ఏర్పడినప్పుడు సంధి అత్యవసరంగా భావించబడుతుంది. అలాంటి సందర్భాల్లో రాయబారి పాత్ర కీలకంగా మారుతుంది. మనం మహాభారతాన్ని చూసినట్లయితే శ్రీకృష్ణ రాయబారం రాజకీయపరమైనదిగా భావించవచ్చు. శ్రీకృష్ణ రాయబారిగా తన శక్తికి మించి సంధిని నెలకొల్పడానికి ప్రయత్నించిన విషయం తెలిసిందే. అయినా యుద్ధం అనివార్యమైంది. జనార్ధన రాయబారం కూడా ఇలాంటిదే.

రాజకీయ కారణాలతో చేసిన, స్వప్రయోజనాలకోసం చేసిన సంధి ప్రయత్నాలు ఎప్పుడూ రాయబారాలే.

అవధూత గణపతి సచ్చిదానంద స్వామి వారి స్వదస్తూరి



ప్రాచార్య శలాక రఘునాథ శర్మ గారి స్వదస్తూరి



అనుబంధం 4

పంచపాండవులు ద్రౌపది తో కూడిన చిత్రం(అంతర్జాలంలో సేకరణ



అర్జునుడు మత్స్య యంత్రాన్ని  ఛేదిస్తున్న చిత్రం



## అనుబంధం – 5

### ఆధ్యాత్మిక వేత్త బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారితో పరిశోధకురాలు కె.సుజన



## అనుబంధం –6

### భారత కాల భరతఖండ చిత్రపటం



AS PER THE UNIVERSITY POLICY, ANTI-PLAGIARISM SCREENING IS NOT REQUIRED FOR THE REGIONAL LANGUAGES

Librarian
Indira Gandhi Memorial Library
UNIVERSITY OF HYDERABAD
Central University P.O.
HYDERABAD-500 046.